# శ్రీమద్భగవత్

# గీతారహస్యము


కర్మయోగ శాస్త్రము

లోకమాన్య బాలగంగాధర తిలక్



## ద్వితీయ సంపుటము

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి



## శ్రీమద్భగవత్

# గీతారహస్యము

అను

# కర్మయోగశాస్త్రము

ద్వితీయ సంపుటము

మహారాష్ట్రభాషయందు

**లోకమాన్య శ్రీ బాలగంగాధర తిలక కృతము**

**శ్రీ నోరి సుబ్రహ్మణ్యశాస్త్రిచే ఆంధ్రీకృతము**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

2003

# GITĀ RAHASYAMU - II

by

**Sri Balagangadhara Tilak**

Translated from Marathi
by
**Sri Nori Subrahmanya Sastri**

Edited by
Sri M. Ramakrishna Sastry
Sri Mudivarti Kondamacharya

T.T.D. Religious Publications Series No. 291

© All Rights Reserved

Re-Prints : 1997, 2003

Copies : 2,000

Price : 45-00

Published by :
Sri Ajeya Kallam, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 501.

Printed at
Adisri Screens
Tirupati.

# ముందుమాట

ఉపనిషద్వాఙ్మయం అంతా గోవుగా, గోపాలనందనుడు దోగ్ధగా, నరుడైన పార్థుని మీది వాత్సల్యంతో సుబుద్ధుల సార్థక్యానికి అందించిన అమృతం భగవద్గీత.

మరణశీలి అయిన మానవుడిని జననమరణ రూప సంచార చక్రంనుంచి తప్పించగల ఏకైకశాస్త్రం బ్రహ్మవిద్య అమృతత్వసిద్ధి కేర్పడింది. ఈ స్థితి చేరేందుకు శాస్త్రకారులు విభిన్న మార్గాలను సమాజానికీ సాధకులకూ అందించినా వేటి కవి విడిగా ఉండి పోయాయి. అన్ని మార్గాలను సంకలనం చేసుకున్న అమృత భాండం భగవద్గీత. ఆ యా వ్యక్తుల అర్హతావకాశాలకు అనుగుణంగా భిన్న భిన్నమార్గాలు వాటిని ఆచరించే విధానాలను తరతరాలకూ అందించిన లౌకిక పారలౌకిక శుభ సుఖదాయిని అది. ఫలాపేక్షరహిత బుద్ధితో ఏ విధానాన్ని అనుసరించగలిగినా, ఐహికంగా జీవన్ముక్తుడై పరంలో పునరావృత్తిరహిత పరమ పదాన్ని సాధకుడు పొందగలుగుతాడు. అన్ని విధానాలను అనుసరించగలిగితే చెప్పవలసిన పనే లేదు.

అసలు భగవద్గీత భిన్నధర్మ కర్మ మార్గ సంకలనమనే భావన కూడా వున్నది. గీతామార్గాలు సర్వజన శ్రేయోదాయకాలనేందుకు దీనికి ఉర్దూభాషలో 20 అనువాదాలదాకా ఉండడం, వివిధ పాశ్చాత్యభాషలలో ఇది అనువాదం కావడంఇందుకు నిదర్శనం. మొగలాయీ రాజకుమారుడు గీతాసారాన్ని గ్రోలిన ధన్యజీవి అని చరిత్ర తెలుపుతున్నది.

వాస్తవానికి భగవద్గీత భిన్న కర్మమార్గాల సంపుటీకరణమని లోకమాన్య బాలగంగాధర తిలక్ వంటి మహనీయులు భావించారు.

గీతా ఆదర్శాలను అనుష్ఠించి తరించిన ఆ కర్మయోగి తిలక్ మహారాష్ట్ర భాషలో సమాజానికందించిన గీతారహస్యగ్రంథానికి శ్రీనోరి సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ఆంధ్రానువాదాన్ని ఆస్తికజనులకు అందించే అపూర్వావకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాం.

లోగడ ముద్రించిన మూడు సంపుటాల ప్రతులు చెల్లిపోయిన కారణాన వీటిని పునర్ముద్రిస్తున్నాం.

తమ అనుభవాన్ని తాత్త్విక సంపదను రంగరించి లోకమాన్యులందించిన ఈ గీతారహస్యం అఖిలాస్తిక జనాదరణ పొందగలిగితే ఇందరి ఆశ, మా ప్రయత్నమూ చరితార్థమైనట్లే.

**కార్యనిర్వహణాధికారి,**
తిరుమల తిరుపతి దేవస్థానములు.

# గీతారహస్యము నందలి విషయములకు ఆ యా ప్రకరణముల యందున్న యనుక్రమణిక

## పదియవ ప్రకరణము

## కర్మవిపాకము, ఆత్మస్వాతంత్ర్యము

మాయాసృష్టియు బ్రహ్మసృష్టియు....దేహముయొక్క కోశములును కర్మకు నాశ్రయమగు లింగశరీరమును....కర్మయును నామ రూపములును మాయయు ననువానికి గల పరస్పర సంబంధములును .... కర్మయొక్కయు మాయయొక్కయు వ్యాఖ్యానము.... మాయ యొక్క మూల మగమ్యమైనందున మాయ పరతంత్రురాలయినను ననాది యయినది....మాయాత్మకమగు ప్రకృతియొక్క వ్యాప్తి లేక సృష్టి యనునదియే కర్మము ... కావున కర్మమును ననాదియే .... కర్మముయొక్క యఖండమగు ప్రయత్నము ...పరమేశ్వరుఁడు దాని యం దేమియుఁ బ్రవర్తింపక కర్మానుసారముగనే ఫలము నిచ్చుచున్నాడు ... కాని కర్మ చేయుటకు సాధనములు ... కర్మబంధము యొక్కయు ప్రవృత్తిస్వాతంత్ర్యముయొక్కయు ప్రస్తావన.... కర్మ విభాగము, ప్రారబ్ధము, క్రియమాణము ను....ప్రారబ్ధకర్మణాం భోగాదేవక్షయః... మీమాంసకులయొక్క నైష్కర్మ్యసిద్ధివాదము వేదాంతులకు గ్రాహ్యము కాదు....జ్ఞానముదక్క కర్మబంధమునుండి విముక్తి చేయున దెద్దియును లేదు ...జ్ఞానశబ్దార్థము....జ్ఞానమును సంపాదించుకొనుటకు జీవుఁడు స్వతంత్రుఁడు....కాని కర్మ చేయుటకు సాధనము లతనియొద్ద లేకుండుటచే నంతమాత్రమే పరాపేక్షగలవాఁడు ....మోక్షము నొందుట కాచరింపఁబడిన కర్మ స్వల్పమైనను వ్యర్థము కానేరదు .... కావున నొకప్పుడైనను దీర్ఘప్రయత్నముచే స్వయము

గనే సిద్ధించును.... కర్మక్షయముయొక్క స్వరూపము.... కర్మలను విడుట శక్యము గాదు... ఫలాశను వదలుము ...కర్మలకుండు బంధకత్వము మనోమూలకము.... కర్మలు బంధకములు గావు .... కాన జ్ఞాన మెప్పుడు గల్గినను దానినుండి మోక్షమను ఫలమే గలుగును.... అప్పటికిని నవసానకాలముయొక్క మాహాత్మ్యము.... కర్మకాండమును జ్ఞానకాండమును....శ్రౌతయజ్ఞమును స్మార్తయజ్ఞమును.... కర్మపరమయిన గృహస్థాశ్రమవృత్తి.... కర్మములు జ్ఞానయుక్తము లనియు జ్ఞానవిరహితము లనియు... తదనుసారముగ వేర్వేఱగు గతి.... జీవన్ముక్తావస్థను వర్ణించుట .... .... .... 1-76

## పదునొకండవ ప్రకరణము

## సన్న్యాసము, కర్మయోగము

సన్న్యాసము, కర్మయోగము నను నీ రెంటిలోను శ్రేష్ఠమగు మార్గ మేది యని యర్జునుఁడు ప్రశ్నించుట....ఈ మార్గములవంటివే పాశ్చాత్యుల మార్గములు ....సన్న్యాసము కర్మయోగము ననువానికి పర్యాయశబ్దములు ....వీనిలో సన్న్యాసశబ్దముయొక్క యర్థము కర్మయోగము.... సన్న్యాసమార్గమున కంగము కానందున రెండును స్వతంత్రములైనవి....టీకాకారుల విషయమున వ్రాసిన యంగాంగిభావములు.... ఈ రెండు మార్గములలోను కర్మయోగమే శ్రేష్ఠ మని గీతలయొక్క స్పష్టమగు సిద్ధాంతము....సన్న్యాసమార్గీయులకు టీకాకారులచే చేయఁబడిన విపర్యాసము.... దానికు సమాధానము.... అర్జునుఁ డజ్ఞాని యనుకొనుటకు వీలు లేదు.... కర్మయోగమే శ్రేష్ఠమేల యాయె నను విషయమై గీతలలోఁ జెప్పఁబడిన కారణములు ....ఈ యాచార మనాదినుండియు ద్వివిధములుగనే యున్నది కాన శ్రేష్ఠత్వమును నిర్ణయించుట వ్యర్థము.... జనకునిచే వర్ణింపఁబడిన మూఁడు నిష్ఠలును గీతలయందు వర్ణింపఁబడిన రెండు నిష్ఠలును .... కర్మలు బంధకములని చెప్పుటచే వానినే వదలివేయవలయునని సిద్ధిం

పదు....ఫలాశను వదలుటదే నిష్కామకము కానేరదు. కర్మవదలుట కశక్యము....కర్మలను వదలుదు మేని యాహారముకూడ లభింపదు ....జ్ఞానము కలిగినపిదప స్వార్థమై కర్తవ్య మేమియు లేకున్నను, లేక వాసనాక్షయమైనను కర్మలు వీడవు.... కాన స్వార్థబుద్ధి లేకున్నను జ్ఞానము కలిగిన పిదపను కర్మలు తప్పక చేయవలయును....భగవంతుని యొక్కయు, జనకునియొక్కయు నుదాహరణము... ఫలాశా త్యాగము, వైరాగ్యమును, కర్మోత్సాహమును....లోకసంగ్రహమును దాని లక్షణమును ... ఇదియె బ్రహ్మజ్ఞానమునకు నిజమగు పర్యవసానము .. అలోకసంగ్రహమైనను చాతుర్వర్ణ్యానుసారముగను నిష్కామముగను చేయవలయును.... స్మృతిగ్రంథములలో వర్ణింపఁబడిన యాశ్రమచతుష్టయము నందలి జీవితమును గడపు మార్గమును ... గృహస్థాశ్రమ మాహాత్మ్యము.... భాగవతధర్మములు స్మార్తధర్మములన మొదటి యర్థ మేమియో వివరించుట గీతలయందున్న కర్మయోగమున భాగవతధర్మములే ప్రతిపాద్య మనుట.... గీతలయందున్న కర్మయోగమునకును మీమాంసకుల కర్మమార్గమునకును భేదము....స్మార్తసన్న్యాసమునకును భాగవతసన్న్యాసమునకునుగల భేదము.... ఈ రెండింటికి నుండు నేకవాక్యత.... మనుస్మృతి యందున్న వైదిక కర్మయోగమునకును, భాగవతధర్మములకును గల ప్రాచీనత ... గీతలయందున్న యధ్యాయ సమాప్తి సూచకమగు సంకల్పమునకు గల యర్థము ... గీతలయొక్క యపూర్వతయు ప్రస్థానత్రయమునందున్న మూఁడు భాగములకు సార్థక్యము .... సన్న్యాసమును (సాంఖ్యమును), కర్మయోగమును (యోగమును) నను నీ రెండు మార్గములయందును గల భేదాభేదములకు కోష్ఠకరూపము క్షప్తమగు నిరూపణము.... వాసన ప్రతిపాదించునట్టి ఈశావాస్యోపనిషత్తునందలి మంత్రము....దానిని గురించిన శంకరభాష్య

మునందలి విచారము....మనుస్మృతి యందును నితరస్మృతుల యం దునుగల జ్ఞానకర్మసముచ్చయాత్మకములగు వచనములు ...76–197

## పంద్రెండవ ప్రకరణము

## సిద్ధావస్థయు, వ్యవహారము

సంఘముయొక్క పూర్ణావస్థ....పూర్ణావస్థయం దున్న వారం దఱును స్థితప్రజ్ఞులే....నీతియొక్క పరమావధి....పాశ్చాత్యుల మతానుసారముగ స్థితప్రజ్ఞుఁడు.... స్థితప్రజ్ఞునియొక్క విధి నియమములతో సంబంధించియుండదు....కర్మయోగి యగు స్థితప్రజ్ఞునియొక్క స్థితియే పరమనీతి.... పూర్ణావస్థయందలి పరమావధి యగు నీతియు, నను వాని భేదములు.... దానబోధయందు చెప్పఁబడిన యుత్తమ పురుషుని వర్ణన.... కాని యీ భేదముచే నీతిధర్మముల కుండు నిత్యత్వము తగ్గదు.... స్థితప్రజ్ఞుఁ డీ భేదవిషయమున నేమి చేయుచున్నాఁడు?.... సమాజమునకు శ్రేయస్సు, కల్యాణము, లేక, సర్వభూతహితము....అయిన నీ బాహ్యధోరణికంటె సామ్యబుద్ధియే శ్రేష్ఠమయినది....అనేకుల కెక్కువ హితమును సామ్యబుద్ధియు నను నీ రెండింటిని పోల్చిచూచుట.... సామ్యబుద్ధిచే జగత్తునందలి యాచరణము.... పరోపకారమును స్వీయమగు యోగక్షేమమును.... ఆత్మౌపమ్యబుద్ధియు.... దానియొక్క వ్యాపకతయు, మాహాత్మ్యము, నుపపత్తియు....“వసుధైవ” కుటుంబము....బుద్ధి సమమయినను పాత్రాపాత్ర విచారము వదలనేరదు.... నిర్వైరుఁ డనఁగా నిష్క్రియుఁడు గాని, లేక ప్రతిక్రియ చేయనివాఁడు గాని కాఁడు....దుష్టనిగ్రహము ....దేశాభిమానము, కులాభిమానము మొదలగువానికుపపత్తి....దేశకాలమర్యాదా పరిపాలనము ఆత్మసంరక్షణము.... జ్ఞానియొక్క కర్తవ్యము....లోకసంగ్రహమును కర్మయోగమును.... విషయసమారోపణము....స్వార్థమును, పరార్థమును, పరమార్థమును.... 198–268

# పదుమూఁడవ ప్రకరణము

## భక్తిమార్గము

నిర్గుణబ్రహ్మస్వరూపము అల్పబుద్ధిగల సామాన్యమనుజులకు దుర్బోధ్యము....జ్ఞానప్రాప్తికి సాధనములును, శ్రద్ధయు, బుద్ధియు ....రెండింటికినుండు పరస్పరాపేక్ష....శ్రద్ధచే వ్యవహారసిద్ధి....శ్రద్ధచే పరమేశ్వరజ్ఞానము గల్గినను నిర్వాహకము కానేరదు.... అది మనస్సునకుఁ దెలియుటకై నిరతిశయము, నిర్హేతుకము నగు ప్రేమచే పరమేశ్వరుని చింతింపవలసి వచ్చును.... దీనిపేరే భక్తి.... సగుణమగు నవ్యక్తముయొక్క చింతనము కష్టమయమును దుర్ఘటమును....కాన నుపాసనకు ప్రత్యక్షమయిన వస్తువు కావలయును....జ్ఞానమార్గమును భక్తిమార్గమును పరిణామమం దొక విధమే యయినను జ్ఞానమువలె భక్తి స్వతంత్ర మగు నిష్ఠ కానేరదు.... పరమేశ్వరుని భక్తికొఱకై గ్రహింపఁబడిన ప్రేమ గమ్యము ప్రత్యక్షము నగు రూపము....ప్రతీక శబ్దార్థకము.... రాజవిద్యయు, రాజగుహ్యము, అను శబ్దములకు నర్థము.... గీతలయందు చెప్పఁబడిన ప్రేమరసము.... పరమేశ్వరుని యనేక విభూతులలో నేదైనను ప్రతీకమగును.... అనేకులకు ననేక ప్రతీకములును, వానినుండి కలుగఁబోవు ననర్థములును, వానిని తప్పించుట కుపాయము.... ప్రతీకముయొక్కయు, ప్రతీకసంబంధ భావమునకునునుండు భేదము....ప్రతీకమేదైనను భావానుసారముగ ఫలము నొందును....వేర్వేరగు దేవతల యుపాసన....వానియందును ఫలదాత పరమేశ్వరుఁ డొక్కఁడె.... దేవతలు కారు.... ఏ దేవతను భజించినను నా భజించుట విధిచోదితము గాని పరమేశ్వరునియొక్క భజనమే యగును.... ఈ దృష్టితోఁ జూచిన గీతలయందున్న భక్తిమార్గమునకుగల శ్రేష్ఠత్వము.... శ్రద్ధయొక్కయు, శుద్ధత్వాశుద్ధత్వములు....ఉద్యోగముచే క్రమముగ సుధారణ....మఱియు ననేక జన్మములయొక్క యంతమందు సిద్ధియు .. శ్రద్ధయు, బుద్ధియు లేని

వాఁడు చెడిపోవును....బుద్ధిచేతను, భక్తిచేతను తుదకు నొకఁడే యగు నద్వైతబ్రహ్మయొక్క జ్ఞానము ప్రాప్తమగును.... కర్మవిపాకప్రక్రియ యందున్నట్టియు నధ్యాత్మమందున్నట్టియు సిద్ధాంతములన్నియు భక్తిమార్గమున సైతము గ్రాహ్యములే.... ఉదాహరణ మేమియన:— గీతలయందున్న జీవపరమేశ్వరులయొక్క స్వరూపము అయినను నీ సిద్ధాంతముల విషయమున నక్కడక్కడ శబ్దభేదము లుండును. ఉదాహరణము: కర్మ యనఁగా: కర్మయోగమార్గమునందు పరమేశ్వరుఁడే యగును.... బ్రహ్మార్పణమును, కృష్ణార్పణము నయినను నర్థభేద ముండునట్లు కన్పట్టునేని శబ్దభేదమును చేయు లేదు....గీతాధర్మముల యందు గ్రహింపఁబడిన శ్రద్ధకును జ్ఞానమునకును సంబంధము .... భక్తిమార్గమునకును సన్న్యాసధర్మముయొక్క యుపేక్ష లేదు....భక్తికిని కర్మకును విరోధము లేదు....భగవద్భక్తియు లోకసంగ్రహమును ....తమతమ కర్మలచేతనే భగవంతుని యజనపూజనములు.... జ్ఞాన మార్గమున త్రైవర్ణికులకే యధికారము కలదు....భక్తిమార్గమున స్త్రీ శూద్రాదుల కెల్లరకు నధికారము గలదు.... అంతకాలమునందైనను పరమేశ్వరుని యనన్యభావముచే శరణుఁ జొచ్చునేని ముక్తిగలుగును .... గీతలయందున్న ధర్మముల కితర ధర్మముల యన్నింటికంటె శ్రేష్ఠత్వము .... .... .... .... 269–333

## పదునాల్గవ ప్రకరణము

## గీతాధ్యాయసంగతి

విషయమునుఁ బ్రతిపాదించుటకు శాస్త్రీయ మనియు సంవాదాత్మక మనియు రెండు మార్గములు.... సంవాదాత్మక పద్ధతియందున్న దోషములు గుణములు....గీతలయొక్క ప్రారంభము....ప్రథమాధ్యాయము.... ద్వితీయాధ్యాయము నందున్న 'సాంఖ్యమును యోగము' నను రెండుమార్గములనుండియే యారంభము....మూఁడు నాలుగు, అయిదు అధ్యాయములయందున్న కర్మయోగవివేచనము

....కర్మకంటె సామ్యబుద్ధి శ్రేష్ఠమైనది....కర్మలు వదలవు....సాంఖ్య నిష్ఠకంటె కర్మయోగము శ్రేయస్కరము....సామ్యబుద్ధిప్రాప్తి కింద్రి యనిగ్రహ మావశ్యకము .. ఆఱవయధ్యాయమునం దున్న యిం ద్రియనిగ్రహ సాధనములు.... కర్మయు, భక్తియు, జ్ఞానము నని గీతలను విభజించుట యోగ్యము కాదు.... జ్ఞానము భక్తియు నను నవి కర్మయోగమునందున్న సామ్యబుద్ధికి సాధనములు.... కాన 'త్వం తత్ అసి' యను దాని గుఱించి యా ఱారధ్యాయములు చెప్పఁబడలేదు....ఏడవయధ్యాయము మొదలు పండ్రెండవయధ్యా యము వఱకునుండు తాత్పర్యము . ఈ యధ్యాయముల యం దుసు భక్తియును, జ్ఞానము గీతలయందు వేర్వేఱుగ వర్ణింపఁబడలేదు ....ఒకదానిలో నొకటి చేర్పఁబడినది....మఱియు వానికి జ్ఞానవిజ్ఞాన ములని యొక్క పేరే పెట్టఁబడినది.... పదుమూఁడవయధ్యాయము మొదలు పదునేనవ యధ్యాయము వఱకును సారాంశము ... పదు నెనిమిదవ యధ్యాయమునందున్న యుపసంహారము కర్మయోగపర మైనదే.... కాన నుపక్రమోపసంహారము మొదలుగాగల మీమాంస కులకు నిబంధనను బట్టియు గీతలయందు కర్మయోగమే ప్రతిపాద్య మగును.... చతుర్విధ పురుషార్థములు.... అర్థము, కామము ధర్మము ననుసరించియే యుండవలయును.... కాని మోక్షమునకును ధర్మము నకును విరోధము లేదు .... గీతలకు సన్న్యాస పరమగు నర్థ మెట్లు చేయఁబడినది....సాంఖ్యము+నిష్కామకర్మము=కర్మయోగము.... గీతలయందు లేనిదేదియైనను లుప్తము కర్మయోగమే ప్రతిపాద్యము ....సన్న్యాసమార్గీయులకు విజ్ఞప్తి (ప్రార్థన).... 334 385

## పదునేనవ ప్రకరణము

### ఉపసంహారము

కర్మయోగశాస్త్రమునందును, ఆచారసంగ్రహమునందునుగల భేదము.... వేదాంతశాస్త్రముతో నీతిశాస్త్రమున కుపపత్తి కుదరదని

భ్రమం జెందుట.... గీత యీ యుపపత్తినే చెప్పుచున్నది.... కేవల నీతిదృష్టిచే గీతాధర్మముల వివేచనము .... కర్మకంటె బుద్ధి శ్రేష్ఠము .... నకులోపాఖ్యానము.... తత్సదృశములగు బౌద్ధక్రైస్తవసిద్ధాంతములు.... అనేకుల కధికహితమును మనోదైవతము ననెడు నీ రెండు పాశ్చాత్యసిద్ధాంతములతో గీతలయొక్క సామ్యబుద్ధిని పోల్చుట.... పాశ్చాత్యుల యాధ్యాత్మికపక్షముతో గీతలయందున్న యుపపత్తికి గలసామ్యము....కోంటు, గ్రీన్ అనువానిసిద్ధాంతము....వేదాంతము నీతియు.... నీతిశాస్త్రమునందు వేర్వేఱు మార్గములు పుట్టుటకు కారణము....పిండబ్రహ్మాండముయొక్క రచనవిషయమై మతభేదము .... గీతలయొక్క యాధ్యాత్మికమగు నుపపాదనమం దున్న మహత్త్వవిశేషము .... మోక్షము, నీతిధర్మములును, వ్యవహారము ననువానియేకవాక్యత...క్రైస్తవసన్న్యాసమార్గము సుఖహేతుకమగు పాశ్చాత్యకర్మమార్గములు .... దానిని గీతలయందున్న కర్మమార్గముతోఁ బోల్చుట.... చాతుర్వర్ణ్య వ్యవస్థయందును నీతిధర్మములయందును భేదము.... దుఃఖనివారకమగు పాశ్చాత్యకర్మమార్గమును నిష్కామ గీతాధర్మములును.... కలియుగమం దున్న సంక్షిప్తమగు కర్మయోగమును గుఱించిన యితిహాసము.... జైనబౌద్ధయతులు.... శంకరాచార్యులవారి సన్న్యాసమార్గము.... తురకలరాజ్యము.... భగవద్భక్తులు, సత్పురుష సముదాయమును, రామదాసుగారును....గీతాధర్మములు నేటికి వాడుకలో నుండుట ...గీతాధర్మముయొక్క యభయత్వము, నిత్యతయు, సమతయు....దేవతాప్రార్థన .... 386–450

## పరిశిష్ట ప్రకరణము

## గీతలయొక్క బహిరంగపరీక్ష

**గీత మహాభారతమునందు** యోగ్యమగు కారణముచే యోగ్యమగు **స్థలమునందే** చెప్పఁబడినది; ప్రక్షిప్తము కాదు.... (మొదటి

భాగము) గీతయొక్కయు, మహాభారతముయొక్కయు కర్తృత్వము .... గీతలయొక్క ప్రస్తుతమగు స్వరూపము .... మహాభారతము యొక్క ప్రస్తుతస్వరూపము....మహాభారతమున గీతల విషయమగు నేదుల్లేఖములు రెండింటియందును నొక విధముననే యున్న శ్లోకములును, భాషాసాదృశ్యమును.... నటులే యర్థసాదృశ్యమును .... దీనినుండి గీతయు, మహాభారతమునకును, రెండు గ్రంథములకును గ్రంథకర్త యొకడె యని సిద్ధించును. (రెండవభాగము) గీతలను ఉపనిషత్తులను పోల్చి చూచుట....శబ్దసాదృశ్యమును, అర్థసాదృశ్యమును.... గీతలయం దున్న యధ్యాత్మజ్ఞానము గీతలలో ప్రతిపాదింపఁ బడినదే.... ఉపనిషత్తులయందును గీతలయందును నున్న మాయావాదము....ఉపనిషత్తులకంటె గీతలయందున్న విశేషము.... సాంఖ్యజ్ఞానము వేదాంతజ్ఞానము ననువానికి నేకవాక్యత.... వ్యక్తోపాసన, లేక భక్తిమార్గము ... కాని కర్మమార్గముయొక్క ప్రతిపాదన మనెడు విశేష మన్ని గ్రంథములకంటెను గీతలయం దధికము .... గీతలయందున్న యింద్రియనిగ్రహార్థమై చెప్పఁబడిన యోగము, పాతంజలయోగము, ఉపనిషత్తులును.... (మూఁడవభాగము) గీతలయొక్కయు బ్రహ్మసూత్రములయొక్కయు ప్రాచీన నవీన భావము .... గీతలయందు బ్రహ్మసూత్రములు స్పష్టముగ నుల్లేఖింపఁబడుట .... బ్రహ్మసూత్రములయందు గీత 'స్మృతి' శబ్దముచే ననేక పర్యాయము లుల్లేఖింపఁబడుట....రెండు గ్రంథములకుఁ గల పౌర్వాపర్య విచారము....బ్రహ్మసూత్రములు ప్రస్తుతమందున్న గీతలకు సమకాలీనములై యుండవచ్చును.... లేదా ప్రాచీనములైనవి.... కాని పిదప రచింపఁబడినవి కావు.... గీతలయందు బ్రహ్మసూత్రముల నుల్లేఖించుట ప్రబలమగు నొక కారణము.... (నాల్గవభాగము) భాగవతధర్మములయొక్క యుదయమును గీతలును.... గీతలయందున్న భక్తిమార్గము వేదాంతము, సాంఖ్యమును, యోగమును సంబంధిం

చియే యున్నవి. వేదాంతుల మతానుసారముగ గీతలలో తర్వాత చేర్పఁబడినవి కావు .... వైదికధర్మములయొక్క యత్యంతమగు ప్రాచీనత్వము.... కర్మ ప్రధానమైనది.... తదనంతరము నజ్ఞానము యొక్కయు (అనఁగా: వేదాంతముయొక్కయు) సాంఖ్యవైరాగ్య ములయొక్కయు ప్రాదుర్భావమైనది....వీనికి నేకవాక్యత చిరకాలము నందే చేయఁబడినది.... పిమ్మట భక్తి యొక్క యుద్భవమైనది....కాన భక్తికి పూర్వోక్తములగు మార్గములతో మొదటినుండియు నేకవాక్యత చేయుట యావశ్యకము.... భాగవతధర్మములయొక్క ధోరణియు నిదియే.... గీతలయందున్న జ్ఞానకర్మసముచ్చయ ముపనిషత్తులలో నిదే....కాని భక్తి సంబంధముమాత్ర మధికముగ నున్నది....భాగవత ధర్మములయందలి ప్రాచీనగ్రంథములు.... గీతయు నారాయణీయో పాఖ్యానము.... శ్రీకృష్ణునియొక్కయు సాత్త్వతములైన లేక భాగ వతములయిన ధర్మములయొక్కయు నుదయకాల మొక్కటియె.... బుద్ధునికి పూర్వము సుమా రేడెనిమిదివందల సంవత్సరములు అనఁగా క్రీస్తునకు పూర్వము పదునైదువందల సంవత్సరములకు పూర్వము.... అని యంగీకరించుటకు కారణము....అ ట్లంగీకరింపనిచోఁ గలుగఁ బోవు నవస్థ....భాగవతధర్మములయొక్క మూలస్వరూపము నైష్కర్మ్య పరము అనంతరము భక్తిపరమును.... మూలభూతమగు గీత క్రీస్తున కంటె పూర్వమందు సుమారు తొమ్మిదివందల సంవత్సరముల క్రిందట బయలువెడలెను.... (అయిదవభాగము) ప్రస్తుతమందున్న గీతల కాలము.... ప్రస్తుతమందున్న మహాభారతముయొక్కయు ప్రస్తుత మందున్న గీతలయొక్కయు కాల మొక్కటియె.... వీనిలో ప్రస్తుత మందున్న మహాభారతము భాసునికంటెను నశ్వఘోషునికంటెను, నాశ్వలాయనునికంటెను, నలెగ్జాండరుకంటెను, మేఘాతిగణకంటెను వెనుకనే యున్నది గాని బుద్ధుని యనంతరమున బయలువెడల నది.... కాన సుమా రైదువందల శకవర్షములకంటె ప్రాచీనమైయు

న్నది.... ప్రస్తుతమందున్న గీత కాళిదాసునికంటెను, బాణభట్టుని కంటెను, భాసకవికంటెను, పురాణములకన్నను, బౌధాయనుని కన్నను, బౌద్ధధర్మములయం దున్న మహాయాన పథముకన్నను ప్రాచీనమైనది....అనఁగా: శకవర్షములకంటె నయిదునంవత్సరములు ప్రాచీనము .... (ఆఱవభాగము) గీతయు బౌద్ధగ్రంథములును .... గీతలయందున్న స్థితప్రజ్ఞునియొక్కయు బౌద్ధగ్రంథమునందలి యర్హతునియొక్కయు వర్ణనమునందలి సామ్యము, బౌద్ధధర్మముయొక్క స్వరూపమును తత్పూర్వమున నున్న బ్రాహ్మణధర్మములనుండి దాని యుత్పత్తియు.... ఉపనిషత్తులయం దున్న యాత్మవాదమును వదలి కేవల నివృత్తిపరమగు నాచారములను మాత్రమే బుద్ధుఁడు స్వీకరించినాఁడు.... బౌద్ధమతానుసారముగ నీ యాచారమునకు దృశ్యములగు కారణములు, లేక నాలుగు ఆర్యసత్యాలు.... బౌద్ధమగు గార్హస్థ్య ధర్మమునకును వైదికమగు స్మార్తధర్మమునకును గల సామ్యము.... ఈ విచారమంతయు మూలవైదికధర్మము లోనిదియే.... కాయినను మహాభారతమును గీతయును నీ విషయమై వేఱుగ విచారించుటకు కారణము.... మూలభూతములును ననాత్మబోధకములును, నివృత్తిపరములును నగు ధర్మములనుండియే పిదప భక్తిపరములగు బౌద్ధధర్మములు బయలువెడలుట యసంభవము .... మహాయానపంథయొక్క యుత్పత్తి.... దానియందలి ప్రవృత్తిపరమగు భక్తిధర్మము, గీతలయం దుండియే గ్రహింపఁబడినదని యంగీకరించుటకు కారణములు....మఱియు దానింబట్టి యేర్పడు గీతలయొక్క కాలనిర్ణయము .... (ఏడవభాగము) గీతలును, క్రైస్తవుల బైబిలును.... క్రైస్తవధర్మములలోనుండి గీతలలోని కెట్టి సిద్ధాంతమునయినను గ్రహించుట యసంభవము.... యహూదీయధర్మముల నుండి క్రైస్తవధర్మములు స్వతంత్రరీతిచే మెల్లమెల్లఁగ బయలువెడలినవి కావు. అది దేనినుండి యుద్భవించిన దను విషయమై ప్రాచీన క్రైస్తవపండితుల మతములు

.... ఏసీన్‌పంథయును గ్రీకు తత్త్వజ్ఞానమును.... బౌద్ధధర్మములకు క్రైస్తవధర్మములతో నుండు విలక్షణ సామ్యములు.... వీనిలో బౌద్ధ ధర్మములకు ప్రాచీనత్వము నిస్సంశయము ... బౌద్ధయతులకు యహూదీయ మతావలంబుల, దేశమునందు చిరకాలము క్రిందటనే ప్రవేశమున్నది...కాన క్రైస్తవధర్మములయం దున్న సిద్ధాంతములు బౌద్ధధర్మములనుండియు లేక గీతలనుండియే బయలుదేరినవి యని చెప్పుటకు పూర్ణమగు నవకాశము.... దానినుండి సిద్ధము కాఁబోవు గీతలయొక్క ప్రాచీనత్వము నిస్సంశయముగ నున్నది....451_605

శ్రీమద్భగవద్

# గీతారహస్యము

శ్రీ గణేశాయ నమః

ఓం తత్సత్

శ్రీమద్భగవద్

# గీతా రహస్యము

అను

# కర్మయోగశాస్త్రము

## దశమ ప్రకరణము

## కర్మవిపాకము-ఆత్మస్వాతంత్ర్యము

* కర్మణా బధ్యతే జంతుః విద్యయా తు ప్రముచ్యతే.

మహాభారతము. శాం. 240. 7.

ఈ జగత్తునందుండు పదార్థమంతయు పరబ్రహ్మముగనే యున్నది. పరబ్రహ్మము దక్క మఱియొక పదార్థమేమియు లేదను సిద్ధాంతము తుదకు సత్యమైనను, మనుజుల కింద్రియగోచరములగు దృశ్యసృష్టియందలి పదార్థముల నధ్యాత్మశాస్త్రము ననుసరించి శోధించితిమేని యా పదార్థములలో నింద్రియగోచర మైనదియుఁ, బ్రతి దినము మార్పుఁ జెందుచున్నందున ననిత్యమును నయిన నామ రూపాత్మకదృశ్యమును, ఆ నామరూపములచే నాచ్ఛాదింపఁబడిన దియు, అదృశ్య మగునదియు నగు నిత్యమయిన పరమాత్మతత్త్వము నని నిత్యానిత్యరూపములగు రెండుతెగలు బయలుదేఱును. రసాయన శాస్త్రమునం దే పదార్థము నైనను విడఁదీయుటచే వానిలోని ద్రవ్య

* జంతువు, కర్మచే బంధింపఁబడును. విద్యచే విముక్తిఁ జెందును.

ముల నెట్టుల వేర్వేఱుగఁ జేయనగునో యా ప్రకారముగనే యీ రెండు తెగలు నాలోకనమునకై యెదుట వేర్వేఱుగ నమర్చుట సాధ్యముకాని మాట సత్యమే; కాని జ్ఞానదృష్టిచే నా రెంటిని విడఁదీసి శాస్త్రీయోపపాదనా సౌలభ్యమునకై క్రమముగ 'బ్రహ్మ' మనియు, 'మాయ' యనియు, ఒకానొకప్పుడు 'బ్రహ్మసృష్టి' యనియు, 'మాయాసృష్టి' యనియుఁ జెప్పుచున్నారు. అయినను బ్రహ్మము నిత్యము సత్యము నైనది కాన బ్రహ్మసృష్టి యను శబ్దమునందలి 'సృష్టి' శబ్ద మనుప్రాసార్థమై చేర్పఁబడెనని చెప్పవలెనే కాని, 'బ్రహ్మ సృష్టి' పదముచే బ్రహ్మము నెవరో పుట్టించినారని యనుకొనఁగూడదు. ఈ రెండు సృష్టులలోను దిక్కాలాదినామరూపములచే నపరిచ్ఛిన్నము, అనాది, నిత్యము, అవినాశి, అమృతము, స్వతంత్రము, సర్వదృశ్యసృష్టికి నాధారభూతమునై దానిలో నంతర్యామిగ నున్న బ్రహ్మముయొక్క సృష్టిని జ్ఞానచక్షుస్సుచే విచారించి యాత్మయొక్క శుద్ధస్వరూపము (అనఁగా: తనకుఁ బరమసాధ్యమగు విషయము) ఏదియైనను వెనుకటి ప్రకరణములో విచారింపఁబడెను. మఱియు శుద్ధమగు నధ్యాత్మశాస్త్ర మిచ్చో ముగిసినదని యథార్థముగఁ జెప్ప నగును; కాని మనుష్యుని యాత్మ యాదియందు బ్రహ్మసృష్టిలో నుండినను, దృశ్యసృష్టియందలి యితర వస్తువులవలె నదియు నామ రూపాత్మకమగు దేహేంద్రియములచే నాచ్ఛాదిత మగుటం బట్టి యీ దేహేంద్రియాదికములగు నామరూపములును నశ్వరములే యై యున్నవి. కావున వీని నతిక్రమించి యమృతత్వ మెట్టుల సంపాదింప ననువగునని, ప్రతిమానవునకును, స్వాభావికముగనే యిచ్ఛ పొడము చున్నది; కాని యిది నెఱవేఱుటకై మనుష్యుఁడు వ్యవహారములయం దెట్టుల ప్రవర్తింపవలసినదియుఁ దెలిసికొనవలయును. కర్మయోగ శాస్త్రమునం దున్న యీ విషయముల విచారింపవలసినయెడల కర్మ యొక్క నియమములచే బద్ధమును, ననిత్యము నగు మాయాసృష్టి

యొక్క ద్వైతరూపమును మన మిచ్చో విచారింపవలయును. పిండ బ్రహ్మాండములయందుఁ దొలుత నొక్కటే యయినట్టియు, నిత్యము, స్వతంత్రము నైనట్టియు నాత్మ యుండె నేని, పిండమందున్న యాత్మ బ్రహ్మాండమందున్న యాత్మను దెలిసికొనుట కేమి యాటంక మనియు ఆ యాటంకము నేలాగునఁ దొలఁగింపవలయు ననియు, ప్రశ్నలు తొలుత సహజముగనే కలుగును. ఈ ప్రశ్నలకు సమాధానముఁ జెప్పుటకై నామరూపముల నవశ్యము విచారింపనగు. కారణ మే మన: వేదాంతదృష్టిచే 1. ఆత్మ లేక, పరమాత్మయనియు, 2. దానిమీఁద నున్న నామరూపాత్మకమగు నావరణ మనియు సర్వపదార్థములు రెండే వర్గములుగ నుండుటచే నామరూపాత్మకమగు నావరణముదక్క ఇతర మైన దేమియు నుండదు. నామరూపాత్మకమగు నీ పై పదార్థము, కొన్ని చోటుల ఘనీభవించియు, కొన్ని చోటుల విరళత్వమునొందియు నుండుటచే, దృశ్యసృష్టి యందలి పదార్థములు సచేతనము లనియు, నచేతనము లనియు రెండు తెగ లనియు, సచేతనములలోఁ బశువులు, పక్షులు, మనుష్యులు, దేవతలు, గంధర్వులు, రాక్షసులు మొదలగు భేదము లుండు ననియు వేదాంతశాస్త్రము చెప్పును. ఆత్మరూపమగు బ్రహ్మమంతటను నిండియేయున్నది. అది పాషాణమునందును, మనుష్యులయందు సైత మున్నది; కాని దీప మొక్కటియే యైనను, దాని నినుపపెట్టెలో నుంచినప్పుడును, స్వచ్ఛమగు నద్దపులాంతరున నుంచి నప్పుడును, భేదము గాన్పించునటుల, ఆత్మతత్త్వమంతట నొకటియే యైనను దాని పై కోశములయొక్క, (అనఁగా: నామరూపాత్మకమగు నావరణముయొక్క) తారతమ్యముచే, అచేతనము సచేతనము నని భేదము బయలుపడుచున్నది. వే యేల? సచేతనములలో సైతము మనుష్యులు, పశువులును సమానముగ జ్ఞానమును సంపాదింపలేక పోవుటకు కారణ మిదియే. ఆత్మ యంతటను నొక్కటిగా నుండుట నిజమే; అయిన నాదిగనుండు నా యాత్మ నిర్గుణమును, నుదాసీనము

నగుటచే, మనస్సు, బుద్ధి మొదలగు నామరూపాత్మకములగు సాధనము లేవియు లేనిది స్వయముగ నేమియు చేయనేరదు. ఈ సాధనములు మనుష్యయోనియందుఁ దక్క నితర స్థలములయం దుండు వానికి పూర్ణముగ లభ్యము కామిచే మనుష్యజన్మ మన్నింటిలోను శ్రేష్ఠమని చెప్పనగు. ఈ శ్రేష్ఠమగు జన్మములోనికి వచ్చినపిదప నాత్మయొక్క నామరూపాత్మకమగు నా యావరణమునకు, స్థూల సూక్ష్మము లను రెండు భేదములు వెలువడుచున్నవి. వీనిలో స్థూలమునగు నావరణము (అనఁగా మనుష్యునియొక్క స్థూలదేహ మనునది) శుక్లశోణితాత్మకమనియు, అందలి శుక్లమునందుండి స్నాయువులు, అస్థులు, మజ్జలును శోణితమునుండి (అనఁగా: రక్తమునందుండి) త్వగింద్రియము, మాంసము, కేశములు నుత్పన్నము లగు ననియు నంగీకరించి వీనికన్నింటికి 'అన్నమయకోశ' మని వేదాంతులు పేరిడిరి. ఈ స్థూలకోశమును వదలి దానిలోనుండు దానిని జూచుటకు యత్నించితిమేని, క్రమముగ వాయురూపముగ ప్రాణమయకోశము, మనస్సు(అనఁగా: మనోమయకోశము), బుద్ధి (అనఁగా: జ్ఞానమయకోశము), తుద కానందమయకోశము నుండును. ఆత్మ యనునది వీనికంటె పరముగ నున్నది. కావున నన్నమయకోశము మొదలుకొని యుత్తరోత్తరకోశముల బోధించుచుఁ దైత్తిరీయోపనిషత్తునందుఁ దుద కానందమయకోశమును జెప్పి వరుణుఁడు భృగువునకు నాత్మస్వరూపము దెలియఁ జెప్పెను(తై.2.1-5; 3.2-6). ఈ కోశములలో నన్నమయకోశ వ్యతిరిక్తములగు ప్రాణాదికోశములును, సూక్ష్మేంద్రియములును, పంచతన్మాత్రలు ననువానిని వేదాంతులు 'లింగశరీరము' (సూక్ష్మశరీరము) అని చెప్పుచున్నారు; కాని యొక యాత్మకు వేర్వేఱు యోనులందు జన్మ మెటులఁ గలిగెనను ప్రశ్నకు బుద్ధికి ననేక భావములు గలుగుట వలననట్లు గలిగెనని సాంఖ్యులు చెప్పిన సమాధానమునకు బదులుగ,ఇదంతయుఁ గర్మవిపాకము (కర్మఫలము) యొక్క పరిణామ

మని వేదాంతులు సెప్పుచున్నారు. ఈ కర్మ లింగశరీరముయొక్క యాశ్రయముచే(ఆధారముచే) నిలుచుచున్నది. మఱియు నాత్మ స్థూల దేహమును విసర్జించి యేఁగుచుండె నేని యీ కర్మయును 'లింగశరీరము'ద్వారా దానితోనే యేఁగి, యాత్మను మఱల వేర్వేఱుజన్మముల నెత్తునటుల చేయునని గీతలందును వేదాంతసూత్రములందు నుపనిషత్తులయందును స్పష్టముగఁ జెప్పఁబడినది. కావున నామరూపాత్మకము లగు జననమరణము లను సుడిని తరించి నిత్యమగు పరబ్రహ్మస్వరూపము నొందుటకు, లేక, మోక్షమును సంపాదించుకొనుటకు పిండమందుండు నాత్మ కాటంక మేమని యోచించునప్పుడు, లింగశరీరమును కర్మను విచారింపవలసివచ్చును. ఈ రెంటిలోను సాంఖ్యదృష్టిచేతను, వేదాంతదృష్టిచేతను లింగశరీరమును బూర్వముననే విచారించుటచే దానిని మరల విచారింప ననవసరము. ఏ కర్మముననుండి బ్రహ్మజ్ఞానము లేకపోవుటయే గాక యనేక జన్మము లనియెడి సుడిలో నాత్మ పడవలసివచ్చునో, యా కర్మ స్వరూప మెట్టి దైనదియు, అందుండి తప్పించుకొని యాత్మ యమృతత్వము నొందుటకు మనుజుఁడీ జగంబున నెటుల ప్రవర్తింపవలసినదియు మాత్రమే యీ ప్రకరణమునందు వివరింపఁబడినది.

సృష్ట్యారంభకాలమున, మూలమగు వ్యక్తమును, నిర్గుణమగు పరబ్రహ్మమును, దేశకాలాది నామరూపాత్మకమును సగుణము నగు శక్తిచే వ్యక్తమై (అనఁగా: దృశ్యసృష్టిరూపమై) కనిపించు దానినే వేదాన్తశాస్త్రమునందు "మాయ" యని పేర్కొనుచున్నారు (గీ. 7. 24-25). మఱియు కర్మయు దానియందే చేరును (బృ. 1.6.1). వేయేల? మాయ, కర్మ యను నీ రెండు శబ్దములు సమానార్థకములుగ నున్నవని చెప్పినను జెప్పవచ్చును. కారణమేమన: ప్రారంభమున నేదియో యొక కర్మ (వ్యాపారము) కలిగిననే కాని, యవ్యక్తము వ్యక్తమగుట గాని, నిర్గుణము సగుణమగుట గాని సంభవింపదు. ఇందు

చేతనే "నేను నా మాయచేఁ బ్రకృతిలో జననమందుచున్నాను" (గీ. 4.6) అని గీతలలో మొదట వక్కాణించి, పిదప నెనిమిదియవయధ్యాయములో "అక్షరపరబ్రహ్మమందుండి పంచభూతములు మొదలగు వివిధసృష్టి కలిగించు క్రియయే కర్మ" అని కర్మకు లక్షణము చెప్పఁబడినది (గీ. 8.3). కర్మ యనఁగా వ్యాపారము, లేక, క్రియ-కాని యయ్యది మనుష్య నిర్మితమే యైనఁ గానవచ్చును, సృష్టియందలి యితర పదార్థసంబంధమైన దైనను గావచ్చును. లేక మూలసృష్టిని పుట్టించునది గానైన నుండవచ్చునని వ్యాపకమగు నర్థము ప్రకృతమున వివక్షితముగ నున్నది; కాని, యే కర్మయొక్క పరిణామమయినను నెప్పుడును నొక విధమగు నామరూపముల మార్చి వానికిమాఱుగ మఱియొక విధమగు నామరూపముల నుత్పన్నముఁ జేయును. కారణమే మన: ఈ నామరూపములచే నాచ్ఛాదితమగు మూలద్రవ్య మెప్పుడును మాఱక యొకటిగనే యుండును. ఉదాహరణము: 'నూలు' అను నొక వస్తువునకే నేయుటచే 'నూల'ను నామము సెడి 'వస్త్ర' మను నామము సిద్ధించును. మఱియుఁ గుంభకారుని వ్యాపారముచే 'మృత్తిక' యను నామము సెడి 'కుండ' యను పేరు వచ్చును. కావున 'మాయ' యన నేమియో చెప్పునప్పుడు, కర్మయన నేమియో చెప్పక నామరూపములను రెంటిని మాత్రమే 'మాయ' యని పలుమాఱు వాడుచున్నారు. అయినను కర్మను స్వతంత్రముగ విచారింపవలసివచ్చినప్పుడు కర్మస్వరూపమును మాయాస్వరూపమును నొక్కటియే యని చెప్పవలసిన సందర్భము కలుగును. కావున 1. మాయ, 2. నామరూపములును, 3. కర్మయునను నీ మూఁడును మూలమునందొక స్వరూపముగనే యున్నవని ప్రారంభముననే చెప్పుట యధిక సులభముగ నుండును. 'మాయ' యనునది సామాన్యశబ్దము. దాని స్వరూపమునకు నామరూపము లనియు, వ్యాపారమునకుఁ కర్మ యనియు నవాంతరనామములు కలవు. మాయకుఁ గొంత సూక్ష్మభేదము గల్పించినను గల్పింపవచ్చును. లేకపోయినను పోవచ్చును. అయి

నను సామాన్యముగ నీ భేదముఁ జూపుట కావశ్యకత లేమిచే, నీ మూఁడు శబ్దము లనేక పర్యాయములు సమానార్థకములుగనే ప్రయోగింపఁబడుచున్నవి. పరబ్రహ్మముయొక్క యొక భాగమునందు, వినాశియగు మాయయొక్క యే యాచ్ఛాదన, (లేక, యుపాధి = పై యావరణము) మన నేత్రములకుఁ గన్పట్టుచున్నదో, యదియే సాంఖ్యశాస్త్రమునందుఁ త్రిగుణాత్మక ప్రకృతి యని పేర్కొనఁబడియె. సాంఖ్యులు-ప్రకృతి, పురుష లను నీ రెండు తత్త్వములును, స్వయంభువులు, స్వతంత్రములు, అనాదులు నని యందురు; కాని, మాయయు నామరూపములును, గర్మయు నను నవి, క్షణక్షణమున మాఱునవి యగుటచే నవి నిత్యము లనియు, అవికారు లనియు, పరబ్రహ్మముయొక్క యోగ్యత గలవి (అనఁగా: స్వయంభువులు స్వతంత్రములు) అనియుఁ జెప్పుట న్యాయదృష్టిచే సమంజసము. కారణ మేమి యన: నిత్యము, ననిత్యము నను రెండు కల్పనలును, బరస్పర విరుద్ధము లగుటచే నుభయమును నేక కాలమునం దుండుటకు శక్యము కానేరదు. కావున వినాశియగు ప్రకృతి (అనఁగా: కర్మాత్మకమగు మాయ) స్వతంత్రము గాదనియు, ఏకమును, నిత్యమును, సర్వవ్యాపియునగు నిర్గుణపరబ్రహ్మమందే మనుజుని దుర్బలములగు నింద్రియములకు సగుణమాయయొక్క దృశ్యము కాన్పించుచున్నదనియు వేదాంతులచే నిశ్చయింపఁబడినది; కాని మాయ పరతంత్ర మనియు నిర్గుణపరబ్రహ్మమందే యీ యాకృతి కాన్పించుచున్నదని చెప్పిన మాత్రముననే మనకు సర్వనిర్వాహము కానేరదు. సత్త్వరజస్తమో గుణపరిణామముచేఁ గాకపోయినను వివర్తవాదముచే నిర్గుణము నిత్యమునైన బ్రహ్మమందు వినాశియు సగుణమునగు నామరూపముల(మాయ)స్వరూపము కాన్పించుటకు శక్యమయినను మనుష్యేంద్రియములకుఁ గాన్పించుచున్న యీ సగుణస్వరూపము నిర్గుణపరబ్రహ్మమం దే క్రమమున నే సమయమున నేల చూపట్టుచున్నది? (అనఁగా: నిత్యము చిద్రూపియు నగు పరమేశ్వరుఁడు నామరూపాత్మకమును వినాశియునగు జడసృష్టిని

ఎప్పు డేల నిర్మించెను? అని సం[గహముగ) అను మఱియొక ప్రశ్న యీ స్థలమున వెలువడుచున్నది; కాని, ఋగ్వేదములోని నాసదీయ సూక్తములోఁ జెప్పినట్లు లీ విషయము మనుజునకే కాక, దేవతలకును, వేదములకు సైత మగమ్య మగుటచే (ఋ. 10.129; తై. బ్రా. 2.8.9) ఈ ప్రశ్నకు "ఇదియు నొక జ్ఞానదృష్టిచే నిశ్చయింపఁబడిన నిర్గుణపరబ్రహ్మముయొక్క యతర్క్యమగు లీలగనే యున్నది" యను సమాధానముకంటె నధికముగ నేమియు వచించుటకు వీలు లేదు (వే. సూ. 2. 1. 33). మనము చూచినప్పటి నుండియు నామ రూపాత్మకమును వినాశియు నగు కర్మ, లేక, సగుణమగు మాయ, నిర్గుణపరబ్రహ్మమును సమానముగనే కాన్పించుచున్నదని యంగీకరించియే ముందు విషయము నాలోచించుట యుక్తము. కావున మాయాత్మకమగు కర్మ యనాదిగ నున్నదని వేదాంతసూత్రములలోఁ జెప్పఁబడినది (వే. సూ. 2. 1. 35-37). భగవద్గీతయందును ప్రకృతి స్వతంత్రము గాదనియు, 'మాయ' తన సంబంధమైనదే యనియుఁ (గీ. 7. 14) జెప్పి పిదప నీ ప్రకృతియుఁ బురుషుఁడు నను నీ యిరువురును ననాదులుగ నున్నారని భగవంతుఁడే వక్కాణించియున్నాఁడు (గీ. 13-39). శ్రీ మచ్ఛంకరాచార్యులవారును తమ భాష్యమున మాయకు- "సర్వజ్ఞేశ్వరస్య ఆత్మభూతే ఇ వావిద్యాకల్పితే నామ రూపే తత్త్వాన్యత్వాభ్యా మనిర్వచనీయే సంసారప్రపంచబీజభూతే సర్వజ్ఞస్యేశ్వరస్య 'మాయా' 'శక్తిః' 'ప్రకృతి'రితి చ శ్రుతిస్మృత్యో రభిలప్యేతే"- ఏవి ఇంద్రియములయొక్క యజ్ఞానముచే మూల బ్రహ్మమందుఁ గల్పింపఁబడినవో, ఏవి సర్వజ్ఞుఁడగు పరమేశ్వరునకు నాత్మభూతములుగ నున్నటులు కాన్పించునో, యేవి జడములగుటచేఁ బరమేశ్వరునికంటె భిన్నము లనియు నభిన్నము లనియు (తత్త్వాన్యత్వమును) వచించుటకు సాధ్యము కానేరదో, యేవి జడసృష్టియొక్క (దృశ్యముయొక్క) వ్యాప్తికి మూలముగ నున్నవో, యా నామరూపములనే శ్రుతిస్మృతిగ్రంథములలో సర్వజ్ఞుఁడగు నీశ్వరునియొక్క

'మాయ' యనియు, 'శక్తి' యనియు, లేక, 'ప్రకృతి' యనియుఁ జెప్పుచున్నారు (వే.సూ.శాం.భా. 2.1.14) అని లక్షణమును జెప్పిరి. మఱియు ఈ మాయాసంబంధముచేతనే పరమేశ్వరునిచే సృష్టి నిర్మిత మైనటుల కాన్పించుచున్నది. ఈ మాయ వినాశియైనను, దృశ్యమగు సృష్టియొక్క యుత్పత్తి కావశ్యకమును, నత్యంతోపయోగకరమును నయి యున్నది. దానినే యుపనిషత్తులలో నవ్యక్తమనియు, ఆకాశ మనియు, అక్షర మనియుఁ బేర్కొనినటుల స్పష్టముగఁ గాన్పించుచున్న దనియు శ్రీశంకరాచార్యులవారు దమ భాష్యమునఁ జెప్పిరి (వే.సు. శాం.భా. 1. 4. 3). చిన్మయుఁడును (పురుషుఁడును), అచేతనమగు మాయయు (ప్రకృతి) నీ రెండు తత్త్వములును స్వయంభువులును, స్వతంత్రములును, అనాదులు నని సాంఖ్యు లందురు; కాని వేదాంతి, మాయయొక్క యనాదిత్వము నొక కారణముచే కొంచె మంగీకరించినను, మాయ స్వయంభువు స్వతంత్రము నని చెప్పుట వానికిష్టము లేదని యిందువలనఁ గాన్పించుచున్నది. మఱియు నీ కారణముచేతనే సంసారాత్మకమగు మాయను, వృక్షరూపముగ వర్ణించుచు-"న రూప మస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా"- ఈ సంసారవృక్షమునకు రూపము, అంతము, ఆది, మూలమును (అనఁగా: ఆధారస్థానము) లేవు (గీ. 15-3) అని గీతయందు వ్రాయఁబడి యున్నది. అటులే మూఁడవ యధ్యాయమునందు "కర్మ బ్రహ్మోద్భవం విద్ధి"- బ్రహ్మమందుండి కర్మ యుత్పన్న మైనది (గీ.3.15) "యజ్ఞః కర్మసముద్భవః"- యజ్ఞమైనను కర్మమునుండియే యుత్పన్నమైనది (గీ. 3.14) లేక, "సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా"- బ్రహ్మదేవుఁడు యజ్ఞముల (కర్మల)తోఁ గూడిన ప్రజను (సృష్టిని) సృజించెను (గీ. 3. 10); ఈ వచనముల కన్నింటికిని కర్మయు (అనఁగా: కర్మరూపియగు యజ్ఞమును) సృష్టియు (అనఁగా: ప్రజయు) నను నవి యన్నియు నొక కాలముననే సృజింపఁబడినవని తాత్పర్యము. కాని యా సృష్టి ప్రత్యక్షముగ బ్రహ్మదేవునిచే నిర్మింపఁబడినదని చెప్పి

నను, లేక, మీమాంసకులు చెప్పినటులు ఆ బ్రహ్మదేవునిచే నిత్యమగు వేదశబ్దమువలన నిర్మింపఁబడినదని చెప్పినను నొకటే యర్థమగును (మ. భా. శాం. 231; మను. 1. 21) కావున, కర్మ యనఁ: దృశ్యసృష్టి నిర్మాణమగు సమయమున మూలమగు నిర్గుణబ్రహ్మమందు కన్పట్టుచున్న వ్యాపార మని యందలి సారాంశము. ఈ వ్యాపారమునే నామరూపాత్మకమగు మాయ యని పేర్కొనుచున్నారు; మఱియు నీ మూలభూతమగు కర్మ యందుండియే, సృష్టియందలి సూర్యచంద్రాది సకల పదార్థములయొక్క వ్యాపారము క్రమముగ నుత్పన్నమైనది (బృ. 3.8.9). జగత్తునందున్న సర్వవ్యాపారములకు మూలభూతమగు కర్మగాని మాయగాని యేది సృష్టి ప్రారంభకాలమునందున్నదో యది యతర్క్యములగు బ్రహ్మలీలలలో నొకటిగనున్నది. స్వతంత్రవస్తువు కాదని జ్ఞానులు తమ బుద్ధిచే నిశ్చయించినారు*; కాని జ్ఞానికైన నీ విషయ మగమ్యము. కావున నీ లీలయు, నామరూపములును, లేక, మాయాత్మక కర్మయు 'నెప్పుడు' కలిగెనో మనకుఁ దెలియదు. కావున కేవల కర్మసృష్టియొక్క విచారమే కర్తవ్యమైనపుడీ పరతంత్రమును, వినాశియు నగు మాయయును, నటులనే తదంగభూతమగు కర్మయు ననాదులని చెప్పుట వేదాంతశాస్త్రమున వాడుకయై యున్నది (వే.సూ. 2. 1. 35). అనాది యనఁగా: సాంఖ్యులు చెప్పిన తీరున, ప్రారంభమునందే పరమేశ్వరునివలె నిరారంభమును (మొదలు లేనిదియు), స్వతంత్రము నని యర్థము కాదు. అనాది శబ్దమునకు దుర్జ్ఞేయారంభము (తెలియఁబడని యారంభము కలది) అని యీ స్థలమున వివక్షితార్థమని తెలియనగు.

కాని చిద్రూపమగు బ్రహ్మము కర్మాత్మకముగ (అనఁగా: దృశ్యసృష్టిరూపముగ) నే సమయమున నే హేతువువలన నైనదను

* "What belongs to mere appearance is necessarily subordinated by reason to the nature of the thing itself"-Kant's Metaphysics of Morals. (Abbot's trans. in Kant's Theory of Ethics. p.81).

విషయము మనకుఁ దెలియకపోయినను నీ మాయాత్మకమగు కర్మ యొక్క యనంతవ్యాపార మెటుల నడచునో దాని నియమము నిశ్చితమై యుండుటచే వానిలోఁ బెక్కు విషయములను మనము బాగుగనే నిశ్చయింపఁగలము. వీనిలో మూలప్రకృతినుండి(అనఁగా: అనాది మాయాత్మక కర్మనుండి) సృష్టియందున్న నామరూపాత్మక మగు వివిధ పదార్థములును నే క్రమమున నిర్మింపఁబడిన వను విష యము సాంఖ్యశాస్త్రానుసారముగ నెనిమిదియవ ప్రకరణమున వివే చింపఁబడుటచే, అచ్చో నాధునికులగు నాధిభౌతికశాస్త్రజ్ఞులు సిద్ధాం తములు సైతము తారతమ్యప్రదర్శనము కొఱకు వచింపఁబడినవి. వేదాంతశాస్త్రము ప్రకృతిని పరబ్రహ్మమువలె స్వయంభువని చెప్పని మాట సత్యమే. కాని ప్రకృతి కనంతరము కలిగినదియు సాంఖ్య శాస్త్రమునందుఁ జెప్పఁబడినదియునగు క్రమము వేదాంతులకును సమ్మతమే యగుటచే దాని నిక్కడ మరలఁ జెప్పనవసరము లేదు; కాని కర్మాత్మకమగు మూలప్రకృతి వలన ప్రపంచసృష్టియొక్క పూర్వమునందుఁ జెప్పఁబడిన క్రమమున మనుజునకు నే కర్మఫల ములు భోగింపవచ్చునో వాని విషయమగు సామాన్యనియమము లేమియుఁ జెప్పఁబడలేదు. కావున మన మీ విషయములను వివేచిం చుట యావశ్యక మగును. దీనినే కర్మవిపాక మని చెప్పుచున్నారు. కర్మ యొక పర్యాయ మారంభమగు నేని దానియొక్క వ్యాపార మా తీరుననే యఖండముగ నడచుచుండును. మఱియు బ్రహ్మదేవుని దినపరిమితి ముగిసిన పిదప సృష్టియొక్క సంహారమైనను నీ కర్మ బీజముగ మిగిలియుండి మరల సృష్ట్యారంభ మగునేని యా కర్మ బీజము నందుండి మరల వెనుకటివలెనే యంకురించును. ఇదియే కర్మవిపాకముయొక్క మొదటి నియమము. కావుననే—

యేషాం యే యాని కర్మాణి ప్రాక్ సృష్ట్యాం ప్రతిపేదిరే,
తాన్యేవ ప్రతిపద్యంతే సృజ్యమానాః పునః పునః.

— ప్రతిప్రాణియుఁ బూర్వసృష్టియందే యే కర్మను జేయుచుండునో యవి యన్నియుఁ దప్పక (తనకు ఇచ్ఛయుండినను సరే, లేక యుండినను సరే) యతనికి మరల వెనుకటివలెనే ప్రాప్తములగు చున్నవి అని మహాభారతకారుఁడు చెప్పుచున్నాఁడు (మ. భా. శాం. 231.48-49; గీత. 8.18,19 చూడు). "గహనా కర్మణో గతిః"—కర్మ యొక్క గతి తెలియుట దుర్లభము (గీ. 4. 17). ఇంతియకాక కర్మ యొక్క నిర్బంధమును సైతము దెలిసికొనుట బహుకష్టముగనే యున్నది. కర్మ యెవ్వనిని వదలలేదు. వాయువు కర్మచేతనే వీచు చున్నది. సూర్యచంద్రాదులుఁ గర్మచేతనే తిరుగుచున్నారు. మఱియు బ్రహ్మదేవుఁడు, విష్ణువు, శంకరుఁడును, సగుణదేవతలును గర్మచే బద్ధులయి యుండ నింద్రాదుల విషయము చెప్పనేల? సగుణ మనఁగా నామరూపాత్మకము. మఱియు నామరూపాత్మకమనఁగా కర్మయేయని కాని, లేక, కర్మయొక్క పరిణామమని కాని యర్థ మగును. మాయా త్మకకర్మయే ప్రారంభమున నెచ్చో నుండి వచ్చినదియు వచించుటకు సాధ్యము కాదు. తదంగభూతుఁడగు మనుష్యుఁ డనువాఁడు కర్మ యొక్క సుడిలో తొలుత నెట్లుల పడెనో యదియునుజెప్పుటకు సాధ్యము కానేరదు; కాని యే విధముచే నైనను గర్మయొక్క సుడిలో నొకసారి చొరఁబడెనేని యొక నామరూపాత్మకమగు దేహము నాశనమైన పిదపఁ గర్మయొక్క పరిణామము వలన నతని కీ సృష్టియందు వేర్వేఱు రూప ములు ప్రాప్తము లగుటతప్పదు. కారణ మేమి యన: కర్మశక్తి యెప్పు డును నశించునది కాదు. కావున నే శక్తి యే యే రూపములతో నేఁడు గాన్పించుచున్నదో యదియ మఱియొకప్పు డింకొక నామరూపము లతోఁ బ్రకటమగునని యాధిభౌతికశాస్త్రజ్ఞులచే నిశ్చయింపఁబడినది*.

* హిందూధర్మావలంబులును, అస్తికమతావలంబులును మాత్రమే పున ర్జన్మము కలదని యంగీకరింపలేదు. బౌద్ధులుగూడ నాత్మ నంగీకరింపక పోయి నను వైదికధర్మములం దున్న పునర్జన్మను దమ ధర్మములయందుఁ బూర్ణముగ నంగీకరించియే యున్నారు. కావున నిరుపదియవశతాబ్దమునందుఁ బరమేశ్వరుఁడు

మఱియు నొకానొక నామరూపములు నాశనమయిన పిదప దానికి వేఱ్వేఱగు నామరూపంబులు నిర్జీవంబులైయే యుండును. దానికంటె భిన్నముగ నుండుట కెప్పుడును శక్యము కానేరదనియుఁ జెప్పుటకు సాధ్యము కాదు. అధ్యాత్మదృష్టిచేత నీ నామరూపాత్మకపరంపరనే, జననమరణచక్రము, లేక, సంసారము అని వచించెదరు. మఱియు నీ నామరూపములకు నాధారభూతమగు శక్తినే సమష్టిరూపముచే బ్రహ్మమనియు, వ్యష్టిరూపముచే జీవాత్మ యనియుఁ బేర్కొనుచున్నారు. బాగుగఁ బరిశీలించితిమేని యీ యాత్మ పుట్టునదియు కాదు, చచ్చునదియు కాదు (అనఁగా: స్థిరముగ నుండునది); కాని కర్మచక్రమునందుఁ బడియుండుటచే నొక నామమును రూపమును నశించినపిదప దానికే మఱియొక నామమును రూపమును ప్రాప్తమగుట యని వార్యము. ఈ దినమునఁ జేసినదంతయు రేపు భోగింపవలసివచ్చును. ఇంతియకాక ఈ జన్మమునందుఁ జేయునది రాఁబోవు జన్మమున భోగింపవలసివచ్చును. ఈ తీరున నీ భవచక్రము సర్వదా తిరుగుచునే యుండును. కేవలము మనకే కాక మన నామరూపాత్మకములగు దేహములనుండి జనించు పుత్రులును, పౌత్రులును, ఈ కర్మఫలములనే యనుభవింపవలసి వచ్చును అని మనుస్మృతియందును, మహాభారతమునందునుజెప్పఁబడి యున్నది (మను. 4·170; మ·భా·ఆ. 80·3)·

వచ్చునని చెప్పునట్టియు, దృఢమగు నిరీశ్వరవాదియు నగు 'నీట్చే' (Nietzsche) యను జర్మను పండితుఁడు సైతము పునర్జన్మవాదమును స్వీకరించియే యున్నాఁడు. కర్మశక్తి సర్వదా రూపాంతరములఁ బొందుచునే యుండును. ఆ రూపాంతరము లవధి గలవి. కాల మనంత మగుటం బట్టి యొకసారి కలిగిన నామరూపములు మరల మరల కలుగకమానవు. దీనివలన కర్మచక్రము (బంధము) అధిభౌతిక దృష్టిచేఁ జూచినను సిద్ధమగునని చెప్పవలసియే యుండును. ఈ కల్పన (ఉపపత్తి) నాకు స్వయముగనే స్ఫురించిన దనియు నీట్చే వ్రాసియున్నాఁడు. Nietzsche's Eternal Recurrence (Complete Works, English Trans; Vol, XVI. pp. 235-256,

పాపం కర్మ కృతం కించిత్ యది తస్మి న్న దృశ్యతే,
నృపతే తస్య పుత్త్రేషు పౌత్త్రేష్వపి చ నప్తృషు.
(మ.భా.శాం. 1.29)

— ఓ రాజా! ఎవరికైనను దమ పాపకర్మముల ఫలము తమ యను భవమునకు రాకపోయినను, అది వారి కొమారులకో, మనుమలకో, మునిమనుమలకో భోగింపవలసివచ్చును అని శాంతిపర్వమున భీష్ములు యుధిష్ఠిరునకుఁ జెప్పిరి. కొన్ని యనివార్యములగు రోగములు వంశపరంపరగా వచ్చుచుండుటయు మనము ప్రత్యక్షముగఁ జూచుచునేయున్నాము. అటులే యొకఁడు బీదకులమున దరిద్రుఁడుగ జన్మించుటకును, నొకఁడు రాజకులమునందే సంపన్నుఁడై జననమందుటకు నుపపత్తి కర్మవాదముచేతనే చెప్పవలసియుండును; మఱియు ననేకు లీ కర్మవాదమతమునే సత్యముగను పూర్ణముగను నమ్మియున్నారు. కర్మయొక్క చక్రము, లేక, ఈ ఘటీయంత్ర మొకపరి తిరుగుటకుఁ బ్రారంభమగునేని పిదప దీనినిఁ బరమేశ్వరుఁడు సైత మాపలేఁడు. సర్వసృష్టియును బరమేశ్వరునిచేఁ బ్రవర్తించుచున్నదని కనుఁగొంటి మేని, కర్మఫల మిచ్చువాఁడు పరమేశ్వరునికంటె నితరుఁ డెవఁ డుండును? (వే.సూ. 3.2.38; కౌ. 3.8) కావుననే గీతలలో భగవంతుఁడు "లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్"— నాచేతనే విహితమగు నిష్టఫలముల మనుజుఁడు పొందుచున్నాఁడు (గీ. 7.22) అని స్పష్టముగఁ జెప్పుచున్నాఁడు. కర్మఫలములను నియమించుట యను కార్యము పరమేశ్వరునిదే యైనను నీ కర్మఫలములు తమ తమ కర్మల మంచిచెడుగుల ననుసరించి (అనఁగా: కర్మాకర్మల యోగ్యత కనురూపముగ) నిశ్చయింపఁబడును. కావున బరమేశ్వరుఁ డీ విషయమున నుదాసీనుఁడే యగుటచే మనుష్యులలో మంచిచెడుగు లను భేద మున్నను బరమేశ్వరుఁడు వైషమ్యము (విషమబుద్ధి), నైర్ఘృణ్యము (దయలేకపోవుట = నిర్దయత్వము) అను నీ

రెండు దోషములకు బాధ్యుఁడుకాఁడని వేదాంతశాస్త్రముయొక్క కడపటి సిద్ధాంతమై యున్నది (వే.సూ. 2.1.34). మఱియు నీ హేతువు చేతనే "సమోఽహం సర్వభూతేషు"— ఈశ్వరుఁ డందఱకును సమానముగ నున్నాఁడు (గీ. 9. 29) "నాదత్తే కస్య చి త్పాపం న చైవ సుకృతం విభుః"— పరమేశ్వరుఁ డెవరి పాపమును గైకొనఁడు. ఎవరి సుకృతమును గైకొనఁడు. కర్మయొక్క, లేక, మాయయొక్క స్వభావ మను ఘటీయంత్రము నడచుచుండుటచే నన్ని ప్రాణులును దమ తమ కర్మల ననుసరించి సుఖదుఃఖముల భోగింపవలసివచ్చును (గీ. 5. 14-15) నని గీతలలోను జెప్పఁబడినది. పరమేశ్వరేచ్ఛచే జగత్తునందుఁ గర్మ లెప్పుడు పుట్టెనని కాని, లేక, తదంగభూతుఁడగు మనుజుఁడు మొట్టమొదట కర్మయొక్క పరిభ్రమణములో నెటుల పడెనని కాని చేయు ప్రశ్నకు నుత్తర మిచ్చుట మన బుద్ధికి శక్యము గాకపోయినను, కర్మకుఁ గలుగు పరిణామము (ఫలము) కేవల కర్మయొక్క నియమముచేతనే యుత్పన్న మగునని స్పష్టముగ సిద్ధమగును. అందుచే జగత్తుయొక్క యారంభమునందుండి ప్రతిప్రాణియు నామరూపాత్మకమును, ననాదియు నగు కర్మ యనెడి కారాగృహములోఁ బడి నటు లున్నాఁడని మాత్రమే మనకు బుద్ధిచే నిశ్చయించుటకు సాధ్యమగును అని పై నుదాహరింపఁబడిన గీతావచనమునకు సైత మిదియే యర్థము.

ఈ యనాదియగు కర్మప్రవాహమునకే సంసారము, ప్రకృతి, మాయ, దృశ్యసృష్టి, సృష్టియొక్క నియమములు అనునవి పర్యాయపదములు. కారణ మేమన: సృష్టిశాస్త్రముయొక్క నియమములే, నామరూపములయందుఁ బుట్టుమార్పులకును నియమములై యున్నవి. మఱియు నీ దృష్టిచేఁ జూచితిమేని యన్ని యాధిభౌతికశాస్త్రములును నామరూపాత్మకమగు మాయయొక్క ప్రపంచమునందే యంతర్భూతము లగును. ఈ మాయయొక్క నియమములు, లేక, బంధనములు

దృఢమైనవిగను సర్వము వ్యాపించినవిగను నున్నవి. కావున నీ నామ రూపాత్మకమగు మాయ సృజింపఁబడక మునుపు మఱియొక నిత్య తత్త్వ మేదియు లేదని చెప్పునట్టి 'హెకెల్' వంటి కేవలాధిభౌతిక శాస్త్రజ్ఞు లీ సృష్టి యను ఘటీయంత్రము నడచినట్లే మనుజుఁడు నడువవలసివచ్చు నని సిద్ధాంతముఁ జేసిరి. నామరూపాత్మక(వినాశ్య) మగు నీ సంసారమునుండి తనకు విముక్తి కావలయునని కాని, లేక యీ కర్మ నొనర్చుటచే మన కమృతత్వము సిద్ధించునని కాని ప్రతి మనుజుఁడును భావించుట కేవలము భ్రమయే యని పండితులు వక్కాణించెదరు. జీవాత్మ పరమాత్మ లనునవి స్వతంత్రపదార్థములు కాక పోవుటచే నమృతత్వమే యసత్యము. ఇంతియకాక, యీ జగత్తులో నే మానవుఁడైనను స్వయముగ నే కార్యమునైనను జేయుటకు స్వతంత్రుఁడు కాఁడు. మనుష్యుఁ డీ జన్మమునఁ జేయు పని యతనిచేఁ గాని యతని పూర్వులచేఁ గాని పూర్వమునం దొనర్పఁబడిన కృత్యములయొక్క పరిణామమే కాన, నీ కార్యముల నొనర్చుట గాని యొనరింపకయుండుట గాని యతని యిచ్ఛ నవలంబించి యెప్పుడు నుండ లేదు. ఉదాహరణము: పరుల పదార్థ మొకటి కాన్పించె నేని దాని నపహరింపవలయు నను కోర్కె లేకపోయినను, కర్మచేతఁగాని లేక, వంశపారంపర్యముగా వచ్చిన సంస్కారముచేఁ గాని యుపహరింపవలయు నను నూహపుట్టి యనేకులు దేనినైనను తస్కరించుటకై ప్రవృత్తు లగుచున్నారు. "అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః"— ఇచ్ఛ లేకపోయినను మనుష్యుఁడు పాపముఁ జేయును (గీ. 3.36) అని గీతలయందుఁ జెప్పఁబడిన విషయ మెల్లయెడల నా విధమునే సంబంధించును. ఈ విషయమున కేమియు భంగము లేదని కాని, లేక, దానిని తప్పించుకొనుట కేమియు నుపాయము లేదని కాని, యీ యాధిభౌతికపండితుల మతమని సారాంశము. ఈ మతానుసారముగఁ జూచితి మేని, మనుజునకు నేఁడు పొడమిన బుద్ధిగాని,

యిచ్చుగాని యెన్నటి కర్మఫలమనియు, ఇట్టి కారణపరంపర కంతము లేమిచే మనుజుఁ డెప్పుడును తన స్వతంత్రబుద్ధిచే నేమియు నొనర్చుటకు సమర్థుఁడు కానేరఁడనియు, లభించినదంతయుఁ, బూర్వకర్మము యొక్క, అనఁగా: దైవముయొక్క—ప్రాక్తనకర్మనే దైవమని చెప్పుదురు—ఫలముగనే యున్నదనియుఁ జెప్పవలసివచ్చును. మఱియు నీ తీరున నే కర్మనైనఁ జేయుటకుఁ గాని, చేయకపోవుటకుఁగాని మనుజునకు స్వాతంత్ర్యము లేనియెడల, వానిచేతనే యాచరణ యీ తీరున సంస్కరింపఁబడవలయుననియు, ఈ తీరున బ్రహ్మాత్మైక్యజ్ఞానమును సంపాదించుటకై చిత్తము శుద్ధముగ నొనర్చికొన వలయుననియుఁ జెప్పుట సైతము వ్యర్థమే యగును. నదీప్రవాహమునఁ బడిన కఱ్ఱవలెనే, మాయ, ప్రకృతి, సృష్టిక్రమము, లేక, కర్మయొక్క ప్రవాహమెచ్చటికిఁ గొంపోవునో యచ్చటికే పోక, తా నేమియుఁ జేయుటకు వీలుకానంతటి యవస్థ మనుజునకుఁ బట్టును. దానివలనఁ బ్రగతి (అనఁగా: మంచిగతి) కలిగినను, లేక, అధోగతి కలిగినను అనుభవింపక తప్పదు. మఱియును ప్రకృతిస్వరూపము స్థిరము కాదు. నామరూపములు ప్రతిక్షణమును మాఱును. కావుననే, యీ మార్పులే సృష్టినియమముచే నుత్పన్నము లగునో దాని నెఱింగి మనుజుఁడు బాహ్యసృష్టియందుఁ దనకు లాభకారియగు పరివర్తనమును గూడ నంతవఱకుఁ గల్పించుకొనవలయును. మఱియుఁ బ్రత్యక్షవ్యవహారములో నిటులే యగ్నిని గాని, విద్యుచ్ఛక్తిని గాని మనుష్యుఁడు స్వలాభార్థమై యుపయోగించుకొనుచుండుట మనదృష్టికి గోచరమగుచునే యున్నది. అటులే, ప్రయత్నముచేతనే మనుష్యస్వభావము సైతము కొంచెముగనో, గొప్పగనో మార్చుటకు సాధ్యమగు ననియు, అనుభవగోచర మగుచున్నదనియు కొంద ఱాధిభౌతికులగు నుత్క్రాంతివాదులు నుడువుచున్నారు; కాని సృష్టిరచనయందుఁ గాని, లేక, మనుష్యస్వభావమునందుఁ గాని మార్పు లేవిధమైనఁ బొడముచున్నవా

లేవా? లేక, యవి యొనర్చుట యావశ్యకమా? కాదా? యనునవి ప్రస్తుతమందలి ప్రశ్నలు కానేరవు. అందుచే నీ మార్పు చేయుట కే బుద్ధి గాని, యిచ్ఛ గాని, మనుజున కుత్పన్న మగునో, దాని నాపుటయు నాపకుండుటయు వాని స్వాధీనములై యున్నవా? లేవా? యనునదియే ప్రప్రథమమున నిర్ణయింపవలసినదిగ నున్నది. మఱియు నాధిభౌతికశాస్త్రరీతిగ నీ బుద్ధిపుట్టుట, పుట్టకపోవుట యనునవియే "బుద్ధిః కర్మానుసారిణీ" యను న్యాయముచేఁ బ్రకృతియొక్క గాని, కర్మయొక్క గాని సృష్టియొక్క గాని నియమములచేఁ బూర్వముననే నిశ్చయింపఁబడిన యెడల, ఈ యాధిభౌతికశాస్త్రము ననుసరించి మనుజున కే కర్మయైనఁ జేయుటకుఁ గాని, చేయకపోవుటకుఁ గాని స్వాతంత్ర్యము లేదని నిష్పన్నమగును. ఈ వాదమును 1. వాసనాస్వాతంత్ర్య మనియు 2. ఇచ్ఛాస్వాతంత్ర్య మనియు, 3. ప్రవృత్తిస్వాతంత్ర్య మనియుఁ బేర్కొనుచున్నారు. మఱియుఁ గేవలము కర్మవిపాకము యొక్కగాని, కేవలాధిభౌతికశాస్త్రముయొక్కగాని దృష్టిచేతనే విచారించితి మేని, యే మనుజునకైనను నే విధమగు ప్రవృత్తిస్వాతంత్ర్యము గాని, యిచ్ఛాస్వాతంత్ర్యము గాని లేదనియు, ఇనుపపట్టాచే బంధింపఁబడిన చక్రమువలె కర్మ యను నభేద్యమగు బంధనముచేఁ బ్రతి మనుజుఁడును నలుగడలను బిగింపఁబడి యున్నాఁడనియుఁ దుదకు సిద్ధాంతీకరింపవలసి వచ్చును; కాని యీ పనియం దంతఃకరణ సాక్ష్యమును గైకొన్న పక్షమున, సూర్యుని పశ్చిమదిశయం దుదయింపఁజేయుట వంటి పని చేయుటకును మనకు సామర్థ్యము లేకపోయినను, మనము స్వయముగఁ జేయు పనియందలి సారాసార విచారమును విచారించి చేయఁగలమో లేమో, లేక, యెచ్చో నొక మార్గము పాపముగను పుణ్యప్రదముగ నుండునో, యొకటి ధర్మము మఱియొకటి యధర్మముగ నుండునో, అచ్చో నీ రెండు మార్గముల లోను మంచిమార్గమును గాని చెడుమార్గమును గాని స్వీకరించుటకు మనము సమర్థుల మగుదుమో కామో యను విషయములుమాత్రము

మన యిచ్ఛాధీనములుగ నున్నటులు గాన్పించుట మన మెఱుంగుదుము. ఈ యెఱుక నిజమా? యబద్ధమా? యని యిప్పుడు మనము విచారింతము. దీని యాధారముననే, చౌర్యము, హత్య మొదలగు నేరములను జేసిన వారిని అపరాధులని నిశ్చయించి శిక్షించుటవలన దీనిని అసత్యమని చెప్పుటకు వీలులేదు. కర్మవాదము, కర్మవిపాకము లేక, దృశ్యసృష్టియొక్క నియమములును అసత్యము లగును గాన, నిజమని చెప్పుటకును వీలులేదు. ఆధిభౌతికశాస్త్రములందు కేవల జడపదార్థములయొక్క క్రియలు మాత్రమే విచారణీయము లగుటచే నీ ప్రశ్న వెలువడదు; కాని, జ్ఞానవంతుఁడగు పురుషునియొక్క కర్తవ్యాకర్తవ్యము లే కర్మయోగశాస్త్రమునందు విచారింపఁబడవలయునో దానియందీ ప్రశ్న గొప్పది యగుటచే దీనికి సమాధానమును జెప్పుట యావశ్యక మగును. కారణ మేమి యన: మనుజునకుఁ బ్రవృత్తిస్వాతంత్ర్యము లేదని యొక మాఱు స్థిరపడెనేని, మరల నీ తీరున బుద్ధిని శుద్ధముగ నుంచవలయునని కాని, లేక యీ విషయ మొనర్పవలయునని కాని, కూడదని కాని, యిది ధర్మ్యము, ఇది అధర్మ్యము అని కాని చెప్పు విధి నిషేధశాస్త్రములయొక్క యన్నివిధములగు విరోధములును స్వయముగనే నశించుననియు (వే.సూ. 2.3.33)* పరంపరగఁ గాని, ప్రత్యక్షముగఁ గాని, మహామాయ యను ప్రకృతియొక్క దాస్యమునం దెల్లప్పుడు నుండుట యనునదియే పరమపురుషార్థమనియు బయల్పడును. అట్టులయిన నిది పురుషార్థ మెట్టు

---

* వేదాంతసూత్రముల యందుండు నీ యధికరణమును, 'జీవకర్తృత్వాధికరణ'మని పేర్కొనుచున్నారు. దీని మొదటిసూత్రము 'కర్మశాస్త్రార్థవత్త్వాత్' అనఁగా: విధినిషేధశాస్త్రములు, సప్రయోజనము లగుటకు జీవునకుఁ గర్తృత్వ మంగీకరింపవలయునని దీని భావము. "స్వతంత్రః కర్తా" యను పాణినీయ సూత్రమును (పా. 1.4.54) గమనించితి మేని, కర్తృశబ్దముచేతనే యాత్మస్వాతంత్ర్యము తెలియఁబడును. మఱియు నీ యధికరణ మీ విషయమునకే (ఆత్మస్వాతంత్ర్యమునకే) సంబంధించినది యని కన్పట్టును.

లగును? మన స్వాధీనములో నుండునదియే పురుషార్థమగును. ఎక్కడ నైనను మనకుఁ గొంచెము స్వాతంత్ర్యమైనను, స్వేచ్ఛయైన నుండ నేరదో, యక్కడ కారాగృహమును, దాస్యమును దప్ప మఱియొకటి యేమి యుండును? నాగటికి కట్టిన యెడ్లవలె నందఱును బ్రకృతి యాజ్ఞలోనే బద్ధులై యుండుటచే మన శంకరకవి మహారాష్ట్ర భాషలోఁ జెప్పినటుల "పరార్థధర్మాచియా శృంఖలా"- నిత్యమును మన పాద ములు పదార్థగుణములను సంకెలచే బంధింపఁబడియుండవలయును. మన దేశములోనున్న కర్మవాదము చేతను, దైవవాదము చేతను, పాశ్చాత్యదేశమునందుండి ప్రచారమునకు వచ్చిన ప్రాథమికక్రైస్తవ ధర్మములందున్న భవితవ్యతావాదముచేతను, అధునికకాలమునఁ బ్రచారమునకు వచ్చియుండు శుద్ధాధిభౌతికశాస్త్రమునందలి సృష్టి క్రమవాదముచేతను, ఇచ్ఛాస్వాతంత్ర్యములను వంకకుఁ బండితుల దృష్టి ప్రసరించియుండుటచేతను, ఈ విషయ మధికముగఁ జర్చింపఁ బడుచున్నది. ఈ విషయ మంతయు నిచ్చో వక్కాణించుట యావశ్య కము. అందుచే వేదాంతసూత్రములయందును, భగవద్గీతలయందును నీ శంకకే సమాధాన మున్నదనునది మాత్రమే యీ ప్రకరణము నందు విచారింపఁబడును.

కర్మప్రవాహ మనాది యనునదియు, నొకసారి తిరుగుటకుఁ బ్రారంభమయిన కర్మ యను ఘటీయంత్రమునందుఁ బరమేశ్వరుఁడు స్వతంత్రింపఁడనునదియు నిజమే. అయినను దృశ్యసృష్టియే, అనఁగా కేవల నామరూపములే, కర్మకాక, యీ నామరూపాత్మకమగు నావ రణమునకు నాధారభూతమై, యాత్మస్వరూపమును, స్వతంత్రమును అవినాశియు నగు బ్రహ్మసృష్టి యుండుననియు, మనుష్యదేహమునం దున్న యాత్మ నిత్యమును, స్వతంత్రము నగు నా పరబ్రహ్మము యొక్క యంశమే యనియు, అధ్యాత్మశాస్త్రముయొక్క సిద్ధాంతము. దీని సాహాయ్యముచేతనే యనివార్యముగఁ గన్పట్టుచున్న పూర్వోక్తం

బగు నారకంబు నుండి సైతము దాఁటుటకు మార్గమున్నది యని మన శాస్త్రకారులు నిశ్చయించిరి; కాని యీ మార్గమును వివరించుట కంటె ముందుగఁ గర్మవిపాకప్రక్రియయొక్క వివరణ మింకను మిగిలియే యున్నది గాన దానిని బూర్తిఁ జేసికొనవలయును. "నరుఁడు దేని నెట్టులు చేయుచున్నాఁడో దాని నట్లే యనుభవించును" అను నియమ మొక వ్యక్తికి మాత్రమే సంబంధించునది కాదు. ఒక మనుష్యుని కెట్టులో యట్లే యొక కుటుంబమునకును, ఒక జాతికిని, ఒక రాష్ట్రమునకును వేయేల సర్వజగత్తునకును స్వస్వకర్మ యనుభవింపక తీరదు. మఱియుఁ బ్రతి మనుజుఁడును నేదో యొక కుటుంబము నందుఁ గాని, జాతియందుఁ గాని, లేక, దేశమునందుఁ గాని చేరియుండును గాన తనయొక్క ఫలమునే కాక కుటుంబాదికమగు సామాజికులయొక్క కర్మఫలమును సైతము కొంత యనుభవింపవలసి వచ్చును; కాని వ్యవహారమున తఱచుగ నొక మనుజుని కర్మవిషయమై విచారణ యొనరింపవలసి వచ్చినప్పుడు కర్మవిపాకప్రక్రియ యందున్న కర్మ విభాగము తఱచుగ నొక మనుజునకు మాత్రమే యుద్దేశింపఁబడినది. ఉదాహరణము: మనుజుఁ డొనర్చు పాపకర్మములను కాయికము లనియు, వాచికము లనియు, మానసికము లనియు మూఁడు విధములుగ విభజించియున్నాఁడు. వానిలో వ్యభిచారము, హింస, చౌర్యమనునవి మూఁడును కాయికములు. వాక్పారుష్యము, అనృతసంభాషణము, అసంగత ప్రలాపము, పిశునోక్తియు ననునవి నాలుగును వాచికములు. మఱియుఁ బరద్రవ్యాభిలాష, అన్యులు గుఱించి యహితచింతన, దురాగ్రహము ననునవి మూఁడును మానసికములు. ఇవియన్నియుఁ గలిసిన పది విధములగు నశుభములు (పాపకర్మలు) అనిచెప్పి (మను. 12.౪-7; మ.భా.అను. 13) వాని ఫలమును వర్ణించెను; కాని యీ భేదము లెవ్వియు స్థిరములైనవి కావు. కారణ మేమి యన తీ యధ్యాయంబునందుఁ గర్మాత్మ మొత్తముపై కర్మలు సాత్త్వికము నిలయము, రాజసము లనియు, తామసము లనియు త్రివిధములుగ విభ

జింపఁ బడినవి. తఱచుగ భగవద్గీతలలోఁ జెప్పఁబడినటులే యీ త్రి విధములగు గుణములయొక్క గాని కర్మలయొక్క గాని లక్షణములు వ్రాయఁబడినవి (గీ. 14.11-15; 18.2౦-25; మను. 12 31-34). కాని, కర్మవిపాక ప్రకరణమునందు, కర్మకు సామాన్యముగ వెలుపలికిఁ గన్పట్టుచున్న విభాగ మీ రెంటికంటెను వేఱుగ నున్నది. దాని యందు సంచితములు, ప్రారబ్ధములు, క్రియమాణము లని త్రివిధము లుగ కర్మలు విభజన సేయఁబడియున్నవి. ఏ మనుజుఁడైనను బూర్వ జన్మమునఁ గాని యీ జన్మమునఁ గాని యీ క్షణమువఱకుఁ జేసిన కర్మలన్నియు 'సంచితములు' (అనఁగా: 'సంపాదింపఁబడిన కర్మలు') అని చెప్పఁబడును. ఈ సంచితమునే 'అదృష్ట'మని కాని మీమాంసక పరిభాషానుసారముగ 'అపూర్వ'మని కాని పేర్కొందురు. ఈ కర్మగాని క్రియగాని యే సమయమునందుఁ జేయవలసివచ్చునో యంతవఱకే యది కాన్పించును. మఱియు నా సమయము దాఁటిపోయిన పిదప, నా కర్మ స్వరూపముచే నవశిష్టమై యుండకపోయినను, దానియొక్క సూక్ష్మమును, కావుననే, యదృశ్యము నగు నపూర్వము గాని, లేక, విలక్షణమగు పరిణామమాత్రము గాని యవశిష్టమై యుండుటచేతనే యీ పేళ్లు వానికిఁ బెట్టవలసివచ్చెను (వే.సూ.శాం.భా. 32.39-40). ఏమి చెప్పినను 'సంచిత', 'అపూర్వ', లేక, 'అదృష్ట' శబ్దములకు నీ క్షణము వఱకును జేయఁబడిన యన్ని కర్మలయొక్కయు పరిణామ సముదాయ మర్థ మనునది నిర్వివాదము. ఈ సంచితకర్మ లన్నియు నొక కాలముననే యనుభవించుటకు శక్యము కానేరవు. కారణ మేమన: ఈ సంచితములగు కర్మల పరిణామములోఁ గొన్ని మంచివియుఁ గొన్ని చెడువియు నగు(అనఁగా: పరస్పర విరుద్ధములగు) ఫలముల నిచ్చుటకు సమర్థము లగుచున్నవి. ఉదాహరణార్థము: కొన్ని సంచితములు స్వర్గప్రదములును, కొన్ని నరకప్రదములు నగుటచే నా కర్మఫలము లన్నియు నేకకాలముననే యనుభవించుటకు శక్యము కావు. ఒకదాని పిదప నొకదానిని భోగింపవలయును. కాన సంచిత

ములలో నెన్ని కర్మల యొక్క ఫలములు భోగించుటకుఁ బ్రథమమున నారబ్ధము లయినవో వానినే 'ప్రారబ్ధము' లనియు, (అనఁగా: ఆరంభమయిన సంచితములనియు)చెప్పుచున్నారు. వ్యవహారమున ప్రారబ్ధ శబ్దమునే 'సంచిత' మను శబ్దార్థమునం దెల్లప్పుడు నుపయోగించుచున్నారు; కాని యిది భ్రమ. సంచితముయొక్క(సమస్త పూర్వకర్మల సముదాయముయొక్క) యవాంతరభేదమే ప్రారబ్ధమని శాస్త్రదృష్టిచే సిద్ధమగుచున్నది.'ప్రారబ్ధ'మన సకలసంచితములును కాకపోయినను సంచితములలో నే కర్మఫలము లనుభవించుటకుఁ బ్రారంభింపఁబడినవో యవియే ప్రారబ్ధము లనఁబడుచున్నవి. కావున నీ ప్రారబ్ధమునకే యారబ్ధకార్య మని మఱియొక పేరు. ప్రారబ్ధసంచితములు కాక 'క్రియమాణ' మను పేరుగల కర్మ మూఁడవది యని సామాన్యముగఁ జెప్పఁబడిన భేదము. 'క్రియమాణ' శబ్దము వర్తమానకాలవాచి యగు 'శానచ్' ప్రత్యయముచేతను, 'కృఞ్' ధాతువుచేతను నిష్పన్నమయినది. కావున "ఇప్పుడు మనము చేయుచున్న కర్మ" యని దాని కర్థము; కాని ప్రస్తుతమందు మనము చేయుచున్న కర్మలలో నే కర్మలు భోగించుటకుఁ బ్రారబ్ధములైనవో వానియొక్క (అనఁగా: ప్రారబ్ధకర్మయొక్క) పరిణామములే యై యున్నవి. అందుచేతనే 'క్రియమాణ' మనునది కర్మయొక్క మూఁడవ భేదము అని యంగీకరించుటకు హేతువు గానరాదు. ప్రారబ్ధము కారణము. క్రియమాణ మనునది దానియొక్క ఫలము (అనఁగా: కార్యము). కావున నీ రెంటికిని భేదమున్నమాట నిజమే; కాని యీ భేదమునకుఁ గర్మవిపాకక్రియయం దెంతమాత్రము నుపయోగము గానరాదు. సంచితములలో నే కర్మలయొక్క ఫల మనుభవించుట కిప్పటికి నారంభము కాలేదో వానిని అనఁగా: సంచితములోని ప్రారబ్ధమును వదలి యవశిష్టములైన కర్మలను బోధించుటకై క్రొత్తశబ్దముల యావశ్యకతలేదు. కావుననే వేదాంతసూత్రముల యందు ప్రారబ్ధమునే ప్రారబ్ధకార్య మనియును, ప్రారబ్ధము కానివాని ననారబ్ధకార్య మనియును వేర్వే

అని (వే.సూ. 4.1.15). సంచితకర్మ నీ రీతిగ 'ప్రారబ్ధకార్య'మనియు 'అనారబ్ధకార్య' మనియు రెండువిధములుగ విభజించుట యనునదియే శాస్త్రదృష్టిచే మిక్కిలి సయుక్తికముగ నున్నదని నా యభిప్రాయము. కావున 'క్రియమాణ' అను ధాతుసాధిత శబ్దమును వర్తమాన కాల వాచక మనుకొనక "వర్తమాన సామీప్యే వర్తమాన వద్వా" యను పాణినీయసూత్రానుసారముగ (పా. 3. 3. 131) భవిష్యత్కాలవాచక మనుకొనిన యెడల దానియొక్క యర్థము "ఏది ముందు భోగింప వలసియున్నదో యది" యని వచించుటకు సాధ్యమగును. మఱియుఁ క్రియమాణ మనఁగా: ననారబ్ధకార్య మనియు నర్థమగుటచే ప్రారబ్ధ క్రియమాణశబ్దములు రెండును క్రమముగ వేదాంతసూత్రములందు 'ఆరబ్ధకార్య' 'అనారబ్ధకార్య' శబ్దములతో సమానార్థకములుగఁ బ్రయోగింపఁబడినవి; కాని క్రియమాణ శబ్దమున కిటుల ప్రస్తుత మెవ్వరును నర్థము చేయరు. క్రియమాణ మన నిప్పుడు జరుగుతున్న కర్మ యని యర్థము చేయుచున్నారు. ఈ యర్థమును గ్రహింతుమేని ప్రారబ్ధము యొక్క ఫలమే క్రియమాణమని చెప్పవలసివచ్చును. ఇంతియకాక యే కర్మ లనారబ్ధకార్యములుగ నున్నవో వానిని బోధించుటకు, సంచిత, ప్రారబ్ధ, క్రియమాణము లను మూఁడు శబ్దములలో నేదియు పనికి రా నేరదని దీనిపై గొప్ప యాక్షేపణ వచ్చుచున్నది. ఇంతియ కాక క్రియమాణశబ్దముయొక్క రూఢ్యర్థమును వదలుటయు నసాధు వగును. కావున సంచితములు, ప్రారబ్ధములు, క్రియమాణములు నను నీ కర్మయొక్క లౌకికభేదములను కర్మవిపాక ప్రక్రియయందు స్వీకరింపక, వానిని 'ఆరబ్ధకార్యములు', 'అనారబ్ధకార్యములు' నని రెండు వర్గములుగనే మేము చేయుచున్నాము. మఱియు శాస్త్రదృష్టిచేఁ జూచిన నది మిక్కిలి సులభముగ నుండును. భోగించుట యను క్రియకు భోగింపఁబడినది (భూతము), భోగించుటకొఱ కిప్పుడే యారంభ మైనది (వర్తమానము), ముందు భోగింపవలసినది (భవిష్యత్తు) అని

కాలకృతములగు మూఁడుభేదము లున్నవి; కాని కర్మవిపాకశాస్త్రము నందుఁ గర్మల నీ తీరున మూఁడు విధములుగ విభజించుట శక్యము కానేరదు. కారణ మేమి యన: సంచితములో నే కర్మ ప్రారబ్ధమై భోగింపఁబడుచున్నదో దానిఫలములు మరల సంచితములోనే చేరును. కావున కర్మభోగమును విచారించుచున్నప్పుడు సంచితములో భోగించుటకు నారంభమైన వానిని, అనారబ్ధములైన వనియుఁ జెప్పవలయును. ఇంతకన్న సంచితమును వర్గీకరణముఁ జేయుట యనావశ్యకము. సర్వ కర్మఫలములకు నీ తీరున రెండు విధముల వర్గీకరణము నొనర్చి వాని యుపయోగ సంబంధములో సంచిత మంతయు భోగ్యమని కర్మవిపాకప్రక్రియ చెప్పుచున్నది. వీనిలో నే కర్మఫలములను భోగించుట కారంభ మగుటచేఁ బ్రకృతమగు దేహముగాని జన్మ గాని లభించినవో (అనఁగా. సంచితములో నే కర్మలు ప్రారబ్ధ మైనవో) వానిని భోగించినఁ దక్క నివృత్తి కలుగనేరదు. "ప్రారబ్ధకర్మణాం భోగా దేవ క్షయః"— చేతిలోనుండు బాణము నొకసారి వదలితిమేని యయ్యది యెటుల చేతిలోనికి తిరుగ రానేరదో, దానిపా టున్నంత వఱకది యెటుల పోవలయునో యటులను, కుంభకారుని చక్ర మొకసారి త్రిప్పఁబడినయెడల నది యా వేగనమాప్తి యగువఱకును తిరుగుచునే యుండునటులను, ప్రారబ్ధము (అనఁగా: ఏ కర్మ ఫలములు భోగించుటకు నారబ్ధములైనవో యా కర్మలు) ఆరంభమైనది నమాప్తము కావలయును. ఇది తప్ప మఱియొక గతి యేదియు లేదు; కాని యనారబ్ధకార్యముయొక్క గతి యట్లు కానేరదు. జ్ఞానముచే నీ యనారబ్ధకర్మల నన్నింటిని నశింపఁజేయ నగు. ప్రారబ్ధానారబ్ధకార్యములలో నిట్టి భేద ముండుటచే జ్ఞాని జ్ఞానము కలిగిన పిదప, నైసర్గిక రీతిగ మరణపర్యంతమును (అనఁగా: దేహములతోనే ప్రారబ్ధమైన కర్మ ముగియు పర్యంతమును) శాంతముగ వేచియుండవలయును. అట్లు చేయక హఠముచే దేహత్యాగము సేయునేని జ్ఞానముచే నశని

యనారబ్ధకర్మ క్షయమైనను అతని హఠము మూలముననే దేహారంభ మగు ప్రారబ్ధకర్మయొక్క భోగ మపూర్తిగ నున్నదో దానిని భోగించుటకొఱకుఁ బునర్జన్మ మెత్తవలసి వచ్చుననియు, మోక్షప్రతిబంధము సైతము కలుగుననియు వేఱుగఁ జెప్ప నక్కఱ యుండదని వేదాంతసాంఖ్యము లనియెడు రెండు శాస్త్రములయందును వివరింపఁబడినది (వే.సూ. 4. 1. 13-15 మఱియు సాం. కా. 67). ఇంతియ కాక హఠముచే నాత్మహత్య చేయుట యను కర్మ నూతనముగనే యుత్పన్న మగుటచే దాని ఫలమును భోగించుటకును నూతనజన్మను గ్రహించుట యావశ్యకమగును. ఆత్మహత్యను చేసికొనుట కర్మశాస్త్ర దృష్టిచే సైతము వెఱ్ఱితనముగనే యున్నదని యిందువలన సిద్ధమగును.

కర్మఫలభోగదృష్టిచేఁ గర్మలయొక్క భేదము సెప్పఁబడినది. ఇప్పుడు కర్మబంధనమునందుండి యెట్లు విముక్తి యగునో (అనఁగా: ఏ యుక్తిచే విముక్తుఁ డగుటకు సాధ్య మగునో) దానిని విచారించెదము వీనిలో మొదటి యుక్తి కర్మవాదులది. "అనారబ్ధ కార్యములనః ఈజన్మమునఁ గాని, వేఱొక జన్మమునఁ గాని భోగింపవలసిన సంచిత కర్మలు అని యీ శబ్దార్థమును నేను పైన వ్రాసియున్నాను; కాని యీ యర్థమును గమనింపక యనేకులగు మీమాంసకులు కర్మబంధమునుండి వదలించుకొని మోక్షమును బొందుటకై వారి మతమం దొక సులభమార్గము నేర్పఱచియున్నారు. కర్మలు నిత్యములు, నైమిత్తికములు, కామ్యములు, నిషిద్ధములు నని చతుర్విధములుగ నున్నవి. వీనిలో సంధ్యాది నిత్యకర్మలను చేయకుండిన పాపము గలుగును. మఱియు నిమిత్తము ప్రాప్తమైనయెడల నైమిత్తికకర్మలను చేయవలయును. కావున నీ ద్వివిధకర్మలును కర్తవ్యములని మీమాంసకులనుచున్నారు. అవశిష్టములైనవి కామ్యములును, నిషిద్ధములునై యున్నవి. వీనిలో నిషిద్ధకర్మల నాచరించుటచేఁ బాపము లభించును.

కావున నవి చేయఁదగవు. మఱియుఁ గామ్యకర్మలు సేయుదుమేని వాని ఫలము ననుభవించుటకొఱకు పునర్జన్మ మెత్తవలసివచ్చును. కావున నవియుఁ జేయరాదు. ఇట్లు వేర్వేఱు కర్మలసంబంధమగు పరిణామముయొక్క తారతమ్యమును విచారించి చూచి మనుజుఁడు కొన్నికర్మల వదలి కొన్నిటిని యథాశాస్త్రీయముగఁ జేయుచుండెనేని వాఁడు స్వయముగనే ముక్తుఁ డగును. కారణమేమి యన: "ప్రారబ్ధ కర్మల నీ జన్మమునం దనుభవించుటచే నవి నశించును. ఈ జన్మమున నిత్యనైమిత్తికకర్మల నన్నిటినిఁ జేయుటచేతను నిషిద్ధకర్మలఁ జేయక పోవుటచేతను నరకప్రాప్తి కలుగనే కలుగదు. కామ్యకర్మలను త్యజించుటచే స్వర్గాదులందలి సుఖము లనుభవించుటకు నావశ్యకతయుం డదు. ఇహలోకము, నరకము, స్వర్గము నను మూఁడుగతుల నీ తీరున గడచిన పిదప మోక్షముదక్క గత్యంతర మేదియు నుండనేరదు" అను నీ వాదమునే 'కర్మయుక్తివాద'మని కాని, లేక, 'నైష్కర్మ్యసిద్ధివాద' మని కాని చెప్పుచున్నారు. కర్మలను జేసినను నవి చేయఁబడనివిగనే యుండుటయే (అనఁగా: ఏ పుణ్యపాపబంధనములును గర్తకుఁ దగులక యుండుటయే) 'నైష్కర్మ్య'మని చెప్పుచున్నారు. కాని మీమాంసకుల పూర్వోక్తమగు యుక్తియం దీ నైష్కర్మ్యము పూర్ణముగ సిద్ధింపదని వేదాంతశాస్త్రములో నిశ్చయింపఁబడినది (వే.సూ. శాం. భా. 4.3.14); మఱియు గీతలయందును నీ యభిప్రాయముచేతనే "కర్మ నొనరింపకుండుటచే నైష్కర్మ్యమును బొందఁడు. విసర్జించుటచే సైతము సిద్ధి లభింప"దని చెప్పఁబడినది (గీ. 3.4). "మొదట సర్వ నిషిద్ధకర్మలను వర్జించుటయే యశక్యము. మఱియు నే నిషిద్ధకర్మమైన నంఘటిల్లె నేని నైమిత్తికమగు ప్రాయశ్చిత్తముచే దాని దోషము లన్నియుఁ బరిహృతములు గావు" అని ధర్మశాస్త్రములోనే చెప్పఁబడినది; కాని యీ విషయము శక్యమని యంగీకరించినను ప్రారబ్ధ కర్మల యుపభోగముచేతను, ఈ జన్మయందు చేయఁదగిన కర్మ

లన్నియుఁ బూర్వోక్తరీతిగఁ జేయుటచేతఁ గాని, లేక చేయకుండుట చేతను గాని, సర్వసంచితకర్మలయొక్క సమూహమును సమాప్తమగు నను మీమాంసకులయొక్క యభిప్రాయము లే మాత్రమును సత్యములు కావు. హేతు వేమి యనఁగా: రెండు 'సంచిత'కర్మల ఫలములు పరస్పర విరుద్ధములు. ఉదాహరణము: ఒకదాని ఫలము స్వర్గ సుఖము, రెండవదాని ఫలము నరకయాతనయుఁ గాన వాని నేకకాలమున నొక స్థలముననే భోగించుట యశక్యము. అందుచేఁ గేవల మీ జన్మమందే ప్రారబ్ధమైనవియు, ఈ జన్మమందే చేయఁదగినవియు నైన కర్మలచే సమస్తమగు సంచితకర్మలయొక్కయు ఫలోపభోగము సమాప్తమగుట శక్యము కానేరదు.

> కదాచి త్సుకృతం తాతః కూటస్థ మివ తిష్ఠతి,
> మజ్జమానస్య సంసారే యావద్దుఃఖా ద్విముచ్యతే.
> (మ.భా.శాం. 290.17)

— మానవుడు సంసారదుఃఖమునుండి విముక్తుఁడగువఱకు నెప్పుడైనను దా నొనర్చిన పుణ్యము (తన ఫలము నతని కిచ్చుటకు మార్గము వేచుచు) స్థిరముగ నుండును అని భారతమునందున్న పరాశరగీతలలోఁ జెప్పఁబడియున్నది. అటులే సంచితపాపకర్మలు సైతము తమ ఫలము నిచ్చువఱకు నిలచియే యుండునని యూహింపవచ్చును. సంచితకర్మోపభోగ మొక జన్మమందే సమాప్తిఁ జెందకపోవుటచే నీ సంచితకర్మలలో ననారబ్ధకార్యము లని కొన్ని తప్పక మిగిలియేయుండును. మఱియు నీ జన్మమందుఁ జేయఁబడు కర్మలన్నియుఁ బూర్వోక్తమగు యుక్తిచేఁ జేయఁబడినను మిగిలిన యనారబ్ధకార్యసంచితములను భోగించుటకు మరల జన్మ మెత్తక తప్పదు. కావునఁ బూర్వోక్తమగు మీమాంసకులయొక్క సులభమగు మోక్షయుక్తి యసత్యమును, భ్రాంతి మూలకము నని వేదాంతుల సిద్ధాంతము. ఏ యుపనిషత్తునందును, గర్మబంధమునుండి వదలించుకొనుటకు నీ మార్గము

చెప్పబడలేదు. కేవలము తర్కబలముమీఁదనే నిలువఁబెట్టఁబడినది. ఆతర్క మైనను దుదవఱకు స్థిరముగ నుండనేరదు. కర్మచేఁ గర్మనుండి ముక్తుఁడగుట యను నాశ పొడముట, గ్రుడ్డివానికి గ్రుడ్డివాఁడు దారిఁ జూపి తరింపఁజేయు నను నాశవలె వ్యర్థమని సారాంశము. అటులే యగును గాక! మీమాంసకుల యీ యుక్తిని స్వీకరింపక యాగ్రహముచే నిఖిలకర్మలను త్యజించి నిరుద్యోగిగఁ గూర్చుండుటచేఁ గర్మబంధములు వదలిపోవునని వచించితి మేని యీ రీతిగను గానేరదు. కారణ మేమి యన: అనారబ్ధములగు కర్మఫలము లనుభవింపఁదగిన విప్పటికిని కొన్ని మిగిలియుండుటయే కాక, కర్మను వదలివేయుట యను నాగ్రహము, స్వస్థముగఁ గూర్చుండుట యను నీ రెండును దామసమగు కర్మలే గాన నీ తామసకర్మలయొక్క ఫలములను సైత మనారబ్ధసంచితములతో సమానముగ ననుభవించుటకై మరల జన్మ మెత్తక తప్పదు (గీ. 18.7 మఱియు 8 చూడు). ఇంతియకాక దేహమున్నంతవఱకును, శ్వాసోచ్ఛ్వాసములు గాని, లేక, శయనించుట, కూర్చుండుట మొదలగు కర్మలు గాని జరుగుచునేయుండును అందుచే సర్వకర్మలను వదలవలయు నను నాగ్రహము సైతము వ్యర్థ మగును. ఈ జగత్తున నెవరనైన నొక క్షణముననైన, కర్మ వదలలేదనియు గీతలలో ననేక స్థలములయందుఁ జెప్పఁబడినది (గీ. 3.5; 18.11 చూ).

కర్మ మంచిదియైనను, చెడ్డదియైనను, దాని ఫలమును భోగించుటకు మనుజుఁ డేజన్మమునైన నెత్తుటకు సిద్ధముగ నుండవలయును. కర్మ యనాది యగుటచే దానియొక్క యఖండవ్యాపారమునందుఁ బరమేశ్వరుఁడు సైతము స్వతంత్రింపలేఁడు. సర్వకర్మలను త్యజించుట శక్యముకాదు. మఱియు మీమాంసకులు సెప్పినటులఁ గొన్నికర్మలఁ జేయుటచేఁ గర్మబంధమునందుండి విమోచనము కానేరదని సిద్ధించిన పిదప, కర్మాత్మకములగు నామరూపము లను వినశ్వరమగు చక్రము నందుండి విముక్తుఁడయి, యా చక్రమున కాధారభూతమును, నమృ

తమును, నవినాశియు నగు తత్త్వములోఁ గలసిపోవలయు నను మనుజుని స్వాభావికేచ్ఛ నెఱవేఱుటకు మార్గ మేది? యని మొదటి ప్రశ్న మరలఁ బుట్టును. వేదములలోను స్మృతులలోను బారలౌకికములగు యజ్ఞయాగాదులను చేయుటకుఁ బుష్కల సాధనములు సెప్పఁబడినవి; కాని మోక్షశాస్త్రదృష్టిచే నవి యన్నియుఁ గ్రిందిమెట్టుననున్న వియే యగును. కారణ మేమి యన: యజ్ఞయాగాదిపుణ్యకర్మలచే స్వర్గప్రాప్తియైనను, పుణ్యకర్మఫలము సమాప్తమైన పిదప చిరకాలమున కైనను నెప్పుడో యొకప్పుడు మరల క్రిందనున్న కర్మభూమియందు పడితీరును తప్పదు (మ.భా.వన. 259 మఱియు 260; గీ. 8.25 మఱియు 9.20). ఇందువలనఁ గర్మయను పట్టుకారునుండి సంపూర్ణముగ విముక్తుఁడయి యమృతత్వమునందుఁ గలసి పోవుటకును, జననమరణ రూపమగు స్థిరమైన కల్లోలమును శమింపఁజేయుటకును నిది తగుమార్గము కానేరదని స్పష్టముగఁ గన్పట్టుచున్నది. ఈ కల్లోలమును శమింపఁజేయుటకు (అనఁగా: మోక్షమును జెందుటకు) నధ్యాత్మశాస్త్రానుసారముగ జ్ఞాన మనునది యొక్కటియే మార్గము. జ్ఞాన మనఁగా వ్యావహారిక జ్ఞానము, లేక, నామరూపాత్మకమగు సృష్టిశాస్త్రముయొక్క జ్ఞాన మనునది యర్థము కానేరదు. బ్రహ్మాత్మైక్యజ్ఞాన మనియే యిచ్చో నర్థము. దీనినే 'విద్య' యనియెదరు. మఱియు "కర్మణా బధ్యతే జంతుః విద్యయా చ ప్రముచ్యతే" - మనుష్యుఁడు కర్మచే బద్ధుఁ డగుచున్నాఁడు. విద్యచే విముక్తుఁడగుచున్నాఁడు అని యారంభమునఁ జెప్పఁబడిన శ్లోకమునందలి 'విద్యా' శబ్దమున కీ 'బ్రహ్మాత్మైక్యజ్ఞాన' మను నర్థమే వివక్షితమై యున్నది. భగవద్గీతలయందు-

జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసా త్కురుతేఽర్జున.

(గీ. 4.37)

— జ్ఞానరూపమగు నగ్నిచే నిఖిలకర్మలు భస్మము లగుచున్నవి అని

భగవంతునిచే నర్జునునకుఁ జెప్పఁబడినది. శ్రీ మహాభారతమునందు-

**బీజా న్యగ్న్యుపదగ్ధాని న రోహంతి యథా పునః,**
**జ్ఞానదగ్ధై స్తథా క్లేశై ర్నాత్మా సంపద్యతే పునః.**

- వేచఁబడిన గింజ లే తీరున మొలకలెత్తవో యా తీరుననే జ్ఞానముచేఁ గర్మలయొక్క క్లేశములు దగ్ధము లగు నేసి యాత్మను మరలఁ జెందవు అని రెండు స్థలములయందుఁ జెప్పఁబడినది (మ. భా. వన. 199 103-107; శాం. 211. 17). ఉపనిషత్తులయందు నిటులే "య ఏవం వేదాహం బ్రహ్మాస్మీతి స ఇదం సర్వం భవతి"- నేనే బ్రహ్మగా నున్నా నని యెవఁడు తెలిసికొనుచున్నాఁడో. వాఁడే యమృతమగు బ్రహ్మ యగుచున్నాఁడు (బృ. 4 4.10). తామరాకుల కుదక మంటనటులే బ్రహ్మజ్ఞానము గలిగిన వారిని కర్మలు దోషులుగఁ జేయ నేరవు (ఛాం. 1.14.3); బ్రహ్మను దెలిసికొనిన వారికి మోక్షప్రాప్తి యగును(తై.2.1); సర్వమును నాత్మమయముగ నున్నదని యెవఁడు తెలిసికొనునో వానికి పాపబాధ లేదు (బృ. 4. 4. 23); "జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః"- పరమేశ్వరునియొక్క జ్ఞానము కలిగిన పిదప సర్వపాపములనుండి విముక్తుఁ డగును (శ్వే. 5. 13; 6. 13); "క్షీయన్తే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే"- పరబ్రహ్మ జ్ఞానోత్పత్తియైన పిదప వానియొక్క సర్వకర్మలు నశించును (ముం.2.2.8) "విద్యయాఽమృత మశ్నుతే"- విద్యచే నమృతత్వము సిద్ధించును (ఈశ. 11; మైత్ర్యు. 7.9); "తమేవ విదిత్వాఽతిమృత్యు మేతినాన్యః పంథా విద్యతేఽయనాయ"- పరమేశ్వరునిఁ దెలిసికొనిన యెడల నమరుఁ డగును. దీనికంటె మోక్షప్రాప్తికి వేఱగు మార్గము లేదు (శ్వే. 3.8)-ఈ తీరున జ్ఞానమాహాత్మ్యమును బ్రతిపాదించు వచనములనేకము లున్నవి. మఱియు శాస్త్రదృష్టిచే విచారించిన నీ సిద్ధాంతమే దృఢ మగును. కారణ మేమి యన: దృశ్యసృష్టియందున్న పదార్థము

లన్నియుఁ గర్మమయము లైనను నీ సృష్టికి నాధారభూతమగు పరబ్రహ్మముయొక్క లీలలేయైనను, ఏ కర్మయుఁ బరబ్రహ్మమును బంధింపనేరదు; అన్ని విషయముల నొనర్చియుఁ బరబ్రహ్మము తాను నిర్లిప్తుఁడుగనే యున్నాఁడని స్పష్టముగఁ గాన్పించుచున్నది. అధ్యాత్మశాస్త్రానుసారముగ నీ జగత్తునందుండు నిఖిల పదార్థములును కర్మ (మాయ), పరబ్రహ్మము అను నీ రెండు వర్గములుగనే యున్నవని యీ ప్రకరణ ప్రారంభమునందే చెప్పఁబడినది. కావున నెవరికైనను మొదటి వర్గమునందుండి (అనఁగా: కర్మ యందుండి) విముక్తులము కావలయునని యిచ్ఛ యుండిన యెడల వారు రెండవ వర్గమునందు (అనఁగా: పరబ్రహ్మస్వరూపము నందు)ఁ బ్రవేశింపవలయును. మఱియొక మార్గము లేదు. కారణ మేమి యన: మూలమునందు సర్వపదార్థములును రెండు వర్గములుగనే యుండుటచేఁ గర్మమునందుండి ముక్తుఁడయినచో, బ్రహ్మస్వరూపము దక్క యితరమగు నవస్థ యేదియు నుండనేరదు; కాని బ్రహ్మస్వరూపమేదియో మొదట లెస్సగ నెఱుంగవలయును. అది తెలియనియెడల "వినాయకం ప్రకుర్వాణో రచయామాస వానరమ్"— వినాయక విగ్రహముం జేయఁ బూని (దానినిఁ జేయలేక) కోతిని జేసెను అన్నట్లు ముక్తుఁ డగుటకు మాఱుగ పతితుఁ డగును. కావున పరబ్రహ్మస్వరూపముయొక్క యలిప్తత్వముయొక్కయు, జ్ఞాన ముత్పన్న మగునేని దానినే మరణ సమయమునం దెక్కువగ స్థిరముగ నునుపవలయును. ఇదియ కర్మవిపాకమునందుండి విముక్తుఁ డగుటకు సత్యముగ ముఖ్యసాధనమై యున్నదని యధ్యాత్మశాస్త్రమునం దున్న యుక్తివాదముచే సైతము సిద్ధించు నను దానికిని "నాకుఁ గర్మలయం దాసక్తి యుండుటచే నాకుఁ గర్మలోపము కానేరదని యెవ రెఱింగిరో వారు కర్మపాశము నందుండి విముక్తు లగుదురు" అని గీతలలో భగవంతునిచేఁ జెప్పఁబడిన దానికిని (గీ. 4.14 మఱియు 13.23 చూడు) తాత్పర్య మొక్కటియె. అయిన నీ స్థలమునందు జ్ఞాన మనఁగా శబ్దజన్యజ్ఞానము గాని

లేక, మానసికక్రియ యని గాని యర్థము గాదు. మఱి యేమన: వేదాంతసూత్రముల మీఁదనున్న శాంకరభాష్యముయొక్క యారంభమునఁ జెప్పినటులే "మానసికజ్ఞానము మొట్టమొదట నుత్పన్నమై యింద్రియముల జయించిన పిదప బ్రహ్మభూతు డఁగుటకుఁ దగిన యవస్థ, లేక, బ్రహ్మస్థితి" యను నర్థమే యెల్లయెడల వివక్షితమని తెలిసికొనవలయును. వెనుకటి ప్రకరణముయొక్క తుదను జ్ఞాన సంబంధములో నధ్యాత్మశాస్త్రమునకును నిదియె సిద్ధాంత మని చెప్పియుంటిమి. మహాభారతమునందును "జ్ఞానేన కురుతే యత్నం యత్నేన ప్రాప్యతే మహత్"— జ్ఞానము (మానసిక క్రియారూపమగు జ్ఞానము) కలిగిన పిదప మనుజుఁడు యత్నము లొనర్చును. యత్నముచేతనే మహత్తత్త్వమును (పరమేశ్వరుని) పొందును (మ.భా.శాం. 320.30) అని జనకునిచే సులభకుఁ జెప్పఁబడినది. మోక్షము లభించుట కింతకంటె వేఱొక మార్గము కలదని యధ్యాత్మశాస్త్ర మెప్పుడును జెప్పదు. శాస్త్ర మీ విషయమును జెప్పిన పిదప శాస్త్రోక్తమార్గమునం దేమైన కంటకము (ప్రతిబంధకము) లుండెనేని వానిని తొలఁగించి మార్గమును బాగుపఱచుటయు, ఆ మార్గమునం దుండియె పరమ ధ్యేయమగు వస్తువును బొందుటయు నను పనిని ప్రతి మనుజుఁడును దన యత్నముచేతనే యొనరింపవలయును; కాని యీ ప్రయత్నములను పాతంజలయోగము, అధ్యాత్మవిచారము, భక్తి, కర్మఫలత్యాగము మొదలగు ననేకరూపములచేఁ జేయవచ్చును (గీ. 12. 8-12). మఱియు నందువలన తఱచుగ మనుష్యుఁడు భ్రాంతిఁ బొందును. కావుననే నిష్కామకర్మయోగ మను ముఖ్యమార్గమును గీతలలోఁ దొలుతఁ జెప్పిన పిదప దాని సిద్ధికొఱకు యమ-నియమ-ఆసన-ప్రాణాయామ-ప్రత్యాహార-ధారణా-ధ్యాన-సమాధిరూపములైన యంగభూతములగు యోగముల నాఱవ యధ్యాయములోఁ జెప్పి యేడవ యధ్యాయము మొదలుకొని పరమేశ్వరునియొక్క యీ

జ్ఞానము కర్మయోగము నాచరించుచు నధ్యాత్మవిచారముఁ జేయు టచేఁ గలుగుననియో, లేక, దానికంటె సులభమగు భక్తిమార్గముచేఁ గలుఁగుననియో చెప్పఁబడినది (గీ. 18.56).

కర్మబంధమునుండి విముక్తుఁ డగుటకుఁ గర్మను వదలుట మార్గము కాదు. బ్రహ్మాత్మైక్యజ్ఞానముచే బుద్ధిని శుద్ధపఱచుకొని పరమేశ్వరునివలె కర్మల నాచరించుటచే మోక్షము లభించును. కర్మ పరిత్యాగము కేవల భ్రమమూలము. కారణ మేమియన: కర్మయే వారిని వదలదు. ఈ విషయ మీతీరున నిర్వివాద మని సిద్ధమయి నను నిందుల కావశ్యకమగు జ్ఞానప్రాప్తికై చేయవలసిన యత్నమును జేయుట మనుజుని స్వాధీనమైయున్నదా?, లేక, నామరూపాత్మక ప్రవృత్తి యధీనమై యున్నదా? యను నీ యారంభమునఁ జేయఁ బడిన ప్రశ్న యిప్పటికిని నట్లే యున్నది. "ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి"— నిగ్రహ మేమి చేయును? ప్రతి ప్రాణియు స్వప్రకృత్యనుసారముగ నడచును (గీ. 3. 33). "మిథ్యైష వ్యవసాయ స్తే ప్రకృతి స్త్వాం నియోక్ష్యతి"—నీయొక్క ప్రయత్నము వ్యర్థము. నీ కక్కఱ లేని పనులలోనికే ప్రకృతి నిన్ను లాగును (గీ. 18. 59; 2. 60 చూడు) అని భగవంతునిచేతను, "బలవా నింద్రియ గ్రామో విద్వాంస మపి కర్షతి"— విద్వాంసునయిన నింద్రియములు లాగుకొని పోవును (మను. 2.215) అని మనువుచేతను జెప్పఁబడినది. మఱియుఁ గర్మవిపాకప్రక్రియయొక్క నిష్కర్షయు నటులే యున్నది. కారణ మేమి యన: మనుజుని మనస్సు నందున్న సర్వ ప్రేరణలును బూర్వకర్మమూలముననే యుత్పన్నము లయినవని యంగీకరించిన పిదప నదియొక కర్మవలన మఱియొక కర్మలోనికిని, దానినుండి మఱి యొక కర్మలోనికిని లాగుకొనిపోఁబడుటచే నీ విధమున భవచక్రమునం దతఁ డెప్పుడు నుండవలసియే వచ్చునని యూహింపవలసివచ్చును. వేయేల? కర్మయందుండి యావలికి దాఁటిపోవుటకై (విముక్తుఁ

డగుటకై) చేయునట్టి ప్రేరణయు, కర్మయు ననునవి సైతము విరుద్ధములే యని చెప్పినను యుక్తముగ నుండును. మఱియు నిది సత్యమగునేని జ్ఞానము సంపాదించుకొనుటకు నెవ్వరును సమర్థులు గారని చెప్పవలసివచ్చును. నామరూపాత్మక సర్వదృశ్యసృష్టికి నే తత్త్వమాధారభూత మయినదో, యదియె మనుష్యుని జడదేహమునందును నాత్మరూపముగ నివసించుచున్నది. కాన మనుష్యుని సంబంధములగు కృత్యములయొక్క విచారము దేహము, ఆత్మయు నను నీ రెంటి దృష్టితో నొనరింపవలయు నని యీ విషయమున నధ్యాత్మశాస్త్రమున సమాధానము సెప్పఁబడినది. వానిలో నాత్మస్వరూపమగు బ్రహ్మ మూలమునం దేకవిధము, నేకము నగుటచే నది యెన్నడును పరతంత్ర మగుటకు వీలులేదు. ఎందు చేతనన: ఒకపదార్థము మఱియొకపదార్థములో నుండుట కది యొకటియు, నిది యొకటియు నను భేదములు స్థిరముగ నుండవలయును. ప్రకృతస్థలమునందు నామరూపాత్మకమగు కర్మ యనునదియె రెండవ పదార్థముగ నున్నది. మఱియు నీ కర్మ మనిత్యమును, మూలమునందున్న పరబ్రహ్మముయొక్క లీలయు నగుటచేతను, పరబ్రహ్మముయొక్క యొకభాగమునందు దాని యావరణముండినను పరబ్రహ్మము నది యెన్నడును దాసునిఁ జేసికొననేర దను విషయము నిర్వివాదముగనే యున్నది. ఇంతియకాక యే యాత్మ కర్మసృష్టియందలి వ్యాపారముల నొక్కటిగ నొనర్చి సృష్టిజ్ఞానమును బుట్టించుచున్నదో యది కర్మసృష్టికంటె భిన్నముగ నుండవలయును. అనఁగా: బ్రహ్మసృష్టియం దున్నదే కావలయునని పూర్వముననే చెప్పఁబడినది. కావునఁ బరబ్రహ్మమును, మూలమునం దాతనియంశమగునట్టియు శరీరమైనట్టియు నాత్మయు నను నీ రెండును మొదటినుండియు స్వతంత్రములు— అనఁగా: కర్మాత్మకమగు ప్రకృతి కధీనములు కావు— అని నిష్పన్న మగుచున్నది. వీనిలోఁ బరమాత్మ యనంతమును, సర్వ

వ్యాపియు నెప్పుడును శుద్ధముక్తావస్థయందె యుండునదియు నై యున్నది. ఇంతకంటె మనుజునకు నధికముగఁ బరమాత్మజ్ఞానము గోచరము కానేరదు; కాని యా పరమాత్మ యంశమగు జీవాత్మ ప్రప్రథమమున శుద్ధము, ముక్తస్వభావము, నిర్గుణము, అకర్తయు నయినను, దేహము బుద్ధ్యాదీంద్రియములు ననువానియొక్క బంధనములోఁ బడియుండుటచే నది మనుజునియొక్క మనస్సున నెప్పుడు స్ఫురణమును బుట్టించుచున్నదో యప్పుడు దాని ప్రత్యక్షానురూపమగు జ్ఞానము మనకుఁ గలుగును. బట్టబయలు నందుండు నట్టి యావిరియొక్క వేగ మేమియుఁ గానరాకున్నను, దాని నొక భాండమున నించి, భాండపుమూఁతిని బిగించితిమేని యా యావిరివేగ మా భాండముపైఁ గాన్పించును. అటులే యనాదిపూర్వకర్మార్జిత జడదేహము చేతను, నింద్రియములచేతను, పరమాత్మయొక్క యంశభూతుఁడగు జీవుఁడు (గీ.15.7) బంధింపఁబడినపు డీ బద్ధావస్థయందుండి యాతనిని విముక్తునిగఁ జేయుటకై (మోక్షానుకూలమగు) కర్మలను జేయుటకు దేహేంద్రియాదులు ప్రవర్తించుచున్నవి. మఱియు దీనినే వ్యావహారికదృష్టిచే 'ఆత్మయొక్క స్వతంత్రప్రవృత్తి' యని చెప్పుచున్నారు. 'వ్యావహారికదృష్టిచే' అని చెప్పుటకు హేతు వేమన: శుద్ధముక్తావస్థయందు, లేక, 'తాత్త్వికదృష్టిచే' నాత్మ యిచ్ఛాశూన్యమును, అకర్తయు నగుటచే సర్వకర్తృత్వములును ప్రకృతిగనే యున్నవి (గీ. 13.19; వే. సూ. శాం. భా. 2.3.40); కాని యీ ప్రకృతి స్వయముగనే మోక్షానుకూలమగు కర్మ నొనర్చునని సాంఖ్యులవలె వేదాంతులు సెప్పరు. కారణ మేమి యన: అటు లంగీకరించిరేని జడప్రకృతి యంధురా లగుటచే నజ్ఞానులను సైతము ముక్తులను జేయునని యంగీకరింపవలసివచ్చును. మఱియు మూలమునం దే యాత్మ యకర్తగ నుండెనో యది, యేనిమిత్తమును లేక తన నైసర్గిక గుణముచేతనే ప్రవర్తక మగుననియు చెప్పుటకు సాధ్యము కానేరదు. కావున నాత్మ మూలమునం దకర్తయైనను నది బంధనమను నిమిత్తముచే నది యీ

మాత్రమునకే ప్రేరకముగఁ గాన్పించును. ఏ నిమిత్తముచేనైనను దాని కీ యాగంతుకమగు ప్రేరకత్వ మొక పర్యాయము వచ్చెనేని యది కర్మయొక్క నిమిత్తముల యందుండి స్వతంత్రమైనదియే యగును. కావున పూర్వోక్తమగు నాత్మస్వాతంత్ర్యముయొక్క యీ సిద్ధాంతమును వేదాంతశాస్త్రమునం దిట్టి కొన్ని శబ్దములచే నుడువవలసి వచ్చును. స్వతంత్ర మన నిర్నిమిత్తమని యర్థము కాదు. మఱియు నాత్మ తనకు ప్రథమమునందున్న శుద్ధావస్థయందుఁ గర్తగ నుండనేరదు. కాని ప్రతి సమయమునందు నీ యతిదీర్ఘములగు కర్మ కథలను జెప్పుచు నుండక దీనినే సంక్షేపముగ నాత్మయొక్క స్వతంత్ర ప్రవృత్తి, లేక, స్వతంత్ర ప్రేరణ యని చెప్పుట యభ్యాసమైయున్నది. 1. ఆత్మబంధనమను నుపాధిలోఁ బడియుండుటచే దాని మూలమున నీ యింద్రియములకు లభించు స్వతంత్రప్రేరణయు, 2. బాహ్యసృష్టి యందున్న పదార్థసంయోగముచే నింద్రియములకుఁ గలుగు ప్రేరణయు నను నీ రెండును మిక్కిలి భిన్నములుగనే యున్నవి. తినుము, త్రాగుము, సుఖపడు మనునవి యింద్రియప్రేరణములు. ఆత్మయొక్క ప్రేరణ మోక్షానుకూల కర్మలను చేయుమని చెప్పుచుండును. మొదటి ప్రేరణము కేవలము బాహ్యము (అనఁగా: కర్మసృష్టిలోనిది); రెండవది యాత్మ సంబంధమైనది (అనఁగా: బ్రహ్మసృష్టిలోనిది). ఈ రెండు ప్రేరణలును తఱచుగఁ బరస్పర విరుద్ధము లగుటచే వాని వాని కలహములోనే మనుష్యుని యాయు వంతయుఁ గడచును. వీనిలో సంశయము వచ్చినప్పుడు కర్మసృష్టియొక్క ప్రేరణమును స్వీకరింపక (భాగ. 10.10.4) శుద్ధాత్మయొక్క స్వతంత్రప్రేరణాను సారముగ మనుష్యుఁడు ప్రవర్తించుచున్నాఁడు. దీనినే నిజమైన యాత్మజ్ఞానము, లేక, యాత్మనిష్ఠ యనెదరు. ఈ తీరున శుద్ధమగు నాత్మప్రేరణానుసారముగ మనుజుఁడు ప్రవర్తించు నేని, యాతఁడు సేయు వ్యవహార మంతయు స్వభావముగనే మోక్షానుకూల మగును. కావుననే-

విశుద్ధధర్మా శుద్ధేన బుద్ధేన చ స బుద్ధిమాన్,
విమలాత్మా చ భవతి సమేత్య విమలాత్మనా.
స్వతంత్రశ్చ స్వతంత్రేణ స్వతంత్రత్వ మవాప్నుతే.
(మ.భా.శాం. ౩౦౮.27-30)

— స్వతంత్రుఁడగు జీవాత్మ, మొదటినుండియు, నిత్యుఁడును, శుద్ధుఁడును, బుద్ధుఁడును, నిర్మలుఁడును, స్వతంత్రుఁడు నగు పరమాత్మయం దేకీభవించుచు నుండును. జ్ఞానముచే మోక్షము సిద్ధించునని వెనుకఁ జెప్పఁబడిన దానికి నిదియే యర్థము; కాని దీనికి విరుద్ధముగనే జడమగు దేహేంద్రియములయొక్క ప్రాకృతధర్మములు (అనఁగా: కర్మసృష్టియందుండు ప్రేరణలు) ప్రబల మగునేని మనుజున కధోగతి ప్రాప్తమగును. దేహేంద్రియములను మోక్షానుకూలములగు కర్మలలోఁ బ్రవేశపెట్టి, బ్రహ్మాత్మైక్యజ్ఞానముచే మోక్షమును సంపాదింపవలయునని యిచ్ఛ గలిగిన శారీరాత్మయొక్క స్వతంత్రశక్తిని మనంబున నిడుకొని భగవంతుఁడు—

ఉద్ధరే దాత్మనాఽఽత్మానం నాత్మాన మవసాదయేత్,
ఆత్మైవ హ్యాత్మనో బంధు రాత్మైవ రిపు రాత్మనః.
(గీ. ౬.౫)

— మనుష్యుఁడు స్వయముగనే తన్నుద్ధరించుకొనవలయును. తనకు తానే నాశము తెచ్చుకొనరాదు. కారణ మేమి యనః ప్రతి మనుష్యుఁడును తానే తనకు బంధువును (హితకర్త) మఱియుఁ దానే తనకు శత్రువునై (నాశకర్త) యున్నాఁడు అని యాత్మస్వాతంత్ర్యము యొక్క (అనఁగా: స్వావలంబనముయొక్క) తత్త్వము నర్జునున కుపదేశించెను. మఱియు నీ కారణముచే యోగవాసిష్ఠములో దైవమును నిరాకరించి పౌరుషముయొక్క మాహాత్మ్యము విస్తారముగఁ జెప్పఁబడినది (యోగ. 2. సర్గ. 4-8). సర్వభూతములయందు నొక

యాత్మయే కలదను తత్త్వము నెఱింగి యిట్లు ప్రవర్తించుటయే సదాచరణ మని కాని, లేక, మోక్షాచరణమని కాని చెప్పుదురు. మఱియు నీ విధమగు నాచారమున దేహేంద్రియాదులను బ్రవర్తింపఁ జేయుటయే బద్ధుఁడగు జీవాత్మకు స్వతంత్రధర్మము. దురాచారుఁడగు మనుజునియొక్క యంతఃకరణము సదాచారమున కనుకూలముగ సాక్ష్యము నిచ్చుచున్నది. ఆ కారణముననే దురాచారుఁడు దాఁ జేసిన దానిగుఱించి పశ్చాత్తాపము నొందుచున్నాఁడు. అధిదైవతపక్షావలంబులగు పండితులు దీనిని సదసద్వివేకబుద్ధి యను దేవతయొక్క స్వాతంత్రమగు స్ఫురణ మని నుడివెదరు; కాని తాత్త్వికదృష్టిచే విచారించితి మేని, బుద్ధీంద్రియములు జడప్రకృతియొక్క వికారములే యగుటచే, నవి కర్మయొక్క నియమములలో నుండి స్వయముగ విముక్తము లగుటకు వీలులేదు. ఈ ప్రేరణ బుద్ధీంద్రియములకును, కర్మసృష్టికిని, బహిర్భూతుఁడగు నాత్మవలననే జరుగునని స్పష్టమగుచున్నది. ఈ తీరుననే 'ఇచ్ఛాస్వాతంత్ర్య'మను పాశ్చాత్యపండితుల శబ్దము సైతము, వేదాంతదృష్టిచే నిరాకరింపఁబడినది. కారణమేమన: ఇచ్ఛయు మనోధర్మమే యగుటచే వెనుక నెనిమిదవ ప్రకరణమునఁ జెప్పినట్లు బుద్ధివలె మనస్సును గర్మాత్మకమగు జడప్రకృతియొక్క యసంవేద్య (తను దా నెఱుంగని) వికారమే యగును. కావున నది స్వయముగఁ గర్మ యనెడు పట్టుకాయునుండి విముక్తము కానేరదు. కావుననే సత్యమగు స్వాతంత్ర్యము మనస్సునకును బుద్ధికిని లేమిచే నది యాత్మప్రేరణయే యని వేదాంతశాస్త్రముచే నిశ్చయింపఁబడినది. ఆత్మకు నీ స్వాతంత్ర్యము నెవ్వరు నియ్యనక్కఱ లేదు. ఎవరును బోఁగొట్టలేరు. స్వతంత్రమగు పరమాత్మయొక్క యంశమగు జీవాత్మ బంధమగు నుపాధిలోఁ బడియుండి స్వతంత్రరీతిని మనోబుద్ధులను బూర్వోక్తప్రకారముగఁ బ్రేరణఁ జేయును. ఈ యంతఃకరణప్రేరణను దిరస్కరించి యెవఁడైనఁ బ్రవర్తించెనేని తన కషాయమున్ను దానే తెచ్చికొనిన వాఁడగును.

* యేథేఁ కోణాచేఁ కాయ బా గేలేఁ,
జ్యాచేఁ త్యానేఁ అనహిత కేలేఁ.

(గా. 4448)

అని తుకోబా చెప్పినట్లు చెప్పవలయును. భగవద్గీతయందు- "న హిన స్త్యాత్మనాత్మానం"- ఎవరు తమకుఁ దామే ఘాత మొనర్చికొనరో వారికి నుత్తమగతి కలుగునని యీ తత్త్వము చెప్పఁబడినది. 'దాస బోధ'యం దది స్పష్టముగ ననువాదము చేయఁబడినది (గీ.13.28; దాస. 17.7.7-10). మనుజుఁ డీ కర్మసృష్టియొక్క యభేద్యములగు నియమములచే బద్ధుఁడై నటులఁ గాన్పించినను, దానియందుండి యే కార్యమునైనను స్వతంత్రముగ జేయఁగలనని యెన్నుచున్నాఁడు. ఈ యనుభవమునకు పూర్వము చెప్పిన రీతిగ జడసృష్టికంటె బ్రహ్మ సృష్టి వేఱని యంగీకరించిననే కాని మఱియొక విధమగు నెట్టి యుపపత్తియు సంభవింపదు. కావున నధ్యాత్మశాస్త్రము సమ్మతము గాని వా రీ విషయమున మనుజునకు నిత్యదాసత్వము నైన నంగీ కరింపవలయును. లేదా, ప్రవృత్తిదాసత్వమును గుఱించి ప్రశ్న మగమ్యమనియైన వదలవలయును. మఱియొక గతి లేదు. ప్రవృత్తి స్వాతంత్ర్యము (ఇచ్ఛాస్వాతంత్ర్యము)ను గుఱించి యీ యుపపత్తిని జీవాత్మ పరమాత్మలు మూలమునం దేక రూపమున నున్నారను నద్వైతసిద్ధాంతము ననుసరించి మేము వ్రాసియున్నాము (వే.సూ. శాం.భా.2.3.40). కాని యీ యద్వైతము నొప్పుకొననివారు (అనఁ గా: భక్తికొఱకు ద్వైతము నెవరు స్వీకరింతురో వారు) జీవాత్మ యొక్క యీ సామర్థ్యము స్వీయమైనది కాదనియు నది పరమేశ్వరు నందుండియే లభించుననియు నవశ్యము చెప్పుదురు. అయిన నెప్పు డైనను "న ఋతే శ్రాంతస్య సంఖ్యాయ దేవాః"- అయానము వచ్చువఱకును బ్రయత్నము సేయు మనుజునకుఁ దక్క నితరులకు

* వారి వారి కపకారములు వారే చేసికొనుచున్నారు. ఇతరులకేమి పట్టినది?

దేవతలు సాహాయ్యముఁ జేయరు (ఋ. 4.33.11) అను ఋగ్వేదము నందలి తత్త్వము ననుసరించియే జీవాత్మకు స్వాతంత్ర్యము ప్రాప్త మగుటకు తమంతటనే మొదట ప్రయత్నము సేయవలయునని చెప్పి యాత్మ ప్రయత్నముయొక్క (అనఁగా: స్వాతంత్ర్యముయొక్క) తత్త్వము తిరిగి స్థిరపఱుపఁబడినది (వే.సూ. 2.3.41-42; గీ. 10.5.10). ఇంకనేమి చెప్పవలయును? బౌద్ధు లాత్మ గాని, పరబ్రహ్మము గాని కలదని యొప్పికొనరు. కావున బ్రహ్మజ్ఞానమును, నాత్మజ్ఞానమును వారికి సమ్మతములు కాకపోయినను వారి ధర్మగ్రంథములలో "అత్తనా (ఆత్మనా) చోదయఽత్తానం"— తాను తన్ను స్వప్రయత్నముచే మంచిమార్గమునఁ బ్రవేశపెట్టుకొనవలయును అనియే యుపదేశింపఁబడినది. దీని సమర్థనార్థము—

**అత్తా (ఆత్మా) హి అత్తనో నాథో అత్తా హి అత్తనో గతి,**
**తస్మా సఞ్ఞమయఽత్తణం అస్సం (అశ్వం) బద్ధం వ వాణిజో.**
(దమ్మపద. 380)

— తానే తనకుఁ బ్రభు వగుటచేఁ దన యాత్మదక్కఁ దన్ను మఱి యొక టేదియును దరింపఁజేయునది లేదు. కావున నొక రౌతు తన మంచిగుఱ్ఱమును దానే స్వాధీనపఱచుకొనునట్లు మనల మనమే బాగుగ నిగ్రహించికొనవలయును అని గీతలయందువలె నాత్మస్వాతంత్ర్యముయొక్క యస్తిత్వమును నావశ్యకతయుఁ జెప్పఁబడినది (మహాపరినిబ్బాణసుత్త. 2.33-35 చూడు). ఆధిభౌతికుఁడును, ఫ్రెంచి పండితుఁడు నగు కాంటు నీ వర్గములోని వానిగనే చెప్పవలయును. కారణ మేమి యన: అధ్యాత్మ వాదమేదియు నతనికి సమ్మతము కాక పోయినను, ప్రయత్నముచే మనుజుఁడు తన వర్తనమును, స్థితిని, సంస్కరింపఁ గలఁడను విషయ మతనిచేఁ బ్రత్యక్షసిద్ధ మని (అనఁగా: ఉపపత్తి యవసరము లేకయే) స్వీకరింపఁబడినది.

కర్మపాశమునం దుండి ముక్తుఁడై సర్వభూతములయందును నొక యాత్మయే కలదని యెఱుంగుట యను నాధ్యాత్మికపూర్ణావస్థ ప్రాప్తించుటకు బ్రహ్మాత్మైక్యజ్ఞాన మనునదియే, యొక ప్రబలౌషధ మనియు, అజ్ఞానముం బొందుటకుఁ దనకుఁ బూర్ణాధికారము గల దనియు సిద్ధించినను, నీ స్వతంత్రము నగు నాత్మకును దన ఱొమ్ముపై గూర్చుండియున్న ప్రకృతియొక్క యుపద్రవము నొక్కక్షణమునందే వదలించుకొనుటకు శక్యముకాదను మఱియొక విషయమును సర్వదా గమనించుచుండవలయును. ఒకానొక శిల్పి మనయందఱిలో నతి కుశలుఁడైనను, సాధనములు లేనిది తన కౌశల్యము నెటుల బయలు పఱుపలేఁడో, మఱియు సాధనము మంచిది కాకపోయిన దానిని బాగు పఱచుకొనుట కెక్కువకాలహరణ మెటులగునో, యటులే జీవాత్మయుఁ బరమాత్మలో నైక్య మగుటకు సాధనములును, కాలమును, ఉండితీర వలయును. జ్ఞానప్రాప్తికై ప్రేరణఁ జేయుటకు జీవాత్మ స్వతంత్రుఁ డను మాట నిజమే కాని, తాత్త్వికదృష్టిచే మొదట నతఁడు నిర్గుణుఁ డును, కేవలుఁడును, ఏడవప్రకరణమునందుఁ జెప్పఁబడినట్లు నేత్రము లుండినను కుంటివాఁడే యగును (మైత్ర్యు. 3. 2-3; గీ. 13. 20). మఱియు నీ ప్రేరణానుసారముగ నే కర్మలనైనఁ జేయుటకు నవసర ములను, కుమ్మరిచక్రము మొదలగు సాధనముల వంటివియు నగు సాధనములు గాని, సామగ్రులు గాని యీ యాత్మయొద్ద స్వీయము లైనవి లేవు. దేహమును, బుద్ధ్యాదీంద్రియములును మాయాత్మక ప్రకృతియొక్క వికారములే యై యున్నవి. కావున జీవాత్మ మోక్ష మును సైతము ప్రారబ్ధకర్మానుసారముగ ప్రాప్తమగు దేహేంద్రి యాది సాధనముల మూలముననే సంపాదించుకొనవలసివచ్చును. ఈ దేహేంద్రియాది సాధనములలో బుద్ధి యను నింద్రియము ముఖ్య మైనందున నాత్మ యే విషయమును నింద్రియములద్వారా చేయ వలసివచ్చినను దొలుత నది బుద్ధినిఁ బ్రేరేపింపవలసివచ్చును; కాని

పూర్వకర్మానుసారముగను, ప్రకృతిస్వభావానుసారముగను, ఈ బుద్ధి సదా శుద్ధముగను, సాత్త్వికముగనే యుండునని నియమము లేదు. కావున త్రిగుణాత్మకప్రకృతియొక్క ప్రపంచమునందుండిముక్తమయి యీ బుద్ధి యంతర్ముఖమును, సాత్త్వికము లేక, యాత్మనిష్ఠము(అనఁగా: ఆత్మయొక్క ప్రేరణారూపమగు నాజ్ఞ ననుసరించి యతనికి వేని యందుఁ గల్యాణ మగునో యా కర్మలనే చేయుటకు నిశ్చయము గలుగఁ జేయునది) నగుటకుఁ జిరకాలమునుండి వైరాగ్య మభ్యసింప వలసివచ్చును. ఇటులైనను, ఆఁకలి, దప్పి మొదలగు దేహధర్మములు సైత మే సంచితకర్మలయొక్క ఫలములను భోగించుట కారంభమైనవో, అవి వానిని మరణపర్యంతము వదలనే వదలవు. కావున బద్ధుఁడగు జీవాత్మ దేహేంద్రియాదులచే మోక్షానుకూల కర్మను గలుగఁ జేయించుట యను ప్రథమప్రేరణకు స్వతంత్రుఁడైనను బకృతిచేతనే ముందన్ని విషయములను జేయింపవలసి యుండుటచే నంతవఱకును, సాలెవాఁడు, కుమ్మరి మొదలగు పనివాండ్రవలె, నీయాత్మయే ముఖ్యమైనదిగను, దేహేంద్రియాదిసాధనములను శుద్ధములుగఁ జేసి తన యధీనతలో నుంచుకొను ప్రయత్నము సేయునదిగ నుండవలసి వచ్చు నని తాత్పర్యము (వే. సూ. ౨. 3. 40). ఈ కార్య మొక్క పర్యాయమునుగుట కశక్యము గాన, ధైర్యముచే మెల్లమెల్లగఁ జేయవల యును. అటు సేయనిన్నాఁడు, మదించిన గుఱ్ఱమువలెనె యింద్రియము లస్వాధీనము లగును. ఇందుకొఱ కింద్రియనిగ్రహముఁ జేయుటకు బుద్ధియొక్క ధృతి, లేక, ధైర్యము సాయముగ నుండవలయు నని (గీ. 6. 25) గీతలలో భగవంతుఁడు సెప్పియున్నాఁడు. మఱియు పదునెనిమిదియవ యధ్యాయమున బుద్ధికివలె ధృతికిని సాత్త్విక, రాజస, తామసము లను నైసర్గికములగు మూఁడు భేదములు చూపఁబడెను (గీ. 18. 33-35). వీనిలో తామస, రాజసము లను మెట్లను వదలి బుద్ధిని సాత్త్వికమును జేయుటకు నింద్రియనిగ్రహముఁ జేయ

వలసివచ్చును. కావున నాఱవ యధ్యాయమునం దిట్టి యింద్రియ నిగ్రహాభ్యాస మను యోగమునకు యోగ్యస్థలమును, ఆసనమును, ఆహారమును సంక్షేపముగ వర్ణింపఁబడినవి. ఈ తీరున మెల్లమెల్లగ (గీ. 6. 25) నభ్యాసము చేసిన పిదప చిత్తము స్థిరమగుటచే నింద్రియములు స్వాధీనము లగుననియు నుత్తరకాలమునందుఁ గ్రమక్రమముగ (నొకే పర్యాయము కాదు) బ్రహ్మాత్మైక్యజ్ఞానము కలుగుటచే 'ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ' (గీ. 4 38-41) అనినట్లు కర్మబంధము వదలిపోవుననియు గీతయందుఁ జెప్పఁబడినది; కాని భగవంతుఁ డేకాంతమునందు యోగాభ్యాసముఁ జేయవలయునని చెప్పుచుండుటచే (గీ. 6. 10) జగత్తుయొక్క సర్వవ్యవహారములను వదలి యోగాభ్యాసమునందే యాయుర్దాయము నంతయును గడపవలయునని గీతాతాత్పర్యమని యెన్నఁగూడదు. ఏదైనను మన వద్ద సంపాదింపఁబడిన మూలధనము కొంచెముగనో గొప్పగనో యుండెనేని, దానితో వ్యాపారము నారంభించి మెల్లమెల్లగ నా వ్యాపారము చేతనే సంపన్నుల మగునటులే క్రమముగ చిత్తస్థైర్యమును సంపాదించుకొనవలయు నని గీతలయందున్న కర్మయోగమునకుఁ దాత్పర్యము. తనకు శక్యమైనంత యింద్రియనిగ్రహమును సంపాదించికొని మొదట కర్మయోగము నవలంబించుటకు నారంభింపవలయును; పిమ్మట దానిచేతనే యంతకంత కెక్కువగ నింద్రియనిగ్రహము ప్రాప్తమగును; కాని రచ్చబల్లలమీద కూర్చుండి యోగభ్యాస మొనర్చుటకు వీలు లేదు. అట్లు రచ్చబల్లలపైని కూర్చుండి యభ్యసించుటవలన బుద్ధి కలవడిన యేకాగ్రతాభ్యాస మొకానొకప్పుడు తరుగుట కవకాశము గలదు. కావున కర్మయోగమును నిత్యము నాచరించుచున్నపు డప్పుడప్పుడు కొంతకాలమే ఏకాంతమును సేవించుటయు నావశ్యక మగును (గీ. 13.10). కాని యందులకై జగత్తు యొక్క వ్యవహారమును వదలవలయు నని భగవంతుఁ డెక్కడను

చెప్పలేదు. సాంసారికవ్యవహారములు నిష్కామబుద్ధితోఁ జేయుటకు సైత మింద్రియనిగ్రహము కావలయునని చెప్పఁబడినది. కాన, దీనితోపాటు నిష్కామకర్మయోగమును యథాశక్తిగఁ బ్రతివాఁడును దప్పక నాచరింపవలయును. పూర్ణముగ నింద్రియనిగ్రహము సిద్ధమగు వఱకును కనుపెట్టికొని కూర్చుండఁగూడదని గీత లుపదేశించుచున్నవి. మనుజుఁడు, బుద్ధిమంతుఁడు, నిగ్రహము గలవాఁడు నగునేని యిట్టి యోగాభ్యాసముచే నాఱు మాసములలోనే సామ్యబుద్ధిని స్థిరపఱచుకొను నని మైత్ర్యుపనిషత్తు (6. 28) నందును, మహాభారతము (శాం. 239.32; అశ్వ. అనుగీత. 19.66) నందును జెప్పఁబడినది. కాని భగవంతునిచే వర్ణితమైన బుద్ధియొక్క యీ సాత్త్వికమును, సమమును, లేక, యాత్మనిష్ఠాయుక్తము నగు స్థితి యాఱు మాసములకు లభింపనే లభింపకపోయినను, ప్రకృతిస్వభావానుసారముగ నాఱు సంవత్సరములకైనను లభించుట దుర్లభము. మఱియు నీ యభ్యాస మపూర్ణముగ నుండుటచే నీ జన్మమునందు బూర్ణమగు సిద్ధి ప్రాప్తము కాకపోవుటయే కాక, ముందు జన్మమునందు మరలఁ మొదటినుండియు నారంభింపవలసిన దగుటచే నుత్తరజన్మయిందుఁ జేయు యోగాభ్యాసము సైతము పూర్వమువలె నపూర్ణమగును. కాన నిట్టి పురుషునకుఁ బూర్ణసిద్ధి యెప్పుడును లభింపనేరదని యిచ్చోసంశయము గలుగును. మఱియుఁ గర్మయోగము నాచరించుటకు మున్నె పాతంజలయోగముచేఁ బూర్ణమగు నిర్వికల్పసమాధి నభ్యసించుట నారంభమున నేర్చుకొనవలయునని తోఁచును. అర్జునుని మనస్సున కీ శంకయే తోఁచుటచే నిట్టి సందిగ్ధములయందు మనుజుఁ డేమి చేయవలయునని, శ్రీకృష్ణుని, గీతల యాఱవ యధ్యాయమున (గీ. 6. 37-39) నర్జునుఁ డడిగెను. ఈ ప్రశ్నమునకు నాత్మ యనునది యమర మనియు, లింగశరీరముద్వారా యీ జన్మయందుఁ గలిగిన సంస్కారము లన్నియు స్థిరముగ నుండుననియు, 'యోగభ్రష్టుఁడు' కర్మయోగమును బూర్తిగ సాధింపలేక, దానియందుండి భ్రష్టుడైనపుడు, ముందు జన్మయందుఁ దన ప్రయత్నము నక్కడనుండియె

(పూర్వజన్మయందు వదలిన స్థలమునందుండి యనుట) యారంభించుననియు, నిటుల క్రమముగ "అనేకజన్మ సంసిద్ధః తతో యాతి పరాం గతిమ్" (గీ. 6. 45) అన్నట్లనేక జన్మముల నెత్తి తుదకుఁ బూర్ణసిద్ధి నొంది మోక్షమును బొందుననియు భగవంతుఁ డుత్తరము నిచ్చెను. మఱియు "స్వల్ప మప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్"— ఈ ధర్మముయొక్క (అనఁగా: కర్మయోగమార్గముయొక్క) యాచరణము కొంచెమైనను గొప్ప సంకటములో నుండి విడిపించుచున్నది (గీ. 2. 40) అని యీ సిద్ధాంతము ననుసరించియే రెండవ యధ్యాయమునఁ జెప్పఁబడినది. మనుష్యునియొక్క యాత్మ మొదటినుండియు స్వతంత్రముగ నున్నను, బూర్వకర్మానుసారముగఁ బ్రాప్తమగు దేహముయొక్క ప్రకృతిస్వభావము శుద్ధము గానందున నొక జన్మయందే మనుజునకుఁ బూర్ణమగు సిద్ధి లభించుట దుర్లభమని సారాంశము; కాని యంతమాత్రముచే "నాత్మాన మవమన్యేత పూర్వాభి రసమృద్ధిభిః (మను. 4. 137)— ఎవరు నిరాశఁ జెందరాదు లేక, యొకే జన్మయందుఁ బరమసిద్ధిని సంపాదించుకొనుట యను దురాగ్రహమందుఁ బడి పాతంజలయోగాభ్యాసమునందే (అనఁగా: ఇంద్రియములను గేవలము సాముచే జయించుటలోనే) యాయుర్దాయము నంతను వ్యయము సేయరాదు. ఆత్మ కేమియుఁ దొందర లేదు. ఈ రోజున సాధ్యమగునంత యోగబలమును సాధించి కర్మయోగముయొక్క యాచరణ నారంభించె నేని, దానిచేతనే మెల్లమెల్లగ బుద్ధి యంతకంతకు సాత్త్వికము, శుద్ధము నగును. కానఁ గర్మయోగముయొక్క యీ స్వల్పమగు నాచరణమే జిజ్ఞాసను బొందించి, చెఱకును గానుగలోఁ బాఱవైచినటుల మనుష్యుని బలాత్కారముగ ముందు ముందుకుఁ ద్రోసి, తుదకు నేఁడు గానిచో రేపైనను, ఈ జన్మయందుఁ గానియెడల నుత్తరజన్మమం దైనను నా యాత్మకుఁ బూర్ణమగు బ్రహ్మప్రాప్తిని లభింపఁజేయును. దానివలన నీ కర్మయోగమార్గముయొక్క యత్యంతస్వల్పాచరణముగాని, లేక మఱియు

జిజ్ఞాసగాని యెప్పటికిని వ్యర్థము కాదనియు, ఇది కర్మయోగమార్గము నందున్న విశేషమగు గుణ మనియు గీతలయందే భగవంతునిచే స్పష్టముగఁ జెప్పఁబడినది (గీ. 6.15 మీఁదఁ నా టీక చూడు). కేవల మీ జన్మముననే మోక్షము లభింపలేదని ధైర్యమును విడనాడక మన నిష్కామకర్మలను చేయు నుద్యోగమును మాత్రము స్వతంత్రముగను, ధైర్యముగను, యథాశక్తిగ మనము సేయుచుండవలయును. ప్రాక్తన సంస్కారమువలనఁ బ్రకృతిసంబంధమగు నే ద్వంద్వ మీ జన్మ యందు గాని, లేక, నేఁడే గాని వెలువడునని తోఁచుచున్నదో యదియే క్రమక్రమముగ వృద్ధిఁ బొందుచున్న కర్మయోగముయొక్క యభ్యాసముచే, నీ జన్మమునఁ గాని, భవిష్యజ్జన్మమునఁ గాని స్వయముగనే శిథిల మగును. అటుల గాను కాను "బహూనాం జన్మనా మంతే జ్ఞానవా న్మాం ప్రపద్యతే (గీ. 7.19) అన్నట్లుగ నెప్పుడో యొకప్పుడు పూర్ణజ్ఞానము కలుగుటవలనఁ బ్రకృతియొక్క బంధము (అనఁగా: పారతంత్ర్యము) పోయి తుద కాత్మకు తన మూలభూతమయినదియు పూర్ణమయినదియు, నిర్గుణమగు ముక్తావస్థ (అనఁగా: మోక్షము) ప్రాప్తమగును. మనుజుఁ డేమి చేయలేడు? "నర కరనీ కరే తో నరకా నారాయణ హోయ"* అని ప్రచారములో నున్న వచన మీ వేదాంతమునందలి సిద్ధాంతము ననువదించుచున్నది. ఇందువలన యోగవాసిష్ఠకారులు ముముక్షుప్రకరణమునం దుద్యోగమునం బెక్కు విధములుగఁ బ్రశంసించి తుద కుద్యోగముచేతనే సర్వముఁ బ్రాప్తమగుననియు, నిస్సందేహముగ నుపదేశించినారు (యో. 2.4.10.18).

కానిమ్ము; "జ్ఞానమును సంపాదింప వలయునని ప్రయత్నము సేయుటకు జీవాత్మ మూలమునందు స్వతంత్రుఁ డగుటచేత, స్వాలంబన పూర్వకమగు దీర్ఘోద్యోగముచేఁ దుద కెప్పటికైనను, ప్రాక్తనకర్మ యనెడి బంధమునుండి విముక్తుఁ డగును" అని నిశ్చయింపఁబడినను,

* నరుఁడు సేయఁదగిన కార్యమును జేసిన నరుఁడు నారాయణుఁడగును.

కర్మక్షయ మన నేమి? యనియు నది యెప్పు డగుననియుఁ గలుగు సంశయమును సైత మిఁక కొంచెము విశేషముగ వ్యాఖ్యానముఁ జేయుదము. కర్మక్షయ మనఁగ సర్వకర్మల బంధనమునం దుండియుఁ బూర్ణముగ (అనఁగా: నిశ్శేషముగ) విముక్తి యని యర్థము; కాని పురుష్యుడు జ్ఞానియైనను నతనికి దేహ మున్నంతవఱకును నాఁకలి, దప్పి, నిదుర, కూర్చుండుట మొదలగు కర్మలు విడువకపోవుటచే, భోగించిననే కాని ప్రారబ్ధకర్మ నశింపదు. కావున నాగ్రహముచేత నతఁడు దేహత్యాగముఁ జేయరాదని పూర్వమునందుఁ జెప్పఁబడినది. జ్ఞానోత్పత్తికంటె పూర్వమునఁ జేయఁబడిన సర్వకర్మలును, జ్ఞానముచే క్షయించినను, జ్ఞానోత్పత్తియైన పిదప యావజ్జీవమును, జ్ఞానియగు పురుషుఁడు కొంచెముగనో గొప్పగనో కర్మలను జేయుట యావశ్యకమగును. కావున నిప్పు డిట్టి కర్మలయందుండి యతనికి విముక్తి యెటుల కలుగుననియు, విముక్తి కలుగనియెడల, పూర్వకర్మక్షయము గాని, మోక్షము గాని కలుగు టెట్లనియు, శంక తోఁచుట కవకాశ మున్నది. నామరూపాత్మకమగు కర్మ, జ్ఞానియొక్క నామరూపాత్మకమగు దేహము నెప్పుడును విడువకపోయినను, ఆ కర్మను దనపై వేసికొనకుండుట మొదలగు విషయము లాత్మయొక్క స్వాధీనతలో నుండును గాన నింద్రియములను జయించి, కర్మల విషయమై ప్రతి జంతువునకుఁ గల యాసక్తిని క్షయింపఁజేసతి మేని, కర్మలు సేసినను వానియొక్క బంధనములను నశింపఁ జేసినట్లే యగునని వేదాంత శాస్త్ర మీ శంకకు సమాధానము నుడువుచున్నది. కర్మ స్వభావము గనే గ్రుడ్డిదియు, నచేతనమును, మృతప్రాయమునై యున్నది. కాన నది తనంతట తా నెవరిని బంధింపదు, వదలిపెట్టదు. తనయంతట యోగ్యమైనది గాని, యయోగ్యమైనది గాని కానేరదు. మనుజుఁడు తన జీవము నా కర్మయం దిఱికించి తన యిష్టము ననుసరించి యిది మంచిదా? చెబ్బరదియా? యనియు, శుభ మైనదియా? లేక, య శుభమైనదియా? యని యాలోచించి నిశ్చయించు చున్నాఁడు.

కావున నీ మమత్వయుక్తమగు నభిలాష వదలిపోయె నేని, కర్మలఁ జేయుచున్నను, చేయకపోయినను కర్మబంధము వదలిపోయెనని చెప్పవచ్చును. ఇదియె సత్యమగు నైష్కర్మ్యము, కర్మత్యాగముకాదు (గీ. 3. 4); నీ యధికారము కర్మలు సేయువఱకే. ఫలముయొక్క ప్రాప్త్యప్రాప్తు లనునవి నీ యధికారములో నుండు విషయములు కావు (గీ. 2.47). "కర్మేంద్రియైః కర్మయోగ మసక్తస్స విశిష్యతే" — ఫలాశలేక కర్మేంద్రియములను గర్మలను జేయనిమ్ము (గీ. 3.7), "త్యక్త్వా కర్మఫలాసంగం"—కర్మఫలమును వదలి (గీ. 4.20), "సర్వ భూతాత్మభూతాత్మా కుర్వ న్నపి న లిప్యతే"— సర్వభూతములయం దును సమబుద్ధి గలిగిన పురుషుఁడు గర్మలఁ జేసినను నవి యతనిని బాధింపవు (గీ. 5.7), "సర్వకర్మ ఫలత్యాగం కురు"—సర్వకర్మ ఫల ములను వదలుము, "కార్య మిత్యేవ యత్కర్మ నియతం క్రియతే"- తప్పక చేయవలసిన వను తలంపునఁ జేయఁబడు కర్మలు సాత్త్విక ములు (గీ. 18.9), "చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య"— సర్వ కర్మలను నా కర్పించి నడువుము (గీ. 18.57) అనునవి మొదలుగాఁ గల గీతలలోని యనేక స్థలములయందున్న యుపదేశముల కిదియే బీజము. జ్ఞాని సర్వవ్యావహారిక కర్మలను జేయవలయునా? లేదా? యను ప్రశ్న స్వతంత్ర మైనది. గీతాశాస్త్ర మా విషయములో నేమి సిద్ధాంతముఁ జేయుచున్నదియు ముందు ప్రకరణమున విచారించె దము. జ్ఞానముచే సర్వకర్మలును భస్మ మగుటకు వాస్తవికార్థ మేమి యను విషయము మాత్రము ప్రస్తుతము విచారణీయము. మఱియుఁ బూర్వోక్తములగు వచనములవలన నీ విషయములో గీతాభిప్రాయ మేమియై యున్నదియు వ్యక్తమగును. వ్యవహారమందును నీ న్యాయ మునే మన మంతటను బ్రవర్తింపఁ జేయుచున్నాము. ఉదాహరణము: అజ్ఞానముచే నొకానొకఁడు రెండవవానిని ద్రోసె నేని, మన మా పురు షుని దుష్టుఁడని యనము; మఱియు దండనశాస్త్ర నియమములో

సైతము కేవల మనిచ్ఛచే సంభవించిన హత్యలను హింసలలోఁ జేర్పరు. అగ్నిహోత్రముచే నిండ్లు తగులఁబడి పోయినను, వర్షాధిక్యముచే సస్యము కొట్టుకొనిపోయినను, అగ్నికిఁ గాని, వర్షమునకుఁ గాని, యెవరైనను నేరము నాపాదింతురా? కేవల కర్మలవైపుననే దృష్టి యుంచితి మేని ప్రతికర్మయందు నేదైన దోషమో, యసత్యమో, లేక, చెఱుపో మనుష్యదృష్టికిఁ గాన్పింపక తప్పదు. "సర్వారంభా హి దోషేణ ధూమే నాగ్నిరివావృతాః" (గీ. 18.48). కాని గీత వదలి పెట్టు మని చెప్పిన దోష మిది కానేరదు. మనుజునియొక్క యే కర్మ నైనను శుభ మని కాని యశుభ మని కాని చెప్పుచున్నాము; కాని యా శుభాశుభములు కర్మయందు లేవు. అవి కర్మ నొనరించు పురుషుని బుద్ధి నవలంబించి యున్నవని లెస్సగ గమనించి, కర్మలయందలి చెఱుపును తీసివైచుట యన, కర్త తన బుద్ధిని, లేక, మనస్సును, శుద్ధముగ నుంచుటయే యని గీతయందు సిద్ధాంతీకరింపఁబడినది (గీ. 2.49-51); మఱియు నుపనిషత్తులలోను-

> మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః,
> బంధాయ విషయాసంగి మోక్షే నిర్విషయం స్మృతమ్.
> (మైత్ర్యు. 6.34: అమృతబిందు. 2)

— మనుష్యులకు (కర్మయొక్క) బంధము గాని, మోక్షము గాని సంఘటిల్లుటకు మన స్సనునదియే (ఏవ) కారణముగ నున్నది. మనస్సు విషయాసక్తమైన యెడల బంధము గలుగును. మనస్సు నిర్విషయ మన నిష్కామము, లేక, నిస్సంగము అయిన మోక్షము లభించును అని కర్మనుజేయు మనుష్యునియొక్క బుద్ధికి ప్రాధాన్య మీయబడినది. బ్రహ్మాత్మైక్యజ్ఞానము ప్రాప్తమైన పిదప బుద్ధి కీ సామ్యావస్థ నే విధముగఁ గలుగఁ జేయవలయునో భగవద్గీతయందుఁ బ్రధానముగఁ జెప్పఁబడినది. మఱియు నీ యవస్థ ప్రాప్త మగునేని కర్మలు సేయుచున్నను బూర్ణముగఁ గర్మ క్షయ మగును. నిరగ్ని యగుటచేఁ

గాని (అనఁగా: సన్న్యసించి యగ్నిహోత్రాది కర్మల వదలుటచేఁ గాని) లేక, క్రియాశూన్యుఁడుగ నుండుటచేఁ గాని (అనఁగ: ఏ కర్మలనుచేయక యూరక స్వస్థముగఁ గూర్చుండుటచే, గాని) కర్మక్షయముగానేరదు (గీ.6.1). మనుష్యునకు నిచ్ఛ యున్నను, లేకయున్నను ప్రకృతి యను ఘటీయంత్రము సదా నడచుచుండుటచే, దానితో పాటు మనుజుఁడు సైతము తిరుగక తప్పదు (గీ. 3. 33; 18. 60); కాని యజ్ఞాను లీ స్థితియందుఁ బ్రకృతియొక్క పారతంత్ర్యములో నుండి నాట్యము సేయునటు లాచరింపక యింద్రియ నిగ్రహముచే బుద్ధిని స్థిరముగను, శుద్ధముగను జేసికొని సృష్టిక్రమానుసారముగఁ బ్రాప్తములగు కర్మలు కేవలము కర్తవ్యములని, యనాసక్తబుద్ధి తోడను, శాంతముతోడను జేయువారే సత్యమగు విరక్తు లనియు, స్థితప్రజ్ఞు లనియు, బ్రహ్మపదమును బ్రాపించిన పురుషు లనియు గీత చెప్పుచున్నది (గీ. 3 7; 4. 21; 5. 7-9; 18. 11). జ్ఞాని యొకవేళ వ్యావహారిక కర్మను ద్యజించి, సన్న్యాసమును పుచ్చుకొని, వనములోని కేఁగి కూర్చుండి యుండవచ్చును; గాని, యీ తీరున వ్యావహారిక కర్మలను వదలుటచే నా కర్మలు క్షయించిన వని యెన్నుట భ్రమ. అతఁడు కర్మ చేసినను, చేయకపోయినను, కర్మలకుఁ గలిగిన క్షయ మతనియొక్క బుద్ధి సామ్యావస్థ నొందుటచేతనే యగుననియు కర్మ వదలుటచేఁ గాని, వదలిపెట్టకపోవుటచేఁ గాని, కాదనియు విషయము బాగుగ గ్రహింపనగును. అగ్నిచే నే తీరున నింధనములు దగ్ధము లగునో యా తీరున జ్ఞానముచేఁ గర్మలు దగ్ధము లగునను నీ దృష్టాంతముకంటె, తామరాకుమీఁద నీ రుండినను నది యా యాకునకంట నటుల జ్ఞానికి (అనఁగా: బ్రహ్మార్పణముఁ జేసి, లేక, యాసక్తిని వదలి కర్మలను జేయువానికి) కర్మయొక్క లేపము తగులనేరదను నుపనిషత్తులయందును, గీతలయందున్న దృష్టాంతము కర్మయొక్క సత్యస్వరూపమును నిరూపించుటకు మిక్కిలి సమర్థముగనున్నది

(ఛాం. 4.14 3; గీ. 5. 10). కర్మలు నైసర్గికముగ నెప్పుడును నశింపవు; నశింపఁజేయు నక్కఱయును లేదు; కర్మ యనఁగా నామరూపములును, నామరూపము లనఁగా దృశ్యసృష్టియు నైనయెడల నీ సర్వదృశ్యసృష్టియు నెటుల దగ్ధ మగును? ఒకవేళ దగ్ధమైనను సత్కార్యానువాదాను సారముగ నదివఱకున్న నామరూపములు మాఱుట యను భేదము మాత్రమే యుండును. నామరూపాత్మకమగు కర్మ, లేక, మాయ నిత్యమును, మాఱునది యగుటచే, ఈ నామరూపములు తమ తమ యిష్టము ననుసరించి మార్పుఁ జేసికొనుటకు శక్యమయినవియైనను నీ నామరూపాత్మకమగు కర్మను, సమూలముగ నశింపఁజేయుట యను పని యెంతటి జ్ఞానికైన నశక్యము. ఒక పరమేశ్వరునకే యది శక్యమగును (వే. సూ. 4.4.117). కాని మొట్టమొదట నున్న యీ జడములగు కర్మలయందు లేనివి, తన మమత్వబుద్ధిచే దానియందు కల్పించుకొనినవియునగు, మంచి చెడుగుల బీజములను మాత్రము నశింపఁజేయుట మనుజునకు శక్యమగును. అతఁడు దహింపఁ జేయవలసినదియు నీ మంచిచెడుగుల బీజములనే. సర్వభూతములయందును సమత్వబుద్ధి నొంది, సర్వవ్యాపారములయందు నున్న యీ మమత్వబీజము లెవరిచేఁ దగులఁ బెట్టఁబడినవో వారే ధన్యులును, గృతకృత్యులును, ముక్తులు నగుటచే సర్వవ్యాపారములు సేయుచున్నను వారి కర్మము జ్ఞానాగ్నిచే దగ్ధమగు నని చెప్పుచున్నారు (గీ. 4. 19; 18. 56). కర్మలీ తీరున దగ్ధములగుట యనునది, మనోనిర్విషయత్వమును, బ్రహ్మాత్మైక్యముయొక్క యనుభవమును మాత్రమే యవలంబించియుండును. అగ్ని యెప్పు డుత్పన్నమైనను, తన దాహకతాశక్తిని వదలనట్లు బ్రహ్మాత్మైక్యజ్ఞానము కలిగినతోడనే, వారియొక్క కర్మక్షయరూపమగు పరిణామము సంభవింపక మానదు. కాలవిలంబన ముండదు. జ్ఞానము కలిగెనేని తత్క్షణముననే కర్మక్షయ మగును. కాని యితరములగు నన్ని కాలములకంటెను మరణకాల మీ విషయమునకు శ్రేష్ఠమయినదని చెప్పుదురు.

కారణ మేమి యన: మరణ మనునది యాయుర్దాయమున గడపటి కాలము; దానికంటె పూర్వమున నే కాలముననైనను బ్రహ్మజ్ఞానము కలుగుటచే నారబ్ధ సంచితములు నశించినను, ప్రారబ్ధము నశింపదు. కావున నీ బ్రహ్మజ్ఞానము కడవఱకు ఒకేరీతిగను స్థిరముగను నుండక పోయెనేని మరణము వచ్చులోపల ప్రారబ్ధకర్మానుసారముగ సంభవించు మంచివియు చెడ్డవియునగు కర్మలన్నియు సకామము లగుటచే వాని ఫలము భోగించుటకు దిరిగి జన్మింపక తప్పదు. పూర్ణముగ జీవన్ముక్తుడయిన వానికి నీ భీతి యెప్పుడు నుండదను విషయమున సందియ మేమియును లేదు; కాని యీవిషయము శాస్త్రదృష్టిచే విచారింపవలసి వచ్చినప్పుడు మరణమునకు బూర్వమున బుట్టిన బ్రహ్మజ్ఞాన మొకానొకప్పుడు మరణమువఱకు నుండకపోయిన నేమి కావలయు నను విషయమును నవశ్యము విచారింప వలసివచ్చును. కావున మరణముకంటె పూర్వమునందున్న కాలముకంటె మరణ కాలమే మిక్కిలి శ్రేష్ఠమైనదని శాస్త్రకారుల యభిప్రాయము. మఱియు నప్పుడు (అనగా: మరణకాలమునందు) పూర్ణముగ బ్రహ్మాత్మైక్య జ్ఞానానుభవ మవశ్యము సంభవింపవలయును. లేనిచో మోక్షము సంభవింపదు అని నిశ్చయించిరి. ఈ యభిప్రాయముచేతనే "అంత కాలమునం దనన్యభావమున నన్ను స్మరించుటచే మనుజుడు ముక్తుడగును" అని యుపనిషత్తుల యాధారమున గీతలయందు జెప్పబడినది (గీ. ౮.౫). ఈ సిద్ధాంతానుసారముగ జన్మమంతయు దురాచారమునందే గడపినవాడు సైతము మరణసమయమున బరమేశ్వరు నెఱుంగునేని ముక్తు డగునని వచింపవలసి వచ్చును. మఱియు ననేకులు దీనిని యుక్తమనియు సమ్మతింపరు. కాని కొంచెము విచారించితి మేని దీనియందేమియు దప్పులేదని తోచుచున్నది. జన్మమంతయు దురాచారమందు గడపినవానికి కేవలము మరణకాలమునందే, సుబుద్ధియు, బ్రహ్మజ్ఞానమును బుట్టుటకు వీలులేదు. ఇతర విషయములయందు వలెనే బ్రహ్మనిష్ఠను సంపాదించుటయందును

మనస్సున కభ్యాస ముండవలయును. మఱియు నీ జన్మమునం దొక పర్యాయమైనను బ్రహ్మాత్మైక్యానుభవము గలుగనివానికి కేవలము మరణకాలమునందే యది యొక్కసారిగ ప్రాప్తమగుట మిక్కిలి దుర్ఘటము. వేయేల? శక్యము కాదు. కావున ప్రతి మనుజునిచేతను మనస్సును నిర్విషయముగఁ జేసికొను నభ్యాసము, నిత్యము నాచరణలో నుంపఁబడె నేని, యంతకాలమునందును నా స్థితి స్థిరముగ నుండుటకు నాటంకముండదు. కాన, మనుజుఁడు తుదకు ముక్తుఁడగు ననియు గీతలు మఱియొక గొప్ప విషయమును జెప్పుచున్నవి (గీ. 8.6-7; 2.72 చూడు). అయినను పూర్వసంస్కారములు మొదలగు కారణముల మూలమున నెవరికైనను కేవల మరణ సమయమునందు హఠాత్తుగా జ్ఞానము సంప్రాప్తము కావచ్చునని శాస్త్రమునందలి సారాంశము. ఇట్టి యుదాహరణము లక్ష కొకటి గాని, కోటి కొకటి గాని యుండవచ్చును; కాని యది యెంత దుర్లభము, దుర్ఘట మను విచారము దూరమున నుంచి, యిట్టి స్థితి ప్రాప్తమగు నేని, పిదప నేమియగునని ప్రస్తుతము మనము విచారణ చేయవలసియున్నది. మరణసమయమందైన నిట్టి జ్ఞాన ముత్పన్నమగుటచేఁ బురుషుని యనారబ్ధకార్యమగు సంచితము క్షయమగును; మఱియు నారబ్ధకార్య సంచిత మీ జన్మయందలి భోగముచే మరణకాలమునందు సమాప్తమగును. కావున నతని కే కర్మయును భోగింపవలసిన యవసరము లేదు. సర్వకర్మలనుండి (అనఁగా: సంసారచక్రము నందుండి) వాఁడు ముక్తుఁడగునని చెప్పనక్కఱ లేదు. ఈ సిద్ధాంతమే "అపి చేత్ సుదురాచారో భజతే మా మనన్యభాక్"— మిక్కిలి దురాచారుఁడైనను మనుజుఁ డనన్యభావముచేఁ బరమేశ్వరుని సేవించె నేని ముక్తుఁడగును (గీ. 9. 30) అని గీతయందుఁ జెప్పఁబడినది; మఱియు జగత్తునందున్న యితర ధర్మములలో సైతం మా విషయ మంగీకరింపఁబడినది. అనన్యభావ మనఁగాఁ బరమేశ్వరునియందుఁ జిత్తవృత్తి పూర్ణముగ లయమును జెందుట యని యిచ్చట వివక్షితమగు నర్థము. చిత్త

వృత్తిని మఱియొక చోటనుంచి నోటితో "రామ రామ" యని ప్రేలుట మాత్రమే కాదని యిచ్చట బాగుగ గమనింపవలసిన విషయము. పరమేశ్వరజ్ఞాన మనారబ్ధములగు సంచితముల నన్నిటి నొక పర్యాయమే క్షమింపఁ జేయునట్టి మహత్త్వము గలదని సారాంశము. ఈ యవస్థ యెప్పుడు ప్రాప్తమైనను నిష్టమే కాని యా ప్రాప్తిలో సైతము పూర్వమునందుఁ బ్రాప్తమైనది స్థిరముగ నుండుట గాని, పూర్వమున ప్రాప్తము గాని కాకపోయినను తుదకంతకాలముననైనను బ్రాప్తమగుట గాని, యత్యంతావశ్యకము. అట్లు లేనియెడల మరణ సమయమునం దే వాసన మిగిలియుండినను, దానివలననే తిరిగి జన్మించుట తప్పదనియు, పునర్జన్మ తప్పనియెడల మోక్ష మంతరించుననియు మన శాస్త్రకారులచే సిద్ధాంతీకరింపఁబడినది.

'కర్మబంధ మన నేమి? కర్మక్షయ మని దేనినిఁ బేర్కొనుచున్నారు? మఱియు నది దేనిచే నెప్పు డగును?' అను విషయములు చెప్పఁబడినవి. ఇప్పుడు కర్మక్షయ మయిన వారికిని, కర్మబంధము వదలనివారికిని మరణానంతరమునందు వైదికధర్మానుసారముగ నెట్టి గతి ప్రాప్తమగునో ప్రసంగానుసారముగ నిచ్చో కొంత విచారించి యీ ప్రకరణమును సమాప్తిఁ జేయుదము. ఈ విషయమున సైత ముపనిషత్తుల యందుఁ బలుమాఱు చర్చలు సేయఁబడినవి (ఛాం 4.15; 5.10; బృ. 6. 2. 2. 16; కౌ. 1. 2-3). వానియొక్క యేకవాక్యత వేదాంతసూత్రములయందలి నాలుగవ యధ్యాయము యొక్క మూఁడవ పాదమునందుఁ జేయఁబడినది. కాని యీ చర్చ నంతను నిచ్చోఁ జెప్పనక్కఱ లేదు. భగవద్గీతలలోఁ జెప్పఁబడిన రెండు మార్గముల (గీ. 8.23-27) విషయమును మాత్రమే ప్రస్తుతము మనము విచారించుదము. వైదికధర్మములలోఁ గర్మకాండ మనియు, జ్ఞానకాండ మనియు రెండు ప్రసిద్ధములగు మార్గములు గలవు. వీనిలో కర్మకాండయందు సూర్యాగ్నీంద్ర వరుణాదులగు వైదికదేవతలను

యజ్ఞములచేఁ బూజించి, వారి ప్రసాదముచే నిహలోకమునందుఁ బుత్రపౌత్రాది సంతతిని, గవాశ్వాదికమును, లేక, ధనధాన్యాదిసంపత్తిని నొంది మరణానంతరమునందు సద్గతిని గలుగఁజేసికొనుట యనునది ముఖ్యముగ నుపదేశింపఁబడినది. ప్రస్తుతకాలమున నీ యజ్ఞయాగాది శ్రౌతధర్మములు లుప్తప్రాయము లగుటచేఁ బైని చెప్పఁబడిన యుద్దేశము సిద్ధించుటకొఱకు దేవునియందు భక్తియును, దాన ధర్మములు మొదలగు శాస్త్రోక్తపుణ్యకర్మలను లోకులు సలుపుచున్నారు; కాని పూర్వకాలమునందు జనులు కేవలము స్వార్థమునకుఁ గాక, సమాజముయొక్క కల్యాణార్థము సైతము యజ్ఞములచేతనే దేవతల నారాధించు చుండిరని ఋగ్వేదమును బట్టి స్పష్టముగఁ దెలియు చున్నది. కారణ మేమి యన: పైనఁ జెప్పిన కార్యము నిమిత్తమై, యే దేవతలయొక్క యానుకూల్యము సంపాదించుకొనవలయునో వారి యొక్క (అనఁగా: ఇంద్రాది దేవతలయొక్క) స్తుతితో ఋగ్వేద సూక్తము లన్నియు నిండియున్నవి. వానియం దొక్కొక్కచోటను "ఓ దేవా! నాకు సంతతిని సమృద్ధి నిమ్ము", "మాకు నూఱేండ్లాయుర్దాయము నిమ్ము", "మమ్మును, మా సంతతిని, మా శూరులను, మా పశ్వాదులను హింసఁ జేయకుము" అని ప్రార్థింపఁబడినది.* ఈ యజ్ఞయాగాదులు వేదత్రయము నందును విహితము లగుటచే నీ మార్గమునకు 'త్రయీధర్మ' మని ప్రాచీననామము. ఈ యజ్ఞ మెటులఁ జేయవలసినదియు బ్రాహ్మణగ్రంథములందు విస్తృతముగ వర్ణింపఁబడినది. కాని వేర్వేఱగు బ్రాహ్మణములలో యజ్ఞములయొక్క విధుల వేర్వేఱగు ప్రకారములఁ జెప్పుటచే వానిలో గ్రాహ్యము లేవి? యగ్రాహ్యము లేవి? యను సందేహము వెలువడుటచే, జైమిని

* ఇట్టి మంత్రము లనేకము లున్నవి. వాని నన్నిటినిఁ జెప్పక "మాన స్తోకే తనయే మాన అయౌ మానో గోషు మానో అశ్వేషు రీరిషః, వీరా న్మానో రుద్రభామితో వధీర్హవిష్మంతః సదమిత్త్వా హవామహే" (ఋ. 1.114.8) అను నెల్లరకు వచ్చిన మంత్ర మొక్కటి చెప్పినను జాలును.

యీ పరస్పర విరుద్ధములగు వాక్యములకు నేక వాక్యతను జేయుటకై యర్థనిర్ణాయకమగు నియమములను సంగ్రహముగఁ జెప్పెను. జైమిని యొక్క యీ నియమములనే 'మీమాంసాసూత్రము' లని కాని, లేక, 'పూర్వమీమాంస' యని కాని వాడుదురు. ఆ కారణముననే ప్రాచీనకర్మ కర్మకాండకు పిదప మీమాంసకమార్గమని పేరు వచ్చినది. ఆ పేరిప్పటికిని రూఢమగుటచే, నేను నీ గ్రంథమునం దనేక పర్యాయము లా శబ్దమునే యుపయోగించినాను; కాని మీమాంస యను శబ్దము పిదప ప్రచారములోనికి వచ్చినను యజ్ఞయాగాదికములను నీ కర్మమార్గ మతి చిరకాలమునుండియు ప్రచారములో నున్నదని తెలిసికొనవలయును. గీతలయందు మీమాంస యను శబ్దమెచ్చటను లేకపోవుటకును, దానికి బదులుగ 'త్రయీధర్మ'మనియు (గీ. 9.20-21), 'త్రయీవిద్య' యనియు పేర్లుండుటకును నిదియే కారణము. యజ్ఞయాగాదిశ్రౌతకర్మ ప్రతిపాదకములగు బ్రాహ్మణగ్రంథములకు ననంతర కాలమునందలి వైదికగ్రంథములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులునై యున్నవి. వీనియందు యజ్ఞయాగాదికర్మలు గౌణములనియు, బ్రహ్మజ్ఞానమే శ్రేష్ఠమనియుఁ బ్రతిపాదింపఁబడి యుండుటచే వానికి నేకవాక్యతఁ జేయుట యావశ్యకమై యుండెను. ఈ కార్యమును బాదరాయణాచార్యులవారు తమ వేదాంతసూత్రములయందుఁ జేసిరి. ఈ గ్రంథమును బ్రహ్మసూత్రము లనియు, శారీరకసూత్రము లనియు, నుత్తరమీమాంస యనియు వక్కాణించెదరు.

ఈ రీతిగ పూర్వము, ఉత్తరము అను మీమాంసలు క్రమముగఁ గర్మకాండకును, జ్ఞానకాండకును ప్రధానగ్రంథములై యున్నవి. వాస్తవముగఁ జూచితిమేని యీ రెండు గ్రంథములును, ముఖ్యముగ మీమాంసాసంబంధమైనవియే (అనఁగా: వైదికవచనముల యర్థమును జర్చించునవియే) అయినను గర్మకాండప్రతిపాదకులకు 'మీమాంసకు' లనియు, జ్ఞానకాండ ప్రతిపాదకులకు 'వేదాంతు'

లనియును పేర్లు ప్రస్తుతము వాడుకలో నున్నవి. కర్మకాండవాదులు (అనఁగా: మీమాంసకులు) శ్రౌతధర్మమునందున్న చాతుర్మాస్యము జ్యోతిష్టోమము మొదలగు యజ్ఞయాగాది కర్మలే ప్రధానము లని నుడువుచున్నారు. మఱియు వానిన్ని జేయువానికే వేదముల యందలి విధులనుబట్టి మోక్షము ప్రాప్తించుననియు, నెవరును యజ్ఞయాగాది కర్మలను వదలిపెట్టకూడదనియు, వదలినవారు శ్రౌతధర్మభ్రష్టులని యెఱుంగవలయు ననియు చెప్పుదురు. కారణ మేమి యన: సృష్టియొక్క యుత్పత్తితోడనే వైదికయజ్ఞము లుత్పన్నములైన వనియు, మనుష్యుఁడు యజ్ఞములను జేసి దేవతలను దృప్తి నొందింపవలయు ననియు, మఱియు దేవతలు సైతము వర్షము మొదలుగాఁగల యే యే విషయములు మనుజున కావశ్యకములో వానిని పూర్ణముగ నీయవలయు ననియుఁ జెప్పుదురు. ఈ చక్ర మనాదినుండియు నడచుచున్నది. ప్రస్తుతమం దీ విచారమున విశేష మహత్త్వ మున్నటులఁ దోపఁదు. కారణ మేమి యన: శ్రౌతధర్మములు ప్రచారమం దిప్పుడు లేవు. కాని గీతాకాలస్థితి భిన్న మగుటచే భగవద్గీతయందీ యజ్ఞచక్రముయొక్క మహత్త్వము బాగుగనే వర్ణింపఁబడినది. అయిన నుపనిషత్తుల యందున్న జ్ఞానముకంటె నప్పుడును నీ కర్మలకు మోక్షదృష్టిచే గౌణత్వము వచ్చిన దని గీతలలోనే (2. 41-46) స్పష్టముగఁ జెప్పఁబడినది. మఱియు నీ గౌణత్వమే యహింసాధర్మముయొక్క ప్రచారముచేఁ బిదప విశేషముగ వృద్ధిఁబొందినది. యజ్ఞయాగాదికములు వైదికము లైనను, వానియందున్న పశువధ ప్రశస్తము కానేరదు. ధ్యానముచేతనే యజ్ఞమును జేయవలయుననియు భాగవత ధర్మములయందు స్పష్టముగఁ బ్రతిపాదింపఁ బడినది (మ. భా. శాం. 336. 10 మఱియు 337 చూడు). దానివలనను మఱియు కొన్ని యంశములలోఁ బిదప జైనులు సైత మిట్టి ప్రయత్నములు చేసియుండుట చేతను, శ్రౌతాగ్నిహోత్రములు సర్వదా పాలించు

సాగ్నిహోత్రులు కాశి వంటి పుణ్యక్షేత్రములలో సైతము కొందఱే కనఁబట్టుచున్నారు. ఈ హేతువుచే జ్యోతిష్టోమాది పశుయజ్ఞము లేడెనిమిది సంవత్సరముల కొకసారి జరుగుచుండునటుల వినఁబడుచున్నది. కావున శ్రౌతమార్గమునకుఁ బ్రస్తుత మిట్టి స్థితి ప్రాప్తించినది. అయినను శ్రౌతధర్మము సర్వవైదికధర్మములకు మూల మగుటచే దాని విషయమై యాదరబుద్ధి స్థిరముగ నున్నది. జైమినీయసూత్రము లర్థనిర్ణాయకశాస్త్ర మగుటచేఁ బ్రమాణముగ నున్నవి; కాని శ్రౌతయజ్ఞాదిధర్మము లీ రీతిగ వెనుకఁబడినను మన్వాదిస్మృతులందు వర్ణింపఁబడిన యితరయజ్ఞము (అనఁగా: పంచమహాయజ్ఞములు) లిప్పటికిని ప్రచారము నందున్నవి. వానికిని పూర్వోక్తమగు శ్రౌతయజ్ఞయాగచక్రాదుల న్యాయమే ప్రవర్తించును. ఉదాహరణము: మన్వాదిస్మృతికారులు, వేదాధ్యయనమును బ్రహ్మయజ్ఞ మనియుఁ, దర్పణమును బితృయజ్ఞ మనియు, హోమమును దేవయజ్ఞ మనియు, బలిని భూతయజ్ఞ మనియు, నతిథి సంతర్పణమును మనుష్యయజ్ఞ మనియు, అహింసాత్మకములును నిత్యములు నగు నైదు గృహయజ్ఞములను జెప్పిరి. ఈ యైదు యజ్ఞములచేతను యథాసంఖ్యముగ ఋషి, పితృ, దేవ, భూత, మనుష్యులను మొదటఁ దృప్తిఁ బొందించిన పిదప నే గృహస్థైనను దా నన్నమును దిన వలయునని గార్హస్థ్య ధర్మము విధింపఁబడినది (మను. 3. 68. 123). ఈ యజ్ఞమును జేయఁగా మిగిలిన యన్నమును 'విఘస' మని చెప్పుదురు (మను. 3. 285). ఇట్టి యమృతమును విఘసము నైన యన్నమే గృహస్థులకు విహితమును శ్రేయస్కరమునై యున్నది. మఱియు నీ తీరునఁ జేయక యెవఁడైనను కేవలము తన యుదరంభరణార్థమై యన్నమును వండుకొని తినెనేని యా మనుష్యుఁ డఘమును (అనఁగా: పాపమును) భక్షించుచున్నాఁడు. అతనిని 'అఘాశీ' అనవలయునని మనుస్మృతియందే కాక ఋగ్వేదమునందును గీతలయందును

జెప్పఁబడినది (ఋ. 10.117.6; మఱియు మను. 3.118; గీ. 3.13). ఈ స్మార్త పంచమహా యజ్ఞములే కాక, దానము, సత్యము, దయ, అహింసయు నను నితరములగు సర్వభూత హితప్రదము లగు ధర్మములును, నుపనిషత్తుల యందును స్మృతుల యందును గృహస్థులకు విహితములుగ విధింపఁబడినవి (తై. 1.11). మఱియు వాని యందే కుటుంబమును వృద్ధిపఱచి వంశమును స్థిరముగ నుంచుము. "ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః" అని స్పష్టముగఁ జెప్పఁబడినది. ఈ కర్మ లన్నియు నొక విధమగు యజ్ఞములే యని చెప్పఁబడినవి. మఱియు బ్రాహ్మణుఁడు పుట్టుకతోడనే తన వీపుపై నీ ముువ్విధములగు ఋణముల(అనఁగా: అప్పుల) నుంచుకొని వచ్చుచున్నాఁడు. వానిలో మొదటిది ఋషి ఋణము, రెండవది దేవతల ఋణము, మూఁడవది పితరుల ఋణము. వీనిలో ఋషిఋణము వేదాభ్యాసముచేతను, దేవతల ఋణము యజ్ఞముచేతను, పితరుల ఋణముఁ బుత్రోత్పత్తిచేతను దీర్పవలయును. లేనియెడల నతనికి గతి లేదు. వానిని జేయుటకుఁ గారణము తైత్తిరీయసంహితలోఁ జెప్పఁబడినది *(తై.సం. 6.3;10.5). జరత్కారుఁ డీ తీరున నాచరింపక వివాహమునకు మున్నె యుగ్ర తపంబు సేయ నారంభించినపుడు సంతానము లేమిచే నతని యాయావరులను పేరుగల పితరు లాకసంబున వ్రేలాడుచుండి యతనికి కంటఁబడి రనియు, వారి యాజ్ఞానుసారముగ మున్నా ఋషి వివాహ మాడె ననియు భారతమునం దాదిపర్వమునం దొక కథ కలదు (మ.భా.ఆ. 13). ఈ సర్వకర్మలను గాని, లేక, యజ్ఞములను గాని, కేవలము బ్రాహ్మణులే చేయవలయునని నియమము లేదు; కాని వైదిక కర్మములు దక్క ఇతరములగు కర్మలు యథాధికారముగ స్త్రీ శూద్రులకు

---

* "జాయమానో వై బ్రాహ్మణ స్త్రిభి ర్ఋణవా జాయతే బ్రహ్మచర్యేణ ఋషిభ్యో యజ్ఞేన దేవేభ్యః ప్రజయా పితృభ్య ఏష వా అనృణో యః పుత్రీ యజ్వా బ్రహ్మచారివాసీతి" అని తైత్తిరీయసంహితలోని వాక్యము.

సైతము విహితము లగుటచే స్మృతికారులచేఁ జెప్పఁబడిన చాతుర్వర్ణ్య వ్యవస్థానుసారముగఁ జేయఁబడిన సర్వకర్మలును (అనఁగా: క్షత్రియుఁడు యుద్ధము మొదలగునవి) యజ్ఞములే యగునని యజ్ఞ శబ్దమునకు వ్యాపకమగు నర్థ మీ ప్రకరణమున వివక్షితముగ నున్నది. ఏది యెవరికి విహితమో యదియ వారికి తప స్సగునని మనువుచేఁ (11. 236) జెప్పఁబడినది. మహాభారతమునందు—

ఆరంభయజ్ఞాః క్షత్రా శ్చ హవిర్యజ్ఞా విశః స్మృతాః,
పరిచారయజ్ఞాః శూద్రా శ్చ జపయజ్ఞా ద్విజాతయః.
(మ.భా.శాం. 237.18)

— ఆరంభము (ఉద్యోగము), హవిస్సు, సేవయు, జపము నను నీ నాల్గు యజ్ఞములును, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, బ్రాహ్మణులు నను నీ నాల్గు వర్ణములకు యథాక్రమముగ విధింపఁబడినవి. ఈ సృష్టియందలి మనుజుల కెల్లరకును విధింపఁబడిన కర్మలు యజ్ఞార్థమై బ్రహ్మదేవునిచే విధింపఁబడిన వగుటచే (మ. భా. అను. 48. 3; గీ. 3.10, 4.32 చూడు) చాతుర్వర్ణ్యాది సమస్తమైన శాస్త్రోక్త కర్మలు నొక విధమగు యజ్ఞములే యగుచున్నవి. మఱియుఁ బ్రతి మనుజుఁడును తన యధికారమునకుఁ దగినటు లీ యజ్ఞములను (అనఁగా: శాస్త్రోక్తకర్మలను, లేక, పనులను, లేక, కర్తవ్య వ్యవహారములను) జేయకపోయె నేని సర్వసమాజమునకు నష్టము కలిగి తుదకు నశించుట సైతము సంభవింప వచ్చును. కావున నీ వ్యాపకార్థముం బట్టి లోకసంగ్రహార్థమై యజ్ఞము లావశ్యకము లని సిద్ధ మగుచున్నదని సారాంశము;

దీనిపైన వేదానుసారముగను చాతుర్వర్ణ్యాదిస్మార్తవ్యవస్థానుసారముగను గృహస్థులకు విహితములగు యజ్ఞప్రధానములైన వృత్తు లెల్లఁ గర్మమయములే యగుటచే నీ సాంసారిక కర్మలను సైతము ధర్మశాస్త్రము ననుసరించి సాంగోపాంగముగఁ (అనఁగా: నీతి

యొక్కయు, ధర్మాజ్ఞయొక్కయు ననుసారముగ) జేయుచుండె నేని యంతమాత్రముచేతనే మనుష్యుఁడు జననమరణప్రవాహములోనుండి ముక్తుఁడగునా? ముక్తుఁ డగు నందుమేని జ్ఞానమునందు మహత్త్వ మేమియున్నది? యని యొకప్రశ్న పొడమును. బ్రహ్మాత్మైక్యజ్ఞాన మునొంది కర్మలయందు విరక్తుఁ డయిననే కాని, నామరూపాత్మక మాయయందుండి, లేక, జననమరణ ప్రవాహమునందుండి విముక్తుఁడు కాఁ డని జ్ఞానకాండమునందు (అనఁగా: ఉపనిషత్తులలో) స్పష్టముగఁ జెప్పఁబడినది. మఱియు శ్రౌతస్మార్తధర్మములం జూచితి మేని, ప్రతి మనుజునియొక్క సంసారమును గర్మప్రధానమే, లేక, వ్యాపకార్థమునందు యజ్ఞమయమైనదే యై యున్నదని కాన్పించు చున్నది. ఇంతియకాక, యజ్ఞార్థముగఁ జేయఁబడిన కర్మలు, బంధకములుగా వనియు, యజ్ఞముచేతనే స్వర్గప్రాప్తి యగు ననియు, వేదములు సెప్పుచున్నవి. స్వర్గవిషయ మొకప్రక్క నుంచినను ఇంద్రాది దేవతలు సంతుష్టులైననే కాని వర్షము కురియదు. యజ్ఞములు సేయనినాఁడు దేవతలు సైతము సంతుష్టులు గారనియు బ్రహ్మదేవుఁడే విధించియున్నాఁడు. మఱియు యజ్ఞములు (అనఁగా: కర్మలు) చేయనిచో మనుష్యునకుఁ గల్యాణమైన నెటులఁ గలుగును?

**అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్య గాదిత్య ముపతిష్ఠతే,**
**ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టే రన్నం తతః ప్రజాః.**

యజ్ఞములయందు హోమముచేయఁబడిన ద్రవ్యము లగ్నిగుండ సూర్యునిఁ జేరు ననియు, సూర్యునివలన వాన గురియు ననియు, వానవలన అన్నము గలుగు ననియు, అన్నమువలనఁ బ్రజలు బ్రదుకుదు రనియు నిహలోకక్రమము మనుస్మృతియందును మహాభారతమునందును, నుపనిషత్తులందును, గీతలయందునుఁ జెప్పఁబడినది (మను. 3.76; మ.భా.శాం. 262.11; మైత్ర్యు. 6.37; గీ. 3.14 చూడు). మఱియు నీ యజ్ఞములు గర్మలచేతనే యగునేని కర్మలు

వదలిన లోక మెటుల నడచును? యజ్ఞమయములగు కర్మలను వదలితి మేని జగత్తను ఘటీయంత్రము నిలిచిపోవుటయే కాక యెవ రికి నాహారము సైతము లభింపనేరదు. యజ్ఞయాగాది వైదికములు గాని, లేక, యితరములగు స్మార్త కర్మలు గాని, లేక, వ్యావహారిక యజ్ఞమయము లగు కర్మలు గాని, వదలుమని మేము చెప్పము. వేయేల? నడచుచున్న యజ్ఞము లనెడు చక్ర మాఁగిపోయె నేని జగత్తు నశించునని మీరు సెప్పిన విషయము మాకును సమ్మతమే. కావున కర్మమయయజ్ఞముల నెప్పుడును వదలఁ గూడదని మేమును సిద్ధాంతీకరించు చున్నామని భాగవతధర్మములును, గీతయు పై ప్రశ్నకు నుత్తర మిచ్చుచున్నవి (మ. భా. శాం. 340; గీ. 3. 16). అయినను జ్ఞానవైరాగ్యములచేఁ గర్మక్షయమైననే కాని మోక్షము లేదని జ్ఞానకాండము నందును (అనఁగా: ఉపనిషత్తులయందు సైతము) స్పష్టముగఁ జెప్పఁబడియున్నది. కావున నీ రెండు సిద్ధాంత ములను జేర్చి సర్వకర్మలను జ్ఞానపూర్వముగ (అనఁగా: ఫలాశను వదలి నిష్కామబుద్ధితో, లేక, వైరాగ్యచిత్తముతో)ఁ జేయవలయునని మేము చెప్పుచున్నాము (గీ. 3. 17. 19). స్వర్గములయొక్క కామ్య బుద్ధిని మనస్సున నిడికొని జ్యోతిష్టోమాదియాగములను జేసితివేని, వేదమునందుఁ జెప్పినతీరున, స్వర్గఫలము నీకు లభించును. అందు సంశయ మేమియును లేదు. కారణ మేమి యన: వేదవిధి యెప్పుడు నసత్యము కానేరదు; కాని స్వర్గఫలము నిత్యము (స్థిరముగ నుండు నది) కాదు.

ప్రాప్యాంతం కర్మణస్తస్య యత్కించేహ కరోత్యయమ్,
తస్మాల్లోకా త్పునరే త్యస్మై లోకాయకర్మణే.*

* ఈ మంత్రమునందలి రెండవ చరణమును జదువునపుడు 'పునరేతి', యనియు, 'అస్మై' యని పదవిభాగముచేసి చదువుదు మేని చరణమున నక్షర ములు కొరవడనేరవు. వైదికగ్రంథములను జదువునపు డిటు లనేక స్థలములలోఁ జేయవలసివచ్చును.

_ ఇహలోకమునందుఁ జేయఁబడిన యజ్ఞయాగాది పుణ్యకర్మల యొక్క ఫలము స్వర్గోపభోగముచే సమాప్త మగును. అనఁగా: యజ్ఞమును జేయు కర్మఠుఁడగు ప్రాణి స్వర్గలోకమునందుండి యీ కర్మలోకమునకు (భూలోకమునకు) మరల రావలసినవాఁ డగును (బృ. 4.4.6; వే. సూ. 3.1.8; మ. భా. వన. 260 39) అని యుపనిషత్తులయందును కలదు. స్వర్గము నుండి క్రిందికి వచ్చు మార్గము ఛాందోగ్యోపనిషత్తునందు వర్ణింపఁబడినది (ఛాం. 5. 10; 3. 9). "కామాత్మాన స్స్వర్గపరాః" (గీ. 2. 43) అనియు, "త్రైగుణ్య విషయా వేదాః" (గీ. 2.45) అనియు సూక్ష్మముగ నీ కర్మఠుల నుద్దేశించియే భగవద్గీతలయందును జెప్పఁబడుటయే కాక "గతాగతం కామకామా లభంతే" (గీ. 9.21) "వారు స్వర్గమునకు, నిహమునకు సదా రాకపోకలు గలవారై యుండవలయు" ననియు, స్పష్టముగఁ జెప్పఁబడినది. ఆత్మ కీయాతాయాతములు నశించి జ్ఞానప్రాప్తి కలిగిననే కాని సత్యమగు సమాధానము, పూర్ణావస్థ, లేక, మోక్షము లభింపదు. కావున యజ్ఞయాగాదికమునే కాక చాతుర్వర్ణ్యముయొక్క సర్వ కర్మలను బ్రహ్మాత్మైక్యజ్ఞానముతోడను నాసక్తి లేకుండను చేయుదు వేని కర్మలను స్థిరముగ నాచరించుచున్నను నీవు ముక్తుఁడవే యగుదువు అని గీతోపదేశమునందలి సారము (గీ. 18. 5-6). దేవతల నుద్దేశించి, నువ్వులను గాని, బియ్యమును గాని, పశువును గాని "ఇదం అముక దేవతాయై న మమ" యని చెప్పి యగ్నియందు హోమము సేయుటచేతనే యజ్ఞము చేసినట్లు కాదు. ప్రత్యక్షముగ పశువును జంపుటకంటె తన శరీరమందున్న కామక్రోధాదిరూపమగు పశువృత్తిని సామ్యబుద్ధి రూపమైన సంయమాగ్ని హోత్రమునందు హోమము సేయుట యను యజ్ఞము మిక్కుటమగు శ్రేయస్సు నిచ్చును. (గీ. 4.33) మఱియు నీ యభిప్రాయముచేతనే "యజ్ఞములలో నేనే జపయజ్ఞమును" (అనఁగా: జపయజ్ఞము శ్రేష్ఠమైనది)

అని గీతలయందును, నారాయణీయధర్మముల యందును భగవం తుఁడు సెప్పెను. (గీ. 10.25; మ.భా.శాం. 3.32) మనుస్మృతి యందును "జన్నములు చేసినను, చేయకపోయినను జపముచేతనే బ్రాహ్మణుఁడు సిద్ధి నొందుచున్నాఁడు" అని చెప్పఁబడెను (మను. 2. 87). అగ్నియం దాహుతిని వేల్చుచు 'న మమ'— ఇది నాది కాదు అని నుడివి యా ద్రవ్యమునం దుండిన మమత్వబుద్ధిని వదలుట యనునదియే యజ్ఞమునందున్న ముఖ్యతత్త్వము. దానాదులకును నిదియె బీజము. యజ్ఞయాగాదులును దానాదులును సమానము లైనవే (అనఁగా: యజ్ఞముయొక్క యోగ్యత గలిగినవే). వేయేల? కర్మలయందుఁ దన కే విధమగు స్వార్థమును లేకుండ శుద్ధబుద్ధితోఁ జేయునేని యవి యజ్ఞములే యగునని చెప్పినను నది యతిశయోక్తి కానేరదు. యజ్ఞమనుపదమున కీ వ్యాఖ్యానము స్వీకరింపఁబడెనేని, మమతాశూన్య మగు బుద్ధిచే సలుపఁబడిన నిఖిలకర్మలును నీ వ్యాప కార్థమును బట్టి గొప్పయజ్ఞములే యగును. మఱియు యజ్ఞార్థమై సలుపఁబడిన కర్మలు బంధకములు కావని, ద్రవ్యమయ యజ్ఞమును సంబంధించు మీమాంసకుల న్యాయ మీ నిఖిలనిష్కామ కర్మల యందు నుపయోగించును. మఱియు నీ కర్మల సలుపునపుడును ఫలాశను వదలుటచే స్వర్గమునకు రాకపోకలు సైత మంతరించి తుదకు మోక్షరూపమగు సద్గతి సిద్ధించును (గీ. 3.9). సంసారము యజ్ఞమయము, లేక, కర్మమయము; అయినను వానినిఁ జేయు వారు రెండువర్గము లగుదురు. ఒకరు శాస్త్రోక్తప్రకారముగ ఫలాశను వదలి కర్మలను జేయువారు (కర్మఠులు); రెండవవారు నిష్కామ బుద్ధిచేఁ గేవలము కర్తవ్య మని యెఱింగి యన్నికర్మలను సలుపు వారు; (జ్ఞానులు) అని సారాంశము. వీరిలో మొదటివారికి (కర్మఠు లకు) స్వర్గప్రాప్తివంటి యనిత్యఫలమును, రెండవవారికి(జ్ఞానులకు) మోక్షరూప మగు నిత్యఫలమును లభించును అని గీతలయందలి

సిద్ధాంతము. మోక్షార్థమై కర్మలను వదలుమని గీతలు చెప్పక పోవుటయే కాక త్యాగ (వదలుట) శబ్దమునకుఁ గర్మత్యాగ మర్థము కాదనియు, గీతలయం దంతటను దానికి ఫలత్యాగము వివక్షితమగు నర్థ మనియుఁ బదునొకండవ యధ్యాయములోఁ బ్రారంభమున స్పష్టముగఁ జెప్పఁబడినది.

కర్మఠులకును, కర్మయోగులగు జ్ఞానులకును లభించు ఫలము లీ తీరున భిన్నము లగుటచే వానిని బొందుటకు మరణానంతరమున ప్రతి మనుజుఁడును వేర్వేఱు మార్గములచే వేర్వేఱు లోకముల కేఁగ వలసివచ్చును. ఈ మార్గములకే యనుక్రమముగ 'పితృయాన' మనియు, 'దేవయాన' మనియుఁ బేర్లు (శాం. 17.15. 16 చూడు). ఉపనిషత్తుల యాధారమున నీ రెండు మార్గములును గీతలలోఁ బదునెనిమిదవ యధ్యాయమున వర్ణింపఁబడినవి. జ్ఞానియగు పురుషుఁడు గాని, మొదటినుండియు జ్ఞానము లేకపోయినను నంతకాలమునం దైన నది సిద్ధించినవాఁడు గాని (గీ. 2.72) దేహపాతానంతరము చితియందు దహింపఁబడిన పిదప నా యగ్ని యందుండి జ్యోతిస్సు (జ్వాల) యొక్క రూపమున, పగలు శుక్లపక్ష ముత్తరాయణమునందలి యాఱు మాసములు నను వానిలోనుండి ప్రయాణము చేయుచు, బ్రహ్మపదమునకుఁ జేరుచున్నాఁడు. అచ్చటికిఁ జేరినవానికి మోక్షము కలుగును గాన వాఁడు మరల మర్త్యలోకమున జన్మింపఁడు. కేవలము కర్మఠుఁడుగ నున్నవాఁడును, జ్ఞాని కానివాఁడును, ఆ యగ్నియందుండి ధూమము, రాత్రి, కృష్ణపక్షము, దక్షిణాయనము నందలి యాఱుమాసములు నను వానిలోనుండి ప్రయాణముసేయుచు చంద్రలోకమున కేఁగి, యతనిచే సలుపఁబడిన పుణ్యముయొక్క సర్వోపభోగముల ననుభవించిన పిదప మరల నిహలోకమున జన్మించును అనునది యీ రెండు మార్గములయందును గల భేదము (గీ. 8.23; 27). 'జ్యోతిః' (జ్వాల) అను దానికి మాఱుగ నుపనిషత్తులలో

'అర్చిః' (జ్వాల) అను శబ్ద మున్నది. మొదటిదానికి 'అర్చిరాది' మార్గ మనియు, రెండవదానికి 'ధూమాది' మార్గ మనియు పేరు. ఉత్త రాయణమున నుత్తరధ్రువస్థానమందున్న దేవతలకు పగలును, దక్షి ణాయనము వారికి రాత్రియు నను పరిభాషను దెలిసికొందు మేని యీ రెండు మార్గములలో నర్చిరాది (జ్యోతిరాది) మార్గము మొదటి నుండి తుదివఱకును తేజస్వంత మనియు, ధూమాదిమార్గము తమ స్వంత (తమోయుక్త) మనియు స్పష్ట మగును. జ్ఞాన మనునది ప్రకాశ మయమును, పరబ్రహ్మ మనునది 'జ్యోతిషాం జ్యోతిః' (గీ. 3.17) తేజస్సునకుఁ దేజ స్సగుటచే దేహపాతానంతరమున జ్ఞానియొక్క మార్గము ప్రకాశమయముగ నుండుటయే యుక్త మగుటచే గీతలయం దీ రెండు మార్గములకును 'శుక్ల' మనియు, 'కృష్ణ' మనియు పేర్లు పెట్టఁబడినవి. కాన నా శబ్దములకు ప్రకాశ మనియు, నంధకార మనియు నర్థము. గీతలయం దుత్తరాయణముకంటెఁ దర్వాత నున్న మెట్టు చెప్పఁబడలేదు; కాని యాస్కుని నిరుక్తమునందు ఉదగయ నము తర్వాత దేవలోకమును, సూర్యుఁడును, వైద్యుతపురుషుఁడును మానసపురుషుడును వర్ణింపఁబడిరి (నిరుక్త. 14. 9). ఉపనిషత్తులలోఁ జెప్పఁబడిన దేవయానమున కేకవాక్యతఁ జేసి వేదాంతసూత్రముల యం దుత్తరాయణము తర్వాత సంవత్సరమును, వాయులోకమును, సూర్యుఁడును, చంద్రుఁడును, విద్యుత్తును, వరుణలోకమును, ఇంద్ర లోకమును, ప్రజాపతిలోకమును తుదకు బ్రహ్మలోకము నని వరుస చెప్పఁబడినది(బృ. 5.10; 6.2.15; ఛాం. 5-10; కౌషీ. 1.3; వే.సూ. 4.3.1-6).

దేవయానము, పితృయానము నను నీ రెండు మార్గముల యందు నున్న మెట్టు లీ రీతిగ వర్ణింపఁబడినవి; కాని విశ్రాంతిస్థాన ములలో, దివసము, శుక్లపక్షము, ఉత్తరాయణము మొదలగునవి సామాన్యముగఁ గాలవాచకము లగుటచే, దేవయాన, పితృయాణము

లను రెండుమార్గములకును గాలముతో సంబంధ మెప్పుడైన నుండెనా? లేదా? యను ప్రశ్న వెలువడును. దివసము, రాత్రి, శుక్లపక్షము నను శబ్దములు కాల పర్యాయము లైనను, అగ్ని, జ్వాల, వాయులోకము, విద్యుత్తు మొదలగునవి కాలవాచకములు గావు. మఱియు జ్ఞాని పగటియందుఁ గాని, రాత్రియందుఁ గాని మరణము నొందుటచే నతనికి వేర్వేఱు గతులు ప్రాప్తము లగునని యంగీకరింతు మేని జ్ఞానమునకు సైతము మహత్త్వ ముండనేరదు. కావున వేదాంతసూత్రముల యందున్న అగ్ని, దివసము, ఉత్తరాయణము మొదలగు శబ్దములన్నియుఁ గాలవాచకములని యనఁ దగును. ఆ శబ్దములు తత్తదభిమానిదేవతావాచకము లని చెప్పవలయును. కాన, నా దేవత జ్ఞానియును, గర్మఠుఁడు నగు పురుషుల యాత్మను వేర్వేఱు మార్గములచే బ్రహ్మలోకమునకును, ఇంద్రలోకమునకును గొంపోవునని సిద్ధాంతము సేయఁబడినది (వే. సూ. 4.2 19-21; 4.3.4). కాని భగవద్గీతకీ మతము సమ్మత మగునా? కాదా? యని శంక కలుగవచ్చును. కారణ మేమి యన: ఉత్తరాయణమునకుఁ దర్వాతనున్న కాలభిన్న మగు మార్గము గీతయందుఁ జెప్పఁబడక పోవుటయే కాక, యీ మార్గమును జెప్పుటకంటె పూర్వమునందు, "ఏ కాలమున మరణించిన కర్మయోగి వెనుకకు వచ్చునో? యే కాలమున మరణించిన రాఁడో? యా కాలమును నీకుఁ జెప్పుదును" (గీ. 8.23) అని చెప్పి, భగవంతునిచే కాలము స్పష్టముగఁ జెప్పఁబడినది; మఱియు మహాభారతమునందు భీష్ముఁడు శరపంజరమునందు శయనించినప్పుడు శరీరమును వదలివేయుట కొఱకు నుత్తరాయణమునకై వేచియుండెనని చెప్పఁబడినది (భీష్మ. 120; అను. 167). దీనివలన, దివసము, శుక్లపక్షము, లేక, ఉత్తరాయణము నను నీ కాలములే మరణించుటకు నెప్పుడైనను ప్రశస్తము లైనవని చెప్పినటుల స్పష్ట మగుచున్నది. ఋగ్వేదమునందును దేవయానము పితృయాణము నను రెండుమార్గములు సెప్పఁబడినవి (ఋ. 10. 88. 15; బృ. 6. 2. 15). అక్కడను

కాలమను నర్థమే వివక్షితము. దీనివలనను మఱియు ననేకములగు నితర ప్రమాణములవలనను నుత్తరగోళార్ధమునందున్న యే ప్రదేశము నందు సూర్యుఁడు క్షితిజముపై నాఱునెలలు లెప్పుడును గానఁబడు చున్నాఁడో, యా స్థలమందు (అనఁగా: ఉత్తరధ్రువ సమీపమునందు లేక, మేరుస్థానమునందు) వైదికఋషు లుండునపుడు ఆఱుమాసము లయొక్క యుత్తరాయణరూపమగు ప్రకాశకాలము మరణించు వారికి ప్రశస్తమనియు వాడుక మొదట వెలువడియుండునని నేను చెప్పి యుంటిని. దానియొక్క సవిస్తరమగు వివేచనను మఱియొక గ్రంథ ములోఁ జేసినాను. కాని కారణ మేమియైన నిది చిరకాలమునుండి యనుభవములో నున్న దను విషయమున సంశయము లేదు. ఈ యనుభవమే దేవయాన పితృయాణములను రెండు మార్గములయందు స్పష్టముగ లేకపోయినను పర్యాయశబ్దములయం దంతర్భూతమయి యున్నది. వేయేల? ఈ రెండుమార్గములకును మూల మీ ప్రాచీనాను భవమేయని నేఁ దలఁచెద. ఏలన: అట్లుకానిచోఁ, భగవద్గీతయందు దేవయానపితృయాణముల నుద్దేశించి యొకప్పుడు 'కాల' మనియు (గీ. 8.23), నొకప్పుడు 'గతి' లేక, 'సృతి' అనఁగా: మార్గము (గీ. 8.26 మఱియు 27) అనియు వేర్వేఱర్థములు కలిగిన శబ్దములు ప్రయోగింపఁబడుటకు కారణము కుదురదు. వేదాంత సూత్రముల శాంకరభాష్యములోని దేవయాన పితృయాణశబ్దములకు కాల మను నర్థము స్మృతిసిద్ధమై యున్నది. అది కర్మయోగమునకే సంబం ధించును. మఱియు నిజమగు బ్రహ్మజ్ఞాని, యుపనిషత్తులందుఁ జెప్పఁబడిన శ్రౌతమార్గమున (అనఁగా: దేవతాప్రయుక్త ప్రకాశమయ మగు మార్గముచే) బ్రహ్మలోకమున కేఁగు చున్నాఁడని భేదము కల్పించి, కాలరూపమును, దేవతారూపము నగు నర్థములకు వ్యవస్థ చేయఁబడినది (వే.సూ.శాం.భా. 4.2.18_21). కాని మూలసూత్ర ములఁ జూచితిమేని కాలార్థమును గ్రహించినట్లు గన్పట్టదు. ఉత్త రాయణాదిశబ్దములచే దేవతలను గల్పించి దేవయానమునకు బాద

రాయణాచార్యులు నిశ్చయించిన దేవతారూపార్థమే వారిమతములో నంతట నభిప్రేతమై యున్నట్లు కాన్పించుచున్నది. మఱియు గీతల యందున్న మార్గ ముపనిషత్తులయందున్న యీ దేవయానగతి వదలి స్వతంత్రముగ నుండునని చెప్పుట యుక్తముకాదు. కాని యిచ్చో నింతదూరము విచారింప నవసరములేదు. కారణ మేమన: దేవయాన పితృయాణములందున్న దివసము, రాత్రి, యుత్తరాయణము మొద లగు శబ్దము లైతిహాసికదృష్టిచే మూలారంభమునందు కాలవాచకము లగునా? కావా? యనువిషయములో మతభేద ముండినను నీ కాల రూపార్థము పిమ్మట వదలిపోవుటచేఁ గాలము నపేక్షింపక మనుష్యుఁ డెప్పుడు మృతిఁజెందినను జ్ఞాని తన కర్మానుసారముగఁ బ్రకాశమయ మగు మార్గముచేతను, కేవలకర్మఠుఁ డంధకారమయమగు మార్గము చేతను బరలోకమునకుఁ బ్రయాణముఁ జేయుదు రనునదియే, దేవ యాన, పితృయాణములను రెండు పదములకు నర్థ మను చరమ సిద్ధాంతము రూఢమగు విషయ మనునది నిర్వివాదముగనే యున్నది; కాని దివసము, ఉత్తరాయణము మొదలగుశబ్దములకు బాదరాయణా చార్యులవారు చెప్పినటుల దేవత లని యర్థము చెప్పుకొనినను, లేక, లక్షణచేఁ బ్రకాశమయమగు మార్గమున ముందుముందున్న మెట్టని యర్థముఁ జెప్పుకొనినను, దేవయాన పితృయాణము లను శబ్దము లకు 'మార్గ' మనునది రూఢ్యర్థ మగుటచేఁ బ్రకృతమున నదియు సిద్ధాంతమున కేమియు బాధకము కాదు.

దేవయానము పితృయాణము నను నీ రెండుమార్గములు శాస్త్రోక్తము లైనవే అనఁగా: పుణ్యకర్మలఁ జేయువారికే ప్రాప్తమగు నవి. కారణ మేమి యన: పితృయాణమను మార్గము దేవయాన మను మార్గమునకంటె క్రిందిమెట్టైనను, అదియుఁ జంద్రలోకమును (అనఁగా: నొక విధమగు స్వర్గలోకమును) బొందింపఁ జేయునదే యగుటచే నక్కడనుండు సుఖము నుపభోగించుటకు పాత్రుఁడగుటకై

యిహలోకమునఁ గొన్నియైనను శాస్త్రోక్తములగు పుణ్యకర్మల నొనర్చి యుండవలయు నని స్పష్టమగు చున్నది (గీ. 9.20-21). కావున శాస్త్రోక్తములగు పుణ్యకర్మల నల్పముగనైన అనల్పముగనైనఁ జేయక సంసారమున యావజ్జీవముఁ బాపముఁ జేయుచుండువా రీ రెండు మార్గములలో నే మార్గమునను వెళ్లరు. మరణానంతరమున నొక పర్యాయమే పశుపక్ష్యాది తిర్యగ్యోనులందు జన్మింతురు. లేక, తిరిగి తిరిగి యమలోకమును (అనఁగా: నరకమును) జెందుదు రని యుపనిషత్తులయందు స్పష్టముగఁ జెప్పఁబడినది. దీనినే మూఁడవ మార్గమని చెప్పుదురు. (ఛాం. 5.10.8; కఠ. 2.6-7) మఱియు భగవద్గీతల యందును కేవల పాపికి (అనఁగా: అసురపురుషునకు) ఇదే 'నిరయగతి' ప్రాప్తించు నని చెప్పఁబడినది (గీ. 16.19-21; 9.12; వే.సూ. 3.1.12-13; నిరుక్తము 14 9).

వైదికధర్మముల యందున్న ప్రాచీన పరంపరానుసారముగ మనుజునకు మరణానంతరమునందు స్వకర్మానురూపమగు మూఁడు గతులును గ్రమముగఁ బ్రాప్త మగునని పూర్వమునందుఁ జెప్పఁబడినది. వీనిలో దేవయానమార్గముచే మోక్షము లభించుట నిజమే: అయిన నీ మోక్షము క్రమక్రమముగ (అనఁగా: అర్చిరాదిమజిలీ నొకదానివెంబడి నొకదాని నెక్కుటచేఁ దుదకు)ఁ బ్రాప్తమగును. కావున నీ మార్గమును 'క్రమముక్తి' యనియు, మరణానంతరమున బ్రహ్మలోకమునకు నేఁగఁగ నచ్చో చరమముక్తి గలుగుటను 'విదేహ' ముక్తి' యనియు చెప్పుచున్నారు; కాని శుద్ధమగు చిత్తముగలవారు (అనఁగా: బ్రహ్మముయొక్కయు, ఆత్మయొక్కయు నేకత్వపూర్ణ సాక్షాత్కార మెవరి మనస్సున నిత్య మనుభవములోనున్నదో వారు) బ్రహ్మతాదాత్మ్యమును బొందుటకై మఱియొక ప్రదేశమున కేల పోవుదురు? మరణము నైన నేల వేచియుండవలయు? ఉపాసనార్థమై గ్రహింపఁబడిన సూర్యాదిప్రతీకముల వలనఁ గలుగుజ్ఞానము (అనఁగా:

సగుణబ్రహ్మోపాసనచే నే బ్రహ్మజ్ఞానము కలుగునో యది) తొలుతఁ గొంచె మపూర్ణముగ నుండును. కారణ మేమన: దానియందుండి సూర్యలోకము, లేక, బ్రహ్మలోకము మొదలగు వాని కల్పన మనస్సునం దుద్భవిల్లుటచే నది మరణ సమయమునందును, కొంచెము న్యూనాధికభావముగ స్థిరముగ నుండవచ్చును. కావున నీ లోపమును నివారించి మోక్షము నందుటకిట్టివారు దేవయానమార్గముననే యేఁగవలయునని చెప్పుట సయుక్తికముగనే యున్నదనియు శుద్ధమగు నధ్యాత్మశాస్త్రము, పూర్వము చెప్పఁబడినవిషయముకంటె నతిరిక్తమగు విషయమును సైతము చెప్పుచున్నది. కారణ మేమి యన: మరణసమయమునం దెవరి కెట్టి భావనగాని, క్రతువు లేక, సంకల్పముగాని యుండునో, వారి కాగతియె సిద్ధించునని యధ్యాత్మశాస్త్రముయొక్క ముఖ్య సిద్ధాంతము (ఛాం. 3.14.1); కాని సగుణోపాసనచేఁ గాని, లేక, యితర కారణములచేఁ గాని బ్రహ్మము జీవాత్మయు నను ద్వైతరూప మగునద్దుతెర (తై. 2.7) మనస్సునం దేమాత్రమును లేనివారు నిశ్చయముగ బ్రహ్మరూపులే యగుటచే, నిట్టి పురుషులు బ్రహ్మప్రాప్తి నిమిత్తమై మఱియొక ప్రదేశమున కేఁగవలసిన యవసరము లేదని స్పష్టముగనే కన్పట్టుచున్నది. కావున శుద్ధమగు బ్రహ్మజ్ఞానముఁ బూర్ణుఁడు, నిష్కాముఁడైనవాఁడు "న తస్య ప్రాణా ఉత్క్రామంతి బ్రహ్మైవ సన్ బ్రహ్మా ప్యేతి"— అతని ప్రాణము లెక్కడికి నేఁగవు. అతఁడు నిత్యబ్రహ్మభూతుఁ డగుటచే, బ్రహ్మమందే లయమును బొందుచున్నాఁడు అని బృహదారణ్యకోపనిషత్తునందు (బృ. 4.4.6) యాజ్ఞవల్క్యుల జనకునకుఁ జెప్పిరి. ఇట్టి పురుషుఁడు "అత్ర బ్రహ్మ సమశ్నుతే"—ఎచ్చోట నున్నవాఁ డచ్చోటనేయుండి బ్రహ్మ ననుభవించుచున్నాఁడు (కఠ. 6. 14) అని బృహదారణ్యకము, కఠము నను నీ రెం డుపనిషత్తుల యందును జెప్పఁబడినది. మఱియు నీ శ్రుతి యాధారముచేతనే మోక్షము కొఱకు గ్రామాంతరమున కేఁగవలసిన యవసరము లేదని శివగీతలు వక్కాణించుచున్నవి. బ్రహ్మ

మొకచోట నుండునదియు, వేఱొకచోట నుండనిదియు నని చెప్పుటకు సాధ్యము కాదు (ఛాం. 7. 25; ముం. 2. 2. 11); కాని యెప్పుడైనను సంపూర్ణముగ బ్రహ్మప్రాప్తి కలుగుటకుఁ బూర్ణజ్ఞాని యగు పురుషుఁ డుత్తరాయణము, సూర్యలోకము మొదలగు మార్గములచే నేల యేఁగవలయును? "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి"— బ్రహ్మము నెఱింగినవా రిహలోకమునందే బ్రహ్మ మగుదురు (ము. 3. 2. 9). కారణ మేమి యన: ఒకఁడు మఱియొక చోటి కేఁగుటలో ఇక్కడ నక్కడ నను స్థలకృతభేదము గాని, కాలకృతభేదము గాని యుండవలయును. ఈ భేదము కడపటిదియగు (అనఁగా: అద్వైతమును శ్రేష్ఠము నగు) బ్రహ్మానుభవమునం దుండదు. కావున "యస్య సర్వమాత్మై వాభూత్" (బృ. 2. 4. 14) అనియు, "సర్వం ఖల్విదం బ్రహ్మ" (ఛాం. 3.14.1) అనియు, "అహం బ్రహ్మాస్మి" (బృ. 1.4. 10) అనియు నుపనిషత్తులలోఁ జెప్పఁబడిన నిత్యమగు స్థితి కలిగిన వాఁడు మఱియొకచోటికి బ్రహ్మప్రాప్తి కేల యేఁగును? వాఁడెప్పుడును బ్రహ్మభూతుఁడే. పూర్వప్రకరణాంతమునఁ జెప్పిన తీరున గీత యందుసైత మీ యభిప్రాయముతోనే "అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్"— ద్వైతమును (అనఁగా: ద్విత్వభావమును) వదలి యాత్మస్వరూపమును దెలిసికొనినవారు ప్రారబ్ధక్షయార్థమై దేహపాతమును నిరీక్షింపవలసి వచ్చినను, మోక్షప్రాప్తి కెక్కడకును బోవలసిన యవసరము లేదు. కావున బ్రహ్మనిర్వాణరూపమగు మోక్షమెప్పుడును వారియెదుట సిద్ధముగనే యుండును (గీ. 5. 26) అనియు, "ఇహైవతై ర్జిత స్సర్గో ఏషాం సామ్యే స్థితం మనః" (గీ. 5. 19)— ఎవని మనస్సునందు సర్వభూతాంతర్గతమగు బ్రహ్మాత్మైక్య రూపసామ్యము ప్రతిబింబితమైనదో (దేవయానమార్గాపేక్ష నుంచుకొనక యెక్కడనుండిన నక్కడనే యుండి జనన మరణాదికమును జయించుచున్నాఁడో), లేక, "భూతపృథగ్భావ మేకస్థ మనుపశ్యతి"— సర్వ

భూతములయందున్న నానాత్వము నశించి యవియన్నియు నెవనికి నేకస్థముగఁ (అనఁగా: బరమేశ్వర రూపముగఁ) గాన్పింప నారంభ మాయెనో (గీ. 13.30), యతఁడు "బ్రహ్మ సంపద్యతే"- బ్రహ్మమే యగుచున్నాఁడు (గీ. 13. 20) అని పరమజ్ఞానియగు పురుషుఁడు వర్ణింపఁబడెను. అటులే దేవయానము, పితృయాణము నను రెండు మార్గములను పూర్ణముగ నెఱిఁగి కర్మయోగి మోహము నొందఁడు (గీ. 8. 27) అని గీతలయందుఁ జెప్పఁబడిన పూర్వోక్తవచనములం దున్న "తత్త్వతః-తెలిసికొనినవాఁడు" అను పదమునకు సైతమర్థము 'పరమావధియగు బ్రహ్మస్వరూపమును దెలిసికొనినవాఁడు' అని వివక్షితమని కాన్పించుచున్నది (భాగ. 7.15.56). పూర్ణమగు బ్రహ్మ భూతస్థితి గాని, లేక, పరమావధియైన బ్రాహ్మస్థితి గాని యిదియే. మఱియు శ్రీ మచ్ఛంకరాచార్యులవారు తమ శారీరకభాష్యమునందు (వే.సూ. 4. 3. 14) ఇదియే యధ్యాత్మజ్ఞానమున కత్యంత పరాకాష్ఠ యనియుఁ బ్రతిపాదించిరి. వేయేల? ఈ స్థితి నొందుటకు మనుష్యుఁ డొక విధముగఁ బరమేశ్వరుఁడే కావలయు ననియు చెప్పవచ్చును. మఱియు నీ రీతిగ బ్రహ్మభూతుఁ డయిన పురుషుఁడు కర్మసృష్టియం దున్న యే విధినిషేధములను బాటింప నవసరము లేని స్థితినిబొందు చున్నాఁ డనియు వేఱుగఁ జెప్పనక్కరలేదు. కారణ మేమి యన: ఈ పురుషుని బ్రహ్మజ్ఞాన మెపుడును విడిచియుండదు. కావున వీని చేఁత లన్నియు నెప్పుడును నిష్కామబుద్ధిచేఁ బ్రేరితము లగును. కావుననే పాపపుణ్యములచే నలిప్తములుగ నుండును. ఈ స్థితి ప్రాప్తమయిన పిదప బ్రహ్మప్రాప్తికొఱకు మఱియొకచోటునకుఁ బోవుటకును మరణించుటకును (అనఁగా: దేహపాతమునకును) నావశ్యకత లేదు. ఇట్టి స్థితప్రజ్ఞుఁడైన బ్రహ్మనిష్ఠుఁడగు పురుషుని "జీవన్ముక్తు"డని వక్కాణించెదరు (యో. వా. 3. 9). బౌద్ధు లాత్మను, లేక, బ్రహ్మమును అంగీకరింపక పోయినను 'జీవన్ముక్తి' యను నీ నిష్కామావస్థయే

మనుష్యునకు ముఖ్యముగ సాధ్యమని యందురు గానఁ గొంచెము శబ్దభేదముచే నదియే తమ ధర్మగ్రంథములయందు వారిచే సంగ్రహింపఁబడినది (పరిశిష్టప్రకరణము చూడుము). పరమావధియగు నిష్కామత్వరూపమయిన యీ యవస్థయు, సాంసారికకర్మలు నగు వానికి స్వభావముగనే పరస్పరవిరోధము లుండును; గావున నీ యవస్థను బొందిన వారికర్మలు స్వయముగనే నశించును. కావున నతనిని సన్న్యాసి యని వచించెదరు; కాని గీతల కీ మతము సమ్మతము కాదు. పరమేశ్వరుఁ డే రీతిగఁ దానుఁ గర్మలఁ జేయుచున్నాఁడో యా రీతిగనే జీవన్ముక్తుఁడును నిష్కామబుద్ధితో లోకసంగ్రహార్థమై యా మరణాంతము నన్ని వ్యవహారములను జేయుట మిక్కిలి శ్రేయస్కరమై యున్నది. నిష్కామత్వమునకును, కర్మలకును విరోధము లేదని గీతలయొక్క సిద్ధాంత మను విషయము వెనుకటి ప్రకరణములను బట్టి స్పష్ట మగును. గీతల యందలి యీ సిద్ధాంతము యోగవాసిష్ఠమునందును స్వీకరింపఁబడినది (యో. 6. ఉ. 199).

ఇది కర్మవిపాకము - ఆత్మస్వాతంత్ర్యము అను దశమ ప్రకరణము.

# ఏకాదశ ప్రకరణము

## సన్న్యాసము-కర్మయోగము

**సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ,**
**తయోస్తు కర్మ సన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే.** *

అనాది యగు కర్మచక్రము నుండి విముక్తుఁ డగుటకు సర్వ భూతములయందు నేకముగ నున్న పరబ్రహ్మముయొక్క యనుభవాత్మకజ్ఞాన మనునది యొకటియే మార్గ మనియు నీ యమృత మగు బ్రహ్మముయొక్క జ్ఞానమును సంపాదించుటకు మనుజుఁడు స్వతంత్రుఁ డగునా? కాఁడా? మఱియు నీ జ్ఞానము కలుఁగుటకు మాయాసృష్టియందున్న యనిత్యవ్యవహారములను, లేక, కర్మలను వాఁడెట్లు సేయవలయు? నను విషయము గతప్రకరణమున సవిస్తరముగఁ జెప్పఁబడెను; మఱియుఁ దుదకు బంధన మను ధర్మము కర్మసంబంధము కాక, మనస్సంబంధ మైనది కావున, వ్యావహారిక కర్మల

---

* "సన్న్యాసము, కర్మయోగము నను నీ రెంటను నిశ్శ్రేయసకరములు (అనఁగా: మోక్షప్రదములు); కాని యీ రెండింటిలోను గర్మసన్న్యాసముకంటె, కర్మయోగ మహిమ యధికము". మొదటి చరణమునందున్న సన్న్యాసశబ్దార్థము కర్మసన్న్యాసశబ్దమున నుండి స్పష్టపఱుపఁబడినది. గణేశగీతయొక్క చతుర్థాధ్యాయారంభమున, గీతలయందున్న యీ ప్రశ్నోత్తరములు చెప్పఁబడినవి. అచ్చో ప్రస్తుత శ్లోకము—

క్రియాయోగో వియోగ శ్చాప్యుభౌ మోక్షస్యసాధనే,
తయోర్మధ్యేక్రియాయోగ స్త్యాగా త్తస్య విశిష్యతే.

అని కొంత పాఠభేదముగాఁ జెప్పఁబడినది.

యొక్క ఫలములందున్న తన యాసక్తి యింద్రియ నిగ్రహముచేఁ దగ్గించి, యా కర్మలను శుద్ధముగా నిష్కామబుద్ధిచేఁ జేయునెడల మెల్ల మెల్లగ సామ్యబుద్ధిరూప మగు నాత్మజ్ఞానము దేహేంద్రియముల యందుఁ జొచ్చుటచేఁ దుదకుఁ బూర్ణసిద్ధి సంఘటిల్లును. మోక్ష రూపమగు పరమసాధ్యము, లేక, ఆధ్యాత్మిక మగుపూర్ణావస్థ ప్రాప్త మగుటకు నే సాధనముల నడవడియందుఁ బ్రవర్తింపఁ జేయవలయు నను విషయ మీ రీతిగ నిశ్చయింపఁబడినది. ఇప్పు డీ ప్రకారమగు నాచరణముచేఁ (అనఁగా: యథాశక్తి, యథాధికారముగ నిష్కామ కర్మల నాచరించుటచే) గర్మబంధము వదలి చిత్తశుద్ధిచేఁ బూర్ణ బ్రహ్మజ్ఞానము కలిగిన పిదప (అనఁగా: సిద్ధావస్థలో), జ్ఞానియు, స్థిత ప్రజ్ఞుఁడు నగు పురుషుఁడు కర్మలను జేయుచునే యుండవలయునా? లేక, కావలసిన దంతయు లభించి కృతకృత్యుఁ డగుటచే మాయా సృష్టియం దున్న నిఖిల వ్యవహారములు నిరర్థకములు, జ్ఞానవిరుద్ధ ములు నని యెఱింగి బొత్తిగఁ గర్మలను వదలివేయ వలయునా? అను గొప్పవిషయము నిప్పుడు విచారింప వలయును. కారణ మేమి యన: కర్మలను బొత్తిగ వదలుట, (కర్మసన్న్యాసము), మఱియు వానిని నిష్కామబుద్ధిచే నామరణాంతము నొనర్చుటయు (కర్మ యోగము) అను నీ రెండు పక్షములు నిచ్చి తర్కదృష్టిచే సంభ వించును; మఱియు వానిలో శ్రేష్ఠ మని నిశ్చయింపఁబడిన పక్షమును మనమున నిడుకొనియే తొలుత నుండియు (అనఁగా: సాధనావస్థ యం దుండియు) నాచరించుట సులభోపాయమగుటచే నీ రెంటి యొక్క తారతమ్యమును విచారించిననే గాని కర్మాకర్మలయొక్క యాధ్యాత్మికవివేచన యెట్టులైనను బూర్ణము గానేరదు. పూర్ణముగ బ్రహ్మజ్ఞానము కలిగిన పిదపఁ గర్మలను జేసినను, జేయకపోయినను సమానమే (గీ. 3.18); కారణ మేమి యనఁగా: అన్నివ్యవహారముల యందును గర్మకంటె బుద్ధి శ్రేష్ఠ మగుటచే, జ్ఞానముచే సర్వభూత

ములయందు సమబుద్ధి గలిగిన వారికి ముందే శుభాశుభముల యొక్కయు లోప ముండదని (సంబంధ ముండదని) యర్జునునకుఁ (గీ. 4. 20. 21) జెప్పినంత మాత్రముచేఁ గర్మసన్న్యాసమునకు శ్రేష్ఠత్వము సిద్ధింపదు. ఏలయన "నీవు యుద్ధమునే చేయుము-యుద్ధ్యస్వ!"— అని భగవంతుఁ డతనికి నిశ్చయముగ నుపదేశించెను (గీ. 2.18); మఱియు నీ సుస్పష్టమగు నుపదేశమును సమర్థించుటకునై జ్ఞానము కలిగిన పిదప యుద్ధముఁ జేసినను సరే, చేయక యుండినను సరే యను సందిగ్ధమగు నుత్తరముకంటె రెండవదేది యయినను నిశ్చితము, లేక, ప్రబలమగు కారణము దానికిఁ జెప్పుట యావశ్యకము. విశేషము చెప్పనేల? ఒక కర్మయొక్క భయంకరమగు పరిణామము ప్రత్యక్షముగఁ గాన్పించిన, నేర్పరియగువాఁడు దానినేల చేయవలయు నని చెప్పుటకొఱకే గీతాశాస్త్ర ముపదేశింపఁ బడినది. గీతలయందలి విశేష మిదియే. కర్మచే ముక్తుఁ డగుచున్నాఁ డనునది సత్యమగునేని జ్ఞాని కర్మ నేల చేయవలయును? కర్మక్షయ మనఁగా కర్మలను వదలుట యను నర్థము గాదు. కేవలము ఫలాశను త్యజించుటచేతనే కర్మక్షయ మగును. సర్వకర్మలను వదలిపెట్టుట శక్యము గాదు. ఈ మొదలగు సిద్ధాంతములు సత్యము లయినను శక్యములగు కర్మల నయిన వదలకూడదని దానియందుండి పూర్ణముగ సిద్ధింపదు. మఱియు న్యాయముగఁ జూచినను అదే యర్థము వెలువడును. కారణ మేమియన: తనకు నలుగడల నుదక మున్నచో నీటికై బావి తుద కెట్లావశ్యకము కానేరదో, యటులే కర్మచే సిద్ధమగుజ్ఞానము కలిగిన పిదప జ్ఞానికిఁ గర్మయొక్క యపేక్ష యేమియు నుండదని గీతలలోనే చెప్పఁబడియున్నది (గీ. 2 46). ఇందుకొఱకు మూఁడవ యధ్యాయముయొక్క యారంభమున తొలుత నర్జునుఁడు శ్రీకృష్ణుని, "కర్మకంటె నిష్కామము, లేక, సామ్యమగుబుద్ధి శ్రేష్ఠమని నీ యభిప్రాయ మగునేని స్థితప్రజ్ఞునివలె నేను నా బుద్ధిని శుద్ధ

ముగ నుంచిన చాలునే; నన్ను యుద్ధమను నీ ఘోరకర్మమునం దేల నియమించెదవు" అని యడిగెను (గీ. 31.). ఇందు కుత్తర మిచ్చుచు భగవంతుఁడు, "కర్మ యేరిని వదలనే వదలదు", అను మొదలగు కారణములను జెప్పి నాల్గవ యధ్యాయమునఁ గర్మలను సమర్థించి నాఁడు; కాని సాంఖ్యము (సన్న్యాసము), కర్మయోగ మను రెండు మార్గములు శాస్త్రమందుఁ జెప్పఁబడెనేని, జ్ఞానోత్పత్తియైన పిదప వీనిలో నెవరికి నేది యిష్టమో వారు దానిని స్వీకరింపవలయునని చెప్పవలసి వచ్చును. కావున నైదవయధ్యాయారంభమున నర్జునుఁడు "ఈ రెండు మార్గములను కలియఁ గ్రుచ్చి నాకుఁ జెప్పక యీ రెంటిలో నేది శ్రేయస్కరమో యా యొక్కదానినే నాకు నిశ్చయించి నుడువుము" అని మరల భగవంతుని అడిగెను (గీ. 5. 1). "జ్ఞానోత్పత్తి యైన పిదపఁ గర్మలను చేయుట గాని, చేయకపోవుట గాని సమానమే యైన పక్షమున, నా యిష్టానుసారముగఁ జేసినఁ జేయుదును, లేనిచో మానుదును. వానిని చేయుటయే యుత్తమ పక్షమాయె నేని, నా కందలి కారణ మానతిమ్ము. నీ యాజ్ఞానుసార మొనర్తును" అని యర్జునుఁ డడిగిన యీ ప్రశ్న మపూర్వ మయినది కాదు. యోగవాసిష్ఠమునందు శ్రీరాములవారు వసిష్ఠుని, (యో. 5. 56. 6) మఱియు గణేశగీతలయందు (4. 1) వరేణ్యనామకరాజు గణేశుని నీ విషయమునే యడిగిరి. కేవలము మనదేశమునందే కాక ఐరోపాఖండమందును, ఎక్కడ తత్త్వజ్ఞానవిచారము తొలుత ప్రారంభమయినదో యట్టి గ్రీసుదేశమునందును బూర్వకాలమునం దీప్రశ్న బయలు వెడలెనని అరిస్టాటల్‌యొక్క గ్రంథమువలనఁ గాన్పించుచున్నది. ఈ ప్రసిద్ధుఁ డగు గ్రీకుదేశస్థుఁడైన తత్త్వవేత్త తానొనర్చిన నీతిశాస్త్ర గ్రంథముయొక్క యంతమున (10-7 మఱియు) నిదే ప్రశ్నను మనస్సులోనికిఁ దెచ్చుకొని, సంసారముయొక్క, లేక, రాజ్యకార్యభారము యొక్క యల్లకల్లలములో నాయుష్యము నంతయు వ్యర్థపుచ్చుకొనుటకంటె, జ్ఞానియగు పురుషుఁడు శాంతము

గనే, తత్త్వవిచారములోఁ గాలయాపనఁ జేయుటయందే సత్యమును పూర్ణము నైన యానంద మున్నదని తన మతము ముందుఁ జూపి నాఁడు; కాని, యటుపిమ్మట వ్రాసిన స్వీయమగు రాజధర్మములం దున్న గ్రంథములో (7.2. మఱియు 3) "కొందఱు బుద్ధిమంతులు తత్త్వవిచారమునందును, కొందఱు రాజకార్యముల యందును మగ్నులై యున్నారు. మఱియు నీ రెండు మార్గములలో నేది మిక్కిలి మాన్యమో విచారించితి మేని ప్రతిమార్గము నంశతః సత్యముగనే యున్నదని చెప్పవలసివచ్చును. అయినను కర్మకంటె యకర్మ మంచిది యనిచెప్పుట తప్పే. * కారణమేమి యనఁగా: ఆ యానంద మయినను కర్మయే యగుటచే సత్యమగు శ్రేయః ప్రాప్తియు, పుష్కలముగ జ్ఞానయుక్తము నీతియుక్తమయిన కర్మయందే యున్న దని చెప్పుటకు నభ్యంతరము లేదు" అని యరిస్టాటల్ నుడివెను. అరిస్టాటల్ రెండు ప్రదేశములందును రెండు భిన్న ప్రకారములుగఁ జెప్పిన విధానములం జూచితిమేని "కర్మ జ్యాయో హ్యకర్మణః" – అకర్మకంటె కర్మ శ్రేష్ఠమైనది (గీ. 3. 8) అని గీతయొక్క స్పష్ట మగు నుపదేశములోని మహిమ వాచకులకుఁ బ్రత్యేకముగ జెప్ప నక్కఱయుండదు. 'అగస్టస్‌కాంటు' అను పేరుగల గతశతాబ్దము నందుఁ బ్రసిద్ధినొందిన ఫ్రెంచిపండితుఁడు తన యాధిభౌతికతత్త్వ జ్ఞానమునందు– "తత్త్వవిచారమునందే మగ్నుఁడయి తన యాయు ష్యమును గడుపుకొనుట శ్రేయస్కరమని చెప్పుట భ్రాంతిమూలక ముగ నున్నది. మఱియు నే తత్త్వజ్ఞుఁడు నీ తీరున తత్త్వవిచారము నందే యావజ్జీవము మగ్నుఁడై తనచే నగునంతవఱకు లోకులకు కల్యాణ మొనర్చుటను వదలుట తనకు ప్రాప్తమగు సాధనములను

* "And it is equally a mistake to place inactivity above action, for happiness is activity, and the actions of the just and wise are the realization of much that is noble". (Aristotle's Politics, trans. by Jowett. Vol. I. p. 212. The italics are ours).

దురుప యుక్తములుగఁ జేయుచున్నాఁడని చెప్పవలయును” అనిచెప్పి యున్నాఁడు. దీనికి విరుద్ధముగ జర్మనుతత్త్వవేత్తయగు 'శోఫెన్ హౌయర్' అనువాఁడు “జగత్తునందున్న సర్వవ్యవహారములు,-విశేషము చెప్పనేల? జీవించుట సైతము దుఃఖమయ మగుటచేఁ దత్త్వజ్ఞానమును సంపాదించి యీ సర్వకర్మలను శక్యమగు నంత శీఘ్రముగ వదలివేయుటయే యీ జగత్తునందు మనుజునకు సత్యమగు కర్తవ్య మని” చెప్పియున్నాడు. కాంటు క్రీ. శ. 1857 సంవత్సరమునను, శోఫెన్‌హౌయర్ క్రీ. శ. 1860 సం॥ నందును మరణమునొందిరి. శోఫెన్‌హౌయర్‌యొక్క మార్గము జర్మనుదేశమునందు హార్టమన్ అనువాఁడు పిదపఁ బ్రచురము జేసెను. స్పెన్సరు, మిల్లు మొదలగు నాంగ్లేయతత్త్వవేత్తల మతము కాంటుమతమువలె నున్నదని చెప్పనక్కఱలేదు; కాని దీని నంతయు దాఁటి కేవల మర్వాచీన యాధిభౌతికపండితుఁడగు నిత్శే యనువాఁడు తన గ్రంథములోఁ గర్మలను వదలివేయు వానిని “మూర్ఖులలో మూర్ఖశిరోమణి” యనుట కంటె నామాంతర మేమియు నిడుటకు సాధ్యములేదని కర్మత్యాగము నందు బహుతీవ్రముగ నుడివెను*.

---

* కర్మయోగము, మఱియు, కర్మత్యాగము (సాంఖ్యము, లేక, సన్న్యాసము) అను రెండు మార్గములకు సలీ అనువాఁడు Pessimism అను తన గ్రంథమునందు అనుక్రమములో Optimism మఱియు Pessimism అను పేరులను పెట్టియున్నాఁడు; కాని తన మతప్రకార మా పేరులు సరిగావు. Pessimism అను శబ్దము “విసుగు, లేక, నిరాశనొందుట” అను ధ్వన్యర్థము నిచ్చుచున్నది; కాని సంసార మనిత్య మని యెఱిఁగి దానిని వదలినవాఁ డెప్పుడు నానందముగల వాఁడై యే యున్నాఁడు. మఱియు నతఁడు సంసారము వదలునప్పుడు సంతోషముతోనే వదలుచున్నాఁడు. కాఁబట్టి వానిని మా మతప్రకారము Pessimist అని చెప్పఁగూడదు. దానికి బదులుగా కర్మయోగమునకు Energism అనియు, సాంఖ్యము, లేక, సన్న్యాసమార్గమునకు Quietism అనియు వింగ్లీషులోఁ బేర్లు పెట్టిన ప్రశస్తముగ నుండును. వైదికధర్మప్రమాణానుసారమున నీ రెండు మార్గముల

ఐరోపాఖండమునందు 'అరిస్టాటల్' కాలము మొదలు నేఁటి పర్యంతము నీరెండు విషయములయం దెట్లు రెండు పక్షములున్నవో యటులే ప్రాచీనకాలము మొదలు నేఁటి పర్యంతము భరతఖండము నందున్న వైదికధర్మములలో నీ విషయమున రెండుమార్గము లొకే తీరున నడుచుచున్నవి (మ.భా.శాం. 349·72). వీనిలో నొక మార్గమును సన్న్యాసమార్గము, సాంఖ్యనిష్ఠ, లేక, కేవలసాంఖ్యము, అనియు జ్ఞానమునందే యెల్లప్పుడు మగ్నుఁడై యుండుటచే జ్ఞాననిష్ఠ యనియుఁ జెప్పుచున్నారు. రెండవదానిని కర్మయోగము, సంక్షేపముగ యోగము, మఱియు పర్యాయముగ కర్మనిష్ఠ యనియు నను చున్నారు. సాంఖ్యయోగశబ్దములచే నను క్రమముగఁ గాపిలసాంఖ్యము, పాతంజలయోగ మను నర్థము లిచ్చో వివక్షితములు కావని పూర్వమున మూఁడవ ప్రకరణమునఁ జెప్పఁబడినది; కాని సన్న్యాస మను శబ్దము సైతము కొంత సందిగ్ధ మగుటచే దానియర్థ మిచ్చో నింతకంటె బాగుగ విచారించుట యావశ్యకము. 'సన్న్యాస' శబ్దముచే వివాహము చేసికొనక, లేక, చేసికొన్నను దారపుత్రాదులను వదలి కావిగుడ్డలను గట్టుకొనుట, లేక, కేవలము చతుర్థాశ్రమమును గైకొనుట యనునదియె యిచ్చోఁ జెప్పఁదగినది కాదు. కారణ మేమి యన: వివాహముఁ జేసికొనక భీష్ముఁ డామరణాంతమును రాజ్యతంత్రమును నడుపుచునే యుండెను. బ్రహ్మచర్యమునం దుండియే యొకే పర్యాయము చతుర్థాశ్రమమును గైకొనిన శ్రీమచ్ఛంకరాచార్యులవారును, మా మహారాష్ట్ర దేశమునందు నామరణాంత బ్రహ్మచారి (గోసావి) యైన శ్రీసమర్థరామదాసుగారును జ్ఞానప్రసారముచే జగ

యందు బ్రహ్మజ్ఞాన మేక విధమైనందున నీ రెంటియందుఁ గలుగు నానందము, లేక, శాంతియు నొకవిధమే. కాబట్టి మే మీ రెండు మార్గములలో నొకటి ఆనందమయము, రెండవది దుఃఖమయము అని కాని, లేక, ఒకటి ఆశావాదియు, రెండవది నిరాశావాదియు నని కాని పేర్కొనము.

దుద్ధారకము లగు కర్మలఁ జేసిరి. జ్ఞానానంతరమున జగత్తునందలి వ్యవహారము లన్నియు కేవలము కర్తవ్యములే యని లోకకల్యాణార్థమై యవి చేయవలయునా?, లేక, యవి మిథ్య యని బొత్తిగ వదలవలయునా? యని ప్రకృతమున విచారించుట ముఖ్యవిషయముగ నున్నది. ఈ వ్యవహారమును జేయువాఁడు కర్మయోగియగును కాని యతఁడు వివాహము చేసికొన్నను సరే, లేకపోయినను సరే, కాషాయవస్త్రములు కట్టుకొనినను సరే, లేకపోయినను సరే; విశేషము చెప్పనేల? ఇట్టి పనులను జేయుటకు వివాహముఁ జేసికొనక పోవుట, కాషాయవస్త్రములు ధరించుట, లేక, పత్తనము వెలుపల విరక్తుఁ డయి యుండుటయే యనేక సమయములయందు విశేష సులభముగ నుండును. కారణ మేమి యన: కుటుంబ భరణ మను వ్యాపారము లేమిచే, తన యొక్క సర్వకాల పరిశ్రమమును, లోక కార్యమునకై వినియోగించుటకు నడ్డేమియు నుండదు. ఇట్టి పురుషుఁడు వేషముచే సన్న్యాసిగ నుండినను, యథార్థముగ నతఁడు కర్మయోగియే యగును. అయినను దీనికి విరోధముగ, అనఁగా: జగత్తునందలి సర్వవ్యవహారములను నిస్సారము లని తెలిసికొని వానిని వదలి ఎవరు స్వస్థముగ నుందురో వారిని సన్న్యాసు లనవలయును; కాని వారు ప్రత్యక్షముగ చతుర్థాశ్రమమును గైకొనినను సరే, లేక పోయినను సరే, మొద లుండిన నుండవచ్చును. కావున గీతయొక్క కటాక్షము, కావివస్త్రముల యందుఁగాని, ధవళవస్త్రముల యందుఁ గాని, లేక, వివాహమాడి యుండుటలో గాని, లేక, బ్రహ్మచర్యమున నుండుటలో గాని లేదు. జ్ఞాని జగద్వ్యవహారములు జేయునా? లేదా? యను నొకే విషయము మనంబున నిడుకొని సన్న్యాసము, కర్మయోగ మను రెండు మార్గములకు గీతయందు భేదముఁ జెప్పఁబడినది యని సారాంశము. మిగిలిన విషయము గీతాధర్మములందు మహత్త్వముఁ గలదియుఁ గాదు. సన్న్యాసము, లేక, చతుర్థాశ్రమ మను నీ రెండు శబ్దములకంటెను కర్మసన్న్యాసము, లేక, కర్మత్యాగము

నను శబ్దములు ప్రకృతస్థలమునం దధికముగ నన్వర్థములు, నిస్సం దిగ్ధములుగ నున్నవి; కాని యీ రెంటికంటెను కేవలము సన్న్యాస మను నొక శబ్దమే యోజించుట యధికముగ ప్రచారములో నుండు టచే వానికి పారిభాషికార్థ మిచ్చుట స్పష్టముగఁ జెప్పఁబడినది. జగ ద్వ్యవహారము నిస్సార మని తోఁచువారు సంసారముననుండి నివృత్తు లగుచున్నారు. మఱియు నరణ్యమున కేఁగి స్మృతిధర్మానుసారముగ చతుర్థాశ్రమమును గైకొనుచున్నారు. కావునఁ గర్మత్యాగ మను నీ మార్గమును సన్న్యాసమని చెప్పుదురు; కాని దాని యందున్న ప్రధాన భాగము కర్మత్యాగ మయి యున్నది. కాషాయవస్త్రములు ప్రధాన ములు గావు.

పూర్ణమగుజ్ఞానము కలిగినపిదపఁ గర్మలను జేయవలయునా? (కర్మయోగము), లేక, వదలవలయునా! (కర్మసన్న్యాసము), అను నీ రెండుపక్షము లే తీరున ప్రచారములో నుండినను దుదకు మోక్షము నొందుటకు నీ రెండుమార్గములు స్వతంత్రములుగనే యనఁగాఁ నొకే రీతిగ సమర్థములై యున్నవి. లేక, కర్మయోగమనునది పూర్వాంగ మనఁగా మొదటి మెట్టగుటచేఁ దుదకు మోక్షప్రాప్తికొఱకు కర్మలను వదలి సన్న్యాసమునే కైకొనవలయు ననువిషయము గీతయొక్క సాంప్రదాయిక టీకాకారులచేఁ జెప్పఁబడినది. గీతయొక్క రెండవ మూఁడవ యధ్యాయములలో నీ రెండు మార్గములు స్వతంత్రములుగ వర్ణింపఁబడినటుల గాన్పించుచున్నది. కాని యెప్పుడైనను సన్న్యా సాశ్రమమును స్వీకరించి సర్వసాంసారిక కర్మలను వదలినఁ గాని మోక్షము లభింప దని యెవరిమతమై యున్నదో మఱియు 'నా యభి ప్రాయమే గీతయందు ప్రతిపాద్యము కావలయు' నను బుద్ధితో గీతలపై టీకను రచియించుటకై యెవరు ప్రవర్తించిరో— అట్టి టీకా కారులు "కర్మయోగ మనునది స్వతంత్రముగ మోక్షప్రాప్తియైనను కానేరదు. తొలుత చిత్తశుద్ధ్యర్థమై కర్మల నొనర్చి తుదకు సన్న్యాస

మును గైకొనవలయును. సన్న్యాస మనునదియె తుది (అనఁగా: ముఖ్యమగు) నిష్ఠగ నున్నది" యని గీతలకుఁ దాత్పర్యమని చెప్పుచున్నారు; కాని యీ యర్థమును స్వీకరింతుమేని, సాంఖ్యము (సన్న్యాసము), యోగము (కర్మయోగము) అనునవి, ఈ జగత్తులో ద్వివిధ మగు నిష్ఠలుగ నున్నవి (గీ. 3. 3) యని భగవానుఁడు చెప్పినదానియందున్న 'ద్వివిధ' మన్నపదమునకు స్వారస్య మేమియు నుండదు. కర్మయోగశబ్దమునకు మూఁడర్థములు సేయ వచ్చును. 1. జ్ఞానము కలిగినను లేకపోయినను, యజ్ఞయాగాది చాతుర్వర్ణ్యసంబంధములైనవిగాని, లేక, శ్రౌతస్మార్తసంబంధమయి నవి గాని, యగు కర్మలను జేయుచునే మోక్షమును సంపాదించు కొనుచున్నాఁడని మొదటి యర్థము; కాని యీ మీమాంసకుల పక్షము గీతలకు మాన్యము కానేరదు (గీ. 2.45). 2. చిత్తశుద్ధి కొఱకే కర్మలను జేయుట యనునది రెండవయర్థముగ నున్నది. ఈ యర్థముచేఁ గర్మయోగ మనునది సన్న్యాసమార్గముయొక్క పూర్వాంగము,' లేక, మొదటిసాధన మగును; కాని గీతలయందు వర్ణింపఁబడిన కర్మయోగ మిదికాదు. 3. తనయాత్మయొక్క కల్యాణ మెట్టు లగునని యెఱుఁగుజ్ఞాని యుద్ధము మొదలుగాఁగల స్వధర్మోక్త ములగు సాంసారికకర్మముల నామరణాంత మొనర్పవలయునా? అక్కఱ లేదా? యనునదియే గీతలయందు ముఖ్యవిషయ మగుటచే జ్ఞానియును చాతుర్వర్ణ్యముయొక్క కర్మములను నిష్కామబుద్ధిచే నొనర్చియే తీరవలయును (గీ. 3.25) అని గీతలయందున్న కర్మ యోగశబ్దమున కర్థము; మఱియు నది సన్న్యాసమార్గమునకుఁ బూర్వాంగ మెప్పుడును కానేరదు. కారణ మేమియన: ఈ మార్గమునఁ గర్మ లెప్పుడును వదలకూడనివి. విషయము ముఖ్యముగ మోక్ష ప్రాప్తిని సంబంధించినదియే యై యున్నది; కాని జ్ఞానము ప్రాప్త మగుటచే నిష్కామకర్మలు బంధకములు గానందున సన్న్యాసముచే నే మోక్షప్రాప్తి యగునో యదియె యీ కర్మయోగముచేతను ప్రాప్త

మగును (గీ. ౫.౫) అని గీతలలో స్పష్టముగఁ జెప్పఁబడినది. కావున గీతలలోఁ జెప్పఁబడినకర్మమార్గము సన్న్యాసమార్గమునకు పూర్వాంగము గామిచే జ్ఞానోత్తరములగు నీ రెండుమార్గములును, మోక్షదృష్టిచే స్వతంత్రములు (అనఁగా: తుల్యబలములు) గ నున్నవి. (గీ. ౫.౭) ఇట్లే "లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా' (గీ. ౩.౩) అను నీ గీతావాక్యార్థమును గైకొనవలయును. మఱియు నీ హేతువుచేతనే ముందున్న చరణములో "జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్" అని యీ రెండు మార్గములను భగవంతుఁడు వేర్వేఱుగ విడఁదీసి చూపెను. ముందు పదుమూఁడవ యధ్యాయములో "అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే" అను శ్లోకము నందలి 'అన్యే' (కొందఱు), 'అపరే' (ఇతరులు) అను రెండు పదము లీ రెండుమార్గములును స్వతంత్రములుగ నంగీకరించిననే తప్ప యన్వర్థకములు గావు (గీ. 13.24). మఱియు నే నారాయణీయమునందున్న ప్రవృత్తిమార్గము (యోగము) గీతలయందును బ్రతిపాదింపఁబడినదో మహాభారతమునందు పిదప వ్రాయఁబడిన య ద్దానియొక్క యితిహాసమును జూచినసైత మీసిద్ధాంతమే దృఢమగును. సృష్ట్యారంభమున భగవంతుఁడు హిరణ్యగర్భుని (బ్రహ్మదేవుని) సృష్టినుత్పన్నముఁ జేయుమని యాజ్ఞ నొసంగఁగా నతనియందుండి మరీచ్యాది సప్తమానసపుత్రులు పుట్టి, వారు సృష్టిక్రమమును బాగుగ నారంభించుటకు యోగమును అనఁగా: కర్మమయ మగు ప్రవృత్తిమార్గము నవలంబించిరి; మఱియు సనత్కుమారుఁడు, కపిలుఁడు మొదలగు నితరులగు నేడ్గురు బ్రహ్మమానస పుత్రులు పుట్టిన వెంటనే నివృత్తిమార్గము, అనఁగా: సాంఖ్యము నవలంబించి రని యీ రెండుమార్గములకు నుపపత్తిఁ జెప్పుటచే నీ రెండుమార్గములు మోక్షదృష్టిచే తుల్యబలములు, అనఁగా, వాసుదేవస్వరూపమగు నొకే పరమేశ్వరునియొక్క ప్రాప్తిని గలుగఁ జేయునవియై, వేర్వేఱుగను, స్వతంత్రములుగ నున్నవని ముందు స్పష్టముగఁ జెప్పఁబడినది (మ. భా. శాం. 348. 74; 349.

63-73). అటులే యోగమునకుఁ (అనఁగా: ప్రవృత్తి మార్గమునకు) ప్రవర్తకుఁడు హిరణ్యగర్భుఁడనియు, సాంఖ్యమార్గమునకు మూల ప్రవర్తకుఁడు గపిలుఁడనియు, భేదముగాఁ జెప్పఁబడినది. హిరణ్య గర్భుఁడు ముందు కర్మలను వదలినాఁడని యెక్కడను జెప్పఁబడ లేదు. దీనికి విరుద్ధముగ, సృష్టివ్యవహారము సరళముగ నడుచు నిమిత్తమై భగవంతుఁడే కర్మరూపమగు యజ్ఞచక్రము నుత్పన్నముఁ జేసి, దానిని సంతతము ననుష్ఠానములో నుంచుఁడని వారికిని, ఇతర దేవతలకు నుపదేశించెనని వర్ణింపఁబడినది (మ.భా.శాం. 340.44-75 మఱియు 339.66,67 చూడు). దీనివలన సాంఖ్యమును, యోగ మును నను రెండు మార్గములును తొలుత నుండియు స్వతంత్రములు గనే యున్నవని నిర్వివాదముగ సిద్ధ మగుచున్నది. గీతలయందున్న సాంప్రదాయిక టీకాకారులు కర్మయోగమార్గమునకు గౌణత్వ మీయవలయునని చేసిన ప్రయత్నము లన్నియు బొత్తిగ సాంప్ర దాయికాగ్రహముయొక్క పరిణామమే. కర్మయోగ మనునది జ్ఞాన ప్రాప్తి కైనను, లేక, సన్న్యాసమునకు నైనను, బొత్తిగ సాధనమగును అని యీ టీకాకారులచే సైతము వారిటీకలలో నచ్చటచ్చట చేయఁ బడియున్న సూచన లన్నియు వారిచే కల్పింపఁబడినవియే యనియు గీతకు సత్యమగు భావార్థ మటులు కానేర దనియు నిందువలన స్పష్ట మగును. గీతలలోని సన్న్యాసమార్గమునకు టీకలయందున్న ముఖ్య దోష మిదియే యని మా యభిప్రాయము. మఱియు టీకాకారుల యొక్క యీ సాంప్రదాయికాగ్రహము దాఁటిననేతప్ప గీతలయొక్క సత్యమగు రహస్య మెప్పుడును బోధపడుట శక్యము కానేరదు.

"కర్మసన్న్యాస-కర్మయోగము లను నీ రెండును స్వతంత్ర రీతిగ సమానముగనె మోక్షప్రదములయి యున్నవి. వీనిలో నొకటి, రెండవ దానికిఁ బూర్వాంగము కానేరదు" అని నిశ్చయించినను వానిచే సర్వవిషయములు సిద్ధింపవు. కారణమేమి యన: రెండు

మార్గములు సమానముగనే మోక్షప్రదము లగును. వానిలో మన కిష్టమగు మార్గము మన మవలంబింప వలయు నని సిద్ధ మగును; మఱియు నర్జునుఁడు యుద్ధమునే చేయవలయు నని సిద్ధపడక పోవుటచే, భగవంతుని యుపదేశముచేఁ బరమేశ్వరజ్ఞానము గలిగినను నతఁడు స్వాభిరుచి ననుసరించి, యుద్ధమునైనను జేయును, లేక, సన్న్యాసమునైనం గైకొను నని రెండు పక్షములు సంభవించు చున్నవి. కావున "ఈ రెండుమార్గములలోను, మిక్కిలి ప్రశస్తమైన దేదియో యా యొకేమార్గమును నిశ్చయించి నాకుఁ జెప్పుము" (గీ. 5.1) అని తానట్లు ప్రవర్తించుట మేలని తోఁచుటచే నర్జునుఁ డీ విషయము నడిగెను. గీతయొక్క యయిదవ యధ్యాయము ప్రారంభమున నర్జునుఁ డీ విధమున నడిగిన పిదప, వెంటనె భగవంతుఁడు, "సన్న్యాసము, కర్మయోగము నను నీ రెండు మార్గములు నిశ్శ్రేయసము (మోక్షము) నిచ్చునవి, లేక, మోక్షవిషయమున సమాన యోగ్యత గలవియే యయిన నీ రెంటిలో కర్మయోగముయొక్క మహిమము, లేక, యోగ్యత గొప్పదిగ నున్నది (విశిష్యతే)" యని యర్జునునకు (గీ. 5. 2) స్పష్టమగు నుత్తర మిచ్చెను. మఱియు నీ శ్లోకమునే యా ప్రకరణారంభమున నేను వ్రాసియున్నాను. కర్మయోగముయొక్క శ్రేష్ఠత విషయమై గీతలలో నీ శ్లోక మొకటియే యున్నదని కాదు. "తస్మాద్యోగాయ యుజ్యస్వ"—కావున నీవు కర్మయోగమునే స్వీకరింపుము"(గీ. 2.50) "మాతే సంగోఽస్త్వ కర్మణి" — కర్మను జేయకూడదని పట్టుపట్టకుము (2.47).

> యస్త్వింద్రియాణి మనసా నియ మ్యారభతేఽర్జున,
> కర్మేంద్రియైః కర్మయోగ మసక్తః స విశిష్యతే.
>
> (గీ. 3.7)

— కర్మలను వదలుట యను పట్టు పట్టక ఇంద్రియములను మనస్సుచే నిరోధించి యనాసక్తబుద్ధితోఁ గర్మేంద్రియములచేఁ గర్మ

లను జేయుట యనుయోగ్యత 'విశిష్యతే', అనఁగా మిక్కిలి విశేషమై యున్నది"; కారణ మేమి యన: ఎప్పుడైనను "కర్మ జ్యాయో హ్యకర్మణః"- అకర్మకంటె కర్మ శ్రేష్ఠము (గీ. 3 8). "కావున నీవు కర్మను జేయుము" (గీ. 4 15); లేక, "యోగమాతిష్ఠోత్తిష్ఠ" - కర్మయోగమును స్వీకరించి యుద్ధమునకుఁ బూనుము. (నిలువఁబడుము) (గీ. 4.42); "(యోగీ) జ్ఞానిభ్యోఽపి మతోఽధికః" - జ్ఞానమార్గీయముకంటె (సన్న్యాసమునకంటె) కర్మయోగము యొక్క యోగ్యత అధికమైనది. "తస్మాద్యోగీ భవార్జున"- కావున నో యర్జునా! నీవు (కర్మ) యోగివి కమ్ము (గీ. 6. 46); మఱియు "మా మనుస్మర యుద్ధ్యచ"- నన్ను స్మరించి యుద్ధముఁ జేయుము (గీ. 8. 7) మొదలగునవి యర్జునునకు గీతలయం దా యా స్థలముల యం దుపదేశింపఁబడినవి; దానియందును గర్మయోగము సన్న్యాసముకంటెను, లేక, అకర్మకంటె నధిక యోగ్యత గలది యని నిరూపించుటకు 'జ్యాయః', 'అధికః', 'విశిష్యతే', యని స్పష్టమగుపదము లున్నవి. మఱియు పదునెనిమిదవ యధ్యాయమునం దున్న యుపసంహారమునందును "నియతమగు కర్మను వదలుట యోగ్యము కామిచే నాసక్తివిరహితుఁడ వయి సర్వకర్మల నెల్లప్పుడుఁ జేయుచుండవలయును. ఇదే నాయొక్క నిశ్చితము- ఉత్తమము నగు మతముగ నున్నది" యని భగవంతుఁడు మరల చెప్పినాఁడు (గీ. 18. 6, 7). దీనివలన సన్న్యాసమార్గముకంటె కర్మయోగమే గీతలయందు శ్రేష్ఠముగ నిశ్చయింపఁబడినటుల నిర్వివాదముగ సిద్ధ మగుచున్నది.

కాని "సన్న్యాసము, లేక, భక్తి యనునదియె తుదయందలి శ్రేష్ఠమగు కర్తవ్యము అగుటచేఁ గర్మయందు నది కేవలము చిత్తశుద్ధికే కారణమగును. ముఖ్యమగు సాధ్యము, లేక, కర్తవ్యము కానేర" దని యేరికి సాంప్రదాయికమతముగ నున్నదో, వారికి గీతల

యొక్క యీ సిద్ధాంత మెటులు రుచించును? సన్న్యాసమార్గమున కంటె గీతలయందుఁ గర్మయోగమునకు స్పష్టముగ నధికమహిమ చెప్పఁబడిన దను నీ విషయము వారి లక్ష్యములోనికి రానిది కాదు; కాని యిది సత్యమని యంగీకరించిన, తమ సంప్రదాయముయొక్క యోగ్యతకు న్యూనత యగునని స్పష్ట మగుచున్నది. కావున పంచ మాధ్యాయారంభమున నర్జునుని ప్రశ్నయు నందులకు భగవంతుని యుత్తర మను నీ రెండును సరళములు సయుక్తికములు స్పష్టార్థము లయినను వాని మార్గము నెట్లు చూపవలయునను విషయములో సాంప్రదాయిక టీకాకారులకు బహుక్లేశము సంభవించినది. కారణ మేమి యన: సన్న్యాసము కర్మయోగ మను నీ రెండు మార్గములును స్వతంత్రము లని యంగీకరించిననే తప్ప యీ రెంటిలో నే మార్గము శ్రేష్ఠ మను ప్రశ్నయే వెలువడదు. మఱియు టీకాకారులు వక్కాణించి నటుల కర్మయోగము జ్ఞానమునకుఁ బూర్వాంగ మైనయెడల పూర్వాంగము గౌణ మనియు, జ్ఞానము, లేక, సన్న్యాసము శ్రేష్ఠ మనియుఁ జెప్పనక్కఱ లేకయే సిద్ధమగుచున్నది. మఱియు నూతన ప్రశ్నము విచారించుటకుఁ గారణ మేమియు నుండదు. కావున ప్రశ్న తగినదని యంగీకరింతు మేని యీ రెండు మార్గములు స్వతంత్రములుగ నున్నవని యంగీకరింప వలసివచ్చును; మఱియు నటులే యంగీకరింతు మేని తమ సంప్రదాయమే ముఖ్యమగు మోక్షమార్గ మని చెప్పుటకు విరోధము వచ్చును. ఈ విషయమై యర్జునుని ప్రశ్నయే బాగుగ నుండలేదని సూచించి, భగవంతుని యుత్తరముయొక్క తాత్పర్యము సైతము నటులే యున్న దని సూచించుటకయి యీ టీకాకారులు నిశ్చయించియున్నారు. కాని యింత యాటోపముఁ జేసినను, "కర్మయోగముయొక్క యోగ్యత, లేక, మహత్త్వము విశేషము" (గీ. ౫. 2) అను భగవంతుని యీ స్పష్టమగు నుత్తరముయొక్క వ్యాఖ్య యిప్పటికిని కుదురనే కుదురదు. కావున తుదకు "కర్మయోగో విశి

ష్యతే"_ కర్మయోగముయొక్క మహత్త్వ మధికము_ ఈ వచనము కర్మయోగిని కేవలము స్తుతిఁ జేయు నిమిత్తమై, అనఁగా: అర్థవాదాత్మక మగుటచే భగవంతుని మతమునందును సన్న్యాసమార్గము శ్రేష్ఠముగనే యున్న దని పూర్వాపరసందర్భ విరుద్ధముగఁ దమ మనస్సు చేతనే రెండవ కల్పనఁ జేసి యీ టీకాకారు లెటు లైనను తాము సమాధానమును జేసికొనుటకుఁ బ్రారంభించిరి (గీ.శాం.భాం. 5.2; 6. 1, 2; 18. 11 చూడు). శాంకరభాష్యమునందే కాక రామానుజ భాష్యమునందు సైతము ఈ శ్లోకము కర్మయోగమును బ్రశంసించు చున్నది. అనఁగా: అర్థవాదాత్మకమే యని యంగీకరింపఁ బడినది (గీ. రా. భా. 5. 1). కారణ మేమి యన: రామానుజాచార్యులవా రద్వైతి కాకపోయినను, వారి మతమున భక్తి యనునది ముఖ్య సాధ్య మగుటచేఁ గర్మయోగ మనునది జ్ఞానయుక్త మగు భక్తికి సాధనముగనే స్థిరపడుచున్నది (గీ.రా.భా. 3.1 చూడు). మూలగ్రంథము యొక్కయు, టీకాకారుల యొక్కయు సంప్రదాయములు వేర్వేఱగుటచే నీ టీకాకారులు దమ మార్గములే మూలగ్రంథమునందు వర్ణింపఁ బడినవి యను దృఢజ్ఞానముచే నాగ్రంథముపై టీక యొనర్చుటకుఁ బ్రారంభించి రేని మూలగ్రంథ మెట్లు తలక్రిం దగు నను విషయ మిందువలన వాచకు లెఱుంగఁ గలరు. "అర్జునా! నీ ప్రశ్నము మంచిది గాదు", అని శ్రీకృష్ణునకును, లేక, వేదవ్యాసులకును, సంస్కృతమున స్పష్టశబ్దములతోఁ జెప్పుటకు రానేరదు కాఁబోలు! కాని యట్లు సేయక "కర్మయోగమే విశేష యోగ్యత గల" దని యనేక స్థలములలో స్పష్టముగఁ జెప్పియుండుటచే సంప్రదాయరీతిగ టీకాకారులు సేసిన పూర్వోక్తార్థము సరళముగ లేదని చెప్పవలసివచ్చును; మఱియుఁ బూర్వాపరసందర్భముఁ జూచితిమేని యీ యనుమానము (అనుమితి=ఊహ) దృఢ మగును. కారణ మేమియన: గీతలయందే జ్ఞాని కర్మసన్న్యాసమును చేయక, జ్ఞానము గలిగిన పిదప సైత మనా

సక్తబుద్ధిచేఁ దన సర్వవ్యవహారములను జేయుచున్నాఁ డని యనేక స్థలములలో వర్ణింపఁబడినది (గీ. 2.64; 3 19; 3.25; 18.9 చూడు). జ్ఞానముచేతను మోక్షము సిద్ధించునా? యను విషయ మీ స్థలమున శంకకుఁ దెచ్చుకొని, కేవల జ్ఞానముచేతనే సర్వకర్మములును దగ్ధమగుటచే మోక్షప్రాప్తి యగును; మోక్షప్రాప్తికిఁ గర్మావశ్యకత లేదు అని గీతార్థమును శ్రీశంకరాచార్యులవారు తమ భాష్యమునందు మొదట వ్రాసినారు. మఱియు నిందుండి "ఏ హేతువుచే గీతా తాత్పర్యముం బట్టి మోక్షమునకుఁ గర్మయొక్క యావశ్యకత లేదో, యా హేతువుచేతనే చిత్తము శుద్ధమగు నెడలఁ గర్మలు నిరర్థకములగును. మఱియు నవి స్వభావముచేతనే బంధకములు (అనఁగా: జ్ఞానమునకు విరుద్ధములు) అగుటచే, జ్ఞానప్రాప్తియైన పిదప, జ్ఞాని వానిని వదలవలయును నను నిదే మతము భగవంతునకు గీతలయందు గ్రాహ్యమని చెప్పవచ్చును" అని యూహింపఁబడినది. జ్ఞానప్రాప్తియైన పిదప జ్ఞానియుఁ గర్మలను జేయుచునే యుండవలయునను పక్షమునకే 'జ్ఞానకర్మ సముచ్చయపక్ష' మని నామ మగుటచే శ్రీశంకరాచార్యులచేఁ పైఁ జెప్పఁబడిన యుక్తివాద మంతయుఁ దద్విరుద్ధమగు ముఖ్యాక్షేపణగా నున్నది. ఈ యుక్తివాదము మధ్వాచార్యులవారిచే సైతము స్వీకరింపఁబడినది (గీ. మా. భా. 3.31 చూడు). కాని యీ యుక్తివాదము మాకు సమాధానకారకముగను, నిరుత్తరముగను లేదు. కారణమేమియన: 1. కామ్యకర్మలు బంధకములగుటచే జ్ఞానవిరుద్ధము లయినను, అట్టి న్యాయము నిష్కామకర్మలకు సంబంధింపదు. మఱియు 2. జ్ఞానప్రాప్తియైన పిదప మోక్షమునకుఁ కర్మలక్కఱలేక పోయినను వేఱొక బలవత్తరమగు కారణముచే, జ్ఞాని జ్ఞానసహితుఁడై నిష్కామకర్మలను జేయుట యావశ్యక మని సిద్ధించుటకు నా వాదముచే బాధ యేమియు రానేరదు. ముముక్షువులకు చిత్తశుద్ధిని గలుగఁజేయుటయే యీ జగత్తున కర్మయొక్క ముఖ్యమగు నుపయోగముగ నున్నది; లేక, యిందుకే కర్మ లుత్పన్నము

లయినవి యని నుడువరాదు. కావున, మోక్షమునకేకాక, కారణాంతరమునకు స్వధర్మానుసారముగ ప్రాప్తములగు కర్మ సృష్టియందున్న నిఖిల వ్యవహారములను, జ్ఞానిసైతము నిష్కామబుద్ధిచేఁ జేయుట యావశ్యక మని చెప్పవచ్చును. ఈ కారణము లెవ్వియో ముందీ ప్రకరణమున సవిస్తరముగ విచారింపఁబడినవి. ప్రస్తుతమందు చెప్పున దేమనఁగా: సన్న్యసముం గైకొనుటకు సిద్ధమైన యర్జునునకు నీ కారణములను చెప్పుటకొఱకే గీతాశాస్త్ర ముపదేశింపఁబడినది యగుటచే చిత్తశుద్ధ్యనంతరమున మోక్షమునకుఁ గర్మయొక్క యావశ్యకత లేదను నట్టి యుక్తివాదముచే గీతలయందు సన్న్యసమార్గమే ప్రతిపాద్యముగ నున్నది యని యనుమానించుటకు (అనుమితికి-ఊహకు) సాధ్యము గాదు. జ్ఞానప్రాప్తి యయిన పిదప సన్న్యసాశ్రమముఁ గైకొని కర్మలను వదలనే వలయునని శాంకరసంప్రదాయముయొక్క మతమై యున్నది. నిజమే కాని యంతమాత్రముచే "గీతయొక్క తాత్పర్యము సైత మిదియే యై యుండవలయును, లేక, శాంకరము, అదియును గాక మఱి యేదైనను సంప్రదాయ మనునదియే ధర్మ" మని మొదట పట్టువట్టి తదనుకూలమగు నిట్టి రీతినే యెట్లులైనను గీతార్థము సమన్వయించుకొన వలయునని చెప్పుట యుక్తము. జ్ఞానోత్పత్తి యైన పిదపను; సన్న్యసమార్గము నవలంబించుటకంటె కర్మయోగము నవలంబించుట యనునది యుత్తమపక్షముగ నున్నది అని గీతలయొక్క స్థిరమగు సిద్ధాంతముగ నున్నది. దానిని నీవు వేఱుసంప్రదాయ మనినను సరే, లేక, వేఱుగ పేరిడినను సరే, కాని, గీతలకుఁ గర్మయోగమే శ్రేష్ఠ మని యంగీకార్యము. అయినను, సన్న్యసమార్గము బొత్తిగ వదల వలయునని గీతలకు నితర మతములను సహింపని సంప్రదాయానుసారి యగు నాగ్రహము లేకపోవుటచే సన్న్యసమార్గ విషయమై గీతలయం దెచ్చట ననాదరబుద్ధి చూపఁబడలేదు అను విషయమును బాగుగ గుర్తుంచుకొనవలయును.

విపరీతముగ "సన్న్యాసము, కర్మయోగము నను రెండు మార్గములు సమానముగనే నిశ్శ్రేయసకరములు, అనఁగా మోక్షప్రదములు, లేక, మోక్షదృష్టిచే సమానమైన మూల్యము కలవియె" యని భగవంతుఁడు స్పష్టముగఁ జెప్పినాఁడు. మఱియు ముందు "ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి" _ఈ రెండు మార్గము లొకటియే అనఁగా తుల్యబలము గలవిగనే యున్నవి యని యే రెఱుంగుదురో వారే నిజమగు తత్త్వము నెఱింగినవారు (గీ. 5. 5), లేక, కర్మయోగమైనను దానియందు ఫలాశయొక్క సన్న్యాసము చేయవలసి వచ్చును. "న హ్యసంన్యస్త సంకల్పో యోగీ భవతి కశ్చన" (గీ. 6. 2). ఇటు లీ ప్రత్యేకమగు మార్గములకు యుక్తిచేత శక్యమయినంతవఱకే యేకవాక్యత చేసి చూపింపఁబడినది. కాని జ్ఞానప్రాప్తి యయిన పిదప (తొలుత లేకపోయినను) కర్మసన్న్యాసమును జేయుట, లేక, కర్మయోగమును స్వీకరించుట యను నీ రెండు మార్గములు మోక్షదృష్టిచే సమాన మయిన యోగ్యత గలవియే యైనను లోకవ్యవహారదృష్టిచే విచారించుచున్నప్పుడు సన్న్యాసము బుద్ధియందుంచుకొని, అనఁగా బుద్ధిని నిష్కామముగఁ జేసి, దేహేంద్రియముల ద్వారా లోకసంగ్రహ కారకమగు కర్మ నా మరణాంతముఁ జేయుచునే యుండవలయును. ఈ మార్గమే యన్నింటియందు శ్రేష్ఠమైనది. కారణ మేమి యనఁగా: సన్న్యాసము, కర్మ యను నీ రెండును మోక్షకారణములే యని భగవంతుఁడు నిశ్చయముగ నుపదేశించుటచే అదేరీతిని పిదప నర్జునుఁడు యుద్ధమునకుఁ బ్రవర్తించెను. జ్ఞానికిని అజ్ఞానికి నుండు తారతమ్య మిదియే. కేవల శారీరకమగు అనఁగా: ఇంద్రియములద్వారా సంఘటిల్లు కర్మను జూచితి మేని యది జ్ఞానికి యజ్ఞానికిని నొక్కటియేయై యుండును; కాని యజ్ఞాని దాని నాసక్త బుద్ధిచేతను, జ్ఞాని యనాసక్తబుద్ధిచేతను జేయుచున్నారు (గీ. 3. 25). గీతయొక్క యీ సిద్ధాంతమే_

**ప్రాజ్ఞస్య మూర్ఖస్య చ కార్యయోగే**
**సమత్వ మభ్యేతి తను ర్న బుద్ధిః**

**(అవిమార. ౫. ౫)**

– జ్ఞానికిని మూర్ఖునకును కర్మలు సంఘటిల్లునేని దేహ మొక్కరీతిగనే యుండును. బుద్ధిమాత్రము వేఱుగ నుండును అని భాసకవి తన నాటకములో వర్ణించినాఁడు.

సన్న్యాసమార్గావలంబు లగు కొంద ఱేకదేశీయులు "గీతల యం దర్జునునకుఁ గర్మలు చేయుమని యుపదేశించినది నిజమే; కాని యర్జునుఁ డజ్ఞాని యగుటచే చిత్తశుద్ధికారకములగు కర్మలనుజేయుట లోనే యతనికి నధికార మున్నదని మనంబున నుంచుకొని, భగవం తుఁ డీ విషయమును నుపదేశించెను" అని చెప్పుదురు. సిద్ధావస్థ యందుఁ గర్మత్యాగమే శ్రేష్ఠమని భగవంతునకు సమ్మతి. అటు లగు నేని యర్జునునకు "నీ వజ్ఞానివిగ నున్నావు" అని చెప్పుచుండఁగా, కఠోపనిషత్తునందు నచికేతుఁ డే రీతిని పూర్ణమగు జ్ఞానప్రాప్తి కావల యునని పట్టుపట్టెనో యటులనే యర్జునుఁడు సైతము పట్టుపట్టును. మఱియు నతనికిఁ బూర్ణజ్ఞానము నుపదేశింపవలసివచ్చును. మఱియు నటులు పూర్ణజ్ఞానము నుపదేశించిన యెడల, యుద్ధమును వదలి సన్న్యాసముఁ గైకొనును. దానిచే యుద్ధముయొక్క తన విధానము చెడిపోవును. ఈ భీతిచేఁ దన యత్యంతప్రియభక్తుని మోసగించుటకు శ్రీకృష్ణుఁడు గీతల నుపదేశించెనని యర్థ మగును. మఱియుఁ గేవ లము తన సంప్రదాయమును సమర్థించుకొనుటకు భగవంతుని మీఁద నత్యంత ప్రియభక్తుని మోసపుచ్చె నను నిందమోపుట కెవరుప్రవృత్తు లయ్యెదరో యట్టివారితో నెట్టివాదముఁ జేయక మౌనముతోనుండుట శ్రేయస్కరము. "నీ వజ్ఞానివి కావునఁ గర్మను జేయుము" అని యర్జునునకు స్పష్టములగు శబ్దములచేఁ జెప్పుటకు భగవంతున కే విధమయిన భీతియు నుండుటకు కారణము లేనందుననే, సామాన్య

జనులు దమయొక్క భ్రామకమగు యుక్తివాదముచే మోసపోఁ గూడదనియే యీ విషయమును జెప్పుచున్నాము. మఱియు నిందుల కర్జునుఁ డే యాటంకమునైనఁ జెప్పెనేని యతనిని అజ్ఞానిగ నిశ్చయించియే యతని చేతనే ప్రకృతిధర్మానుసారముగ యుద్ధముఁ జేయించు సామర్థ్యము శ్రీకృష్ణున కుండెను (గీ. 18.19 మఱియు 59 చూడు). కాని యట్లు చేయక, జ్ఞానవిజ్ఞానములనే పలుమాఱులు చెప్పి (గీ.7.2 9.1; 10.1; 13 2; 14.1). పదునైదవ యధ్యాయము తుద "ఈ శాస్త్రము నెఱుంగుటచే మనుజుఁడు జ్ఞాతయుఁ గృతార్థుఁడు నగును" (గీ. 15.20) అని భగవంతుఁ డర్జునునకుఁ జెప్పినాఁడు. మఱియు నీ రీతిగ నతనిని పూర్ణజ్ఞానిని జేసిన పిదప నతని యిష్టము ననుసరించియే యుద్ధముఁ జేయించెను (గీ. 18. 63). దీనివలన జ్ఞాని, జ్ఞాన ప్రాప్తియైన పిదప సైతము నిష్కామకర్మలను జేయుచుండుట యను పక్షమే సర్వోత్తమ మని, భగవంతుని యభిప్రాయ మయినటుల స్పష్టముగనే సిద్ధమగుచున్నది. ఇంతియె కాక యర్జునుని కేవల మజ్ఞాని యని చెప్పినను, అతనికి భగవంతుఁ డొనర్చిన యుపదేశమును సమర్థించుటకై, భగవంతుఁడు, ఏ జనకాది ప్రాచీన కర్మయోగుల యొక్కయు, పిదప తనయొక్కయు దృష్టాంతముల నిచ్చెనో, యవి యన్నియు నజ్ఞానికే యిచ్చెనని యెప్పుడును చెప్పుటకు సాధ్యము కానేరదు. కావున సాంప్రదాయికుల యాగ్రహముచే (పట్టుదలచే) నగు నీ శుష్కకోటిక్రమము (వాదము) నన్నివిధముల ననుచితము, త్యాజ్యము ననియు, జ్ఞానయుక్తమగు కర్మయోగమే గీతలలో నుపదేశింపఁబడినది యనియు చెప్పుట న్యాయ్యముగ నుండును.

మంచిది. జ్ఞానము కలిగిన పిదప సిద్ధావస్థయందును, కర్మత్యాగము (సాంఖ్యము), కర్మయోగము (యోగము), అను నీ రెండు మార్గములు మన దేశముననే కాక యితర దేశములయందు సైతము పూర్వాపరముగఁ బ్రవర్తించుచు వచ్చుచున్న ట్లింతవఱకు

నిరూపింపఁబడినది. మఱియు 1. ఈ రెండు మార్గములు స్వతంత్ర ములు, తుల్యబలములుగ నున్నవి. ఒకటి రెండవదాని యంగము కానేరదు. 2. వీనిలోఁ గర్మయోగమే మిక్కిలి శ్రేయస్కరమగును,— అని గీతాశాస్త్రముయొక్క యీ విషయసంబంధములో, నే ముఖ్య మగు రెండు సిద్ధాంతము లేవి గలవో, యవి స్పష్టముగ నున్నను, సాంప్రదాయిక టీకాకారులు, వాని నేల? యెట్లు? విపర్యాసముఁ జేసినా రనువిషయమును స్పష్టపఱచుటకై యీప్రస్తావన యంతయుఁ జేయవలసి వచ్చినది. ఇప్పుడు సిద్ధావస్థ యందును గర్మత్యాగముఁ జేయుటకంటె నిష్కామబుద్ధిచే నామరణాంతముఁ గర్మలను జేయుట యనుమార్గమే (కర్మయోగమే) యధికశ్రేయస్కర మని ప్రస్తుత ప్రకరణమందున్న ముఖ్యవిషయమును సిద్ధింపఁజేయుటకు గీతల యందు వ్రాయఁబడిన కారణముల నిరూపించెదము. వీనిలోఁ గొన్ని విషయములు సుఖదుఃఖవివేక ప్రకరణమునందు వర్ణింపఁబడినవి. కాని యీ వివేచనము బొత్తిగ సుఖదుఃఖములను గుఱించియే చేయఁ బడియుండుటచే నక్కడ ని విషయము పూర్ణముగఁ జర్చింపఁబడ లేదు. కావున నీప్రకరణ మిందునకయి స్వతంత్రముగ నారంభింపఁ బడినది. వైదికధర్మములకుఁ గర్మకాండ మనియు, జ్ఞానకాండ మనియు రెండుభాగము లుండుటచే వాని యందుండు భేదము వెనుకటి ప్రకరణమునఁ జెప్పఁబడినది. వానిలోఁ గర్మకాండమందు, అనఁగా: బ్రాహ్మణాది శ్రౌతగ్రంథములయందు, ప్రతిగృహస్థుఁడు-వాఁడు బ్రాహ్మణుఁడైనను, లేకఁ క్షత్రియుఁడైనను— నగ్నిహోత్రముఁ జేయుచు జ్యోతిష్టోమాదియజ్ఞయాగములను దన తన యధికారాను సారముగఁ జేయవలయునని యాజ్ఞ యందుండుటచే, వివాహమాడి ప్రతిమనుజుఁడును వంశవృద్ధిఁ జేయుట సైత మతనికిఁ గర్తవ్య మని స్పష్టముగ వచనము లున్నవి. ఉదాహరణము: "ఏతద్వై జరావర్యే సత్రం య దగ్నిహోత్రమ్"— అగ్నిహోత్రరూప మగు నీ సత్రము

నడిపింపవలయును (శ.బ్రా. 12.4.1.1); "ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః" – వంశవిచ్ఛేదమును జేయకుము (వంశమనుసూత్రముం ద్రెంపకుము)– (తై.ఉ. 1.11.1). లేక, "ఈశావాస్యమిదం సర్వం" – జగత్తునందున్న దంతయుఁ బరమేశ్వరునిచే నధిష్ఠింపఁబడినది. అనఁగా: 'నాది గాదు, అతనిది' యని తెలిసికొన వలయును" మఱియు నీ నిష్కామబుద్ధిచే–

**కుర్వ న్నే వేహ కర్మాణి జిజీవిషే చ్ఛతం సమాః,**
**ఏవంత్వయి నాన్యథేతోఽ స్తి న కర్మ లిప్యతే నరే.**

కర్మలనుజేయుచు నే నూఱువత్సరములు: (అనఁగాఁ బురుషాయుర్దాయము) సమాప్తియగువఱకు బ్రతుకుటకు నిచ్ఛగింపవలయును. 'ఏవం', అనఁగా నీ యీశావాస్యబుద్ధిచేఁ గర్మలను జేసెనేని యా కర్మలయొక్క లేపము(బంధము), నీకు (అనఁగా: పురుషునకు) తగులదు. ఇది తప్ప ఈ లేపము (అనఁగా బంధనము)ఁ దప్పించుకొనుటకు మఱియొక మార్గము లేదు" – (ఈశ 1 మఱియు 2); మొదలగు వచనములు చూడుము. కాని కర్మకాండలో నుండి జ్ఞానకాండలోనికి వచ్చితి మేని "బ్రహ్మవి దాప్నోతి పరం"– బ్రహ్మజ్ఞానముచే మోక్షము లభించును (తై. 2.1). "నాన్యః పంథా విద్యతేఽయనాయ" జ్ఞానముఁ దప్ప మోక్షప్రాప్తికి రెండవమార్గములేదు (శ్వే. 3.8); "పూర్వే విద్వాంసః ప్రజాం న కామయన్తే కిం ప్రజయా కరిష్యామో యేషాం నో ఽయమాత్మాఽయం లోక ఇతి తే హస్మ పుత్త్రైషణాయా శ్చ విత్తైషణాయాశ్చలోకైషణాయాశ్చ వ్యుత్థాయాథ భిక్షాచర్యం చరన్తి."– ప్రాచీను లగు జ్ఞానులకు పుత్త్రాదులయొక్క యిచ్ఛ లేమిచే, నే హేతువుచే సర్వలోకములును మా యాత్మయే యైనవో, యా హేతువుచేతనే మాకు (రెండవది) ప్రజ యేల కావలయును?" అని యిట్లుచెప్పి, సంతతి, సంపత్తి–స్వర్గాది లోకములలో దేనియొక్క యీషణను (అనఁగా: ఇచ్ఛను) నుంచక దానియం

దుండి నివృత్తులైన జ్ఞానులు బొత్తిగ భిక్షాటనముఁ జేయుచుఁ దిరుగుచున్నారు (బృ. 4·4·22 మఱియు 3·5·1); లేక, ఈ రీతిగ విరక్తుఁడయిన పురుషునకు మోక్షము లభించుచున్నది (ముం. 1.2.11), లేక, తుదకు "యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్" — ఏ నిమిషమున బుద్ధికి విరక్తి కలిగెనో యా నిమిషముననే సన్న్యసింపవలయును; (జాబా. 4) ఇట్లు విరుద్ధపక్షము లగు వచనములు వైదిక గ్రంథములలో స్పష్టముగఁ గాన్పించుచున్నవి. ఈ ప్రకారముగ వేదాంతములో ద్వివిధముగ నుండుటచే (మ. భా. శాం. 240.6) ప్రవృత్తి నివృత్తులలో, లేక, కర్మయోగ సాంఖ్యములలో శ్రేష్ఠమగు మార్గ మేది యని నిర్ణయించుటకు, రెండవసాధన మే మయిన నున్నదా? లేదా? యని విచారించుట యావశ్యకము. ఆచార మనఁగా శిష్టుల వ్యవహారము, పరిపాటి, లేక, ఆచరణము. అది యెట్టున్నదో దానినిం జూచి యీ విషయము నిర్ణయించుటకు శక్యమయి యుండును. కాని యీ విషయములో శిష్టాచారము సైతముభయవిధముగ నున్నదని కాన్పించుచున్నది. శుకులు, యాజ్ఞవల్క్యులు మొదలగు వారు సన్న్యాసమార్గమును; జనక, శ్రీకృష్ణ, జైగీషవ్యులు మొదలగు జ్ఞానులు కర్మమార్గము నవలంబించి రనియు నితిహాసములవలన స్పష్టమగును. ఈ యభిప్రాయముచేతనే "తుల్యం తు దర్శనం" — ఆచారదృష్టిచే నీ రెండుమార్గములును దుల్యములుగనే యున్నవి (వే. సూ. 3.4.9) యని సిద్ధాంతపక్షము నందున్న కోటిక్రమములో బాదరాయణాచార్యులవారు చెప్పియుండుటచే—

వివేకీ సర్వదా ముక్తః కుర్వతో నాస్తి కర్తృతా,
అలేపవాద మాశ్రిత్య శ్రీకృష్ణజనకౌ యథా.

పూర్ణముగ బ్రహ్మజ్ఞాని యైనను సర్వకర్మలను జేసియు శ్రీకృష్ణ జనకులవలె నకర్తయు, నలిప్తుఁడును, సర్వదా ముక్తుఁ డుగనే

యున్నాఁడు అని స్మృతివచనమందు సైత మున్నది. * అటులే భగవద్గీతయందు, మనువు, ఇక్ష్వాకువు మొదలగు కర్మయోగుల పరంపరఁ జెప్పిన పిదప "ఏవం జ్ఞాత్వా కృతం కర్మపూర్వైరపి ముముక్షుభిః"– దీని నెఱింగి జనకాది జ్ఞానులు కర్మ నొనర్చిరి (గీ. 4. 15) యని చెప్పఁబడియుండుటచే, జనకుఁడే కాక యీ ప్రకారముగ ననేకులు కర్మ నొనర్చిరి యని యితరోదాహరణములు యోగవాసిష్ఠమునందును భాగవతమందును జెప్పఁబడినవి (యో. 5.75; భాగ. 28.43-45). జనకాదులకు పూర్ణబ్రహ్మజ్ఞానము లేదని ఎవరైనను శంకింపవచ్చును. అయినను వీ రందఱు జీవన్ముక్తులుగనే యున్నారని యోగవాసిష్ఠమునందు స్పష్టముగఁ జెప్పఁబడినది. మఱియు యోగవాసిష్ఠమునందే కాక మహాభారతమునందును వ్యాసులవారు తన పుత్త్రుఁ డగు శుకుని మోక్షధర్మములను బూర్ణముగఁ దెలిసికొనుటకై తుదకుఁ బట్టుదలతో జనకునియొద్ద కంపినటు లున్నది (మ. భా. శా. 325; యో. 2. 1. చూడు). ఈ తీరుననే యుపనిషత్తులయందు నశ్వపతి యను కేకయరాజు ఉద్దాలకఋషికిని (ఛాం. 5.11.24), మఱియు కాశీరాజగు నజాతశత్రువు గార్గ్యుఁడగు బాలాకికిని (బృ. 2.1) బ్రహ్మజ్ఞానమును దెలిపినటుల కథలున్నవి. అటుల నశ్వపతి, లేక, జనకుఁడు రాజ్యారంభము మొదలుకొని కర్మత్యాగరూపసన్న్యాసమును గైకొనినటుల నెక్కడను వర్ణింపఁబడ లేదు. దీనికి విపరీతముగ జనకసులభాసంవాదమున జనకుఁడు "నేను ముక్తసంగుఁడనై యాసక్తి నుంచక రాజ్యముఁ జేయుచున్నాను. మఱియు నాయొకహస్తము గంధముచేఁ బూయఁబడినను, రెండవహస్తము శస్త్రముచే ఖండింపఁ బడినను నాకు సుఖ

* ఈ వచనము స్మృతులలో నున్నదని యానందగిరిస్వామి, కఠోపనిషత్తుపై (2. 19) నున్న శంకరభాష్యటీకయందు వ్రాసియున్నాఁడు. ఈ వచనమే స్మృతియందును మాకుఁ గాన్పింపదు.

దుఃఖములు సమానములుగనే యున్నవి" అని యీ మొదలగు తన స్థితిని వర్ణించి (మ.భా.శాం. 320.36) పిదప సులభతో నిట్లు—

మోక్షే హి త్రివిధా నిష్ఠా దృష్టా ఽన్యై ర్మోక్షవిత్తమైః,
జ్ఞానం లోకోత్తరం యచ్చ సర్వత్యాగశ్చ కర్మణామ్.
జ్ఞాననిష్ఠాం వద న్త్యేకే మోక్షశాస్త్రవిదో జనాః,
కర్మనిష్ఠాం త థై వాన్యే యతయ స్సూక్ష్మదర్శినః.
ప్రహా యోభయ మప్యేవం జ్ఞానం కర్మ చ కేవలమ్,
తృతీయేయం సమాఖ్యాతా నిష్ఠా తేన మహాత్మనా.
(మ.భా.శాం. 320.38)

— మోక్షప్రాప్తికొఱకు మూఁడు విధములగు నిష్ఠలను మోక్షశాస్త్ర వేత్తలు నుడువుచున్నారు. 1. జ్ఞానము సంపాదించి సర్వకర్మలను వదలుట; దీనినే కొందఱు మోక్షశాస్త్రజ్ఞులు జ్ఞాననిష్ఠ యని చెప్పుదురు. 2. అటులే యితరమగు సూక్ష్మదర్శులగు జనులు కర్మనిష్ఠను జెప్పుదురు. కాని, జ్ఞానము, కేవల కర్మ, యను రెండు నిష్ఠలను వదలి 3. యీ మూఁడవదగు (అనఁగా: జ్ఞానముచే నాసక్తిఁ బోఁగొట్టుకొని కర్మనుజేయుట) నిష్ఠయే (నాకు) ఆ మహాత్ములచే (పంచశిఖాచార్యులచే) వక్కాణింపఁబడినది. — నిష్ఠాశబ్దమునకు సామాన్యార్థము కడపటిస్థితి, ఆధారము, లేక, యవస్థ యగును. కాని యీ స్థలమందును, గీతలయందును నిష్ఠాశబ్దమునకు "ఏ విధమయిన యాయుఃక్షేపణముచేఁ దుదకు మోక్షము లభించునో యా యాయుఃక్షేపణముయొక్క మార్గ" మని యర్థము వివక్షిత మగుటచే ఆయుఃక్షేపణ మనఁగా తా నున్నంతవఱకు నాచరించు విధి). గీతలపైనున్న శాంకరభాష్యమునందు సైతము నిష్ఠా=అనుష్ఠేయతాత్పర్యం, అనఁగా: యావజ్జీవ మేది యనుష్ఠేయమో, అనఁగా: ఏది యాచరింపఁ దగినదో, దానియందు తత్పరత, అనఁగా: నిమగ్నుఁడయి యుండుట,

యనియే యర్థమును జేసికొనవలయును. యావజ్జీవము నాచరణీయములగు నీ మార్గములలో జైమిన్యాది మీమాంసకులు జ్ఞానమునకు మహత్త్వము నీయక యజ్ఞాదికర్మలను జేయుట మాత్రముచేతనే మోక్షము లభ్య మగునని నుడివిరి.

ఈజానా బహుభిః యజ్ఞైః బ్రాహ్మణా వేదపారగాః,
శాస్త్రాణి చేత్ప్రమాణం స్యుః ప్రాప్తా స్తే పరమాం గతిమ్.

కారణ మేమి యన: అటు లంగీకరింపకపోయితి మేని శాస్త్రముయొక్క అనఁగా: వేదముయొక్క యాజ్ఞ వ్యర్థ మగునని ప్రతిపాదింపఁ బడినది (జై. సూ. 5. 2. 23 పైన శాబరభాష్యముం జూడుము); మఱియు నుపనిషత్కారులును, బాదరాయణాచార్యుల వారును సర్వయజ్ఞకర్మలను గౌణము లని నిశ్చయించి కేవల జ్ఞానముచే మోక్షప్రాప్తియగుననియు, జ్ఞానముతప్ప మఱి దేనిచే నైనను మోక్షము లభించుట శక్యము కానేర దనియు సిద్ధాంతమును చేసినారు (వే. సూ. 3. 4. 1, 2). కాని యీ రెండు నిష్ఠలు గాక యాసక్తి విరహిత మగు కర్మలను జేయుటయను మూఁడవనిష్ఠ పంచశిఖునిచే (స్వయముగ సాంఖ్యమార్గములో నున్నవాఁడయినను) తనకుఁ జెప్పఁబడినది యని జనకుఁడు వక్కాణించెను. "రెండు నిష్ఠలును గాక" యను వచనమువలన నీ మూఁడవనిష్ఠ పూర్వమునం దయిన రెండునిష్ఠలలో నే నిష్ఠకు నంగము గాదు, అనఁగా స్వతంత్ర ముగనె వర్ణింపఁ బడినటుల స్పష్టముగ నున్నది. వేదాంతసూత్రములలో సైతము (వే. సూ. 3.4.32-35) జనకునిచే గ్రహింపఁబడిన యీ మూఁడవనిష్ఠ నిరూపింపఁబడినది. మఱియు భగవద్గీతయందును జనకునిచే గ్రహింపఁబడిన యీ మూఁడవనిష్ఠయే తుదవఱకు భక్తిని సంబంధింపఁజేసి ప్రతిపాదింపఁబడినది; కాని మీమాంసకులయొక్క కేవలము, అనఁగా జ్ఞానవిరహితమగు, కర్మమార్గము మోక్షప్రదము

గామిచే కేవలము స్వర్గప్రదముగనే యున్నదని గీతలయొక్క సిద్ధాంతము (గీ. 2.42-44; 9.21). ఈ హేతువుచే నే మార్గము మోక్ష ప్రదముగాదో దానిని నిష్ఠ యనుటకు సాధ్యము కానేరదు. కారణ మేమి యన: దేనిచేఁ దుదకు మోక్షప్రాప్తియగునో యా మార్గమునే నిష్ఠయని చెప్పవలయు నను వ్యాఖ్యాన మందఱకు నంగీకార్యమే. కావున నందఱి మతములను సామాన్యముగ ననువదించునపుడు, జనకుఁడు మూఁడు నిష్ఠలను జెప్పియుండినను మీమాంసకుల యొక్క కేవలమైన, అనఁగా, జ్ఞానవిరహితమైన, కర్మమార్గనిష్ఠ నీ వర్గములో నుంచి తీసివైచి సిద్ధాంతపక్షమున స్థిరముగ నుండెడు నిష్ఠలే గీతయొక్క మూఁడవయధ్యాయారంభమున వర్ణితమైనవి (గీ. 3.3). కేవల జ్ఞానము (సాంఖ్యము), జ్ఞానయుక్తమగు నిష్కామ కర్మయు (యోగము) నీ రెండును ఆ నిష్ఠ లగును. మఱియు సిద్ధాంతీ కరింపఁబడిన రెండు నిష్ఠలతోను మూఁడవది యగు (జనకుని రీతిని మూఁడవది యగు) నిష్ఠను సమర్థించునిమిత్తమయి "కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః"- జనకుఁడు మొదలగు వా రేరీతిని కర్మలను జేయుచు సిద్ధిని పొందిరో (గీ. 3.20) యని ప్రాచీనమగు సిద్ధాంతము చెప్పఁబడినది. జనకుఁడు మొదలగు రాజర్షుల విషయమును వదలినను వ్యాసులవారు విచిత్రవీర్యునివంశము నుద్ధరించు నిమిత్తము ధృతరాష్ట్ర పాండువులను క్షేత్రజులగు పుత్త్రులను బుట్టించిరి. మఱియు మూఁడు వత్సరము లెడతెగని పరిశ్రమ యొనర్చి జగత్తు నుద్ధరించు నిమిత్తము మహాభారతమును వ్రాసిరి. మఱియు కలియుగమున స్మార్తమును, అనఁగా సన్న్యాసమును శ్రీ శంకరాచార్యులవారును దమ యసామాన్యమగు జ్ఞానోద్యోగములచే, ధర్మసంస్థాపనను జేసిరి; ఇది యెల్ల రెఱింగిన విషయమే. విశేషముచెప్ప నేల? బ్రహ్మదేవుఁడు స్వయముగఁ గర్మలను జేయుటకుఁ బ్రవర్తించినప్పుడె సృష్ట్యారంభ మయినందున, మూలబ్రహ్మవలన మరీచ్యాది సప్తమానసపుత్త్రు

లుత్పన్నులై, వారు సన్న్యాసముం గైకొనక సృష్టిక్రమమును నడిపించుటకయి యామరణాంతము ప్రవృత్తి మార్గమునే యవలంబించిరి మఱియు సనత్కుమారుఁడు మొదలగు రెండవ సప్తమానసపుత్త్రులును బుట్టినది మొదలు విరక్తులే యై, నివృత్తిమార్గములోనివారైనట్లు మహాభారతమునందున్న నారాయణీయ ధర్మనిరూపణలో వర్ణింపఁబడినదని పైనఁ జెప్పఁబడియే యున్నది (మ.భా.శాం. 339 మఱియు 340). బ్రహ్మజ్ఞాని యగు పురుషుఁడు, లేక, బ్రహ్మదేవుఁడే యైనను గర్మలను జేయుచుండుట యను ప్రవృత్తిమార్గము నేల స్వీకరించునను దానికి వేదాంతసూత్రములలో "యావదధికార మవస్థితి రాధికారిణామ్"—ఎవరికి నే యధికారమీశ్వరనిర్మితమో యది పూర్ణమగు పర్యంతము కార్యమున నుండి విముక్తి కానేరదు (వే.సూ. 3.3.32). ఈ రీతిగ నుపపత్తి సెప్పఁబడినది. ఈ యుపపత్తిని పిదప పరీక్షించెదము. ఉపపత్తి యెట్లున్నను జగత్తుయొక్క యారంభము మొదలుకొని బ్రహ్మజ్ఞానులలోఁ గొందఱు ప్రవృత్తిమార్గావలంబు లని, కొందఱు నివృత్తిమార్గావలంబు లని రెండు పక్షములవారున్నారను విషయము నిర్వివాదముగనే యున్నది; దానివలన వీనిలో శ్రేష్ఠమేది యని యీ నిర్ణయమునుండియే నిర్ణయించుటకు సాధ్యము కానేర దనియు స్పష్టమగుచున్నది. కాని పూర్వాచార మీ తీరున ద్వివిధ మగుటచేఁ గేవలాచారమున నుండియే, నివృత్తి శ్రేష్ఠమైనదా? లేక, ప్రవృత్తి శ్రేష్ఠమైనదా? యని సిద్ధాంతీకరించుటకు సాధ్యము కాకపోయినను గర్మబంధమున నుండి విముక్తుఁడయిననే కాని మోక్షము లభింపదని నిర్వివాదముగ నుండె నేని, జ్ఞానప్రాప్తియైన పిదప తృష్ణామూలకమగు కర్మలయొక్క బంధనమును శక్యమయినంత త్వరలోఁ ద్రెంపి వైచుటయే శ్రేయస్కరము, అని కల్యాణమార్గమునందున్న జనులయొక్క కోటిక్రమ మయియున్నది. మహాభారతమునందున్న శుకానుశాసనమున—దినినే శుకానుప్రశ్న మనియుఁ జెప్పుదురు, సన్న్యాసమార్గమే ప్రతిపాదింపఁ బడియున్నది. అచ్చొ శ్రీశుకులవారు—

**య దిదం వేదవచనం కురు కర్మ త్యజేతి చ,**

**కాం దిశం విద్యయా యాంతి కాం చ గచ్ఛంతి కర్మణా.**

— వేదము కర్మలను వదలు మని చెప్పుచున్నది. మఱియుఁ గర్మలను జేయు మనియుఁ జెప్పుచున్నది; కాని విద్యచేఁ అనఁగా, కర్మవిహీనమగు జ్ఞానము చేతను, కేవలకర్మ చేతను, నేమి గతి లభించును ఇది నాకుఁ జెప్పుము (శాం. 240.1) అని వ్యాసులవారి నడిగిన పిదప నతనికి నుత్తర మిచ్చుచు శ్రీవ్యాసులవారు— .

**కర్మణా బధ్యతే జంతుః విద్యయా చ ప్రముచ్యతే,**

**తస్మాత్కర్మ న కుర్వన్తి యతయః పారదర్శినః.**

(శాం. 240.7)

— కర్మచేఁ బ్రాణి బంధింపఁబడును. మఱియు విద్యచే ముక్తుఁ డగును. కావున నెవరు పారదర్శులగు (పారంగతు లగు) యతులో, లేక, సన్న్యాసులో వారు కర్మలను జేయరు అని నుడివిరి. ఈ శ్లోకముయొక్క ప్రథమచరణము వెనుకటి ప్రకరణమున నాచే చర్చింపఁ బడినది. "కర్మణా బధ్యతే జంతుః విద్యయా చ ప్రముచ్యతే." ఈ సిద్ధాంతవిషయమై యేమియు వాదము లేదు. "కర్మణా బధ్యతే" అనఁగ, జడము, లేక, యచేతనమగు కర్మ మెవరిని బంధింపఁ జేయదు, మఱియు వదలియు వేయదు? మనుజుఁడు ఫలాశచేఁ గాని తన యాసక్తిచేఁ గాని కర్మయందు బద్ధుఁ డయినాఁడు. ఈ యాసక్తి వదలిపోయిన యెడల నతఁడు కేవల బాహ్యేంద్రియములచేఁ గర్మఁ జేసినను ముక్తుఁడె యగును అని తేలునట్లు నచ్చోఁ జూపింపఁబడినది. ఈ యర్థమునే మనస్సున నుంచుకొని యధ్యాత్మ రామాయణమునందు (2.4.42) రామచంద్రుఁడు లక్ష్మణునకు—

**ప్రవాహపతితః కార్యం కుర్వ న్నపి నలిప్యతే,**

**బాహ్యే సర్వత్ర కర్తృత్వ మావహ న్నపి రాఘవః**

– కర్మమయ మగు సంసారముయొక్క ప్రవాహములోఁ బడినను మనుజుఁడు, బాహ్యములు సర్వప్రకారములు నగు కర్మలను చేసినను, అలిప్తుఁడుగనే (సంబంధము లేనివానివలె) యుండుచున్నాఁడు అని చెప్పెను. అధ్యాత్మశాస్త్రము యొక్క యీ సిద్ధాంతమును బాగుగ గమనించితి మేని కర్మము దుఃఖమయ మనియు, దానిని వదలుట యావశ్యకము కాదనియు, మనస్సును శుద్ధమును సమమును జేసి కొని, ఫలాశవదలె నేని సర్వకార్యము లగునని కన్పట్టుచున్నది. కావున జ్ఞానమునకు నేమియు విరోధముండ నేరదని తాత్పర్యము. ఈ హేతువుచేతను గీతయందు "తస్మాత్కర్మ న కుర్వంతి"–కావున కర్మలను జేయరు అను వాక్యమునకు మారుగ–

**తస్మా త్కర్మ సు నిస్స్నేహా యే కేచి త్పారదర్శినః.**

**(అశ్వ. 51.33).**

– కావున పారదర్శి యగు పురుషుఁడు కర్మలయం దాసక్తి యుంచఁడు అని వాక్యము లుండుటచేఁ దత్పూర్వమున–

**కుర్వతే యే తు కర్మాణి శ్రద్దధానా విపశ్చితః,**
**అనాశీ ర్యోగసంయుక్తా స్తే ధీరాః సాధుదర్శినః.**

**(అశ్వ. 50.6, 7).**

– ఏ జ్ఞానులు శ్రద్ధతో ఫలాశ నుంచక (కర్మ-) యోగమార్గము నవలంబించి కర్మలను జేయుచున్నారో వారే సాధుదర్శు లయి (బాగుగ నెఱింగినవారుగ) యున్నారు అని కర్మయోగమార్గము బాగుగఁ బ్రతిపాదింపఁబడినది. ఆ రీతినే–

**య దిదం వేదవచనం కురు కర్మ త్యజేతి చ.**

– ఈ పూర్వార్ధమును సంబంధించియే–

**తస్మాద్ధర్మా నిమాన్ సర్వా న్నాభిమానాత్సమాచరేత్.**

– వేదము కర్మలను జేయుము, మఱియుఁ గర్మలను వదలుము అని రెండు ప్రకారములుగఁ జెప్పుచున్నది. కావున– (కర్తృత్వము

యొక్క) అభిమానము నొందక మనము మన సర్వకర్మలను జేయ వలయును (వన. 2.37) అని యరణ్యపర్వమున శౌనకులు యుధిష్ఠిరునకు నుపదేశించిరి. శుకానుప్రశ్న మందును—

**ఏషా పూర్వతరా వృత్తిః బ్రాహ్మణస్య విధీయతే,**
**జ్ఞానవా నేవ కర్మాణి కుర్వన్ సర్వత్ర సిద్ధ్యతి.**
**(మ.భా.శాం. 237.1; 234.29)**

— జ్ఞానవంతుఁడై సర్వకర్మలను జేయుచునే సిద్ధిని సంపాదించుట బ్రాహ్మణునకుఁ బూర్వముకంటె పూర్వమగు (పూర్వతర) వృత్తిగ నున్నది అని వ్యాసులవారు శుకునకు రెండు పర్యాయములు స్పష్టముగఁ జెప్పినారు. "జ్ఞానవానేవ" యను పదముచే జ్ఞానప్రాప్తి యయిన పిదప జ్ఞానయుక్తములగు కర్మలే యిచ్చో వివక్షితములని స్పష్టముగనే యున్నది. రెండు పక్షములందున్న యీ వచనములను నిష్పక్షపాతబుద్ధితో శాంతముగ విచారించితి మేని "కర్మణా బధ్యతే జంతుః"— ఈ కర్మత్యాగపర మగు నను మాన మొక్కటియే వెలువడదు. అందుచే "తస్మాత్కర్మసు నిస్స్నేహాః"— కావున కర్మలయందాసక్తిని యుంచరు. ఈ నిష్కామబుద్ధిచే కర్మలను జేయుట యను రెండవ యనుమానము సైత మంత యోగ్యత గలదియే యని సిద్ధమగుచున్నది; ఈ రీతిగ నీ రెం డనుమానములను మేమే కల్పించుట లేదు. స్పష్టముగ వ్యాసులవారును ఈ యర్థమునే వ్రాసిరి.

**ద్వా విమా వథ పంథానౌ యస్మిన్ వేదాః ప్రతిష్ఠితాః,**
**ప్రవృత్తిలక్షణో ధర్మః నివృత్తిశ్చ విభాషితః. ***
**మ. భా. శాం. 240.6**

---

* ఈ శ్లోకము నందలి నాల్గవ చరణమునకు 'నివృత్తిశ్చ విభావితః' అనియు పాఠాంతరముగలదు. ఏ పాఠము నంగీకరించినను మొదట 'ద్వావిమౌ' అని యంగీకరించి యుండుటచే నీ రెండుమార్గములు స్వతంత్రము లైనవే యను విషయము నిర్వివాదముగ నున్నది.

— సమానముగ వేదాధారముఁ గలిగిన యే రెండు మార్గములు న్నవో వానిలో మొదటిది ప్రవృత్తిపరమగు ధర్మము. రెండవది నివృత్తి (అనఁగా: సన్న్యాస) పరమగు ధర్మము అని ఈ శుకానుప్రశ్నము నందలి శ్లోకమున స్పష్టముగఁ జూపింపఁబడినది. అటులే నారాయణీయధర్మములలో సైత మీ రెండు మార్గములనే వేర్వేఱుగ (స్వతంత్రముగ) సృష్ట్యారంభమున నుండియు వచ్చుచున్నటుల వర్ణింపఁబడినదని పూర్వమునందే చెప్పియున్నాను. కాని మహాభారతము నందు ప్రసంగానుసారముగ నీ రెండుమార్గములు వర్ణింపబడియుండుటచేఁ బ్రవృత్తిమార్గమునువలె నివృత్తిమార్గమును సైతము సమర్థించు వచనములు నా మహాభారతగ్రంథమునందే కాన్పించుచున్నవి; మఱియు గీతలపైనున్న సన్న్యాసమార్గీయ టీకలలోనివి (అనఁగా: నివృత్తి మార్గముయొక్క వచనములే) ముఖ్యము లని తెలిపి అవి దప్ప రెండవ మార్గమే లేనటులును, అటులుండిన నది గౌణము(అనఁగా: సన్న్యాస మార్గమున కంగము)గ నున్నదనియు ప్రతిపాదించుటకుఁ బ్రయత్నించుచున్నారు. కాని యీ ప్రతిపాదనము సాంప్రదాయికుల యాగ్రహమూలమైనదిగ నున్నది. అందుచే గీతార్థము సరళముగను, స్పష్టముగ నుండినను ప్రకృతకాలమునం దది దుర్బోధమైనది. "లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా" (గీ. ౩. 3) అని గీతలయందున్న యీ శ్లోకముతో సమాన మయినదియే "ద్వా విమా వథ పంథానౌ" అను శ్లోకము సమానముగనే యున్నది. అనఁగా: రెండు తుల్యబలముగల మార్గములిచ్చో చెప్పుటకు కారణమై యున్నది యని స్పష్ట మగుచున్నది. కాని యీ స్పష్టమగు నర్థముననుఁ గాని, లేక, పూర్వాపర సందర్భము వైపుననుఁ గాని, లక్ష్యము నుంచక యీ రెండు శ్లోకములందును రెండు మార్గములు ప్రతిపాద్యములు కావనియు నొకేమార్గము ప్రతిపాద్యమనియు రూపించుట కనేకులు ప్రయత్నించుచున్నారు!

వైదికధర్మములయం దీ విధమున గర్మసన్న్యాసము (సాంఖ్యము) నిష్కామకర్మయు (యోగము) నను రెండు స్వతంత్రమార్గములు నిష్పన్నము లగుననియు నవి వైకల్పికములు గావనియు గీత యొప్పుకొనును గాని సన్న్యాసముకంటె కర్మయోగము గొప్పయని చెప్పును. ఏ జగత్తున మన ముంటిమో యా జగత్తును, దానియందు మనము క్షణమాత్రము జీవించియుండుటయు నను నవి సైతము కర్మలే యగు నేని కర్మలను వదలు టెట్లు? మఱియు నీ జగత్తునందు (అనఁగా: కర్మభూమియందే) యుండవలయు నేని కర్మ మనలను వదలు టెట్లు? దేహ మున్నంతపర్యంతము క్షుత్పిపాసలు మొదలగు వికారములు వదలవని మనము ప్రత్యక్షముగఁ జూచుచున్నాము (గీ. 5. 8. 9). మఱియు వాని నాపుటకు, బిచ్చమెత్తుకొనుట యను లజ్జాయుక్తమగు కర్మ నాచరించుటకు సైతము సన్న్యాసమార్గానుసారముగ స్వాతంత్ర్యమున్న యెడల, ననాసక్తబుద్ధితో నితర వ్యావహారికములగు శాస్త్రోక్తకర్మల నొనర్చుటకైన నాటంక మేమి? కర్మపాశములో మనస్సు మగ్న మగుటచే బ్రహ్మానందము లభింపకపోవును, లేక, బ్రహ్మాత్మైక్యరూప మగు నద్వైతబుద్ధి గాని చెడిపోవు నను భీతిచే నితరకర్మలను వదలెనేని అతనియొక్క మనోనిగ్రహ మప్పటికి సైత మపరిపక్వము గనే యున్నదని చెప్పవలయును; మఱియు మనోనిగ్రహము దృఢము గాకపోవు నేని చేయఁబడిన కర్మత్యాగము గీతానుసారముగ మోహమయములు, లేక, మిథ్యాచారము లగును(గీ.18.7; 3.6). ఇంతియే కాక యీ రీతిగ నపరిపక్వమగు మనోనిగ్రహమును చిత్తశుద్ధిద్వారా పూర్ణమును జేయుటకు, నిష్కామబుద్ధిని వృద్ధిఁజేయు యజ్ఞదానాది గృహస్థాశ్రమసంబంధము లగు శ్రౌతములు గాని, స్మార్తములు గాని యగు కర్మలనే యిట్టి మనుజుఁడు సేయవలయునని చెప్ప నక్కఱ లేకయేసిద్ధించును. ఈ విధమగు కర్మత్యాగమెప్పుడును శ్రేయస్కరము కానేరదని సారాంశము. మనస్సు నిర్విషయ మగుటచే మనుష్యుని యొక్క స్వాధీనతలో నున్నదని చెప్పితి మేని యతనికి కర్మచేయుట

కాటుంక మేమి? లేక, కర్మలను జేయనని వ్యర్థముగ నేల పట్టుపట్ట వలయును? వర్షాకాలమునకు నిర్మింపఁబడిన ఛత్రము వర్షమునందే పరీక్షింపఁబడినట్లును;

> వికారహేతౌ సతి విక్రియంతే
> యేషాం న చేతాంసి త ఏవ ధీరాః
>
> (కుమార. 1.59)

— ఏ కారణముచే వికార ముత్పన్న మగునో యా కారణము, లేక, యా విషయము కన్నుల కెదుట నుండినను, ఎవరియొక్క యంతఃకరణము మోహవికారముఁ జెందదో యా పురుషులే ధైర్యశాలు లని చెప్పవలయును— అని కాళిదాసు చెప్పినటులును, కర్మలు సేయునపుడును మనోనిగ్రహము పూర్ణముగఁ గలిగెనదా? లేదా? యని యితరులకును స్వయముగఁ గర్తకును దెలియఁగలదు. కావున నీ పక్షమునందు సైతము శాస్త్రముచే ప్రాప్తమయిన (అనఁగా: ప్రవాహపతితమగు) కర్మలను జేయవలయు ననియే సిద్ధమగుచున్నది (గీ.18.6). "మనస్సు స్వాధీనముగ నున్నందున ప్రాప్తమయిన చిత్తశుద్ధి, కర్మలు చేయుటచే చెడిపోవు నను భీతియు లేదు. కాని మోక్షప్రాప్తికి నావశ్యకములు గాని వ్యర్థకర్మలను జేసి దేహమును కష్టపెట్టుట కిచ్ఛగింప" రని చెప్పితి మేని కాయక్లేశభయముచేఁ (అనఁగా: దేహమునకుఁ గష్టము కలుగునను క్షుద్రభీతిచేఁ) జేయఁబడిన యీ కర్మత్యాగము 'రాజస'మయినందున, త్యాగమువలన నే ఫలమును సంపాదించుకొనవలయునోయది యీ ప్రకారమగు కర్మత్యాగముచే సిద్ధింపదు(గీ.18.8) కాని "కర్మలను వదలు టేల? అన్ని కర్మలును మాయాసృష్టి లోనివి కావుననే యనిత్యము లగుటచే బ్రహ్మసృష్టియందున్న నిత్యమగు నాత్మ దీనిలో పడుట యోగ్యము కానేర"దని యెవ రయినను చెప్పినను అదియు సరియగు నుత్తరము కానేరదు. కారణ మేమి యన: పరబ్రహ్మమే స్వయముగ మాయచే నాచ్ఛాదితమగు నేని మనుజుఁడు

సైతం మా తీరున మాయలో ప్రవర్తించుట కాటంకమేమి? బ్రహ్మసృష్టి మాయాసృష్టియు నని సర్వజగత్తున నే రీతిగ రెండుభాగములు కన్పట్టుచున్నవో యదేరీతిని మనుష్యునియొక్క యాత్మ యనియు దేహేంద్రియము లనియు రెండు భాగములు గాన్పించుచున్నవి. వీనిలో నాత్మకును బ్రహ్మకును సంబంధమును గలుగఁజేసి, యాత్మను బ్రహ్మములో లయముచేసినను, మఱియు నీ బ్రహ్మాత్మైక్యజ్ఞానముచే బుద్ధిని నిస్సంగముగ నుంచి కేవలము మాయికమగు దేహేంద్రియములచే మాయాసృష్టి యందున్న వ్యవహారములను జేసినను చాలును. ఈ రీతిగ సంచరించితి వేని, అనఁగా: మోక్షమునకుఁ బ్రతిబంధము రానేరదను టింతియే కాక దీనితో దానిని సంబంధింపఁ జేసి, సృష్టియొక్క యే భాగమునైన నుపేక్షించిన, లేక, విచ్ఛేదముఁ జేసిన, దోషము తగులక బ్రహ్మసృష్టియు, మాయాసృష్టియు-పరలోకము,ఇహలోకము ఈ రెంటియందు కర్తవ్యకర్మను జేయుటచే శ్రేయస్సు నీకు లభించును.

ఈశోపనిషత్తునం దీ సిద్ధాంతమే ప్రతిపాదింపఁబడినది (ఈశ. 11). కాని యీ శ్రుతివచనములయొక్క విచార మనంతరము చేయనగు. ప్రస్తుత విషయ మేమనఁగా. బ్రహ్మాత్మైక్యజ్ఞానము నొందిన జ్ఞాని మాయాసృష్టి యందలి వ్యవహారమును, కేవలము శరీరముచేతను, మఱియు కేవలేంద్రియములచేతనే చేయుచున్నాఁడని యేది గీతలయందు వర్ణితమో (గీ. 4.21; 5.12) దానియందున్న తాత్పర్యమిదియే. ఈ హేతువుచేతనే పదునెనిమిదవ యధ్యాయమున "నిస్సంగబుద్ధిచే ఫలాశను వదలి ముఖ్యకర్తవ్యము లని కర్మలను చేయుటయే సత్యమగు 'సాత్త్విక' కర్మత్యాగ మగును. కర్మలను వదలిన సత్యమగు కర్మత్యాగము కానేర"దని సిద్ధాంతము చేయఁబడినది. కర్మ మాయాసృష్టియం దున్నను, అది పరమేశ్వరుని యే యగమ్యమగు కారణమువలననో నిర్మింపఁబడియుండుటచే దానిని వదలుట యను విషయము మనుష్యుని స్వాధీనముగ లేదు, పరమే

శ్వరాధీనముగ నున్నది. మఱియు బుద్ధిని నిస్సంగముగ నునిచి కేవలము శారీరకకర్మలను జేయుటచే నవి మోక్షమునకుఁ బ్రతిబంధకములుగా వనునది నిర్వివాదముగనే యున్నది. అయిన చిత్తమున వైరాగ్య ముంచుకొని కేవలేంద్రియముల ద్వారా శాస్త్రప్రాప్తములగు కర్మలను చేయుటలో నాటంక మేమి? "న హి కశ్చిత్ క్షణ మపి జాతు తిష్ఠత్యకర్మకృత్"– ఈ జగత్తున క్షణమాత్రమయిన నెవఁడును గర్మ లేనిది యుండనేరఁడు (గీ. 3.5.18-11) అని గీతలయందును, నైష్కర్మ్యం న చ లోకేఽస్మి న్ముహూర్త మపి లభ్యతే" (అశ్వ.20.7) –ఈ లోకమునందును (ఎవరికిని) క్షణమాత్ర మయినను కర్మ వదలి పోదని యనుగీతలలోఁ జెప్పఁబడినది. మనుజులే కాక సూర్యచంద్రాదులు సైత మొకే తీరునఁ గర్మను జేయుచున్నారు! విశేషము చెప్ప నేల? కర్మ యన సృష్టి యనియు, మఱియు సృష్టి యనఁ గర్మ యనియు నిశ్చితమగుటచే సృష్టి యను ఘటీయంత్రమునకు, లేక, కర్మకు క్షణమాత్ర మైనను విశ్రాంతి లేదని మనము ప్రత్యక్షముగఁ జూచుచునే యున్నాము. "కర్మ వదలెనేని తినుటకొఱకు సైతమును దొరక" దని భగవంతుఁడు గీతలలోను (గీ. ౩. 8) "అకర్మణాం వై భూతానాం వృత్తి స్స్యా న్న హి కాచన"– కర్మ చేయనినాడు ప్రాణిమాత్రమునకు నిర్వాహము కానేరదు (వన. 32.8) అని వనపర్వమునందు ద్రౌపది యుధిష్ఠిరునకును జెప్పియుండుటచే, నా విధముననే దానబోధయందును బ్రహ్మజ్ఞానముం జెప్పి పిదప "ప్రపంచ సాండూన పరమార్థ కేలా, తరీ అన్న మిళేనా ఖాయాలా"– ప్రపంచమును వదలి పరమార్థమును సంపాదింతు వేని తినుటకు నన్న మైనను లభింపదు (దా.1.2.1.3) అని శ్రీసమర్థరామదాసుగారును చెప్పుచున్నారు. మఱియు స్వయముగ భగవచ్చరిత్రమును జూచినను భగవంతుఁడు వేర్వేఱుగ నవతారంబుల నెత్తి, యీ మాయికమగు జగత్తున సాధువుల పరిత్రాణము, దుష్టుల నాశము నను నీ రెండుకర్మలనే చేయుచు

వచ్చుచుండు నటుల (గీ. 4. 8; మ. భా. శాం. 339. 103 చూడు) కాన్పించుచున్నది; మఱియు నీ కర్మలను దాను చేయనినాఁడు జగత్తు చెడి నశించునని భగవంతుఁడే గీతలలోఁ జెప్పియున్నాఁడు (గీ.3.24). స్వయముగ భగవంతుఁడును ప్రపంచపోషణము నిమిత్తమై యీరీతిని గర్మలను జేయుచుండె నేని, జ్ఞానప్రాప్తి యైన పిదప మనుజుఁడు కర్మలు నిరర్థకములని చెప్పుటలో సారమేమియు లేదని స్పష్టముగ సిద్ధమగుచున్నది; కావున, "యః క్రియావాన్ స పండితః"- ఎవఁడు క్రియావంతుఁడో వాఁడే పండితుఁ డగును (మ.భా.వన. 312. 108). ఈ న్యాయముచే నర్జునుని నిమిత్తముగఁ జేసికొని భగవంతుఁ డంద ఱకు "ఈ జగత్తునందు కర్మత్యాగ మెరికిని శక్యము గామిచే కర్మ బాధ తగులక పోవుటకై, ఎప్పుడును స్వధర్మానుసారముగఁ బ్రాప్త మగు కర్తవ్యములను ఫలాశ వదలి (అనఁగా: విరక్తబుద్ధిచే) చేయుట యను ముఖ్యమగు మార్గము (యోగము) మనుజుని యధికార ములో నుండునదియు, నుత్తమముగ నున్నది" యని యుపదేశిం చెను. ప్రకృతి తన వ్యవహారములను దప్పక చేయుచునే యున్నది; కాని, దానియందున్న కర్తృత్వాభిమానబుద్ధిని నీవు వదలిన ముక్తుఁ డవే యగుదువు (గీ. 3.27; 13.19; 14.19; 18.16). ముక్తికొఱకుఁ గర్మను వదలుట గాని, లేక, సాంఖ్యులు చెప్పినటుల కర్మసన్న్యాస రూపమగు వైరాగ్యము నొందుట యావశ్యకము గాదు. మఱియు నీ కర్మభూమియందుఁ గర్మలను బొత్తిగ వదలుటయు శక్యము గాదు. కర్మబంధమును ద్రెంపుటకుఁ గర్మత్యాగ మావశ్యకము గామిచే, కర్మ ఫలాశాత్యాగమున నిర్వాహమగుచున్నను, జ్ఞానముచే బుద్ధి నిష్కామ మయినందున, సర్వవాసనలు క్షయించిన పిదపఁ గర్మలను జేయుట యందుఁ బ్రవర్తించుట కేమియు కారణము లేదు. మఱియు నా కార ణమున, (అనగా: కాయక్లేశభయముచేఁ గాకపోయినను వాసనా క్షయముచే) స్వయముగఁ గర్మలు వదలిపోవునని కొందఱు చెప్పు

దురు. మనుజున కీ జగత్తున పరమపురుషార్థము మోక్షమే యనియు. ఆ మోక్షము జ్ఞానముచేఁ బ్రాప్తమయిన వారికి, ప్రజ, సంపత్తి, లేక, స్వర్గాదిలోకముల యందున్న సుఖములలో నే విధమగు ఈషణలు, (ఇచ్చటు) నుండకపోవుటచే (బృ. ౩.౫.1; 4.4.22), కర్మలను వదలక పోయినను, అవి వదలుట యనునది యా జ్ఞానముయొక్క సహజమగు స్వభావముచేతనే కడపటి పరిణామముగ సంఘటిల్లుచుండును. ఈ యభిప్రాయముచేతనే—

జ్ఞానామృతేన తృప్తస్య కృతకృత్యస్య యోగినః,
న చాస్తి కించి త్కర్తవ్య మస్తి చే న్న స తత్త్వవిత్.

— జ్ఞానామృతముచేఁ దృప్తిఁబొందిన కృతకృత్యుఁడగు పురుషునకుఁ గర్తవ్యమగు నవశిష్ట మేమియు నుండదు మఱియు నుండె నేని వాఁడు తత్త్వవేత్త (జ్ఞాని) కాఁడు అని యుత్తరగీతలయందుఁ (1. ౨౩) జెప్పఁబడినది.• కర్మలను వదలక తప్పదని యెవరు శంకించుటయు యుక్తము కాదు. ఇంతియగాక బ్రహ్మజ్ఞానికి నిది యొక యలంకారముగనే యుండును. "అలంకారోహ్యయ మస్మాకం యద్బ్రహ్మాత్మావగతౌ సత్యాం సర్వకర్తవ్యతాహానిః" (వే సూ. శాం. భా. 1 1.4) — అని శ్రీశంకరాచార్యులవారు సెప్పియున్నారు. అయిన, గీతలలోను "తస్య కార్యం న విద్యతే" — జ్ఞానము కలిగినపిదపఁ గర్తవ్యమేమియు నుండదు (గీ. ౩. 17). లేక, "సర్వవైదిక కర్మలతో నతనికి

• ఈ శ్లోకము శ్రుతులయందుండునటుల నిజముగఁ దెలియదు. వేదాంత సూత్రములపై నున్న శాంకరభాష్యమున నీ శ్లోకము కన్పట్టదు; కాని సనత్సుజాతీయ భాష్యములో శ్రీ శంకరాచార్యు లీ శ్లోకమును లిఖియించి లింగపురాణములోనిది యని చెప్పినారు. అర్థముం బట్టి యిది సన్న్యాస మార్గమునకు సంబధించినదే కావి, కర్మయోగమునకు సంబంధించినది కానేరదని తెలియును. బౌద్ధగ్రంథములయందు సైత మిట్టి వచనములే యున్నవి. (పరిశిష్టప్రకరణము చూడుము).

ప్రయోజన మేమియు నుండదు" (గీ. 2. 46) అనియు "యోగారూఢస్య తస్యైవ శమః కారణ ముచ్యతే"—యోగారూఢుఁ డగునేని యతనికి శమ మనునదియె కారణమగును (గీ. 6. 3)— ఇట్టుల వచనములున్నవి. ఇంతియేకాక "సర్వారంభ పరిత్యాగీ"—సర్వోద్యోగములను వదలి వేయువాఁడును (గీ. 12.16) మఱియు "అనికేతః" అనఁగా:— ఇల్లులేనివాఁడు (గీ. 12 19) మొదలయిన విశేషణములు సైతము జ్ఞాని నుద్దేశించి గీతలయందు ప్రయోగింపఁబడినవి. దీనిగుండ జ్ఞానము కలిగినపిదప తమంతటనే కర్మలు వదలునని చెప్పుట భగవద్గీతలకు మాన్యమని యనేకుల యభిప్రాయ మయి యున్నది; గాని మా మతానుసారముగ గీతలలోని వాక్యముల కీ యర్థమును పైనఁజెప్పఁబడిన మొత్తమిూఁది యుక్తివాదమును బాగుగ లేవు. కావున తద్విరుద్ధముగ మేము చెప్పునదంతయు నిచ్చో సంక్షేపముగ జెప్పుచున్నారము.

మనుష్యుఁడు జ్ఞానము గలవాఁ డగునేని యతఁడన్ని విధములగు కోరికలను, లేక, వాసనలను వదలవలయునని చెప్పుటయే గీతలకు ముఖ్యముగ మాన్యము కానేరదని, పూర్వమున సుఖదుఃఖ వివేక ప్రకరణములో నేను జూపియున్నాను. కేవల వాసన, లేక, కేవల మిచ్ఛ యుండుటయందు నేమియు దుఃఖము లేదు. దానియం దాసక్తియె దుఃఖమునకు నిజమగు కారణముగ నున్నది. కావున సర్వప్రకారములగు వాసనలను నశింపఁజేయక జ్ఞాత కేవలమాసక్తిని వదలి సర్వకర్మలను జేయవలయు నని గీతాసిద్ధాంతముగ నున్నది. ఈ యాసక్తి వదల పెట్టఁబడెనేని, దానితో సమానముగనే సర్వకర్మలు వదలుటయు నవసరము గాదు; వే యేల? వాసనలు నశించినను సర్వకర్మలను వదలుటకు శక్యము కానేరదు. వాసనలున్నను లేకపోయినను శ్వాసోచ్ఛ్వాసాదికర్మ లనిశ మొకేతీరున నడచుచున్నట్లు మనము చూచుచునే యున్నాము. క్షణమాత్రము

జీవించి యుండుటయుఁ గర్మయే యగుటచేఁ బూర్ణజ్ఞానము కలిగి నను తన వాసనచేత గాని, వాసనాక్షయముచేత గాని యవి వదలి పోనేరవు. కారణ మేమియన : వాసన వదలిపోయిననే జ్ఞానియుఁ బ్రాణముఁ బోగొట్టు కొనఁడను విషయము ప్రత్యక్షసిద్ధముగనేయు న్నది; మఱియు దానివలన "న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మకృత్"— ఎవరయినను కర్మ చేయుచుండిననే తప్ప యుండు టకు శక్యముకాదు (గీ. 3.5) అను నీ వచనము గీతలలోఁ జెప్పఁబడి నది. కర్మభూమియందు కర్మ, స్వభావముచే ప్రాప్తమును ప్రవాహ పతితమునగుటచే నపరిహార్యముగ నున్నది. మనుష్యునియొక్క వాస నాధీనము కానేరదు. ఇది గీతాశాస్త్రముయొక్క కర్మయోగమునందలి ప్రాథమిక సిద్ధాంతముగ నున్నదనియు, కర్మకును వాసనకును పర స్పరము నిత్యసంబంధము లేదనియు సిద్ధమయినపిదప వాసనాక్షయ మగుచుండఁగనే, కర్మక్షయమైయే తీరవలయు నని చెప్పుట నిరా ధారము, నిష్ప్రయోజనము నగును. మఱియు వాసనాక్షయానంతర మున ప్రాప్తమైన కర్మలను జ్ఞాని యే రీతిగఁ జేయవలయునను శంక సహజముగనే వెలువడును. ఈ శంకకు సమాధానము గీతలయొక్క మూఁడవయధ్యాయమున వ్రాయఁబడినది (గీ. 3.17-19 మఱియు దానిపై నాటీకను జూడుము). జ్ఞానికి, జ్ఞానప్రాప్తియైన పిదప, తనది యగుకర్తవ్యము నుండదు. ఈ మతము గీతలకు మాన్యముగనే యున్నది; కాని గీత, యెవరిని కర్మ మాత్రము వీడిపోదని పిమ్మట చెప్పుచున్నది. జ్ఞానికి కర్తవ్య మేమియు నుండదు. మఱియు కర్మ విడిపోనేరదు అను నీ రెండు సిద్ధాంతములును బరస్పరవిరుద్ధములుగఁ దోఁచుచుండును. కాని గీతలయందున్న విషయమట్టిది కానేరదు. "కర్మమెందుచే నపరిహార్యమై యున్నదో యందుచేతనే జ్ఞాని జ్ఞానోత్తరమునందును, దానిని జేయుచుండవలయు" నని జ్ఞాన కర్మలకుఁ బరస్పర సంబంధమును గీత చెప్పుచున్నది. జ్ఞానికి నాత్మార్థమగు కర్మలేమియు నుండనందున సర్వకర్మలను నిష్కామ

బుద్ధిచే చేయుచుండుటయే యతనికిఁ బ్రాప్తమగును. మూఁడవ యధ్యాయముయొక్క 17 వ శ్లోకమునందు "తస్య కార్యం న విద్యతే" యనుమాటలలో 'తస్య' (అనఁగా: జ్ఞాని యగు పురుషునకు) అను మాట యధిక మహత్త్వము గలది. మఱియు దానికి మొత్తముపై భావార్థ మెటులున్నది యన నతనికి స్వయముగ తనది యని యేమియు సంపాదింపఁదగినది లేదనుటచేతనే యతఁడు తన కర్తవ్యము నిప్పుడు (అనఁగా: జ్ఞానప్రాప్తియైన) పిదప నిరపేక్ష బుద్ధితోఁ జేయవలయును. మఱియును నీ యర్థమే పందొమ్మిదియవ శ్లోకమునందు 'తస్మాత్' అను నీ కారణబోధకపదము నారంభమున నుండి "తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర" — కావున శాస్త్రముచేఁ బ్రాప్తమయిన కర్తవ్యములను నీ వాసక్తిని వదలి చేయుచుండుము. కర్మలను వదలి పెట్టకుము (గీ. 3.19). ఈ మాటలచే నర్జునునకు చెప్పఁబడినది యని తాత్పర్యము. మూఁడవయధ్యాయమునందున్న (గీ. 17-19) శ్లోకత్రయమునందు వ్యక్తమగు నీ కార్యకారణభావమును, మఱియు నీ యధ్యాయముల యందున్న మొత్తము మీఁద ప్రకరణములయొక్క సందర్భమునను లక్ష్య ముంచితిమేని సన్న్యాసమార్గీయులు సెప్పినటుల "తస్యకార్యం న విద్యతే" యనునది స్వతంత్రసిద్ధాంతముగ నంగీకరించుట యుక్తము కాదని కాన్పించుచున్నది. దీనికిముందు వ్రాయఁబడిన దృష్టాంతములే యుత్తములును, పూర్ణములు నైన యుత్తరము లగును. జ్ఞానప్రాప్త్యనంతరమున నే మైనను కార్యములు మిగిలినవి యుండకపోయినను శాస్త్రముచే సంప్రాప్తములగు సర్వవ్యవహార కర్తవ్యములను జేయవలసియే వచ్చును. ఈ సిద్ధాంతమును బలపఱచుటకు భగవంతుఁడు వెంటనే—

న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన,
నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి.

– ఓ యర్జునా! నాకని యీ మూఁడు లోకములయందుఁ గర్తవ్య మేదియును (అవశిష్టముగ), లేదు. లేక మఱియు నొకానొక వస్తువును సంపాదించుకొనుట (వాసన) యును లేదు. అయినను నేను కర్మను జేయుచునే యున్నాను. ఇది లక్ష్యములో నుంచు కొనుము అని చెప్పెను. దీని యందున్న "న మే కర్తవ్యమస్తి" – నాకు కర్తవ్య మేమియు మిగుల లేదు. – ఈ శబ్దములు, "తస్య కార్యం న విద్యతే" – అతని కేమియు కర్తవ్యముండదు. ఈ పూర్వ శ్లోకమునందున్న (గీ. 3. 17) శబ్దముల ననుసరించియే యున్నవి; మఱియు దానివలన "జ్ఞానముచేఁ గర్తవ్య మవశిష్టమై యుండినను, విశేషము చెప్పనేల? ఈ కారణముచేతనే శాస్త్రమువల్ల సంప్రాప్త మగు సర్వ వ్యవహారముల ననాసక్తబుద్ధితోఁ జేయవలయును" అను నర్థము నాలుగైదు శ్లోకములలోను నొక్కి వక్కాణింపఁబడియున్నది. అట్లు లేని పక్షమున 'తస్య కార్యం న విద్యతే' మొదలగు శ్లోకము లలోఁ జెప్పిన సిద్ధాంతమును దృఢీకరించుట కొఱకు భగవంతునిచేఁ జెప్పఁబడిన తన దృష్టాంతము బొత్తిగ సంబంధింపకయే పోవును. సిద్ధాంత మొకటియు, నుదాహరణ మందులకు విరుద్ధమగు వేఱొక టియు నైన, ననవస్థ ప్రాప్త మగును. ఈ యనవస్థను తప్పించు కొనుటకు సన్న్యాసమార్గీయ టీకాకారులు "తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర", అను దీనియందును 'తస్మాత్' అను శబ్దము నకు నర్థమును వేఱుగనే చేయుచున్నారు. "జ్ఞాని కర్మలను వదలు ననియే" గీతలో ముఖ్య సిద్ధాంతముగ నున్నది; కాని యర్జునుఁ డట్టి జ్ఞాని కాకపోవుటచే– 'తస్మాత్'–అతఁడు కర్మ చేయవలయునని భగవంతుఁడు చెప్పినాఁడు. కాని గీతోపదేశానంతరమందు నర్జునుఁడు జ్ఞానిగనే యున్నాఁడా?" యనుట బాగుగ నుండలేదని నేను పూర్వ ప్రకరణమునఁ జూపియుంటిని. ఇంతియకాక 'తస్మాత్' అను దాని శబ్దార్థ మీ రీతిగ తలక్రిందు చేయఁబడినను "న మే పార్థాస్తి కర్తవ్యం" మొదలగు శ్లోకములయందు భగవంతుఁడు "తనకు కర్తవ్య మేమియు

లేక పోయినను నేను కర్మలను జేయుచున్నా"నని ముఖ్యసిద్ధాంతము యొక్క సమర్థనార్థమై, ఏ తన దృష్టాంతమునే చెప్పినాఁడో దాని సంగతియు నీ పక్షమున బాగుగఁ గుదురదు. కావున "తస్య కార్యం న విద్యతే" ఈ వాక్యమునందు 'కార్యం, న విద్యతే' యను శబ్దములు ముఖ్యము లని యంగీకరింపక 'తస్య' యను శబ్దము ప్రధానముగ నంగీకరింపవలయును. మఱియు నట్లు చేసితిమేని "తస్మాదసక్తస్సతతం కార్యంకర్మ సమాచర" యను దీని కర్థము "నీవు జ్ఞానివి యగుటచే స్వార్థముకొఱకుఁ గర్మ యక్కఱ లేనిమాట నిజమే. కాని నీకు స్వార్థమునకు నవసరము లేకపోయినను నాకు వలదను బుద్ధితో అనఁగా నిష్కామబుద్ధితో, విహితకర్మలను జేయుము" అని యర్థమును జేయవలసివచ్చును. సంక్షేపముగ చెప్పుట కయి 'నాకు వల' దనుట కర్మను వదలిపెట్టుటకు కారణము కానేరదు. మఱియు కర్మ వదలివేయ వలసినది కానందున శాస్త్రమువలన ప్రాప్తము లయిన యపరిహార్య కర్మలను స్వార్థత్యాగబుద్ధితోఁ జేయవలయుననియే దానివలన ననుమానము వెలువడును అని గీతల తాత్పర్యమైయున్నది. మఱియు ప్రకరణానుకూలమగు నర్థమును జూచిన నిదే యర్థమును గైకొనవలయును. ఇదియే కర్మసన్న్యాస కర్మయోగముల కుండు గొప్ప భేదము. "నీకు నేమియు నవశిష్టము లేదు; కావున నీ వేమియును చేయకుము" అని సన్న్యాసపక్షీయులు సెప్పుచున్నారు; మఱియు "నీ కేమి యవశిష్టము లేకపోయినను నీకు కర్తవ్యమగు దాని నంతయును స్వార్థపరమగు వాసనను వదలి యెప్పు డనాసక్తబుద్ధితోఁ జేయుము" అని గీత చెప్పుచున్నది. "ఒక హేతువాక్యమున నుండి యీతీరున వేర్వేఱగు రెం డనుమానము లేల బయలుదేరుచున్నవి? గీత యపరిహార్య మని యంగీకరించి యుండుటచే, కర్మను వదలుమను ననుమానము గీతయందు తాత్త్విక విచారానుసారముగ బయలుదేరుటకే శక్యము గాదు అని దీనికి సమాధానమయియున్నది.

కావున 'నీకు వల'దను నీ హేతువాక్యము నందుండియే, 'స్వార్థ బుద్ధిని వదలి కర్మ చేయు'మని గీతలయం దనుమానము చేయఁబడి నది. రామునకు బ్రహ్మజ్ఞానమంతయు నుపదేశించిన పిదప నిష్కామ కర్మయందుఁ బ్రవర్తింపఁ జేయుటలో యోగవాసిష్ఠమున వసిష్ఠులు సెప్పిన యుక్తి వాదము సైత మిదియే విధ మగుటచే, యోగవాసిష్ఠము యొక్క చివర భగవద్గీత యందలి సిద్ధాంతమే శబ్దభేదము సైతముఁ గాన్పింపకుండ (యో. 6, ఉ. 199; 216. 14, గీ. 3. 19 యొక్క భాషాంతరమున నున్న నా టిప్పణి చూడు) చెప్పఁబడినది. యోగ వాసిష్ఠానుసారముగనే బౌద్ధధర్మమునం దున్న మహాయానపంథ యొక్క గ్రంథములలో నీ విషయములో గీతయొక్క యనువాదమే చేయఁబడినది. కాని విషయాంతర మగునని దాని చర్చ నిచ్చో వదలి తద్విషయిక విచారమును పరిశిష్టప్రకరణమునఁ జేయుదును.

ఆత్మజ్ఞానము కలిగె నేని 'నేను', 'నాది' యను నహంకారము దెలుపు భాషయే యేమియు నుండదు (గీ. 18.16; 26). మఱియు దానివలన జ్ఞానియు 'నిర్-మమ' అని చెప్పుచున్నాడు నిర్మముఁ డనఁగా 'నాది (మమ) యని చెప్పని వాఁ'డని యర్థ మగును; మఱియు జ్ఞానేశ్వరమహారాజుగారు జ్ఞానిసి వర్ణించుచు నదే యర్థ మును—

ఆణి మీ హే భాష నేణే, మాఝేఁకాఁహీఁచ న మ్హణే,
సుఖదుఃఖ జాణణేఁ నాహీఁ జయా.

— జ్ఞాని తా ననుట (అహ మనుట) నెఱుంగఁడు. ఏ వస్తువును 'నాది', 'మనది' యని చెప్పఁడు, సుఖదుఃఖజ్ఞానము లేనివాఁడుగ నుండును —అను పద్యములో స్పష్టపఱచినారు. కాని బ్రహ్మజ్ఞానముచే 'నాది' మఱియు 'నేను' అను నీ బుద్ధి వదలిపోయినను ఈ రెండు శబ్దము, లకుఁ బ్రతినిధిగ జగత్తు, మఱియు జగత్తుయొక్క లేక, భక్తి దృష్టితో

మాటలాడవలసి వచ్చెనేని 'పరమేశ్వరుఁడు' మఱియు 'పరమేశ్వరుని యొక్క-అను శబ్దము లప్పుడా స్థానమున వచ్చును, అని మఱచి పోకూడదు. జగత్తునందున్న ప్రతి సామాన్య మనుజుఁడును తన సర్వవ్యవహారము లను నావి యని, లేక, నా కొఱకనియే చేయు చున్నాఁడు. కాని జ్ఞానికి మమతాబుద్ధి పోయియుండుటచే నీశ్వర నిర్మితమగు జగత్తునందున్న సర్వవ్యవహారములును పరమేశ్వరునివిగ నున్నవి. మఱియు వానిని జేయు నిమిత్తమయి తన్ను పుట్టించెనను బుద్ధితో (అనఁగా: నిర్మమబుద్ధితో) జ్ఞాని వ్యవహరించుటయే జ్ఞానికి నజ్ఞానికి నున్న భేదము (గీ. 3.27.28). గీతలయొక్క యీ సిద్ధాంతమును గమనించితి మేని "యోగారూఢుఁడగు పురుషునకు పిదప శమము కారణ మగును" (గీ. 6.3 మఱి దానిపై నా టిప్పణిచూడుము) అను శ్లోకమునకు నేది సరళార్థ మనియుఁ దెలియును. గీతల టీకాకారు లీ శ్లోకమునందు యోగారూఢునిచే పిదప 'శమము' అనఁగా శాంతి యను మార్గ మవలంబింప వలయు ననియు, రెండవదేదియుఁ జేయ నవసరము లేదనియు చెప్పఁబడినట్లు వక్కాణించిరి. కాని యీ యర్థము బాగుగ లేదు. శమ మనఁగా: మనస్సుయొక్క శాంతి యగును. మఱియు నిది కడపటి 'కార్యము' కాదు 'శమము' లేక 'శాంతి' యనునది రెండవదానికయినను కారణ మగును— 'శమః కారణ ముచ్యతే' యని యీ శ్లోకములోఁ జెప్పఁబడినది. అప్పుడు చెప్పనక్కఱ యుండకయే శమ మనునది 'కారణ' మని యంగీకరించినపిదప దానికి 'కార్య' మేమి? యని విచారింపవలసి యుండును. పూర్వాపరసందర్భమును విచారించితిమేని దానికి 'కర్మ' యే కార్యమగు నని నిష్పన్న మగును; మఱియు యోగారూఢుఁడు చిత్తమును శాంతింపఁ జేసికొని యా శాంతిచేతనే తనకుఁ గర్తవ్యము లగు వ్యవహారములను జేయవలయునని యీ శ్లోకమున కర్థమగును; టీకాకారులు సెప్పినటుల కర్మలను యోగారూఢుఁడు వదలుట సాధ్యము కానేరదు. అటులె 'సర్వారంభపరిత్యాగి', 'అనికేతః'

మొదలగు పదముల యర్థమును కర్మత్యాగపరముగఁ జేయక ఫలాశా త్యాగపరముగనె చేయవలయునని యా యా స్థలము లందున్న గీత యొక్క భాషాంతరమునకు సంబంధించియున్న టిప్పణిలో నేను జూపించియున్నాను. ఫలాశను వదలి జ్ఞాని చాతుర్వర్ణ్యాది సర్వ కర్మలను యథాశాస్త్రీయముగఁ జేయుచునే యుండవలయును. దానిని సిద్ధింపఁజేయుటకు స్వీయముగ నుండునదే కాక, భగవం తుఁడు జనకాదులదగు రెండవ దృష్టాంతమును జూపించెను. జనకుఁ డొక కర్మయోగి. అతని స్వార్థబుద్ధి యెంతముట్టుకు వదలి పోయె ననఁగా తన రాజధాని తగులఁబడిపోవుచున్నను అందులో తనది పోవున దేదియు లేదని– మిథిలాయాం ప్రదీప్తాయాం న మే దహ్యతి కించన” (శాం. 275. 4 మఱియు 279. 50)–అని యతఁడు స్వయ ముగనే చెప్పెను. కాని యీ రీతిని స్వార్థముగాని, లాభాలాభములు గాని యెందును లేక పోయినను, రాజ్యముయొక్క నిఖిల వ్యవహార ములను తానేల చేయుచున్నదియుఁ జెప్పుచు జనకుఁడు స్వయముగ–

దేవేభ్యశ్చ పితృభ్యశ్చ భూతేభ్యో ఽతిథిభిః సహ,
ఇత్యర్థం సర్వ ఏవైతే సమారంభా భవంతి వై.

– దేవతలు, పితరులు, సర్వభూతములు, (అనఁగా: ప్రాణులు) మఱియు నతిథులు నను వారి కొఱకు నీ సర్వవ్యవహారములు నడు చుచున్నవి నా కొఱకుఁగాదు. (మ.భా.అశ్వ. 32. 24) స్వార్థమై కర్త వ్యమవశిష్టము లేకపోయినను లేక స్వయముగ నే వస్తువును బొంద వలయు నను వాసన లేకపోయినను జనక శ్రీకృష్ణులవలె జగత్తునకు కల్యాణము చేయుటకు ప్రవృత్తులు కారేని యీ జగత్తు ఉత్పన్న మగును. 'ఉత్సీదేయు రిమేలోకాః' అని చెప్పనక్కఱలేదు (గీ.3.24).

మఱి కొందఱు “ఫలాశను వదలవలయును. సర్వప్రకారము లగు నిచ్ఛలను వదల నవసరముండదు” అను గీతాసిద్ధాంతము

నందును వాసనాక్షయసిద్ధాంతము నందును విశేషభేదము లేదు" అని చెప్పెదరు. కారణ మేమియన: వాసనాక్షయమైన నేమి? ఫలాశను వదలిన నేమి? ఉభయపక్షముల యందును కర్మవిషయమై ప్రవర్తించుటకు నేమియు ప్రయోజనము లేమిచే నే పక్షమును స్వీకరించినను తుదకు కర్మత్యాగమె దానియొక్క పరిణామ మగునని చెప్పుదురు; కాని యీ యాక్షేపము అజ్ఞానమూలకము, అనఁగా 'ఫలాశా' శబ్దమునకు నిజమగునర్థము తెలియక పోవుటచే పుట్టినది. ఫలాశను వదలుట యనఁగా సర్వప్రకారములగు నిచ్ఛలను వదలుట, లేక, 'నేఁ జేసినకర్మలయొక్క ఫల మెవరికి నెప్పుడు లభింప కూడదు. మఱియు లభించెనేని దాని నెవరును గైకొనరాదు' అని బుద్ధినుంచుట యని యర్థము కానందున నాకు నేదో యొక ఫల మవశ్యము ప్రాప్తము కావలయునని నేను ఈ కర్మను జేయుచున్నానను నిప్రకారమగు ఫలవిషయకమైన మమత్వముతోఁ గూడుకొనిన ఆసక్తికి, లేక, బుద్ధియొక్క ఆగ్రహమునకు ఫలాశ, సంగము, లేక, కామము అను పేరులు గీతయందు చెప్పబడినవని వెనుక నైదవ ప్రకరణములోనే నేను వక్కాణించియున్నాను; కాని ఫలము లభింప వలయునను ఇచ్ఛను, నాగ్రహమును, లేక, వృథా ఆసక్తి యుంచక పోయినను, ప్రాప్తమగు కర్మ కేవలకర్తవ్యమని చేయుటకు బుద్ధియు నుత్సాహము నీ యాగ్రహముతో సమానముగ తన మనస్సునఁ గలుగక యుండవని చెప్పుము. తనయొక్క లాభమే కాక యీ జగత్తున రెండవ దేదియుఁ గన్పట్టకపోవుటచే, కేవల ఫలేచ్ఛచేతనే, యే పురుషులు కర్మలు సేయుట యందు నిత్యము మగ్నులయి యున్నారో, వారు ఫలాశను వదలి కర్మలను జేయుట శక్యమని తోఁచువారు కారు. ఇది యథార్థమే కాని, జ్ఞానముచే నెవరి బుద్ధి సమము, విరక్తమునైనదో వారివిషయ మట్టిది కానేరదు. ఏ కార్యమునకైనను నాకు లభించు ఫలము కేవలము నాయొక్క కర్మఫలమే

యగు నను జ్ఞానము మొదటినుండియు తప్పైనదే యగును. నీటి యొక్క ద్రవత్వము, లేక, యగ్నియొక్క యుష్ణత్వము అను వీని సాహాయ్యము లేనియెడల మనుష్యుఁ డెంత యట్టహాసము చేసినను అతనియొక్క ప్రయత్నముచే పాకము సిద్ధించుట సాధ్యము కాదు; మఱియు నగ్ని మొదలగు పదార్థముల యీ గుణధర్మము లుండుట, లేకపోవుట యనునది మనుష్యునకు స్వాధీనములోనిది లేక, ప్రయత్నాధీనము లోనిది కాదు. కావున కర్మసృష్టియందున్న నీ స్వతస్సిద్ధమగు నీ వివిధ వ్యాపారములను, లేక, ధర్మములను యథాశక్తి మొదట నెఱింగి యా వ్యాపారము తన ప్రయత్నమున కే విధముగ ననుకూల మగునో యట్టి ప్రకారమగు తన వ్యవహారమును జేయ వలసివచ్చును. అనఁగా: మనుష్యప్రయత్నముచే లభించు ఫలమంతయు కేవల మతని ప్రయత్నముయొక్క ఫలము కామిచే నతని యొక్క కర్మయు, తదనుకూలమగు కర్మసృష్టియొక్క యనేక స్వతస్సిద్ధమగు ధర్మములును, అను ఈ రెంటియొక్క సంయోగమున కధిక ఫల మగుననియు చెప్పవలయును; కాని మనుజునియొక్క ప్రయత్నము సఫల మగుటకు, నే విధముగ నానా ప్రకారములగు నే సృష్టివ్యాపారముయొక్క యనుకూలత కావలసివచ్చునో, యా యన్నింటియొక్క యథార్థజ్ఞాన మతనికి ననేకసమయములయందు కలిగియుండదు. కొన్నిస్థలములయందు కలుగుటయు శక్యము కానేరదు. దీనినే దైవమని చెప్పుదురు. తన యధీనము కానిది యగుటచే తనకు గోచరము సైతము కానట్టి సృష్టివ్యాపారముయొక్క సాహాయ్యము ఫలసిద్ధి కీ విధమున నావశ్యక మగునేని "కేవలము నాయొక్క ప్రయత్నముచేత నే నొక విషయమును జేయుచున్నా" నను నభిమానమును జెందుటయే మూర్ఖత్వ మగు నని చెప్పనక్కఱ లేకయే సిద్ధమగును (గీ. 18.14.16 చూడు). కారణ మేమియన: కర్మసృష్టియొక్క జ్ఞాతములు నజ్ఞాతములునైనవ్యాపారము లీ మనుష్య ప్రయ

త్నముతో సంయోగ మైనపిదపఁ గాఁబోవుఫలము కేవల కర్మయొక్క నియమముచేతనే పుట్టినది యగుటచే, మనము ఫలాశ నుంచినను, ఉంచకపోయినను దానివలన నీ ఫలసిద్ధి యందేమియు భేదములేక, మన ఫలాశ కేవలము మనకు మాత్రము దుఃఖకారక మగుట సంభవించుచున్నది. అయినను కేవలము సృష్టివ్యాపారమే మనుజునకుఁ గావలసినవిషయమును స్వయముగ సమకూర్పనేరదు. అపూపము (అప్పము, లేక, అతిరసము) రుచికరముగ నుండుట కేవిధముగ పిండిలోఁ గొంత మధురపదార్థముఁ జేర్పవలసివచ్చునో యటులనే కర్మసృష్టియందున్న నీ స్వతస్సిద్ధమగు వ్యాపారము మనుష్యునకు లాభకారి యగుటకు దానియందు మనుజుని ప్రయత్న మను కొంతబరు వైనను వేయవలసివచ్చును. కావున జ్ఞానియు, వివేకియు, సామాన్యజనులవలె ఫలాసక్తిని, లేక, యహంభావమును వదలి జగద్వ్యవహారసిద్ధ్యర్థమై ప్రవాహపతితము, అనఁగా: కర్మయొక్క యనాది ప్రవాహమునందు యథాధికారముగ శాస్త్రమువలన తన వంతునకు వచ్చిన కర్మలయొక్క చిన్న పెద్దభాగములను శాంతముగ కేవలకర్తవ్యములని చేయుచున్నారు. మఱియు ఫలప్రాప్తికై, కర్మ ధర్మసంయోగము మీఁదఁ గాని, లేక, భక్తిదృష్టిచేఁ బరమేశ్వరునియొక్క యిచ్ఛమీఁద గాని నమ్మక మునిచి నిశ్చింతులై యున్నారు. "కర్మను చేయు పర్యంతమే నీయొక్క యధికారము. ఫలించుట యనునది నీ స్వాధీన విషయము కానేరదు" (గీ. 2. 47) అనునది మొదలగు నర్జుననకుఁ జేసిన యుపదేశములం దున్న ముఖ్యాంశ మిదియే యగును. ఫలాశ నుంచక యీ తీరునఁ గర్మఁ జేయుచుంటి మేని ముందాకర్మ లేదో యొక కారణమున నిష్ఫలము లయిన, నుద్యోగమును జేయుట యను మన యధికారము నందున్న కార్యమును మన మొనర్చియుండుటచే నీ నిష్ఫలత్వముయొక్క దుఃఖము మనకు తగులుట కేమియు నవకాశముండదు. ఉదాహర

ణము: ఆయుష్యముయొక్క త్రాడు (శరీరమందున్న పోషక ధాతువులయొక్క నైసర్గికశక్తి) బలిష్ఠముగ నుండిననే గాని, కేవ లౌషధములచే రోగుల కెప్పుడును గుణము గలుగదని వైద్యశాస్త్రము నందు స్పష్టముగఁ జెప్పఁబడినది; మఱియు నాత్రాటియొక్క యీ బల మనేక ప్రాక్తనములును, లేక, వంశాగతములు నగు సంస్కార ములయొక్క ఫల మగుటచే నది వైద్యునిచేతినుండి సిద్ధమగు విషయము కానేరదు. మఱియు నాబల మెంత యున్నదని వైద్యునకు పూర్ణముగ నిశ్చయాత్మక మగుజ్ఞానము గలుగుటకును శక్యము గాదు. అయినను రోగికి నౌషధ మిచ్చుట తనకుఁ గర్తవ్యమని తెలిసికొని, పరోపకారబుద్ధితో నశక్తులగు రోగులకు తమ బుద్ధ్యనుసారముగ కొంతమంది వైద్యు లౌషధ మిచ్చుచుండుటల మనము చూచుచునే యున్నాము. వైద్యుఁ డీతీరున తన కార్యమును నిష్కామబుద్ధితోఁ జేసినపిదప తన యౌషధముచేఁ గొందఱు రోగులకు నిమ్మళింపక పోవుటచే నుద్విగ్నుఁడు కాఁడనునదియె కాక, యొకానొకరోగ మొకానొకయౌషధముచే నిమ్మళించినది యని శాస్త్రీయ నియమ ములను గొప్పశాంతచిత్తముతో వక్కాణించు చున్నాఁడు; కాని యా వైద్యుని కుమారుఁడే యశక్తుఁ డగు నప్పు డతనికి నౌషధము నీయ వలసిన సమయము వచ్చెనేని యాయుర్దాయ మను సూత్రలక్షణ మును మఱచి "నా కుమారుఁడు బాగుగ నుండవలయు" నను మమత్వ యుక్తమగు ఫలాశచే నతని చిత్తము విమోహముం జెందు టచే రెండవ వైద్యుని పిలువవలసివచ్చును; లేక, రెండవ వైద్యుని సలహాయైనఁ బొందవలసివచ్చును. "కర్మఫలమునందు మమత్వ రూపమగు నా సక్తి యని దేనిని చెప్పవలయును? మఱియు ఫలాశ లేకపోయినను కేవల కర్తవ్యబుద్ధితో నే పనినైన నెటులు చేయవలసి వచ్చును?" అను విషయము చిన్న యుదాహరణము నుండి లక్ష్యము లోనికి [illegible] ఫలాశను నశింపఁ జేయుటకై జ్ఞానముచే

మనస్సునందు వైరాగ్యము దృఢము కావలసినది యథార్థమే; కాని యేదయినను వస్త్రముయొక్క రంగును (రాగమును) తీసి వైవ వల యునేని యా వస్త్రమును నశింపఁ జేయవలయునని యర్థ మెట్టులు కానేరదో, యా తీరుననే కర్మలయందు కామమును, సంగమును, లేక, రాగమును (అనఁగా: ప్రీతిని) గాని యుంచఁగూడదని చెప్పుటచే నా కర్మలనే వదలి వేయవలయునని యర్థము కానేరదు. వైరాగ్య ముతోఁ గర్మచేయుటయే యశక్య మగునేని యా విషయము వేఱు; కాని వైరాగ్యముతోఁ గర్మలను జేయవచ్చు ననుటయే కాక, కర్మ యెవరిని,ఎవ్వుడును విడువదను విషయమును మనము ప్రత్యక్షముగఁ జూచుచునేయున్నాము. కావున నజ్ఞాను లే కర్మలను ఫలాశాపూర్వక ముగఁ జేయుచున్నారో వానినే, జ్ఞాని జ్ఞానోత్తరమునందు సైతము లాభాలాభములను, ఫలాఫలములను సమానములుగనే చూచుకొని (గీ. 2. 38). ధైర్యముతో, ఉత్సాహముతో, శుద్ధ బుద్ధితో, అనఁగా: ఫలవిషయమై విరక్తుఁడై లేక, యుదాసీనుఁడై (గీ. 18.26) కేవలము కర్తవ్యమని తన యధికారానుసారముగ శాంతచిత్తముతోఁ జేయుచునే యుండవలయునను (గీ. 6. 3). సదియే నీతిదృష్టిచేతను మోక్షదృష్టి చేతను, నుత్తమమును, సత్యము నగు నాయుః క్షేపణక్రమముయొక్క సిద్ధాంతముగ నున్నది. విశేషము చెప్పనేల? అనేకులగు స్థితప్రజ్ఞులు, భగవద్భక్తులు, పరమజ్ఞానులును, వేయేల? స్వయముగ భగవంతుఁ డును ఈ మార్గమునే స్వీకరించి యుండుటచే నీ కర్మయోగమార్గమే పురుషార్థమునకు పరాకాష్ఠయై యున్నది. మఱియు నీ యోగము చేతనే పరమేశ్వరునియొక్క భజనపూజనములు సంఘటిల్లి తుదకు సిద్ధి సైతము సిద్ధించును (గీ. 18 46) అని భగవంతుఁడు కంఠరవము గనే చెప్పియున్నాఁడు. ఇట్లు నిశ్చితమైనను, ఎవరైనను స్వయము గనే యీ విషయమున గుణదోషములు గ్రహింతురేని యది వారి దౌర్భాగ్యమని తెలిసికొనవలయును. పాశ్చాత్య పండితుఁడగు

స్పెన్సరునకు నధ్యాత్మదృష్టి సమ్మతింపదు. అయినను "జగత్తున నే విషయమైన నొక పర్యాయమే సంఘటిల్లుట తనకు శక్యము కానందుచే వానికి కారణభూతములు, ఆవశ్యకములైన యనే కేతర విషయములు పూర్వమందే సంఘటిల్లునట్లు చేసికొనవలయును. పిదప ప్రయత్నములు సఫలములు, నిష్ఫలములు, లేక, న్యూనాధిక ఫలములు గలవిగ నగుచుండు నని యాధిభౌతికరీతిచే సైతము నిశ్చితములు. కావున సామాన్యజను లే కర్మనయినను ఫలాశచేఁ జేయుటకుఁ బ్రవృత్తు లయినను చతురుఁడగు పురుషుఁడు ఫలము నందాగ్రహము (పట్టుదల) నుంచుకొనక శాంత్యుత్సాహములతోఁ గర్తవ్యమును జేయుచునే యుండవలయును" అను గీతాప్రమాణము ననుసరించియే 'సమాజశాస్త్రముయొక్క అభ్యాసము' అను తన గ్రంథము నందుఁ గడపట నీ సిద్ధాంతమే చేయఁబడినది.*

జ్ఞాని సంసారమునందు ప్రాప్తమగుకర్మలను ఫలాశను వదలి యామరణాంతము నిష్కామబుద్ధిచే చేయవలయునని సిద్ధమయినను

---

* Thus admitting that for the *fanatic*, some wild anticipation is needful as a stimulus, and recognising the usefulness of delusion as adopted to his particular nature and his particular function, the *man of higher type* must be content with greatly *moderated expectations*, while he perseveres with undiminished efforts. He has to see how comparatively little can be done, and yet to find it worth while to do that little: so uniting philanthrophic energy with philosophic calm"— Spencer's *Study of Sociology*, 8th Ed. p. 403. (The italics are ours.) ఈ వాక్యమున fanatics అనుశబ్దమునకు మాఱుగ ప్రకృతిగుణములచే మూఢులు (గీ. ౩.౨౯), అహంకారవిమూఢులు (గీ. ౩.౨౭) లేక, జ్ఞానకవిచే నుపయుక్తమైన 'మూర్ఖులు' అను శబ్దమును, మఱియు man of the highest type అను శబ్దమునకు మారుగ 'విద్వాన్' అను శబ్దమును (గీ. ౩.౨౫) greatly moderated expectations అను శబ్దమునకు ఫలమునం దౌదాసీన్యము, ఫలాశాత్యాగము, అను సమానార్థకపదములను ప్రయోగింతు మేని Spencer సైతము గీతలయొక్క సిద్ధాంతము ననువదించువాఁడై కన్పట్టును.

ఈ కర్మ లే హేతువుచే నే ప్రయోజనము కొఱకు ప్రాప్తములగు చున్నవో చెప్పిననే కాని కర్మయోగముయొక్క వివేచన పూర్ణముగఁ గానేరదు. కావున "లోకసంగ్రహ మే వాపి సంపశ్యన్ కర్తు మర్హసి" – లోకసంగ్రహము వైపునకు దృష్టియుంచినను నీకుఁ గర్మ నాచరించుట యుక్తమగును (గీ. 3. 20) అని కర్మయోగముయొక్క సమర్థనముకొఱకు భగవంతుఁ డర్జుననకు, విశేషమహిమగల ముఖ్యమగు' నీ యుపదేశము తుట్టతుదయం దొనర్చెను. లోకసంగ్రహమనఁగా: కేవలము మనుష్యులను 'సంఘీభవింపఁ జేయుట,' లేక, 'కర్మలను వదలిపెట్టుటకు స్వయముగ నధికార మున్నను అజ్ఞానులు కర్మ వదలఁ గూడదు. కావున వారి ప్రరోచన (ప్రవర్తింపఁజేయు) నిమిత్తమై యీ రీతిగ నాచరించుట యను నొక విధమగు వేష' మని యర్థము కాదు. కారణ మేమి యనఁగా: లోకు లజ్ఞానులుగ నుండ వలయునని కాని, లేక, వారి నజ్ఞానులుగనే యుంచు నిమిత్తముగఁ గాని, జ్ఞానికి, కర్మల నాచరించు వేషము కు ధరియింపుమని నేర్పుట వలన గీతలకు నేమియు ప్రయోజనము లేదు. వేషము దూరముగనే యున్నది; కాని లోకు లీ యపకీర్తిని ప్రకటనఁజేయుదురు"(గీ. 2.34) మొదలగు సామాన్యజనులకుఁ దోఁచుయుక్తివాదములచే నర్జుననకు సమాధానము కానప్పుడు దానికంటె గొప్పవియును, తత్త్వజ్ఞాన దృష్టిచే బలవత్తరములు నగు కారణములు భగవంతుఁడిప్పుడు వక్కాణించుచున్నాఁడు. కావున సంగ్రహశబ్దమునకు ముద్దచేయుట, ఉంచుట, పాలించుట, నియమించుట మొదలగు నిఘంటువులోని యర్థములన్నియు యథాసంభవముగ నిచ్చో చేసికొననగు. మఱియు నటులు చేసితి మేని లోకుల సంగ్రహపదమునకు "వారి నేకత్ర సంబంధింపఁజేసి, పరస్పరానుకూల్యముగ నుత్పన్నమయిన సామర్థ్యము వారికి సంఘటించునటు లొనర్చి పాలించుటయు, పోషించుటయు, లేక, నియమించుటయు, మఱియు నిందుమూల

ముగ తన యభివృద్ధి స్థిరముగ నుంచి, పిదప వారిశ్రేయఃప్రాప్తి యొక్క మార్గములోఁ బ్రవర్తింపఁజేయుట" యని యర్థము లగును. 'రాష్ట్రసంగ్రహ' శబ్దము కీ యర్థమునందే మనుస్మృతిలో నుదాహరింపఁబడినది (మను. 7. 114). శాంకరభాష్యమునందు "లోకసంగ్రహః=లోకస్యోన్మార్గప్రవృత్తినివారణం" అనఁగా "లోకులు పెడత్రోవలోనికి పోకుండ నివారించుట" యని యీ శబ్దమునకు వ్యాఖ్యానము చేయఁబడినది. మఱియు దానివలన నజ్ఞానముచే యథేచ్ఛగ నాచరించు జనులను నిపుణులను జేసి యభివృద్ధితో నొండొక ప్రదేశమున నుంచుట మఱియు నాత్మోన్నతి (తన యభ్యుదయమునకు) యొక్క మార్గమునఁ బ్రవర్తింపఁజేయుట యని సంగ్రహశబ్దమునకు నేను జేసిన యర్థములు అపూర్వములు, నిరాధారములు కావని కాన్పించును. ఇదివఱకు 'సంగ్రహ' శబ్దార్థమైనది. కాని 'లోకసంగ్రహ' శబ్దమందున్న 'లోక' శబ్దము కేవలము మనుష్యవాచకము కాదనియు నిక్కడ చెప్పవలయును. జగత్తునందున్న యితర ప్రాణులకంటె మనుష్యుఁడు శ్రేష్ఠుఁ డగుటచే మానవజాతీయమగు కల్యాణము సైతము ముఖ్యముగ లోకసంగ్రహశబ్దార్థమగు ననుట నిజమే. అయినను భూర్లోకము, సత్యలోకము, పితృలోకము, దేవలోకము మొదలగు ననేకలోకములు, అనఁగా: ఏ జగత్తులు, భగవంతునిచే నిర్మింపఁబడినవో వానికిని సరియగు ధారణ, పోషణములై యవి యన్నియు మంచిరీతిగనే నడచుచుండవలయు ననియే భగవంతుని యూహ యగుటచే, మనుష్యలోకమున కెటులో యటులే యీ సర్వలోకములయొక్క వ్యవహారములును సుస్థితిచే నడిపింపవలయును. కావున (లోకానాం సంగ్రహః) అనుదానిలో నింతవ్యాపకమగు నర్థమిచ్చుట వివక్షితముగ నున్నదని చెప్పవలసివచ్చెను. మఱియు జనకుఁ డేకర్తవ్యమును స్వయముగఁ జేసెనో దానివలన దేవతలు, పితరులును తృప్తిఁ జెందింపఁ బడుదురనియు

భగవద్గీత యందలి మూఁడవ యధ్యాయమునందును, మహాభారత మునందున్న నారాయణీయోపాఖ్యానమందును నే యజ్ఞచక్రము వర్ణింపఁబడినదో, దానియందు దేవలోకము, మనుష్యలోకమును-వీని ధారణ కావలయునని బ్రహ్మదేవుఁడు యజ్ఞములను సృజియించినటుల చెప్పఁబడినది. దీనివలన నొక మనుష్యలోకముయొక్క ధారణమునే కాక, దేవాది స్వర్గలోకములయొక్క ధారణమును జేయుచు పరస్పర మును పరస్పరశ్రేయస్సును సంపాదించుకొనుట యనునదియే 'లోక సంగ్రహ' పదముచే భగవద్గీతలయందు వివక్షితమని స్పష్టమగును. సర్వసృష్టిని పాలించియు, పోషించియు లోకసంగ్రహముఁ జేయ వలయునని భగవంతునకుఁ గల యధికారమే, జ్ఞానియైనపిదపఁ దన జ్ఞానమూలముననే యతనికి సంప్రాప్తమగును. జ్ఞానుల కే విష యము ప్రమాణమని తోఁచునో దానినే యితరులగు లోకులు ప్రమాణ మని యంగీకరించి యా రీతిగ నాచరించుచున్నారు (గీ. ౩. ౨౧). కారణ మేమియన: సర్వజగత్తునకును ధారణపోషణములు దేనిచే నగు నని శాంతచిత్తముతోడను సమబుద్ధిచేతను విచారించి తదనుసారముగ ధర్మనియమముల విధించుట యనుకార్యము జ్ఞానులదియే యగునని సామాన్యజనులు తలఁచుచున్నారు. మఱియు నిట్లు తలఁచుటయు తప్పుకానేరదు. వేయేల? సామాన్యజనులకీ విషయము బాగుగఁ దెలియక పోవుటచేతనే జ్ఞానిపై నీ భారము నుంచుచున్నారని చెప్పి నను చెప్పవచ్చును. ఈ యభిప్రాయమునే మనస్సునం దిడికొని-

లోకసంగ్రహసంయుక్తం విధాత్రా విహితం పురా,
సూక్ష్మధర్మార్థనియతం సతాం చరిత ముత్తమమ్.

మ. భా. శాం. 258.25

- లోకసంగ్రహము చేయునదియు, ధర్మసంశయము గలిగిన సమ యమం దే ధర్మము నవలంబింపవలయునో చెప్పునట్టిదియు నగు సాధుపురుషులయొక్క యుత్తమమగు చరిత్రము స్వయముగ బ్రహ్మ

దేవునిచేతనే యేర్పరుపఁ బడినది అని శాంతిపర్వమునందు భీష్ముఁడు యుధిష్ఠిరునకుఁ జెప్పెను. లోకసంగ్రహ మనఁగా లేనిపోని యధికారమును బూనుట గాని, లేక, యజ్ఞానములో లోకులఁ బ్రవేశపెట్టుట యను యుక్తి గాని కానేరదు. జ్ఞానయుక్తమగు కర్మ జగత్తునందు లేకపోయె నేని జగత్తు నశించుట సంభవించును. కాన బ్రహ్మదేవునిచేతనే నిర్మింపఁబడిన సాధుపురుషుల కర్తవ్యములలో నిదియొక ముఖ్యకర్తవ్యమని దీనివలన సిద్ధమగుచున్నది. మఱియు "నే నీ కార్యమును జేయనినాఁడు లోకము లన్నియు నుత్సన్నము లగును" (గీ. 3. 24) అను భగవద్వచనమునకు భావార్థము నిదియే యైయున్నది. ఈ జనులకు జ్ఞాని నేత్రముగ నున్నాఁడు. మఱియు నతఁడొక వేళ తన పనులను వదలెనేని యీ జగత్తు గ్రుడ్డిదై నశింపక మానదు. సర్వనాశము కాక మానదు. జ్ఞానులే లోకులను జ్ఞానవంతులఁగఁ జేసి యున్నతికిఁ గైకొని రావలసిన వారు. ఈ కార్యము కేవలము ముఖపాఠముచే (అనఁగా: ఉపదేశ మాత్రము చేతనే) తప్ప నెప్పుడును సిద్ధము కాదు. కారణ మేమి యనఁగా: సదాచార మభ్యాసము లేకపోవుటచే పరిశుద్ధతను జెందని బుద్ధిగల వారికి బ్రహ్మజ్ఞానము మాత్రమే చెప్పఁబడె నేని "నీ దంతయు నాది, మఱియు నాదంతయు నాదే" యని యుపదేశించినటు లగును. అట్టివారు తమ జ్ఞానమును దురుపయోగము చేయుచుండునటులు వ్యవహారమున గాన్పింపక మానదు. ఇంతియే కాక, యెవరియొక్క యుపదేశమునందలి సత్యము నైనను వారియొక్క యాచరణమును బట్టియే లోకులు పరీక్షించుచుందురు. కావున జ్ఞాని తాను కర్మచేయక పోయినయెడల సామాన్యజను లలసు లగుటకు నది యొక కారణ మగును. దీనినే బుద్ధిభేదమని చెప్పుచున్నారు. మఱియు నీ బుద్ధిభేదము లేక లోకులు సత్యముగ నిష్కాములై కర్తవ్యమునకు సిద్ధముగ నుండవలయునని జ్ఞాని సంసారమునందుండియే తన కర్మలచే లోకులను సదాచరణమున (అనఁగా: నిష్కామబుద్ధిచే కర్మ చేయుటయందు) ప్రత్యక్షముగఁ బ్రవర్తింపఁజేయుటయే

యతని కర్తవ్యముగ (వేషముగ) పరిణమించును. కావున కర్మను వదలిపెట్టుటయం దధికార మతని కెప్పుడు నుండదు. కావున స్వప్రయోజనార్థమై కాకపోయినను లోకసంగ్రహార్థమైనను తన వర్ణమునకు విధింపఁబడిన యాశ్రమములోని యన్ని కర్మలను యథాప్రకారముగ నతఁడు చేసియే తీరవలయునని గీతలయొక్క యభిప్రాయము కాని "జ్ఞాని చాతుర్వర్ణ్యముయొక్క కర్మలను నిష్కామబుద్ధిచే నైనను చేయ నావశ్యకము లేదు. వేయేల? చేయనే రాదు" అని సన్న్యాసమార్గీయుల మతము.

కావున జ్ఞాని లోకసంగ్రహార్థమై కర్మలను చేయవలయు నను గీతయొక్క సిద్ధాంతమును సన్న్యాసమార్గీయులగు టీకాకారులు క్రిందుమీఁదు చేసి, భగవంతుఁడు సైతము ప్రత్యక్షముగఁ గాక పోయినను మరియొక విధమున నసత్యమగు నర్థమునే యుపదేశించినాఁడని చెప్పుటకు సైతము సిద్ధముగనే యున్నారు; కాని గీతలయందున్న లోకసంగ్రహశబ్దమునకు ఈ తికమక యగు నర్థము సత్యమగు నది కానేరదని పూర్వాపర సందర్భములవలన స్పష్ట మగును. జ్ఞానికి కర్మత్యాగమునం దధికారము కలదను మతమే మొదట గీతలకు మాన్యము కాదు. మఱియు నిది మాన్యము కాదని నిరూపించుటకు గీతలలోఁ జెప్పిన కారణములలో లోకసంగ్రహ మనునదియే ముఖ్యమగు కారణముగ నున్నది. కావున జ్ఞాని కర్మలను వదలివేయవలయు నను పట్టును నెగ్గించుకొనుటకై లోకసంగ్రహార్థము కర్మలను చేయుమను నుపదేశ మసత్యార్థము కలదని చెప్పుట సర్వవిధముల న్యాయ్యమగును. మనుజుఁ డీ జగత్తున స్వప్రయోజన నిమిత్తమై జన్మింపలేదు. అజ్ఞానముచే సామాన్యజనులు స్వార్థమునందే నిమగ్నులగుచున్నా రను మాట సత్యమే. కాని "సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని"- నేను సర్వభూతముల యందును, సర్వభూతములు నాయందు నున్నవి (గీ. 6. 29) అని యుండునట్లు జగత్తే

యేరికి నాత్మభూతమయినదో, యతఁడే "నాకు మోక్షము లభించెను. ఇప్పుడు లోకులు దుఃఖవంతు లైననువారి చింతనాకేల?" అని చెప్పె నేని తన నోటితోనే తన జ్ఞానమునకు న్యూనతఁ గలుగఁ జేసికొనినవాఁ డగును. జ్ఞాని కాత్మయను స్వతంత్ర వస్తువొక్కటి యేదైన నున్నదా? తనయొక్క యాత్మపై నెంతవఱకు నజ్ఞానరూపమగు నావరణ ముం డెనో యంతవఱకుఁ దాను, లోకులను భేదము స్థిరముగ నుండును; కాని జ్ఞానము కలిగిన పిదప సర్వజనులయొక్క యాత్మయే కావున యోగవాసిష్ఠమునందు వసిష్ఠులవారు-

యావ ల్లోకపరామర్శో నిరూఢో నాస్తి యోగినః,
తావ ద్రూఢసమాధిత్వం న భవ త్యేవ నిర్మలమ్.

యోగ. 6, పూ. 128.97

— ఎంతవఱకు లోకులను పరామర్శించుట (అనఁగా: లోకసంగ్రహ మను పని) కొంచె మైనను మిగిలియున్నదో యంతపర్యంతము యోగారూఢుఁ డగు పురుషునియొక్క స్థితి నిర్దోషముగ నున్నదని యెప్పుడును చెప్పుటకు సాధ్యము కాదు అని చెప్పిరి. అతఁడు తన సమాధిసుఖమునందే మగ్నుఁ డగు నేని యొకవిధముగ స్వార్థమును జూచుకొనువాఁడే యగును. సన్న్యాసమార్గీయు లీ విషయమును విచారింపకపోవుటయే వారి యుక్తివాదమునందున్న ముఖ్యమగు దోషము. ఏ నాఁడును భగవంతునకంటె నధికుఁడగు జ్ఞానియు, నిష్కా ముఁడును, లేక, యోగారూఢుఁడు నగుట శక్యము కాదు: కాని భగ వంతుఁ డయినను సాధుసంరక్షణము, దుష్టనాశనము, ధర్మసంస్థాప నము నను నీ లోకసంగ్రహరూపము లగు కార్యములను జేయుటచే ప్రతి సమయమునందు నా యీ యవతారములం గాల్చె నేని (గీ. 4.9), జ్ఞాని, లోకసంగ్రహమును జేయుట వదలి "ఈ సర్వలోకము లను బుట్టించిన పరమేశ్వరుఁడే తనకఁ దోఁచినట్లు ధారణపోషణము లను జేయును. ఆ వైపునకుఁ జూచుట నైతము నాపని కానేర" దని

తలఁచి యూరకుండుట యన్నివిధముల ననుచిత మగును. కారణ మేమి యన: జ్ఞానము కలిగిన పిదప పరమేశ్వరుఁ డనియు, తాన నియు, లోకు లనియు భేద ముండనే యుండదు; ఉండిన నతఁడు జ్ఞానియే కాఁడు. వేషధారి యని చెప్పవలయును. జ్ఞాని జ్ఞానముచే పరమేశ్వరస్వరూపి యగు నేని పరమేశ్వరుఁడు చేయు కార్యమును పరమేశ్వరునివలె నిస్సంగబుద్ధితో చేయుటకు నావశ్యకత యాతని కెట్లు వదలిపోవును? (గీ. 2.22, మఱియు 4.14 మఱియు 15). ఇంతియె కాక పరమేశ్వరుఁడు సేయునది యంతయు జ్ఞానియొక్క రూపముచేతనో లేక, జ్ఞాని ద్వారముగనో చేయును. కావున "సమస్త భూతములయందు నొక యాత్మయే" యని పరమేశ్వరస్వరూపము యొక్క యపరోక్షజ్ఞానము గలిగిన వారి మనస్సునందు సర్వభూత దయ మొదలుగాఁ గల యుదాత్తవృత్తులు పూర్ణముగ స్ఫురించును. మఱియు స్వభావముగనే యతనియొక్క మనఃప్రవృత్తి లోకకల్యాణమునందే పనిచేయుచుండవలయును. ఈ యభిప్రాయముచేతనే-

**జే కాఁ రంజలే గాఁజలే త్యాఁసి మ్హణే జో ఆపులే,**
**తోచి సాధు ఓళఖావా దేవ తేథోచి జాణావా.**

**గా. 960.1-2**

— ఎవడు మిక్కిలి వ్యాకులులైన వారికిని, దుఃఖితులకును, "నేను మీ వాఁడను, నే నుండఁగ మీకు భయము లే"దని చెప్పునో వాఁడే సాధువు. వానియందే యీశ్వరుఁ డున్నాఁ డనియు, లేక-

**పర ఉపకారీఁ వేచియేల్యా శక్తి, తేణేఁ ఆత్మస్థితీ జాణతలీ.**

**గా. 4 582**

— ఎవఁడు పరోపకారమునందే తన శక్తిని వినియోగించునో వాఁడే యాత్మస్థితిని తెలిసికొన్నవాఁడు అనియు నీ తీరున సాధువుల లక్షణమును జెప్పి-

> जगाच्या कल्याणा संतांच्या विभूति,
> देवे कष्टविती उपकारें.
>
> గా. 929

— సత్పురుషు లవతరించుట లోకకల్యాణార్థమే. వారు పరోపకారము కొఱకుఁ దమ శరీరమును సైతము కష్టపెట్టుకొందురు అని తుకారాంబువాగారు సత్పురుషులయొక్క (అనఁగా: భక్తిచే పరమేశ్వరుని యొక్క పూర్ణజ్ఞానముగలవారియొక్క) మాహాత్మ్యమును వర్ణించెను. మఱియు, "స్వార్థో యస్య పరార్థ ఏవ స పుమా నేకః సతా మగ్రణీః" — పరార్థ మేరికి స్వార్థమో యా పురుషుఁడే సాధువులలో శ్రేష్ఠుఁడు, అని భర్తృహరి చెప్పెను. మన్వాది శాస్త్రకర్తలు జ్ఞానులు కారా? కాని వారు తృష్ణవలన దుఃఖము గలదని భయపెట్టినను పరోపకారము మొదలగు నుదాత్తవృత్తు లన్నియు నుండవలసినవే యని చెప్పి లోకసంగ్రహకారకమగు శాస్త్రీయమర్యాదను బ్రవర్తింపఁజేసిరి. బ్రాహ్మణులకు జ్ఞానము, క్షత్రియులకు యుద్ధము, వైశ్యులకుఁ గృషి గోరక్షణము, శూద్రునకు సేవయు నని, యే యే గుణకర్మస్వభావానుసారము లగు వేర్వేఱు ధర్మములు శాస్త్రములయందు విధింపఁబడినవో యవి యొక్కొక్క వ్యక్తియొక్క హితము కొఱకే కాదు. మొత్తముపై సమాజమును కాపాడు నిమిత్తమై కొందఱు యుద్ధముఁ జేయుటయే యెప్పుడు నభ్యసించి తప్పక సిద్ధముగ నుండవలయును. కొందఱు కృషివ్యాపారము, జ్ఞానార్జనము మొదలగు కార్యము లొనర్చి సమాజమునకు నితరములగు కొఱంతలను బూర్తిజేయవలయు నని యెన్నియే చాతుర్వర్ణ్యముయొక్క కర్తవ్యవిభాగము లోకసంగ్రహార్థమై ప్రవర్తింపఁ జేయఁబడినది యని మనుస్మృతియందుఁ జెప్పఁబడి యున్నది. గీతయొక్క యభిప్రాయమును నదియే (మను. 1·87; గీ. 4 13; 18.41 చూడు). ఈ చాతుర్వర్ణ్య ధర్మములలో నే ధర్మము మునిఁగిపోయినను దానింబట్టి సమాజము

కుంటిదై తుదకు నశించుటయు సంభవింపవచ్చు నని పూర్వమునందే చెప్పఁబడినది. అయినను కృత్యవిభాగము చేయు నీ వ్యవస్థ యొక విధముగనే యుండునని నియమము లేదు. ప్రాచీనుఁడు, గ్రీకు తత్త్వజ్ఞుఁడునగు ప్లేటో యీ విషయముపై నున్న తన గ్రంథము నందును, అర్వాచీనకాలమునందు ఫ్రెంచిశాస్త్రజ్ఞుఁడగు కాం టను నతఁడు తన "అధిభౌతికతత్త్వజ్ఞానమునందును" సమాజధారణా ర్థమై సూచించిన వ్యవస్థ చాతుర్వర్ణ్య సదృశముగ నున్నను, వైదికధర్మమునందున్న చాతుర్వర్ణ్యవ్యవస్థకంటె కొంచెముగనో గొప్పగనో భిన్నముగనే యున్నదని యీ గ్రంథమును జదివినవారి కెవరికైనను దెలియును. వీనిలోనే, సమాజవ్యవస్థ మంచిది యని కాని, యీ మంచితనము సాపేక్ష మగుటచే, యుగమానముచేత దానియం దేమైనను భేద ముండవచ్చునా? యుండదా? యని కాని, యిట్టి యనేక శంక లచ్చట బయలుదేరుచున్నవి. కావుననే లోక సంగ్రహ మనునదియే యీ కాలమునందు పాశ్చాత్యదేశములలో నొక గొప్ప శాస్త్రముగ నున్నది; కాని గీతాతాత్పర్యనిర్ణయ మను నదియె మనకు ప్రస్తుతవిషయ మగుటచే నీ ప్రశ్నను విచారించుట లోనే కాలయాపనఁ జేయుట కేమియు వీలులేదు. గీతాకాలము నందు చాతుర్వర్ణ్యవ్యవస్థ విశేషముగ నాచరణలో నుండుటచే నది మూలమునందే లోకసంగ్రహమును చేయుద మను తలంపుననే ప్రవృత్త మయిన దను విషయము నిర్వివాదముగనే యున్నది. కావున చాతుర్వర్ణ్యవ్యవస్థాను సారముగ ప్రాప్తము లయిన తమ కర్మలను నిష్కామబుద్ధితో నెట్లు చేయవలసినదియు లోకులకు ప్రత్యక్షముగ మనస్సునకు గోచరమగునట్లు చెప్పుటయని 'లోక సంగ్రహ' మను గీతయందున్న పదమునకు నర్థమని మాత్రమే యిచ్చో ముఖ్యముగఁ జెప్పవలసియున్నది. సమాజమునకు జ్ఞాని నేత్రమే కాక, గురువుసైతము నై యున్నాఁడు. కావునఁ బూర్వోక్త మగు లోకసంగ్రహమును చేయుటకు తన కాలమునందున్న సమాజ

వ్యవస్థయందు న్యూన మేమయినను నుండెనేని శ్వేతకేతువువలె దేశ కాలానురూపముగ దానిని తీసివైచి సమాజముయొక్క ధారణపోషణ ముల శక్తిని చెడిపోనియక నది వృద్ధిఁ బొందు మార్గమునకు సంబంధించున ట్టుద్యోగము చేయవలయు నని తుదకు ప్రాప్త మగును. ఇట్టి లోక సంగ్రహమును జేయుటకై జనకుఁడు సన్న్యాసమును బుచ్చుకొనక యామరణాంతము రాజ్యపాలనమునే చేయుచు నుండెను. మఱియు మొదట మనువు రాజుగా నుండుట కంగీకరించెను. ఈ కారణముచేతనే "స్వధర్మ మపి చావేక్ష్య న వికంపితు మర్హసి" — స్వధర్మానుసారముగ ప్రాప్తమయిన కర్మలవిషయమై దుఃఖించుట నీకు యోగ్యము కాదు (గీ. 2. 31) అనియు, "స్వభావ నియతం కర్మకుర్వ న్నాప్నోతి కిల్బిషమ్" — స్వభావగుణానురూపముగ నిర్ణయింపఁబడిన (చాతుర్వర్ణ్యవ్యవస్థానుసారముగ విధింపఁబడిన) కర్మలను జేయుటచే నీ కేమియు పాపము రాదు (గీ. 18.47) అనియు, చాతుర్వర్ణ్య ధర్మానుసారముగ ప్రాప్తమయిన యుద్ధమును చేయు మనియు నర్జునునకు గీతలయందు మాటిమాటికి నుపదేశము చేయఁబడినది. యథాశక్తిగ నెవ్వరును పరమేశ్వరుని తెలిసికొనవలదని చెప్పరు. వేయేల? ఈ జ్ఞానమును సంపాదించుకొనుటయే మనుష్యునకి జగత్తునందు ముఖ్యముగఁ జేయఁ దగినపని యని గీతయొక్క సిద్ధాంతము; కాని యాత్మయొక్క యే స్వీయమగు కల్యాణము గలదో దానియందే సమష్టిరూపమగు నాత్మయొక్క కల్యాణార్థమై యథాశక్తిగఁ బ్రయత్నించుటకును వీలుండును గాన లోకసంగ్రహమును జేయుట యనునదియే బ్రహ్మాత్మైక్యజ్ఞానమునకు సత్యమైన పర్యవసాన మని గీతయందు విశేషముగఁ జెప్పఁబడినది. అయిన నొకఁడు బ్రహ్మజ్ఞాని యగు నేని యంతమాత్రము చేతనె యతఁడు సర్వవిధము లగు వ్యావహారికములగు కార్యములను స్వహస్తములతో జేయుటకుఁ బాత్రుఁ డగునని తాత్పర్యము కాదు. భీష్ముఁడు,

వ్యాసులు నను నీ యిరువురును మహాజ్ఞానులును, పరమ భగవద్భక్తులుగ నుండిరి; కాని వ్యాసులవారు, భీష్ములవారివలె యుద్ధముఁ జేసిరని యెవరును నుడువరు. లేక, దేవుని విషయమున విచారించినను జగత్తును సంహరించుట యను కార్యము శంకరునికి మాఱుగ విష్ణువే చేయునట్లు కాన్పింపదు. జీవన్ముక్తావస్థ యనునది మనస్సుయొక్క నిర్విషయత్వమున, సమము శుద్ధము నయిన, బుద్ధికిని నాధ్యాత్మికోన్నతికిని కడపటిమెట్టయి యున్నది. అది యాధిభౌతికోద్యోగములయొక్క సామర్థ్యమును పరీక్షించుటకు పీలుకాదు గనుక, స్వభావానురూపముగ ప్రవృత్తమైన చాతుర్వర్ణ్యాదివ్యవస్థ ననుసరించి యే కర్మల నామరణాంతము చేయుదుమో యవియే స్వధర్మానుసారములగు కర్మలు. జ్ఞానము గలిగినపిదప లోకసంగ్రహార్థమై జ్ఞాని యా కర్మల నాచరించుచునే యుండవలయును. కారణ మేమియన: ఆ కర్మలయందే, వాఁడు నిపుణుఁడు కావచ్చును. పొరపాటున మఱియొకపనిఁ జేసెనేని యందువలన సమాజమునకు నష్టము కలుగును. కాన విశేషోపదేశము గీతలయందు మరల నీ ప్రకరణమునందే రెండు పర్యాయములు చేయఁబడినది (గీ. 3. 35; 18. 47). ఈశ్వర నిర్మిత మగు ప్రకృతి స్వభావగుణానురూపమును ప్రతి మనుజునకును గల యీ వేర్వేఱగు యోగ్యతలనే యధికారము లని చెప్పుచున్నారు; మఱియు "పురుషుఁడు బ్రహ్మజ్ఞాని యైనను నీ యధికారానుసారముగ ప్రాప్తములగు కర్మలను లోకసంగ్రహార్థమై యామరణాంతము నాచరింపవలయును; వదలిపెట్టరాదు. "యావ దధికార మవస్థితి రాధికారిణాం" (వే. సూ. 3. 3. 32) అని వేదాంతసూత్రములలోఁ జెప్పఁబడినది. వేదాంతసూత్రకారుల యీ యుపపత్తియు గొప్ప యధికారము గలవారికె వర్తించునని యనేకులు చెప్పుచున్నారు. మఱియు నీ సూత్రముయొక్క భాష్యమునందుఁ దత్సమర్థనార్థమై యీయఁబడిన యుదాహరణములం జూచితి మేని,

యవియన్నియు వ్యాసులు మొదలగు గొప్పయధికారుల సంబంధము లయినవి యని కాన్పించును. కాని మూలసూత్రమునం దధికారము యొక్క న్యూనాధికభావవిషయమై యేమియుఁ జెప్పఁబడ లేదు. కావున నధికార మనఁగా చిన్నవియు గొప్పవియునగు నన్నియధికారములును గ్రహింప వలసివచ్చును; మఱియు నీ యధికార మెవరి కెటులు ప్రాప్తమగునని సూక్ష్మముగను స్వతంత్రముగను విచారించితిమేని మనుష్యునివలెనే సమాజమును, సమాజమువలెనె మనుష్యులును పరమేశ్వరునిచే సృజియింపఁ బడియుండుటచే నెవరి కెంత బుద్ధిబలము, సత్తాబలము, ద్రవ్యబలము, లేక, శరీరబలము స్వభావముగనె యుండునో, లేక, స్వధర్మముచేఁ బొందనగునో దాని ననుసరించి జగత్తుయొక్క ధారణ పోషణలను జేతనైనంతఁ జేయుటకుఁ గొంచెమో గొప్పయో యధికారము చాతుర్వర్ణ్యాదికముచేఁ గాని, యితర గుణకర్మ విభాగరూపమయిన సామాజికవ్యవస్థచేఁ గాని ప్రతి మనుజునకును జన్మ మొదలుకొని ప్రాప్తమగునని స్పష్టముగఁ గన్పట్టుచున్నది. యంత్రము బాగుగ నడచుటకు పెద్దచక్రము వలెనే మిక్కిలి చిన్నచక్రమును నవసరమగునట్లే సర్వజగత్తున నీ గొప్ప కార్యము, లేక, యీ లోక మను మోటబాన, చెడకుండ కాపాడుటకు వ్యాసులు మొదలయిన వారియొక్క గొప్ప యధికారమువలెనె యితరులయొక్క చిన్న యధికారము సైతము పూర్ణముగను, తగినంతయు నవసర మున్నదని తెలిసికొనవలయును. కారణ మేమి యనః కుమ్మరి కుండలను, సాలెవాఁడు వస్త్రములను నిర్మింపని యెడల రాజు యోగ్యముగ సంరక్షించినను లోకసంగ్రహ మను కార్యము పూర్తి కానేరదు; లేక, రైలుబండి యందొకా నొక చిన్న యధికారి, లేక, యిక్కడనుండు జెండాను జూపు బ్రాకొతు తన కర్తవ్యమును జేయఁడేని వాయువేగములతో రైలుబండి రేయుంబగళ్లు ప్రస్తుతము నిర్భయముగ నెట్లు పరుగిడుచున్నదో యటులు పరుగిడుటకు సాధ్యము కానేరదు. కావున వ్యాసులు మొదలగు గొప్ప

యధికారులే కాక యితరులు సైతము అతఁడు రాజైనను సరే, సామాన్యుఁడగు మనుష్యుఁ డయినను సరే లోకసంగ్రహమును జేయుటకై తమకు యథాన్యాయముగ ప్రాప్తమయిన చిన్నవియు, పెద్దవియునగు నధికారములను జ్ఞానము కలిగిన పిదప వదలవలయు నని యనుకొనక 'నా యధికారమునే నిష్కామబుద్ధితో యథాశక్తిగను, యథామతిగను, యథాసంభవముగ నామరణాంతము నాచరించుచుండవలయును' అని వేదాన్తసూత్రకారులచేఁ బడిన యుక్తి వాదముచేతనే యిప్పుడు నిష్పన్న మగును. నేను గాకపోయినను మఱియొకరు పనిని జేయుదు రని చెప్పుట మంచిది కానేరదు. కారణ మేమియన: అట్లగునేని మొత్తముపై పని కొఱకు మనుష్యుఁడు తక్కువగుటచే సమాజమున నున్న సంఘశక్తి తక్కువ యగును. ఇంతియెకాక జ్ఞాని యేకార్యము నెంత బాగుగఁ జేయునో యా రీతిగ నితరులకు నది సాధించుటకు శక్తియుండదు కావున తదనుసారముగ లోకసంగ్రహము సైతము కుంఠిత మగును. ఇంతియె కాక, జ్ఞాని యొక్క కర్మత్యాగ రూపమగు నుదాహరణములచే లోకులయొక్క బుద్ధియు చెడిపోవునని పూర్వముననే చెప్పఁబడినది. కర్మచేతఁ గలిగిన చిత్తశుద్ధివలన తన యాత్మకు మోక్షము గలిగినంత మాత్రము చేతనె సంతుష్టుఁడు కావలయును. జగత్తునకు నాశము కలిగినను లక్ష్యముఁ జేయగూడదు. "లోకసంగ్రహధర్మం చ నైవ కుర్యా న్న కారయేత్"– లోకసంగ్రహమును జేయను గూడదు, చేయింపను కూడదు (మ. భా. అశ్వ. అనుగీత 46. 39) అని సన్న్యాసమార్గీయు లప్పుడప్పుడు చెప్పుట సత్యమే; కాని వ్యాసాదులయొక్క నడవడికను చెప్పునట్టి యుపపత్తివలననే దీనికి సమాధానము కలుగును; వసిష్ఠ పంచశిఖాచార్యులవంటి వారు, శ్రీరామ జనకాదులకు వారి వారి యధికారానుసారముగ సమాజముయొక్క ధారణపోషణాదికార్యముల నామరణాంతముఁ జేయవలయు నని చెప్పియుండుటనుబట్టి

కర్మ వదలివేయవలయు నను సన్న్యాసమార్గీయుల యుపదేశ మేక దేశీయముగ నున్నది; కాని శాస్త్రముచే సిద్ధమైనదియు నన్నివిధముల సత్యమయినదియు కాదని స్పష్ట మగుచున్నది. కావున నిట్టి యేక పక్షీయమగు నుపదేశమును నమ్మక భగవంతునియొక్క స్వీయమగు దృష్టాంతము ననుసరించి జ్ఞానము గలిగినపిదప సైతము తమ యధికారము నెఱింగి తదనుసారముగ లోకసంగ్రహ కారకములగు కర్మల నామరణాంతము నాచరించుటయే శాస్త్రోక్తము, యుక్తము నగుమార్గమని చెప్పవలయును. అయిన నీ లోకసంగ్రహము సైతము ఫలాశచేఁ జేయఁదగినది కానేరదు. లోకసంగ్రహముయొక్క ఫలాశ నైనఁ జెందెనేని, కర్మ నిష్ఫలమగుటచే దుఃఖము కలుగక తప్పదు. కావున 'నేను లోకసంగ్రహము చేయుదు' ననునది యభిమానమును లేక, ఫలాశను, మనస్సులో నుంచుకొనక లోకసంగ్రహమును జేయుటయు కేవలకర్తవ్య బుద్ధిచేతనే చేయవలసివచ్చును. 'లోక సంగ్రహార్థ' మనఁగా లోకసంగ్రహ రూపమగు ఫలము లభించుట కని యర్థము కాదు. 'లోకసంగ్రహ మేవాపి సంపశ్యన్'— లోక సంగ్రహము నిమిత్త మైనను (సంపశ్యన్) నీవు కర్మలను జేయ వలయును (గీ. ३. ૨૦) అని గీతలయందుఁ జెప్పఁబడుటకుఁ గారణ మిదియె. లోకసంగ్రహ మను కర్తవ్యము గొప్పదియే. కాని యనా సక్తిచే సర్వకర్మలను జేయవలయు నని యీ శ్లోకముకంటె పూర్వ శ్లోకమున (గీ. 3.19). భగవంతుఁ డర్జునునకుఁ జేసిన యుపదేశము లోకసంగ్రహమునకు సంబంధించునని మఱువఁ గూడదు.

జ్ఞానకర్మలకుఁ గల విరోధము జ్ఞానమునకును కామ్యకర్మల కునే కాని, జ్ఞానము నిష్కామకర్మ యను వాని కధ్యాత్మదృష్టిచే సైతము విరోధము వేఱు గాన కర్మ యపరిహార్యమును, లోకసంగ్రహ దృష్టిచే నావశ్యకము నగును. కావున జ్ఞాని యావజ్జీవము యథాధి కారముగ నిస్సంగబుద్ధితో చాతుర్వర్ణ్యముయొక్క కర్మలను జేయు

చునే యుండవలయునని శాస్త్రీయయుక్తి వాదముచే సిద్ధ మయినది. గీతలకు నదియే యుద్దేశ మని చెప్పవలసి వచ్చె నేని వైదికధర్మముల యందున్న స్మృతిగ్రంథములలోఁ జెప్పఁబడిన నాలు గాశ్రమముల లోను సన్న్యాసాశ్రమముయొక్క గతి యేమి యగునని సహజముగ మనస్సునకుఁ దోఁచును. మన్వాది సర్వస్మృతులయందును బ్రహ్మ చారి, గృహస్థుఁడు, వానప్రస్థుఁడు, సన్న్యాసి యని నాలుగాశ్రమ ములం జెప్పి యధ్యయనము, యజ్ఞయాగ దానములు, లేక, చాతుర్వర్ణ్యధర్మానుసారముగ ప్రాప్తమగు నితర కర్మలును, శాస్త్రోక్త మగు నాచరణచే మొదటి మూఁడాశ్రమములలోను చేయుటవలన క్రమముగ చిత్తము శుద్ధమయిన పిదప తుదకు సర్వకర్మలను స్వరూ పముతోనే వదలి పెట్టవలయును. మఱియు సన్న్యాసముఁ గైకొని మోక్షమును సంపాదింపవలయునని చెప్పఁబడినది (మను. 6.1;33-37 చూడు). దీనివలన యజ్ఞయాగములు దానాది కర్మలును గృహస్థా శ్రమమునందు విహితము లయినను నవి చిత్తశుద్ధికొఱకు, అనఁగా: విషయాసక్తిని, లేక, స్వార్థపరాయణబుద్ధిని వదలి పరోపకారబుద్ధి క్రమముగ వృద్ధిఁబొంద సర్వభూతములయందు నొకే యాత్మయున్న దని యెఱుంగునంత వఱ కాచరింపవలసి యుండును. కావున నీ స్థితి ప్రాప్తమయిన పిదప మోక్షప్రాప్తికై తుదకు సర్వకర్మలను స్వరూప ముతోనే త్యజించి సన్న్యాసాశ్రమమునే కైకొనవలయు నని సర్వ స్మృతికారులయొక్క యభిప్రాయ మయినటుల స్పష్ట మగుచున్నది. శ్రీశంకరాచార్యులవారు కలియుగమున స్థాపనఁజేసిన సన్న్యాసమార్గ మిదియె కావున స్మార్తమార్గీయుఁడగు కాళిదాసుఁడును—

> శైశవేఽభ్యస్తవిద్యానాం యౌవనే విషయైషిణామ్,
> వార్ధకే మునివృత్తీనాం యోగే నాంతే తనుత్యజామ్.
>
> రఘు. 1.8

— బాల్యమున విద్యాభ్యాసముఁ జేయువారును (బ్రహ్మచర్యమున);

యౌవనమునందు విషయోపభోగరూప మయిన గృహస్థాశ్రమ ధర్మము నాచరించువారును, నుత్తర వయస్సున మునివృత్తితోనుండు వారును, లేక, వానప్రస్థాశ్రమమునం దుండువారును, దుదకు (పాతంజల) యోగముచే సన్న్యాసధర్మానుసారముగ ప్రాణమును బ్రహ్మాండమందున్న యాత్మయొద్దకుఁ బంపి శరీరమును వదలిపెట్టు వారును అని సూర్యవంశపురాజులయొక్క మార్గమును వర్ణించెను. అటులే మహాభారతమునం దున్న శుకానుప్రశ్నమునందు—

**చతుష్పదీ హి నిశ్శ్రేణీ బ్రహ్మణ్యేషా ప్రతిష్ఠితా,**
**ఏతా మారుహ్య నిశ్శ్రేణీం బ్రహ్మలోకే మహీయతే.**

**శాం. 241. 15**

— (చతురాశ్రమ రూపమగు) ఈ నాలుగుమెట్లను తెలిసికొనినవాఁడు తుదకు బ్రహ్మపదమును బొందును. ఈ నిచ్చెనపై నెక్కి, యనఁగా నొక యాశ్రమములో నుండి మఱియొక యాశ్రమమునకు మెల్లెక్కు నట్లు ప్రవేశించి తుదకు బ్రహ్మలోకమునందు మహత్త్వమును బొం దును అని చెప్పి—

**కషాయం పాచయిత్వాశు శ్రేణిస్థానేషు చ త్రిషు,**
**ప్రవ్రజేచ్చ పరం స్థానం పారివ్రాజ్య మనుత్తమమ్.**

**శాం. 244.3**

— ఈ నిచ్చెనయొక్క మూఁడు మెట్లులయందును తన కిల్బిషమును (అనఁగా: స్వార్థపరాయణమగు బుద్ధిని), లేక, విషయాసక్తి రూప మగు దోషమును మనుజుఁడు శీఘ్రముగ క్షయింపఁ జేసికొని, పిదప సన్న్యాసమును గైకొనవలయును. పారివ్రాజ్య మనఁగా సన్న్యాసము. ఇదియే అన్నిటియందు శ్రేష్ఠమగు స్థానము అని క్రమము వర్ణింపఁ బడినది; ఒక యాశ్రమములో నుండి మఱియొక యాశ్రమములోనికి ప్రవేశించు క్రమ మిటులే మనుస్మృతియందును వర్ణింపఁ బడినది

(మను. 6-34). కాని వీనిలోఁ గడపటిది యగు సన్న్యాసాశ్రమమున లోకులు వ్యర్థముగఁ బ్రవేశించి రేని జగత్తునందున్న కర్తృత్వము స్పష్టమగుటచే సమాజము కుంటిది యగు నను విషయము మానవు నకుఁ బూర్ణముగ దెలిసియే యున్నది. కావున పూర్వాశ్రమమునందు గృహస్థధర్మానుసారముగఁ బరాక్రమ సంబంధమగు నవియు, లోక సంగ్రహ సంబంధమగు నవియు నగు సర్వకృత్యములును తప్పక చేయవలయు నని చెప్పి, యవి యయిన పిదప—

**గృహస్థ స్తు యదా పశ్యేత్ వలీపలిత మాత్మనః,**
**అపత్య స్యైవ చాపత్యం తదాఽరణ్యం సమాశ్రయేత్.**

మను. 6.2

— శరీరమునకు ముడుతలు పడుట కారంభమై, మనుమఁడు దృష్టికి గోచరమైన పిదప గృహస్థుడు వానప్రస్థుఁడై సన్న్యాసమును గైకొన వలయును అని మనువు స్పష్టముగ నవధిని చెప్పియున్నాఁడు. ఈ యవధి యెందుకొఱకు నిరీక్షింపవలయునో యను ప్రశ్నకు మను స్మృతియందే "ప్రతి మనుజుఁడును జన్మము మొదలుకొని ఋషుల యొక్కయు, దేవతలయొక్కయు, పితరులయొక్కయు మూఁడు ఋణ ములను (కర్తవ్యములను) మోయుచునే యున్నాఁడు. కావున వేదా ధ్యయనముచే ఋషులయొక్కయు, పుత్త్రోత్పాదనచే పితరులయొక్క యు, యజ్ఞకర్మలచే దేవతలయొక్కయు ఋణమును మొదట తీర్చి ననే తప్ప వాఁడు సంసారమును వదలి సన్న్యాసమును గైకొనుటకు వీలు లేదు. అట్లు చేయకపోయెనేని జన్మము మొదలుకొని ప్రాప్త మగు నీ ఋణములను తీర్పకయే పోవుటచే నధోగతిని బొందును అని సమాధానము చెప్పఁబడినది (మను. 6. 35. 37; మఱియు వెనుకటి ప్రకరణమునందుఁ జెప్పఁబడిన తై. సం. మంత్రమును చూడు). ప్రాచీనము లగు హిందూధర్మశాస్త్రముల ననుసరించి తండ్రియొక్క ఋణమును వ్యాజ్యెపుయుక్తుల నేమియుఁ జెప్పక, కుమారుఁడు గాని,

మనుష్యుఁడు గాని తీర్చవలయును. ఎవరైనను ఋణముఁ దీర్పక చచ్చుట యనునది గొప్ప దుర్గతికి కారణ మని చెప్పితి మేని, జన్మ మొదలుకొని ప్రాప్తమగు పూర్వోక్తమహత్త్వము గలిగిన సామాజిక కర్తవ్యమును ఋణ మని చెప్పుటకు మన శాస్త్రకారుల యుద్దేశ మే మయి యుండునదియుఁ జదువరులకు సహజముగనే తెలియును. స్మృతికారులచే విధింపఁబడిన యీకట్టుబాట్లననుసరించి సూర్యవంశపు రాజు లాచరించుచు వచ్చిరి. మఱియు వారు కుమారుఁడు రాజ్యమును పాలించుటకు సమర్థుఁ డగునేని యితనిని గద్దెపై కూర్చుండఁబెట్టిన పిదప (పూర్వమునందు కాదు) గృహస్థాశ్రమములో నుండిస్వయముగ నివృత్తు లయినారని కాళిదాసు రఘువంశమునందు చెప్పెను (రఘు. 7-68). ఈ నియమమును పాలింపక మొదట దక్షప్రజాపతియొక్క యీశ్వరు లను పేరుగల కుమారులకును, అనంతరమున శబలాశ్వు లను పేరుగల యనేకులగు పుత్త్రులకును వివాహము గాకమును పే నారదులవారు నివృత్తిమార్గము నుపదేశించుటచే వారు సన్న్యాసు లయి నందున నీ యశాస్త్రీయము, గర్హ్యమునైన ప్రవర్తనవిషయమై నారదుని నిర్భర్త్సించి దక్షప్రజాపతి యాయనకు శాపంబిచ్చి నటుల భాగవతంబునందుఁ జెప్పఁబడినది (భాగ. 6. 5. 35-42). మనము సాంసారిక కృత్యములను యథాశాస్త్రీయముగఁ బూర్తి చేసికొని మన కొమాళ్లు వ్యవహారసమర్థు లగుదురేని, వృద్ధత్వమున సంసార మందున్న యుపద్రవము లేమియు లేకుండుటకై మోక్షపరాయణుల మై స్వీయమగు నానందముచేతనే సంసారము నుండి నివృత్తులము కావలయునని యీ యాశ్రమవ్యవస్థ లేర్పడినవని దీనివలన సిద్ధ మగును. ఈ హేతువుచేతనే విదురనీతియందు—

ఉత్పాద్య పుత్రా న్ననృణాంశ్చ కృత్వా
వృత్తిం చ తేభ్యోఽను విధాయ కాంచిత్,

స్థానే కుమారీః ప్రతిపాద్య సర్వాః
అరణ్యసంస్థోఽథ ముని ర్బుభూషేత్.

మ. భా. ఉ. 36-39

— గృహస్థాశ్రమమున కొడుకులను గని వారికి ఋణము నుంచక వారి యుదరపోషణమున కేదైన నొక వృత్తిని కల్పించి యాఁడుపిల్లలను యోగ్యమగు స్థలముల యందిచ్చి వివాహముచేసి పిదప వానప్రస్థుడై సన్న్యాసముఁ గైకొనుట కిచ్ఛయింపవలయును అని విదురుఁడు ధృతరాష్ట్రునకుఁ జెప్పెను. మనదేశమునం దున్న సామాన్య జనులయొక్క సంసారబంధములోఁ బ్రస్తుతమున్న జ్ఞానమును దలఁచుగ విదురుఁడు చెప్పినటులే యున్నది. అయిన నేదో యొకప్పుడు సంసారమును వదలి సన్న్యాసముఁ గైకొనుటయే మనుష్యమాత్రునకు పరమసాధ్యమని యంగీకరించుటచే జగత్తునందున్న వ్యవహారముల సిద్ధికొఱకు స్మృతికారులచేఁ గావలయునని విధింపఁబడిన పూర్వోక్తములగు మూఁడాశ్రమములయొక్క శ్రేయస్కరము లగు మర్యాదలును మెల్ల మెల్లఁగ వెనుకకే నడచుటకుఁ బ్రారంభించినవి. మఱియు నొకానొకనికి పుట్టుకతోడనే కాని, లేక, యల్పవయస్సుననే కాని జ్ఞానము కలుగునేని యతఁడు మూఁడుమెట్లు నెక్కకయే నొక్కసారిగనే నాల్గవమెట్టగు సన్న్యాసమును బొందవచ్చును. "బ్రహ్మచర్యా దేవ ప్రవ్రజేత్ గృహా ద్వా వనాద్వా" (జాబా. 4) ఇంతకంటె నేమియుఁ జేయఁదగిన పనిలేదు. ఈ యభిప్రాయముచేతనే—

శరీరపక్తిః కర్మాణి జ్ఞానం తు పరమాగతిః,
కషాయే కర్మభిః పక్వే రసజ్ఞానే చ తిష్ఠతి.*

శాం. 269. 38

---

* వేదాంతసూత్రముల పైనున్న శాంకరభాష్యమున (3.4.26) నీ శ్లోకము వ్రాయఁబడినది. అక్కడ "కషాయపక్తిః కర్మాణి జ్ఞానం తు పరమాగతిః, కషాయే కర్మభిః పక్వే తతో జ్ఞానం ప్రవర్తతే" అని పాఠాంతరముగ నున్నది. మహాభారతమున నున్నటులనే యీ శ్లోకము నిచ్చో వ్రాసితిని.

కర్మలు శరీరమందున్న విషయాసక్తి రూపమగు రోగములను బోఁగొట్టుట కొఱ కుపయోగించును. జ్ఞాన మనునదియే సర్వోత్తమము; మోక్షసాధనము. కర్మలచే శరీరమందున్న కషాయము, లేక, యజ్ఞానరూపమగు రోగము నశించు నేని జ్ఞానరసముయొక్క రుచి యుత్పన్నమగును అని మహాభారతమునందు గో కాపిలేయ సంవాదమునందు స్యూమరశ్మిలకుఁ జెప్పఁబడెను. అటులే మోక్షధర్మములోనున్న పింగళగీతలలో "నైరాశ్యం పరమం సుఖమ్", లేక, "యోఽసౌ ప్రాణాంతికో రోగః తాం తృష్ణాం త్యజత స్సుఖమ్"— తృష్ణారూపక మగు ప్రాణాంతిక రోగము వదలినఁ గాని సుఖము లేదు (శాం. 174.65; మఱియు 58) అని చెప్పఁబడినది. జాబాలోపనిషద్బృహదారణ్యకోపనిషత్తులయందును "న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః"— కర్మచేతను, ప్రజచేతను, లేక, ధనముచేతను లేదు; కాని త్యాగముచేతను, లేక, సన్న్యాసముచేతను కొందఱు పురుషులు మోక్షమును సంపాదించినారు అని కైవల్యోపనిషత్తునందును జెప్పఁబడినది (తై. 1.2; నారా. ఉ. 12.౩; 18 చూడు). జ్ఞాని సైతము తుదవఱకు కర్మలను జేయుచునే యుండవలయునని గీతయొక్క సిద్ధాంత మగునేని యీ వచనములకు గతియేమి?" అని తన మనస్సులో శంక నుంచుకొనియే అర్జునుఁడు పదునెనిమిదియవ యధ్యాయారంభమున "అటు లగునేని నాకు సన్న్యాసమన నేమియో మఱియు త్యాగ మన నేమియో విడఁదీసి చెప్పుము (18. 1) అని భగవంతుని అడిగెను; కాని యీ ప్రశ్నమునకు భగవంతుఁ డిచ్చిన యుత్తరమును జూచుటకంటె పూర్వమునందు స్మృతిగ్రంథములలోఁ బ్రతిపాదింపఁబడిన యీ యాశ్రమమార్గములలో కాక మఱియొక తుల్యబలము గలిగిన వైదికమార్గమును సైత మిచ్చోఁ సంక్షిప్తముగ విచారించుట యావశ్యకము.

బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసము లను నాశ్ర

మములను నాలుగు పైకెక్కు మెట్లుగాఁ గల యీ నిచ్చెనయే స్మార్త మని (అనఁగా: స్మృతికారునిచే విచారింపఁబడిన మార్గమని) చెప్పు చున్నారు. కర్మలను జేయు మనియుఁ గర్మలను వదలిపెట్టు మనియు వేదమునందున్న పరస్పర విరుద్ధములగు విధుల కేకవాక్యత చేయు నిమిత్తమయి వయోభేదాను రూపములుగ నీ యాశ్రమములయొక్క వ్యవస్థ స్మృతికారులచే చేయఁబడినది. మఱియు కర్మలను స్వరూప ముతోనే సన్న్యసించుట యనునదియే తుదకు గమ్యస్థానమని యం గీకరించిన యెడల నా సాధ్యమునకు వెనుకనున్న (సాధనమని స్మృతి కారు లంగీకరించిన) యాయుష్యక్రమముయొక్క నాలుగుమెట్లుగల యీ మార్గ మేమియుఁ దప్పు కాదు. ఆయుష్యక్రమమున కీ విధమగు పైకెక్కు మెట్లును గల్పించుటచే జగత్తునందున్న వ్యవహారము లోపిం పక పోవుటయే కాక వైదికకర్మయు నౌపనిషదజ్ఞానము నను నీరెంటిని కూడ కలుపవచ్చు నను మాట సత్యమే. అయిన నితరములగు మూఁ డాశ్రమములకు నన్నమును బెట్టునది గృహస్థాశ్రమమే యగుటచే (మను. 6. 89) మనుస్మృతి యందును, మహాభారతమునందును —

యథా మాతర మాశ్రిత్య సర్వే జీవంతి జంతవః,
ఏవం గార్హస్థ్య మాశ్రిత్య వర్తంత ఇతరాశ్రమాః.

— తల్లియొక్క (పృథ్వియొక్క) యాశ్రయముచే సకల జంతువు లును జీవించుచుండునటులే గృహస్థాశ్రమము నాశ్రయించుకొని యితరాశ్రమము లున్నవి (శాం. 268. 6; మను. 3. 77 చూడు) అని గృహస్థాశ్రమముయొక్క మహత్త్వము తుదకు స్పష్టముగ నంగీకరిం పఁబడినది; మఱియు మనువుచేత నితరాశ్రమములు నదు లనియు గృహస్థాశ్రమము సాగర మనియుఁ జెప్పఁబడినది (మను.6.90; మ. భా.శాం. 295. 39) గృహస్థాశ్రమముయొక్క శ్రేష్ఠత్వ మీ రీతిగ నిర్వివాదమైన యెడల నెప్పుడైనను గృహస్థాశ్రమమును వదలి కర్మ సన్న్యాసము గైకొని యుపదేశించుటయం దేమి ఫలమున్నది?

మఱియు జ్ఞానప్రాప్తియైన పిదప సైతము గృహస్థాశ్రమము నందలి కర్మలను జేయుట యావశ్యకమా? కాదా? యనియు నావశ్యకమైన జ్ఞాని సంసారమునుండి నివృత్తుఁడగుటవలనఁ బ్రయోజన మేమనియు నడుగవచ్చును; కాని స్వార్థబుద్ధితో నటించు సామాన్యజనులకంటె కొద్దియో గొప్పో నిష్కామబుద్ధితో వ్యవహరించు పూర్ణజ్ఞానులే లోక సంగ్రహమును జేయుటకు నధికసమర్థులు, పాత్రులు నగుదురు. కావున జ్ఞానమూలముతో నతనియొక్క యీ సామర్థ్యము పూర్ణావస్థ నొందఁగనే, జ్ఞానికి సమాజమును వదలునంత స్వేచ్ఛయుండిన చాతు ర్వర్ణ్యవ్యవస్థ దేని హితముకొఱకు నిర్మింపఁబడినదో యా సమాజము నకే మిక్కిలి నష్టము కలుగుచున్నది. శరీరసామర్థ్యములేక సమాజ మును వదలి యెవరైన నరణ్యమునకు వెళ్లిన నా విషయము వేఱు. మఱియు సన్న్యాసాశ్రమమునకు వృద్ధత్వము వచ్చుటకు నవధినుం చుటలో మనువునకు నిదియె యభిప్రాయముగ నుండును; కాని యీ శ్రేయస్కర మగు కట్టుబాటు పూర్వ మాచరణలో లేనే లేదని పైన చెప్పియే యున్నాను. కావున కర్మలు చేయుమనియు వదలుమనియు నీ యుభయములగు వేదవిధులయొక్క పరస్పర విరోధమును నివా రించుటకు నాశ్రమము లను మెట్లుగల పైకెక్కు నిచ్చెన స్మృతికారు లచే నేర్పఱుపఁ బడినను నీ వేదవాక్యములయొక్క యేకవాక్యతఁ జేయుటయందు స్మృతికారుల కున్నంత యధికారము, వేయేల? స్మృతికారులకంటె నెక్కువగనే భగవంతుఁడగు శ్రీకృష్ణునకు నధికారము నిర్వివాదముగ నున్నది. కావున నతఁడు జనకాదులయొక్క ప్రాచీన మగు జ్ఞానకర్మసముచ్చయాత్మక మగు మార్గమును భాగవతధర్మము లను పేరుతో పునరుజ్జీవితముగ నొనర్చి పూర్ణముగ సమర్థించెను. భాగవతధర్మములయందు కేవల మాధ్యాత్మికవిచారమునే చేయక వాసుదేవభక్తి యను సులభసాధనము సైతము కలుపఁబడినది; కాని యీ విషయమై సవిస్తరమగు వివేచన ముందు పదుమూఁడవ ప్రకర

ణమునఁ జేయఁబడును. భాగవతధర్మములు భక్తిపరము లయినను నందు పరమేశ్వరజ్ఞానము కలిగిన పిదప కర్మత్యాగరూప మగు సన్న్యాసమును గైకొనక ఫలాశను మాత్రము వదలి జ్ఞాని లోకసంగ్రహార్థమై సర్వవ్యవహారములను నిష్కామబుద్ధితో నామరణాంతముఁ జేయుచునే యుండవలయు నను జనకునియొక్క మార్గమందున్న మహత్త్వము సైతము స్థిరపఱుపఁబడినది; కావున కర్మదృష్టిచే నీ రెండుమార్గముల నొకే విధమయినవే, అనఁగా: జ్ఞానకర్మసముచ్చయాత్మకములే, లేక, ప్రవృత్తిపరములే. పరబ్రహ్మముయొక్క సాక్షాదవతారమూర్తులగు నరనారాయణఋషులే యీ ప్రవృత్తిపరమగు ధర్మములకు మొదట ప్రవర్తకులైరి. ఆ కారణముగ నీ ధర్మములకు 'నారాయణీయధర్మము' లని ప్రాచీనమగు పేరు. ఈ యిరువురు ఋషులును పరమజ్ఞానులై లోకులకు నిష్కామకర్మను జేయుఁడని చెప్పి వారును స్వయముగఁ జేయువారునై యుండిరి (మ. భా. ఉ. 48.21). మఱియు నా కారణముననే "ప్రవృత్తి లక్షణ శ్చైవ ధర్మో నారాయణాత్మకః" (మ. భా. శాం. 347. 81) అనియు, "ప్రవృత్తి లక్షణం ధర్మం ఋషి ర్నారాయణోఽబ్రవీత్"– నారాయణఋషిచే నారంభింపఁబడిన ధర్మము నామరణాంతము ప్రవృత్తిపరముగనే యున్నది (మ. భా. శాం. 217. 2) అనియు మహాభారతమునందు చెప్పఁబడినది. ఇవియే సాత్వతములు, లేక, భాగవతధర్మములు. మఱియు నీ సాత్వతధర్మములయొక్క, లేక, మూలభాగవతధర్మములయొక్క స్వరూపము "నైష్కర్మ్య లక్షణము" అనఁగా: నిష్కామ ప్రవృత్తిపరముగ నుండెనని భాగవతమునందు సైతము స్పష్టముగఁ జెప్పఁబడినది (భాగ. 1.౩.౮ మఱియు 11.4.6 చూడు). ఈ ప్రవృత్తి మార్గమునకే యోగ మని మఱియొక పేరు గలదు. "ప్రవృత్తిలక్షణో యోగః జ్ఞానం సన్న్యాసలక్షణమ్" అను గీతలలోని శ్లోకము వలన స్పష్టమగును (మ.భా.అశ్వ. 43.౨౫); కావుననే నారాయణునియొక్క

యవతారమగు శ్రీకృష్ణునిచే, నరావతారమగు నర్జునున కుపదేశింపఁ బడిన ధర్మములకు 'గీత'లయందే 'యోగ' మని పేరిడఁబడినది. భాగవతము, స్మార్తము నను నీ మార్గము లుపాస్యభేదముచేతనే మొదట నుత్పన్నములైనవని, ప్రస్తుతమున ననేకు లెన్నుచున్నారు; కాని మా మతానుసారముగ నిశ్చయించుట యసమంజసము. కారణ మేమి యన: ఈ రెండు మార్గములందున్న యుపాస్యములు భిన్నములుగ నుండినను వానిలోని యధ్యాత్మజ్ఞాన మొక్కటిగనేయున్నది. మఱియు నధ్యాత్మజ్ఞాన మను మూల మొక్కటియే యయి యుండఁగ నీ యుదాత్తజ్ఞానమున పారంగతులయిన ప్రాచీనజ్ఞానులు కేవల ముపాస్యభేదముకొఱకు వివాదము లాడుచుందురని చెప్పుటకు వీలుండదు. ఈ కారణముచేతనే యే దేవుని భజించి యోగము నవలంబించినను నది యొక పరమేశ్వరునకే చేరునని భగవద్గీతయందును (9.14), శివగీతయందును (12.4) చెప్పఁబడినది. మఱియు మహాభారతమునందున్న నారాయణీయ గ్రంథములయందు నారాయణుఁడు, రుద్రుఁడు నొకఁడే యగుటచే, నెవరు రుద్రభక్తులో వారే నారాయణునకు భక్తు లనియు, నెవరు రుద్రునకు ద్వేషులో వారు నారాయణునకు ద్వేషులే యనియు నీ యిరువురు దేవతలు నభేదముగ వర్ణింపఁబడిరి (మ.భా.శాం. 341. 20.26 మఱియు 342. 129 చూడు). శైవులు, వైష్ణవులు నను భేదము పూర్వమునందు లేదని మేము చెప్పము గాని, స్మార్తము, భాగవతము నను భిన్నమార్గములగుటకు శివుడు, విష్ణువు నను నుపాస్యభేదము మూలకారణము కానందున జ్ఞానము కలిగిన పిదప నివృత్తిమార్గము నవలంబింపవలయునా? లేక, ప్రవృత్తిమార్గము నవలంబింపవలయునా? కర్మలను వదలవలయునా? యక్కఱ లేదా? యను నొక గొప్ప విషయమున మాత్రము మతభేదము కలిగి యీ రెండు మార్గములు మొదటినుండియు ప్రచారములోనికి వచ్చినవని మా యభిప్రాయమునందలి తాత్ప

ర్యము. తర్వాత కొంతకాలము గడచిన పిదప మూలభాగవత ధర్మ ములలో నున్న యీ ప్రవృత్తిమార్గము, లేక, కర్మయోగము లోపింపఁగ దానికే కేవల విష్ణుభక్తిపరము (అనఁగా: అనేక విషయములలో నివృత్తిపరము) అయిన యాధునిక స్వరూపము ప్రాప్తము కాఁగా దాని మూలమున 'నీ దేవుఁడు శివుఁడైన, నా దేవుఁడు విష్ణువు' అని పేరునకు మాత్రమే మనుష్యులు వివాదము నారంభించిరి. అప్పుడు స్మార్త భాగవత శబ్దములే యనుక్రమముగ శైవవైష్ణవ శబ్దములతో సమానార్థకములై తుద కీ యాధునిక భాగవతధర్మములయొక్క వేదాంతమును (ద్వైతము, లేక, విశిష్టాద్వైతము), మఱియు వేదాంతమువలెనే జ్యోతిషము, అనఁగా; ఏకాదశియొక్కయు, గంధములు పెట్టుకొను పద్ధతులయొక్కయు రీతులు స్మార్తపద్ధతులకంటె భిన్నములాయెను. కాని యీ భేదము సత్యమును, మొదట నున్నదియు కాదని యీ స్మార్తశబ్దమువలన వ్యక్తమగును. భాగవతధర్మములు భగవంతునిచేఁ బ్రవర్తింపఁబడుటచే వానియందున్న యుపాస్య దైవతము భగవంతుండగు శ్రీకృష్ణుఁడు, లేక, విష్ణువు ననుట యందేమియు నాశ్చర్యము లేదు. కాని స్మార్తశబ్దార్థము స్మృత్యుక్తమని మాత్రమే యగుటచే స్మార్తదైవమునందున్న యుపాస్యదైవతము శివుఁడేయై యుండవలయునని యభిప్రాయము కానేరదు. కారణ మేమి యనఁగా: మన్వాదిప్రాచీనస్మృతి గ్రంథములలో నొకశివునే యుపాసింపవలయునని యెక్కడను నియమింపలేదు. పైగా విష్ణువునే యధికముగ వర్ణించిరి. కొన్ని స్థలములయందు గణపతి మొదలగు వారు నుపాస్యులని చెప్పఁబడిరి. శివకేశవులను నీ యిరువురగు దేవతలే వైదికులు (అనఁగా: వేదములయందు వర్ణింపఁబడియుండువారు) గాన వీరిలో నొకరినే స్మార్తులని చెప్పుట యుక్తము కాదు. శ్రీశంకరాచార్యులవారిని స్మార్తమతమునకు పురస్కర్తలని చెప్పుచున్నారు; కాని శాంకరమతమునందు శారదయే యుపాస్యమగు

దైవ మగుటచే శాంకరభాష్యములో ప్రతిమాపూజావిషయమై చెప్ప వలసిన సమయము వచ్చినప్పుడెల్ల శివలింగము నిర్దేశింపఁబడక సాలగ్రామమే, యనఁగా విష్ణుప్రతిమయే, యాచార్యుల వారిచే నుల్లేఖింపఁబడినది (వే.సూ.శాం.భా. 1.2.7; 1.3.14 మఱియు 4.1.3; ఛాం.శాం.భా. 8.1.1.) అటులె పంచాయతన పూజయును మొదట శ్రీ శంకరాచార్యులవారిచేతనే యారంభింపఁబడినదని కథగలదు. దీనివలన శివభక్తులు, విష్ణుభక్తులు నను విషయమున దృష్టియుంచక స్మృతిగ్రంథములయందే ముందు వ్యాఖ్యానము చేయఁబడినదియు, మార్గదర్శకముగ వర్ణింపఁబడినదియు నాశ్రమవ్యవస్థల ననుసరించి, తారుణ్యమునందు యథాశాస్త్రీయముగ సంసారముచేసి పిదప వార్ధకమున కర్మలను బొత్తిగ వదలి చతుర్థాశ్రమమును, లేక, సన్న్యాసమును గైకొనుట యనునదియే యెవరికిఁ దుట్టతుదకు పరమసాధ్య మగునో వారు స్మార్తులు. మఱియు జ్ఞానము నుజ్జ్వల భగవద్భక్తియు ననువానివలెనే యామరణాంతము గృహస్థాశ్రమము నందలి కర్మలనే నిష్కామబుద్ధితోఁ జేయవలయునని భగవంతుని యొక్క యుద్దేశానుసారముగ నెవరు తలఁచుచున్నారో వారు భాగ వతు లనియు, నిదియే నీ రెండు శబ్దములకుఁ దొలుతనున్న యర్థమని సిద్ధ మగుచున్నది. మఱియు నీ హేతువుచేతనే సాంఖ్యము-యోగము అను నీ రెండు శబ్దములు సన్న్యాసకర్మయోగశబ్దములతోడను యథా క్రమము సమానార్థకము లయి యున్నవి. భగవంతునియొక్క యవతారకృత్యములనుబట్టి చెప్పినను, లేక, జ్ఞానయుక్తగార్హస్థ్య కర్మములయొక్క మహత్త్వమును విమర్శించి చెప్పినను సన్న్యాసా శ్రమము లుప్తప్రాయ మగుటచే కలివర్జ్యములలో (కలియుగమునందు శాస్త్రముచే నిషేధింపఁ బడిన వానియందు) సన్న్యాసము చేర్పఁబడి

నది* కాని, పిదప, జైనబౌద్ధధర్మములయొక్క ప్రవర్తకులు కాపిల సాంఖ్యమతమును స్వీకరించి సంసారములో నుండి బయలువెడలి సన్న్యసమును గైకొనినఁ గాని మోక్షము ప్రాప్తి కానేర దను మతమును విశేషప్రచారములోనికిఁ దెచ్చిరి. బుద్ధుఁడు వయస్సు కాలముననే రాజ్యమును, దారపుత్త్రాదులను బుద్ధిపూర్వకముగ వదలి దీక్షను గైకొనెనని యితిహాసముల యందుఁ బ్రసిద్ధముగనే యున్నది. జైనబౌద్ధమతములను శ్రీశంకరాచార్యులవారు ఖండించినను, జిన, బౌద్ధులు విశేషముగఁ బ్రచారమునకుఁ దెచ్చిన సన్న్యసధర్మమునకే శ్రౌతస్మార్తసన్న్యసమని పేరిడి, దాని నాచార్యులవారు స్థాపించిరి. ఆ కారణముననే గీతలయందు సన్న్యసధర్మమే ప్రతిపాద్యముగనున్నదని వారు గీతలకు పరినిష్ఠితార్థమును జేసిరి; కాని వాస్తవముగ విచారించితి మేని గీత యనునది స్మార్తమార్గగ్రంథము కానేరదు. సాంఖ్యము, లేక, సన్న్యసమార్గమున నుండియే గీత యారంభమైనను పిదప సిద్ధాన్తపక్షమందలి ప్రవృత్తిపరములగు భాగవతధర్మము లే యా గీతయందు ప్రతిపాద్యములుఁగ నున్నవను విషయమున మహాభారతకారునియొక్క వచనములు మొదటి ప్రకరణమునందే వ్రాయఁబడినవి.

ఈ రెండుమార్గములును వైదికములే యగుటచే వీని కన్నింటితోఁ గాకపోయినను ననేకములగు వాక్యములతో నేకవాక్యతఁ

* నిర్ణయసింధువునందలి తృతీయ పరిచ్ఛేదమున, కలివర్జ్యప్రకరణమును జూడుము. దానియందు– "అగ్నిహోత్రం గవాలంభం సన్న్యసం పలపైతృకం, దేవరా చ్చ సుతోత్పత్తిః కలౌ పంచ వివర్జయేత్", మఱియు "సన్న్యసశ్చ న కర్తవ్యో బ్రాహ్మణేన విజానతా" మొదలగు స్మృతివచనము లుదాహరింపఁబడినవి. "అగ్నిహోత్రము, గవాలంభము, సన్న్యసము, శ్రాద్ధమున మాంసభక్షణము, నియోగము వను వీ యైదును, కలియుగమున నిషేధింపఁబడినవి యని యర్థము. వీనిలో సన్న్యసము కూడదను విషయము శ్రీశంకరాచార్యులచే ఖండింపఁబడినది. సన్న్యసము స్థాపింపఁబడినది.

జేయుట యావశ్యక మగును; కాని యిట్టి యేకవాక్యతను జేయుట వేఱు; గీతలలో సన్న్యాసమార్గమే ప్రతిపాద్య మగుటచే కర్మమార్గమునే యెక్కడనైన మోక్షప్రదమని చెప్పిన నది కేవల మర్థవాదము (అనఁగా బాహ్యస్తుతి) అయి యుండునని చెప్పుట వేఱు. రుచివైచిత్ర్యానుసారముగ నొకనికి భాగవతధర్మములకంటె స్మార్తధర్మములే యధికముగ రుచించును. లేదా కర్మసన్న్యాసమునకొఱకు సామాన్యముగఁ జెప్పఁదగినకారణములే వానికి బలవత్తరములుగఁ దోఁచును; యుక్తమే. ఉదాహరణము: శ్రీ శంకరాచార్యులవారికి స్మార్తధర్మమే లేక, సన్న్యాసధర్మమే యిష్టము గావున నితరములగు సర్వమార్గములును నజ్ఞానమూలకము లని యనిరి. ఈ విషయమై యేరికిని శంక లేదు; కాని యంతమాత్రముచే గీతలయొక్క భావార్థము సైతము నటులే యుండవలయునని నియమములేదు. గీతలయొక్క సిద్ధాంతము నీ కిష్టము కాదేని దానిని స్వీకరింపకుము; కాని దానినుండి ఈ జగత్తున నాయుష్యక్రమమునకు రెండు విధము లైనవియు, స్వతంత్రము లైనవియు, మోక్షప్రదములగు నట్టియు మార్గములుగాని నిష్ఠలుగాని యున్నవి అని గీతారంభమున చెప్పఁబడిన దానికి "సన్న్యాసనిష్ఠయే సత్యమునకు శ్రేష్ఠము నయినమార్గ" మని యర్థము చేయుట యుక్తము కానేరదు. గీతలలో వర్ణింపఁబడిన రెండు మార్గములును వైదికధర్మములలో జనకయాజ్ఞవల్క్యులకంటె పూర్వమునుండియు స్వతంత్రరీతిగ ప్రవర్తించుచునే పరంపరగ వచ్చుచున్నవి. వీనిలో జనకునివలె సమాజముయొక్క ధారణ పోషణము లను క్షత్రియధర్మము వంశమునందు వంశపరంపరగఁ గాని, లేక, స్వసామర్థ్యముచేతఁ గాని, లభించిన వారు జ్ఞానము గలిగినపిదప సైతము తమ కర్మలను నిష్కామబుద్ధితో నాచరించుచు, జగత్తునకు కల్యాణము చేయుటయందే సర్వాయుర్దాయమును వ్యయము చేయుచుండి రని స్పష్టముగనే తెలియుచున్నది. సమాజమునందున్న యీ యధికార

మును మనస్సున నుంచుకొనియే "సుఖం జీవంతి మునయో భైక్ష వృత్తిం సమాశ్రితాః"- మఠములలో నుండు మును లానందముగ భిక్షావృత్తితో జీవించుచున్నారు (శాం. 178. 11) అనియు, "దండ ఏవహి రాజేంద్ర క్షత్రధర్మో న ముండనమ్"- దండముచేతను లోకుల ధారణపోషణలు చేయుటయే క్షత్రియునకు ధర్మ మగును. గొఱిగించుకొనుట కానేరదు (శాం. 23.46) అనియు మహాభారత మునం దధికారభేదమునుం బట్టి రెండు విధములుగ వర్ణింపఁబడినది; కాని యింతమాత్రముచే ప్రజాపాలనమునకు నధికారి యగు క్షత్రి యుఁడు తన కంతవఱకే యధికారానుసారముగఁ గర్మయోగము విహిత మనియు నను కొనఁగూడదు. ఎవరికే కర్మఁ జేయుటయం దధికారము గలదో వా రాకర్మను జ్ఞానముగలిగిన పిదప సైతము చేయ వలయునని కర్మయోగమునందున్న పూర్వోక్తవచనములకు సత్య మయిన భావార్థము. మఱియు నీ కారణముచేతనే "ఏషా పూర్వతరా వృత్తిః బ్రాహ్మణస్య విధీయతే" - బ్రాహ్మణుఁడు సైతము జ్ఞానము గలిగిన పిదప స్వీయాధికారాను సారముగ యజ్ఞయాగాది కర్మ లను జేయవలెను (శాం. 237) అని భారతమునందుఁ జెప్పఁబడినది. మనుస్మృతి యం దున్న సన్న్యాసాశ్రమమునకుఁ బ్రతినిధిగ వైదిక కర్మయోగము సర్వవర్ణములకును వికల్పముగ విధింపఁ బడినది (మను. 6.89-96). అట్లు భాగవతధర్మము కేవల క్షత్రియులకొఱకే యని యెక్కడను చెప్పియుండ లేదు. పైఁగా స్త్రీశూద్రాదుల కందఱకు నది సులభముగ నున్నదని చెప్పుటచే దానియొక్క మహత్త్వము స్తుతిచేయఁబడినది (గీ. 9.32). మఱియు నిట్లె మహా భారతమునందు, తులాధారుఁ డనఁగా వర్తకుఁడును, వ్యాధుఁ డనఁగా కిరాతకుఁడును నీ ధర్మమునే యాచరించుచు నా బ్రాహ్మణున కుపదే శము చేసిరని స్పష్టముగ కథ గలదు (శాం.263. వన.215). భాగవత ధర్మగ్రంథమున నీయఁబడిన నిష్కామకర్మయోగము నాచరించు

ప్రముఖులయొక్క యుదాహరణములు శ్రీకృష్ణాదిక్షత్రియులవి మాత్రమే కావు. వానియందు వసిష్ఠుఁడు, జైగీషవ్యుఁడు, వ్యాసుఁడు మొదలగు బ్రాహ్మణ జ్ఞానులకును సమావేశము కలదు.

గీతయందుఁ గర్మమార్గమే ప్రతిపాదింపఁబడినను జ్ఞానము లేకుండ కర్మను జేయుట యనుమార్గము మోక్షప్రద మనునది గీత యభిప్రాయము కానేర దని తెలిసికొనవలయును. కర్మలును రెండు విధములుగఁ జేయుదురు. ఒకటి దంభముకొఱకు, లేక, యాసురీ బుద్ధితోఁ జేయుట. రెండవది శ్రద్ధతోఁ జేయుట. వీనిలో దంభము కొఱకు కర్మలఁ జేయుట, లేక, యాసురీమార్గము గీతలచేతనే కాక (గీ. 16.16; మఱియు 17.28). మీమాంసకులచే సైతము గర్హ్యము నరకప్రదమని చెప్పఁబడినది. ఋగ్వేదమునందు సైతము ననేక స్థలములయందు శ్రద్ధయొక్క మహత్త్వము వర్ణింపఁబడినది (ఋ. 10. 151; 9.113. 2 మఱియు 2. 12. 5). మఱియు రెండవదాని విషయమై (అనఁగా: జ్ఞానము లేక పోయినను శాస్త్రమును నమ్మి కర్మలను జేయుట) పరమేశ్వరస్వరూపముయొక్క యథార్థజ్ఞానము లేక పోయినను శాస్త్రములపై విశ్వాసమునుంచి యజ్ఞయాగాది కర్మలను శ్రద్ధతోడనే యామరణాంతముఁ జేయుచు నుండుటచే మోక్షప్రాప్తి యగునని మీమాంసకులు సెప్పుదురు. మీమాంసకుల యొక్క మార్గము కర్మకాండరూపముగ బహుకాలమునుండి యు వచ్చుచున్నదని వెనుకటి ప్రకరణములోఁ జెప్పఁబడినది. వేదసంహిత యందును, బ్రాహ్మణమునందును సన్న్యాసాశ్రమ మావశ్యకమని యెచ్చటను లేదు. పైగా గృహస్థాశ్రమమునందుండియే మోక్షము సంపాదింపవచ్చుననునది వేదముయొక్క స్పష్టమైన విధానమని జైమిని చెప్పుచున్నాఁడు (వే.సూ. 3.4, 17-20 చూడు). వారు చెప్పున దేమియు నిరాధారము కాదు. కారణ మేమియన: కర్మకాండయొక్క యీ ప్రాచీనమార్గము గౌణమని యనుట యుపనిషత్తులలోనే మొదట

నారంభ మయినటుల కాన్పించుచున్నది. ఉపనిషత్తులు వైదికము లైనను, సంహితకును, బ్రాహ్మణమునకు ననంతరము బయలుదేరెనని దానియందున్న విషయప్రతిపాదనమును బట్టి స్పష్ట మగును. పరమేశ్వరునియొక్క జ్ఞానము తత్పూర్వమునందు లేక పోలేదు; కాని మోక్షసంపాదనకు జ్ఞానము కలిగిన పిదప వైరాగ్యముతోఁ గర్మసన్న్యాసముఁ జేయవలయు నను మత ముపనిషత్కాలమునందే యాచరణములోనికి వచ్చుట కారంభ మాయెను. తదనంతరమున సంహితా బ్రాహ్మణములలో వర్ణింపఁబడిన కర్మకాండకు గౌణత్వము వచ్చినది. తత్పూర్వము కర్మనే ప్రధానముగ నంగీకరించుచువచ్చిరి. వైరాగ్యయుక్తమగు జ్ఞానమునకు (అనఁగా: సన్న్యాసమార్గమునకు) నుపనిషత్కాలమునం దీ రీతిని ప్రాధాన్యము వచ్చిన పిదప యజ్ఞయాగాదికర్మలను, చాతుర్వర్ణ్యాదిధర్మములను, జ్ఞాని సహజముగనే యలక్ష్యముఁ జేసెను; మఱియు లోకసంగ్రహమును జేయుటకు మనకు కర్తవ్య మనుజ్ఞానము మందగించుటకు నారంభించినది. స్మృతికారులు దమ తమ గ్రంథములలో గృహస్థాశ్రమమునందు యజ్ఞయాగాది శ్రౌతకర్మలు, లేక, చాతుర్వర్ణ్యముయొక్క స్మార్తకర్మలు చేయుచునే యుండవలయునని చెప్పి గృహస్థాశ్రమము యొక్క మహత్త్వమును స్తోత్రము చేయుచుండినమాట సత్యమే; కాని స్మృతికారులయొక్క మతమునందు సైతము తుదకు వైరాగ్యమును, సన్న్యాసాశ్రమమును శ్రేష్ఠము లైనవని యుండుటచే నుపనిషత్తులచేఁ గర్మకాండమునకు వచ్చిన గౌణత్వము స్మృతికారులయొక్క యాశ్రమవ్యవస్థచే తగ్గుటకు శక్యముగాక పోయెను. ఇట్టిస్థితియందు జ్ఞానకాండ కర్మకాండలలో దేనికిని గౌణత్వము నీయక రెంటికిని భక్తితో సంబంధము కలుగఁజేసి యేకవాక్యతను జేయుటకు గీతలు ప్రవర్తించినవి. జ్ఞానము లేనిది మోక్షప్రాప్తి కలుగనేర దనియు, యజ్ఞయాగాదికర్మలచే స్వర్గముకంటె నెక్కువలాభసిద్ధి లేదనియు నుపని

షత్తులసిద్ధాంతము గీతకు మాన్యముగనే యున్నది (ముండ, 1.2.10; గీ. 2.41-45); కాని సృష్టిక్రమము నడచుచుండుటకు యజ్ఞముల యొక్క, లేక, కర్మలయొక్క చక్రము సైతము స్థిరముగ నుంచ వలయును. కర్మలను వదలు మనుట యెప్పుడైనను వెఱ్ఱితనమే యనునదియు గీతలయొక్క సిద్ధాంతము.

కావున యజ్ఞయాగాది శ్రౌతకర్మలను గాని, చాతుర్వర్ణ్యాది వ్యావహారిక కర్మలను గాని యజ్ఞానపూర్వకశ్రద్ధతోఁ జేయక జ్ఞాన వైరాగయుక్త మగు నూహతోఁ గర్తవ్య మను నూహతో మాత్రముఁ జేసె నేని యజ్ఞచక్ర మస్ఖలితముగ నుండును. కావున నీవు చేసిన కర్మ లన్నియు మోక్షమునకుఁ బ్రతిబంధకములు గావనియు గీత లుప దేశించు చున్నవి. జ్ఞానకాండ కర్మకాండలకు (అనఁగా: సన్న్యాసము నకుఁ గర్మకును) పరస్పరము సంబంధము కలుగఁజేయుట యను గీతలయొక్క శైలి స్మృతికారులయొక్క శైలికంటె నధిక సరసముగ నున్నదని చెప్పనక్కఱ లేదు. కారణ మేమి యన: వ్యష్టిరూప మగు నాత్మకుఁ గల్యాణమును గొంచెమైనను కొఱత సేయక దానితో సం బంధించి సృష్టియందున్న సమష్టిరూప మగు నాత్మయొక్క కల్యాణ మును సైతము గీతామార్గముచే సాధింపవచ్చును. కర్మ లనాదులును వేదప్రతిపాదితములు నగుటచే, జ్ఞానము లేకపోయినను శ్రద్ధచే చేయ వలయునని మీమాంసకులు సెప్పుచున్నారు. అనేకములగు నుపని షత్తులు (అన్నియు కావు) కర్మ గౌణ మని నిశ్చయించి వైరాగ్యముచే దానిని వదలు మని చెప్పుచున్నవి. లెక యంత స్పష్టముగా చెప్పక పోయినను నా పక్షమున నెక్కువ పట్టుదల గలవియై యున్నవని యైనను చెప్పుటకు నభ్యంతరము లేదు; మఱియు పూర్వాశ్రమమ్ము నం దీ కర్మలు సేయుచుండి చిత్తశుద్ధియైన పిదప వార్ధకములో వైరా గ్యముతో వానిని వదలి సన్న్యాసమును గైకొనుమని స్మృతికారులు పూర్వోక్తములగు రెండుమతములకు నుపయోగభేదముచేఁ (అనఁగా:

ఆశ్రమవ్యవస్థచే) జేయఁబడిన కర్మలయొక్క ఫలము మాత్రము స్వర్గమే కాని మఱియొకటి యేదియు కాదని యుపనిషత్తులలోను గీతలలోను జెప్పఁబడినది. దీని తర్వాత (అనఁగా: జ్ఞానము కలిగిన పిదప) కర్మలను జేయవలయునా? చేయ నక్కఱ లేదా యను విషయమై యుపనిషత్తులలోను మతభేదము కలదు. జ్ఞానముచే సర్వ కామ్యబుద్ధులును నశించిన పిదప మోక్షమున కధికారియైన వాఁడు కేవల స్వర్గప్రాప్తిని కలుగఁజేయు కామ్యకర్మలను జేయుటవలన నేమియు ప్రయోజనము లేదని యనేకములగు నుపనిషత్తులలో నున్నది. మఱియు నీశావాస్యాద్యనేకోపనిషత్తులలో మృత్యులోకము యొక్క వ్యవహారము జరుగుటకొఱకు నీ కర్మలు సేయఁబడవలయు నని ప్రతిపాదింపఁబడినది. ఉపనిషత్తులలో వర్ణింపఁబడిన యీ రెండు మార్గములలోను రెండవమార్గమే గీతలయందు ప్రతిపాద్యముగనున్న దని స్పష్ట మగుచున్నది (గీ.౫.౭). కాని మోక్షమున కధికారియైన జ్ఞాని లోకసంగ్రహార్థమై నిష్కామబుద్ధితో సర్వవ్యవహారములను చేయ వలయు నని చెప్పినను స్వర్గము దక్క మఱియొక ఫలములేని యజ్ఞ యాగాది కర్మల నేల చేయవలయు నను శంక యిక్కడ సహజముగఁ గలుగును. కావున నీ శంకయే పదునెనిమిదవ యధ్యాయమున నారంభమున నుపస్థితమైనది. కావున, "యజ్ఞము, దానము, తపస్సు" మొదలగు కర్మలు తప్పక చిత్తశుద్ధిని గలుగఁ జేయునవియు (అనఁగా నిష్కామబుద్ధిని పుట్టించునవియు) వృద్ధిఁ బొందించునవియు నగుటచే "వీనిని సైతము" (ఏతాన్యపి) ఇతరములగు నిష్కామకర్మల వలెనే లోకసంగ్రహార్థమై ఫలాశయు, సంగమును లేకుండ జ్ఞాని తప్పక చేయవలయు"నని భగవంతుఁడు స్పష్టము నిర్ణయించి సిద్ధాంతము చేసినాఁడు (గీ. 18. 6). పరమేశ్వరార్పణపూర్వకముగ సర్వకర్మల నీ రీతిని నిష్కామబుద్ధితోఁ జేయుచుండె నేని వ్యాపకార్థమునం దిది యొక గొప్ప యజ్ఞమగును; మఱియు నీ యజ్ఞార్థమై చేయఁబడిన

కర్మ బంధకము సైతము కానేరదు(గీ. 4. 23). ఇంతియె కాక, సర్వ కర్మలును నిష్కామబుద్ధితోఁ జేయఁబడి యుండుటచే యజ్ఞమువలన కలుగవలసిన స్వర్గప్రాప్తి రూప మగునదియు, బంధక మయినదియు నగు ఫలము రాకపోవుటచే నీ కర్మలన్నియు మోక్షమున కంతరాయ ములు గానేరవు. కావున మీమాంసకుల కర్మకాండ గీతలలో స్థిర ముగ నుంచఁబడినను నది యిట్టి యుక్తిచే స్థిరముగ నుంచఁబడినది. దానివలన స్వర్గమునకు యాతాయాతములు సంఘటిల్లవు. సర్వ కర్మలు నిష్కామబుద్ధితోఁ జేయఁబడుచుండుటచేఁ దుదకు మోక్షము కలుగక తప్పదు. మీమాంసకుల కర్మమార్గమునందును గీతలయోగ మునందును నున్న మహత్త్వమునకు నీ భేద మున్నది గాన రెండు నొకటి గావని తెలిసికొనవలయు నని సారాంశము.

భగవద్గీతయందు ప్రవృత్తిపరమైన భాగవతధర్మమే, లేక, కర్మయోగమే ప్రతిపాద్య మనియు నీ కర్మయోగమునకును మీమాం సకులయొక్క కర్మకాండకు నున్న భేదమును చెప్పఁబడినది. ఇఁక గీతలయందున్న కర్మయోగమునకును జ్ఞానకాండ నాశ్రయించి స్మృతికారులచేఁ జెప్పఁబడిన యాశ్రమవ్యవస్థకు నున్న భేదము తాత్త్వికదృష్టితో నిప్పుడు కొంత విచారించెదము. ఈ భేదము మిక్కిలి సూక్ష్మ మగుటచే వాస్తవముగఁ జూచితి మేని యీవిషయమై వాదముఁ జేయ నవసరముండదు. జ్ఞానప్రాప్తి యగువఱకును చిత్త శుద్ధ్యర్థమై మొదటి రెం డాశ్రమముల యందలి కృత్యముల నంద ఱును చేయవలయు ననియే యుభయ పక్షములకును తాత్పర్యము. పూర్ణమగు జ్ఞానప్రాప్తి యయిన పిదప కర్మలను చేయవలయునా? సన్న్యాసమును గైకొనవలయునా? యనియే మతభేదములలోని పట్టుదల; కాని యిట్టి పట్టుదల కొలఁదిమంది జ్ఞానులకే యుండును. కొందఱు కర్మలను జేసినను, చేయకపోయినను దాని విషయమై విశేషచర్చ చేయనక్కఱ యుండదని యనేకులకుఁ దోఁపవచ్చును;

కాని యిట్లు చెప్పుటకు న్యాయము కాదు. కారణ మేమి యనః జ్ఞాని యొక్క వర్తన మితరు లందఱు ప్రమాణముగ నంగీకరింతురు. మఱియుఁ దుదకు నేది సాధ్య మగునో దాని ననుసరించియే మొదటినుండియు మనుష్యుఁడు తన ప్రవర్తన నేర్పఱచుకొనును. కావున జ్ఞాని యేమి చేయవలయు నను ప్రశ్నము లౌకికదృష్టితోఁ జూచినను మహత్త్వము గలదియే. స్మృతిగ్రంథములలో జ్ఞాని తుదకు సన్న్యాసము గైకొనవలయు నని చెప్పఁబడియున్న మాట సత్యమే; కాని స్మార్త మార్గానుసారమున సైత మీ విధి కపవాద మున్నదని పూర్వము నందు చెప్పఁబడినది. ఉదాహరణము: బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యులవారు జనకునకు బ్రహ్మజ్ఞానమును విస్తారముగ నుపదేశించిరి; కాని "నీ విప్పుడు రాజ్యమును వదలి సన్న్యాసమును గైకొమ్ము" అని జనకున కెచ్చటను చెప్పలేదు. పైగా జ్ఞానులు జ్ఞానము కలిగినపిదప సంసారమును వదలివేయుటకు కారణ మా సంసారము వారికి రుచింపకపోవుటయే యని (న కామయన్తే) చెప్పఁబడినది (బృ. 4. 5. 22). దీనివలన జ్ఞానము కలిగిన పిదప సన్న్యాసమును గైకొనుటయుఁ గైకొనకపోవుటయు ననునది వారి వారి యిష్టముం బట్టియుండును (అనఁగా: వైకల్పికముగనున్నది యనుట). "బ్రహ్మజ్ఞానమునకును సన్న్యాసమునకును సంబంధము నిత్యము కాదు" అని బృహదారణ్యకోపనిషత్తుయొక్క యభిప్రాయ మైనట్లు వ్యక్తమగుచున్నది. మఱియు బృహదారణ్యకోపనిషత్తునందున్న వచనముల కర్థము వేదాంతసూత్రములందు నిట్లే సమన్వయింపఁ బడినది (వే. సూ. 3. 4. 15). జ్ఞానము గలిగిన పిదపఁ గర్మసన్న్యాసముఁ జేసిన కాని మోక్షప్రాప్తి కానేరదని శ్రీశంకరాచార్యులవారి ముఖ్య సిద్ధాంత మగుటచే దానికి సర్వోపనిషత్తు లనుకూలములుగ నున్నవని చూపుటకయి తమ భాష్యములో వారు ప్రయత్నించిరి. అయినను జనకాదులవలె జ్ఞానము గలిగిన పిదప సైతము యథాధికారముగ

నామరణాంతము కర్మలను జేయుచుండుట కేమియు నభ్యంతరము లేదని శ్రీశంకరాచార్యులవారు సైత మంగీకరించియే యున్నారు (వే. సూ. శాం. భా. 3. 3. 32; గీ. శాం. భా. 2.11; 3. 20 చూడు). మఱియు జ్ఞానము గలిగిన పిదపఁ గర్మలను బొత్తిగ వదలవలయు ననుట యిష్టము లేకపోవుటచేఁ గొందఱు జ్ఞానులు సన్న్యాసమునకు సైత మపవాద మని నిశ్చయించి యథాధికారముగఁ గర్మలను జేయుట యను నీ మార్గమునకు నిష్ప్రతిబంధముగ ననుజ్ఞ యిచ్చు చున్నారని దీనివల స్పష్టమగుచున్నది. ఈ యపవాదముయొక్క వ్యాప్తిని వృద్ధిఁ బొందింపఁజేసి చాతుర్వర్ణ్యవిహితకర్మలు జ్ఞానప్రాప్తి కలిగిన పిదప సైతము లోకసంగ్రహార్థమై కేవల కర్తవ్యమని నిష్కామ బుద్ధితోఁ బ్రతి జ్ఞానియుఁ జేయవలయునని గీతలు సెప్పుచున్నవి. కావున గీతాధర్మము వ్యాపకమైనను దాని యందున్న తత్త్వము సన్న్యాసమార్గీయుల దృష్టి సైతము నిర్దోషముగనే యున్నదని సిద్ధ మగుచున్నది. మఱియు వేదాంతసూత్రములలో సైతము జ్ఞానయుక్త మగు కర్మయోగము సన్న్యాసమునకు వికల్పముగ గ్రహింపఁబడిన యా సూత్రములను ప్రత్యేకముగఁ జదివినయెడల స్పష్టమగును*(వే. సూ. 3.4.26; 3.4.32-35); అయినను నిష్కామబుద్ధిచే నైన నామర ణాంతముఁ గర్మలనే చేయవలసిన యెడల స్మృతిగ్రంథములందుఁ జెప్పఁబడిన కర్మత్యాగరూప చతుర్థాశ్రమమునకు (అనఁగా: సన్న్యా సాశ్రమమునకు) గతి యేమియో యిప్పుడు చెప్పవలసి యున్నది.

---

* వేదాంతసూత్రముల యందలి యీ యధికరణముల కర్థము శ్రీశంకర భాష్యమున కొంత వేఱుగ వ్రాయఁబడినది. కాని 'విహితత్వా చ్చాశ్రమ కర్మాపి' (3.4.32) అను సూత్రమునకు "జ్ఞాని యాశ్రమకర్మలను జేయుట సైత ముచి తమే. కారణ మేమన: అవి విధిప్రాప్తములు" అని యర్థమని నా యభిప్రా యము. జ్ఞాని కర్మలను జేయుటయుఁ, జేయకపోవుటయు నను రెండు పక్షము లును వేదాంతసూత్రములయందు స్వీకరింపఁబడిన వని మా మతమునందలి సారాంశము.

భగవంతుఁ డొకా నొకప్పుడైనను గర్మత్యాగరూపమగు సన్న్యాసమును గ్రహించిననే కాని మోక్షము సిద్ధింపదని చెప్పుననియు యుద్ధమును వదలిపెట్టుటకు భగవంతుని వాక్కునుండియే తన కనుమతి కాఁగల దనియు నర్జునుఁ డెన్నుచుండెను; కాని పదునేడవ యధ్యాయము యొక్క తుదవఱకుఁ గర్మ త్యాగరూప మగు సన్న్యాసాశ్రమము యొక్క విషయమునైనను భగవంతుఁ డెత్త లేదు. ఫలాశను వదలు మనియే ప్రతి సమయమునందును నుపదేశింపఁగ నర్జునుఁడు పదు నెనిమిదవ యధ్యాయముయొక్క యారంభమున "సన్న్యాసము నందును, త్యాగమునందును గల తత్త్వమును నాకుఁ జెప్పు" మని భగవంతుని తుదకు ప్రశ్నఁ జేసెను. అర్జునుని ప్రశ్నమునకు నుత్తర మిచ్చుచు భగవంతుఁడు "అర్జునా! యింతవఱకుఁ జెప్పిన కర్మయోగ మార్గమునందు సన్న్యాసము లేదనితలఁచితివేని యా యూహ తప్పు. కర్మయోగి మొత్తముపై సర్వకర్మలను కామ్యము లనియు (అనఁగా: అసక్తబుద్ధిచేఁ జేయఁబడినవి యనియు) నిష్కామము లనియు (అనఁగా: అసక్తబుద్ధిని వదలి చేయఁబడినవి యనియు) రెండువిధములుగఁ దలఁచుచున్నాఁడు (వీనికి మనుస్మృతి 12. 89 యందు నను క్రమము లుగ 'ప్రవృత్త' కర్మ లనియు 'నివృత్తకర్మ' లనియు పేరు లున్నవి). వీనిలోఁ గామ్యము లను వర్గములోవచ్చు కర్మలన్నియుఁ గర్మయోగి బొత్తిగ వదలివేయుచున్నాఁడు. అనఁగా: వానిని సన్న్యాసముచేయు చున్నాఁడు. మిగిలినవారు నిష్కాములు, లేక, నివృత్తులునైయున్నారు. ఈ నిష్కామ కర్మలను కర్మయోగి చేయుచున్నమాట సత్యమే; కాని వాని యన్నిటిలో ఫలాశ సర్వదా 'త్యాగము' చేయఁబడియున్నది. ఇంతమాత్రముచేతఁ గర్మయోగమార్గమునందు 'సన్న్యాసమును' 'త్యాగమును' నెక్కడ వదలఁబడినవి? స్మార్తమార్గమునందున్న జనులు కర్మలను బొత్తిగ సన్న్యసించెదరు. దానికి ప్రతినిధిగ కర్మ మార్గము నందున్న యోగులు కర్మఫలాశను పరిత్యజించెదరు. కావున

మొత్తముపై రెండుపక్షములనుండియు సన్న్యాసము స్థిరముగనే యున్నది" (గీ. 18.1-6 పైన నా టీకను చూడు). వే యేల? సర్వకర్మలను పరమేశ్వరార్పణముగ నిష్కామబుద్ధితోఁ జేయువాఁడు గృహస్థాశ్రమములో నున్నను నిత్యసన్న్యాసి యనియే యనఁబడును (గీ. 5.3). ఇది భాగవతధర్మములయొక్క నిత్య మగు తత్త్వము. మఱియు నీ తత్త్వమే భాగవతపురాణమునందు సర్వాశ్రమ ధర్మములను జెప్పిన పిదపఁ దుదకు నారదునిచే యుధిష్ఠిరున కుపదేశింపఁబడినది. వామన పండితుఁడు గీతలపై వ్రాసిన తన టీకయందు (అనఁగా: యథార్థదీపికయందు 18. 2) చెప్పినట్లు "శిఖా బోడునీ తోడిలా దోరా"— జుట్టు గొఱిగించుకొని జందెమును తీసివైచి, లేక, చేతదండమును బట్టి బిచ్చ మెత్తికొనినను లేక, సర్వకర్మలను వదలి యరణ్యమునఁ కేఁగినను నది సన్న్యాసము కాదు. సన్న్యాసమును, వైరాగ్యమును బుద్ధిధర్మములు; దండము, శిఖ, యజ్ఞోపవీతము వీనియొక్క ధర్మములు కావు. అవి దండాదుల ధర్మములే కాని బుద్ధియొక్క (అనఁగాఁ జ్ఞానముయొక్క) ధర్మములు కావనియు, రాజచ్ఛత్రముయొక్క గాని, గొడుగుయొక్క గాని కఱ్ఱను చేతిలో ధరించుకొనిన వానికిని సన్న్యాసులకు ప్రాప్తమగు మోక్షమే సిద్ధింపవలసి వచ్చును.

**త్రిదండాదిషు యద్యస్తి మోక్షో జ్ఞానేన కస్యచిత్,**
**ఛత్రాదిషు కథం న స్యాత్ తుల్యహేతౌ పరిగ్రహే.**

శాం. 320.42

అని జనకసులభా సంవాదమునఁ జెప్పఁబడినది. కారణ మేమి యనః దండపరిగ్రహము (అనఁగా: చేతదండమును బట్టుట) మోక్షహేతువను విషయము రెండు స్థలములయందు సమానమే; కాని, కాయిక, వాచిక, మానసిక సంయమమే సత్యమగు త్రిదండము (మను. 12. 10). కావున సత్యమగు సన్న్యాస మనఁగా: కామబుద్ధియొక్క సన్న్యాసమే యగునని తాత్పర్యము (గీ. 18. 2); మఱియు నదియే

భాగవతమార్గమును వదలకుండునట్లు (గీ. 6. 2) బుద్ధిని స్థిరముగ నుంచుకొనుట గాని, లేక, భోజనాదికర్మలు గాని సాంఖ్యమార్గమునందు సైతము తుదవఱకును వదలిపోవు; కాని త్రిదండసన్న్యాసము గాని కర్మత్యాగ రూపమగు సన్న్యాసము గాని కర్మయోగమునందు లేదు. కావున నా మార్గము స్మృతివిరుద్ధముగను, త్యాజ్యముగనున్న దనియు నట్టి సన్న్యాసి కాషాయమును ధరింపవలయునా? లేక, ధవళవస్త్రములనే ధరింపవలయునా? యని క్షుద్రప్రశ్నల వేసియు వివాదము చేయుచు కూర్చుండుటవలన నేమి లాభము?

**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి**

— సాంఖ్యమును కర్మయోగమును మోక్షదృష్టితో విచారించిన వేఱు కావని యెఱింగినవాఁడే పండితుఁడు అని భగవంతుఁడు గొప్ప నిరభిమానబుద్ధితో వక్కాణించెను (గీ. ౫. ౫). మఱియు మహాభారతమునందును ఐకాంతికధర్మము (భాగవతధర్మము) "సాంఖ్యయోగేన తుల్యో హి ధర్మ ఏకాంతసేవితః (శాం. 348. 74) అని సాంఖ్యధర్మములతో సమానముగనే యున్నట్లు చెప్పఁబడినది. కావున స్వార్థమును పరార్థమున లయింపఁ జేసికొని తమ తమ యోగ్యతానురూపముగ వ్యవహారమునందు ప్రాప్తమయిన సర్వకర్మములను సర్వభూతహితార్థమై యామరణాంతము నిష్కామబుద్ధితోఁ గేవలము కర్తవ్యమని చేయుచుండుటయే సత్యమయిన వైరాగ్యము, లేక, 'నిత్యసన్న్యాసము' (౫.౩) అని సారాంశము. కావున కర్మయోగమార్గమునం దుండువాఁడు కర్మలను బొత్తిగ సన్న్యసించి యెప్పుడును బిచ్చమెత్తఁడు; కాని బాహ్యాచరణవిషయములో చూపుల కొకరీతి భేదము కాన్పించినను, సన్న్యాసమునందును, త్యాగమునందును నున్న సత్యమగు తత్త్వము కర్మయోగమార్గమునందును, స్థిరముగనే యుండును. కావుననే స్మృతిగ్రంథములయందున్న యాశ్రమ

వ్యవస్థకును, నిష్కామకర్మయోగమునకును విరోధము లేదని గీతల యొక్క కడపటి సిద్ధాంతము.

పైనఁ గావింపఁబడిన వివేచనచే ననేకులు "సన్న్యాసధర్మములకు కర్మయోగముతో నేకవాక్యతఁ జేయుటకు గీతలలోఁ గావింపఁబడిన యింత చర్చకును స్మార్తధర్మములు, లేక, సన్న్యాసధర్మములు ప్రాచీనము లగుటయు, కర్మయోగమార్గము పిదప వెలువడుటయు మాత్రమే కారణ" మని యెన్నవచ్చును; కాని యితిహాసమును బట్టి విచారించిన సత్య మగు వస్తుస్థితి యది కానేరదని యేరికైనఁ గన్పట్టును. వైదికధర్మములయొక్క యత్యంతప్రాచీన స్వరూపము కర్మకాండాత్మకమే యని పూర్వముననే చెప్పఁబడినది. ఔపనిషదిక జ్ఞానముచే పిదప కర్మకాండకు గౌణత్వము వచ్చుట కారంభమైనది. మఱియుఁ గర్మత్యాగరూపమగు సన్న్యాసము క్రమేణ ప్రచారములోనికి వచ్చుచుండెను. వైదికధర్మవృక్షముయొక్క వృద్ధి కిది రెండవ మార్గమైనది; కాని యట్టి సమయములం దుపనిషత్తునందున్న జ్ఞానమునకుఁ గర్మకాండముతో సంబంధముఁ గలుగఁజేసి జనకాది జ్ఞానులు తమ కర్మల నామరణాంతము నిష్కామబుద్ధితో నాచరించుచునే యుండిరి. అనఁగా; వైదికధర్మవృక్షముయొక్క యీ రెండు మార్గములును రెండువిధములుగ నున్నవని చెప్పవలయును. మొదటిది జనకాదులది. రెండవది యాజ్ఞవల్క్యాదులమార్గము. స్మార్తాశ్రమ వ్యవస్థ మూఁడవమార్గము; కాని రెండవమార్గము ననుసరించి మూఁడవ మార్గము రెండు విధము లగును. స్మృతిగ్రంథములలోఁ గర్మత్యాగరూప మగు చతుర్థాశ్రమముయొక్క మహత్త్వము స్తుతింపఁబడి యుండునది సత్యమే; కాని దానివలెనే సన్న్యాసాశ్రమము యొక్క వికల్పమను సంబంధముచే జనకాదులయొక్క జ్ఞానయుక్త కర్మయోగము సైతము స్మృతికారులు చెప్పిరి. సర్వస్మృతి గ్రంథములకును మూలభూతమైన మనుస్మృతినే యుదాహరణముగ కొం

దము. ఈ స్మృతియొక్క యాఱవయధ్యాయమున మనుష్యుఁడు, బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము నను నాశ్రమములలో క్రమముగ పైయాశ్రమమునఁ బ్రవేశించుచుఁ గర్మత్యాగరూప మగు చతుర్థాశ్రమమునఁ బ్రవేశింపవలయునని చెప్పఁబడినది; కాని సన్న్యస్తాశ్రమముయొక్క (అనఁగా: యతిధర్మముయొక్క) యీ నిరూపణము సమాప్తియైన పిదప "ఈ యతియొక్క (అనఁగా: సన్న్యాసియొక్క) ధర్మము చెప్పఁబడినది. ఇప్పుడు వేదసన్న్యాసులయొక్క కర్మయోగమును జెప్పుచున్నాను" అని ప్రస్తావించియు, గృహస్థాశ్రమమె యితరాశ్రమములకంటె నెట్లు శ్రేష్ఠమో చెప్పియు, మనువు సన్న్యాసాశ్రమము యొక్క, లేక, యతిధర్మముయొక్క వికల్పమను నిష్కామ గార్హస్థ్యవృత్తియొక్క కర్మయోగమును వర్ణించెను (మను. ౬. ౮౬-౯౬); మఱియు పిదప పంద్రెండవ యధ్యాయము నందు దానికే 'వైదిక కర్మయోగ' మని పేరిడి యీ మార్గము సైతము చతుర్థాశ్రమమంత నిశ్శ్రేయసకర మని (అనఁగా: మోక్షప్రదముగ నున్నదని) చెప్పెను (మను. 12.86.౯౦). మనువుయొక్క యీ సిద్ధాంతము యాజ్ఞవల్క్యస్మృతియందు సైతము వర్ణింపఁబడినది (యాజ్ఞ. 3.204 మఱియు 205). అటులే యాస్కుఁడును, కర్మలను వదలిపెట్టు తపస్వికిని, జ్ఞానయుక్తమయిన కర్మలను జేయు కర్మయోగికిని నొక్కదేవయానగతియే ప్రాప్తమగునని తన నిరుక్తము నందుఁ దెలిపియున్నాఁడు (ని. 14.9). ఇంతియెకాక యీ విషయమయి ధర్మసూత్రకారుల గ్రంథము రెండవప్రమాణమయి యున్నది. ఈ ధర్మసూత్రములు గద్యాత్మకములే యగుటచే శ్లోకములలో వ్రాసిన స్మృతిగ్రంథములకంటె ప్రాచీనములై యుండవలయునని విద్వాంసులయభిప్రాయము. ఈ యభిప్రాయము మంచిదియగునా? కాదా? యని ప్రస్తుతమునందు విచారించుట కవకాశము లేదు. అది మంచిదైనను చెడుదైనను, పైన మను యాజ్ఞవల్క్య స్మృతుల

యందు చెప్పఁబడిన వచనములకంటె సైతము గృహస్థాశ్రమము యొక్క, లేక, కర్మయోగముయొక్క మహత్త్వము ధర్మసూత్రముల యం దధికముగ వర్ణింపఁబడినదని ప్రస్తుత ప్రకరణమునందలి ముఖ్య విషయము. మను, యాజ్ఞవల్క్యులు కర్మయోగమును చతుర్థాశ్రమమునకు వికల్పముగ చెప్పినారు; కాని బౌధాయనాపస్తంబు లిట్లు చెప్పక గృహస్థాశ్రమమే ముఖ్యమయిన దనియు దానిచే నమృతత్వము ప్రాప్తియగుననియు స్పష్టముగ విధించిరి. బౌధాయనధర్మసూత్రమున "జాయమానో వై బ్రాహ్మణః త్రిభి ర్ఋణవాన్ జాయతే" – ప్రతిబ్రాహ్మణుఁడును జన్మ మొదలుకొని మూఁడు ఋణములను తన వీఁపుపై వైచికొని వచ్చినాఁడు అనునది మొదలుగాఁ గల తైత్తిరీయ సంహితయందున్న వచనములను మొదట చెప్పి యనంతర మీ ఋణములఁ దీర్చుకొనుటకొఱకు యజ్ఞయాగాదిపూర్వకముగ గృహస్థాశ్రమము నాశ్రయించు మనుజుఁడు బ్రహ్మలోకము నొందుచున్నాఁ డనియు, బ్రహ్మచర్యమును గాని, సన్న్యాసమునుగాని ప్రశంసించు మనుజులు దుమ్ములోఁ గలసిపోదు రనియుఁ జెప్పఁబడినది (బౌ. ౭. ౬. 11. ౩౩ మఱియు ౩4). మఱియు నాపస్తంబసూత్రమునందును నవి యటులే విధింపఁబడియున్నవి (అప. 2.9.24.8). ఈ రెండు ధర్మసూత్రములలోను సన్న్యాసాశ్రమము వర్ణింపఁబడకపోలేదు. దానిని వర్ణించినను గృహస్థాశ్రమముయొక్క మహత్త్వ మధికమయినది యని చెప్పఁబడినది. దీనివలనను, "విశేషముగ మనుస్మృతియందు కర్మయోగమునకు 'వైదిక' మని విశేషణ మిచ్చుటచేతను కర్మత్యాగానురూపమగు సన్న్యాసాశ్రమముకంటె నిష్కామకర్మయోగయుక్తమైన గృహస్థాశ్రమము మనుస్మృతియొక్క కాలముకంటెను ప్రాచీనమని తెలియుచున్నది: మఱియు మోక్షదృష్టిచే దానియొక్క యోగ్యత చతుర్థాశ్రమముతో సమముగానే గణింపఁబడుచుండెను అను నీ రెండు విషయములు స్పష్టముగనే స్థిరపడు

చున్నవి. గీతలపై నున్న టీకాకారులయొక్క విశ్వాసము సన్న్యాసముపై, లేక, కర్మత్యాగయుక్త భక్తిపైననే యుండుటచే వారియొక్క టీకలలోఁ బూర్వోక్తములగు స్మృతివచనము లుల్లేఖింపఁబడినటుల కానరావు; కాని వారీ పక్షమును లక్ష్యము చేయకపోయినను కర్మయోగముయొక్క ప్రాచీనత్వమిందుచేఁ దఱుఁగదు. వేయేల? కర్మయోగమార్గ మీ తీరున ప్రాచీన మయిన దగుటచే యతిధర్మములకు వికల్ప మని దానిని స్మృతికారులు గ్రాహ్యముగ నంగీకరించుచు వచ్చినారనియు చెప్పుటకు నభ్యంతర ముండదు. ఇది వైదికకర్మయోగము. శ్రీకృష్ణునికంటె పూర్వకాలమునందు జనకాదు లీ మార్గమునే యాచరించుచుండిరి; కాని భగవంతుఁడు పిదప దానియందు భక్తిభారమును వైచి యధికముగఁ బ్రవర్తింపఁ జేయుటచే దానికే 'భాగవతధర్మ'మని నూతన నామకరణంబుఁ జేసిరి. భగవద్గీత సన్న్యాసముకంటెను, కర్మయోగ మీ తీరున నధికమహత్త్వము గలది యని నిశ్చయించి యుండుటచే దానికి పిదప గౌణత్వము వచ్చి సన్న్యాసమార్గముతో సదృశమైన దెట్లయినదియు నైతిహాసికదృష్టితో నిటుపైన విచారించెదము. కర్మయోగము స్మార్తమార్గమునకు పిమ్మటిది కాదనుటకు కారణము, పురాతనవైదికకాలమునుండియు వచ్చుచున్నదనిమాత్రమే యిక్కడ చెప్పవలసియున్నది.

భగవద్గీతయొక్క ప్రతియధ్యాయపు సమాప్తియందును "ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే" అని యున్న సంకల్పమునందలి రహస్యము చదువరుల కిప్పుడు సంపూర్ణముగఁ దెలియును. భగవంతునిచేఁ జెప్పఁబడిన యుపనిషత్తులయందితరములగు నుపనిషత్తులయందు వలెనే బ్రహ్మవిద్య యుండియే యున్నది; కాని యొక బ్రహ్మవిద్యయే యుండలేదు. ఇంక నేమనఁ: బ్రహ్మవిద్యయందు సాంఖ్యు లనియు, యోగు లనియు (వేదాంతులగు సన్న్యాసు లనియు, వేదాంతులగు కర్మయోగు లనియు) వెలు

పడిన రెండు మార్గములలో యోగము (అనఁగా: కర్మయోగము) యొక్క ప్రతిపాదన భగవద్గీతకు ముఖ్యవిషయమని పూర్వోక్తమగు సంకల్పమువలన స్పష్టమగుచున్నది. వేయేల? భగవద్గీతోపనిషత్తను నది కర్మయోగమునకు ముఖ్యగ్రంథమనునది యని చెప్పుటకేమియు నభ్యంతర ముండదు. కారణ మేమి యన: కర్మయోగము వైదిక కాలమునం దుండియు వచ్చుచున్నదైనను "కుర్వన్నే వేహ కర్మాణి" (ఈశ. 2) అనియు, "ఆరభ్య కర్మాణి గుణాన్వితాని" (శ్వే. 6. 4) అనియు, "విద్య నభ్యసించినటులే స్వాధ్యాయాది కర్మలను సైతము చేయవలయు" ననియు (తై. 1. 9) చిన్న చిన్న వచనములు తప్ప ఈ యుపనిషత్తులలోఁ గర్మయోగ మెక్కడను సవిస్తరముగ వివేచింపఁబడలేదు. భగవద్గీత యనునదియే దానిపై ప్రమాణగ్రంథముగ నున్నది. మఱియు భారతభూమి యందున్న కర్తలగు పురుషుల చరిత్రమును జెప్పు భారతమునందే యధ్యాత్మశాస్త్రము నవలంబించి కర్మయోగముయొక్కయు నుపపత్తిని చెప్పుచుఁ బోవుట యనునది కావ్యదృష్టితో విచారించినను యోగ్యమే యగును. ప్రస్థానత్రయ మందును భగవద్గీత కేల సమావేశము చేయఁబడినది? యను ప్రశ్నకు నిప్పుడు సరియగు నుపపత్తి కుదిరినది. ఉపనిషత్తులు మూలభూతము లయిన వని యనేకులగు ఋషీశ్వరులచేఁ జెప్పఁబడి యుండుటవలన వానియందున్న విచారము సంకీర్ణముగను, కొన్ని స్థలములయందుఁ జూచుటకు పరస్పరవిరుద్ధముగ నుండును. కావున నుపనిషత్తులవలెనే వానికి నేకవాక్యతను జేయు వేదాంతసూత్రములకును ప్రస్థానత్రయ మందు గణనఁ జేయఁబడుట యావశ్యక మగును; కాని యుపనిషత్తులు, వేదాంతసూత్రములు నను నీ రెంటికంటెను గీతయందాధిక్యము లేనియెడల ప్రస్థానత్రయమునందు గీతలను సంగ్రహించుటకుఁ గారణమేమియు నుండదు; కాని యుపనిషత్తులయొక్క యభిప్రాయము చూపునకు తఱచుగ సన్న్యాసమార్గము వైపునకే యుందు

టుచే దానియందు జ్ఞానమార్గమే విశేషముగఁ బ్రతిపాదింపఁ బడినది. మఱియు భగవద్గీతయం దీ జ్ఞానము నవలంబించి భక్తియుక్తమగు కర్మయోగము సమర్థింపఁబడినదని చెప్పితి మేని గీతాగ్రంథమునకు నపూర్వత సిద్ధమగుటచే దానివలెనే ప్రస్థానత్రయముయొక్క మూఁడుభాగములకు సార్థకత వ్యక్తమగును. కారణ మేమియన: వైదిక ధర్మములకుఁ బ్రమాణభూతము లగు గ్రంథములయందు జ్ఞాన-కర్మ (సాంఖ్యము, యోగము) లను నీ రెండు వైదికమార్గములును విచారింపఁబడని యెడల ప్రస్థానత్రయమును నంత యపూర్ణముగనే యుండును. ఉపనిషత్తులు సామాన్యముగ నివృత్తిపరము లయినను గీతకు బ్రవృత్తిపరమయిన యర్థము చేసినయెడల ప్రస్థానత్రయము నందున్న మూఁడుభాగములందును విరోధము గలుగును గాన వాని యొక్క ప్రామాణ్యమునకే లోపము వచ్చునని యనేకు లభిప్రాయ పడుచున్నారు. సాంఖ్యము (అనఁగా: సన్న్యాసము) అనునది యొక్కటియే సత్యమగు వైదికమార్గ మయినయెడల నీ శంక యుక్తమగును; కాని యేమి లేకపోయిన నీశావాస్యాదికములగు కొన్ని యుపనిషత్తులలో కర్మయోగము స్పష్టముగ నుల్లేఖింపఁబడినదని పైన చెప్పియే యున్నాను. కావున వైదికధర్మప్రవర్తకు లొకపక్షమునే (అనఁగా: సన్న్యాస పక్షమునే) తెలిసికొనక దానికి బ్రహ్మవిద్య యనునది యొకటే శిరస్సును, ఈ సాంఖ్యము, కర్మయోగము ననునవి మోక్ష దృష్టిచే తుల్యబలము గలవి యగుటచే దాని కుడియెడమ చేతులు నయి యున్నవి యని గీతానుసారముగ సిద్ధాంతము చేసిన పక్షమున నుపనిషత్తులకును, గీతకును విరోధ ముండదు. వేయేల? ఉపనిషత్తుల యం దొక మార్గమును గీతయందు రెండవ మార్గమును సమర్థింపఁ బడి యుండుటచేఁ బ్రస్థానత్రయముయొక్క యీ రెండు భాగములు రెండు హస్తములవలె పరస్పర విరుద్ధములు గాక సహాయకారులే యగునని కాన్పించుచున్నది. అట్టి గీతలయందు కేవల ముపనిషత్తుల

యొక్క ప్రతిపాదనమే యున్నదని యంగీకరించుటచే పిష్టపేషణ న్యాయముగ గీతలకుఁ గలిగిన వైయర్థ్య మిప్పు డుండదు. మఱియు గీతలపై నున్న సంప్రదాయటీకాకారు లీ విషయము నుపేక్షించి యుండుటచే సాంఖ్యము యోగము అను రెండు స్వతంత్రమార్గముల యొక్క పురస్కర్తలును తమ తమ మార్గములను సమర్థించుకొనుటకై చెప్పునట్టి ముఖ్యకారణములును వాని యందున్న సామ్యవైషమ్యములును సులభముగను తొందరగను దెలియు నిమిత్తమయి ముందుఁ వ్రాయఁబడిన కోష్ఠకద్వయములో నీ కారణము లొకదాని కెదురుగ మఱియొకటి సంక్షేపముగఁ జూపింపఁబడినవి. స్మృతిగ్రంథములలోఁ బ్రతిపాదింపఁబడిన (అనగా: స్మార్తమయిన) యాశ్రమవ్యవస్థయందును మూలభాగవత ధర్మములయందును ముఖ్యములైన భేదము లేవైనదియు నీ కోష్ఠకమువలనఁ గాన్పించును—

బ్రహ్మవిద్య, లేక, ఆత్మజ్ఞానము ప్రాప్తమయిన పిదప

| కర్మసన్న్యాసము (సాంఖ్యము) | కర్మయోగము (యోగము) |
| --- | --- |
| 1. మోక్ష మాత్మజ్ఞానముచేతనే లభించును. కర్మచే సిద్ధింపదు. జ్ఞానవిరహితమయినను శ్రద్ధతోఁ జేయఁబడిన యజ్ఞయాగాది కర్మలచే లభించు స్వర్గసుఖ మనిత్యము. | 1. మోక్ష మాత్మజ్ఞానముచేతనే లభించును. కర్మచే లభింపదు. జ్ఞానవిరహితమయినను శ్రద్ధతోఁ జేయఁబడిన యజ్ఞయాగాది కర్మచే లభించు స్వర్గసుఖ మనిత్యము. |
| 2. ఆత్మజ్ఞానము కలుగుటకు నింద్రియనిగ్రహముచే బుద్ధి స్థిరమును, నిష్కామమును, విరక్తమును, సమమును కావలయును. | 2. ఆత్మజ్ఞానము కలుగుటకు నింద్రియనిగ్రహముచే బుద్ధిస్థిరమును, నిష్కామమును, విరక్తమును, సమమును కావలయును. |

| కర్మసన్న్యాసము (సాంఖ్యము) | కర్మయోగము (యోగము) |
| --- | --- |
| 3. కావున నింద్రియముల కుండు విషయపాశములను ద్రెంచి ముక్తుఁ డ వగుము. | 3. కావున నింద్రియములయొక్క విషయములను వదలక వానియందే వైరాగ్యముతోఁ బ్రవర్తించుచు నింద్రియనిగ్రహమును బాగుగ నభ్యసింపుము. నిష్కామ మనఁగా : నిష్క్రియ గాదు. |
| 4. తృష్ణామూలకములగు కర్మములు దుఃఖమయములు గను బంధకములుగ నున్నవి. | 4. దుఃఖమును బంధకమును దేని వలన కలుగునవి బాగుగ విచారించితి మేని యచేతనములగు కర్మ లెవరిని బంధించునవియు, విడచునవియు కాక పోవుటచే వాని విషయమై కర్మయొక్క మనస్సునందున్న కామము, లేక, ఫలాశ యనునదియే బంధమునకు దుఃఖమునకు మూలమగునవి స్పష్టమగును |
| 5. కావున చిత్తశుద్ధి కలుగుదనుక కర్మలను జేసినను, తుదకు వదలవలయును. | 5. కావున చిత్తశుద్ధ్యనంతరమున పైతము ఫలాశనువదలి, ధైర్యముతో ఉత్సాహముతో సర్వకర్మలను జేయుము. కర్మలను వదలవలయునవియెంచి నను వదలవు. సృష్టియే కర్మ. దానిని వదలకూడదు. |
| 6. యజ్ఞార్థము చేయఁబడిన కర్మలు బంధకములు గామిచే గృహస్థాశ్రమము నం దవి చేసినను తప్పు కాదు. | 6. నిష్కామబుద్ధితో, లేక, బ్రహ్మార్పణవిధిచే, చేయఁబడిన సర్వకర్మలు నొక గొప్ప 'యజ్ఞ'మే. కావున స్వధర్మవిహితము లయిన సర్వ కర్మలు నిష్కామబుద్ధితో కేవల కర్తవ్యములని యెప్పుడును చేసియే తీరవలయును. |

| కర్మసన్న్యాసము (సాంఖ్యము) | కర్మయోగము (యోగము) |
| --- | --- |
| 7. దేహధర్మములు వదలుటకు వీలైనవి గాకపోవుటచే సన్న్యాసము గైకొనిన పిదప భిక్షమెత్తుకొనుట తప్పు. | 7. పొట్టకొఱకు భిక్ష మెత్తుటయు కర్మయే. ఇంతియకాక యది లజ్జా త్యాగ రూపమయినది. ఇట్టి కర్మలను చేయనగు నందువేని ఇతర కర్మలను మాత్రము నిష్కామబుద్ధితో నేల చేయరాదు? ఇది గాక గృహస్థాశ్రమము లేనిచో, భిక్ష పెట్టువా రెవరు? |
| 8. జ్ఞానము కలిగిన పిదప తనకుఁ గర్తవ్యము లేమియు నుండవు. లోకసంగ్రహము సైతము చేయనవసరము లేదు. | 8. జ్ఞానము కలిగిన పిదప నాత్మహితార్థమై పొందవలసిన దేమియు నుండకపోయినను గర్మ వదలిపోదు. కావున శాస్త్రముచే విధింపఁబడినవి 'నా కక్కఱ లే' దను నిర్మమబుద్ధితో లోకసంగ్రహము వైపునకు దృష్టిని ప్రసరింపఁ జేయుచుండుము. లోకసంగ్రహము నెవరును వదలిపెట్టకూడదు. ఉదాహరణమునకై భగవంతుని చరితముం జూడుము. |
| 9. అయిన నధికారి యగు పురుషుఁడు జ్ఞానము కలిగిన పిదప సన్న్యాసమున కపవాద మను నూహతోఁ దన వ్యావహారికములయిన యధికారములను జనకాదులవలె నామరణాంతము నడపుట యేమియు తప్పుకాదు. | 9. గుణవిభాగరూపమగు చాతుర్వర్ణ్య వ్యవస్థానుసారముగ చిన్నవియుఁ బెద్దవియు నగు నధికారము లందఱకును జన్మమొదలుకొని యుండియేయున్నవి. మఱియు స్వధర్మానుసారముగ ప్రాప్తములయిన యీ యధికారములను లోకసంగ్రహార్థమై యందఱును నిస్సంగబుద్ధితో నామరణాంతము నభ్యంతరములు చెప్పకుండ నాచరింపవలయును. కారణ మేమియన: ఈ చక్రము జగత్తుయొక్క ధారణమునకై పరమేశ్వరునిచే నిర్మింపఁబడినది. |

**కర్మసన్న్యాసము (సాంఖ్యము)**

10. కాని యేమైనను కర్మత్యాగ రూపమగు సన్న్యాసమే శ్రేష్ఠము. ఇతరాశ్రమముల కర్మలు చిత్తశుద్ధికి సాధనములు, లేక, ప్రాథమిక సన్నాహములు. కావున జ్ఞానమునకును, కర్మకును సహజముగనే విరోధము కలదు. కావున పూర్వాశ్రమమునందు సాధ్యమగునంత త్వరలో చిత్తశుద్ధిఁ గలుగఁ జేసికొని జ్ఞానము కలిగిన పిదప కర్మత్యాగ రూపమగు సన్న్యాసమును గైకొనుము. చిత్తశుద్ధి పుట్టుకతోనే కాని, లేక, పూర్వవయస్సుననే కాని కలిగిన యెడల గృహస్థాశ్రమమునందలి కర్మలను చేయుచు కూర్చుండ నవసర ముండదు. కర్మలను స్వరూపముతోనే త్యజించుట (స్వరూపతస్త్యాగము) సత్యమగు సన్న్యాస మగును.

11. కర్మసన్న్యాసమును గైకొనిన పిదప శమదమాది ధర్మములను బాలింపవలయును.

**కర్మయోగము (యోగము)**

10. సాంసారిక కర్మలను శాస్త్రోక్త విధి ననుసరించి చేసినందున చిత్తశుద్ధి యను నొక్కటియే కర్మకు ఫలము కాదు. జగత్తుయొక్క వ్యవహారము నడిపించుటకు కర్మ యావశ్యకమయినదియే. అట్లే కామ్యకర్మలకును, జ్ఞానమునకును విరోధమున్నను, నిష్కామ కర్మకును, జ్ఞానమునకు నేమియు విరోధము లేదు. కనుక చిత్తశుద్ధి గలిగిన పిదప సైతము, ఫలాశనువదలి చాతుర్వర్ణ్యముయొక్క సర్వకర్మల నామరణాంతము నిష్కామబుద్ధితో జగత్తుయొక్క సంగ్రహార్థమై యాచరించుము ఇదియే సత్యమగు సన్న్యాస మగును. కర్మలను బొత్తిగ వదలివేయుట (స్వరూపతస్త్యాగము) యెప్పుడు నుచితమును శక్యమును కానేరదు.

11. జ్ఞానము కలిగిన పిదప ఫలాశాత్యాగరూప సన్న్యాసమును గైకొని శమదమాది ధర్మములనే కాక యాత్మౌపమ్యదృష్టితోఁ బ్రాప్తములయిన సర్వ ధర్మములను పాలింపవలయును. మఱియు నీ శమముతోడనే (అనఁగా: శాంతవృత్తితోడ) శాస్త్రవిధిచే ప్రాప్తములయిన సర్వకర్మలను లోకసంగ్రహార్థమై యామరణాంతమును చేయుచుండుము. నిష్కామకర్మలను వదలి పెట్టుము.

| కర్మసన్న్యాసము (సాంఖ్యము) | కర్మయోగము (యోగము) |
|---|---|
| 12. ఈ మార్గ మనాది యైనదియు స్మృతిప్రతిపాదిత మైనదియు నై యున్నది. | 12. ఈ మార్గ మనాదియైనదియు శ్రుతి స్మృతిప్రతిపాదితమునై యున్నది. |
| 13. శుకయాజ్ఞవల్క్యాదు లీ మార్గ ముననే నడచిరి. | 13. వ్యాస, వసిష్ఠ, జైగీషవ్యాదులును, జనక-శ్రీకృష్ణాదు లీ మార్గ ముననే నడచిరి. |

తుదకు మోక్షము.

ఈ రెండు మార్గములు (అనఁగా: నిష్ఠలు) బ్రహ్మవిద్యా మూలకములు. ఈ రెండు పక్షములయందును మనస్సుయొక్క నిష్కామావస్థయు శాంతియు నొక్క విధముననే యుండవలయును. కాన రెండు మార్గముల చేతను తుద కొక మోక్షమే ప్రాప్తమగును (గీ. ౫.౫.). జ్ఞానము కలిగినపిదప కర్మలను వదలిపెట్టుటయు, కామ్యకర్మలను వదలి నిష్కామకర్మలను నిత్యము చేయుచుండుటయు ననునది మాత్రమే యీ రెంటియందును ముఖ్యమయిన భేదము.

కర్మత్యాగము, కర్మనుజేయుటయు నను పైన చెప్పిన రెండు మార్గములును జ్ఞానమూలకములుగ అనఁగా జ్ఞానము గలిగినపిదప జ్ఞానిచే స్వీకరింపఁబడినవియు, నాచరింపఁబడినవియు నై యున్నవి; కాని కర్మను వదలిపెట్టుటయు, కర్మను చేయుటయు నను రెండు విషయములును జ్ఞానము లేకపోయిన నుండవచ్చును. కావున నీ యజ్ఞానమూలకములగు కర్మలయొక్కయు, కర్మత్యాగముయొక్కయు వివేచనము నిచ్చోఁ జేయుట కొంత యావశ్యక మగును. గీత యొక్క పదునెనిమిదియవ యధ్యాయమునఁ జెప్పఁబడిన త్యాగము యొక్క మూఁడు విధములకును నిదియే కారణము. జ్ఞానము లేక

పోయినను కొందఱు కాయక్లేశభయముచే కర్మలను వదలిపెట్టు చున్నారు; ఇది గీతలలో రాజసత్యాగ మని చెప్పఁబడినది (గీ. 18.8). అట్లె జ్ఞానము లేకపోయినను కేవలము శ్రద్ధచేతనే యనేకులు యజ్ఞ యాగాది కర్మలను చేయుచున్నారు; కాని కర్మలను జేయుట యను నీ మార్గము మోక్షప్రదము కానేరదు. మఱియు నింక నేమన: స్వర్గప్రదముగనే యున్నదని గీత చెప్పుచున్నది (గీ. 9 20). యజ్ఞ యాగాది శ్రౌతధర్మములు ప్రస్తుతమున ప్రచారములో లేకపోవుటచే, మీమాంసకుల సంబంధమగు నీ కేవల కర్మమార్గవిషయమై గీత యొక్క సిద్ధాంతము ప్రస్తుతమున విశేషోపయోగి కానేరదని యనేకులు తలఁచుచున్నారు; కాని యది సత్యమైనది కాదు. కారణ మేమి యన: శ్రౌతము లైన యజ్ఞయాగములు మునిఁగిపోయినను, స్మార్తయజ్ఞములు, అనఁగా చాతుర్వర్ణ్యముయొక్క కర్మ లిప్పటికిని నడుచుచునే యున్నవి. కావున నజ్ఞానముచేతనైనను, శ్రద్ధతో యజ్ఞ యాగాది కామ్యకర్మలను చేయువారి విషయములో గీతలో నున్న సిద్ధాంతము, జ్ఞానము లేకపోయినను శ్రద్ధతో చాతుర్వర్ణ్యాది కర్మ లను జేయువారికిని, ప్రకృతమందున్న స్థితియందు పూర్ణముగ సం బంధించియేయుండును. జగత్తునందలి వ్యవహారము విషయమై విచా రించితి మేని, యిట్టి సమాజమునందే (అనఁగా: శాస్త్రముమీఁదనే శ్రద్ధ యుంచి నీతిచేఁ దమకర్మలను జేయులోకులయొక్క సమాజము నందే) విశేషమగు గొప్పతన మున్నదని కాన్పించును; కాని, వారికి పరమేశ్వర స్వరూపము పూర్ణముగఁ దెలియక యుండును. కావున గణితశాస్త్రమునం దుపపత్తిని దెలిసికొనక నోటిలెక్కనే గణితమును జేయులోకుల యవస్థవలె నీ శ్రద్ధాళువులును కర్మఠులు నయినలోకుల యొక్క యవస్థ యగును. సర్వకర్మలును శాస్త్రోక్తవిధిచేత శ్రద్ధతోఁ జేయఁబడి యుండుటచే నవి తప్పక పుణ్యప్రదములు, అనఁగా స్వర్గ ప్రదము లగు నను విషయమున నేమియు సందేహము లేదు.

జ్ఞానము కుదురక మోక్షము సిద్ధించుట శక్యము కాదని శాస్త్రముల యొక్క సిద్ధాంతము గాన స్వర్గప్రాప్తికంటె నధికఫల మీ కర్మము లకు లభించుట శక్యము కాదు. కావున స్వర్గసుఖముకంటె పర మందున్న యమృతత్వముఁ బొందఁదగిన వారును, నీయమృతత్వమే ముఖ్యమైన పురుషార్థ మనుకొనువారును, మొదటు సాధన మనియు, పిదప సిద్ధావస్థయందు లోకసంగ్రహార్థ మనియు మొత్తముమీఁద నామరణాంతము "సర్వభూతములయందు నొక యాత్మయే కల" దను జ్ఞానముగలబుద్ధితో, నిష్కామకర్మలను జేయుమార్గమునే స్వీకరింప వలయును. అయుర్దాయమును గడపుకొనుటలో నన్ని మార్గముల కంటె నీ మార్గ ముత్తమ మయినది. గీతల ననుసరించి పైన చెప్పఁ బడిన కోష్ఠకమందున్న యీ మార్గము కర్మయోగమని చెప్పఁ బడినది; మఱియు దీనినే కర్మమార్గ మనియు, లేక, ప్రవృత్తిమార్గ మనియుఁ జెప్పుదురు. కర్మమార్గము, ప్రవృత్తిమార్గము నను రెండు శబ్దములచేతను, జ్ఞానవిరహిత మైనను శ్రద్ధతోఁ గర్మలను జేయువారికి స్వర్గప్రదమగు మార్గముయొక్క బోధయు సామాన్యముగఁ గలుగు చున్నది. కావున జ్ఞానవిరహితమైనను శ్రద్ధాయుక్తమగు కర్మమును, జ్ఞానయుక్త నిష్కామకర్మమును అను నీ రెంటియొక్క భేదమును దెలియఁజేయుటకు వేర్వేఱగుశబ్దములను బ్రయోగించుట యావశ్యక మగును. మఱియు నీ కారణముచేతనే మనుస్మృతియందును, భాగ వతమందును, మొదటిదానికి (అనఁగా: జ్ఞానవిరహితమగు కర్మకు) 'ప్రవృత్తికర్మ' యనియు, రెండవదానికి (అనఁగా: జ్ఞానయుక్త మగు నిష్కామకర్మకు) 'నివృత్తికర్మ' యనియు వేర్వేఱగు పేరులు పెట్టఁబడినవి (మను. 12·89; భాగ. 7·15·47). కాని యీ శబ్దము లును నా మతమునందు కావలసినంత నిస్సందిగ్ధములుగ లేవు. కారణ మేమి యన: 'కర్మనుండి నివృత్తియగుట,' యని సామాన్య

మైన యర్థము నివృత్తిశబ్దమున కగును. ఈ శంక యుండఁగూడ దను నూహతో 'నివృత్త' శబ్దమునకు ముందు 'కర్మ' యను విశేషణమును సంబంధింపఁ జేయుచున్నారు. అటు లొనర్చిన యెడల 'నివృత్త' అను విశేషణమునకుఁ గర్మయందుండి పరావృత్తుఁడని యర్థము గాక, నివృత్తకర్మ=నిష్కామకర్మ, యని మొత్తముపై నర్థము నిష్పన్నమగును. కాని యేమి చెప్పినను 'నివృత్త' శబ్దము దానియం దున్నంతవఱకు కర్మత్యాగముయొక్క కల్పన మనస్సునకు దోఁపకమానదు. కావున జ్ఞానయుక్త నిష్కామకర్మలను జేయు మార్గమును 'నివృత్తి, లేక, నివృత్తికర్మ' యని చెప్పక 'కర్మయోగ' మని చెప్పుటయే యుత్తమ మని నాయూహ. కారణ మేమన: కర్మ శబ్దమునకు యోగశబ్దము చేర్పఁబడెనేని 'మోక్షమున కాటంకము రాని కర్మలను జేయు యుక్తి' యని దానికి స్వభావముగ నర్థమగును కావున నజ్ఞానయుక్తకర్మలయొక్క నిరాసము తనంతట తానే యగును. ఐనను గీతలయందున్న కర్మయోగము జ్ఞానమూలకముగ నున్న దని మఱవక దీనినే కర్మమార్గము, లేక, ప్రవృత్తిమార్గము అని చెప్పుట కేమియు నభ్యంతరము లేదు. కొన్ని స్థలములయందు నేనును భాషావైచిత్ర్యముకొఱకీ శబ్దములను గీతలయందున్న కర్మయోగము నుద్దేశించియే ప్రయోగించి యున్నాను. అది యట్లుండు గాక. కర్మనుజేయుట, లేక, వదలుట యనునవి యిట్లు జ్ఞానమూలకములు, నజ్ఞానమూలకములు నని రెండువిధము లగుచున్నవి. వానిలోఁ బ్రతిదాని విషయమునను గీతాశాస్త్రముయొక్క యభిప్రాయ మీదిగువ వ్రాసిన తీరున నున్నది—

| ఆయుష్యక్రమణమునకు మార్గము. (జీవితకాలమును గడపుమార్గము) | శ్రేణి. | | గతి. | |
|---|---|---|---|---|
| 1. కామోపభోగ మనునదియె పురుషార్థమని యెన్ని యహంకారము, ఆసురీ బుద్ధి, దంభము, లేక, లోభము- వీని తోడ తన సుఖముకొఱకె కర్మలను జేయుట (గీ. 16.16)- ఆసురము, లేక, రాక్షసమార్గము! | అధమము. | | నరకము. | |
| 1. సర్వభూతములందు నొక యాత్మయే కలదని పరమేశ్వర స్వరూపము యొక్క యథార్థజ్ఞానము లేకపోయినను వేదవిధిని, లేక, శాస్త్రవిధి ననుసరించి శ్రద్ధతోను, నీతితోను దమతమ కామ్యకర్మలను జేయుట. (గీ. 2. 41-44; మఱియు 9.20) కేవలకర్మము, త్రయీధర్మము, లేక, మీ మాంసకమార్గము. | మధ్యమము (మీమాంసక మతములో ఉత్తమము) | జనకునిచేఁ వర్ణింపఁబడిన మూఁడునిష్ఠలు | స్వర్గము. (మీమాంసక మతమున మోక్షము.) | |
| 1. శాస్త్రోక్తములగు నిష్కామకర్మలచే పరమేశ్వరజ్ఞానము గలిగిన పిదప వైరాగ్యముచే సర్వకర్మలను వదలి కేవలజ్ఞానమునందే తృప్తుఁడై యుండుట (గీ.5.2)- కేవల జ్ఞానము, సాంఖ్యము లేక, స్మార్త మార్గము. | ఉత్తమము | | మోక్షము | గీతలయందున్న రెండు నిష్ఠలు. |
| 1. మొదట చిత్తశుద్ధ్యర్థమును, పరమేశ్వరునియొక్క జ్ఞానము కలిగినపిదప కేవల లోకసంగ్రహార్థమును, నామరణాంతము భగవంతునివలె కర్మలను చేయుచునేయుండుట (గీ.5.2)-జ్ఞానకర్మసముచ్చయము, కర్మయోగము,లేక, భాగవతమార్గము. | సర్వోత్తమము. | | మోక్షము | |

కావున మోక్షప్రాప్తిని గుఱించి కర్మ లావశ్యకములు కాకపోయినను, ఆ కర్మతోఁగూడిన యితర కారణముల గుఱించి అన్నఁగా కర్మ లపరిహార్యము లయినను ఇతర కారణములు జగత్తుయొక్క ధారణపోషణములకొఱ కావశ్యకములై నందున— నిష్కామబుద్ధితో నెప్పుడును సర్వకర్మలను జేయుచునే యుండవలయు నను పక్షము సర్వోత్తమమని గీతలలో నిశ్చయింపఁబడినది. లేదా "కృతబుద్ధిషు కర్తారః కర్తృషు బ్రహ్మవాదినః" (మను. 1.97) అను మనువచనానుసారముగ కర్తృత్వమునకును బ్రహ్మజ్ఞానమునకు నుండు పరస్పర సంబంధమే యన్నింటిలో నుత్తమ మనియు, కేవలకర్తృత్వము, కేవలబ్రహ్మజ్ఞానము ననునవి ప్రత్యేక మేకదేశీయములుగ నున్నవనియు గీతల చరమసిద్ధాంత మని సారాంశము.

వాస్తవముగ విచారించిన నీ ప్రకరణ మిచ్చో సమాప్తమయినది; కాని గీతలయొక్క సిద్ధాంతము శ్రుతిస్మృతిప్రతిపాదితమని నిరూపణచేయుటకై పూర్వమునఁ జెప్పఁబడిన వచనములలోని తుద రెండు మాటలను చెప్పుట యావశ్యకము. కారణ మేమి యన: ఉపనిషత్తులపై నున్న సాంప్రదాయిక భాష్యములనుబట్టి సర్వోపనిషత్తులును సన్న్యాసపరములు, లేక, నివృత్తిపరములుగ నున్నవని యనేకు లభిప్రాయపడి యుండిరి. ఉపనిషత్తులలో సన్న్యాసమార్గము ప్రతిపాద్యము కాదని మేము చెప్పుటయే లేదు. పరబ్రహ్మమనునదియే సత్యమని యనుభవములోనికి వచ్చిన పిదప "కొందఱు జ్ఞానులు పుత్త్రేషణ, విత్తేషణ, లోకేషణల నపేక్షింపక మాకు సంతతితో ప్రయోజన మేమి? మా యాత్మయే లోక మని యెన్ని భిక్ష యెత్తుకొనుచు నానందముగ తిరుగుచున్నారము" అని బృహదారణ్యకోపనిషత్తులోఁ జెప్పఁబడినది (4.4.22); కాని యీ పక్షమునే సర్వబ్రహ్మజ్ఞానులును స్వీకరింపవలయు నని నియమము బృహదారణ్యకములో నెచ్చటను లేదు. వేయేల? ఈ యుపదేశము నొందిన జనక

చక్రవర్తియు బ్రహ్మజ్ఞానముయొక్క శిఖరమునెక్కి యమృతత్వము నొందెనని యుపనిషత్తులలోఁ జెప్పబడెను; కాని యాతఁడు యాజ్ఞ వల్క్యులవలె సంసారమును వదలి సన్న్యాసము గైకొని న ట్లెక్కడను గానరాదు. కావున జనకునియొక్క నిష్కామకర్మమార్గము, యాజ్ఞ వల్క్యులయొక్క కర్మసన్న్యాసమార్గము నను నీ రెండును బృహ దారణ్యకోపనిషత్తునకు వికల్పముగ సమ్మతమయినటుల స్పష్టమగు చున్నది. మఱియు వేదాంతసూత్రకారులును, ఆ యనుమానమునే చేసిరి (వే.సూ. 3.4.15). కఠోపనిషత్తు దీనికంటె మీఁదిమె ట్టెక్కి నది. దానిల్లో మా మతమునందున్న నిష్కామకర్మయోగమే ప్రతి పాద్యముగ నున్నదని వెనుక నేనవ ప్రకరణములోనే నిరూపించి యున్నాను. ఛాందోగ్యోపనిషత్తు నందును (8. 15. 1) నీ యర్థమే ప్రతిపాద్యమగుటచేఁ దుదకు "గురునియొద్ద యధ్యయనముఁ జేసి యనంతరము కుటుంబములో నుండి, ధర్మముతో నడుచు జ్ఞాని బ్రహ్మలోకమును బొందును. మరలరాఁడు" అని స్పష్టముగఁ జెప్పఁ బడినది. మఱియు తైత్తిరీయ శ్వేతాశ్వతరోపనిషత్తుల యందున్న యీ యర్థము కలిగిన వాక్యములు పైనఁ జెప్పఁబడినవి (తై. 1. 9 మఱియు శ్వే. 6.4). ఇంతియె కాక యుపనిషత్తులలో నెవ రెవ రితరునకు బ్రహ్మజ్ఞానము నుపదేశించిరో వారు గాని, లేక, బ్రహ్మ జ్ఞానము నొందినవారికి శిష్యులు గాని, యాజ్ఞవల్క్యులవలె నెవ్వరును కర్మత్యాగపూర్వకమగు సన్న్యాసమును పుచ్చుకొనినటుల స్పష్టముగఁ గన్పట్టదు. అదియునుం గాక వారు గృహస్థాశ్రమమునందే యుండి రని వారిచరిత్రనుబట్టి కన్పట్టుచున్నది. కావున నన్ని యుపనిషత్తులును సన్న్యాసపరములు గావనియు, గొన్నింటిలో సన్న్యాసకర్మయోగ ములయొక్క వికల్పమును, మఱికొన్నిటిలో జ్ఞానకర్మయోగముల సముచ్చయమును బ్రతిపాదింపఁబడినవనియుఁ జెప్పవలసివచ్చును; కాని యుపనిషత్తులమీఁద నున్న సాంప్రదాయిక భాష్యములలో నీ

భేదమును జెప్పక సర్వోపనిషత్తులు నొక యర్థమే కలవి యనియు చెప్పుచున్నారు. కావున సాంప్రదాయిక టీకాకారులయొక్క చేతులలో గీతలకు నుపనిషత్తులకు నొక యవస్థ ప్రాప్తమయినది. అనఁగా గీతలలోనున్న కొన్ని శ్లోకములకువలె, నుపనిషత్తులలోనున్న కొన్ని మంత్రములకును నీ భాష్యకారులు బలాత్కారముగఁ దమ తమ మతమున కనుకూలమగు నర్థముఁ జేయుటకు నారంభించిరి యని సారాంశము.

ఈశావాస్యోపనిషత్తు నుదాహరణముగఁ గైకొనుము. ఈ యుపనిషత్తు చిన్నది. పదునెనిమిది శ్లోకములు మాత్రమే కలిగిన దైనను నితరోపనిషత్తులకంటె నధికమైన యోగ్యత గలదని చెప్పుచున్నారు. కారణ మేమియన: ఈ యుపనిషత్తు వాజసనేయసంహిత యందుమాత్రమే చెప్పఁబడినది. ఇతరోపనిషత్తు లారణ్యకగ్రంథము నందు చెప్పఁబడియున్నవి; మఱియు సంహితకంటె బ్రాహ్మణమును, బ్రాహ్మణముకంటె యారణ్యకగ్రంథము నుత్తరోత్తరముగ తగు ప్రామాణ్యము గలవను విషయము నందఱు నొప్పుకొందురు. ఈ శావాస్యోపనిషత్తంతయు (అనఁగా: ఆరంభము మొదలు తుదవఱకును) జ్ఞానకర్మసముచ్చయాత్మకముగనే యున్నది. దీనియందలి మొదటిమంత్రమున(శ్లోకమునందు) "జగత్తునం దున్నదంతయు నీశావాస్యము-అనఁగా: పరమేశ్వరాధిష్ఠితము అని తెలిసికొనవలయును" అని చెప్పి రెండవ మంత్రమునందే యావజ్జీవము నూఱువత్సరములు నిష్కామకర్మలను జేయుచునే యుండవలయునని యిచ్ఛగింపవలయును" అని స్పష్టముగనే యున్నది. వేదాంతసూత్రములందు కర్మయోగమును వివేచన చేయవలసిన సమయము వచ్చినప్పుడు నితర గ్రంథముల యందును నీశావాస్యమునందున్న యీ వచనములు జ్ఞానకర్మసముచ్చయ పక్షమునకు సమర్థకము లని వ్రాయఁబడినది; కాని యీశావాస్యోపనిష త్తంతమాత్రముచేఁ బూర్ణము కానేరదు.

రెండవ మంత్రములోఁ జెప్పఁబడిన యీ విధానమును సమర్థించు నిమిత్తమై మొదట నవిద్యను (అనఁగా: కర్మను), పిదప విద్యను (అనఁగా: జ్ఞానమును) వివేచించుటకు నారంభించి తొమ్మిదియవ మంత్రమునందు అవిద్యనే (అనఁగా: కర్మనే) సేవించువార లంధకారమున ప్రవేశించెదరు; కేవల విద్యయందు (అనఁగా: బ్రహ్మజ్ఞానమునందు మాత్రమే) మగ్ను లయినవారు విశేషముగ నంధకారములోఁ బడుదురు" అని చెప్పఁబడినది. కేవల మవిద్య(కర్మ), కేవలము విద్య (జ్ఞానము) యను వీనియొక్క ప్రత్యేకత్వము న్యూనతఁ జూపించిన పిదపఁ బదునొకండవ మంత్రమునందు క్రింద చెప్పఁబడినటుల 'విద్యాఽవిద్య' లను నీ రెండింటికిని సముచ్చయముయొక్క యావశ్యకత చెప్పఁబడినది_

**విద్యాం చావిద్యాం చ యస్త ద్వేదోభయం సహ,**
**అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే.**

– విద్యయు (జ్ఞానము) నవిద్యయు (కర్మము) ఒకదానితో నొకటి కలిసియున్నవి యని తెలిసికొనినవారు, అవిద్యచేత (అనఁగా: కర్మచేత) మృత్యువును (అనఁగా: నాశవంతమైన ప్రపంచముయొక్క మాయాసృష్టిని) దాఁటి, విద్యచే (అనఁగా: బ్రహ్మజ్ఞానముచే) నమృతత్వము నొందుచున్నారు అని యీ మంత్రమునకు స్పష్టము, సరళము నగు నర్థము. మఱియు నా యర్థముననే విద్యకు 'సంభూతి' యనియు, (అనఁగా: జగత్తుయొక్క యాదికారణ మనియు) దానికంటె భిన్నమైన యవిద్యకు 'అసంభూతి' యనియు, లేక, 'వినాశ' మనియు మఱియొక పేరు పెట్టి, పిదప నున్న మూఁడు మంత్రములలో నిదియే మరలఁ జెప్పఁబడినది (ఈశ. 12-14). దీనివలన మొత్తముపై నీశావాస్యోపనిషత్తు విద్యను, నవిద్యను నొక కాలమునందే (ఉభయం సహ) సముచ్చయమును బ్రతిపాదించు నని వ్యక్తమగుచున్నది. మంత్రమునందున్న 'విద్యాఽవిద్యా' శబ్దమువలెనే

మృత్యువు, అమృతము అను శబ్దములును పరస్పర విరుద్ధములుగ నున్నవి. వీనిలో నమృత మనఁగా: అవినాశిబ్రహ్మ మను నర్థము స్పష్టముగ నున్నది. కావున తద్విరుద్ధమయిన మృత్యుశబ్దముచే నశ్వరమైన మృత్యులోకము, లేక, యిహలోకముయొక్క సంసార మని యర్థము నిష్పన్న మగును; మఱియు నీ యర్థమునందే యీ రెండు శబ్దములును ఋగ్వేదమునందలి నాసదీయసూక్తమునం దున్నవి (ఋ. 10.129.2). విద్యాదిశబ్దములకీ సరళమైన యర్థమును గ్రహింతుమేని విద్య=జ్ఞానము, అవిద్య=కర్మము, అమృతము=బ్రహ్మము, మృత్యువు=మృత్యులోకము నని తెలిసికొందుము. ఈశావాస్యమం దున్న పైఁ జెప్పఁబడిన, పదునొకండవ మంత్రముయొక్క యర్థమును చేయ నారంభింతు మేని యీ మంత్రముయొక్క ప్రథమచరణము నందు, విద్యావిద్యలకు నేకకాలీన సముచ్చయము (అనఁగా ఎప్పుడు నవి రెండును కలసియే యుండు ననుట) వర్ణింపఁబడియుండుటచే, నా విధానమునే బలపఱచుటకొఱకు, రెండవ చరణమునందు నీ రెంటిలో నొక్కొక్కదాని కేమి ఫల మున్నదియు వేర్వేఱుగఁ జెప్పఁబడినదని మొదటఁ గన్పట్టును. ఈశావాస్యోపనిషత్తునకు నీ రెండు ఫలములు నిష్టములుగానే యున్నవి. కావుననే జ్ఞానకర్మ లను నీ రెంటికి నేక కాలీనమయిన సముచ్చయ మీ యుపనిషత్తునందు ప్రతిపాదింపఁ బడినది. మృత్యులోక మను ప్రపంచమును బాగుగ నడిపించుటయు, దాని నిష్ప్రతిబంధముగ దాఁటుటయు నను నీ రెంటికిని, లోకసంగ్రహ మని గీతలయందు పేరిడఁ బడినది. మోక్షమును సంపాదించుకొనుట యనునది మనుజునకు కర్తవ్య మనుమాట సత్యమే; కాని యా ముక్తి నొందుటవలెనే యతనికి లోకసంగ్రహము చేయుటయు నావశ్యక మయినందున, జ్ఞాని యీ లోకసంగ్రహ కారకములగు కర్మలను వదలకూడదని గీతల సిద్ధాంతము; మఱియు నీ సిద్ధాంతమే శబ్దభేదముచే "అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే" అను పై మంత్రమునందున్నది. గీత యుపనిషత్తుల ననుస

రించి యుండుటయే కాక, యీశావాస్యోపనిషత్తునందు స్పష్టముగ వర్ణింపఁబడిన యర్థమే గీతలయందు సవిస్తరముగ ప్రతిపాదింపఁబడిన దని దీనింబట్టి కాన్పించునని సారాంశము. ఈశావాస్యోపనిషత్తు గల వాజసనేయసంహితయందే శతపథబ్రాహ్మణ మొక భాగము. మఱియు నా శతపథబ్రాహ్మణముయొక్క యారణ్యకమునందు బృహదారణ్యకోపనిషత్తు కలదు. కావున దానితో "కేవల విద్యయందు (బ్రహ్మజ్ఞానమునందు) మగ్నులైనవారు విశేషమైన యంధకారములోఁ బ్రవేశింతురు" అని యీశావాస్యోపనిషత్తు నందలి తొమ్మిదవమంత్ర మక్షరములతో సైతము స్వీకరింపఁబడినది (బృ, 4.4.10). ఈ బృహదారణ్యకోపనిషత్తునందే జనకునికథ యున్నది. మఱియు నా జనకుని దృష్టాంతమే కర్మయోగసమర్థనార్థమై భగవంతునిచే గీతలలో వక్కాణింపఁబడియె (గీ. 3.20). దీనివలన నీశావాస్యమునకును, భగవద్గీత యందున్న కర్మయోగమునకును పూర్వమునందు నేను నిర్మించిన సంబంధమే యధికదృఢముగను నిస్సంశయముగను సిద్ధమగును.

కాని యన్ని యుపనిషత్తులలోను మోక్షప్రాప్తికి నొక్కమార్గమే ప్రతిపాద్య మనియు, నదియు వైరాగ్యము, లేక, సన్న్యాసముతో కూడుకొని యున్నదనియు, నుపనిషత్తులలో రెండు మార్గములు చెప్పుటకు వీలులే దనియుఁ జెప్పునట్టి సాంప్రదాయికులు దమ సిద్ధాంతమున కనుకూలమగుటకై యీశావాస్యోపనిషత్తులో నున్న స్పష్టార్థకము లైన మంత్రములకు, బలాత్కారముగ మఱియొక యర్థమును జెప్పవలసినవా రగుదురు. అట్లు చేయనియెడల నీ సంప్రదాయమునకా మంత్రము ప్రతికూలమగును. అది యట్లగుట వారి కిష్టము కాదు. కావుననే పదునొకండవ మంత్రమును వ్యాఖ్యానముఁ జేయుచు శ్రీ శంకరాచార్యులు దమ భాష్యమునందు 'విద్యా' శబ్దమునకు జ్ఞానమని యర్థము చెప్పక యుపాసన యని యర్థము చెప్పిరి. 'విద్యా' శబ్దమునకు నుపాసన యని యర్థముఁ జెప్పుటకు వీలులేకపోలేదు. శాండిల్య

విద్య మొదలగు వానియందు దానికి నుపాసన యని యర్థము వివక్షిత మయియున్నది; కాని యది ముఖ్యార్థము కానేరదు. శ్రీశంకరాచార్యులవారి కీ యర్థము తెలియక కాని తోఁపక కాని యుండలేదు. అట్లు తోఁచుటకు వీలును లేకపోలేదు. "విద్యయా విందతేఽమృతం" (కేన. 2.12), లేక, "ప్రాణ స్యాధ్యాత్మం విజ్ఞాయామృత మశ్నుతే" (ప్రశ్న. 3.12) అని యితరములగు నుపనిషత్తులలో సైత మీ యర్థమున నీ పదము లున్నవి. మైత్ర్యుపనిషత్తుయొక్క యేడవప్రపాఠకమునందు "విద్యాం చావిద్యాం చ" అని పూర్వోదాహృతమైన యీశావాస్యమునందలి పదునొకండవ మంత్ర మీ యక్షరములతో సైతము గ్రహింపఁబడియున్నది. దానిని సంబంధించియే దానికంటె పూర్వమునందున్న కఠోపనిషత్తు 2.4. కఠ. 2.5 నందు నీ మంత్రము లున్నవి. అనఁగా: ఈ మూఁడు మంత్రము లొక్కచోట నొకదాని వెంబడి నొకటి చెప్పఁబడియున్నవని యర్థము. వానిలో మధ్యమంత్ర మీశావాస్యము లోనిది. మఱియు దానియందును 'విద్యా' శబ్దమున్నది. కావున కఠోపనిషత్తునందు విద్యాశబ్దమున కున్న యర్థమే (అనఁగా: జ్ఞాన మను నర్థమే) యీశావాస్యమునందును స్వీకరింపఁబడిన దని మైత్ర్యుపనిషత్తుయొక్క యభిప్రాయమైనట్లు స్పష్టమగుచున్నది. కాని యీశావాస్యముపై నున్న శాంకరభాష్యములో 'విద్య' యనఁగా ఆత్మజ్ఞాన మనియు, 'అమృత' మనఁగా మోక్ష మనియు నీ రెండు శబ్దములకు చేయఁబడిన యర్థమే యీశావాస్యమునందలి పదునొకండవ మంత్రమున గ్రహింపఁబడిన యెడల, జ్ఞానము (విద్య) మఱియు కర్మము (అవిద్య) అను వానియొక్క సముచ్చయ మీ యుపనిషత్తులలో వర్ణింపఁబడినదని చెప్పవలసివచ్చును; మఱియు నే హేతువుచే నీ సముచ్చయ మే (మిశ్రణము) న్యాయ్యమును యుక్తమును కానేరదో యా హేతువుచేతనే విద్య యనఁగా దేవతోపాసన యనియు, అమృత మనఁగా దేవలోక మనియు, గౌణార్థమే యిక్కడ నెఱుంగవలయును" అని చెప్పఁబడినది. మఱియు "జ్ఞానము కలిగిన పిదప

సన్న్యాసముఁ గైకొనవలయును. కర్మలు చేయఁగూడదు; కారణమేమి యన: జ్ఞానకర్మలయొక్క సముచ్చయ (మిశ్రణ) మెప్పుడును న్యాయ్యము కాదు" అను శాంకరసంప్రదాయముయొక్క ముఖ్యసిద్ధాంతమునకు విరుద్ధముగ నీశావాస్యమునందున్న మంత్ర ముండకూడదనియు, కావుననే విద్యాశబ్దమునకు గౌణార్థమును స్వీకరించి సర్వశ్రుతివచనములకు తమ సంప్రదాయానుసారముగ నేక వాక్యతను జేయుటకొఱకు శాంకరభాష్యమునం దీశావాస్యముయొక్క పదునొకండవ మంత్రమునకు పైనచెప్పిన తీరున నర్థము చేయఁబడినదనియు స్పష్టమగుచునే యున్నది" యని సారాంశము. మఱియు సాంప్రదాయక దృష్టితోఁ జూచితి మేని యీ యర్థము మహత్త్వము గలదియె కాక యావశ్యకమునునయి యున్నది. కాని "అన్ని యుపనిషత్తులలోను నొక యర్థమే ప్రతిపాదింపఁబడి యుండవలయును. రెండు మార్గములును శ్రుతిప్రతిపాదితము లగుటకు వీలు లే"దను నీ మూలసిద్ధాంతము నొప్పుకొనని వారికి పై మంత్రమునందున్న 'విద్యా' శబ్దముయొక్కయు 'అమృత' శబ్దముయొక్కయు నర్థమును మార్చుటకు నేమియు కారణము లేదు. పరబ్రహ్మము "ఏక మే వాద్వితీయం" అని సమ్మతమయినను దాని నెఱుంగు నుపాయ మొక్కటికంటె నెక్కువగ నుండకూడదని సిద్ధము కానేరదు. ఒకే మేడపై కెక్కుటకు రెండు సోపానమార్గములు గాని, లేక, యొక గ్రామమును జేరుటకు రెండు మార్గములు గాని యుండఁదగియున్నటులే, మోక్షప్రాప్తి కుపాయలును ననేకము లుండవచ్చును. మఱియు నీ యభిప్రాయముచేతనే "లోకేఽస్మిన్ ద్వివిధా నిష్ఠా" యని భగవద్గీతయందు స్పష్టముగఁ జెప్పబడినది. రెండు నిష్ఠ లుండ వచ్చునని యొప్పుకొనిన పిదప కొన్ని యుపనిషత్తులలోఁ గేవల జ్ఞాననిష్ఠయును, కొన్ని యుపనిషత్తులలో జ్ఞానకర్మ సముచ్చయ (మిశ్రణము) మను నిష్ఠయును వర్ణింపఁబడుట యశక్యము కాదు. అనఁగా: జ్ఞాననిష్ఠలో విరోధము వచ్చునని యీశావాస్యోపనిషత్తున నున్న శబ్దములకు సరళమును, సామా

జికమును, స్పష్టమునైన యర్థమును వదలుటకు నేమియు కారణము లేదు. శ్రీమచ్ఛంకరాచార్యులవారియొక్క కటాక్షము సరళమైన యర్థముకంటె, సన్న్యాసనిష్ఠాపరమగు నేకవాక్యత వైపునకే విశేషముగ ప్రసరించినదని చెప్పుటకు మఱియొక కారణమును గలదు. తైత్తిరీయోపనిషత్తుయొక్క శాంకరభాష్యములో (తై. 2.11) "అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే" అని యీశావాస్య మంత్రమం దున్న యీ భాగమే వ్రాయఁబడినది. దానికి సంబంధించియే "తపసా కల్మషం హన్తి, విద్యయాఽమృత మశ్నుతే" అని మనువచనము (మను. 12. 104) చూపింపఁబడినది; మఱియు నీ రెండు వచనములందున్న 'విద్యా' శబ్దమునకు నొక్క యర్థమే (అనఁగా: బ్రహ్మజ్ఞాన మను ముఖ్యార్థమే) యాచార్యులవారిచే స్వీకరింపఁబడినది. కాని యాచార్యులవా రిచ్చో "తీర్త్వా=దాఁటి" యను పదమువలన మృత్యులోకమును తరించుట యను క్రియ పూర్ణమైన పిదప (ఒక కాలముననే కాదు) విద్యచే నమృతత్వము ప్రాప్తమగుట యను క్రియసంఘటిల్లు నని చెప్పుదురు; కాని యీ యర్థము "ఉభయం సహ" అను పూర్వార్ధమం దున్న శబ్దమునకు విరుద్ధ మగునని చెప్పనక్కఱలేదు. మఱియు తఱచుగ నీ కారణము చేతనే యీశావాస్యమునం దున్న శాంకరభాష్యములో నీ యర్థమును వదలి యుండవలయునని కాన్పించుచున్నది. ఎటులయిన నుండనిమ్ము; ఈశావాస్యమునందున్న పదునొకండవ మంత్రమునకు శాంకరభాష్యమునందు వేఱుగ వ్యాఖ్యానముఁ జేయుటకుఁ కారణ మేమైన నుండుననియు నిందువలన స్పష్టమగును. ఈ కారణము సాంప్రదాయికమై యున్నది; మఱియు భాష్యకారులు సాంప్రదాయిక దృష్టిని గ్రహింపక పోయిరేని యీ భాష్యములందున్న వ్యాఖ్యానము మాన్యము కాదు. శ్రీమచ్ఛంకరాచార్యులవంటి యలౌకికజ్ఞానిచేఁ బ్రతిపాదింపఁబడిన యర్థమును, సాధ్యమైనంతవఱకు వదలకుండుటయును మాకు సమ్మతమే; కాని సాంప్రదాయికదృష్టిని వదలినప్పుడు

మాత్రము వారి యర్థమును వదలక తప్పదు. మఱియు నీ హేతువు చేతనే, మాకంటె పూర్వమునందు సైత మీశావాస్యమునందున్న మంత్రములకు శాంకరభాష్యముకంటె వేఱుగనే (అనఁగా: నేను చెప్పియుండు తీరుననే) యితర భాష్యకారులు నర్థముఁ జేసియున్నారు. ఉదాహరణము- వాజసనేయసంహితపై (అనఁగా: ఈశావాస్యోపనిషత్తుపై) ఉవటాచార్యులవా రొనర్చిన భాష్యమునందున్న "విద్యాం చావిద్యాం చ" అను మంత్రముయొక్క వ్యాఖ్యానమున 'విద్య' యన నాత్మజ్ఞాన మనియు 'అవిద్య' యనఁ గర్మ మనియు నీ రెంటి యొక్క యేకీకరణముచేతనే యమృత మనఁగా మోక్షము లభించు ననియు నున్నది; మఱియు ననంతాచార్యులచే నీ యుపనిషత్తుపై చేయఁబడిన భాష్యములో నీ జ్ఞానకర్మసముచ్చయా(మిశ్రణము)త్మక మైన యర్థముండుటయే గాక, తుదకు "ఈ మంత్రసిద్ధాంతమును, "యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే" (గీ. 5.5) యను గీతావచనమునందున్న యర్థమును నొకటియే గాన నీ గీతా శ్లోకమునందున్న 'సాంఖ్యయోగ' శబ్దములను క్రమముగ జ్ఞానము నకును కర్మమునకును వాచకము లగు' ననియు స్పష్టముగ వ్రాయఁ బడినది.* అటులే యాజ్ఞవల్క్యస్మృతిమీఁద నున్న (యా. 3.57,205)

* ఈశావాస్యోపనిషత్తునకున్న యీ భాష్యములన్నియు పునహాలో నున్న యానందాశ్రమ ముద్రాశాలలో ముద్రింపఁబడిన యీశావాస్యోపనిషత్పుస్తకము నఁ జేర్పఁబడినవి. యాజ్ఞవల్క్యస్మృతికిఁ గల యపరార్కులవారి వ్యాఖ్యయు నా యానందాశ్రమముననే ముద్రింపఁబడినది. ప్రొ. మాక్సుమూలరుచేఁ జేయఁ బడిన యుపనిషద్భాషాంతరీకరణమున నీశావాస్యమునకు శాంకరభాష్యానుసారము గఁ జేయఁబడలేదు. దీనికి కారణము నతఁడు తన భాషాంతరీకరణ గ్రంథమునందే చివర చెప్పెను (Sacred Books of the East Series Vol. I. pp. 314-320). అనంతాచార్యుల భాష్యము మాక్సుమూలరునకు సిద్ధింపలేదు. మఱియు శాంకర భాష్యమునం దీ మంత్రములకు వేఱగు నర్థ మేల చేయఁబడినది యని యతనికిఁ దెలిసినట్లు కన్పట్టదు.

టీకలో నపరార్క దేవుఁడును నీశావాస్యముయొక్క పదునొకండవ మంత్రమును గైకొని యనంతాచార్యుల వలెనే జ్ఞానకర్మసముచ్చయాత్మకమైన యర్థమును జెప్పెను. ఈ కారణములనుబట్టి యీశావాస్యోపనిషత్తునందున్న మంత్రమునకు శాంకరభాష్యముకంటె వేఱగు నర్థమును నే నిందు క్రొత్తగ నిప్పుడు చేయలేదని చదువరు లెఱుంగుదురు గాక.

ఈశావాస్యోపనిషత్తు నందున్న మంత్రముల సంబంధములోనే యీ విచారణ జరిగినది. ఇప్పుడు శాంకరభాష్యమునందున్న "తపసా కల్మషం హన్తి విద్యయాఽమృత మశ్నుతే" యను మనువచనమును కొంత విచారింతము. మనుస్మృతియొక్క పండ్రెండవ యధ్యాయమున నీ శ్లోకము 104 వదియై యున్నది. ఆ ప్రకరణము వైదికకర్మయోగ సంబంధమైనదని మను 12. 86 శ్లోకమునుబట్టి కన్పట్టును. కర్మయోగముయొక్క యీ వివేచన జరుగుచుండఁగా—

తపో విద్యా చ విప్రస్య నిఃశ్రేయసకరం పరమ్,
తపసా కల్మషం హంతి విద్యయాఽమృత మశ్నుతే.

— తపస్సును (చ) విద్యయు ననునవి (అనఁగా: రెండును) బ్రాహ్మణునకు నుత్తమములైన మోక్షసాధనములుగ నున్నవి అని మొదటి చరణములోఁ జెప్పి పిమ్మటనలోఁ బ్రతిదానికి నుపయోగ మేమియో తెలుపుటకు ''తపస్సుచే దోషములు నశించినందున విద్యచే నమృతము (అనఁగా: మోక్షము) లభించును'' అని రెండవ చరణములోఁ జెప్పఁబడినది. ఇందువలన జ్ఞానసముచ్చయమే (మిశ్రణమే) యిచ్చో మనువున కిష్టము గావున నీశావాస్యమునందలి పదునొకండవ మంత్రముయొక్క యర్థమే మనువుచే నీశ్లోకమునందు వర్ణింపఁబడినదని స్పష్టమగును. ఈ యర్థమే హారీతస్మృతియందున్న వచనములను బట్టి యధికముగ దృఢ మగును. ఈ హారీతస్మృతి స్వతంత్రముగనే యుప

లబ్ధమైనది. ఇంతియె కాక నృసింహపురాణమునందును (నృ పు. అ.57-61; 61.9-11 చూడు) చెప్పఁబడినది. హారీతస్మృతియందు (7.9-11) జ్ఞానసముచ్చయసంబంధములో నీ క్రింద వ్రాయఁబడిన శ్లోకము లున్నవి.

యథాఽశ్వా రథహీనా శ్చ రథా శ్చాశ్వై ర్వినా యథా,
ఏవం తపశ్చ విద్యా చ ఉభా వపి తపస్వినమ్.
యథాన్నం మధుసంయుక్తం మధు చాన్నేన సంయుతమ్,
ఏవం తపశ్చ విద్యా చ సంయుక్తం భేషజం మహత్.
ద్వాభ్యా మేవ హి పక్షాభ్యాం యథా వై పక్షిణాం గతిః,
తథై వ జ్ఞానకర్మాభ్యాం ప్రాప్యతే బ్రహ్మ శాశ్వతమ్.

— ఏ రీతిగ రథము లేనిది యశ్వములును, అశ్వములు లేనిది రథమును (నడువవో) తపస్వియొక్క తపస్సును విద్యయు నను రెంటి స్థితియు నటులే యున్నది. ఏ రీతిగ నన్నము మధువుతో సంయుక్తమైనదో, మధువు నన్నముతో సంయుక్త మయినదో యా రీతిగనే తపస్సును విద్యయు సంయుక్తము లగునేని యొక గొప్ప యౌషధమగును. ఏ రీతిగ పక్షులయొక్క గతి రెండు రెక్కలయొక్క సంబంధముచేఁ గలుగునో యా రీతిగనే జ్ఞానకర్మలచేత శాశ్వతమగు బ్రహ్మమును పొందును— హారితస్మృతియందును యీ వచనములు వృద్ధాత్రేయస్మృతియందలి రెండవ యధ్యాయమునందు నున్నవి. ఈ వచనములం బట్టియు, విశేషముగ వానిలో నున్న దృష్టాంతములం బట్టియు మనుస్మృతియందున్న వచనములకు నేమి యర్థముఁ జేయవలయునో స్పష్ట మగును. చాతుర్వర్ణ్యముయొక్క కర్మకు తపశ్శబ్దార్థములోనే సమావేశముఁ జేయుట మనువున కిష్ట మని పూర్వమునందే జెప్పఁబడినది (మను. 11.236); మఱియు తైత్తిరీయోపనిషత్తునందు "తపస్సు, స్వాధ్యాయప్రవచనము" మొదలగునవి యాచ

రింపవలయు నని (తై. 1.9) చెప్పుటయు, జ్ఞానకర్మ సముచ్చయపక్ష మునే స్వీకరించి చెప్పఁబడినదని యిప్పుడు స్పష్ట మగును. యోగ వాసిష్ఠముయొక్క తాత్పర్య మంతయు నిదియే యగును. కారణ మే మన: ఈగ్రంథారంభమున "మోక్షముయొక్క ప్రాప్తి కేవల జ్ఞానము చేతనా? కేవల కర్మచేతనా? లేక, యీ రెంటియొక్క సముచ్చ యము చేతనా? ఆ నిర్ణయమును నాకుఁ జెప్పు" మని సుతీక్ష్ణుండడి గెను. మఱియు దానికి సమాధానముఁ జెప్పుచు హారీతస్మృతియందు పక్షితెక్కలను దృష్టాంత మిచ్చి "ఆకాశమునందున్న పక్షులగతి యే రీతిని రెండుతెక్కలచే నగునో యా రీతిని జ్ఞానకర్మల రెండింటిచేతను మోక్షప్రాప్తి యగును. కేవల మొక్క దానిచేతనే ప్రాప్తి లే" దని మొదటఁ జెప్పి పిదప నా యర్థమును సవిస్తరముగ సిద్ధింపఁజేసి చూపించుటకై యోగవాసిష్ఠ గ్రంథ మంతయుఁ జెప్పఁబడినది (యోగ. 1.1.6-9). అటులె ముఖ్యకథలయందు వసిష్ఠుఁడు రాము నకు "జీవన్ముక్తునివలె బుద్ధిని శుద్ధముగ నుంచి నీ వన్ని వ్యవహారము లను జేయుము" (యోగ. 5.18 17-26) అనియు "కర్మలను ద్యజిం చుట యామరణాంతము యుక్తము గామిచే (యో. 6; ఉ. 2.42) స్వధర్మానుసారమైన రాజ్యమును పాలింపుము" (యో. 5. 5. 54 మఱియు 6; ఉ. 2.13.50) అనియు నా యా స్థలములయందు మరల మరల నుపదేశించెను. గ్రంథముయొక్క యుపసంహారమును, శ్రీరామచంద్రుఁడు పిదపఁ జేసిన కార్యములును నా రీతిగనే యున్నవి; కాని యోగవాసిష్ఠముపై టీక వ్రాసినవారు సన్న్యాసమార్గీయులై యుండుటచే పక్షియొక్క రెండుతెక్కల యుపమానము స్పష్టముగ నున్నను "జ్ఞానకర్మలు రెండు నేకకాలమున విహితములు కావు" అని తుదకు యుక్తి చెప్పిరి; కాని యీ యర్థము బలాత్కారముగ వచ్చి నదియు, క్లిష్ట మయినదియు, సాంప్రదాయికముగ నున్నదనియు నను విషయము టీక లేని మూలగ్రంథమును జదివిన వారికందఱకును

స్పష్టముగఁ దెలియును. యోగవాసిష్ఠమువలె, గురుజ్ఞానవాసిష్ఠ-తత్త్వ సారాయణ మను గ్రంథము చెన్నపురీరాష్ట్రమునఁ బ్రసిద్ధముగనున్నది. దానిలో జ్ఞానకాండ మనియు, ఉపాసనాకాండ మనియు, కర్మకాండ మనియు మూఁడు భాగము లున్నవి. ఈ గ్రంథము లోకు లెన్నునంత ప్రాచీన మయినదిగఁ గన్పట్టదని మేము పూర్వముననే చెప్పియున్నాము; కాని యది ప్రాచీనము కాకపోయినను, జ్ఞానకర్మ సముచ్చయమే దానియందు ప్రతిపాదిత మగుటచే నీ ప్రదేశమున దాని నుల్లేఖించుట యావశ్యకమైనది. దీనియందలి వేదాంత మద్వైతము. దీనికి నిష్కామకర్మపై విశేషకటాక్షమున్నందున దీనియందున్న సంప్రదాయము శ్రీశంకరాచార్యులవారి సంప్రదాయముకంటె వేఱుగను, స్వతంత్రముగ నున్నదని చెప్పుటకు నభ్యంతర మేమియు నుండదు. ఈ సంప్రదాయమునకు చెన్నపురి (మద్రాసు) ప్రాంతమున 'అనుభవాద్వైతము' అని పేరు. మఱియు విషయముం బట్టి చూచితిమేని గీతలయందున్న కర్మయోగమున కిది యొక ప్రతిబింబమని తోఁచును. అయినను కేవల భగవద్గీతాధారముచేతనే యీ సంప్రదాయమును సిద్ధపఱుపక మొత్తముపై 118 యుపనిషత్తులలో నాయర్థమే సిద్ధమగునని దానియందు జెప్పఁబడియున్నది. మఱియుఁ రామగీతయు, సూర్యగీతయు నను రెండు క్రొత్త గీతలు సైతము దీనియం దున్నవి. అద్వైతమతమును స్వీకరించుట యనఁగా కర్మసన్న్యాసపక్షమునే స్వీకరించుట యని యనేకు లెన్నుకొను విషయ మీ గ్రంథమువలన తిరస్కరింపఁబడును. అటులే సంహిత, బ్రాహ్మణము, ఉపనిషత్తులు, ధర్మసూత్రములు, మనుయాజ్ఞవల్క్యస్మృతులు, మహాభారతము, భగవద్గీత, యోగవాసిష్ఠము, తుదకు తత్త్వసారాయణము మొదలగు గ్రంథములయందు ప్రతిపాదింపఁబడిన నిష్కామ కర్మయోగము, శ్రుతిస్మృతి ప్రతిపాదితము కాదనియు, కేవల సన్న్యాసమే శ్రుతిస్మృతి ప్రతిపాదితముగ నున్నదనియు చెప్పుట

సైతము సర్వాంశముల యందు నిర్మూలముగ నున్నదని పైన జెప్పిన యాధారములవలన నిప్పుడు స్పష్ట మగును.

అట్లుండ నిమ్ము; మృత్యులోకముయొక్క వ్యవహారము నడిపించుట, లేక, లోకసంగ్రహార్థమై యథాధికారముగ నిష్కామకర్మల నాచరించుట, మోక్షప్రాప్తికై జ్ఞానము సంపాదించుట యను నీ రెంటికి నొక్కసమయమున సముచ్చయము (మిశ్రణము) ను జేయుటయు, లేక, మహారాష్ట్రకవియైన "శివదినకేసరి" యను వారిచే వర్ణింపఁబడినటుల –

> ప్రపంచ సాధుని పరమార్థాచా లాహో జ్యానేఁ కేలా,
> తో నర భలా భలా రే భలా భలా.

– ఎవఁడు ప్రపంచమును సాధించి పరమార్థమును సైతము సాధించునో వాఁడే యుత్తముఁడు అను నీ యర్థమే గీతలయందు ప్రతిపాద్యమై యున్నది. ఈ కర్మయోగమార్గము చిరకాలమునుండి ప్రవర్తిలుచున్నదియు, జనకాదులచే నాచరింపఁబడినదియునై యున్నది. మఱియు భగవంతుఁడు దానియొక్క యధిక ప్రచారమును పునరుజ్జీవనమును జేసియుండుటచే దానినే భాగవతధర్మము లని చెప్పుచున్నారు. ఈ మొదలగు విషయము లీ రీతిగ సిద్ధించిన పిదప నీ మార్గమునందు జ్ఞానులు తమ పరమార్థముతోఁ దమ ప్రపంచము నే రీతిగ నడిపింతురో చూచుటయు లోకసంగ్రహదృష్టిచే నావశ్యకమయి యున్నది; కాని యీ ప్రకరణము మిక్కిలి గొప్పది యైనందున దాని స్పష్టీకరణమును తర్వాతి ప్రకరణములో చేయుదము.

ఇది సన్న్యసము-కర్మయోగము అను నేకాదశ ప్రకరణము.

---

# ద్వాదశ ప్రకరణము

## సిద్ధావస్థ-వ్యవహారము

సర్వేషాం యస్సుహృన్నిత్యం సర్వేషాం చ హితే రతః,
కర్మణా మనసా వాచా స ధర్మం వేద జాజలే. *

మ.భా.శాం. 261.9.

బ్రహ్మజ్ఞానము గలిగి బుద్ధి యత్యంతము సమము నిష్కామము నయిన పిదప మనుష్యునకు నే విధమగు కర్తవ్యము నవశిష్టమయి యుండదు. అందువలన క్షణభంగురమగు సంసారమందున్న దుఃఖమయములు, శుష్కములునగు వ్యవహారములను జ్ఞాని విరక్తిచే పూర్తిగ వదల వలయు నని చెప్పు మతమునందలి పండితులకు కర్మయోగము (అనఁగా: గృహస్థాశ్రమమునందున్న వర్తన) అనునది యొక విచారార్హమగు శాస్త్రముగ నున్నదని తోఁచుట యెప్పటికిని సంభవింపదు. సన్న్యాసాశ్రమమునఁ బ్రవేశించుటకు సైతము చిత్తశుద్ధియు, జ్ఞానము నుండవలయును గాన, వారును, సంసారముఁ జేయునప్పుడు చిత్తశుద్ధిని గలుగఁజేయు ధర్మముల నాచరింపవలయు నని యొప్పుకొందురు; కాని యెప్పుడైనను సంసారమునందే యెల్లప్పుడు నుండుట వెఱ్ఱితన మగుటచేఁ బ్రతి మనుజుఁడును శక్యమగునంత త్వరలో సన్న్యాసమును గైకొనుటయే జగత్తునందు

* ఓ జాజలీ! కర్మచేతను, మనస్సుచేతను, వాక్కుచేతను నందఱిహితము నందు నాసక్తిగలవాఁడును, నందఱకు నెల్లప్పుడును స్నేహితుఁడునైన వాఁడే ధర్మము నెఱింగినవాఁడు (అని చెప్పవలయును).

పరమమగు కర్తవ్య మని యంగీకరింతు మేని కర్మయోగమునకు స్వతంత్రమగు మహిమ యుండనేరదు. కావున సంసారమెట్లు చేయ వలసినదియు విచారింప నవసరమే లేదు. ఒకవేళ విచారించినను నా యా సందర్భముల కనుగుణ మగునట్లు స్వల్పముగ విచారించి మన్వాదిశాస్త్రకారులు సెప్పిన చతురాశ్రమధర్మము లను సోపానముల మార్గమున పైపైకిఁ బోవుచు శీఘ్రముగ సన్న్యాసమార్గ మను తుద మెట్టుపైకిఁ బోవలయును. కావున గార్హస్థ్యధర్మమందలి ధర్మాధర్మ విచారరూపమగు విషయమున సన్న్యాసమార్గమునందలి పండితులు విశేషముగఁ బ్రవేశింపరు. సన్న్యాసమార్గమునకుఁ బురస్కర్తయగు శ్రీశంకరాచార్యులవారు తమ గీతాభాష్యమున గీతలలో నున్న కర్మ పరమగు వచనముల నుపేక్షించి కాని, కేవలమని ప్రశంసాపరము (అర్థవాదము) లని కల్పించికాని, కర్మసన్న్యాసధర్మమే గీత లన్నింటి లోను ప్రతిపాద్యముగ నున్నదని, గీతల ఫలితార్థమును తుదకు నిర్ణ యించుటకును, అనేకులగు టీకాకారులు నివృత్తిపరము (అనఁగా: కేవల భక్తిపరము) గను, లేక, పాతంజల యోగపరముగను నిర్ణ యించుటకును, ఈ మోక్షమార్గమునే భగవంతుఁడు రణభూమియందు అర్జునునకు నుపదేశించె నని తమ తమ సంప్రదాయానుసారముగ గీతల రహస్యమును వర్ణించుటకును, కారణ మిదియే. సన్న్యాస మార్గమునందున్న యధ్యాత్మజ్ఞానము దోషశూన్య మైనది యగుటచే దానిమూలమునఁ బొందఁదగు సామ్యబుద్ధి, లేక, నిష్కామావస్థ యనునది గీతలకు గ్రాహ్యము, సమ్మతము నను విషయమున నెంత మాత్రమును సంశయము లేదు. అయినను మోక్షప్రాప్తియగుటకై తుదకు కర్మను బొత్తిగ వదలవలయు నను సన్న్యాసమార్గముయొక్క మతము గీతలకు గ్రాహ్యము కామిచే బ్రహ్మజ్ఞానముచే సిద్ధించు వైరాగ్యముతోడను, సమత్వము తోడను జ్ఞాని జ్ఞానము కలిగిన పిదప సైతము సర్వవ్యవహారములఁ జేయవలయు ననుట గీతలయొక్క

విశేషసిద్ధాంతమని పూర్వప్రకరణమున నేను సవిస్తరముగ నిరూపించి యున్నాను. జగత్తునందు జ్ఞానయుక్తమగు కర్మను వదలితి మేని జగత్తు గ్రుడ్డిదై నశించును. మఱియు నీ తీరున నది నశింపకుండు నటుల సులలితముగ దాని బ్రవర్తింపఁ జేయవలయునని భగవంతుఁ డిష్టపడి యున్నాఁడు. కావుననే జ్ఞానియు సకలప్రాపంచిక కర్మలను నిష్కామబుద్ధితో నొనర్చుచు సామాన్యజనులకు సద్వర్తన యను భారమును బ్రత్యక్షముగఁ జూపవలయును. వేయేల? ఈ మార్గమే మిక్కిలి శ్రేయస్కరముగను, గ్రాహ్యముగ నున్నదని నుడివిన పిదప నిట్టి జ్ఞాని జగత్తునందున్న వ్యవహారముల నెట్లు చేయునని చూచుట యావశ్యకము. కారణ మేమియన: ఇట్టి జ్ఞానియొక్క వర్తనము (అనఁగా: లోకుల కతనిచేఁ జెప్పఁబడిన విషయము) గ్రంథమే యగుటచే నీ గ్రంథము నతఁ డెట్లు నడపించుచున్నాఁడో చూచితిమేని ధర్మాధర్మములు, కార్యాకార్యములు, లేక, కర్తవ్యాకర్తవ్యములు, ననువాని నిర్ణయించుటకు మనము శోధించుచున్న సాధనములును, యుక్తులును స్వయముగనే తెలియును. సన్న్యాసమార్గముకంటె కర్మ యోగమార్గమందున్న విశేష మిదియే. ఏ పురుషునియొక్క వ్యవసా యాత్మకబుద్ధి యింద్రియనిగ్రహముచే స్థిరమై "సర్వభూతముల యందు నొకయాత్మయే" యను సామ్యముయొక్క పరిచయము చేసికొనుటకు సమర్థ మైనదో, వానియొక్క వాసనయు శుద్ధముగ నుండవలయును. మఱియు వాసనాత్మకబుద్ధి యీ రీతిని శుద్ధము, సమము, నిర్మమము, పవిత్రము నగునేని, యితని చేతినుండి యే పాపమును లేకయే మోక్షప్రతిబంధకమగు కర్మయు సంఘటిల్లుటయే యశక్యమగును. కారణ మేమియన: మొదటవాసనయు, ననంతరము తదనుకూలమగు కర్మయు నని క్రమము గలదు. శుద్ధమైన వాసన చేతనే కాఁబోవు కర్మ శుద్ధముగనే యుండవలయును. ఏది శుద్ధమో యదియే మోక్షానుకూల మగును. అనఁగా: పారలౌకిక కల్యాణమున

కాటుంకము లేక యీ సంసారమున మనుష్యమాత్రుఁ డెట్లు ప్రవర్తింప వలయునని మనము చేసిన 'కర్మాకర్మలయొక్క విచికిత్స' యొక్క గాని, 'కార్యాకార్యవ్యవస్థితి' యొక్క గాని, వికటమగు ప్రశ్నకు తన నడతచేతనే నుత్తర మిచ్చు గురువు లభించు నని తాత్పర్యము (తై. 1.11.4; గీ. 3.21). అర్జునున కెదుట నిట్టి గురువు శ్రీకృష్ణ రూపముగ నిలువఁబడి యుండెను. మఱియు 'నా జ్ఞాని' యుద్ధాది కర్మలను బంధకములని వదలవలయును గాఁబోలు నని యర్జునునకుఁ బొడమిన సంశయము నీ గురువు దీర్చివైచి జగత్తునందున్న వ్యవహారముల నే యుక్తిచేఁ జేసిన పాపము తగులదో దాని నధ్యాత్మ శాస్త్రానుసారముగ నర్జునునకు బాగుగ బోధించెను. మఱియు నతనిచే యుద్ధము చేయించెను; కాని యిట్టి బోధఁ జేయు గురు వెల్లరకు నెల్లప్పుడును లభించుట శక్యము కాదు. మఱియు నీ మహాపురుషుని యొక్క బాహ్యావర్తనమునే సర్వదా యవలంబించి యుండుట సాధ్యము కాదు. ఈ విషయమును, "మహాజనో యేన గతః స పంథాః" అను వచనమును విచారించునప్పుడు వెనుక మూఁడవ ప్రకరణముతుద నేఁ జెప్పియున్నాను. కావున జగత్తునకు పుస్తకము నిచ్చు నీ జ్ఞానియొక్క వర్తనము సూక్ష్మముగఁ బరీక్షించి దాని యందున్న సత్యమగు బీజము, మూలతత్త్వము నేది యని విచా రించుట యావశ్యకము. దీనినే కర్మయోగశాస్త్రమని చెప్పుచున్నారు. మఱియు పైన జ్ఞానియని చెప్పఁబడినవాని స్థితియు, కృతియు నీ శాస్త్రమునకు మూలాధార మగును. ఈ జగత్తునందున్న పురుషు లందఱు నీ రీతిగ నాత్మజ్ఞానులును కర్మయోగులు నైన యెడల కర్మ యోగశాస్త్రమున కేమియు నావశ్యకత యుండదు. నారాయణీయ ధర్మములయం దొకచోట—

ఏకాన్తినో హి పురుషా దుర్లభా బహవో నృప,
య ద్యేకాన్తిభి రాకీర్ణం జగత్ స్యా త్కురునందన.

అహింసకై రాత్మవిద్భిః సర్వభూతహితే రతైః,
భవేత్ కృతయుగ ప్రాప్తిః ఆశీఃకర్మ వివర్జితా.

శాం. 348.62-63.

— ఏకాంతికము లైన (ప్రవృత్తి పరములగు) భాగవతధర్మములను పూర్ణముగ నాచరించు పురుషులు విశేషముగ లభించుట దుర్లభము. ఆత్మజ్ఞానులును, అహింసకులును, సర్వభూతహితార్థమయి సంచరించుట మొదలగు నేకాంత ధర్మములుగల జ్ఞానులును, జగత్తునందు నిండియుండి రేని ఆశీఃకర్ములు (అనఁగా: కామ్యములు, లేక, స్వార్థబుద్ధిచేఁ జేయఁబడిన కర్మలు గలవారు) జగత్తున నెచ్చోటను లేక పోవుదురు. కావున మరల కృతయుగము ప్రాప్తమగునుఅని చెప్పఁబడియున్నది. కారణ మేమన: ఆ స్థితియం దందఱును జ్ఞానులే. కావున నెవరును నితరులకు నష్టమును గలుగఁ జేయరు. ఇంతియె కాక ప్రతి మనుజుఁడు నెల్లరకుఁ గల్యాణమిచ్చో నుండు ననునదియే మనస్సున నుంచుకొని, యాతీరునను, శుద్ధాంతఃకరణముతోను నిష్కామబుద్ధితోను దన వర్తనమును గాపాడుకొనును. సమాజమున కిట్టి స్థితి పూర్వమునందు (అనఁగా: బహుప్రాచీనకాలమునం దొకానొకప్పుడు) ఉండెననియు, మరల న దెప్పుడయినను ప్రాప్త మగుననియు మనశాస్త్రకారులమత మయియున్నది. (మ.భా.శాం. 59.14); కాని పాశ్చాత్య పండితు లర్వాచీనములగు నితిహాసములయాధారమున "పూర్వమున నిట్టి స్థితి లేనే లేదు; కాని యిఁకముందుమాత్ర-మొకానొకప్పు డయినను మానవజాతియొక్క సంస్కారముచే ప్రాప్తము కావచ్చు" నని చెప్పుదురు. ఎటులైన నుండనిమ్ము; ఇతిహాసవిచారము ముఖ్య కర్తవ్యము కాదు. సమాజముయొక్క యుత్కృష్టస్థితియందు (అనఁగా: పూర్ణావస్థయందు) ప్రతి మనుజుఁడును పరమజ్ఞానిగ నున్నాఁడనియు, వానివర్తనము శుద్ధము, పుణ్యకారకము, ధర్మ్యము, లేక, కర్తవ్యముయొక్క పరాకాష్ఠ యనియు నంగీకరింప వలయుననుమత మిరువురకును సమ్మత మనియు ననుట కేమియు నభ్యంతరము

లేదు. ప్రసిద్ధుఁడు నాంగ్లేయసృష్టిశాస్త్రజ్ఞుఁడునైన 'స్పెన్సరు' అను వానిచే నీ మతము తాను రచించిన నీతిశాస్త్రగ్రంథముయొక్క తుట్టతుదఁ బ్రతిపాదింపఁబడి యున్నది. పూర్వకాలమున గ్రీస్‌దేశమందలి తత్త్వజ్ఞానులచే సైత మీసిద్ధాంత మొప్పుకొనఁబడినదియే యనియు నతఁడు చెప్పినాఁడు! * గ్రీకుతత్త్వవేత్తయగు ప్లేటో యనువాఁడు తన గ్రంథమున "తత్త్వజ్ఞానికి ప్రశస్తమని తోఁచుకర్మయే శుభకారకము, న్యాయ్యము నగును. సామాన్యుల కీ ధర్మము తెలియనేరదు. అట్లు తెలియకపోవుటకు కారణ మేమియన; వారు తత్త్వజ్ఞానియొక్క నిర్ణయమునే ప్రమాణముగఁ గైకొందు" రని వ్రాసెను. 'అరిస్టాటు' లనుపేరు గల మఱియొక గ్రీకుదేశీయ తత్త్వజ్ఞాని తన నీతిశాస్త్రముపై నున్న గ్రంథములో (3.4) "జ్ఞానియొక్క నిర్ణయమెప్పుడును తప్పులేనిదియై యుండును. అతనికి నిజమగు తత్త్వము తెలియుటయే దానికి కారణము. మఱియు జ్ఞానియొక్క యానిర్ణయమే లేక, ప్రవర్తనమే యితరులకు ప్రమాణభూతమగు" నని చెప్పెను. 'ఎపిక్యూరస్' అను పేరుగల మఱియొక గ్రీకుదేశీయతత్త్వజ్ఞుఁడు ఇట్లు ప్రమాణభూతులగు పరమజ్ఞానులను వర్ణించుచు "శాంతుఁడును, సమబుద్ధిఁగల వాఁడును— వేయేల? పరమేశ్వరునివలె నెల్లప్పుడు నానందమయుఁడనై యుండును. కావున లోకుల కతనివలనఁ గాని యతనికి లోకులవలనఁ గాని కొంచెమైనను భయ ముండదు" అని యిట్లు చెప్పినాఁడు. † భగవద్గీతయందున్న స్థితప్రజ్ఞునియొక్క,

---

* Spencer's Data of Ethics, Chap. XV, pp. 275—278 స్పెన్సరుచే Absolute Ethics అని పేర్కొనఁబడెను.

† Epicurus held the virtuous state to be "a tranquil, undisturbed, innocuous, non-competitive fruition, which approached most nearly to the perfect happiness of the Gods", who "neither suffered vexation in themselves, nor caused vexation to others." Spencer's Data of Ethics p. 278, Bain's Mental and Moral Science Ed. 1875, p. 530. వీనినే Ideal Wise Man అని చెప్పిరి.

లేక, త్రిగుణాతీతునియొక్క, లేక, పరమభక్తునియొక్క, లేక, బ్రహ్మభూతుఁడైన వానియొక్క వర్ణనతో నీ వర్ణన కెంత సామ్య ముండునదియుఁ జదువరులకుఁ దెలియును. "యస్మా న్నోద్విజతే లోకో, లోకా న్నోద్విజతే చ యః"—ఎవరివలన లోకు లుద్విగ్నులు కారో, లేక, యెవరికి లోకులను జూచిన నుద్వేగము దోఁపదో (గీ. 12.15) యనియు, "ఎవఁడు నిత్యసంతుష్టుఁడును, హర్షము-ఖేదము, భయము-విషాదము, సుఖము-దుఃఖము మొదలగు ద్వంద్వముల నుండి ముక్తుఁడై యెల్లప్పుడును తనయందె సంతుష్టుఁ డగునో" (ఆత్మ న్యే వాత్మనా తుష్టః (గీ. 2.55) యనియు, "త్రిగుణములచే నెవని యంతఃకరణము చంచలము కానేరదో" (గుణై ర్యో న విచా ల్యతే. గీ. 14.23) అనియు, "స్తుతినిందలు గాని, మానావమానము లనునవి గాని యెవరికి సమానములో" యనియు, మఱియు "సర్వ భూతాంతర్గతమగు నాత్మైక్యము నెఱింగి, (18. 55) సామ్యబుద్ధితో నాసక్తిని వదలి, ధైర్యముతో, నుత్సాహముతోఁ దన కర్తవ్యకర్మను చేయువాఁడు, లేక, సమలోష్టాశ్మకాంచనుఁడు" (14.24) అనియును బలుదెఱంగులు భగవద్గీతయందును స్థితప్రజ్ఞుని లక్షణములు మూఁడు నాలుగు పర్యాయములు సవిస్తరముగఁ జెప్పఁబడియున్నవి. కావున నిదియే సిద్ధావస్థ, లేక, బ్రాహ్మీస్థితి యని పేర్కొనఁబడెను. యోగ వాసిష్ఠాది గ్రంథకారు లీ స్థితినే జీవన్ముక్తావస్థ యని చెప్పుచున్నారు. ఈ స్థితి ప్రాప్త మగుట యత్యంత దుర్ఘట మగుటచే జర్మను తత్త్వ వేత్తయగు 'కాంటు' అను నతఁడు "గ్రీకుపండితులు శుద్ధమగు నీతి తత్త్వములను లోకుల మనస్సున నింపు నిమిత్తమై, సర్వనీతులకు మూలమగు 'శుద్ధవాసనను' మానవదేహధారినిగ కల్పించి, గ్రీకు పండితుఁడు పరమావధియైన జ్ఞానియనియు, నీతిమంతుఁడగు పురుషుని రూప మనియు, చిత్రమగు కల్పనఁ జేసిరి" అని చెప్పెను; కాని యీ స్థితి కాల్పనికము గాదనియు, మనోనిగ్రహముచేతను,

ప్రయత్నముచేతను నిహలోకమునందే ప్రాప్త మగుననియు, మన శాస్త్రకారులయొక్కయు సిద్ధాంతముగ నున్నది. మఱియు నటులె ప్రత్యక్షానుభవము సైతము మావైపున ప్రసిద్ధమై యున్నది. అయిన నీ విషయము సామాన్యము కానందున వేయింటిలో నొకానొకఁడె దానినిం బడయుటకు ప్రయత్నించుచున్నాఁడు. మఱియు నిట్టి ప్రయత్నముఁ జేయు వేయి మనుజులలో నొకానొకఁడే యనేక జన్మముల యనంతరమునందు పరమావధియగు నీ స్థితిని తుదకుఁబొందు నని గీతయందే స్పష్టముగఁ జెప్పఁబడినది (గీ. 7.3).

“స్థితప్రజ్ఞావస్థ, లేక, జీవన్ముక్తావస్థ యెంత దుష్ప్రాపమయి నను నీ పరమావధి రూపమయిన సిద్ధి యొకపరిప్రాప్తమయిన వానికి కర్మయోగముయొక్క, లేక, నీతిశాస్త్రముయొక్క నియమములతో నెప్పుడు నేమియు పనియుండదు” అని స్థితప్రజ్ఞునకు పైనఁ జెప్పిన లక్షణములచే పర్యవసాన మగును. కారణ మేమి యన: పరమావధిగ శుద్ధము, సమము, పవిత్రము నగు బుద్ధియే నీతియొక్క సర్వస్వము; కావున నిట్టి స్థితప్రజ్ఞులైన పురుషులకు నీతినియమములను సంబంధింపఁజేయుట యనునది, స్వయంప్రకాశుఁడైన సూర్యునియొద్ద నంధకార మున్నదని కల్పించి యాయనకు దివిటీ చూపించుటవలె నసమంజన మగును. ఏ పురుషుఁడైన నీ పూర్ణావస్థ నొందెనా? లేదా? యను సంశయ ముండవచ్చును; కాని యే రీతిచేత నయినను పూర్ణావస్థ నొందినాఁడని యొకప్పుడు నిశ్చయింపఁబడిన వానియొక్క పాపపుణ్యముల విషయమై యధ్యాత్మశాస్త్రమున పైనఁ జెప్పఁబడిన సిద్ధాంతము కాక రెండవ కల్పనను జేయుటకే వీలు నుండనేరదు. ప్రభుత్వ మొకనియందుఁ గాని, లేక, పురుషసమూహమునందుఁగాని యధిష్ఠిత యయియుండునట్లును నా రాజనియమములచేత ప్రజలు బంధింపఁబడినను రాజు బంధింపఁ బడనట్లును, రాజధర్మజ్ఞులగు ననేక పాశ్చాత్యు లంగీకరించుచున్నారు. ఆ తీరుననే నీతియొక్క రాజ్యమున స్థితప్రజ్ఞుని యధికారము చెల్లును. అతని మనస్సునం

దే కామ్యబుద్ధియు నుండదు. కావున కేవలము శాస్త్రముచే ప్రాప్తించిన కర్తవ్యములు చేయునే కాని, యితర హేతువులచేఁ గర్మల నొనర్చుటకు నతఁడు ప్రవర్తింపఁడు. ఆ కారణముననే, పాపము, పుణ్యము, నీతి, అవినీతి, యను శబ్దము లత్యంతము నిర్మలము శుద్ధము నగు వాసనగల యా పురుషునియొక్క వర్తనకు నెప్పుడును సంబంధింపవు. పుణ్యపాపములు రెండింటికిని పరమగు గమ్యస్థానము నతఁడు చేరియున్నాఁడు.

నిస్త్రైగుణ్యే పథి విచరతాం కో విధిః కో నిషేధః.

— త్రిగుణాతీతులయిన వారిని విధినిషేధ రూపములయిన నియమములు బంధింప నేరవు అని శ్రీశంకరాచార్యులవారును, "ఉత్తమమయిన రత్నమునకు సానపెట్టుట యనావశ్యమయినట్లే నిర్వాణపదవి కధికారులయిన వారి కర్మలకు విధినియమరూపములయొక్క యాటంకములు కలుగఁజేయ నవసరము లేదు అని బౌద్ధగ్రంథకారులుసైతము వ్రాసియున్నారు (మిళింద ప్రశ్న. 4.5.7). కౌషీతక్యుపనిషత్తునందు "ఆత్మజ్ఞానికి మాతృహత్య పితృహత్య భ్రూణహత్య మొదలగు పాపములు సైతము తగులవు" అని యింద్రుఁడు ప్రతర్దనునకుఁ జెప్పినాఁడు (కౌషీ. 3.1). ఎవరి కహంకారబుద్ధి సర్వదా వదలిపోవునో యతఁడు లోకులను చంపినను పాపపుణ్యములచే లిప్తుఁడుకాఁడు (గీ. 18. 17) అని గీతలయందున్న దానికి నిదియె తాత్పర్యము (పంచదశి. 14. 16 మఱియు 17 చూడు). 'ధమ్మపద' మను పేరుగల బౌద్ధగ్రంథమునందును, ఈ తత్త్వముయొక్క యనువాదము చేయఁబడినది (ధమ్మపద శ్లో. 249 మఱియు 295 చూడు).* వే

* "యో మాం విజానీయా న్నాస్య కేవచి త్కర్మణా లోకో మీయతే న మాతృవధేన న పితృవధేన న స్తేయేన న భ్రూణహత్యయా" అని కౌషీతక్యుపనిషత్తు వందలి వాక్యము. ధమ్మపదమునందలి శ్లోకములు క్రిందఁ జెప్పఁబోవు రీతిమన్నవి—

యేల ? బైబిలుయొక్క తొమ్మిదవ యుపదేశమునందు "నా కన్ని విషయములు (ఒకే తీరుననే) ధర్మములై యున్నవి" (1 కొరిం. 6. 12; రోమ. 8. 2) అని క్రీస్తు శిష్యుఁడగు 'పాల్' అనువాఁడు చెప్పిన దానికిఁ గాని, లేక, "ఎవరు దేవుని పుత్రులో (పూర్ణభక్తులయినారో) వారివలన నెప్పుడును పాపము సంఘటిల్లుటకు శక్యము కాదు" (జాన. 1.3.9) అను ఈ 'జాను' వాక్యములకుఁ గాని యిదే తాత్పర్యమని మా యభిప్రాయము. శుద్ధబుద్ధికి ప్రాధాన్య మీయక కేవల బాహ్యకర్మలనుండియే నీతిమత్తను గ్రహించి నిర్ణయించుటకు నభ్యసించినవారికి సిద్ధాంతము చమత్కారముగఁ దోఁచును. మఱియు వెనుకటి వాక్యములకు 'విధినిషేధములకు పరమందున్నవాఁడు', అనఁగా; 'తోఁచినటుల మంచిచెడుగుల నొనర్చువాఁడు' అని తన మనస్సుచే నర్థము నూహించుకొని "స్థితప్రజ్ఞునకు సర్వదుష్కృత్యములను చేయుట కధికారము గల" దని పైనఁ జెప్పఁబడిన సిద్ధాం

---

మాతరం పితరం హంత్వా రాజానో ద్వే చ ఖత్తియే,
రట్ఠం సానుచరం హంత్వా అనీఘో యాతి బ్రాహ్మణో.

మాతరం పితరం హంత్వా రాజానో ద్వేచ సోత్థియే,
వేయ్యగ్ఘ పంచమం హంత్వా అనీఘో యాతి బ్రాహ్మణో.

ధమ్మపదము నందలి యీ కల్పన కౌషీతక్యుపనిషత్తునుండి గ్రహింపఁబడినట్లు స్పష్టముగఁ గన్పట్టుచున్నది; కాని బౌద్ధగ్రంథకర్తలు మాతృవధ, పితృవధ యని యర్థము గ్రహింపక, మాత యన తృష్ణ యనియు, పిత యన నభిమాన మనియు నర్థముల వచింపుదురు; కాని యీ శ్లోకమునందున్న నీతితత్త్వము బౌద్ధగ్రంథకారులకు బాగుగఁ దెలియకపోవుటచే నిటు లౌపచారికార్థమును గ్రహించినా రని మా మతము. కౌషీతక్యుపనిషత్తునందు "మాతృవధేన, పితృవధేన" మొదలగు మంత్రముకంటె పిదప నింద్రుఁడు వృత్రాసురుని (అనఁగా: బ్రాహ్మణుని) జంపిన నా పాపము తనకుఁ దగుల దనెను. ధమ్మపదముయొక్క యాంగ్ల యానువాదమున (S.B·E. Vol. pp. 70-71) మాక్సుమూలరుచేఁ జేయఁబడిన టీకయు పొరపాటని మా మతము.

తమును కొందఱు విపర్యాసమును జేయుచున్నారు; కాని గ్రుడ్డివానికి స్తంభము గాన్పింపకపోవుట యనునది స్తంభముయొక్క దోషము కానటులే, పక్షాభిమానముచే నంధులకు నాక్షేపకులకు పై సిద్ధాంతమునందలి యర్థము సరిగ బోధపడకపోవుటయు వారి దోషమే కాని యీ సిద్ధాంతమునందలి దోషము కానేరదు. ఎవరియొక్క శుద్ధబుద్ధినైనను బాహ్యాచరణము నుండియే పరీక్షింపవలె నని చెప్పుట గీతలకును మాన్యమే; కాని యీ నికషోపలము (ఒరపిడిఱాయి) ననుసరించియే యెవరియొక్క శుద్ధబుద్ధిని పరీక్షించుట నేఁటికిని కొంచెమైన నవశిష్టమయియే యున్నదో, యట్టి యపూర్ణావస్థ యందున్న జనులకు పూర్వోక్తసిద్ధాంతమును అధ్యాత్మవాదియు సంబంధింపఁజేయుటకిచ్ఛయింపఁడు; కాని యెవనిబుద్ధి పూర్ణముగ బ్రహ్మనిష్ఠమును, అపరిమితముగ (నిస్సీమముగ) నిష్కామము నయినదను విషయమున నావంతయు సంశయమునుండదో, యట్టి పూర్ణావస్థను చేరిన సత్పురుషుని విషయము వేఱుగనే యుండును.

కావున నతఁ డొకానొక కృత్యమును లోకదృష్టికి విపరీతముగ నొనర్చినను నతని బుద్ధి పూర్ణముగ శుద్ధము సమము నయినదని పూర్వమునందే నిశ్చయింపఁబడి యుండుటచే నా కృత్యములు చూపుల కెటు లుండినను వానియం దున్న బీజము నిర్దుష్టముగనే యుండవలయును. లేదా యది శాస్త్రదృష్టిచే నేదో యొక యోగ్యమగు కారణముచేతనే సంఘటిల్లినదియై యుండును. సామాన్యజనుల యొక్క కృత్యములవలె లోభమూలకము, లేక, యనీతితో కూడుకొన్నదిగ నుండుటకు వీలులేదని న్యాయ్యముగనె సిద్ధమగును. బైబిలులో 'అబ్రహామ్' మనువాఁడు తన పుత్త్రుని బలియిచ్చుటకుఁ గడఁగిన నతనికి పుత్త్రహత్య గావించిన పాపము దగులనటు లున్నది. బుద్ధునియొక్క శాపముచే నతని మామగారు చచ్చినను మనుష్యవధ వలన వచ్చిన పాతక మతనికి తగులలేదు. మఱియుఁ దల్లిని చంపి

నను పరశురాములకు మాతృహత్యవలన పాతక మతనికి సంఘటిల్ల లేదు. వీనికన్నిటికిని కారణ మిదియె. కావున "నీయొక్క బుద్ధి పవిత్రము నిర్మలము నగునేని ఫలాశను వదలి కేవల క్షాత్రధర్మాను సారముగ యుద్ధమునందు భీష్మద్రోణులను జంపినను పితామహ గురువధవలని పాతకము నీకుఁ దగులదు. కారణ మేమన: ఇట్టి వేళలయందు నీశ్వరసంకేతము సిద్ధించుటచే నీవు నిమిత్తమాత్రము గనే యై యున్నావు." (గీ. 11 33) అని గీతయం దర్జునునకుఁ జేయఁబడిన యుపదేశమునందలి తత్త్వమును నిదియే. లోకములో నొకలక్షాధిపతి యొకపేదవానిని మోసపుచ్చి రెండుపైసలు గైకొనినను వానిని చోరుఁడనక, పేద యగువాఁ డేదో యొకయపరాధము చేసియుండుటచే లక్షాధిపతి వానిని శిక్షించి యుండునని కల్పించు చున్నారు. ఈ న్యాయ మన్నింటికంటె నెక్కువ యుక్తియుక్తముగ, లేక, పూర్ణముగ, స్థితప్రజ్ఞులయొక్కయు, అర్హతులయొక్కయు, మహాభగవద్భక్తుల యొక్కయు వర్తనకు సంబంధించి యుండును. కారణ మేమి యన: లక్షాధీశుని బుద్ధియైన నొకప్పుడు చలించును; కాని స్థితప్రజ్ఞునియొక్క బుద్ధిని ఈ వికారము లెప్పుడును స్పృశింప నేరవని నిశ్చయింపఁబడినది. సృష్టికర్తయగు పరమేశ్వరుఁడు సర్వ కర్మలను జేసియు నే రీతిగ పాపపుణ్యములచే లిప్తుఁడు కాఁడో, యట్లె బ్రహ్మభూతుఁడైన యీ సాధువుయొక్క స్థితియు నెప్పుడును పవిత్రము గను నిష్పాపముగ నుండును. వే యేల? ఆ యా సమయములయం దిట్టి వారు పూర్వమునందు స్వయముగఁ బ్రవర్తించిన (ఆచరించిన) దానింబట్టియే విధినియమములయొక్క నిర్బంధములు వెలువడుచుండును. మఱియు నా కారణముననే యీ సత్పురుషుఁ డా విధినియమములకు జనకుఁ డగుచున్నాఁడు. ఎప్పుడు నుదాసీనుఁడుగ నుండఁడని చెప్పుచున్నారు. వైదికధర్మములయందే గాక బౌద్ధ క్రైస్తవ ధర్మములయందును, నీ సిద్ధాంతమే స్పష్టముగఁ గాన్పించుచున్నది ప్రాచీన

గ్రీకు తత్త్వజ్ఞానులకును నీ తత్త్వమే మాన్యమై యున్నది; మఱియు నర్వాచీనకాలము నందు కాంటు * అనువాఁడు తన నీతిశాస్త్రవిషయక మగు గ్రంథమునందు దీనినే సోపపత్తికముగ సిద్ధముఁ జేసి చూపి నాఁడు. నీతినియమములకు నెప్పుడును సాంకర్యము లేని స్వచ్ఛము నిర్దోషము నగు పుస్తక మెద్ది యని మొదట నిర్ణయింపఁబడిన పిదప, నీతిశాస్త్రముయొక్క, లేక, కర్మయోగశాస్త్రముయొక్క మూలతత్త్వ మును చూడవలయు ననువారు, గొప్పవారును నిష్కళంకులు నగు సిద్ధపురుషుల యొక్క చరిత్రలనే సూక్ష్మముగ నవలోకింపవలయునని స్పష్టముగనె సిద్ధమగును. "స్థితధీః కిం ప్రభాషేత కి మాసీత వ్రజేత కిమ్" — స్థితప్రజ్ఞుఁడగు పురుషునియొక్క సంభాషణయు, కూర్చుం డుటయు, నడచుటయు నెటు లుండును (గీ. 2. 54)? లేక, పదు నాల్గవ యధ్యాయమున "కైర్లింగై స్త్రీన్గుణా నేతా నతీతో భవతి ప్రభో కి మాచారః"—పురుషుఁడు త్రిగుణాతీతుఁ డెట్లగును? అతని యాచార మేమై యుండును? మఱియు నది మనకెట్లు తెలియును? (గీ. 14. 21) అని శ్రీకృష్ణు నర్జునుఁ డడిగిన ప్రశ్నయు నీ యభిప్రాయము తోడనే. సరాబునొద్దకు నొక స్వర్ణాభరణమును పరీక్షార్థమై తీసికొని పోయిన యెడల తన యొద్ద నమోనా (మాదిరి) కొలఁ కుంచుకొని

---

* "A perfectly good will would therefore be equally subject to objective laws (viz., laws of good), but could not be conceived as obliged thereby to act lawfully, because of itself from its subjective constitution it can only be determined by the conception of good. Therefore no imperatives hold for the Divine will, or in general for a holy will; ought is here out of place, because volition is already of itself necessarily in unison with the law" [Kant's Metaphysics of Morals p.31. [Abbott's trans, in Kant's Theory of Ethics 6th Edn.] విశ్శేయమవాఁ డే విధముగను నాధ్యాత్మికోపపత్తి నంగీకరింపఁడు. అయినను తన గ్రంథములలో నుత్తమపురుషుని [Superman] వర్ణించినచోట నిట్టివాఁడు మంచిచెరుగులనంటని వాఁడుగ నుండునని చెప్పెను. ఆ గ్రంథమునకు Beyond Good and Evil అని పేరు.

యుందు పంద్రెండువన్నెల బంగారుకణికతో పరీక్షించిన పిదప దాని యొక్క వన్నె మొదలగువానిని నిశ్చయించునటులె, కార్యాకార్యములను, లేక, ధర్మాధర్మములను; నిశ్చయించుటకు స్థితప్రజ్ఞుని వర్తనకును నొకనికషోపలము (ఒరపిడిఱాయి) కలదు. కావున దానిని తనకుఁ దెలుపుమని యీ ప్రశ్నయందలి గర్భితార్థము. అర్జునుని యొక్క యీ ప్రశ్నకు నుత్తర మిచ్చుచు శ్రీకృష్ణులు వర్ణించిన స్థితప్రజ్ఞునియొక్క, లేక, త్రిగుణాతీతునియొక్క స్థితి సన్న్యాసమార్గము నందున్న జ్ఞానులదే కాని కర్మయోగులది కానేరదని యనేకులు చెప్పుచున్నారు. కారణ మేమియన: ఇట్టి పురుషుల నుద్దేశించియే 'నిరాశ్రయః' (గీ. 4. 20) మొదలగు విశేషణములు గీతలయందుఁ బ్రయోగింపఁబడినవి యగుటచే రెండవ్వ యధ్యాయమున స్థితప్రజ్ఞుఁడగు భగవద్భక్తుని వర్ణించునపుడు దానియందు 'సర్వారంభ పరిత్యాగి' (12.16) అనియు, 'అనికేతః' (12.19) అనియు స్పష్టములగు పదములే యున్నవి; కాని, 'నిరాశ్రయ' 'అనికేత' పదములకు 'ఇంటిలో నుండక యరణ్యములలో తిరుగు' వారని వివక్షితమగు నర్థము గానందున "అనాశ్రితః కర్మఫలం" (గీ. 6.1) అనునదియు దీనితో సమానార్థము కలదియే; అనఁగా: "కర్మఫలముల నాశ్రయింపనివాఁడు" అని కాని ఆ ఫలమునందు "మనస్సులేని వాఁడు" అని కాని యర్థముఁ జేయవలయునని గీతయొక్క భాషాంతరమున నున్న యా యా శ్లోకములయొక్క టిప్పణమునుండి స్పష్టముగఁ గాన్పించును. ఇంతియ కాక స్థితప్రజ్ఞునియొక్క వర్ణనలోనే "వాఁడింద్రియములను తన స్వాధీనములో నుంచుకొని విషయముల యందు సంచరించువాఁడు, అనఁగా: నిష్కామకర్మలను జేయువాఁడుగ నున్నాఁడు" (గీ. 2.64) అని చెప్పియున్నది. నిరాశ్రయపద మున్న శ్లోకమునందె "కర్మ ణ్యభిప్రవృత్తోఽపి నైవ కించి త్కరోతి సః" — సర్వకర్మలను జేసినను వాఁ డలిప్తుఁడుగనే యుండును అనియున్నది. పంద్రెండవ యధ్యాయమునందున్న అనికేతాది పదముల

కును, నీ విధముననే యర్థము గ్రహింపవలయును. కారణ మేమి యన: ఈ యధ్యాయమున మొదటఁ గర్మఫలత్యాగమును (కర్మ త్యాగమును కాదు) ప్రశంసించి పిదప (గీ. 12.12) ఫలాశనుత్యజించి కర్మలను జేయుటచేఁ గలుగు శాంతికి నిదర్శనమునుజూపుటకై యనం తరమందు భగవద్భక్తులయొక్క లక్షణములు సెప్పఁబడినవి. మఱియు నటులనె పదునెనిమిదియవ యధ్యాయమునందును నాసక్తివిరహిత ములగు కర్మలను జేయుటచే శాంతి యెట్లు లభించునదియుఁ దెలుపు టకయి బ్రహ్మభూతుఁడు మరల వర్ణింపఁబడెను (గీ. 18.50). కావున నీ సర్వవర్ణనలు సన్న్యాసమార్గములోనివి కామిచే కర్మయోగులగు పురుషులవియే యై యున్నవని యంగీకరింప వలసివచ్చును. కర్మ యోగియైన స్థితప్రజ్ఞుఁడును, సన్న్యాసియైన స్థితప్రజ్ఞుఁడును నీయిరు వురియొక్క బ్రహ్మజ్ఞానము, శాంతి, ఆత్మౌపమ్యము, నిష్కామబుద్ధి, లేక, నీతితత్త్వము ననునవి వేర్వేఱుగ నుండునని దీని తాత్పర్యము కాదు. ఇరువురును పూర్ణబ్రహ్మజ్ఞానులయి యుండుటచే నిరువురి మానసికస్థితియు, శాంతియు నొక తీరుననే యుండును; కాని యీ యిరువురిలో నొకఁడు శుద్ధశాంతియందు నిమగ్నుఁడై యితరుల నెవ్వ రిని లక్ష్యముఁ జేయఁడు. ఇతరుఁడు శాంతిని, ఆత్మౌపమ్యబుద్ధిని, వ్యవ హారమునందు యథాసంభవముగను నిత్యము నుపయోగించుచుండు ననునదియే కర్మదృష్టిచే నీయిరువురిలో నుండు మహత్త్వము యొక్క భేదము. కావున వ్యావహారికమగు ధర్మాధర్మ వివేచన యను పనిలో నెవరి ప్రత్యక్షవర్తనము ప్రమాణమని యంగీకరింపవలయునో యట్టి స్థితప్రజ్ఞుఁడు కర్మలను జేయువాఁడుగనే యుండవలయును. కర్మలను వదలిన సాధువులు, లేక, భిక్షువు లీ స్థలమున వివక్షితు లగుటకు వీలులేదని న్యాయమూలమునఁ దెలియును. కర్మలను పరిత్యజించు టకు నావశ్యకత లేదు; అవి వదలను సైతము వదలవు. బ్రహ్మాత్మైక్య జ్ఞానమును సంపాదించుకొని కర్మయోగివలె వ్యవసాయాత్మకబుద్ధిని

సామ్యావస్థయందుంచెనేని దానితో పాటుగనే వాసనాత్మకబుద్ధియు, తప్పక శుద్ధము, నిర్మలము, పవిత్రము నగును. కావున కర్మలయొక్క బంధనములు నీకు సంఘటిల్లవనునది గీతయం దర్జుననకుఁ జేయఁబడిన సర్వోపదేశముయొక్కయు సారమయియున్నది. మఱియు నీ కారణముననే యీ ప్రకరణారంభమున వ్రాయఁబడిన శ్లోకములో “కేవల వాక్కుచేతను మనస్సుచేతనే కాక ప్రత్యక్షముగఁ గర్మలచే సైత మెవఁ డెల్లరతును స్నేహితుఁడును హితకర్తయు నగుచున్నాఁడో వానినే ధర్మజ్ఞుఁ డని చెప్పవలయును” అను ధర్మతత్త్వమును జాజలికి చెప్పుచున్న తులాధారుఁడు వాఙ్మనసములకు ప్రాధాన్యమును నిర్దేశించి నటులే యీ వాఙ్మనసములకంటె ముందుగఁ గర్మల సైతము ప్రధానములుగ నిర్దేశించెను.

కర్మయోగియగు స్థితప్రజ్ఞునకు, లేక, జీవన్ముక్తునకు వలె నెవనిబుద్ధి సర్వభూతములయందును సామ్యమును బొందియున్నదో, మఱియు నెవనియొక్క స్వార్థము పరార్థముననె లయమగునో, యతని కీ స్థితి గలిగిన పిదప నీతిశాస్త్రమును సవిస్తరముగఁ జెప్పనవసరము లేదు. ఏలన: అతఁడు తనంతనే స్వయంప్రకాశుఁడు, లేక, బుద్ధుఁడాయెను. అర్జునుని యధికార మిట్టిది యగుటచే “నీవు నీ బుద్ధిని సమము, స్థిరమగునట్లు చేయుము. కర్మలను వదలివేయుదునను వ్యర్థమగు భ్రమలోఁ బడక స్థితప్రజ్ఞునివలె బుద్ధిని సామ్యమున నిలిపి స్వధర్మానుసారముగ ప్రాప్తములయిన సర్వసాంసారికకర్మలను చేయుము” అనుదాని కంటె నాతనికి విశేషముగ నుపదేశింపవలసిన యావశ్యకత యుండదు. అయిన నీ సామ్యబుద్ధిరూపమగు యోగ మందఱకు నొక జన్మమునందే ప్రాప్తమగుటకు శక్యము కానేరదు. కావున సామాన్య జనులకొఱకు స్థితప్రజ్ఞునియొక్క వర్తనము నింకను కొంత పరీక్షింపవలయునని పైనఁ జెప్పఁబడియే యున్నది. కాన దీనిని విచారించునప్పుడు మఱికొన్నిటిని సైతము గమనింపవలయును. మనము

విచారించుచున్న స్థితప్రజ్ఞుఁడు కృతయుగమునందలి పూర్ణావస్థను బొందిన సమాజమున నున్నవాఁడు కాఁడు. ఇఁక నేమనఁగా: ఏ సమాజమున ననేకులు స్వార్థమునందే నిమగ్నులయి యుండిరో యట్టి కలియుగమునం దున్న సమాజమునం దతఁడు నడచుకొను వాఁడుగ నుండవలయును. కారణ మేమియన: మనుష్యునియొక్క జ్ఞాన మెంత పూర్ణమైనను నతని బుద్ధి యెంత సామ్యావస్థను జెంది యుండినను, కామక్రోధాదులయొక్క నడుమ చిక్కికొనక పరిశుద్ధ బుద్ధి గలిగిన లోకులవలెనే సంచరించుచు, అహింస, శాంతి, దయ, క్షమ మొదలగు నిత్యములును పరమావధులు నగు సద్గుణములనే సర్వవిధముల నెల్లప్పుడును విడువకయుండిననే కాని యా సమాజమున నిర్వహింపలేఁడు.* అనఁగా: అందెల్లవారును స్థితప్రజ్ఞులే యగు సమాజమునందున్న పరాకాష్ఠయగు నీతి, లేక, ధర్మాధర్మములును, మఱియు నెల్లవారును లోభులే యగు సమాజమునందున్న ధర్మాధర్మములును అనునవి కొంతయయినను వేఱుగనే యుండవలయును; అట్లు కాకపోయె నేని సాధువు లీ జగత్తును వదలవలసి వచ్చును. మఱియు నంతటను దుష్టులసామ్రాజ్యమే యగును. ఇట్లను

* "In the second place, ideal conduct such as ethical theory is concerned with, is not possible for the ideal man in the midss of men otherwise constituted. An absolutely just or perfectly sympathetic person, could not live and act according to his nature in a tribe of cannibals. Among people who are treacherous and utterly without scruple, entire truthfulness und openness must bring ruin". Spencer's Data of Ethics, Chap. XV, p. 280. స్పెన్సరు దీనికి Relative Ethics అని పేరిడెను. "On the evolution—hypothesit the two [Absolute and Relative Ethics] presuppose one another; and, only when they co-exist, can there exist that ideal conduct which Absolute Ethics has to formulate, and which Relative Ethics has to take as the standard by which to estimate divergencies from right, or degrees of wrong" అని యాతఁడు చెప్పుచు

టుచే సాధువు తన సమతాబుద్ధిని వదలవలయునని దీనికి యర్థము కానేరదు. అయిన నీ సమతలలో భేద మున్నది. "బ్రాహ్మణే గవి హస్తిని"–బ్రాహ్మణుఁడు, గోవు, ఏనుఁగు ననువాని విషయములో (గీ.5.18) పండితుల బుద్ధి సమముగ నుండునని గీతయందుఁ జెప్పఁబడినది. కావున గోవునకై తెచ్చిన గడ్డిని బ్రాహ్మణునకును, బ్రాహ్మణుల కొఱకై తెచ్చిన వండిన యన్నమును గోవునకును, నెవఁడైన పెట్టునేని యతనిని మనము పండితుఁడని యందుమా? సన్న్యాసమార్గము నందుండు వారీ ప్రశ్న నొక గొప్పది యని యెన్నకపోయినను, కర్మయోగశాస్త్రజ్ఞు లట్లనరు. కృతయుగమున నున్న సమాజము యొక్క పూర్ణావస్థయు, అందున్న ధర్మాధర్మముల స్వరూపమును విచారించి దేశకాలానుసారముగ వాని నెంతవఱకు మార్పవలయునో నిశ్చయించి, స్వార్థపరాయణుల సమాజమునందు స్థితప్రజ్ఞుఁడు సంచరించుచున్నాఁడు. మఱియు కర్మయోగశాస్త్రమునందున్న వికట ప్రశ్న మిదియే యని చదువరులకు రెండవ ప్రకరణపు వివేచనవలనఁ గన్పట్టును. స్వార్థపరాయణులపై కోపింపక, లేక వారియొక్క లోభబుద్ధిని జూచి తన మనస్సునందలి సమతను చెడిపోనీయక యీ విధమగు జనుల కల్యాణార్థమై సాధువు కర్తవ్య మనియే వైరాగ్యముతోఁ దన యుద్యోగమును వర్తిల్లఁ జేయుచునే యుండును. ఈ తత్త్వమునే మనంబున నిడుకొని శ్రీ సమర్థరామదాసస్వామి గారు దాసబోధ యొక్క పూర్వార్ధమున మొదట బ్రహ్మజ్ఞానమును జెప్పి, లోకులను నిపుణులుగఁ జేయుటకై వైరాగ్యముతో (అనఁగా: నిస్పృహత్వముతో) లోకసంగ్రహార్థమై వ్యాపారమును గాని, యుద్యోగమును గాని చేయు స్థితప్రజ్ఞుని, లేక, యుత్తమ పురుషుని వర్ణించుటకు, పదునొకండవ దశకములో (దాస. 11.10; 12.8-10; 15.2) నారంభించిరి. మఱియు పిదప పదునెనిమిదియవ దశకమున జ్ఞానియొక్క, అనఁగా: జ్ఞాతయొక్క కథ, గోష్ఠి, యంత్రము, ప్రసంగము, సాక్షేపము, తర్కము

ధూర్తత, రాజకరణము, సహిష్ణుత, తీక్ష్ణత, ఔదార్యము, అధ్యాత్మ జ్ఞానము, భక్తి, యలిప్తత్వము, వైరాగ్యము, ధృష్టత, ఇచ్ఛ, నియతముగ నుండుట, నిగ్రహము, సమత, వివేకము మొదలగు ననేక గుణముల నెల్లవారు నభ్యసింపవలయునని చెప్పినారు (దాస. 18.2) కాని యీ నిస్పృహులు లోభులలో సంచరింపవలసి వచ్చినందున –

> ధటాసీ ఆణావాధట, ఉద్ధటాసీ పాహిజే ఉద్ధట,
> ఖటనటాసీ ఖటనట, అగత్య కరీ.
>
> దాస. 19.9.30.

– త్రాత్యునితో త్రాత్యునే చేర్పవలయును. పిచ్చివానితో పిచ్చివానినే కూర్పవలయును. వెఱ్ఱిపట్టుదల గలవానితో నట్టివానినే కలసికొనునట్లు చేయవలయును అని యిట్లు తుదకు సమర్థుల వా రుపదేశించిరి. పూర్ణావస్థలోనుండి వ్యవహారములోనికి వచ్చినప్పు డత్యుత్తమము లైన ధర్మాధర్మముల యందు కొద్దియో గొప్పయో మార్పు చేయక తప్ప దనునది నిర్వివాదమే యని తాత్పర్యము.

పూర్ణావస్థయందున్న సమాజము నుండి క్రిందికి నాఁడు, అనఁగా: అనేకవిషయములయొక్క సారాసారములను విచారించి పరమావధియగు నీతిధర్మములో కొంతగనో, లేక, గొప్పగనో భేదము చేయవలసి వచ్చేనేని, నీతిధర్మము సత్య మెట్లగును? మఱియు "ధర్మో నిత్యః" అని వ్యాసులవారు భారతసావిత్రియందు చెప్పినందులకు గతియేమి? యని దీనిపై నాధిభౌతికవాదులు శంకింతురు. అధ్యాత్మ దృష్టిచే సిద్ధమగు ధర్మముయొక్క నిత్యత్వము కేవలము కాల్పనికమగుటచే నన్ని సమాజములయొక్క స్థితివలె నా యా కాలములందు "అనేకుల కధికసుఖము" అను సిద్ధాంతముచేఁ బ్రాప్తమగు నీతితత్త్వమే సత్యమగు నీతినియమ మగునని వారందురు; కాని యీ

పూర్వపక్షరీతి బాగుగ లేదు. భూమితిశాస్త్రమునందుఁ జెప్పబడినటుల నే మాత్రమును వెడల్పు లేని సరళమగు రేఖగాని, లేక, యే మాత్ర మును తప్పు లేని వర్తులమగు పరిధి గాని యెవరికిని వ్రాయుటకు సాధ్యము కాకపోయినను, అట్లు సాధ్యము కాని హేతువుచే సరళ రేఖయొక్క గాని, లేక, శుద్ధవర్తులరేఖయొక్క గాని శాస్త్రీయమగు లక్షణము తప్పు గాని నిరర్థకమయినది గాని కానటులే, యే మాత్ర మును లోపము లేనిదియు, సరళమును శుద్ధము నయినదియు నీతి నియమములు గలిగినదియునై యుండవలయు నని చెప్పుట తప్పు, లేక, వ్యర్థము కానేరదు. ఇంతియ కాక ఏ విషయముయొక్క యయినను పరమావధియైన శుద్ధస్వరూప మేదియో మొదట నిశ్చ యించిననే కాని వ్యవహారమునందుఁ గన్పట్టునట్టి యా విషయము యొక్క యనేకస్వరూపములను సంస్కరించుట, లేక, సారాసార విచారముఁ జేసి దానియందున్న తారతమ్యమును దెలిసికొనుట శక్యము కానేరదు. మఱియు నీ కారణముననే మేలిమివన్నె బంగార మేది యని నరాబు ముందు నిర్ణయించుచున్నాఁడు. దిక్కులను జూపు ధ్రువమత్స్యయంత్రము వైపునకుఁ గాని, ధ్రువనక్షత్రము వైపునకుఁ గాని చూడక యపారమగు సముద్రమునందలి తరంగముల యొక్కయు, వాయువు యొక్కయు తారతమ్యమునే చూచి యోడ నడుపు వాఁడు మాటిమాటికి చుక్కానిని త్రిప్పెనేని యతనికిఁ గలుగు స్థితియే నీతినియమముయొక్క పరమావధిస్వరూపము నెఱుఁగక దేశకాలానుసారముగ మాత్రమే సంచరించు మనుష్యునకును సంభ వించును. కావున కేవ లాధిభౌతికదృష్టిచే విచారించినను ధ్రువునివలె స్థిరము నిత్యము నైన నీతితత్త్వ మేది యని మొదట నవశ్యము నిశ్చయింపవలసివచ్చును. మఱియు నొక మాఱిది యావశ్యకమని యంగీకరించెనేని యాధిభౌతికమతమందలి కలమే (పద్ధతి) యగును. కారణ మేమి యనఁగా: సుఖము దుఃఖము మొదలగు సర్వవిష

యోపభోగములును నామరూపాత్మకములు గావుననే యనిత్యములు వినాశులు మాయలోఁ జేరినవియు యయి యున్నవి. కావున వాని యొక్క, (అనఁగా: బాహ్యప్రమాణముల యొక్క) యాధారము చేతనే సిద్ధములైన యే నీతినియమములైనను నిత్య మనుటకు వీలు లేదు. అధిభౌతికములైన బాహ్య సుఖదుఃఖములయొక్క కల్పన యెటులు మాఱునో యటులే వానిపై రచియింపఁబడిన నీతిధర్మము లును మాఱవలయును గనుక నెప్పుడును మాఱునట్టి నీతిధర్మముల యీ స్థితిని దాఁటువలసియుండె నేని మాయాసృష్టియం దున్నవిష యోపభోగమును వదలి నీతిధర్మరూపమగు మహాగృహమును, సర్వ భూతములయందు నొక యాత్మయే యను నధ్యాత్మజ్ఞానముయొక్క పునాదిమీఁదనే కట్టవలసివచ్చును. కారణ మేమియనఁగా: ఆత్మ కాక రెండవ వస్తు వేదియైనను జగత్తునందు నిత్యము కాదని వెనుక తొమ్మిదియవ ప్రకరణమునఁ జెప్పఁబడియే యున్నది. "ధర్మోనిత్య స్సుఖదుఃఖే త్వనిత్యే" — నీతియొక్క, లేక, సదాచరణము యొక్క ధర్మము నిత్యము. మఱియు సుఖదుఃఖము లనిత్యములుగ నున్నవి. — అను వ్యాసవచనములయొక్క తాత్పర్యము సైత మిదియే యై యున్నది. దుష్టులు, లోభులు నైన వారిసమాజమునందు అహింస సత్యము మొదలగు నిత్యము లగు నీతిధర్మములను బూర్ణముగఁ బాలించుటకు సాధ్యము కాదనుట సత్యమే; కాని వారియొక్క దోష మీ నిత్యధర్మములపైఁ బెట్టుట యోగ్యము కానేరదు. సూర్యుని యొక్క కిరణముల ప్రసారముచే నొక పదార్థముయొక్క నీడ యొక సరళమైన ప్రదేశమునందు సరళముగను నిమ్నోన్నతప్రదే శమున నిమ్నోన్నతముగను పడినందున, ఆ యసమతామూలముననే నిమ్నోన్నతముగ నుండి యుండవలయునని యనుమానించుటకు సాధ్యము కానటులే, దుష్టుల సమాజమునందలి నీతిధర్మముల పరా కాష్ఠయొక్క శుద్ధస్వరూపము స్పష్టముగఁ గన్పట్టకపోవుటచే నపూర్ణా

వస్థయందున్న సమాజమునందు స్పష్టముగఁ గాన్పించెడి నీతిధర్మ ములయొక్క యపూర్ణస్వరూపమే ముఖ్యము, లేక, మొట్టమొదట నుండునది యని చెప్పుటకు సాధ్యము కాదు. ఇది సమాజపు దోషమై యున్నది. నీతియందలి దోషము కాదు. కావున నేర్పరులగు వారు శుద్ధము నిత్యము నయిన నీతిధర్మముల విషయమై వాదు లాడక సమాజ మున్నతస్థితిలోనికి వచ్చి పూర్ణావస్థను జెందవలయు నని ప్రయత్నించుచున్నారు. లోభుల సమాజమున నిట్లుండఁగా నపరిహార్య మను తలంపున నిత్య మయిన నీతిధర్మములకు నేదైన యపవాదము మన శాస్త్రకారులచేఁ జెప్పఁబడినను వానివిషయమై ప్రాయశ్చిత్తమును చెప్పుచున్నారు. మఱియు పాశ్చాత్యులగు నాధి భౌతికులైన నీతిశాస్త్రజ్ఞు లీ యపవాదమునే ప్రకారాంతరముచేఁ బ్రతిపాదించు చున్నందున, నీ యపవాదమును నిశ్చయించుటకు నుపయోగకరమైన బాహ్యఫలములయందలి తారతమ్యముయొక్క తత్త్వమును, భ్రమముచే నీతియొక్క మూలతత్త్వమని వారనుకొను చున్నారు అని పూర్వప్రకరణమున నేను చూపిన భేదమునందున్న రహస్యమిప్పుడు చదువరులకు స్పష్ట మగును.

స్థితప్రజ్ఞుఁడైన జ్ఞానియొక్క వర్తనము, బుద్ధియు, నీతిశాస్త్ర మునకుఁ బునాది యగుటచే దానియందుండి వెలువడు నీతియొక్క నియమము నిత్యమయినను, సమాజముయొక్క యపూర్ణావస్థ యందుఁ గొంచెమో, గొప్పయో యేల మాఱవలసి వచ్చుననియు, నది యా విధమున మాఱినయెడల నీతి నియమముల యొక్క నిత్యత్వమునకు దానివలన బాధయే కలుగ దనియుఁ జెప్పఁబడినది. ఇప్పుడు స్థితప్రజ్ఞుఁడగు జ్ఞాని యపూర్ణావస్థగల సమాజమునఁ జేయు చున్న వర్తనకు కారణము, లేక, మూలతత్త్వము ఏమని మొదట చేయఁబడిన శంకను విచారింతము. ఈ విచారము రెండు విధము లుగఁ జేయవచ్చునని వెనుక నాల్గవ ప్రకరణమునఁ జెప్పఁబడినది.

అందు కర్త యొక్క బుద్ధిని ప్రధానముగ నంగీకరించి చేయునది మొదటిది. అతని బాహ్యావర్తనము ననుసరించి చేయునది రెండవది. వీనిలో రెండవదృష్టితో విచారించితి మేని "స్థితప్రజ్ఞుఁడు సేయు వ్యవహారములన్నియు తఱచుగ నందఱు జనులయొుక్క హితార్థమే యయి యున్నవి" అని స్పష్టపడును. పరమజ్ఞానులగు సత్పురుషులు "సర్వభూతహితే రతాః"_ సర్వభూతములయొక్క కల్యాణమునందు నిమగ్నులై యుందు రని గీతలలో రెండు పర్యాయములు చెప్పఁబడినది (గీ. 5.25; 12.4); మఱియు నీ యర్థమే మహాభారతమునందును నింక ననేక ప్రదేశములయందును చెప్పఁబడినది. స్థితప్రజ్ఞుఁడైన సిద్ధపురుషుఁడును, అట్టి యహింసాది నియమములు ననునవియే, ధర్మముయొక్కయు, సదాచరణముయొక్కయు గ్రంథము లగునని నే నిదివరలో చెప్పియున్నాను. ఈ యహింస మొదలగు నియమము లెందు కొఱకున్నదియు, నీ ధర్మముల లక్షణ మేమియో యదియు, చెప్పుచు "అహింసా సత్యవచనం సర్వభూతహితం పరం"_అహింసయు సత్యభాషణయు నను నీ నీతిధర్మములు సర్వభూతహితార్థములై యున్నవి (వన. 206.73). "ధారణా ద్ధర్మమిత్యాహుః"_జగత్తును ధరించుచున్నది కావున ధర్మము (శాం. 109.12) ''ధర్మం హి శ్రేయ ఇత్యాహుః''_ ఏది కల్యాణమో యదియే ధర్మము (అను. 105.14) "ప్రభవార్థాయ భూతానాం ధర్మప్రవచనం కృతం"_ లోకుల యభ్యుదయార్థమే ధర్మశాస్త్రములు వెలువడినవి (శాం. 109.10) "లోకయాత్రార్థ మే వేహ ధర్మస్య నియమః కృతః, ఉభయస్య సుఖోదర్కః" _ లోకవ్యవహారము నడిపించుచు నుభయ లోకములయందు కల్యాణము కావలయునని ధర్మాధర్మములు నియమింపఁబడినవి (శాం. 258.4) అని ధర్మములయొక్క బాహ్యోపయోగమును జూపు ననేక వచనములు మహాభారతమునందుఁ జెప్పఁబడినవి. అట్లే ధర్మాధర్మ సంశయ సమయములందు జ్ఞానులును_

**లోకయాత్రా చ ద్రష్టవ్యా ధర్మ శ్చాత్మహితాని చ.**

— లోకవ్యవహారము, నీతిధర్మము, తమ కల్యాణము నను నీ బాహ్య విషయములను బాగుగ విచారించి (అను. 37. 16; వన. 206. 90) పిదప నేమి చేయవలయునో యది నిశ్చయించుకొనవలయు నని భారతమునఁ జెప్పఁబడినది; మఱియు వనపర్వమునందు శిబిచక్రవర్తి ధర్మాధర్మనిర్ణయమునకై యీ యుక్తినే యుపయోగించినాఁ డని యున్నది (వన. 131 మఱి 12 చూడు). ఈ వచనములవలన సమాజముయొక్క యుత్కర్ష మనునదియే స్థితప్రజ్ఞునియొక్క యాచరణము నందలి బాహ్యాధోరణి యని స్పష్టమగుచున్నది. మఱియు నిది సత్య మగునేని, యనేకుల కధిక సుఖమని కాని, సుఖశబ్దమునకుఁ గల వ్యాపకార్థము ననుసరించి, హితము, కల్యాణము నని కాని, అధిభౌతికవాదులు సెప్పునట్టి నీతితత్త్వమునే యధ్యాత్మవాదు లేల స్వీకరింపరని సహజముగ ప్రశ్న బయలువెడలును; కాని యటు లొప్పుకొనిన 'అనేకుల కధికసుఖ' మను నీ సూత్రమునందు బుద్ధికి నాత్మప్రసాదమువలనఁ గలుగఁబోవు సుఖమునకును, లేక, యున్నలికిని పారలౌకిక కల్యాణమునకు నంతర్భావము కాలేదను నొక గొప్పదోష మున్నదని వెనుక నాలుగవ ప్రకరణములోఁ జెప్పియుంటిని; కాని 'సుఖశబ్దార్థమును' అధికముగ వ్యాపకముగఁ జేసి యీ దోషము ననేక విధముల నివారింపవచ్చును; మఱియు నీతిధర్మముయొక్క నిత్యత్వసంబంధములో పైనఁ జెప్పఁబడిన యాధ్యాత్మికోపపత్తియు ననేకులకు విశేషమహిమ గలదని తోఁపదు. కావున నీతిశాస్త్రముయొక్క నాధిభౌతికములు నయిన మార్గములందున్న మహత్త్వములకు భేద మేమియో యిక్కడ దాని నింకను కొంచెము స్పష్టము చేయుట యావశ్యకముగ నున్నది.

ఏ కర్మయైనను నీతిదృష్టిచే యోగ్య మయినది యగునా? కాదా? యని విచారించుటకు 1. ఆ కర్మకు కేవల బాహ్యఫలము

(అనఁగా: జగత్తునందు దృశ్యమగు పరిణామము) ఏమి కలిగినదో, యేమి కలుగఁగలదో దానిని జూచుటయు, 2. ఆ కర్మను జేయువాని యొక్క బుద్ధి (అనఁగా: వాసన) యెట్లున్నదో దానిని జూచుకొను టయు నను రెండు మార్గములు గలవు. మొదటిదానిని అధిభౌతిక మార్గ మని చెప్పుచున్నారు. రెండవదానియందు మరల రెండు పక్ష ములు బయలువెడలు చున్నవి. ఈ రెండు పక్షములకును వేర్వేఱు పేరు లున్నవి. శుద్ధమైన కర్మ సంఘటిల్లుటకయి వాసనాత్మకబుద్ధి శుద్ధముగ నుండవలసివచ్చును. మఱియు వాసనాత్మకబుద్ధి శుద్ధముగ నుండుటకు వ్యవసాయాత్మకబుద్ధి (అనఁగా: కార్యాకార్యములను నిర్ణయించు) బుద్ధి స్థిరము, సమము, శుద్ధముగ నుండవలయు నని వెనుకటి ప్రకరణములోఁ జెప్పఁబడియున్నది. ఈ సిద్ధాంతాను సారముగ నెవరియొక్కయు కర్మ శుద్ధముగ నున్నదా? లేదా? యని చూచుటకు వారి వాసనాత్మకమగు బుద్ధి శుద్ధముగ నున్నదా? లేదా? యని చూడవలసి వచ్చును. కర్మయొక్క బుద్ధి (అనఁగా: వాసన) శుద్ధమైనదా? లేదా? యను దాని నిశ్చయము తుదకు వ్యవసాయా త్మకబుద్ధియొక్క శుద్ధత నుండియే చేయవలసి వచ్చునని యిందలి సారాంశము (గీ. 2. 41). ఈ వ్యవసాయాత్మకబుద్ధి సదసద్వి వేచనాశక్తి రూపమయిన స్వతంత్రదేవత యని యంగీకరించితి మేని యది అధిదైవికమార్గ మగును. మఱియు నీ బుద్ధి స్వతంత్రమైన దైవతము కానేరదు. మఱి యే మన: ఆత్మయొక్క యొక యంతరిం ద్రియమై యున్నది. మఱియు దానివలన బుద్ధి ప్రధాన మని యం గీకరింపక యాత్మ ప్రధాన మని యంగీకరించి వాసనయొక్క శుద్ధ తను విచారింతు మేని యది నీతినిర్ణయముయొక్క అధ్యాత్మికమార్గ మయినది. ఈ యన్ని మార్గములలో నాధ్యాత్మికమార్గమే శ్రేష్ఠ మని మన శాస్త్రకారులు సెప్పుదురు; మఱి జర్మను తత్త్వవేత్తయు, ప్రసి ద్ధుఁడు నగు కాంటు బ్రహ్మాత్మైక్యసిద్ధాంతమును స్పష్టముగ వ్రాయక పోయినను, తన నీతిశాస్త్రవివేచనను, శుద్ధబుద్ధి మొదలుకొని అనఁగా:

నొక విధమగు నధ్యాత్మదృష్టిచేతనే యారంభించి యటు లేల చేయవలయునో యందులకు పూర్ణముగ సోపపత్తికముగ సైతము వ్రాసెను. † గ్రీనుయొక్క యభిప్రాయమును నిదియే; కాని యీ విషయమై యన్ని యూహాపోహాలు నీ చిన్నిగ్రంథమునఁ జేయుటకు సాధ్యము కానేరదు. నీతిమత్తను పూర్తిగ నిర్ణయించుటకుఁ గర్మల యొక్క బాహ్యఫలములవైపున దృష్టి నుంచుటకంటె, దాని కర్త యొక్క శుద్ధమగు బుద్ధివైపునకు విశేషముగ నేల యుంచవలసినదియు నొకటి రెండు ఉదాహరణములతో వివరించి వెనుక నాలుగవ ప్రకరణములలో స్పష్టముగ వ్రాసియే యున్నాను. ఈ సంబంధములో విశేషమగు విచారమును పిదప పదునైదవ ప్రకరణములో పాశ్చాత్యములు, పౌరస్త్యములు నగు నీతిమార్గములను పోల్చి చెప్పునపుడు చేయుదును. ఇప్పుడు చెప్పున దేమన: కర్మయైనను సంఘటిల్లుటకు నా కర్మను జేయవలయునని బుద్ధి మొదట కావలసివచ్చును గాన, కర్మలయొక్క యోగ్యతాయోగ్యతల విచారముసైతము బుద్ధియందలి శుద్ధతాశుద్ధతలమీఁదనే సర్వాంశములచేతను పూటఁబడి యుండును. బుద్ధి సరియైనది కానియెడల కర్మయు నయోగ్య మైనదియేయగును. కేవల బాహ్యకర్మకూడ నిది యైనంత మాత్రమున, బుద్ధియు చెడుదిగనే యుండి యుండవలయు నని యనుమితి చేయుటకు సాధ్యము కాదు. కారణ మేమి యనఁగా: మఱచిపోవుటచేఁ గాని, పొరపాటుచేఁ గాని, యజ్ఞానముచేతఁ గాని బాహ్యకర్మ లట్లగును; మఱియు నా కర్మలను నీతిశాస్త్రప్రకారముగ చెడువి యని చెప్పుట సాధ్యము కాదు. 'అనేకుల కధిక సుఖ' మను నీ నీతితత్త్వము బాహ్యపరిణామమునకు మాత్రమే సంబంధించును. మఱియు నీ సుఖదుఃఖాత్మకమగు బాహ్య పరిణామము నిశ్చితరీతిచే కొలుచుటకు బాహ్యసాధనము నేటికిని

---

† See Kant's Theory of Ethics, trans. by Abbott. 6th Ed. especially, Metaphysics of Morals therein.

వెలువడలేదు. కావుననే నీతిమత్తకు నీ నికషోపలము (ఒరపిడిఱాయి) చేతనే తప్పక యథార్థనిర్ణయము కాఁగలదని నమ్మిక లేదు. అటులే మనుష్యుఁ డెంత నేర్పరియైనను, వానియొక్క బుద్ధి శుద్ధము కాని యెడల ప్రతి సమయముననను, ధర్మమునే యాచరించునని నియమము లేదు. అతనికి విశేషముగ స్వార్థముగల ప్రసంగమున నేమి చెప్పవల యును. "స్వార్థే సర్వే విముహ్యంతి యేఽపి ధర్మవిదో జనాః (మ. భా. విరా. 51.4)-మనుజుఁ డెంత జ్ఞానియు, ధర్మవేత్తయు నేర్పరియు నయినను సర్వభూతములయందును సముఁడు కానియెడల, నతని కర్మలు తప్పక శుద్ధములుగను, లేక, నీతిదృష్టిచే నిర్దోషములుఁగ నుండు నని నియమముండ దని యిందలి సారాంశము. కావున నీతిని విచా రించుచున్నప్పుడు, కర్మయొక్క బాహ్యఫలముకంటె కర్తయొక్క బుద్ధియే ప్రధానముగ విచారింపఁ బడవలయును. సామ్య బుద్ధియే సద్వర్తనమునకు నిజమగు బీజ మని మన శాస్త్రకారులు సిద్ధాంతముఁ జేసిరి. మఱియు భగవద్గీతయందు సైతము-

*దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ,
బుద్ధౌ శరణ మన్విచ్ఛ కృపణాః ఫలహేతవః.

గీ. 2.49

అని యర్జునునకు భగవంతునిచేఁ జేయబడిన యుపదేశమందున్న రహస్య మిదియే. ఈ శ్లోకమునందున్న బుద్ధిశబ్దమునకు జ్ఞాన మర్థ మనుకొని కర్మయు జ్ఞానము నను నీ రెంటిలో జ్ఞానమునకే శ్రేష్ఠత్వ మీయఁబడెనని యనేకులు చెప్పుచున్నారు; కాని యీ యర్థము పొరపాటని మా మతము. బుద్ధియోగ మనఁగ సమత్వ బుద్ధియోగ

* "ఓ ధనంజయా! (సమ) బుద్ధిరూపమగు యోగముకంటె, (కేవల) కర్మ వికృష్టమైనది. కాన (సమ) బుద్ధినే యాశ్రయింపుము. ఫలమును గోరి కర్మను జేయువారు కృపణులు (అనఁగా: తక్కువవారు)" అని యీ శ్లోకము నకు సరళమగు నర్థము.

మని యిక్కడ శాంకరభాష్యములో నర్థము వ్రాయఁబడినది. కావున యథార్థముగఁ జూచితి మేని దానికి కర్మపరమగు నర్థము చేయవల యును. అట్లు చేసిన సరళముగ నన్వయింపఁ గలదు. కర్మను జేయు వారు రెండు విధములుగ నున్నారు. ఒకరు ఫలమునుగోరి చేయు వారు (అనఁగా: ఆ కర్మవలన నెందటి కెంత సుఖము గలుగునో యని యాలోచించి చేయువారు), మఱియొకరు బుద్ధిని సమముగను నిష్కామముగ నునిచి కర్మను జేయువారు. వీరు తా మటులుచేయు నపుడు కర్మధర్మసంయోగముచే నే పరిణామము గలిగినను లక్ష్య పెట్టరు. వీనిలో "ఫలహేతవః" అనఁగా ఫలమును గోరి కర్మలను జేయువారు, నైతికదృష్టిచేఁ కృపణులు (అనఁగా: తక్కువవారు)అని నిశ్చయించి, సమత్వబుద్ధిచే గర్మలను జేయువారు శ్రేష్ఠులని యీ శ్లోకమున నిశ్చయింపఁబడినది. "దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగా ద్ధనంజయ"— ఓ ధనంజయా! సమత్వబుద్ధి యోగముకంటె కేవల కర్మ యత్యంత నికృష్టము అని యీ శ్లోకముయొక్క మొదటి రెండు చరణములలోనున్న తాత్పర్యమిదియే. మఱియు భీష్మద్రోణుల నే నెట్లు చంపుదును? అను నీ యర్జునుని ప్రశ్నకు నిది యే యుత్తరము. చంపు టయు, చచ్చుటయు నను క్రియలను మాత్రమే చూడక మనుజుఁ డే బుద్ధితో నా పనిని జేయుచున్నాఁడో దానిని జూడవలయునని దీని యందున్న భావార్థము; కావున "నీవు బుద్ధిని (అనఁగా: సమబుద్ధిని) శరణు పొందుము" అని యీ శ్లోకముయొక్క మూఁడవ చరణమున నుపదేశింపఁబడినది. మఱియు నుపసంహారాత్మకమగు పదునెనిమిదవ యధ్యాయమందును "బుద్ధియోగము నాశ్రయించి నీవు నీ కర్మలను జేయుము" అని భగవంతుఁడు చెప్పినాఁడు. గీత కేవలకర్మయొక్క విచారము కనిష్ఠమని తెలిసికొనినది. కావుననే యా కర్మకు ప్రేరక మగు బుద్ధియొక్క విచారమే శ్రేష్ఠమని చెప్పుచున్నదని గీతయందలి మఱియొక శ్లోకమువలన వ్యక్తమగుచున్నది. పదునెనిమిదియవ యధ్యాయమున కర్మయొక్క మంచి చెడుగులు వర్ణింపఁబడినవి.

అనఁగా: సాత్త్వికములు, రాజసములు, తామసములు నని మూఁడు విధములుగ జెప్పఁబడినవి. ఒకకర్మఫలమునే గీత యుద్దేశించినయెడల ననేకులకు సుఖమునిచ్చు కర్మయే సాత్త్వికమని భగవంతుఁడు చెప్పి యుండును; కాని యటులు చెప్పక "ఫలాశను వదలి నిస్సంగబుద్ధిచే చేయఁబడిన కర్మలు సాత్త్వికములు, లేక, యుత్తమము లైనవి" యని పదునెనిమిదియవయధ్యాయమున చెప్పఁబడినది (గీ. 18.23). గీత కర్మాకర్మవివేచనఁ జేయుచు కర్మలయొక్క బాహ్యఫలముల కంటె కర్తయొక్క నిష్కామము సమము నిస్సంగము నయిన బుద్ధికే యధిక మయిన మహత్త్వ మిచ్చుచున్నదని దీనివలన స్పష్ట మగు చున్నది. మఱియు నీ న్యాయమునే స్థితప్రజ్ఞునియొక్క వర్తనకు సంబంధింపఁ జేయుదు మేని, స్థితప్రజ్ఞుఁడే సామ్యబుద్ధిచే తనతో సమానులైన వారితోడను, తక్కువవాండ్రతోడను (అనఁగా: అందఱి తోడను), వ్యవహరించు చున్నాఁడో, యా సామ్యబుద్ధియే యతని యొక్క యాచరణకు సత్యమయిన బీజము కావున నీయాచరణముచేఁ గాఁబోవు సర్వభూతహిత మా సామ్యబుద్ధియొక్క బాహ్యము నాను షంగిక మయిన పరిణామమే యని సిద్ధ మగును. అట్లే యెవరి యొక్క బుద్ధి పూర్ణమయిన సామ్యావస్థ నొందినదో వారు లోకుల కాధిభౌతికసుఖమును మాత్రమే కలిగించుటకై తమయొక్క సర్వ వ్యవహారములను చేయుట సంభవింపదు. వారు మఱియొకరి కప కారము చేయ రనుమాట సత్యమే; కాని యిది వారికి ముఖ్యమగు ధ్యేయము కానేరదు. ఇఁక నేమన: సమాజమునందున్న మనుష్యుల యొక్క బుద్ధి యంతకంతకు శుద్ధమగుచు రాఁగాఁ దుద కెల్లవారును దమ వలె నాధ్యాత్మిక పూర్ణావస్థ నొంద వలయు నని ప్రయత్నము చేయుచుందురు. మనుజులయొక్క కర్తవ్యములలో శ్రేష్ఠము సాత్త్వి కము నైన కర్తవ్య మిదియే. కేవల మాధిభౌతిక మయిన సుఖవృద్ధి యొక్క ప్రయత్నమును నేను గౌణ మని కాని రాజస మని కాని యెన్నుదును.

కర్మాకర్మ నిర్ణయార్థమై కర్మయొక్క బాహ్యఫలమును లక్ష్య పెట్టక కర్తయొక్క శుద్ధబుద్ధికే ప్రాధాన్య మియ్యవలయునని గీతల యొక్క సిద్ధాంతముపైన ననేకులు "కర్మఫలముల వైపును జూడక యీ రీతిగ కేవలశుద్ధబుద్ధినే విచారింపవలయునని చెప్పితిమేని, శుద్ధ బుద్ధి గలిగిన మనుష్యుఁ డేదైన దుష్కృత్యమును జేసినను తప్పు లేదని సిద్ధ మగుననియు వారికి సర్వదుష్కృత్యములను జేయుటకు స్వాతంత్ర్యము లభించు ననియు తర్కయుక్తమగు నాక్షేపముఁ జేయుదు రనుట నా కల్పన కానేరదు. ఇఁక నేమనఁగా: కొందఱు క్రైస్తవమతబోధకు లీ విధముగ గీతాధర్మములపైఁ జేసిన యాక్షేప మును నేను జూచియున్నాను. * కాని యీ యాక్షేప మన్ని విధము లచే మూర్ఖతామూలముగను దురాగ్రహమూలముగ నున్నదని చెప్పు టకు మాకేమియు తప్పుతోఁపదు. వేయేల? ఆఫ్రికాలోనున్న యొకా నొక నల్లని మూర్ఖుఁడు సంస్కరింపఁబడిన రాష్ట్రములయందున్న నీతి తత్త్వముల నాకర్షించుకొనుట కే రీతి నపాత్రుఁడు నసమర్థుఁడునగునో యటులే యీ క్రైస్తవమతబోధకుల బుద్ధి వైదికధర్మములయందున్న స్థితప్రజ్ఞునియొక్క యాధ్యాత్మికపూర్ణావస్థను దెలిసికొనుట కైనను నర్హమైనదికాదు. ఏలయన: వారు స్వధర్మసంబంధమగు వ్యర్థపు దురా గ్రహము చేతను, తామసము దుష్టమునగు మనోవికారము చేతను, నసమర్థులై యుందురని చెప్పుట కేమియు నభ్యంతరము లేదు. పందొ మ్మిదవ శతాబ్దమునఁ బ్రసిద్ధుఁ డగు కాంటు అను జర్మనుతత్త్వవేత్త కర్మలయొక్క బాహ్యఫలమును లక్ష్యపెట్టక నీతినిర్ణయార్థమై కర్త యొక్క బుద్ధినే విచారింపఁ వలయు నని నీతిశాస్త్రమును గుఱించి

---

* కలకత్తాయందలి యొక క్రైస్తవమతబోధకుఁ డిటు లాక్షేపించినందున వతనికి 'మిత్రుఁడు' అను దొరచే నీయఁబడిన సమాధాన మతని Kurukshetra (కురుక్షేత్ర) అను పేరుగల ముద్రితగ్రంథముయొక్క చివరఁజేర్పఁబడినది. గావున దానిం జూచునది. (Kurukshetra, Vyasashrama, Adyar, Madras, pp. 48—52).

వ్రాసిన తన గ్రంథమున ననేకస్థలములలో వ్రాసెను. * కాని దానిపై నెవరును నిట్టి యాక్షేపమును జేసినవారు నాదృష్టికిఁ గాన్పింపలేదు. ఇఁక నది గీతలయందున్న నీతితత్త్వమునకు మాత్ర మెట్లు సంబంధించును? బుద్ధి సర్వభూతములయందు సమ మగునేని పరోపకారమును చేయుట యనునది దేహస్వభావముగనే మాఱును. మఱియు నమృతమునుండి మృత్యువు వచ్చుట యె ట్లశక్యమో యట్లే యీ పరమజ్ఞానమును బరమశుద్ధబుద్ధియుఁ గలిగిన వానినుండి కుకర్మలు సంఘటిల్లుటయే యశక్య మగును. కర్మలయొక్క బాహ్యఫలములను విచారించుచు నూరకయుండకూడదని గీతచెప్పినప్పుడు దానికి మనసు వచ్చిన యర్థము చేయుమని యుద్దేశముకాదు; ఇంక నేమనఁగ: దంభముచేతఁ గాని, లోభముచేతఁ గాని, పరోపకారమునుజేయు వేషమును వేసికొనవచ్చును గాని, సర్వభూతముల యందు నొక యాత్మయే యున్నదని తెలిసికొనుటచే బుద్ధియందుఁ గలుగఁబోవు స్థైర్యమును సమతయును కలిగినట్లు వేషము వేయుటకు వీలులేదు. కావున, నీ కృత్యముయొక్కయు యోగ్యతాయోగ్యతలను విచారించునప్పుడు కర్మలయొక్క బాహ్యపరిణామముకంటె కర్తయొక్క బుద్ధినే బాగుగ విచారింపవలయునని గీత చెప్పుచున్నది. సంక్షేపముగఁ జెప్పవలసెనేని, నీతిమత్త యనునది కేవలము జడమైన కర్మయందు లేనేలేదు. అది యన్ని విధములచేఁ గర్తయొక్క బుద్ధి నవలంబించి యున్నదని

* "The Second proposition is: That an action done from duty derives its moral worth, *not from the purpose* which is to be attained by it, but from the maxim by which it is determined.".. The moral worth of an action "cannot lie anywhere but in the *principle* of the wlll, without regard to the ends which can be attained by action." Kant's *Metaphysics of Morals* (trans. by Abbott in Kant's *Theory of Ethics*, p. 16. The italics are author's and not our own). And again "When the question is of moral worth, it is not with the actions which we see that we are concerned, but with those inward principles of them which we do not see." p. 24..Ibid.

గీతయొక్క సిద్ధాంతము; కాని యీ యాధ్యాత్మిక సిద్ధాంతమునం దున్న సత్యమైనతత్త్వమును దెలిసికొనక యెవరికిఁ దోఁచినది వారు చేసిన యెడల వారు రాక్షసులు, లేక, తామసులు నని గీతలలోనె చెప్పఁబడినది (గీ. 18.25). ఒకపరి బుద్ధి సమ మగునేని, వానికి కర్తవ్యాకర్తవ్య విషయమై విశేషముగ నుపదేశింప నక్కఱ లే దను నీ తత్త్వము నెఱింగియే తుకోబాగారు శివాజీమహారాజుగారికి—

కల్యాణకారక అర్థ యాచా ఏక, సర్వాఁభూతీఁఏక ఆత్మా.

— సర్వభూతములయందు నొక యాత్మయే కలదని తెలిసికొనుటయే దీనికి శ్రేయస్కర మగు విషయము అని భగవద్గీతానుసారముగ కర్మయోగ మను నొక తత్త్వమునే యుపదేశించిరి (తు. గా. 4428. 9). కాని పూర్ణమైన సామ్యబుద్ధియే సదాచరణమునకు బీజమైనను, కర్మలను జేయువాఁడు బుద్ధి యీ విధముగ పూర్ణమును, శుద్ధమును నగు పర్యంతము నేమియుఁ జేయక యూరకుండవలయు నవి దీనినుండి ననుమితి చేయకూడదని యిచ్చో నింకొకపరి చెప్పవలయును. "స్థితప్రజ్ఞునివలె బుద్ధిని శుద్ధముచేయుట యనునది పరమధ్యేయము; కాని యిది పరమధ్యేయ మని యెన్ని యదియంతయు సిద్ధమగువఱకును నేమియుఁ జేయకుండ నుండక ప్రతి మనుజుఁడును శక్యమైనంతమాత్రమే నిష్కామబుద్ధితోఁ దన కర్మలను జేయుచుండె నేని వాని చేతనే బుద్ధి యంతకంతకు శుద్ధమై తుదకు పూర్ణమగు సిద్ధి ప్రాప్తించును. పూర్ణమగు సిద్ధి లభించినను కర్మలను జేయనని యాగ్రహము పెట్టుకొని కాలమును వ్యర్థముగఁ గడుపరాదు అనునది" మొదలుగాఁ గల యుపదేశములు గీతలయొక్క యారంభముననే చేయఁబడినవి (గీ. 2.40).

'సర్వభూతహితము', లేక, 'అనేకుల కధిక సుఖము' అను నీతితత్త్వము బాహ్యమైన కర్మకు మాత్రమే సంబంధించినందున, కొనాకులు మేయు నదియు (పైన నుండునదియు) నల్పమును నై

యున్నది. కాన 'సర్వభూతములయం దొకటే యాత్మ' యను స్థిత ప్రజ్ఞునియొక్క సామ్యబుద్ధి మూలగ్రాహిణి యగుటచే, నదియే నీతి నిర్ణయము విషయమున శ్రేష్ఠ మని యంగీకరింపవలయు నని యీ రీతిగ సిద్ధమైనను, దానిచేత వ్యవహారమందు వర్తించుటకు సరియైన యుపపత్తి కుదురదని దీనిపై ననేకు లాక్షేపణఁ జేయుచున్నారు; కాని యీ యాక్షేపణము, తఱచుగ సన్న్యాసమార్గీయులైన స్థితప్రజ్ఞుల యొక్క జగత్తునందున్న వ్యవహారమును జూడఁగా దోఁచియుండును; కాని స్థితప్రజ్ఞుడైన కర్మయోగియొక్క వర్తనకు నది సంబంధింపదని కొంచెము విచారించిన నెవరికైన సహజముగఁ దోపఁక మానదు. వేయేల? సర్వభూతములయందును నొక యాత్మయే కలదని కాని, యాత్మౌపమ్యబుద్ధి యని కాని చెప్పఁబడు నీ తత్త్వములచే వ్యావహారిక నీతితత్త్వముల కెట్లుపపత్తి కుదురునో యట్లు మఱి యే తత్త్వముచేతనైనను కుదురదని చెప్పినను చెప్పవచ్చును. సర్వదేశముల యందును, నీతిశాస్త్రముల యన్నింటి యందును, ప్రధాన మని చెప్పఁబడిన పరోపకారధర్మము నుదాహరణముగ తీసికొనుము. ఇతరుల యందుండు నాత్మయే నా యందును గలదను నీ యధ్యాత్మ తత్త్వముచే నీ ధర్మమున కుపపత్తి కుదురునట్లే యాధిభౌతికవాదము చేతను గుదురదు. ఆధిభౌతికశాస్త్రజ్ఞు లీ విషయమునఁ దమ శక్తినంతయు వినియోగపఱచినను పరోపకారబుద్ధి యనునది యొక సహజ గుణ మనియు నది యుత్క్రాంతివాదమునఁ జెప్పిన ట్లంతకంతకు వృద్ధిఁ బొందుననియు మాత్రమే చెప్పుదురు. అంతమాత్రముచే పరోపకారమునకు నిత్యత్వము సిద్ధింపకపోవుటయే కాక స్వార్థపరార్థముల నడుమ వివాదము వెలువడినప్పు డీ రెండు పక్షములను నెరవేర్చుకొను తలంపు గల రెండావుల దూఁడ యగు 'చతురస్వార్థికి' దీనిమూలమున తన పక్షమును సాధించుకొనుట కవకాశము సైతము సిద్ధించునని వెనుక నాలుగవ ప్రకరణమునఁ జూపియే యున్నాను; కాని యీ విషయము ననేకులు "పరోపకారబుద్ధికి నిత్యత్వము సిద్ధమైనను నేమి ప్రయోజ

న్నము? సర్వభూతములయందు నొక యాత్మయే కలదని యెన్నుకొని ప్రతి మనుజుఁడు నెల్లప్పుడును సర్వభూతహితముచే చేయనారంభించు నేని వానికి స్వీయకార్యనిర్వాహ మెట్లు కాఁగలదు? మఱియు నిట్లు యోగక్షేమములే నడవనియెడల వాఁడు లోకులకు కల్యాణమెట్లు చేయఁగలడు?" అని శంకలఁ జేయుదురు; కాని యీ శంక లపరిహార్యములు గాని క్రొత్తవి గాని కావు. "తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్" (గీ. 9. 22) అని యిట్లు భక్తిమార్గ దృష్టిచే భగవంతుఁడు గీతలయందే యీ ప్రశ్నమునకు నుత్తర మిచ్చెను. "మఱియు నధ్యాత్మశాస్త్రము నందున్న యుక్తివాదముచే సైతము నదియే నిష్పన్న మగును. లోకులకుఁ గల్యాణ మొనర్చుటకును బుద్ధిగలవారు భోజనాదికమును సైతము వదలవలయునని దీని తాత్పర్యము కానేరదు. ఇఁక నేమన: తనయొక్క దేహధారణమును లోకోపకారమునకై చేయుచున్నాఁడని యతనికి బుద్ధి పుట్టవలయును ఇట్లు బుద్ధి పుట్టినపుడే యింద్రియములు స్వాధీనముగ నుండుటచే లోకకల్యాణ మగును" అని జనకునిచేఁ జెప్పఁబడినది (మ.భా.అశ్వ. 32). మఱియు నీకారణముననే యజ్ఞము నొనర్చి యవశిష్టాన్నము గ్రహించువారు 'అమృతాశు' లని చెప్పవలయునని మీమాంసక సిద్ధాంతమని గీతలలోఁ జెప్పఁబడినది (గీ. 4.31). కారణ మేమియన: వారిదృష్టిచే యజ్ఞ మనునది జగత్తుయొక్క ధారణపోషణల నిమిత్తమగు కర్మయే కావున లోకకల్యాణకరమగు నీ కర్మను జేయునప్పడతని యుద్దేశము నిర్వాహమగు ననియు, నట్టి నిర్వాహమును జేయవలయు ననియు స్వార్థముకొఱకు యజ్ఞరూపమగు క్రమమును జెడఁగొట్టుట మంచిదికాదనియు వారిచే సిద్ధాంతీకరింపఁబడిన వ్యావహారిక దృష్టితోఁ జూచినను—

**తో పరోపకార కరితచి గేలా, పాహిజే తో క్యాలా త్యాలా,**
**మగ కాయ ఉణే తయాలా, భూమండళీ.**

అని దాసబోధయందు (19. 4. 10) సమర్థులవారు సెప్పినది యథార్థముగనే యున్నదని యనుభవమునకు వచ్చును. సారాంశ మేమన: లోకకల్యాణార్థమై ప్రయత్నించు వారియొక్క యోగక్షేమము లాటంకపఱుపఁబడుట యీ జగత్తున నెప్పుడును గనుపడదు. పరార్థమును జేయుటకు మాత్ర మతఁడు నిష్కామబుద్ధితో సిద్ధముగ నుండవలయును. లోకు లందఱు తనయందును, తాను సర్వలోకములయందు నున్నటులు భావన యొకపరి దృఢమైన పిదప స్వార్థము పరార్థముకంటె భిన్నమగునా? కానేరదా? యను ప్రశ్న వేయ నవకాశము లేదు. "నేను వేఱు, లోకులు వేఱు" అను నీ యాధిభౌతిక ద్వైతబుద్ధిచే "అనేకుల కధిక (పుష్కల) సౌఖ్యమును" జేయుటకు ప్రయత్నించు వాని మనస్సునందు పైనఁ జెప్పఁబడిన భ్రామకములగు శంకలు గల్గుచున్నవి. కాని, 'సర్వం ఖల్విదం బ్రహ్మ' యను నద్వైతబుద్ధితోఁ బరోపకారమును జేయుటకుఁ బ్రవృత్తులైనవారి కీ శంకయే యుండనేరదు. సర్వభూతాత్మైక్యబుద్ధిచే నిష్పన్నమగు సర్వభూతహితముయొక్క యీ యాధ్యాత్మికతత్త్వమును, మఱియు స్వార్థపరార్థములను ద్వైతముయొక్క (అనఁగా: అనేకులకుఁ గలుగు సుఖముయొక్క తారతమ్యముచే వెలువడు లోకకల్యాణముయొక్క) యాధిభౌతికతత్త్వమును నను నీ రెంటి నడుమ నున్న భేదమును దెలిసికొనవలసి యున్నది. లోకకల్యాణమును చేయవలయునని మనస్సులో నుంచుకొని సాధువులు లోకకల్యాణమును జేయరు. ప్రకాశము నిచ్చుట సూర్యున కెట్లు సహజమై యున్నదో సర్వభూతాత్మైక్యరూపమగు బ్రహ్మజ్ఞానముచే మనస్సున పూర్ణమగు జ్ఞానము పరిణమించినందున, లోకకల్యాణమును జేయుటయే యీ సాధువులకు దేహస్వభావమై పోవును. మఱియు దేహస్వభావ మీ రీతిగ పరిణమించె నేని సూర్యుఁ డితర పదార్థములను బ్రకాశింపఁజేయుచునే స్వయముగఁ బ్రకాశించునటులు సాధువులయొక్క పరార్థమగు నుద్యోగముచేతనే వారికిని యోగక్షేమములు స్వయముగ సిద్ధము

లగును. పరోపకార మొనర్చుట యను దేహస్వభావము, అనాసక్త బుద్ధియు నను నీ రెండింటికి జత కలిసిన పిదప నెన్ని సంకటములు వచ్చినను, సరకు సేయక సహించుట యుక్తమా? లేక, లోక కల్యాణమును వదలుట యుక్తమా? యను రెండింటియొక్క తాత్పర్యమును బరిశీలింపక, బ్రహ్మాత్మైక్యబుద్ధితో సాధువులు తమ యుద్యోగమును మానకయే యుందురు. మఱియు సమయము వచ్చెనేని దేహమును వదలుటకు సైతము వెనుదీయరు; కాని స్వార్థపరార్థములను భిన్నములుగ నెన్ని, వానిని తక్కెడలోఁ బెట్టి పిదప ము ల్లె మూలకు వంగునో చూచి, ధర్మాధర్మములను నిర్ణయించుటను నేర్చుకొనిన వారికి తీవ్రమైన లోకకల్యాణేచ్ఛ పుట్టుట కెప్పుడును వీలు లేదు. కావున సర్వభూతహితముయొక్క తత్త్వము భగవద్గీతకు సమ్మతమైనను, దీనికి నుపపత్తి యనేకులకుఁ గలుగు నధిక బాహ్యసుఖముయొక్క తారతమ్యముచేత యోచించుచు కూర్చుండక, జను లనేకులున్నను, లేక, తక్కువయున్నను, వారికి సుఖ మధికమగునా? తక్కువ యగునా? యను విచారము సైతము నాగంతుకము కావుననే కృపణ మని నిశ్చయించి, శుద్ధమైన వ్యవహారమునకు బీజమైన సామ్యబుద్ధికిఁ గల యుపపత్తి యధ్యాత్మశాస్త్రమునందున్న నిత్యమగు బ్రహ్మజ్ఞానముయొక్క యాధారముచే గీతలయందుఁ జెప్పఁబడినది.

సర్వభూతహితార్థమై ప్రయత్నించుట, లేక, లోకకల్యాణ మొనర్చుట, లేక, పరోపకారమును చేయుట, యను వీని కధ్యాత్మ దృష్టిచే నయుక్తిక మగు నుపపత్తి యెట్లు సంబంధించునో దీనిపలనఁ దెలియును. ఇప్పుడు సమాజమునందున్న యొకఁ డితరులతో నెట్లు సంచరింపవలయు నను విషయమై సామ్యబుద్ధియొక్క దృష్టిచే మన శాస్త్రములయందుఁ జెప్పఁబడిన ముఖ్యనియమములను విచారించెదము. "యత్ర వా అస్య సర్వ మాత్మై వాభూత్" (బృ. 2.4.14) — ఎవరికి సర్వము నాత్మమయ మైనదో, వారు సామ్యబుద్ధితోడనే

యెల్లవారితో వ్యవహరించుచున్నారని బృహదారణ్యక, ఈశావాస్య (ఈశ. 6), కైవల్యో (కై. 1. 10)పనిషత్తుల యందును, మనుస్మృతి యందును (మను. 12. 91; మఱియు 12.) చెప్పఁబడియున్నది. మఱియు నీ తత్త్వమే "సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని" అని గీతలయొక్క యాఱవయధ్యాయమున (గీ. 6.29) నక్షరములనైన మార్పక యుల్లేఖింపఁబడినది. సర్వభూతాత్మైక్యము యొక్క, లేక, సామ్యబుద్ధియొక్క తత్త్వమునకీ యాత్మౌపమ్యదృష్టి యనునది రూపాంతము. కారణ మేమి యన: సర్వభూతముల యందు నేనును, నా యందు సర్వభూతములు నున్నయెడల నేను నాతో వ్యవహరించుకొనునటులే యితరభూతములతో వ్యవహరించు కొనవలయునని దానివలన సహజమైన యనుమితి వెలువడును. కావుననే "ఆత్మౌపమ్య దృష్టితోడను సమత్వముతోడను నెల్లరతో వ్యవహరించువాఁడే యుత్తముఁడును, కర్మయోగియు, స్థితప్రజ్ఞుఁడు ననవలయును" అని చెప్పి యర్జున సట్లు నడువవలయు నని భగ వంతుఁ డనంతర ముపదేశించెను (గీ. 6. 30-32) అర్జునుఁ డధికారి యగుటచే నీ తత్త్వమును విశేషముగ గీతలలో వర్ణించుట కావశ్య కత లేకయుండెను; కాని సామాన్యజనులకు నీతియొక్కయు, ధర్మ ముయొక్కయు బోధను గలుగఁ జేయు నిమిత్తమయి రచియింపఁ బడిన మహాభారతమునం దనేక స్థలములయం దీ తత్త్వమును జెప్పి (మ.భా.శాం. 238. 21; 261. 33), వ్యాసులవారు దానియందున్న రహస్యమును, వ్యాపకమైన యర్థమును స్పష్టముఁ జేసిరి. ఉదాహర ణము-ఉపనిషత్తుల యందును, గీతలయందును సంక్షేపముగఁ జెప్పఁ బడిన యాత్మౌపమ్యము యొక్క యీ తత్త్వమే-

> ఆత్మోపమస్తు భూతేషు యో వై భవతి పూరుషః,
> న్యస్తదండో జితక్రోధః స ప్రేత్య సుఖ మేధతే.
>
> మ. భా. అను. 113.6

—ఏ పురుషుఁడు పరులను సైతము తనవలె నెన్నునో, యెవఁడు క్రోధమును జయించినాఁడో, వాఁడు పరలోకమునందు సుఖము నొందును అని మొదట చెప్పి యొకఁడితరులతో నెట్లు వ్యవహరింపవలసినదియు చెప్పుట యిక్కడనే సమాప్తి కామిచే పిదప—

న తత్పరస్య సందధ్యాత్ ప్రతికూలం యదాత్మనః,
ఏష సంక్షేపతో ధర్మః కామా దన్యః ప్రవర్తతే.
మ. భా. అను. 113.8

— తన కేది ప్రతికూలమని (అనఁగా: దుఃఖకారకమని) తోఁచునో దానిని లోకులయందు ప్రవర్తింపఁ జేయకూడదు. ఇదియె సర్వ ధర్మములకును నితులకును సారము. మిగిలిన సర్వవ్యవహారములును లోభమూలకములుగనే యున్నవి అని చెప్పి తుదకు—

ప్రత్యాఖ్యానే చ దానే చ సుఖదుఃఖే ప్రియాప్రియే,
ఆత్మౌపమ్యేన పురుషః ప్రమాణ మధిగచ్ఛతి.
యథా పరః ప్రక్రమతే పరేషు తథా పరే ప్రక్రమన్తేఽ
పరస్మిన్,
తథైవ తేషూపమా జీవలోకే యథా ధర్మో నిపుణే నోపదిష్టః.
మ.భా.అను. 113.9, 10.

— సుఖము, దుఃఖము, ప్రియము నప్రియము, దానము నిషేధము నను నీ సర్వవిషయములయందు ప్రతిమనుజుఁడును దనకేది యిష్టమగునో దానిని జూచి యితరుల విషయమునను నిది యిటులే యనుకొనవలయును. తా మేతీరున నితరులతో వ్యవహరించుచున్నారో యా తీరుననే యితరులును తమతో వ్యవహరించెదరు కావున దానినే యుపమానముగ నుంచుకొని యీ జగత్తున నాత్మౌపమ్యముచే వ్యవహరించుట యనునదియే బుద్ధిమంతులు ధర్మమని చెప్పి యున్నారు అని బృహస్పతి యుధిష్ఠిరునకుఁ జెప్పెను. "న తత్పరస్య

నందధ్యా త్ప్రతికూలం యదాత్మనః” అను నీ శ్లోకము విదురనీతి యందుఁ గూడఁ జెప్పఁబడినది (ఉద్యో. 38. 72); మఱియు శాంతి పర్వమునందు (శాం. 167.9). మరల విదురుఁ డీ తత్త్వమునే యుధిష్ఠిరునకుఁ జెప్పెను; కాని లోకుల కిది దుఃఖము నిచ్చునది కాదు. కారణ మేమియన: నీకు నేవి దుఃఖకారకము లగుచున్నవో లోకుల కవి దుఃఖకారకము లగు ననునది యీ యాత్మౌపమ్యనియమములో నొకభాగము; నీకేది సుఖకారక మని తోఁచునో యదియె లోకులకును సుఖకారక మగును. కావున లోకులకు సుఖకారకమగు విధమున వర్తిల్లుమని దానినుండి నిశ్చయాత్మకమయిన యనుమానము వెలువడదని యెవరికి నెప్పటికిని దీర్ఘ శంక గలుగకపోదు. కావున భీష్ముఁడు యుధిష్ఠిరునకు ధర్మలక్షణములను జెప్పుచు నింతకంటె బాగుగ వివరించెను.

**యదన్యై ర్విహితం నేచ్ఛే దాత్మనః కర్మ పూరుషః,**
**న తత్పరేషు కుర్వీత జాన న్నప్రియ మాత్మనః.**
**జీవితుం యః స్వయం చేచ్ఛేత్ కథంసోఽన్యం ప్రఘాతయేత్,**
**యద్యదాత్మని చేచ్ఛేత తత్పరస్యాపి చింతయేత్.**

శాం. 258.19.21.

— మనవలె నితరులు చేయకూడదని మన మెన్నునటులె, అనఁగా: మనయొక్క మనస్సును దెలిసికొని, మనము లోకులవలెఁ జేయకూడదు. తాను జీవింపవలయునని యెన్నువాఁ డితరుల నెట్లు చంపును? ఏవేవి తనకుఁ గావలయునో యవి యన్నియుఁ బరులకు గావలయునని యెన్నుకొనవలయును అని యీ నియమముయొక్క రెండు భాగములును స్పష్టముగ నుల్లేఖింపఁబడినవి. మఱియొక స్థలమునం దీ నియమములనే చెప్పుచు ‘అనుకూలము’, లేక, ‘ప్రతికూలము’ అను విశేషణముల యోచింపక యెట్టి యాచరణమును దీసికొన్నను సరిపోవునట్లు—

**తస్మా ద్ధర్మప్రధానేన భవితవ్యం యతాత్మనా,**
**తథా చ సర్వభూతేషు వర్తితవ్యం యథాత్మని.**

**శాం. 167.9.**

— ఇంద్రియముల నిగ్రహించి ధర్మానుసారముగ నుండవలయును; మఱియును దనయందువలెనే సర్వభూతములయందును బ్రవర్తింప వలయును అని విదురుఁడు చెప్పెను. కారణ మే మన: శుకాను ప్రశ్నలో వ్యాసులు

**యావా నాత్మని వేదాత్మా తావా నాత్మా పరాత్మని,**
**య ఏవం సతతం వేద సోఽమృతత్వాయ కల్పతే.**

**మ.భా.శాం. 238.22.**

— తనయొక్క శరీరమునం దెంత యాత్మ యున్నదో యంత యాత్మయే యితరుని శరీరమందును కలదు. దీని నెవ్వ డెవఁడు తెలిసికొనుచున్నాఁడో వాఁడె యమృతత్వమును (మోక్షమును) నొందుటకు సమర్థుఁ డగును అని చెప్పిరి. బుద్ధుఁ డాత్మ యున్నదని యొప్పుకొనువాఁడు కాఁడు. ఎప్పటికి నాత్మవిచార మను వ్యర్థమైన యల్లరిలో పడకూడదని యాతఁడు స్పష్టముగ వక్కాణించెను. అయినను బౌద్ధభిక్షువు లితరులతో నెటులు వర్తింపవలసినదియు చెప్పుచు—

**యథా అహం తథా ఏతే యథా ఏతే తథా అహం,**
**అత్తానం (ఆత్మానం) ఉపమం కత్వా (కృత్వా) నహనే**
**య్యనఘాతయే.**

— నే నెట్లో అటులే వీరును, వీ రెటులో యటులే నేనును అని తన్నుపమానముగ తెలిసికొని (ఎవ్వరిని) చంపను కూడదు. చంపింపను సైతము రాదు అని యాత్మౌపమ్యదృష్టి నుపదేశించెను (సుత్తనిపాతము నాలకసుత్త. 27. చూడు). 'ధమ్మపద' అను పేరు గల మఱి

యొక పాలీబౌద్ధగ్రంథమునందును (ధమ్మపద. 129; మఱియు 130) పై శ్లోకముయొక్క రెండవ చరణము రెండుసారు లక్షరపు మార్పు సైతము లేక చెప్పఁబడియున్నది. మఱియు పిదప మనుస్మృతి(5.45) మహాభారత (అను.113-5) ములను నీ రెండు గ్రంథములయందును స్పష్టముగ గన్పట్టుచున్నశ్లోకము లీక్రిందఁ జెప్పఁబడినరీతిగ పాలీ భాషయం దనువదింపఁబడినవి.

సుఖకామాని భూతాని యో దండేన విహింసతి,
అత్తనో సుఖమేసానో (ఇచ్ఛన్) పేచ్యనో న లభతే సుఖం.

ఎవఁడు తన వలెనే సుఖముఁ గోరు మఱియొక ప్రాణిని తన యొక్క (అత్తనో) సుఖార్థమై దండముచే హింసించునో వానికి చచ్చినపిదప (పేచ్య=ప్రేత్య) సుఖము లభింపదు (ధమ్మపద. 131). ఆత్మయొక్క యస్తిత్వము మాన్యముకాక పోయినను ఆత్మౌపమ్య మను నీ పదము బౌద్ధగ్రంథములలోఁ గాన్పించుచున్నందున బౌద్ధ గ్రంథకారు లీ విచారమును వైదికగ్రంథముల యందుండియే గైకొని రని స్పష్ట మగును; కాని దీని విషయమై విశేషవిచారము పిదపఁ జేయుదము. "సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని" అనునటు లెవరిస్థితి యున్నదో వా రితరులలో వర్తించునపుడు ఆత్మౌ పమ్యబుద్ధితోడనే యెప్పుడును బ్రవర్తించుచున్నా రనియు, నిదియే యా వ్యవహారమునకు ముఖ్యమగు నైతికతత్త్వ మనియు, మేము చిరకాలము నుండి యెఱింగియున్నా మనియు, పైవచనములవలన స్పష్టముగనే కాన్పించును. సమాజమునం దొక మనుష్యుఁడు మఱి యొకనితో నెటుల వర్తింపవలయునో నిర్ణయించుటకు నాత్మౌపమ్య బుద్ధియొక్క యీ సూత్రము "అనేకుల కధికహిత" మను నీ యాధి భౌతికతత్త్వముకంటె, ముఖ్యము, నిర్దోషము, నిస్సందేహము, వ్యాప్తము, నల్పాక్షరములు గలదియు నజ్ఞానులకు సైతము వేగ

ముగఁ దెలియునది యనియు నెవ రనరు?* ధర్మాధర్మశాస్త్రముల యొక్క రహస్యము (ఏష సంక్షేపతో ధర్మః), లేక, మూలతత్త్వ మనువాని కధ్యాత్మదృష్టిచే నుపపత్తి కుదిరినట్లు కర్మయొక్క బాహ్యపరిణామమును మాత్రమునే పరీక్షించు నాధిభౌతికుల వాదముచే కుదురదు; కావుననే ధర్మాధర్మశాస్త్రములయందున్న యీ ప్రధాననియమములకు కర్మయోగముయొక్క యాధిభౌతిక దృష్టిచే విచారించు పాశ్చాత్యపండితులయొక్క గ్రంథములలో ప్రముఖస్థానము తఱచుగ నీయఁబడినది. వేయేల? ఆత్మౌపమ్యదృష్టి యొక్క సూత్రము నొకమూల నుంచి, సమాజబంధనమునకు నుప పత్తి "అనేకుల కధికసుఖము" మొదలగు కేవల దృశ్యతత్త్వముచేతనే చెప్పుద మని వారు ప్రయత్నించుచుందురు; కాని యుపనిషత్తుల యందును, మనుస్మృతియందును, గీతలయందును, మహాభారతము యొక్క యితరప్రకరణములయందును, బౌద్ధధర్మములయందును, నితరదేశము లందును, నితర ధర్మములందును ఆత్మౌపమ్య మను నీ సులభమైన నీతితత్త్వమునకే యగ్రస్థాన మీయఁబడినదని స్పష్టమగుచున్నది. యాహూదులయొక్కయు (Jews) క్రైస్తవుల యొక్కయు ధర్మగ్రంథములయందున్న "నీవు నీ యిరుగు పొరుగు వాండ్రను నీవలెనే ప్రేమించుము" (లెవ్వి. 19.15; మాత్థ్యూ 22.39) అను నాజ్ఞయు నీ నియమములయొక్క రూపాంతరమే యై యున్నది. క్రైస్తవులు దీనిని సువర్ణసూత్రమని (అనఁగా: బంగారువంటి మూల్యము గలిగిన నియమ మని) చెప్పుచున్నారు; కాని యాత్మైక్య

---

* అల్పాక్షర మసందిగ్ధం సారవ ద్విశ్వతోముఖం, అస్తోభ మనవద్యం చ సూత్రం సూత్రవిదో విదుః" అని సూత్రశబ్దమునకు వ్యాఖ్యానముఁ జేయు చుందురు. గానముయొక్క సౌకర్యమునకై కొన్నిమంత్రములయందుఁ బ్రయోగింపఁబడు నిరర్థకములగు నక్షరములను స్తోభ లందురు. సూత్రములయం దిట్టి నిరర్థకములగు నక్షరము లుండవు. కావున నీలక్షణమున నస్తోభ మనువిశేషణము వేయఁబడినది.

మునకు నుపపత్తి వారి గ్రంథములలో లేదు. "లోకులు తన విషయమున నెట్లు ప్రవర్తింపవలయునని తనకు తోఁచునో అట్లే తాను వారి విషయమునఁ బ్రవర్తింపవలయును" (మ. 7. 21. ల్యూ. 6.31) అను నీ క్రీస్తుయొక్క యుపదేశమును ఆత్మౌపమ్యసూత్రమున నొకభాగమే. గ్రీసుదేశపు తత్త్వజ్ఞుఁడగు అరిస్టాటిల్‌యొక్క గ్రంథమున నొకరితో నొకరికిఁ గల వ్యవహారమునకు సంబంధించిన, యీ తత్త్వమే యక్షరమార్పు సైతము లేక చెప్పఁబడినది. అరిస్టాటిల్ క్రీస్తుపూర్వము సుమారు మూఁడువందల సంవత్సరముల కాలమున నుండినవాఁడు; కాని యరిస్టాటిల్‌నకు పూర్వము సుమారు రెండువందలసంవత్సరముల కాలము నందుండిన చీనాతత్త్వజ్ఞానియగు ఖూ-ఫూ-త్సే (ఆంగ్లేయ భాషలో నీ పేరున కపభ్రంశరూపము కాన్‌ఫ్యూషియస్) అనువానిచేత నాత్మౌపమ్యదృష్టియొక్క పైన చెప్పఁబడిన నియమములు చైనాభాషయొక్క సరణినింబట్టి యొక శబ్దములోనే చెప్పఁబడినవి! కాని మన దేశమునం దీ తత్త్వము కాన్‌ఫ్యూషియస్‌కంటె బహుపూర్వమున నుపనిషత్తులలోను (ఈశ. 6; కేన. 13), భారతమునందును, గీతలయందును," ఆత్మవత్ పరా వేఁతేఁ మానీతజాతేఁ" అని (దాస. 12.10.22) మహారాష్ట్రదేశమందలి సత్పురుషమండలులలోను చెప్పఁబడినది. తన దృష్టాంతముంబట్టి జగత్తునెఱుంగవలయునని చెప్పుటయు ప్రచారములో నున్నది. ఇంతియ కాక దాని కాధ్యాత్మికోపపత్తియు మన ప్రాచీనులగు శాస్త్రకారులచేఁ జెప్పఁబడినది. వైదికేతరధర్మములయందు నీతిధర్మములయొక్క యీ సర్వమాన్యసూత్రము వ్రాయఁబడినను దానికి నుపపత్తి చెప్పఁబడలేదు. మఱియు బ్రహ్మాత్మైక్యరూపమగు నధ్యాత్మజ్ఞానముచేఁగాక, మఱి దేనిచేతను నీ సూత్రమునకుఁ దగిన యుపపత్తి దొరకదని గుర్తుంచుకొనినయెడల గీతలయందున్న యాధ్యాత్మికమయిన నీతిశాస్త్రముయొక్క గాని, కర్మయోగముయొక్క గాని మహత్త్వము వ్యక్త మగును.

సమాజమువందు మనుష్యు లొకరితో నొకరెట్లు వ్యవహరింప వలయు నను విషయములో "ఆత్మౌపమ్య" బుద్ధియొక్క సులభమగు నీ నియమ మింత వ్యాపకమును, సుబోధకముగను, అన్నివైపుల వ్యాపకమును జెందినదియుగా నున్నదా? లేదా? యని విచారించి సర్వభూతములయందు నుండు నాత్మైక్యము నెఱింగి "(ఆత్మవత్) సమబుద్ధిచే నితరులతో వ్యవహరించుచుండుము" అని యొకపరి నిర్బంధించిన పిదప, లోకులపై దయయుంచుము; వారికి యథా శక్తిగ సాయముఁ జేయుము; వారికి కల్యాణ మొనర్పుము: వారికి నభ్యుదయ మార్గమును జూపుము; వారిని ప్రేమించుము; వారికి అసహ్యము గలుగున ట్లొనర్పకుము; వారిని దుఃఖపెట్టకుము; వారితో న్యాయముగను సమతగను వర్తించుము: ఎవ్వరిని నిర్బంధింపకుము; ఎవ్వరి ద్రవ్యము నపహరింపకుము; ఎవ్వరిని హింసింపకుము; వారితో నసహ్యముగ మాటలాడకుము; అనేకుల కధిక కల్యాణము చేయవలయునను బుద్ధిని నిత్యమును మనస్సున నుంచు కొనుము; ఎల్లవారు నొక పితాపుత్రులమే యని వారి విషయమున బంధుప్రేమతో వ్యవహరించుము అను మొదలగు నుపదేశములను వేర్వేఱుగఁ జేయనక్కఱలేదు. ఎవరికైనను దమ సుఖదుఃఖములు, లేక, కల్యాణము దేనియం దున్నదియు సహజముగనే తెలియును. మఱియు, సంసారమున సంచరించుచు "ఆత్మా వై పుత్రనామాసి" యని కాని "అర్ధం భార్యా శరీరస్య" యని కాని యెన్నుకొని త న్ననుసరించియే తన స్త్రీపుత్రులను ప్రేమింపవలయు నను విషయము యొక్క యనుభవము కుటుంబవ్యవస్థచే నతనికి ప్రాప్తమగుచున్నది. కాని కుటుంబ మనునది యీ "ఆత్మౌపమ్యబుద్ధి" యను పాఠము నభ్యసించుటకు మొదటి సాధన మగును. దీని యందె సర్వదా లంపటుఁడై యుండక కుటుంబము తర్వాత మిత్రులు, ఆప్తులు, గోత్రజులు, గ్రామస్థులు, జాతిబంధువులు, ధర్మబంధువులు మఱియుఁ

దుద తెల్ల మనుష్యులు అన్ని భూతములు, అని యీ తీరున ప్రతి మనుజుఁడు ఆత్మౌపమ్యబుద్ధిని విస్తారము వ్యాపకముఁ జేసి తనయందే యాత్మ గలదో, యదే సర్వభూతముల యందున్నది యని తెలిసికొనుటయుఁ దుద కా తీరున వర్తించుటయు ననునది, జ్ఞానమునకును, ఆశ్రమవ్యవస్థకును పరమావధియైన (లేక, మనుష్యమాత్రులకు సాధ్యమైన) సీమయగునని యాత్మౌపమ్యబుద్ధిరూపమైన సూత్రమునకుఁ దుదిదియు వ్యాపకమునగు నర్థము. మఱియు నీ పరమావధియొక్క స్థితిని పొందు యోగ్యత, యే యజ్ఞదానాది కర్మలచేత వృద్ధిఁ జెందుచున్నదో యా కర్మలన్నియు, చిత్తశుద్ధికారకములును, కావుననే గృహస్థాశ్రమమునఁ గర్తవ్యములునని మొత్తముపైన సిద్ధమగును. కారణ మేమియన: చిత్తశుద్ధి యనుదానికి నిజమగు నర్థము స్వార్థబుద్ధిని వదలి బ్రహ్మాత్మైక్యమును తెలిసికొనుటయే. కావుననే గృహస్థాశ్రమమునందలి కర్మలను స్మృతికారులు విధించినారని పూర్వముననే వచింపఁబడినది. యాజ్ఞవల్క్యులు మైత్రేయికిఁ జేసిన "ఆత్మా వా అరే ద్రష్టవ్యః" మొదలగు నుపదేశములయం దీ రహస్యమే యున్నది. "ఆత్మా వై పుత్ర నామాసి" అని యాత్మయొక్క వ్యాప్తికి సంకోచమును గలుగఁ జేయక, "లోకో వై అయమాత్మా" అని దాని స్వభావముగ నుండు వ్యాప్తిని తెలిసికొని, "ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్"— గొప్పవారికి పృథ్వియే కుటుంబము అను నీ జ్ఞానము చేత ప్రతి మనుజుఁడు తన వ్యవహారములను జేయుచుండ వలయునని యధ్యాత్మజ్ఞాన మను పునాదిపైఁ గట్టఁబడిన కర్మయోగశాస్త్రమను మందిర మెల్లవారికిఁ జెప్పుచున్నది. మఱియు నీ విషయమున మన కర్మయోగశాస్త్ర మితర దేశములయందలి ప్రాచీనము నర్వాచీనమునగు నే కర్మయోగశాస్త్రమునకును నోడిపోక యుండుటయే కాక, యిది యన్నింటిని లోఁబఱచుకొనుటచే పరమేశ్వరునివలె పదియంగుళము లన్నింటికంటె మిగిలియుండునని నాయొక్క నిశ్చయము.

కాని, యాత్మౌపమ్యభావముచే "వసుధైవ కుటుంబకమ్" అను వేదాంతసంబంధమైనదియు, వ్యాపకమైనదియు నగు దృష్టి గలిగిన పిదప దేశాభిమానము, కులాభిమానము, ధర్మాభిమానము మొదలగు నే సద్గుణములచే కొన్నికులములు, లేక, రాష్ట్రము లిప్పుడభ్యుదయము నొందుచున్నవని కాన్పించుచున్నవో యా సద్గుణములన్నియు ననవసరము లగుటయే గాక యెవరయినను తన్నుఁ జంపుటకు వచ్చినను, "నిర్వైర స్సర్వభూతేషు" (గీ. 11.55) అను గీతా వాక్యమున కనుసారముగ వానిని దుష్టబుద్ధిచేఁ గొట్టకపోవుటయే తనకు ధర్మమగును గాన (ధమ్మపద. 338. చూఁడు) దుష్టులకు ప్రతీకారము సంభవింపదు. దానిమూలమున వారియొక్క దుష్టకృత్యములకు సాధువులు సహాయపడవలసినవా రగుదురు. మఱియు దుష్టులయొక్క ప్రాబల్యము వ్యాపించుటచే మొత్తముపై సమాజమునకుఁగాని, రాష్ట్రమునకుఁగాని వారివలన నాశము గలుగు నని దీనిపై ననేకులు యుక్తిఁ జెప్పుదురు. "న పాపే ప్రతి పాపః స్యాత్ సాధు రేవ సదా భవేత్"—దుష్టునితో దుష్టుఁడు కాఁగూడదు, సాధుత్వము తోడనే సంచరింపవలయును (మ. భా. వన. 206. 44). కారణ మేమి యనఁగా: దౌష్ట్యముచేతను, వైరముచేతను వైర మెప్పుడును నశింపదు. "న చాపి వైరం వైరేణ కేశవ వ్యుపశామ్యతి" పైగా జాతిచే దుష్టుఁడైనవాఁడు మనచే పరాజితుఁడైన పిదప వాఁడు మనస్సునం దధికక్లేశమునే పొందును. ఇంతియగాక తిరిగి కసిదీర్చుకొనుటకు సమయము వేచియుండును. "జయో వైరం ప్రసృజతి" కావున దుష్టులను శాంతిచేతనే నివారించుట యుక్త మగును అని మహాభారతమున స్పష్టముగఁ జెప్పఁబడినది (మ. భా. ఉద్యోగ. 71.59; మఱియు 63). మఱియు, భారతమునందున్న యీ శ్లోకమే బౌద్ధధర్మగ్రంథములలో వ్రాయఁబడి యున్నది (ధమ్మపద. 5; మఱియు 201. మహావగ్గ 10.ఽ.3 చూడు). ఆ రీతిగ నీవు నీ వైరులకు

ప్రతిక్రియఁ జేయుము. (మాథ్యూ. 5.4.4). మఱియు "ఒక చెంపపై నెవఁడైన నొక దెబ్బఁగొట్టినయెడల వానికి నీ రెండవచెంపను గొట్టుటకై చూపుము (మత్యూ. 5.39. ల్యూక్ 6.29) అని క్రీస్తువుచే సైత మీ తత్త్వ మనువాదము చేయఁబడినది. క్రీస్తునకంటె పూర్వమున్న చైనాదేశపు తత్త్వజ్ఞుఁడు లా-ఓ-త్సే అనువాఁడును నిటులే చెప్పెను. మా మహారాష్ట్ర సాధుమండలములో ఏకనాథ మహారాజులుంగా రీ తీరున నాచరించినటుల కథయును గలదు. క్షమకు, లేక, శాంతికిని పరాకాష్ఠను నుత్కర్షను సూచించుచు నీ యుదాహరణ మొక గొప్ప దానిలోఁ జేరినది కా దనుటకేమియు కారణము కానరాదు. సత్యాను సారముగనే క్షమ యనుధర్మము సైతము తుదకు (అనఁగా: సమాజముయొక్క పూర్ణావస్థయందు) నపవాదము లేనిదియు రూపముతో మాత్ర ముండుననుటకు సంశయము లేదు. వేయేల? ప్రస్తుత మపూర్ణావస్థయందున్న సమాజమున ననేకసమయములలో శాంతతచే సిద్ధించుకార్యము కోపముచేత కానేరదని కాన్పించుచున్నది. దుష్టుఁడగు దుర్యోధనునకు సహాయ మొనర్చుటకై యెవ రెవరు వచ్చిరో చూత మని ప్రయత్నింపఁగా నా వచ్చిన వారిలో పితామహులు, గురువులు మొదలగు పూజ్యులు గాన్పించిరి. అంత నతనికి దుర్యోధనుని దౌష్ట్యమునకు ప్రతిక్రియఁ జేయునిమిత్తమై పన్నుగడలు పన్న వలసి వచ్చుటయు, ధనలోభము నొందుటయు ననునవియే కాక గురువులగు వారిని శస్త్రములతో వధియించుట యను దుష్కరకర్మ సైతము చేయవలసివచ్చునని తోఁచెను (గీ. 2.5). మఱియు, "న పాపే ప్రతిపాప స్స్యాత్" అనున్యాయము ప్రకారము దుర్యోధనుఁడు దుష్టుఁడే కాన నతనివలె మనము సైతము దుష్టులము కారాదు. "అతఁడు మనలను చంపినను (గీ. 1. 46) మనము నిర్వైరమగు నంతఃకరణముతో స్వస్థముగ నాసీనులమై యుండుటయే యోగ్యమగును" అని చెప్పుట కారంభించెను. అర్జునునియొక్క యీ సంశయమును బోఁగొట్టుటకొఱకే గీతాశాస్త్రము ప్రవర్తించినది.

కావున నీ విషయము గీతలలో బాగుగ వివేచింపఁబడిన ట్లితరము లగు ధర్మగ్రంథములలో నెక్కడను స్పష్టముగ గాన్పింపదు. ఉదాహరణము: బౌద్ధక్రైస్తవ ధర్మములు రెండును నిర్వైరతత్త్వమును వైధికధర్మములవలె స్వీకరించుచున్నవి. కాని లోకసంగ్రహమును, ఆత్మసంరక్షణమును, లక్ష్యము సేయక సర్వకర్మలను వదలి సన్న్యాసమును గైకొను-వానియొక్క వర్తనమును, బుద్ధియు, ననాసక్తము, నిర్వైరము నైనను, నా యనాసక్తము, నిర్వైరము నైన బుద్ధితోడనే సర్వవ్యవహారములును జేయుచున్న కర్మయోగియొక్క వర్తనము నను నీ రెండును సర్వాంశములయందును నొకటియే యనుటకు వీలు లేదను విషయము బౌద్ధక్రైస్తవ ధర్మగ్రంథములలో స్పష్టముగఁ నెచ్చటను చెప్పఁబడలేదు. పైగా క్రీస్తుచేఁ జెప్పఁబడిన నిర్వైరత్వరూపమగు క్రింద చెప్పఁబడిన యుపదేశమునకును, జగత్తునం దున్న నీతియొక్క యోగ్యతకును మేళన మొనర్చుట పాశ్చాత్యులగు నీతిశాస్త్రజ్ఞులకొక చిక్కుగాఁ దోఁచెను.* మఱియు నిత్శేయను పేరు గల యర్వాచీన జర్మను పండితుఁడు నిర్వైరత్వ మను ధర్మతత్త్వము దాసత్వము వంటిదియు, ఘాతుకము నగుటచే నదియే శ్రేష్ఠ మని చెప్పునట్టి క్రైస్తవధర్మములచే నైరోపాఖండమున నిర్వీర్యముగాఁ జేయఁబడినదని తన గ్రంథమున స్పష్టముగ వ్రాసెను; కాని మన దేశమునందలి యే ధర్మగ్రంథమును చూచినను, సన్న్యాసము కర్మయోగము నను నీ రెండుధర్మమార్గముల మధ్యమున నీ విషయములో భేదము చేయవలయు నను విషయము, గీతలకే కాక మనువునకును పూర్ణముగ నవగతము, సమ్మతము నయినదని స్పష్ట మగును. కారణ మేమి యన: "క్రుధ్యంతం న ప్రతిక్రుధ్యేత్ "_ కోపము వచ్చిన వానిపై నీవు గూడ కోపగింపకుము (మను. 6. 48) అను నీ నియమము మనువుచే గార్హస్థ్య ధర్మములయందు, లేక, రాజధర్మముల

* See Paulsen's System of Ethics, Book III Chap. X. (Eng. Trans) and Nietzsche's Anti-Christ.

యందును గాక కేవల మతిథిధర్మములయందే చెప్పఁబడినది; కాని వీనిలో నే వచన మే మార్గములో నున్నదను విషయమును గాని, దాని నే కడ నుపయోగించుకొనవలయునను విషయమును గాని యోచింపక, సన్న్యాసము కర్మయోగము నను రెండు మార్గముల యందును పరస్పర విరుద్ధము లగు సిద్ధాంతములను సమానపఱచి యొక్కచోట చెప్పుట యను పద్ధతిని ప్రస్తుతపు టీకాకారు లారంభించి నందువలన ననేక పర్యాయములు కర్మయోగమునందున్న నిజమగు సిద్ధాంతవిషయమై యెటుల వ్యామోహమును బొందుచున్నదియు, నేను వెనుక నైదవ ప్రకరణమున జూపియున్నాను. గీతలపై నున్న టీకల యీ భ్రామకమగు మార్గమును వదలఁదుమేని నిర్వైరశబ్దమునకు భాగవతధర్మియుఁడగు కర్మయోగి యేమి యర్థమును జేయునదియు సహజముగఁ దెలియును. కారణ మేమియన: కర్మయోగియగు గృహస్థుఁ డిట్టి సమయములలో దుష్టులతో నెట్లు వ్యవహరింపవలసి నదియు, "తస్మా న్నిత్యం క్షమా తాత! పండితై రపవాదితా" — నాయనా! ఇందుకొఱకే పండితులచే క్షమకెప్పుడును నపవాదము చెప్పఁబడినది (మ భా.వన. 28.8) అని పరమభక్తుఁడగు ప్రహ్లాదునిచేఁ జెప్పఁబడినది. మనకు నేవి దుఃఖదాయకము లయినవో యట్టి కర్మలను చేసి యితరులను దుఃఖపెట్టకూడ దనునది యాత్మౌపమ్యదృష్టియొక్క సామాన్యధర్మ మనుమాట సత్యమే; కాని యీ ధర్మమునకు ప్రతిబంధులగు నితరులు మనల దుఃఖపెట్టఁగూడదను ధర్మమును పాలించువారులేని సమాజమునం దొక్కఁడే యీ ధర్మమును పాలించియు నుపయోగము లేదని మహాభారతమునందు నిర్ణయింపఁబడినది. ఈ సమతాశబ్దమే రెండువ్యక్తులతో సంబంధించును. అనఁగా: సాపేక్షము. కావునఁ జంప వచ్చు వానిఁ జంపిన నహింసాధర్మము చెడిపోనటులే దుష్టులను యోగ్యముగ శిక్షించుటచే సాధువుయొక్క యాత్మౌపమ్యబుద్ధికిఁ గాని, నిర్వైరత్వమునకుఁగాని, యేమియుఁ గొఱఁతరానేరదు. పైఁగా దుష్టులయొక్క యన్యాయమునకు ప్రతీకార మొనర్చి యితరులను

సంరక్షించుట యను శ్రేయము సైతము నతనికి సిద్ధించును. పరమేశ్వరుని బుద్ధికంటె సాధువుయొక్క బుద్ధి, విశేషసమత్వము నొందలేదని యెల్లవా రెఱింగినదియె కదా? అట్టి పరమేశ్వరుడు సైతము సాధుసంరక్షణార్థమును, దుష్టనిగ్రహార్థమును, ఆ యా సమయములం దవతారములుదాల్చి లోకసంరక్షణను జేయుచున్నాఁడే (గీ.4.7; మఱియు 8); ఇఁక నితరులవిషయ మేమి చెప్పవలయును? "వసుధైవ కుటుంబకమ్" అను దృష్టి కలుగుటచేఁ గాని, ఫలాశను వదలుటచేఁ గాని భేదము లేకయే యుండవలయునని చెప్పుట భ్రాంతిమూలమై యున్నది. ఫలాశయందు మమత్వబుద్ధి ప్రధానముగ నుండుననియు, దానిని వదలిననే కాని పాపపుణ్యము లందుండి విడువఁబడుట లేదనియు గీతలయొక్క సిద్ధాంతము. కాని యెవరి కేది యోగ్యముకాదో దానిని వారి కిచ్చుటచే స్వలాభమునే పాటించుకొనుట లేకపోయినను దుష్టులకు సహాయము చేసి యర్హులగు సాధువులకును నందుమూలమున సమాజమునకు నష్ట మొనర్చిన పాపము తగులక దప్పదు. కుబేరునివంటి యైశ్వర్యముగల కోటీశ్వరుఁడు బజారునకు కూరకొనుటకై పోయి కొత్తిమిరియాకున కెట్లు లక్షరూపాయల నీయఁడో యటులే పూర్ణమైన సామ్యావస్థ నొందిన పురుషుఁ డెవని కేది యోగ్య మగునో దానియొక్క తారతమ్యమును మఱవఁడు. అతనియొక్క బుద్ధి సమమైనది యగుట సత్యమే; కాని 'సమతా' శబ్దముయొక్క యర్థము గోవునకు వేయు గడ్డి మనుష్యులకును, మనుష్యుల కిడు నన్నము గోవులకును వేయుట యని తలఁపఁ గూడదు. గీతలయందును నీ న్యాయముచేతనే కేవలము దాతవ్య మనియే సాత్త్వికదానమును చేయవలయునని యున్నదో యదియును, 'దేశే కాలే చ పాత్రే చ' అనఁగా: 'దేశమును కాలమును పాత్రమును చూచియే దానము నీయవలయు (గీ.17.20)' నని భగవంతునిచేఁ జెప్పఁబడినది. సాధువుయొక్క సామ్యబుద్ధిని వర్ణించు జ్ఞానేశ్వరమహారాజుగా రట్టి సాధువునకు

పృథ్వియొక్క యుపమానము నిచ్చినారు. ఈ పృథ్వికే 'సర్వంసహ' యని మఱియొక పేరు. కాని యీ 'సర్వసంహ' యమ్మవారు సైతము తన్నెవరైనఁ గాలితో తన్నిరేని ఆ తన్నినవారి యరికాలి కంటె బలము గల దెబ్బను తగిలించి తనయొక్క సమతాబుద్ధిని వ్యక్తము చేయుచున్నది! మనస్సున వైరము లేక పోయినను (అనఁగా: నిర్వైరుఁ డైనను) ప్రతీకార మెట్లు చేయునో దీనివలన బాగుగ వ్యక్తమగును; మఱియు నీ కారణముచేతనే స్వయముగ భగవంతుఁడు "యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజా మ్యహమ్"— ఎవరు నన్నెట్లు సేవించుచున్నారో యటులే వారికి ఫలమునే యిచ్చుచున్నాను (గీ. 4. 11) అని యట్లే యాచరించియు "వైషమ్య-నైర్ఘృణ్య" దోషముల నొందఁడని కర్మవిపాకశాస్త్రమునఁ జెప్పఁబడినది. అటులే వ్యవహారమునందును వ్యావహారిక నియమములయందును సైతము హత్యఁ జేసినవానికి నురిశిక్ష విధించు న్యాయాధీశ్వరుఁ డతనికి విరోధి యని యెవ్వరును నుడువరు; బుద్ధి నిష్కామమయి సామ్యావస్థకుఁ జేరెనేని యా మనుష్యుఁడు తన యిచ్ఛచే నెవరికి నపకార మొనర్పఁడు; అతనివలన నితరుల కేదైన నపకారము గలిగిన యెడల నది యితరుని కర్మకు ఫల మగుననియు నిష్కామబుద్ధి గలిగిన 'స్థితప్రజ్ఞుఁ' డిట్టి సమయములయందు చేయుపని చూపులకు మాతృవధ, గురువధలవలె నెంతఘోరమైనను దానియొక్క శుభాశుభఫలముల బంధన మతనికిఁ దగుల దనియు నధ్యాత్మశాస్త్రముయొక్క సిద్ధాంతము (గీ. 4.14; 9.28; మఱియు 18.17 చూఁడు). దండశాస్త్రనియమముల యందు సైత మాత్మ సంరక్షణకుఁ జెప్పఁబడిన నియమము లీ తత్త్వమును బట్టియే రచియింపఁబడినవి. లోకులు "రాజవు కమ్ము" అని విన్నవింపఁగా "అనాచారముతో సంచరించులోకులను శిక్షించుటకై రాజ్యమును స్వీకరించి నేను పాపమునకు లోఁబడుట కిష్టపడనని మనువు మొదట చెప్పె" నని యొక కథ యున్నది. కాని "త మబ్రువన్ ప్రజాః మా భీః

కర్తృ౯ా నేనో గమిష్యతి" (మ. భా. శాం. 67. 23)— లోకు లతనిని భయపడకుము; పాప మెవరిదో వారికే తగులును; నీకు రక్షించిన పుణ్యము మాత్రము సిద్ధించు నని చెప్పి "ప్రజారక్షణార్థమై నీ కగు వ్యయమునకై మేము నీకు పన్ను నిచ్చెదము" అని ప్రతిజ్ఞఁ జేసిన పిదప మనువు రాజుగా నుండుట కిష్టపడెను. సారాంశ మేమి యనఁగా: నాఘాత మంతయే ప్రత్యాఘాత మను నచేతనసృష్టియం దున్న కర్మలసంబంధ మైనదియు నెప్పుడును మార్పును జెందనదియు నగు నియమమునకే, సచేతనసృష్టియందు నెట్టి వాని కట్టి వాఁడే కావలయు ననునది రూపాంతరము. సామ్యావస్థ నొందని బుద్ధిగల సామాన్యజను లీ కర్మ విపాకముయొక్క నియమములలోఁ దమ మమత్వబుద్ధిని ప్రవేశపెట్టి క్రోధముతో నైనను ద్వేషముతో నైనను అఘాతముకంటె నధికముగ ప్రత్యాఘాతముఁ జేసి దాని విషయమై కసిఁ దీర్చుకొనుచున్నారు. మఱియు తమకంటె నెవఁడైన దుర్బలుఁ డున్న యెడల వానియందు లేని తప్పు నొకదానిని గల్పించి దానికి ప్రతీకారముఁ జేయుమిషతో నతని సొత్తు నపహరించి తమకు లాభ మును గలుగఁ జేసికొనుటకై యెల్లప్పుడు ప్రవర్తించుచుందురు; కాని కసిదీర్చుకొనుటు, వైరమును, అభిమానమును, క్రోధముచేతఁ గాని, లోభముచేతఁ గాని, ద్వేషముచేతఁ గాని, దుర్బలుల పీడించుటను, గర్వముచేత తన ప్రౌఢత్వమును, విలాసమును, సత్తును, శక్తిని దెలియఁజేయు నట్టి యీ బుద్ధి సామాన్యజనులవలె మనస్సులోలేని వీరికి, తమమీఁద వచ్చిపడిన బంతిని వెనుకకుఁ ద్రిప్పివేయుట మాత్రముచే (అనఁగా: తమకుఁ గలిగిన యపకారమునకుఁ బ్రత్యప కారముఁ జేయుటచే) తమయొక్క శాంతమును, నిర్వైరమును, సమము నయినట్టి బుద్ధిని చెడఁగొట్టుకొనక యుండుటయే కాక జగత్తునందు దుష్టుల ప్రాబల్యముచే దీనులకు నన్యాయము కాఁగూడ దని యిట్టి ప్రత్యాఘాతరూపమైన కర్మచేయుట లోకసంగ్రహదృష్టినే వారికి ధర్మ మనియును (అనఁగా: కర్తవ్య మనియును) (గీ. 3. 25)

నిట్టి సమయములయందు సమబుద్ధిచేఁ జేయఁబడిన ఘోరయుద్ధము సైతము ధర్మ్యము, శ్రేయస్కరము నగు ననియును గీతలయందున్న సంపూర్ణోపదేశమునకు సారము. ఎల్లవారితోడను నిర్వైరముగనే వ్యవహరింపవలయును. 'దుష్టులతో దుష్టులుగా నుండరాదు', 'కోపపడువానిపై కోపపడరాదు' అను నీ ధర్మతత్త్వములు స్థితప్రజ్ఞుఁడైన కర్మయోగికి మాన్యములు కాకపోవు. కాని, నిర్వైరుఁ డనఁగా: నిష్క్రియుఁడు, లేక, ప్రతీకారశూన్యుఁడు నని కేవల సన్న్యాస మార్గమునందున్న యర్థమును సత్యమని యెన్నక "వైర మనఁగా: మనస్సునందున్న దుష్టబుద్ధి, దానిని వదలవలయుననునది మాత్రమే నిర్వైరపదార్థము" అని యెఱింగి లోపల దుష్టబుద్ధి లేక, "కర్మ యెవరిని వీడదు, కావున కేవలము లోకసంగ్రహార్థమును, లేక, ప్రతీకారార్థము నావశ్యకమును నైనది. శక్యమగునంత కర్మను నూహతోడను వైరాగ్యముతోడను నిస్సంగబుద్ధితోడను చేయవలయును" అని కర్మయోగులు చెప్పుచున్నారు (గీ. 3. 19). కావున కేవలము నిర్వైరపదమును యోజింపక—

> మత్కర్మకృత్ మత్పరమో మద్భక్తః సంగవర్జితః,
> నిర్వైరః సర్వభూతేషు యస్స మామేతి పాండవ.
>
> గీ. 11.55.

— అను శ్లోకమున 'మత్కర్మకృత్' అనఁగా: నా యొక్క (అనఁగా:పరమేశ్వరుని) ప్రీతికొఱకు కర్మలను జేయువాఁడు, అనఁగా: "పరమేశ్వరార్పణబుద్ధితో సర్వకర్మములను జేయువాఁడు" అని చెప్పి పిదప మహత్త్వ బోధకమయిన మఱియొక విశేషణమును వేసి భగవంతునిచే నిర్వైరత్వమునకును నిష్కామకర్మకును గీతలయందు భక్తిదృష్టిచే సంబంధ మేర్పఱుపఁబడెను. మఱియు నీ శ్లోకము సర్వ గీతాశాస్త్రముయొక్క సారమని శాంకరభాష్యమునందును నితరము

లగు టీకలయందునుఁ జెప్పఁబడినది. బుద్ధిని నిర్వైరముగఁ జేసికొను టకుఁ గాని, చేసికొనిన పిదపఁ గాని కర్మలను వదలవలయునని గీతలలో నెచ్చటనులేదు. ప్రతీకారార్థమై యే కర్మలు చేయవలసినవై యున్నవో యవి యీ రీతిగ నిర్వైరత్వముతోడను పరమేశ్వరార్పణ బుద్ధితోడను చేసె నేని కర్తకు వానియొక్క పాపము, లేక, దోష మేమియు తగులదు. ఇంతియే కాక, ప్రతీకారముయొక్క కార్యము సమాప్త మగునేని ప్రతీకారము చేయఁబడిన దుష్టునకే 'ఆత్మౌపమ్య దృష్టిచే' కల్యాణమును చింతించు బుద్ధియు మనస్సు నుండి తొలఁగి పోనేరదు. ఉదాహరణము : రావణునియొక్క దుష్టకృత్యముల విషయమై నిర్వైరుఁడు, నిష్పాపుఁ డైన శ్రీరామచంద్రుఁడు యుద్ధ మునం దతనిని వధించిన పిదప నతనికి నుత్తరక్రియలఁ జయుటకు విభీషణుఁడు సంకోచించుచున్నప్పుడు—

మరణాంతాని వైరాణి నివృత్తం నః ప్రయోజనమ్,
క్రియతా మస్య సంస్కారో మమాప్యేష యథా తవ.
వాల్మీకి రా. 6.109.25

— వైరము (రావణాసురునిమనస్సునందున్నది) మరణముతో సమాప్త మైనది. మాయొక్క కార్యము (దుష్టులవినాశము నొందించుట) సమాప్తమైనది. ఇప్పు డితఁడు నీ కెట్టివాఁడో (అన్నయో) నాకును నటులే యయి యున్నాఁడు. కావున నితనికి నగ్నిసంస్కారమును జేయుము అని శ్రీరామచంద్రుఁడు విభీషణునకుం జెప్పెను. రామా యణమునందున్న యీ తత్త్వము భాగవతమందును నొకచోట నున్నది (భాగ. 8.19.13). భగవంతుఁడు దాను సంహరించిన దుష్టులకే పిదప దయాళువై సద్గతి నిచ్చెనని యితర పురాణములలో నున్న కథలకును నిదియే కారణము. ఈ వివారమునంతను మనస్సున నిడికొని, "ఉద్ధతాసీ పాహిజే ఉద్ధట" అని సమర్థులవారు చెప్పిరి. మహాభారతమునందు—

**యో యథా వర్తతే యస్మిన్ తస్మి న్నేవం ప్రవర్తయన్,**
**నాధర్మం సమవాప్నోతి న చాశ్రేయశ్చ విందతి.**

**మ.భా.ఉ. 179.30.**

— ఎవఁ డెట్లు వర్తించుచున్నాఁడో యట్లు వానితో మనము వర్తించుటచే నధర్మము (అనీతి) సంభవిల్లదు. అకల్యాణము సైతము కానేరదు అని భీష్ములు పరశురామునకుఁ జెప్పిరి. మఱియు శాంతి పర్వమునందున్న సత్యానృతాధ్యాయమున—

**యస్మిన్ యథా వర్తతే యో మనుష్యః**
**తస్మిన్ తథా వర్తితవ్యం స ధర్మః,**
**మాయాచారో మాయయా బాధితవ్యః**
**సాధ్వాచారః సాధునా ప్రత్యుపేయః.**

— తనతో నెవ రెట్లు వర్తించుచున్నారో యట్లే వారితో వర్తించుట ధర్మము మాయగల పురుషునితో మాయావిగను, సాధువుతో సాధువుగను వ్యవహరింపవలయును (మ. భా. శాం. 109. 29; మఱియు ఉద్యో. 36. 7) అని యీ యుపదేశమే మరల యుధిష్ఠిరునకు చేయఁబడినది. అట్లే ఋగ్వేదమునందు ఇంద్రునియొక్క మాయావిత్వము విషయమయి యతని దూషింపక "త్వం మాయాభి రనవద్యమాయినం....వృత్రం అర్దయః"—ఓ నిష్పాపుడవైన యింద్రుడా! మాయావియైన యా వృత్రాసురుని నీవు మాయచేతనే చంపితివో (ఋ. 10.147.2; 1.80.7) యని స్తుతించియున్నది. భారవికవిచే తన కిరాతార్జునీయ కావ్యమునందు—

**వ్రజంతి తే మూఢధియః పరాభవం,**
**భవంతి మాయావిషు యేన మాయినః.**

— మాయావులతో నెవరు మాయావులు కారో వారు పరాభవము నొందుదురు అని ఋగ్వేదమునందున్న తత్త్వమే యనువదింపఁబడి నది. కాని యీ స్థలమునందు మఱియొకటి సైతము తెలిసికొనవల యును అదేది యనఁగా: దుష్టునకు ప్రతీకారము చేయుట సాధువు నకు శక్యమగునేని మొదట సాధుత్వముగనే చేయవలయును. కారణ మేమి యనఁగా: ఇతరుఁడు దుష్టుఁడైనంత మాత్రముననే మనము నతనితో సమానముగ దుష్టులము కావలసి వచ్చును. ఒకఁడు తొఱ్ఱి ముక్కుగలవాఁ డాయె నని యితరులును తమ ముక్కును కోసి కొనఁగూడదు గదా! వే యేల! అట్లు సేయుట ధర్మము కానేరదు. "న పాపే ప్రతిపాపః స్యాత్" అను సూత్రమునకు సత్యమైన యర్థమిదియే. మఱియు నీ కారణముచేతనే విదురనీతియందు "న తత్ పరస్య సందధ్యాత్ ప్రతికూలం య దాత్మనః"—తమకేది ప్రతికూల మని తోఁచునో దాని నితరుల కుపయోగింపకూడదు అను నీతితత్త్వ మును ధృతరాష్ట్రునకు విదురుఁడు చెప్పిన వెంటనే—

అక్రోధేన జయే త్క్రోధ మసాధుం సాధునా జయేత్,
జయే త్కదర్యం దానేన జయేత్ సత్యేన చానృతమ్.

— (ఇతరులయొక్క) క్రోధమును తన శాంతిచేతను, దుష్టులను సాధుత్వముచేతను, లోభిని దానముచేతను, అనృతము సత్యము చేతను జయింపవలయును అని చెప్పెను (మ. భా. ఉ. 38. 73. 74). ధమ్మపద మను పేరుతో పాలీభాషలోనున్న బౌద్ధధర్మీయనీతి గ్రంథ మునం దీ శ్లోకము—

అక్రోధేన జినే క్రోధ మసాధుం సాధునా జినే,
జినే కదర్యం దానేన సచ్చే నాలీకవాదినమ్.

అని యున్నది యున్నట్లుగనే యనువదింపఁబడినది (ధమ్మపద. 223 చూడు). శాంతిపర్వమునందు యుధిష్ఠిరున కుపదేశించుచు భీష్ముఁడుమ

కర్మ చైత దసాధూనాం అసాధుం సాధునా జయేత్,
ధర్మేణ నిధనం శ్రేయో న జయః పాపకర్మణా.

శాం. 95.16

— దుష్టులయొక్క దుష్కృత్యములను సాధుత్వముచే నివారింపవల యును. కారణ మేమి యన: పాపకర్మచేత పొందు జయముకంటె ధర్మముచేత (అనఁగా: నీతిచేతను) మరణము వచ్చినను శ్రేయస్కర మగును అని యీ నీతితత్త్వముయొక్క మహత్త్వమును కొండాడెను; కాని యిట్టి సాధుత్వముచే దుష్టులయొక్క దుష్కృత్యములు నివా రణ కాకపోయినను, లేక, సామోపాయముచేతను, శిష్టత్వముచేతను ఈ దుష్టులకు చెప్పుట యనుకూలింపక పోయినను "కంటకే నైవ కటకం" అను న్యాయముచేత, చేతితో లాగిన పైకిరాని ముల్లును లోహవికారమయిన ముల్లుచేతనే (అనఁగా: సూదిచేతనే) వెలుపలికి లాగుట యావశ్యక మగును (దాస. 19. 9. 12-31). కారణ మేమి యనఁగా: నెప్పుడైనను లోకసంగ్రహార్థమై దుష్టులను నిగ్రహించుట భగవంతునికి వలె సాధుపురుషులకును ధర్మదృష్టిచే ప్రాథమిక మగు కర్తవ్యము. "సాధుత్వముచేత దుష్టుని జయింపవలయు" నను వాక్యమునందు దుష్టులను జయించుట, లేక, నివారించుట యను నది సాధువులకు ముఖ్యకర్తవ్యముగ నున్నదను విషయమును బాగుగ పట్టుకొనియే తత్సిద్ధ్యర్థమై మొదట నే యుపాయమును యోజింప వలయునో నిదర్శింపఁబడినది. సాధుత్వముచే నివారించుటకు శక్యము కాకపోయె నేని ఎట్టివారి కట్టివాఁడై దుష్టులను నివారింపరాదు. అతని దుష్టకృత్యములకు సాధువులు సంతోషపూర్వకముగ తమదేహ మును బలి యీయవలయునని మన గ్రంథకారు లెక్కడను ప్రతిపా దించి యుండలేదు. తనయొక్క దుష్టకృత్యముచే లోకుల గొంతులను గోయుటకుఁ బ్రవర్తించిన వానితో నితరులు తమ సాధుత్వముతోడనే వ్యవహరింప వలయునని చెప్పుటకు నే విధమయిన నైతికమగు

హక్కును లేదని ముఖ్యముగఁ దెలిసికొనవలయును; వేయేల? సాధువు లిటు లోక యకార్యమును జేయవలసి వచ్చినప్పుడు దాని యొక్క బాధ్యత శుద్ధబుద్ధిగల సాధువులమీఁద నుండక దుష్టుల సంబంధమైన దుష్టకృత్యములయొక్క పరిణామమే యగును. కాన నా దుష్టులనే యా విషయమై బాధకులనుగ పట్టుకొనవలయు నని ధర్మశాస్త్రమునందే స్పష్టముగఁ జెప్పఁబడినది (మను. 8. 19; 351). మఱియు బుద్ధుఁడు తాను దేవదత్తుని శాసించుటకు నుపపత్తిని బౌద్ధ గ్రంథకారులును నీ తత్త్వముమీఁదనే సమన్వయించిరి (మిళింద.ప్ర. 4.30.1.34 చూడు). జడసృష్టియొక్క వ్యవహారమునందు అఘాత ప్రత్యాఘాతరూపము లయిన యా కర్మలను నిత్యము లయినవి గను నత్యంతము సమానములుగ నుండును; కాని మనుష్యుల వ్యవహారము వారియొక్క యిష్టానుసార మగుటచేతను, పైఁ జెప్పిన త్రైలోక్య చింతామణిమాత్రలు దుష్టునకు నెప్పు డుపయోగింపవలయునో నిశ్చయించుటకయి సంబంధించు ధర్మజ్ఞానము మిక్కిలి సూక్ష్మ మగుటచేతను మనము చేయుదమని తలఁచిన పద్ధతి యోగ్య మయినదా? లేక, యయోగ్యమయినదా? ధర్మ్యమా? లేక, యధర్మ్యమా? యను విషయమై గొప్పవారును నా యా సమయములయందు మోహము నొందుట సత్యమే. "కిం కర్మ కి మకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః" (గీ. 1. 46) అని గీతలో నున్నది. కావున నిట్టి సమయము లందు విద్వాంసుఁ డెప్పుడును కొంచెమో గొప్పయో స్వార్థబుద్ధితో కార్యములను జేయుచున్న వారి పాండిత్యమును గాని, తన సారాసారవిచారమును గాని యన్ని విధముల విశ్వసింపక, పూర్ణమైన సామ్యావస్థకుఁ జేరినట్టియు, పరమావధి యయినట్టియు, సాధువు యొక్క శుద్ధబుద్ధినే తుదకు శరణుజొచ్చి యా గురువుయొక్క నిశ్చయము ననుసరించియే యాచరింపవలయును. కారణ మేమి యన: కేవల తార్కికపాండిత్య మెంత యధికమో యన్ని యుక్తు లంతకంతకు వెలువడును. కావున శుద్ధబుద్ధి లేని కేవల పాండిత్యముచే నిట్టి

వికల్పప్రశ్నల కెప్పుడును సత్యమును సమాధానకరము నగు సిద్ధాంతము లభింపదు; దానిని శుద్ధమును నిష్కామమును నైన బుద్ధి గలిగిన గురువులే యుపదేశింపవలయును. సర్వమాన్యులైన శాస్త్రకారుల బుద్ధి యీ ప్రకారముగ శుద్ధమగును. కావుననే 'తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ'–కార్యాకార్యములను నిర్ణయించుట యను పనిలో నీవు శాస్త్రమును ప్రమాణ మని యంగీకరింపవలయును (గీ. 16·24) అని భగవంతుఁ డర్జునున కుపదేశించెను. అయినను కాలమానానుసారముగ శ్వేతకేతువువంటి సాధుపురుషులకు పిదప నీ శాస్త్రమునందు సైతము మార్పులను చేయుట కధికారము వచ్చునని గుర్తుంచుకొనవలయును.

నిర్వైరుఁడును శాంతుడు నైన సాధువుయొక్క యాచరణ విషయములో నిప్పుడు లోకులకుఁ గల భ్రమ, కర్మయోగము లుప్తప్రాయమై సంసార మంతయు త్యాజ్య మని చెప్పునట్టి సన్న్యాసమార్గము ప్రస్తుతమందు నలుగడల విశేషవృద్ధిని పొందియుండుటచే, సంభవించినది. నిర్వైరి యగునేని నిష్ప్రతీకారియుఁ గావలయునని గీతలయొక్క యుపదేశమును నుద్దేశమును కాదు. ఎవరికి లోకసంగ్రహ విషయమై లక్ష్యము లేదో యతనికి జగత్తున దుష్టులు ప్రబలమైనను, కాకపోయినను, మఱియు నతని ప్రాణ మయిన నుండినను పోయినను సమానముగనే యుండును. కాని పూర్ణావస్థ నొందిన కర్మయోగి, సర్వభూతాత్మైక్యము నెఱింగి సర్వభూతములయందును నిర్వైరముగ వ్యవహరించుచున్నను, అనాసక్తబుద్ధిచేత పాత్రాపాత్రతలయొక్క సారాసారమును విచారించి స్వధర్మానుసారముగ ప్రాప్తమయిన కర్మలను చేయుట మానఁడు. మఱియు నట్లు చేయఁబడిన కర్మలవలన కర్తయొక్క సామ్యబుద్ధి కేమియు కొఱఁత రానేరదని కర్మయోగులు చెప్పుదురు. గీతాధర్మమునం దున్న కర్మయోగము యొక్క యీ తత్త్వమును స్వీకరించిన పిదప కులాభిమానము, దేశా

భిమానము మొదలయిన కర్తవ్యధర్మములకును కర్మయోగశాస్త్రాను సారముగ యోగ్యమైన యుపపత్తి చెప్పుటకు సాధ్య మగును. సర్వ మానవజాతికిని, వే యేల? ప్రాణిమాత్రమున కంతకు దేనిచే హిత మగునో యదే ధర్మ మనునది పరమసిద్ధాంత మయినను, పరమావధి రూపమయిన యా స్థితి నొందుటకు, కులాభిమాన, ధర్మాభిమానము లనునవి పైకెక్కుటకు మెట్లగును. కాన దానియొక్క యావశ్యకత యెప్పుడు నావశ్యకత కాక పోనేరదు, నిర్గుణబ్రహ్మప్రాప్తికి, సగుణో పాసన మావశ్యక మైనట్లు 'వసుధైవకుటుంబకమ్' అను బుద్ధి కలుగు టకు, కులాభిమాన, జాత్యభిమాన, ధర్మాభిమాన, దేశాభిమానములు మొదలగు మార్గము లావశ్యకములుగ నున్నవి; మఱియు సమాజ మున ప్రతితరము నీ నిచ్చెనచేతనే పైకెక్కుచుండును గాన నీ నిచ్చె నను స్థిరముగ నునుపవలసివచ్చును. అట్లే తన పరిసరజనులు గాని, రాష్ట్రములు గాని తక్కువస్థితిలో నుండఁగా నొక పురుషుఁడు గాని, రాష్ట్రము గాని తా నొక్కఁడు నెప్పుడు నున్నతస్థానమున నుండవల యునని యెంచినను నదియు సంభవింపదు. కారణ మేమియన: పర స్పర వ్యవహారమున "ఎట్టివాని కట్లె" యను న్యాయముచేఁ బైపై మెట్లు నున్నవారు క్రింది క్రింది మెట్లపై నున్న లోకుల యన్యాయ మునకు ప్రతిక్రియ చేయుట యా యా సమయములయం దావశ్యక మని పైనఁ జెప్పఁబడియే యున్నది. జగత్తునం దున్న యందఱి స్థితియు సంస్కారము కానుకాను, ఏదో యొక సమయమున వారె ల్లరును, సర్వభూతాత్మైక్యమును బొందుదు రను విషయమున నేమియు సందేహము లేదు. ఏమి లేకపోయినను అట్టిస్థితిని బొందుదు మను కోరిక ప్రతి మనుష్యునకును బుట్టుటయు నయుక్తము కాదు. కాని యాత్మోన్నతియొక్క యీ పరమావధి యెల్లరకు ప్రాప్తియగు నంతవఱకు నితరరాష్ట్రములయొక్క స్థితిని గాని, సమాజముల స్థితిని గాని, మనంబున నిడుకొని సాధువులు తమ తమ సమాజములకు తత్తత్కాలములయందు శ్రేయస్కరములగు దేశాభిమానాది ధర్మము

లనే యుపదేశింప వలయునని న్యాయముగనే సిద్ధమగును. ఇంతియు కాక, యిటులే మనంబున నునుపఁదగి నమఱియొక విషయ మేమన: ఇంటి పైపై యంతస్థులు కట్టి పూర్తిచేసినను, క్రింది యంతస్థులు తీసి వైచుటకు వీలు లేనట్లును, చేతిలో పట్టాకత్తి యున్నంతమాత్రమున చిన్న యాయుధముయొక్క యావశ్యకత తీరనట్లును, సూర్యుఁ డున్నను నగ్ని యావశ్యకత యుండునట్లును, సర్వభూతహిత మను కడపటి మెట్టుమీఁదికి చేరినను, దేశాభిమానమే కాక, కులాభిమాన ముయొక్కయు నావశ్యకత యుండకపోదు. కారణ మేమి యన: సమాజమును సంస్కరించుట యను దృష్టితోఁ జూచితి మేని మనము తలపెట్టిన కులాభిమాన మను కార్యము కేవలము దేశాభిమానము చేతనే కానేరదు. మఱియు దేశాభిమాన మను కార్యము కేవలము సర్వభూతాత్మైక్యదృష్టిచే సైతము సిద్ధి కానేరదు. అనఁగా: సమాజ ముయొక్క పూర్ణావస్థయందు సైతము సామ్యబుద్ధివలెనే దేశాభిమానము, కులాభిమానము మొదలగు ధర్మములును నావశ్యకము లగును. కాని కేవలము తన దేశముయొక్క యభిమాన మనునదియే తనకు పరమసాధ్య మని యంగీకరించిన పిదప నొక రాష్ట్రము తనలాభము నకై మఱియొక రాష్ట్రమున కెంత నష్టము నైనను జేయుట కెట్లు సిద్ధ మగుచున్నదో యట్లే సర్వభూతహితమే పరమసాధ్యమని యంగీకరించుటకు సాధ్యము కాదు. కులాభిమానము, దేశాభిమానము, తుదకు సర్వమానవజాతియొక్క హితము నను వీనిలో విరోధమువచ్చునేని క్రింది క్రింది మెట్లయందున్న ధర్మమును పైపై మెట్లమీఁదనున్న ధర్మము కొఱకు వదలిపెట్ట వలయునని చెప్పుటచే, సామ్యబుద్ధిచే పూతమైన నీతిధర్మములయొక్క మహత్త్వమును, విశేషమును చెప్పఁ బడును. యుద్ధమునందు కులక్షయ మగుచుండఁగా దుర్యోధనునకుఁ గోపము వచ్చునను తలంపున, పాండవులకు రాజ్యభాగము నీయక పోవుటకంటె, దుర్యోధనుఁడు విననియెడల, కుమారుఁడైనను నతని

నొక్కనినే వదలుట యోగ్యమని ధృతరాష్ట్రునకు నుపదేశించుచు దానిని సమర్థించుటకు—

**త్యజే దేకం కులస్యార్థే గ్రామస్యార్థే కులం త్యజేత్,**
**గ్రామం జనపదస్యార్థే ఆత్మార్థే పృథివీం త్యజేత్.**

— కులము (సంరక్షించుట) కొఱకు నొకనిని, గ్రామముకొఱకు కులమును, సర్వలోకసమూహముకొఱకు గ్రామమును, ఆత్మార్థమై పృథివిని వదలవలయును (మ. భా. ఆది. 115. ౘం. సభా. 61. 11) అని విదురుఁడు చెప్పిన శ్లోకము నందలి మూఁడు చరణముల తాత్పర్యమును నిదియె. నాల్గవచరణమునం దాత్మసంరక్షణముయొక్క తత్త్వము చెప్పఁబడినది. ఆత్మశబ్దము సామాన్యమగు సర్వనామమగుటచే నాత్మసంరక్షణ యను తత్త్వ మొక వ్యక్తియందు వలెనె యేకత్వము నొందిన సమూహమునకును, జ్ఞాతులకును, దేశమునకును, రాష్ట్రమునకును వర్తించును; మఱియు కులముకొఱకు నొక పురుషని, గ్రామముకొఱకుఁ గులమును, దేశముకొఱకు గ్రామమును, వదల వలయునని పూర్వమునందుఁ జెప్పఁబడిన పైపై మెట్లెక్కు మార్గమును దెలిసికొంటి మేని, యాత్మశబ్దముయొక్క యర్థము వీని యన్నింటికంటె నెక్కడ విశేషమహత్త్వము కలిగినదయి యుండవలయునని స్పష్టముగఁ గాన్పించుచున్నది. అయినను కొందఱు స్వార్థపరులు, లేక, శాస్త్రానభిజ్ఞు లీ చరణమునకు నప్పుడప్పుడు విపరీతముగ (అనఁగా: కేవలము స్వార్థపరముగ) నర్థమును జేయుచున్నారు. కావున, నాత్మసంరక్షణ మను నీ తత్త్వ ముదరంభరిత్వ సంబంధ మయినదికా దని యిక్కడ చెప్పవలయును; కారణ మేమి యన: ఏ శాస్త్రకారులు కేవలస్వార్థపరమగు చార్వాకమతమును రాక్షసమత మని నిశ్చయించిరో (గీ.అ. 16) యా శాస్త్రకారులే స్వార్థముకొఱకు జగత్తునైనను నశింపఁ జేయవచ్చునని యెవరికైనను చెప్పుట యెప్పుడును సంభవింపదు. పై శ్లోకమునందున్న 'అర్థే' యను

శబ్దార్థము కేవలస్వార్థపరము కాదు. "సంకటములు వచ్చునప్పుడు వానిని నివారించుకొను నిమిత్తమై" అని యర్థముఁ జేసికొన వలయును; మఱియుఁ గోశకారు లా యర్థమునే వ్రాసినారు. ఉదరం భరిత్వము నాత్మసంరక్షణము నను నీ రెంటియందును గొప్ప తార తమ్యమున్నది. కామోపభోగేచ్ఛచేతను, లోభముచేతను, స్వలాభార్థమై జగత్తునకు నష్టముఁ గలుగఁ జేయుట యుదరంభరిత్వము. ఇది యమానుషము, గర్హ్యము నైనది. కావున నొకనియొక్క హితము కంటె ననేకులయొక్క హితమును, మన మెక్కువగా గమనింప వలయునని పై నున్న శ్లోకమునందలి మొదటి మూఁడు చరణముల యందును జెప్పఁబడినది. అయినను సర్వభూతములయందును నొక యాత్మయే యుండుటచేఁ బ్రతిమనుజునకు నీ జగత్తులో సుఖముగ నుండుట యను నైసర్గికమైన హక్కు సమానముగనే యున్నది. మఱియు నీ సర్వసామాన్య మగు మహత్త్వమును, నైసర్గికమగు హక్కును గమనింపక, జగత్తునందు నొక వ్యక్తికి గాని, యొక సమాజమునకుఁ గాని, నష్టముఁ జేయు నధికారము మఱియొక వ్యక్తికిఁ గాని, సమాజమునకుఁ గాని, బలముచేతను, సంఖ్యచేతను నెక్కువగ నున్నంతమాత్రమునఁగాని యితరులయొద్ద నున్నవస్తువుల నపహరించెడి సాధనము లధికముగ నున్నంత మాత్రమునఁ గాని నీతిదృష్టిచే నెప్పుడును బ్రాప్తము కానేరదు. ఒకని హితముకంటెఁ గాని, కొంతమందియొక్క హితముకంటెఁ గాని, యనేకుల హిత మధిక మయిన యోగ్యత గలదను యుక్తివాదముచేత, సంఖ్యచే గొప్పదయిన సమాజముయొక్క స్వార్థపరత్వవర్తనమునే యిచ్చో నెవరయిన సమర్థించినయెడల నా యుక్తివాదము రాక్షసమని తెలిసి కొనవలయును. కావున నితరు లిటు లన్యాయముగఁ బ్రవర్తించిరేని యనేకులకే కాక సర్వపృథ్వికిని నగు హితముకంటె నాత్మసంరక్షణ అనఁగా: తన్ను సంరక్షించుకొనుటయొక్క నైతికమగు హక్కు బలవత్తర మగుచున్నదని నాలుగవ చరణముయొక్క భావార్థము.

మఱియు మొదటి మూఁడు చరణములందు వర్ణింపఁబడిన యర్థమున కీఁ సంబంధముచేత గలిగిన మహత్త్వాపవాదము దానివలెనె చెప్పఁ బడినది. (ఇంతియె కాక) మనము జీవించినయెడల లోకకల్యాణ మును చేయుదుము. లోకహితదృష్టిచే విచారించినను, విశ్వామిత్రుఁడు సెప్పినట్లు "జీవన్ ధర్మ మవాప్నుయాత్ "— బ్రతికితి మేని ధర్మము నాచరింతుము - అని కాని కాళిదా సనినటుల "శరీర మాద్యం ఖలు ధర్మసాధనం"— శరీర మనునదియె సర్వధర్మములకు మూలసాధన మగును (కుమార. ౫.౩౩). అనఁగా: మనువు చెప్పినటుల "ఆత్మానం సతతం రక్షేత్ " —తాను తన్నెల్లప్పుడును రక్షించుకొనవలయు" నని గాని చెప్పవలసి వచ్చుననియు గమనింపవలయును. కాని యాత్మ సంరక్షణ యను నీ హక్కు జగత్తుహితముకంటె నీ తీరున శ్రేష్ఠమయి నను ననేక విషయములలోఁ గులముకొఱకును, దేశముకొఱకును, ధర్మముకొఱకును, లేక, పరోపకారార్థమును సత్పురుషులు స్వేచ్ఛ చేతనే ప్రాణములను సైతము వదలుచున్నారని వెనుక రెండవ ప్రకరణమునందుఁ జెప్పఁబడినది. కాన, నీ తత్త్వమే పై శ్లోకము నందున్న మొదటి మూఁడు చరణములలోను వర్ణితమైనది. ఇట్టి సమయములయందు మనుజుఁ డాత్మసంరక్షణ యను తన శ్రేష్ఠమైన హక్కును బుద్ధిపూర్వకముగ వదలుకొనుటచే నా కృత్యముయొక్క నైతికయోగ్యతయు నన్నింటికంటె శ్రేష్ఠమని తెలిసికొనవలయును. అయిన నీ సమయ మెప్పుడు వచ్చునదియుఁ దప్పులేక నిశ్చయించు టకు, కేవల పాండిత్యము గాని, లేక, తర్కశక్తి గాని పూర్ణము కానేరదు. దీనికొఱకు విచారించుచున్న మనుజునియొక్క యంతః కరణము మొదట శుద్ధము సమము కావలయు నని ధృతరాష్ట్ర సంబంధమగు పై యుదాహరణమువలననే రూఢమగుచున్నది. విదు రుఁడు సేసిన యుపదేశమును ధృతరాష్ట్రుఁడు దెలిసికొనలేని మంద బుద్ధికాఁడు. కాని పుత్రస్నేహమువలన నతని బుద్ధి సమము కాలేదని

మహాభారతమునందే చెప్పఁబడినది. కుబేరునకు లక్షరూప్యములు కావలసినచో నతని కెట్టి కొఱఁతయు నుండనటు లొకపరి యొకనికి బుద్ధి సమమైన పిదప వానికి, కులాత్మైక్యము, దేశాత్మైక్యము, ధర్మాత్మైక్యము మొదలగు నల్పవిధములగు నైక్యములకు నెప్పుడును లోపము రాదు. బ్రహ్మాత్మైక్యమునం దివి యన్నియు నంతర్భూతము లగుచున్నవి; మఱియు దేశధర్మములు, కులధర్మములు మొదలగు సంకుచితధర్మములలోఁ గాని, సర్వభూతహిత మను వ్యాపకధర్మము లోఁ గాని, వారివారి స్థితి ననుసరించి గాని, వారి యాత్మసంరక్షణా ర్థమై కాని, యే కాలమున నెవరి కేది శ్రేయస్కర మగునో దానినే వారి కుపదేశించి, జగత్తుయొక్క ధారణపోషణ లను కార్యమును సత్పురుషులు నడిపించుచున్నారు. మానవజాతియొక్క ప్రకృతియందు దేశాభిమాన మనునదియే ముఖ్యమగు సద్గుణ మగుటచే నాగరికతను జెందిన రాష్ట్రములు సైతము సమీపమున నున్న శత్రువులయొక్క రాష్ట్రమున నున్న జనులను స్వల్పమగు కాలములో నా యా సందర్భములయం దెట్లు చంప నగునా యని విచారించుట యందును దానియొక్క ప్రయత్నమునందును, తమయొక్క జ్ఞానమును, కౌశలమును, ద్రవ్యమును నుపయోగించుచున్న దనునది సత్యమే; కాని యంతమాత్రముచే, దేశాభిమాన మనునదియే, నీతిదృష్టిచే మానవజాతికి పరమసాధ్యమని యనుటకు వీలులేదని స్పెన్సరు, కాంటు మొదలగు పండితులు తమ గ్రంథములలో స్పష్టముగఁ బ్రతిపాదించియున్నారు. మఱియు, వారి ప్రతిపాదనకుఁ దగులని నీ యాక్షేప మధ్యాత్మదృష్టిచే సిద్ధమైన సర్వభూతాత్మైకత్వరూప తత్త్వమునకు మాత్ర మెటులు తగులునో తెలియదు. పిల్ల చిన్న దయినను దాని ధారణకు యోగ్యమగు వస్త్రములు దాని శరీరము ననుసరించియే యుండవలయును. ఇంతియకాక కొంచెము పెద్దవిగ (అనఁగా: వృద్ధి పొందుచున్న యవయవములకు ననుకూలించు నటు లేర్పఱచి యుంచవలసియుండు నటులనే సర్వభూతాత్మైక్య

బుద్ధిచే మొదట సాధ్యముగ దేని నెదుటఁ బెట్టవలయునో యది యతనియొక్క యధికారమున కనురూపమైనదిగఁ గాని, లేక, దానికంటె కొంచె మధికమైనదిగఁ గాని యుండిననే యతనికి శ్రేయస్కర మగును. గొప్ప పనినైనను వాని శక్తికి మించిన దానిని వెంటనే చేయుమని చెప్పిన యెడలను దానిచే నతని కెప్పుడును గల్యాణము కానేరదు. పరబ్రహ్మ మింత యని నియమ మేమియు లేకపోయినను, ఉపనిషత్తులలో దానియొక్క యుపాసన యంతకంత కెక్కువగఁ జెప్పఁబడుటకు కారణ మిదియే. కావున నెల్లవారును స్థిత ప్రజ్ఞులే యైన సమాజమునందు క్షాత్రధర్మముయొక్క యావశ్యకత లేకపోయినను జగత్తునందున్న యితరసమాజములయొక్క తత్కాల స్థితిని బట్టి "ఆత్మానం సతతం రక్షేత్" అను తత్త్వము ననుసరించి మన ధర్మశాస్త్రములయందున్న చాతుర్వర్ణ్యవ్యవస్థలో క్షాత్రధర్మము చేర్పఁబడినది. మఱియు సుప్రసిద్ధ గ్రీకుతత్త్వజ్ఞుఁడగు ప్లేటో యను వాఁడు తన గ్రంథమున నుత్తమోత్తమ మను నూహతోఁ జెప్పిన సమాజవ్యవస్థయందును నియమయుక్త మయిన యభ్యాసముచే యుద్ధశాస్త్రమందు ప్రవీణు లయిన వర్గమునకు సమాజరక్షణ మను సంబంధముచే ప్రాముఖ్యము నిచ్చెను. తత్త్వజ్ఞానులు, పరమావధి కలిగినదియు, శుద్ధము నూర్జితము నయినదియు నైన స్థితియొక్క విచారమున మగ్ను లయినను దానియందే తత్కాలీనము, నపూర్ణము నైన సమాజవ్యవస్థను విచారింపక మానరని దీనివలన స్పష్ట మగును.

సర్వవిషయముల నీ తీరున విచారించితి మేని, బ్రహ్మాత్మైక్య జ్ఞానముచే తన బుద్ధిని నిర్విషయము, శాంతము, సర్వభూతముల యందు నిర్వైరము, సమమునైన దానిగఁ జేయుటయుఁ దన కీ స్థితి ప్రాప్త మగుటచే సామాన్యు లయిన యజ్ఞానులను బీడింపక తాను సర్వసాంసారిక కర్మలను వదలి (అనఁగా: కర్మసన్న్యాసమార్గమును స్వీకరించియు) నీ జనులయొక్క బుద్ధి చెడనీయక, దేశకాలస్థితులం

బట్టి యెవరి కేది యోగ్య మగునో వారికి దానినే యుపదేశించియుఁ దన నిష్కామకర్తవ్యాచరణచేత యథాధికారముగ సద్వర్తనయొక్క రీతిని దృష్టాంతపూర్వముగఁ గనుపఱచియు నెల్లవారిని మెల్లమెల్లఁగ వీలైనపుడెల్ల శాంతముచేఁ గాని, యుత్సాహముచేఁ గాని గొప్ప మార్గమును జేర్చుటయు ననునదియే జ్ఞానికి సత్యమగు ధర్మమని సిద్ధమగుచున్నది. ఆ యా సమయములయం దవతారములం దాల్చి భగవంతుఁడు సేయు కార్య మంతయు నిదియే; మఱియు జ్ఞాని యా విధినే యాచరించుచు ఫలాశను వదలి యీ జగత్తునందున్న స్వకర్తవ్యమును శుద్ధబుద్ధిచే (అనఁగా: నిష్కామబుద్ధిచే) నెప్పుడును యథాశక్తిగఁ జేయుచునే యుండవలయును. వేయేల? దానియందు మరణము సిద్ధించినను దానిని గొప్ప యానందముతో స్వీకరింపవలయును (గీ. ౩.౩౫). తన కర్తవ్యమును (అనఁగా: ధర్మమును) వదలరాదని సమస్తగీతాశాస్త్రముయొక్కయు తాత్పర్యము. దీనినే లోకసంగ్రహ మనియు సత్యమైన కర్మయోగ మనియుఁ జెప్పుదురు. ఒక వేదాంతమే గాక దాని యాధారమునఁ గర్మాకర్మలయొక్క పైనఁ జెప్పఁబడిన హేతువువలన మొదట యుద్ధమును మాని బిచ్చమెత్తుకొనుటకు సిద్ధుడైన యర్జునుఁడు పిదప స్వధర్మానుసారముగ ఘోరయుద్ధమును చేయుటకు— భగవంతుఁడు చెప్పుచున్నాఁడనియె కాక స్వేచ్ఛచే సైతము— ప్రవర్తించును. అర్జునునకు నుపదేశింపఁబడిన స్థితప్రజ్ఞునకు సంబంధించిన సామ్యబుద్ధియొక్క యీ తత్త్వము కర్మయోగశాస్త్రమునకుఁ బునాది యగుటచే దానినే ప్రమాణముగఁ గైకొని దాని యాధారముచే బరాకాష్ఠ యయిన నీతిమత్తకు నుపపత్తి యెటులు కుదురునదియుఁ జెప్పిన పిదప నాత్మౌపమ్యదృష్టితో సమాజమునం దొకనితో నొకఁడు కదిసి యెట్లు వ్యవహరింపవలసినదియు "ఎట్టివానికి నట్టివాఁడే" యను న్యాయముచేఁ గాని పాత్రాపాత్రతల మూలమునఁ గాని, పరాకాష్ఠ యయిన నీ ధర్మములలో

నేమి భేద ముండునదియు; నీ పూర్ణావస్థయం దున్న సమాజమునందు వ్యవహరించుచున్న సాధువు విషయమున నపవాదాత్మకమగు నీతిధర్మ మెటు లుండవలసినదియు మొదలగు కర్మయోగశాస్త్రమునం దున్న గొప్ప విషయములను సంక్షేపముగ నీ ప్రకరణమునందు విమర్శఁ జేసియే యుంటిని. ఈ యుక్తివాదమే న్యాయము, పరోపకారము, దానము, దయ, అహింస, సత్యము, అస్తేయము మొదలగు నిత్యధర్మములకు వర్తించును. కాన ప్రస్తుతమం దపూర్ణమగు సమాజముయొక్క వ్యవస్థయందు సమయానుసారముగ నేమి మార్పుఁ జేయవలసివచ్చునదియుఁ దెల్పుటకు నీ ధర్మములలోఁ బ్రతి విషయముపై నొక్కొక్క స్వతంత్రగ్రంథము వ్రాసినను, నా విషయము సమాప్తము కానేరదు; భగవద్గీతయొక్క ముఖ్యోద్దేశమును నది కానేరదు. అహింసాసత్యములును, సత్యాత్మసంరక్షణలును, ఆత్మరక్షణశాంతులును మొదలగు వానిలోఁ బరస్పరవిరోధము లుండుటచేఁ గర్తవ్యాకర్తవ్యసంశయ మా యా సమయములయం దెట్లుత్పన్న మగునదియు నీ గ్రంథమున రెండవ ప్రకరణమునందు దిగ్దర్శనముగఁ జెప్పఁబడినది. ఇట్టి సమయములయందు సాధువు "నీతిధర్మము, లోకయాత్రావ్యవహారము, స్వార్థము, సర్వభూతహితము" మొదలగు విషయములయొక్క తారతమ్యమును విచారించి పిదప కార్యాకార్యములను నిర్ణయించు ననుట నిర్వివాదము. మహాభారతమునందు శ్యేనముచే శిబిచక్రవర్తికి నీ విషయము స్పష్టముగఁ జెప్పఁబడినది. మఱియు 'సిజ్విక్' అను పేరు గల నాంగ్లేయ గ్రంథకారుఁడు దన నీతిశాస్త్ర గ్రంథమునం దనేకోదాహరణములతో నీ విషయమును విస్తారముగ వర్ణించెను; కాని యంతమాత్రముచే స్వార్థపరార్థముల యొక్క సారాసారమును విచారించుటయే నీతినిర్ణయముయొక్క తత్త్వ మగునని యనేక పాశ్చాత్య పండితులచేఁ జేయఁబడు ననుమితి మాత్రము మన శాస్త్రకారు లెప్పుడు నొప్పుకొనరు. కారణమేమి యన: ఈ సారాసారవిచార మనేక సమయములయందు "నావంటి

వాఁడే యన్యుఁడు" నను సామ్యబుద్ధి మొదట స్థిరముగ లేకయే కేవల తార్కికమగు సారాసారవిచారముచేఁ గర్తవ్యాకర్తవ్యముల నెప్పుడును దప్పులేక నిర్ణయించుటకు వీలులేనంత సూక్ష్మముగను, ననైకాంతికముగను (అనఁగా: అనేకానుమితులచే సిద్ధమగునదిగను) నుండును. మఱియు నిది "ఒకనెమలి పింఛమును విప్పి యాడుటం జూచి పింఛము లేని మఱియొక నెమలి యాడుటవలె హాస్యాస్పదముగ నున్నది" అని మన శాస్త్రకారు లందురు. మిల్లు మొదలుగాఁ గల యుపయుక్తతావాదులగు పాశ్చాత్యనీతిశాస్త్రజ్ఞులయొక్క యుపపాదనయందు ముఖ్యముగ నున్న యపూర్ణత్వ మిదియే. గరుడపక్షి మేఁకపిల్ల నాకాశమున కెఁగ దన్నుకొని పోయెనని కాకియు నట్లు చేయఁబోయిన నపాయము నొందక తప్పదు.

కావున సాధువులయొక్క బాహ్యయుక్తిని మాత్ర మవలంబించి యుండక యంతఃకరణమునం దెప్పుడును స్ఫురించుచున్న సామ్యబుద్ధినే తుదకు శరణుఁ జెందవలయును. సామ్యబుద్ధియే కర్మయోగశాస్త్రమునకు సత్యమైన మూలమని గీత చెప్పుచున్నది. అర్వాచీనాధిభౌతికపండితులలోఁ గొందఱు స్వార్థపరులైను, కొందఱు పరార్థులుగనే యున్నారు (అనఁగా: 'అనేకుల కధిక హిత' మనునది నీతికి మూలతత్త్వముగ నున్నదని ప్రతిపాదించు చున్నారు). కాని కర్మలయొక్క బాహ్యపరిణామములకే సంబంధించియున్న యీ తత్త్వముచే నన్ని విషయములయందును నిర్వాహము కానందున, కర్తయొక్క బుద్ధి యెంతవఱకు శుద్ధమైనదియు నవశ్యముగ విచారింపవలసి వచ్చునని నేను నాల్గవ ప్రకరణమునందుఁ జెప్పియున్నాను. కర్మలయొక్క బాహ్యపరిణామ సంబంధమైన సారాసారమును విచారించుటయే నేర్పరితనమునకును, దూరదర్శిత్వమునకును లక్షణమగుట సత్యమే. కాని దూరదర్శిత్వమును, నీతియు నను శబ్దములు సమానార్థకములు గావు. కావున బాహ్యకర్మలయొక్క సారాసార

విచారమే కేవల ప్రాపంచికుల క్రియారూపమగు సద్వర్తనమునకు సత్యమగు బీజము కాదు గాన సామ్యబుద్ధిరూప పరమార్థమే నీతికి పునాది యని మన శాస్త్రకారులు నిర్దేశించి యున్నారు; మఱియు మనుష్యులయొక్క (అనఁగా: జీవాత్మయొక్క) పూర్ణావస్థ యేదియో యోగ్యముగ విచారించినను, ఈ సిద్ధాంతమునే యవలంబింపవలసి వచ్చును. కారణ మేమి యన: లోభముచే నితరుల మోసపుచ్చుట యందలి నేర్పును అనేకుల కధిక సుఖమును దేనివలనఁ గలుగునో దెలిసికొనునట్టి శుష్క బ్రహ్మజ్ఞానమే ప్రతి మనుజునకును పరమ సాధ్యమని యే వారును నుడువరు. మనస్సు, లేక, యంతఃకరణము శుద్ధముగ నుండు పురుషుఁడే యుత్తముఁ డనఁ బడవలసినవాఁడు. వే యేల? అంతఃకరణము, నిర్మలము, నిర్వైరము, శుద్ధము కాని యెడల కేవల బాహ్యకర్మల సంఖ్యయందలి తారతమ్య విచారములో మునిఁగియుండును గాన నట్లు సంచరించువాఁడు వేషధారిగ పరిణమించినను పరిణమింపవచ్చును (గీ. 3.6). కర్మయోగశాస్త్రమునందు సామ్యబుద్ధిని ప్రమాణముగ నంగీకరించెనేని యీ దోష ముండనేరదు. సామ్యబుద్ధిని ప్రమాణమున నంగీకరింతు మేని చిక్కిలి యభ్యంతరము గలుగు సమయమున ధర్మాధర్మనిర్ణయార్థమై జ్ఞానవంతుఁ డైన సాధువునే శరణు పొందవలసివచ్చు నను మాట సత్యమే; కాని దాని కేమియును చికిత్స లేదు. ఒకానొక గొప్ప వ్యాధి యాపాదించిన యెడల వైద్యుని సహాయము లేక యా రోగమునకు, నిదానమును, చికిత్సయుఁ జేయుటకు శక్యము కాని యట్లే ధర్మాధర్మముల సంశయములయొక్క వికటస్థలములందు సత్పురుషులయొక్క సహాయము లేనిది "అనేకుల కధిక హిత" మను నొక సాధనముచేతనే సామాన్యజనుఁడు దా నొనర్చు కార్యములయందలి ధర్మాధర్మములను నిస్సంశయముగ నిర్ణయింపవలయు నని యభిమానము చెందు నేని వ్యర్థుఁ డగును. సామ్యబుద్ధిని వృద్ధిఁ బొందించు నభ్యాసమునకుఁ

ప్రతిమనుజుఁడును ప్రయత్నింపవలయును. మఱియు నీ క్రమముగ జగత్తునందున్న యెల్లవారి బుద్ధియుఁ బూర్ణమగు సామ్యావస్థను బొందినపుడే కృతయుగప్రాప్తి యగును. కావున మానవజాతికి పరమ సాధ్యమగు పూర్ణావస్థ యెల్లవారికిని ప్రాప్త మగును. కార్యాకార్య శాస్త్రముయొక్క ప్రవృత్తి యీ కారణముచేతనే కలిగినది. మఱియు నా కారణమున నా భవనము సైతము సామ్యబుద్ధి యను పునాది మీఁదనే కట్టఁబడవలయును; కాని యింత దూరదృష్టితో విచారింపక నీతిమత్తకు ముఖ్యమగు లౌకికనికషోపల (ఒరపిడి ఱాయి) మను దృష్టితో విచారించినను గీతలయందున్న సామ్యబుద్ధియొక్క పక్షము పాశ్చాత్యుల యాధిభౌతి కాధిదైవికమార్గముల కంటె నధికమైన యోగ్యత కలది కావున రహస్యము తెలుపునదిగను నిలువఁబడునని పిదప పదునైదవ ప్రకరణమునఁ జేయఁబోవు తారతమ్యపరీక్ష వలన స్పష్ట మగును. గీతాతాత్పర్య నిరూపణమునందలి మహత్త్వమునకు నవశిష్టమైయున్న భాగమును గీతారహస్య నిరూపణకంటె ముందుగఁ బూర్తిఁ జేయుచున్నాను.

ఇది సిద్ధావస్థ-వ్యవహారము అను ద్వాదశ ప్రకరణము.

# త్రయోదశ ప్రకరణము

## భక్తిమార్గము

సర్వధర్మాన్ పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః.*
గీ. 18.66

సర్వభూతాత్మైక్యరూపమగు నిష్కామబుద్ధియే కర్మయోగమునకును, మోక్షమునకును మూల మగుటచే నీ శుద్ధబుద్ధిచేఁ బ్రహ్మాత్మైక్యజ్ఞానముచే నెట్లు ప్రాప్త మగునదియు నీ శుద్ధబుద్ధిచేఁ బ్రతి మనుజుఁడు స్వధర్మానుసారములుగఁ బ్రాప్తము లయిన కర్తవ్యముల నామరణాంత మేల చేయవలసినదియు నింత పర్యంత మధ్యాత్మదృష్టిచే విచారింపఁబడినది; కాని భగవద్గీతయందుఁ బ్రతిపాద్యమైన విషయ మంతమాత్రముచేఁ బూర్ణము కానేరదు. కారణ మేమియన: బ్రహ్మాత్మైక్యజ్ఞాన మనునదియే, నిజమగు సత్యము, సాధ్యము నగుటచే "దానివంటి పవిత్రమగు మఱియొక వస్తువు జగత్తున లేదు" (గీ. 4. 38) అను విషయము నిస్సంశయముగ నుండినను, నింతదనుకఁ జేసిన విచారణయు, తద్ద్వారా సామ్యబుద్ధిని సంపాదించుకొనుటకుఁ జెప్పఁబడిన మార్గమును బుద్ధిగమ్యము లగుటచే, వానిని పూర్ణముగ నాకళించునట్టి తీవ్రబుద్ధిని ప్రతి మనుజుఁ డెచ్చోనుండి కైకొని రావ

---

* "అన్ని విధములగు ధర్మములను (అనఁగా: పరమేశ్వరప్రాప్తి సాధనముల నన్నిటిని) వదలి నన్నొక్కనినే శరణు పొందుము. నేను నిన్ను సర్వపాపముల నుండియు విముక్తునిగఁ జేయుదును." ఈ శ్లోకార్థ మీ ప్రకరణాంతమున బాగుగ వివరింపఁబడినది, చూడుము.

లయును, మఱియు బుద్ధితీవ్రత లేనినాఁడన్ని విధములచేతను మునిఁగిపోయె నని తాత్పర్యమా? అను శంక సామాన్యజనులకుఁ గలుగుచున్నది; ఈ శంకయు యుక్తముగనే యున్నది. గొప్పగొప్ప జ్ఞానులు సైతము వినాశియు, నామరూపాత్మకము నగు మాయచే నాచ్ఛాదింపఁబడిన యమృతస్వరూపమగు పరబ్రహ్మమును వర్ణించుచు "నేతి నేతి" యని చెప్పి యూరకుందురేని పిదప మనవంటి సామాన్యుల కిది యెట్లు తెలియును? కావున నీ గహనమయిన బ్రహ్మజ్ఞానము మాయొక్క యల్పగ్రాహకశక్తి కధీనమగుట కే మైన సులభమార్గము కలదా యని యెవరయిన నడిగినను దోష మేమి? ఆత్మను (అనఁగా: బ్రహ్మను) ఆశ్చర్యచకితులై వర్ణించువారు, వినువారు ననేకు లుండినను, అది యేరికిని దెలియదని గీతలయందును కఠోపనిషత్తునందును జెప్పఁబడినది (గీ. ౨.29; కఠో. 2.7). ఈ విషయమై శ్రుతియం దొక కథ కలదు. అ దేమన: "మహానుభావా! నాకు బ్రహ్మజ్ఞానము నుపదేశింపు" మని బాష్కలుఁడు బాహ్వుఁడను వాని నడుగ నతఁ డేమియు జెప్పక యూరకుండెను. బాష్కలుఁడు మరల నట్లే యడిగెను; కాని యప్పటికిని బాహ్వుఁ డూరక యుండెను. ఇటుల నాలుగైదుమారు లడిగినను నేమియుఁ జెప్పక తుదకు "ఓరీ! నీ ప్రశ్నకు సమాధానము నే నింతదనుక నొక విధముగఁ జెప్పుచునే యున్నాను; నీ కది తెలియలేదు. నే నేమి చేయఁగల వాఁడను? బ్రహ్మస్వరూప మే విధమునను జెప్పుటకు సాధ్యము కానే రదు. మాటలాడక కూర్చుండుట యను నదియే బ్రహ్మకు లక్షణ మని యెఱింగితివా?" యని బాష్కలుని బాహ్వుఁ డడిగెను (వే. సూ. శాం. భా. 3.౨.17). నోరు మూసికొని చెప్పుటకు సాధ్యమగు నదియున్నొకనుదోయి మూసికొనిన పిదపన్నొకనఁబడునదియుఁ, దెలియుట మానిన పిదపఁ దెలియునదియు నని యిందలి సారాంశము (కేన. 2. 11). దృశ్యసృష్టివిలక్షణము, అనిర్వాచ్యము అచింత్యము నగు నీ

పరబ్రహ్మమును సామాన్యబుద్ధిగల మనుజు లెట్లు తెలిసికొందురు? తద్ద్వారా సామ్యావస్థయు సద్గతియు నెట్లు కలుగును? సర్వభూతముల యందును నొక యాత్మయే యను పరమేశ్వర స్వరూపముయొక్క యనుభవాత్మకము, యథార్థమునగు జ్ఞానము కలిగి మనుజులకెల్ల వారికిని పూర్ణమగు నున్నతస్థితి సంభవించుటకు తీవ్రమగు బుద్ధిదక్క మఱియొక మార్గమే లేనియెడల జగత్తునందున్న లక్షలకొలఁది మనుజులు బ్రహ్మప్రాప్తిని గుఱించి యాశ నయినఁ జెందక స్వస్థముగఁ గూర్చుండవలసివచ్చును. కారణ మేమి యన: బుద్ధిమంతులగు మనుజులు కొలఁదిమందిగనే యుందురు. బుద్ధిమంతుఁడు చెప్పిన దానిపై విశ్వాస ముంచిన, కార్యము నిర్వహించు ననుకొన్నను, బుద్ధిమంతులలోను ననేక మతభేదములు స్పష్టముగఁ గాన్పించుచున్నవి. ఇంతియె కాక, విశ్వాస ముంచినయెడల కార్యము నెరవేఱునని చెప్పుదు మేని, యీ గూఢమగు జ్ఞానమును సంపాదించుటకు, విశ్వాసమును, లేక, శ్రద్ధను వహించుట యను బుద్ధికంటె వేఱగు మఱియొక మార్గ మున్నదని మొత్తముపై ప్రాప్తమగును. మఱియు నిజముగ విచారించితి మేని, శ్రద్ధలేనిది జ్ఞానమునకుఁ బూర్ణత సంభవింపనేర దనియే స్పష్టమగుచున్నది. "జ్ఞానమంతయు బుద్ధిచేతనే ప్రాప్త మగును. దానికి మఱియొక మనోవృత్తిసాహాయ్య మక్కఱ లేదు" అను నీ తర్కమే ప్రధానముగాఁ గల శాస్త్రమునందే జన్మమును వృథసేయుట కర్కశబుద్ధిగల పండితులయొక్క వృథాభిమానమై యున్నది. రేపు ప్రాతఃకాలమున సూర్యుఁడు మరల నుదయించునను సిద్ధాంతము నుదాహరణముగ గ్రహింపుము. ఈ సిద్ధాంతమందలి జ్ఞాన మత్యంతము నిశ్చితముగనే యున్నదని మనము చెప్పుచున్నాము. ఏలన మనమును, మన పూర్వులును నీ క్రమము నింతదనుక నబాధితముగఁ జూచినారము కాని కొంచెము దూరదృష్టితో విచారించితి మేని మనమును మన వృద్ధపితామహులును నేటిదనుక ప్రతిదినమునను ప్రాతఃకాలమున సూర్యోదయ మగుచుండుటనుజూచి

యుండుట సూర్యుఁడు రేపును ప్రాతఃకాలమునందే యుదయించుట కెప్పుడును కారణము కానేరదు; లేక, ప్రతిదినము నీవు చూచుట కొఱకుఁ గాని, చూచుటచేఁ గాని సూర్యుఁ డుదయింపఁడు; సూర్యోదయ మగుటకు కారణములు వేఱుగనే యుండునటులు కాన్పించుచున్నవి. మఱియు నీవు ప్రతిదినముఁ జూచుచుండుట రేపు ప్రాతఃకాలమునందు సూర్యుఁ డుదయించుటకు కారణము కాకపోయినచో రేపు సూర్యోదయము దేనివలన నగును? చిరకాల మే వస్తువుయొక్క యయినను క్రమ మొకరీతినే యబాధితముగ నున్నదని స్పష్టముగఁ గాన్పించిన పిదప నా క్రమ మికపైన నిటులే యుండుననుకొనుటయు నొకవిధమగు శ్రద్ధయే. మఱియు నిట్టివానికి మనము 'అనుమానము' లని చమత్కారమగు పేరిడినను, నీ యనుమానము బుద్ధిగమ్యమైన కార్యకారణాత్మకము కానేరదు. ఇఁక నేమన: మొదట శ్రద్ధాత్మకముగనే యున్నదని తెలిసికొన వలయును. రామునకు పంచదార తీయఁగ నున్నది గాన, సోమునకును దీయగనే యుండవలయు నను మన నిశ్చయమునందలి వాస్తవిక విషయమును విచారించితి మేని మొదటనే యది తియ్యనిదియై యుండును. కారణ మేమి యన: శర్కర తీపిగ నుండునను జ్ఞానము మన బుద్ధికి ప్రత్యక్షముగ ననుభవమగుచుండుట సత్యమే; కాని యెల్లరకు శర్కర తియ్యగనే యుండునని చెప్పునప్పుడు బుద్ధికి నమ్మకముతో సంబంధముండితీరును. అటులే ప్రత్యక్షానుభవము లేని నమ్మకముయొక్క సహాయముచేతనే రేఖాగణితమం దెంతదూరము పోయినను కలసికొనని రెండు సరళరేఖ లుండు నను సిద్ధాంతమును ప్రత్యక్షానుభవ మగునటుల బోధించును. ఇంతియ కాక జగత్తునందలి వ్యవహార మంతయు శ్రద్ధ, ప్రేమ, మొదలుగాఁ గల నైసర్గికమనోవృత్తులచేతనే నడచుచున్నది. కావున నీ వృత్తుల నిరోధించుట తప్ప బుద్ధికి మఱియొక కార్యము లేదు. బుద్ధిచే నెద్దానియొక్క గాని మంచి చెడుగు

లను నిశ్చయించిన పిదప నటు వెనుకఁ జేయఁదగిన వ్యవహారముల నడిపించుట మనోవృత్తియొక్క యధీనమై యున్నదని యిదివరలో క్షేత్రక్షేత్రజ్ఞ విచారమునందుఁ జెప్పితిమి. కావున బుద్ధిగమ్యజ్ఞానము పూర్ణ మగుటకును, పిదప నా జ్ఞానము బుద్ధిలో నుండి యాచరణ యందును, కృతియందును ప్రవేశించి, సఫల మగుటకును, నీ జ్ఞానమునకును, నమ్మకము, దయ, వాత్సల్యము, కర్తవ్యప్రేమ మొదలగు నితర మనోవృత్తులయొక్క యపేక్షయు తప్పక యుం డును, మఱియు నే జ్ఞాన మీ మనోవృత్తిని శుద్ధముగను, సప్రయ త్నముగను చేసికొని వానియొక్క సాహాయ్యము నపేక్షింపదో యది శుష్కము, నపూర్ణము, తర్కమయము, వంధ్యము లేక, యపక్వము నని తెలిసికొనవలయును. అవును. తుపాకిమందు లేనిది, యొక సీసపుగుండుచే మాత్రమే తుపాకియొక్క బారు పాఱనట్లే, ప్రేమ, నమ్మకము మొదలుగాఁ గల మనోవృత్తుల యొక్క సాహాయ్యము లేనిది, కేవల బుద్ధిగమ్యమగు జ్ఞాన మేరిని తరింపఁజేయ దను సిద్ధాంతమును ప్రాచీనులగు ఋషీశ్వరులు పూర్తిగ నెఱుంగుదురు. ఉదాహరణము- అవ్యక్తము, సూక్ష్మము నగు పర బ్రహ్మమే దృశ్యమైన సర్వజగత్తునకు మూలకారణ మని సిద్ధాంతీక రించుటకై శ్వేతకేతువునకుఁ దండ్రి మఱ్ఱికాయను దెచ్చి "దానిలో నేమి యున్నదో చూడుము" అని చెప్పెను. శ్వేతకేతు వా పండును పగులఁగొట్టి చూచి, "లోపల చిన్న చిన్న పెక్కుబీజము లున్న"వని నుడివెను. "వానియందలి యొక బీజమును గైకొని దానిని పగులఁ గొట్టి లోపల నేమి యున్నదో చెప్పు"మని తండ్రి చెప్పఁగా, శ్వేతకే తువు వానిలో నొక బీజమును గైకొని పగిల్చి "లోపల నేమియుఁ గాన్పింపలే" దనెను. పిదప తండ్రి "ఓరీ! లోపల నీకుఁ గాన్పింపని దాని నుండియే యీ వట మను గొప్పవృక్షము పుట్టియున్న" దని చెప్పి తుదకు "శ్రద్ధత్స్వ"–దీనిమీఁద విశ్వాసముంచుము అనఁగా: "విషయమును వినను మాత్రము విని నోటితో మాత్ర మగునని

చెప్పక యీ తత్త్వమును హృదయములో నుంచుకొని నీయొక్క యాచరణమునందుఁ బ్రవేశపెట్టు"మని తండ్రి యతని కుపదేశించినట్లు ఛాందోగ్యోపనిషత్తునందుఁ జెప్పఁబడెను (ఛాం. ృ. 12). సూర్యుఁడు రేపు ప్రాతఃకాలమునం దుదయించునని నిశ్చయాత్మక జ్ఞానము గలుగుటకు సైతము నమ్మిక మావశ్యక మయినచో సర్వ సృష్టికిని మొట్టమొదట నుండునట్టి మూలతత్త్వము, అనాదిగను, అనంతముగను, సర్వకర్తగను, సర్వజ్ఞముగను, స్వతంత్రముగను, చైతన్యరూపముగ నున్నదని, పూర్ణముగ నెఱుంగుటకు, బుద్ధి యనునినుపదారిగుండ శక్యమైనంత దూరము పోయిన పిదప నా దారి ననుసరించియైనను, దానికంటె పరమం దైనను, కొంత నమ్మకమును ప్రేమయు ననెడి కాల్త్రోవనే వెళ్ళవలయు ననునది నిర్వివాదమై యున్నది. మఱియు 'నే నెవరిని తల్లియనియు, దేవతవలె వంద్యురా లనియుఁ బూజ్యురా లనియు నెన్నుకొనుచున్నానో యామెనే యితరు లోక సామాన్యస్త్రీ యనియో, లేక, నైయాయికులయొక్క శాస్త్రీయశబ్దాడంబరానుసారముగ ' గర్భధారణప్రసవాది స్త్రీత్వసామాన్యావచ్ఛేదకావచ్ఛిన్నవ్యక్తివిశేష" మనియో తలఁచుచున్నారు. ఒక చిన్నవ్యావహారికోదాహరణమునుండి కేవలతర్కముచేఁ గలుగు జ్ఞానమును, నమ్మకము, ప్రేమయు నను మూనయందుఁ బోయుటచే దానియం దేమి భేదము కలుగునో యది యందఱకును సహజముగఁ దెలియును. మఱియు నీ కారణముచేతనే కర్మయోగులలో సైతము నమ్మకము గలవాఁడు శ్రేష్ఠుఁడని గీతలలోఁ జెప్పఁబడినది (గీ.6.47). "అచింత్యాః ఖలు యే భావాః న తాం స్తర్కేణ చింతయేత్"— ఇంద్రియాతీతము లగుటచే నే పదార్థముల చింతించుట సాధ్యము కానేరదో వానియొక్క స్వరూపనిర్ణయము కేవల తర్కమూలముననే చేయఁగూడదని పూర్వమునందు చెప్పిన తీరున నధ్యాత్మశాస్త్రమునందును సిద్ధాంతము చేయఁబడినది.

నిర్గుణపరబ్రహ్మమును సామాన్యమనుజులు దెలిసికొనుట కష్టమనునది మాత్రమే యాటంకమైన యెడల బుద్ధిమంతులలో మతభేద మున్నను, నీ యాటంకమును శ్రద్ధచేతను, లేక, విశ్వాసము చేతను పోఁగొట్టవచ్చును. కారణ మేమియన: ఈ పురుషులలో నధికముగ విశ్వసనీయుఁ డెవఁడని చూచి మన మతని వాక్యము మీఁదనే శ్రద్ధ యుంచినఁ జాలును (గీ. 13. 25). తర్కశాస్త్రమునం దీ మార్గమును "ఆప్తవచనరూపమైన ప్రమాణ" మని చెప్పుచున్నారు. ఆప్తులనఁగా: విశ్వసనీయులగు పురుషులు. జగత్తుయొక్క వ్యవహారమును బరికించితి మేని వేలకొలఁది జను లాప్తవాక్యమును విశ్వసించియే తమ వ్యవహారములను నడిపించుచున్నా రని కాన్పించుచున్నది. రెండయిదులు పది యగుటకు బదులుగ నేడేల కావు? లేక, యొకటి వెంబడి నింకొకటి వేసితి మేని రెండుగాక పదునొకం డెందు కగుచున్నవి? అను నీ ప్రశ్నల కుపపత్తిని, లేక, కారణమును జెప్పుటకు సమర్థు లయినవారు కొలఁదిమందియే యున్నారు. అయినను నీ సిద్ధాంతమును నమ్మకమని యంగీకరించియే జగత్తులో నెల్లరును వ్యవహరించుచున్నారు. హిమవత్పర్వతముయొక్క యెత్తు అయిదు మైళ్లా? లేక పది మైళ్లా? యను నంశమున ప్రత్యక్షమగు జ్ఞానము గలవారు స్వల్పముగనే యుందురు. అయినను హిమాలయముయొక్క యెత్తెంత యని మనల నెవరయిన నడిగిరేని పాఠశాలలో భూగోళవర్ణనయొక్క పుస్తకమునందు చదువుకొన్న 36000 అడుగుల యెత్తను సమాధానమును వేగముగఁ జెప్పుదుము. కాని యా తీరుననే బ్రహ్మ మెట్లున్నదని యెవరైన నడిగిన నిర్గుణముగ నున్నాఁడని యుత్తర మిచ్చుట కభ్యంతర మేమి? అది నిజముగ నిర్గుణముగ నున్నదా? లేదా? యని పూర్తిగఁ బరిశీలించి దానియొక్క సాధకబాధక ప్రమాణములను విచారించునంత బుద్ధి సామాన్యజనులకు లేకపోయినను నమ్మకమను మనోధర్మము కేవలమహా బుద్ధిమంతులగు పురుషులకే లభ్యమగు నను నియమము లేదు.

కేవలాజ్ఞానులకు సైతము నమ్మిక యుండకపోదు. మఱియు నమ్మిక ముచే నజ్ఞాని తన వ్యవహారముల నెప్పుడును జేయుచుండినయెడల నా నమ్మికముచే బ్రహ్మము నిర్గుణ మని యెఱుంగుటకు నేమియు నభ్యంతరము లేదు. మోక్షధర్మములయొక్క యితిహాసముల బాగుగ విచారించిన యెడల జ్ఞాని బ్రహ్మస్వరూప విషయమై చర్చఁ జేసి యది నిర్గుణమని నిశ్చయింపక మునుపే సృష్టికి మూలకారణ మైనట్టియు సృష్టియందున్న నశ్వరములును ననిత్యములునైన పదార్థములకంటె విలక్షణ మైనదియు నొకానొక పదార్థము, అనాద్యంతము, అమృతము, స్వతంత్రము, సర్వశక్తియుతము, సర్వజ్ఞము, సర్వవ్యాపియు నయిన తత్త్వమని తన నమ్మికముచేతనే తెలిసికొని, యా బ్రహ్మ నేదో యొక రూపముచే నుపాసనఁ జేయుచున్నటులఁ గన్పట్టుచున్నది. ఈ జ్ఞానమునకు నుపపత్తి యా సమయమునం దతనికి చెప్పుటకు సాధ్యము కాని మాట సత్యమే; కాని యాధిభౌతికశాస్త్రమునందు సైతము మొదట ననుభవము ననంతరము దానికి నుపపత్తియు ననియే క్రమము. ఉదాహరణము: భాస్కరాచార్యులవారికి పృథ్వియొక్కయు తుదకు న్యూటు ననువానికి సమస్తమునగు ప్రపంచమునందలి వస్తువుల గురుత్వాకర్షణయొక్కయు కల్పన తోఁచుటకు మున్నె వృక్షముననుండి పండు క్రిందికి జారి పడు నను విషయ మెల్లవారికి తెలిసినదియె. అధ్యాత్మశాస్త్రమునకును నీ న్యాయ్యమే వర్తించును. నమ్మికము ప్రాప్తమయిన జ్ఞానమును పరిశీలించి దానికి నుపపత్తిని జేర్చికొనుట బుద్ధియొక్క కార్యమే కాని సర్వదా యోగ్య మయిన యుపపత్తి చెప్పలేకపోయినంత మాత్రముచేతనే, నమ్మికముచే ప్రాప్తమయిన జ్ఞానము భ్రమయే యనుటకు సాధ్యము కాదు.

అది యట్లుండ నిమ్ము. బ్రహ్మము నిర్గుణమను జ్ఞానము మాత్రముచేతనే కార్యము నిర్వహించు నెడల పైనఁ జెప్పినటుల నా

కార్యమును నమ్మకముచే సైతము నెఱవేర్పవచ్చు ననుదాని విషయమై సంశయ మేమియు లేదు (గీ. 13. 25) కాని వెనుక తొమ్మిదవ ప్రకరణమునఁ జెప్పినటుల మనుష్యునకు నీ జగత్తునందు పరమసాధ్య మగు నే బ్రాహ్మస్థితి యనఁగా నే సిద్ధావస్థ గలదో దానిని బొందుట బ్రహ్మము నిర్గుణ మను శుష్క జ్ఞానము కలుగుటచే సాధ్యము కానేరదు. చిరకాలాభ్యాసముచేతను, నెడతెగక యుండుటచేతను, నీ జ్ఞానము హృదయమందును దేహేంద్రియములందును నుండు నజ్ఞానమును భేదించుకొనిపోయి యాచరణద్వారా బ్రహ్మాత్మైక్యబుద్ధి దేహస్వభావముగ మారవలయును; మఱియు నట్లగుటకుఁ బరమేశ్వర స్వరూపమును బ్రేమచే నాకలించుకొని మనస్సును దదాకారముగఁ జేయుట యనునదియే యొక మార్గముగ నున్నది. ఈ మార్గము, లేక, సాధనము మన దేశమున చిరకాలమునందుండి వచ్చుచున్నది. దీనినే యుపాసన, లేక, భక్తియని చెప్పుచున్నారు. "సా (భక్తిః) పరానురక్తి రీశ్వరే"— ఈశ్వరుని యందలి నిరతిశయమగు ప్రేమనే భక్తియని చెప్పుచున్నా రని భక్తిలక్షణము శాండిల్యసూత్రములందు వ్రాయఁబడినది (శాండి. సూ. 2). పర మనఁగా: కేవలము నిరతిశయము నను నదియె కాక నిర్హేతుకము ననియు నర్థమే కాన, నా యనురక్తి నిష్కామముగను నిరంతరముగ నుండవలయును. "అహేతుక్యవ్యవహితా యా భక్తిః పురుషోత్తమే" (భాగ. 3.29.12) అని భాగవత పురాణమునందుఁ జెప్పఁబడినది. కారణ మేమి యనఁగా: "ఓ పరమేశ్వరా! నా కది కావలయు, నిది కావలయు" నని ప్రార్థించునపు డుండుభక్తి నహేతుక మగును. కావున కామ్యములగు వైదికయజ్ఞయాగాది కర్మలకువలె దీనికిని కొన్నియంశములయందైనను క్రియాస్వరూపము సంభవించును. భక్తి యిట్లు వ్యాపారి (అనఁగా: రాజసము) యగునేని దానివలన పూర్ణ మగు చిత్తశుద్ధి కానేరదు. మఱియు చిత్తము పూర్ణముగ శుద్ధముకానిచో నాధ్యాత్మికోన్నతికి, లేక, మోక్షప్రాప్తి కాటంకము కలుగక మానదు. అధ్యాత్మశాస్త్రమునం దున్న

పూర్ణనిష్కామత్వముయొక్క తత్త్వ మీ తీరున భక్తిమార్గమునందును స్థిరముగ నున్నది. గీత, యీ భగవద్భక్తులను నాల్గువిధములుగ విభజించెను. వానిలో అర్థార్థి (అనఁగా: ఏదో యొక కార్యముకొఱకుఁ బరమేశ్వరుని యందు భక్తిగలవాఁడు) క్రింది మెట్టులోని వాఁడు. మఱియుఁ బరమేశ్వరుని దెలిసికొనుటచే సంపాదించుకొనవలసిన దేమియు లేకపోయినను (గీ. 3.18) నారదాదులవలెనే జ్ఞాని యితర నిష్కామకర్మల నాచరించినట్లు కేవల కర్తవ్యబుద్ధిచేఁ బరమేశ్వరుని భజించునో వాఁడే సర్వభక్తులలో శ్రేష్ఠుఁ డని చెప్పఁబడినది (గీ. 7. 16.18). ఈ భక్తి భాగవతపురాణమునందు—

> శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్,
> అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్.
> (భాగవత. 7.5.23)

అను నీ తొమ్మిది విధములుగఁ జెప్పఁబడినది. అదే నారదుని యొక్క భక్తిసూత్రములయందు పదునొకండు విధము లని చెప్పఁబడినది (నా.సూ. 82). కాని యీ సర్వవిధములగు భక్తులును మహారాష్ట్రమునందున్న దాసబోధ మొదలగు గ్రంథములయందు విస్తృతముగ నిరూపింపఁబడినవి; కాన వాని విషయమై యిచ్చో విశేషచర్చ చేయను. భక్తి యెట్టి దయినను, పరమేశ్వరునిమీఁద నిరతిశయముగను నిర్హేతుకముగను ప్రేమనుంచి వృత్తి తదాకారముగఁ జేయుట యను సామాన్య కార్యమును ప్రతి మనుజుఁడు తన మనస్సుచేతనే చేయవలయునని స్పష్ట మగుచున్నది. కారణ మేమి యన: బుద్ధి యను నంతరింద్రియము కేవలము మంచి చెడుగులను, ధర్మాధర్మములను, లేక, కార్యాకార్యములను నిర్ణయించుటకంటె విశేష మేమియుఁ జేయునది కాకపోవుటచే మిగిలిన సర్వమానసిక కర్మలును మనస్సుచేతనే చేయవలసివచ్చునని వెనుక నాఱవ ప్రకరణములోఁ జెప్పఁబడినది. అనఁగా: ఉపాసనకు మనస్సును నుపాస్యముఁ (అనఁ

గా: దేనిపై ప్రేమ నుంచవలయునో యా వస్తువున్న నను రెండు విషయము లుండవలయును. కాని యుపనిషత్తులలో, నే శ్రేష్ఠ మయిన బ్రహ్మస్వరూప ముపపాదింపఁబడినదో యది యింద్రియా తీతము, అవ్యక్తము, అనంతము, నిర్గుణము "ఏక మే వాద్వితీయ" మగుటచే నుపాసన నచ్చోనుండి యారంభము చేయుటకు శక్యము కానేరదు. కారణ మేమి యన: ఈ శ్రేష్ఠమగు బ్రహ్మస్వరూప మెప్పు డనుభవగోచర మగునో యప్పుడు మనస్సు భిన్నముగ నుండదు. అనఁగా: ఉపాస్యము, ఉపాసకుఁడు, లేక, జ్ఞాత, జ్ఞేయము అను నీ రెండును నేకరూపము లగుచున్నవని వెనుక నధ్యాత్మప్రకరణములోఁ జెప్పఁబడినది. నిర్గుణబ్రహ్మము చరమసాధ్యముగ నున్నది; సాధనము కాదు; మఱియు నే సాధనముతోనైనను నిర్గుణబ్రహ్మముతో తాదా త్మ్యమును (ఏకరూపము) సంపాదించుకొనుటకు పాత్రత మనస్సు నకుఁ గలిగిననే కాని యీ శ్రేష్ఠమగు బ్రహ్మసాక్షాత్కారముకాదు. కావున సాధనములను సమకూర్చుకొని చేయు నుపాసనలో విషయమగు బ్రహ్మస్వరూపము రెండవ తరగతిలోనిది (అనఁగా: ఉపాస్యము నుపా సకము నను భేదముతో మనస్సునకు గోచర మగునది సగుణమే యని తాత్పర్యము). మఱియు నందువలన నుపనిషత్తులలో నెచ్చటెచ్చట బ్రహ్మయొక్క యుపాసన జెప్పఁబడినదో యచ్చటచ్చట నుపాస్య బ్రహ్మము అవ్యక్తమయినను సగుణమే వర్ణింపఁబడినది. శాండిల్యవిద్య యందు దేని నుపాసింపుమని చెప్పియున్నదో యా బ్రహ్మ మవ్యక్తము నిరాకారము నయినను, నది ప్రాణశరీరము, సత్యసంకల్పము, సర్వ గంధము, సర్వరసము, సర్వకర్మయు నని మనస్సునకు గోచరమగు గుణములతోఁ గూడి యుండవలయుననియు ఛాందోగ్యోపనిషత్తునందు చెప్పఁబడినది (ఛాం. 3. 14) ఉపాస్యబ్రహ్మ మిచ్చో సగుణమైనను 'అవ్యక్తము' అనఁగా: నిరాకారమై యున్నది. కాని మనుజుల మనస్సు యొక్క స్వభావము ననుసరించి పరిశీలింపగా "సగుణవస్తువులలో సైత మేది యవ్యక్తమో (అనఁగా: ఏదయిన నొక రూపము గంధము

మొదలగు గుణము లేకపోవుటచే నేత్రాదీంద్రియములకు గోచరము కాదో) దానిపై ప్రేమ నుంచుటచేఁ గాని, లేక, దాని నెల్లప్పుడును చింతించుటచేఁ గాని, మనస్సు నద్దాని విషయమై స్థిరమైనదిగ నొనర్చి కొని వృత్తిని తదాకారముగఁ జేయుటయే మిక్కిలి కష్టమైనది. వే యేల? దుఃఖసాధ్యమైనది. గారణమేమి యన, మన స్సనునది స్వ భావముగనే చంచలమైనందున నింద్రియగోచరమగు నే వస్తువైనను, నాధారార్థమై మనస్సున కెదురుగ నుండిననే కాని విషయమునను స్థిరమగుటకు వీలులేక మాటిమాటికిఁ దెలియనటులే యుండును. చిత్తస్థైర్య మను నీ మానసికకర్మ గొప్ప గొప్ప జ్ఞానులకు సైతము దుష్కరముగఁ దోఁచును; సామాన్యమనుజుని విషయమై యేమిచెప్ప వలయును? కావున భూమితిశాస్త్రము నభ్యసించుచున్నప్పు డే రీతిగ ననాది యనంతము వెడల్పు లేనిది కావుననే యవ్యక్త మయినది. అయినను నిడివి యను గుణము దానియం దుండుటచే, సగుణమైన రేఖయొక్క కల్పన మనస్సున తట్టుటకై యా రేఖయొక్క చిన్న భాగమును, నమూనాగా, బల్లపై వ్యక్తముగ వ్రాసి చూపవలసి వచ్చునో యా రీతిగనే సర్వకర్త, సర్వశక్తియుతుఁడు, సర్వజ్ఞుఁడు గనుకనే సగుణుఁడైనను నిరాకారుఁడు (అనఁగా: అవ్యక్తుఁడు) నగు పరమేశ్వరునియందు ప్రేమ స్థిరమై వృత్తి తదాకార మగుటకు మన స్సున కెదురుగా నే మైన (అనఁగా. ప్రత్యక్ష నామరూపాత్మకమగు వస్తువు) నుండిననే కాని సామాన్యులకు సాధ్యము కానేరదు. * వే

---

* ఈ విషయమున—

అక్షరావగమలబ్ధయే యథా స్థూలవర్తులదృషత్పరిగ్రహః,
శుద్ధబుద్ధపరిలబ్ధయే తథా దారుమృణ్మయశిలామయార్చనమ్.

— అక్షరములను దెలిసికొనుటకై (బాలురకు) గుండ్రని రాతిముక్కల నక్షర ములనుగఁ జెక్కి చూపించుటవలెనే (నిత్య) శుద్ధబుద్ధపరబ్రహ్మజ్ఞానము కలు గుట కొఱకు కొయ్యలు, మన్ను, రాయి వీనితోఁ జేయఁబడిన విగ్రహములను స్వీకరించుచున్నారు అని యోగవాసిష్ఠమున నున్నదని కొందఱనియెదరు; కాని, యీ శ్లోకము గురుయోగవాసిష్ఠమునఁ గానరాదు.

యేల? మొదట దేనినైన నొక వ్యక్తవస్తువును చూచిననే కాని యవ్యక్త వస్తువుయొక్క కల్పన మనుజులయొక్క మనస్సునందు స్ఫురించుటకు శక్యము గాదు. ఉదాహరణము: ఎఱుపు, పసుపు మొదలగు నవ్యక్తపురంగులను మొదట నేత్రముతోఁ జూచిన పిదప 'రంగు' అను సామాన్యమును, అవ్యక్తము నగు కల్పన మనస్సునందు స్ఫురించుచుండు ననియు, మఱియొక విధమున స్ఫురించ దనియు స్పష్టమగుచున్నది. కాని దానిని నీవు మనుజునియొక్క మనస్స్వభావ మనియైనను జెప్పుము, లేక, దోష మనియైనను జెప్పుము. ఏమి చెప్పినను మనస్సుయొక్క యీ స్వభావ మెంత పర్యంతము దేహధారి యగు మనుజునకుఁ దీసి పారవైచుటకు సాధ్యము కాదో యంత పర్యంతము నుపాసనార్థమై(అనఁగా: భక్తి కొఱకు) నిర్గుణములోనుండి సగుణములోనికి, దానియందు కూడ, నవ్యక్తమగు సగుణము నుండి వ్యక్తమయిన సగుణములోనికిని, దిగునుఁ గాని సాధ్యము కానేరదు. కావున వ్యక్తోపాసనయొక్క మార్గ మనాదినుండియు ప్రచారములోనికి వచ్చి యున్నది. తుదకు రామతాపనీయాద్యుపనిషత్తుల యందుసైతము, ప్రత్యక్షముగ మానుషరూపధారియగు వ్యక్త మయిన బ్రహ్మస్వరూపముయొక్క యుపాసన చెప్పఁబడినది. మఱియు భగవద్గీతయందు సైతము—

> క్లేశోఽధికతర స్తేషాం అవ్యక్తాసక్త చేతసామ్,
> అవ్యక్తా హి గతి ర్దుఃఖం దేహవద్భి రవాప్యతే.

— అవ్యక్తమునందుఁ జిత్తము నేకాగ్రముగఁ జేయుట చాల కష్టమగును. కారణ మేమి యనఁగా: దేహేంద్రియధారులైన మనుజులకు నీ యుక్తమగు గతినిఁ బొందుట స్వభావముగఁ గష్టమగును (గీ.12.5) అని యీ సిద్ధాంతమే సోపపత్తికముగ ననువదింపఁబడినది. ఈ ప్రత్యక్షమార్గమునే 'భక్తిమార్గ' మనుచున్నారు. బుద్ధిచేఁ బరబ్రహ్మ యొక్క స్వరూపమును నిశ్చయించిన పిదప ఆ పరబ్రహ్మముయొక్క

యవ్యక్తస్వరూపమునందు విచారణమాత్రముచేత మనస్సును స్థిర పఱచుకొనుట యొకానొక బుద్ధిమంతునకు శక్యమగును. ఎవరికిని సాధ్యము కాకపోదు; కాని యీ తీరుననే యవ్యక్తమునందు మనస్సును సక్తముఁజేయుట యను కార్యమైనను నమ్మకముచేతను, ప్రేమ చేతను మాత్రమే సిద్ధించునది యగుటచే నీ మార్గమునందును శ్రద్ధా ప్రేమలయొక్క యావశ్యకత యుండక తప్పదు. కావున నిజముగ విచారించిన యెడల సచ్చిదానందబ్రహ్మోపాసనను సైతము ప్రేమ మూలక మగు భక్తిమార్గమునందే చేర్పవలయును. అయినను ధ్యానార్థమయి యీ మార్గమునందుఁ గైకొనఁబడిన యీ బ్రహ్మ స్వరూపము తొలుతనుండియు నవ్యక్తమును, కేవల బుద్ధిగమ్యమును (అనఁగా: జ్ఞానగమ్యమును) ప్రధానమును నగుటచే నీ క్రియను భక్తిమార్గమనక, నధ్యాత్మవిచారము, అవ్యక్తోపాసన, లేక, కేవల ముపాసన, లేక, జ్ఞానమార్గము ననుట పరిపాటి; మఱియు నుపాస్య బ్రహ్మము సగుణముగనే యుండవలసివచ్చినను, అదియే యవ్యక్తమునకు మాఱుగ వ్యక్తముగ నుండుటయు, నా వ్యక్తస్వరూపము లందు సైతము, ముఖ్యముగ మనుష్యదేహధారిగ స్వీకరింపఁబడెనేని, యట్లు స్వీకరించుటయే భక్తిమార్గమగును, కాని, మార్గములు రెండైనను రెండింటియందు నొక పరమేశ్వరుఁడే, పొందఁ దగినవాఁడును, తుద కొక సామ్యబుద్ధియే మనస్సునందుఁ బుట్టును గానఁ దమతమ యధికారానుసారముగ నొక మేడమీఁదికే యెక్కుటకు నీ రెండును ననాదిసిద్ధములును వేర్వేఱైనవియు నగు నిచ్చెనలుగ నున్నవి. మార్గము వే అగుటచే సాధ్యములు వేఱైనవి కావని స్పష్టముగఁ గాన్పించుచున్నది. వీనిలో నొక నిచ్చెనకు బుద్ధియు, రెండవదానికి శ్రద్ధయు, ప్రేమయు మొదటి మెట్లుగ నున్నవి. మఱియు నే మార్గము నుండి వెడలినను, తుద కొక పరమేశ్వరునియొక్కయే, యొక విధ మగు జ్ఞానమే కలుగుటచే, నొక విధమేయగు మోక్షము లభించు నను

సిద్ధాంతము సైతము రెండు మార్గములందు నొక్క రీతినే స్థిరముగ నున్నది; కాని 'జ్ఞానమార్గము శ్రేష్ఠమా? భక్తిమార్గము శ్రేష్ఠమా?' యని చర్చించుటచే లాభ మేమి? రెండు సాధనములును మొదట నధికారితారతమ్యముంబట్టి వేర్వేఱైనను పరిణామమునందు సమాన మైన యోగ్యత గలవియే కావున రెంటికిని 'అధ్యాత్మ' మని యొక పేరే గీతలయందు జెప్పఁబడినది (గీ. 11.1).

కాని సాధనమను సంబంధముచే భక్తిజ్ఞానములను రెండును సమానమయిన యోగ్యతఁ గలవియే యైనను భక్తి యనునది యెప్పుడును నిష్ఠ కాదు. జ్ఞాన మనునది నిష్ఠ (అనఁగా: సిద్ధావస్థయందలి కడపటి స్థితి) కావచ్చు ననునది యీ రెండింటిలోనున్న భేదము. అధ్యాత్మవిచారముచేఁ గాని, యవ్యక్తోపాసనచేఁ గాని కల్గు పరమేశ్వరుని జ్ఞానమే భక్తి కాఁగలదను మాట (గీ. 18.౫౫) సత్యమే; కాని యీ జ్ఞానము కలిగిన పిదప నా పురుషుఁడు సంసారమును వదలి, యా జ్ఞానమునందే మగ్నుఁడయి యుండిన యెడల నతనిని గీత 'జ్ఞాననిష్ఠుఁడని' చెప్పును; 'భక్తినిష్ఠుఁ'డని చెప్పదు. కారణ మేమి యనఁగా: భక్తి యను క్రియ యుపాస్యము నుపాసకుఁడు నను ద్వైత భావముతోఁ గూడినది యగుటచే కడపటిదైన బ్రహ్మాత్మైక్యస్థితి యందు భక్తి గాని యితరమయిన యే యుపాసనగాని యుండనేరదు. భక్తికిపర్యవసానము జ్ఞాన మగుటచే భక్తి యనునది దానికి సాధనము, సాధ్యము కాదు. కావున నవ్యక్తోపాసన యను విషయమున జ్ఞాన మనునది యొకప్పుడు సాధన మైనప్పటికిని బ్రహ్మాత్మైక్యముయొక్క యపరోక్షానుభవ మను విషయమున నా జ్ఞానమే నిష్ఠ (అనఁగా: కడపటిస్థితి) కాఁగలదని సారాంశము. మఱియు నీ భేదమును జూపించుట యావశ్యకమైనప్పుడు, జ్ఞానమార్గజ్ఞాననిష్ఠాశబ్దములను, సమానార్థకములుగఁ బ్రయోగింపక యవ్యక్తోపాసనయొక్క సాధనావస్థ యందున్న స్థితిని దెలియఁజేయుటకు 'జ్ఞానమార్గ' మనియు,

జ్ఞానము కలిగినపిదప సకలకర్మల పరిత్యజించి జ్ఞానమునందె మగ్నుఁడై పోవునట్టి సిద్ధావస్థయందున్న వాని స్థితిని దెలియఁ జేయుటకు 'జ్ఞాననిష్ఠ' యనియు రెండు శబ్దములు ప్రయోగింపఁబడినవి. అనఁగా: అవ్యక్తోపాసన, లేక, అధ్యాత్మవిచారము అను విషయమున జ్ఞాన మనునది యొకసారి సాధన మగునేని (అనఁగా: జ్ఞానమార్గ మగునేని) అపరోక్షానుభవ మను విషయమునం దదియే నిష్ఠ (అనఁగా: తుదయి నట్టియుఁ గర్మత్యాగరూప మయినట్టియు నవస్థ) కాఁగలదు. మఱియుఁ గర్మయొక్క విషయము నటులె యున్నది. శాస్త్రోక్త మర్యాదానుసారముగ జిత్తశుద్ధ్యర్థ యి యే కర్మ మొదటు చేయ వలసివచ్చునో యది సాధన మగును. ఈ కర్మలచేఁ చిత్తశుద్ధికలిగి పరిణామమునందు జ్ఞానమును, శాంతియు ప్రాప్త మగును. కాని ముందీ జ్ఞానమునందే మగ్నుఁడు గాక శాంతిచే నామరణాంతమును నిష్కామ కర్మలను జేయుచుండె నేని, జ్ఞానయుక్తనిష్కామకర్మ యను విషయమునందు కర్మ యనునది నిష్ఠ కావచ్చును (గీ. 3.3). భక్తివిషయ మట్లు కానేరదు. భక్తి యనునది కేవలము మార్గము. జ్ఞానప్రాప్తికి సాధనము; నిష్ఠ కాదు. కావున గీతారంభమునందు జ్ఞానము (సాంఖ్యము), యోగము (కర్మ) నను రెండు నిష్ఠలనే యుపన్యసించి వానిలోఁ గర్మయోగనిష్ఠయొక్క సిద్ధికొఱకు సుపాయములు, సాధనములు, విధులు, లేక, మార్గము లేవియో చెప్పుచు (గీ. 7.1), నవ్యక్తోపాసన (జ్ఞానమార్గము), వ్యక్తోపాసన (భక్తిమార్గము) యనునవి యన్నదమ్ములవలె పూర్వాపరములై నడచివచ్చుచున్న రెండు సాధనములని చెప్పి యారెంటిలో నవ్యక్తోపాసన క్లేశమయ మగుటచే, వ్యక్తోపాసన, లేక, భక్తియను సాధన మధిక సులభము (అనఁగా: ఎల్లవారికి నాచరించుటకుఁ దగినట్లున్నది) అని చెప్పఁబడినది. "తుజ్వావా ఆహేదేవ తరి హా సులభ ఉపాయ" (గా. 3002) అనియే యీ విషయమున గీత చెప్పును. ప్రాచీనోనిష

షత్తులలో జ్ఞానమార్గమే విచారింపఁబడియున్నది. మఱియుశాండిల్యాది సూత్రములు, లేక, భాగవతాది ధర్మములును భక్తిమార్గముయొక్క మాహాత్మ్యమునే స్తుతించుచున్నవి. కాని జ్ఞానమార్గభక్తిమార్గములకు సాధన మను సంబంధముచే నధికారితారతమ్యమునుబట్టి భేదమును జూపి రెండిఁటికిని తుదకు నిష్కామకర్మతో నైక్యముచేయుట యను కార్యము గీతలయందువలె సమబుద్ధితో, నే యితర ప్రాచీన ధర్మ గ్రంథమునందును చేసినట్టు స్పష్టముగఁ గాన్పింపదు.

సర్వభూతములయందు నొక పరమేశ్వరుఁడే కలఁడను నీశ్వర స్వరూపముయొక్క యథార్థమును, ననుభవాత్మకమయిన జ్ఞానము గలుగుటకు దేహేంద్రియధారులైన మనుజు లేమి చేయవలసి నదియు, పైన చెప్పిన ప్రకారముగ విచారించితిమేని, అనాదియు, ననంతము, ననిర్వాచ్యము, నచింత్యము, 'నేతి నేతి' యను వాక్య ములచేఁ జెప్పఁబడునదియు నగు నీ పరమేశ్వరస్వరూపము శ్రేష్ఠ మయిన దయినను నది నిర్గుణము, అజ్ఞేయము, అవ్యక్తము నగుటచే మనకు ననుభవములోనికి వచ్చినప్పు డుపాస్యుఁడు, నుపాసకుఁడు నను నీ ద్వైతభావ ముండక పోవుటచే నుపాసన యచ్చోనుండి యారంభింపఁ బడుటకు శక్యము కాదనియు, నది సాధ్యము గాని, సాధనము గాదనియుఁ దోఁచును. మఱియు తద్రూపమగు నద్వైతము యొక్క స్థితినొందుటకు నుపాసన యనునది యుపాయము గావున, నీ యుపాసనకొఱకై యే వస్తువు కైకొనఁదగినదో యది సగుణము గనే యుండవలసివచ్చును. సర్వజ్ఞుఁడు, సర్వశక్తియుతుఁడు, సర్వ వ్యాపియు, నిరాకారుఁడు నగు బ్రహ్మముయొక్క స్వరూప మటు లున్నది. అనఁగా సగుణముగ నున్నది. కాని యది కేవలము బుద్ధి గమ్యము, అవ్యక్తము, (అనఁగా: ఇంద్రియములకు నగోచరము) అగుటచే నుపాసన నొనరించుట క్లేశ మగును. ఈ యుపాసనకొఱకు పరమేశ్వరునియొక్క యీ రెండుస్వరూపములకంటె, నే పరమేశ్వరుఁ

డచింత్యుఁడును, సర్వసాక్షియు, సర్వవ్యాపియు, సర్వశక్తియుతుఁడును జగదాత్మయు నయి మన మాతనితో మాటలాడునట్లు మనతో మాటలాడునో, మనపై మమతను జెందునో, మనకు సన్మార్గమును జూపి సద్గతి నిచ్చునో, యెవరిని మనము మనసంబంధమైనవాఁ డని చెప్పుదుమో, మనయొక్క సుఖదుఃఖముల నెవరికిఁ దెలియఁ జేయవలయునో, యెవరు మనయొక్క యపరాధములను క్షమింతురో, నేను నీవాఁడ ననియు నీవు నావాఁడ వనియు మన మెవనితోఁ జెప్పుదుమో, యెవఁడు మనలఁ దండ్రివలె రక్షించునో, తల్లివలెఁ బోషించునో, లేక, "గతిర్భర్తా ప్రభుః సాక్షీ నివాసః శరణం సుహృత్" (గీ. 9-17)- నాయొక్క గతి, నాకు పోషణకర్త, నాకు ధని, నాకు సాక్షి, నాయొక్క నివాసమునకును నాయొక్క విశ్రాంతికిని నివాసస్థానమో, నాయొక్క కడపటి యాధారమును మూలస్తంభమును, నాయొక్క స్నేహితుఁడును, కింకరుఁడునై యుండెనో, పిల్లవానివలె నే నెవరిని ప్రేమతోడను, లాలనతోడను జూతునో, యట్టి సత్యసంకల్పుఁడును, సకలైశ్వర్యసంపన్నుఁడును, దయాసాగరుఁడును, భక్తవత్సలుఁడును, పరమపవిత్రుఁడును, పరమోదారుఁడును, పరమకారుణికుఁడును, పరమపూజ్యుఁడును, సర్వసుందరుఁడును, సకలగుణనిధానమును, లేక, సంక్షేపముగఁ జెప్పవలసి వచ్చినచో సగుణుఁ డనియు, ప్రేమగమ్యుఁడనియు, వ్యక్తుఁడనియు (అనఁగా: ప్రత్యక్షరూపధారి యనియు), సులభుఁడు నగు పరమేశ్వరుఁడే మనుజునియొక్క భక్తికొఱకు స్వభావముగనే యవతరించుచున్నాఁడని, యే ధర్మముఁ జూచినను గాన్పించుచున్నది. మూలమునందు 'ఏక మే వాద్వితీయం' అయిన పరబ్రహ్మము, ప్రేమయు, శ్రద్ధయు మొదలుగఁ గలిగిన మనోమయములగు నుపనేత్రములచే మనుజులకు గోచరమగును. కడపటఁ జెప్పఁబడిన రెండువిధములయిన స్వరూపములనే వేదాంతశాస్త్రమునం దీశ్వరుఁడని యనుచున్నారు. "పరమేశ్వరుఁడు సర్వవ్యాపి యైనను పాండురంగమూర్తియు, విఠో

బాయును నేల చిన్నమూర్తులుగ నున్నారు?” అను ప్రశ్నమునకు “హరితుకావ్హాణె అవఘా ఏకలా, పరిహా ధాకులా భక్తసారీ”— ఒక హరియే యంతటను వ్యాపించినవాఁడుగను, సర్వసముఁడుగ నున్నాఁడు; అయినను భక్తికొఱకు ఆ భగవంతుఁడు కొద్దివాఁడగు చున్నాఁడు అని తుకారాం బువాగారు సమాధానమును జెప్పిరి (గా. 38.7). ఆ సిద్ధాంతమే వేదాంతసూత్రములయందు వ్రాయఁ బడినది (1.2.7). ఉపనిషత్తులలో నే యే స్థలములయందు బ్రహ్మోపాసన వర్ణింపఁబడినదో యా యా స్థలములయం దెల్ల ప్రాణము మనస్సు మొదలగు సగుణవస్తువులును, నవ్యక్తవస్తువులును మాత్రమే నిర్దే శింపఁబడక యొకానొకప్పుడు సూర్యుఁడు (ఆదిత్యుఁడు), లేక, యన్నము మొదలగు సగుణము లగు వ్యక్తపదార్థములయొక్క యుపాసనయుఁ జెప్పఁబడినది (తై. 3. 2 6; ఛాం. 7). మఱియు శ్వేతాశ్వతరోపనిషత్తునందు “మాయాం తు ప్రకృతిం విద్యాత్ మాయి నం తు మహేశ్వరమ్”— ప్రకృతికి మాయ యని పేరు గాన, నా మాయ కధిపతి యగువాఁడే మహేశ్వరుఁడు (శ్వే. 4. 10) అని ఈశ్వరలక్షణము చెప్పిన పిదప “జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః” ఈ దేవుని తెలిసికొనె నేని సర్వపాశముల నుండియు ముక్తుఁడగును (4-16) అని యనేక స్థలములయందు గీతలయందు వలెనే సగుణుఁ డని చెప్పఁబడినది (గీ. 10.3). ఉపాస్యబ్రహ్మముయొక్క చిహ్నము, ఆనవాలు, అవతారము, అంశ, లేక, ప్రతినిధి యని పేర్గొని యుపా సనార్థమై యావశ్యకములైన యీ నామరూపాత్మకములగు వస్తువులనే వేదాంతశాస్త్రమునందు 'ప్రతీక'మని చెప్పుదురు. ప్రతీక (ప్రతి+ఇక) అనఁగాఁ: దనవైపునకు, 'ప్రతి=తెలిసిన' అని ధాత్వర్థము గాన నే వస్తువుయొక్కయైనను నేప్రదేశము మొదట గోచరమై దానిమూల మున నసలు వస్తువుయొక్క జ్ఞానము మనకుఁ గలుగునో యా భాగ మును 'ప్రతీక' మందురు. ఈ న్యాయముచే సర్వ వ్యాపియగు పర మేశ్వరుని జ్ఞానము గలుగుటకు నాతనియొక్క యేదైన నొకప్రత్యక్ష

మగు భాగమును, లేక, అంశరూపమయిన విభూతియు ప్రతీకము గాఁగలదు. ఉదాహరణము: మహాభారతమునందున్న బ్రాహ్మణ వ్యాధ సంవాదమునందు వ్యాధుఁడు బ్రాహ్మణునకు నధ్యాత్మజ్ఞాన మును జెప్పిన పిదప తుదకు "ప్రత్యక్షం మమ యో ధర్మ స్తం చ పశ్య ద్విజోత్తమ"— నాయొక్క ధర్మమునిప్పుడు ప్రత్యక్షముగఁ జూడుము (మ.భా.వన. 213.3) అని చెప్పి యా బ్రాహ్మణుని వ్యాధుఁడు వృద్ధు లగు తన తల్లిదండ్రుల కడకుఁ దోడ్కొనిపోయి, "వీరు నాకుఁ బ్రత్యక్ష దేవతలు" అని మనస్సున భావించుకొని యీశ్వరుని సేవించినటుల సేవించుటయే నా ప్రత్యక్షధర్మ మని చెప్పెను. మఱియు నీ యభి ప్రాయమునే మనస్సున నిడికొని తన వ్యక్తస్వరూపముయొక్క యుపాసనను చెప్పక మునుపు భగవంతుఁడు గీతలయందు భక్తి మార్గము—

రాజవిద్యా రాజగుహ్యం పవిత్ర మిద ముత్తమమ్,
ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తు మవ్యయమ్.

— సర్వవిద్యలలోను శ్రేష్ఠమైనది (రాజవిద్యయు), సర్వగుహ్యము లలోను శ్రేష్ఠమైనది (రాజగుహ్యము) ఉత్తమమును, బవిత్రమును, ప్రత్యక్షముగఁ గాన్పించునదియు, ధర్మానుకూల మయినదియు, సుఖ ముగ నాచరించుటకు యోగ్యమయినదియు, నక్షయ్యమును నైనది (గీ. 9. 2) అని చెప్పెను. రాజవిద్యారాజగుహ్యము లను నీ రెండు సమాసములకును 'విద్యానాం రాజా' యనియు 'గుహ్యానాం రాజా' యనియు, (విద్యలకు రాజు, మఱియు గుహ్యములకు రాజు) విగ్ర హము గాన, సమాసమైన పిదప దానియందున్న రాజశబ్దము సం స్కృతవ్యాకరణ నియమానుసారముగ పూర్వమునందుఁ బ్రయోగిం పఁబడవలసి వచ్చును. కాని దీనిని మఱియొకవిధముగ "రాజ్ఞాం విద్యా (రాజులయొక్క విద్య) యని మఱియొక విగ్రహముఁ జేసి కొని, యనేకులు యోగవాసిష్ఠమునందు చెప్పఁబడినటులు (యో.

2.11.16.18), ప్రాచీనులగు ఋషులు రాజులకు బ్రహ్మవిద్య నుపదే శించినందున బ్రహ్మవిద్యకే, లేక, యధ్యాత్మజ్ఞానమునకే, రాజవిద్య యనియు, రాజగుహ్య మనియు పేర్లు వచ్చిన వనియు, కావున గీతల యందున్న రాజవిద్యారాజగుహ్యము లను నీ రెండు శబ్దములకును రాజుల కుపదేశింపఁబడిన విద్యయు గుహ్యము నని యర్థము చెప్ప వలయు ననియు (అనఁగా: అధ్యాత్మజ్ఞానము వివక్షితము గాని, భక్తి వివక్షితము గానేర దనియు) వారి యభిప్రాయము. గీతలలోనున్న మార్గమును మనువు, ఇక్ష్వాకుఁడు మొదలగు రాజులయొక్క పరం పరచేతనే ప్రవర్తింపఁ జేయఁబడినది (గీ. 4. 1). కాన, 'రాజవిద్యా రాజగుహ్యం' అను నీ రెండు శబ్దములును రాజులయొక్క విద్య, రాజులయొక్క గుహ్యము (అనఁగా: రాజమాన్యము లగు విద్యా గుహ్యము)లను నర్థములందే గీతలలోఁ బ్రయోగింపఁబడలేదని చెప్పు టకు సాధ్యము కాదు. కాని యీ యర్థమును స్వీకరించినను ప్రకృత స్థలమునందున్న యీ శబ్దములు జ్ఞానమార్గము నుద్దేశించి ప్రయో గింపఁ బడలేదని తెలిసికొనవలయును. కారణ మేమి యనఁగా: ఈ శ్లోకము గీతలలో నే యధ్యాయమునఁ జెప్పఁబడినదో దానియందు మొత్తముపై భక్తిమార్గమే ప్రతిపాద్యమై యున్నది (గీ. 9.22-31). మఱియు సాధ్యమైన బ్రహ్మయొక్కటి యయినను, అధ్యాత్మవిద్య యందున్న సాధనాత్మకమైన జ్ఞానమార్గము కేవలము బుద్ధిగమ్య మును, 'అందుచేతనే యవ్యక్తము'ను దుఃఖకారకము నగునని గీతల యందే స్పష్టముగఁ జెప్పఁబడినందున (గీ. 12. 5) తద్విరుద్ధముగ దానినే భగవంతుఁ డిప్పుడు 'ప్రత్యక్షావగమం' అనఁగా: వ్యక్తము మఱియు 'కర్తుం సుసుఖం' అనఁగా: ఆచరించుట సుఖకారక మనియు చెప్పుట సంభవించునని తోఁపదు. కావున ప్రకరణ సామ్యముకొఱ కును, కేవలభక్తిమార్గమునకే సరిగ సంబంధించునది యగుటచేతను రాజవిద్యాశబ్దముచే భక్తిమార్గమే యిచ్చో వివక్షితమయి యున్నదని

సిద్ధమగును. 'విద్య' యను శబ్దము కేవల బ్రహ్మజ్ఞానవాచకముగనే గాక పరబ్రహ్మ నెఱుంగుటకు నే సాధనములు, లేక, మార్గములు గలవో తద్వాచకముగ సైత ముపనిషత్తులలోఁ బ్రయోగింపఁబడినది. ఉదాహరణము: శాండిల్యవిద్య; ప్రాణవిద్య, హార్దవిద్య మొదలగునవి; మఱియు వేదాంతసూత్రములలోఁ దృతీయాధ్యాయము నందలి తృతీయ పాదమునం దుపనిషత్తులలోఁ జెప్పఁబడిన యీ సర్వవిద్య లును (అనఁగా: సాధనములు) విచారింపఁబడినవి. ఈ విద్య గుప్త ముగ నుండుటచే ముఖ్యశిష్యులకే తప్ప నితరుల కెవ్వరికిని పూర్వ ముపదేశింపకుండ నుండి రనియు నుపనిషత్తులయందుఁ గాన్పించు చున్నది. కావునను విద్యను గైకొనినను నది గుహ్యముగనే యుండ వలయును; కాని బ్రహ్మప్రాప్తిని గుఱించి సాధనభూతములైన యే యే గుహ్యవిద్యలు, లేక, మార్గములు గలవో యవి యనేకములున్నను వాని యన్నింటిలోను గీతలయందున్న భక్తిమార్గరూపమగు విద్యయే యనఁగా: సాధనమే శ్రేష్ఠము (విద్యానాం చ, గుహ్యానాం చ రాజా) కారణ మేమి యన: జ్ఞానమార్గము నందలి విద్యవలె నది 'వ్యక్తము' కాక, నేత్రములకుఁ బ్రత్యక్షముగఁ గాన్పించునదిగ నున్నది. మఱియు నందువలన దానియొక్క యాచరణమును సుఖముగఁ జేయవచ్చును అని మా మతమునందు పై శ్లోకమునకు భావార్థకముగ నున్నది. గీతలయందు కేవలము బుద్ధిగమ్యమగు జ్ఞానమార్గమే ప్రతిపాద్యమైన యెడల వైదికధర్మముల యందున్న సర్వసంప్రదాయముల వారికిని వేలకొలఁది వత్సరములుగ నేటివఱకు నీ గ్రంథమున నింత గౌరవ ముండునా యని తోఁచును. లోకులకు గీతయందున్న మాధుర్యము, ప్రేమ, లేక, రసపూర్ణత యనునది దానియందుఁ బ్రతిపాదింపఁబడిన భక్తిమార్గముయొక్క పరిణామమే యై యున్నది. పరమేశ్వరుని యొక్క ప్రత్యక్షావతారమైన శ్రీకృష్ణుఁడే మొదట గీతాధర్మములఁ జెప్పువాఁడు, మఱియు దానిలోను, అజ్ఞేయమగు పరబ్రహ్మముయొక్క

శుష్కజ్ఞానమును జెప్పక ప్రతి స్థలమునందును "నాయందు సర్వము ఓతప్రోతమయి యున్నది" (గీ.7.7); "ఈ సమస్తమును నాయొక్క మాయయే" (గీ. 7. 14); "నాకంటె వేఱగు రెండవ వస్తువేదియు లేదు" (గీ. 7. 7); "నాకు శత్రువులును మిత్రులును సమానులే" (గీ. 9. 29); "నేనే యీ జగత్తును బుట్టించినాఁడను" (గీ. 9. 4) అనియుఁ, దుదకు "నేనే బ్రహ్మమునకును; మోక్షమునకును మూలభూతుఁడను (గీ. 14. 27); నేను పురుషోత్తముఁడను (గీ. 15. 18); కావున సర్వధర్మములను వదలి నీవు నన్ను ఒకనినే సేవింపుము. నేను నిన్ను సకల పాపముల నుండి ముక్తునిగఁ జేయుదును; భయపడకుము" (గీ. 18.66) అనియు తనయొక్క సగుణమును, వ్యక్తము నయిన రూపము నుద్దేశించి భగవంతుఁ డర్జునున కుపదేశించెను. అందువలన సమదృష్టి, పరమపూజ్యుఁడును ప్రేమపూర్ణుఁడు నయిన పురుషోత్తముని యెదుట మనము సాక్షాత్తుగా నిలువఁబడి యున్నామని శ్రోతకు భావన పుట్టును గాన నాత్మజ్ఞానమునం దతనికి దృఢనిష్ఠ గలుగుటయే కాక యొకప్పుడు జ్ఞానము, భక్తి యను వానిని వేఱువేఱుగ విభజింపక జ్ఞానమునందు భక్తియును, భక్తియందు జ్ఞానమును గుంభితముగ నుండుటచే జ్ఞానభక్తులు, లేక, బుద్ధిప్రేమలు అను వానికిఁ బరస్పర విరోధము లేదనియు తోఁచుటచే పరమేశ్వరుని యొక్క జ్ఞానమువలెనే దానియందున్న రసము సైత మనుభవగోచరమగును. మఱియు సర్వభూతములయందు నాత్మౌపమ్యబుద్ధి స్ఫురించుటచేఁ దుదకుఁ జిత్తమునకు విలక్షణమగు శాంతియు, సమాధానసుఖమును ప్రాప్త మగును. పాలలోఁ బంచదార వేసినటుల దీనియందే కర్మయోగముయొక్క భారము వేయఁబడినది; కాని గీతలయందున్న జ్ఞానము ఈశావాస్యోపనిషత్తులోఁ జెప్పినటుల మృత్యువును, అమృతమును— అనఁగా: ఇహలోకము, పరలోకము కలిసి శ్రేయస్కర మగునని మన పండితులు సిద్ధాంతము చేసినందుల కేమియు నాశ్చర్యము లేదు. పై వివేచనవలన, భక్తిమార్గ మనఁగా

నేమి? జ్ఞానమార్గమునందును భక్తిమార్గమునందును గల సామ్య వైషమ్యము లేవియైనదియు, భక్తిమార్గమును రాజమార్గము (రాజ విద్య) సులభమైన నిచ్చెన యని యేల చెప్పుచున్నదియు, గీతల యందు భక్తి స్వతంత్రనిష్ఠ యని యెందులకుఁ జెప్పఁబడదో యది యుఁ జదువరులకు స్పష్ట మగును; కాని జ్ఞానప్రాప్తికిని సులభము, ననాది, ప్రత్యక్షమునగు మార్గమునందు సైతము మోసపోవు స్థల మేది గలదో దాని నిప్పుడు చెప్పవలయును. చెప్పనంతట నా మార్గమునఁ బోవు బాటసారులు భ్రమపడి యపమార్గమునఁ బడవచ్చును. భగవ ద్గీతలో నీ యపమార్గము స్పష్టముగఁ జెప్పఁబడినది. వైదికభక్తి మార్గమునం దితరమగు భక్తిమార్గములకంటె నుండు విశేష మిదియే. పరబ్రహ్మమందు మనస్సుయొక్క యాసక్తి గృఢమై చిత్తశుద్ధి ద్వారా సామ్యబుద్ధి యుత్పన్న మగుటకు సామాన్య మనుజుల యెదుట పరబ్రహ్మముయొక్క "ప్రతీక" మని యేదైన నొక సగుణవస్తు వనఁగా వ్యక్తమగు వస్తు వుండవలయును. లేనిచోఁ జిత్తము స్థిరము కానేర దనునది మాత్రమే విచారింప, నది యెల్లరకు నంగీకార్యముగ నున్నను, ఈ ప్రతీకము లెట్లుండవలయు నను విషయమున ననేక పర్యాయములు కలహించుచున్నా రనియు, నితిహాసములవలన స్పష్ట మగును. అధ్యాత్మజ్ఞానదృష్టిచేఁ జూచితి మేని యీ పరమేశ్వరుఁడు జగత్తునం దెచ్చటను లేకపోఁడు. మఱియు భగవద్గీతలయందును అర్జునుఁడు "నిన్ను ఏ యే విభూతులయొక్క రూపముచేఁ జింతింప వలయునో (భజింపవలయునో) ఆ విభూతులను నాకుఁ జెప్పుము" (గీ. 10.18) అని శ్రీకృష్ణుని ప్రశ్నచేసిన పిదప పదియవయధ్యాయ మునందు భగవంతుఁ డింద్రియములలో మనస్సు, స్థావరములలో హిమాలయము, యజ్ఞములలో జపయజ్ఞము, సర్పములలో వాసుకి దైత్యులలో ప్రహ్లాదుఁడు, పితరులలో నర్యముఁడు, గంధర్వులలో చిత్రరథుఁడు, వృక్షములలో నశ్వత్థము, పక్షులలో గరుడుఁడు,

మహర్షులలో భృగువు, అక్షరములలో అకారము, ఆదిత్యులలో విష్ణువు మొదలగు స్థావరజంగమాత్మక మగు సృష్టియందు నాలుగుమూలలు వ్యాపించియున్న తన యనేక విభూతులను వర్ణించి తుదకు–

యద్య ద్విభూతిమత్ సత్త్వం శ్రీమ దూర్జిత మేవ వా,
త త్తదే వావగచ్ఛ త్వం మమ తేజోఽంశసంభవమ్.

గీ. 10.41.

– ఓ యర్జునా! ఏ యే వస్తువులు వైభవముతోడను, లక్ష్మితోడను, ప్రభావముతోడను కూడుకొని యున్నవో యవి యన్నియు నా తేజస్సుయొక్క యంశమునుండి పుట్టినవని యెఱుంగుము. విశేష మేమి చెప్పవలయును? నాయొక్క యొక అంశముచేతనే యీ సర్వజగత్తును వ్యాపించియున్నాను అని చెప్పెను. మఱియు దీని యనంతరమునందు నధ్యాయములో విశ్వరూపదర్శనముచే నీ సిద్ధాంతమున నర్జునునకుఁ బ్రత్యక్షజ్ఞానము పుట్టునట్లు చేయఁబడినది. జగత్తున కంటికిఁ గాన్పించు వస్తువులు, గుణములు పరమేశ్వరుని యొక్క రూపములే (ప్రతీకములే) యైనయెడల, వానిలోఁ బర మేశ్వరుఁ డొకదానియందే యున్నాఁడనియు మఱియొకదానియందు లేఁడనియు నెవఁ డెట్లు చెప్పును? అతఁడు దూరమునం దున్నను సమీపమునం దున్నాఁడు. సద్రూపుఁడు నసద్రూపుఁడు నగుటచే నీ రెండింటికి పరమందున్నాఁడు; లేక, గరుడుఁడు–సర్పము, మృత్యువు–చచ్చువాఁడును, విఘ్నకర్త–విఘ్నహర్త, భయకృత్తు–భయనాశనుఁడు, ఘోరుఁడు–అఘోరుఁడు, శివుఁడు–అశివుఁడు, సృష్టిని కలుగఁజేయు వాఁడు–అరికట్టువాఁడును (గీ. 9.19 మఱియు 10.32) నతఁడే యయి యున్నాఁడని యంగీకరించుటయే శాస్త్రమూలముగఁ దెలి యును. మఱియు భగవద్భక్తుఁడగు తుకారాంబువాగారును–

తుకా మ్హణే జేఁ జేఁ బోలా, తేఁ తేఁ సాజే యా విఠ్ఠలా.

తు.గా. 4085.4

– మన మే రీతిగఁ జెప్పినను నది యీ భగవంతునియొక్క మహి మకుఁ దగియే యుండును అని చెప్పిరి. జగత్తుయొక్క ప్రతి వస్తు వును ఇట్లంశమునుబట్టి పరమేశ్వరునియొక్క సర్వవ్యాపక మగు రూపము నొక్కసారిగ కనిపెట్టలేని వారి యవ్యక్తము శుద్ధము నయిన రూపమును దెలిసికొనుటకు సాధనములని, లేక, ప్రతీకము లని యీ యనేకవస్తువులలో నే వస్తువునైనను మొదట నుపాసనార్థమై గ్రహించుటకు నభ్యంతర మేమి? కొందఱు మనస్సున నుపాసించెద రేని, కొందఱు జపయజ్ఞములను ద్రవ్యయజ్ఞములను జేయుదురు. ఒకఁడు గరుఁడుని భజించె నేని యొకఁడు 'ఓమ్' అను మంత్రాక్షర మునె జపియించును. కొందఱు విష్ణువును, కొందఱు శివుని, కొందఱు గణపతిని, కొందఱు భవానిని భజింతురు. కొందఱు మాతాపితరులను పరమేశ్వరుఁ డను బుద్ధితో సేవింతురు. కొందఱు వానికంటె వ్యాపకమైన విరాట్పురుషునియొక్క యుపాసన శ్రేష్ఠమని యెన్నుదురు. కొందఱు సూర్యుని భజింపుఁ డని చెప్పుదు రేని, మఱి కొందఱు సూర్యునికంటె కృష్ణుఁడును, రామచంద్రుఁడును శ్రేష్ఠులని నుడువుదురు; కాని యీ సర్వవిభూతియు మూలమునం దొక్కటిగనే యున్న దను దృష్టి యజ్ఞానముచేఁ గాని మోహముచేఁ గాని చెడి పోవుటచే, లేక, ధర్మమునందు మొదట నేమియు లేమిచే నిట్టి యుపాసనలయందే వృథాభిమాన ముత్పన్నమగును. కావున ననేక సమయములయందు యుద్ధముఁ జేయవలసినంత యవకాశము గలుగును. వైదిక, బౌద్ధ, జైన, క్రైస్తవ, మహమ్మదీయ ధర్మముల యందున్న పరస్పరవిరోధముల నొకవైపున నుంచినను, నొక సగుణ మును వ్యక్తమునైన క్రైస్తవమతమునందే యుపాసకులలో విధి భేదములచే నొకరి నొకరు చంపుకొనునట్టి సమయము వచ్చిన దని ఐరోపాఖండపు ఇతిహాసమునుండి కాన్పించుచున్నది. మఱియు మన దేశమునందున్న సగుణోపాసకులలో సైత మొకరి దేవుఁడు నిరా కారుఁడై మఱియొకరి సాకారదేవునికంటె బాగుగ నున్నాఁడని

వివాదము నేఁటికిని జరుగుచునే యున్నది. భక్తిమార్గమునం దుద్భ
వించు నీ వివాదమును తీర్మానించుట కేదైన మార్గమున్నదా? ఉండె
నేని యది యెద్దియో చెప్పినఁ గాని భక్తిమార్గము నిరపాయము
కానేరదు. కావున గీతయం దీ ప్రశ్న కేమియుత్తర మీయఁబడినదో
యిప్పుడు కొంచెము విచారింతము. హిందూస్థానము నందలి
ప్రస్తుతపుస్థితిలో నీ ప్రశ్నకు యోగ్యమగు నుత్తర మిచ్చుట విశేష
మహత్త్వము గలదని చెప్ప నక్కఱ లేదు.

మనస్సును స్థిరపఱచుకొని సామ్యబుద్ధిని సంపాదించుకొను
నిమిత్తమై పరమేశ్వరునియొక్క యనేకములగు నగుణవిభూతులలో
నేదో యొక జాతియొక్క స్వరూపమును మనస్సున మొదట నుంచు
కొనుటయు, లేక, ప్రతీక మని ప్రత్యక్షముగ కంటియెదుట నుంచు
కొనుటయు నను నీ సాధనము ప్రాచీనములగు నుపనిషత్తులయందు
సైతము చెప్పఁబడినది. తుదకు రామతాపిని వంటి యుత్తరోపనిషత్తుల
లోను, గీతలయందును మానవరూపధారియు, నగుణుఁడు నయిన
పరమేశ్వరునియొక్క నిస్సీమము, ఏకాంతమునైన భక్తి యనునదియే
పరమేశ్వరప్రాప్తికి ముఖ్యమైన సాధనముగ నంగీకరింపఁబడినది; కాని
సాధన మను మిషచే వాసుదేవభక్తి ప్రధానముగఁ జెప్పఁబడియున్నను
నధ్యాత్మదృష్టితో విచారించితి మేని 'ప్రతీకము' అనఁగా నొక విధ
మైన సాధన మగుటచే నత్యుఁడును, నర్వవ్యాపియు, నిత్యుఁడు నైన
పరమేశ్వరుఁడు వీనిలో నే ప్రతీకమునందు నుండుటకు వీలులేదని
వేదాంతసూత్రానుసారముగ (వే.సూ. 4.1.4) గీతలయందును విదప
స్పష్టముగఁ జెప్పఁబడినది. విశేష మేమి చెప్పవలయును? నామరూపా
త్మకమయిన వ్యక్తమును (అనఁగా: నగుణమగు నే వస్తువును) గైకొని
నను నది మాయాసంబంధమే యగుటచే సత్యమైన పరమేశ్వరుని
చూడవలసినయెడల దృష్టి నీ విధమగు నగుణమయిన రూపముకంటె
పరముగనే యుంచవలయును. భగవంతునియొక్క అనేకవిభూతులలో

నర్జునునకుఁ జూపిన విశ్వరూపముకంటె విశేషవ్యాపకమగు విభూతి యుండనేరదని స్పష్టమగుచునే యున్నది. అయిన నీ విశ్వరూపమునే భగవంతుఁడు నారదులవారికిఁ జూపి "నీవు చూచునట్టి యీ నామ రూపము సత్యమయినది కాదు. ఇది మాయ యగుటచే నాయొక్క సత్యస్వరూపమును జూచుటకు దీనికంటె పరముగనే విచారింపవల యును" అని చెప్పెనని నారాయణీయధర్మములలోఁ జెప్పఁబడినది (భా. శాం. 339. 44). గీతయందును—

**అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యంతే మా మబుద్ధయః,**
**పరం భావ మజానంతో మమావ్యయ మనుత్తమమ్.**

— నే నవ్యక్తుఁడ నైనను మూర్ఖులగు లోకులు నన్ను వ్యక్తుఁడు (గీ. 7.24) అనఁగా మనుష్యదేహధారి యని తలఁచుచున్నారు (గీ. 9.11); కాని యది సత్యము కాదు. నాయొక్క యవ్యక్తస్వరూపమే సత్య మైనదని శ్రీకృష్ణుఁ డర్జునునకు బోధించెను. ఆ తీరుననే యుపనిష త్తులలో మనస్సు, వాక్కు, సూర్యుఁడు, ఆకాశము మొదలగు ననేక ములును వ్యక్తములు నవ్యక్తములునగు బ్రహ్మప్రతీకము లుపాసనా ర్థమై చెప్పఁబడియున్నను తుదకు వాక్కునకును, నేత్రములకును, వీనులకును గోచర మగునది బ్రహ్మము కాదు గాన—

యన్మనసా న మనుతే యే నాహు ర్మనో మతమ్,
త దేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిద ముపాసతే.
(కేన. 1.5–8)

— మనస్సుచే నేది తలఁచుకొనుటకు సాధ్యము కాదో, పైఁగా మనస్సే యెవరి మననశక్తి కధీనముగ నుండునో యది సత్యమైన బ్రహ్మమని నీవు తెలిసికొనుము. దేనిని ప్రతీక మని యుపాసించుచున్నారో యది (నిజమయిన) బ్రహ్మము గాదు అని స్పష్టముగఁ జెప్పఁబడినది. మఱియు "నేతి నేతి" వాక్యములకును నదియే యర్థము. మనస్సు,

అకసము, లేక, వ్యక్తోపాసనయొక్క మార్గానుసారముగ సాలగ్రామము, శివలింగము, శ్రీకృష్ణునియొక్క, లేక, సాధుపురుషునియొక్క వ్యక్తమగు మూర్తి, లేక, శిలామయములు, లేక, ధాతుమయమయిన దేవతామూర్తులుగల దేవాలయము, లేక, మూర్తి లేకుండు మందిరములు మసీదులు మొదలగు వానిలో దేనిని గ్రహించినను నివి యన్నియు పిల్లలయొక్క క్రీడాశకటములవలె స్థిరీకరించుటకు (అనఁగా: చిత్తప్రవృత్తిని పరమేశ్వరుని వైపునకు పంచుటకు) సాధనములగును. వారి వారి సంతోషానుసారముగఁ గైకొనఁబడిన రంగువస్తువులు, చందనము, లేక, కలశము మొదలగునవి కుంటివానికి బండి వలె నధికారానుసారముగ నుపాసనార్థమై చెప్పఁబడిన ప్రతీకములెంత యిష్టములైనను సత్యమగు పరమేశ్వరుఁడు "ఈ ప్రతీకములలో లేడు" "న ప్రతీకే న హి సః" (వే.సూ. 4.1.4)- వానికి పరముగ నున్నాఁడని తుదకు తెలిసికొనవలయును. మఱియు నీ కారణముచేతనే "నా మాయ యెవరికి తెలియదోయట్టి మూఢులు నన్నుఁ దెలిసికొనలేరు" అని భగవద్గీతలయందు సైతము సిద్ధాంతము చేయఁబడినది (గీ. 7. 13-15). భక్తిమార్గమునందున్న మనుష్యులను దరింపఁజేయు శక్తి సజీవములు గాని, నిర్జీవములు గాని యయిన మూర్తులయందుఁ గాని, శిలామయములగు భవనములయందుఁ గాని లేదు గాన నీ ప్రతీకములకంటె శ్రేష్ఠమయిన యీశ్వరభావననే యా ప్రతీకమునందు తన సౌలభ్యముకొఱకు నుపాసకుఁ డుంచుకొనుటయే సత్యమైన తారకమగును. ప్రతీకము శిలామయమైనను, ధాతుమయమయినను లేక, మఱియొకటియైనను నేమియు విశేషము లేదు. ప్రతీకముకంటె శిలాదుల యోగ్యత యెప్పుడు నధికము కానేరదు. ప్రతీకమునందే భావన యెటులుండు నటులే యా భక్తియొక్క ఫలమును పరమేశ్వరుఁడు నీకిచ్చుచున్నాఁడు; ప్రతీకము గాదు, కాని యీప్రతీకము మంచిదా? లేక, యాప్రతీకము మంచిదియా? యని వివాదపడుటవలన

నేమియు విశేషము లేదు. నీయొక్క భావము శుద్ధము కానియెడల ప్రతీక మెంత మంచిదైన నేమి ప్రయోజనము? దినమంతయు లోకులను ముంచవలయునని వ్యాపారముచేయుచు సంధ్యాకాలమునందు, లేక, రాత్రియందు దేవాలయములోనికి దేవతాదర్శనమునకుఁ గాని, లేక, యొకానొక నిరాకారదేవుని మందిరమందుపాసించు నిమిత్తమయి కాని వెళ్లుటచే పరమేశ్వరప్రాప్తియగుట యెట్లు సంభవించును?

**విషయీా లోక శ్రవణా యేతీ, తే బాయకాఁ కడేచ పహాతీ.**
**చోరటే లోక చోరూన జాతీ, పాదరక్షా.**

(దాస. 18.10.24)

— కొందఱు వైషయికులు కథాశ్రవణముఁ జేయుచు స్త్రీలనే చూచుచుందురు. దొంగ లా సమయముననే చెప్పుల నెత్తుకొని పోవుదురు అని పురాణములను వినుటకొఱకును దేవాలయములకును బోవు కొందఱిని సమర్థులు వర్ణించినారు. కేవల దేవాలయములయందుఁ గాని, దేవతలయొక్క మూర్తులయందే కాని తారకత్వ ముండినయెడల వీరికిని ముక్తి లభింపవలయును. పరమేశ్వరునియందు భక్తి మోక్షార్థమయి యుపయోగించును. కాని, వ్యావహారికములైన, లేక, స్వార్థములైన విషయములయం దపేక్ష గలవారు వేర్వేఱు దేవతలనే యారాధింపవలయునని యనేకు లెన్నెదరు. మఱియు నీ స్వార్థబుద్ధిచే వారీ దేవతలవెంటఁ బడుదురని గీతలయందు నున్నది (గీ. 7.20). కాని యీా దేవతలు వారి యారాధనచే సంతసించి ఫలమును తామే యిత్తురను జ్ఞానము తాత్త్వికదృష్టి ననుసరించి నిజమైనది కాదని యీా గీతయే పిదపఁ జెప్పుచున్నది. "ఏ వాసననైనను మనస్సులో నుంచుకొని యే దేవత నారాధించినను నా యారాధనయొక్క ఫలమునిచ్చుట యను కార్యము సర్వవ్యాపియగు పరమేశ్వరునిదియే యై యున్నది. దేవతలది కాదు" అని యధ్యాత్మశాస్త్రముయొక్క స్థిరమయిన సిద్ధాంతము (వే.సూ. 3.2.38-41). మఱియు నదియే

గీతాతాత్పర్యము (గీ. 7.22). కాని ఫలమిచ్చు పరమేశ్వరుఁ డీ రీతిగ నొక్కఁడే యైనను వారి వారి యుక్తాయుక్తములగు భావనల ననుసరించి వేర్వేఱగు ఫలముల నిచ్చుచుండుటచే (వే. సూ. 2. 1. 34-37) నా యా దేవతలయొక్క, నా యా ప్రతీకములయొక్క యుపాసనా ఫలములు వేర్వేఱుగ నున్నట్లు మనకుఁ గాన్పించును. మఱియు నీ యభిప్రాయమునే మనస్సున నిడుకొని—

శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః

— మనుష్యుఁడు శ్రద్ధామయుఁడై యున్నాఁడు; ప్రతీక మేదైనను, నెవరి కెట్టి శ్రద్ధగలదో యట్లు వా రగుదు రనియు (గీ. 17.3; మైత్ర్యు. 4.6); లేక—

**యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః,**
**భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోఽపి మామ్.**

**(గీ. 9.25)**

— దేవతలను భజించువారు దేవలోకమును, పితరులను భజించువారు పితృలోకమును, భూతములను భజించువారు భూతములను, నన్ను భజించువారు నన్నును బొందుచున్నా రని లేక—

**యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథై వ భజామ్యహమ్.**

ఎవరు నన్నెటుల భజించుచున్నారో వారి నే నట్లు భజించుచున్నాను (గీ. 4.11) అనియు భగవంతుఁడు చెప్పినాఁడు. సాలగ్రామ మనునది ఱాయియే. దానియందు విష్ణుభావము నుంచి పూజింతురేని విష్ణులోకమును జెందుదురు. ఆ ప్రతీకమునే, యక్ష రాక్షసాది భూతములయొక్క బాధలనుండి భయపడి, యవియే గొప్పవని యెన్ని, వానిగా భజింతు మేని యా యా యక్ష రాక్షసాది భూతములయొక్క భావము ననుసరించి యుండును. ప్రతీకమును బట్టి

యుండదు అను సిద్ధాంతము మన సర్వశాస్త్రకారులకు సమ్మత మయి నదే. మఱియు వ్యవహారమునందు సైతము మూర్తిని పూజించుట కంటె ముందుగఁ బ్రాణప్రతిష్ఠాపనఁ జేయు నాచారమునందున్న రహస్య మిదియే. ఏ దేవతయొక్క భావనచే మూర్తియొక్క పూజ చేయవలయునో, యా దేవత ప్రాణప్రతిష్ఠ దానియందుఁ జేయుచు న్నారు. మూర్తియందు పరమేశ్వరునియొక్క భావన నునుపక మూర్తి యనఁగా నేదో యొక యాకారము గలిగిన మన్ను, ఱాయి, లేక, లోహ మను నూహతో దాని నెవరును బూజింపరు. ఎవఁడైన పూజించె నేని గీతయందలి పైఁ జెప్పఁబడిన సిద్ధాంతానుసారముగ నతనికి మన్నుయొక్క గాని, లేక, ఱాతియొక్క గాని గతి ప్రాప్త మగు నునది నిర్వివాదమయి యున్నది. ప్రతీకమునకును, దాని యందుంచిన భావనకును నీ రీతిగ భేదము నెఱిఁగిన పిదప ప్రతీక మేదయిన దాని విషయమై పెనఁగులాడుటకు కారణ మేమియు నుండనేరదు. కారణ మేమి యన: ప్రతీక మనఁగనే దేవుఁడను బుద్ధి యిప్పు డుండనేరదు. సర్వకర్మలయొక్క ఫలము నిచ్చు సర్వసాక్షి యగు పరమేశ్వరునియొక్క దృష్టి భక్తులభావన ననుసరించియే యుండును. కావున "దేవుఁడు భావననే యపేక్షించును. ప్రతీకము నపేక్షింపఁడు" అని తుకారాంబువా చెప్పినాఁడు. భక్తిమార్గమునం దలి యీ తత్త్వమును తెలిసికొనిన వారియొక్క మనస్సునందు తా ముపాసించు నీశ్వరస్వరూపమే, లేక, ప్రతీకమే సత్యమైనందున నితర ప్రతికము లసత్యమయిన వను దురాగ్రహ ముండదు. ఎవరి ప్రతీక మెట్లు లున్నను, దానిగుండ పరమేశ్వరుని భజించువారి కా యొక పరమేశ్వరునే పొందుదు మను నుదారబుద్ధియు నుత్పన్నమగును; మఱియు—

**యేఽ ప్యన్యదేవతాభక్తాః యజంతే శ్రద్ధయాన్వితాః,**
**తేఽపి మామేవ కౌంతేయ యజం త్యవిధిపూర్వకమ్.**

(గీ. 9.23)

– విధి, యనఁగ బాహ్యోపచారము, లేక, సాధనము శాస్త్రోక్తముగఁ గాకపోయినను నితర దేవతలను శ్రద్ధతో (వారియందు శుద్ధమగు పరమేశ్వర భావమునుంచి) పూజించువారు, మఱియొక విధముగ నన్నే పూజించుచున్నారు అని భగవంతుఁడు చెప్పినదానియందు నమ్మకము గలుగుటకుఁ బ్రారంభ మగును. భాగవతమునం దీ యర్థమే కొంచెము శబ్దభేదముతో వర్ణింపఁబడినది (భాగ.10, పూ. 40.8-10). శివగీతయందు మాత్రము పై శ్లోక మే మాత్ర మక్షరమును పొర్లుపడక వ్రాయఁబడినది (శివ. 12.4). మఱియు "ఏకం స ద్విప్రా బహుధా వదన్తి" (ఋ. 1.164.46) అను వేదవచనమునకుఁ దాత్పర్యమిదియే. దీనివలన నీ తత్త్వము వైదికధర్మములలో బహుకాలము క్రిందట నుండియుఁ బ్రవర్తించుచున్నదని సిద్ధమగుచున్నది. మఱియు నిటీవలి వారగు శ్రీ శివాజి మహారాజువంటి వైదిక ధర్మనిరతులగు పురుషులు సర్వోత్కృష్టులుగా నున్నప్పుడు సైతము పరధర్మాసహిష్ణుత యను ద్వేషము వారియందే మాత్రముఁ గాన్పింపక పోవుట యీ పైనఁ జెప్పిన సిద్ధాంతఫలమే యయియున్నది. ఈశ్వరుఁడు సర్వవ్యాపియు, సర్వసాక్షియు, సర్వజ్ఞుఁడు, సర్వశక్తి గలవాఁడును నై యున్నాఁడు. వే యేల? ఈ గుణము లన్నింటికంటె పరమునందును నున్నాఁడు (అనఁగా అచింత్యుఁడుగ నున్నాఁడు) అని సత్యమైన తత్త్వమును తెలిసికొనక యొక కాలమునందును, నొక దేశమునందును, నొక తల్లిగర్భమునందును, నొక రంగుతోను, నొక పేరుతోడను లేక, యాకృతితోడను నున్నాఁడని, తా నెన్నుకొనిన వ్యక్తస్వరూపమును మాత్రమే సత్య మని తలఁచి నామరూపాత్మకమగు మిథ్యాభిమానమును జెంది దానికొఱకు కత్తి (తరవారి)తో నొకరి ప్రాణము నొకరు తీసివైచు పర్యంతము వచ్చుట యనునది మనుష్యులయొక్క శోచనీయములగు మూర్ఖావస్థలకు లక్షణము. గీతయందున్న భక్తి మార్గమునకు 'రాజవిద్య' యని పేరున్నమాట సత్యమే; కాని "నా

యొక్క దృశ్యస్వరూపముకూడ మాయయే. నా సత్యస్వరూపమును జూడవలయు నేని యీ మాయను దాఁటి పరమునకు వెళ్లుము" అని స్వయముగ భగవంతుఁడు యథార్థము నుపదేశించి నట్లుపదేశించి "అవిభక్తం విభక్తేషు" అను సాత్త్వికజ్ఞానదృష్టితో సర్వధర్మముల యందున్న ఐక్యమును దెలియఁజేసి భక్తిమార్గమునందున్న వివాద కారణములగు విషయములను సమూలముగ నశింపఁజేయు ధర్మోప దేశకుఁడు మొదట నెచ్చో నుదయ మయినదియు, లేక, యట్టి గురుని మతము ననుసరించువా రెక్కువగ నే దేశమున నున్నదియు పరిశీలించిన యెడల భారతభూమికి నగ్రస్థాన మీయవలయునని చెప్పుటయే న్యాయ్య మయి యున్నది. 'రాజవిద్యయు, రాజగు హ్యము నను నీ ప్రత్యక్షములగు పక్షు' లనాయాసముగ వశమైయుండ నజ్ఞాన మను సులోచనమును నేత్రములకు పెట్టుకొని యది బాగులే దని చెప్పుటకు మనలో కొందఱు క్షణమాత్రమైనను సిద్ధముగ నుం డుట యనునది మన దురదృష్టమే యగును.

ప్రతీక మేదైనను భక్తిమార్గమువలనఁ గలుగు ఫలము ప్రతీక మందు మన ముంచు భావనసంబంధ మైనదియే కాని ప్రతీకము మూలమైనది గాదు; కావున ప్రతీకముల విషయమై వివాదపడుట వలన కార్య మేమియు లేదనుమాట సత్యమే; కాని ప్రతీకమునందు వేదాంతదృష్టిచే శుద్ధమగు నే పరమేశ్వరుని భావము నుంచవలసి వచ్చునో యీ శుద్ధమగు పరమేశ్వరుని స్వరూపముయొక్క కల్పన యనేకుల కొకసారియే చేయుటకు, వారి ప్రకృతినిబట్టి గాని, లేక, యజ్ఞానము వలనఁ గాని తఱచుగా శక్యము గాకుండునని యనేకు లందురు; కాని యట్టివారికి ప్రతీకమునందు శుద్ధభావమునుంచి పరమేశ్వరప్రాప్తిని కలుగఁజేసికొనుటకు మార్గమేది? భక్తిమార్గము నందు జ్ఞానముయొక్క కార్యములను నమ్మకముతోఁ జేసికొన వచ్చును. కారణ మేమియన: శుద్ధపరమేశ్వరస్వరూపమును విశ్వాస

ముచే, లేక, శ్రద్ధచేఁ దెలిసికొని ప్రతీకమునందు నా భావన నుంచినఁ జాలునని చెప్పుటవలన ప్రయోజనము లేదు. కారణ మేమియన: భావన యుంచుటయైనను, మనస్సుయొక్క ధర్మమే; అయినను, దానికి కొంచెమో, గొప్పయో బుద్ధియొక్క సాహాయ్య ముండిననే కాని యెప్పుడును కార్యము నెఱవేఱదు. ఇతరములగు మనోధర్మముల వలెనే శ్రద్ధాప్రేమ లోకవిధముగ గ్రుడ్డివే యగుటచే "దేనియందు శ్రద్ధ యుంచవలెను, దేనిమీఁద కూడదు; లేక, దేనిమీఁద ప్రేమ యుంచవలయును, దేనిమీఁద కూడ" దను విషయము కేవలము శ్రద్ధకుఁ గాని, లేక, ప్రేమకుఁ గాని యెప్పుడును దెలియదు. ఈ కార్యమును బ్రతి మనుజుఁడును తన బుద్ధిచేతనే తెలిసికొనవలయును; కారణ మేమియన: సారాసారములను వివేచన చేయునది బుద్ధియే కాని మఱియొక యింద్రియము కాదు. కావున నొకానొకని బుద్ధి తీవ్రము గాకపోయినను శ్రద్ధ నెచ్చట నునుపవలయునో తెలియు నంతవఱ కైనను నది సమర్థముగ నుండవలయును. లేనియెడల వెఱ్ఱి శ్రద్ధచేతవలెనే, వెఱ్ఱిప్రేమచేతసైతము బద్ధుఁడై రెండుగోతులలోను బడును. పైగా, అన్నఁగా: శ్రద్ధలేని కేవలబుద్ధియే కార్యము చేయునని, తర్కించుటచే నది యే వైపునకు నొరుగునో నియమము లేదు. బుద్ధి యెంత యధికముగ తీవ్రమయినదో యంత యధికముగనే భ్రమఁ జెందును. ఇంతయేగాక శ్రద్ధమొదలగు మనోధర్మములు దప్ప కేవలము బుద్ధిగమ్యమగు జ్ఞానమునందే కర్తృత్వశక్తియు నుత్పన్నము కానేరదని యీ ప్రకరణారంభముననే చెప్పఁబడినది. కావున శ్రద్ధ యును, జ్ఞానమును, లేక, మనస్సును, బుద్ధియు ననువాని కెల్లప్పు డును సంబంధ ముండవలసివచ్చును. కాని మనస్సును బుద్ధియు నను నీ రెండును త్రిగుణాత్మకము అగు ప్రకృతియొక్క వికారములే యగుటచే వానిలో ప్రతివస్తువును పుట్టుకలోనే సాత్త్వికము, రాజ సము, తామసము నని మూఁడు భేదములు గలదికావచ్చును; మఱియు వానికి సంబంధము స్థిరముగ నుండినను, నా యా మనుష్యులం

దే రీతిగ నది శుద్ధాశుద్ధముగ నుండునో యా రీతిగనే మనుష్యుని యొక్కస్వభావము, జ్ఞానము, వ్యవహారమును వేఱువే అగుచున్నవి. కేవలము బుద్ధియే పుట్టుక మొదలున పరిశుద్ధము, రాజసము, లేక, తామసముగ నుండెనేని దానిచేఁ జేయఁబడిన మంచిచెడుగుల నిర్ణయము సరియైనదిగ నుండకపోవుటచే గ్రుడ్డిదయిన శ్రద్ధ సాత్త్వికమైనను బంధకముగనే యుండును; మఱియు శ్రద్ధయే జన్మ మొదలు నపరిశుద్ధమైన యెడల బుద్ధి సాత్త్వికమైనను నుపయోగింపదు. కారణ మేమియన: ఇట్టి సమయములయందు బుద్ధి నిశ్చయించిన దానినే శ్రద్ధ యొప్పుకొనక పోవును; కాని సామాన్యముగ మనస్సును బుద్ధియు ననునవి యొక్కొక్కటియె యపరిశుద్ధముగ నుండక యెవరియొక్క బుద్ధి పుట్టుక మొద లపరిశుద్ధముగ నుండునో, వారి యొక్క మనస్సును, శ్రద్ధయు నపరిశుద్ధముగనే యుండును. మఱియు నీ యపరిశుద్ధబుద్ధి, స్వభావముగనే యపరిశుద్ధముగ నుండు శ్రద్ధ నంతకంత కెక్కువ భ్రమలోఁ బడఁద్రోయును. ఈ స్థితియందుఁ బరమేశ్వరునియొక్క శుద్ధస్వరూపము నెవ రెంత యుపదేశించినను నది వారి మనస్సునందు పూర్ణముగ స్థిరపడదు; లేక, యనేకపర్యాయములు — అనఁగా విశేషముగ శ్రద్ధయు, బుద్ధియు, నను రెండును పుట్టుకకు మొదలుగ నపక్వములును, దుర్బలము లగునేని — ఆ యుపదేశమునకే, వాఁడు విపరీతార్థమును జేయునని వ్యవహారము నందును స్పష్ట మగుచున్నది. ఉదాహరణము— క్రైస్తవధర్మోపదేశకుఁ డాఫ్రికాలో నున్న నల్లని యాకృతి గల యొక జాతిజ్ఞానులకు క్రైస్తవ ధర్మము నుపదేశించుచు వచ్చినప్పుడు వారి కాకసమునందున్న తండ్రియొక్క గాని, లేక, క్రీస్తుయొక్క గాని వాస్తవిక కల్పన నేమియు చేయుటకు శక్యము కాదు. మనము చెప్పిన దంతయు వారియొక్క యపక్వబుద్ధి ననుసరించి యసత్యమే యనియుఁ దా మసత్యమునే గ్రహించుచున్నా మనియు వారికిఁ దోఁచును. అ కారణమున నిటు వంటివారికి నంస్కరింపఁబడిన ధర్మమును దెలిసికొనునంత యోగ్యత

వచ్చుటకు వారిని నాగరికులయొక్క యోగ్యతకుఁ గైకొని రావలయు నని యొక యాంగ్లేయ గ్రంథకర్త వ్రాసియున్నాఁడు. * గురువొక్కఁ డైనను శిష్యుల మధ్యమున భేద మగపడుననియు, సూర్యుఁ డొక్కఁ డైనను నతని ప్రకాశము చేత సూర్యకాంతము మండును, మట్టి ముద్ద యట్లు మండ దనియు, అను నీ భవభూతి వాక్యమున కిదియే యర్థము (ఉ. రా మ. 2. 4); మఱియు నీ కారణముచేతనే పూర్వ కాలమునందు శూద్రులు మొదలయిన యజ్ఞజాతులు వేదశ్రవణము నకు ననధికారులని చెప్పినటులఁ గన్పట్టుచున్నది. † గీతయందలి పదునెనిమిదియవ యధ్యాయమున నీ విషయము చెప్పఁబడియుండు టచే బుద్ధి కెట్లు స్వభావముగనె, సాత్త్విక రాజస తామసభేదము లుండునో (18·30-32) యట్లె శ్రద్ధయు స్వభావముచేతనే సాత్త్వి కాదులగు మూఁడుభేదములు గలది యగునని పదునేడవయధ్యా యము (17·2) యొక్క యారంభమునందు చెప్పిన పిదప, ప్రతి మనుజునియొక్కయు దేహస్వభావము ననుసరించి వారి వారి శ్రద్ధయుఁ బుట్టుక మొదలుకొని యీ రీతిగ వేర్వేఱగును (17·3) గాన సాత్త్వికశ్రద్ధగల పురుషుఁడు సహజముగ దేవతలను, రాజసశ్రద్ధ గల పురుషుఁడు సహజముగ యక్షరాక్షసులను, తామసశ్రద్ధగలవాఁడు భూతపిశాచాదులను నమ్మి భజించునని భగవంతుఁడు చెప్పెను (గీ. 17·4-6). కాని మనుష్యునియొక్క శ్రద్ధ మంచిదిగఁగాని, చెడుదిగఁగాని, యుండుట యనునది యీ రీతిని వృద్ధిఁబొందుచున్న

---

* And the only way, I suppose, in which beings of so low an order of development (e.g. an Australian savage or a Bushman) could be raised to a civilized level of feeling and thought would be by cultivation continued through several generations; they would have to undergo a gradual process of humanization before they could attain to the capacity of civilization. Dr. Maudsley's Body and Mind, Ed. 1873. p. 57.

† See Maxmuller's Three Lectures on the Vedanta Philosophy pp. 72, 73

స్వభావము నవలంబించి యుండెనేని మొదట యథాశక్తిగ భక్తి నభ్యసించుటచే నీ శ్రద్ధ యంతకంతకు నెక్కువగ స్వతంత్ర మగుచు నెప్పు డయినను పూర్ణమగు శుద్ధమైన(అనఁగా: సాత్త్వికమైన)యవస్థను బొందునా? పొందదా? యను ప్రశ్న, పిదప సహజముగనే యుత్పన్న మగును. జ్ఞానమును సంపాదించుకొనుటకు మనుజుఁడు స్వతంత్రుఁ డగునా? కాఁడా? యను కర్మవిపాకప్రక్రియ యందుండు ప్రశ్నయొక్కయు, భక్తిమార్గము నందున్న పై ప్రశ్నయొక్కయు స్వరూప మొక్కటియే యగుటచే సమాధానము సైత మొక్కటిగనే యుండవలయును. నాయొక్క శుద్ధస్వరూపమునందు నీవు మనస్సు స్థిరపఱచుకొనుము. "మయ్యేవ మన ఆధత్స్వ" (గీ. 12. 8) అని యర్జునునకు మొదట నుపదేశించి, పిదప "నా యందు చిత్తమును స్థిరముగ నుంచుట నీ చేత కాకపోయె నేని యభ్యాసమును (మాటి మాటికిఁ బ్రయత్నమును) చేయుము. అభ్యాసము సైతము కాని యెడల నా నిమిత్త మయి చిత్తశుద్ధికారకము లగు కర్మలను జేయుము. అదియును గానినాఁడు కర్మఫలములను త్యజించుము. అందుమూలమున నన్నుఁ బొందుము" అని పరమేశ్వరుని స్వరూపమును మనస్సులో దృఢపఱచుకొనుటకు భగవంతుఁడు సెప్పిన వేఱువేఱు మార్గములకును (గీ. 12.9-11; భాగ. 11.11.21-25) నిదియే కారణము. మొదట దేహస్వభావము, లేక, ప్రకృతి తామస మైనచోఁ బరమేశ్వరునియొక్క శుద్ధస్వరూపమునందు చిత్తమును స్థిరముగ జేయు నుద్యోగము సైత మొకసారియే, లేక, యొక జన్మమునందే సఫలము కానేరదు; కాని కర్మయోగమునందువలె భక్తిమార్గమునందు నేనియు వ్యర్థము కానేరదు. కావున—

> బహూనాం జన్మనా మంతే జ్ఞానవాన్ మాం ప్రపద్యతే,
> వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః.
>
> (గీ. 7.19)

— ఒకసారి భక్తిమార్గము నవలంబించిన పిదప నీ జన్మమునఁ గాక పోయినను మఱుజన్మముననుూ, ఆ జన్మమునఁ గానిచో మఱుసటి జన్మముననుూ, నొకప్పుడు కాకపోయినను మఱియొకప్పుడైననుూ, 'సర్వమును వాసుదేవాత్మకముగనే యున్న' దను పరమేశ్వర స్వరూపము యొక్క సత్యమగు జ్ఞానము మనుజునకుఁ గలుగును. ఆ జ్ఞానముచే నతనికి ముక్తి లభించును అని భగవంతుఁ డెల్లవారికి నాశ్వాస వచనము నిచ్చుచున్నాఁడు. ఆఱవయధ్యాయమునందును నీ తీరున "అనేకజన్మసంసిద్ధ స్తతో యాతి పరాం గతిమ్"(గీ. 6.45) అని కర్మయోగము నభ్యసించువారి నుద్దేశించి చెప్పఁబడినది. మఱియు భక్తిమార్గమునకును నా న్యాయమే వర్తించును. ప్రతీకమునం దే దేవతా భావము నుంచవలయునో దానియొక్క స్వరూపము నీయొక్క దేహ స్వభావమును బట్టి మొదటనే సాధ్యమైనంత శుద్ధముగఁ గల్పించి యారంభింపవలయును. చిరకాల మిట్లు చేయఁబడిన భావనకు ఫలమును గొంతకాలమునకుఁ బరమేశ్వరుఁ (ప్రతీకము గాదు) డిచ్చును (7.22). కాని తర్వాత చిత్తశుద్ధికి నితరసాధనాపేక్ష యేమియునుండక పోవుటచేఁ దోఁచిన ట్లాచరింపఁబడుచున్న పరమేశ్వరునియందు నిత్య భక్తిచేతనే యీ భావన సంస్కరింపఁబడును. పరమేశ్వర విషయక జ్ఞానమువృద్ధిఁబొందుటచేఁ దుదకు "వాసుదేవ స్సర్వం" అని మనస్సునకు దృఢనిశ్చయము కలిగి దానిచే నుపాస్యోపాసకు లను భేదము నశింపఁగాఁ దుదకు శుద్ధమగు బహ్మమునం దాత్మకు లయ మగును. మనుష్యుఁడు తన యుద్యోగమును మాత్రము వదలకూడదు. కర్మయోగమును దెలిసికొనుట మాత్రమైన పిదప నుడిగుండములోఁ బడినవాఁ డొడ్డునకు లాగఁబడినట్లు సంసారమునఁ బడినవాఁడు పూర్ణసిద్ధి వైపునకు నే రీతిగ లాగఁబడు ననఁగా (గీ. 6.44) భక్తిమార్గము నందున్న భక్తుఁ డొకానొకప్పుడు తన్ను పరమేశ్వరుని స్వాధీనము చేసెనేని యతని నిష్ఠనువృద్ధిఁ బొందించుచు భగవంతుఁడే యతనికిఁ దన స్వరూపముయొక్క పూర్ణజ్ఞానమును దుదకుఁ గలుగఁజేయును (గీ.

7. 21; 10. 10); మఱియు నా జ్ఞానముచేతనే (కేవలము శుష్కమును గ్రుడ్డిదియు నయిన శ్రద్ధచేఁగాదు) భగవద్భక్తునకుఁ దుదకుఁ బూర్ణమగు సిద్ధి లభించునని గీతాధర్మములయొక్క సిద్ధాంతమని యిందలి సారాంశము. భక్తిమార్గముచే పైపై మెట్టు నెక్కఁగా చివరకుఁ బ్రాప్తమగు నీ స్థితియు జ్ఞానమార్గముచేఁ బ్రాప్తమగు కడపటి స్థితియు నను నీ రెండు నొకటియే గావున గీతలలోఁ బంద్రెండవ యధ్యాయమునందు భక్తిమంతుఁడైన పురుషుని ధర్మముయొక్కయు స్థితియొక్కయు వర్ణనయు రెండవయధ్యాయము నందున్న స్థితప్రజ్ఞునియొక్క వర్ణనయు నీ రెండును నొక్కరీతిగ నున్నవని యీ వర్ణనలు చదివినప్పు డెవరి కయినను స్పష్టముగఁ దెలియును. జ్ఞానమార్గ భక్తిమార్గములను నీ రెండును నారంభమున భిన్నములుగనున్నను నధికారము ననుసరించి యొకఁడు మొదటి మార్గమునను మఱియొకఁడు రెండవ మార్గమునను వెళ్ళుచుండినను నీ రెండు మార్గములును దుద కొక దిక్కునఁ గలియుటచే జ్ఞానికిఁ గలుగు గతియే భక్తునకును బ్రాప్తమగునని దీనివలన స్పష్ట మగును. జ్ఞానమార్గమున మొదటినుండియు బుద్ధిచేఁ దెలిసికొనఁబడినయెడల భక్తిమార్గమునందు శ్రద్ధచేత గ్రహింపఁబడి యుండుటయే యీ రెంటియందును భేదము; కాని ప్రారంభమునం దున్న యీ భేదము పిదప లేదు గాన—

> శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః,
> జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతి మచిరే ణాధిగచ్ఛతి.
>
> (గీ. 4.39)

— శ్రద్ధగలవాఁ డింద్రియనిగ్రహముచేత జ్ఞాననిష్ఠుఁ డయ్యె నేని బ్రహ్మాత్మైక్యరూప మయిన జ్ఞానముయొక్క యపరోక్షానుభవము సంఘటిల్లినందున మరల నా జ్ఞానముచేతనే శీఘ్రముగ పూర్ణజ్ఞానము లభించును లేక—

**భక్త్యా మా మభిజానాతి యావా న్యశ్చాస్మి తత్త్వతః,**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్.**
**(గీ. 18.55)**

— భక్తిచేత నన్నుఁ దెలిసికొనును (అనఁగా:- పరమేశ్వరుఁ డెవఁడైన దియు నెంతవాఁడై నదియు తాత్త్వికజ్ఞానము గలుగును). మఱియు నీ జ్ఞానము గలిగిన పిదప (మొదట కాదు) భక్తుఁడు నన్నే కలిసికొనుచున్నాఁడు అని భగవంతుఁడు సెప్పియున్నాఁడు (గీ. 11. 14 చూడు).* పరమేశ్వరునియొక్క పూర్ణజ్ఞానము కలుగుటకు నీ రెండు మార్గములును దక్క మూఁడవమార్గము లేదు. కావున నెవరికి జ్ఞానమును భక్తియు నుండవో యతఁడు మాత్రము "అజ్ఞశ్చా శ్రద్దధానశ్చ సంశయాత్మా వినశ్యతి" (గీ. 4. 40)— బొత్తిగ మునిఁగిపోవలయునని గీతలయందే స్పష్టముగఁ జెప్పఁబడినది.

శ్రద్ధచేతను భక్తిచేతను దుదకుఁ బూర్ణమగు బ్రహ్మాత్మైక్య జ్ఞానము గలుగు నను విషయముపై ననేకులగు తార్కికు లుపాస్యము వేఱు నుపాసకుఁడు వేఱు నను ద్వైతభావముచేతనే భక్తిమార్గమారంభింపఁ బడునేని తుదకైనను బ్రహ్మాత్మైక్య రూపమయిన యద్వైత జ్ఞాన మెట్లు గలుగునని యడుగుదురు. గాని యీ యాక్షేపణము కేవలము భ్రాంతిమూలకమై యున్నది. ఐక్యజ్ఞానము కలిగిన పిదప భక్తియొక్క ప్రవాహ మాఁగిపోవునని మాత్రమే యీ యాక్షేపకుల యభిప్రాయమైన యెడల నా యభిప్రాయ మందేమియుఁ బొరపాటు లేదు. కారణ మేమి యన: ఉపాస్యము, నుపాసకుఁడు, నుపాసనయు

---

* ఈ శ్లోకమునందలి "అభి" యను నుపసర్గవలన భక్తి, జ్ఞానమునకు సాధనము గాదు. మఱి యేమన: స్వతంత్రమగు సాధ్యమని నిరూపించుటకు శాండిల్యసూత్రమున (సూ. 15) ప్రయత్నము చేయఁబడినది. కాని యీ యర్థ మితరములగు సాంప్రదాయికార్థములవలె నాగ్రహపూర్వకముగఁ జేయఁబడినది గాని సరళమైనది కాదు.

నను నీ త్రిపుటి నశించిన పిదప భక్తి యనఁబడు వ్యాపారము నిరుద్ధ మగునను విషయ మధ్యాత్మశాస్త్రమునకు మాన్యముగనే యున్నది; కాని ద్వైతమూలకమైన భక్తిమార్గముచేఁ దుదకు నద్వైతముయొక్క జ్ఞానము కలుగుటయే శక్యముకాదని యీ యాక్షేపమునకు నర్థమైన యెడల నీ యాక్షేపము నిర్మూలకమని తర్కమువలననే గాక ప్రసిద్ధులైన భగవద్భక్తులయొక్క యనుభవముచే సిద్ధ మగును. పరమేశ్వరుని యందు భక్తునియొక్క చిత్త మెట్లంతకంతకు నెక్కువగ స్థిర మగునో దాని ననుసరించియే భేదబుద్ధియు నశించుట తర్కశాస్త్రదృష్టిచే నేమియు తప్పు కాదు. కారణ మేమి యన: బ్రహ్మసృష్టియందు సైతము పాదరసమువంటి పదార్థముయొక్క లేశములు మొదట వేర్వేరై కాన్పించుచున్నను పిదప వాని నన్నింటిని ఒకచోటఁ జేర్చుటకు నేమియు నాటంకమును లేనట్లే యితర విషయములయందు సైత మేకీకరణప్రక్రియకు మొదటనున్న భిన్నత్వమునుండియే యారంభ మగుట మనము ప్రత్యక్షముగఁ జూచుచునే యున్నాము; కీటకము భ్రమరధ్యానముచేఁ దుదకుఁ దానే భ్రమరమగు న్యాయము నెల్లవారెఱింగినదియే; కాని తర్కముకంటె సాధువులయొక్క ప్రత్యక్షానుభవమే యీ యాక్షేపణకు సదృశమైన యుత్తరము. కాన వారిలో భగవద్భక్త శిరోమణియగు తుకారాంబువావంటి వారియొక్క యనుభవము నీ విషయమున నెక్కువప్రమాణమని యెన్నెదను. తుకారాంబువాగారి యధ్యాత్మజ్ఞానముపనిషదాది గ్రంథములయొక్క యధ్యయనముచేఁ గలిగినదని యెవరికిని జెప్పనక్కఱ లేదు. అయినను వారియొక్క గాథయందు సుమారు మూఁడువందలయేఁబది యభంగము లద్వైతస్థితిని వర్ణించుచున్నవి. మఱియు నా యన్నింటిలోను "వాసుదేవ స్సర్వం" అను నట్టిది కాని (గీ. 7.19) లేక, బృహదారణ్యకోపనిషత్తునందు యాజ్ఞవల్క్యులు వర్ణించినట్లు 'సర్వ మాత్మైవాభూత్' అను నట్టిది గాని యగు నర్థమే స్వానుభవముచేఁ బ్రతిపాదింపఁ బడినది. ఉదాహరణార్థమై—

గోడ పడే( జైసా గూళ, తైసా దేవ జాలా సకళ,
అతాం భజో( కోణే( పరీ, దేవ సబాహ్య అంతరీ(.
ఉదకావేగళా, నవ్హే తరంగ నిరాళా,
హేమ అళంకారా నామీ(, తుకామ్హణే తైసే ఆమ్హీ.
(గా. 3627)

— బెల్లము లోపలను వెలుపలను సమముగానే తీపై యున్నట్లు భగవంతుఁడును లోపలను వెలుపలనుగూడ సమముగా నిండి యున్నందున నెట్లు భజించినను భజింపవచ్చును. నీటికంటె తరంగము వేఱు కానట్లును, బంగారుకంటె నగ వేఱుకానట్లును నేను భగవంతునికంటె వేఱగువాఁడను కాను అని తుకారాంబువా చెప్పెను. వీనిలో మొదటి రెండు చరణము లధ్యాత్మప్రకరణమునందు వ్రాసియే యుపనిషత్తులందున్న బ్రహ్మాత్మైక్యజ్ఞానముతో దానియందున్న యర్థమునకు పూర్ణసామ్యమును చూపియున్నాను. భక్తులయొక్క పరమావస్థను తుకారాంబువాగారు స్వానుభవముచే నీ రీతిగ వర్ణించియుండినందున నే తార్కికుఁడైనను, 'భక్తిమార్గముచే నద్వైతజ్ఞానము గలుగుట' శక్యము గాదని కాని, లేక, దేవునిమీఁద మూఢవిశ్వాసము నుంచుట చేతనే మోక్షము లభించును గాన జ్ఞాన మక్కఱలేదని కాని బాష్కలునివలె ప్రతిపాదించుటకు సాహసించుట యాశ్చర్యకరముగ నున్నది.

భక్తిమార్గముచేతను, జ్ఞానమార్గముచేతను సాధ్య మగునది తుద కొక్కటియే యగుటచే "పరమేశ్వరునియొక్క యనుభవాత్మకమైన జ్ఞానముచేతనే చివరకు మోక్షము లభించునను సిద్ధాంతము రెండు మార్గములందును స్థిరముగ నుండుటయ కాక యధ్యాత్మ, లేక, కర్మ విపాక ప్రకరణములందు వెనుకఁ జెప్పఁబడిన సిద్ధాంతము లన్నియుఁ గూడ గీతలయందున్న భక్తిమార్గమునందు స్థిరముగనే యున్నవి. ఉదాహరణము: భాగవతధర్మములయందు వాసుదేవరూపుఁ డయిన

పరమేశ్వరునినుండి సంకర్షణరూపమయిన జీవ ముత్పన్న మయినదని యుఁ, దర్వాత సంకర్షణునినుండి ప్రద్యుమ్నుఁడు (అనఁగా: మన స్సను), ప్రద్యుమ్నుని నుండి యనిరుద్ధుఁడు (అనఁగా: అహంకార మును) బయలుదేరెనని చతుర్వ్యూహరూపమగు సృష్టియొక్క యు త్పత్తిని కొందఱు ప్రతిపాదించుచున్నారు. మఱియుఁ గొంద ఱా నాల్గువ్యూహములలోను మూఁటి నొప్పుకొందురు. మఱి కొందఱొక వాసుదేవుఁడే సత్యమైన వ్యూహ మందురు. జీవునియొక్క యుత్పత్తి విషయమైన యీ మతములు సత్యమైనవి కావు. అధ్యాత్మదృష్టిచే జీవుఁడు సనాతన పరమేశ్వరునియొక్క సనాతనమగు నంశమని యుప నిషత్తులయొక్క యాధారమున వేదాంతసూత్రములయందు నిశ్చ యింపఁ బడినది (వే. సూ. 2. 3. 17; మఱియు 2.2.42-45 చూడు). కావున కేవల భక్తిమార్గమునందున్న చతుర్వ్యూహకల్పనను వదలివేసి జీవుని సంబంధములో వేదాంతసూత్రకారులయొక్క పై సిద్ధాంతమే భగవద్గీతలయందును వర్ణింపఁబడినది (గీ. 2.24; 8.20; 13.22 మఱి యు 15.7). సారాంశ మేమి యన: వాసుదేవభక్తియు, కర్మయో గము నను నీ రెండు తత్త్వములును భాగవతధర్మములలోనుండి గీత లలోనికి గ్రహింపఁబడినను, క్షేత్రజ్ఞరూపుఁడయిన జీవునియొక్కయు పరమేశ్వరునియొక్కయు స్వరూపవిషయము నైనదియు, నధ్యాత్మ జ్ఞానముకంటె వేఱగునదియు నగు నే గ్రుడ్డికల్పనకుఁ గాని, లేక, యజ్ఞానులయొక్క కల్పనకుఁ గాని గీతయందే మాత్రము నాధారము లేదని దీనివలన స్పష్టమగును; కాని భక్తియు, నధ్యాత్మము నను రెంటికిఁ గాని, శ్రద్ధయు జ్ఞానము నను వానికిఁ గాని పూర్ణమగు జత కలుపుటలో గీత యింత ప్రయత్నించినను నధ్యాత్మశాస్త్రము యొక్క సిద్ధాంతమును, భక్తిమార్గములోనికే గైకొనుటకు, కొంచె ముగనో గొప్పగనో శబ్దభేదము చేయవలసివచ్చుననియు గీతలయం దట్లు లక్ష్య ముంచుకొనవలయును. జ్ఞానమార్గమున నుండునదియుఁ, భక్తిమార్గమునం దున్నదియు నగు నీ శబ్దముచే గీతలలో నొకానొక

ప్పుడు దృష్టిచేతను, జ్ఞానదృష్టిచేతను చెప్పఁబడిన సిద్ధాంతముల యందు పరస్పర విరోధ ముండుటచే నా విషయములలో గీత యసంబద్ధముగ నున్నదని యనేకులు పొరఁబడినట్లు కాన్పించు చున్నది; కాని యీ విరోధము స్వభావముగ సత్యమైనది కామిచే నధ్యాత్మమునకును, భక్తికిని మన శాస్త్రకారులు చేసిన యేకవాక్యత దెలియక పోవుటచే నీ శంక బయలువెడలు చున్నదని మా యభి ప్రాయము. కావున నీ విషయమై యిచ్చట కొంచెము విస్తరించుట యావశ్యకమయి యున్నది. పిండమందును బ్రహ్మాండమందును నొక యాత్మయే నామరూపములచే నాచ్ఛాదితమైనది యని యధ్యా త్మశాస్త్రముయొక్క సిద్ధాంతము గాన "ఏ యాత్మ నాయందుఁగలదో యదియే సర్వభూతములయందును కలదు". "సర్వభూతస్థ మా త్మానం సర్వభూతాని చాత్మని" అని కాని (గీ. 6. 29) లేక "ఇదం తయు నాత్మయే", "ఇదం సర్వ మాత్మైవ" అని కాని యధ్యాత్మ శాస్త్రము ననుసరించి మనము చెప్పుచున్నాము; మఱియు దీని నను సరించియే "తుకా మ్హణే జేఁ జేఁ భేటే, తేఁ తేఁ వాటే మీ ఏసేఁ"– ఈ కనఁబడున దంతయు నే ననియే తోఁచుచున్నది (గా. 4444. 4) అని తుకారాంబువాగారు చెప్పిరి; కాని యవ్యక్తమగు పరమాత్మకే భక్తిమార్గమునందు వ్యక్తమగు పరమేశ్వరునియొక్క స్వరూపము ప్రాప్తమగును. కావునఁ బై సిద్ధాంతమునకుఁ బ్రతినిధిగ నిప్పుడు "యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి"– నేను (భగ వంతుఁడను) సర్వభూతములయందును, సర్వభూతములు నాయందు నున్నవి (6. 29) యని కాని, లేక, "వాసుదేవ స్సర్వ మితి"– ఈ యున్నదంతయు వాసుదేవమయముగనే యున్నది (7. 19) యని కాని, లేక, "సర్వభూతా న్యశేషేణ ద్రక్ష్య స్యాత్మన్యథో మయి" – జ్ఞానము కలిగిన పిదప సర్వభూతములను నీ యందును పిదప నా యందును జూచెదవు (గీ. 4.35) అని గీతలయందుఁ జెప్పఁబడినది; మఱియు నీ కారణము చేతనే భాగవతపురాణమునందును–

సర్వభూతేషు యః పశ్యే ద్భగవద్భావ మాత్మనః,
భూతాని భగవ త్యాత్మ న్యేష భాగవతోత్తమః.

— నేను వేఱు, భగవంతుఁడు వేఱు, మఱియు లోకులు వేఱను బుద్ధి మనస్సున నుంచక నేనును భగవంతుఁడును నొకటియే యను భావన నెవఁడు సర్వభూతములయందు నుంచుచున్నాఁడో, మఱియు సర్వభూతములు భగవంతునియందును తనయందు నున్నవని తెలిసికొనుచున్నాఁడో వాఁడు భాగవతులలో శ్రేష్ఠుఁడు అని భగవద్భక్తుల యొక్కలక్షణము చెప్పఁబడినది (భాగ. 11.2.45 మఱియు 3.24.46). అయినను వాస్తవముగ విచారించితి మేని యధ్యాత్మశాస్త్రమునందున్న 'అవ్యక్త పరమాత్మ' యను శబ్దమునకు మాఱుగ 'వ్యక్తపరమేశ్వరుఁ'డను శబ్దము యోజింపఁబడుట మాత్రమే యిపు డున్న భేదమని స్పష్టమగుచున్నది. అధ్యాత్మశాస్త్రమునందున్న పరమాత్మ యవ్యక్తమనియు సమస్త జగత్తును నాత్మమయముగనే యున్నదనియు నధ్యాత్మశాస్త్రమునందున్న యుక్తివాదముచే సిద్ధించినది; కాని భక్తిమార్గము ప్రత్యక్షముగఁ దెలియునదగుటచేఁ బరమేశ్వరుని యనేకములయిన వ్యక్తవిభూతులను జెప్పి, ప్రత్యక్షమగు విశ్వరూపదర్శనముచే సర్వజగత్తును పరమేశ్వరమయ మైనదని (ఆత్మమయ మయినదని) చెప్పి యప్పు డర్జునునకు దివ్యదృష్టి నిచ్చి సాక్షాత్కారముఁ గలుగఁజేసినాఁడు (గీ. 10. 11). అధ్యాత్మశాస్త్రమునందుఁ గర్మక్షయము జ్ఞానముచేఁ గలుగునని చెప్పఁబడినది; కాని సగుణుఁడైన పరమేశ్వరుఁడు దప్ప జగత్తునందు మఱియొకటేమియు లేమిచే జ్ఞానము, కర్మజ్ఞాత, కర్త, కారయిత, ఫలదాతయు నాతఁడే యయి యున్నాఁడని భక్తిమార్గముయొక్క సిద్ధాంతము. సంచితము, ప్రారబ్ధము, క్రియమాణము మొదలయిన కర్మభేదము లను చిక్కులోఁ బడక కర్మను జేయుటకు బుద్ధి నిచ్చువాఁడును, లేక, కర్మక్షయమును జేయువాఁడును నొక పరమేశ్వరుఁడే యనియుఁ బ్రతిపాదించుట సాధ్య మగును.

ఉదాహరణము: తుకోబా దేవుని నేకాంతమునందు ప్రార్థించి, స్పష్టముగను ప్రేమపూర్వకముగను—

**ఐక పాండురంగా ఏక మాత, కాఁహీఁ బోలడేఁ అహే ఏకాంత**
**అమ్హాఁ జరీ తారీల సంచిత, తరీ ఉచిత కాయ తుఝేఁ.**

— ఓ పాండురంగా! ఏకాంతమున నొకమాటఁ జెప్పెదను వినుము. కర్మయే నన్నుఁ దరింపఁ జేయునెడల నీవు చేయునట్టి యుపకారమేమి? యని అడిగి (గా. 499) యా యర్థమునే శబ్దాంతరముచే మఱియొక ప్రదేశమునందును (గా. 1023)—

**ప్రారబ్ధ క్రియమాణ, భక్తాఁ సంచిత నాహీఁ జాణ,**
**అవఘా దేవచి జాలా పాహీఁ, భరోనియాఁ అంతర్బాహీఁ.**

— వాద ప్రతివాదములు భక్తుల కవసరము లేదు. ఈశ్వరుఁ డొక్కఁడే లోపలను, వెలుపలను, నంతటను వ్యాపించి యున్నాఁడు అని చెప్పెను. మఱియు భగవద్గీతలయందును "ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి" (18. 61)— ఈశ్వరుఁడే సర్వలోకుల హృదయములందును వసించి వారిచే యంత్రములచేతనువలె, సర్వ కర్మలను జేయించుచున్నాఁ డని భగవంతుఁడు చెప్పెను. కర్మవిపాక ప్రక్రియయందు జ్ఞానముఁ గలుగఁ జేసికొనుటకై తనకుఁ బూర్ణమగు స్వాతంత్ర్య మున్నదని సిద్ధాంతీకరింపఁబడినది. కాని దానికి వ్యతిరేకముగ నిప్పు డీ బుద్ధిని సైతము పరమేశ్వరుఁడే యిచ్చుచున్నాఁడు. "తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధా మ్యహమ్" (7. 21). అనియు, "దదామి బుద్ధియోగం తం యేన మా ముప యాంతి తే" (గీ. 10. 10)— అనియుఁ జెప్పఁబడినది. అట్లే జగత్తులోనున్న సర్వ కర్మలును పరమేశ్వరునియొక్క సత్తచేత నడచును; కావున వాయు వతని భీతిచే విసరును. సూర్యచంద్రు లతనిశక్తిచేతనే నడచుచున్నారు (కఠ. 6. 3. బృ. 3. 8. 9.) వేయేల? అతని యిచ్ఛలేకయే వృక్షము యొక్కయాకైనఁ గదలదు అని భక్తిమార్గమునందుఁ జెప్పుచున్నారు.

మఱియు దానివలన మనుష్యుఁడనువానిని నిమిత్తముగ ముందుంచు కొని (గీ. 11. 33) యతనియొక్క హృదయము నందుండి తనసర్వ వ్యవహారములను బరమేశ్వరుఁడే, యంత్రముచేతను వలె, చేయించు చున్నాఁడు, అని భక్తిమార్గమందు ప్రమాణములు కలవు—

నిమిత్తాచా ధనీ కేలా అసే ప్రాణీ,
మార్ఝుఁ మార్ఝుఁ మ్హణేనీ వ్యర్థ గేలా.

(గా. 2310.4)

— జీవుఁడు నిమిత్తమాత్రముగ స్వతంత్రుఁడు గాన వ్యర్థముగ నిది నాది, యిది నాది యనుకొనినఁ జెడిపోవును అని తుకారాంబువా చెప్పెను. జగత్తుయొక్క వ్యవహారమును, సుస్థితియు, స్థిరమై యుండుట కెల్లవారును గర్మలను జేయవలయును; కాని యజ్ఞాను లీ కర్మ నాదియని తలంచి చేయునట్లు చేయక జ్ఞాని బ్రహ్మార్పణబుద్ధితో నామరణాంతము సర్వకర్మలను చేయునని యీశావాస్యోపనిషత్తు నందున్న తత్త్వమే పైనఁ జెప్పిన యుపదేశములోని సారము. మఱి యు నీ యర్థమే—

యత్కరోషి య దశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్.

(గీ. 9.27)

— దేనిని దేనినిఁ జేయుదువో, తినియెదవో, యజించెదవో, యిచ్చెదవో, వాని నన్నింటిని మదర్పణము చేయుము. అటులైన నీకుఁ గర్మలయొక్క బంధనము తగులదని యీ శ్లోకమున భగవంతుఁ డర్జునున కుపదేశించెను. భగవద్గీతలో నున్న యీ శ్లోకమే శివగీతల యందు నున్నది (14.45); ఇంతియె కాక—

కాయేన వాచా మనసేంద్రియై ర్వా బుద్ధ్యాత్మనా వా
ఽనుసృతస్వభావాత్,

కరోతి యద్య త్సకలం పరస్మై నారాయణా యేతి
సమర్పయే త్తత్.
(భాగ. 11.2.39)

— కాయము, వాక్కు, మనస్సు, ఇంద్రియములు, బుద్ధి, లేక, యాత్మ వీనిప్రవృత్తిచేఁ గాని, లేక, స్వభావానుసారముగఁ గాని మనము చేయున దంతయు పరాత్పరుఁడైన నారాయణునికి సమర్పింపవలయును అను భాగవతమందలి శ్లోకమునందును నా యర్థమే యున్నది. కావున నధ్యాత్మశాస్త్రమునందు దేనిని జ్ఞానకర్మసముచ్చయపక్ష మనియు, ఫలాశాత్యాగ మనియు, బ్రహ్మార్పణపూర్వక మగు కర్మ యనియు, చెప్పుచున్నారో (గీ. 4. 24; 5. 10; 12. 12) దానికే యిప్పుడు 'కృష్ణార్పణపూర్వకకర్మ' యని క్రొత్త పేరు వచ్చినది. భక్తిమార్గమునందున్నవారు భోజనసమయమునందు, గడ్డి నోటిలోఁ బెట్టుకొనినను 'గోవింద గోవింద' యనుటకు కారణ మీ కృష్ణార్పణబుద్ధియే యని సారాంశము. తన సర్వవ్యవహారములును లోకోపయోగార్థమై నిష్కామబుద్ధితో నడుచుచున్నవని జ్ఞానియగు జనకుఁడు చెప్పెను. కావున భగవద్భక్తులు తమభోజనాది వ్యవహారముల సైతము కృష్ణార్పణబుద్ధితోడనె చేయుచున్నారు. ఉద్యాపనలను, బ్రాహ్మణభోజనములను, లేక, యితరములగు నిష్టాపూర్తములగు కర్మలను జేసిరేని తుదకు "ఇదం కృష్ణార్పణమస్తు" అని కాని, లేక, "హరి ర్దాతా హరిర్భోక్తా" యని కాని చెప్పి యుదకమును వదలుట యను నాచారమునకు మూలము భగవద్గీతలయందున్న పైశ్లోకమే. ఏలన: ఆ సంకల్పమందున్న సత్యమైన రహస్యమును దెలిసికొనక యుపాధ్యాయుఁ డీ సంకల్పమును చిలుకవలె చెప్పుటయు, యజమానుఁడును చెవిటివానివలె నర్థమును దెలిసికొనకయే యుదకమును వదలుట యను కవాతును (అనఁగా: డ్రిల్లును) చేయుటయు సంభవించుచున్నది. కాని మూలమును విచారించితి మేని, కర్మ

ఫలాశను వదలివైచి కర్మను జేయుటయన నిదియే యని తెలియును. మఱియు దీని నాక్షేపించుటచే శాస్త్రమునకు వైగుణ్య మేమియు రాదు. నప్పువారి యజ్ఞానముమాత్రము వ్యక్త మగును. జీవితకాలమునం జేయుసర్వకర్మలును, వేయేల? జీవించుట యను కర్మ సైత మీరీతిగ కృష్ణార్పణబుద్ధితో, లేక, ఫలాశను వదలిచేసిన పిదప పాపవాసన యెక్కడ నుండును? మఱియుం గుకర్మయైన నెట్లు సంఘటిల్లును? లేక, లోకోపయోగార్థమగు కర్మను జేయుము. లోకోపకారార్థమై ప్రాణమును బోఁగొట్టుకొమ్ము" అని వేఱుగ నుపదేశ మేల చేయ వలయును? నేను, లోకులు నను నిద్దఱకును పరమేశ్వరునియందును బరమేశ్వరున కీ యిద్దఱియందును సమావేశము కలదు గాన స్వార్థ పరార్థములను రెండును కృష్ణార్పణరూపమగు పరమార్థమునందే కలసి పోవును. "జగాచ్యా కల్యాణా సంతాచ్యా విభూతి, దేహకష్టవితీ ఉప కారే"- సత్పురుషు లవతరించుట జగత్తుయొక్క కల్యాణము కొఱకే వారు పరోపకారము కొఱకుఁ దమ శరీరము నలయించుకొందురు అను తుకోబాయొక్క యభంగమే యెల్లెడలను సమన్వయ మగును. కృష్ణార్పణబుద్ధిచే సర్వ కర్మలను జేయు పురుషునకు స్వీయమగు యోగక్షేమములు బంధకములు గావని యుక్తివాదముచే గత ప్రక రణమునందు సిద్ధము చేయఁబడినది; మఱియు నా హేతువుచేతనే యిప్పుడు భక్తిమార్గమునందు "తేషాం నిత్యాభియుక్తానాం యోగ క్షేమం వహామ్యహమ్" (గీ. 9.22) అని భగవంతుఁడు గీతల యం దుఁ జేయూఁత నిచ్చియున్నాఁడు. శ్రేష్ఠమయిన మెట్టునకుఁ జేరిన జ్ఞాని సామాన్యజనులకు బుద్ధిభేదమును జేయక వారి నెట్లు సన్మార్గ మునకుఁ ద్రిప్పవలయునో (గీ. 3.26) ఆ రీతిగనే శ్రేష్ఠులగు భక్తులును గ్రిందితరగతి వారైన భక్తులయొక్క శ్రద్ధ నిఱుసనటు పోసియక వారి వారి యధికారానుసారముగఁ బై మెట్టునకుఁ జేర్పవలయునని వేఱు గఁ జెప్పనక్కఱ లేదు. కావున నధ్యాత్మశాస్త్రమునందు, లేక, కర్మ విపాకమునందు సిద్ధాంతీకరింపఁబడిన వన్నియు నీరీతిగఁ గొంత శబ్ద

భేదముతో భక్తిమార్గమునందును స్థిరముగనే యున్నవి. అటు లుండుటచే భక్తిజ్ఞానములకుసంబంధము కలుగఁజేయుట యను పద్ధతి మన దేశములో బహుకాలము క్రిందటనుండియు ప్రవృత్తమయినదని యిందలి సారాంశము.

కాని శబ్దభేదముచే నర్థభేదము గలుగునేని పైనఁ జెప్పినతీరున శబ్దభేదము సైతము చేయరు. కారణ మేమియన: ఏది యెట్లున్నను నర్థము ప్రధాన మగును. ఉదాహరణము: జ్ఞానప్రాప్తికొఱ కెవరికి వారు యత్నించి, యాత్మోద్ధారమును జేసికొనవలయు ననుకర్మవిపాకప్రక్రియయందున్న సిద్ధాంతము నీ కార్యమును సైతము పరమేశ్వరుఁడే చేయుచున్నాఁడను శబ్దభేదముతోఁ జెప్పుమూఢు లలసులై యత్నమే చేయరు. ఈ కారణముననే "ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః"—తానే తనకు శత్రువును, తానే తనకు మిత్రుఁడును (గీ. 6. 5) అను తత్త్వము భక్తిమార్గమునందును తఱచుగ నున్నది యున్నటులే (అనఁగా: శబ్దభేదము చేయక) చెప్పవచ్చును. "యథేఁ కోణాచెఁ కాయ బా గెలేఁ జ్యాచేఁ త్యానేఁ అనహిత కేలేఁ"—బుద్ధిపూర్వకముగ తనకు తానే యపకారము చేసికొనిన నితరుల కేమి నష్టము? (గా. 4448) అను తుకోబాయొక్క యభంగమే వెనుక వ్రాయఁబడినది. కాన దీనికంటె విశేష స్పష్టముగ—

నాహీఁ దేవాపాశీఁ మోక్షాచేఁ గాఠోళేఁ,
అణూని నిరాళేఁ ద్యావేఁ హాతేఁ.
ఇంద్రియాఁచా జయ సాధూనియాఁ మన,
నిర్విషయ కారణ అసే తేథేఁ.

గా. 42.97.

—ఎవరికైన చేత నందియిచ్చుటకు నీశ్వరునివద్ద మోక్షమను ముల్లె లేదు. ఈ మోక్షమును సాధించుట కింద్రియముల జయించుటయు, మనస్సును నిర్విషయముగఁ జేయుటయే ముఖ్య సాధనములు అని

తుకారామబువాగారు చెప్పిరి. "మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః" అనుదానికిఁ దుల్యమగు నుపనిషత్తులో నున్న మంత్రమువెనుక పదియవ ప్రకరణమునందు వ్రాయఁబడినది. పరమేశ్వరుఁడు జగత్తు నందున్న సర్వఘటీయంత్రములకును, కర్తగను, కారయితగ నున్నాఁడనుట సత్యమే; అయినను దానివిషయమై యాతనికి నిర్దయతయు, పక్షపాతము నను దోషములు లేకపోవు నిమిత్తమై వారి వారి కర్మానుసారముగ ఫలము ఇచ్చువాఁడని చెప్పినను కర్మవిపాకప్రక్రియయందున్న సిద్ధాంతమును సైత మీ కారణముచేతనే శబ్దభేదము లేకుండ భక్తిమార్గమునందు స్వీకరించుచున్నారు. అటులే యుపాసనార్థమై యీశ్వరుని వ్యక్తుఁ డనినను వ్యక్తములగు పదార్థములన్నియు మాయ యనియు, సత్యమగు పరమేశ్వరుఁడు వానికి పరమయినవాఁ డనియు నధ్యాత్మశాస్త్రమునందున్న తత్త్వమును సైతము మనదేశమునందున్న భక్తిమార్గీయు లెప్పుడును వదలరు. మఱియు నా కారణమున గీతలయందు వేదాంతసూత్రములయందుఁ బ్రతిపాదింపఁబడిన జీవస్వరూపమే సిద్ధాంతముగ నొప్పుకొనఁబడినదని వెనుకఁజెప్పియున్నారు. మనుష్యునియొక్క మనస్సు ప్రత్యక్షము వైపునకు, లేక, వ్యక్తమువైపునకు సహజముగఁ బ్రవర్తించు స్వభావమును తత్త్వజ్ఞానముయొక్క గూఢమగు సిద్ధాంతములతో నేకవాక్యతను జేయుట యను వైదికధర్మములయొక్క శైలియే యితర దేశముల యందున్న వారియొక్క భక్తిమార్గముల యందు స్పష్టముగఁ గాన్పింపదు. వీ రొకపర్యాయము పరమేశ్వరునియొక్క యొకానొక సగుణవిభూతికి సంబంధించి వ్యక్తుఁడు వచ్చెనేని వానియందే నిమగ్నులగుచున్నారు. మఱియు నదిగాక, వారికి మఱియొకటేదియుఁ గాన్పింపకపోవుటచేత తామసగుణ ప్రతీకముల విషయమై వృథాభిమానము వారి హృదయములయందు నుత్పన్న మగుచున్నది. మఱియు నటు లగుటచే తత్త్వజ్ఞానము వేఱనియు, శ్రద్ధయొక్క భక్తిమార్గము వేఱనియు నసత్యమగుభేదములనే చేయుచున్నారు.

కాని తత్త్వజ్ఞానము మన దేశమునందు చిరకాలము క్రిందటనే కలిగి యుండుటచే గీతాధర్మమునందు శ్రద్ధకును, జ్ఞానమునకును విరోధము లేదు. వైదికమగు జ్ఞానము శ్రద్ధాపూత మగునేని వైదికభక్తిమార్గము జ్ఞానరూపముగ నుండును. మఱియు నా కారణమున మనుష్యుఁడే మార్గము ననుసరించినను దుదకు సద్గతినే పొందును. అవ్యక్త జ్ఞానముయొక్కయు, వ్యక్తమగుభక్తియొక్కయు, మేళనమునందలి మహత్త్వమును, కేవల వ్యక్తమగు వస్తువునుండి బయలువెడలిన ధర్మమునం దున్న పండితులు గమనింపక పోవుటచే, నా మతమం దున్న యేకదేశీయులకును, తత్త్వజ్ఞానదృష్టిచే గీతాధర్మములయందు విరోధము భాసించుట యొక యాశ్చర్యము కాదు. కాని సంతోష మెట్లున్నది యనఁగా: వైదికధర్మముల యందలి గుణమును గ్రహింపక, దానికే మనలో ననేకులగు ననుకరణప్రియు లిటీవల పేరులు పెట్టుటకుఁ బ్రవర్తించుటఁ జూడ సంతోష మగుచున్నది. “అథవాఽభినివిష్టబుద్ధిషు, వ్రజతి వ్యర్థకతాం సుభాషితమ్”— అసత్యజ్ఞానముచే నొకసారి మనస్సు గ్రసింపఁ బడెనేని యా మనుజునకు సత్యవాక్కులును మనసున పట్టవు అని మాఘకావ్యమునందుఁ జెప్పఁబడిన (16. 43) వాక్యమున కిది యొక గొప్ప యుదాహరణము.

చతుర్థాశ్రమమునకు స్మార్తమార్గమునందున్న గౌరవము భక్తిమార్గమునందు, లేక, భాగవతధర్మములయం దుండనేరదు. వర్ణాశ్రమములయొక్క ధర్మము భాగవతధర్మములచే సైతము వర్ణింపఁబడి యుండును; కాని యా ధర్మముయొక్క ముఖ్యోద్దేశము భక్తియందే యుండును; కావున నుత్కటమైనభక్తి గలవాఁడు, గృహస్థుఁడైనను, వానప్రస్థుఁడైనను, లేక, బైరాగియైనను నందఱికంటె శ్రేష్ఠుఁడు. వర్ణాశ్రమములవిషయమై భాగవతధర్మములయం దేమియు విధినిషేధము లుండవు (భాగ. 11.18.13,14 చూడు). సన్న్యాసాశ్రమము స్మార్తధర్మములలో ముఖ్యమయినది. భాగవతధర్మములలో నట్టిది

కాదు; అయినను భాగవతధర్మములలో నెప్పుడును విరక్తులు కాఁ గూడదను నియమము లేదు. గీతలయందే సన్న్యాసము కర్మ యోగము నను నీ రెండును మోక్షదృష్టిచే సమానము లైనవియే యని చెప్పఁబడినది. కావున చతుర్థాశ్రమమునఁ బ్రవేశింపక పోయి నను సాంసారికకర్మలను వదలి బైరాగు లయినవారు భక్తిమార్గము నందుఁ బ్రవేశించుటకు వీలు లేకపోలేదు. వే యేల? పూర్వము నుండియు నీ మతము కొంచెమున్నట్టు సైతము స్పష్ట మగుచున్నది. అయినను నా కాలమున నది యంత ప్రచారములో నుండకపోవుటచే భగవద్గీతలయందు కర్మత్యాగముకంటె కర్మయోగమునకే యధిక మహత్త్వ మియ్యఁబడినదని పదునొకండవ ప్రకరణమునందు నేను స్పష్టముగ నిరూపించినాను. కర్మయోగముయొక్క ప్రచారము కాలాంతరమందు లుప్త మగుటచే భగవద్భక్తుఁ డనఁగా సాంసారికకర్మ లను లక్ష్యము చేయక వైరాగ్యముతో కేవలము భక్తియందే మగ్నుఁ డైనవాఁడని యిటీవల భాగవతధర్మీయులు సైతము సామాన్యముగ తలఁచుచున్నారు. కావున నీ విషయములో గీతలయొక్క ముఖ్యమగు సిద్ధాంతమును, సత్యమగు నుపదేశమును నేమయి యుండునని భక్తి పక్షమున నిచ్చో కొంచెము మరల వివరించుట యావశ్యక మయి యున్నది. భక్తిమార్గమునందున్న, లేక, భాగవతధర్మములయం దున్న బ్రహ్మమును జెప్పితిమేని బొత్తిగ సగుణభావనయే యగును. ఈ భగవంతుఁడు స్వయముగనే జగత్తను ఘటీయంత్రమును నడుపు చున్నాఁడు. మఱియు సాధుసంరక్షణార్థమును, దుష్టనిగ్రహార్థమును నా యా వేళలయం దవతారముల నెత్తుచు జగత్తుయొక్క ధారణ పోషణములఁ జేయుచున్నాఁడు. మఱియును, భగవద్భక్తులును లోక సంగ్రహార్థమై యా పుస్తకమునే యావృత్తి చేయుచుండవలయు నను విషయములు వేఱుగ చెప్పనక్కఱ లేదు. హనుమంతుఁడు రామచం ద్రునకు మహాభక్తుఁడుగ నుండెను; కాని రావణాది దుష్టులను తన

పరాక్రమముచే శిక్షించుట యను కార్యమును వీడలేదు. భీష్మల వారిని భగవద్భక్తులలో చేర్చిరి; కాని యాతఁ డామరణాంతము బ్రహ్మచారిగ నుండినను, స్వధర్మానుసారముగ స్వకీయులను, రాజ్యమును సంరక్షించుట యను కార్యమును వదలలేదు. భక్తిచే పరమేశ్వరజ్ఞానము కలిగిన పిదప భక్తులకు స్వీయహితముకొఱకై పొందవలసిన దేమియు నుండదు. సత్యమే, కాని ప్రేమమూలకమగు భక్తిమార్గముచే, దయయు, కారుణ్యమును, కర్తవ్యప్రీతియు మొదలగు నుదాత్త మనోవృత్తులను దొలఁగఁ ద్రోయరు. పైగా నా విషయమున నత్యంత సిద్ధు లగుచున్నారు. మఱియు కర్మలు సేయవలయునా? చేయ నక్కఱ లేదా? యను తార్కికవివాదమునఁ బడక—

> జ్యాసి ఆపంగితా నాహీఁ, త్యాసి ధరీ జో హృదయీ,
> దయా కరణేఁ జే పుత్రాసీ, తేచి దాసా ఆటి దాసీ.
> (గా. 960)

అన్నట్లు అభేదబుద్ధితో వెనుక పదునొకండవ ప్రకరణములోఁ జెప్పినట్లు "జగాచ్యా కల్యాణీ సంతాచ్యా విభూతి, దేహ కష్టవితీ ఉపకారేఁ" (గా. 929.3) అని స్వభావముగనే భగవద్భక్తులయొక్కవృత్తి లోకసంగ్రహపరముగ పరిణమించును. పరమేశ్వరుఁడే సృజించి దానియందు సర్వవ్యవహారములను జేయుచున్నాఁడని చెప్పుదు మేని యా సృష్టియొక్క వ్యవహారమే సులలితముగ నడచుటకు చాతుర్వర్ణ్యాది వ్యవస్థ యాతని యిచ్ఛచేతనే నిర్మిత మయినదని స్పష్టమగుచున్నది; మఱియు గీతలయందు "చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః" (గీ. 4.13) అని భగవంతుఁడు స్పష్టముగఁ జెప్పియున్నాఁడు. అనఁగా: వారు వారు తమ యధికారానుసారముగ సమాజముయొక్క యీ కార్యములఁ జేయుచు లోకసంగ్రహమును చేయవలయు నని పరమేశ్వరుని యుద్దేశమయి యున్నదనియు పరమేశ్వరుని యిచ్ఛచే నడచుచున్న సృష్టియందలి వ్యవహారములలో నొకానొక భాగమును

మనుజుని నిమిత్తమాత్రముగఁ జేసి యతనిచేఁ జేయించుట కొఱకే పరమేశ్వరుఁ డతనిని జన్మింపఁ జేయుచున్నాఁ డనియు, (పుట్టుక యందు ప్రవేశపెట్టుచున్నాఁ డనుట) పరమేశ్వరుఁ డతనికొఱకై యోచించిన యీ కార్యములను మనుజుఁడు చేయకయుండె నేని పరమేశ్వరు నవమానము చేసిన పాప మతనికిఁ గలుగుననియు తాత్ప ర్యము. ఈ కర్మలు నావి యని, లేక, నేను వానిని నా నిమిత్తమై చేయుచున్నానని యహంకారబుద్ధి మనస్సులో నుండెనేని యా కర్మల మంచిచెడుగులను నీ వనుభవింపవలసి వచ్చును; కాని పరమేశ్వరుని యొక్క మనస్సు నందేమి చేయింపవలయు నని యున్నదో దానినే నన్ను నిమిత్తముగ నుంచుకొని యాతఁడు చేయుచున్నాఁడని (గీ. 11. 33) భావించి పరమేశ్వరార్పణ పూర్వకముగ, కేవల స్వధర్మము లని యీ కర్మలను నీవు చేసినను నేమియు తప్పు గాని యయోగ్యత గాని లేదు. పైఁగా నిట్టి స్వధర్మాచరణము సర్వభూతాంతర్గతుఁ డగు పరమేశ్వరుని యందలి యొకవిధమైన సాత్త్వికభక్తియే యగునని గీతలు సెప్పుచున్నవి. "సర్వప్రాణిమాత్రముయొక్క హృదయములం దుండి పరమేశ్వరుఁడే వానిని నటింపఁ జేయుచున్నాఁడు. కావున నే నీ కర్మను జేయుచున్నా ననియు, వదలుచున్నా ననియు ననుకొనుట వ్యర్థమే. ఫలాశను వదలి సర్వకర్మలను కృష్ణార్పణబుద్ధితోఁ జేయు చుండుము. ఈ కర్మలను నేను చేయ నని నీవు నిగ్రహము చేసినను, ప్రకృతిధర్మానుసారముగ, నవి నీకు చేయవలసియే వచ్చును. కావు ననే స్వార్థముల నన్నింటిని పరమేశ్వరునియందు లయింపఁజేసి పర మార్థబుద్ధితోడను వైరాగ్యబుద్ధితోడను లోకసంగ్రహార్థమై నీవు కర్మలను జేయవలయును. నేను వానిని జేయుచునే యున్నాను; నాయొక్క యుదాహరణమును జూడుము; నావలె సంచరింపుము" అని తన సర్వోపదేశముయొక్క తాత్పర్యమును భగవంతుఁడు గీతలయొక్క చరమాధ్యాయమునం దుపసంహారముగ మరల చెప్పినాఁడు. జ్ఞాన మునకును, నిష్కామకర్మకు నెట్లు విరోధము లేదో యట్లే భక్తికిని,

కృష్ణార్పణబుద్ధిచేఁ జేయఁబడిన కర్మలకును విరోధముండదు. మహా రాష్ట్ర దేశమునందు భగవద్భక్తశిరోమణి యగు తుకారాంబువా గారును భక్తిచే "అణోరణీయాన్ మహతో మహీయాన్" (కఠ. 2.20; గీ. 8.9) — పరమాణువుకంటె చిన్నదియు, పెద్దదియు నని కఠోపనిషత్తులోఁ జెప్పఁబడిన యీ పరమేశ్వర స్వరూపముతోఁ దనకుఁ గలిగిన తాదాత్మ్యమును వర్ణించుచు—

అణురణీయాఁ థోకడా, తుకా ఆకాశవివఢా,
గిళుని సాఁడిలేఁ కళివర, భవభ్రమాచా ఆకార.
సాఁడిలీ త్రిపుటీ, దీప ఉజళలా ఘటీ,
తుకా మ్హణే ఆతాఁ, ఉరలోఁ ఉపకారాపురతా.

(గా. 3587)

అని, నే నిప్పుడు పరోపకారార్థము మాత్రమే యయి యున్నా నని స్పష్టముగఁ జెప్పినాఁడు. సన్న్యాసమార్గీయానుసారముగ నే నిప్పుడే పనియుఁ జేయనక్కఱలేదని చెప్పలేదు.

భిక్షాపాత్ర అవలంబణేఁ, జళోజిణేఁ లాజిరవాణేఁ,
ఐసీయాసే నారాయణేఁ, ఉపేక్షిజే సర్వదా.

(గా. 2595)

లేక—

సత్యవాదీ కరీ సంసార సకళ, అలిప్త కమళ జళీఁ జైసేఁ,
ఘడే జ్యా ఉపకార భూతాంచి తే దయా, ఆత్మస్థితియా
అంగీఁ వసే.

(గా. 3780. 2,3)

— అను నీ యభంగలవలన నీ విషయములో తుకారాంబువా గారి యభిప్రాయ మేదియో వ్యక్త మగును; కాని తుకారాంబువా గారు సంసారియై యున్నను వారియొక్క జీవితకాలము కొంచెము కర్మ త్యాగమువైపునకే యుండెను. కావున నుత్కటభక్తివలెనే యా

మరణాంతము నీశ్వరార్పణపూర్వకమైన నిష్కామకర్మాచరణయును ప్రవృత్తిపరమగు భాగవతధర్మములకు లక్షణమే యగును. లేక, గీతల యొక్క సిద్ధాంతమును బూర్ణముగఁ దెలిసికొనవలయునని యుండె నేని తుకారాంబువాగారే, శివాజీమహారాజుగారికి "సద్గురుని శరణు నొందు" మని తెలుపుటకుఁ జెప్పిన సంగతులను శ్రీసమర్థరామదాస స్వాముల వారియొక్క దాసబోధగ్రంథము నుండి తెలిసికొన వలయును. భక్తిచేతఁ గాని, జ్ఞానముచేతఁగాని పరమేశ్వరునియొక్క శుద్ధస్వరూపమును కృతకృత్యులగు సిద్ధులు దెలిసికొందురు. "శహాణే కరూన సోడావే, బహుత జన"–"నిస్పృహుఁడు తనయొక్క వ్యా పారములను యథాధికారముగ నెటు లారంభించుచున్నదియు చూచి జనులు తమ తమ వ్యవహారములను చేయుటకు నభ్యసింపవలయును (దాస. 19.10.14) అనియు, "కేల్యావిణ కాఁహీఁచ(హోత) నాహీఁ" (దాస. 19.10.25; 12.9.6; 18.7.3) అనియు ననేక పర్యాయములు చెప్పి చివర దశకమునందు–

> సామర్థ్య ఆహే చళవళీచేఁ, జో జో కరీల తయాచేఁ
> పరంతు యేథేఁ భగవంతాచేఁ, అధిష్ఠాన పాహిజే.
>
> దాస. 20.4.26.

– అని కర్మయొక్క సామర్థ్యమును, భక్తియొక్క తారకత్వమును సమర్థులవారు పూర్ణముగ సమన్వయించినారు. గీతయందు "మా మనుస్మర యుద్ధ్య చ"–నన్ను నిత్యమును స్మరించుము, యుద్ధమును సైతము చేయుము (గీ. 8. 7) అని యెనిమిదియవ యధ్యాయమున నర్జుననకు భగవంతుఁడు చేసిన యుపదేశమునం దున్నవియు, లేక, కర్మయోగులలోనే భక్తిగలవాఁడు శ్రేష్ఠుఁడు (గీ. 6.47) అని యాఱవ యధ్యాయపు చివరఁ జెప్పఁబడినవియు నగు వాక్యముల యందుండు తాత్పర్య మిదియే. కావుననే తుదకు పదునెనిమిదియవ యధ్యాయ మునందును–

**యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వ మిదం తతమ్,**
**స్వకర్మణా త మభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః.**

**గీ. 18.46**

— ఎవఁ డీ సర్వజగత్తును నిర్మించినాఁడో యాతనిని స్వధర్మానురూపముగ నిష్కామకర్మలచేత (కేవలవాక్కుచేతనే, లేక, పుష్పములచేఁ గాదు) పూజించి మనుష్యుఁడు సిద్ధిని పొందుచున్నాఁడు అని చెప్పఁబడినది. వేయేల? సర్వధర్మానురూపమగు నిష్కామకర్మానుష్ఠానము సైతము, సర్వభూతాంతర్గతుఁడును విరాట్స్వరూపుఁడు నగు పరమేశ్వరునియొక్క యొకవిధమగు భక్తియే, పూజయే, యుపాసనయే యగును అని యీ శ్లోకమునకును, గీతలకును భావార్థము. "స్వధర్మానురూపములగు కర్మలచేఁ బరమేశ్వరునిఁ బూజింపుము" అని చెప్పుటచే "శ్రవణం కీర్తనం విష్ణోః" మొదలగు నితరములైన నవవిధభక్తులును గీతలకు సమ్మతములు కావని తలఁపరాదు. ఇఁక నేమన: కర్మలు గౌణము లని వదలి యీ నవవిధమగు భక్తియందే మగ్నుఁ డౌట యుక్తము కాదు; తనకు శాస్త్రముచే విధింపఁబడిన కర్మలను జేయుచునే యుండవలయును; కాని వానిని స్వీయములైనవని తలఁచి చేయక పరమేశ్వరుని స్మరించి యాతనిచే నిర్మింపఁబడిన జగత్తుయొక్క సంగ్రహార్థమై యీ కర్మ లాతనివే యను నిర్మమబుద్ధితో జేసినయెడల కర్మలోప ముండదు. పైఁగా నీ కర్మలచేతనే పరమేశ్వరునియొక్క సేవ, భక్తి, యుపాసన నంఘటిల్లి పాపపుణ్యములు తగులక పోవుటచేఁ దుదకుఁ బూర్ణమగు సద్గతి లభించునని గీతలు సెప్పుచున్నవి. గీతలయొక్క యీ సిద్ధాంతము నెఱుఁగక గీతల మీఁద భక్తిపరులగు టీకాకారులు గీతలయందు భక్తియే ప్రధానమని తలఁచి కర్మలు గౌణములని గీతార్థమును తమ గ్రంథములలోఁ బ్రతిపాదించు చున్నారు; కాని సన్న్యాసమార్గీయు లగు టీకాకారుల మతమునకే భక్తిపరులగు టీకాకారుల యీ తాత్పర్యమును నేక

దేశీయముగ నున్నది. గీతలయందున్న భక్తిమార్గము కర్మప్రధాన మగుటచేఁ గేవలము పుష్పములచేతను, వాక్కులచేతనే కాక స్వధర్మోక్తనిష్కామకర్మచే సైతము పరమేశ్వరునియొక్క పూజన మగు ననియు నిట్టి పూజనము ప్రతి మనుజుఁడు నవశ్యము చేయవలయు ననియు దాని యందుండు ముఖ్యతత్త్వమై యున్నది. మఱియుఁ గర్మమయమగు భక్తియొక్క యీ తత్త్వము గీతలయందువలె నింకొకస్థలమున నెచ్చటను ప్రతిపాదింపఁబడక పోవుటచేతనే గీతల యందున్న భక్తిమార్గమున కీ విశేషమే లక్షణ మని చెప్పవలయును. జ్ఞానమార్గము భక్తిమార్గము ననువానికి కర్మయోగదృష్టిచే నిట్టి యేక వాక్యత సర్వశ్రేష్ఠముగ నున్నను, జ్ఞానమార్గముకంటె భక్తిమార్గము నందు విశేషమహత్త్వము గలదని స్పష్టముగఁ జెప్పవలయును. జ్ఞాన మార్గము సర్వమును బుద్ధిగమ్యమే యగుటచేఁ నల్పబుద్ధి గల సామా న్యుల కది క్లేశమయ మగును. భక్తిమార్గము శ్రద్ధామూలకమును ప్రేమగమ్యమును, ప్రత్యక్షము నగుటచే దాని నాచరించుట యెల్ల వారికిని సులభ మగునని పూర్వమునందే చెప్పఁబడినది; కాని, క్లేశమే కాక జ్ఞానమార్గమునందుఁ బ్రతిబంధకముఁ గలదు. జైమినియొక్క మీమాంసను గాని, లేక, యుపనిషత్తులను గాని, వేదాంతసూత్రము లను గాని చూచితి మేని వానియందు శ్రౌతములగు యజ్ఞయాగాది కములయొక్కయు కర్మసన్న్యాస పూర్వముగ 'నేతి నేతి' వాక్య గమ్యుఁడగు పరబ్రహ్మముయొక్కయు చర్చయే నిండియుండుటచే స్వర్గప్రాప్తికి సాధనభూతములగు శ్రౌతయాగాదికర్మలు గాని, మోక్ష ప్రాప్త్యర్థమయి యుపయోగించు నుపనిషదాదివేదాధ్యయనము గాని చేయునధికారము మొదటి మూఁడు వర్ణములవారివే యని చివరకు నిర్ణయింపఁబడినది (వే. సూ. 1.3.34-38). ఈ మూఁడు వర్ణముల యందున్న స్త్రీలకును, చాతుర్వర్ణ్యానుసారముగ సర్వసమాజము నకును హితార్థమై కృషి, లేక, యితర వ్యాపారములను జేయు సామాన్యస్త్రీపురుషులకును, మోక్ష మెట్లు లభించునదియు నీ గ్రంథ

ములలో విచారింపలేదు. మంచిది! ఇట్లు వేదమున స్త్రీ శూద్రాదుల కధికారము లేదు గాన వారి కెప్పుడును ముక్తి లభించుట శక్యము గాదని చెప్పుదు మేని యుపనిషత్తులలో గార్గి మొదలగు వారును, పురాణములలో విదురుఁడు మొదలగువారును, జ్ఞానులై సిద్ధినిఁ బొంది నారని (వే.సూ. 3.4.36-39) యున్నది గాన మొదటి మూఁడువర్ణ ముల పురుషులకే మోక్షప్రాప్తి యగునని సిద్ధాంతముఁజేయుటకు సాధ్యము కాదు. మఱియు స్త్రీ శూద్రుల కందఱకును ముక్తి లభించుట శక్య మగునని యందుమేని వారికి జ్ఞానప్రాప్తి సాధనము లేవియో చెప్పవలయును. బాదరాయణాచార్యులు "విశేషానుగ్రహశ్చ"— పరమేశ్వరునియొక్క విశేషానుగ్రహము (వే. సూ. 3. 4.38) అను సాధనమును జెప్పుచున్నారు; మఱియుఁ గర్మపరమగు భక్తిమార్గమను రూపము చేతనే యిది విశేషానుగ్రహాత్మకసాధనము. "స్త్రీలు, శూద్రులు, లేక, (కలియుగమునందున్న) నామధారక బ్రాహ్మణులు శ్రుతిని వినఁగూడదు; గాన భారతమందును (అనఁగా గీతలలోను) నిరూపింపఁబడినది" అని భాగవతమునందు చెప్పఁ బడినది (భాగ. 1. 4. 25). ఈ మార్గముచేఁ బ్రాప్తమగు జ్ఞానమును నుపనిషత్తులయందున్న బ్రహ్మజ్ఞానమును నొకవేళ యొక్కటేయయి నను, స్త్రీ-పురుషులు, లేక, బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్య-శూద్రులను భేద మిప్పుడు లేదు గాన—

**మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః,**
**స్త్రియో వైశ్యా స్తథా శూద్రా స్తేఽపి యాంతి పరాంగతిమ్.**
**గీ. 9.32.**

— ఓయి పార్థ! నన్నాశ్రయించి స్త్రీలు, వైశ్యులు, శూద్రులు, లేక, అంత్యజాతులయిన యే పాపయోనులు గలరో వారును పరమ మగు సిద్ధి నొందుదురు అని యీ రహస్యముయొక్క విశేషగుణము గీత లలో వర్ణింపఁబడినది. మఱియు నీ శ్లోకమే మహాభారతమునందున్న

అనుగీతాపర్వమునందు మరల వ్రాయఁబడినది (మ. భా. అశ్వ. 19. 61). వనపర్వాంతర్గత మగు బ్రాహ్మణవ్యాధ సంవాదమునందు మాంసము విక్రయించు వ్యాధునిచే బ్రాహ్మణునకును, శాంతిపర్వము నందు తులాధారునిచే (అనఁగా: వైశ్యునిచే) జాజలి యను విప్రుఁడగు తపస్వికిని స్వధర్మానుసారముగ నిష్కామబుద్ధితోఁ గర్మ నాచరించుటచే మోక్ష మెట్లు లభించునో నిరూపింపఁబడినదని కథ చెప్పఁబడినది (మ.భా.వన. 205-214; శాం. 260-263). దీనింబట్టి సమబుద్ధిగలవాఁడు వృత్తిచేత సాలెవాఁడైనను వర్తకుఁడైనను, లేక, కటికవాఁడే యైనను శ్రేష్ఠుఁడే యనియు నెవనియొక్క యోగ్యత యైనను వ్యాపారము నైనను జాతిని నవలంబించియుండదు, సర్వవిధముల నతనియొక్క యంతఃకరణశుద్ధినే యవలంబించి యుండుననియు, భగవంతుఁడు సెప్పినాఁడని స్పష్ట మగును. సామాన్యజాతి యందున్న సర్వజనులకు నీ రీతిగ మోక్షద్వారము తెఱవఁబడియుండుటచే సమాజమునం దొక విధమగు విలక్షణమగు నే జాగృతి (అనఁగా: స్ఫూర్తి) యుత్పన్న మగునో దానియొక్క స్వరూపమును మహారాష్ట్రమునఁదున్న భాగవతధర్మముల యొక్క యితిహాసముల యందుండి సహజముగఁ దెలిసికొనుటకు యోగ్యమయియున్నది. పరమేశ్వరునకు స్త్రీయైనను, బ్రాహ్మణుఁడైనను, చండాలుఁ డైనను సమానులే. "దేవుఁడు భావ మనునాఁకలి గలవాఁడు;" ప్రతీకమును సంబంధించిన వాఁడు కాఁడు. నలుపుఁ దెలుపు ననువర్ణములయొక్క భేదము లేదు. మఱియు స్త్రీపురుషు లని కాని, లేక, బ్రాహ్మణ చండాలాదులని కాని భేదము లేదు. తుకోబా—

> బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర, చాండాళాఁ ఆహె అధికార,
> బాలే నారీనర, ఆదికరోని వేశ్యాహి.
> తుకామ్హణే అనుభవే, అమ్హీఁ పాడియలేఁ ఠావేఁ,
> ఆణికహి దైవేఁ, సుఖ ఘేతీ భావికేఁ.

గా. 2382.5,6.

— అని చెప్పుచున్నారు. వే యేల? "మనుజుఁ డెంత దురాచారుఁ డైనను నంతకాలమందైనను ననన్యభావముతో భగవంతుని శరణుఁ జొచ్చెనేని పరమేశ్వరుఁ డతనిని మఱచిపోఁ" డని (గీ. 9.30; 8 5.8) గీతాశాస్త్రముయొక్క సిద్ధాంతము 'వేశ్యా' యను శబ్దమును పైన నున్న 'అభంగ'లోఁ జూచి యనేకులగు విద్వాంసులకు నొకా నొకప్పు డసహ్యము తోఁచును; కాని యట్టి జనులకు నిజమగు ధర్మ తత్త్వము తెలియదని చెప్పవలయును. హిందూధర్మములయందేకాక బౌద్ధధర్మముల యందును నీ సిద్ధాంతమే స్వీకరింపఁ బడియున్నది. (మిళింద ప్రశ్న: 3.7.2). 'అమ్రపాలి' యనుపేరి వేశ్యకును, 'అంగులీమాల' యనుపేరి చోరునకును దీక్ష యిచ్చినటుల నా ధర్మ గ్రంథములలోనే కథ యున్నది; మఱియు క్రైస్తవుని వధస్తంభము మీఁద నెక్కింపఁబడిన యిరువురు దొంగలలో నొకఁడు మరణసమయమునందుఁ గ్రీస్తువును శరణుచొచ్చినందుననే క్రీస్తు, వానికి సద్గతి నిచ్చినాఁడని క్రైస్తవ ధర్మగ్రంథములలో సైత మొక కథ యున్నది (ల్యూక. 23.42 మఱియు 43). తమ ధర్మముపై శ్రద్ధయుంచు వేశ్య సైతము ముక్తిని పొందుచున్నదని స్వయముగ ఏసుక్రీస్తే యొకచోట చెప్పినాఁడు (మాథ్యూ. 21 31; ల్యూక. 7.50). మంచిది. అధ్యాత్మ దృష్టిచే చూచినను నీ సిద్ధాంతమే సిద్ధమగునని పూర్వమునందు పదియవ ప్రకరణమునఁ జెప్పియే యున్నాను; కాని యీ ధర్మతత్త్వము శాస్త్రముచే నిర్వివాదముగ నున్నను జన్మమంతయు దురాచారముతోఁ గడపిన వారి కంతకాలమునందే భగవంతుని యనన్యభావముతో శరణు చొచ్చుటకు బుద్ధిపుట్టుట సంభవింపఁదగినది కాదు; మఱియు నంతకాలమునఁ గలుగు యాతనయందు యంత్రమువలె నుండును; 'రా' యనిన పిదప 'మ' యనుటకై నోరు మూయుటయు శ్రమయే యగుటచే, తెఱచిననోరు మూసికొనుటయైన విశేషముగ నిష్పన్నము కానేరదు. కావున మరణసమయమునందే కాకపోయినను సర్వాయుర్దాయము నందును దప్పక నాయొక్క స్మరణమును మనస్సులో

స్థిరముగ నుంచుకొని స్వధర్మానుసారముగ సర్వవ్యవహారములను పరమేశ్వరార్పణబుద్ధితోఁ జేయుచుండుము. కాని నీవు జాతితో నెవఁడవైనను కర్మలను చేసిన ముక్తుఁడవే యగుదు వని భగవంతుఁ డెల్ల వారికి నిశ్చయపూర్వకముగఁ జెప్పినాఁడు (గీ. 9.2౦.28 మఱియు 30. 34). ఇట్లు వర్ణముయొక్కయు, నాశ్రమములయొక్కయు, జాతుల యొక్కయు, లేక, స్త్రీపురుషాదులయొక్కయు భేదము నుంచక యుపనిషత్తులయందున్న బ్రహ్మాత్మైక్యజ్ఞానమును, వ్యవహారలోపము చేయక, నా బాలవృద్ధమునకును సులభము చేసి యిచ్చెడి గీతల యందున్న భక్తిమార్గముయొక్క యీ సామర్థ్యమును, సమతయు ననుభవగోచర మయ్యెనేని "సర్వధర్మములను వదలి, నీవు నన్నొకనినే శరణము నొందుము. నిన్ను నేను సర్వపాపముల నుండియు ముక్తునిఁ జేయుదును. తొందరపడకుము" అని ప్రతిజ్ఞా పూర్వకముగ భగవంతుఁడు గీతలయొక్క కడపటి యధ్యాయము నం దన్న రహస్యము స్పష్టముగనే యున్నది. వ్యవహారమునందు పాపములనుండి యలిప్తుఁడయి పరమేశ్వరప్రాప్తిరూపమగు నాత్మ శ్రేయస్సును సంపాదించుకొనవలయు నను ప్రత్యక్షమార్గమే, లేక, యుపాయమే, ధర్మమని, వ్యాపకమగు నర్థమునం దీ స్థలమున నుపయోగింపఁ బడినది. అనుగీతయందున్న గురుశిష్యసంవాదములో నహింసాధర్మము, సత్యధర్మము, వ్రతములు, ఉపవాసములు, జ్ఞానము, యజ్ఞయాగములు, దానము, కర్మ, సన్న్యాసము మొదలగు ననేకవిధములగు నుపాయములను ననేకులు ప్రతిపాదింతురు గదా! వానిలో సత్య మేదియో చెప్పుమని ఋషులు బ్రహ్మదేవుని ప్రశ్నించిరి (అశ్వ. 49); మఱియు శాంతిపర్వమునందును (శాం. ౩54), గార్హస్థ్య ధర్మము, వానప్రస్థధర్మము, రాజధర్మము, మాతృపితృసేవాధర్మము, క్షత్రియులకు రణాంగణమునందు మరణము, బ్రాహ్మణులకు స్వాధ్యాయము మొదలగు ననేక ధర్మములును, లేక, స్వర్గప్రాప్తికి ద్వారములు, శాస్త్రమునందుఁ జెప్పఁబడియుండుటచే వానిలో గ్రాహ్యమగు

ధర్మమేది? యను ప్రశ్నము, ఉంఛవృత్త్యుపాఖ్యానమందుఁ జేయఁబడినది. వేర్వేఱు ధర్మమార్గములు, లేక, ధర్మములు పైకి పరస్పర విరుద్ధములుగ నున్నట్లు తోఁచును; కాని సర్వభూతములయందును సామ్యబుద్ధి యను ధర్మము చరమసాధ్య మైనది. ఆ సామ్యబుద్ధి పై ధర్మములో నేదైన నొక ధర్మముపై ప్రీతి దృఢమై, శ్రద్ధచే మన స్సైకాగ్ర మగుటచే ప్రాప్త మగుటవలన నీ సర్వప్రత్యక్షమార్గముల యొక్క యోగ్యతను శాస్త్రకారు లొకరీతిగనే తలఁచుచున్నారు; అయిన, నీ యనేకమార్గములయొక్క, లేక, ప్రతీకోపాసనలయొక్క చిక్కులోఁబడి మనస్సు భ్రమపడవచ్చును. కావున చిత్తశుద్ధియొక్క యనేకధర్మమార్గములను వదలి "నీవు నన్నొకనినే శరణు పొందుము, నేను నిన్ను సర్వపాపములనుండి ముక్తునిఁ జేయుదును, భయ పడకుము" అని యర్జునునకే కాక, యర్జునుని నిమిత్తముగఁ జేసి కొని యందఱకును భగవంతుఁడు చివరకు నిశ్చితమైన ముగింపు మాట నిచ్చినాఁడు.

> **జళో తేఁ జాటీవ జళోతే శాహాటీవ,**
> రాహో మాఝూ భావ విఠ్ఠలపాయీ,
> **జళో తో ఆచార జళో తో విచార,**
> రాహో మన స్థిర విఠ్ఠలపాయీఁ. **గా. 3464.**

— అని తుకారాంబువాగారును, అట్లే సర్వధర్మ నిరసనపూర్వకముగ దేవునివద్ద తుదకు నడుగుచున్నారు. నిశ్చయపూర్వకమగు నుపదేశమునకు, లేక, ప్రార్థనకు, ఇది పరమావధియై యున్నది.

శ్రీమద్భగవద్గీతారూపమగు సువర్ణపాత్రయందు 'భక్తి' యను నది కడపటి యోగిర మగును. ప్రేమ యను గ్రాసమును పుచ్చుకొనుము. నేను అపోశనమును వైచుటకు సిద్ధుఁడ నగుదును.

ఇది భక్తిమార్గ మను త్రయోదశ ప్రకరణము.



—

# చతుర్దశ ప్రకరణము

## గీతాధ్యాయసంగతి

ప్రవృత్తిలక్షణం ధర్మం ఋషి ర్నారాయణోఽబ్రవీత్. *

కర్మలను చేయుమనే యధ్యాత్మవిచారము చేయుటచే, లేక, భక్తిచే సర్వాత్మైక్య రూప మగు సామ్యబుద్ధి సంపూర్ణముగ లభించు చున్నది. వెంటనే సన్న్యాసమును గైకొనుట యను పెడత్రోవకు పోక సంసారమునందు శాస్త్రవిధిచే ప్రాప్తము లయిన సర్వకర్మలను కేవలము కర్తవ్యము లని తప్పక చేయుచుండవలయును. అట్లు చేయుట యనునదియే యీ జగత్తునందు మనుజులకు పరమపురుషార్థము, లేక, యాయుష్యక్రమణమునకు నుత్తమమార్గము. ఇది భగవద్గీతల యందు (అనఁగా: భగవంతునిచే గానము చేయఁబడిన యుపనిషత్తులయందు) ప్రతిపాదింపఁబడినదని యింతవఱకుఁ జేసిన వివేచనవలనఁ గాన్పించును. అయిన నీ గ్రంథమునం దీ యర్థమున నేను చెప్పినక్రమము, గీతాగ్రంథముననుండు క్రమముకంటె వేఱుగ నున్నది. కావున నా విషయమున భగవద్గీతయం దెట్లు పట్టిక యేర్పఱుపఁబడినదియు నిచ్చోఁ గొంచెము పరీక్షించుట యావశ్యకము. రెండు పద్ధతులుగనే విషయ నిరూపణమును జేయ నగును. ఒకటి శాస్త్రీ

---

* "నారాయణఋషి ప్రవృత్తిపరములగు ధర్మములను చెప్పెను." నర నారాయణు లను యిరువురిలోని వారే యీ నారాయణఋషి. మఱియు నీ యిరువురే క్రమమున అర్జున శ్రీకృష్ణులై యవతరించిరని పూర్వము చెప్పఁబడి యున్నది. ఇటులే నారాయణీయధర్మములు గీతలయందు చెప్పఁబడిన వను విషయమై, మహాభారతమునందున్న వచనములు పూర్వమునందు చూపఁబడినవి.

యము. రెండవది పౌరాణికము. వీనిలో సర్వజనులకు సహజ
ముగ తెలియు విషయములనుండి ప్రతిపాద్య విషయముయొక్క
మూలతత్త్వ మెట్లు నిష్పన్న మగునని, సాధకబాధకప్రమాణములను
తర్కశాస్త్రానుసారముగ క్రమముగ సిద్ధము చేసి చూపించుటకు
శాస్త్రీయపద్ధతి యని పేరు. భూమితిశాస్త్ర మీ పద్ధతిలో నుత్కృష్ట
మైనది. న్యాయసూత్రములయందును, వేదాంతసూత్రములయం
దును, నున్నయుపపాదన యీ విధముగనే యున్నది. కావున భగ
వద్గీతయందు బ్రహ్మసూత్రము లుల్లేఖింపఁ బడినప్పుడెల్ల, వానియం
దున్న విషయము హేతుయుక్తములును, నిశ్చయాత్మకములు నయిన
ప్రమాణములచే సిద్ధమైనటుల వర్ణింపఁబడినది. "బ్రహ్మసూత్ర పదై
శ్చైవ హేతుమద్భి ర్వినిశ్చితైః" (గీ. 13.4) కాని భగవద్గీతయందున్న
నిరూపణము నశాస్త్రీయమైనను నది యీ శాస్త్రీయపద్ధతి చేతనే
చేయఁబడలేదు. భగవద్గీత సులభముగను, మనోరంజకమగు శ్రీకృ
ష్ణార్జున సంవాదరూపముగను నున్నది. మఱియు నా కారణముననే
ప్రత్యధ్యాయ సమాప్తియందును "భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మ
విద్యాయాం యోగశాస్త్రే" యను శబ్దముల తర్వాత "శ్రీకృష్ణార్జున
సంవాదే" యను గీతానిరూపణముయొక్క స్వరూపదర్శకములగు
శబ్దము లున్నవి. ఈ నిరూపణయందును, 'శాస్త్రీయ' నిరూపణ
యందును నున్న భేదమును జూపించుటకై సంవాదాత్మక మగు నిరూ
పణము 'పౌరాణిక' మని మాచేఁ బేర్కొనఁబడినది. ఏడువందల
శ్లోకములలో వివరింపఁబడిన యిట్టి సంవాదాత్మకము, లేక, పౌరా
ణిక మగు నిరూపణమునందు 'ధర్మ' మను వ్యాపకశబ్దమున కర్థమగు
సర్వవిషయములను సవిస్తరముగ నూహాపోహలు చేయుట యెప్పు
డును శక్యము గాదు; కాని త్రోటకము (ఒకవిధమగు నాటకము)
రీతిచే నైనను గీతలయందుఁ గాన్పించు ననేక విషయములు పరస్పర
విరోధము లేక విచారింప నాశ్చర్య మగును. మఱియును దానింబట్టి
గీతాకారులయొక్క యలౌకిక సామర్థ్యము వ్యక్త మగుటచే గీతల

యందున్న యుపదేశ మత్యంత యోగయుక్తమైన చిత్తముతోఁజేయఁ బడిన దని యనుగీతలయొక్క యారంభమునఁ జెప్పఁబడిన మాట సత్యమే యని తోఁచును. అర్జునునకుఁ బూర్వమునందే తెలిసినదానిని మరల సవిస్తరముగఁ జెప్పవలసిన యవసర మేమియు లేదు. "నేను యుద్ధమున ఘోరకర్మమును జేయుదునా? వలదా? చేయుదు నన్న నెట్లు చేయుదును?" అని యతనికి సందేహము కలిగెను. మఱియు శ్రీకృష్ణుఁడు తనకు నేదైన యుక్తివాదముఁ జెప్పె నేని దానిమీఁద నర్జునుఁడు మఱియొక యాక్షేపణను జేయుచుండెను. ఈ ప్రకార ముగ నడచుచున్న ప్రశ్నోత్తరరూపమగు సంవాదమునందు గీతలలోని ిచారణ సాధారణముగఁ బ్రోటకముగను, లేక, సంక్షిప్తముగను, లేక, యెప్పుడైన నొకప్పుడు పునరుక్తముగను నుండును. ఉదాహర ణము: త్రిగుణాత్మక ప్రకృతిసంబంధమగు వర్ణన కొంచెము భేదముగ రెండు ప్రదేశములయందు (గీ. అ. 7 మఱియు 14) చేయఁబడినది. స్థితప్రజ్ఞుఁడు, భగవద్భక్తుఁడు, త్రిగుణాతీతుఁడు, బ్రహ్మభూతుఁడు నను వారియొక్క స్థితి యొక్కటియైనను వేఱువేఱు దృష్టిచేఁ బ్రతి సమ యము నందును పునరుక్తి చేయఁబడినది. అట్లు లేనప్పు డర్థము, కామము నను నవి ధర్మమును వదలివేయనప్పుడు గ్రాహ్యము లగు నను విషయము "ధర్మావిరుద్ధః కామోఽస్మి" (7. 11) అను నొక్క వాక్యమునందే సూచనగఁ దెలియఁ జేయఁబడినది. గీతలలో నన్ని విషయములు వచ్చియున్నను శ్రౌతధర్మములు, స్మార్తధర్మములు, భాగవతధర్మములు, సాంఖ్యశాస్త్రము, పూర్వమీమాంస, వేదాంతము కర్మవిపాకము మొదలగు గ్రంథముల యందున్న ప్రాచీనసిద్ధాంత ముల యాధారముచే గీతలలోఁ జెప్పఁబడిన జ్ఞానముయొక్క పరం పరఁ దెలియనివారి మనస్సు గీతలను చదువునప్పుడు భ్రమము చెం దుట సంభవించును. మఱియు ప్రతిపాదనయొక్క సరణి సరిగఁ దెలియనిచో గీత యనఁగ నేదో యొుగ గందరగోళముగ నుండును. లేదా, శాస్త్రీయపద్ధతి ప్రచారములోనికి వచ్చుటకు పూర్వమే గీత

యుపదేశింపఁబడి యుండునని తోఁచును. మఱియు దానివలన గీతలలోఁ బ్రతి ప్రదేశమునందును నపూర్ణతయుఁ, విరోధము నిండి యుండు ననియు, లేక, యేమియు లేకపోయినను తన బుద్ధికైనను గీతలయందున్న జ్ఞాన మగమ్యముగ నున్నదనియుఁ దోఁచును. సంశయ నివృత్తికొఱకు టీకలఁ జూచితిమేని యవియు ననేక స్థలముల యందు వేర్వేఱు సంప్రదాయముల ననుసరించి చేయఁబడినవియై యుండుటచే టీకాకారుల మతములలో నున్న పరస్పర విరోధములకు నేకవాక్యతను జేయుట దుర్ఘటమై మనస్సు విశేషముగ భ్రమఁ జెందును. ప్రసిద్ధిఁ జెందిన కొందఱు చదువరులు సైత మీ విధమైన భ్రాంతియందుఁ బడినట్లు మనకుఁ దెలిసియే యున్నది. ఈ ప్రతిబంధకము లేకపోవు నిమిత్తమై గీతలయందు ప్రతిపాద్యములగు విషయములను నా తెలివికొలఁదియు, శాస్త్రీయక్రమముతోఁ దెలిపి యింత పర్యంతము వివరించితిని. ఇప్పు డా విషయములే శ్రీకృష్ణార్జున సంభాషణలో నర్జునుని ప్రశ్నను, లేక, శంక ననుసరించి ఏ యే విధముగ వర్ణింపఁబడినవో, చెప్పితి మేని, యీ వివరణము పూర్ణమగును. మఱియు మొత్తముపై నన్ని విషయములను జెప్పఁబోవు ప్రకరణమునం దుపసంహారమును జేయుటకు సులభ మగును.

మన హిందూదేశము జ్ఞానముయొక్కయు, వైభవముయొక్కయు యశస్సుయొక్కయు స్వారాజ్యముయొక్కయు సుఖము ననుభవించుచున్నట్లు నలుదిక్కులను ప్రశంసఁ జెందిన సమయమునందొక సర్వజ్ఞుఁడును, మహాపరాక్రమవంతుఁడును, యశస్వియు, పరమపూజ్యుఁడు నయిన క్షత్రియునిచే, మఱియొక గొప్పవాఁడగు ధనుర్ధరుని క్షత్రియ ధర్మరూపమగు స్వకార్యమునందుఁ బ్రవర్తింపఁ జేయుట కొఱకు గీత యుపదేశింపఁబడినదని చదువరులు మొదట గుర్తుంచుకొనవలయును. జైనధర్మములకును, బౌద్ధధర్మములకును బ్రవర్తకులగు మహావీరుఁడు, గౌతమబుద్ధుఁడు నను వార లిరువురును క్షత్రియులే; అయిన నా

యిరువురును వైదికధర్మములయందున్న కేవల సన్న్యాసమార్గమునే యంగీకరించి క్షత్రియాది సకల వర్ణములకును సన్న్యాసధర్మముల నాచరించుట కభ్యనుజ్ఞ నిచ్చినట్లు శ్రీకృష్ణమూర్తి యభ్యనుజ్ఞనియ్య లేదు. ఇఁక నేమన: క్షత్రియాదులే కాక, బ్రాహ్మణులు సైతము నివృత్తిమార్గమునం దెల్లపుడును శాంతి నభ్యసించినట్లు, నిష్కామ బుద్ధితో నిఖిల కర్మల నామరణాంతము నాచరించుట యను మార్గ మును స్వీకరింపఁ వలయును అని భాగవతధర్మముల నుపదేశించెను; కాని యుపదేశ మెట్టిదైనను దాని ననుష్ఠించుట కేదియో యొక కారణ ముండి తీరవలయును; మఱియు నా యుపదేశము సఫలమగు టకు శిష్యునియొక్క మనస్సునందు "ఈ యుపదేశముయొక్క జ్ఞానమును గలుగఁ జేసికొనవలయును" నను కోరికయును మొదట తీవ్రముగ నుండవలసివచ్చును. కావున నీ రెండు విషయములను స్పష్టము చేయుటకై వ్యాసులవారు గీతలలోని ప్రథమాధ్యాయము నందు శ్రీకృష్ణుఁ డర్జునున కీ యుపదేశమును జేయుటకు కారణ మేమియో సవిస్తరముగ వర్ణించినారు. కౌరవపాండవ సైన్యములు యుద్ధమునకు సిద్ధములై కురుక్షేత్రమునకు నిలువఁబడెను. యుద్ధప్రా రంభము కాఁబోవుచుండెను. ఇంతలో నర్జునుఁడు చెప్పగా శ్రీకృష్ణుఁడు రథమును దోలుకొనిపోయి రెండు సైన్యముల మధ్యమునను నిలువఁ బెట్టి "నీ వెవరితో యుద్ధము చేయవలయునో యా భీష్మద్రోణాదు లను జూడు" మని యర్జునునితో ననెను. అప్పు డర్జునుఁడు రెండు సైన్యములను గలయఁ జూడఁగనే "మన గురువులును, పినతండ్రు లును, పితామహులును, శ్వశురులును, బంధువులును, పుత్త్రులును, మనుమలును, స్నేహితులును, నాప్తులును, గొప్పవారును, గురు బంధువులును మొదలయినవారు రెండు పక్షములయందు నిండి యున్నారు. ఈ యుద్ధమున నందఱను నశింతురు" అని వాని మన మునకుఁ దోఁచెను. యుద్ధము సైతము తలవని తలంపుఁగా సంభవిం చినది గాదు. నిశ్చితమగుటచే రెండు వైపులను సైన్యముయొక్క

సన్నాహము చిరకాలము నుండి నడచుచుండెను. అయినను నీ యుద్ధము తమలో తమకే యగును గావున కులక్షయముయొక్క ప్రత్యక్షస్వరూపము తనకుఁ గనఁబడునట్లుండఁగా నర్జునునివంటి మహా యోధకు సైతము మేవగింపు కలుగుటచే "అయ్యయో! నాకు రాజ్యము వచ్చునను తలంపున మా కులమునకు నీ భయంకరమగు క్షయమును నేను చేయఁబోవుచున్నాను గదా! ఇట్లు కులక్షయముఁ జేయుటకంటె బిచ్చమెత్తుకొనిన మాత్రమునఁ దప్పేమి?" యనుమాట లతని నోటి నుండి వెలువడెను. మఱియు "నన్ను శత్రువులు జంపినను మంచిదే; కాని త్రైలోక్యరాజ్యము కొఱకైనను పితృవధ, గురువధ, బంధువధ, కులక్షయమువంటి ఘోరపాతకములను నేను చేయ నిచ్ఛయింపను'' అని శ్రీకృష్ణునితోఁ జెప్పెను. ఆతని శరీరమంతయు వణఁకసాగెను. కాలుసేతులకు శక్తి లేకపోయెను. మఱియు నోరెండ నారంభించెను. ముఖమున చెమటలు పట్టెను. చేతులందున్న ధనుర్బాణములు పీడెను. పాప మా యర్జునుఁడు తన రథముపై నిలువలేక వెంటనే కూలఁ బడెను" అను నీ కథయంతయుఁ బ్రథమాధ్యాయమునందు కలదు. ఈ యధ్యాయమును "అర్జున విషాదయోగ''మని చెప్పుచున్నారు. కారణ మేమియన: గీతల యందంతటను బ్రహ్మవిద్యాంతర్గత (కర్మ) యోగశాస్త్రమును నీ యొక విషయమే ప్రతిపాద్యముగ నున్నను ప్రత్యధ్యాయమునందు నే విషయము ముఖ్యముగఁ బ్రతిపాదింపఁ బడుచున్నదో యది యీ కర్మయోగశాస్త్రమున కొక భాగ మను తలంపునఁ బ్రత్యధ్యాయమునను దానియం దున్న విషయము నను సరించి యీ యోగ మీ యోగమని వేఱువేఱు పేరులు పెట్టఁబడి నవి; మఱియు నీ యోగము లన్నియుఁ గలిసి "బ్రహ్మవిద్యయం దున్న కర్మయోగశాస్త్ర'' మగును. ప్రథమాధ్యాయమునం దున్న యీ కర్మకుఁ గల మహత్త్వము నీ గ్రంథారంభముననే చెప్పినాను. కారణ మేమి యన: ప్రశ్న పూర్తిగఁ దెలియనిచో, సమాధానము సైతము సరిగా దోఁపదు. "సాంసారిక కర్మలనుండి నివృత్తుఁడవయి

భగవద్భజనమును నారంభింపుము, లేక, సన్న్యాసమును గైకొనుము" అనునది గీతలయొక్క తాత్పర్య మగునేని యర్జునుఁడు యుద్ధమను ఘోరకృత్యమును వదలి బిచ్చ మెత్తుకొనుటకుఁ దొలుతనే సిద్ధుఁడయి యుండుటచే నీ యుపదేశము నతనికిఁ జేయ నావశ్యకమే లేక యుండును. ప్రథమాధ్యాయముయొక్క కడపట "మేలు మేలు! ఏమి మంచివిషయమును జెప్పితివి? నీకు గలిగిన విరక్తి ని జూడ నా కానంద మయినది! మన మిరువురమును నీ కర్మమయమగు సంసారమును వదలి సన్న్యాసాశ్రమముచేతనుగాని, లేక, భక్తి చేతను గాని మన యాత్మకుఁ గల్యాణ మొనర్చికొందము" అని యర్థము గల యేదో యొక శ్లోకమును శ్రీకృష్ణుఁడు చెప్పియుండును గాన నంతటితోనే గీత ముగిసియుండును. మఱియు నిట్లు యుద్ధము జరిగినను వ్యాసులవారు దానిని మూఁడుసంవత్సరములు వర్ణించుచు (మ.భా. ఆ. 62.52) వ్యర్థముగ కాలయాపనఁజేసినవారై యుందురు. శ్రీకృష్ణార్జునులకునైన యీ యుద్ధమువలనఁ గలుగు పాప మంటక యుండును. కురుక్షేత్రమునఁ గూడిన యనేకులగు మహారథు లర్జునుని శ్రీకృష్ణుని పరిహాసము చేసియే యుందురు; కాని తమ యాత్మకు శుభము కోరువా రిట్టి యుపహాస్యము నేమియు లక్ష్యముచేయరు; జగ త్తేమను కొన్నను ననుకొనుఁ గాక! "య దహ రేవ విరజే త్తదహ రేవ ప్రవ్రజేత్"-ఏ క్షణమునందు విర క్తికలుగునో యా క్షణముననే సన్న్యసింపవలయును. ఆలస్యము చేయకూడదు (జా. 4) అని యుపనిషత్తులయందును చెప్పఁబడియున్నది. అర్జునుని విర క్తి జ్ఞానపూర్వకమైనది కాదు. మోహపూర్వకమన్నను, నది విర క్తియే. అంతమాత్రము చేత నైనను జగత్తు కార్యమయినది. మోహమును పీడఁగొట్టి విరక్తినే పూర్ణమగు జ్ఞానమూలకమగు దానిగాఁ జేయుట భగవంతునికి శక్యము గాకపోదు. పురుషుఁ డే కారణముచేత నైనను సంసారముపైన నేవగింపు కలిగెనేని, తదనుగుణముగానే మొదటువదలి, పిదప పూర్ణమగు

సిద్ధిని పొందినట్లు భక్తిమార్గము నందును, సన్న్యాసమార్గమునందు ననేకములగు నుదాహరణములు కలవు. అర్జునునకు నిట్టి యవస్థయే కలిగియుండును. సన్న్యాసమును గైకొనుటకై వస్త్రములకు రంగు వేయుటకు కొంచెము జేగురును, లేక, భక్తిచే భగవన్నామసంకీర్తనము చేయుటకు మృదంగాది సామగ్రియు నున్నచోటనే (అనఁగా: కురుక్షేత్రమునందే) లభింపక పోలేదు.

కాని యటు లేమియుఁ జేయక యర్జునుని యూహలకు వ్యతిరేకముగ ద్వితీయాధ్యాయ ప్రారంభమునందే "ఓరీ! ఈ దుర్దశ (కశ్మలము) నీ కెచ్చో నుండి వచ్చెను? ఈ నపుంసకత్వము (క్లైబ్యము) నీకు శోభింపదు; ఇది నీ కీర్తిని పాడుచేయును; కావున నీ దుర్బలతను (దౌర్బల్యమును) వదలి, యుద్ధమునకు నిలువుము, అని శ్రీకృష్ణుఁ డర్జునునకుఁ జెప్పెను. అయినను వెఱ్ఱివానివలె మొదటి దుఃఖకథనే మరలఁ జెప్పుచు, "నేను భీష్మద్రోణాదిమహాత్ముల నెట్లు చంపుదును? చచ్చుట మంచి దగునా? చంపుట మంచి దగునా? ఈ సంశయమునందు నా మనస్సు వ్యాకులమైనది. కావున వీనిలో నే ధర్మము శ్రేయస్కరమో యది నాకుఁ జెప్పుము, నేను నిన్ను శరణుఁ జొచ్చి యున్నాను" అని దీనుఁడై పలుకఁగా నర్జునునకు దౌర్భాగ్యదేవత బాగుగఁ బూని యుండునట్లు శ్రీకృష్ణుఁడు దెలిసికొనెను. మఱియు కొంచెము నవ్వినట్లుగపఱిచి "అశోచ్యా నన్వశోచస్త్వం" మొదలగు వాక్యముల నతని కుపదేశించుటకు భగవంతుఁ డారంభించెను. కావున జగత్తునందున్న జ్ఞాను లాచరించుచున్న "కర్మలను వదలి వేయుట" మఱియు "కర్మలను చేయుట" యను రెండు మార్గములను (అనఁగా: నిష్ఠలను) నక్కడనుండియే భగవంతుఁడు తన కుపదేశమును జేయ నారంభించెను; మఱియు నీ రెండునిష్ఠలలో నేనిష్ఠను నీవు గైకొనినను నీవు పొరపడినవాఁడవే యని యర్జునునకు భగవంతుఁడు మొదటనే చెప్పెను. అనంతరమం దే జ్ఞాననిష్ఠయొక్క

గాని, లేక, సాంఖ్యనిష్ఠయొక్క గాని యాధారముచే నర్జునుఁడు కర్మసన్న్యాస విషయమున మాటలాడ నారంభించెనో, యా సాంఖ్య నిష్ఠ యాధారము చొప్పున మొదట "ఏషా తేఽభిహితా సాంఖ్యేబుద్ధిః" (గీ. 2.11-39) అను పర్యంతము శ్రీకృష్ణుఁ డుపదేశించెను. తర్వాత నీ యధ్యాయముయొక్క సమాప్తిపర్యంతము కర్మయోగమార్గము నవలంబించి యుద్ధ మనునదియే నీకు నిజమయిన కర్తవ్య మని చెప్పెను. "ఏషా తేఽభిహితా సాంఖ్యే ..." ఇటువంటి శ్లోకము, "అశోచ్యా నన్వశోచ స్త్వం...." అను శ్లోకమునకు పూర్వమునం దుండెనేని కర్మయోగరూపార్థమే స్పష్టమై యుండును; కాని సంభాషణయొక్క రీతిలో "సాంఖ్యమారమును ప్రతిపాదించిన పిదప నిప్పుడు యోగమార్గానుసారముగఁ బ్రతిపాదించుచున్నాను" అని చెప్పెను. ఎటులైన నర్థ మొకటియే. సాంఖ్యము, (లేక, సన్న్యాసము) యోగము, (లేక, కర్మయోగము) వీని మధ్యమునను్న భేదమును పూర్వముననే పదునొకండవ ప్రకరణమున స్పష్టపఱచి యున్నాను. కావున దానిని పునరుక్తి చేయక చెప్పున దేమన: చిత్తశుద్ధికొఱకు స్వధర్మానుసారముగ వర్ణాశ్రమవిహితకర్మల నొనర్చి, జ్ఞానప్రాప్తి యైన పిదప మోక్షముకొఱకు సర్వకర్మలను వదలి సన్న్యాసముం గైకొనుట సాంఖ్య మనియు, కర్మల నెప్పుడు వదలక, తుదవఱకును వానినే నిష్కామబుద్ధితోఁ జేయుచునే యుండుట యోగము, లేక, కర్మయోగ మనియు చెప్పుచున్నారు. సాంఖ్యమార్గమునందున్న యధ్యాత్మ జ్ఞానానుసారముగ నాత్మ యనునది, యవినాశియు, నమరము నగుటచే "భీష్మద్రోణాదులను నేను చంపవలసివచ్చును" అనుదానియొక్క జ్ఞానమే మిథ్యాభూత మయినది; కారణ మేమి యన: "ఆత్మ చచ్చునదియు, చంపఁబడునదియు కాదు. మనుజుఁడు తన వస్త్రములను మార్చుకొనునట్లే యాత్మ యొక దేహమును వదలి రెండవదేహము నందుఁ బ్రవేశించును. దీనివలన వాఁడు చచ్చిన వాఁడని తలఁచి శోకించుట యుక్తము కాదు" అని భగవంతుఁ

ర్జునునకుఁ జెప్పెను. మంచిది; "నేను చంపుదును" అనునది భ్రమ మని యంగీకరించినను యుద్ధమేల చేయవలయునని యందునేని, "శాస్త్రవిధి ననుసరించి ప్రాప్తమైన యుద్ధమును మానకపోవుట యనునదియే క్షత్రియధర్మమై యున్నది. మనుజు లీ సాంఖ్యమార్గము నందు మొదట నీ వర్ణాశ్రమధర్మముల నాచరించుటయే శ్రేయస్కర మని యంగీకరించుచున్నారు. కాన నీవట్లు చేయక పోయితి వేని లోకులు నిన్ను నిందించెదరు; వేయేల? యుద్ధమునందుఁ జచ్చుటయే క్షత్రియునకు ధర్మము. కాన వ్యర్థముగ నేల శోకించెదవు? నేను చంపువాఁడను, వాఁడు చచ్చువాఁడు నను నీ కేవలకర్మదృష్టిని వదలి నేను కేవలము నాధర్మమునే చేయుచున్నా నను బుద్ధితో ప్రవాహ పతితమైన కార్యముల చేయుచున్నచో, నా కర్మవలన నీ కేవిధమగు పాపమును తగులదు" అని సాంఖ్యమార్గాను సారముగ నీ యుప దేశము చేయఁబడినది; కాని చిత్తశుద్ధికొఱకు మొదట సర్వకర్మలను జేసి, చిత్తశుద్ధి కలిగిన పిదప సర్వకర్మలను వదలి సన్న్యాసమును గైకొనుటయే సాంఖ్యమార్గానుసారముగ శ్రేష్ఠమని యంగీకరించిన యెడల వైరాగ్యము కలిగినతోడనే యుద్ధమును చేయకుండ తప్పించు కొనుటకు వెంటనే సన్న్యాసమును గైకొనుట మంచిది కాదాయేమి? యను శంక మిగిలి యున్నది. గృహస్థాశ్రమమును పూర్ణముగ నిర్వ హించి పిదప వార్ధకమునందు సన్న్యసింపవలయును. తారుణ్యము నందు గృహస్థాశ్రమముననే యుండవలయునని మన్వాది స్మృతి కర్తలయొక్క యాజ్ఞ యని చెప్పుటచే ప్రయోజనము లేదు. కారణ మేమి యన: ఎప్పుడైనను సన్న్యాసముఁ గైకొనుట శ్రేష్ఠమైనప్పుడు సంసారమున నేవ పుట్టి నప్పు డే యాలస్యమును జేయక సన్న్యసిం చుట యుక్తమగును; మఱియు నీ హేతువుచేతనే యుపనిషత్తులందును "బ్రహ్మచర్యా దేవ ప్రవ్రజేత్ గృహాద్వా వనాద్వా" అను వచనము లున్నవి (జా. 4). సన్న్యసించుటచే లభించుగతియే రణాంగణమందు మృతినొందుటచే క్షత్రియునకుఁ బ్రాప్తమగును–

ద్వా విమౌ పురుషవ్యాఘ్రౌ సూర్యమండలభేదినౌ,
పరివ్రా డ్యోగయుక్తశ్చ రణే చాభిముఖో హతః.
(మ. భా. ఉద్యో. 32. 65)

— ఓ పురుషశ్రేష్ఠుఁడా! సూర్యమండలమును భేదించి బ్రహ్మలోకమునకుఁ బోవువా రిరువురే. ఒకఁడు యోగయుక్తుఁ డయిన సన్న్యాసియు, మఱియొకఁడు యుద్ధమం దభిముఖుఁడై యుద్ధము చేయుచు చచ్చువాఁడును అని మహాభారతమునం దున్నది. కౌటిల్యునియొక్క (అనఁగా చాణక్యునియొక్క) యర్థశాస్త్రమునందును నీ హేతువుచేతనే

యాన్ యజ్ఞసంఘై స్తపసా చ విప్రాః
స్వర్గైషిణః పాత్రచయైశ్చ యాంతి,
క్షణేన తా న ప్యతియాంతి శూరాః
ప్రాణాన్ సుయుద్ధేషు పరిత్యజంతః.

— స్వర్గేచ్ఛగల బ్రాహ్మణు లనేకములగు యజ్ఞములచేతను, యజ్ఞపాత్రలచేతను, తపస్సుచేతను, నే లోకమును బొందుదురో యుద్ధమునందుఁ బ్రాణముల విడనాడు శూరు లొక క్షణములోనే యా లోకముకంటె పరమగు లోకమును బొందుదురు (అనఁగా: తపస్వులకును సన్న్యాసులకును మాత్రమే కాక, యజ్ఞయాగాదులను చేయు దీక్షితులకు సైత మే గతి లభ్యమగుచున్నదో యది రణాంగణమందు చనిపోయిన క్షత్రియులకు ప్రాప్తమగును) యని యొక శ్లోకము వ్రాయఁబడినది (కౌటి. 10·3·150-152 మఱియు మ·భా·శాం. 98-100). యుద్ధమువంటి స్వర్గద్వారము క్షత్రియుల కొకొక్కప్పుడె తెఱవఁబడును. యుద్ధమునందుఁ జచ్చెనేని స్వర్గమును, జయమును సంపాదించుకొందుమేని పృథ్వీరాజ్యమును లభించును (2·32,37); ఈ గీతలయందున్న యుపదేశముయొక్క తాత్పర్య మిదియే; కావున సన్న్యాసమును గైకొన్నను, యుద్ధములోఁ జచ్చినను ఫలము సమా

నమే, అనియు సాంఖ్యమార్గానుసారముగఁ బ్రతిపాదింపవచ్చును. ఏమి చెప్పినను యుద్ధమే చేయవలయునని ముఖ్యార్థ మేమార్గ మందున్న యుక్తివాదముచేతను పూర్ణముగ సిద్ధము కాదు. సాంఖ్యయోగమార్గమునందున్న యీ ప్రతిబంధమును గమనించియే భగవంతుఁడు సాంఖ్యయోగము తర్వాత కర్మయోగమును బ్రతిపాదించుటకు నారంభించి గీతలయొక్క కడపటి యధ్యాయము పూర్తియగు పర్యంతము కర్మయోగమునే (అనఁగా: కర్మలను చేసియే తీరవలయుననియు, అవి మోక్షమునకుఁ బ్రతిబంధకము కాకపోఁగా నా కర్మలను చేయుచుండఁగనే మోక్షము లభించుననియు బ్రతిపాదించు విషయమునే) వేర్వేఱగు బ్రమాణములను జెప్పి శంకానివృత్తి పూర్వకముగ సమర్థించెను. ఏ కర్మయైనను సాధువా? యసాధువా? యని నిశ్చయించుటకు, ఆ కర్మయొక్క బాహ్య పరిణామముకంటె కర్మయొక్క వాసనాత్మకబుద్ధి శుద్ధమా? యపరిశుద్ధమా? యని మొదట చూడవలయు ననునది కర్మయోగము నందున్న ప్రధానమగు సిద్ధాంతము (గీ. 2.49). కాని వాసన శుద్ధమైనదా? యపరిశుద్ధమైనదా? యని నిశ్చయించుట యను కార్యముసైతము తుదకు వ్యవసాయాత్మిక బుద్ధిమూలమున నగుటచే సదసద్వివేకమును జేయు బుద్ధీంద్రియము స్థిరముగ నుండిననే కాని, వాసనయు, శుద్ధమును, సమమును గానేరదు. కావున వాసనాత్మిక బుద్ధి శుద్ధ మగుటకు వ్యవసాయాత్మికమగు బుద్ధీంద్రియమును సైతము సమాధిచే మొదట స్థిరము చేయవలయునని చెప్పఁబడినది (గీ. 2.41). జగత్తునందలి సామాన్య వ్యవహారములను జూచితి మేని యనేకులు స్వర్గాదికములగు వేర్వేరు కామ్యసుఖములను బొందుట కొఱకై యజ్ఞయాగాది వైదిక కామ్యకర్మల నాచరించుచున్నారు; కావున వీరి బుద్ధి నేఁ డీ ఫలముకొఱకును, రేపు మఱియొక ఫలము కొఱకును బ్రయత్నించును.- అనఁగా: స్వార్థమునందే మగ్నమయి నదియుఁ, దప్పక మాఱునదియు, లేక, చంచలముగ నుండునదియు

నని స్పష్ట మగుచున్నది; కాని జనులకు స్వర్గసుఖా ద్యనిత్యఫలము కంటె గొప్పది యగు (అనఁగా: మోక్షరూప మగు) నిత్యసుఖము లభించుటకు వీలు లేదు. కావున వైదికకర్మలయందలి యీ స్వార్థములను వదలి నిష్కామబుద్ధితోఁ గర్మలను జేయ నభ్యసింపవలయును. కర్మలను జేయుటకే నీకు నధికారము కలదు. వానియొక్కఫలము మాత్రము నీ యధీనము కాదు (2.47). ఫలము నిచ్చువాఁడు పరమేశ్వరుఁడని దెలిసికొని కర్మఫలము లభించినను, లేకున్నను సరియే యని సమబుద్ధితోఁ గేవలము కర్తవ్యము లనియే కర్మలను జేయు వారికి కర్మలయొక్క పుణ్యపాపములు తగులవు; కావున నీ సమబుద్ధినే యాశ్రయింపుము. ఈ సమబుద్ధినియోగము అనఁగా: పాపము తగులకుండ కర్మలను జేయుట యను యుక్తి అని చెప్పుచున్నారు; ఈ యోగమును నీవు సాధించితివేని కర్మలను జేసినను నీకు మోక్షము లభించును. మోక్షార్థములు కర్మసన్న్యాసము చేయవలయునని నియమము లేదు అని ఈ మొదలగు కర్మయోగమునందలి రహస్యములను భగవంతుఁ డర్జునునకుఁ జెప్పుట కారంభించెను (2.47-58). ఎవనియొక్కబుద్ధి యీ తీరున సమమయినదో యతఁడు స్థితప్రజ్ఞుఁడని చెప్పవలసినవాఁడని భగవంతుఁడు చెప్పిన పిదప (2.53), స్థితప్రజ్ఞుఁ డెటుల నాచరించుచున్నాఁడో దానిని నాకుఁ జెప్పుమని యర్జునుఁడు మరల ప్రశ్నచేసెను. కావున రెండవ యధ్యాయముయొక్క కడపటు స్థితప్రజ్ఞుని వర్ణించి తుదకు స్థితప్రజ్ఞునియొక్క స్థితినే బ్రాహ్మీ స్థితి యనుచున్నారని చెప్పెను. అర్జునునిచే యుద్ధమును చేయించుటకై గీతలయందు చేయఁబడిన యీ యుపదేశ మీ జగత్తునందు జ్ఞానులకు గ్రాహ్యము లయిన "కర్మలను వదలి పెట్టుటయు" (సాంఖ్యము) "కర్మలను చేయుటయు (యోగము) అను నీ రెండునిష్ఠలనే మొదలుగఁ జేసికొని చేయఁబడినది కావున, యుద్ధ మెందులకుఁ జేయవలయు నను ప్రశ్నకు మొదట సాంఖ్య నిష్ఠానుసారముగ నుపపత్తి చెప్పఁబడినదని యిందలి

సారాంశము; కాని యీ యుపపత్తి యపూర్ణముగ నుండునని యాలోచించి, వెంటనే యోగమార్గానుసారముగ (కర్మయోగాను సారముగ) జ్ఞానోపదేశ మారంభించెను. మఱియు నీ కర్మయోగయు యొక్క స్వల్పమగు నాచరణ మెట్లు శ్రేయస్కర మగునదియు చెప్పిన పిదప కర్మయోగమునందు కర్మకంటె నాకర్మకు ప్రేరకమగు బుద్ధినే శ్రేష్ఠమని చెప్పుదురు గాని స్థితప్రజ్ఞునివలె బుద్ధిని స్థిరముగఁ జేసికొని కర్మలను జేసితి నేని నీ కే విధమయిన పాపములు తగుల వనునదియు మాత్రమే రెండవయధ్యాయమునం దుపపాదన చేయఁ బడినది. ఇందుపైన నే విధమగు ప్రశ్నలు బయలువెడలునో చూతము. గీతలలోని యుపపాదన కంతకును మూలమగు విషయము రెండవ యధ్యాయమునం దుండుటచే దాని విషయమై విపులముగ వివేచన చేయఁబడెను.

"కర్మయోగమార్గమునందు సైతము కర్మకంటె బుద్ధియే శ్రేష్ఠ మయినది గనుక నేను నాయొక్క బుద్ధిని స్థితప్రజ్ఞుని బుద్ధివలెనే సమముగ నుండునట్లు చేసితి నేని చాలును; నన్ను యుద్ధమువంటి ఘోరకర్మలఁ జేయు మని యేల చెప్పుదువు" అని తృతీయాధ్యాయ ముయొక్క యారంభమునం దర్జునుఁ డడిగెను. ఏలన: కర్మకంటె బుద్ధి శ్రేష్ఠమని చెప్పుటచే "యుద్ధ మేల చేయవలయును? బుద్ధిని సమముగ నుండునట్లు చేసి యుదాసీనుఁడుగ నేల కూర్చుండరాదు" అను ప్రశ్నములకు నిర్ణయములు కాలేదు; గాన నటు లడిగెను. బుద్ధిని సమముగ నుంచుకొనియు, కర్మలను సన్న్యసించుట సాధ్యము కాకపోదు; కాని సమబుద్ధి గలిగిన పురుషుఁడు సాంఖ్యమార్గమునందు వలె కర్మలను వదలుట కేమి యాటంకము కలదు? అను ప్రశ్నకు భగవంతుఁ డీ క్రింద చెప్పఁబోవునట్లు సమాధానము చెప్పెను. "పూర్వమునందు నీకు సాంఖ్యము, యోగము నను రెండు నిష్ఠలు చెప్పితిని, నిజమే; కాని ఎవనికైనను కర్మలను బూర్తిగ వదలుట

యశక్యము. ఎంతదనుక వాఁడు దేహధారియై యుండునో యంత దనుక ప్రకృతి, స్వభావముగనే, యతనిచేఁ గర్మలఁ జేయించును; మఱియును, ప్రకృతియొక్క యీ కర్మలు వదలిపోవు గనుక, నింద్రియ నిగ్రహముచేత బుద్ధిని స్థిరముగను, సమముగను జేసికొని, కేవల కర్మేంద్రియముల తోడనే, నీయొక్క కర్తవ్యకర్మలను జేయు చుండుట యధిక శ్రేయస్కర మగును. కావునఁ గర్మలను చేయుము. కర్మలను చేయనినాఁడు నీ కాహారము సైతము లభ్యపడదు (3.3-8); కర్మ లనునవి పరమేశ్వరునిచేతనే పుట్టింపఁబడినవి; మనుజుఁడు కల్పించినవి కావు. బ్రహ్మదేవుఁడు సృష్టిని, ప్రజలను నిర్మించి యా సమయమునందే 'యజ్ఞములను' సృజించి, యీ యజ్ఞములచేత మీరు మీకు కావలసిన దానినెల్ల సంపాదించుకొనుఁడని చెప్పెను; మఱియుఁ నీ యజ్ఞము, కర్మను జేయకుండ సిద్ధము కాదు గావున, యజ్ఞమనఁగాఁ గర్మయే యగును. కావున మనుజులును, గర్మయు నను నీ రెండును నొకసారియే యుత్పన్నము లయినవని చెప్పవలయును. కాని యీ కర్మలు కేవలయజ్ఞముకొఱకే యయియుండుట చేతను, యజ్ఞములనునవి మనుజునకు కర్తవ్యము లగుటచేతను నీ కర్మఫలములు మనుజునకు బంధకములుగావు. జ్ఞానియైన వానికి స్వీయము లగుకర్తవ్యము లేమియు నుండవు. మఱియు లోకములో నతని కేమియు ప్రతిబంధక ముండ దనుమాట సత్యమే; కాని యంతమాత్రముచే కర్మలను చేయకూడదని సిద్ధము కాదు. కారణ మేమన: కర్మయే వారిని వదలిపోదు గాన, స్వార్థముకొఱకుఁ గాకపోయినను, లోకసంగ్రహార్థమైనను నిష్కామబుద్ధితోఁ జేయవలయునని యూహించుట యావశ్యక మగును (3.17-19). ఈ విషయమును మనంబున నిడుకొనియే, జనకాదులగు జ్ఞానులు పూర్వమందు కర్మలను జేసిరి. నేను కర్మలను చేయుచునే యున్నాను. ఇంతియ కాక లోకసంగ్రహమును జేయుటయే (అనఁగా: లోకులకు తన నడతచె మంచి యభి

ప్రాయమును గలుగఁజేసి వారిని మంచిత్రోవకుఁ ద్రిప్పుటయే) జ్ఞానికి కర్తవ్యములలో నొక ముఖ్య కర్తవ్య మగును. మనుష్యుఁ డెంత జ్ఞానము కలవాఁ డైనను నతనికి ప్రకృతిసంబంధము బొత్తిగా వదలిపోదు; కావున కర్మలను వదలిపెట్టుట మిక్కిలి యసంభవము. కాన కర్తవ్యము లను నూహతో స్వధర్మానుసారముగ కర్మలను జేయుచు నావశ్యకమగు నేని యా కర్మలయందే మృతిఁ జెందుట శ్రేయస్కరము (శ్లో. 30-35) అని యీ యధ్యాయమునందు భగవంతుఁ డుపదేశించెను. భగవంతుఁ డీ రీతిగ ప్రకృతికి సర్వకర్మల యొక్కయు, కర్తృత్వము నిచ్చి యుండుటచే మనుష్యునియొక్క యిచ్ఛ యేమియు లేదు; గాన వాఁడు పాపము నెట్లు చేయుచున్నాడని యర్జునుఁ డడిగినప్పుడు కామక్రోధాదివికారములు బలాత్కారముగ మనస్సును భ్రష్టముగఁ జేయుచున్నవి; కావుననే యింద్రియముల నిగ్రహించి ప్రతి మనుజుఁడును తన మనస్సును స్వాధీనములో నుంచుకొనవలయునని సమాధానముఁ జెప్పి యీ యధ్యాయమును భగవంతుఁడు సమాప్తము చేసెను. స్థితప్రజ్ఞునివలె బుద్ధి సమమయినను కర్మ యెవ్వరిని వదలిపెట్టదు. కావున స్వార్థముకొఱకు కాకపోయినను లోకసంగ్రహార్థమై నిష్కామబుద్ధిచే కర్మలనే చేయుచునే యుండవలసి వచ్చును గనుకను, కర్మయోగావశ్యకత సిద్ధమైనదనియు “నాకు సర్వకర్మల నర్పింపుము” (శ్లో. 30-31) అని భగవద్గీతలలోఁ జెప్పినట్లు పరమేశ్వరార్పణపూర్వకముగఁ గర్మలనుజేయుట యను భక్తిమార్గమునందున్న సిద్ధాంతమునకు సైత మీ యధ్యాయమునందే యారంభమైనదనియు నిందలి సారాంశము.

అయినను నీ వివేచనము మూడవ యధ్యాయమునందు పూర్ణము కాకపోవుటచే నాల్గవ యధ్యాయమునందును ఆ వివేచనమునే చేయుట నారంభించెను. ఇంత పర్యంతము చేయఁబడిన ప్రతిపాదనము కేవల మర్జునుని యుద్ధమునందుఁ బ్రవర్తింపఁ జేయుటకు

నవీనముగ రచింపఁబడి యుండెనేమో యను సంశయమును దీర్చు టకై నాల్గవ యధ్యాయారంభమునందు నీ కర్మయోగమునకు (అనఁగా: భాగవత ధర్మములకు, లేక, నారాయణీయ ధర్మములకు) త్రేతా యుగమునం దుండిన పరంపర చెప్పఁబడినది. మొదట (అనఁగా: యుగారంభమునందు) నేనే యీ కర్మయోగమును వివస్వంతునకుఁ జెప్పితిని. వివస్వానుఁడు మనువునకును, మను విక్ష్వాకువునకును జెప్పిరి; కాని మధ్య సంప్రదాయము విచ్ఛిన్న మయినందున నా యోగమును (కర్మయోగమార్గమును) నేను నీ కిప్పుడు మరలచెప్పినా నని శ్రీకృష్ణుఁడు చెప్పఁగా నిప్పటివాఁడవగు నీవు వివస్వంతునికంటె పూర్వ మెట్లుంటివని యర్జునుఁ డడిగెను. అప్పుడు సాధుసంరక్షణమును దుష్టశిక్షణమును, ధర్మస్థాపనమును జేయుటకై తా ననేకములగు నవతారముల నెత్తుదు నని యీ ప్రశ్నకు సమాధానముఁ జెప్పి యీ రీతిగ లోకసంగ్రహ కారకములగు కర్మలను నేను జేయుచున్నను నాకు వాని విషయమై నాసక్తి లేమిచే వాని పాపపుణ్యాదిఫలములు తగులవని కర్మయోగమును సమర్థించి, యీ సిద్ధాంతమును దెలిసి కొనియే జనకాదులు పూర్వమునఁ గర్మలను జేసిరి. నీవును నటులే చేయుమని యర్జునునకు భగవంతుఁడు మరల నుపదేశించెను. మూఁడవ యధ్యాయమున "యజ్ఞార్థమై చేసిన కర్మలు బంధకములు కా" వని మీమాంసకులు చెప్పిన సిద్ధాంతమునే మరల చెప్పి, తిలలను తండులములను హోమము చేయుటయు, లేక, పశువులను జంపు టయు ననునది యొక విధమగు యజ్ఞ మను మాట నిజమే; కాని యీ ద్రవ్యమయమగు యజ్ఞము కొద్ది తరగతిలోని దనియు, సంయ మాగ్నియందు కామము, క్రోధము మొదలగు నింద్రియవృత్తులను హోమము సేయుట, లేక, 'న మమ' యని చెప్పి సర్వకర్మలను బ్రహ్మ మందు దాహుతిఁ జేయుట యను యజ్ఞము పై తరగతిలోని దనియు, యజ్ఞములను గుఱించి విస్తృతముగను, వ్యాపకముగను విమర్శించి యీ యజ్ఞముకొఱకు ఫలాశను వదలి, కర్మలను చేయుచునేయుండ

వలయునని బోధించెను. కారణ మేమి యన, మీమాంసకన్యాయా నుసారముగ యజ్ఞార్థమయి చేయఁబడిన కర్మలు స్వయముగ బంధకములు కాకపోయినను యజ్ఞములయొక్క ఫలములు లభించినప్పు డా ఫలముల మూలమున బంధకము లగును. కావున యజ్ఞములను సైతము నిష్కామబుద్ధితోఁ జేసె నేని యజ్ఞార్థమయి చేయఁబడిన కర్మలును, యజ్ఞము నను రెండును గూడ బంధకములు కావు. తుదకు సర్వభూతములును, తన యందున్న వని కాని, భగవంతునియందున్న వని కాని కలిగిన జ్ఞానమునకే సామ్యబుద్ధి యని పేరు. మఱియు నీ జ్ఞానము గల్గె నేని, సర్వకర్మలును భస్మమగును గాన వాని బాధ కర్తకుఁ దగులదు. "సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే"- సర్వకర్మలును జ్ఞానమునందు లయ మగుచున్నవి; కర్మలు స్వయముగ బంధకములు గావు. అజ్ఞానముచే బంధము కలుగుచున్నది. కావున నజ్ఞానమును వదలుము; మఱియుఁ గర్మయోగము నాశ్రయించి యుద్ధమునకు సిద్ధుడవు కమ్ము; అని చెప్పి యీ యధ్యాయము పూర్తి చేయబడినది. కర్మయోగమార్గసిద్ధికొఱకైనను సామ్యబుద్ధి రూపమగు జ్ఞానముండుట యావశ్యక మగును; గాన నీ యధ్యాయమునం దా జ్ఞానముయొక్క ప్రస్తావన చేయఁబడిన దని యిందలి సారాంశము.

కర్మయోగముయొక్క యావశ్యకత (అనఁగా: కర్మల నేల చేయవలయు నను దాని కారణములు) మూఁడు నాలు గధ్యాయములలోఁ జెప్పఁబడిన వనునది నిజమే; కాని రెండవ యధ్యాయమునందే సాంఖ్యజ్ఞానమును జెప్పి, పిదప కర్మయోగవివేచనను జేసి యందును కర్మకంటె బుద్ధి శ్రేష్ఠ మని నొక్కి చెప్పఁబడి యుండుటచే, నీ రెండు మార్గములలో శ్రేష్ఠమైన దేదియో చెప్పుటయే యిప్పటి కర్తవ్యమగును. కారణ మేమన: రెండు మార్గములును సమానమయిన యోగ్యత గలవియే యగుటచే, వీనిలో నెవరి కే మార్గము మంచిది

యని తోఁచునో, వాఁ డా మార్గమును స్వీకరింపవలయునని తోఁచునే కాని, కర్మయోగమునే స్వీకరింపవలయు ననుటకు కారణ మేమియు లేదు. మనస్సులో నీ సంశయ ముండుటచేతనే, "సాంఖ్యము-యోగము నను రెండు నిష్ఠలను కలిసిపోవునట్లు చెప్పక, యీ రెం డింటిలోను శ్రేష్ఠమయినదేదియో నిశ్చయించి, దానినే యిప్పుడు చెప్పితి వేని యా రీతిగ నాచరించుటకు నాకు సులభమగు"నని పంచ మాధ్యాయముయొక్క యారంభమున నర్జునుఁ డడిగెను. మఱియు రెండు మార్గములును నిశ్శ్రేయసకరములు (అనఁగా: ఒకే రీతిని మోక్ష ప్రదములు) అయినను వానిలోఁ గర్మయోగము గొప్పది- "కర్మ యోగో విశిష్యతే" యని స్పష్టముగఁ జెప్పి యర్జునుని సందేహ మును బోఁగొట్టెను (5.2). ఈ సిద్ధాంతమునే దృఢముచేయు నిమిత్తమయి సన్న్యాసముచే, లేక, సాంఖ్యనిష్ఠచే నే మోక్షము సిద్ధించుచున్నదో యా మోక్షమే కర్మయోగముచే సైతము లభించుటయే కాక, కర్మ యోగమునం దావశ్యకమని చెప్పఁబడిన నిష్కామబుద్ధి ప్రాప్తమయిన గాని సన్న్యాసము సిద్ధము కాదనియు, ప్రాప్తమయిన పిదప యోగ మార్గముచేఁ గర్మలను చేయుచున్నను బ్రహ్మప్రాప్తి కాకపోదనియు భగవంతుఁడు మరల చెప్పెను. కావున సాంఖ్యము, యోగము నను నవి వేర్వేఱైనవని వాదులాడిన నేమిలాభము? నడుచుట, సంభాషిం చుట, చూచుట, వినుట, అఘ్రాణించుట మొదలగు వందలకొలఁది సంఖ్యగల కర్మలు, వదలివేతు మన్నను వదలకపోవుటచేఁ, గర్మలను వదలిపెట్టుద మని నమ్ముకొనక, వానినే బ్రహ్మార్పణబుద్ధితోఁ జేయుట యనునదియే నేర్పరితనమునకు లక్షణము. కావున తత్త్వజ్ఞాని నిష్కామ బుద్ధితోఁ గర్మలఁ జేయుచు వానిమూలమునఁ దుదకు శాంతిని, మోక్ష మును బొందుచున్నాఁడు. ఈశ్వరుఁడు నీతోఁ గర్మలను జేయుమనియు చెప్పఁడు. ఇదియంతయు ప్రకృతియొక్క నాట్యము. మఱియు బంధన మను ధర్మము మనస్సుదే యయియుండుటచే సమబుద్ధిగల వాఁడు సేయు కర్మ లతనిని బాధింపవు. వే యేల? శునకము,

చండాలుఁడు, బ్రాహ్మణుఁడు, గోవు, హస్తియు ననువాని విషయ మయి సమమయిన దృష్టికలవాఁడును, సర్వభూతాంతర్గత మగు నాత్మైక్యమును దెలిసికొని తనయొక్క వ్యవహారములను చేయ నారంభించినవాఁడును నగు వానికి కూర్చున్నచోటనే బ్రహ్మనిర్వాణ రూపమగు మోక్షము లభించును. మోక్షప్రాప్తి కొఱకు మఱియొక చోటున కెక్కడికి వో నక్కఱలేదు. అతఁడు సదా ముక్తుఁడుగనే యుండు నని యీ యధ్యాయమున తుదకుఁ జెప్పఁబడినది.

ఆఱవయధ్యాయమునం దీ విషయమే ప్రతిపాదితమగుటచేఁ గర్మయోగము సిద్ధమగుటకు, సంబంధించు సమబుద్ధిని సంపాదించు కొను నుపాయము లేవియో చెప్పఁబడినవి. ప్రథమశ్లోకమునందుఁ గర్మఫలము నపేక్షింపక, కర్తవ్యములని ప్రాప్తములగు కర్మలను చేయుచున్నవాఁడే సత్యమైన యోగి, సత్యమైన సన్న్యాసి యనియు, నగ్నిహోత్రాది కర్మల వదలి స్వస్థముగ కూర్చున్నవాఁడు సన్న్యాసి కాఁడనియు, భగవంతుఁడు తన మతమును స్పష్టముగఁ జెప్పి యనం తరమందు కర్మయోగమున బుద్ధిని స్థిరము చేయుటకు నింద్రియ నిగ్రహరూపములగు నే కర్మలు చేయవలసియుండునో యవి తాను స్వయముగనే చేయవలయు ననియు, నట్లు చేయనిచో, నా నేరము తనమీఁదనే యొరగుటకు సాధ్య పడుననియు, చెప్పి యాత్మ స్వాతంత్ర్యము వర్ణింపఁబడినది. మఱియు మొదట నింద్రియనిగ్రహ రూపమగు యోగము నెట్లు సాధింపవలసినదియు నీ యధ్యాయము నందు ముఖ్యముగ పాతంజలయోగదృష్టిచే వర్ణింపఁబడినది. అయినను యమ నియ మాసన ప్రాణాయామాది సాధనములచే నింద్రియముల నిగ్రహించినను, అంతమాత్రముచేఁ బ్రయోజనము లేదు గాన, పిదప నాతనియొక్క వృత్తి "సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని" యనినటుల గాని, లేక, "యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి" (౬. ౨౯, ౩౦) యనిన

టులగాని సర్వభూతములయందు సమమైనది గావలయును. ఇట్టి యాత్మైక్యజ్ఞానముయొక్క యావశ్యకతయు నీయధ్యాయము నందు వర్ణింపఁబడినది. ఇట్టి సమబుద్ధిరూపమగు యోగ మొక జన్మమునందు సాధ్యము గాకపోయినచో, మరుసటి జన్మమునందు సైతము మరల మొదటినుండియే యారంభము చేయవలసివచ్చును. మఱియు నీ రీతిగ ఘటీయంత్రమువలె నెప్పుడు నారంభమె యగు నేని యీ మార్గముచే మనుజునకు సద్గతి లభించుట కెప్పటికైన వీలున్నదా? యని యింతలో నర్జునునకు సందేహము కలిగెను. ఈ సంశయమును నివారించుటకై యోగమార్గమునం దేమియు వ్యర్థము కాదు. పూర్వజన్మమునందలి సంస్కారము నిలిచియుండును. గాన మరుసటి జన్మయందు వెనుకటికంటె నధికముగ నభ్యాస మగుననియు, క్రమక్రమముగ తుదకు సిద్ధి లభించుననియు, చెప్పి యంతమునందు కర్మయోగ మీ రీతిగ శ్రేష్ఠమును, క్రమముగ నుసాధ్యము నగుటచే, ఫలాశతో కర్మలను చేయుట, తపస్సును చేయుట, యజ్ఞానముచే కర్మసన్న్యాసమును గైకొనుటయు నను నీమార్గముల నన్నింటిని వదలి నీవు యోగివి (అనఁగా: నిష్కామ కర్మయోగము నాచరించువాఁడవు) కమ్మని యీ యధ్యాయము యొక్క తుద నర్జునునకు మరల స్పష్టముగను, నిశ్చయముగను భగవంతుఁడు వక్కాణించెను.

కర్మయోగముయొక్క వివేచన మీ మొదటియాఱధ్యాయము లందును సమాప్తమయిన దనియు, దీని పిమ్మట జ్ఞానమును భక్తియు నను నీ రెండు నిష్ఠలును 'స్వతంత్రములే' (అనఁగా: పరస్పరనిర పేక్షములు, లేక, కర్మయోగమునకు సదృశములైనవి, కర్మయోగ మునకంటె వేఱైనవి) అనియు, దానికి ప్రతినిధిగ వికల్పము లను నూహతో నాచరించుటకు యోగ్యములైనవి కావని భగవంతుఁడు చెప్పెననియు, వీనిలో నేడవ యధ్యాయము మొదలు పండ్రెండవ

యధ్యాయము పర్యంతము భక్తియు, పిదప శేషించిన యాఱధ్యా యములందును జ్ఞానమును చెప్పఁబడియుండుటచే పదునెనిమిది యధ్యాయముల నీ రీతిగ విభజించితి మేని, కర్మయు, భక్తియు, జ్ఞానము నను వీనిలో నొక్కొకదాని వంతునకు ఆఱాఱధ్యాయ ములు వచ్చుటచే నీ మూఁడును గీతలయందు సమానములుగనే యున్నవనియు ననేకు లందురు; కాని యీ మతము మంచిది కాదు. "సాంఖ్యనిష్ఠానుసారముగ యుద్ధమును వదలుదునా? లేక, యుద్ధముయొక్క ఘోరపరిణామ మెదుటఁ గన్పట్టినను యుద్ధమునే చేయుదునా?" యనియు, చేయవలసి వచ్చునేని, యా పాపము నెట్లు పోఁగొట్టుకొందు ననియు నర్జునునకు గొప్ప సంశయము గలిగెను. జ్ఞానముచేతను, కర్మచేతను మోక్షము లభించును. నీ కిష్టమైనచో భక్తి యను మూఁడవ నిష్ఠ సైతము మోక్షసాధన మగు నను నిశ్చితమైన సమాధానముచే నర్జునుని సంశయము నివారింపఁ బడదని, పంచమాధ్యాయారంభమునం దున్న శ్లోకమును బట్టి స్పష్ట మగును. ఇంతియ కాక యర్జునుఁ డొక నిర్ణయాత్మక మయిన మార్గమును విచారించుచున్నప్పుడు, సర్వజ్ఞుఁడును, చతురుఁడు నగు శ్రీకృష్ణుఁ డా ముఖ్యవిషయమును వదలి, మూఁడు స్వతంత్రములును వికల్పాత్మకములు నైన మార్గములను జూపించెనని చెప్పుటయు న్యాయవిరుద్ధము. నిజముగఁ జూచినను గీతయందు 'సన్న్యాసము' 'కర్మయోగము' నను నీ రెండు నిష్ఠలే విచారింపఁబడి (గీ. 5.1), వానిలో 'కర్మయోగమే' యధిక శ్రేయస్కర మని స్పష్టముగ సిద్ధాంతము చేయఁబడినది (గీ. 5.2). భక్తి యను మూఁడవ స్వతంత్ర నిష్ఠ యెక్కడను చెప్పఁబడలేదు. అనఁగా: జ్ఞానమును, కర్మయు, భక్తియు నను మూఁడును స్వతంత్రములైన నిష్ఠ లను కల్పనయు సాంప్రదాయికటీకాకారులు కల్పించినదే యని తాత్పర్యము. గీతల యందు కేవల మోక్షోపాయములే విచారింపఁబడిన వనియు వారి మతము; గాన నీ మూఁడు నిష్ఠలను, వారు భాగవతమునుండి

గ్రహించియుందురు (భాగ. 11. 20.6); కాని భాగవతపురాణము యొక్కయు, భగవద్గీతయొక్కయు తాత్పర్య మొకటి కాదను విష యము నీ టీకాకారు లెఱుంగరు. కేవలకర్మచే మోక్షము లభింపదు మోక్షముకొఱకు జ్ఞానము కావలయు నను సిద్ధాంతమును భాగవత కారులును నొప్పుకొందురు; కాని జ్ఞానము, నైష్కర్మ్యము ననునవి మోక్షప్రదములయినను, ఈ రెండును (అనఁగా: గీతలయందున్న నిష్కామకర్మయోగము) భక్తి లేకుండ శోభింపవు- "నైష్కర్మ్య మప్యచ్యుత భావవర్జితం న శోభతే జ్ఞాన మలం నిరంజనమ్"- అని భాగవతపురాణము చెప్పుచున్నది (భాగ. 12.12.52 మఱియు 1.2. 12). దీనింబట్టి విచారించితిమేని భాగవతకారులు భక్తి యనునదియే నిజమగు నిష్ఠ (అనఁగా: కడపటిది యగు మోక్షప్రదమగుస్థితి) యని యంగీకరింతు రని స్పష్ట మగుచున్నది. భగవద్భక్తు లీశ్వరార్పణ బుద్ధితోఁ గర్మలఁ జేయ నక్కఱలేదని కాని, చేయవలయునని కాని భాగవతము చెప్పదు. "నిష్కామకర్మను జేయవలయునా? అక్కఱ లేదా?" యనునది యంతయు భక్తియోగములోనిదే (భాగ. 3 .29.7-19); భక్తి లేకపోయిన యెడల కర్మయోగమంతయు తిరిగి సంసారమునందు (అనఁగా: జనన మరణ ప్రవాహమునందు)ఁ బడవేయునదియే యగు నని (భాగ. 1.5.34,35) భాగవతము చెప్పు చున్నది. భాగవతకారులకటాక్ష మంతయు భక్తిమీఁదనే యుండుటచే వారు నిష్కామకర్మ యోగమును భక్తియోగములోఁ గలిపి, భక్తి యనునదియే యొక సత్యమైననిష్ఠ యని ప్రతిపాదించిరని యిందలి సారాంశము; కాని, భక్తి యనునదియే గీతలయందు ముఖ్యముగ ప్రతిపాద్యమయిన విషయములలోనిది గాదు గనుక, భాగవతమునం దున్న పై సిద్ధాంతము, లేక, పరిభాషగీతలలోఁ జేర్చుటయనునది, మఱ్ఱిఁతాఁటను రావిచెట్టున కతికించినటులుండును. పరమేశ్వరజ్ఞానము లేని యే యితర సాధనముచేతను మోక్షప్రాప్తి

కావుచే నీ జ్ఞానసంపాదనకు భక్తి సులభమగు మార్గముగ నున్నది యని చెప్పుట గీతలకు నిష్టమే! కాని యీ మార్గమే ముఖ్యమైనదని పట్టుపట్టక మోక్షప్రాప్తికి నావశ్యకమగు జ్ఞానమును గుఱించి యెవరి కే మార్గము సులభముగఁ గాన్పించునో యా మార్గముచేత వారు దానిని సంపాదించుకొన వలయునని గీత చెప్పును; గాన తుదకు (అనఁగా: జ్ఞానప్రాప్త్యనంతరమున) కర్మలను చేయవలయునా? అక్కఱయుండదా? యనునదియే గీతలయందున్నముఖ్యవిషయము. జీవన్ముక్తుఁడు శరీర మున్నంతకాలమును కర్మలను చేయవలయునా? వదలివేయవలయునా? యను విషయము మొదలుకొనియే భగవద్గీత లారంభింపఁ బడియున్నవి; గాన, వీనిలో మొదటిమార్గమునకు భాగ వతకారుల యభిప్రాయానుసారముగ, భక్తియోగమని పేరు పెట్ట లేదు. ఈశ్వరార్పణబుద్ధితోఁ గర్మలను చేయుటకే 'కర్మయోగ' మనియు, 'కర్మనిష్ఠ'యనియు, జ్ఞానము గలిగిన పిదప కర్మలను వద లుటకు 'సాంఖ్యము' లేక, 'జ్ఞాననిష్ఠ' యనియు, నారాయణీయ ధర్మములయందున్న ప్రాచీననామములే గీతలలో స్థిరముగ నుమపఁ బడినవి. గీతలలోనున్న యీ పరిభాషను స్వీకరించివిచారించితి మేని, భక్తి యనునది జ్ఞానము, కర్మయు ననువానితో సమానమైన మూఁడవ స్వతంత్రనిష్ఠ యగుట యెప్పుడును వీలు లేదని తోఁచును. కారణమేమి యన: 'కర్మలను చేయుట' - 'చేయకపోవుట' అనఁగా: వదలుట (యోగము, సాంఖ్యము) అను నీ యస్తి నాస్తి రూపములయిన రెండు పక్షములు తప్ప కర్మవిషయమైన మూఁడవ పక్ష మెప్పుడు నుండదు. కావున భక్తునియొక్క నిష్ఠ యేది యని గీతానుసారముగ నిశ్చయిం పవలసి వచ్చె నేని, వీఁడు భక్తుఁ డన్నంతమాత్రము చేతనే దానిని నిర్ణయింపక యతఁడు కర్మలను జేయుచున్నాఁడా? లేదా? యని విచారింపవలయును. భక్తి యనునది పరమేశ్వరప్రాప్తికి నొక సాధ నము. సాధన మను నర్థమునందు భక్తినే 'యోగ' మని చెప్పుటకు సాధ్యమయినను (గీ. 14.26) అది కడపటి 'నిష్ఠ' యగుటకు సాధ్యము

కాదు. భక్తిచేఁ బరమేశ్వరజ్ఞానము కలిగిన పిదప కర్మలను జేసె నేని కర్మనిష్ఠుఁడనియు, చేయకపోయెనేని సాంఖ్యనిష్ఠుఁడనియు చెప్పవల యును. వీనిలోఁ గర్మచేయుట యను నిష్ఠ యధిక శ్రేయస్కరమని భగవంతుఁడు తన యభిప్రాయమును పంచమాధ్యాయమునందు స్పష్టముగఁ జెప్పినాఁడు; కాని "కర్మలను జేయుట పరమేశ్వరజ్ఞానము కలుగుటకు ప్రతిబంధక మగును; మఱియు పరమేశ్వరజ్ఞానము లేనిచో మోక్షము లేదు'' అని కర్మయోగము మీఁద సన్న్యాసమార్గి యులయొక్క యొకానొక యాక్షేపణ కలదు. ఈ యాక్షేపము నిజమయినది కాదు. సన్న్యాసమార్గముచే, నే మోక్షము లభించు చున్నదో యదియే కర్మయోగమార్గముచే సైతము లభించును (గీ. ౕ.ౕ) అని పంచమాధ్యాయమునందు సామాన్యముగఁ జెప్పఁబడినది; కాని యీ సామాన్యసిద్ధాంతము నప్పుడు విపులముగఁ జెప్పనందున నపూర్ణముగ నున్న నీ మహత్తరమయిన విషయము(అనఁగా: కర్మ లను జేయుటచేతనే తుదకు పరమేశ్వరజ్ఞానము గలిగి మోక్షమెట్లు లభించు ననియు) నిప్పుడు భగవంతుఁడు సవిస్తరముగ నిరూపించు చున్నాఁడు. ఈ హేతువుచేతనే యేడవయధ్యాయ ప్రారంభము నందు, భక్తి యను స్వతంత్రనిష్ఠను నీకుఁ జెప్పుదు నని చెప్పక—

మ య్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్మదాశ్రయః,
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు.
(గీ. 7.1)

— ఓ పార్థుఁడా! నాయందు చిత్తము నుంచియు, నన్నాశ్రయిం చియు, యోగమును (అనఁగా: కర్మయోగమును) ఆచరింతు వేని యే విధముగ నాయొక్క నిస్సంశయమగు పూర్ణజ్ఞానము కలుగునో దానిని (నీకు చెప్పుచున్నాను) వినుము. వీనిలో మొదటిది అనఁగాఁ బైనఁ జెప్పఁబడిన "మయ్యాసక్తమనాః" వంటి శ్లోకమునం దున్న "యోగం యుంజన్'' (అనఁగా: కర్మయోగము నాచరించుచున్న

వాఁడై) యను పదములు మిక్కిలి మహత్త్వము గలవి; కాని దాని నే టీకాకారులును బాగుగ గమనించినట్లు తోఁపదు. యోగ మనఁగా: మొదటి యాఱధ్యాయములలో వర్ణింపఁబడిన కర్మయోగము. కర్మ యోగము నాచరించుచుండఁగా, నే ప్రకారముగ భగవంతునియొక్క పూర్ణజ్ఞానము కలుగునో యా విధిని చెప్పుటకు నిప్పుడు (అనఁగా: ఏడవయధ్యాయము మొదలుకొని) అరంభింపఁ బడినదని, యీశ్లోకా ర్థము. అనఁగా: మొదటి యధ్యాయములకును, పిదప నుండు నధ్యా యములకును, ఈ విషయసందర్భమున సంబంధమేమియో తెలుపుట కయి యీ శ్లోక మేడవయధ్యాయారంభమున ముఖ్యముగ వ్రాయఁ బడినది. కావున నీ శ్లోకమును గమనింపక "ఆఱవయధ్యాయము తర్వాత భక్తినిష్ఠ స్వతంత్రరీతితో వర్ణింపఁబడిన దని" చెప్పుట కేవల మన్యాయ్యము. వే యేల? ఇట్లెవరును నర్థము చేయఁ గూడదను నూహతోడనే "యోగం యుంజన్" అను పదము లీ శ్లోకమునందు ముఖ్యముగ వ్రాయఁబడినవని చెప్పినను చెప్పవచ్చును. గీతలయం దున్న తొలి యైదధ్యాయములందును కర్మల యావశ్యకతను నిరూ పించి సాంఖ్యమార్గముకంటె కర్మయోగము సిద్ధాంతీకరింపఁబడినది. మఱియు పిదప నాఱవయధ్యాయమునందుఁ గర్మయోగమున కావ శ్యకమగు నింద్రియనిగ్రహము సంపాదించుటకు పాతంజలయోగము నందున్న సాధనములు వర్ణింపఁబడినవి; కాని యింతమాత్రముచే కర్మ యోగము పూర్ణముగ వర్ణింపఁబడలేదు. ఇంద్రియనిగ్రహ మనఁగా: కర్మేంద్రియములయొక్క యొకవిధమగు నభ్యాసము. ఈ యభ్యాస ముచే నింద్రియములు తమ స్వాధీనములోనికి వచ్చునను మాట సత్యమే; కాని మనుజుని వాసన దుష్ట మగునేని యింద్రియములను స్వాధీనములో నుంచుకొని యుపయోగములేదు. కారణ మేమియన: వాసన దుష్టమయినచో నింద్రియనిగ్రహ రూపమయిన యీ సిద్ధిచే జారణమారణోచ్చాటనాది దుష్కృత్యముల ననేకులు చేయుదురు.

కావున నింద్రియనిగ్రహముతో పాటుగనే వాసనయును “సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని” యన్నట్లు శుద్ధము కావలయును (గీ. 6.29) అని యాఱవయధ్యాయమునందే చెప్పఁబడినది. మఱియు వాసనయొక్క యీ శుద్ధి బ్రహ్మాత్మైక్యరూప మగు పరమేశ్వరునియొక్క శుద్ధస్వరూపమును తెలిసికొనినఁ గాని లభ్యము కాదు. కర్మయోగమున కావశ్యకమగు నింద్రియనిగ్రహము సంపాదించుకొన్నను ‘రసము’ (అనఁగా: విషయముల యందలి రుచి) లోపల నశింపదని యిందలి తాత్పర్యము. ఈ రసము, లేక, విషయవాసన నశించుటకు పరమేశ్వరునియొక్క పూర్ణజ్ఞానమే కావలసివచ్చునని గీతలయందలి ద్వితీయాధ్యాయమునందే చెప్పఁబడినది (గీ. 2.59). కావున నీ పరమేశ్వరునియొక్క జ్ఞానము కర్మయోగము నాచరించుచుండఁగనే యే విధిచేఁ గలుగునో యా విధినే భగవంతుఁ డేడవ యధ్యాయము మొదలుకొని చెప్పుచున్నాఁడు. “కర్మయోగము నాచరించుచున్నను” అను పదములవల్ల కర్మయోగము నాచరించుచునే యీ జ్ఞానమును సంపాదించుకొనవలయు ననియు దానికొఱకుఁ గర్మలను వదల నక్కఱ లేదనియు సిద్ధమగును; మఱియు నీ కారణమున కర్మయోగముయొక్క స్థానమునందు వికల్పముగ భక్తియు, జ్ఞానము నను నీ రెండు స్వతంత్రమార్గములు నున్నవని యేడవయధ్యాయము మొదలుకొని చెప్పఁబడినదని చెప్పుట నిర్మూలమగును. గీతలయందున్న కర్మయోగము, భాగవతధర్మములలో నుండియే తీసుకొనఁబడుటచే కర్మయోగమునందున్న జ్ఞానప్రాప్తియొక్క విధులఁ జెప్పుట యనఁగనే, భాగవతధర్మములలో నున్న, లేక, నారాయణీయములగు ధర్మములందున్న విధుల వర్ణనయే. మఱియు నీ యభిప్రాయము చేతనే “ప్రవృత్తిపరములగు నారాయణీయధర్మములు వానియందున్న విధులతో కూడ భగవద్గీతలయందు వర్ణింపఁబడినవి” అని వైశంపాయనులవారు జనమేజయునకు శాంతిపర్వముయొక్క తుదను చెప్పినారు (మొదటి ప్రకరణారంభమున

వ్రాయఁబడిన శ్లోకమును చూడు). వైశంపాయనుఁడు చెప్పినతీరున దీనియందే సన్న్యాసమార్గమునం దున్న విధులకును సంతర్భావ మగును. కారణ మేమియన: కర్మల చేయుటయు, వదలుటయు నను నీ రెండు మార్గములందును భేద మున్నను రెండు పక్షములకును సం బంధించు జ్ఞానవిజ్ఞానము లొకటియే యగుటచే జ్ఞానము సంపాదించు టకు రెండు మార్గములయందున్న విధియు నొకటియే యగును. అయినను "కర్మయోగము నాచరించుచున్నవాఁ డగుచు" అను ప్రత్యక్షమగు పదములను పై శ్లోకమునఁ బ్రయోగించినందువనే గీతల యందున్న యేడవ యధ్యాయము నను, పిమ్మట నున్న యధ్యా యముల యందుండు జ్ఞాన విజ్ఞానములయొక్క నిరూపణము ముఖ్య ముగఁ గర్మయోగ పరిపూర్తి కొఱకే చేయఁబడినది. సన్న్యాసమార్గపు విధు లీ రెండు మతములయందును నుపయోగించునవి గాన నా యధ్యాయముల యందు చెప్పఁబడినవి. కర్మయోగమును వదలి కేవల సన్న్యాసనిష్ఠను సమర్థించు నిమిత్తమయి యీ జ్ఞానవిజ్ఞాన ములు చెప్పఁబడలేదని స్పష్టముగ సిద్ధమగుచున్నది. సాంఖ్యమార్గీ యులు జ్ఞానము గొప్పదనినను, కర్మ గాని, భక్తి గాని యట్టిదని యొప్పుకొనరు. మఱియు గీతలయందు భగవంతుఁడు భక్తి సుల భము, ప్రధానము నని చెప్పుటయే కాక యధ్యాత్మజ్ఞానమును, భక్తిని చెప్పుచు, నాయా స్థలములయందు "నీవు కర్మను (అనఁగా: యుద్ధ మును) చేయుము" అని యర్జునున కుపదేశించె ను(గీ. 8.7; 11.33; 16.24; 18.6). కావున గీతలయందున్న యేడవ యధ్యాయమం దును, పిమ్మటి యధ్యాయములయందును జేయఁబడిన జ్ఞానవిజ్ఞాన ములయొక్క నిరూపణము వెనుకటి యాఱధ్యాయములలోఁ జెప్పఁ బడిన కర్మయోగముయొక్క పరిపూర్త్యర్థమును సమర్థనార్థమును చెప్పఁబడినవి. కేవల సాంఖ్యనిష్ఠయొక్క గాని, కేవల భక్తియొక్క గాని స్వతంత్రమగు సమర్థన మిచ్చో వివక్షితము గాదని సిద్ధాంతము

చేయవలసి వచ్చును. మఱియు నిట్లు సిద్ధాంతము చేసిన పిదప, కర్మ, భక్తి, జ్ఞానము నను మూడును గీతలయందలి స్వతంత్రమయిన భాగములు కాకపోవుటయే కాక "తత్త్వమసి" యను మహావాక్య మునందు మూఁడే పదము లుండుటచే గీతలయొక్క యధ్యాయ ములు పదునెనిమిది యున్నవి. "మూఁడాఱులు పదునెనిమిది" యను లెక్కచే ఆఱు ఆఱు అధ్యాయము లొకటిగ నుండునట్లు గీతలను మూఁడు సమానభాగములు చేసి మొదటి యాఱధ్యాయములందు 'త్వం' పదముయొక్కయు, రెండవ యాఱింటియందు 'తత్' పదముయొ క్కయు, మూఁడవ యాఱింటియందు 'అసి' పదముయొక్కయు వివేచన చేయఁబడినదని చెప్పునట్టి మతము సైతము శుద్ధకాల్పనిక మయినదని యిప్పుడు స్పష్ట మగుచున్నది. కారణ మేమియన- గీత యం దంతటను కేవల బ్రహ్మజ్ఞానమే ప్రతిపాద్యముగ నున్నది. మఱియు 'తత్త్వమసి' యను మహావాక్యము యొక్క వివరణము కంటె నధికముగ గీతలయం దేమియు లేదను నేకదేశీయపక్ష మిప్పు డుండనే యుండ దను విషయమును సైత మిట్లే గుర్తుంచుకొన వల యును.

భగవద్గీతయందు భక్తి, జ్ఞానములయొక్క వివేచన మెందుకు చెప్పఁబడినదియు నీ తీరున నొకసారి విచారించి పిదప నేఁడు మొదలు కొని పదునేడవయధ్యాయముయొక్క సమాప్తిపర్యంతము, పదు నొకండధ్యాయములయొక్కయు విషయము సహజముగఁ దెలియు టకు యోగ్యముగ నున్నది. ఏ పరమేశ్వరస్వరూపము యొక్క జ్ఞానముచే, బుద్ధి రసవర్జముగను, సమముగ నుండునో యా పరమే శ్వర స్వరూపమును విచారించుట యొకప్పుడు క్షరాక్షరదృష్టిచేతను, నొకప్పుడు క్షేత్రక్షేత్రజ్ఞదృష్టిచేతను, చేయవలసి యుండుటచే, దానివలన నేది పిండమందు కలదో, యదే బ్రహ్మాండమందు కలదని తుదకు చేసిన సిద్ధాంతమును వెనుక యాఱవ ప్రకరణమునందు చెప్పి

యున్నాను. ఆ విషయమే యిప్పుడు గీతలలోఁ జెప్పఁబడినది; కాని పరమేశ్వరస్వరూపము నీ రీతిగ విచారించుట కారంభింతు మేని యది యొకప్పుడు వ్యక్తమును (ఇంద్రియగోచరము) మఱియు నొకప్పుఁ డవ్యక్తము నగునని స్పష్టమగుచున్నది; కాని యీ రెండు స్వరూపములలోను శ్రేష్ఠమైన దేది? ఆ శ్రేష్ఠస్వరూపము నుండి కనిష్ఠ స్వరూపమెట్లుత్పన్న మాయె? నను నదియే మొదలుగాఁ గల యనేక ప్రశ్నములయొక్కయు విచార మీ నిరూపణయందు చేయవలసివచ్చును. అట్లే పరమేశ్వరునియొక్క పూర్ణజ్ఞానము గలిగి బుద్ధి స్థిరమును, సమమును, నాత్మనిష్ఠము నగుటకుఁ బరమేశ్వరునియొక్క యవ్యక్తోపాసనయా? లేక, వ్యక్తోపాసనయా చేయుట మంచిది? యను విషయము సైత మిపుడు నిర్ణయింపవలసివచ్చును. ఈ విషయమునంతను ప్రమాణపురస్సరముగ చెప్పుటకు పదునొకండధ్యాయములు పట్టుట యొక యాశ్చర్యము కాదు. ఇటు లనుటచే గీతలయందు భక్తిజ్ఞానములకు బొత్తిగ వివేచన లేదని నా యభిప్రాయము కాదు. ఇఁక నేమన: కర్మయు, భక్తియు, జ్ఞానము నను నీ మూఁడు విషయములు, లేక, నిష్ఠలు, స్వతంత్రములని, అనఁగా తుల్యబలములని కల్పించి గీతలలోని పదునెనిమిదియధ్యాయములను నన్నదమ్ములకువలె నీ మూఁడింటికే సమానముగ భాగించుట యుక్తము కాదనియు, జ్ఞానమూలకము, భక్తిప్రధానము నగు కర్మయోగమను నొక నిష్ఠయే గీతలలో నన్ని యధ్యాయముల యందును, ప్రతిపాద్యముగనున్నదనియు, భగవద్గీతయందు చెప్పఁబడిన సాంఖ్యనిష్ఠ, జ్ఞానవిజ్ఞానములు, లేక, భక్తి యనువాని నిరూపణ మొక కర్మయోగనిష్ఠయొక్క పూర్తికొఱకే యనుబంధముగ చేయఁ బడినది గాని, ప్రత్యేక మా విషయ ప్రతిపాదనమునకుఁ గాదనియు నా యభిప్రాయము. ఇపుడీ సిద్ధాంతానుసారముగ కర్మయోగముయొక్క పూర్తి సమర్థనల కొఱకుఁ జెప్పఁబడిన జ్ఞానవిజ్ఞానములకు నధ్యాయ సంగతి యెట్లు విభజింపఁబడినదో చూతము.

ఏడవయధ్యాయమునందు క్షరాక్షరసృష్టియొక్క, (అనఁగా: బ్రహ్మాండముయొక్క) విచారము నారంభించి యీ సృష్టియంతయు పురుషుఁడును ప్రకృతియు— నా యొక్క పరాపరములయిన స్వరూపము లనియు, నీ మాయకంటె పరమందున్న యవ్యక్త స్వరూపమును తెలిసికొని నన్ను సేవించు వారియొక్క బుద్ధి సమ మగుటచే, వారికి నేను సద్గతి నిచ్చుచున్నా ననియు నవ్యక్తము యొక్క, లేక, యక్షర పరబ్రహ్మముయొక్క జ్ఞానమును, మొదట భగవంతుఁడు చెప్పి "సకలదేవతలును, సకలభూతములును, సకల యజ్ఞములును, సకలకర్మలును, సకలమగు నధ్యాత్మమును, నేనే యయి యున్నాను. నేను తప్ప ఈ జగత్తునం దేదియు లే" దని తన స్వరూపమును వర్ణించెను. అనంతరమునందు ఎనిమిదియవ యధ్యాయములో నారంభమునందు "అధ్యాత్మము, అధియజ్ఞము, అధిదైవము, అధిభూతము నన నేమి యర్థమో తనకుఁ జెప్పుమని యర్జునుఁ డడుగ నీ శబ్దములయొక్క యర్థమును చెప్పి భగవంతుఁ డిట్లు నాస్వరూపమును తెలిసికొనినవారిని నేను మఱవ నని చెప్పెను. మఱియు "సర్వజగత్తునందును, అవినాశి, లేక, యక్షరమగు తత్త్వ మేది? సర్వజగత్తునకు సంహార మెప్పు డెట్లగును? పరమేశ్వర స్వరూపమును దెలిసికొనిన పిదప, పురుషులకు నే గతి ప్రాప్త మగును?" అను విషయములు సంక్షేపముగ వివేచింపఁబడినవి. తొమ్మిదవ యధ్యాయమునను నా విషయమునే ప్రతిపాదించుచు "నలుగడల నీ రీతి నిండియున్న యవ్యక్తుఁడగు పరమేశ్వరునియొక్క వ్యక్తస్వరూపమును భక్తిచే తెలిసికొని యనన్యభావముతో నతని శరణు చొచ్చుటయే బ్రహ్మప్రాప్తికి ప్రత్యక్షముగఁ గన్పట్టు సులభ మార్గము, లేక, రాజమార్గ మగును. మఱియు దీనినే రాజవిద్యయని కాని, లేక, రాజగుహ్యమని కాని చెప్పుదు" రని చెప్పఁబడినది. భగవంతుఁ డీ మూఁడధ్యాయములందును, జ్ఞానవంతుఁడును, భక్తి యుక్తుఁడు నైన పురుషుఁడు కర్మలను చేయుచునే యుండవలయు

నని కర్మమార్గము యొక్క ప్రధాన సిద్ధాంతమును నడుమ నడుమ సూచించుచునే యుండెను. "తస్మాత్సర్వేషు కాలేషు మా మనుస్మర యుద్ధ్య చ"— కనుక సర్వసమయములయందు నన్ను స్మరించుము. యుద్ధము చేయుము(8.7) అని యెనిమిదియవ యధ్యాయమున చెప్పఁబడినది "సర్వకర్మల నా కర్పణము చేయుటచే కర్మల యొక్క శుభాశుభములగు ఫలములనుండి నీవు ముక్తుఁడవగుదువు" అని తొమ్మిదియవ యధ్యాయమునందు (9. 27,28) చెప్పఁబడినది. సర్వజగత్తును నా వలననే పుట్టినది. నా స్వరూపమే యదియు నై యున్నది" అని, పూర్వమునందు చెప్పఁబడిన దశమాధ్యాయమునందు జగత్తునందలి ప్రతిశ్రేష్ఠవస్తువును నాయొక్క విభూతియే యై యున్నదని యనేకోదాహరణములచే నర్జునునకు బోధించిన పిదప నర్జునుని ప్రార్థనవలన పదునొకండవయధ్యాయమునందు తన విశ్వరూపమును ప్రత్యక్షముగఁ జూపించి పరమేశ్వరుఁడ నగు నేనే నలుగడల వ్యాపించియున్నానను విషయముయొక్క సత్యత భగవంతునిచే నర్జునుని యనుభవమునకుఁ గైకొని రాఁ బడెను. కాని యీ తీరున విశ్వరూపమును జూపించి సర్వకర్మలను జేయువాఁడను నేనే యయి యున్నానని యర్జునునకు నమ్మకము గలిగించిన వెంటనే "సత్యముగు కర్తను నేను. నీవు నిమిత్తమాత్రముగ నున్నావు. కావున నిస్సందేహుఁడవై యుద్ధమును జేయు" మని భగవంతుఁడు చెప్పినాఁడు (గీ. 11.33). సర్వజగత్తునందును నొకఁడే పరమేశ్వరుఁ డున్నాఁడని యిట్లు సిద్ధమయినను, "నే నవ్యక్తముగ నున్నను నన్ను మూర్ఖులు వ్యక్తముగఁ దెలిసికొనుచున్నారు (7. 24). "యదక్షరం వేదవిదో వదంతి"— ఎవరిని వేదవేత్త లక్షరుఁడని చెప్పుచున్నారో అవ్యక్తమునే యక్షర మని చెప్పుచున్నారు (8.21) "నాయొక్క నిజమగు స్వరూపమును దెలిసికొనక, నేను మనుష్యరూపధారి నని మూఢు లనుకొనుచున్నారు" (9.11), "విద్యలలో నధ్యాత్మవిద్య శ్రేష్ఠము" (10.32) అనియు, "త్వ మక్షరం నదసత్పరం యత్" (11. 37) అని యర్జు

నుఁడు చెప్పిన రీతిగను, ప్రతిస్థలమునను పరమేశ్వరునియొక్క యవ్యక్తస్వరూపమే ముఖ్యమని వర్ణింపఁబడి యుండుటచే వ్యక్తపరమేశ్వరోపాసన చేయవలయునా? లేక, యవ్యక్తోపాసన చేయవలయునా? యను విషయము పంద్రెండవయధ్యాయముయొక్క యారంభమున నర్జునుఁ డడిగెను. అప్పుడు భగవంతుఁడు తొమ్మిదవయధ్యాయమునందు వర్ణింపఁబడిన వ్యక్తస్వరూపముయొక్క యుపాసన సులభ మని తన మతమును చెప్పి రెండవ యధ్యాయమునందు స్థితప్రజ్ఞుని వర్ణించినటులే పరమ భగవద్భక్తులయొక్క స్థితిని సైతము వర్ణించి యీ యధ్యాయమును సమాప్తము చేసినాఁడు.

కర్మ, భక్తి, జ్ఞానము నని గీతలను మూఁడు స్వతంత్రములైన భాగములుగఁ జేయుటకు సాధ్యము గాకపోయినను నేడవయధ్యాయము మొదలుకొని యారంభింపఁబడిన జ్ఞానవిజ్ఞానములను, భక్తి యనియు, జ్ఞాన మనియు రెండు విధములుగ స్వభావముగనే విభాగింప వచ్చునని యనేకులయొక్క యభిప్రాయము. కావున రెండవ షడధ్యాయి, భక్తిపరమై యున్నదని వారు చెప్పుదురు; కాని కొంచెము విచారించిన యెడల నీ మతముకూడ సత్యమయినది కాదని యెవరికైనను దోఁచకమానదు. కారణ మేమి యన: ఏడవ యధ్యాయముయొక్క యారంభము క్షరాక్షరసృష్టియొక్క జ్ఞానవిజ్ఞానములతోనే చేయఁబడినది; కాని భక్తితోఁ జేయఁబడలేదు. మఱియు భక్తియొక్క వర్ణనము పంద్రెండవ యధ్యాయమునందు సమాప్తమయినదని చెప్పవలసి వచ్చినేని తర్వాత ప్రత్యధ్యాయములోను, ప్రతిస్థలమునను నా స్వరూపము బుద్ధికి గోచరము కానివారు శ్రద్ధతో "ఇతరుల వచనముల విశ్వసించి నన్ను ధ్యానింపవలయును"(గీ. 13.25). "ఎవఁడు నాయం దవ్యభిచరితమగు భక్తిని చేయుచున్నాఁడో వాఁడే బ్రహ్మభూతుఁ డగును" (14.26). "పురుషోత్తమరూపమును దెలిసికొనినవాఁడు నాయొక్క భక్తినే చేయుచున్నాఁడు (గీ. 15.19)

అనియు, పదునెనిమిదియవ యధ్యాయమునందు "సర్వధర్మముల వదలి నీవు నన్ను భజింపుము" (గీ. 18. 66) అనియుఁ బలుమాఱు భక్తియే యుపదేశింపఁబడినట్లు స్పష్టముగఁ గన్పట్టుచున్నది. కావున కేవలము రెండవ షడధ్యాయియందే భక్తి యుపదేశింపఁబడినదని చెప్పుటకు వీలులేదు. అటులే జ్ఞానముకంటె భక్తి వేఱని భగవంతుని యభిప్రాయమైనచోఁ జతుర్థాధ్యాయమునందు, జ్ఞానముయొక్క ప్రస్తావనఁ జేసి (4.34-37) "ఆ జ్ఞానమునే, విజ్ఞానముతోడ" "నీ కిప్పుడు చెప్పుచున్నానని యేడవయధ్యాయమున (అనఁగా: పైయాక్షేపకుల మతము ననుసరించి) భక్తిపరమగు షడధ్యాయియొక్క యారంభ మునందు భగవంతుఁడు చెప్పకయే యుండును (7. 2). దీనికి పర మందున్న తొమ్మిదవ యధ్యాయమునందు రాజగుహ్యమును, రాజ విద్యయు (అనఁగా: ప్రత్యక్షావగమ్యమగు భక్తిమార్గము) చెప్పఁబడిన మాట నిజమే; కాని యధ్యాయారంభముననే "విజ్ఞానసహిత జ్ఞాన మును నీకుఁ జెప్పుచున్నాను" (9. 1) అని చెప్పెను. దీనివలన గీత లలో, భక్తియు జ్ఞానముననే చేర్పఁబడె నని స్పష్టమగును. పదియవ యధ్యాయమునందు భగవంతుఁడు తన విభూతిని వర్ణించెను; కాని దానినే యర్జునుఁడు పదునొకండవ యధ్యాయముయొక్క యారం భమున నధ్యాత్మ మని చెప్పెను (11. 1); మఱియు పరమేశ్వరుని వ్యక్తస్వరూపముయొక్క వర్ణన జరుగుచుండ నడుమ నడుమ వ్యక్త స్వరూపముకంటె నవ్యక్తస్వరూపము శ్రేష్ఠ మని చెప్పఁబడెనని పైన వక్కాణింపఁబడి యున్నది. ఈ విధినిబట్టి "వ్యక్తోపాసనఁ జేయవల యునా? లేక, యవ్యక్తోపాసనఁ జేయవలయునా"? యని యర్జు నుఁడు పండ్రెండవ యధ్యాయముయొక్క యారంభమున నడుగ నవ్యక్తముకంటె వ్యక్తముయొక్క యుపాసన (అనఁగా: భక్తి) సులభమని యుత్తర మిచ్చి వెంటనే పదుమూఁడవ యధ్యాయము నందు క్షేత్రక్షేత్రజ్ఞులయొక్క జ్ఞానమును జెప్పుట కారంభించి,

యేడవ యధ్యాయముయొక్క యారంభమునందువలె, పదునాల్గవ యధ్యాయారంభము నందును "పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞాన ముత్తమమ్"— మరల నీ కా జ్ఞానవిజ్ఞానములనే పూర్ణముగఁ జెప్పుచున్నాఁడను (14.1) అని చెప్పఁబడినది. మఱియు నీ జ్ఞానమును జెప్పుచు భగవంతుఁడు భక్తిని సైతము నడుమనడుమ స్థిరపఱచెను. దీనివలన జ్ఞానము భక్తియు నను నీ రెండును వేర్వేఱని చెప్పుట భగవంతుని యుద్దేశము కామిచే నేడవ యధ్యాయము మొదలుకొని యారంభింపఁబడిన జ్ఞానవిజ్ఞానములయందే యీ రెండును గుంఫితములై యున్నవని స్పష్టమగుచున్నది. భక్తి వేఱును, జ్ఞానము వేఱు ననునది యా యా సంప్రదాయములయొక్క యభిమానముచే వెలువడిన నాటకము. గీతయొక్క యభిప్రాయ మది గాదు. అవ్యక్తోపాసనయందు (జ్ఞానమార్గమునందు) అధ్యాత్మవిచారముచేఁ బరమేశ్వరస్వరూపముయొక్క యే జ్ఞానము సంపాదించుకొనవలయునో యదే భక్తియందును నావశ్యక మగును. కావున వ్యక్తోపాసనయందు (భక్తిమార్గమునందు) ఆ జ్ఞానము నారంభమున నితరులవలన శ్రద్ధతో గ్రహింపవచ్చును (13.15). కావున భక్తిమార్గము ప్రత్యక్షావగమ్యమును సామాన్యముగ సర్వలోకులకును సుఖకారకమును (9.2). ఇంతియ కాక జ్ఞానమార్గము (లేక, యవ్యక్తోపాసన) క్లేశమయమును (12.5) అను దానికంటె నీ రెండు సాధనముల యందును భేదమున్నటుల గీత చెప్పదు. పరమేశ్వర స్వరూపముయొక్క జ్ఞానమును బొందిన పిదప బుద్ధిని సమముచేయుటయను కర్మయోగమునందున్న సాధ్య మీ రెండు సాధనముల చేతను సమానముగనే ప్రాప్త మగును. కావున వ్యక్తోపాసనయు నవ్యక్తోపాసనయు నను రెండును భగవంతునకు సమానముగనే గ్రాహ్యములు. అయినను జ్ఞానియుఁ గొంచెమో గొప్పయో యుపాసనఁ జేయవలయును గాన, చతుర్విధ భక్తులలోను భక్తిగల జ్ఞాని శ్రేష్ఠుఁడని చెప్పి (గీ. 7.

17) జ్ఞానమును భక్తియు నను రెంటియందు నున్న విరోధమును భగవంతుఁడు నివారించెను; కాని యే మయినను జ్ఞానవిజ్ఞానముల వర్ణించుచు ప్రసంగానుసారముగ నొకానొక యధ్యాయమునందు వ్యక్తోపాసనయొక్కయు, మఱియొక యధ్యాయమునం దవ్యక్తోపాసనయొక్కయు విశేషమగు వర్ణన తప్పక చేయవలసివచ్చెను; కాని యంతమాత్రముచే నివి వేఱుగ నున్నదని భ్రమఁ జెందఁ గూడదు. కావుననే భగవంతుఁడు పరమేశ్వరుని వ్యక్తస్వరూపవర్ణనను జేయుచు, వ్యక్తస్వరూపముకంటె నవ్యక్తస్వరూపముయొక్క గొప్పతనమును, నవ్యక్తమును వర్ణించుచున్నపుడు భక్తియొక్క యావశ్యకతను చెప్పుచు వచ్చెను. అయినను విశ్వరూపముయొక్కయు, విభూతియొక్కయు వర్ణనకే మూఁడు నాలుగధ్యాయములు పట్టెను. కాన నీ మూఁడు నాలుగధ్యాయములకును (షడధ్యాయికిఁ గాదు) స్థూలదృష్టిచే "భక్తిమార్గ"మని పేరిడుట యెవరికయిన నిష్టమే యగునేని యట్లు చేయుట కాటంక మేమియు లేదు; కాని యేమి చెప్పినను గీతలయందు, భక్తిని జ్ఞానమును విడఁదీసి యీ రెండు మార్గములు స్వతంత్రములుగనే వర్ణింపఁబడినవి యని చెప్పుటకు సాధ్యము కాదని నిశ్చితమగును. కర్మయోగమునందుఁ బ్రధానముగఁ జెప్పఁబడిన సామ్యబుద్ధినొందుటకు పరమేశ్వరునియొక్క సర్వవ్యాపకమగు స్వరూపముయొక్క జ్ఞానము కావలయుననియు; ఈ జ్ఞానము వ్యక్తముయొక్కయుపాసనవలనఁ గలిగినదైనను, అవ్యక్తోపాసనవలనఁ గలిగినదైనను నిష్టమే; సౌలభ్యముదక్క ఇందు భేద మేమియు లేదనియు నిందలి సారాంశము. ఇదియే యీ చేయఁబడిన వివేచనకు ఫలముగాన, నేడవయధ్యాయము మొదలుకొని పదునేడవయధ్యాయమువఱకు నున్న విషయముల కన్నింటికిని గీతలలో జ్ఞానవిజ్ఞానములని కాని, యధ్యాత్మమని కాని యొక్కపేరే పెట్టఁబడినదని తెలిసికొనవలయును.

అది యటులుండుఁగాక; ఇప్పుడు పరమేశ్వరుఁడే సర్వ బ్రహ్మాండమును, లేక, క్షరాక్షరసృష్టిని వ్యాపించినాఁడని విశ్వరూప దర్శనముచే నర్జునుని 'చర్మచక్షుస్సు'లకు ప్రత్యక్షమగు ననుభవమును గలుగఁ జేసిన పిదప నీ పరమేశ్వరుఁడు పిండమునందు అనఁగా: మానుషశరీరమునందు, లేక, క్షేత్రమునందు ఆత్మ యను రూపముతో నుండెను గాన నాత్మయొక్క, అనఁగా: క్షేత్రజ్ఞునియొక్క, జ్ఞానమే పరమేశ్వరునియొక్క (పరమాత్మయొక్క) జ్ఞాన మగు నను నూహతో క్షేత్రక్షేత్రజ్ఞవిచారము నిప్పుడు పదుమూఁడవ యధ్యాయమునఁ జేసెను. వీనిలో మొదట పరమాత్మను (అనఁగా: పరబ్రహ్మమును) "అనాదిమత్పరం బ్రహ్మ......" మొదలగు నుపనిషద్వాక్యముల యాధారముచే వర్ణించినపిదప క్షేత్రక్షేత్రజ్ఞవిచారమే 'ప్రకృతియు' 'పురుషుఁడు' నను సాంఖ్యవివేచనయం దంతర్భూత మగు నని నిరూపింపఁబడినది; మఱియుఁ దుదకుఁ బ్రకృతిపురుషు లను భేదమును దెలిసికొని సర్వగతమగు నిర్గుణపరమాత్మను "జ్ఞానచక్షువుతోఁ" జూచినవారే ముక్తు లగుదురని చెప్పఁబడినది. అయినను ఆ సాంఖ్యమందును "సర్వకర్మలను ప్రకృతియే చేయుచున్నది. ఆత్మ కర్త గాఁడు" అని తెలిసికొనుటచేఁ గర్మలు బంధకములు గావు (13. 29) అని కర్మయోగముయొక్కయు, "ధ్యానే నాత్మని పశ్యంతి" (13.24) అని భక్తియొక్కయు సూత్రములు స్థిరముగ నుంపఁబడినవి. పదునాల్గవ యధ్యాయమునందు నీ జ్ఞానమునె ముందు చెప్పుచు, నొక యాత్మయే, లేక, పరమేశ్వరుఁడే యంతటను నిండియున్నను, సత్త్వము, రజస్సు, తమస్సు నను ప్రకృతిగుణములయొక్క భేదముచే జగత్తునందు వైచిత్ర్య మెట్లుత్పన్న మగునదియు సాంఖ్యశాస్త్రాను సారముగఁ జెప్పి, ప్రకృతియొక్క ఖేలనమును దెలిసికొనిన వారును తాను కర్త గానని యెఱింగి పరమేశ్వరుని భక్తియోగముచే సేవించు వారును మాత్రమే నిజమగు త్రిగుణాతీతులు, ముక్తులు, నని చెప్పఁ

బడుచున్నారని, తుదకు స్థితప్రజ్ఞునియొక్కయు భక్తునియొక్కయు స్థితివలెనే త్రిగుణాతీతుని స్థితియు నర్జునుఁ డడుగుటచేఁ జెప్పఁబడినది. పదునేనవయధ్యాయమునందు, మొదట శ్రుతులలో నక్కడక్కడ నున్న పరమేశ్వరునియొక్క వృక్షరూపమగు వర్ణననే చెప్పి, తర్వాత సాంఖ్యులు ప్రకృతియొక్క దుకాణ మని చెప్పునదియే యీ యశ్వత్థ వృక్ష మని చెప్పి, తుదకు క్షరము నక్షరము నను నీ రెండింటికిని పరమందున్న పురుషోత్తముని తెలిసికొని, యతని భజించుటచే మనుజుఁడు కృతకృత్యుఁ డగుననియు నర్జునునకు భగవంతునిచే నుపదేశింపఁ బడినది. పదునాఱవ యధ్యాయమునందు ప్రకృతి భేదముచే జగత్తునం దెట్లు వైచిత్ర్య ముత్పన్న మగునో యటులే మనుష్యులలోసైతము దైవీసంపత్తియు అసురీసంపత్తియు నను రెండు భేదములు గలవని చెప్పి యట్టి సంపదలు గలవారియొక్క కర్మ లెట్లుండునదియు, వారి కే గతి ప్రాప్తమగునదియు వర్ణింపఁబడినది. త్రిగుణాత్మక ప్రకృతియొక్క గుణవైషమ్యమువలనఁ గలుగువైచిత్ర్యము, శ్రద్ధ, దానము, తపస్సు, యజ్ఞములు మొదలగువానిలో సైత మెట్లు కాన్పించు నని యర్జునుఁ డడుగ నా విషయము పదునేడవ యధ్యాయమునందు వివేచింపఁబడినది. తుదకు 'ఓం తత్సత్' అను బ్రహ్మ నిర్దేశమునందున్న తత్ పదమునకు, నిష్కామబుద్ధిచే చేయఁబడిన కర్మ యనియు, సత్ అను పదమునకు మంచికర్మ (కామ్యబుద్ధిచేఁ జేయఁబడిన కర్మ) అనియు నర్థము చేసి యీ సామాన్యబ్రహ్మనిర్దేశము సైతము, కర్మయోగమార్గమునకే యనుకూల మగు ననియు సూచింపఁబడినది. జగత్తునందు నలుగడల నొక పరమేశ్వరుఁడే యున్నాఁడు; కాని యతనిని విశ్వరూపదర్శనముచేఁ దెలిసికొనినను, జ్ఞాననేత్రముచేఁ దెలిసికొనినను ఫలము సమానమే; ఏలన: శరీర మందు క్షేత్రజ్ఞుఁడును వాఁడె, క్షరసృష్టియం దున్న యక్షరుఁడును వాఁడె. దృశ్యసృష్టియందు నిండియున్నవాఁడును, దానికి వెలుపట (అనఁగా:పరమందు) నున్నవాఁడును అతఁ డొక్కడైనను, ప్రకృతి

యొక్క గుణభేదములచే వ్యక్తసృష్టియందు నానాత్వము, లేక, వైచిత్ర్యము గన్పట్టుచున్నది. మఱియు నీ మాయచేత, లేక, ప్రకృతి యొక్క గుణభేదముచేత, జ్ఞానము, శ్రద్ధ, తపస్సు, యజ్ఞము, ధృతి, దానము ననువానియందును, మనుష్యులయందును ననేకము లగు భేదములు గలుగుచున్నవి; కాని యీ భేదముల యన్నిటి యందును నున్న యైక్యమును దెలిసికొని, యేకము, నిత్యము నగు నా తత్త్వముయొక్క యుపాసనను వ్యక్తోపాసనను గాని, యవ్యక్తోపాసనను గాని చేసి ప్రతిమనుజుఁడును తనయొక్క బుద్ధిని స్థిరముగను సమముగను చేసికొని యా నిష్కామము, సాత్త్వికము, లేక, సామ్యము నగు బుద్ధితోడనే కేవలకర్తవ్య మని జగత్తునందున్న స్వధర్మానుసారముగ ప్రాప్తములగు వ్యవహారముల నన్నింటిని చేయ వలయునని యీ పదునొకండవ యధ్యాయముయొక్కయు తాత్పర్య మని యిందలి సారాంశము. ఈ జ్ఞానవిజ్ఞానముల నీగ్రంథముయొక్క (అనఁగా: గీతారహస్యముయొక్క) పూర్వప్రకరణములలో నేను సవిస్తరముగఁ బ్రతిపాదించి యుంటిని గాన నేడవ యధ్యాయము మొదలుకొని పదునేడవ యధ్యాయము వఱకునుండు నధ్యాయముల యొక్క యభిప్రాయ మీ ప్రకరణమునందు విశేషముగ విస్తరింపఁ బడలేదు. అధ్యాయముల సంగతిని జూచుట మాత్రమే ప్రస్తుత ముద్దేశింపఁబడి యుండినందున నా కార్యమునకు కావలసిన భాగమే యిచ్చో వక్కాణింపఁబడినది.

కర్మయోగమార్గమునందు కర్మలకంటె బుద్ధి శ్రేష్ఠమగుటచే, ఈ బుద్ధి శుద్ధము సమము నగుటకు నావశ్యకము లగు పరమేశ్వరుని సర్వవ్యాపిత్వముయొక్క (అనఁగా: సర్వభూతాంతర్గతమగు నాత్మైక్యముయొక్క) 'జ్ఞానవిజ్ఞానములను' చెప్పుట కారంభించి, యధికార భేదానుసారముగ వ్యక్తముయొక్కయు, నవ్యక్తముయొక్కయు నుపా సనచే నీ జ్ఞానము హృదయములోఁ బ్రతిబింబించిన పిదప బుద్ధికి

స్థైర్యమును, సమతయు నెట్లు ప్రాప్త మగునదియు, వానిచేతనే కర్మలను వదలి పెట్టకపోయినను దుదకు మోక్ష మెట్లు లభించునదియు, క్షరాక్షరులయొక్కయు, క్షేత్రక్షేత్రజ్ఞులయొక్కయు, వివేచనపూర్వకముగ నింత పర్యంతము నిరూపింపఁబడినది. అయినను బుద్ధి యిట్లు సమమయిన పిదప కర్మలనే త్యజించుటకంటె ఫలాశను వదలి లోకసంగ్రహార్థమై యామరణాంతమును కర్మలను చేయుచుండుట యధిక శ్రేయస్కరమని భగవంతుఁడు నిర్ణయముఁ జేసెను (గీ.౫.౭). కావున స్మృతులలో వర్ణింపఁబడిన సన్న్యాసాశ్రమ మీకర్మయోగమున నుండ నేరదనియు, దానివలన మన్వాది స్మృతిగ్రంథములకును నీకర్మయోగమునకును విరోధ ముండవచ్చును అనియు నొక సందేహమును మనస్సునం దిడికొని సన్న్యాసము, త్యాగము నను నీ రెండింటియందున్న రహస్యమేమియో నాకుఁ జెప్పుమని పదునెనిమిదియవ యధ్యాయముయొక్క యారంభమునం దర్జునుఁ డడిగెను. దానికి సన్న్యాసమనఁగా వదలిపెట్టుట యని మొదట నర్థ మగును. మఱియు కర్మయోగ మార్గమునందు, కర్మల వదలిపెట్టక పోయినను, ఫలాశను వదలిపెట్టినందున కర్మయోగ మనునది సత్యమును విచారింప సన్న్యాసమే యగునని భగవంతుఁడు సమాధానము చెప్పెను. కారణ మేమి యన: సన్న్యాసివేషమును స్వీకరించి భిక్ష నెత్తుకొనక పోయినను బుద్ధి నిష్కామముగ నుంచుట యను స్మృత్యుక్తమైన వైరాగ్యముయొక్కయు, సన్న్యాసముయొక్కయు సిద్ధాంతము కర్మయోగమునందు కలదు; కాని ఫలాశ వదలిపోవు నేని స్వర్గప్రాప్తి యందలి యాశయు నుండదు గాన, యజ్ఞయాగాది శ్రౌతకర్మలను చేయనక్కఱ లేదని మఱియొక సందేహ మిచ్చటఁ గలుగును. ఈ శంకను నివారించుటకై, యీ కర్మలు చిత్తశుద్ధికారకములు గాన వానిని సైతమితర కర్మలనువలెనే చేయవలయును; కాని నిష్కామబుద్ధితో చేసి యజ్ఞచక్రమును లోకసంగ్రహార్థమయి స్థిరముగ నుంచవలయునని

భగవంతుఁడు తన నిశ్చితమయిన మతమును చెప్పినాఁడు. ఈ రీతిగ నర్జునుని ప్రశ్నమునకు నుత్తరముఁ జెప్పిన పిదప జ్ఞానము, కర్మ, కర్త, బుద్ధి, ధృతి, సుఖము అనునవి ప్రకృతిస్వభావానురూపముగ సాత్త్వికము, రాజసము, తామసము నని మూఁడుభేదములు గలవియై యున్నవని నిరూపించి గుణవైచిత్ర్యముయొక్క విషయము పూర్తి చేయఁబడినది. అనంతరము వీనిలో నిష్కామకర్మ, నిష్కామకర్త, ఆసక్తిరహితబుద్ధి, అనాసక్తివలనఁ గలుగు సుఖము, 'అవిభక్తం విభక్తేషు' అను న్యాయము ననుసరించి కలుగు నాత్మైక్యజ్ఞానము నను నవియే సాత్త్వికములు, లేక, శ్రేష్ఠము లని నిశ్చయింపఁబడినది. పిదప నీ సిద్ధాంతము ననుసరించియే చాతుర్వర్ణ్యములవారును దమ తమ కర్మల నాచరింపవలయనని చెప్పి, చాతుర్వర్ణ్య ధర్మముచే ప్రాప్తములయిన కర్మములను సాత్త్వికబుద్ధితో (అనఁగా: నిష్కామబుద్ధితో) కేవల కర్తవ్యములని చేయుచుండుటచేతనే మనుజుఁడు జగత్తునందు కృతకృత్యుఁ డగుటచేఁ దుద కతనికి శాంతియు మోక్షము లభించునని చెప్పఁబడినది; మఱియుఁ గర్మ లనునవి ప్రకృతిధర్మము లగుటచే వానిని వదలిపెట్టుద మనినను వదలవు. కావున సర్వకర్తయు, కారయితయుఁ బరమేశ్వరుఁడే యను తలంపుతో నతనిని శరణుఁ జొచ్చి సర్వకర్మలను నిష్కామబుద్ధితోఁ జేయుచుండుము. నేనే యా పరమేశ్వరుఁడను. నాయందు విశ్వాసము నుంచి నన్ను భజింపుము. నేను నిన్ను సర్వపాపములనుండియు ముక్తునిగఁ జేయుదును" అని యర్జునునకు భక్తిమార్గమును నిశ్చయముగ నుపదేశించి భగవంతుఁడు గీతలయందున్న ప్రవృత్తిపరములగు ధర్మములయొక్క వాస్తవమును జెప్పి సమాప్తిఁ జేసెను. ఇహలోక పరలోకముల రెంటిని విచారించి, జ్ఞానవంతులగు శిష్టులు ప్రచారములోనికిఁ దెచ్చిన సాంఖ్యము, యోగము నను రెండు నిష్ఠలే, మొదలుగ గీతలయం దుపదేశము ప్రారంభింపఁబడి యున్నదనియు, వానిలో గొప్పదని పంచమాధ్యాయమునందు వర్ణింపఁబడినదియు, ఆఱవ యధ్యాయమునందుఁ జెప్పఁబడిన పాతం

జలయోగముచే సిద్ధించునదియు, తర్వాత పదునొకండధ్యాయము లలో పిండబ్రహ్మాండజ్ఞానపూర్వకముగ నిరూపింపఁబడిన విధుల ననుసరించి యాచరించుచుండుటచే పరమేశ్వరజ్ఞానమును మోక్షమును గలుగఁ జేయునదియు నైన కర్మయోగమే పదునెనిమిదవ యధ్యాయమునందును సమర్థింపఁబడినదనియు నందలి సారాంశము. మఱియు మోక్షరూపమగు నాత్మకల్యాణమునకు ప్రతిబంధకము లేకుండుటకై పరమేశ్వరార్పణ పూర్వకముగ కేవలము కర్తవ్యములను బుద్ధితో స్వధర్మానుసారముగ లోకసంగ్రహార్థమై సర్వకర్మలను జేయుచునేయుండుట యను నీ యోగము (లేక, యుక్తి) యొక్క భగవత్ప్రణీతమగు నీ శ్రేష్ఠత్వోపపాదనమును వినిన వెంటనే యర్జునుఁడు సన్న్యాసమును గైకొని భిక్ష నెత్తుకొనవలయునని తన మనస్సులోఁ గలిగిన యూహను వదలి, భగవంతుఁడు చెప్పుచున్నాఁడని మాత్రమే కాక, కర్మాకర్మశాస్త్రము పూర్ణముగఁ దెలియుటచే బుద్ధిపూర్వముగ సైతము యుద్ధము చేయుటకుఁ బ్రవృత్తుఁడయ్యెను. అర్జునుని యుద్ధమునందు బ్రవర్తింపఁ జేయుటకై గీత యారంభింపఁబడి యితఁ డట్లు ప్రవర్తింపఁగనే సమాప్తి సేయఁబడినది (18.73).

గీతయొక్క పదునెనిమిది యధ్యాయములందు నున్న పైన చెప్పఁబడిన యధ్యాయసంగతిని బట్టి విచారింప గీత యనునది కర్మ భక్తి, జ్ఞానములు నను వేఱ్వేఱగు మూఁడు స్వతంత్రనిష్ఠలును గలపు లగము గాని యా నిష్ఠలనెడు గుడ్డపేలికలను పట్టుపేలికలను వేసి కుట్టిన బొంత గాని కాదనియు, భక్తిజ్ఞానములను నూలుపోగులను పట్టుపోగులను గీత యను మగ్గమున నా యా స్థలముల సమర్చి మనోహరముగ నేయఁబడిన కర్మయోగ మను నొక విధమగు నమూల్య వస్త్రమనియు, నది మొదటినుండి చివరవఱకు నత్యంతయోగయుక్తమగు చిత్తముతో నిర్మింపఁబడిన దనియుఁ గన్పట్టును. నిరూపణము యొక్క పద్ధతి, సంవాదాత్మక మగుటచే శాస్త్రీయపద్ధతికంటె

కొంచెము దుర్బలముగానే యుండును; కాని సంవాదాత్మకమగు నిరూపణముచే శాస్త్రీయమగు పద్ధతియొక్క కాఠిన్యము పోయి, దానికి మాఱుగ సౌలభ్యమును, ప్రేమయుక్తతయు గీతలయందు నిండియున్నవనియుఁ దెలిసె నేని, శాస్త్రీయపద్ధతియందున్న హేతువును బట్టి యే సంగతినైన నూహించుట యనెడు కేవల బుద్ధిగ్రాహ్యమును, నీరసమునైన ముష్టియుద్ధము వదలిపోవుట యెవరికిని నే మాత్రమును తప్పని తోఁచదు. అటులె గీతానిరూపణపద్ధతి పౌరాణికమైనను, లేక, సంవాదాత్మకమయినను, గ్రంథమును పరీక్షించునట్టి మీమాంసకుల పద్ధతు లనెడు నన్ని నికషోపలములచేతను బరీక్షించి గీతయొక్క తాత్పర్యము నిశ్చయించుటకు ప్రతిబంధ మేమియు నుండనేరదని యీ గ్రంథము నంతను బూర్తిగ విచారించినఁ దెలియును. గీతాప్రారంభమును జూచితి మేని క్షాత్రధర్మానుసారముగ యుద్ధముఁ జేయుటకు వెడలిన యర్జునుఁ డీ ధర్మాధర్మవిచికిత్సయను సుడిగుండములోఁ బడఁగా, నతనికి వేదాంతశాస్త్రముయొక్క యాధారమునఁ బ్రవృత్తిపరమగు కర్మయోగధర్మము నుపదేశించుట యను తెప్ప నిచ్చు నిమిత్తమయి గీత ప్రవర్తించినదని స్పష్టముగనే తెలియును. మఱియు గీతలయొక్క యుపసంహారమును, ఫలమును నను నీ రెండును నట్టివియే (అనఁగా: ప్రవృత్తిపరములే) యని ప్రథమ ప్రకరణముననే నేను నిరూపించియున్నాను. పిదప గీతలయందర్జునునకుఁ జేయఁబడిన యుపదేశమునందు "నీవు యుద్ధమును (అనఁగా: కర్మనే) చేయుము" అని స్పష్టముగ పది పండ్రెండు సారులును నా యర్థమే వచ్చునటులు పెక్కుసారులు (అభ్యాసముగ) చెప్పఁబడినది. సంస్కృతవాఙ్మయమునందు భగవద్గీత దప్ప కర్మయోగముయొక్క యుపపత్తిని జెప్పునట్టి మఱియొక గ్రంథము లేదు. దీనియందు అభ్యాసమును, అపూర్వతయు నను నీ రెండు ప్రమాణముల చేతను గీతలయొక్క కర్మయోగపరత్వ మెటుల నధికముగ వ్యక్తమగునో చెప్పఁబడినవి. మీమాంసకులు గ్రంథ

తాత్పర్య నిర్ణయమును జేయుటకై చెప్పిన లింగము లను నికషోపల ములలో అర్థవాదమును, ఉపపత్తియు నను నీ రెండును మిగిలినవి. వాని విషయమయి మొదట నా యా ప్రకరణములందును, గీతల యందున్న యధ్యాయక్రమము ననుసరించి యీ ప్రకరణము నందును జేయఁబడిన విచారణను బట్టి కర్మయోగమే గీతలయందుఁ బ్రతిపాద్యమగు విషయ మని నిశ్చయమగుచున్నది. కావున మీ మాంసకులయొక్క గ్రంథతాత్పర్య నిర్ణయమును జేయునట్టి షడ్విధ లింగములచేఁ బరిశీలించి జూచినను గీతాగ్రంథమునందు జ్ఞాన మూలమును భక్తిప్రధానమునగు కర్మయోగమే ప్రతిపాద్యమని నిర్వివాదముగ సిద్ధమగును. ఇది గాక గీతాతాత్పర్యములు సాంప్ర దాయికము లను విషయమున సందేహమేమియు లేదు; కాని యీ తాత్పర్యములు సాంప్రదాయికదృష్టితోఁ దీయఁబడినను గీతయొక్క యీ సాంప్రదాయికార్థము— అందునను విశేషముగ సన్న్యాసపరమగు నర్థము— సమన్వయించుటకు నవకాశ మెట్లు కలిగినదియు నిరూ పించిననే కాని యీ సాంప్రదాయికార్థచర్చ పూర్ణము కానేరదు. కావున నీ సాంప్రదాయికటీకాకారులు గీతకు సన్న్యాసపరమగు నర్థము నెటుల చేయుచువచ్చిరో యిచ్చోఁ గొంచెము విచారించి యీ ప్రకరణమును ముగింతుము.

మనుజుఁడు బుద్ధిమంతుఁడగు ప్రాణియగుటచే పిండబ్రహ్మాండ ములయందున్న తత్త్వమును దెలిసికొనుటయే వారికి ముఖ్యమగు కార్యము, లేక, పురుషార్థ మని మన శాస్త్రకారుల సిద్ధాంతము. మఱియు ధర్మశాస్త్రమునందు దీనినే 'మోక్ష' మని చెప్పుచున్నారు. అయినను దృశ్యసృష్టియొక్క వ్యవహారమును గమనించి యీ పురు షార్థము ధర్మము, అర్థము, కామము, మోక్షమునను నామములతో చతుర్విధ మయినదని శాస్త్రములలోనె చెప్పఁబడినది. 'ధర్మ' శబ్ద మున కిక్కడ వ్యావహారికము, సామాజికము, నైతికము నను

నర్థము నెఱుంగవలయు. ఇది పూర్వమునందు చెప్పఁబడినది. పురుషార్థ మిట్లు చతుర్విధ మని యంగీకరించినపిదప దానియొక్క నాలుగంగములును పరస్పరపోషకము లగునా? కావా? యను ప్రశ్నము తనంతటనే పుట్టినను వీనిలో పిండమందును బ్రహ్మాండమందు నున్న తత్త్వమును దెలిసికొనినఁగాని మోక్షము లభింపదు; కాన నామార్గమే ప్రాప్తముకావలయు నను విషయమున శాబ్దికమగు మతభేద మున్నను తత్త్వమునుబట్టి మతభేదము లేదు. తుద కీ గీతాశాస్త్రమునకుఁ గూడ నీ సిద్ధాంతము సమ్మతమే. అట్లే యర్థకామము లను పురుషార్థములు సంపాదించుకొనవలసి వచ్చినను నీతిధర్మములకు విరుద్ధము కాని రీతిని సంపాదింపవలయునను విషయము సైతము భగవద్గీత పూర్తిగ నొప్పుకొనును. ఇప్పుడు ధర్మమును (అనఁగా; వ్యావహారికమగు చాతుర్వర్ణ్య ధర్మమును) మోక్షము ననువానికి పరస్పరసంబంధ మేమియో నిర్ణయించుట మాత్రమే మిగిలి యున్నది. వీనిలో మొదట ధర్మముచే చిత్తశుద్ధి కలిగిననే కాని మోక్షమను విషయమును గుఱించి యయినను మాటలాడ నక్కఱయుండదనుట యన్నిపక్షములవారికిని నిష్టమైనదియే. ఈ చిత్తశుద్ధి కలుగుటకు విశేష కాలము పట్టును. కావున మోక్షమే ముఖ్యపురుషార్థ మను దృష్టితో పూర్వముననే 'ధర్మముచే' సంసారమును పూర్ణము చేసికొనవలయు ననియె సిద్ధాంతమగును (మను. 6.35-37). సన్న్యాస మనఁగా వదలి పెట్టుట; మఱియు ధర్మముచే సంసారమును సిద్ధము చేసికొనినవారు వదలి పెట్టుటయన, దేనిని? లేక, యెవరిసంసారము బాగుగ సాధింపఁబడలేదో యట్టి 'వ్యర్థునకుఁ' బరమార్థ మయిన నెట్లు సిద్ధించును? (దాస. 12.1.1-10 మఱియు 12.8.21-31 చూడు). కారణ మేమి యనఁగా: సాధ్యము ప్రాపంచిక మైనను, పారమార్థిక మయినను అది సిద్ధించుటకు దీర్ఘప్రయత్నమును మనోనిగ్రహమును సామర్థ్యమును మొదలగు గుణములయొక్క యుపేక్ష

సమానముగనే యుండును; మఱియు నీ గుణములు లేనివానికే సాధ్య మును ప్రాప్తము కాదని స్పష్టమగుచున్నది; కాని యనేకు లీ విష యము నొప్పుకొని చిరకాల ప్రయత్నముచేతను మనోనిగ్రహము చేతను నాత్మజ్ఞానము కలిగిన పిదప జగత్తునందున్న విషయోప భోగరూపములగు సర్వవ్యవహారములును నిస్సారములుగఁ దోఁచు ననియు, సర్పము తనకు నిరుపద్రవముగ కుబుసమును వదలి పెట్టునట్లు జ్ఞాని సమస్తమగు నైహికవిషయములను వదలి కేవల పరమేశ్వరస్వరూపమునందే లీనుఁడై యుండు ననియుఁ జెప్పుదురు (బృ. 4.4.7). ఈ మార్గమున జీవితకాలమును గడపుట యను వ్యవహారమును సైతము వదలి జ్ఞానమునకు మాత్రమే ప్రాధాన్య మీయఁబడినది. దీనిని జ్ఞాననిష్ఠ యని కాని, సాంఖ్యనిష్ఠ యని కాని, లేక, సర్వవ్యవహారములను వదలిపెట్టుటచే సన్న్యాసనిష్ఠ యని కాని చెప్పుదురు; కాని గీతాశాస్త్రము దీనికి విరుద్ధముగ మొదట చిత్తశుద్ధి నిమిత్తమయి కావలసియుండు ధర్మము చిత్తశుద్ధి గలిగిన పిదప స్వప్రయోజనార్థమై విషయోపభోగరూపములగు వ్యవహారము లను జేయుట తుచ్ఛమైనను, లోకసంగ్రహార్థమై స్వధర్మమును, కర్తవ్యమును, అను తలంపున నిష్కామబుద్ధితోఁ జేయుట యావశ్యక మగుననియు, జ్ఞాని యీ రీతిగ చేయనియెడల లోకుల కుపదేశించు వాఁ డెవఁడు నుండకపోవుటచే జగత్తు నశించు ననియు, నీ కర్మ భూమియందు కర్మ యెవ్వరినికూడ వదలదనియు, బుద్ధి నిష్కామమగు చున్న యెడల చేయవలసిన కర్మలఁ జేసినను నవి మోక్షమునకుఁ బ్రతిబంధకములు కానేరవు కావున సంసారమును వదలక యితరుల వలెనే జగత్తునందలి సర్వవ్యవహారములను విరక్తబుద్ధితో నామర ణాంతమును జేయుట జ్ఞానికిని కర్తవ్యముగఁ బరిణమించు ననియుఁ జెప్పుచున్నది. గీతలయం దుపదేశింపఁబడిన యీ యాయుష్యక్రమణ మనుమార్గమే కర్మనిష్ఠ, లేక, కర్మయోగ మని చెప్పఁబడినది; కాని కర్మయోగ మీ రీతిని శ్రేష్ఠమని నిశ్చయింపఁబడినను ఆ నిర్ణయము

నిమిత్తమై సన్న్యాసమార్గముయొక్క నింద గీతలయం దెక్కడను చేయఁబడలేదు. పైఁగా నదియు మోక్షప్రదముగనే యున్నదని చెప్పఁబడినది. సృష్ట్యారంభమునందు సనత్కుమారాదులును, బిదప శుక యాజ్ఞవల్క్యులును స్వీకరించిన దానిని భగవంతుఁడైనను బొత్తిగ వదలివేయ వలయునని యెట్లు చెప్పును? అనియు, జగత్తునందున్న వ్యవహారములు నీరసములుగఁ దోపక సమ్మతములుగఁ దోచుటయుఁ గొన్ని యంశములలోఁ బ్రారబ్ధకర్మానుసారముగ బ్రాప్తమగు వృద్ధి నొందుటయు స్వభావముగ నుండుటచేతనే స్పష్టముగ నున్నది. మఱియు జ్ఞానము గలిగినను బ్రారబ్ధకర్మను భోగించిననేకాని విముక్తి గలుగదని పూర్వమునందే చెప్పఁబడినది. కావున నీ ప్రారబ్ధకర్మానుసారముగఁ బ్రాప్తమగు వృద్ధి స్వభావముచే నొకానొక జ్ఞానికి సంసారముపై విరక్తి కలుగుటచే నతఁడు సన్న్యాసమును గైకొనినచో నతనికేమియు పేరులు పెట్టఁగూడదు. ఆత్మజ్ఞానముచే నిస్సంగమును పవిత్రమునైన బుద్ధిగల సిద్ధుఁడే మైన నితరమగు కర్మను జేసినను జేయకపోయినను నతఁడు మానవబుద్ధి సంబంధమైన శుద్ధతయొక్క పరమావధిని, స్వభావముగనే విషయములయం దాసక్తి గలది యగుటచే నివారింప శక్యముకాని మనోవృత్తిని, స్వాధీనముగ నుంచుకొనుట యను మానవసామర్థ్యమును లోకులకుఁ బ్రత్యక్షముగఁ జూపుటయను నేర్పు లోకసంగ్రహదృష్టితోఁ జూచినను సామాన్యమైనదికాదు. సన్న్యాసధర్మము విషయమై లోకమునందుఁ గల యాదరమునకు నిజమయిన కారణ మిదియే యగుటచే నది గీతలకును మోక్షదృష్టిచే సమ్మత మయినదియే; కాని వృద్ధి నొందుచున్న స్వభావమును మాత్రమే (అనఁగా: ప్రారబ్ధకర్మమును మాత్రమే) గమనింపక పూర్ణమగు నాత్మస్వాతంత్ర్యము గల జ్ఞాని జ్ఞానము గలిగిన పిదప నీ కర్మభూమియం దెట్లు చరింపవలయునో శాస్త్రీయరీతితో విచారింప నారంభింతు మేని కర్మత్యాగపక్షము గౌణమగుటచే సృష్ట్యారంభమున మరీచ్యాదులచేతను, పిదప జనకాదులచేతను నాచరింపఁబడిన కర్మ

యోగమునే జ్ఞానులు లోకసంగ్రహార్థమై స్వీకరింపవలయు నని గీతానుసారముగ సిద్ధాంతము చేయవలసివచ్చును. కారణ మేమి యన: పరమేశ్వర నిర్మితమగు సృష్టిని నడపించుట యను కార్యమును జ్ఞాని చేయవలయు నను విషయ మిపుడు తనంతటనే ప్రాప్త మగు చున్నది. మఱియు నీ మార్గమునందు జ్ఞానసామర్థ్యముయొక్క భారమును నవిరోధముగఁ బడియుండుటచే నీ కర్మయోగము కేవల సాంఖ్యమార్గముకంటె మొత్తముమీాద నధిక యోగ్యతగలది యని నిశ్చయ మగుచున్నది.

సాంఖ్యము, కర్మయోగము నను నీ రెండు మతములలోనున్న ముఖ్యమగు భేద మేమని యీ రీతి విచారించినయెడల సాంఖ్యము + నిష్కామకర్మ = కర్మయోగము అని సమీాకరణము నిష్పన్నమగును. కాన, వైశంపాయనులవారు చెప్పినటుల గీతయందలి ప్రకృతిపర మగు కర్మయోగముయొక్క ప్రతిపాదనమునందే సాంఖ్యమతము యొక్క నిరూపణము సహజముగ నిమిడియున్నట్లు కాన్పించుచున్నది. అందుమూలముననే సన్న్యాసమార్గీయటీకాకారులకు తమ సాంఖ్యమే, లేక, సన్న్యాసమార్గమే గీతలలోఁ బ్రతిపాద్య మని చెప్పుట పరిపాటియై యున్నది. వారు గీతలయందున్న కర్మ శ్రేయస్కర మని నిశ్చ యించుటకు చెప్పఁబడిన శ్లోకములు గమనింపనే గమనింపరు; లేదా యన్నియు నర్థవాదాత్మకము లని (అనఁగా: అనుషంగికములగు ప్రశంసాత్మకములని) చెప్పి సులభముగఁ గాన్పించు నర్థమును కాదని కాని, లేక, యేదయిన మఱియొక తికమకఁ బెట్టి కాని, పైనున్న సమీాకరణములో నుండి యొకప్పుడు నిష్కామకర్మలను తీసివైచు టకు, అనఁగా: వానియొక్క సమీాకరణములో నుండి యొకప్పుడు నిష్కామకర్మలను తీసివైచుటకు, అనఁగా: వానియొక్క సమీాకర ణమే సాంఖ్యము = కర్మయోగ మగుటచే గీతలలో సాంఖ్యమార్గమే ప్రతిపాద్య మని చెప్పుటకు, ప్రయత్నింతురు; కాని యీ రీతిగఁ

జేయఁబడిన యర్థము గీతలయొక్క యుపక్రమోపసంహారముల కత్యంత విరుద్ధమగును. మఱియు గీతలయందున్న కర్మయోగము గౌణ మనియు సన్న్యాసము ముఖ్యమనియు ననుకొనుట యొక యింటియజమానుని నతని యింటిలోనే యాగంతుకునిగ నిశ్చయించి యాగంతుకుని యజమానునిగ నెంచుటవంటిది యగును. ఈ విష యమును నీ గ్రంథమునం దక్కడక్కడ వ్యక్తముచేసి చూపించియే యున్నాఁడను. మఱియు దానియందు కేవల సిద్ధాంతము, కేవల భక్తి, లేక, కేవల పాతంజలయోగము మాత్రమే గీతలలో ప్రతిపాద్య మను మతమును ఖండించినాఁడను. గీతలలో లేని దేది? వైదికధర్మ ములయందు మోక్షప్రాప్తికై చెప్పఁబడిన ముఖ్య సాధనములును, ముఖ్యమార్గములును కొంచెము కొంచెమైనను గీతలలోఁ గైకొనఁ బడియే యున్నవి. మఱియు నిట్లు గ్రహింపఁబడినను "భూతభృన్న చ భూతస్థః" (గీ. 9.5) అను న్యాయము ననుసరించి గీతలయం దున్న సత్య మగు రహస్యము మాత్రమే యన్ని మార్గములకంటెను వేఱుగనే యున్నది. జ్ఞానప్రాప్తి కానిది మోక్షము లేదని సన్న్యాస మార్గమునందున్న (అనఁగా: ఉపనిషత్తుల యందున్న) సిద్ధాంతము గీతలలో లేకపోలేదు. ఇఁక నేమన: దానికి నిష్కామకర్మలతో సం బంధము గలుగఁ జేయుటం బట్టి గీతలయందున్న భాగవతధర్మము లలోనే యతిధర్మములు సహజముగఁ జేరి యున్నవి. అయినను సన్న్యాసమును, వైరాగ్యము నను వానికి కర్మలను వదలిపెట్టుట యని యర్థము చేయక, ఫలాశను వదలుటలోనే నిజమగు వైరాగ్య మును సన్న్యాసమును కలవని చెప్పి, యుపనిషత్కారులయొక్క కర్మ సన్న్యాసముకంటె నిష్కామకర్మయోగమే యధిక శ్రేయస్కరమని గీతాశాస్త్రమునందుఁ దుదకు సిద్ధాంతీకరింపఁ బడినది; వేదవిహితము లగు యజ్ఞయాగాది కర్మలు కేవల యజ్ఞార్థమై యాచరించినను, బంధకములు గావను కర్మఠులగు మీమాంసకులయొక్క మతము

సైతము గీతలకు మాన్యమయినదియే; కాని యజ్ఞ శబ్దార్థమును విస్తృతముగఁ జేసి, ఫలాశను వదలి చేసిన సర్వకర్మలు నొక గొప్ప యజ్ఞమే యగును గాన వర్ణాశ్రమవిహితములగు కర్మల నన్నిటిని నిష్కామబుద్ధితో నెప్పుడును చేయుచుండుటయే ప్రతి మనుష్యున కును కర్తవ్యమని గీతలచే దానియందు బరువు మోపఁబడినది. మఱి యు నుపనిషత్తులలోని సృష్ట్యుత్పత్తి క్రమముకంటె సాంఖ్యులమతము లోని సృష్ట్యుత్పత్తి క్రమము ప్రధానముగ గీతలలో నంగీకరింపఁబడి న్నది. అయినను ప్రకృతి పురుషులవఱకే కాక సృష్ట్యుత్పత్తి క్రమపరం పర యుపనిషత్తులయందున్న నిత్యపరమాత్మ పర్యంతమును తీసికొని పోఁబడినది. అధ్యాత్మజ్ఞానము కేవలము బుద్ధిచేతనే పొందుట క్లేశ మగుటచే, శ్రద్ధచేతను, భక్తిచేతను దానినిఁ బొందవలయు నని వాసుదేవభక్తి యందున్న, లేక, భాగవతధర్మముల యందున్న, లేక, నారాయణీయ ధర్మములయందున్న విధియును గీతలయందు వర్ణింపఁబడినది; కాని యీ విషయములో సైతము భాగవతధర్మము లనే యన్నివిధముల ననుకరింపక వాసుదేవునియందుండి సంకర్ష ణుఁడు, లేక, జీవుఁడు పుట్టెనని భాగవతధర్మములయందున్న జీవుల యొక్క యుత్పత్తిక్రమమును వేదాంతసూత్రానుసారముగ ఖండించి భాగవతధర్మములయందున్న భక్తికిని, ఉపనిషత్తులయందున్న క్షేత్ర క్షేత్రజ్ఞవిషయిక సిద్ధాంతమునకును పూర్ణముగ సంబంధము కలదని నిరూపింపఁబడినది. ఇదిగాక మోక్షప్రాప్తికి మఱియొక సాధనము పాతంజలయోగము; కాని పాతంజలయోగ మనునదియే జీవిత కాలమున ముఖ్యకర్తవ్యమని గీతలలో లేకపోయినను, బుద్ధి సమ మగుటకు నింద్రియనిగ్రహముయొక్క యావశ్యకత యుండుటచే నంతవఱకును పాతంజలయోగమునం దున్న యమనియమాది సాధనముల నుపయోగించుకొమ్మని గీత చెప్పును. సారాంశ మేమి యన: వైదికధర్మములలో మోక్షప్రాప్తికై చెప్పఁబడిన సాధనము లన్నియు కర్మయోగముయొక్క సాంగోపాంగవివేచన చేసినప్పుడు

భగవద్గీతయందు ప్రసంగానుసారముగ కొంచెమో గొప్పయో చెప్ప వలసివచ్చెను; ఈ వర్ణనలన్నియు స్వతంత్రములని చెప్పితిమేని యసంగతత్త్వము సంభవించి గీతలయందున్న సిద్ధాంతము పరస్పర విరుద్ధముగ నున్నట్లు దోఁచును. ఆ యా సాంప్రదాయిక టీకాకారుల వలన నది యధికముగ దృఢ మగుచున్నది; కాని బ్రహ్మజ్ఞానము నకును, భక్తికిని సంబంధము కలుగఁజేసి దాని మూలమున తుదకు కర్మయోగమును సమర్థించుటయే గీతలలోని ముఖ్యప్రతిపాద్యమగు విషయ మని నేను పైనఁ జెప్పినరీతిగ సిద్ధాంతముఁ జేయునెడల నీ విరోధము లేమియు నుండవు. కావున పూర్ణవ్యాపకదృష్టిచే తత్త్వ జ్ఞానముతో భక్తికిని, కర్మయోగమునకును సంబంధమును పూర్ణముగఁ గలుగఁజేయుట యను గీతలయందున్న యలౌకిక చాతుర్య మాశ్చర్యకరము గాక మానదు. ఇతర నదు లెన్ని వచ్చి కలసినను గంగయొక్క స్వరూపము మాఱనట్లు గీతలలో నెన్ని మతముల కలయిక యున్నను వానియందు కర్మయోగ మనునదియే ముఖ్య ముగ ప్రతిపాద్య మను విషయమునకు భంగము రాదు; కాని కర్మ యోగ మీ రీతిని ముఖ్యవిషయ మైనను దానివలెనే మోక్షధర్మము యొక్క రహస్యమును దీనియందు సుందరముగ నిరూపింపఁబడి యున్నది. అందుచే కార్యాకార్య నిర్ణయార్థమై చెప్పఁబడిన గీతా ధర్మమే "న హి ధర్మ స్సుపర్యాప్తో బ్రహ్మణః పదవేదనే" (మ. భా. అశ్వ. 16. 12)- బ్రహ్మపదమును దెలిసికొనుటకును పూర్ణముగ సమర్థ మగును. మఱియు నీ మార్గమున నడుచువారు మోక్షప్రాప్తి కొఱకు మఱియొక యనుష్ఠానము చేయ నక్కఱలేదని యను గీతారంభమునందు భగవంతుఁ డర్జునునకు స్పష్టముగఁ జెప్పెను. వ్యావహారికములగు కర్మల నన్నిటిని త్యజించిననే కాని మోక్షప్రాప్తి గలుగదని చెప్పు సన్న్యాసమార్గీయుల కిది రుచింపదని నే నెఱుంగు దును; కాని దానికి నే చేయు ప్రతిక్రియ యేమియు లేదు. గీతా గ్రంథము సన్న్యాసమార్గమును గాని మఱియొక నివృత్తిపరమగు

మార్గము గాని బోధింపనిది మాత్రమే కాక జ్ఞానము గలిగిన పిదప సైతము కర్మసన్న్యాసము చేయవలయునా? యక్కఱ లేదా? యను శంకకు బ్రహ్మజ్ఞానదృష్టితో సయుక్తికమగు నుత్తరము నిచ్చుటకే ప్రవర్తించినది; కావున, భగవద్గీతకు కూడ సన్న్యాస మియ్యవలయు నను భ్రాంతిలోఁబడక సన్న్యాసమార్గప్రతిపాదకములగు నితర వైదిక గ్రంథములను జూచియే సన్న్యాసమార్గము ననుసరించువారు సంతుష్టులయి యుండవలయును. లేదా, గీతలయందే సన్న్యాసమార్గమును భగవంతుఁడు నిరభిమానబుద్ధితో నిశ్శ్రేయసకర మని చెప్పెనో దానినే సమబుద్ధితో సాంఖ్యమార్గీయులును ననుసరింతురు గాక. ఏలన: సాంఖ్యులును "జగత్తును నడిపింపవలయునని పరమేశ్వరుని యభిప్రాయము. మఱియు నా పరమేశ్వరుఁడును దత్తత్సమయముల యందవతారముల నెత్తుచు నున్నాఁడు గనుక, జ్ఞానము గలిగిన పిదప సైతము నిష్కామబుద్ధితో వ్యావహారికకర్మల నాచరించుచుండ వలయునని భగవంతుఁడు గీతలలో నుపదేశించినమార్గమె కలికాల మందు యుక్తముగ నున్నది" అని చెప్పుటయే వీని నన్నింటిలో నుత్తమ మగు పక్షము.

గీతాధ్యాయ సంగతి యను చతుర్దశ ప్రకరణము.

---

# పంచదశ ప్రకరణము

## ఉపసంహారము

తస్మాత్సర్వేషు కాలేషు మా మనుస్మర యుద్ధ్య చ. *

గీత. 8.7.

గీతలయందున్న యధ్యాయముల సంగతిఁ జూచినను, దాని యందున్న విషయములను మీమాంసకుల పద్ధతితో వేర్వేఱుగ విచారించినను సాంప్రదాయిక టీకాకారులు కర్మయోగమును గౌణముగ నిశ్చయించి గీతల కనేకవిధములఁ జెప్పిన తాత్పర్యము యథార్థము కాదనియు నుపనిషత్తులయందున్న యద్వైతవేదాంతమును భక్తితోఁ గలిపి, దాని మూలమున జ్ఞాని, జ్ఞానము గలిగిన పిదపఁ దన జీవిత కాలము నెట్లు గడపవలసిన దనియుఁ దెలుపుటయే (అనఁగా: జ్ఞాన భక్తులతోఁ గూడిన కర్మయోగమే) గీతలకు నిజమగు తాత్పర్యమగు నని స్పష్టపడుచున్నది. మీమాంసకులు చెప్పిన రీతిని కేవలము శ్రౌత స్మార్త కర్మల నెల్లప్పుడును జేయుచుండుట శాస్త్రోక్తమయినను, జ్ఞాన ప్రాప్తి, లేక, కాఁబోవు నిట్టి తాంత్రికక్రియలచే బుద్ధిమంతునకు సమాధానము కానేరదు. మఱియు నుపనిషత్తులయందున్న ధర్మమును జూచినచో నది కేవలము జ్ఞానమయ మగుటచే నల్పబుద్ధిగల

---

* "కావున సర్వకాలములయందు నన్ను స్మరించుచు యుద్ధముఁ జేయుము." యుద్ధముఁ జేయు మను శబ్దము ప్రసంగము ననుసరించి ప్రయోగింపఁ బడినది. ఈ శబ్దమునకుఁ గేవలము యుద్ధముఁ జేయు మనియే యర్థము కానేరదు. యథాధికారముగఁ గర్మలఁ జేయు మని యెఱుంగవలయును.

వారల కది తెలియుట కష్టము. ఇంతియ కాక దానియందున్న సన్న్యాసమార్గము సైతము లోకసంగ్రహమునకు విరుద్ధముగ నున్నది. కావున బుద్ధి (జ్ఞానము), ప్రేమ (భక్తి), కర్తృత్వము నను వాని నన్నిటిని తగినట్లు కలిపి, మోక్షమునకుఁ బ్రతిబంధము లేనట్లును లోకవ్యవహారము సులలితముగ నడచునట్లును, జ్ఞానమూలకమును, భక్తిప్రధానమును నామరణాంతము నాచరింపఁదగినట్టియు కర్మపర మగునట్టియు, ధర్మమును భగవంతుఁడు గీతలయం దుపదేశించెను. మఱియు దీనియందే కర్మాకర్మశాస్త్రముయొక్క యభిప్రాయమం తయు నున్నది. వేయేల? ఈ ధర్మము నర్జునున కుపదేశించుటకు కర్మా కర్మలయొక్క వివేకమే మూలకారణమైన దని గీతలయొక్క యుప క్రమోపసంహారములను బట్టి స్పష్ట మగుచున్నది. ఏ కర్మనైనను ధర్మ్యమును, పుణ్యమును, న్యాయ్యమును, శ్రేయస్కరమును నని కాని, అధర్మ్యమును, పాపప్రదమును, అన్యాయ్యమును, గర్హ్యము నని కాని చెప్పవచ్చును. అది యెట్లన: ఉపపత్తిని, లేక, రహస్య మును చెప్పక యీ విషయ మీ రీతిగఁ జేయఁబడిన యెడల శుద్ధమ నియు, నింకొక రీతిగఁ జేయఁబడిన యెడల నపరిశుద్ధ మనియు విధిని మాత్రము దెలుపునది యగును. "హింసఁ జేయకుము, చౌర్యమును జేయకుము, సత్యమును జెప్పుము (సత్యం వద, ధర్మం చర) మొద లగు విధానము లట్టివే. మన్వాదిస్మృతులలోను, నుపనిషత్తులలోను నీ పద్ధతి స్పష్టముగ నున్నది; కాని మనుష్యుఁడు జ్ఞానముగల ప్రాణి యగుటచేఁ బూర్వోక్తము లగు కేవల విధులచేఁ బురుషునకుఁ దృప్తి కలుగక పోవుటచే నీ నియమముల విధించుటకుఁ గారణ మేమియో యెఱుంగ వలయు నని స్వభావముగనే తోఁచును. పిదప నీ విచార మును జేసి చేసి యా విధులయం దున్న నిత్యమును మూలము నగు తత్త్వమును శోధించి ప్రకటనఁ జేయును. వ్యావహారికధర్మముల కీ రీతిగ నంతమును జూచి వానియందున్న మూలతత్త్వమును శోధించి బయటికిఁ దీయుట శాస్త్రములు సేయు పని యగుటచే, నీ విషయ

ములయొక్క విధులను సమకూర్చి చెప్పుటయే యాచార సంగ్రహమని చెప్పుదురు. కర్మమార్గముయొక్క యాచార సంగ్రహము స్మృతి గ్రంథముల యందున్నది. భగవద్గీతయం దా యాచారముయొక్క మూలతత్త్వము లేవియో సంవాదాత్మకమగు, లేక, పౌరాణిక మగు పద్ధతితో శాస్త్రీయమగు వివేచనచేయఁబడినది. కాన భగవద్గీతయందు ప్రతిపాద్యమగు విషయమును కర్మయోగము అని మాత్రమే చెప్పుటకంటె కర్మయోగశాస్త్ర మని చెప్పుట మిక్కిలి మంచిది. ఈ యోగశాస్త్ర మను శబ్దము భగవద్గీతలయొక్క యధ్యాయసమాప్తి సూచకమగు సంకల్పమునం దున్నది. గీతలయందున్న యీ కర్మయోగశాస్త్రమునకే పారలౌకికదృష్టిని వదలునట్టి (అనగా: అప్రధాన మనుకొను) పాశ్చాత్యపండితులు సద్వర్తనశాస్త్ర మనియు, నీతిశాస్త్రముయొక్క మూలతత్త్వ మనియు, కర్తవ్యశాస్త్ర మనియు, కార్యాకార్యవ్యవస్థితి యనియు, లేక, సమాజధారణశాస్త్ర మనియు, నా యాలౌకిక నామములఁ బెట్టుచున్నారు. మఱియు వారి మార్గములు నీతియు మీమాంసయు సైతము లౌకికములుగనే యున్నవి; గాననిట్టి పాశ్చాత్యపండితుల గ్రంథముల చదువుకొనిన వారిలో ననేకులు సంస్కృతవాఙ్మయమునందు సదాచరణముయొక్క, లేక, నీతియొక్క కారణముల నెవరును నిర్ణయించి వ్రాయలేదనియు, మన దేశమునందున్న గొప్పతత్త్వజ్ఞానశాస్త్రము వేదాంతమే యనియు, ప్రస్తుతమందున్న మన వేదాంతగ్రంథములను జూచితిమేని సాంసారికకర్మవిషయమై యది తఱచుగ నుదాసీన మగు ననియు, నిఁక కర్మయోగశాస్త్రముయొక్క (అనఁగా: నీతిశాస్త్రముయొక్క) విచారమెక్కడ చేయలేదనియు, వ్యాకరణము, న్యాయము మొదలగ గ్రంథములయందు నీ విచారముండుట శక్యము కాదనియు, స్మృతిగ్రంథములయందు విధులసంగ్రహమే తప్ప మఱేమియు లేదనియు నా కాలమున మన శాస్త్రకారులు మోక్షముయొక్క గహన మగు విచారణలో నిమగ్నులయి యుండుటచే సదాచరణముయొక్క, లేక, నీ

ధర్మములయొక్క మూలతత్త్వమును వివేచించుట మఱచి యుందు రనియు ననుకొనుచున్నారు. మహాభారతమును గాని, భగవద్గీతను గాని బాగుగ పరిశీలనఁ జేయుచుఁ జదువుకొనిన నీ యభిప్రాయ ముండదు; కాని మహాభారత మతి విస్తర మగుటచే దాని నంతయుఁ బూర్ణముగను జదివి, దానియందున్న విషయములను దెలిసికొనుట కష్ట మగును; మఱియు గీత చిన్నదైనను సాంప్రదాయిక టీకాకారుల యొక్క యభిప్రాయానుసారముగ దానియం దొక మోక్షప్రాప్తి యొక్కజ్ఞానమే చెప్పఁబడినదని యెన్నుదురు; కాని యెవరు సన్న్యాసము, కర్మయోగము నను నీ రెండు మార్గములును మనదేశమునందు వేదము లున్నప్పటి నుండియు నాచరణములో నున్నను, సన్న్యాస మార్గమునం దున్న వారికంటె నెప్పు డైనను కర్మయోగము ననుసరించువారి సంఖ్య వేయి రెట్లెక్కువగ నున్నదనియు, పురాణేతిహాసములయందు వర్ణింపఁబడిన మహాపురుషు లెల్లరును, కర్మయోగము నకే పురస్కర్త లనియు ననుకొనరు; కాని వీరిలో నొకరికైనను తమ కర్మయోగశాస్త్రమును సమర్థింప వలయు నను బుద్ధి పుట్టలేదా యేమి? యని యడిగిన, సమస్తజ్ఞానమును బ్రాహ్మణజాతులయం దుండుట చేతను, వేదాంతి బ్రాహ్మణకర్మ నిమిత్తమై యుదాసీనుఁడై యుండుట చేతను, కర్మయోగముమీఁద గ్రంథమేమియు రచియింపఁ బడలేదని సమాధాన మెవరైనను జెప్పినను నదియు నయుక్తికము కానేరదు. కారణ మేమి యన: ఉపనిషత్కాలమందును తదనంతర కాలములందును జనక శ్రీకృష్ణులవంటి జ్ఞానులు క్షత్రియులలో నుండిరి; మఱియు వ్యాసులవారివంటి బుద్ధిమంతులగు బ్రాహ్మణులు గొప్పగొప్పవారైన క్షత్రియులయొక్క యితిహాసముల వ్రాసియున్నారు. ఈ యితిహాసమును వ్రాయుచు నా గొప్పవారి చరిత్రలయందలి రహస్యముల చెప్పనక్కఱ లేదా? యందుమేని యా రహస్య మనఁగా కర్మయోగము, వ్యవహారశాస్త్రమే. కాని దానిని జెప్పుటకే మహాభారతమున ప్రతిస్థలమునందును సూక్ష్మముగ ధర్మాధర్మముల వివేచించి

ప్రతిస్థలమునందును జగత్తుయొక్క ధారణపోషణలకు కారణమయిన సదాచారముయొక్క (అనఁగా: ధర్మములయొక్కయు, మూల తత్త్వములయొక్కయు) మోక్షదృష్టిని వదలక గీతలయందు దూహా పోహలచేఁ జెప్పఁబడినది. ఇతరములగు పురాణములలో సైత మిట్టి యనేకములగు ప్రసంగములు కలవు; కాని గీతయొక్క తేజము నెదుట నితరములగు వివేచనల కాంతులు ప్రసరింపక పోవుటచే భగవద్గీత యనునది కర్మయోగశాస్త్రమునందు ప్రధానగ్రంథమై యున్నది. ఈ కర్మయోగముయొక్క నిజమగు స్వరూపమును పూర్వ ప్రకరణమునందే సవిస్తరముగ నిరూపించియున్నాను. అయినను గీతలయందు వర్ణింపఁబడిన కర్మాకర్మలయొక్క యాధ్యాత్మిక మూలతత్త్వములతో, పాశ్చాత్యపండితులచేఁ బ్రతిపాదింపఁబడిన నీతి యొక్క మూలతత్త్వము లెంత పర్యంతము సంబంధించి యుండునో యని పోల్చుటయే తులనతప్ప గీతాధర్మముల నిరూపణ పూర్ణ మయిన దని చెప్పుటకు సాధ్యముకాదు. ఈ సరిచూచుటలో రెండు పక్షముల యందలి యధ్యాత్మజ్ఞానమును చక్కగఁ బరిశీలింపవలసి వచ్చును; కాని పాశ్చాత్యుల యాధ్యాత్మికజ్ఞానము, మన వేదాంత ములయందలి జ్ఞానముకంటె నెక్కువగ నేఁటివఱకుఁ గనపడుట లేదు. ఈ విషయము నెల్లవారు నొప్పుకొందురు. గావున మన యధ్యాత్మశాస్త్రమును, పాశ్చాత్యుల యధ్యాత్మశాస్త్రమును పోల్చి సరిమాడవలసిన యవసర మేమియు లేదు.* కాన నే శాస్త్రమునకు

---

* వేదాంతము, పాశ్చాత్యతత్త్వజ్ఞానముతో సరిపోల్చుటను ప్రొఫెసర్ 'డాయసు' నమువాఁడు The Elements of Metaphysics అను గ్రంథమున నచ్చు టచ్చుటఁ జేసెను. ఈగ్రంథపు రెండవకూర్పు చివర "On the Philosophy of Vedanta" అను విషయమును గుఱించి 1893 సం॥ ప్రొ. డాయసన్ భరతఖండమునకు వచ్చినప్పుడు బొంబయి రాయలేషియాటిక్ సొసైటీకై యుప న్యాసము విచ్చినవిషయము సైతము తెలుపఁబడినది. ఇంతియకాక The Religion of Philosophy of Upanishads" అను డాయసన్ గ్రంథము సైత మీ విషయము గుఱించి ముఖ్యముగఁ జదువఁదగినది.

శాస్త్రకారు లుపపత్తి చెప్పలేదని యనేకులు దలఁచుచున్నారో యట్టి నీతిశాస్త్రముతో, లేక, కర్మయోగముతోఁ బోల్చి సరిచూచుటయే మిగిలి యున్నది; కాని యీ యొక విషయవిచారమే పూర్ణముగఁ బ్రతిపాదించుటకు మఱియొక గ్రంథము వ్రాయవలసినంత యధిక ముగ నున్నది. అయిన నీ గ్రంథమునం దీ విషయమును సంపూర్ణ ముగ నుపపాదించుటకు నిష్టము లేకున్నను దిగ్దర్శనార్థమై దానియం దున్న కొన్ని ముఖ్యవిషయముల నీ యుపసంహారమునందు వివేచనఁ జేయుచున్నాను.

సదాచరణము, దురాచరణము, ధర్మము, అధర్మము, నను విషయముల విచారించితి మేని యవి జ్ఞానియొక్క కర్మలనే సంబం ధించియుండును. కాన నీతి గలిగియుండుట కేవలము జడకర్మ యందు లేదు. బుద్ధియందే యున్నదని కొంచెము విచారము చేసిన నెల్లవారికిఁ దెలియును. "ధర్మో హి తేషా మధికో విశేషః" — ధర్మాధర్మజ్ఞానమే బుద్ధిమంతులగు మనుష్యులకుఁ గల విశేషము. ఈ పై వచనముయొక్క తాత్పర్య మిదియే. ఒకయెద్దు మనలను పొడు చుటచేతనే యది పోట్లది యనియు, భయంకరమయినది యనియు మనము చెప్పుదుము. నిజమే; కాని యెద్దు పొడిచెనేని దానిపై నెవరును రాజునొద్ద నభియోగము (వ్యాజ్యెము) చేయరు. నదీ ప్రవాహము వచ్చి సస్యము కొట్టుకొనిపోయిన యెడల "అనేకుల కధిక నష్టము గలుగుటచే" నెవ్వరును దానిని దురాచారవంత మని కాని, బందిపోటు చేయునది యని కాని యనరు. దీనిపై ననేకులు "ధర్మాధర్మముల యొక్క నియమములు మనుజునియొక్క వ్యవ హారములనే సంబంధించియుండునని యొకప్పు డంగీకరించిన పిదప మనుజుని కర్మలయందలి మంచి చెడుగుల విచారింపవలసిన వారు, వారికర్మలనుండి మాత్రమే యేల చేయరాదు?" అని ప్రశ్నఁజేయు దురు. ఈ ప్రశ్నకు సమాధానముఁ జెప్పుట యొక కష్టము కాదు.

కారణ మేమి యన: అచేతనవస్తువులు, పశుపక్ష్యాదులునగు మూఢ ప్రాణులయొక్క విషయమును వదలి మనుజుని కృత్యములనే విచారించినను వారిలో సైతము వెఱ్ఱివాండ్రును, నజ్ఞానులును, కొంచెము తప్పు చేసినను లోకమున (అనఁగా: వ్యావహారిక నియమముల యందు) క్షమింపఁబడఁ దగినవారని యెన్నఁబడుదురు గాన, మనుజుని కర్మాకర్మల యందలి మంచిచెడుగులను నిశ్చయించుటకుఁ గర్త బుద్ధిపూర్వకముగ నా కర్మలను జేసినప్పటికిని నా కర్మలయొక్క పరిణామ మతనికి చెందునా? చెందదా? యను విషయమునే ముందుగ విచారింపవలసి వచ్చును. ఒక శ్రీమంతుఁడగు గృహస్థుఁడు తన సంతోషానుసారముగ విశేషమగు దానము నిచ్చుట యేమియుఁ గష్టము కానేరదు; కాని యీ విషయము మంచిదైనను దానియొక్క సత్యము నైతికమూల్యము నిశ్చయింపవలసి వచ్చినప్పుడు సహజముగఁ జేయఁబడిన దానమును మాత్రమే దానిని నిశ్చయింపఁ గూడదు. ఈ శ్రీమంతుఁ డగు గృహస్థుని బుద్ధి నిజముగ శ్రద్ధాయుక్తముగ నున్నదా? లేదా? యని చూడవలసివచ్చును. మఱియు దానిని నిర్ణయించుట కీ దానము సహజముగ చేయఁబడినది కాదనుటకు హేతువు కాన్పింపనిచో నా దానముయొక్క యోగ్యత శ్రద్ధాపూర్వకముగఁ జేయఁబడిన దానముతో సమానముగనున్నదని యెవ రనుకొనరు? నిదానము శంకించుటకైనను యోగ్యమగు కారణ ముండును. సర్వధర్మాధర్మములను వివేచించిన పిదప మహాభారతమందు కడపట నీ విషయ మొక కథయందు సుందరముగ వర్ణింపఁబడినది. యుధిష్ఠిరుఁడు రాజ్యారూఢుఁడైన పిదపఁ జేసిన గొప్ప యశ్వమేధము నందన్నదానముచేతను, ధనదానముచేతను ననేకులు సంతుష్టులై యుధిష్ఠిరుని ప్రశంస చేయ నారంభించిరి. అప్పు డక్కడ కొక ముంగిస (నకులము) వచ్చి "ఈ ప్రశంసయంతయు వ్యర్థము పూర్వమునం దీ కురుక్షేత్రమునందె యుంఛవృత్తిచేతను (అనఁగా: వరిమళ్ళయందలి

గింజల నేఱుకొని తినుటచేతను) కాలము గడపుచుండిన యొక దరిద్ర బ్రాహ్మణుఁడు తానును దారపుత్త్రాదులు ననేక దినము లుపవాసములు చేసి యొక దినమున నతికష్టమున లభించిన పేలపిండి నంతను సమర్పించి చేసిన యతిథియజ్ఞమున కీ యుధిష్ఠిరునియజ్ఞము సమానము కాదు" అని చెప్పెను (మ. భా. అశ్వ. 90). ఈ ముంగిసయొక్క ముట్టెయు సగము శరీరమును బంగారు వికారమైనదిగ నుండెను. యుధిష్ఠిరుని యజ్ఞము యోగ్యత యీ దరిద్రబ్రాహ్మణుఁ డతిథి కిడిన మానెఁడు పేలపిండితో సమానమైనది కాదు. ఏలన: "ఈ బ్రాహ్మణుని యింటిలో నతిథుల యుచ్ఛిష్టమునందు పొరలాడుటచే, నా ముట్టెయు, సగము శరీరమును బంగారువికారమైనది; కాని యుధిష్ఠిరుని యజ్ఞమంటపమునందు పొరలాడుటచే మిగిలిన శరీరము బంగారము కాలేదే" యని యది చెప్పెను. ఇచ్చట కర్మయొక్క బాహ్యపరిణామమును గమనించి యనేకుల కధికహిత మెందులో నున్నదని మనము కొంత విచారించితి మేని యొక యతిథిని తృప్తినొందించుట కంటె ననేక జనుల తృప్తినొందించు యోగ్యత లక్షమడుంగు లధిక మని నిర్ణయింపవచ్చును; కాని కేవలము ధర్మదృష్టిచేఁ గాకపోయినను, నీతిదృష్టిచే మాత్రము చూచిన నీ నిర్ణయము సరిగా నుండునా? ఉండదు. ఏలన: ఎవరికైనను పుష్కలమగు ద్రవ్యమును సంపాదించుట గాని, లేక, లోకోపయోగార్థమై గొప్పగొప్ప పనులు చేయుట గాని సంభవించుట వారి సద్వర్తనము ననుసరించియే యుండదు. మఱియు దరిద్రుఁడగు బ్రాహ్మణునకు గొప్పయజ్ఞముచేయుట సాధ్యముకాని హేతువుచే నతఁడు యథాశక్తిగఁ జేసిన స్వల్పకృత్యము యొక్క నైతికమగు, లేక, ధార్మికమగు మూల్యము తక్కువ యగునేని దరిద్రుఁడు శ్రీమంతునివలె నీతిమంతుఁడును ధార్మికుఁడు నగుటకు నెప్పుడు నాశింపనక్కఱలేదని సిద్ధాంత మగును. ప్రకృత కథయందాత్మస్వాతంత్ర్యానుసారముగ తన బుద్ధిని శుద్ధముగ నుంచుట బ్రాహ్మణుని యధీనమైయుండెను. మఱియు నతని స్వల్పకృత్యమునుబట్టి

యతని పరోపకారబుద్ధి యుధిష్ఠిరుని బుద్ధియంత శుద్ధముగానే యున్న దను విషయమై యేమియు సంశయము లేదు. అతనియొక్కయు అతని స్వల్పకృత్యముయొక్కయు నైతికమూల్యమును యుధిష్ఠిరుని మహాయజ్ఞముయొక్క నైతికమూల్యముతో సమానమైనదే; వేయేల? దరిద్రుఁడును ననేక దినము లుపవాసము చేయువాఁడును, అనఁగ, బ్రాహ్మణుఁ డన్నదానముచే నతిథిప్రాణముల సంరక్షించునపుడు చేసిన స్వార్థత్యాగమునుబట్టి యాతనియొక్క బుద్ధి యెంత శుద్ధ మైనదియు స్పష్టమగుచునే యున్నది. కారణ మేమియన: ధైర్యాది గుణములవలె శుద్ధబుద్ధియొక్క నిజమైనపరీక్ష కష్టకాలమునందే చేయవలయు నను విషయము నెల్లవారును సమ్మతింతురు కాన, సంకటకాలమునందు నైత మెవరియొక్క నైతికమగు సత్యము చలింపదో వాఁడె సత్యమగు నీతిమంతుఁ డని కాంటునువాఁడు నైతము తన నీతిగ్రంథారంభమున జెప్పెను. ముంగిసయొక్క యభిప్రాయమును నిదియే; కాని రాజ్యా రూఢుఁ డయిన పిదప (అనఁగా: సంపత్కాలమునందు) చేయఁబడిన యొక్క యశ్వమేధముచేఁ గాక యంతకు మునుపు (అనఁగా: అప త్కాలమందు, లేక, యనేక ప్రతిబంధకములు కలిగినప్పుడు) బ్రాహ్మ ణుని శుద్ధబుద్ధివలె యుధిష్ఠిరుని శుద్ధబుద్ధి పరీక్షింపఁబడినది; కావున ధర్మాధర్మనిర్ణయముయొక్క పైనఁ జెప్పఁబడిన న్యాయముచేత యుధి ష్ఠిరుఁడు ధార్మికుఁడే యని మహాభారతకారునియొక్క సిద్ధాంతము గాన నతఁడు ముంగిస నిందించుచున్నదని చెప్పెను. అయినను అశ్వమేధము చేయువానికిఁ గలుగు గతియే బ్రాహ్మణునకు లభించిన దని చెప్పఁబడుటచే బ్రాహ్మణుని కర్మసంబంధమైన యోగ్యతయు, యుధిష్ఠిరుని యజ్ఞముకంటె యధికము కాకపోయినను నీ రెంటి యొక్కయు నైతికమును, ధార్మికమునగు మూల్యము, సమమైనదే యని మహాభారతకారుని యభిప్రాయము నిర్వివాదాంశము. వ్యవ హారమునందు నైత మీా న్యాయము ననుసరించియే యొకానొక లక్షాధీశుఁడు ధర్మకృత్యమునకు వేయిరూప్యము లిచ్చినను, దరిద్రుఁ

డొక్క రూప్యము నిచ్చినను నా రెంటియొక్క నైతికమగు మూల్యము సమానమే యని యెన్నుదుము. చందా యను శబ్దమునుండి యీ దృష్టాంత మెవరికైనను క్రొత్తదిగా నెన్నఁగును. మహాభారతమున ముంగిసకథయందుఁ జేయఁబడిన ధర్మములయొక్క వివేచనయందే

సహస్రశక్తిశ్చ శతం శతశక్తి ర్దశాపి చ,
దద్యా దపశ్చ యః శక్త్యా సర్వే తుల్యఫలాః స్మృతాః.
మ.భా.అశ్వ. 90.97

— వేయి గలవాఁడు నూఱును, నూఱు గలవాఁడు పదియును, లేక యెవరయిన యథాశక్తిగ కొంత నీరైన నిచ్చినను వారెల్లరును తుల్యఫలులు, (అనఁగా: సమానమైన యోగ్యత గలవారు) గనే యున్నారు అని యున్నది. మఱియు "పత్రం పుష్పం ఫలం తోయం" (గీ. 9. 26) అను నీ గీతావాక్యముయొక్క తాత్పర్యమును నిదియే. మన ధర్మములయందే కాక, క్రైస్తవధర్మములయందు సైత మీ సిద్ధాంతమే యంగీకరింపఁబడినది. "దైవముచే నెవరికి పుష్కలముగ నీయఁబడినదో వారినుండి యధిక ఫలము నపేక్షించుచున్నారు" (ల్యూక్. 12.48) అని క్రీస్తు వొకచోట చెప్పెను. ఒకదినమున క్రీస్తు దేవాలయమునకు పోఁగా, ధర్మార్థమై ద్రవ్యము సేకరించుటకుఁ బ్రారంభించిరి. అప్పు డచ్చో నత్యంత దరిద్రురాలగు నొక విధవ తనవద్ద నున్న రెండుపైసలను ధర్మార్థ మీయగాఁ జూచి "యీమె యితరుల యందఱికంటె గొప్పధర్మము నాచరించిన"దని క్రీస్తు తాను చెప్పినట్లు బైబిలులో మఱియొకచోట చెప్పఁబడినది (మార్కు.12.43 మఱియు 44). కర్మయొక్క యోగ్యత కర్తయొక్క బుద్ధింబట్టి నిశ్చయింపవలసి వచ్చును. కర్తయొక్క బుద్ధి శుద్ధ మగునేని చిన్నకర్మ యైనను గొప్ప కర్మలకంటె ననేక సమయములయందు గొప్పకర్మల యొక్క నైతికమగు యోగ్యతను పొందునను విషయమును క్రీస్తు సైత మొప్పుకొని యున్నాఁడని దీనినిబట్టి స్పష్ట మగును. విరుద్ధపక్షము

నందు (అనఁగా: బుద్ధి శుద్ధము కానప్పుడు) కర్మలయొక్క నైతిక మూల్యముపై దాని కేమి మార్పు సంఘటిల్లునో విచారించితి మేని హత్యచేయుట యను కార్య మొక్కటియే కాన్పించును; కాని తన్నుఁ జంపవచ్చునప్పుడు స్వసంరక్షణార్థమై చంపుటయు, నొకానొక శ్రీమంతుఁ డగు పాంథుని ద్రవ్యమును దోఁచుకొనుటకై మార్గమధ్యమున వానిం జంపుటయు నను నీ రెండు విషయములును నైతికదృష్టిచే సమములైనవి కావు. జర్మను పండితుఁడగు షిల్లర్ అనువాఁ డీ విధ మగు నొక ప్రసంగమును తనయొక్క 'విలియం టెల్' అను పేరుగల నాటకముయొక్క కట్టకడపట వర్ణించెను. మఱియు నచ్చో నతఁడు బుద్ధియొక్క శుద్ధాశుద్ధతలంబట్టి బాహ్యమున సమానములయిన రెండు కృత్యములయందును గలదని చెప్పిన భేదమే స్వార్థత్యాగ మును, స్వార్థహత్యయు నను వానిలో నున్న భేదము. కర్మలు చిన్న వైనను, సరిసమానము లైనను వానిలో నైతికదృష్టిచే సంభవించు భేదమే హేతుభూతమగు కర్మచే సంభవించుచున్నదని దీనివలన స్పష్ట మగుచున్నది. ఈ హేతువునే, ఉద్దేశము, వాసన, బుద్ధి యని చెప్పుచున్నారు. కారణ మేమియన: బుద్ధిశబ్దమునకు వ్యవసాయాత్మక మగు నింద్రియ మని శాస్త్రీయార్థ మైనను, జ్ఞానము, వాసన, హేతువు నను నవి యన్నియు బుద్ధీంద్రియముయొక్క వ్యాపారఫల ములే యగుటచే వానిని సైతము బుద్ధి యని చెప్పుట వాడుకయై యున్నది గాన, స్థితప్రజ్ఞునియొక్క సామ్యబుద్ధియందు వ్యవసాయా త్మకబుద్ధియొక్క శుద్ధతయు చేరునని పూర్వమునందు చెప్పఁబడినది. యుద్ధము చేయుటచే నెంత జనమునకు కల్యాణము గలుగునో యెందఱకు నెంత కష్టము నష్టము గలుగునో చూడు మని యర్జును నకు భగవంతుఁడు సెప్పలేదు. పైఁగా, భగవంతుఁడు "నీవు యుద్ధము చేయుటచే భీష్ముఁడు చచ్చునా? ద్రోణుఁడు చచ్చునా? యను ప్రశ్న గౌణ" మనియు, "నీ వే బుద్ధితో యుద్ధము చేయుటకు నిలువఁబడియున్నా వనునది ముఖ్యప్రశ్న" యనియు, "నీయొక్క

బుద్ధి స్థితప్రజ్ఞునిబుద్ధివలె నున్నచో, ఆ శుద్ధము, పవిత్రము నగు బుద్ధితో నీయొక్క కర్తవ్యములను జేయుచుండ భీష్ముఁడు గాని, ద్రోణుఁడు గాని మృతు లైనను ఆ పాపము నీకు తగుల దనియు, భీష్ముని చంపుట యను ఫలమును మనస్సున నునిచికొని, దాని కై నీవు యుద్ధము చేయుట లేదనియు, నీకు జన్మము మొదలుకొని హక్కుగా లభించియుండు రాజ్యముయొక్క విభాగమును నీ వడిగితి వనియు, నింతియ కాక యుద్ధము తప్పిపోవునంత పనిఁ జేసినను సామోపచార ముపయోగింపక పోయె ననియు, శిష్టత్వము, సాధుత్వము నను నీ మార్గములచే కార్యము నెఱవేఱనినాఁ డుపాయాంతర మేమియు లేకపోవుటచే నీవు యుద్ధకార్యమును జేయుటలో దోషమే లేదనియు, పైఁగా దుష్టునియొద్దనుండి తన ధర్మ్యమగు హక్కును నిలుపుకొనుటకై బ్రాహ్మణునివలె బిచ్చమెత్తుచుండక యావశ్యక మగునేని క్షాత్రధర్మము ననుసరించి, లోకసంగ్రహార్థమై యా హక్కును యుద్ధముచే సంపాదించుకొనుట నీకు కర్తవ్యమే యగు ననియు చెప్పెను (మ.భా.ఉ. 28 మఱియు 72; వనపర్వ. 33.58. మఱియు 50). భగవంతుని శ్రేష్ఠమగు నీ వాదము ననుసరించియే వ్యాసులవారు శాంతిపర్వమునందు యుధిష్ఠిరునకు సమాధానమును గలుగఁ జేసిరి (శాం. అ. 32. మఱియు 33); కాని కర్మాకర్మనిర్ణయార్థమై బుద్ధి యీ తీరున శ్రేష్ఠమని యంగీకరించినను శుద్ధబుద్ధి యనఁగా నేమియో యిప్పుడు చెప్పుట యావశ్యక మగును. కారణ మేమియన: మనస్సును బుద్ధియు ననునవి ప్రకృతియొక్క వికారములు. అవి పుట్టుకలోనే సాత్త్వికములు, రాజసములు, తామసములని మూఁడువిధములు. కావున బుద్ధికంటెను పరమందున్న నిత్యమగు నాత్మయొక్క సర్వభూతములయందును నొకటిగ నుండు స్వరూపమును దెలిసికొని యీ రీతిగనే కార్యాకార్యములు నిర్ణయించు బుద్ధినే యీ శాస్త్రమునందు శుద్ధము, లేక, సాత్త్విక మని చెప్ప వలయు నని గీతయందు చెప్పఁబడినది. ఈ సాత్త్వికబుద్ధినే సామ్య

బుద్ధి యనియు ననెదరు. మఱియు దానియం దున్న 'సామ్య' శబ్దమునకు సర్వభూతాంతర్గతమగు నాత్మయొక్క యేకత్వమును సామ్యమును దెలిసికొనునది యని యర్థము. ఏ బుద్ధి యీ సామ్యమును దెలిసికొనదో యది శుద్ధమును సాత్త్వికమును కాదు. నీతి నిర్ణయ మను విషయమునందు సామ్యబుద్ధి యీ రీతిగ శ్రేష్ఠ మని యంగీకరించిన పిదప బుద్ధియొక్క యీ సమతను లేక సామ్యము నెట్లు తెలిసికొనవలయు నను ప్రశ్న పిదప వెలువడును. కారణ మేమి యన: బుద్ధి యనునది యంతరింద్రియ మగుటచే నది మంచిదై యున్నదో చెడుదై యున్నదో నేత్రములకు గోచరము కాదు. కావున బుద్ధిసమముగను, శుద్ధముగను నున్నదా? లేదా? యని పరీక్షించుటకు మొదట మనుజుని బాహ్యాచారముల వైపునకు దృష్టిని వ్యాపింపఁ జేయవలయును; లేనియెడల నాయొక్క బుద్ధి మంచిది యని నోటితో చెప్పి కావలసిన పను లన్నియు చేయుటకు నారంభించును. కావున నిజమగు బ్రహ్మజ్ఞాని యని యతనియొక్క స్వభావమునుండియె తెలిసికొనవలయును. మాటలు మాత్రమే చెప్పువాఁడె యైనచో నతఁడు నిజమగు సాధువు కాఁడని శాస్త్రము నందు సిద్ధాంతీకరింపఁ బడినది. భగవద్గీతలయందు స్థితప్రజ్ఞుని యొక్క, లేక, భగవద్భక్తునియొక్క లక్షణములను జెప్పుచు నట్టి భక్తుఁడు జగత్తునం దితరులతో నెట్లు సంచరింపవలయునో యీ విషయమే ముఖ్యముగ వర్ణింపఁబడినది; మఱియు పదుమూఁడవ యధ్యాయమునందు జ్ఞానముయొక్క వ్యాఖ్యానము సైత మా యుద్దేశముతోడనే చేయఁబడినది (అనఁగా: జ్ఞానముయొక్క స్వభావముపై నేమి పరిణామము సంఘటిల్లునో చెప్పఁబడినది). బ్రహ్మజ్ఞానమును బొత్తిగ వదలివేయ వలయునని గీతలు చెప్పుట లే దని యిందువలన స్పష్టముగఁ గన్పట్టును. కాని యొకానొకనియొక్క బుద్ధి సమముగ నున్నదా? లేదా, యని పరీక్షించుటకు నతని బాహ్యకర్మలును నడతయు ముఖ్యసాధనములు. సంకటకాలమున

నవి మిక్కిలి ముఖ్యసాధనములు; కావున నొక బాహ్యవర్తనమును బట్టియే పొరపాటు లేకుండ నీతిమత్తను పరీక్షించుట సాధ్యము కాదనియు, గుర్తు నుంచుకొనవలయును. కారణమేమి యన: ఆ యా సమయములయందు బాహ్యకర్మ యల్పమయినను దానియొక్క నైతికమగు మూల్యము గొప్పదియే యగునని నకులోపాఖ్యానముం బట్టి సిద్ధ మగుచున్నది. కావున బాహ్యకర్మ కొలఁదిదియైనను గొప్పది యైనను, ఒకనికి సుఖకరమైనను అనేకులకు సుఖము నిచ్చున దైనను బుద్ధి పూర్తిగ శుద్ధ మగుటకు నింతకంటె నెక్కువ మహత్త్వము నిచ్చి యీ బాహ్యకర్మలను బట్టి మాత్రము విచారించిన నీతిమత్తకు యోగ్యమగు నిర్ణయము కానేరదని మన శాస్త్రకారులు నిశ్చయించిరి. మఱియు దీనింబట్టియే కర్మకంటె బుద్ధి శ్రేష్ఠము (గీ. 2. 49) అని గీతలోని కర్మయోగమునందు సమము, శుద్ధము నగు బుద్ధికే (అనఁగా: వాసనకే) ప్రాధాన్య మియ్యఁబడినది. గీతకంటె నర్వాచీనమగు నారదపాంచరాత్రము లనుపేరు గల భాగవతధర్మముల యందున్న యొక గ్రంథమునందు మార్కండేయులు—

మానసం ప్రాణినా మేవ సర్వ కర్మైకకారణమ్,
మనోనురూపం వాక్యం చ వాక్యేన ప్రస్ఫుటం మనః.
నా. పం. 1.7.18.

— లోకులయొక్క సర్వకర్మలకును మనస్సే యొక (మూల) కారణము. మాట యీ మనస్సు ననుసరించి యుండును. సంభాషణను బట్టియే మనస్సు ప్రకట మగును అని నారదునకుఁ జెప్పిరి. మనో నిశ్చయము గలిగిన పిదప సర్వకర్మలును సంఘటిల్లుచున్న వని సారాంశము. కావున కర్మాకర్మల నిర్ణయించుటకు గీతలయందున్న శుద్ధబుద్ధియొక్క సిద్ధాంతమునే బౌద్ధగ్రంథకారులు సైతము స్వీకరించిరి. ఉదాహరణము: ధమ్మపద మను పేరుగల బౌద్ధులయొక్క ప్రసిద్ధమగు నీతిగ్రంథారంభమున—

మనోపుబ్బంగమా ధమ్మా మనో సేట్ఠా మనోమయా,
మనసాచేపదుట్ఠేన భాసతి వా కరోతి వా,
తతో న దుక్ఖ మన్వేతి చక్కం ను వహతో పదం.

— మొదట మనోవ్యాపారము ననంతరమున ధర్మాధర్మముల యాచరణయును సంభవించును. గాన నీ విషయమునందు మనస్సే ముఖ్యము; మనస్సే శ్రేష్ఠ మగుటచే నీ సర్వధర్మములును మనోమయములే యని చెప్పవలయును. కావున కర్తయొక్క మనస్సెంత శుద్ధము గాని, దుష్టము గాని యగునో భాషణమునకును, కర్మకును నంత మంచిచెడుగులు సంఘటిల్లును గాన వాని ననుసరించియే యతనికి, సుఖదుఃఖములును ప్రాప్తము లగు నని యున్నది*. అటులే యొక్క పర్యాయము పూర్తిగ శుద్ధమును నిష్కామము నయిన మనస్సుగల స్థితప్రజ్ఞుఁడగు పురుషుని వలన నే పాపమును సంభవించుటకు శక్యము కాదు. అన్ని పనులను చేసినను నతనికి పాపపుణ్యము లంటవని యిందలి సారాంశము. దీనినిబట్టి యుపనిషత్తులలోను, గీత యందును జేయఁబడిన రెండవ యనుమానము సైతము (కౌషీ. 3.1; గీ. 18. 17) బౌద్ధులకు సమ్మతమే యని స్పష్ట మగును. కావున నర్హతుఁడు (అనఁగా: పూర్ణావస్థ నొందిన పురుషుఁడు) తప్పక శుద్ధుఁడును, నిష్పాపుఁడు నయి యుండునని బౌద్ధగ్రంథములలో ననేక స్థలములయందు చెప్పఁబడినది (ధమ్మపద. 294; 295; మిళింద ప్రశ్న. 4.5.7).

* ఈ పాళీశ్లోకమున కనేకులు వేర్వే ఱర్థములను జేయుచున్నారు; కాని యీ శ్లోకము కర్మాకర్మవిర్ణయార్థమై మన స్సెట్లున్నదని చూడవలయుననే సిద్ధాంతము ననుసరించి రచియింపఁబడినదని మా యభిప్రాయము. మాక్సుముల్లరుగారొనర్చిన ధమ్మపదముయొక్క యాంగ్లేయభాషాంతరీకరణమునం దీ శ్లోకము మీఁది టిప్పణి చూడుఁడు. S. B. E. Vol. X. pp. 3,4.

నీతినిర్ణయ మను కార్యమును సదసద్వివేకదేవతకే స్వాధీనము చేయు పాశ్చాత్యుల యాధిదైవిక పద్ధతియు, "అనేకుల కధికహితము దీనిలో నున్నది" యని బాహ్యపరీక్షమాత్రము చేసి నీతినిర్ణయించు నట్టి పాశ్చాత్యాధిభౌతికపద్ధతియు నను నీ రెండును నేకదేశీయము లును, శాస్త్రీయములు నగు కట్టుబాట్లను బట్టియు పూర్ణము లనియు పై వివేచనను బట్టి సహజముగఁ గాన్పించును. కారణ మేమియన: సదసద్వివేక మను నొకదేవత గాని, వస్తువుగాని లేదు. వ్యవసాయా త్మికబుద్ధి యందే యది యంతర్భావము నొందును. మఱియు నటు లంతర్భావమును జేయుదు మేని ప్రతి పురుషునియొక్క స్వభావమును బట్టి యతని సదసద్వివేకబుద్ధి సాత్త్వికము, రాజసము, తామసము నగును. కాన దానియొక్క కార్యాకార్యనిర్ణయ మెల్లప్పుడును తప్పు లేనిదిగ నుండుటకు వీలులేదు. మఱియు "అనేకుల కధికసుఖము" దేనియం దున్నదో పరిశీలించునట్టి భౌతికనికషోపలముచేత మాత్రమే నీతిమత్తను సిద్ధాంతీకరించితి మేని కర్మలను చేయు పురుషుని యొక్క బుద్ధి నేమియు విచారించినటుల కానేరదు. ఒకానొకఁడు తన చౌర్యముయొక్కయు వ్యభిచారముయొక్కయు ననిష్టములగు బాహ్యపరిణామములను మాత్రము శక్యమగునంత తగ్గించుటకు, లేక, రహస్యముగ నుంచుటకు మొదటనుండియు జాగరూకతతోనుండి యేదైనను కుటిలమగు పన్నుగడను జేసె నేని, యతని దుష్కృ త్యము లాధిభౌతిక నీతిదృష్టిచే నంతగ నిందింపఁదగినవి కావనిచెప్ప వలసి వచ్చును. కావున కేవల వైదికధర్మమునందే కాయిక, వాచిక మానసికశుద్ధతయొక్క యావశ్యకత వర్ణింపఁబడలేదు (మను.12.3-8;9 29). ఇఁక నేమియన: బైబిలులో సైతము వ్యభిచారమను పాపము కేవల కాయికమే యనక పరస్త్రీని పురుషుఁడును, పరపురుషుని స్త్రీ యును జూచుటయు వ్యభిచారమునందే గణింపఁబడినది (మాత్థ్యూ. 5.28); మఱియు బౌద్ధధర్మమునందు సైతము కేవల కాయికమేకాక

వాచికమును మానసికమును నయిన శుద్ధత సైత మవశ్య ముండ వలయునని చెప్పఁబడినది (ధమ్మపద. 96-291 చూడు). మఱియు గ్రీనుదొర యింతకంటె నధికముగ విచారించి, "బాహ్యసుఖ మను నదియే పరమసాధ్య మని యందుమేని ప్రతి మనుజుఁడును ప్రతి రాష్ట్రమును నా పరమసాధ్యమగు రాష్ట్రసుఖమును సంపాదించుకొను నిమిత్తమయి ప్రయత్నము చేయుటచే నొండొరులకు కలహము సంభ వింపవచ్చు"నని చెప్పుచున్నాఁడు. బాహ్యసుఖము నొందుటకు సంబం ధించు బాహ్యసాధనములు తఱచుగ నితరుల సుఖమును లోపింప చేయనీయక మనకు లభ్యపఱచుకొనుట దుర్లభము. సామ్యబుద్ధియే పరమసాధ్య మని యందు మేని దాని నిమిత్తమై ప్రయత్నించినప్పు డట్టి యుపద్రవ ముండదు. ఏలన: ఈ యంతస్సుఖ మాత్మవశము (అనఁగా: ఇతరుని సుఖమున కడ్డురాక యెవరి సుఖమును వారు పొందుటకు శక్యమగును). ఇంతియే కాక యాత్మైక్యమును దెలిసి కొని సర్వభూతములయందును సమముగఁ బ్రవర్తించు స్వభావము గల వారియొక్క చేతిమీఁదుగ రహస్యముగఁ గాని, బహిరంగముగఁ గాని యే విధమగు దుష్కృత్యమును చేయుట సంభవింపదు గాన "అనేకుల కధిక సుఖము గలుగు పని నెప్పుడును విచారించి చేయు చుండుము", అనియు నతనికి చెప్పవలసిన యావశ్యకత యుండదు. కారణ మేమి యన: మనుజుఁ డనఁగనే, యే కార్యమునైనను సారా సారమును విచారించి చేయువాఁడని యర్థ మగుచున్నది. నైతికకర్మ యొక్క నిర్ణయముకొఱకు మాత్రము సారాసారవిచార మావశ్య కము కాదు. ఈ సారాసారములను విచారించునప్పు డంతఃకరణ మెటు లుండవలయునో దెలిసికొనుట యొక గొప్ప విషయము. కారణ మేమి యన: ఎల్లవారి యంతఃకరణములు నొకవిధముగనుం డవు. కావున నంతఃకరణమందుఁ దప్పక సామ్యబుద్ధి స్ఫురించు చునే యుండవలయు నని చెప్పితి మేని, యనేకుల హితముయొక్క

సారాసారవిచారమే కాక, భూతములయొక్క గాని, లేక, ప్రాణి మాత్రముయొక్క గాని హితమునందలి సారాసారమును సైతము విచారింపు మని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. మానవజాతియందున్న ప్రాణుల సంబంధములోనే కాక, నోరులేని జంతువుల సంబంధములో సైతము మనుష్యునకు కొంత కర్తవ్య ముండును; గాన దానిని కార్యాకార్యశాస్త్రములయందుఁ జేర్పవలయు నని పాశ్చాత్యపండితులు సైత మిప్పుడు చెప్ప నారంభించిరి. మఱియు నీ వ్యాపకమగు దృష్టితో చూచిన, ననేకుల కధికహిత మను దానికంటె సర్వభూతహిత మను శబ్దమే యధిక వ్యాపకమైనది గాన సామ్యబుద్ధియందివి యన్నియుఁ జేరును. ఒకానొక బుద్ధి శుద్ధమును, సమమును కాలేదని యనినచో "అనేకుల కధికసుఖము" ఏ పనివలనఁ గలుగునదియు నిశ్చయించుట యను పని యతనికి తప్పులేకుండఁగ నేర్పుఱచు శక్తి యున్నను నీతి ధర్మమువైపున కతఁడు ప్రవర్తించుటకు వీలులేదు. కారణ మేమియన: ఏ సత్కార్యము వైపునకైనను ప్రవర్తించుట యను పని శుద్ధమగు మనస్సు చేయునదియే యయి యున్నది. శుద్ధము గాని మనస్సు చేయునది గాదు. శుద్ధమనస్సు లేనిది మనుజునియొక్క స్వభావమును, లేక, మనస్సును పరిశీలించుటకు నీకేమియు నవసరములేదు. అతఁడు చేసిన నిర్ణయము సరిగ నుండె నేని యంతమాత్రముచేఁ గర్తవ్యాకర్తవ్యములయొక్క నిర్ణయ మగుననియు, నీ కార్యము నెఱవేఱునని యెవరైనఁ జెప్పినను, వారును సత్యము నాడినవారు కారు. కారణ మేమి యన: సుఖదుఃఖములన నేమైనదియు, సామాన్యముగ నందఱకును దెలిసినను నన్నివిధములగు సుఖదుఃఖముల తారతమ్యమును. విచారించునప్పుడే సుఖదుఃఖముల కెంత విలువ యున్నదియు మొదటనే నిశ్చయింపవలసివచ్చును. మఱియు నీ పని చేయుటకు వేఁడిని కొల్చు యంత్రమువంటి యొక్క బాహ్యసాధన మిప్పుడు గాని యిటు పిమ్మటఁ గాని యుండుట సంభవింపదు; కాన సుఖదుఃఖములకు తగిన విలువను నిశ్చయించుట యను పని ప్రతి

మనుజుఁడును తుదకుఁ దన మనస్సుచేతనే చేయవలసివచ్చును; కాని నావంటివాఁడే యితరుఁ డను నాత్మౌపమ్యబుద్ధి మనస్సున రూఢము కానివాఁడు పరుల సుఖదుఃఖముల తీవ్రతను బాగుగఁ దెలిసికొనుటు కెప్పుడును వీలులేదు; గాన నీ సుఖదుఃఖములయొక్క సత్యమగు మూల్యమును చెప్పుట కతనికి సాధ్యము కాదు; మఱియుఁ దార తమ్య నిర్ణయమునకై యతనిచేఁ జేయఁబడిన సుఖదుఃఖముల తర గతులలోనే సహజముగ భేదములుగలది గాన, దానింబట్టి తుద వఱకును, నాతనిచేఁ జేయఁబడిన లెక్కయంతయు తప్పక మానదు. కావున ననేకుల కధికసుఖమును జూచుట యను వాక్యమునందున్న 'చూచుట' యను క్రియ కీ లెక్కను చేయుట యని యర్థము చేయక యాత్మౌపమ్యము గలిగినదియు, నిర్లోభమయినదియు, బుద్ధితో ననేకులగు పరులయొక్క సుఖముల యందలి యథార్థమగు మూల్య మును మొదట నిశ్చయించుట యని యర్థముఁ జేసినచో, సర్వ భూతములయందు సమానము శుద్ధమునగు బుద్ధియే నీతిమత్తకు నిజమగు బీజ మగునని తుదకుఁ జెప్పవలసివచ్చును. నీతిమత్త యను నది నిర్మమము, శుద్ధము, ప్రేమపూర్ణము, సమము, సత్త్వశీలము నగు నంతఃకరణముయొక్క ధర్మమయి యున్నది. కేవలము సారా సారవిచారముయొక్క ఫలము గాదు. కావుననే భారతయుద్ధానంతర మందు ధర్మరాజు రాజ్యము నేలెను గాన పుత్త్రిసియొక్క పరా క్రమముచేఁ గృతార్థురాలయిన కుంతి, ధృతరాష్ట్రునితో, వానప్రస్థా శ్రమధర్మము నాచరించుటకై యడవికిఁ బోవునప్పు డనేకుల కధిక హితమును జేయుచుండుమని చెప్పక "మనస్తే మహ దస్తు చ"— నాయనా! నీ యొక్క మనస్సు తప్పక గొప్పది యగుఁ గాక (మ. భా.అ(శ. 17.21) యనియే తుదకుఁ జెప్పెను. అనేకుల కధికసుఖము దేనివలనఁ గలుగునో విచారించుట మాత్రమే నీతిమత్త కొక సత్య మును, శాస్త్రీయమును, సులభము నైన పరీక్ష యని పాశ్చాత్య పండితులు చెప్పుటచేఁ దనవలెనే యితరులందఱును శుద్ధమనస్సు

గలవారయి యున్నారని మొదట నొప్పుకొని పిదప నీతియొక్క నిర్ణయము నే రీతిగ చేయవలసినదియు చెప్పినట్లు కాన్పించుచున్నది; కాని యీ పండితు లొప్పుకొనిన విషయము సత్యము కాదు; కావున దానియందున్న నీతి నిర్ణయతత్త్వము లేకదేశీయములును నపూర్ణములు నగును. వారియొక్క వ్రాతలఁ బట్టియే మనస్సు స్వభావముగ మిక్కిలి పరిశుద్ధమైనదియు, పాపమునుండి భయపడునదియు నగునట్లు ప్రయత్నించుటకు మాఱుగ నెవరైనను తమ కర్మలయొక్క బాహ్యపరిణామమును పరిశీలించిన చాలు నని భ్రమ పుట్టును. మఱియు స్వార్థపరత్వమును వదలనివారు, యంత్రధారులు, శుష్కతర్కములతో వాదించువారు, వేషధారులు నగుదురు (గీ. 3.6). కావున మొత్తముపై సమాజమునకు నా రీతిగ నష్టము గలుగవచ్చును. కావున నీతిమత్తయను నికషోపలముతోఁ బరీక్షించినను గర్మయొక్క కేవలబాహ్యపరిణామమును విచారించుట యను మార్గ మపూర్ణమును కృపణము నగునని నిశ్చయించి బాహ్యకర్మలను బట్టియే వ్యక్తమగునదియు, సంకట సమయమునందు సైతము దృఢముగ నుండునదియు నగు సామ్యబుద్ధినే యీ కర్మయోగమునందు తుదకు శరణు నొందవలయును. జ్ఞానయుక్తమును, సంపూర్ణము నగు శుద్ధబుద్ధి యనునదియే సదాచరణమునకు సత్యమగు నికషోపలముగ నున్నది యని గీతలయందు చేయఁబడిన సిద్ధాంతమే పాశ్చాత్యాధిభౌతికాధిదైవికమతములకంటెను మిక్కిలి నిర్దోషముగ నున్నది యని నేను నిశ్చయించుచున్నాఁడను.

నీతిశాస్త్రముపై నున్న యాధిభౌతికములు నాధిదైవికములు నయిన గ్రంథములను వదలి యాధ్యాత్మికదృష్టిచే నీతిని విచారణ చేయు పాశ్చాత్యపండితుల గ్రంథములఁ జూచితి మేని నీతిమత్తను నిర్ణయించుట యను కార్యములో గీతలయందు వలె వానియందును కర్మకంటె శుద్ధమగుబుద్ధికే, విశేషప్రాధాన్య మీయఁబడినట్లు స్పష్ట

ముగఁ గాన్పించును. ప్రసిద్ధుఁడగు కాం టను జర్మనుతత్త్వవేత్త వచించిన నీతియొక్కయు నాధ్యాత్మిక మగు మూలతత్త్వమును రెండవ నీతిశాస్త్రముపై నున్న యితర గ్రంథముల నుదాహరణముగఁ గైకొనుము. కాంతు * సర్వభూతాత్మైక్యముయొక్క సిద్ధాంతమును వ్రాయకపోయినను, వ్యవసాయాత్మకము, వాసనాత్మకము నగు బుద్ధినే సూక్ష్మముగ విచారించి, 1. యేకర్మయొక్క నైతికమూల్యము నైనను నాకర్మవలన నెంతమంది కెంత సుఖము గలుగునని బాహ్య పరిణామముఁ బట్టియే నిశ్చయింపక కర్మను చేయువానియొక్క వాసన యెంత శుద్ధమైనదియు పరిశీలించియే నిశ్చయింపవలసినది యనియు, 2. మనుజునియొక్క యీ వాసన, లేక, వాసనాత్మక మగు నీ బుద్ధి యింద్రియ సుఖములయందు లోభము గలది గాక, యెల్లప్పుడును శుద్ధమగు (వ్యవసాయాత్మక) బుద్ధియొక్క యాజ్ఞ యందు (అనఁగా: నీ బుద్ధిచే నిశ్చయింపఁబడిన కర్తవ్యాకర్తవ్యముల యొక్క నియమానుసారముగ) నడుచుచు నుండెనేని యది శుద్ధ మును, పవిత్రమును, స్వతంత్రము నని యెఱుంగవలయు ననియు, 3. ఇంద్రియజయమును చేయుటచే నీవిధముగ చిత్తశుద్ధి గల్గినవాని కే విధమైన నీతి నియమమును విధింప నవసరము లేదనియు, నీ నీతినిబంధనము సామాన్యమనుజుల నిమిత్త మేర్పడిన దనియు, 4. ఇట్లు చిత్తశుద్ధి గలగిన పిదపఁ దోఁచిన పని తనవలెనె యితరులును చేసినచో నేమి యగునో యని విచారించి చెప్పవలసివచ్చు ననియు, 5. వాసనయొక్క యీ శుద్ధతకును స్వతంత్రతకు నుపపత్తి కర్మసృష్టిని

---

* Kant's Theory of Ethics, trans. by Abbott 6th Ed. ఈ పుస్తకమునం దీ సిద్ధాంతములన్నియు వ్రాయఁబడియున్నవి. మొదటి సిద్ధాంతము 10, 12, 16 మఱియు 24 వ పేజీయందును, రెండవది 112 మఱియు 115 పేజీలయందును, మూఁడవది 312, 58, 121, మఱియు 290 పేజీలయందును, నాల్గవది 18, 35, 55 మఱియు 119 పేజీలయందును, మఱియు నైదవది 70, 73 మఱియు 80 పేజీలయందును చదువరులకు నీ విషయము గాన్పించును.

వదలి బ్రహ్మసృష్టిలోనికిఁ బ్రవేశించినఁ దప్ప కుదరనేర దనియుఁ నిశ్చయించెను; కాని యాత్మయు బ్రహ్మసృష్టియు నను వాని సంబంధములో కాంటు విచార మపూర్ణముగ నున్నది. గ్రీనుదొర, కాంటు దొరయొక్క మార్గము ననుసరించువాఁడే యైనను "తన నీతిశాస్త్రోపోద్ఘాతమునందు" బ్రహ్మాండమునం దగమ్యములగు తత్త్వములే యాత్మస్వరూపముతో మనుజుని దేహమునం దంశములయిన వని మొదట నిరూపించి, పిదప మనుజుని శరీరమునందున్న నిత్యము స్వతంత్రము నగు తత్త్వమునకు (అనఁగా: ఆత్మకు)ఁ దనయొక్క సర్వభూతాంతర్గతమగు సామాజిక పూర్ణస్వరూపమును బొందవలయు నను నిచ్ఛయే, మనుజుని సదాచరణము వైపునకు ప్రవర్తింపఁ జేయుచున్నది యనియు, దానియందే మనుజునకు నిత్యము స్థిరము నగు కల్యాణము గలదనియు, విషయసుఖ మనిత్య మనియు ప్రతిపాదించెను. * కాంటు, గ్రీ నను నిరువురి దృష్టియు నాధ్యాత్మికమే యైనను వ్యవసాయాత్మకమగు వ్యాపారమునందే చిక్కుపడి యుండక, కర్మాకర్మవివేచనయొక్కయు, వాసనాస్వాతంత్ర్యము యొక్కయు నుపపత్తిని గ్రీను, పిండమందును బ్రహ్మాండమందును కలిసి, యేకత్వముతో వ్యక్తమగు శుద్ధమైన యాత్మ స్వరూపము వద్దకుఁ గైకొని పోయి, వాదమునకు వదలినటులఁ గాన్పించునని యిందలి సారాంశము. కాంటు, గ్రీను లను నాధ్యాత్మికులగు పాశ్చాత్యనీతిశాస్త్రజ్ఞులయొక్క యీ సిద్ధాంతమును 1. బాహ్యకర్మలకంటె కర్తయొక్క (వాసనాత్మకమగు) బుద్ధియే శ్రేష్ఠమైన దనియు, 2. వాసనాత్మకబుద్ధి యాత్మనిష్ఠమై, నిస్సంశయము సమము నగునేని తనయంతటనే పవిత్రమును శుద్ధము నగు ననియు, ఈ రీతిగ సమమును స్థిరమును నయిన బుద్ధిగల స్థితప్రజ్ఞుఁడు విధినియమమునకుఁ బరమందున్న స్థితియందుఁ దనంతటనే యుండు ననియు, 4. అతని

* Green's Prolegomena to Ethics § 99, 174–179 and 223–232.

వర్తనముచే, లేక, యాత్మైక్యబుద్ధిచే సిద్ధమగు నీతియొక్క నియమము సామాన్యమనుజులకు పుస్తకమువలె ప్రమాణమగుచున్నదనియు, ఏ. పిండమందును బ్రహ్మాండమందును నొక యాత్మస్వరూపమగు తత్త్వమే యుండుటచే దేహమునందున్న యాత్మ తనయొక్క శుద్ధమును పూర్ణమునగు స్వరూపమును (మోక్షమును) బొందుటకు వేడుకఁ జెందుననియు, ఈ శుద్ధస్వరూపమును దెలిసికొనె నేని సర్వభూతముల యందును నాత్మౌపమ్యబుద్ధి ప్రాప్త మగుననియు, గీతల యందున్న సిద్ధాంతమును నన్ని యంశములలోను సమానములుగ లేకపోయినను వానియం దెంత విలక్షణమగు సామ్య మున్నదియు నెల్లవారికి సహజముగఁ దెలియుచున్నేయున్నది. అయినను, బ్రహ్మ, ఆత్మ, మాయ, ఆత్మస్వాతంత్ర్యము, బ్రహ్మాత్మైక్యము, కర్మవిపాకము మొదలగు విషయములయందు వేదాంతశాస్త్రసిద్ధాంతము కాంటు, గ్రీనుల సిద్ధాంతముకంటె నెక్కువ శ్రేష్ఠమైనదని నిశ్చిత మైనది. ఉపనిషత్తుల యందున్న వేదాంతముయొక్క యాధారమునఁ జేయఁబడిన గీతలయందున్న కర్మ యోగముయొక్క వివేచన మాధ్యాత్మికదృష్టిచే మిక్కిలి నిస్సందిగ్ధము, పూర్ణము నయియున్నది, మఱియు ప్రస్తుతమందున్న జర్మన్ పండితుఁ డగు డాయిస నన్ను వేదాంతి నీతివివేచనయొక్క యీ మార్గమునే తనయొక్క "అధ్యాత్మ శాస్త్రముయొక్క మూలతత్త్వము" అను గ్రంథమునందు స్వీకరించెను. డాయన ననువాఁడు శోఫెన్‌హౌయె రనువాని మతము ననుసరించువాఁ డగుటచే "సంసారముయొక్క కారణము వాసనయే కావున నది నశించినఁ గాని దుఃఖము నివర్తించుటకు వీలు లేదు. వాసనాక్షయమును జేసికొనుటయే ప్రతి మనుజునకును కర్తవ్యము" అను శోపెన్‌హౌయరుయొక్క సిద్ధాంతము నెక్కువ గౌరవించును; మఱియు నీ యాధ్యాత్మిక సిద్ధాంతమునుంబట్టి నీతి కుపపత్తి యెట్లు కుదురునదియు పైఁజెప్పఁబడిన గ్రంథముయొక్క మూఁడవభాగము

నం దతఁడు స్పష్టముగ నిరూపించెను. వాసనాక్షయమగుటకుఁ గాని, వాసనాక్షయమైన పిదపఁ గాని కర్మలను త్యజింప నక్కఱలేక పోవుటయే కాక, వాసన పూర్ణముగ క్షీణమైనదియు లేనిదియు పరోపకారార్థము చేయఁబడిన నిష్కామకర్మలచే వ్యక్తమైనట్లు దీనిచేతను వ్యక్తము కాదు. కావున నిష్కామకర్మయే వాసనాక్షయమునకు లక్షణమును, ఫలమును నని నిరూపించి వాసనయొక్క నిష్కామత యనునదియె సదాచారమునకును, నీతిమత్తకును మూలముగ నున్నదని డాయసన్ ప్రతిపాదించెను. మఱియు నాతని గ్రంథాంతమున "తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర" (గీ. 3. 19) అను గీతయందున్న శ్లోకము వ్రాయఁబడినది. * దీనింబట్టి డాయసన్ దొరకీ యుపపత్తి గీతలను జదువుటచేతనే తోఁచి యుండునని కన్పట్టుచున్నది. ఎటులయిన నుండనిమ్ము; డాయసన్, గ్రీన్, శోఫెన్ హౌయర్, కాంటు దొరలకంటె పూర్వమునందును- వేయేల? అరిస్టాటల్‌కంటె ననేక సంవత్సరముల క్రిందటనే యీ విచారము మన దేశమందు ప్రచలితమై యున్నదను విషయము సామాన్యమైనది కాదు. వేదాంత మన, సంసారమును విడనాడి మోక్షమును సంపాదించుకొనుట యను శుష్కమగు నాయాస మని యర్వాచీనులగు ననేకు లెన్నెదరు; కాని యటు లెన్నుట పొరపాటు. "జగత్తునందు కంటికిఁ గాన్పించుచున్న దానిని గుఱించియే కాక, కాన్పింపని దానిం గూడ విచారించుచు నే నెవఁడను? సృష్ట్యారంభమున నే తత్త్వముండెను? ఆ తత్త్వమునకును నాకును సంబంధ మేమి?" యని విచారించి "నా కీ జగత్తునందు పరమసాధ్య మేది? ఈ సాధ్యమును బొందుటకు నే నేవిధముగ నా జీవితకాలమును గడుపవలయును? లేక యే మార్గముచే నే సాధ్యము ప్రాప్తించును?" మొదలగు గొప్ప సంగతులను యథాశక్తిగ శాస్త్రీయరీతితో విచారించుటకే వేదాంత

---

* See Deussen's Elements of Metaphysics, Eng. trans. 1909, p. 304.

శాస్త్రము ప్రవర్తించినది. మఱియు వాస్తవికస్థితిని జూచితి మేని సమస్త నీతిశాస్త్రములందును, లేక, మనుజులు సర్వవ్యవహారముల యందును పరస్పర మెట్లు వ్యవహరింపవలయు నను విషయము యొక్క విచార మా గంభీరమగు వేదాంతశాస్త్రమునకే యంగమై యున్నది. కావున కర్మయోగోపపత్తి వేదాంతశాస్త్రాధారము చేతనే చెప్పవలసియుండుటచే సన్న్యాసమార్గీయు లేమి చెప్పినను గణిత శాస్త్రమున శుద్ధగణిత మనియు, వ్యావహారిక గణిత మనియు రెండు భేదము లున్నట్టులు, వేదాంతశాస్త్రమునను శుద్ధవేదాంత మనియు, నైతికము వ్యావహారికము నగు వేదాంత మనియు రెండు భేదములు గల వనునది నిర్వివాద మైనది. కాంటు, "నేను జగత్తున నెట్లు సంచరింపవలయును? లేక, నాకు జగత్తునందున్న కర్తవ్య మేమి?" అను నీతివిషయముయొక్క ప్రశ్నవిచారమును జేయుచునే పర మేశ్వరుఁడు' (పరమాత్మ) 'అమృతత్వము' '(ఇచ్ఛా) స్వాతం త్ర్యము' మొదలగు వాని సంబంధమును గుఱించి గూఢములగు ప్రశ్నములు మనుజుని మనస్సునందు పుట్టుచున్న" వని చెప్పు చున్నాఁడు. మఱియు నీ ప్రశ్నములకు సమాధానము చెప్పక యేదో యొక కేవల బాహ్యసుఖముయొక్క లెక్కచేతనే, నీతికి నుప పత్తిని చెప్పుట యనఁగా, మనుజునియొక్క మనస్సునందున్న విషయసుఖమందలి లోభ మను పశువృత్తినే వృద్ధిపొందించి సత్యమగు నీతిమత్తయొక్క మూలమును కుఠారముచే ఛేదించినటుల యగునని చెప్పినాఁడు.* గీతలయందు కర్మయోగము ప్రతిపాద్యమైయుండఁగ

* Empiricism, on the contrary, cuts up at the roots of the morality of intentions (in which, and not in actions only, consists the high worth that men can and ought to give themselves)... Empiricism, moreover, being on this account allied with all the inclinations which (no matter what fashion they put on) degrade humanity when they are raised to the dignity of a supreme practical principle, ...is for that reason much more dangerous." Kant's Theory of Ethics, pp. 163 and 236-238. See also Kant's Critique of Pure Reason (trans. by Maxmuller) 2nd. Ed. pp. 640-657.

దానినుండియే శుద్ధవేదాంత మెట్లు వచ్చెననియు, నేల వచ్చెననియు నిప్పుడు వేఱుగఁ జెప్ప నక్కఱ లేదు. కాంటుదొర యీ విషయమై "శుద్ధ (వ్యవసాయాత్మిక) బుద్ధియొక్క మీమాంస" యనియు, "వ్యావహారిక (వాసనాత్మిక) బుద్ధియొక్క మీమాంస" యనియు రెండు గ్రంథములను వ్రాసినాఁడు; కాని భగవద్గీతయందు మన యౌపనిషదిక తత్త్వజ్ఞానమువలె నీ రెండు విషయములను జేరియుం డుటయే కాక, శ్రద్ధామూలకమగు భక్తిమార్గముయొక్క యే వివేచ నయును దానియందు చెప్పఁబడి యుండుటచే గీత యన్నిటికంటె నెక్కువగ గ్రాహ్యమును ప్రమాణభూతమును నయియున్నది.

మోక్షధర్మమును క్షణమాత్ర మొక వైపున నుంచి, కేవల కర్మా కర్మలయొక్క పరీక్షయందలి నైతికతత్త్వ మను దృష్టితోఁ జూచినను 'సామ్యబుద్ధియే' శ్రేష్ఠమైనచో గీతలయందున్న యాధ్యాత్మికపక్షము దక్క నీతిశాస్త్రమునందు మఱియొక మార్గ మెట్లు నిర్మింపఁబడి నదియో, యేల నిర్మిత మయినదియో కొంచెము విచారించుట యావశ్యకమయి యున్నది. డాక్టర్ పాల్‌కరస్† అను పేరు గల యొక ప్రసిద్ధుఁడగు అమెరికాదేశపు గ్రంథకారుఁడు నీతిశాస్త్రముపై తనచే వ్రాయఁబడిన గ్రంథములో నీ ప్రశ్నకు "పిండబ్రహ్మాండముల యొక్క రచనా విషయమున మనుజుల మతము మాఱుచున్నటులే నీతిశాస్త్రముల మూలతత్త్వముల విషయమై వారి విచారపద్ధతియు మాఱుచునే యున్నది. పిండబ్రహ్మాండములయొక్క రచనావిషయమై

---

† See The Ethical Problem, by Dr. Carus, 2nd Ed. p. 111. "Our proposition is that the leading principle in ethics must be derived from the philosophical view back of it. The world-conception a man has can alone give character to the principle in his ethics. Without any world-conception we can have no ethics (i.e. ethics in the highest sense of the world). We may act morally like dreamers or somnambulists, but our ethics would in that case be a mere moral instinct without any rational insight into its raison d'etre.

యేదైన నొక నిశ్చితమగు మతముండిననే కాని, నిజముగఁ జూచిన నైతికప్రశ్నయే వెలువడదు. పిండబ్రహ్మాండములయొక్క రచనా విషయమై స్థిరమగు మతము లేకపోయినను తన చేతిమీఁదుగ నొకా నొకప్పుడు నైతికమగు వర్తనము జరుగవచ్చును; కాని యీ వర్తనము నిద్రలోని వ్యాపారమువలె నుండును గాన దీని నైతిక మని చెప్పుటకు మారుగ దేహధర్మానుసారముగ సంభవించునట్టి కేవల కాయికచేష్ట యని చెప్పవలయును," అని సమాధానముఁ జెప్పుచున్నాఁడు. ఉదాహరణ మేమి యన: ఆఁడు పెద్దపులి యయినను తన పిల్లల సంరక్షణార్థమైన తన ప్రాణముల నిచ్చుటకు సిద్ధపడును. ఇంతమాత్రముచే పెద్దపులివర్తనము నైతిక మనక దాని కిది జన్మముచే సిద్ధమగు స్వభావ మని మనము చెప్పుచున్నాము. నీతిశాస్త్రోపపాదనమునం దనేక మార్గము లేల వెలువడిన వను ప్రశ్నకు నీ సమాధానముం బట్టి స్పష్టమగును. కారణ మేమియన: నే నెవరు? జగమేల పుట్టినది? నాకీ జగత్తువలన నుపయోగ మేమి? మొదలగు గూఢములగు ప్రశ్నలకు సమాధానము నిచ్చు తత్త్వములచేతనే నేను నాయొక్క వ్యాపారమున లోకులతో నిట్లు వ్యవహరింపవలయు నను దానికి సైతము విచారముచేఁ బ్రతి పురుషుఁడును తుదకు సిద్ధాంతమును చేసికొనవలయును. దానిలో, నే శంకయును లేదు; కాని యీ గూఢమగు ప్రశ్నకు నుత్తరము వేర్వేఱు కాలములయందును, వేర్వేఱు దేశములయందును, నొకటిగనే యుండుటకు వీలు లేదు. యూరపుఖండమునందు ప్రచారములోనున్న క్రైస్తవధర్మగ్రంథమైన బైబిలునందు మనుజులకును సృష్టికిని కర్త సగుణుఁడగు పరమేశ్వరుఁడే యనియు, నాతఁడే యీ జగత్తును సృజించి సదాచారముయొక్క నియమమును, లేక, విధిని మనుజునకు విధించినాఁడనియు చెప్పఁబడియున్నది. మఱియు బైబిలునందున్న యీ పిండబ్రహ్మాండములయొక్క యీ కల్పన ననుసరించి దానిలోఁ జెప్పఁబడిన నీతినియమములే నీతిశాస్త్రమునకు మూలములైనవని యని మొట్టమొదట క్రైస్తవపండితు

లభిప్రాయపడిరి; కాని కొన్నాళ్ళకు పిదప నీ నియమములు వ్యవహారమునకు చాలవని తోఁచిన పిదప నీ నియమములఁ బూర్తిచేయుటకై (అనఁగా: వివరించుటకై) పరమేశ్వరుఁడే సదసద్వివేకశక్తి మనుజున కిచ్చెనని చెప్ప నారంభించిరి; కాని చోరునకును, ధనికునకును సదసద్వివేకశక్తి యొక్క విధముగ నుండదని పిదపఁ దెలిసికొనుటచేఁ బరమేశ్వరుని యిచ్ఛయే నీతిశాస్త్రమునకుఁ బుట్టకీటయినను, పరమేశ్వరుని యీ యిచ్ఛ యనేకుల కధిక కళ్యాణము, దేని వలనఁ గలుగునని విచారించుటచే మనకుఁ దెలియునో, దానియొక్క స్వరూపముం దెలిసికొనుటకు మఱియొక సాధనము లేదను మతము ప్రచారములో నున్నది. ఈ యన్నిమతముల వారికిని బైబిలులోఁ జెప్పఁబడిన సగుణ పరమేశ్వరుఁడే జగత్తునకు కర్త యనియు, మనుజుఁడు నీతిపరుఁడై సంచరింపవలయు ననియు నను నాతని యాజ్ఞయే యెల్లవారి కభిమత మగుటచే పిండబ్రహ్మాండముల రచనాసంబంధమున సైతము క్రీస్తుమతము నాధారముగఁ గైకొని యీ యన్నిమతములు వెలువడినవి; కాని క్రైస్తవధర్మబోధక గ్రంథములందున్న పిండబ్రహ్మాండములయొక్క రచనావిషయక సిద్ధాంతములు సరిగ లేవని యాధిభౌతికశాస్త్రములయొక్క వృద్ధిచే ననుభవములోనికి వచ్చిన పిదప, పరమేశ్వరునివంటి సృష్టికర్త యెవ్వఁడైన కలఁడా? లేఁడా? యను విచార మొకవైపున నుంచి నీతిశాస్త్ర మను మహాభవనము ప్రత్యక్షముగఁ గాన్పించుచున్న విషయములను పునాదిపై కట్టవచ్చునా? కట్టరాదా? యను విచార మారంభమాయెను. మఱియు ననేకుల కధిక సుఖము, లేక, మనుష్యత్వముయొక్క వృద్ధియును నీ దృశ్యతత్త్వములే నీతిశాస్త్రమునకు మూలము లయియున్న వని ప్రతిపాదన యారంభమయినది. ఈ ప్రతిపాదనయం దనేకుల కధిక హితమును మనుష్యుఁ డేల చేయువలయునో చెప్పక, యిది మనుజునకు వృద్ధినొందుచున్న స్వాభావికమగు ప్రవృత్తిగ నున్నదని మాత్రమే చెప్పుటకు వీలగును. అయినను మానుషస్వభావమునందు

దృశ్యమగు స్వార్థమువలె మఱియొక ప్రవృత్తి యుండుటచే నీ మార్గము సైతము భేదించుటకు మరల యారంభించెను. నీతిమత్తము యొక్క యుపపత్తు లన్నివిధములచే నిర్దోషములు కావు; కాని సృష్టి యందు దృశ్యములగు పదార్థములకంటె పరముగ సృష్ట్యారంభము నందొక యవ్యక్త తత్త్వముండె నను నీ మార్గము ననుసరించి పండితులకు సమానముగనే యవిశ్వాసము, నశ్రద్ధయు నుండుటచేఁ దమ ప్రతిపాదనయం దెన్ని ప్రతిబంధకములు కన్పట్టినను కేవల బాహ్యములు దృశ్యములు నగు తత్త్వములచేతనే యెటులైన నిర్వహించుకొనవలయునని యెప్పుడును ప్రయత్నమును జేయుదురు. నీతి యందఱకును గావలసినదే యైనను పిండబ్రహ్మాండముయొక్క రచనాసందర్భములో వేర్వేఱగు మతము లుండుటచే వారు చెప్పు నీతిశాస్త్రోపపత్తియం దెప్పుడును నెపుడు భేదము గలుగునదియు దీనింబట్టి గాన్పించును. ఇందుకొఱకే పిండబ్రహ్మాండములయొక్క రచనా విషయమై యాధిభౌతికము, నాధిదైవికము, నాధ్యాత్మికము నను మతములవలె నీతిశాస్త్రముయొక్క ప్రతిపాదనసంబంధమైన మూఁడవ ప్రకరణమునందు మూఁడు విధములుగ భేదము గల్పించి పిదప ప్రతి మార్గమునందు నున్న సిద్ధాంతములను నేను వేర్వేఱుగ విచారించితిని. సర్వమగు దృశ్యసృష్టియు సగుణ పరమేశ్వరునిచే సృజింపఁబడె నని చెప్పువారు తమ ధర్మపుస్తకములయం దున్న పరమేశ్వరాజ్ఞచే సృజింపఁబడె నని చెప్పువారు తమ ధర్మపుస్తకములయం దున్న పరమేశ్వరాజ్ఞచే నిర్మింపఁబడిన సదసద్వివేకశక్తిరూపమగు దేవతకంటె నధికముగ నీతిశాస్త్రవిచారముఁ జేయరు. దీనినే నే నాధిదైవికమార్గ మని పేర్కొంటిని. కారణ మేమియనఁ: సగుణపరమేశ్వరుఁ డని చెప్పినను ఒక దైవతమే యగును. దృశ్యసృష్టియొక్క యారంభమునందేమియు దృశ్య మగు తత్త్వము లేదు. ఒకవేళ నుండినను నది మనుజుని బుద్ధికి నగమ్య మయియున్నది. ఇటులని చెప్పువారు అనేకుల కధిక కళ్యాణము, లేక, మానుషత్వముయొక్క పరమోత్క

ర్షము, అను నీ దృశ్యతత్త్వము మీఁదనే నీతిశాస్త్రములయొక్క భవనముల నిర్మించుచున్నారు. మఱియు నీ బాహ్యము దృశ్యము నగు తత్త్వముకంటె పైన విచారించుటవలన నేమియు ప్రయోజనము లేదని యందురు. ఈ మతమునకు నే నాధిభౌతిక మని పేరిడితిని. నామరూపాత్మక మగు దృశ్యసృష్టియొక్క యారంభమునం దాత్మవలె నిత్యము నవ్యక్తమునగు నేదో యొక తత్త్వమున్నదని చెప్పువారు తమ నీతిశాస్త్రోపపత్తి నాధిభౌతికోపపత్తికంటె పైకి లాగికొనిపోవుచున్నారు; మఱియు నాత్మజ్ఞానమును, నీతియు లేక ధర్మము నను వానికి సంబంధము కలుగఁజేసి మనుజునకు జగత్తునందున్న కర్తవ్య మేదియో నిర్ణయించుచున్నారు. ఈ మార్గమునే నే నాధ్యాత్మిక మని చెప్పితిని. ఈ మూఁడు మార్గములయందున్న యాచారాత్మకము లగు నీతి యొక్కటియే; కాని పిండబ్రహ్మాండముల రచనావిషయమై ప్రతి మతమును వేఱగుటచే నీతిశాస్త్రసంబంధములైన మూలతత్త్వములయొక్క స్వరూప మన్ని మతములయందును కొంతకొంతగా మాఱుచు వచ్చినది. వ్యాకరణశాస్త్ర మే రీతిగ క్రొత్త భాషను గల్పింపక వ్యవహారముననున్న దానికే నియమములను గల్పించి శోధించుటచే భాషయొక్క యభివృద్ధికి సాహాయ్యమును చేయుచున్నదో యా రీతిగనే నీతిశాస్త్రముయొక్క పద్ధతియు నున్న యాచారములకు నియమములను గల్పించి శోధించుచున్నది. మనుజుఁ డీ సృష్టియందుఁ బుట్టిన దినము మొదలుకొని తన యూహచే తన వర్తనమును దేశకాలానుసారముగ శుద్ధముఁ జేసికొనుచు వచ్చుచున్నాఁడు. ఆ యా సమయములం దవతరించి యాచారశుద్ధికై చోదనా (ఆజ్ఞా) రూపములగు నియమములను విధించిరి. నీతిశాస్త్ర మనునది యీ నియమములను పూర్వపక్షముఁ జేసి క్రొత్త నియమములను విధించుటకొఱకు ప్రవర్తించినది కాదు. హింసను చేయకుము; సత్యమును సంభాషింపుము; పరోపకారముం జేయుము;

మొదలగు నీతినియమములు బహుకాలమునుండియుఁ బ్రచారము లోనే యున్నవి. కాని నీతి యథోచితముగ వృద్ధిపొందుటకు సుల భోపాయము లభించుటకై యీ నీతినియమములయం దున్న మూల తత్త్వమేమి యను నింతయే నీతిశాస్త్రమునందు చూడవలసియున్నది. మఱియు దానినింబట్టి నీతిశాస్త్రమునందలి యే మతమును జూచినను ప్రస్తుతమునందు ప్రచారములో నున్న నీతినియమములును, మార్గ ములును సమానములుగనే యున్నవి. దానియందు కలుగు భేద ముపపత్తియొక్క స్వరూపభేదము వలనఁ గలిగినది. మఱియు నీ భేదము కలుగుటకు ప్రతి మార్గమునందును నున్న పిండబ్రహ్మాండ ములయొక్క రచనాసంబంధములో వేఱుగనున్న మతములే ముఖ్య కారణము లని డాక్టర్ పాల్ కరస్ చెప్పిన విషయమే సత్య మని కాన్పించుచున్నది;

నీతిశాస్త్రమునందు మిల్లు, స్పెన్సరు, కాంటు మొదలగు నాధి భౌతికవాదులగు నాధునిక పాశ్చాత్యగ్రంథకారు లాత్మౌపమ్యదృష్టి యొక్క సులభము వ్యాపక మగు తత్త్వమును వదలి 'సర్వభూత హితము', లేక, 'అనేకుల కధికహిత' మను నీ యాధిభౌతికతత్త్వము మీఁదనే నీతిరూపక మగు భవనమును కట్టవలయునని ప్రయత్నము జేసిరి. మఱియుఁ బిండబ్రహ్మాండముల సంబంధములోఁ దమ మత ములు ప్రాచీనమతముకంటె వేఱుగుటచే నట్లు చేసి రనునది యీ రీతిగ సిద్ధమగును. పిదప పిండబ్రహ్మాండములయొక్క రచనాసంబం ధము లగు నవీనమతములు సరిరాక పోవుటచే, నే ననగఁ నెవరు? సృష్టి యన నేమి? నాకీ సృష్టిజ్ఞాన మెవ్విధముగఁ గలుగును? నా కంటె వేఱగు బాహ్యసృష్టి స్వతంత్ర మగునా? కానేరదా? అగునేని దానికి మూలతత్త్వ మేది? ఒక మనుజుఁడు మఱియొక ప్రాణియొక్క సుఖముకొఱకు నేల తన ప్రాణములను వ్యయము పెట్టవలయును? 'ఏది జన్మించునో యది చచ్చు' నను న్యాయము ననుసరించి మనము

నివసించుట కాధారమగు భూమియు నన్ని ప్రాణులతోకూడ నెప్పుడో యొకప్పుడు నశించునదే యని నిశ్చితమైనచో, నశ్వరమగు నెదుట నున్న పిండముకొఱకై మనము మన సుఖముల నేల పాడుచేసికొన వలయును? మొదలగు ప్రశ్నలు కొందఱకు లోఁతుగ విచారింపవలసి యుండును. లేక పరోపకారము మొదలగు మనోవృత్తి కర్మమయము ననిత్యము నయిన దృశ్యసృష్టి యందున్న నైసర్గికప్రవృత్తియై యున్నది. ఈ యుత్తరముచే పూర్ణసమాధానము రానేరదు. కావున నీ ప్రవృత్తికి మూల మేమని యెవరికి చూడవలసి యున్నదో వారధ్యాత్మ శాస్త్రమునం దున్న నిత్యమగు తత్త్వజ్ఞానము వైపునకు మరలిననే తప్ప గత్యంతర మేమియును లేదు; మఱియు నీ కారణముచేతనే గ్రీ నను వాఁడు తన నీతిశాస్త్రగ్రంథమునందు నే యాత్మకు జడసృష్టియొక్క జ్ఞానము గలుగుచున్నదో యా యాత్మ జడసృష్టికంటె వేఱుగనుండ వలయు ననియే యారంభించెను. 'కాంటు' అనువాఁడు మొదట వ్యవసాయాత్మకబుద్ధిని వివేచించి పిదప వాసనాత్మకబుద్ధిని నీతిశాస్త్ర మును చర్చించెను. మనుజుఁడు తన సుఖముకొఱకుఁ గాని, యనే కులగు జనులయొక్క సుఖముకొఱకుఁ గాని, పుట్టినాఁడని చెప్పుట పై కెంత మోహకరముగఁ గాన్పించినను, అది సహజముగ సత్యము కానేరదు. కేవలము సత్యముకొఱకే ప్రాణముల నిచ్చుటకు సిద్ధు లగు మహాత్ముల మనస్సునందు ముందు కలుగఁబోవు జన్మమున నత్యధికముగ విషయసుఖము గలుగవలయు నను తలఁపే యట్లు చేయుటకు హేతువై యుండునా? యని క్షణమాత్రము విచారించితి మేని తనయొక్క గాని, లోకులయొక్క గాని నిత్యమగు నాధిభౌతిక సుఖముకంటె నధికమహత్త్వము గల మఱియొకటి యైన నీ జగత్తు నందు మనుజునకు పరమసాధ్యముగ నుండి తీరవలయునని చెప్ప వలసివచ్చును. ఈ పరమసాధ్యమగు వస్తు వేది? పిండబ్రహ్మాండ ములయొక్క నామరూపాత్మకము గనుకనే నశ్వరమును దృశ్యమును

నగు స్వరూపముచే నాచ్ఛాదింపఁబడిన యాత్మస్వరూపముయొక్క నిత్యత్త్వము నాత్మప్రతీతిచేఁ (స్వానుభవముచే) దెలిసికొనిన వారీ ప్రశ్నమునకు తమ యాత్మయొక్క యమరము, శ్రేష్ఠము, శుద్ధము నిత్యము సర్వవ్యాపియు నగు స్వరూపమును దెలిసికొని దానియందు విరామము నొందుటయే జ్ఞానికి నశ్వరమగు జగత్తునందున్న ప్రథమ కర్తవ్య మని సమాధానముఁ జెప్పుదురు. సర్వభూతాంతర్గత మగు నాత్మైక్యము నీ రీతిగఁ దెలిసికొనుటచే నీ జ్ఞానము దేహేంద్రియముల యందు దృఢముగ నలముకొనినవారు జగత్తు నశ్వర మయినదా? కాదా? యని విచారించుచు కూర్చుండక సర్వభూతహితోద్యోగము నకు ప్రవర్తింతురు గాన సత్యమునకుఁ బురస్కర్త లగుదురు. కారణ మేమి యన: అవినాశియుఁ ద్రికాలాబాధితమునగు సత్య మేదియో వారికి పూర్ణముగఁ దెలిసియే యున్నది. మనుజునియొక్క యీ యాధ్యాత్మికపూర్ణావస్థయే నీతియొక్క యన్ని నియమములకును మూలకారణము. దీనినే వేదాంతులు 'మోక్ష' మనెదరు. ఏ విధమగు నీతిని విచారించినను నది యీ చరమసాధ్యమును విడచియుండు టకు వీలులేదు. కావున నీతిశాస్త్రముయొక్కయు, కర్మయోగము యొక్కయు, వివేచనఁ జేయునప్పుడు తుద కీ తత్త్వమునే శరణు నొందవలయును. సర్వాత్మైక్యరూపమగు నవ్యక్తమూలతత్త్వమునకు సర్వభూతహితేచ్ఛ యనునదియే యొక యవ్యక్తస్వరూప మగుటచే నగుణపరమేశ్వరుఁడును, దృశ్యసృష్టియు నను నీ రెండును కూడ సర్వభూతాంతర్గతము, సర్వవ్యాపియు నవ్యక్తమునగు నాత్మయొక్క వ్యక్తమగు స్వరూపములే యయి యున్నవి. మఱియు నీ వ్యక్త స్వరూపముకంటె పైకిపోయి, యవ్యక్తమగు నాత్మయొక్క జ్ఞానము నంపాదించిననే కాని జ్ఞానమునకుఁ బరిపూర్తి కాకపోవుటయే కాక, దేహమునందున్న యాత్మయొక్క పూర్ణావస్థను పొందుట యను నదియె ప్రతి మనుజునకును నీ జగత్తునందు పరమ కర్తవ్యము. ఈ

విషయము సైత మీ జ్ఞానము లేనిది సిద్ధము కానేరదు. నీతిని విచారించుము, ధర్మమును విచారించుము, వ్యవహారమును విచారించుము లేక, యే శాస్త్రమును విచారించినను "సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే"_ అధ్యాత్మజ్ఞానమే యెల్లవారికిఁ బరమగతి యగును. మఱియు మనయొక్క భక్తిమార్గము సైత మీ తత్త్వజ్ఞానమునే యవలంబించి యుండును. కావున జ్ఞానదృష్టిచే నిష్పన్నమగు సామ్యబుద్ధిరూపతత్త్వమే, మోక్షమునకును, సదాచరణమునకును మూల మను సిద్ధాంతము మన భక్తిమార్గమునందు సైతము స్థిరముగ నున్నది. జ్ఞానప్రాప్తికలిగిన పిదప కర్మల నన్నింటిని పరిత్యజింపవలయునను వేదాంతులయొక్క యూహయే వేదాంతశాస్త్రముచే సిద్ధమగు సిద్ధాంతమునందున్న గొప్పలోపము గనుక జ్ఞానమునకును కర్మకును విరోధము లేదని నిరూపించి వాసనాక్షయమైనను జ్ఞాని పరమేశ్వరార్పణపూర్వకముగ లోకసంగ్రహార్థమై కేవలము కర్తవ్యమను తలంపుతో సర్వకర్మలను చేయవలయు నను కర్మయోగము యొక్క సిద్ధాంతము గీతలలో విస్తారముగ వర్ణింపఁబడినది. పరమేశ్వరునకు సర్వకర్మలను సమర్పించి యుద్ధము చేయుమని యర్జునునకు భగవంతునిచే విశేషముగ నుపదేశింపఁబడినమాట సత్యమే; కాని యది తాత్కాలికప్రసంగము ననుసరించి చేయఁబడినది (గీ. 8.7). అర్జునునివలెనే సేద్యగాఁడును, స్వర్ణకారుఁడును, వస్త్రకారుఁడును, లోహకారుఁడును, వర్తకుఁడును, బ్రాహ్మణుఁడును, గుమాస్తా మొదలయిన వారెల్లరును దమ తమ యధికారానురూపముగఁ దమ వ్యవహారములను బరమేశ్వరార్పణబుద్ధితోఁ జేయుచు జగత్తుయొక్క ధారణపోషణలను జేయవలయును. ఈ వ్యాపారము స్వభావముగనే ప్రాప్తమైనవారిట్టి నిష్కామబుద్ధితోఁ బ్రవర్తించి రేని వారికి పాపమేమియు నంటదు. కర్మలన్నియు నచ్చోనుండి సమానమైనవే; దోషము కర్తయొక్క బుద్ధియందున్నది గాని కర్మయందు లేదు; కావున బుద్ధిని సమముగఁ జేసి సర్వకర్మలం జేయుటచేఁ బరమేశ్వరుని

యుపాసన ఘటించును. కావున పాపము తగులకపోవుటయె కాక తుదకు సిద్ధి కలుగును అని యీ యుపదేశమున కంతకును తాత్ప ర్యము; కాని యేమైన నశ్వరమగు దృశ్యసృష్టికంటె పైకిపోయి యాత్మానాత్మ విచార మను లోఁతునీళ్లలోనికి దిగుట తగదని (విశేషముగ నర్వాచీన కాలమందు) యెన్నువారు, బ్రహ్మాత్మైక్య రూపమైన పరమసాధ్య మను పై మెట్టును వదలి మానవజాతికి కల్యా ణము, లేక, సర్వభూతహితము మొదలగు సిద్ధాంతములను క్రింది మెట్టునందున్న యాధిభౌతికములును, దృశ్యములును ననిత్యము లును నగు తత్త్వముల దగ్గఱనుండియే తమ నీతిశాస్త్రవివేచన నారం భించుచున్నారు; కాని యొకానొక వృక్షపుకొమ్మ కొట్టివేసినంత మాత్రమున ఆ చెట్టు నూతనమైనది కానియట్లే యాధిభౌతికపండి తులచే నిర్మింపఁబడిన నీతిశాస్త్ర మపూర్ణమైనను క్రొత్తది గాదు. మనదేశమునందు బ్రహ్మాత్మైక్యము నంగీకరింపక ప్రతిమనుజుఁడును స్వతంత్రుఁడే యను సాంఖ్యశాస్త్రజ్ఞులగు పండితులు సైతము జగత్తు యొక్క ధారణ పోషణ లే గుణముచే నగుచున్న వనియు, వినాశ మే గుణముచే నగుచున్నదనియు విచారించి, సత్త్వము, రజస్సు, తమ స్సను, నీ మూఁడు గుణములయొక్కయు లక్షణములను నిశ్చ యించిరి. మఱియు వానిలో సాత్త్వికములగు సద్గుణములను, పరమోత్కృష్టములనుగ చేయుటయే మనుజులకు కర్తవ్యమనియు దానిచేతనే తుదకు త్రిగుణాతీతావస్థ ప్రాప్త మగుటచే మోక్షము లభించుననియు, ప్రతిపాదింపఁబడినది. మఱియు భగవద్గీతలయొక్క పదునేడు పదునెనిమిది యధ్యాయములయందు కొంచెము మార్పుతో నీ యర్థమే వర్ణింపఁబడినది.* సాత్త్వికములగు సద్గుణములయొక్క

* బాబు కిశోరిలాల్ సర్కార్, ఎం. ఏ., బి. ఎల్. గారిచే వ్రాయఁబడిన "The Hindu System of Moral Science" అను నామముగల చిన్నగ్రంథ మున, వారు సైత మీ రీతిగనే, సత్త్వరజస్తమము లను త్రిగుణములనే యాధా రముగఁ గొని యీ విషయమున ప్రతిపాదించిరి.

పరమోత్కర్ష మనినను, లేక, యాధిభౌతిక వాదానుసారముగ పరోపకారబుద్ధి యనినను, మానుషత్వముయొక్క వృద్ధియనినను, నర్థ మొక్కటియే. మహాభారతమందు, లేక, గీతయందు నీ యాధిభౌతిక తత్త్వము లన్నియు స్పష్టముగ నుల్లేఖింపఁ బడుటయే కాక, ధర్మాధర్మములయొక్క నియమములకు లౌకికమగు, లేక, బాహ్యమగు నుపయోగ మేమి యని విచారింతుమేని నీతి ధర్మము సర్వభూతహితార్థమే (అనఁగా: లోకులకు కల్యాణార్థమే) యయియున్నదనియు మహాభారతమునందు స్పష్టముగఁ జెప్పఁబడియున్నది; కాని యవ్యక్తమునందు నమ్మకము లేకపోవుటవలన తాత్త్వికదృష్టితో కార్యాకార్యనిర్ణయము చేయుటకు నాధిభౌతికతత్త్వములు చాలవని యెఱింగియు, వానియందె విశేషగ్రంథముల రచియించి పాశ్చాత్యులగు నాధిభౌతికపండితులు వ్యక్తముచేతనే యెట్లులైనను సర్వనిర్వాహమును చేసినట్లు చేయక, యా తత్త్వములయొక్క పరంపరను, పిండబ్రహ్మాండములకు మూల మగునదియు, నవ్యక్తమును, నిత్యమునగు తత్త్వము పర్యంతము కైకొని పోయి, మోక్షము, నీతి ధర్మము, వ్యవహారము నను నీ మూఁడింటికిని తత్త్వజ్ఞానాధారముచే భగవంతుఁడు గీతలయందు పూర్ణమగు నేకవాక్యతను నిరూపించెను. మఱియు దానింబట్టి కార్యాకార్యనిర్ణయమును చేయుటకుఁ జెప్పఁబడిన ధర్మమే మోక్షమును కలుగఁజేయుటకు సామర్థ్యము కలదియని యనుగీతల యారంభమునందు స్పష్టముగ చెప్పఁబడినది (మ. భా. అశ్వ. 16. 12). మోక్షధర్మము, నీతిశాస్త్రము, లేక, అధ్యాత్మజ్ఞానము, నీతి యను వాని నన్నింటిని నేకము చేయనవసరము లేదను వారీ యుపపాదనమహిమ నొప్పుకొనరు; కాని యీ విషయమై యుదాసీనులుగ నుండని వారికెల్లరకును గీతలయందున్న కర్మయోగముయొక్క ప్రతిపాదన మాధిభౌతిక వివేచనకంటె శ్రేష్ఠమును గ్రాహ్యము నని తోఁపక మానదు. హిందూస్థానమందువలె నధ్యాత్మ

జ్ఞానముయొక్క వృద్ధి చిరకాలమునుండి మఱియొకచోట లేకపోవు టచే నితర దేశములయం దెక్కడను కర్మయోగమున కిట్టి యాధ్యాత్మికమగు నుపపాదనము వెలువడుటకు వీలు లేదు. కావుననే యట్టి గ్రంథ మెచ్చటను లేనే లేదు.

ఇహలోకమునందున్న సంసార మశాశ్వత మనియు దానికంటె సుఖముకంటె దుఃఖ మధిక మనియు నొప్పుకొనినను (గీ. 9. 33) "కర్మ జ్యాయో హ్యకర్మణః"_ సంసారమందున్న సర్వకర్మల నెప్పుడైనను త్యజించుటకంటె నా కర్మలనే నిష్కామబుద్ధితో లోకకల్యాణార్థమై చేయుచుండుటయే శ్రేయస్కర మని గీతలయం దొనర్పఁబడిన సిద్ధాంతమునకు (గీ. 3. 8, 5. 2) సాధకబాధకములగు కారణముల విచారము పూర్వము పదునొకండవ ప్రకరణమునఁ జేయఁబడెను; కాని గీతలయం దున్న యీ కర్మయోగమును పాశ్చాత్యకర్మమార్గముతోఁ గాని, లేక, మన దేశమునందున్న సన్న్యాసమార్గమును పాశ్చాత్యకర్మత్యాగపక్షముతోఁ గాని పోల్చి చూచునప్పు డీ సంబంధములో కొంచెము విశేషముగ వివరింపవలసి వచ్చును. దుఃఖమయమును, నిస్సారము నగు సంసారమునుండి నివృత్తుఁడయిననే కాని మోక్షప్రాప్తి కానేరదను నీ మతము వైదికధర్మములయందు, మొదట నుపనిషత్కారులును, సాంఖ్యులును ప్రచారములోనికి కొనివచ్చిరి. తత్పూర్వమునందున్న వైదికధర్మములు వృత్తిపరములుగనే (అనఁగా కర్మకాండాత్మకములుగనే) యుండెను; కాని వైదికేతర ధర్మముల విచారించితిమేని వానిలో ననేక మతములయందు మొదటినుండియు సన్న్యాసమార్గమునే స్వీకరించినటుల కన్పట్టుచున్నది. ఉదాహరణము: జైనము, బౌద్ధము నను నీ రెండు ధర్మములును మొదటినుండియు నివృత్తిపరములే. క్రైస్తవధర్మము సైత మిట్టిదియే. సంసారమును వదలి యతిధర్మానుసారముగ నుండవలయు ననియు, స్త్రీలవైపునకు చూడఁగూడ దనియు, లేక, వారితో సంభాషింపను సైతము కూడద

నియు బుద్ధుఁడు తన శిష్యులకు చిట్టచివర కుపదేశించినటులే(మహా పరినిబ్బాణ సుత్త 5.23) మూలభూతములగు క్రైస్తవధర్మములును నుప దేశింపఁ బడినవి. "నీ యిరుగుపొరుగువారల నిన్నువలె ప్రేమింపుము" అని క్రీస్తు ఉపదేశించెను (మాథ్యూ. 19.19). "నీవు తినుటను, త్రాగు టను-వెక్కేల? చేయు పనులనెల్ల నీశ్వరార్థమే చేయుము" అని పా లను క్రైస్తవుఁ డనెను (1 కొరిం. 10.31). ఈ యుపదేశములు రెండును నాత్మౌపమ్యబుద్ధితో నీశ్వరార్పణపూర్వకముగ కర్మలను చేయవలయు నను గీతలయందున్న యుపదేశముతో సదృశములయి యున్నవి (గీ. 6.29 మఱియు 9. 27). కాని యంతమాత్రముచే గీతాధర్మాను సారముగ క్రైస్తవధర్మములు ప్రవృత్తిపరములయి యున్నవని సిద్ధము కానేరదు. కారణ మేమియన: మనుజుఁ డమృతత్వమును సంపాదిం చుకొని ముక్తుఁడు కావలయు ననుట క్రైస్తవధర్మముల యందును పరమపురుషార్థము; మఱియు నా పురుషార్థము గృహదారాదికమును వదలనిది సాధ్యము కానేరదని యుండుటచే క్రీస్తుయొక్క మూల ధర్మములు సన్న్యాసపరములుగనే యున్నవని చెప్పవలయును. క్రీస్తు మరణపర్యంతము నవివాహితుఁడే యయియుండుటయే కాక "మాతా పితరులను, ఇరుగుపొరుగువారలను ప్రేమించుము" అని "నీ వుపదేశిం చిన సర్వధర్మములను యావజ్జీవమును నేను పాలించుచునే యున్నాను. పూర్ణమగు నమృతత్వము లభించుటకు నా యందేమి లోపమున్నదో చెప్పు"మని యొక గృహస్థుఁ డతని నడుగఁగా "గృహదారాదికము నమ్మివేసి కాని, లేక, దరిద్రున కిచ్చి కాని నీవు నా భక్తుఁడ వగుము" అని క్రీస్తు స్పష్టముగ నతనికి యుత్తర మొసఁగెను (మాథ్యూ. 19.16-30 మఱియు మార్కు. 10. 21-31). వెంటనే తన శిష్యుల వైపునకు మరలి వారితో "ఒంటె సూదిబెజ్జములో నుండియైన దూఱిపోవచ్చును గాని యీశ్వరుని రాజ్యమందు శ్రీమంతునకు ప్రవేశము గలుగుట కష్ట"మని చెప్పెను. "అమృతత్వస్య తు నాశాఽస్తి విత్తేన"- ద్రవ్య

ముచే నమృతత్వము లభించునని యాశింపకుము (బృ. 2.4.2) అని యాజ్ఞవల్క్యులు మైత్రేయికిఁ జేసిన యుపదేశమున కిది యనుకరణ యని చెప్పవచ్చును. "అమృతత్వమును సంపాదించుకొనుటకు సాంసారికకర్మలను వదల నక్కఱలేదు. వానినే నిష్కామబుద్ధితోఁ జేసినఁ జాలును" అని గీతలయందు భగవంతుఁ డుపదేశించినట్లు క్రీస్తు వెక్కడ నుపదేశింప లేదు. పైఁగా "ఐహికసంపత్తి, పరమేశ్వరుఁడు నను నీ రెంటియందు ననివార్యమగు విరోధ మున్నది" యనియు, (మాథ్యూ. 6.24) "మాతాపితరులను, గృహదారాదికములను భార్యాపుత్త్రాదులను, తోఁబుట్టువులను, అన్నలను వే యేల? తమ జీవితమును సైతము వదలి నావెంట రానివారు నా భక్తులగుట కెప్పుడును వీలు లే"దనియు నుపదేశించినటు లున్నది (ల్యూక్. 14. 26-33). క్రైస్తవులు స్త్రీలను స్పృశింపక పోవుట సైత ముత్తమ పక్షము" (1 కారిం. 7.1) అని క్రీస్తు శిష్యుఁడు పా లనువాఁడు స్పష్టముగ నుపదేశించెను. అటులనే "మనకు జన్మము నిచ్చునది తల్లి * మనకేమి యగును? మనకు సేవ్యుఁడగు నీశ్వరభక్తుఁడే మనకు మాతాపితరులును, బంధువుఁడు నయియున్నాఁడు (మాథ్యూ. 12. 46-50) క్రీస్తు నోటినుండి వచ్చిన మాటకును "కిం ప్రజయా కరిష్యామో యేషాం నోఽయ మాత్మాయం లోకః" అను బృహదారణ్యకోపనిషత్తులో నున్న సన్న్యాసపరమగు వచనమునకును (బృ 4. 4. 22) నున్న సామ్యమును నే నిదివఱకే నిరూపించి యున్నాను. ప్రత్యక్షముగ బైబిలులోనున్న యీ వాక్యములం బట్టి బౌద్ధ జైనధర్మముల వలెనే క్రైస్తవధర్మమును మొదటినుండియు సంసారమును వదలివేయు

* "కా తే కాంతా క స్తే పుత్త్రః" అని శ్రీశంకరులయొక్క ప్రసిద్ధమగు శ్లోకములోని యుపదేశ మశ్వఘోషుని బుద్ధచరిత్రయందు (6.45) బుద్ధునివాక్కునుండి "క్వాహం మాతుః క్వ సా మమ" యని వచ్చిన యుపదేశము సైతము సన్న్యాసమార్గమును తప్పక యవలంబింపఁ జేయునదియే.

మని చెప్పునదియే, (అనఁగా: సన్న్యాసపరమైనదియే)యని సిద్ధమగు చున్నది; మఱియు క్రైస్తవ ధర్మములయొక్క ప్రాచీనేతిహాసములఁ జూచితిమేని "క్రైస్తవభక్తుఁడు ధనద్రవ్యాదుల నుంచఁ గూడదు" (మాథ్యూ. 10. 9. 15) అను క్రీస్తుయొక్క యుపదేశానుసారముగ మొదటివారగు క్రైస్తవధర్మోపదేశకులు, విరక్తులుగనే యుండిరని కాన్పించుచున్నది.† క్రైస్తవధర్మోపదేశకులు, లేక క్రైస్తవభక్తులు గార్హస్థ్య ధర్మానుసారముగ సంసారమునం దుండుట యను నాచారము పిదప కావింపఁబడిన సంస్కరణమువలన సంభవించినది. మూలమం

† See Paulsen's System of Ethics, (Eng. trans.) Book I Chap. 2 and 3; esp. pp. 89-97. "The new (Christian) converts seemed to renounce their family and country .. their gloomy and austere aspect, their abhorrence of the common business and pleasures of life, and their frequent predictions of impending calamities inspired the pagans with the apprehension of some danger which would arise from the new sect. "Historians' History of the World Vol.VI p. 318 జర్మను కవీశ్వరుఁడగు, గవిఁటే, తన Faust (ఫౌస్టు) అను కావ్యమున "Thou shalt renounce! That is the eternal song which rings in everyone's ears; which our whole life-long every hour is hoarsely singing to us." [Faust Part I, lines 1195-1298] అని వర్ణించినాఁడు. క్రైస్తవధర్మములు తొలుదొల్త నుండియు సన్న్యాసపరములుగనే యున్నవియను విషయమై మఱియు అనేకాధారములు చెప్పవచ్చును.

జేమ్సు సలీ (James Sulli) తా నొనర్చిన Pessimism అను గ్రంథమున Optimist అనియు Pessimist అనియు రెండు మార్గముల నిరూపించినాఁడు. వానిలో Optimist అనఁగా ఉత్సాహము కలవాఁడనియు, Pessimist అనఁగా సంసారములో విసుగుఁ జెందినవాఁడనియు నర్థ మగును. ఈ శబ్దములు గీతలలో యోగ సాంఖ్యశబ్దములతో సర్వవిధముల సమానార్థకములు గావని నేను పూర్వమున నొక టిప్పణియందు (పృ. 301 చూడు) చెప్పినాను. మఱియు నా విషయమే యిచ్చో వివరింపఁబడినది. దుఃఖనివారణేచ్ఛ యని పూర్వమున వర్ణింపఁబడిన మూఁడవ మార్గమునకు సలీ యనువాఁడు Meliorism అను పేరిడెను.

దున్న క్రైస్తవధర్మము కాదు. నేఁటికిని శోఫెన్‌హౌయెర్ సంసారము దుఃఖమయము కావుననే త్యాజ్యమనియే చెప్పును. మఱియు గ్రీస్ దేశమున చిరకాలము క్రిందటనే తత్త్వవిచారములోనే యాయుష్య మును గడుపుట శ్రేష్ఠమా? లేక, లోకకళ్యాణార్థమైన రాజకీయములగు కార్యములను సాధించుట శ్రేష్ఠమా? యను ప్రశ్నము వచ్చినదని పూర్వమున చెప్పియే యుంటిని. పాశ్చాత్యుల ఈ కర్మత్యాగపక్ష మును, మన దేశమునందున్న సన్న్యాసమార్గమును నను నీ రెండును ననేక విషయములలో సమానములుగనే యుండును; గాన నా మార్గ మును సమర్థించు పాశ్చాత్యులయొక్కయు, పౌరస్త్యులయొక్కయు పద్ధతులు వేఱుకావని చెప్పవచ్చు ననునది యందలి సారాంశము; కాని కర్మత్యాగముకంటె కర్మమార్గ మేల శ్రేష్ఠ మనః కర్మత్యాగమార్గ మును సాధించుటకు అధునిక పాశ్చాత్యపండితులు చెప్పునట్టి కారణ ములకంటె గీతలయందున్న ప్రవృత్తిమార్గ ప్రతిపాదన యందలి యుక్తులు యుక్తముగ నున్నవి. వానిని, అందలి విశేషముల నిచ్చో వివరించెద. జగత్తునందున్న మనుజుల కందఱకును గాని, యనేకు లకుఁ గాని యధిక సుఖము (అనఁగా: ఐహికసుఖము) అనునదియే యీ జగత్తునందు ముఖ్యసాధ్యమనియు, నటు లెల్లరకును సుఖము గలుగు నిమిత్తమయి ప్రయత్నముఁ జేయుచు తా సుఖమందే తత్ప రుఁడై యుండుటయే ప్రతి మనుజునకును కర్తవ్య మనియు పాశ్చా త్యులగు నాధిభౌతిక కర్మమార్గీయుల యభిప్రాయము; మఱియు దానిం బలపఱచుటకై సంసారమందున్న దుఃఖముకంటె మొత్తముపై సుఖమే యధిక మగుననియు వారిలో ననేక పండితులు వాదించుచు న్నారు. ఈ యూహనుబట్టి విచారించితి మేని పాశ్చాత్యుల కర్మ మార్గము ననుసరించు జనులు "సుఖము లభించు నను నాశచే సంసారమును జేయు వా"రని యొక తెగయు, "సంసారమునందు విసుగు చెందిన వా" రని మఱియొక తెగయు నిట్లు పాశ్చాత్య కర్మ

త్యాగపక్షావలంబులు రెండు తెగలుగ నున్నారని చెప్పవలసివచ్చును. మఱియు నీ కారణముచేతనే వారిని 'ఆశావాదు' లనియు, 'నిరాశావాదు'లనియు ననుక్రమముగ పేర్కొనుచున్నారు;* కాని భగవద్గీతలయందు చెప్పఁబడిన రెండునిష్ఠలును వీనికంటె భిన్నములై యున్నవి. తనయొక్క గాని, లోకులయొక్క గాని యైహికవిషయ సుఖమునందలి యాశచేతనే సంసారమునందు ప్రవృత్తు లగుదురు గాన సామ్యబుద్ధిరూపమగు సాత్త్వికవృత్తియందు కొంచెమైనను భేద ముండక మానదు. కావున (గీతలలోఁ జెప్పన దేమన) సంసారము సుఖమయమైనను, దుఃఖమయమైనను సాంసారిక కర్మలను వదలుద మనుకొనినను, వదలనప్పుడు దానియందలి సుఖదుఃఖముల విచారించుటవలన నేమియు లాభము లేదనియు, సుఖకర మైనను దుఃఖకర మైనను మనుష్యజన్మము లభించుటయే మహాభాగ్య మని యెన్ని, కర్మసృష్టియొక్క యీ యపరిహార్యమగు వ్యవహారమునందు ప్రాప్తమగు వానిచే నంతఃకరణమును జెడగొట్టుకొనక "దుఃఖే ష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః" (గీ. 2.56) అను నీ న్యాయము ననుసరించి (అనఁగా: సామ్యబుద్ధితో) సహించుటయు, జగత్తుయొక్క ధారణపోషణనిమిత్తమై తమ యధికారము ననుసరించి తమ వంతునకు శాస్త్రముచేఁ బ్రాప్తమయిన కర్మయొక్క భాగమును ఫలము సంపాదించుకొనుట కని యెన్నక నిష్కామబుద్ధితో నామరణాంతమును జేయుచుండుటయే మనుజునకుఁ గర్తవ్య మనియు, భగవద్గీత చెప్పును. గీతాకాలమునందు చాతుర్వర్ణ్యవ్యవస్థ ప్రచారములో నున్నందున నీ సామాజికకర్మలు చాతుర్వర్ణ్య విభాగానుసారముగ ప్రతివానికి ప్రాప్తము లగునని యున్నది. కావున పదునెనిమిదియవ యధ్యాయమున 'గుణకర్మవిభాగశః' అను భేదమెట్లు నిష్పన్నమగు నదియుఁ జెప్పఁబడినది (గీ. 18.41-44). కాని యంతమాత్రముచే గీతలయందలి నీతితత్త్వములు చాతుర్వర్ణ్యరూపమగు సమాజవ్యవస్థనే యవలంబించి యున్నవని యెన్నకూడదు. అహింస మొదలగు నీతిధర్మముల

వ్యాప్తి చాతుర్వర్ణ్యమునకొఱకే కాదనియు, మనుష్యమాత్రునకు సామాన్యముగ బ్రాప్తమగు ననియు మహాభారతకారుఁడు పూర్తిగ నెఱుంగును. కావున చాతుర్వర్ణ్యములోఁ జేరని యనార్యులయందును నీ ధర్మము నడచుచునే యున్నది. వారిని రాజు పరిపాలన చేయునప్పు డీ సామాన్యధర్మము ననుసరించియే పరిపాలింపవలయునని భారతము నందు స్పష్టముగఁ జెప్పఁబడియున్నది (శాం. 65. 12-22). కావున గీతల యందున్న నీత్యుపపత్తియు చాతుర్వర్ణ్యము మొదలగు నొకానొక సమాజవ్యవస్థ నవలంబింపక సర్వమాన్యమగు నాధ్యాత్మికజ్ఞానాధారముచేఁ బ్రతిపాదింపఁ బడినది. శాస్త్రమువలన బ్రాప్తమయిన కర్తవ్యమును, నిష్కామమును, నాత్మౌపమ్యము గలదియునగు బుద్ధితోఁ జేయవలయు ననునది గీతలయందున్న నీతిధర్మముల యందలి ముఖ్యమైన సారము. ఇది యన్ని దేశములయందలి జనులకు సంబంధించి యుండును; కాని యాత్మౌపమ్యబుద్ధిచేతను, నిష్కామకర్మాచరణచేతను నీ సామాన్యములగు నీతితత్త్వములు సిద్ధము లయినను వానికి సంబంధింపఁ జేయఁదగిన కర్మ లీ జగత్తునందు బ్రతిమనుజున కెట్లు బ్రాప్తమగుననదియుఁ గొంచెము విచారింప వలసివచ్చును. కావుననే వానిని జెప్పుట కా కాలమునకు నుపయోగించునట్టి సహజములగు నుదాహరణముల నిచ్చుచు చాతుర్వర్ణ్యము గీతయందు చెప్పఁబడినది. అటులే గుణకర్మ విభాగముచే నా సమాజ వ్యవస్థకు సంక్షేపముగ నుపపత్తియుఁ జెప్పఁబడినది. ఇది గీతయందలి ముఖ్యాంశము గాదు. చాతుర్వర్ణ్యవ్యవస్థ యెక్కడనైన నడువక యుండినను నక్కడ సైతము తత్కాలమునందు బ్రచారములో నుండు సమాజవ్యవస్థ ననుసరించి, సమాజముయొక్క ధారణపోషణలకు సంబంధించి బ్రాప్తములగు కర్మల నన్నింటిని ధైర్యోత్సాహముల తోడను, నిష్కామబుద్ధితోడను కర్తవ్యములను చేయుటకు మనుజుఁడు జన్మించెనే కాని, కేవలసుఖోపభోగార్థమై జన్మింప లేదని సమస్త

మగు గీతాశాస్త్రముయొక్కయు వ్యాపకమగు సిద్ధాంతము. గీతల యందున్న నీతిధర్మములు కేవలము చాతుర్వర్ణ్య మూలకములయి యున్నవని యనేకులు చెప్పున దంతయు నిజము కాదని యెఱుంగ నగు. సమాజము హిందువుల దైనను, లేక, మ్లేచ్ఛుల దయినను, ప్రాచీనమైనను, లేక, యర్వాచీనమైనను, పౌరస్త్యమైనను, పాశ్చాత్య మైనను, దానియందు చాతుర్వర్ణ్య వ్యవస్థ ప్రచారములో నున్నచో దాని ననుసరించియు, లేక, మఱియొక సమాజవ్యవస్థ ప్రచారములో నున్నచో దాని ననుసరించియు మనకు ప్రాప్తము లయినవాని నశక్యము లగునేని మన యభిరుచి ననుసరించియు కర్తవ్యములని యొక సారి యాచరించితి మేని యవియే మనకు స్వధర్మములగును; పిదప నా ధర్మములను వదలి యే కారణముచేత నయినను నితరుల ధర్మ ముల నాచరించుట ధర్మదృష్టిచేతను సర్వభూతహిత దృష్టిచేతను సైతము నింద్య మగుచున్నదని గీతలు సెప్పుచున్నవి. "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః"–స్వధర్మమునందు మృతినొంది నను శ్రేయస్కరమగును; కాని పరులధర్మము భయావహము (గీ. 3. 35) అను గీతావచనమునకు నిదియె తాత్పర్యము. ఈ న్యాయ్య ముంబట్టియే, జాతిచే బ్రాహ్మణుఁడైనను దేశకాలానురూపముగ క్షత్ర ధర్మము నంగీకరించిన పెద్దమాధవరావు పీష్వాగారికి "స్నానసంధ్య లయందు సమయమును వ్యయపఱుపక క్షాత్రధర్మానుసారముగ ప్రజలను రక్షించుటయందు సమయమునంతయు వ్యయపఱచుట వలననే నీకు నుభయలోకములయందును కల్యాణమున్న" దని రామశాస్త్రి బువాగా రుపదేశించినా రను విషయము మహారాష్ట్రము నందు సుప్రసిద్ధము. సమాజధారణార్థమై యే విధమగు వ్యవస్థయుండ వలసినదియు చెప్పుట గీతయొక్క ముఖ్యోద్దేశము కానేరదు. సమాజ వ్యవస్థ యేదైన నగుఁ గాక! దానియందు యథాధికారముగ ప్రాప్త ములగు కర్మముల నుత్సాహపూర్వకముగఁ జేసి సర్వభూతహితమగు నాత్మశ్రేయమును సాధింపవలయునని గీతాశాస్త్రమునందలి ముఖ్య

తాత్పర్యము. ఇట్లు కర్తవ్యము లను నూహతో గీతలయందు వర్ణింపఁ బడిన స్థితప్రజ్ఞుఁడు సేయు కర్మలు స్వభావముచేతనే లోకకల్యాణ కారకములుగ నుండు ననుమాట నిజమే; కాని గీతలయందు వర్ణింపఁ బడిన స్థితప్రజ్ఞుని మనస్సున నా కర్మములచే నేను లోకకల్యాణము చేయుచున్నా నని యభిమానము లేకపోవుటచే సామ్యబుద్ధి యను నది యతని దేహముయొక్క స్వభావమై యున్నది. కావున నా కాల మందలి సమాజ వ్యవస్థానుసారముగ కేవలము కర్తవ్యము లను నూహతో వాఁడు సేయునట్టి కర్మలే స్వభావముగ లోకకల్యాణ కారకము లగుచున్నవి. ఆధునికులును, పాశ్చాత్యులు నగు నీతి శాస్త్రజ్ఞులు సంసారము సుఖమయ మనియు, ఈ సంసారసుఖమును సర్వజనులును బొందుటకొఱకై లోకకల్యాణకారకములగు కార్యము లను జేయవలయు ననియుఁ జెప్పుచున్నారు. ఇదియే పాశ్చాత్యుల యాధిభౌతిక కర్మమార్గమునకు గీతలయందున్న కర్మయోగము నకును గల భేదము.

అయినను పాశ్చాత్యులు నాధునికులు నగు కర్మయోగు లంద ఱును సంసారము సుఖమయ మని యంగీకరించువారు కారు. శోపెన్‌హాయెర్ వలె సంసారము దుఃఖప్రదముగ నున్నదని యన్నను లోకులయొక్క యీ దుఃఖమును శక్యమగునంతవఱకు తగ్గించుటయే నేర్పరియగు పురుషునకుఁ గర్తవ్యము. కావున సంసారమును వదలక లోకుల సుఖమును సాధ్యమగునంతవఱకు తగ్గించుటకు జ్ఞాని ప్రయ త్నింపవలయునని ప్రతిపాదించునట్టిది గాని, లేక, దుఃఖనివారణేచ్ఛ గల కర్మయోగులయొక్క గాని యొక :మతము పాశ్చాత్యదేశము నందును నిప్పుడు వెలువడినది. దానికి గీతలయందున్న కర్మ యోగముతో విశేషసామ్యము కలదు. "సుఖాద్బహుతరం దుఃఖం జీవితే నాత్ర సంశయః"— సంసారమందు సుఖముకంటె దుఃఖమే యధికముగ నున్న దనియు—

న జానపదికం దుఃఖ మేక శ్శోచితు మర్హతి,
అశోచన్ ప్రతికుర్వీత యది పశ్యే దుపక్రమమ్.

— సాధారణముగ నందఱు ననుభవించు దుఃఖమునుగుఱించి విచార పడరాదు. దానిని నివారించుటకై తన కేమైన నుపాయము తోఁచిన యెడల (జ్ఞాని) దానిం జేయవలయు, ననియు మహాభారతమున మనువు బృహస్పతికిని, నారదుఁడు శుకునకును జెప్పిరి (శాం.205. 5 మఱియు 330.15). దీనింబట్టి సంసారము దుఃఖమయమయినను, దానియందు జనుల కందఱకును గలుగఁబోవు దుఃఖమును దగ్గించు టకు నేర్పరియైనవాఁడు యత్నము చేయవలయునను మతము మహా భారతకారునకును నిష్టమే యని స్పష్ట మగుచున్నది; కాని యిదియే మా సిద్ధాంతము కానేరదు. ఐహికసుఖముకంటె నాత్మబుద్ధిప్రసాదము వలన కలుగు సుఖ మధికము గాన, నీ యాత్మబుద్ధి ప్రసాదసుఖమును బూర్ణముగ ననుభవించుచుండ కేవలము కర్తవ్యము లను నూహతో, అనఁగా: లోకులదు:ఖమును నేను తగ్గించు చున్నానని రాజసమగు నభిమానబుద్ధిని మానసమునం దిడక, సమస్తవ్యావహారికకర్మలను చేయవలయునని చెప్పుచున్న గీతలయందలి కర్మయోగముతో సమానమయిన దగుటకు, దుఃఖనివారణయం దిచ్ఛగల పాశ్చాత్యుల యొక్క కర్మయోగమున సైత మింకను ననేకములగు మార్పులు గావలయును. "తనకైనను, సర్వజనులకైనను నైహికసుఖమును— సుఖసాధనముల వృద్ధిపఱచి కాని, లేక, దుఃఖమును క్షీణింపఁజేసి కాని కలుగఁ జేయుట యను నదియే మనుజునకు జగత్తునందున్న సత్యమగు పరమసాధ్యము" అను నూహతోఁ బాశ్చాత్య పండితు లందఱును కొంచెమో గొప్పయో శోధించియుండుటచే, "సంసారము దుఃఖమయమయినను నపరిహార్య మని యెఱింగి కేవలము లోక సంగ్రహార్థమై జగత్తునందున్న కర్మములను చేయవలయును" అని చెప్పుచున్న గీతల యందున్న నిష్కామ కర్మయోగము వారి

శాస్త్రమునందు స్పష్టముగఁ గాన్పింపదు. ఎల్లవారును కర్మమార్గీయు లన్నమాట నిజమే; కాని పాశ్చాత్య కర్మయోగులు (సుఖేచ్ఛవులు) సుఖము గోరువారైనను, (దుఃఖనివారణేచ్ఛవులు) దుఃఖనివారణ మును గోరువారైనను సకాములే. గీతలయందున్న కర్మయోగి యెప్పుడును ఫలవిషయ మయి నిష్కాముఁడే. ఈ విషయమునే గీతలయందున్న కర్మయోగము సాత్త్వికమును, పాశ్చాత్యకర్మయో గము రాజసమును గాన నీ రెంటికిని శుద్ధ నీతిదృష్టిచేతను భేదముండు నటుల కాన్పించునని మఱియొక విధముగ సైతము చెప్పవచ్చును (గీ. 18. 23, 24. చూడు).

కేవలము కర్తవ్య మను తలంపున పరమేశ్వరార్పణబుద్ధితో సర్వసాంసారికకర్మలను జేయుచు దానిగుండ పరమేశ్వరోపాసనము నామరణాంతమును జేయుచుండవలయునని యీ గీతలయందున్న జ్ఞానయుక్తమగు ప్రవృత్తిమార్గమునే, లేక, కర్మయోగమునే భాగవత ధర్మమని చెప్పుదురు. "స్వే స్వే కర్మ ణ్యభిరతః సంసిద్ధిం లభతే నరః" (గీ. 18. 45) అను నీ గీతాశ్లోకార్థమే యీ మార్గమందలి రహస్యము. ఈధర్మముల నిరూపణము మహాభారతమున వనపర్వము నందు బ్రాహ్మణవ్యాధకథయందును (వన. 208) శాంతిపర్వము నందలి తులాధార జాజలి సంవాదమునందును (శాం. 261) చేయఁ బడియున్నది. మనుస్మృతియందును యతిధర్మనిరూపణానంతరమున వైదిక సన్న్యాసులకు కర్మయోగమును నీ మార్గమే విహితము మోక్ష ప్రదముగ నున్నదని చెప్పఁబడెను (మను. 6 96,97). 'వేదసన్న్యా సిక' అనుపదముంబట్టి వేదముయొక్క సంహిత నుండియు, బ్రాహ్మణ గ్రంథముల నుండియు వెలువడిన యర్థ మగుచున్నది గావున నీ మార్గము మన దేశమునం దనాదికాలమునుండియుఁ బ్రచారములో నున్నదని సిద్ధ మగుచున్నది. వేయేల? కేవల మీ దేశ మెప్పుడును విభవముతోఁ గూడనిదిగ నుండలేదు. కారణ మేమియన: ఏ దేశమం

డైనను కర్తలని చెప్పఁబడువారు కర్మమార్గమునకే పురస్కర్తలై యుండవలయు నని స్పష్టమయినది; కాని కర్తయైనను బ్రహ్మజ్ఞానమును వదలక, బ్రహ్మజ్ఞానముతోడనే కర్తృత్వమును స్థిరముగ నునుపవలయునని మన కర్మయోగముయొక్క ముఖ్య సిద్ధాంతము. మఱియు నీ బీజభూతమగు తత్త్వమును వ్యవస్థితముగ వివేచించి భగవంతుఁ డీ మార్గమును మిక్కిలి బలపఱచి ప్రచారములోనికిఁ దెచ్చెను. ప్రాచీనమార్గమునకే పిదప భాగవతధర్మమని పేరు వచ్చి యుండునని వెనుకఁ జెప్పియుంటిని. అట్లు గాక కొంద అజ్ఞానుల చిత్తము మొదటినుండియు స్వభావముగనే సన్న్యాసమార్గమువైపునకే ప్రసరించియుండును. లేదా, గృహస్థాశ్రమములో నుండి తుదకు మరణ సమయమందైనను సన్న్యాసముఁ గైకొనవలయునని మనస్సునందుండియుండును; కాని, పిదప నిజముగ వారు సన్న్యాసమును గైకొనినను గైకొనవచ్చును, కైకొనకపోయినను బోవచ్చు నని యుపనిషత్తులంబట్టి వ్యక్తమగుచున్నది. కావున సన్న్యాసమార్గము నూతన మైనదని చెప్పుటకు సాధ్యము కానేరదు; కాని స్వభావవైచిత్ర్యము మొదలగు కారణములచే నీ రెండు మార్గములును మన దేశమునం దిట్లు చిరకాలమునుండియుఁ బ్రచారములోనున్నను వైదిక కాలమందు మీమాంసకుల కర్మమార్గమే లోకమునందు విశేషముగఁ బ్రబలియుండెను. మఱియుఁ గౌరవపాండవుల కాలమునం దీ కర్మయోగమునకు ముందు సన్న్యాసమార్గమున కాధిక్యత లేదనుటకు సందేహ మేమియు లేదు. కారణ మేమియన: కౌరవ పాండవుల యనంతరమున (అనఁగా: కలియుగమున) సన్న్యాసధర్మము నిషిద్ధమైనదని మన ధర్మశాస్త్రకారులు స్పష్టముగఁ జెప్పినారు. మఱియు "ఆచారప్రభవో ధర్మః" (సభా. అను. 149.137; మను. 1.108) అను వచనము ననుసరించి ధర్మశాస్త్రము లనునవి తఱచుగ నాచారములకే యనువాదకము లగుచున్నందున ధర్మశాస్త్రకారులు, నిషేధమును

విధించుటకంటె ముందే లోకాచారమునందు సన్న్యాసధర్మము గౌణముగ నుండి యుండవలయు నని సహజముగ సిద్ధ మగుచున్నది; కాని కర్మయోగ మీ రీతిగ మొదట ప్రబల మగుటచేఁ దుదకుఁ గలియుగమునందు సన్న్యాసధర్మము నిషేధింపఁబడినదని యనిన, నొక పర్యాయము విశేషముగ వ్యాపించిన యీ జ్ఞానయుక్త కర్మయోగము తరుగునట్టి కాలమువచ్చి ప్రస్తుతమునం దున్న భక్తి మార్గమునందు సైతము సన్న్యాసపక్ష మొక్కటియే శ్రేష్ఠమను మత మెట్లు ప్రబలెనని సహజముగ నొకసందేహము కలుగును. శ్రీమదాది శంకరాచార్యు లీ భేదమును గలుగఁ జేసిరని యనేకు లనెదరు; కాని యితిహాసముం బట్టి విచారించితి మేని యీ యుపపత్తి సరి యైనది కాదని కాన్పించును. శ్రీశంకరాచార్యుల సంప్రదాయములో 1. మాయావాదాత్మకమగు నద్వైతజ్ఞాన మనియు, 2. కర్మసన్న్యాస ధర్మ మనియు రెండు విభాగములు కలవని నేను మొదటిప్రకరణము ననె చెప్పియున్నాను. వీనిలో నద్వైతబ్రహ్మ జ్ఞానమువలెనే, సన్న్యాస ధర్మములు నుపనిషత్తులయందు ప్రతిపాదింపఁబడిన వైనను నీ రెండింటి కిని సంబంధము నిత్యము కామిచే నద్వైతవేదాంతమార్గము స్వీక రింపఁబడిన యెడల సన్న్యాసమార్గము సైతము స్వీకరింపఁబడినదే యని చెప్పరాదు. ఉదాహరణము: యాజ్ఞవల్క్యాదులవలన నద్వైత వేదాంతమును బూర్ణముగ నభ్యసించిన జనకాదులు తాము కర్మ యోగులుగ నుండిరి. ఇంతియ కాక యుపనిషత్తుల యందున్న యద్వైతబ్రహ్మజ్ఞానమే గీతలయందు ప్రతిపాద్యముగ నున్నను నీ జ్ఞానాధారముచేతనే సన్న్యాసమునకు మారుగఁ గర్మయోగము గీతలయందు నమర్థింపఁబడినది. కావుననే సన్న్యాసధర్మములను బలపఱచు శాంకరసాంప్రదాయముపైఁ జేయఁబడిన యాక్షేప మీ సంప్రదాయమునం దున్నయద్వైతజ్ఞానమునకు తగులక తదంతర్గత మగు సన్న్యాసధర్మమునకు మాత్రమే తగులవచ్చునని గుర్తించు

కొనవలయును. ఈ సన్న్యాసమార్గము నాచార్యులవారు క్రొత్తగ సృజియింపక పోయినను కలివర్జ్యములయం దుండుటచే దానికిఁ గలిగిన గౌణత్వమును ఖండించినది మాత్రము సత్యమే; కాని యంతకు మునుపు కారణాంతరములచే సన్న్యాసమార్గమున నిచ్ఛ లోకులకుఁ బుట్టి యుండనిచో నాచార్యులవారు సన్న్యాసపరమగు మతము నింత ప్రసరింపఁజేసి యుందురా యని యొక వికల్పము గలుగుచున్నది. మఱియు నొక చెంపపై నెవఁడైనను గొట్టెనేని, "ఈ చెంపపైనను గొట్టు" మని రెండవదానిని, గొట్టువాని వైపునకుఁ జూపు మని క్రీస్తువు చెప్పెను; కాని యీ మతము నవలంబించిన వారు యూరపుఖండము నందున్న క్రైస్తవరాష్ట్రములలో నెందఱుం డినను నొకానొక ధర్మోపదేశకుఁ డొక విషయము మంచిది యని చెప్పినంతమాత్రముననే, నది ప్రచారములోనికి వచ్చునది కాదనియు, లోకుల కా విషయముపై నెక్కువ యభిలాష యుండుట కంతకు మును పేదో యొక బలవత్తరమగు కారణ ముండి యుండవలయు ననియుఁ దోఁచును. మఱియు లోకాచారము క్రమక్రమముగ మాఱుచుండు టచే, దాని ననుసరించియే ధర్మనియమములకు సైతము మార్పు గలుగుచుండునని స్పష్ట మగుచున్నది. ఆచార మనునది ధర్మమునకు మూల మను స్మృతివచనమునకు తాత్పర్య మిదియే. జర్మన్‌దేశమున శోఫెన్‌హాయెర్ అనువాఁడు గడచిన శతాబ్దమున సన్న్యాసమార్గ మును సమర్థించెను; కాని యా మత మిప్పటికిని యా దేశమున తల యెత్తినటులఁ గాన్పింపదు. శోఫెన్‌హాయర్ మతముకంటె నిత్శే యను వాని మతమే ప్రస్తుతమునం దధికముగ వ్యాపించియున్నది. మఱియు మన దేశమునందుఁ జూచినను సన్న్యాసమార్గము శ్రీశంకరా చార్యులవారికంటె పూర్వమునందే (అనఁగా: వైదికకాలమునందే) పుట్టియున్నదైనను నప్పటివారు కర్మయోగము నెప్పుడును వదలి వేయలేదు. స్మృతిగ్రంథములలోఁ దుదకు సన్న్యసింపవలయు నన్న మాట నిజమే; కాని దానియందును పూర్వాశ్రమమునందున్న

కర్తృత్వము బొత్తిగా లేదని చెప్పలేదు. మఱియు శ్రీశంకరాచార్యుల వారి గ్రంథములలో సైతము కర్మసన్న్యాసపక్షమే ప్రతిపాద్యమైనను, జ్ఞానులును, సన్న్యాసులును యథాధికారముగ ధర్మసంస్థాపనవంటి లోకసంగ్రహార్థములగు కర్మలను చేయఁగూడదని చెప్పఁబడలేదు (వే.సూ.శాం.భా. 3.3.32). వారిచరిత్రయే సాక్ష్య మిచ్చుచున్నది. సన్న్యాసమార్గము ప్రబల మగుటకు శంకరాచార్యులవారియొక్క స్మార్తసంప్రదాయమే కారణ మయియుండినచో నాధునికభాగవత సంప్రదాయస్థాపకులగు రామానుజాచార్యులవారు తమ గీతాభాష్య మునందు శంకరాచార్యులవారివలెనే కర్మయోగము గౌణ మని చెప్ప నవసరము లేకపోవును; కాని యొకసారి విశేషముగఁ బ్రచారము నకు వచ్చిన కర్మయోగము భాగవతసంప్రదాయమునందు సైతము నివృత్తిపరమగు భక్తిమార్గముచే నణఁచి వేయఁబడినందున యది యణఁగిపోవుటకు సర్వసంప్రదాయములకును గాని, లేక, యన్ని దేశములకును గాని యొక్కవిధముగనే సంబంధించునట్టి మఱియొక కారణమేదియో యుండియుండు నని చెప్పవలసివచ్చును. జైనబౌద్ధ ధర్మములయొక్క యుదయము, ప్రసార మనునవి వానిలో మొద టివియు, ముఖ్యములునగు కారణములు. ఈ రెండుధర్మములు నాల్గు వర్ణములకు సన్న్యాసస్వీకారమునం దభిరుచిఁ గలుగఁ జేయుటచే, క్షత్రియవర్గమునందు సైతము, సన్న్యాసధర్మముల యొక్క విశేష మగు ప్రచార మారంభ మాయె నని మా యభిప్రాయము; కాని కర్మ శూన్యమగు సన్న్యాసమార్గమునే మొట్టమొదట బుద్ధుఁ డుపదేశించి నను బౌద్ధయతులు ఖడ్గమృగములవలె వనమం దొంటరిగ నుండక ధర్మప్రచారార్థమును, పరోపకారార్థమును సదా యుపదేశాదికమును జేయుచునే యుండవలయునని గీతలయం దున్న కర్మయోగమునకు వలె బౌద్ధధర్మమునకును, వెంటనే సంస్కారము జరిగెను. (పరిశిష్ట ప్రకరణము చూడుడు). మఱియు నీ సంస్కారము గలుగుటచేతనే బౌద్ధ ధర్మీయులైన యతు లుత్తరదిక్కున టిబెట్టునందును, తూర్పున

బ్రహ్మావర్తముననను, చీనా, జపానుదేశములయందును, దక్షిణమున సింహళముననను, పశ్చిమమున తుర్కిస్థానముననను దానికి సంబంధించిన యూరపుఖండముననందలి గ్రీసు మొదలగుదేశముల పర్యంతమును వ్యాపించి యా మతము విస్తరింపఁజేసిరని యితిహాసముంబట్టి తెలియుచున్నది. శాలివాహనశకమునకు పూర్వము ఆఱేడువందల యబ్దములకు పూర్వమున జైనులయొక్కయు, బౌద్ధులయొక్కయు ధర్మములకు ప్రవర్తకులు పుట్టిరి. మఱియు శంకరాచార్యులవారు శాలివాహనశకానంతరమం దాఱువందల యబ్దంబుల కవతరించిరి. పిదప ముఖ్యముగ ధర్మార్థమయి పని చేయుచున్న బౌద్ధ యతి సంఘములయొక్క వైభవము లోకులకుఁ గన్పట్టుచుండుటచే యతి ధర్మముల విషయమై యొక విధమగు కోరిక, లేక, యాదరబుద్ధి శంకరాచార్యుల యవతారమునకుఁ బూర్వమునందే జనులకుఁ గలిగియుండెను. మఱియు జైన బౌద్ధధర్మములను శ్రీశంకరాచార్యులవారు ఖండించిన యతిధర్మముల విషయమయి లోకులకుఁ గలిగిన యాదరబుద్ధికే వైదికస్వరూపము నిచ్చి బౌద్ధధర్మములకు మారుగ వైదికధర్మముల సంస్థాపనకొఱకు వ్యాపించునంత యధికారము మాత్రమే కలిగిన వైదిక సన్న్యాసమును స్థాపనఁ జేసిరి. ఈ సన్న్యాసులు బ్రహ్మచర్యవ్రతము గలవారుగనే యుండి, కాటీదండములను స్వీకరించుచున్నారనుట నిజమే. అయినను వారును వైదికధర్మ సంస్థాపన మను కర్మను తమ గురువులవలెనే తామును జేయుచునుందురు. యతిసంఘములలో నీక్రొత్త యతిసంఘమును (వైదిక యతుల సంఘమును) జూడ, శ్రీశంకరాచార్యులవారి సన్న్యాస మార్గమునకును, బౌద్ధుల సన్న్యాసమార్గమునకును గొంత భేదమే మైన నుండునేమో యని కొందఱకుఁ దోఁచియుండును. ఆ సంశయ నివారణమునకై ఛాందోగ్యోపనిషద్భాష్యమునందు బౌద్ధమును, సాంఖ్యము నగు యతిధర్మము వేదబాహ్య మనియు, సనత్య మనియు మన సన్న్యాసధర్మములు వేదాధారముచే ప్రవృత్తము లైనవి యని

యు నాచార్యులవారు వ్రాసియుందు రని కన్పట్టుచున్నది (ఛాం. శాం. భా. 2.23.1). వా రెందునిమిత్తమై యటుల వ్రాసినను వ్రాయుదురు గాక! కలియుగమునందు యతిధర్మముల ప్రచారము మొదట బౌద్ధులచేతను, జైనులచేతను జేయఁబడినది యను విషయము నిర్వివాదమయి యున్నది; కాని ధర్మప్రచారణముకొఱకుఁ గాని లోకసంగ్రహముకొఱకుఁ గాని చేయవలసిన కర్మలను బౌద్ధయతులును జేయుచునే యుండిరి. వాని, నిరసించుటకై శ్రీశంకరాచార్యులవారు స్థాపించిన వైదిక సంఘమువారును. కర్మను బొత్తిగ విడనాడక తమ ప్రయత్నముచేతనే వైదిక ధర్మములను మరల స్థాపించినారని యితిహాసముంబట్టి స్పష్టమగుచున్నది. ఈ కాలమునకు పిదప కొన్ని యబ్దంబులకుఁ దురుష్కు లీ దేశమునకు రా నారంభించిరి. మఱియు పరాక్రమముచే పరచక్రమునందుండి రక్షించి దేశముయొక్క ధారణపోషణలంజేయు క్షత్రియులగు రాజ్యకర్తలు క్షీణింపసాగిరి. తురుష్కులు దేశము నాక్రమించిరి. దేశమునందుండిన కర్తృత్వశక్తి తురుష్కులకాలమున నశించినది. ఇట్టి సమయమున సన్న్యాసము, కర్మయోగము నను నీ రెండుమార్గములలోను మొదటిది, యనఁగా కేవలము "హరి హరి" యనుచు స్వస్థముగఁ గూర్చుండుట యను మార్గ మొక్కటియే శ్రేష్ఠమును, మూలమున నేకదేశీయమగు మతమా కాలమునందలి బాహ్యపరిస్థితికి విశేషసులభమై యుండుటచే సాంసారికులకును నత్యధికముగ గ్రాహ్య మని తోఁచియుండు నని కాన్పించుచున్నది. ఇంతకు పూర్వమునం దిట్టి స్థితి లేదు.

అపహాయ నిజం కర్మ కృష్ణ కృష్ణేతి వాదినః,
తే హరే ర్ద్వేషిణః పాపాః ధర్మార్థం జన్మ యద్ధరేః. *

---

* బొంబయిలో ముద్రితమైయుండు విష్ణుపురాణములో నీ శ్లోకము కన్పట్టదు; అయినను కమలాకరభట్టువంటి ప్రామాణికుఁడగు గ్రంథకారుఁడు గ్రంథములో నున్నదని చెప్పినందున దీని నసత్యమని చెప్పుటకు సాధ్యము కానేరదు.

— తమ (స్వధర్మోక్తములగు) కర్మలను వదలి (కేవలము) హరిహరి యనుచు కూర్చుండువారు హరికి ద్వేషులును పాపులును నగుదురు. కారణ మేమియన: ఆ హరి యవతారమయినను ధర్మరక్షణముకొఱకే యయి యున్నది అని శూద్రకమలాకరమునం దుదాహరింపఁబడిన విష్ణుపురాణమునందున్న శ్లోకముగుండ స్పష్ట మగును. యథార్థముగఁ జూచితి మేని యీ జనులు సన్న్యాసమునందు నిష్ఠులు కారు. కారణ మేమి యన: వారు సన్న్యాసులవలె జ్ఞానము గలుగుటచేఁ దీవ్రమగు వైరాగ్యముతో సర్వసాంసారిక కర్మలు వదలలేదు; మఱియు సంసార మందుండినను కర్మయోగులవలె శాస్త్రమువలన ప్రాప్తములగు కర్మలను (కర్తవ్యములను) నిష్కామబుద్ధితోఁ జేయుటయును లేదు. కావున నీ నామమాత్రసన్న్యాసులు గీతలయందు వర్ణింపఁబడని మూఁడవ మార్గము (నిష్ఠ) నంగీకరించు వారైరి. ఏ కారణము చేతనైన నేమి? లోకు లీ మూఁడవ మార్గమున ప్రవర్తించువారుగ పరిణమించినచో, ధర్మము సైతము నశింపక యుండదు. ఇరాన్ దేశములోనుండి పారశీక ధర్మములఁ దొలఁగించుటకు నట్టి స్థితియే కారణము. కావున భరతఖండమున వైదిక ధర్మము సైతము (సమూలం చ వినశ్యతి) సమూలముగ నశింపఁబోవు సమయము తటస్థించెను. కాని బౌద్ధ ధర్మములు నశించిన పిదప వేదాంతమునకువలె గీతలయందున్న భాగవతధర్మములకుఁ బునరుజ్జీవనము గలుగుటచే మన దేశమునందీ దుష్పరిణామము సంభవింపలేదు. దౌలతాబాదుయొక్క హిందూ రాజ్యమును ముసల్మానులు పాడుచేయుటకు పూర్వమున కొన్ని యబ్దముల క్రిందట మన యదృష్టవశమున జ్ఞానేశ్వరమహారాజుగారు భగవద్గీతలకు వ్యాఖ్యానము మహారాష్ట్ర భాషలో నలంకరింపఁ జేసిరి. బ్రహ్మవిద్యను మహారాష్ట్ర దేశమున నతిసులభముగ వ్యాపింపఁ జేసిరి. మఱియు భరతఖండముయొక్క యితర ప్రదేశములలోను నీ సమయమునందే గీతలయందున్న భక్తిమార్గము నితరులగు సాధువులును సత్పురుషులును విశేషముగ బ్రాహ్మణ, చండాలాదులకు సైతము,

సమమును, జ్ఞానమూలకమును నగు గీతాధర్మములయొక్క దేదీప్య మానమగు నుపదేశము నలుదిక్కుల నొక్క కాలముననే వ్యాపించెను. కాఁబట్టి హిందూధర్మములు పూర్ణముగ నశించిపోవు నను భయము లేకపోవుటయే కాక, కఠినములగు తురుష్కుల ధర్మములందు సైతము దాని విషయములను (గీతాధర్మవిషయములను) కొంత ప్రవేశపెట్టు టచేఁ గబీరువంటి సాధువు సత్పురుష మండలములందుఁ జేరుటకు వీలైనది. మఱియు నీ సమయముననే యౌరంగజేబునకు జ్యేష్ఠభ్రాత యగు “శాహజాదా దారా” యనువాఁడు తన యాజమాన్యము క్రింద నుపనిషత్తులను పారశీకభాషకు భాషాంతరీకరణముఁ గావించెను. వైదిక భక్తి ధర్మమాధ్యాత్మజ్ఞానాధారమున కాక కేవలము తాంత్రికశ్రద్ధయొక్క పుట్టుకీటుమీఁదనే కట్టఁబడినచో, దాని కేమైన నిజమగు సామర్థ్యము కలదా? లేదా? యను సందేహము కలుగ వచ్చును; అయినను భాగవతధర్మములయొక్క యాధునికమగు పున రుజ్జీవనము తురుష్కుల రాజ్యకాలమునందే సంభవించుచుండుటచే, నవియును నెక్కువగా భక్తిపరములే యగుటచే (అనఁగా: ఏకదేశీ యము లగుటచే), మూలభాగవతధర్మములకు కర్మయోగమునకును నొక కాలమున కొఱఁతపడినందున నది మరల ప్రాప్తముకామిచే, కర్మయోగము సన్న్యాసమార్గముయొక్క యంగము, లేక, సాధన మని చెప్పుటకు నాఱుగ నది భక్తిమార్గమున కంగ మని యా సమ యమునందున్న భాగవతధర్మములయొక్క సాధుసంఘమును, పండి తులును, నాచార్యులును వక్కాణింప నారంభించిరి. ఆ కాలమున వెలువడిన యీ సర్వసాధారణమగు నీ జ్ఞానమునకు విరుద్ధముగ శ్రీ సమర్థరామదాసస్వామివారు తాము రచించిన దాసబోధగ్రంథములో నిరూపించినారు. మఱియుఁ గర్మమార్గముయొక్క సత్యమగు మహ త్త్వము శుద్ధముగను, తేటతెల్లముగను మహారాష్ట్ర భాషయం దుఁ జెప్పఁబడినది. కావున నెఱుంగఁ గోరువారు సమర్థులయొక్క దాసబోధను- అందు సైతము ముఖ్యముగ నుత్తరార్ధమును జదువ

వలయును. శ్రీ సమర్థులవారి యుపదేశమే శ్రీ శివాజీమహారాజు గారికి లభించెను; మఱియు మహారాష్ట్రదేశమునందు సైతము పిదప కర్మయోగముయొక్క తత్త్వమును దెలియఁజేయుట యావశ్యక మని తోఁచినప్పుడు శాండిల్యసూత్రములకును బ్రహ్మసూత్రములకును మాఱుగ మహాభారతమును గద్యాత్మకముగ భాషాంతరీకరణముఁ జేసికొనిరి. అటులే బఖరను (ప్రాకృతమున వచనరూపమున రచి యింపఁబడిన చరిత్రము) పేరు గలిగిన యైతిహాసికమగు వ్రాఁతలో దానినభ్యసించుట యారంభమాయెను. ఈ భాషాంతరములు తంజా వూరిలో నున్న పుస్తకాలయమునందు నేఁటికిని నున్నవి. ఈ పద్ధతి తర్వాత నబాధితముగఁ బ్రచారములో నుండినను గీతలమీఁది యేక దేశీయములగు టీక లణఁగిపోయినను మహాభారతమందున్న సమస్త నీతితత్త్వముల సారమంతయు గీతాధర్మములయం దున్న కర్మయో గమునందు వర్ణింపఁబడియున్న దను విషయము కాలానుసారముగ మరల జను లెల్లరకును దెలిసిననే కాని నిలువనేరదు; కాని కర్మయో గముయొక్క పునరుజ్జీవనము మన దౌర్భాగ్యముచే చిరకాలము నిలువ లేదు.

ఆ సంగతి యటులుండ నిమ్ము; హిందూదేశమునందున్న ధార్మికేతిహాసములను వివేచించుట కిది సమయము కాదు. గీతల యందున్న ధర్మమునం దొక విధమగు సజీవావస్థ, తేజస్సు, లేక, సామర్థ్యము ఉండుటచే నడుమ నడుమ దైవవశముచే సన్న్యాస ధర్మ ములయొక్క యభ్యుదయముచేత సైత మా సామర్థ్యము నష్టము కాలే దను విషయము పైన చెప్పిన సంక్షిప్తమగు వివేచనచే చదువరు లకుఁ దెలియును. 'ధారణా ద్ధర్మః' అని ధర్మశబ్దమునకు ధాత్వర్థము సామాన్యముగ నది 'పారలౌకికము', 'వ్యావహారికము', లేక, 'మోక్ష ధర్మము - నీతిధర్మము' నని రెండు విధములుగ నున్నదవి మూఁడవ ప్రకరణమునందుఁ జెప్పియే యున్నాఁడను. వైదిక ధర్మమునందైనను

బౌద్ధధర్మమునం దైనను, లేక, క్రైస్తవధర్మమునం దైనను, జగత్తు యొక్క ధారణపోషణలును, మనుజునకుఁ దుదకు సద్గతియును లభింపవలయు నను నదియే యందఱకును ముఖ్యోద్దేశ్యము గాన, మోక్ష ధర్మమువలెనే వ్యావహారికములగు ధర్మాధర్మములును నన్ని మత ధర్మములయందు కొంచెమో గొప్పయో వివేచింపఁబడినవి. వేయేల? పూర్వకాలమునందు మోక్షధర్మములు వేఱనియు, వ్యావహారికధర్మ ములు వేఱనియు భేదములేకయే యుండెనని చెప్పినను చెప్పవచ్చును. కారణ మేమియన: పరలోకమునందు సద్గతి లభించుటకై యీ జగత్తు నందలి యాచరణము శుద్ధముగనే యుండవలయు నని యందఱు నెఱుంగుదురు. ఇంతియే కాక, గీతలలోఁ జెప్పినటుల పారలౌకిక ములు నైహికములగు కల్యాణములకుఁ బునాది యొక్కటియే యని యందఱు నొప్పుకొందురు; కాని యాధిభౌతికజ్ఞానప్రసారముచే, ప్రస్తుతమున పాశ్చాత్యదేశమునందు నీ జ్ఞానము దృఢముగ నుండక పోవుటచే మోక్షధర్మములు తప్ప మిగిలిన నీతినియమములకు (అనఁ గా: ఏ నియమములచే జగత్తుయొక్క ధారణపోషణలు జరుగునో యా నియమములకు) నుపపత్తి చెప్పుటకు సాధ్యమగునా? కాదా? యను విచార మారంభమై కేవలాధిభౌతిక మగు (అనఁగా: దృశ్యము, లేక, వ్యక్తమును) పునాదిమీఁదనే సమాజధారణశాస్త్రరచన ప్రారంభమయి నది. అయినను కేవలము వ్యక్తముచేతనే కార్యనిర్వాహ మెటులు కలుగును? వృక్షము, మనుష్యుఁడు నను జాతివాచకశబ్దములుకూడ నవ్యక్తమగు నర్థమునే బోధించుచున్నవి. మామిడిచెట్టు, గులాబిచెట్టు అనునవి వేఱ్వేఱగు వస్తువులు, దృశ్యము లను మాట సత్యమే; కాని వృక్ష మను సామాన్యశబ్దమే దృశ్యవస్తువునుగాని, వ్యక్తవస్తువునుగాని బోధింప నేరదు. ఇటులే మన వ్యవహారము లన్నియు ప్రచారములో నున్నవి. అవ్యక్తముయొక్క కల్పన మనస్సునందు బాగుగ స్థిరపడు టకు మొదట వ్యక్తవస్తు వేదయినను కంటియెదుట నుండవలయు నని దీనివలన స్పష్టమగుచున్నది; కాని వ్యక్త మనునదియే కడపటి

మెట్టు కాదు; గాన నవ్యక్తముయొక్క యాశ్రయము లేక యొక్క యడుగైనను ముందుకు సాగలేము, లేక యొక వాక్యమునైననుం బూర్తిగఁ జెప్పలే మనునది నిశ్చయముగఁ దెలిసికొనవలయును. కావున నధ్యాత్మదృష్టిచే నీతిశాస్త్రమునకు నాధారమని యొప్పుకొనఁ బడిన సర్వభూతాత్మైక్యరూప మగు పరబ్రహ్మముయొక్క యవ్యక్త కల్పనను వదలివేసినను తుదకు దానికి మాఱుగ నా స్థానమునందు "సర్వమానవజాత"మును నీ నేత్రములకుఁ గాన్పింపనిది గనుకనే యవ్యక్తమగు వస్తువే, దేవతవలె పూజ్య మని యంగీకరింపవలసి వచ్చును. మఱియు సర్వ మానవజాతియందే గతించిన తరములును, జన్మింపఁబోవు తరములును సమావేశ మగుటచే నమృతత్వవిషయ మగు మనుజుని స్వాభావికప్రవృత్తి తృప్తి చెందవలయునని యొప్పి కొని యీ గొప్పదేవుని భక్తితోడను ననన్యభావముతోడను నుపాసించుటయు నాతని సేవయందు దన యాయువంతయు వ్యయము చేయుటయు లేక, యాతనికొఱకు సమస్తమగు స్వార్థములను యజ్ఞము చేయుటయు ననునవియే ప్రతి మనుజునకును నీ జగత్తునందుఁ గర్తవ్యములయి యున్నవని యనేకులగు (వాటిలోఁ దొంబదితొమ్మిది పాళ్లు) నాధిభౌతికపండితులును నిప్పుడు బహుదృఢముగ నుపదేశించుచున్నారు. జర్మన్‌పండితుఁడగు కాంటు ప్రతిపాదించిన ధర్మమునకు నిదియే సారమగుటచే నీ ధర్మమునకే "సకల-మానవ-జాతి ధర్మము", లేక, సంక్షేపముగఁ జెప్పవలసియుండెనేని "మానవ ధర్మము" అను పేరే యతని గ్రంథమునందు వ్రాయఁబడినది. * అర్వాచీనకాలమునం దున్న జర్మన్‌పండితుఁడగు 'నిత్శే'యొక్క యభి

* కాంటు తన గ్రంథమునకు Religion of Humanity అని పేరిడెను. ఆ గ్రంథము కాంటు రచించిన A System of Positive Polity [Eng. trans. in four Vols.] అను గ్రంథమునందు సవిస్తరముగ వివేచింపఁబడినది. కేవల మాధిభౌతికదృష్టిచే నైతము సమాజము నెటు లుద్ధరింపవలయునని యీ గ్రంథమునం దుత్తమముగఁ జర్చింపఁబడినది.

ప్రాయమును నిదియే యైయున్నది. క్రీస్తుశకమునందలి పందొమ్మిది యవ శతాబ్దమున పరమేశ్వరుఁడు మరణించెనని యతనిచే స్పష్టముగఁ జెప్పఁబడి యున్నది. అధ్యాత్మశాస్త్రమంతయు నసత్యమనియు నతఁడు సెప్పెను. అయిననునాధిభౌతికదృష్టిచేతనే, కర్మవిపాకము, పునర్జన్మము నను చక్రము నంగీకరించి, తుదకు తనకు మరల ప్రతి జన్మమందు చేయుటకు సాధ్యములగు కృత్యములం జేయుటయు, నెవరి మనోవృత్తు లన్నియు మిక్కిలి వికసితము లగుటచే పూర్ణావస్థను నొంది యున్నదియు, మానవజాతి ముం దేవిధమున జన్మింపఁగలదో యా విధముననే సమాజవ్యవస్థ నుంచుట యనునదియే యీ జగత్తున మనుష్యమాత్రునకు కర్తవ్యము, పరమసాధ్యము ననియు నతఁడు తన గ్రంథములలో నంతటఁ బ్రతిపాదించినాఁడు. అధ్యాత్మశాస్త్రము నొప్పుకొనినవారు గూడ కర్మాకర్మవివేచనము చేయునప్పు డేదయిన నొకటి పరమసాధ్య మనవలసివచ్చును. మఱియు నది యవ్యక్తమే యగుననియు దీనింబట్టి కన్పట్టుచున్నది. కారణ మేమి యనః సమస్త మానవజాతిరూపమగు మహాదేవత నుపాసించి సర్వజనులకును హితమును సంపాదింపుమని చెప్పినను, లేక, ముందెప్పుడైన నత్యంత పూర్ణావస్థనొందిన మనుజునివలె నేమిచేయుటచే జన్మించునో యట్టి కర్మలనుజేయు మని చెప్పినను నాధిభౌతిక నీతిశాస్త్రజ్ఞు లుపదేశింపఁబోవు నీ రెండును వారి దృష్టికి గోచరము (అనఁగా: అవ్యక్తమే) లగును. కాంటు, నిత్సే యనువారల యీ యుపదేశము క్రీస్తుధర్మములవలె తత్త్వజ్ఞానశూన్యమగు కేవలాధిదైవతభక్తి ధర్మములకు విరుద్ధమైనను నధ్యాత్మదృష్టిచే సర్వభూతాత్మైక్య జ్ఞానరూపమగు సాధ్యమనెడి, లేక, కర్మయోగియగు స్థితప్రజ్ఞునియొక్క పూర్ణావస్థయనెడి, పునాదిపై రచియింపఁబడిన ధర్మశాస్త్రములయందున్న, లేక, నీతిశాస్త్రములయందున్న పరమధ్యేయ మగు సిద్ధాంతములోనే పైనున్న యాధిభౌతిక సాధ్యము లన్నియును నవిరోధముగఁ జేరును. కావున నధ్యాత్మజ్ఞానముచే పరిపూతమైన వైదికధర్మ మెప్పుడైన

నణఁగిపోవు నని యెవరును భయపడ నవసరములేదు. పరమసాధ్య మవ్యక్తమే యని యనక తప్పనిచో నది మానవజాతికి మాత్రమే యేల సంకుచితముగ గ్రహింపవలయు? నని కాని, లేక పూర్ణావస్థయే పరమసాధ్యమని యనినను పశువులకును మనుజులకును సామాన్య మగు నాధిభౌతికసాధ్యముకంటె దానియం దాధిక్య మేమి యున్నది? అని కాని విపరీతముగు ప్రశ్న యీ స్థలమందు వెలువడును. ఈ ప్రశ్న మునకు సమాధానము చెప్పుటకు ప్రయత్నింతు మేని యధ్యాత్మ దృష్టిచే సిద్ధమగు సమస్తచరాచరసృష్టియొక్కయు నొక యనిర్వాచ్య పరమతత్త్వమునే తుదకు శరణము నొందవలసి వచ్చును. అధిభౌతిక శాస్త్రమున కర్వాచీనకాలమునందు నశ్రుతపూర్వమగు వృద్ధి సంభ వించుటచే మనుజునియొక్క దృశ్య సృష్టిజ్ఞానము పూర్వముకంటె శతగుణితముగ వృద్ధినొందియున్నది. మఱియు "ఎట్టివారి కటులె" యను న్యాయముచే నీ యాధిభౌతిక జ్ఞానమును సంపాదింపనట్టి ప్రాగ్దేశములవారికి సంస్కరింపఁబడిన నవీనులగు పాశ్చాత్యుల రాష్ట్రముల యెదుట నిలువనీడ లభింప దనునది నిర్వివాదమయిన విషయము; కాని యాధిభౌతికశాస్త్ర మెంత వృద్ధినొందినను జగత్తు యొక్క మూలతత్త్వమును తెలిసికొనునట్టి మనుజమాత్రునియొక్క స్వాభావిక ప్రవృత్తికి కేవల మాధిభౌతికవాదముచే పూర్ణమగు సమాధాన మెప్పుడును రానేరదు. కేవలము వ్యక్తసృష్టియొక్క జ్ఞానముచేతనే సమస్తనిర్వాహము కానేరదు; గాన నామరూపాత్మక మగు దృశ్యసృష్టియొక్క యారంభమున నేదో యొక యవ్యక్త మగు తత్త్వ ముండి తీరవలయునని స్పెన్సరువంటి యుత్క్రాంతి వాదులును నొప్పికొనుచున్నారు; కానీ యీ నిత్యమగు తత్త్వము యొక్క స్వరూప మిట్టిది యని యెఱుంగుటకు సాధ్యము కాదు: గాన దానియొక్క యాధారముచే నే శాస్త్రమునకు నుపపత్తిని జెప్పు టకు వీలులేదని వారు చెప్పుదురు. జర్మను తత్త్వవేత్తయగు కాంటు సైత మవ్యక్తమగు సృష్టితత్త్వముయొక్క యజ్ఞేయత్వము నంగీక

రించుచునే యున్నాఁడు. అయినను నీతిశాస్త్రముయొక్క యుపపత్తి యీ యగమ్యమగు తత్త్వముచేతనే సమన్వయింపవలయునని యతని యుద్దేశము. శోపెన్‌హౌయ రింతకంటె నెక్కువగ నాలోచించి యీ యగమ్యతత్త్వము వాసనారూపమయి యున్నదని ప్రతిపాదించెను. నీతిశాస్త్రముపై నాంగ్లేయ గ్రంథకర్తయగు గ్రీనుమతమున నీ సృష్టి తత్త్వమే యాత్మ యను రూపముచే నంశముగ మనుజుల దేహము లందు ప్రాదుర్భూతమైన దనెను. గీతయు "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అని స్పష్టముగఁ జెప్పుచున్నది. "జగత్తు యొక్క యారంభమునందున్న యీ యవ్యక్తతత్త్వము, నిత్యమును, ఒకటియు, నమృతమును, స్వతంత్రము, నాత్మరూపమునై యున్న దనుటకంటె విశేషముగ నేమియుఁ జెప్పుటకు సాధ్యము కాదు అని యుపనిషత్కారుల సిద్ధాంతము. ఈ సిద్ధాంతముకంటె నెక్కువగ మనుజుని బుద్ధి యూహించుట యెప్పు డయినను సంభవించునా? యని సందేహముగ నున్నది కారణ మేమియన: జగత్తు యొక్క మూలమునందున్న యవ్యక్తమగు తత్త్వ మింద్రియములకు గోచరము కానిది. (కావున అనఁగా: నిర్గుణమై యుండుటచే) గుణమును, వస్తువును, లేక, క్రియను బోధించునట్టి యే శబ్దముచేతనైనను నీ నిర్గుణతత్త్వమును వర్ణించుటకు వీలులేదు. కావుననే దాని నజ్ఞేయమని చెప్పుదురు; కాని యీ యవ్యక్తసృష్టి తత్త్వసంబంధమై మనకుఁ గలుగు జ్ఞానమును శబ్దముచేఁ జెప్పుటకు బొత్తిగ సాధ్యము కాదు గనుకనే, చూపులకు స్వల్పముగఁ గాన్పించినను నదియె మానవజ్ఞానముయొక్క సర్వస్వమై యున్నందున లౌకికమగు నీతిమత్తయొక్క యుపపత్తియు దాని యాధారముచేతనే చెప్పఁబడినది. మఱియు దానిని జెప్పవలసిన విధమునఁ జెప్పుటకుఁ బ్రతిబంధక మేమియు నుండదని గీతలయందున్న వివేచనను బట్టి సహజముగఁ దెలియును. దృశ్యసృష్టియందున్న వ్యవహారముల నన్నిటి నెట్లు

చేయవలయును?_ ఉదాహరణము: వ్యాపార మెట్లు చేయవలయును? యుద్ధము నెట్లు చేయవలయును? రోగుల కే యౌషధ మెప్పు డీయవలయును? సూర్యచంద్రాదులయంతరము నెట్లు తెలిసికొనవలయును?_ అను నీ విషయముల బాగుగఁ దెలిసికొనుటకు నామరూపాత్మకమగు దృశ్యసృష్టియొక్క జ్ఞానముండి తీరవలయును. మఱియు నా లౌకికవ్యవహారము మిక్కిలి నేర్పుతోఁ జేయుటకు నామరూపాత్మకమగు నాధిభౌతికశాస్త్రము నెక్కువగఁ జదువుకొనవలయు నను విషయములో సందేహ మేమియు లేదు. కాని గీతయొక్క విషయ మట్లు కాదు. అధ్యాత్మదృష్టిచే మనుజునియొక్క పరమ శ్రేష్ఠమగు నవస్థ యేదియో చెప్పి దానియొక్క యాధారముచేఁ గర్మాకర్మరూపములగు నీతిధర్మములయొక్క మూలతత్త్వ మేమని నిశ్చయించుటయే గీతయందలి ముఖ్యవిషయమై యున్నది. అధ్యాత్మికపరమసాధ్యమగు మోక్షము విషయమయి యాధిభౌతిక మార్గ మొకవేళ యుదాసీనముగనుండు ననినను, కేవలనీతిధర్మముల యొక్క మూలతత్త్వముల నిర్ణయించుటకును సైత మాధిభౌతికపక్ష మపూర్ణమే యగును. మఱియు, ప్రవృత్తి స్వాతంత్ర్యము, లేక, నీతి ధర్మముల నిత్యత్వము, లేక, యమృతత్వము నొందుద మను మానవుని మనస్సునందున్న స్వాభావికేచ్ఛ, మొదలగు గూఢ విషయముల నిర్ణయము దానిచేఁ గానేరదు. అందునిమిత్తమై యాత్మానాత్మవిచారమునందుఁ దుదకుఁ బ్రవేశింపవలసివచ్చు నని నేను పూర్వమునందున్న ప్రకరణములలో నిరూపించియున్నాను; కాని, యధ్యాత్మశాస్త్రము యొక్క కార్య మింతమాత్రముచే సమాప్తము కానేరదు. జగత్తుయొక్క మూలమందున్న యమృతతత్త్వము నెల్లప్పుడు నుపాసించుట చేతను, నపరోక్షానుభవముచేతను మనుజుని యాత్మకు నొక విధమగు శాంతి లభించును. దాని మూలమున మనుజునియొక్క శీలమునందు (అనఁగా: స్వభావమునందు)ఁ గలుగునట్టి భేదమే సదాచరణమునకు మూలమయి యుండుటచే,

మానవజాతియొక్క పూర్ణావస్థ దేనివలనఁ గలుగు నను విషయ మధ్యాత్మశాస్త్రముచే నిర్ణయింపఁబడునట్లు కేవలాధిభౌతికసుఖ వాదముచే నిర్ణయింపఁబడదని యెఱుంగ వలయును. కారణ మేమి యన: కేవలవిషయసుఖ మనునది పశువులకును సాధ్యమె యగు టచే జ్ఞానియగు మనుజుని బుద్ధికి దానిచేత నెప్పుడును బూర్ణమగు సమాధానము వచ్చుటకు వీలులేదు. మఱియు సుఖదుఃఖము లనిత్య ములు, ధర్మము నిత్యము నను విషయ మిదివఱకే సవిస్తరముగఁ బ్రతి పాదింపఁబడినది. ఇట్టి దృష్టిచే విచారము చేయుదు మేని గీతల యందున్న పారలౌకిక ధర్మమును, నీతిధర్మమును, జగత్తునందున్న నిత్యము, నమృతమయము నగు తత్త్వముయొక్క యాధారముచేఁ బ్రతిపాదింపఁబడియుండుటచేఁ బరమావధియగు నీ గీతాధర్మము, మనుజుఁ డొక యున్నతస్థితిలో నున్నాఁడను దృష్టితో మానవకృత్య ములను విచారించు కేవలాధిభౌతికజ్ఞానమునకు నెప్పుడును తగ్గి పోనిది కావుననే నిత్యమును, నభయమును నైయున్నదనియు, హైందవుల కీ విషయమై యితర గ్రంథమును గాని, ధర్మమును గాని, లేక, మతమును గాని, విచారింపవలసిన యపేక్ష భగవంతుఁ డుంచ లేదనియు కాన్పించుచున్నది. వేయేల? బ్రహ్మజ్ఞానము నంతను నిరూపించిన పిదప "అభయం వై ప్రాప్తోఽసి" — నీ విప్పుడు భయము లేనివాఁడ వయితివి (బృ. 4.2.4) అని యాజ్ఞవల్క్యులు జనకునకుఁ జేసిన యుపదేశమే యీ గీతాధర్మముల జ్ఞానమునకును ననేక విషయములలోఁ బూర్తిగ సంబంధించునని చెప్పినను చెప్ప వచ్చును.

ఈ రీతిగ నన్నింటికంటెను, నిర్భయము, వ్యాపకము నయి యుండుటచే సమము, అనఁగా వర్ణముచేతఁ గాని, జాతిచేఁగాని, దేశము చేతఁగాని, లేక, యితరమగు దేనిచేతఁగాని భేదము కలుగక యందఱకు నొక్క విధముననే నొక సద్గతినే యిచ్చునదియు, నితర

ధర్మముల విషయమయి యోగ్యమగు సహిష్ణుతను జూపునదియు నగు జ్ఞాన-భక్తి-కర్మలతోఁగూడిన గీతాధర్మము సనాతనవైదిక ధర్మ వృక్షముయొక్క యత్యంత మధురము నమృతము నయిన ఫలమయి యున్నది. వైదికధర్మములయందు మొదట ద్రవ్యమయము, లేక, పశుమయము నయిన యజ్ఞముచే (అనఁగా: కేవలకర్మ కాండ పరమగు శ్రౌతధర్మమునకే) యధికమగు మహత్త్వముండెను; కాని పిదప నుపనిషత్తులందున్న జ్ఞానముచే కేవలము కర్మకాండపరమగు నీ శ్రౌతధర్మము గౌణ మని నిశ్చితమైన పిదప దానియందే సాంఖ్య శాస్త్రమును ప్రాదుర్భూత మైనది. కాని యీ జ్ఞానము సామాన్యజను లకు నగమ్య మగుటచే నది కర్మసన్న్యాసమును విశేషముగ బోధించు నదిగ నుండుటచే సామాన్యజనుల కొఱకు యుపనిషత్తులలో నున్న ధర్మములచేఁగాని, లేక, రెండింటికిని స్మృతిప్రోక్తమగు నేకవాక్యతచేఁ గాని పూర్ణముగ సమాధానము రాకయుండెను. ఈ కారణమున నుప నిషత్తులయందున్న కేవలము బుద్ధిగమ్యమగు బ్రహ్మజ్ఞానమును ప్రేమ గమ్యము, వ్యక్తము నగు నుపాసన యను రాజగుహ్యముతోఁ జేర్చి కర్మకాండముయొక్క ప్రాచీన పరంపరానుసారముగఁ "దమ తమ యోగ్యతానుసారముగ, దమ తమ సాంసారిక కర్తవ్యములను లోక సంగ్రహార్థమై నిష్కామబుద్ధితోడను, నాత్మౌపమ్యదృష్టితోడను, నుత్సా హముతోడను యావజ్జీవముఁ జేయుచు నుండుటచే పిండబ్రహ్మాండ ములందును, సర్వభూతములయందును, నేకత్వముతో నిండియున్న నిత్యయగు పరమాత్మయను దేవతనే యెప్పుడును యజింపవలయును. దానియంద్థే మీకు పారలౌకికము నైహికము నగు కల్యాణమున్నది" అని యర్జును నిమిత్తముగఁ జేసికొని ఎల్లరకును గీతాధర్మ మెలుఁగెత్తి చెప్పుచున్నది. మఱియు నందుమూలమున కర్మము, బుద్ధి(జ్ఞానము) ప్రేమ (భక్తి)యు నను మూఁటికిని విరోధము లేకపోవుటచేత నాయు ర్దాయమునంతను యజ్ఞమయముగఁ జేయవచ్చునని చెప్పుచున్న యొక గీతాధర్మమునందు సమస్త వైదికధర్మసారమును కలదు. ఈ

నిత్యధర్మమును దెలిసికొని కేవలము కర్తవ్యము లను తలఁపున సర్వ భూతహితార్థమై పటాటోపములు చేయు ననేకులగు మహాత్ములును, కర్తలు నీ భారతభూమి నలంకరించి నప్పు డీ దేశము పరమేశ్వరుని కృపాపాత్రమగుటచే జ్ఞానముయొక్కయే గాక యైశ్వర్యముయొక్కయు శిఖరమును బొందియుండెను. మఱియు నీ యుభయలోక శ్రేయస్కరమును, పూర్వతరమునగు ధర్మము వదలిపోయినప్పు డీ దేశమునకు నికృష్టస్థితి ప్రాప్తమగునని యెవరికిని చెప్పనక్కఱ లేదు. కావున భక్తికిని, బ్రహ్మజ్ఞానమునకును, కర్తృత్వమునకును కలయికను విధించునదియు, సమమును, తేజస్వంతమునగు గీతాధర్మముచేఁ బరమేశ్వరునియొక్క యజనపూజనములను జేయు సత్పురుషులు మరల నీ దేశమునం దుత్పన్ను లగుదురు గాక యని భగవంతుని తుదకు ప్రార్థించి గ్రంథమునందు న్యూనాధికము లేవియైన నున్నచో వానిని చదువరులు సమాధానదృష్టితో సంస్కరించుకొనవలయునని క్రిందఁ జెప్పఁబోవు మంత్రముచే (ఋ. 10. 191. 4) విన్నవించి గీతలయొక్క యీ రహస్యవివేచన నిచ్చి పూర్తిఁ జేయుచున్నాఁడను.

సమానీ వ ఆకూతిః సమానా హృదయాని వః,
సమాన మస్తు వో మనో యథా వః సుసహాసతి.
యథా వః సుసహాసతి. *

ఇది ఉపసంహారణమను పంచదశ ప్రకరణము.

ఓం తత్స ద్బ్రహ్మార్పణ మస్తు.

---

* ఈమంత్రము ఋగ్వేదసంహితలో కడపటనున్నది. యజ్ఞమండపమున నొకచో స్థలమున నాసీనులైనవారి నుద్దేశించి చెప్పఁబడినది. మీ యొక్క యభిప్రాయ మొకచేవిధ మైనదియు, మీ యంతఃకరణము లొకచేవిధ మైనవియు, మీ మనంబు లొకచేవిధ మైనవియు నగుఁగాక. మీ మంచిసాహాయ్యమువనే(సంఘశక్తిచే) కార్యమంతయు దృఢ మగును" అని యీ మంత్రార్థము. అసతి=అస్తి యనునది వైదికరూపము. 'యథా వః సహాసతి' యని రెండు మాఱులు చెప్పుట గ్రంథసమాప్తిని చూపించుటకొఱకు నై యున్నది.

# పరిశిష్ట ప్రకరణము

## గీతయొక్క బహిరంగపరీక్షణము

అవిదిత్వా ఋషిం ఛందో దైవతం యోగ మేవ చ,
యోఽధ్యాపయేత్ జపే ద్వాఽపి పాపీయా ఞ్జాయతే తు సః.

స్మృతి.

భారత యుద్ధమునందు కాఁబోవు భయంకరమగు కుల క్షయము యొక్కయు జ్ఞాతిక్షయము యొక్కయు స్వరూపము ప్రత్యక్షముగఁ గాన్పించిన పిదప, తన క్షాత్రధర్మమును వదలి, సన్న్యాసమును గైకొనుటకు సిద్ధుఁడగు నర్జునునిచే యుద్ధము చేయించుటకు, కర్మయోగము మిక్కిలి శ్రేయస్కర మనియు, కర్మ యోగమున బుద్ధియే ప్రధాన మగుటచే, బ్రహ్మాత్మైక్యజ్ఞానమునఁ గాని, పరమేశ్వరభక్తిచేఁ గాని సమత్వమును బొందిన బుద్ధితో స్వధ ర్మానుసారముగ కర్మములను జేయుచు నుండుటచేతనే మోక్షప్రాప్తి కలుగుననియు, మోక్షము లభించుట కింతకంటె వేఱొక యుపాయ

---

* "దేవతను, ఋషిని, ఛందస్సును, వినియోగమును దెలిసికొనక యే మంత్రమునైనను బఠించువాఁడును, జపము సేయువాఁడును, పాపి యగును" అను వచన మే స్మృతిలోనిదియో తెలియరాదు; కాని ఆర్షేయబ్రాహ్మణ (ఆర్షే. 1) మను శ్రుతియందు "యో హ వా అవిదితార్షేయచ్ఛందో దైవతబ్రాహ్మణేన మంత్రేణ యాజయతి వాఽధ్యాపయతి వా స్థాణుం వర్ఛ్ఛతి గర్తం వా ప్రతిపద్యతే" అనఁగా : మంత్రముల కన్నిటికిని ఋషి ఛందస్సు మొదలగునవి కలవు. కావున మద్గ్రంథములను వైత మటులే ఋషి ఛందస్సు మొదలగు వానిని దెలిసికొనియే పఠింపవలయును.

మేమియు లేదనియు, వేదాంతశాస్త్రానుసారముగ శ్రీకృష్ణుఁ డర్జునుని యుద్ధమునం దెటుల ప్రవర్తింపఁ జేసినదియు, వెనుకటి ప్రకరణములో సవిస్తరముగ నిరూపింపఁబడినది. గీతకు నిజమగు తాత్పర్యమిట్లు నిర్ణయింపఁబడిన పిదప, భగవద్గీత కేవలము వేదాంతపరముగాను, నివృత్తిపరముగాను నున్నదను విపరీతమైన (అన్యథా) జ్ఞానము గలుగుటచేఁ బుట్టిన "గీతలు భారతములో నుండవలసిన యవసర మేమి" యనునది మొదలుగాఁ గల సందేహ మిప్పుడు తనంతటనే వదలిపోవును. కారణ మేమి యన: కర్ణపర్వమునందు సత్యానృతములను వివేచనఁ జేసి యర్జునుని యుధిష్ఠిరవధనుండి నివర్తింపఁ జేసినటులే, గీతలయందున్న యుపదేశము యుద్ధమునందు తప్పక ప్రవర్తింపఁ జేయుట యావశ్యకమై యున్నది. కావ్యదృష్టిచేఁ జూచినను, మహాభారతమున నిట్టి ప్రసంగము లనేకము లనేక స్థలములనున్నందున, వాని యన్నిటియందున్న మూలతత్త్వ మొక్కటియే చెప్పును గాన, నీ మూలతత్త్వము భగవద్గీతలయందు సైతము చెప్పఁబడినది. కావున వ్యావహారిక ధర్మములయొక్క గాని, లేక, కార్యాకార్యవ్యవస్థితియొక్క గాని నిరూపణ పూర్ణముగా గీతలలోఁ జేయఁబడినదని యిప్పుడు సిద్ధమగుచున్నది. వనపర్వమునం దున్న బ్రాహ్మణవ్యాధసంవాదములో, వ్యాధుఁడు తన కులవృత్తి యగు మాంసవిక్రయవ్యాపారము నేల చేయు చున్నదనియు, వేదాంతశాస్త్రాధారముచే వివేచన చేయఁబడినది. శాంతిపర్వమున తులాధారజాజలి సంవాదమునను నిటులే తులాధారుని వాణిజ్యవ్యాపారము సమర్థింపఁ బడినది (వన. 206-215, మఱియు శాం. 260-263); కాని యీ యుపపత్తులా యా వ్యాపారముల నిమిత్తము చెప్పఁబడినవి. అటులనే యహింస, సత్యము మొదలగు విషయముల వివేచనము మహాభారతమున ననేక స్థలములయందుఁ జేయఁబడినను నవియును నేకదేశీయములే (అనఁగా: ఆ యా విషయములకు మాత్రము సంబంధించి యున్నవే) కావున మహాభారతమున కవి ప్రధానము లని

చెప్పుటకు వీలు లేదు. శ్రీకృష్ణుఁడు, అర్జునుఁడు మొదలగు నే మహా పురుషులయొక్క గొప్ప కార్యములను వర్ణించుటకు వ్యాసులవారిచే మహాభారతము రచియింపఁబడినదో యా మహాపురుషులయొక్క చరిత్రరూప మగు గ్రంథమును బ్రమాణముగాఁ గైకొని ప్రతి మానవుఁడును నా చరిత్ర ననుసరించి ప్రవర్తింపవలయునా? వలదా? యను విషయముల నైతమిట్టి యేకదేశీయమగు వివేచనచే నిర్ణయించుటకు వీలులేదు. సంసారము నిస్సారమగుటచే నెప్పుడైన సన్న్యసించుటయే శ్రేష్ఠమగునేని శ్రీకృష్ణుఁడును పాండవులు నటు లేల యొనర్ప లేదు. వా రటు లొనర్పమి యటులుండ, వా రొనర్చిన దానిని వ్యాసులు గౌరవించి మూఁడు సంవత్సరంబు లేకదీక్షతో (మ. భా. ఆ. 62. 52) నొక లక్షగ్రంథము నేల వ్రాసిరి? యని సందేహము సహజముగఁ గలుగును. వర్ణాశ్రమోచిత కర్మములు చిత్తశుద్ధ్యర్థమై చేయవలయు నని చెప్పుటే యీ ప్రశ్నకుఁ దగిన సమాధానము కానేరదు. కారణ మేమన: స్వధర్మాచరణము గాని, ప్రపంచమునందలి యితర వ్యవహారములు గాని సన్న్యాసదృష్టిచే గౌణములే యని యంగీకరింపవలసివచ్చును. కావున మహాభారతములో, నే మహాపురుషులయొక్క చరిత్రలు వర్ణింపఁబడినవో యా మహాపురుషులయొక్క నడవడికం గూర్చి "మూలే కుఠారః" అను న్యాయముచేఁ బ్రాప్తమగు పూర్వోక్తాక్షేపమును నిరసించి "సంసారమును చేయవలయునా? వలదా? చేయవలయు నేని సంసారమునందుఁ బ్రతిమనుజుఁడు నే తీరునఁ దమ తమ వ్యాపారములం జేయుచున్నను, నా కర్మలచే మోక్షప్రాప్తికి నాటంకము గలుగ" దని మహాభారతమునం దెచ్చోటనైన సవిస్తరముగఁ జెప్పుట యావశ్యకమయి యుండును; కాని శ్రీమహాభారతమునం దున్న నలోపాఖ్యానము, రామోపాఖ్యానము మొదలగు నుపాఖ్యానములయం దీ వివేచనఁ జేయుట యుక్తముగా నుండదు. కారణ మేమన: ఆ యుపాంగములవలె నీ వివేచనయు గౌణమే (అప్రధానము) యనవలసివచ్చును. అటులే వనపర్వమునందును, శాంతి

పర్వమునందును నున్న యనేక విషయములయొక్క కలయికయే (అనఁగా: మిశ్రణమే) గీత లనెడు సంగ్రహగ్రంథము గాన, దాని యొక్క మహత్త్వమునకు లోప మగును. కావుననే యుద్యోగపర్వము సమాప్తియైన పిదప, ప్రధానకర్మమగు యుద్ధ మారంభమగు సమయ మునందే, నీతిధర్మదృష్టిచే, నాక్షేపింపఁబడిన యపరిహార్యములగు విషయములే కర్మాకర్మవివేచన మను నీ స్వతంత్రశాస్త్రమున, సోప పత్తికముగ విచారింపఁబడినవి. శ్రీకృష్ణుఁడు యుద్ధారంభముననే యర్జునునకు గీత నుపదేశించె నను పరంపరాగతమగు కథను క్షణ మాత్రము దూరముగ నుంచి, మహాభారత మనునది ధర్మాధర్మనిరూ పణార్థమై రచియింపఁబడిన యొక యార్ష మగు మహాకావ్య మను బుద్ధితో విచారించినను, గీతలను చెప్పుటకు భారతమున నిర్దేశింపఁ బడిన స్థలమే గీతామహత్త్వమును లోకులకు వెల్లడిచేయుటకు కావ్యదృష్టిచే సైతము యోగ్యముగనే యున్నదని దీనింబట్టి కన్పట్టు చున్నదని యిందలి సారాంశము.

గీతలలోఁ బ్రతిపాద్యమగు విషయమును, ఆ గీత భారతమున చెప్పఁబడిన స్థలమును నీ తీరున యుక్తాయుక్తముగ విచారించిన పిదప, గీతయందున్న జ్ఞానమును రణభూమియందుఁ జెప్పవలసిన యవసర మేమియు లేకపోవుటచే, ఈ గ్రంథము పిదప నెవరిచేతనో మహాభారతమునఁ జేర్పఁబడియుండును. లేనిచో భగవద్గీతయందు పదిశ్లోకములో, లేక, నూఱుశ్లోకములో ముఖ్యము లగును. మిగిలి నవి యితర ప్రకరణములలోని భావములే కావు; కాన ముఖ్యములు కా వను శంకయే యుండదు. కారణమేమి యన: ధర్మనిరూపణా ర్థమై రచియింపఁబడిన భారతమును మహాభారతమునుగాఁ జేయుట కొఱకీ విషయమును మహాభారతమునం దీ ప్రదేశమున వ్రాయఁ బడవలయునని నిశ్చయించుకొని, యీ విషయమును పూర్ణముగ నిరూపించుట కెన్ని స్థలములయందు నవకాశము వచ్చినను మహా

భారతకారుఁడు లక్ష్యము చేయలేదను విషయ మితర ప్రకరణములం బట్టి తెల్ల మగును. అయినను గీతయొక్క బహిరంగపరీక్షణ విషయమున వెలువడిన యితర పూర్వపక్షముల నా యా సందర్భముంబట్టి విచారించి, యది యెంతమాత్రము సత్యమో యని యెఱుంగ వలయును. కావున వానిలో 1. గీతలు–మహాభారతమును, 2. గీతలు–ఉపనిషత్తులును, 3. గీతలు–బ్రహ్మసూత్రములును, 4. భాగవతధర్మములయుదయము–గీతయును, 5. గీతయొక్క కాలమును, 6. గీతలు–బౌద్ధగ్రంథములును, 7. గీతలు–క్రైస్తవుల బైబిలును అను నీ యేడు విషయములం గూర్చి యీ ప్రకరణమునం దేడు భాగములు క్రమముగ విచారణ చేయఁబడినవి. దీనిని విచారించుచు, మహాభారతము గీతలు, బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, మొదలగు గ్రంథములను కేవలము కావ్యమను బుద్ధితో (అనఁగా: వ్యావహారికమును, ఐతిహాసికము నగు దృష్టితో) బహిరంగపరీక్షచేయుట యాచారము. కావున నేనును పై విషయము నా దృష్టితోడనే యిప్పుడు విచారింతును.

## 1. గీతలు-మహాభారతము

శ్రీకృష్ణునివంటి మహాత్మునియొక్క చరిత్ర నైతికమని నిశ్చయించుటకై, కర్మయోగపర మగు గీత మహాభారతమందు తగినట్టి కారణములతోఁ దగిన స్థలమున నుండుటచే గీత మహాభారతము నందలి యొకభాగమే యై యుండవలయును. ఇందులకుఁ బూర్వమున మన యనుమానమే యీ రెండు గ్రంథముల రచనను బోల్చి చూచి పరీక్షించితి మేని దృఢమగును; కాని యట్లు పోల్చి చూచి పరీక్షించుటకు ముందుగ నీ రెండు గ్రంథములయొక్క యిప్పటి స్వరూప విషయమై కొంచెము విచారింపవలయును. గీతాగ్రంథమున నేడు వందల శ్లోకము లున్నవని శ్రీమచ్ఛంకరాచార్యులవారు తమ గీతాభాష్యముయొక్క ప్రారంభముననే స్పష్టముగఁ జెప్పిరి. ప్రస్తుతము దొరకునట్టి యన్ని ప్రతులయందును నన్ని శ్లోకములే స్పష్టముగఁ

గాన్పించుచున్నవి. ఈ యేడువందల శ్లోకములలో నొక శ్లోకము ధృతరాష్ట్రుని వచనము. నలువది శ్లోకములు సంజయునివి. ఎనుబది నాల్గర్జునునివి. ఐదువందల డెబ్బదియైదు శ్లోకములు భగవంతునివి; కాని బొంబాయిలో నున్న గణపతికృష్ణాజీ ముద్రణాలయమునఁ బ్రచురింపఁబడిన మహాభారతప్రతిలో భీష్మపర్వమునందు గీతలలోని పదునెనిమిది యధ్యాయములును ముగిసిన పిదప (అనఁగా: భీష్మ పర్వమునందలి నలువదిమూఁడవ యధ్యాయపుటారంభమున) నయిదున్నర శ్లోకములలో వర్ణింపఁబడిన గీతామాహాత్మ్యమున—

షట్శతాని సవింశాని శ్లోకానాం ప్రాహ కేశవః,
అర్జున స్సప్త పంచాశత్ సప్త షష్టిం తు సంజయః.
ధృతరాష్ట్రః శ్లోక మేకం గీతాయా మాన ముచ్యతే.

గీతలలోఁ గేశవునివి యాఱువందల యిరువది, సంజయునివి యఱువదియేడు, నర్జునునివి యేబదియేడు, ధృతరాష్ట్రుని దొకటి, మొత్త మేడువందల నలువదియైదు శ్లోకములున్న వని చెప్పఁబడినది. ఇవి చెన్నపురి రాజధానిలోనున్న పాఠము ననుసరించి, కృష్ణాచార్యులచే ముద్రితమైన మహాభారత ప్రతులయందుఁ గాన్పించుచున్నది; కాని కలకత్తాలో ముద్రితమైన మహాభారత ప్రతులలో నవి బొత్తిగఁ గాన్పింపవు. మఱియు భారత టీకాకారులగు నీలకంఠు లీ యైదున్నర శ్లోకములును "గౌడైః న పఠ్యంతే" అని గౌడులకు పాఠము లేనట్లు వ్రాసిరి. కావున నవియు ప్రక్షిప్తములుగఁ గాన్పించుచున్నవి. ప్రక్షిప్తము లని యనినను, గీతలలో నేడువందలయైదు (అనఁగా: ప్రస్తుతము దొరకు శ్లోకములకంటె నలువదియైదు శ్లోకము లెక్కువ) శ్లోకము లెవరి కెప్పుడు లభించినవో చెప్పుటకు సాధ్యము కాదు. మహాభారతగ్రంథము విస్తీర్ణ మగుటచే దానిలో నితర శ్లోకములం జేర్చుట, లేక, యున్నవానిని తీసివైచుట సంభవింపవచ్చును; కాని గీతల విషయ మట్టిది కాదు. గీత యను గ్రంథము సదా పారా

యణములో నుండుటచే, వేదమువలె గీతనంతను నోటికి రాఁజేయు వారనేకులు పూర్వమున నుండిరి. నేఁటికిని గొందఱుండియే యున్నారు. ప్రస్తుతమందున్న గీతలలో విశేష పాఠాంతరములు గాన్పింపవు. ఉండు పాఠాంతరములును టీకాకారులకుఁ దెలిసియే యుండుటకుఁ గారణ మిదియే. ఇంతియ కాక గీతాగ్రంథమునం దేమియు వ్యత్యాసములు (అనఁగా: హెచ్చుతగ్గులు) చేయఁగూడ దను హేతువుచేతనే దానియం దేడువందల శ్లోకములు గూర్పఁబడిన వనియుఁ జెప్పవచ్చును; కాని బొంబయిలోను, చెన్నపురిలో నున్న భారతప్రతులలోఁ జెప్పిన తీరున నలువదియైదు శ్లోకములు (మఱియు నవి యన్నియు భగవంతునివే) ఎక్కువగ నెచ్చోనుండి వచ్చును? కారణ మేమన: సంజయునియొక్కయు నర్జుననియొక్కయు శ్లోకములసంఖ్య ప్రస్తుత ప్రతుల యందును, నీ లెక్కయందును నొక తీరుననే (అనఁగా: నూటయిరువది నాలుగుగనే) యున్నది. మఱియుఁ బదునొకండవ యధ్యాయమునందున్న "పశ్యామి దేవాన్...." (11.15-31) మొదలగు పదునేడు శ్లోకములతో సమానముగ నితరములగు పదిశ్లోకములును మతభేదముచే సంజయునివిగ నెన్నుటకు వీలు కలదు. కావున సంజయుని యొక్కయు నర్జునుని యొక్కయు శ్లోకముల సంఖ్య యొకటియే యైనను, నొక్కొక్కరి శ్లోకములును వేర్వేఱుగా గణించుటలో మాఱుపడి యుండునని చెప్పవచ్చును; కాని ప్రకృతప్రతులలో భగవంతుని వగు నైదువందల డెబ్బదియైదు శ్లోకములకును మాఱుగ నాఱువందలయిరువది శ్లోకములు (అనఁగా; నలువదియైదెక్కువగ) ఎట్లేర్పడినదియుఁ దెలియదు. గీతలయొక్క స్తోత్రములు లేక, ధ్యానములు, లేక, యిట్టి యితర ప్రకరణములును గీతలలోఁ జేర్పఁబడి యుండునని చెప్పితి మేని యా ప్రకరణములు బొంబయి యందున్న భారతప్రతులలో వ్రాయఁబడక పోవుటయే కాక యీ ప్రతులలో నున్న గీతలలోను ఏడువందల శ్లోకములే యున్నవి.

కావున ప్రస్తుతమందున్న యేడువందల శ్లోకములుగల గీతనే ప్రమాణ ముగాఁ గైకొనక తప్పదు. గీతావిషయ మిటు లుండ నిమ్ము. మహాభారతస్థితిఁ జూచితిమేని యీ విరోధ మేమియు లేదని చెప్పవలసి వచ్చును. మహాభారత సంహితయందు నొక లక్షశ్లోకము లున్నవి యని భారతమునందే చెప్పఁబడినది; కాని ప్రస్తుతము ముద్రితము లైన ప్రతులలో నన్ని శ్లోకములు లేవు. అ యా పర్వములయందున్న యధ్యాయములయొక్క సంఖ్యయు, భారతమందుఁ జెప్పబడిన యనుక్రమణికానుసారముగ లేదని రావుబహదూర్ చింతామణిరావు వైద్యయనువారిచే, భారతముపై నున్న తమ టీకాగ్రంథములో స్పష్టముగ నిరూపింపఁబడినది. ఇట్టి స్థితిలో మహాభారతమును, గీతలను పోల్చి చూచి పరీక్షఁజేయుటకై, యీ గ్రంథములలో నేదో యొక దానిని వివక్షితమగు ప్రతిగఁ గైకొనక తప్పదు. కావున శ్రీమచ్ఛంకరాచార్యులవారిచేఁ బ్రమాణముగ నంగీకరింపఁబడిన సప్తశతశ్లోక గీతను, కలకత్తాలో బాబూ ప్రతాపచంద్రరాయిగారిచే ముద్రింపఁ బడిన మహాభారతముయొక్క ప్రతిని, ప్రమాణముగఁ గైకొని నేనును వానిని బోల్చి చూచి పరీక్షించినాఁడను. మఱియు మహాభారతము నుండి కైకొనఁబడిన శ్లోకములకును నీ గ్రంథమునందు స్థలనిర్దేశ మును, కలకత్తాలో నచ్చు వేయఁబడిన పూర్వోక్తమగు మహాభారతప్రతి ననుసరించియే చేసినాఁడను. ఈ శ్లోకములే బొంబయి, లేక, చెన్నపురి రాజధానిలోనున్న పాఠముల ననుసరించి ముద్రింపఁబడిన కృష్ణాచార్యుల ప్రతియందుఁ జూచుచో, నాచే నిర్దేశింపఁబడినచోట లేక పోయినను, కొంచెము వెనుకగనో, ముందుగనో చూచిన దొరకును.

ఏడువందల శ్లోకములు గల గీతాగ్రంథమును కలకత్తాలోని బాబూ ప్రతాపచంద్రరాయిగారి మహాభారత ప్రతిలోఁ బరీక్షించితి మేని, భగవద్గీత మహాభారతమునందలి యొక భాగ మని మహాభారతములో ననేక స్థలములయందుఁ గన్పట్టుచున్నట్లు మొదట

స్థిరపడును. ఆ స్థలములలో మొదట భగవద్గీతయొక్క మొదటి ప్రస్తావన, యాదిపర్వారంభమున రెండవయధ్యాయములో వ్రాయఁబడినవిషయ సూచిక యందున్నది. "పూర్వోక్తం భగవద్గీతాపర్వ భీష్మవధ స్తతః" (మ. భా. ఆ. 2. 69) అని తొలుత పర్వములను వర్ణించినప్పుడు చెప్పి, యనంతరమునం దష్టాదశపర్వములయందున్న యధ్యాయములను శ్లోకములను లెక్కించుచు భీష్మపర్వము యొక్క వర్ణనలో—

కశ్మలం యత్ర పార్థస్య వాసుదేవో మహామతిః,
మోహజం నాశయామాస హేతుభి ర్మోక్షదర్శిభిః.

మ.భా.ఆ. 2.247.

— దేనియందు (గీతయందు) మోక్షమార్గమునకు గారణంబులం జూపి యర్జునునియొక్క మనస్సును మోహపెట్టెడి కశ్మలమును వాసుదేవుఁడు పోఁగొట్టెనో అని భగవద్గీతను తిరుగ స్పష్టముగాఁ బేర్కొనెను. అటులె యాదిపర్వపు ప్రథమాధ్యాయములో "యదా శ్రౌషం" అని ప్రత్యేకశ్లోకమును బ్రారంభించి దుర్యోధనాదుల గెలుపు విషయమై తనకు నిరాశ యే విధమునఁ గలిగినదియు ధృతరాష్ట్రుఁడు సెప్పుచు "అర్జునునకు మోహము కలిగిన పిదప శ్రీకృష్ణమూర్తి యతనికి విశ్వరూపముఁ జూపించెనని వినఁగనె నాకు దుర్యోధనాదుల గెలుపు విషయమై నిరాశయైనది అని చెప్పెను (మ. భా. ఆ. 1.179). ఆదిపర్వము నందున్న యీ మూఁడుచోట్లను భగవద్గీతల నుదాహరించిన పిదప శాంతిపర్వపు కడపటిభాగమున నారాయణీయ ధర్మముల నుడువుచు గీతలప్రస్తావన మరల చేయవలసి వచ్చెను. నారాయణీయములు, సాత్వతములు, ఐకాంతికములు, భాగవతములు నను నీ నాల్గుశబ్దములును సమానార్థకములే. నారాయణ ఋషిచే, లేక, భగవంతునిచే శ్వేతద్వీపమున నారదున కుపదేశింపఁబడిన భక్తిపరమగు ప్రవృత్తిమార్గ మీ యుపాఖ్యానమున వర్ణింపఁబడి

నది (శాం. 334-351). వాసుదేవునిపై భక్తి నేకాంతభావముతో నలుపుచు జగద్విషయములగు వ్యవహారములను స్వధర్మానుసారముగఁ జేయుచుండుటచేతనే మోక్షప్రాప్తి యగునని యీ భాగవతధర్మముల యందలి సిద్ధాంతము. కావుననే భగవద్గీతలయందు సైత మిటులె కర్మయోగము సన్న్యాసమార్గముకంటె శ్రేష్ఠమని ప్రతిపాదింపఁ బడినదని పూర్వప్రకరణముననే నిరూపించితిని. ఈ నారాయణధర్మములయొక్క పరంపరను వర్ణించుచు నీ ధర్మములుగ సాక్షాత్తు నారాయణునివలన నారదునకుఁ బ్రాపించుటచే, నా ధర్మమే "కథితో హరిగీతాసు సమానవిధికల్పతః" (మ.భా.శాం. 346. 10) అని హరి గీతలయందు, లేక, భగవద్గీతలయందు చెప్పఁబడినట్లు వైశంపాయనులు జనమేజయునకుఁ జెప్పిరి. అటులే పిదప 348వ యధ్యాయములో నెనిమిదియవ శ్లోకమున—

సముపోఢే ష్వనీకేషు కురుపాండవయో ర్మృధే,
అర్జునే విమనస్కే చ గీతా భగవతా స్వయమ్.

— ఐకాంతికములైన, లేక, నారాయణీయములైన ధర్మములయొక్క యీవిధి పూర్వమున కురుపాండవయుద్ధ ప్రసంగమునందు విమనస్కుఁడైన యర్జునునకు భగవంతునిచే నుపదేశింపఁబడినదని చెప్పి నారాయణ ధర్మములకు యుగము లన్నిటిలోను పరంపరను జెప్పి, యీ ధర్మములును యతులయొక్క (అనఁగా: సన్న్యాసులయొక్క) ధర్మములు నను నీ రెండును 'హరిగీతలలో' నుండునటుల మరలఁ జెప్పఁబడినది (మ.భా.శాం. 348.53). ఆదిపర్వ శాంతిపర్వములలో నున్న యీ ప్రస్తావనయే కాక యశ్వమేధపర్వమునందున్న యను గీతాపర్వములో సైతము మఱియొకసారి భగవద్గీత ప్రస్తావనగ నుదాహరింపఁబడినది. భారతయుద్ధము సమాప్తమయిన పిదప యుధిష్ఠిరుని పట్టాభిషేకమైన కొంతకాలమునకు శ్రీకృష్ణార్జును లొకచో నేకాంతముగ నుండునపుడు శ్రీకృష్ణుఁడు "ఇప్పు డిక్కడ

నా కేమియుఁ బనిలేదు. ద్వారకకుఁ బోఁదలఁచుచున్నా" నని యర్జునునితో ననఁగా, అర్జునుఁడు "పూర్వము యుద్ధారంభమున నీవు సేసిన యుపదేశమును మఱచితిని. కావున నా యుపదేశమునే మరల నాకుఁ జేయు" మని శ్రీకృష్ణుని వేఁడెను (అశ్వ. 16). అర్జునుని ప్రార్థనానుసారముగ ద్వారక కేఁగుటకు పూర్వమే శ్రీకృష్ణుఁడును గీతను చెప్పెను. ఈ యనుగీతయందు మొదట "యుద్ధారంభమున నీకు చేసిన యుపదేశమును నీవు మఱచితివేని నీ యదృష్టము మేలైనది కానేరదు. ఆ యుపదేశము నటులే మరలఁ జేయుట నాకు సైతము సాధ్యము కానేరదు. కావున వానికి మారుగ మఱియొక విషయ మేమైన నీకుఁ జెప్పెదను" (మ.భా.అశ్వ. అనుగీత. 16.9-13) అని భగవంతునిచేతనే చెప్పఁబడియున్నది. కావున ననుగీతలో నున్నకొన్ని ప్రకరణములు సైతము గీతలలో నుండు కొన్ని ప్రకరణములవలెనే యున్నవి. అనుగీతలయందున్న గీతలయొక్క యీ ప్రస్తావనతోఁ జేరి మహాభారతమున గీతల ప్రస్తావన యేడు పర్యాయములు స్పష్టముగఁ జేయఁబడినది. అనఁగా: భగవద్గీత యనునది యిప్పు డున్నమహాభారతము నందలి యొక భాగమే యని తదంతర్గతమగు గ్రంథమును బట్టియే సిద్ధ మగుచున్నది.

కాని యెంత స్పష్టముగఁ జెప్పినను సందేహములు పుట్టుచునే యుండును గాన, నీ చెప్పిన యేడు నిర్దేశముల చేతను తృప్తిపడక యనేకు లీ ప్రస్తావనలను మాత్రము మహాభారతమునందుఁ బిదపఁ జేర్చి యుండఁ గూడదా? యని యడుగుదురు కాబోలు! అటు లడుగు నెడల గీత యనునది మహాభారతమునందలి యొక భాగ మగునా? కానేరదా? యను సంశయము వారి మనస్సున శాశ్వతముగ నుండును. గీతాగ్రంథము కేవలము బ్రహ్మజ్ఞానపరముగ నున్నదని యనుకొనుటచే నీ శంక తొలుతఁ గలుగును; కాని యీ గీతాగ్రంథము జ్ఞానపర మను నిశ్చయమే మొదట సత్యము కాదని

నేను పూర్వమున సవిస్తరముగ నిరూపించి యున్నాఁడను. కావున నిజముగఁ జూతు మేని యిప్పు డీ శంక కవకాశమే లేదు. అయిన నింతమాత్రముచేతనే పూర్తి యయినదని తలంపక యితర కారణము లదే సైత మీ శంక యసత్య మెట్టులైనదియు నే నిప్పుడు చూపించుచున్నాఁడను. ఏవైన రెండు గ్రంథముల నొక్కఁడు రచించెనా? యిరువురు రచించిరా? యను శంక గలిగెనేని కావ్యవిమర్శకుఁడు శబ్దసాదృశ్యము, అర్థసాదృశ్యము నను రెండువిషయములను ముందు విచారించుచుండును. ఈ రెంటిలో నొక శబ్దసాదృశ్యమునకే గాక, మొత్తముమీఁద భాషయొక్క శైలికిని సమావేశ ముండునను దృష్టితో విచారించునెడల గీతయందలి భాష మహాభారతమునందలి భాషతో నెంతవఱకు పోలియుండునో చూడవలయును; కాని మహాభారతగ్రంథ మతివిస్తర మగుటచేఁ బ్రసంగానుసారముగ దాని యందున్న భాషయు ననేక స్థలముల ననేక విధములుగ నున్నది. ఉదాహరణ మేమన: కర్ణపర్వమునందున్న కర్ణార్జునుల యుద్ధవర్ణనమును జూచితి మేని దానియందలి భాషాశైలి యితర ప్రకరణముల యందున్న భాషాశైలికంటె వేఱుగ నున్నట్లు గాన్పించుచున్నది. కావున గీతయందలి భాష మహాభారతమునందలి భాషతోఁ బోలి యుండునో లేదో చెప్పుటకు సాధ్యము కానేరదు. అయినను సామాన్యముగ విచారించితి మేని, కై. కాశీనాథపంత్ తెలంగు * చెప్పినరీతిగా గీతయొక్క భాషయు, వృత్తములయొక్క రచనయు,

---

* కై. కాశీనాథ త్ర్యంబక తెలంగుగారిచే రచియింపఁబడిన భగవద్గీతకు నాంగ్లేయభాషాంతరము మాక్సుముల్లరుచే సంపాదింపఁబడిన ప్రాచ్యధర్మపుస్తక మాలయందు (Sacred Books of the East Series, Vol. VIII.) ముద్రింపఁబడినది. ఈ గ్రంథమునకు నాంగ్లేయభాషలో వ్రాయఁబడినదియు గీతలకు నొక టీకారూపమగు లేఖము ప్రస్తావనగాఁ జేర్పఁబడినది. కై. తైలంగుగారి మతాను సరణముగ నీ ప్రకరణమందు వ్రాయఁబడిన లేఖ మంతయు (ఒక స్థలమును వదలి) నీ ప్రస్తావన ననుసరించియే వ్రాయఁబడినది.

నార్షముగ, లేక, ప్రాచీనముగ నున్నదని చెప్పవచ్చును. ఉదాహరణ మేమన: అంత (గీ. 2.16), భాషా (గీ. 2.54), బ్రహ్మ (=ప్రకృతి, గీ. 14.3), యోగ (=కర్మయోగ), పాదపూరక మగు నవ్యయము 'హ' (గీ. 2. 9) మొదలగు శబ్దములు గీతలయం దే యర్థమునఁ బ్రయోగింపఁబడినవో యా యర్థమం దవి కాళిదాసాదులచేఁ గావ్యములయందుఁ బ్రయోగింపఁబడినట్లు స్పష్టముగఁ గాన్పింపదని కాశీనాథపంతు చెప్పెను. పాఠభేదముచేత నైనను గీతలలో 11.35-వ శ్లోకములో 'నమస్కృత్వా' యను పాణినీయవ్యాకరణవిరుద్ధ మగు శబ్దమును, గీ. 11. 48-వ శ్లోకమున 'శక్య అహం' అని పాణినీయ వ్యాకరణవిరుద్ధసంధియు కలవు. ఇటులనే 'సేనానీనా మహం స్కందః' (గీ. 10. 24) అను శ్లోకమున 'సేనానీనాం' అను షష్ఠియును పాణినీయసమ్మత మయినది కాదు. ఆర్షమగు వృత్తరచనల కుదాహరణములు కై. తెలంగు గారు స్పష్టముగ నిరూపించినవారు కారు; కాని పదునొకండవయధ్యాయమున విశ్వరూపవర్ణనమునందలి (గీ. 11. 15-50) ముప్పదియాఱు శ్లోకముల నుద్దేశించియే గీతావృత్తరచన యార్షముగ నున్నదని వారు చెప్పినట్లు నాకుఁ దోఁచుచున్నది. ఈ శ్లోకములలోఁ బ్రతిచరణమందును బదునొకం డక్షరములు గలవు; కాని గణనియమము లేక మొదటి చరణ మింద్రవజ్రా వృత్తముగను రెండవది యుపేంద్రవజ్రముగను, మూఁడవది శాలినీవృత్తముగను, నాల్గవది మఱియొక వృత్తముగ నున్నవి. ఇట్లు వేర్వేఱగు పదునొకండు వృత్తములయందలి చరణము లీ ముప్పదియాఱు శ్లోకముల యందును (అనఁగా: 144 చరణములయందును) స్పష్టముగఁ గాన్పించుచున్నవి. అయినను బ్రతిచరణమందును నక్షరములు పదునొకం డుండవలయుననియు, మొదటిదియు, నాల్గవదియు, నెనిమిదవదియు, మఱియు చరణములయందు చివర నుండు రెండక్షరములును గురువులుగను, నాఱవది కఱచుగ లఘువుగను నుండవలయు

ననియు వానియందు నియమము గాన్పించుచున్నది. దానివలన ఋగ్వేదమందుఁ గాని, యుపనిషత్తులయందుఁ గాని యున్న త్రిష్టుప్ వృత్తము మాదిరిగ నీ శ్లోకములు రచియింపఁబడిన ట్లూహింపవలసి యున్నది. కాళిదాసుయొక్క కావ్యములయందుఁ బదునొకం డక్షరములుగల యిట్టి విషమవృత్తము లెక్కడను గాన్పింపవు. శాకుంతల నాటకములో నున్న "అమీ వేదిం పరితః క్లృప్తధిష్ణ్యాః" అను నీ శ్లోక మీ ఛందస్సులోనిదియే; కాని కాళిదాసే దీనిని 'ఋక్ఛందస్సు' అనఁగా: "ఋగ్వేదమునందున్న ఛంద"స్సని యనెను. ఇందువలన గీతాగ్రంథ మార్షవృత్తములు ప్రచారములో నున్నప్పుడే రచియింపఁబడినదని వెల్లడిగాఁ గన్పట్టుచున్నది. మహాభారతమున మఱియొక స్థలమందు సైత మార్షశబ్దములును వేదములోని వృత్తములను గాన్పించుచున్నవి. ఇంతియకాక యీ రెండు గ్రంథములలో నున్న భాషయొక్క పోలికకు ననేక శ్లోకము లొక తీరుననే యుండుట మిక్కిలి నిస్సంశయమగు తార్కాణము. మహాభారతమునందలి యన్ని శ్లోకములను వెదకి వానిలో నెన్ని శ్లోకములు గీతలలో నున్నవో పొరపాటు లేకుండ నిశ్చయించుట మహాప్రయాసము అయినను మహాభారతమును జదువునపుడు దానియందు సమానాక్షరములచేఁ గాని, కొంచెము పాఠభేదముచేఁ గాని, గీతలయందలి శ్లోకముల వలెఁ గాన్పించుచున్న శ్లోకముల సంఖ్యయు విశేషముగనే యున్నది. దానిచే భాషాసాదృశ్యముయొక్క విషయము సహజముగ నిర్ణయింప వచ్చును. గీతలలోను మహాభారతమునందును (కలకత్తా ప్రతులలో) క్రింద వ్రాయఁబడిన శ్లోకములును శ్లోకార్ధములును కేవల శబ్దములనుబట్టి కాని, కొన్ని శ్లోకములు కొంచెము శబ్దభేదమును బట్టి కాని సమానములుగనే కాన్పించుచున్నవి.

| గీతలు | మహాభారతము |
|---|---|
| 1. 9. నానాశస్త్రప్రహరణాః శ్లోకార్ధము. | భీష్మపర్వము. 51. 4 గీతలలోనున్నరీతిని దుర్యోధనుఁడు తనసైన్యమును ద్రోణాచార్యులవద్ద మరల వర్ణించుచున్నాఁడు. |
| 1.10. అపర్యాప్తం .... అను శ్లోక మంతయు. | భీష్మ. 51. 6. |
| 1.12–19. పర్యంత మెనిమిది .... శ్లోకములు. | భీష్మ. 51. 22. 29 కొంచెము శబ్ద భేదమున గీతలలో నుండునటులేయున్నవి. |
| 1.45 అహో బత మహత్పాపం.... శ్లోకము. | ద్రోణ. 197. 50 కొంచెముగా శబ్ద భేదముతో గీతలలోని శ్లోకము వలెనే యున్నది. |
| 2.19. ఉభౌ తౌ న విజానీతః.... శ్లోకార్ధము. | శాంతి. 224, 14. కొంచెము పాఠభేదమున బలివాసవ సంవాదములోను కఠోపనిషత్తునందును (2. 18) నున్నది. |
| 2.28. అవ్యక్తాదీని భూతాని .... శ్లోకము. | స్త్రీ. 2.6; 9.10. అవ్యక్తమునకు మారుగా అభావము చెప్పఁబడినది. మిగిలిన దంతయు నొకటే. |
| 2.31 ధర్మ్యాద్ధియుద్ధాచ్ఛ్రేయో .... శ్లోకార్ధము | భీష్మ. 124.36. భీష్ము లీ శబ్దములనే కర్ణునకుఁ జెప్పుచున్నారు. |
| 2.32. యదృచ్ఛయా .... శ్లోకము. | కర్ణ, 57.2, 'పార్థ' శబ్దమునకు మాఱుగ 'కర్ణ' శబ్దము ప్రయోగించి కర్ణునకు దుర్యోధనుఁడు చెప్పుచున్నాఁడు. |
| 2.46. యావా నర్థ ఉదపానే .... శ్లోకము | ఉద్యోగ. 45.26 సనత్సుజాతీయ ప్రకరణమున కొంత శబ్దభేదముగఁ జెప్పఁబడినది. |
| 2.59. విషయా వినివర్తంతే .... శ్లోకము | శాంతి. 204.16 మను–బృహస్పతి సంవాదమున నీ శ్లోకమే యున్నది. |

| గీతలు | మహాభారతము |
|---|---|
| 2,67. ఇంద్రియాణాం హి .... శ్లోకము | వన. 210.26 బ్రాహ్మణ-వ్యాధ సంవాదమున కొంచెము పాఠభేదముగ మొదట రథస్వరూపముగను నారోపింపఁబడినది. |
| 2.70. అపూర్యమాణ మచల ... శ్లోకము | శాంతి. 250.9 శుకానుప్రశ్నమున నీ శ్లోకమే పఠింపఁబడినది. |
| 3.42. ఇంద్రియాణి పరాణి .... శ్లోకము | శాంతి. 245.3 మఱియు 247.2 కొంచెము పాఠభేదముతో శుకానుప్రశ్నమున రెండుమాఱు లీ శ్లోకము చెప్పఁబడినది కాని యీ శ్లోకము మూలము కఠోపనిషత్తులో నున్నది (కఠ. 3.10). |
| 4. 7. యదా యదా హి .... శ్లోకము | వన. 189. 27 మార్కండేయ ప్రశ్నమునం దీ శ్లోకమే యున్నది. |
| 4.31. నాయం లోకోఽస్త్య .... శ్లోకార్ధము | శాంతి 267. 40 గోకాపిలీయాఖ్యానమునందు వ్రాయఁబడినది. అక్కడ ప్రకరణ మంతయు యజ్ఞమునకుఁ జేరినదియే. |
| 4.40. నాయం లోకోఽస్తి న .... శ్లోకార్ధము | వన. 199. 110 మార్కండేయ సమస్యాపర్వమునం దీ శబ్దములతోనే పఠింపఁబడినది. |
| 5. 5 యత్సాంఖ్యైః ప్రాప్యతే ..., శ్లోకము | శాంతి 305. 19 మఱియు 4316. 4 ఈ స్థలముల యందు కొంచెము పాఠభేదముగ వసిష్ఠ-కరాల, మఱియు యాజ్ఞవల్క్య-జనకసంవాదములయం దున్నది |
| 5.18. విద్యావినయసంపన్నే .... శ్లోకము | శాంతి. 238.19 శుకానుప్రశ్నమున నీశబ్దములతోనే వ్రాయఁబడినది. |

| గీతలు | మహాభారతము |
| --- | --- |
| 6.5. ఆత్మైవ హ్యాత్మనో బంధుః ... శ్లోకార్ధమును, మఱియు, ముందఱి శ్లోకార్ధము. | ఉద్యోగ. 3363 ,64 విదురనీతిలో నివే పదములతో వ్రాయఁబడినది. |
| 6.29. సర్వభూతస్థ మాత్మానం.... శ్లోకార్ధము | శాంతి. 238.21 శుకానుప్రశ్నము నందును మనుస్మృతియందును(12.91) ఈశావాస్యోపనిషత్తునందును (6) మఱియు కైవల్యోపనిషత్తునందును (1. 10) నా శబ్దముల తోడనే చెప్పఁబడినది. |
| 6.44. జిజ్ఞాసు రపి యోగస్య .... శ్లోకార్ధము | శాంతి. 235.7 శుకానుప్రశ్నమున కొంత పాఠభేదముతోఁ జెప్పఁబడినది. |
| 8.17. సహస్రయుగపర్యంతం.... ఈ శ్లోకము యుగ మనఁగ నేదియో చెప్పక మునుపే గీతలు వ్రాయఁ బడినవి. | శాంతి. 231. 31 శుకానుప్రశ్నమునం దీ శ్లోకమే పఠింపఁబడినది. మఱియు యుగ మనఁగ నేదియో పూర్వమునం దు కోష్టకము వ్రాయఁబడినది. మను స్మృతియందుసైత మీ శ్లోకమే కొంత పాఠభేదముతో నున్నది (మను1.73). |
| 8.20. యః స సర్వేషు .... శ్లోకార్ధము | శాంతి. 339.23 నారాయణీయ ధర్మముల యందు కొంత పాఠభేదముగ రెండు మారులు వ్రాయఁబడినది. |
| 9.32. స్త్రియో వైశ్యా స్తథా .... ఈ శ్లోకమంతయు,పూర్వ శ్లోక పూర్వార్ధమును | అశ్వమేధ పర్వ. 19. 61-62 అనుగీత యం దీ శ్లోకమే కొంత పాఠభేదముగ వ్రాయఁబడినది. |
| 13.13. సర్వతః పాణిపాదం .... శ్లోకము. | శాంతి. 231.29 అశ్వమేధ. 19.49 శుకాను ప్రశ్నమునందును అనుగీతలయందును ఇంక నితర స్థలములయందు నీ శ్లోకమే యున్నది. ఈ శ్లోకము మొదట శ్వేతాశ్వతరోపనిషత్తు లోనిది. |

| గీతలు | మహాభారతము |
|---|---|
| 13.30 యదా భూతపృథగ్భావం.... శ్లోకము | శాంతి. 17. 23 యుధిష్ఠిరుఁ డర్జునునితో నీ శబ్దములతోనే చెప్పెను. |
| 14.18 ఊర్ధ్వం గచ్ఛంతి .... శ్లోకము | అశ్వమేధ. 39.10 అనుగీతయందు గురుశిష్య సంవాదములో నీ శ్లోకమే యున్నది. |
| 16.21 త్రివిధం నరకస్యేదం .... శ్లోకము | ఉద్యోగ. 32. 70 విదురనీతియందు అక్షరము తప్పకుండ నున్నది. |
| 17.3. శ్రద్ధామయోఽయం .... శ్లోకము | శాంతి. 263.16 తులాధార-జాజలి సంవాదమున శ్రద్ధాప్రకరణములో నున్నది. |
| 18.14 అధిష్ఠానం తథా కర్తా .... శ్లోకము | శాంతి. [illegible] నారాయణీయ ధర్మములయం దీ శ్లోకమే యున్నది, |

ఇట్లు 27 సంపూర్ణశ్లోకములును, 12 శ్లోకార్ధములును, గీతలయందును మహాభారతమునందలి యా యా ప్రకరణములయందును, కొన్ని యా పదములతోను, కొన్ని కొంత పాఠభేదములతోను నొక విధముగనే యున్నట్లు గాన్పించుచున్నది. పూర్ణముగ వెదకితి మేని యింతకంటెను మఱికొన్ని సమానములగు శ్లోకములు, శ్లోకార్థములు కన్పట్టును. రెండేసి శబ్దములు, లేక, మూఁడేసి శబ్దములు గాని, లేక, శ్లోకపాదములు గాని గీతయందును మహాభారతమునందును నొక విధముగనే యున్న వెన్ని దొరకునో పరికించితి మేని పైన నుదాహరింపఁబడిన శ్లోకముల పట్టికగొప్పది యగును; * కాని యీ శబ్దసామ్య

* మహాభారత మంతయు నీ దృష్టితోఁ జూచితి మేని, గీతలయందును, మహాభారతమందును సమానమగు శ్లోకపాదములు (అనఁగా: చరణములు) మూటికంటె నధికముగనే కన్పట్టును. వానిలో కొన్నిటి నిచ్చోఁ బొందుపఱచెదను. కిం భోగై ర్జీవితేన వా (గీ.1.32), నైత త్త్వ య్యుపపద్యతే (గీ.2.3), త్రాయతే మహతో భయాత్ (2.40), అశాంతస్య కుతః సుఖమ్ (2.66).

ముసు వదలి యితర ప్రకరణములును, గీతలును నొకరిచేతనే రచి
యింపఁబడినవని చెప్పకతప్పదు. ప్రకరణముల నన్నింటిని పరిశీలిం
చినను పూర్వోదాహృతమగు 33 శ్లోకములలో 1 శ్లోకము మార్కం
డేయ ప్రశ్నయందును, 5 శ్లోకములు మార్కండేయ సమస్యయం
దును, 1 శ్లోకము బ్రాహ్మణవ్యాధ సంవాదమునందును, 1 విదురనీతి
యందును, 1 శ్లోకము సనత్సుజాతీయమునను, 1 మనుబృహస్పతి
సంవాదమునను, 6½ శ్లోకములు శుకానుప్రశ్నమందును, 1 తులా
ధార జాజలిసంవాదమునందును, 1 శ్లోకము వసిష్ఠకరాళసంవాద
మునను-యాజ్ఞవల్క్యజనకసంవాదమునను, 1½ శ్లోకము నారాయ
ణీయ ధర్మములయందును, 2½ శ్లోకములు గీతలయందును, మిగిలి
నవి భీష్మ, ద్రోణ, కర్ణ, స్త్రీ పర్వములయందు నున్నవి. వీనిలోఁ
దఱచుగ నన్ని స్థలములయందును నీ శ్లోకములు పూర్వాపర సంద
ర్భానుసారముగఁ దగిన స్థలములయందే యున్నవి. ప్రక్షిప్తములు
కావని స్పష్టముగఁ గన్పట్టుచున్నవి. వేయేల? కొన్ని శ్లోకములు
సిద్ధాంతదృష్టిచే గీతలలోనే గైకొనఁబడినవి. ఉదాహరణ మేమన:
"సహస్రయుగపర్యంతం"(8.17) అను శ్లోకమున కర్థము దెలియుటకు
పూర్వమే, సంవత్సరము, యుగము, అన నేమో చెప్పవలసియుండెను.
మహాభారతమునందును (శాం. 231), మనుస్మృతియందును ఈ
శ్లోకమునకు పూర్వమే వర్షయుగముల లక్షణములు సెప్పఁబడినవి;
కాని గీతలలో యుగము మొదలగువాని లక్షణములఁ దెలియఁజేయ
కయే యీ శ్లోకము చెప్పఁబడినది. ఇట్లు విచారించితి మేని మహా

---

ఉత్సీదేయు రిమే లోకాః (3. 24), మనో దుర్నిగ్రహం చలమ్ (6. 35), మ
మాత్మా భూతభావనః (9. 5), మోఘాశా మోఘకర్మాణః (9. 12), సమః
సర్వేషు భూతేషు (9. 29), దీప్తానలార్కద్యుతిం .... (11. 17), సర్వభూత
హితే రతాః (12. 4), తుల్యనిందాస్తుతిః (12. 19), సంతుష్టో యేన కేనచిత్
(12. 19), సమలోష్టాశ్మ కాంచనః (14. 24), త్రివిధా కర్మచోదనా (18. 18).
నిర్మమః శాంతః (18. 53), బ్రహ్మభూయాయ కల్పతే (18. 53). ఇ.ఇ.

భారతమునందలి యితర ప్రకరణములలో నున్న శ్లోకము గీతలయం దుండియే కైకొనఁబడినదని చెప్పుటకు వీలులేదు. ఇన్ని ప్రకరణములలోనుండి గీతలలోని శ్లోకము లన్నియుఁ గైకొనఁబడినవని చెప్పుటకు వీలులేదు. కావున గీతలను, ఈ ప్రకరణములను రచించిన వాఁ డొకఁడే యయి యుండవలయునని యనుమానము చేయవలసి వచ్చును. మనుస్మృతిలోని యనేకశ్లోకములు మహాభారతమునందుఁ గాన్పించుచుండునటులే, * గీతలయందున్న "సహస్రయుగ పర్యంతం...." (8. 17) అనుశ్లోకము కొంత పాఠభేదముతోను, "శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్" (గీ. 3.35 మఱియు 28. 47) అను నీ శ్లోకార్ధములోని 'శ్రేయాన్' అనుదానికి మాఱుగ 'వరం' అను మార్పుతోను, "సర్వభూతస్థ మాత్మానం...." అను నీ శ్లోకార్ధము (గీ. 6.29) "సర్వభూతేషు చాత్మానం " అను మార్పుతోను, మనుస్మృతియందుఁ గాన్పించుచున్నది (మను. 1.73; 10.97; 12.91). మహాభారతము నందలి యానుశాసనికపర్వమునందు మాత్రము 'మనునాఽభిహితం శాస్త్రం' (అను. 47. 35) అని మనుస్మృతివిచనము స్పష్టముగ నుల్లేఖింపఁబడినది.

శబ్దసాదృశ్యమునకు మారుగా నర్థసాదృశ్యమును జూచినను నీ యనుమానమే దృఢ మగును. గీతలయందలి కర్మయోగమార్గమునకును, ప్రవృత్తిపరమగు నారాయణీయధర్మములకును గల సామ్యమును నేను పూర్వ ప్రకరణములలో నిరూపించియే యున్నాను. వాసుదేవునివలన సంకర్షణుఁడును, సంకర్షణునివలన ప్రద్యుమ్నుఁడును, ప్రద్యుమ్నునివలన ననిరుద్ధుఁడును, ననిరుద్ధునివలన బ్రహ్మ

---

* మనుస్మృతి యందలి యే యే శ్లోకములు మహాభారతమునఁ గానఁబడుచున్నవో వాని సూచికను బ్యూలర్‌సాహేబుగారు 'ప్రాచ్యధర్మ పుస్తకమాలయందు' ప్రకటింపఁబడిన మనుస్మృతియొక్క యింగ్లీషు తర్జుమాయందు చేర్చియున్నారు (S. B. E. Vol. XXV. pp. 533 ff.)

దేవుఁడును బుట్టిరని నారాయణీయధర్మములలోఁ జెప్పఁబడిన (మ. భా. శాం. 339.71,72) వ్యక్తమగు సృష్టియొక్క యుపపత్తి గీతలలో నుండి కైకొనఁబడినది కాదు. ఇంతియకాక, గీతలయందుండు ధర్మములకును, నారాయణీయ ధర్మములకును మఱికొన్ని భేదము లున్నవి, సత్యమే; కాని పరమేశ్వరుని సంబంధమగు చతుర్వ్యూహ కల్పనను గీత యొప్పుకొన్నను, వాసుదేవసంబంధమగు నేకవ్యూహ భక్తియే రాజమార్గము. ఇతర దేవతాభక్తియు వాసుదేవభక్తియే యగును. భక్తులు నాలుగు విధములుగ నుందురు. భగవద్భక్తుఁడు స్వధర్మానుసారముగ సర్వకర్మలం జేయుచు యజ్ఞచక్రము నడిపింప వలయును. సన్న్యాసముఁ గైకొనుట యోగ్యము కాదు; అను నీ మొదలగు సిద్ధాంతములను విచారించితిమేని గీతయందున్న ధర్మములును భాగవతధర్మములును ఒకటిగనే యున్నటులు కాన్పించును. మఱియు వివస్వంతుఁడు, మనువు, ఇక్ష్వాకువు మొదలగు వారి యొక్క సంప్రదాయపరంపరయును రెంటికి నొకటిగనే యున్నదని పూర్వమే చెప్పఁబడినది. అటులనే గీతలయందలి వేదాంతము, లేక, యాధ్యాత్మికజ్ఞానము సనత్సుజాతీయము, శుకానుప్రశ్నము, యాజ్ఞవల్క్యజనకసంవాదము మొదలగు ప్రకరణములయందుఁ గాని గీత యందుఁగాని ప్రతిపాదింపఁబడిన బ్రహ్మజ్ఞానముతో సమానముగనే యున్నదని యా యా ప్రకరణములు చదివినచో నెల్లరకుఁ దెలి యును. కాపిలసాంఖ్యశాస్త్రమందలి 25 తత్త్వములను, 'గుణోత్కర్ష' సిద్ధాంతము నంగీకరించి, భగవద్గీతలో ప్రకృతిపురుషులకు పరమగు తత్త్వము నిత్యమని చెప్పినటులే, సాంఖ్యులయొక్క యిరువదియైదు తత్త్వములకుఁ బర మందున్న యిరువదియాఱవతత్త్వము నెఱింగినఁ గాని కైవల్యప్రాప్తి కానేరదని శాంతిపర్వమునందు వసిష్ఠకరాళజనక సంవాదమునందును, యాజ్ఞవల్క్యజనక సంవాదమునందును సవిస్తరముగఁ బ్రతిపాదింపఁబడినది. కర్మయోగము, అధ్యాత్మిక జ్ఞానము నను నీ రెండు విషయముల సంబంధముననే యా విచార

సామ్యము కన్పట్టుటయే కాక, గీతలలోని యితరవిషయములతో సమానములగు ప్రకరణములును మహాభారతమునం దనేక స్థలముల యందుఁ గన్పట్టుచున్నవి. ఉదాహరణ మేమన: గీతలయందలి ప్రథమాధ్యాయముయొక్క యారంభమున దుర్యోధనుఁడు రెండు సేనలను, ద్రోణాచార్యుల సముఖమున వర్ణించినటులే భీష్మపర్వము లోని యేఁబదియొకటవ యధ్యాయమునందును మరల ద్రోణా చార్యులతోనే వర్ణించి చెప్పెను. ప్రథమాధ్యాయము యొక్క యుత్తరార్ధమున నర్జునునకుఁ గలిగిన విషాదముతో సమానముగనే ధర్మరాజు శాంతిపర్వారంభమునఁ బొందిన విషాదము వర్ణింపఁబడినది భీష్మద్రోణుల వధింపవలసివచ్చినప్పు డిట్టి విషాదమే యర్జునునకుఁ గలిగినట్లు చెప్పఁబడినది (భీష్మ. 97. 4-7; మఱియు 108 88-94). ఎవరికొఱకై యీ భోగము లన్నియు సంపాదింపవలయునో వారినే చంపిన పిదప గెలుపు కలిగినను నుపయోగ మేమని యర్జునుఁడు గీతారంభమం దడిగెను (గీ. 1. 32, 33). కాని యుద్ధమున కౌరవు లెల్లవారును నశించిన పిదప నా విషాదమే దుర్యోధనునికి సైతము కలిగెను (శల్య. 31.42-51). గీతయందలి రెండవయధ్యాయము యొక్క ప్రారంభముననే సాంఖ్యయోగము, కర్మయోగమునను రెండుమతములను జెప్పినటులే, నారాయణీయధర్మములయందును, శాంతిపర్వాంతర్గతమైన జాపకోపాఖ్యాన, జనకసులభాసంవాదముల యందును నా మతములే చెప్పఁబడినవి (శాం. 196 మఱియు 320). మఱియు మూఁడవ యధ్యాయమున, అకర్మకంటె కర్మ శ్రేష్ఠ మని చెప్పినదానినే, కర్మ చేయనిచోఁ బొట్టపోసికొనుట కైన వీలు లేదని యరణ్యపర్వారంభమున ద్రౌపది యుధిష్ఠిరునకుఁ జెప్పెను (వన. 32). అనుగీతలయందును నీ తత్త్వమే మరలఁ జెప్పఁబడినది. శ్రౌతధర్మములు, లేక, స్మార్తధర్మములు యజ్ఞమయము లనియు, యజ్ఞములును, ప్రజలును బ్రహ్మదేవునిచే నొకసారియే నిర్మింపఁబడి రనియు ననునది మొదలుగాఁగల గీతలలో నున్న విషయము నారాయణీయ

ధర్మములయందును, శాంతిపర్వమున కొన్ని ప్రదేశములయందును (శాం. 267), మనుస్మృతియందును కలదు (మను. 3). స్వధర్మాను సారముగఁ గర్మలు సేయుటయందు పాపము లే దను విషయము తులాధార జాజలి సంవాదమునందును, బ్రాహ్మణవ్యాధసంవాదము నందును చెప్పఁబడినది (శాం. 260-263 మఱియు వన. 206-215). ఇంతియకాక, గీతలయందలి యేడవ యధ్యాయమునందును, నెనిమిదవ యధ్యాయమునందును సృష్టిక్రమము సంక్షేపముగ వర్ణింపఁ బడినటులే, శాంతిపర్వమునందలి శుకానుప్రశ్నములో సైతము వర్ణింపఁబడియున్నది (శాం. 231). ఆఱవయధ్యాయమున వర్ణింపఁబడిన పాతంజలయోగము నందలి యమనియమాదులు సైతము మరల శుకానుప్రశ్నమందును (శాం. 239), పిదప శాంతి పర్వమునందలి 300-వ యధ్యాయమునందును, అనుగీతలయందును సవిస్తరముగ వర్ణింపఁబడినవి (అశ్వ. 19). అనుగీతలయందలి గురు శిష్యసంవాదమున నున్న మధ్యమోత్తమ వస్తువుల వర్ణనయును, (అశ్వ. 43 మఱియు 44 గీతలయందలి పదియవయధ్యాయములోని విభూతివర్ణనయును, విశేషముగ సమానార్థకములుగనే యున్నవని చెప్పవచ్చును. గీతలయం దర్జునునకు భగవంతునిచేఁ జూపఁబడిన విశ్వరూపమే దుర్యోధనాది కౌరవులకును, యుద్ధానంతరమున ద్వారకకుఁ బోవుచు మార్గమున నుదంకునకును, నారాయణుఁడు నారదులకును, దాశరథి పరశురామునకును చూపించిరని మహా భారతమునందుఁ జెప్పఁబడినది (ఉ. 130; అశ్వ. 55; శాం. 339; వన. 99). గీతలయందలి విశ్వరూపవర్ణనమే యీ నాలుగుప్రదేశముల యందలి వర్ణనకంటె సరసముగను విస్తృతముగ నున్నది; కాని యర్థసాదృశ్యముయొక్క దృష్టితో నన్నివర్ణనలను విచారించినచో నొకదానియందు కంటె వేఱొకదానియందు నూతన మేమియులేదని సహజముగనే కన్పట్టును. సత్త్వము, రజస్సు, తమస్సు, అను నీ మూఁడుగుణముల సృష్టివైచిత్ర్య మెట్లు నిర్మింపఁబడెను? ఈ గుణము

లకు లక్షణము లేవి? మఱియు సర్వవిధముల కర్తృత్వ మంతయు గుణములంబట్టి యుండునే కాని యాత్మనుబట్టి యుండదని గీతల యందలి పదునాలుగు, పదునేనవ యధ్యాయములలో నిరూపింపఁ బడినట్లే యనుగీతయందును (అశ్వ, 36-39) శాంతిపర్వమునందును ననేక స్థలములయందుఁ జెప్పఁబడినది (శాం. 285 మఱియు 300-311) ఇందులకు, గీతలలో వర్ణింపఁబడు విషయసందర్భమును బట్టి కొన్ని విషయములయొక్క వివేచన మిక్కిలి విపులముగఁ జేయఁ బడినది. మఱియు గీతలలోని విషయవివేచన పద్ధతియు భిన్నముగనే యున్నది. గీతలయందున్న సర్వవిచారముతో సమానమగు విచారము మహాభారతమునందు నా యా స్థలములలోఁ గొంచె మెచ్చుతగ్గుగఁ జెప్పఁబడినట్లు కాన్పించుచున్నది. మఱియు నీ విచారసామ్యమువలెనే కొద్దియో గొప్పయో శబ్దసామ్యమును గలదని వేఱుగఁ జెప్ప నక్కర లేదని సారాంశము. మార్గశీర్ష మాసము నందలి యాధిక్యసాదృశ్య మును విలక్షణముగనే యున్నది. గీతలలో "మాసానాం మార్గశీర్షోఽహం" (గీ. 10 35) అని యీ మాసము ముఖ్యమైనదని చెప్పినటులే యానుశాసనిక పర్వమున సైతము దానధర్మ ప్రకరణములో నుప వాసము చేయఁదగిన మాసములయొక్క పేళ్ళను బేర్కొను నప్పుడు రెండు పర్యాయములును మార్గశీర్ష మాసము మొదలుకొనియె లెక్కింపఁబడెను (అను. 106 మఱియు 109). గీతలయందున్న యాత్మౌపమ్యము, లేక, సర్వభూతహితదృష్టి గాని, యాధిభౌతికాధిదైవికాధ్యాత్మికభేదము గాని, దేవయాన, పితృయాణ గతులభేదము గాని మహాభారతమునఁ బెక్కుచోట్లఁ బేర్కొనఁబడినది; కాని యీ విషయమై వెనుకటి ప్రకరణములలో సవిస్తరముగ వివేచింపఁబడి యుండుటచే వానిని మరలఁ జెప్ప నవసరము కానరాదు.

భాషాసాదృశ్యమును బట్టి కాని యర్థసాదృశ్యమును బట్టి కాని మహాభారతమున నానేడు మార్లు చెప్పఁబడిన గీతలలోని విష

యమును విచారించినను గీత యనునది ప్రస్తుతమందున్న మహా భారతమున కొక భాగము గావున, మహాభారతమును రచించిన వాఁడే గీతను సైతము రచియించె నని యనుమాన ప్రమాణముచే నిశ్చయింపవలసివచ్చును. ఈ ప్రమాణముల నన్నింటిని జూడక కాని, వానియం దేదో యొక దోషారోపణము నుంచికాని, కొందఱు గీత ప్రక్షిప్త మని నిశ్చయించుటకుఁ బ్రయత్నించుచుండునటుల నేను ప్రత్యక్షమునఁ జూచుచున్నాను; కాని బాహ్యప్రమాణముల నప్ర మాణములుగ నిశ్చయించి సహజముగ నుండు సంశయపిశాచము నగ్రస్థానమున నునిచిన వారివిచారపద్ధతి యెటుఁజూచిన నశాస్త్రీయ మగుటచే నగ్రాహ్యము. అందువలన గీత మహాభారతములో నేల చెప్పఁబడవలయు నను సంశయమునకు నివారకమగు నింతకంటె వేఱు సమాధానము లేకపోయినను పోవచ్చును. ఈ ప్రకరణారంభ మునఁ జెప్పినటుల గీత యొక జ్ఞానపరమైనది గాని, లేక, భక్తిపర మైనది గాని కానేరదు. మహాభారతమున వర్ణింపఁబడిన ప్రమాణ భూతులగు మహాత్ములయొక్క చరిత్రములోని నీతితత్త్వమును గాని, లేక, రహస్యమును గాని చెప్పుటకై మహాభారతమునందుఁ గర్మ యోగపరముగ గీతను జెప్పవలసివచ్చిన దనియు, మహాభారతమున నిప్ప దున్నచోటకంటె గీత మఱొండుచోట కావ్యదృష్టితోఁ జూచి నను భారతమున నెచ్చోటను గాన రాదనియు సిద్ధించిన పిదప గీత మహాభారతమునఁ దగు కారణముతోఁ దగిన స్థలముననే చెప్పఁబడిన దనియుఁ, బ్రక్షిప్తము కాదనియు తుట్టతుదకు సిద్ధాంతము తేలును. మహాభారతమువలెనే రామాయణము సైత మెల్లవారును గౌరవించు నదియు, గొప్పదియునగు నార్షమహాకావ్యము గాన దానియందును కథాసందర్భమును బట్టి సత్యములును, పుత్రధర్మములును, మాతృ ధర్మములును, రాజధర్మములును మొదలగువానియందలి రహస్యము వివేచింపఁబడినది, కాని యీ రామాయణము మహాభారతమువలె ననేకసమయాన్వితము కాదు గనుక అనఁగా: సూక్ష్మములగు ధర్మా

ధర్మములయొక్క యనేకన్యాయములతో నిండి యెల్లరకు నన్ని విధములచేతను శీలచరిత్రాదులను బోధించుటకై వాల్మీకి రచియింప లేదు గాన, ధర్మాధర్మములను గాని, కార్యాకార్యములను గాని, నీతిని గాని బోధించువిషయమున మహాభారతముతో సమానమైనది కాదని వేఱుగఁ జెప్పవలదు. మహాభారత మనునది కేవల మార్ష కావ్యముగఁ గాని, కేవల మితిహాసముగఁ గాని యుండక, ధర్మాధర్మములయందలి సూక్ష్మవిషయములను నిరూపించు నొక సంహితగ నున్నది. 'ఈ ధర్మ సంహిత' యందు కర్మయోగము శాస్త్రీయము గను, తాత్త్వికముగను వివేచింపఁబడనిచో, నే యితర గ్రంథమున నిది వివేచింపఁ బడవలయును? వేదాంతగ్రంథములయం దీ విషయ మును వివేచించుటకు వీలులేదు. ధర్మసంహితయే యీ విచారమును జేయుటకుఁ దగినది. మహాభారతకర్త దీనిని విచారింపక పోయెనేని ధర్మాధర్మములయొక్క యీ గొప్ప సంగ్రహము, లేక, యయిదవ వేదమును అన్నింటివలె నపూర్ణముగనే యుండును. ఈ యసంపూర్తి యను లోపమును నివారించునిమిత్తమై భగవద్గీత మహాభారతములోఁ జెప్పఁబడినది. కర్మయోగమును సమర్థించుటలో వేదాంతశాస్త్రము నందువలెనె, వ్యవహారమందు సైత మత్యంతప్రవీణుఁ డగు మహాభారతకర్త యంతటి యుత్తమ జ్ఞానియగు సత్పురుషునిచేతనే గీత రచింపఁబడినది. ఇదియే మనకు మహాభాగ్య మని తెలిసికొన వలయును.

ఇప్పుడు భగవద్గీత మహాభారతములో నొక భాగమని యిట్లు సిద్ధ మైనను దాని యర్థమును కొంచె మెక్కువగ విచారణఁ జేయ వలయును. భారతము, మహాభారతము నను నీ రెండు శబ్దములును నిప్పుడు సమానార్థకములే యనుకొనుచున్నాము. అయిన నీ రెండు శబ్దములును వాస్తవముగ వేర్వే ఱర్థములు గలవి. వ్యాకరణముచేఁ జూచితి మేని భరతవంశమందలి రాజులయొక్క పరాక్రమ మే గ్రంథ మున వర్ణింపఁబడినదో దానికి భారతమని పేరు. రామాయణము,

భాగవతము మొదలగు శబ్దముల వ్యుత్పత్త్యర్థము లటులనే యున్నవి. అదేతీరున, నే గ్రంథమున భారతయుద్ధము వర్ణింపఁబడినదో యది భారత మని మాత్రము చెప్పఁబడినఁ జాలును. ఆ గ్రంథ మెంతపెద్దది యైనఁ గావచ్చును. రామాయణగ్రంథము మాత్రము చిన్నదా? కాని యెవరును మహారామాయణ మనరు. 'మహాభారత' మని పేరేల వచ్చెను? మహత్త్వము, భారవత్త్వము నను నీ రెండు గుణములను బట్టియు మహాభారతమని యీ గ్రంథమునకుఁ బేరిడఁ బడినదని మహాభారతమున కడపటఁ జెప్పఁబడినది (స్వర్గా. 5.44); కాని సరళ ముగ శబ్దార్థమును జూచితిమేని మహాభారత మనఁగా, గొప్ప భారత మని యర్థ మగును. ఈ యర్థమును గైకొందుమేని గొప్ప భారతము పుట్టుటకంటె పూర్వ మొక చిన్న భారత ముండెనా? దానిలో గీతయు నుండెనా? యని సహజముగ సందేహ ముత్పన్న మగును. ప్రస్తుత మహాభారతములోని యాదిపర్వములో నున్న యుపాఖ్యానములు గాక మిగిలిన మహాభారత మిరువదినాలుగు వే లున్నదని చెప్పఁబడి యున్నది (ఆ. 1. 101). పిదప దీనికే జయ మని పేరు కలిగెనని పూర్వమందుఁ జెప్పఁబడినది(ఆ. 62. 20). 'జయ' శబ్దముచే భారత యుద్ధమందు ప్రాప్తమైన పాండవులయొక్క జయ మర్థ మని వివక్షిత ముగఁ గన్పట్టుచున్నది. మఱియు నటు లర్థము గావించుకొంటిమేని భారతయుద్ధముయొక్క వర్ణనము జయ మను పేరు గలిగిన గ్రంథ మున వర్ణింపఁబడిన దనియు, పిదప దానికే యైతిహాసికగ్రంథముల లోని యుపాఖ్యానములు చేరుటవలన నితిహాసము, ధర్మాధర్మ వివే చనమున నీ రెండింటిని నిరూపించుటవలన మహాభారత మను గొప్ప గ్రంథ మైనదనియుఁ గాన్పించుచున్నది. అశ్వలాయన గృహ్యసూత్ర మునందు "సుమంతు-జైమిని-వైశంపాయన-పైల-సూత్ర-భాష్య-భారత-మహాభారత ధర్మాచార్యాః" (ఆ. గృ. 3.4.4) అని ఋషితర్ప ణమునందు; భారత, మహాభారతము లనునవి రెండు వేర్వేఱు గ్రంథము లని స్పష్టముగఁ జెప్పఁబడియుండుటచే సైత మీ యను

మానమే దృఢ మగుచున్నది. పెద్దభారతములోఁ జిన్న భారత మీ రీతిగఁ జేర్పఁబడిన పిదపఁ గొన్నినాళ్లకు చిన్న భారత మను నొక గ్రంథము లేకపోవుటచే మహాభారత మను నదియే భారతగ్రంథ మని యెఱుంగుట సహజ మాయెను. ప్రస్తుత భారతకర్తయగు వ్యాసులు భారతమును మొదట తన పుత్రుఁడగు శుకునకును, పిదప నా శుకుఁ డితర శిష్యులకును పాఠము చెప్పినటుల చెప్పఁబడినది (ఆ. 1.103). తరువాత సుమంతుఁడు, జైమిని, పైలుఁడు, వైశంపాయనుడు అను నీ యైదుగురును వేర్వేఱుగ నైదు భారతసంహితలను లేక, మహాభారతములను వ్రాసిరని స్పష్టముగఁ జెప్పఁబడినది (ఆ. 63 90). ఈ యయిదు మహాభారతములలోను వైశంపాయనమహాభారతమునను జైమినిమహాభారతమునను నశ్వమేధపర్వము నొక్క దానినే వ్యాసులు చివరకు నిలిపిరని యొక కథ గలదు. ఋషితర్పణమున 'భారత-మహాభారత' శబ్దములకుఁ బూర్వము సుమంతుఁడు మొదలగువారి పేరు లేల చెప్పఁబడిన వను విషయమున కుపపత్తి యిప్పుడు స్పష్టముగఁ గాన్పించుచున్నది. ప్రస్తుత మింత యధికముగ విచారింప నక్కఱలేదు. రా.బ. చింతామణిరావు వైద్య యను వారిచే మహాభారతమునకు వ్రాసిన టీకాగ్రంథమున నీ విషయమును విచారించి సిద్ధాంతము చేయఁబడినది. అదియే సయుక్తికముగ నున్నదని యెన్నెదను. కావున ప్రస్తుతము మనము చూచుచుండు మహాభారతము మొదటిది కాదనియు, భారతము మహాభారతము పెక్కు మార్పులను జెంది చెంది తుద కీ మహాభారతముగఁ బరిణమించె ననియుఁ జెప్పినఁ జాలును. వీనిలో మూలభారతమందు గీతలేదని చెప్పుటకు సాధ్యము కాదు. సనత్సుజాతీయము, విదుర నీతి, శుకానుప్రశ్నము, యాజ్ఞవల్క్య జనకసంవాదము, విష్ణుసహస్రనామములు, అనుగీత, నారాయణీయధర్మములు మొదలగు ప్రకరణములవలె నీ భగవద్గీతను సైతము మహాభారతకర్త పూర్వ గ్రంథము నాధారముఁ జేసికొనియే వ్రాసెనే కాని నూతనముగ

వ్రాయలేదనియు స్పష్టముగనే యున్నది. అయినను మహాభారత కర్త భారతములోని గీతలయందు నేమియు మార్పుఁజేయ లేదని నిశ్చయముగఁ జెప్పుటకు వీలులేదు. "ఏడునూఱుల శ్లోకములుగల యిప్పటి గీత ప్రస్తుత మహాభారతమున నొకభాగము గాన, రెండిటి నొకరే రచించియున్నారు. ఇప్పటి మహాభారతముననున్న యిప్పటి గీతను పిదప నెవరు నన్యులు రచియింపలేదు" అని యింతవఱకును జేసిన విమర్శవలన నెల్లవారికిని దెలియును. ఇఁక మహాభారత మెప్పుడు పుట్టిన దను విషయమును మొట్టమొదట గీతలను గుఱించి నా యభిప్రాయమును నిప్పుడు విమర్శించెదను.

## 2. గీతలు-ఉపనిషత్తులు

ఇంకను గీతలకును నా యా యుపనిషత్తులకును గల పరస్పర సంబంధ మేమియో విచారింతము. ప్రకృతమహాభారతములోఁ బ్రతి స్థలమున నుపనిషత్తులు సామాన్యముగ గ్రహింపఁబడినవి. ఇంతియే కాక, బృహదారణ్యక-ఛాందోగ్యములలోని (బృ. 1 3; ఛాం. 1.2) ప్రాణేంద్రియముల వివాద మనుగీతలయందు (అశ్వ. 23) వ్రాయఁ బడియున్నది. "న మే స్తేనో జనపదే" మొదలగునవి కైకేయాశ్వపతు లచే నుచ్చరింపఁబడిన శబ్దములు (ఛాం. 5.11.5). శాంతిపర్వమున నీ రాజుయొక్క విషయముఁ జెప్పునపుడు వ్రాయఁబడినవి (శాం.77. 8). ఇటులనే "న ప్రేత్య సంజ్ఞాస్తి"– చచ్చిన పిదప జ్ఞానియొక్క పే రేమియు నుండదు; కారణ మేమన: అతఁడు బ్రహ్మములోనే కలసిపోవుచున్నాఁడు అని బృహదారణ్యకములో నున్నది (బృ. 4.5. 13). శాంతిపర్వమునందలి జనక పంచశిఖసంవాదమునం దీ విష యము వ్రాయఁబడినది. తుదకు ప్రశ్నోపనిషత్తునను ముండకోపని షత్తునను నున్న (ప్రశ్న. 6.5; ముం. 3 2 8) నదీసముద్రములయొక్క దృష్టాంతములు నామరూపవిముక్తుఁడగు పురుషు నుద్దేశించి చెప్పఁబడి

నవి. ఇంతియకాక యింద్రియములను గుఱ్ఱములకుఁ బోల్చి బ్రాహ్మణ వ్యాధ సంవాగమునందును (వన 210), అనుగీతలయందును, బుద్ధిని సారథిగఁ బోల్చుట కఠోపనిషత్తునం దున్నది (క. 1. 3. 3). శాంతి పర్వమున (18.7.26; మఱియు 331.44) నీ రెండు స్థలములయందును "ఏవసర్వేషు భూతేషు గూఢాత్మా" (కఠ. 3.12), "అన్యత్ర ధర్మాదన్యత్రా ధర్మాత్" (కఠ. 2.14) అను కఠోపనిషత్తులోనున్న శ్లోకములు, కొంచెము పాఠభేదమునఁ జెప్పఁబడినవి. శ్వేతాశ్వతరమునందలి "సర్వతః పాణిపాదం...." అను శ్లోకము మహాభారతమునందు గీతలయందును ననేక స్థలములయం దున్నదని యిదివఱకే చెప్పఁబడినది. కాని యింతమాత్రముననే నీ సాదృశ్యము పూర్తి కానేరదు. ఇంతియకాక యుపనిషత్తులలోని యనేక వాక్యములు మహాభారతమునం దనేక స్థలములలో నున్నవి. వే యేల? మహాభారతమునందలి యాధ్యాత్మిక జ్ఞాన మనేకముగ నుపనిషత్తులలో ప్రతిపాదింపఁబడినదే యని చెప్పవచ్చును.

మహాభారతమందలి యాధ్యాత్మికజ్ఞానమువలెనే భగవద్గీతలలోని యాధ్యాత్మికజ్ఞానమును నుపనిషత్తుల లోనిదే. మఱియు గీతలయందున్న భక్తిమార్గము సైత మీ యధ్యాత్మజ్ఞానమును వదలకయే చెప్పఁబడిన దనియును, నీ గ్రంథముయొక్క తొమ్మిదవ ప్రకరణమునను, పదుమూఁడవ ప్రకరణమునను నేను విస్తరముగ నిరూపించియున్నాను. కావున దాని నిచ్చో మరలఁ జెప్పక సంక్షేపముగఁ జెప్పునదేమన: గీతయొక్క రెండవ యధ్యాయమందున్న యాత్మయొక్క యశోచ్యత్వమును, నెనిమిదవ యధ్యాయములోని యక్షరబ్రహ్మస్వరూపమును పదుమూఁడవ యధ్యాయములోని క్షేత్రక్షేత్రజ్ఞవిచారమును ముఖ్యముగ జ్ఞేయబ్రహ్మస్వరూపము నను విషయములన్నియు, నక్షరములతోఁ గూడ నుపనిషత్తులలో నుండి గైకొనియే గీతలలోఁ జెప్పఁబడినవి. ఉపనిషత్తులలోఁ గొన్ని గద్యములుగను,

కొన్ని పద్యములుగను నున్నవి. వీనిలో గద్యాత్మకములగు నుపనిష త్తులలోనున్న వాక్యములు పద్యములుగ గీతలలో నున్నవి యున్నట్లు చెప్పుటకు వీలులేదు. అయినను "ఏది యున్నదో యది యుండనే యున్నది. ఏది లేదో యది లేనేలేదు" (గీ. 2.16). "యం యం వాపి స్మరన్ భావం...." (గీ. 8.6) మొదలగు విచారము ఛాందోగ్యమున నున్నది. మఱియు "క్షీణే పుణ్యే" (గీ. 9.21) "జ్యోతిషాం జ్యోతిః" (గీ.13.17) లేక, "మాత్రా స్పర్శాః" (గీ. 2.14) అను విచారణయు వాక్యములును బృహదారణ్యకము లోనివే యని యుపనిషత్తులఁ జది వినవారికి సహజముగనే కాన్పించును; కాని గద్యాత్మకములగు నుప నిషత్తులను గాక పద్యాత్మకములగు నుపనిషత్తులను గైకొన్న నీ సామ్య మింతకంటెను బాగుగనే వ్యక్తమగును. కారణ మేమన: ఈ పద్యాత్మకములగు నుపనిషత్తులయందున్న కొన్ని శ్లోకము లున్నవి యున్నట్లే భగవద్గీతలో సైతము గాన్పించుచున్నవి. కఠోపనిషత్తులోని యాఱేడుశ్లోకములు పూర్తిగఁ గాని, లేక, కొంతశబ్దభేదముతోఁ గాని గీతలయందుఁ జెప్పఁబడినవి. గీతలయొక్క రెండవ యధ్యాయమున "ఆశ్చర్యవ త్పశ్యతి" (2. 29) అను శ్లోకము కఠోపనిషత్తు నందలి రెండవవల్లిలో "ఆశ్చర్యో వక్తా"...." (కఠ. 2. 7) అను శ్లోకముతో సమానముగ నున్నది. "న జాయతే మ్రియతే వా కదాచిత్" అను శ్లోకమును (గీ. 2.20), "య దిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి...." (గీ. 8.11) అను శ్లోకార్థమును గీతయందును కఠోపనిషత్తునందును నేమియు మార్పేలేక యొకటిగనే యున్నది (కఠ. 2. 19 మఱియు 2.15). "ఇంద్రియాణాం పరాణ్యాహుః" (గీ. 3.42) అను గీతలలోని శ్లోకము కఠోపనిషత్తునం దున్నదని (కఠ. 3.10) పూర్వమందే చెప్పఁ బడినది. అటులే గీతయందున్న పదునైదవ యధ్యాయములోని యశ్వత్థవృక్షముయొక్క రూపకము కఠోపనిషత్తునుండియు, "న త ద్భాసయతే సూర్యో...." (గీ. 15.6) అను శ్లోకము కఠోపనిషత్తునుం

డియు శ్వేతాశ్వతరములో నుండియును, గ్రైకొని కొంచెము శబ్దభేద మున గీతయందు వ్రాయఁబడినది. శ్వేతాశ్వతరోపనిషత్తు నందలి యితరములగు ననేక కల్పనలును, శ్లోకములును, గీతలయందున్నవి. మాయాశబ్దము మొట్టమొదట శ్వేతాశ్వతరోపనిషత్తునం దుండెను. దానిలోనుండి యా శబ్దము గీతలలోనికిని, మహాభారతములోనికిని గ్రైకొనఁబడియుండు నని తొమ్మిదవ ప్రకరణములో నేను నిరూపించి యున్నాను.

ఇంతయకాక గీతలలోని యాఱవయధ్యాయమునందు "శుచౌ దేశే ప్రతిష్ఠాప్య" (గీ. 6. 11) అని యోగాభ్యాసమునకు యోగ్యము లని చెప్పఁబడిన స్థలములను గుఱించిన శ్లోకములు "సమే శుచౌ...." (శ్వే. 2. 10) అను శ్వేతాశ్వతరోపనిషత్తునందలి మంత్రము నుండి యును, "సమం కాయశిరోగ్రీవం...." (గీ. 6.13) అను నీ శ్లోకము "త్రిరున్నతం స్థాప్య సమం శరీరం (శ్వే.2.8) అను శ్వేతాశ్వతరోప నిషత్తునందలి మంత్రమునందుండియుఁ గ్రైకొనఁబడినట్లు శబ్దసామ్య మును బట్టియే స్పష్ట మగును. అటులనే "సర్వతః పాణిపాదం ..." అను శ్లోకమును, దానికి ముందున్న శ్లోకమునందలి సగమును గీత యందును (13.13) శ్వేతాశ్వతరోపనిషత్తునందును మార్పేమియు లేక కాన్పించుచున్నవి(శ్వే. 3.16). మఱియు "అణో రణీయాంసం", లేక "ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అను పదములును గీతలలోను (8.9), శ్వేతాశ్వతరోపనిషత్తునందును నొకరీతిగనే యున్నవి (శ్వే.3. 9, 20). ఇంతియకాక గీతలయందును, నుపనిషత్తులయందును గల శబ్దసాదృశ్యమును జూచితి మేని "సర్వభూతస్థ మాత్మానం" (గీ. 16.29), "వేదైశ్చ సర్వై రహ మేవవేద్యః" (గీ. 15. 15) అను నీ యర్థశ్లోకములు రెండును కైవల్యోపనిషత్తునందును(కై.1.10; 2.3) నున్నవి యన్నటులే కాన్పించుట నిజమే కాని యీ శబ్దసాదృశ్య విషయమై విశేషముగా విచారించుటలోఁ బ్రయోజనమేమియు లేదు.

గీతలలోని వేదాంత ముపనిషత్తులలోని వేదాంతము ననుసరించియే ప్రతిపాదింపఁబడిన దను విషయములో నెవరికిని సందేహము లేదు. ఉపనిషత్తుల వివేచనకును, గీతల వివేచనకును నేమైన భేద లేదా? యనియు, ఉండె నేని యా భేద మేది? యను విషయమే మున్నదా? ముఖ్యముగ విచారింపఁదగినది; కాన, ప్రకృతము దానిని గూర్చియే విచారింతము.

ఉపనిషత్తు లనేకము లుండినను వానిలోఁ గొన్నిటి భాషను జూచిన, గొన్ని ప్రాచీనోపనిషత్తులకు సమకాలికములు గావని యను మాన పడఁదగినంత నవీనములుగఁ గన్పట్టును. కావున గీతలయం దును, నుపనిషత్తులయందును ప్రతిపాద్యములగు విషయములయొక్క సాదృశ్యమును జూచుచు, బ్రహ్మసూత్రములయందు గ్రహింపఁబడిన యుపనిషత్తులనే ముఖ్యముగ నీ ప్రకరణమునందు పోలికనిమిత్తమై కైకొంటిని. ఈ యుపనిషత్తుల యర్థమును, గీతలయందలి యధ్యాత్మ సంబంధమును జూచితిమేని, నిర్గుణ పరబ్రహ్మస్వరూపము రెండింటిలో నొక్కటిగ నున్నను, నిర్గుణమునుండి సగుణ మెట్లు వెలువడినదియుఁ జెప్పునప్పు డవిద్యాశబ్దమునకు మారుగ మాయా-అజ్ఞానశబ్దములే గీత లలో వాడఁబడినవని కన్పట్టును. మాయాశబ్దము శ్వేతాశ్వతరములో నున్నది; కాని నామరూపాత్మకమగు నవిద్యకే యిది పర్యాయశబ్ద ముగ నున్నది. ఈ విషయము పూర్వమున తొమ్మిదవప్రకరణములోఁ జెప్పఁబడినది. మఱియు శ్వేతాశ్వతరోపనిషత్తులోని కొన్ని శ్లోకము లేమాత్రము మార్పులేక యే గీతలలోఁ బ్రయోగింపఁబడినవని పూర్వ మందుఁ జెప్పియే యున్నాము. "సర్వం ఖల్విదం బ్రహ్మ" (ఛాం. 3.14.1), లేక, "సర్వమాత్మానం పశ్యతి" (బృ. 4.4.23), లేక, "సర్వభూతేషు చాత్మానం" (ఈశ. 6) అను సిద్ధాంతము (అనఁగా: ఉపనిషత్తులయందు మొత్తముమీఁద నున్న యధ్యాత్మజ్ఞానము) గీతలలో సంగ్రహముగఁ జెప్పఁబడినను, నామరూపాత్మకమగు

నవిద్యకు, మాయ యనుపే రుపనిషత్తులలో రూఢమైన పిదప, గీతా గ్రంథము పుట్టినదని దీనింబట్టి మొదటనే యనుమానము చేయఁ బడును.

ఇప్పు డుపనిషత్తులయందును గీతలయందు నున్న యుప పాదనములో భేద మేమని విచారించితి మేని గీతయందు కాపిల శాస్త్రమునకుఁ బ్రాముఖ్యము చెప్పఁబడినట్లు కన్పట్టును. బృహ దారణ్యకము, ఛాందోగ్యము నను జ్ఞానపరములగు నుపనిషత్తులలో సాంఖ్యప్రక్రియయొక్క పేరైనను స్పష్టముగఁ జెప్పఁబడలేదు. ఘటియు కఠము మొదలగు నుపనిషత్తులలో నవ్యక్తము, మహత్తు మొదలగు సాంఖ్యశాస్త్రమునందలి శబ్దము లున్నను వానికి సాంఖ్య ప్రక్రియానుసారముగ నర్థము చేయక వేదాంతశాస్త్రానుసారముగ నర్థము చెప్పవలయునని స్పష్టముగఁ గాన్పించును. మైత్ర్యుపనిషత్తునం దలి యుపపాదనకు నా న్యాయమే ప్రవర్తించును. సాంఖ్యప్రక్రియ నీ తీరున బహిష్కరించుట యను ప్రయత్నముచేతనే వేదాంతసూత్ర ములయందు పంచీకరణమునకు బదులుగ ఛాందోగ్యోపనిషత్తు నాధారముగఁ గైకొని త్రివృత్కరణముచేతనే సృష్టియందలి నామ రూపాత్మకమగు వైచిత్ర్యమున కుపపత్తి చెప్పఁబడినదని తేలినది (వే.సూ. 2.4.20). సాంఖ్యమతమును బూర్తిగ వదలి యాధ్యాత్మిక శాస్త్రమునందలి క్షరాక్షరవివేచనము చేయుపద్ధతి గీతలలో స్వీకరింపఁ బడలేదు. అయినను సాంఖ్యసిద్ధాంత మున్నది యున్నటులే గీత లలో గ్రహింపఁబడలేదని యెఱుంగవలయును. త్రిగుణాత్మకమును, నవ్యక్తమును నగు ప్రకృతినుండి గుణోత్కర్షచే వ్యక్తసృష్టియంతయు నెట్లు సృజింపఁబడె నను విషయమున, సాంఖ్యసిద్ధాంతానుసారముగ పురుషుఁడు నిర్గుణుఁడగుటచే, ద్రష్టయే యగు ననువారి మతము సైతము గీతలలో నొప్పుకొనఁబడియే యున్నది; కాని ప్రకృతి పురుషు లిరువురును స్వతంత్రులు కారనియు, ఈ యిరువురు నుపని

షత్తులయందుఁ జెప్పఁబడిన యాత్మరూపి యగు పరబ్రహ్మము యొక్క స్వరూపమే (అనఁగా: విభూతియే) యనియు, ద్వైతసాంఖ్య జ్ఞానముకంటె నద్వైతవేదాంతము యొక్క ప్రాబల్య మీ తీరున స్థాపింపఁబడి సాంఖ్యులయొక్క క్షరాక్షరవిచారము గీతలయందుఁ జెప్పఁబడినది. ఉపనిషత్తులలోని బ్రహ్మాత్మైక్య మను నద్వైతమత మందు ప్రవేశపెట్టఁబడిన ద్వైతులగు సాంఖ్యుల సృష్ట్యుత్పత్తి క్రమముయొక్క సంబంధము గీతలయందువలెనే మహాభారతము నందలి యితరములగు నాధ్యాత్మికవివేచనఁ జేయు ప్రకరణముల యందును గలదు. దీనినిబట్టి గీతలును, మహాభారతము నను నీ రెండు గ్రంథములును నొకరిచేతనే చెప్పఁబడినవని పూర్వమందుఁ జేయఁబడిన యనుమానమే బలపఱుపఁబడెను.

వ్యక్తోపాసన, లేక, భక్తిమార్గ మను గొప్పవిషయమే యుపని షత్తులకంటె గీతలలో బాగుగ నుపపాదింపఁబడిన రెండవవిషయము. కేవల యజ్ఞయాగాదికర్మలు జ్ఞానదృష్టిచే న్యూనములని భగవద్గీతల యందువలె నుపనిషత్తులయందును నొప్పుకొనఁబడినవి; కాని వ్యక్తుఁ డును, మానవదేహధారియునగు నీశ్వరునియొక్క యుపాసన ప్రాచీ నములగు నుపనిషత్తులలో స్పష్టముగఁ గాన్పింపదు. అవ్యక్తమును, నిర్గుణమునగు పరబ్రహ్మస్వరూప మనుభవగోచరమగుట బహుకష్టము. కావున మనస్సు, ఆకసము, సూర్యుఁడు, అగ్ని, యజ్ఞము మొదలగు సగుణము లయిన ప్రతీకముల నుపాసింపవలయు నను సిద్ధాంత ముపనిషత్కారులకును మాననీయముగనే యున్నది; కాని యుపాసన విషయములోఁ బ్రాచీనోపనిషత్తులయందుఁ జెప్పఁబడిన ప్రతీకముల యందు మనుష్యదేహధారియగు పరమేశ్వరునియొక్క స్వరూపము ప్రతీకముగ నెక్కడను లేదు. రుద్రుఁడు, శివుఁడు, విష్ణువు, అచ్యు తుఁడు, నారాయణుఁడు, అను నీ ప్రతీకము లన్నియుఁ బరమాత్మ యొక్కరూపములే యని మైత్ర్యుపనిషత్తునందుఁ (మై. 7. 7) జెప్పఁ

బడినది. శ్వేతాశ్వతరోపనిషత్తునందు 'మహేశ్వరుఁడు' మొదలగు శబ్దములున్నవి. "జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః" (శ్వే. 5.13), లేక, "యస్య దేవే పరాభక్తిః" (శ్వే. 6. 23) మొదలగు వచనములును శ్వేతాశ్వతరములో నున్నవి; కాని యీ వచనములనుబట్టి, నారాయణుఁడు, విష్ణువు, మొదలగు శబ్దములకు విష్ణువుయొక్క మానవదేహరూపమగు నవతారమే యర్థమని నిశ్చయించుటకు సాధ్యము గాదు. కారణ మేమన: రుద్రుఁడు, విష్ణువు నను నిరువురు దేవతలును వైదికులే (అనఁగా: ప్రాచీనులే). "యజ్ఞో వై విష్ణుః" (తై.సం. 1.7.4)అని చెప్పఁబడినట్లు, ప్రాచీనములగు యజ్ఞయాగములనే విష్ణురూపముగ నుపాసింపవలయునని వెనుకఁ జెప్పఁబడినదియు పూర్వమునఁ జెప్పఁబడిన యుపనిషత్తుల యభిప్రాయము కానేరదని చెప్పుటకు సాధ్యము కాదు. అయినను మానవ రూపములను ధరించిన యవతారములయొక్క కల్పనయు నప్పుడే పుట్టియుండునని చెప్పిన నదియును బొత్తిగ నసంభవము కాదు. కారణ మేమన: శ్వేతాశ్వతరోపనిషత్తునందున్న భక్తిశబ్దమును యజ్ఞరూపముయొక్క యుపాసనకు సంబంధింపఁజేయుట, చూపుల కంత యుక్తముగఁ గాన్పింపదు. మహానారాయణము, నృసింహతాపని, రామతాపని, గోపాలతాపని మొదలగు నుపనిషత్తులయందున్న వచనములు శ్వేతాశ్వతరోపనిషత్తులోని వచనములకంటె నధికస్పష్టముగ నుండుటచేత నా విషయమై యిట్టి శంక చేయుటకే యవకాశము లేదనుమాట నిజమే; కాని యీ యుపనిషత్తులయొక్క కాలమును నిశ్చయించి వక్కాణించుటకు సాధనములు లేమిచే వైదికధర్మమునందు మానవరూపధారియగు విష్ణువుయొక్క భక్తి యెప్పు డుత్పన్నమైన దనుప్రశ్నకుపనిషత్తులనుండి సరియగు సమాధానము లభ్యపడదు. అయినను వైదికభక్తిమార్గము మిక్కిలి ప్రాచీనముగ నున్నదని యితరపద్ధతులచే బాగుగనే సిద్ధమగును. "భక్తిః"- అనఁగనే యెవరి విషయమై భక్తి యుండునదియు ముందు సూత్రమును జెప్పి (పా. 4.3.985), "వాసు

దేవార్జునాభ్యాం వున్" (పా. 4.3.98). అను సూత్రముచే వాసుదేవునియందు భక్తిగలవారు 'వాసుదేవకు' లనియు నర్జునునియందు భక్తిగలవారు 'అర్జునకు' లనియు పాణిని సూత్రములనుఁ జెప్పెను. పతంజలి మహాభాష్యమున నీ సూత్రమునకు వ్యాఖ్యానమునుజేయుచు వాసుదేవశబ్ద మీ సూత్రమునందు క్షత్రియునియొక్క గాని భగవంతునియొక్క గాని పేరై యున్నదని చెప్పినారు. వీనిలో పతంజలి భాష్యముయొక్క కాలము క్రైస్తవశకముకంటె పూర్వమున సుమారు రెండు వందల యేఁబది సంవత్సరము లయి యుండునని భాండారుకరుచే నిరూపింపఁబడినందున, పాణినియొక్క కాలము దీనికంటె సైతము చాలప్రాచీనముగ నుండవలయు నను విషయములో వాదమేమియు లేదు. ఇంతియే కాక బౌద్ధ ధర్మగ్రంథములయందును భక్తి వ్రాయఁబడియున్నది. బౌద్ధ ధర్మగ్రంథముల మహాయాన పంథలో భక్తియొక్క తత్త్వమెక్కువగ వ్యాపించియుండుటకు శ్రీకృష్ణునియొక్క భాగవతధర్మములే కారణములై యుండునని వెనుక సవిస్తరముగ నిరూపించియున్నాను. కావున నెంత తక్కువగ లెక్క చూచినను బుద్ధునికంటె పూర్వ మందె (అనఁగా: క్రైస్తవ శకముకంటె పూర్వము సుమారు ఆ రెంటికంటె నెక్కువయగు శతాబ్దముల క్రిందటనె) మన దేశమందు భక్తిమార్గము పూర్ణముగ స్థాపింపఁబడినదని నిర్వివాదముగ సిద్ధ మగుచున్నది. నారదపంచరాత్రము గాని, శాండిల్యునియొక్క గాని, నారదునియొక్క భక్తిసూత్రములు గాని, వీనిచే తర్వాత పుట్టిన భక్తిమార్గముయొక్క గాని, లేక, భాగవతధర్మములయొక్క గాని ప్రాచీనత్వమునకు నేమియు భంగము రాదు. ప్రాచీనోపనిషత్తులలోఁ జెప్పఁబడిన సగుణోపాసన నుండియే మనలో భక్తిమార్గము క్రమక్రమముగ బయలు వెడలినది. పాతంజలయోగమునందు చిత్తస్థైర్యమును సంపాదించుకొనుట కేదియో యొక వ్యక్తమును, ప్రత్యక్షము నగు వస్తువును కన్నులయెదుట నుంచికొనవల

యును గాన, దానిని బట్టి భక్తిమార్గమునకు రెండుబలములు గలిగిన వనియు, భక్తిమార్గమే యితరదేశములనుండియు హిందూదేశమునకు రాలే దనియు, నట్లు రా నక్కర లేదనియు గీతారహస్యములోనుండు వివేచనవలన స్పష్టముగఁ దెలియును. హిందూదేశమున నిటులు వెలువడిన భక్తిమార్గమును, మఱియు విశేషముగ వాసుదేవభక్తిని, ఉపనిషత్తుల యందున్న వేదాంతదృష్టితో సమర్థించుట యనునది గీతలలో నుండు ప్రతిపాదనలో నొక విశేషభాగముగ నున్నది.

కాని కర్మయోగముతో భక్తికిని బ్రహ్మజ్ఞానమునకును సంబంధము గలుగఁ జేయుట యనున దింతకంటెను నధిక మాహాత్మ్యము గలవిషయము. చాతుర్వర్ణ్యకర్మలు గాని, లేక, యజ్ఞయాగాది కర్మలు గాని యుపనిషత్తులయం దప్రధానము లని చెప్పఁబడినను చిత్తశుద్ధ్యర్థమై వానిని జేయవలయును. చిత్తశుద్ధి గలిగినపిదప వానిని వదలి పెట్టుట మంచిది కాదని కొన్ని యుపనిషత్తులలోనే చెప్పఁబడినది. అయినను గొప్పగొప్ప యుపనిషత్తులయొక్క యభిప్రాయము సామాన్యముగ కర్మసన్న్యాసమునే బోధించునని చెప్పవలయును. “కుర్వన్నే వేహ కర్మాణి” యని యీశావాస్యోపనిషత్తునం దున్నట్లు, మఱికొన్ని యుపనిషత్తులలో సైత మామరణాంతము కర్మ చేయుచునే యుండవలయునని విధింపఁబడినది; కాని యధ్యాత్మజ్ఞానమునకును, సాంసారిక కర్మలకును గల విరోధమును పరిహరించి చిరకాలమునుండి యాచరింపఁబడు కర్మయోగము గీతలయందు సమర్థింపఁబడినట్లు, ఏయుపనిషత్తునందును బాగుగ సమర్థింపఁబడ లేదు. వేయేల? ఈ విషయమున నుపనిషత్కారులయొక్క సిద్ధాంతముకంటె గీతయొక్క సిద్ధాంతము వేఱుగనే యున్నదని చెప్పవచ్చును. గీతారహస్యపు పదునొకండవ ప్రకరణమున నీ విషయము సవిస్తరముగ విచారింపఁబడినది గాన నిక్కడ దానివిషయమై యెక్కువగ వ్రాయ నవసరము లేదు.

గీతయందలి యాఱవ యధ్యాయమునందుఁ జెప్పఁబడిన యోగసాధనముల యొక నిర్దేశము పాతంజల యోగసూత్రము లందు సవిస్తరముగను, మార్గప్రదర్శకముగను వివేచింపఁబడుటచే, నీ సూత్రము లా విషయమునకుఁ బ్రమాణగ్రంథ మని యెన్ను చున్నారు. ఈ సూత్రములు నాలు గధ్యాయములై యున్నవి. వీనిలో ప్రథమాధ్యాయప్రారంభముననే "యోగ శ్చిత్తవృత్తినిరోధః" అని యోగశబ్దార్థమును వివరించి "అభ్యాసవైరాగ్యాభ్యాం త న్నిరోధః" — ఈ నిరోధ మభ్యాస వైరాగ్యములచే సాధ్య మగును అని చెప్పిన పిదప యమ నియ మాసన ప్రాణాయామాదులగు యోగసాధనము లను జెప్పుచు, మూఁడవ నాల్గవ యధ్యాయములలో 'అసంప్రజ్ఞాత' (అనఁగా: నిర్వికల్పక) సమాధిచే అణిమాదులైన యలౌకికములగు సిద్ధులును సామర్థ్యములు నెట్లు లభించునదియు, నీ సమాధిచే చివరకు బ్రహ్మనిర్వాణరూపమైన మోక్ష మెట్లు సంభవించునదియు నిరూపింపఁ బడినది. భగవద్గీతలయందును మొదట చిత్తనిరోధము చేయుట యొక్క యావశ్యకతయు (గీ. 6. 20), పిదప నభ్యాసము, వైరా గ్యము నను నీ రెండు సాధనములచేతను చిత్తము నిరోధింపవలయు ననియు (గీ. 6. 35), చెప్పి తుదకు నిర్వికల్పసమాధి నెటు లభ్య సింపవలసి నదియు, దానియం దెట్టి సుఖ మున్నదియు చెప్పఁబడి నది; కాని యంతమాత్రముచే పాతంజల యోగమార్గము భగవద్గీత లకు సమ్మత మగునని కాని, పాతంజలసూత్రములు భగవద్గీతకంటె పూర్వముననే యున్నవని కాని చెప్పుటకు సాధ్యముకాదు. పాతంజల సూత్రములయందుఁ జెప్పఁబడినట్లు సమాధి సిద్ధించుటకై ముక్కు మూసికొని యాయువు నంతను వ్యయము చేయవలయునని భగవం తుఁ డెక్కడను చెప్పలేదు. కర్మయోగ సిద్ధ్యర్థ మావశ్యక మగు బుద్ధి యొక్కసమత్వమును బొందుటకు సాధనమని గీతలలో చిత్తవృత్తి నిరోధమును, సమాధియుఁ జెప్పఁబడినవి. కావున నీ విషయములో

పాతంజల సూత్రములకంటె శ్వేతాశ్వతర, కఠోపనిషత్తులతోడనే గీతల కెక్కువ సామ్య మున్నదని చెప్పవలయును. ధ్యానబిందు, ఛురికా, యోగతత్త్వము లను నీ యుపనిషత్తులు యోగముయొక్క స్వరూప మునే చెప్పుచున్నవి; కాని వానియందు యోగ మనునదే ముఖ్య విషయ మగుటచే యోగమందలి మాహాత్మ్య మెక్కువ యని యంతటను స్తుతి చేయఁబడెను. కావున కర్మయోగమే శ్రేష్ఠమని చెప్పునట్టి గీతలతో నీ యేక పక్షీయములగు నుపనిషత్తుల కన్నిటికిని సంబంధము కలుగఁజేయుట యుక్తము కాదు. మఱియు నది సిద్ధ మును కానేరదు. థామ్సన్ దొరచే నింగ్లీషు భాషలోనికి తర్జుమా చేయఁబడిన గీతా గ్రంథమునందలి యుపోద్ఘాతములో గీతలయం దున్న కర్మయోగము పాతంజల యోగమునకే యొక రూపాంతర మని వ్రాయఁబడినది; కాని యీ విషయ మే మాత్రము సంభవించు టకు వీలులేదు. గీతలయందున్న యోగశబ్దముయొక్క సత్యమగు నర్థము తెలియక పోవుటచే నాతఁ డిట్లు భ్రమ పడెనని మేము చెప్పు చున్నాము. కారణ మే మన: గీతలయందలి కర్మయోగము ప్రవృత్తి పరము గను, పాతంజలయోగము దానికి కేవలము విరుద్ధము గను (అనఁగా: నివృత్తిపరముగను) నున్నది. ఈ రెంటిలో నొక దానినుండి మఱియొకటి పుట్టుటకు వీలులేదు. అటులే గీతలయందును చెప్పఁ బడినది, వేయేల? యోగశబ్దమునకు 'కర్మయోగ' మని ప్రాచీ నార్థము గాన పాతంజల సూత్రములలో నా శబ్దమునకే 'చిత్తనిరోధ రూపమగు యోగ' మర్థమని విశేషముగఁ జెప్పవలసి వచ్చె ననియుఁ జెప్పవచ్చును. ఇది యెటులైన నుండుఁగాక! పూర్వకాలమందు జనకాదులచే నాచరింపఁబడిన నిష్కామ కర్మాచరణ మార్గముతో గీతల లోని యోగము (అనఁగా: కర్మ మార్గము) సమానముగ నున్నది. మనువు, ఇక్ష్వాకువు మొదలగువారి పరంపరనుండి యది ప్రవర్తించి, యింతవరకును ప్రచారములో నున్న భాగవతధర్మముల నుండి

గ్రహింపఁబడినది గాని పాతంజలయోగమును బట్టి నిర్మింపఁబడినది కాదు; అను విషయము నిర్వివాదముగనే యున్నది.

గీతయు నుపనిషత్తులు నను రెండింటికిని సాదృశ్య వైషమ్యము లే విషయములో నున్నదియు దీనిం బట్టి తెలియును. ఈ విషయము లలో ననేకములు గీతారహస్యములో నక్కడక్కడ విచారింపఁబడినవి. కావున నిచ్చో తుదను గీతలలోని బ్రహ్మజ్ఞాన ముపనిషత్తుయొక్క యాధారముచేతనే చెప్పఁబడిన దైనను నది నుపనిషత్తునం దున్న యాధ్యాత్మికజ్ఞానమునే యనువదింపక, యా యాధ్యాత్మికజ్ఞానము మీఁదనే వాసుదేవభక్తియొక్కయు, సాంఖ్యశాస్త్రమునఁ జెప్పఁబడిన సృష్ట్యుత్పత్తి క్రమముయొక్కయు(అనఁగా: క్షరాక్షర జ్ఞానము యొక్కయు) భారమును వైచుటచే సామాన్యజను లాచరించుటకు సులభమును, నుభయ లోకములయందును శ్రేయస్కరమునైన వైదిక కర్మయోగధర్మమే, గీతలలో ముఖ్యముగఁ బ్రతిపాదింపఁబడినవని సంక్షేపముగఁ జెప్పుచున్నాఁడను. ఉపనిషత్తులకంటె గీతలయందున్న యాధిక్య మిదియే. కావున బ్రహ్మజ్ఞానమునఁ దక్క మిగిలిన యితర విషయములలో సన్న్యాస పరములగు నుపనిషత్తులతో నేకవాక్యతను సంపాదించుట కొఱకు గీతలను సాంప్రదాయికదృష్టితో తికమకఁ జేయుట యుక్తము కాదు. రెండింటియందు నున్న యాధ్యాత్మిక జ్ఞాన మొక్కటియే యను మాట సత్యమే. అయినను అధ్యాత్మజ్ఞాన రూపమగు శిర స్సొకటి యైనను సాంఖ్య కర్మమార్గము లను నీ రెండు వైదికధర్మములును సమానబలము గలిగిన రెండు బాహువులు గాన నీశావాస్యోపనిషత్తు నందువలె జ్ఞానసహిత కర్మయే గీతలయందు స్పష్టముగఁ జెప్పఁబడిన దని గీతారహస్యముయొక్క పదునొకండవ ప్రకరణమున స్పష్టముగనే నిరూపించినాఁడను.

---

## 3. గీతలు-బ్రహ్మసూత్రములు

జ్ఞాన ప్రధానములును, భక్తి ప్రధానములును యోగప్రధానములును నయిన యుపనిషత్తులు, భగవద్గీతలు నను నీ రెండింటికిని సాదృశ్య మెంత కలదు, వైషమ్యమెంత కలదని యిట్లు విచారించిన పిదప బ్రహ్మసూత్రములతో గీతలను సజముగ పోల్చిచూడవలసినంత యవసరము లేదు. కారణ మేమన: ఆ యా యుపనిషత్తులలో నా యా ఋషీశ్వరులచే వేర్వేఱు విధమునఁ జెప్పఁబడిన యధ్యాత్మసిద్ధాంతముయొక్క పద్ధతినే వివేచనఁ జేయుటకై బాదరాయణులు బ్రహ్మసూత్రములు చెప్పుటకుఁ బ్రవర్తించిరి గాన, నా బ్రహ్మసూత్రముల యం దుపనిషత్తులలో నున్న దానికంటె వేఱగు విచారమును జేయుటకుఁ వీలులేదు. అయినను భగవద్గీతయొక్క పదమూఁడవ యధ్యాయములో క్షేత్రక్షేత్రజ్ఞవిచారమున నారంభమునందే-

**ఋషిభి ర్బహుధా గీతం ఛందోభి ర్వివిధైః పృథక్,**
**బ్రహ్మసూత్రపదై శ్చైవ హేతుమద్భి ర్వినిశ్చితైః.**

క్షేత్రక్షేత్రజ్ఞులు "అనేక ప్రకారములును వివిధములు నగు ఛందస్సుల చేతను, (అనేకులగు) ఋషులచేతను, వేర్వేఱగు హేతుయుక్తములును, పూర్ణముగ నిశ్చయాత్మకములును నగు బ్రహ్మసూత్ర పదములచేతను" వివేచన చేయఁబడిరి (గీ. 13.4) అని బ్రహ్మసూత్రములను స్పష్టముగ జెప్పఁబడినవి. మఱియు నీ బ్రహ్మసూత్రములును ప్రస్తుతమందున్న వేదాంతసూత్రములును వేఱు కావని యందుమేని ప్రస్తుతమందున్న వేదాంతసూత్రముల యనంతరము గీత పుట్టినదని చెప్పవలసివచ్చును. కావున నీ బ్రహ్మసూత్రము లేవియవని, గీతాకాల దృష్టితోఁ దప్పక విచారింపవలసి వచ్చును. * కారణ మేమన :ప్రస్తుత

* ఈ విషయము కై. తెలంగుగారిచే విచారింపఁబడినది. ఇంతియ కాక 1895-సంవత్సరమున, ఈ విషయమున ప్రొ. తుకారామ రామచంద్ర అంమళనేంకర్ బి. ఏ. గారిచే నొక గ్రంథము ప్రకటింపఁబడినది.

మందున్న వేదాంతసూత్రములు గాక బ్రహ్మసూత్రము లను పేరు గల మఱియొక గ్రంథ మిప్పుడు లభ్యపడదు. అట్టి గ్రంథ మొక్కటి యున్నటులే చెప్పఁబడలేదు. మఱియు ప్రస్తుతమున నుండు బ్రహ్మ సూత్రములకుఁ బిదప గీతలు పుట్టినవని చెప్పుటయు బాగుగనుండదు. కారణ మేమన: గీత లీ బ్రహ్మసూత్రములకంటె ప్రాచీనము లని పరం పరాగతముగఁ దెలియుచున్నది. ఈ యభిప్రాయమును మనస్సున నునిచికొనియే శాంకరభాష్యమునందు "బ్రహ్మసూత్రపదైః" అను దానికి "శ్రుతులయందుఁ లేక యుపనిషత్తులయందుఁ గాని యున్న బ్రహ్మ ప్రతిపాదకములగు వాక్యములు" అని యర్థము వ్రాసిరి. శాంకరభాష్యమునకు వ్యాఖ్యానము చేసిన యానందగిరియు, రామా నుజాచార్యులును, మధ్వాచార్యులు మొదలగు నితర భాష్యకారులును, "బ్రహ్మసూత్ర పదైశ్చైవ" అను పదముచే "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" మొదలగు బాదరాయణుమొక్క బ్రహ్మసూత్రములే యిక్కడ నుద్ది ష్టములని శాంకరభాష్యమునకు విరుద్ధముగ నర్థము చెప్పుచున్నారు. శ్రీధరస్వామి యీ రెండర్థములను జెప్పవచ్చునని నుడివెను. ఇప్పు డీ శ్లోకమునకు సత్యమగు నర్థ మేదియో స్వయముగ మనము నిశ్చ యించి కొనవలయును. క్షేత్రక్షేత్రజ్ఞవిచారము "ఋషులచే అనేక విధముల వేర్వేఱుగ" (పృథక్) చెప్పఁబడియున్నది. అది గాక(చైవ) "హేతుయుక్తములును వినిశ్చయాత్మకములు నగు బ్రహ్మసూత్రపద ములచే సైత" మీ యర్థమే చెప్పఁబడినది. ఈ ప్రకారముగ 'చైవ' (మఱియు)అను పదముచే నీ శ్లోకమున క్షేత్రక్షేత్రజ్ఞవిచారము చేయఁ బడిన రెండు భిన్న భిన్న స్థలము లుల్లేఖింపఁబడిన వని యర్థమగు చున్నది.ఈ రెండుస్థలములును వేఱుగనుండుటయేకాక వీనిలోమొదటి (అనఁగా: ఋషులచే చేయఁబడిన)వర్ణన "వివిధ చ్ఛందస్సులచే వేర్వే ఱైనది, అనఁగా: చిన్నచిన్నవియు ననేక విధములును" అగుటచేతనే, 'ఋషిభిః' అను తృతీయా బహువచనాంతపదముచేత నవి అనేక

ఋషులచేఁ జేయఁబడిన పనియు, బ్రహ్మసూత్రముల యందున్న రెండవవర్ణన "హేతుయుక్తమును, నిశ్చయాత్మకము" నైన దనియు, ఈ రెండు వర్ణనలలోను విశేషభేద మీ శ్లోకమునందే స్పష్టీకరింపఁబడి నది. ఈ 'హేతుమ'చ్ఛబ్దము మహాభారతమున ననేక స్థలములయం దుండుటచే "నైయ్యాయికరీతిగ కార్యకారణభావము నేర్పఱచి చేయఁ బడిన ప్రతిపాదన" మని యా శబ్దమున కర్థ మగును. జనపు నెదుట సులభచేఁ జేయఁబడిన సంభాషణమును గాని, శిష్టతకు (గౌరవము నకై) కౌరవసభకుఁ బోయినప్పుడు శ్రీకృష్ణమూర్తిచేఁ జేయఁబడిన సంభాషణమును గాని యుదాహరణముగఁ గైకొందము. మొదటి సంభాషణ "హేతుమంతమును నర్థవంతమును" (శాం. 220. 191), రెండవది "న హేతుకమును"(ఉద్యో.131.2) అని మహాభారతములోనే చెప్పఁబడినది. దీనిని బట్టి, సాధకబాదకము లగు ప్రమాణములను చూపించి, తుదకు నిస్సందేహముగ ననుమానము చేయఁబడిన ప్రతి పాదనకే "హేతుమద్భి ర్వినిశ్చితైః" అను విశేషణమును సంబంధిం చును. ఒకచో నొకటియు, మఱియొకచో నింకొకటియు నీ యుపని షత్తులయందు సంకీర్ణముగఁ బ్రతిపాదించుట కీ శబ్దములు పనికిరావని సిద్ధమగును. కావున నొకవైపున "ఋషిభిః బహుధా వివిధైః పృథక్" అను పదములకును, "వే ఱొకవైపున హేతుమద్భి ర్వినిశ్చితైః" అను పదములయొక్క విరోధాత్మకమగు స్వారస్యము దృఢపఱుప వలసి నచో, గీతలయందున్న పూర్వోక్త శ్లోకములో, "ఋషులచే వివిధ చ్ఛందస్సులయందును చేయఁబడినదియు, ననేక విధములైనదియు, వే ర్వేఱైనదియు" నగు విచారమే (అనఁగా: ఆ యుపనిషత్తులయం దున్న సంకీర్ణములును వేర్వేఱైన వాక్యములును, మఱియు "హేతు యుక్తములును నిశ్చితాత్మకములు నగు బ్రహ్మసూత్రపదములు" అను శబ్దములచే సాధకబాధక ప్రమాణముల నిరూపించి తుదకు నిస్సందే హమగు సిద్ధాంతముగ నిశ్చయింపఁబడిన బ్రహ్మసూత్రగ్రంథమునం

దున్న వివేచనమే) యభిప్రేతమై యున్నదని చెప్పక తీరదు. రెండ వదియు నిటులే యని యెఱుంగవలయును. అది యెటు లనఁగా: ఉపనిషత్తులయందున్న విచార మనేకులగు ఋషీశ్వరుల కనేక విధ ములుగఁ బొడకట్టినటులె (అనఁగా: విస్ఖలితమగు తీరుననే) చెప్పఁ బడియున్నది గాన, దానిని విచారించి యేకవాక్యతఁ జేసినఁ గాని యుపనిషత్తుల భావార్థము బాగుగఁ దెలియ నేరదని మనంబున నిడి కొనవలయును. కావున నుపనిషత్తులను వలెనే వాని కార్యకారణ భావములను నిరూపించి యేకవాక్యతను బోధించు వేదాంతసూత్ర ములను సైతము వివేచింప వలసి వచ్చును.

గీతలయందున్న శ్లోకమున కీ తీరున నర్థ మొనర్చితి మేని యుపనిషత్తులును బ్రహ్మసూత్రములును గీతకంటె పూర్వముననే రచి యింపఁబడి యుండవలయునని స్పష్ట మగుచున్నది. వీనిలో నతిముఖ్య ములగు నుపనిషత్తుల విషయమై వాదమేమియు లేదు. కారణ మేమి యన: ఈ యుపనిషత్తులయందుండు శ్లోకములే పదముల మార్పు సైత మే మాత్రము లేక గీతలయందుండునట్లు కాన్పించుచున్నవి; కాని బ్రహ్మసూత్రముల విషయమై సంశయించుట కవకాశముకలదు. కారణ మేమన: బ్రహ్మసూత్రములయందు 'భగవద్గీత' యను శబ్దము ప్రత్యక్షముగ లేక పోయినను, కొన్ని సూత్రములయందు 'స్మృతి' శబ్దముచే భగవద్గీతయే నిర్దేశింపఁబడినదని భాష్యకారు లొప్పుకొను చున్నారు. బ్రహ్మసూత్రములలో శాంకరభాష్యానుసారముగ 'స్మృతి' శబ్దముచేత గీతయే చెప్పఁబడినది. వానిలో నీ క్రింద చెప్పఁబడినవి ముఖ్యము లైనవి.

| బ్రహ్మసూత్రములు | గీతలు |
|---|---|
| అధ్యాయము, పాదము, సూత్రము | అధ్యాయము, శ్లోకము |
| 1.2.6 స్మృతేశ్చ | 18.61 "ఈశ్వరః సర్వభూతానాం" మొ. శ్లోకములు. |

| బ్రహ్మసూత్రములు అధ్యాయము, పాదము, సూత్రము | | గీతలు అధ్యాయము, శ్లోకము | |
|---|---|---|---|
| 1.3.23 | అపి చ స్మర్యతే | 15.6 | "న తద్భాసయతే సూర్యః" మొ. |
| 2.1.36 | ఉపపద్యతే చా ప్యుపలభ్యతే చ. | 15.3 | "నరూప మస్యేహ తథోపలభ్యతే" మొ. |
| 2.3.45 | అపి చ స్మర్యతే. | 15.7 | "మమైవాంశో జీవలోకే జీవ భూతః...." మొ. |
| 3.2.17 | దర్శయతి చాథో అపి స్మర్యతే. | 13.12 | "జ్ఞేయం యత్త త్ప్రవక్ష్యామి...." మొ. |
| 3.3.31 | అనియమః సర్వాసా మవిరోధః శబ్దానుమానాభ్యాం. | 8.26 | "శుక్లకృష్ణే గతీ హ్యేతే...."మొ. |
| 4.1.10 | స్మరంతి చ. | 6.11 | "శుచౌ దేశే...." మొ. |
| 4.2,21 | యోగినః ప్రతి చ స్మర్యతే. | 8.23 | "యత్ర కాలే త్వనావృత్తి మావృత్తిం చైవ యోగినః...." మొ. |

పూర్వోక్తములగు నెనిమిది స్థలములలోఁ గొన్నిటియందు సందిగ్ధముగఁ గన్పట్టినను మా మతమున నాలవదియు (బ్ర.సూ.2.3.45), నెనిమిదవదియు (బ్ర.సూ. 4. 2. 21) నగు స్థలములయందు నిస్సందేహముగనే యున్నది. మఱియు నీ విషయమున శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, వల్లభాచార్యులు నను నలువురు భాష్యకర్తల మతమును నొక్క విధముననే యున్నదని తెలిసికొనవలయును. జీవాత్మ పరమాత్మల సంబంధ మేమి యని విచారించుచు, సృష్టియందున్న యితర పదార్థములవలె జీవాత్మ పరమాత్మల సంబంధమేమి యని విచారించుచు, సృష్టియందున్న యితర పదార్థములవలె జీవాత్మ పరమాత్మవల్ల పుట్టలేదని "నాత్మాఽశ్రుతే ర్నిత్యత్వా చ్చ తాభ్యః" (బ్ర.సూ. 2.3.17) అను సూత్రముచే నిర్ణయించి జీవాత్మ, పరమాత్మయొక్క 'అంశ' మని "అంశో నానా

వ్యపదేశాత్ ....'' (బ్ర.సూ. 2.3.43) అను సూత్రమునందు జెప్పి, పిదప "మంత్రవర్ణాచ్చ" (2. 3. 44) అని శ్రుతి నాధారముగాఁ జేసి కొనుచు "అపి చ స్మర్యతే'' (2.3 45) "అనఁగా: స్మృతియు నటులే యున్నది'' యను సూత్రములు చెప్పఁబడినవి. ఈ స్మృతి ''మమై వాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'' (గీ. 15.7) అను గీతలయం దున్న వచన మని యందఱు భాష్యకారులును చెప్పుచున్నారు; కాని వీని యన్నిటికంటె కడపటు చెప్పిన యుదాహరణము మిక్కిలి నిస్సం దేహముగ నున్నది. దేవయాన, పితృయాణము లను రెండింటియం దును నాఱుమాసము లుత్తరాయణమును, నాఱుమాసములు దక్షిణా యన మని చెప్పుదురు. ఆ రెండు శబ్దముల కర్థము కాలపరముగాఁ జేయక, బాదరాయణులవారీ శబ్దమునకు నా యా కాలాభిమానిను లగు దేవతలే యర్థమని యెన్నుచున్నారని (వే.సూ. 4.3.4)పూర్వమున పదియవ ప్రకరణముననే చెప్పఁబడినది. దక్షిణాయనోత్తరాయణ శబ్దములకు కాల మను నర్థ మెప్పుడును చెప్పఁగూడదా యను సం దేహము గలిగి ''యోగినః ప్రతి చ స్మర్యతే'' (బ్ర. సూ. 4. 2. 21), అనఁగా: ఈ కాలము ''స్మృతియందు యోగులకు విహితముగ నున్నది'' అని యీ సూత్రము చెప్పఁబడినది. మఱియు ''యత్ర కాలే త్వనావృత్తి మావృత్తిం చైవ యోగినః'' (గీ 8.23) అను గీతా వచనములో నీ కాలము యోగులకు విహితమని స్పష్టముగఁ జెప్పఁ బడినది. దీనింబట్టి భాష్యకారులు చెప్పిన రెండు స్థలములయందైనను బ్రహ్మసూత్రములలో నున్న శబ్దములచే భగవద్గీతయే వివక్షిత మని చెప్పవలసి వచ్చును.

కాని భగవద్గీతయందు బ్రహ్మసూత్రములు స్పష్టముగ నుల్లే ఖింపఁబడినవనియు, బ్రహ్మసూత్రములయం దున్న స్మృతిశబ్దముచే భగవద్గీతయే నిర్దేశింపఁబడినదనియు, చెప్పునెడల రెండింటికిని కాల మును బట్టి విరోధము గలుగును. కారణ మేమన: భగవద్గీతలయందు

బ్రహ్మసూత్రములు స్పష్టముగ నుల్లేఖింపఁ బడియుండుటచే బ్రహ్మ సూత్రములు గీతకంటె పూర్వమే పుట్టినవని సిద్ధ మగుచున్నది. బ్రహ్మ సూత్రముల యందున్న 'స్మృతి' శబ్దముచే గీతయే యుద్దేశింపఁబడె నందు మేని గీత, బ్రహ్మసూత్రములకంటె పూర్వము రచియింపఁ బడినదని నిశ్చయ మగును. ఒకసారి బ్రహ్మసూత్రములు గీతకంటె పూర్వము లని యందుమేని మరల నా సూత్రములు గీతల యనంత రము పుట్టిన వనుటకు వీలు లేదు. కావున నీ ప్రతిబంధమును తప్పిం చుకొనుటకు గీతలయందున్న "బ్రహ్మసూత్ర పదైః" అను శబ్దముచే శాంకరభాష్యమునందున్న యర్థమునే గ్రహింతు మేని "హేతుమద్భి ర్వినిశ్చితైః" మొదలగు పదములయొక్క స్వారస్య మేమియు నుం డదు. మఱియు బ్రహ్మసూత్రములయందున్న 'స్మృతి' శబ్దముచే గీత గాక మఱి యేదైనను స్మృతి వివక్షిత మందు మేని క్రమముగ భాష్యకారులందఱును బొరపడినారని చెప్పవలసివచ్చును. వారు పొర పడినారని చెప్పినను స్మృతిశబ్దముచేతనే గ్రంథము వివక్షిత మని యనుటకును వీలులేదు. అట్లైన నీ సందేహనివారణ మెట్లగును? మా మతమున నీ సందేహము నివృత్తి యగుటకు మార్గ మొకటియే యున్నది. బ్రహ్మసూత్రములను రచించినవారే మూలభారతమును గీతలనుకూడ ప్రకృతమున్న రీతిగ రచియించినా రందుమేని యేమియు విరోధ ముండనేరదు. బ్రహ్మసూత్రములను వ్యాససూత్రములని చెప్పుట పరిపాటియై యున్నది. "శేషత్వాత్ పురుషార్థవాదో యథాన్యే ష్వితి జైమి నిః" (వే.సూ. 3.4.2) అను సూత్రముయొక్క శాంకరభాష్యమునకు టీకచేయుచు, జైమిని వేదాంతసూత్రకారులగు వ్యాసులకు శిష్యుఁడని యానందగిరి చెప్పెను. మఱియు నారంభమునందు చేసిన మంగళా చరణములో సైతము "శ్రీమద్వ్యాస పయోనిధి ర్నిధి రసౌ" అని బ్రహ్మసూత్రములను వర్ణించెను. మహాభారతకారులగు వ్యాసులకు, పైలుఁడు, శుకుఁడు, సుమంతుఁడు, జైమిని, వైశంపాయనుఁడు నని యైదుగురు శిష్యులు కలరు, వారికి వ్యాసులవారు మహాభారతమును

పాఠముం జెప్పిరి యను కథను ప్రస్తుతమందున్న మహాభారతము యొక్క యాధారముచేతను నేను వెనుక వ్రాసియున్నాను. ఈ రెండు విషయములను మనస్సున నునిచికొని విచారించితిమేని మూల భారతమునకును తదంతర్గతగీతలకును ప్రకృతమునం దున్న స్వరూపమును వ్రాయుటయు, బ్రహ్మసూత్రములను రచించుటయు నను కార్యముల నొక బాదరాయణు లగు వ్యాసులే చేసియుందురని యూహింపవచ్చును. ఇటు లనుటచే బాదరాయణులవారు ప్రకృత మందున్న మహాభారతమును రచించినారని నా యభిప్రాయము కాదు. మహాభారతగ్రంథ మతి విస్తీర్ణ మగుటచే బాదరాయణుల యొక్క సమయము నను దానిలో నున్న కొన్ని భాగములు లుప్తములు గాని విస్ఖలితములు గాని యైయుండవచ్చును. కావున నా కాలమందు లభించిన మహాభారతముయొక్క భాగములను శోధించి యెక్క డెక్కడ గ్రంథము సందేహముగ నుందునట్లు గాని, లేక, యపరిశుద్ధ మని కాని, లేక, యపూర్ణ మని కాని కాన్పించినదో, యక్కడక్కడ నెల్ల దాని శుద్ధముగఁ గాని పూర్ణముగఁ గాని చేసి, యనుక్రమణికలు మొదలైన వన్నియు గూర్చి బాదరాయణాచార్యుల వారీ గ్రంథమును పున రుజ్జీవితముగఁ జేసినారని కాని, లేక, దానిని ప్రకృతస్వరూపముతో వ్రాసినారని కాని మా యభిప్రాయము. మహారాష్ట్ర వాఙ్మయములో సైతము జ్ఞానేశ్వరి యేకనాథునిచే నిటుల శుద్ధము చేయఁబడినదని ప్రసిద్ధికలదు. సంస్కృతమందున్న వ్యాకరణభాష్యము సైత మొకానొకప్పుడు లుప్త మగుటచే చంద్రశేఖరాచార్యుల వారు మరల దానిని సంస్కరించుటకు, లేక, యుద్ధరించుటకు ప్రయత్నించినటులు కథ కలదు. మహాభారతమునందలి యితరప్రకరణములలో గీతలయందున్న శ్లోకములేల యున్న వను ప్రశ్నకు నేఁజెప్పిన సమాధానము నిప్పుడు సోపపత్తికముగ నుండును. మఱియు గీతల యందు బ్రహ్మసూత్రములను స్పష్టముగ నుదాహరించుటయు, బ్రహ్మసూత్రములయందు గీతలను స్మృతిశబ్దముచే నుద్దేశించుటయు నెట్లు

సంభవించినదను ప్రశ్నకును సమాధానము స్పష్టమగును. ప్రస్తుతముం దున్న గీతల కాధారభూత మగు గీత, బాదరాయణుల వారికంటెను పూర్వమం దుండుటచే దానిని బ్రహ్మసూత్రములయందు స్మృతిశబ్దముచే నిర్దేశించిరి. మఱియు మహాభారతమును శుద్ధము చేయుచు క్షేత్రక్షేత్రజ్ఞులు బ్రహ్మసూత్రములయందు సవిస్తరముగ విచారింపఁబడిరని గీతయందే చెప్పఁబడినది.* ప్రకృతమందుండు గీతలలో

* బ్రహ్మసూత్రములు వేదాంతమునకు ముఖ్యగ్రంథ మైనటుల, గీతా గ్రంథము కర్మయోగమునకు ప్రధానగ్రంథ మని పూర్వ ప్రకరణములో నేను చెప్పియున్నాను. గీతలును బ్రహ్మసూత్రములు నొకరిచేతనే (అనఁగా: వ్యాసుని చేతనే) రచియింపఁబడె నని మేము చేసిన యనుమానము సత్య మగు నేని వ్యాసులవారే యీరెండు శాస్త్రములకుఁ గర్త యని యేర్పడును. నే నీ విషయము ననుమానముచే సిద్ధపఱచినటుల పూర్వమునందు చెప్పియున్నాను; కాని కుంభకోణములోఁ గ్రొత్తగ దాక్షిణాత్యపాఠము ననుసరించి కృష్ణాచార్యునిచే ముద్రిత మైయున్న మహాభారతగ్రంథమున శాంతిపర్వములోని 212-వ అధ్యాయమున (వార్ష్ణేయాధ్యాత్మ ప్రకరణమున), ప్రథమ యుగముయొక్క యారంభమున వేర్వేఱు శాస్త్రములును నితిహాసములు నెట్లు నిర్మింపఁబడిన వని చెప్పుచు-

వేదాన్తకర్మయోగం చ వేదవి ద్బ్రహ్మవి ద్విభుః,
ద్వైపాయనో నిజగ్రాహ శిల్పశాస్త్రం భృగుః పునః.

అని ముప్పదినాల్గవ శ్లోకముగ వ్రాయఁబడినది. ఈ శ్లోకమున 'వేదాన్తకర్మ యోగం' అని యేకవచనాంతమగు నొకపదముగనే ప్రయోగింపఁబడె ననునపుడు 'వేదాన్తము మఱియు కర్మయోగము' అని సమాహారద్వంద్వ సమాసముగఁ దెలియవలయును. నే యేలః 'వేదాన్తం కర్మయోగం చ' యని మొదట పాఠ ముండి, వ్రాయునపుడుగాని, అచ్చు వేయునపుడుగాని 'న్తం' అను దానియందున్న యనుస్వారము పోయియుండునని తోఁచుచున్నది. వేదాంతము-కర్మయోగము అను నీ రెండు గ్రంథములును వ్యాసునకు లభించినట్లు భృగువునకు శిల్పశాస్త్రము లభించినది యని యీ శ్లోకమున విడఁదీసి స్పష్టముగఁ జెప్పఁబడినది. కాని యీ శ్లోకము బొంబాయిలో గణపతికృష్ణాజీచే ప్రచురింపఁబడిన భారత పుస్తకమునఁ గాని, కలకత్తా ముద్రితపుస్తకమునఁ గాని కాన్పింపదు. కుంభకోణ పుస్తకములో నున్న ఈ 212-వ యధ్యాయము బొంబాయి కలకత్తా పుస్తకములలో 210-వ

నున్న బ్రహ్మసూత్రములయొక్క ప్రస్తావనతో సమానమగు సూత్ర గ్రంథముయొక్క మఱియొక ప్రస్తావన సైతము ప్రస్తుత మహాభారతములో నున్నది. అనుశాసనపర్వమందున్న యష్టావక్ర దిక్సంవాదమందు "అనృతాః స్త్రియః ఇత్యేవం సూత్రకారో వ్యవస్యతి" (అను. 19. 6) అను వాక్యమే యిందులకు తార్కాణము. అటులే శతపథ బ్రాహ్మణమును (శాంతి. 318. 16-23), పంచరాత్రమును (శాంతి. 339. 107), యాస్కుని నిరుక్తమును (శాంతి. 342. 71), మనువును (అను. 37.16) మఱియొకచోట స్పష్టముగ నుల్లేఖింపఁబడినవి; కాని గీతలవలె మహాభారతముయొక్క సర్వభాగములును కంఠపాఠము చేయుట పరిపాటి గాకపోవుటచే గీతలయందే కాక మహాభారతము నందలి యితర ప్రదేశముల యందును నున్న యితర గ్రంథముల యొక్క యుల్లేఖము కాలనిర్ణయమున కెంతవరకు నమ్మఁదగినదో విచారింప వలయును. కారణ మేమన: ఎవరును కంఠపాఠము చేయని గ్రంథమున నే విషయమైనను నే శ్లోకమైనను ప్రక్షిప్తముగఁ జేర్చుట కేదో యొక సమయము తటస్థింపక పోనేరదు. అయినను ప్రస్తుత గీతలలోనున్న బ్రహ్మసూత్రములయొక్క యుల్లేఖ మపూర్వము గనుకనే నమ్మఁదగినది కాదను విషయమును మాత్రము దెలియఁజేయుటకై యీ రెండవ యుల్లేఖము నుపయోగించిన నుపయోగింపవచ్చును.

---

యధ్యాయముగ నున్నది. కుంభకోణపాఠమునం దున్న యీ శ్లోకము నా మిత్రులగు డా. గణేశకృష్ణ గర్దే గారిచే నాకుఁ జూపఁబడి నందులకు వారి కృతకృత్యతకు నేను పాత్రుఁడను. దానినిబట్టి కర్మయోగశబ్దముచే గీతయే యిక్కడ వివక్షిత మయినందున గీతలకును వేదాంతసూత్రములకును వ్యాసులవారే కర్త అయినట్లు ఈ శ్లోకమునందు వ్రాయఁబడినది. మహాభారతముయొక్క మూఁడు పుస్తకములలో నొక పుస్తకమునందే యీ పాఠము కన్పట్టుచున్నందున నీ విషయమై శంక కలుగవచ్చును; కాని యేది యెట్లున్నను వేదాంతశాస్త్రమునకును కర్మయోగమునకును గ్రంథకర్త ఒకరే యను మా యనుమానము క్రొత్తది గాని నిరాధారము గాని కానేరదని పై శ్లోకము వలన సిద్ధ మగును.

"బ్రహ్మసూత్రపదై శ్చైవ...." అను శ్లోకమునందలి పదముల యొక్క యర్థస్వారస్యమును విమర్శించి భగవద్గీతయందు ప్రస్తుతమందున్న బ్రహ్మసూత్రములే, లేక, వేదాంతసూత్రములే యుల్లేఖింపఁబడినవని పైన నిశ్చయింపఁబడినది; కాని భగవద్గీతయందు బ్రహ్మసూత్రముల నుల్లేఖించుటకును, నదియు పదుమూఁడవయధ్యాయము నందే (అనఁగా: క్షేత్రక్షేత్రజ్ఞవిచారమునందే) చేయుటకు మఱియొక ప్రబలకారణము కలదని మా యూహ. భగవద్గీతయందలి వాసుదేవభక్తియొక్క తత్త్వము మూలభాగవతధర్మముల నుండి కాని లేక పాంచరాత్రధర్మముల నుండి కాని గ్రహింపఁబడినను వాసుదేవునివలన సంకర్షణుఁడును (అనఁగా: జీవుడు), సంకర్షణునివలన ప్రద్యుమ్నుఁడును (మనస్సు), ప్రద్యుమ్నునివలన ననిరుద్ధుఁడును (అహంకారము) బుట్టిరను చతుర్వ్యూహ పాంచరాత్రధర్మముల యందు మొట్టమొదట జీవునియొక్కయు, మనస్సుయొక్కయు నుత్పత్తి విషయమై చెప్పఁబడిన మతము భగవద్గీతకు సమ్మతము కాదని పూర్వప్రకరణమునఁ జెప్పియే యున్నాను. జీవాత్మ యితరమగు నే వస్తువునం దుండియు పుట్టలేదని వేదాంతసూత్రములయం దున్నది (వే. సూ. 2. 3. 17). ఆ జీవుడు సనాతన పరబ్రహ్మముయొక్క నిత్యమగు నంశమే (వే.సూ. 2.3.43) యని బ్రహ్మసూత్రముల సిద్ధాంతము. దానినిబట్టి బ్రహ్మసూత్రములయందలి రెండవ యధ్యాయమందలి రెండవ పాదమందు "వాసుదేవునివలన సంకర్షణుఁడు పుట్టెనను నీ భాగవత ధర్మీయమగు జీవోత్పత్తి యసంభవము" (వే. సూ. 2.2.42) అని దూషించి "జీవునకు మనస్సను నది యొక యింద్రియము గాన జీవునివలన ప్రద్యుమ్నుఁడు (మనస్సు) పుట్టుటకును వీలులేదు (వే.సూ. 2.2.43). కారణమేమన: లోకవ్యవహారమును జూచితిమేని కర్తవలన కారణము, లేక, సాధనము గాని పుట్టనట్టుల స్పష్టముగఁ దెలియును" అని భాగవత ధర్మముల యుత్పత్తిక్రమమునే బాదరాయణులవారును సయుక్తికముగ ఖండించిరి. దీనికి భాగవతధర్మముల మతము వారు, "నేను

వాసుదేవుఁడను(ఈశ్వరుఁడను), సంకర్షణుఁడను(జీవుఁడను), ప్రద్యుమ్నుఁడను (మనః), అనిరుద్ధుఁడను (అహంకారము). ఈ నలువురును సమానులే యని జ్ఞాని యెఱుంగుచున్నాఁ"డనియు, మఱియు "వారి యొకరినుండి మఱియొకరి యుత్పత్తి లాక్షణిక" మనియుఁ జెప్పుదురు; కాని యిటు లొప్పుకొన్నను నొక మనుష్యుఁడగు పరమేశ్వరునకు మారుగ నలువురిని జెప్పవలసివచ్చును. కావున నీ సమాధానమును సరియైనది కాదని బ్రహ్మసూత్రములయందుఁ జెప్పఁబడినది. తుదకుఁ బరమేశ్వరుని పిదప జీవుఁడు పుట్టినాఁడను మతము వేదములకు (అనఁగా: ఉపనిషత్తులకు) విరుద్ధము కావున నొప్పుకొనఁ దగినది కాదని బాదరాయణులవారు స్థిరపఱచిరి (వే.సూ. 2.2.44, 45). భగవద్గీతయందున్న భాగవతధర్మములలో కర్మపరమగు భక్తితత్త్వముపపాదింపఁబడిన దనుమాట సత్యమే. అయినను జీవుఁడు వాసుదేవునకుఁ బుట్టినవాఁడు కాఁడు. నిత్యమగు పరమాత్మయొక్క 'అంశమే' యని గీతలలో సైతము సిద్ధాంతము చేయఁబడినది (గీ. 15. 7). జీవునిసంబంధమైన యీ సిద్ధాంతము మూలభాగవతధర్మములలో లేదు. కావున నా సిద్ధాంతమునకుఁ బ్రమాణ మేదియో చెప్పవలయును. కారణమేమన: అట్లు ప్రమాణమును చెప్పనిచోఁ జతుర్వ్యూహరూపములగు భాగవతధర్మముల యందున్న ప్రవృత్తిపర మగు భక్తితత్త్వమువలెనె జీవునియుత్పత్తి విషయమైనకల్పనయును గీతలకు సమ్మతమని పొరపాటుపడుట కవకాశముండును. కావున క్షేత్రక్షేత్రజ్ఞవిచారమునందు జీవాత్మయొక్క స్వరూపము చెప్పవలసివచ్చినప్పుడే (అనఁగా: గీతల పదుమూఁడవ యధ్యాయముయొక్క యారంభముననే) క్షేత్రజ్ఞునియొక్క (అనఁగా: జీవునియొక్క) స్వరూపవిషయమైన మా మతము భాగవతధర్మానుసారముగ నిరూపింపఁబడలే దనియు, నుపనిషత్తులయందున్న ఋషులయొక్క మతానుసారముగనే నిరూపింపఁబడినదనియు సిద్ధాంత మగును. మఱియు నా యా ఋషులచే, నా యా

యుపనిషత్తులఁబట్టి వేర్వేఱుగ నుపపాదింపఁబడిన విషయముల కన్నింటికిని బ్రహ్మసూత్రములయందు చేయఁబడిన యేకవాక్యతయే (వే.సూ. 2.3.43) మాకు సమ్మత మనియు సిద్ధాంతమగును. ఇట్లు విచారించితిమేని భాగవతధర్మములపై బ్రహ్మసూత్రములచేఁ జేయఁబడిన యాక్షేపము తగులని రీతిని భాగవతధర్మములయందున్న భక్తిమార్గముమాత్రమే గీతలయందు చేర్పఁబడినట్లు కాన్పించుచున్నది. రామానుజాచార్యులు తమ వేదాంతభాష్యమునందు పూర్వోక్తములగు సూత్రములయొక్క యర్థమును మార్పుఁజేసిరి (వే.సూ.రా.భా. 2.2.42.45); కాని యా యర్థము క్లిష్టముగాన మాకు సమ్మతము కానేరదు. రామానుజభాష్యమునందున్న యర్థమునే థిబో యంగీకరించినట్లు కన్పట్టుచున్నది. థిబో వ్రాఁతనుబట్టి యతని కీ వాద స్వరూపము బాగుగ గోచరింపఁలేదని తెలియుచున్నది. మహాభారతమున శాంతిపర్వమునందు కడపట చెప్పఁబడిన నారాణీయములైన లేక, భాగవతములైన ధర్మములలో సైతము వాసుదేవునకు జీవుఁడు (అనఁగా: సంకర్షణుఁడు) పుట్టినాఁడని చెప్పక "అ వాసుదేవుఁడే (స ఏవ) సంకర్షణుఁడు, అనఁగా: జీవుఁడు, లేక, క్షేత్రజ్ఞుఁడు" అని మొదటఁ జెప్పి (శాం. 339 39 మఱియు 71) 334.28-29; సంకర్షణునకు పిదప ప్రద్యుమ్నుఁడు అను నీ క్రమముమాత్రము చెప్పఁబడినది. మఱియు కొన్నిస్థలములయందు భాగవతధర్మములు చతుర్వ్యూహములని కొందఱును, త్రివ్యూహములని కొందఱును, ద్వివ్యూహములని యింక కొందఱును, నేక వ్యూహమని మఱికొందఱును నిటుల స్పష్టముగఁ జెప్పిరి (మ.భా.శాం. 348.57); కాని భాగవతధర్మములయం దీ యనేక పక్షముల నొప్పుకొనక, వానిలో క్షేత్రక్షేత్రజ్ఞుల యొక్క పరస్పరసంబంధమైన యుపనిషత్తులకును, బ్రహ్మసూత్రములకును సంబంధించునది మాత్రమే యగు నొకమతమే ప్రస్తుతగీతలలో స్వీకరింపఁబడినది. మఱియు నీ విషయమును గమనించితిమేని గీతల

యందు బ్రహ్మసూత్రముల నుల్లేఖింపవలసి వచ్చుటకు కారణము బాగుగ స్పష్ట మగును. వేయేల? మూలగీతలయం దీ సంస్కార మొకటే చేయఁబడెనని చెప్పినను చెప్పవచ్చును.

---

## 4. గీతలు–భాగవతధర్మముల యుదయము

ఉపనిషత్తులయం దున్న బ్రహ్మజ్ఞానము, కాపిలసాంఖ్యము నందున్న క్షరాక్షరవిచారము నను నీ రెంటికిని భక్తిని నిష్కామ కర్మను విశేషముగ సంబంధింపఁజేసి కర్మయోగమును శాస్త్రీయ పద్ధతితో పూర్ణముగ సమర్థించుటయే గీతాగ్రంథమున ముఖ్యముగ ప్రతిపాద్యమగు విషయమని గీతారహస్యమం దనేక స్థలములయం దును, నీ ప్రకరణమందు ప్రారంభముననుచెప్పఁబడినది; కాని యిన్ని విషయముల నేకవాక్యముఁ జేయుట గీతానరణిని (అనఁగా: గీతా మార్గమును) పూర్ణముగ నెఱుంగనివారికి, లేక, యిన్ని విషయముల నేకవాక్యత చేయుట యత్యంతాసాధ్యమని యెన్నువారికి గీత యందున్న అనేక విధానములు పరస్పర విరుద్ధములుగ నున్నవని తోఁచును. ఉదాహరణ మేమన: ఈ జగత్తునందున్న దంతయు నిర్గుణ బ్రహ్మమే యని పదుమూఁడవ యధ్యాయమునందును, దీనికి విరుద్ధ ముగ సర్వము సగుణుఁడేయైన వాసుదేవుఁడే యని యేడవ యధ్యాయమునందును చెప్పఁబడినది (గీ. 7. 19). పరస్పర విరుద్ధ ముగ నొకప్పుడు "నాకు శత్రుమిత్రులు సమానులుగనే యున్నా" రనియు(9.29), మఱియొకచోట "జ్ఞానియు భక్తిగల పురుషుఁడును నా కధికప్రియు" లనియు (7.17; 12.19) భగవంతుఁడు చెప్పెనని యాక్షేపకులు చెప్పుచున్నారు; కాని నిజము చూచితిమేని విరోధము లేకుండ నొక విషయమునే యొకప్ప డధ్యాత్మదృష్టిచేతను, మఱి యొకప్పుడు భక్తిదృష్టిచేతను విచారమును చేయునప్పుడు మాపులకుఁ

గాన్పించు విధానములు చేయవలసివచ్చినను వ్యాపకమగు తత్త్వ జ్ఞానముయొక్క దృష్టిచే గీతలలో తుదకు వాని కేకవాక్యత చేయఁ బడినదని గీతారహస్యమున నే ననేక పర్యాయములు స్పష్టముగ నిరూ పించియే యున్నాను. అయినను దీనిపై సైత మనేకులు, అవ్యక్త బ్రహ్మజ్ఞానమును, పరమేశ్వరునియొక్క భక్తియు నను నీ రెంటికిని నిట్లు సంబంధ మిప్పుడు కల్పించుటకు సాధ్యమైనను మూలగీతల యం దీ సంబంధ మున్నదని చెప్పుటకు సాధ్యము కాదనియు, మూలభూతమగు గీత ప్రకృతగీతలవలె విరోధప్రచురము కాదనియు, దానియందు వేదాంతులు కాని, సాంఖ్యశాస్త్రాభిమానులుకాని తమ తమ శాస్త్రములయొక్క విషయములను పిదపఁ జేర్చి రనియు నాక్షే పించుచున్నారు. ఉదాహరణము: ప్రొ. గార్బే యను నతఁడు మూల గీతలలో భక్తితో సాంఖ్యయోగము లనువానికి మాత్రము సంబంధము నిరూపింపఁబడుటచేత, తర్వాత వారు వేదాంతముతోడను, మీ మాంసకులయొక్క కర్మమార్గముతోడను, భక్తికి సంబంధము కల్పించి యుందురని చెప్పుచున్నాఁడు. మఱియు మూలగీతలయం దీ రీతిగ తర్వాత నెన్ని శ్లోకములు ప్రక్షిప్తములైనదియు, తన యభిప్రాయ ప్రకార మా శ్లోకములపట్టికయు, నతనిచే గీతలపైఁ జేయఁబడిన జర్మనుభాషాంతరీకరణములోఁ దుదకుఁ జెప్పఁబడినది. ఈ కల్పన యంతయు తప్పే యని మా యభిప్రాయము. ధర్మములయందలి యా యా యంశములయొక్క యైతిహాసిక పరంపరయును, గీతల యందున్న యీసాంఖ్యయోగశబ్దముల సత్యమైనయర్థమును బాగుగ నెఱుంగక పోవుటచేతను, తత్త్వజ్ఞాన విరహితములగు (అనఁగా: కేవల భక్తిపరములైన) క్రైస్తవ ధర్మములయొక్క యితిహాసములే యీ లేఖకులయొక్క యెదుట నెక్కువగ నుండుటచేతను నిట్టి భ్రమ కలిగెను. క్రైస్తవ ధర్మములు ప్రారంభమున కేవల భక్తిపరములుగ నుండెను. గ్రీకుపండితులో, లేక, యితర తత్త్వజ్ఞానులో యా ధర్మములలో తత్త్వజ్ఞానమును పిదపఁ జేర్చిరి; కాని యీ దేశములో

నట్లు కాదు. హిందూదేశమున భక్తిమార్గముయొక్క యుదయము నకు పూర్వమే మీమాంసకులయొక్క యజ్ఞమార్గమును, నుపని షత్కారులయొక్క తత్త్వజ్ఞానమును, సాంఖ్యులయొక్క యోగ మును పరిపక్వస్థితిలోనికే వచ్చియున్నవి. ఆ హేతువుచే సర్వశాస్త్రము లందును, వానియందు విశేషించి యుపనిషత్తుల యందును నున్న బ్రహ్మజ్ఞానమును వదలి స్వతంత్రవముగఁ బ్రతిపాదింపఁబడిన భక్తి మార్గ మా దేశమున నున్న వారికి సమ్మత మగుటకు మొదటి నుండియు వీలులేదు. మఱియు నీ యసంభవమును బాగుగ గమ నించితిమేని గీతలయందున్న ధర్మప్రతిపాదనయొక్క స్వరూపము తొలుతటినుండియు ననేక విషయములలోఁ బ్రకృతపు గీతలయం దున్న ప్రతిపాదనవలెనే యుండవలయు నని యొప్పికొన వలసి వచ్చును. గీతారహస్యమునందున్న వివేచన మీ విధముననే చేయఁ బడినది. అయిన నీ విషయము గొప్పది యగుటచే గీతాధర్మముల యొక్క మూలరూపమును, పరంపరయు నను వాని విషయమున నైతిహాసికదృష్టిచే మా మతమునం దేమని నిష్పన్నమగునదియు సం క్షేపముగఁ జెప్పుచున్నాను.

వైదికధర్మములయొక్క యత్యంతప్రాచీనమగు స్వరూపము భక్తిప్రధానమైనది గాని, జ్ఞానప్రధానమైనది గాని, లేక, యోగ ప్రధానమైనదిగాని కాదనియు, యజ్ఞమయముగ (అనఁగా; కర్మ ప్రధానమైనదిగ) నుండె ననియు, వేదసంహితయందును బ్రాహ్మణ మునను, ముఖ్యముగ నీ యజ్ఞయాగాది కర్మపరమగు ధర్మమే ప్రతి పాదింపఁ బడిన దనియు గీతారహస్యముయొక్క పదియవ ప్రకరణ మున వ్రాయఁబడినది. ఈ ధర్మమే పిదపఁ జైమినీయమీమాంసా సూత్రములలో శాస్త్రీయపద్ధతితో వివేచింపఁబడినది. ఆ పద్ధతికే పిదప 'మీమాంసకమార్గ' మని పే రిడిరి; కాని మీమాంస యనుపేరు క్రొత్తదైనను యజ్ఞయాగాదిధర్మములు ప్రాచీనము లైనవే. వేయేల?

ఇతిహాస దృష్టితోఁ జూచితిమేని వైదికధర్మముల కిది మొదటి మెట్టుగ నున్నదని చెప్పవచ్చును. ఇందులకు సందేహము లేదు. మీమాంసక మార్గమున కీపేరు రాక మునుపు దీనికి త్రయీధర్మ మని (అనఁగా: మూఁడు వేదములచేతను ప్రతిపాదింపఁబడిన ధర్మమని) పేరుండెను. అదియే గీతలలోఁ జెప్పఁబడినది (9.20 మఱియు 21). కర్మమయ మగు త్రయీధర్మ మిట్లు ప్రవర్తించుచుండ, "కర్మలచే (అనఁగా: బాహ్యమగు యజ్ఞయాగాదుల కేవల పటాటోపముచే) పరమేశ్వరుని జ్ఞాన మెటుల గలుగును? జ్ఞాన మనునదియు మానసస్థితియే. కావున పరమేశ్వరస్వరూపమును విచారించినఁగాని జ్ఞానము గలుగుటకుఁ వీలు లేదు" అనునది మొదలుగాఁగల విషయములును, కల్పనలును వెలువడి క్రమక్రమముగ వానియందే యౌపనిషదిక మైన జ్ఞానము పుట్టినదని ఛాందోగ్యోపనిషత్తుయొక్క ప్రారంభమునం దున్నయవ తరణికలో స్పష్ట మగును. ఈ యౌపనిషదికమగు బ్రహ్మజ్ఞానమునే పిదప వేదాంతమని పేర్కొనిరి; కాని, మీమాంసాశబ్దమువలె వేదాంతశబ్దము సైతము పిదప వాడఁబడుచున్నను, బ్రహ్మజ్ఞానము లేక, జ్ఞానమార్గ మా కారణమున క్రొత్తదిగ నేర్పడలేదు. కర్మ కాండము పిదప జ్ఞానకాండము బయలుదేరినది నిజమే. అయినను రెండును ప్రాచీనములైనవియే యని యెఱుంగనగు. కాపిలసాంఖ్య మనునది జ్ఞానమార్గమునకే మఱియొక స్వతంత్రమగు శాఖయై యున్నది. బ్రహ్మజ్ఞాన మద్వైతమును, సాంఖ్యము ద్వైతము నగుటచే సృష్ట్యుత్పత్తిక్రమ సంబంధములో సాంఖ్యులవిచారము భిన్నముగ నున్నదని గీతారహస్యమునఁ జెప్పఁబడినది; కాని యౌపనిషదికుఁ డగు నద్వైతియొక్క బ్రహ్మజ్ఞానము, సాంఖ్యులయొక్క ద్వైత జ్ఞానము నను నీ రెండును మొదటినుండియు నిట్లు ప్రత్యేకములైనను కేవల జ్ఞానదృష్టితోఁ జూచితిమేని రెండింటియొక్క మార్గములును, అంతకు పూర్వమునం దున్న యజ్ఞయాగాది కర్మమార్గమునకు సమానముగనే విరుద్ధములుగ నున్నట్లు గాన్పించును. కావున

కర్మకును జ్ఞానమునకును సంబంధ మెట్టుల కలుగఁజేయవలయు నని సహజముగఁ దోఁచుటచే నుపనిషత్కాలమునందే యీ విషయములో రెండు పక్షము లుండెను. కర్మజ్ఞానములు రెండును సర్వదా పరస్పరవిరుద్ధము లగుటచే జ్ఞానము గలిగిన పిదప కర్మలను వదలివైచుట ప్రశస్తమే కాక యావశ్యకమును నగునని బృహదారణ్యకాద్యుపనిషత్తులును, సాంఖ్యశాస్త్రమును చెప్ప నారంభించెను. మఱియు దీనికి విరుద్ధముగ "జ్ఞానము కలిగినను కర్మలను వదలకూడదు. వైరాగ్యముచే నిష్కామబుద్ధిని సంపాదించి జగత్తునందు వ్యవహారసిద్ధ్యర్థమై జ్ఞాని యన్ని కర్మలను జేయవలయును" అని యీశావాస్యాదికములగు నితరోపనిషత్తులు ప్రతిపాదింప నారంభించినవి. ఈ యుపనిషత్తులయొక్క భాష్యములో నీ భేదమును నివారించుటకు ప్రయత్నము చేయఁబడినది; కాని శాంకరభాష్యమునం దున్న యీ సాంప్రదాయికార్థము క్లిష్టకల్పన వల్లనే వచ్చినది గాన నీయుపనిషత్తులను స్వతంత్రరీతిగ విచారించునపు డా యర్థమును గ్రహించుటకు వీలులే దనియు, గీతారహస్యమునందలి పదునొకండవ ప్రకరణము తుదఁ జేయఁబడిన వివేచననుబట్టి స్పష్టమగును. యజ్ఞయాగాది కర్మలు, బ్రహ్మజ్ఞానము నను నీ రెండింటికే యిట్లు సంబంధమును గలుగఁజేయ ప్రయత్నింపలేదు. ఇఁక నేమనఁగా: కాపిలసాంఖ్యమునందు మొదట స్వతంత్రముగ వెలువడిన క్షరాక్షర జ్ఞానమునకును, నుపనిషత్తులయందున్న బ్రహ్మజ్ఞానమునకు సైతము సాధ్యమైనంత వఱ కేకవాక్యతఁ జేయుటకు ప్రయత్నించుట యీ కాలముననే యారంభమైన దని మైత్ర్యుపనిషత్తునందలి వివేచననుబట్టి స్పష్టముగఁ గాన్పించును. బృహదారణ్యకము మొదలుగాఁ గలిగిన ప్రాచీనోపనిషత్తులయందు కాపిలసాంఖ్యము నొప్పికొనలేదు; కాని మైత్ర్యుపనిషత్తునందు సాంఖ్యులయొక్క పరిభాషను పూర్ణముగ గ్రహించియొక పరబ్రహ్మముచేతనే సాంఖ్యులయొక్క యిరువదినాలుగు తత్త్వములు నిర్మింపఁబడినవని తుదకుఁ జెప్పఁబడినది. అయినను కాపిల

సాంఖ్యశాస్త్రమును వైరాగ్యపరముగనే(అనఁగా: కర్మకు విరుద్ధముగనే) యున్నది. కావున మొత్తముపైఁ జూచితిమేని, 1. యజ్ఞయాగాది కర్మలను జేయుమార్గము, 2. జ్ఞానముతోడను వైరాగ్యముతోడను కర్మసన్న్యాసముచేయుట (జ్ఞాననిష్ఠ గాని సన్న్యాస మార్గము గాని యనునదియు), 3. జ్ఞానముతోడను, వైరాగ్యముతోడను నెప్పటికిని కర్మలను జేయుట (అనఁగా: జ్ఞానకర్మసముచ్చయమార్గము) అని మూఁడు పక్షములు వైదికధర్మములందు పూర్వకాలముననే వెలువడి యుండునట్లు కాన్పించుచున్నది. వీనిలో జ్ఞానమార్గమునుండియే యోగము, భక్తియు నను నీ యితరశాఖలు రెండును పిదప నిర్మితము లైనవి. పరబ్రహ్మజ్ఞానము కలుగుటకు బ్రహ్మచింతన మవశ్యకర్తవ్యమే కాని యీ చింతనమునే (అనఁగా: మననమును, లేక, ధ్యానమునే) చేయుటకు చిత్తము నేకాగ్రముగఁ జేయ వలసివచ్చినందున పరబ్రహ్మముయొక్క యేదో యొక సగుణమగు ప్రతీకమును మొదట కన్నులయెదుట నుంచవలయునని ఛాందోగ్యాది ప్రాచీనోపనిషత్తుల యందు చెప్పఁబడినది. ఈ విధముగ బ్రహ్మోపాసనఁ జేయుటచేఁ గలిగిన చిత్తైకాగ్రతయే ముఖ్యమైనదని చెప్పఁబడుటచే చిత్తనిరోధ రూపమగు యోగము వేఱుమార్గ మాయెను. మఱియు సగుణ ప్రతీకమునకు మారుగ పరమేశ్వరునియొక్క వ్యక్తమును మానవ రూపము నగు ప్రతీకము, నుపాసనార్థము గ్రహించితిమేని యప్పుడే భక్తి కొంచెము కొంచె మారంభమై తుదకు భక్తిమార్గము బయలు వెడలును. ఆ భక్తిమార్గము, లేక, భక్తియొక్క కల్పన యౌపనిషదిక జ్ఞానము నందుండి కాక వేఱుగను స్వతంత్రముగ నుద్భవించినది కాదు. ఇతరదేశమునందుండి మన భరతఖండమునకు వచ్చినదియు కాదు. బ్రహ్మచింతనార్థమై తొలుత యజ్ఞమందలి యంగముల యొక్కయు నాకాశాదికము మొదలగు సగుణములు వ్యక్తములు నగు బ్రహ్మప్రతీకములయొక్కయు నుపాసన ప్రారంభమై, తుద కాబ్రహ్మ ప్రాప్త్యర్థమే రామ కృష్ణ వాసుదేవ నృసింహాదులయొక్కయు భక్తి

(అనఁగా: ఒక విధమగు నుపాసన) యారంభమైన దని క్రమయుక్త మగు నొక మార్గము సర్వోపనిషత్తులను విచారించితిమేని మొత్తముపై వెలువడును. వీనిలో యోగమార్గమునందలి యోగతత్త్వము మొదలగు గ్రంథములును, భక్తిమార్గమునందలి నృసింహతాపని, రామతాపని మొదలగు నుపనిషత్తులకంటె నర్వాచీనములని వానియందలి భాషను బట్టియే స్పష్టమగుచున్నది. కావున ఛాందోగ్యము మొదలగు ప్రాచీనోపనిషత్తులలో నున్న కర్మ, జ్ఞానము, లేక, సన్న్యాసము, జ్ఞానకర్మసముచ్చయము నను నీ మూఁడు పక్షములును బుట్టిన పిదప యోగమార్గ-భక్తిమార్గములకు ప్రాధాన్యము వచ్చినదని యైతిహాసిక దృష్టితోఁ జెప్పవలసివచ్చును; కాని యీ యోగము భక్తియు నను సాధనము లిట్లు తర్వాత ప్రధానములుగ గ్రహింపఁబడినను నంతకు పూర్వము నందున్న బ్రహ్మజ్ఞానముయొక్క శ్రేష్ఠత్వమునకు దాని మూలమున న్యూనత కలుగలేదు. అట్లు కలుగుటకును వీలులేదు. కావున యోగప్రధానములును, భక్తిప్రధానములు నగు నుపనిషత్తులలో నున్న బ్రహ్మజ్ఞానమే భక్తికిని, యోగమునకును చరమసాధ్యమగును. మఱియు రుద్ర, విష్ణు, అచ్యుత, నారాయణ, వాసుదేవాదులయందలి భక్తియు పరమాత్మయందలి, లేక, పరబ్రహ్మమందలి భక్తియే యగునని చెప్పఁబడినది. (మైత్ర్యు. 7.7; రామపూ. 16; అమృతబిందు. 22. మొదలగునవి చూడు), వైదికధర్మములయందప్పుడప్పు డాత్మజ్ఞానులచేఁ బ్రవర్తింపఁ జేయఁబడిన ధర్మాంగములన్నియు నంతకు పూర్వమునందున్న ధర్మాంగముల నుండియే పుట్టినవి. మఱియు నూతనములగు ధర్మాంగములను బూర్వమందున్న ధర్మాంగములతోఁ గలుపుట యనునది వైదికధర్మము లారంభమైనది మొదలుకొని జరుగుచుండు పద్ధతియే. వేర్వేఱగు ధర్మాంగముల కేకవాక్యతఁ జేయ నుద్దేశించియే, స్మృతికారు లాశ్రమవ్యవస్థా ధర్మములను పిదపఁ బ్రతిపాదించిరనియు, వేర్వేఱగు ధర్మాంగముల

కేకవాక్యతఁ జేయుట యను ప్రాచీన పద్ధతిని గమనించినచో, గీతా ధర్మ మొక్కటియే యీ పూర్వాపర పద్ధతిని వదలి ప్రవర్తించినదని చెప్పుట నయుక్తికము కాదనియు నిందలి సారాంశము.

బ్రాహ్మణ గ్రంథములయం దున్న యజ్ఞయాగాది కర్మయు, నుపనిషత్తులయందున్న బ్రహ్మజ్ఞానమును, కాపిలసాంఖ్యమును, చిత్త నిరోధరూపక మగు యోగమును, భక్తియు నను నీ వైదికధర్మముల యొక్క ముఖ్యములగు నంగములకును, వానియొక్క యుత్పత్తి క్రమమునకును సామాన్యమగు నితిహాస మింతదనుకఁ జెప్పఁబడినది. ఇప్పుడు గీతలయం దీ సమస్తమగు ధర్మాంగములను బ్రతిపాదించు టకుఁ గారణ మేమి? అనఁగా: ఈ విషయము లన్నియు వేర్వేఱగు నుపనిషత్తులలోనుండి గీతలలోనికిఁ గైకొనఁబడినవా? లేక, నడుమ నేదైన మఱియొక్క మెట్టున్నదా? యను విషయమును విచారిం తము. కేవల బ్రహ్మజ్ఞానమును వివేచించు కఠాద్యుపనిషత్తులయం దున్న కొన్ని శ్లోకము లున్నవి యున్నట్టులే గీతలలోనికి గ్రహింపఁ బడినవి. జ్ఞానకర్మసముచ్చయపక్షమును బ్రతిపాదించుచు జనకాదుల యొక్క యౌపనిషదిక దృష్టాంతము తీయఁబడినవి. దీనినిబట్టి గీతాగ్రంథము, ముఖ్యముగ నుపనిషత్తుల ననుసరించియే రచింపఁ బడినదని తెలియుచున్నది; కాని గీతలయందు గీతాధర్మముల పరం పరను జూచితి మేని యదియు నుపనిషత్తులలో నెచ్చోటను గాన రాదు. గీతలయందు ద్రవ్యమయమగు యజ్ఞముకంటె జ్ఞానమయ మగు యజ్ఞము శ్రేష్ఠ మని నిశ్చయింపఁ బడినటులే (గీ. 4. 33) ఛాందోగ్యోపనిషత్తునందును నొకచో (ఛాం. 3.16, 17) మనుష్యుని యొక్క జీవిత మొక విధమగు యజ్ఞముగ నున్నదని చెప్పి యిట్టి యజ్ఞముయొక్క మహత్త్వమును వర్ణించుచు "ఈయజ్ఞవిద్య 'ఘోర అంగిరస్సు' అనుపేరు గల ఋషీశ్వరుఁడు దేవకీపుత్త్రుఁడగు కృష్ణునకుఁ జెప్పెను" అని చెప్పఁబడినది. ఈ దేవకీపుత్త్రుఁడగు కృష్ణుఁడును, గీతల

యందున్న కృష్ణుఁడును నొకఁడే యనుట కాధార మేమియు లేదు. అయిన నిరువురు నొకరే యని క్షణమాత్ర మంగీకరించినను జ్ఞాన యజ్ఞము ప్రధానమని చెప్పునట్టి గీతయందు 'ఘోర అంగిరస్సు' ఎక్కడ నుదాహరింపఁబడలేదని తెలిసికొనవలయును. ఇంతియ కాక జనకుని మార్గము జ్ఞానకర్మ సముచ్చయాత్మకమైనను నా కాలమం దీ మార్గమున భక్తి చేరియుండలేదని బృహదారణ్యకోపనిషత్తు వలన స్పష్ట మగుచున్నది. కావున భక్తియుక్తమగు జ్ఞానకర్మ సముచ్చయ మతముయొక్క సాంప్రదాయికపరంపరయందు జనకుని లెక్కించు టకు వీలు లేదు. అట్లు గీతయందును చెప్పఁబడలేదు. గీతాధర్మము లను యుగారంభమున, భగవంతుఁడు మొదట వివస్వంతునకు, వివస్వంతుఁడు మనువునకును, మను విక్ష్వాకునకును నుపదేశించిరి; కాని కొంతకాలమున కది నష్ట మగుటచే, నర్జునునకు మరల చెప్ప వలసివచ్చెనని గీతలలో చతుర్థాధ్యాయముయొక్క యారంభము నందు (గీ. 4. 1-3) చెప్పఁబడినది. గీతాధర్మముయొక్క పరంపర నెఱుంగుట కీ శ్లోకమత్యంత మహత్త్వము గలదైనను, టీకాకారులు దానియొక్క శబ్దార్థమును చెప్పు విషయములో విశేషముగ వ్యాఖ్యా నము చేసినట్లు కన్పట్టదు. అటుల చేయుటయు వారి కిష్టము లేనట్లు తోఁచుచున్నది. కారణ మేమన: గీతాధర్మము మొట్టమొదట నొక విశేషమార్గమును దెల్పునదియని చెప్పుటచే మఱియొక ధార్మిక మతమునకు కొంచె మైనను న్యూనత రాక మానదు; కాని గీతల యందున్న యీ పరంపర మహాభారతాంతర్గతమగు నారాయణీయో పాఖ్యానమునందు వ్రాయఁబడిన భాగవతధర్మములయొక్క పరం పరయందు చివరనున్న త్రేతాయుగమునందలి పరంపరతో పూర్ణముగ కలసియున్నదని గీతారహస్యముయొక్క :యారంభమునను, గీత. 4. 1 మఱియు 2 శ్లోకముల పై నున్నటిప్పణియందును సప్రమాణముగ స్పష్టముచేసి నిరూపింపఁబడినది. భాగవతధర్మములయొక్కయు గీతా

ధర్మములయొక్కయు పరంపరకుఁగల యైక్యమును జూచితిమేని గీతా గ్రంథము భాగవతధర్మసంబంధమైనదిగనున్నదని చెప్పవలసివచ్చును. ఈ విషయమై సంశయ మున్నచో "గీతయందు భాగవతధర్మములే చెప్పఁబడినవి" (మ.భా.శాం. 346.10) అని మహాభారతమునందున్న వైశంపాయనునియొక్క వాక్యములను బట్టి యది పూర్ణముగ నశించును. గీత యన్నునది యౌపనిషదిక జ్ఞానమునకు (అనఁగా: ఉపనిషత్తులలో ప్రతిపాదింపఁబడిన వేదాంతమునకు) స్వతంత్ర గ్రంథము కానేరదు. దానియందు భాగవతధర్మములు ప్రతిపాదింపఁబడినవి' అని యిట్లు సిద్ధమైన పిదప భాగవతధర్మములను వదలి చేయఁబడిన గీతల యొక్క యే చర్చయైనను పూర్తి కానిదియు, భ్రామకము, లేక, పొరపుచ్చునదియుఁ గావచ్చునని చెప్పసక్కఱలేదు. కావున భాగవత ధర్మము లెప్పుడు పుట్టిన వనియు, వానికి మూలస్వరూప మెట్లుండు ననియు నిట్టి ప్రశ్నల విషయమై ప్రస్తుతము కలుగఁబోవు జ్ఞానము నిచ్చో సంక్షేపముగ వివరించెదము. ఈ భాగవతధర్మములకే నారాయణీయములనియు, సాత్వతములనియు, లెక, పాంచరాత్రధర్మములనియు మఱియొక పేరు గలదని గీతారహస్య మందు పూర్వమందే చెప్పఁబడినది.

ఉపనిషత్కాలానంతరమునను బుద్ధునికి పూర్వమందును నున్న వైదికధర్మ గ్రంథములలో ననేకములు నశించెను. కావున గీత కాక యితరము లగునవి మహాభారతము నందలి శాంతిపర్వముయొక్క చివరనున్న పదునెనిమిది యధ్యాయములలో నిరూపింపఁబడిన నారాయణీయోపాఖ్యానమును, శాండిల్యసూత్రములును శ్రీమద్భాగవతమును, నారదపాంచరాత్రములును, రామానుజాచార్యుల గ్రంథములను మాత్రమే యిప్పుడు దొరకునట్టి భాగవతధర్మీయములగు ముఖ్యగ్రంథములు. వీనిలో రామానుజాచార్యులయొక్క గ్రంథములు క్రమముగ సాంప్రదాయిక దృష్టితో (అనఁగా: భాగవతధర్మములకు

విశిష్టాద్వైత వేదాంతముతో) సంబంధమును కలుపు నిమిత్తమై శాలి వాహనశకమునందలి పండ్రెండవ శతాబ్దము ప్రాంతమున వ్రాయఁ బడినవి. కావున నీ గ్రంథముల నవలంబించి భాగవతధర్మముల యొక్కమూలస్వరూపమును నిశ్చయించుటకు వీలులేదు. ఇట్లే మధ్వా చార్యులు మొదలుగాఁ గల యితర వైష్ణవ సంప్రదాయ ప్రవర్తకుల గ్రంథములును పనికిరావు. శ్రీమద్భాగవత మీ గ్రంథములకంటె ప్రాచీనమైనదే; కాని మహాభారతమునందు (అనఁగా: గీతలలో సైతము) నిరూపింపఁబడిన సన్న్యాసపరములగు భాగవతధర్మముల యందు భక్తిని పూర్తిగ నిరూపింప లేదనియు, భక్తిలేని సన్న్యాసము శోభింప దనియు, విచారించి వ్యాసులు తాను జేసిన పని నేవగించు కొనె ననియు, వారి మనస్సునందలి యీ సందేహమును తీర్చు నిమిత్తమై నారదులు వచ్చి యుపాయమును జెప్పఁగా భక్తియొక్క మార్గమును ప్రతిపాదించు భాగవతమును వ్యాసులు రచియించి రనియు నొక కథ భాగవతముయొక్క ప్రారంభముననే కలదు (భాగ. స్కం. 1 అ. 4 మఱియు 5 చూడు). ఈ కథ నైతిహాసిక దృష్టితో విచారించితిమేని భారతమునందున్న భాగవతధర్మములలోఁ జెప్పఁబడిన నైష్కర్మ్యముయొక్క ప్రాధాన్యము కాలక్రమమున తఱిగి దానికి మారుగ భక్తికి ప్రాధాన్యము వచ్చినప్పు డీ భక్తిప్రధా నములగు భాగవతధర్మములను ప్రతిపాదించుటకై భాగవత మను గ్రంథము తర్వాత రచింపఁబడినదని కన్పట్టును. నారద పాంచరాత్ర గ్రంథమును శుద్ధభక్తిపరమైనదియే యగుటవలన దానియందు ద్వాదశస్కంధములు గల భాగవతమును, బ్రహ్మవైవర్తపురాణమును, విష్ణుపురాణమును, గీతలును, మహాభారతమును పేళ్లు గ్రుచ్చి స్పష్టముగ నిర్దేశింపఁబడినవి (నా. పం. 2. 7. 28-32; ౩. 14. 73; మఱియు 4. 3. 158). అప్పుడున్న భాగవత ధర్మములయొక్క మూలస్వరూపమును నిశ్చయించుటకై యీ గ్రంథము భాగవతపురా ణముకంటె తక్కువ మహిమగలదని యిందువలన స్పష్ట మగు

చున్నది. నారదసూత్రములు, శాండిల్యసూత్రములునను గ్రంథములు నారద పాంచరాత్రములకంటె నొకవేళ ప్రాచీనములైనను నారదసూత్రములయందు వ్యాసులును, శుకులును పేర్కొనఁబడి యుండుటచే (నా.సూ. 83) వారు భారత భాగవతముల యనంతర కాలమునం దుండు వారనియు, శాండిల్యసూత్రములయందు భగవద్గీతలయందున్న శ్లోకములే యుండుటచే (శా. సూ. 9.15 మఱియు 83) నీ సూత్రములు నారదసూత్రములకంటె ప్రాచీనము (నా.సూ. 83) లయినను, గీతా - మహాభారతములకు పిదపనే వెలువడిన వనుటకేమియు సంశయము లేదు. కావున భాగవతధర్మములయొక్క మూలమును ప్రాచీనమునగు స్వరూప మేదియో నిర్ణయించుట చివరకు మహాభారతాంతర్గతమగు నారాయణీయోపాఖ్యానము ననుసరించియే చేయవలసివచ్చును. భాగవతపురాణము (1.3.24), నారద పాంచరాత్రము (4.3.156-159; 1.8.81) నను నీ రెండు గ్రంథములయందును బుద్ధుఁడు విష్ణుమూర్తియొక్క యవతార మని చెప్పఁబడినది; కాని నారాయణీయాఖ్యానమున వర్ణింపఁబడిన దశావతారములలో బుద్ధుని పేరే లేదు. అందు మొదటి యవతారము హంసావతార మనియు, పిదప కృష్ణావతారము, తర్వాత కల్క్యవతారమనియుఁ జెప్పఁబడినది (మ.భా.శాం. 339.100). దీనింబట్టియు నారాయణీయోపాఖ్యానము భాగవత పురాణముకంటెను నారద పాంచరాత్రములకంటెను ప్రాచీనమని సిద్ధమగుచున్నది. బ్రహ్మము యొక్క యవతారమే యగు నరనారాయణు లను పేరులు గలిగిన యిరువురు ఋషులచే నారాయణీయములు (అనఁగా: భాగవతధర్మములు) ప్రారంభమునఁ బ్రవర్తింపఁజేయఁబడిన వనియు, నవి చెప్పిన పిదప నారదమహర్షి శ్వేతద్వీపమునకు వెళ్లినపుడు, భగవంతుఁడు నారదునకు స్వయముగ నా ధర్మముల మొదట నుపదేశించెననియు, నారాయణీయోపాఖ్యానమున నున్నది. భగవంతుఁ డున్న శ్వేతద్వీపము క్షీరసముద్రమున నున్నది. క్షీరసముద్రము మేరుపర్వత

మునకు నుత్తరముగ నున్నది యనునది మొదలుగాఁ గల నారాయణీయాఖ్యానమునందలి వర్ణనము ప్రాచీనమగు పౌరాణికబ్రహ్మాండ వర్ణనము ననుసరించియే యున్నది గాన దాని విషయమై యేమియు విశేష మున్నట్లెవరును చెప్పరు; కాని వేబరను పాశ్చాత్యసంస్కృత పండితుఁ డీ కథనే మార్చి భాగవతధర్మమునందున్న భక్తితత్త్వము శ్వేతద్వీపము*నుండి (అనఁగా: హిందూదేశముకంటె వేఱగు దేశాంతరము నుండి) హిందూదేశమునకు వచ్చిన దనియు, నీ భక్తితత్త్వమున కా కాలమున నున్న క్రైస్తవధర్మమే మూలమనియు (అనఁగా: మఱియొక దేశమున నా ధర్మము ప్రచారములో లేనందున క్రైస్తవ దేశమునం దుండియే గ్రహించి, భక్తియొక్క కల్పన భాగవతీయ ధర్మములలో నిరూపింపఁబడిన దనియు) నొకగొప్పసంగతిఁ జెప్పెను. కాని పాణినికి వాసుదేవభక్తియొక్క తత్త్వము తెలిసియే యున్నది. బౌద్ధజైన ధర్మములయందును భాగవతధర్మము, లేక, భక్తి పేర్కొనఁబడినది. పాణినియు, బుద్ధుఁడును క్రీస్తుకంటె సైతము పూర్వకాలికులను విషయము నిర్వివాదమే కావున వేబరు చెప్పిన పూర్వోక్తవిషయము పాశ్చాత్యపండితులచే సైత మిప్పుడు నిర్మూలమని నిశ్చయింపఁబడినది. భక్తి యను ధర్మాంగము మన దేశమందున్న జ్ఞానపరములగు నుపనిషత్తుల తర్వాత ప్రచారమునకు వచ్చినదని పైనఁ జెప్పఁబడినది. కావున జ్ఞానపరములైన యుపనిషత్తుల యనంతరమునను, బుద్ధునకు పూర్వమునను వాసుదేవభక్తిపరమగు భాగవతధర్మము వెలువడిన దను విషయము మాత్రము నిర్వివాదమే. బుద్ధునకంటె నెన్నిశతాబ్దములకు పూర్వము * భాగవతధర్మములు బయలువెడలె

* 'భక్తిమాన్' (పాళీ-భత్తిమా) అను శబ్దము థేరగాథయందు (శ్లో. 370) ప్రయోగింపఁ బడినది. ఒక జాతకమునందును భత్తిశబ్దము ప్రయోగింపఁబడినది. ఇంతియకాక ప్రసిద్ధుఁడును ఫ్రెంచిపాళీపండితుఁడు నగు సేనార్టు (Senart) చే 'బౌద్ధధర్మములయొక్క మూలము' అను విషయమున 1909-వ సంవత్సరము చేయఁబడిన వ్యాఖ్యానమున బౌద్ధధర్మములకు మున్ను భాగవతధర్మములు బయలు

నను విషయము మాత్రము మిగిలియున్నది. దానికి నిశ్చయాత్మక మగు సమాధానమును జెప్పలేకపోయినను కొంచె మెచ్చుతగ్గుగ నా కాలమును జెప్పవచ్చునని ముందున్న వివేచనవలన కాన్పించును.

శ్రీకృష్ణుఁ డర్జునున కుపదేశించిన భాగవతధర్మము లంతకు మునుపే లోపించినవని (గీ. 4.2) గీతలయందు చెప్పఁబడియున్నది. ఈ ధర్మముయొక్క తత్త్వజ్ఞానమందు పరమేశ్వరునకు వాసుదేవుఁ డనియు, జీవునకు సంకర్షణుఁ డనియు, మనస్సునకు ప్రద్యుమ్నుఁ డనియు, నహంకారమున కనిరుద్ధుఁ డనియు పేరు లిడఁబడినవి. వీరిలో వాసుదేవుఁడే శ్రీకృష్ణుఁ డను నామము గలవాఁడు. సంకర్షణుఁ డతనికి పెద్దన్నగారు (అనఁగా: బలరాముఁడు). ప్రద్యుమ్నుఁ డును ననిరుద్ధుఁడు నను నవి శ్రీకృష్ణునియొక్క పుత్త్రునకును పౌత్త్రున కును నామములు. శ్రీకృష్ణమూర్తి యాదవకులమునఁ బుట్టి భాగ

---

వెడలిన వని స్పష్టముగఁ జెప్పఁబడినది. "No one will claim to derive from Buddhism, Vishnuism or the Yoga. Assuredly Buddhism is the borrower.". ....... "To sum up, if there had not previously existed a religion made up of the doctrines of Yoga of Vishnuite legends, of devotion to Vishnu-Krishna, worshipped under the title of Bhagavata, Buddhism would not have come to birth at all." సేనార్టు అనువానియొక్క యీ నిబంధము The Indian Interpreter అను పేరు గలిగినదియు, పునహాలో, ప్రసిద్ధిఁ జెందినదియు నగు మిషనరి త్రైమాసిక పత్రికయొక్క అక్టోబరునెల 1909, మఱియు జనవరి 1910 నంబరుల యందు భాషాంతరరూపముగ ప్రసిద్ధిఁజెందినది. పైజెప్పినవాక్యములు జనవరి నంబరులో పుట. 117 మఱియు 178 లోఁ గాన్పించును. డా. బుల్హర్ సైతమిట్లు చెప్పు చున్నాడు. "The ancient Bhagavata, Sattvata or Pancharatra sect devoted to the worship of Narayana and his deified teacher Krishna - Devakiputra dates from a period long anterior to the rise of Jainas in the 8th Century B.C." -Indain Antiquary. Vol XXIII. (1894) P. 248. ఈ విషయమై విశేషమగు వివేచన మీ పరిశిష్టప్రకరణ మాఱవ భాగమందు చేయఁబడినది. చూడుము.

వతధర్మముల నుపదేశించినందున భాగవతధర్మములకు సాత్వతము లని రెండవపేరు కలిగెను. దీనింబట్టి శ్రీకృష్ణుఁడు జన్మించిన కులమునను, వారి జ్ఞాతులయందును నీ ధర్మము ప్రవృత్తమయ్యె ననియు, శ్రీకృష్ణుఁడు తన ప్రియమిత్రునకు (అనఁగా: నర్జునునకు) నా ధర్మ ముపదేశము చేసె ననియు స్పష్ట మగుచున్నది. పౌరాణిక కథయు నటులే యున్నది. ఇంతియకాక, శ్రీకృష్ణుఁడును, నాతని సాత్వత మార్గము వా రెల్లరును నేక కాలముననే స్వర్గస్థులైరని కథ యున్నందున, కృష్ణావతారానంతరమున వారి జ్ఞాతులలో నీ సంప్రదాయ మాచరణములో నున్నదని చెప్పుటకు సాధ్యము కాదు. శ్రీకృష్ణుఁడిట్లు ప్రవర్తింపఁజేసిన ధర్మమును నొకవేళ నారాయణీయ మను పేరుతోఁ గాని, పాంచరాత్ర మను పేరుతో గాని కొద్దియో, గొప్పయో ప్రచారములో నుండియుండును. మఱియు నటు వెనుకటి సాత్వత జాతి యందు ప్రచారము గలిగిన పిదప వానికి సాత్వతములని పేరు వచ్చి యుండుననియు, ననంతరమందు శ్రీకృష్ణుఁడు నర్జునుఁడు ననువారు నరనారాయణుల యవతారములే యను నూహతో నీ ధర్మములకు భాగవతధర్మము లని వాడుక గలిగియుండు ననియు, నిటు లీ ధర్మములకు వేర్వేఱు పేరులుండుట కొక విధమగు నైతిహాసికోపపత్తి చెప్పవచ్చును. కావున, ముప్పురో, నలుఁవురో శ్రీకృష్ణులుపుట్టి యొక్కొక్కరు తమకు శక్యమగునంతవఱకు క్రమక్రమముగ నీ ధర్మములను సంస్కరింపఁ జేసిరని చెప్పవలసిన యవసరము లేదు. అట్లు చెప్పుటకుఁ బ్రమాణమేమియుఁ గానరాదు. మూలధర్మములయందుఁ గ్రొత్త క్రొత్త మార్పులు వెలువడినవి; కాని బుద్ధుఁడును, క్రీస్తువును, మహమ్మదును నొక్కొక్కరే మతస్థాపకులైనను వారి వారి ధర్మములయందు సైతము కాలక్రమమున ననేకము లగునవియు, మంచివో చెడువో యైనవియు మార్పులుకలిగినట్లు స్పష్టముగఁ గాన్పించుచున్నది. దీనిని బట్టి అనేక బుద్ధులు, అనేక క్రీస్తువులు, అనేక మహమ్మదీయు లున్నారని యెవ్వరు నొప్పుకొనరు. అటులే మూలభాగవతధర్మములకును

వేర్వేఱగు స్వరూపములు ప్రాప్తము లగుటచేతను, శ్రీకృష్ణుని విషయమై కాలక్రమమున వేర్వేఱగు కల్పనలు రూఢము లగుటచేతను, అనేకులగు శ్రీకృష్ణు లుండుటకుఁ గారణము లేదని మా యభిప్రాయము. ఏ ధర్మమైనను కాలక్రమమున నిట్టి మార్పులను జెందుట సహజము. కావున ననేకులగు శ్రీకృష్ణులు గాని, బుద్ధులుగాని, క్రీస్తులు గాని కలరని చెప్పనక్కఱ లేదు.* శ్రీకృష్ణుఁడు, యాదవులు, పాండవులు లేక, భారతయుద్ధము నను నీ విషయము లైతిహాసకములును, వాస్తవికములు గావనియు, కల్పితము లనియు ననేకులగు తార్కికులు—అందునను కొందఱు పాశ్చాత్య తార్కికులును తలఁచుచున్నారు. మఱియు ననేకులు మహాభారత మొక గొప్ప యధ్యాత్మ విషయరూపకమువలె నున్న దని యందురు; కాని మన దేశమునం దున్న ప్రమాణములగు ప్రాచీనగ్రంథముల నన్నిటినిఁ జూతురేని యీ శంక నిరాధార మని, నిష్పక్షపాతిఁ యగు ప్రతి మనుజుఁడును నొప్పు

---

* శ్రీకృష్ణచరిత్రయందు పరాక్రమము, భక్తి, వేదాంతము నను నవియేకాక గోపికలతోఁ గూడి చేయఁబడిన రాసక్రీడయు వర్ణింపఁబడినది. ఈ విషయములు పరస్పర విరుద్ధములు గాన, మహాభారతమునందలి శ్రీకృష్ణుఁడు వేఱనియు, గీతలలోనున్న శ్రీకృష్ణుఁడు వేఱనియు, గోకులమందలి శ్రీకృష్ణుఁడు వేఱనియు నిప్పటి పండితు లనేకులు ప్రతిపాదించుచున్నారు. ఇట్టి యభిప్రాయమే డా. భండార్కరుచే "వైష్ణవశైవాదిపంథ" అను నాంగ్లేయ గ్రంథమందు స్వీకరింపఁబడినది; కాని యిది యుక్తముగ లేదని నా యభిప్రాయము. గోపికలకథలయందుఁ జేయఁబడిన శృంగారరసవర్ణనము తర్వాతఁ జేయఁబడినది. అంతమాత్రముచే శ్రీకృష్ణుఁడని పేరుగల మనుష్య లనేకులు పుట్టిరని యంగీకరించుట యనావశ్యకము. అట్టి కల్పనకు నాధార మేమియు లేదు. ఇంతియకాక గోపికలకథ భాగవతకాలమునందే మొదట ప్రచారములోనికి రాలేదు. శకకాలారంభమునందు, అశ్వఘోషునిచే రచింపఁబడిన బుద్ధచరిత్రమందు (4.14) భాసుని బాలచరితమను నాటకమందు పైతము (3.2) గోపికలు వర్ణింపఁబడిరి. అప్పటి విషయము డా. చింతామణిరావు పక్షము, డా. భండార్కరుగారి పక్షముకంటె మిక్కిలి సయుక్తికముగఁ దోఁచుచున్నది.

కొనవలసివచ్చును. ఈ కథలకు నితిహాసమే మూలాధార మనునది మాత్రము నిర్వివాదమై యున్నది. నలువు రైదుగురు శ్రీకృష్ణులు లేరనియు, నైతిహాసిక పురుషుఁ డొకఁడే యనియు మా మత మని యిందలి సారాంశము. ఇప్పుడే శ్రీకృష్ణునియొక్క కాలము విచారింతము. శ్రీకృష్ణ, యాదవ, పాండవులయొక్కయు, భారత యుద్ధముయొక్కయు, కాలమొక్కటియే (అనఁగా: కలియుగారంభము), గాన పురాణములయందున్న గణితము ననుసరించితిమేని, అప్పటినుండి యిప్పటికి నైదువేలవత్సరములకంటె నెక్కువయే యైనదనియు, నిదియే శ్రీకృష్ణునియొక్క సత్యమైన కాలమనియు రా.బ. చింతామణిరావు వైద్య అనువారిచేఁ బ్రతిపాదింపఁబడినది.* కాని పురాణములో వర్ణింపఁబడిన పాండవులకాలము మొదలు శకకాలము వఱకుఁ బుట్టిన రాజులయొక్క తరములను విచారించితిమేని యది వేఱుగ నుండును. కావున పరీక్షిన్మహారాజు జన్మము మొదలు నందునియొక్క యభిషేకపర్యంతము 1115 (లేక 1015) సంవత్సరములగుచున్నవని (భాగ. 12.2.26; మఱియు విష్ణు. 4.24.32) భాగవతమునందును, విష్ణుపురాణమునందు నున్న వచనములయొక్క యాధారమునుబట్టి క్రైస్తవశకమునకు పూర్వము 1400 సంవత్సరములు జరిగినట్లు విద్వాంసులచే నిప్పుడు నిశ్చయింపఁబడినది. మఱియు నీ కాలమును స్వీకరించితిమేని శ్రీకృష్ణుఁడు భాగవతధర్మములను ఎంత తక్కువగ గణించినను 1400 సంవత్సరము క్రీస్తు జననమునకు పూర్వమే (అనఁగా: బుద్ధునికంటె సుమారు 800 సంవత్సరములు) ప్రవర్తింపఁజేసెనని తేలెను. శ్రీకృష్ణుఁడు, పాండవులు అను వా రైతి

---

* రావుబహదూర్ చింతామణి రా వనువారు, వారి మతమున వారిచే ముద్రింపఁబడిన మహాభారతము పైని టీకాత్మకమగు నాంగ్లగ్రంథమున వ్రాసియున్నారు. మఱియు నీ విషయము నక్కడనున్న దక్కన్ శిక్షాశాలయొక్క సాంవత్సరికోత్సవ సందర్భమున 1914 సంవత్సరమున వా రొనర్చిన యుపన్యాసమున వివరించియున్నారు.

పోసిన పురుషులైనను శ్రీకృష్ణుఁడను క్షత్రియవీరుని క్రమముగ మొదట నొక మహాపురుషుఁడనియు, ననంతరము విష్ణువనియుఁ, దుదకుఁ బూర్ణపరబ్రహ్మ మనియు బ్రాహ్మణు లంగీకరించు నప్పటికి బహుకాలము గతించియుండును. కావున భాగవతధర్మము లుత్ప న్నములైన కాలమును, భారతయుద్ధముయొక్క కాలము నొకటే యని చెప్పుటకు వీలులేదని యనేకు లనుచున్నారు. కావున నీ యూహలచే నేమియుఁ బ్రయోజనము గన్పట్టదు. ఎవరిని దేవుఁడని యెన్నవలయును, ఎవరిని యటు లనరాదను విషయమున నాధు నికుల యూహకును, మూఁడు నాలుగువేల సంవత్సరములకంటె పూర్వమునందున్న వారి యూహకును (గీ. 10. 41) చాల భేద మున్నది. మఱియు, జ్ఞాని తానే బ్రహ్మమయుఁ డగుచున్నాఁడని శ్రీకృ ష్ణునికంటె పూర్వమందున్న యుపనిషత్తులలో సిద్ధాంతీకరింపఁబడినది (బృ. 44. 6). మైత్ర్యుపనిషత్తునందు, రుద్ర, విష్ణు, అచ్యుత, నారా యణాదు లెల్లరును బ్రహ్మస్వరూపులే (మైత్ర్యు. 7. 7) యని స్పష్ట ముగఁ జెప్పఁబడినది. శ్రీకృష్ణుఁడు పరబ్రహ్మత్వమును బొందుటకై విలంబ మగుటకుఁ గారణ మేమి? ఇతిహాసమును జూచితి మేని బుద్ధుఁడు 'తాను బ్రహ్మభూతుఁ'డైనట్లు చెప్పుకొనువాఁడఁట (సేల సుత్త. 14; థేరగాథ. 831). బుద్ధుఁడు జీవించియుండఁగనే దేవుఁ డను గౌరవమును బొందుచుండె ననియు, మరణానంతరమందు వెంటనే యాతనికి 'దేవాధిదేవత్వము'యొక్క, లేక, వైదికధర్మముల యందున్న పరమాత్మయొక్క స్వరూపము, ప్రాప్తించుటచే నాతనిని పూజించుటయు ప్రారంభింపఁబడిన దనియుఁ బ్రమాణభూతములగు బౌద్ధగ్రంథములనుబట్టి కాన్పించుచున్నది. క్రీస్తు సైత మటులే గౌర వింపఁబడెను. బుద్ధుఁడును క్రీస్తువు నను వారివలెనే శ్రీకృష్ణుఁడు సన్న్యాసముఁ గైకొనలేదు, భాగవతధర్మములను, నివృత్తిపరముగఁ జెప్పలేదను మాట నిజమే; కాని యంతమాత్రముచే, బౌద్ధధర్మముల యొక్కయు, క్రైస్తవధర్మముల యొక్కయు, మూలపురుషులకువలె

భాగవతధర్మములయొక్క ప్రవర్తకులకును ప్రారంభమున నుండి బ్రహ్మముయొక్క గాని, లేక, దేవునియొక్క గాని స్వరూపము ప్రాప్తించుట కేమియు నభ్యంతరము లేదు.

శ్రీకృష్ణుని కాల మిట్లు నిశ్చయింపఁబడిన పిదప, భాగవత ధర్మములయొక్క యుదయమును నా కాలముననే యాయె నని చెప్పుట ప్రశస్తమును సయుక్తికమును నై యున్నది. పాశ్చాత్యపండితులు సామాన్యముగ నటు లొప్పుకొనక పోవుటకు కారణము వేఱుగనే యున్నది. ఋగ్వేదముయొక్క కాలమే క్రీస్తునకుఁ బూర్వమున 1500 గాని 2000 గాని సంవత్సరములకంటె నెక్కువ ప్రాచీనము గాదని యీ పండితులలో ననేకు లిప్పటికిని చెప్పుచునేయున్నారు. కావున భక్తిపరములగు భాగవతధర్మములు క్రీస్తుశకముకంటె సుమారు 1400 సంవత్సరములు పూర్వము వెలువడినవని చెప్పుటకు వారిలెక్కనుబట్టి వారికే యసంగతముగఁ దోఁచుచున్నది. కారణమే మన: ఋగ్వేదానంతరమున యజ్ఞయాగాది కర్మలకు ప్రతిపాదకమగు యజుర్వేదమును బ్రాహ్మణగ్రంథములును, అనంతరమున జ్ఞానపరములగు నుపనిషత్తులును సాంఖ్యశాస్త్రమును, తుదకు భక్తిపరములగు గ్రంథములును, నను నీ క్రమము, వైదికధర్మవాఙ్మయమును బట్టి నిర్వివాదముగ సిద్ధమగును. కేవల భాగవతధర్మముల గ్రంథములను జూచినను ఔపనిషదిక జ్ఞానము, సాంఖ్యశాస్త్రము, చిత్తనిరోధరూపమగు యోగము మొదలగు ధర్మాంగములు, భాగవతధర్మములు వెలువడుటకుఁ బూర్వమే ప్రచలితములై యుండెనని స్పష్టముగఁ గాన్పించుచున్నది. కాలము నెంత తగ్గించినను ఋగ్వేదానంతర మందును, భాగవతధర్మములు వెలువడుటకుఁ బూర్వము నను నీ వేర్వేఱగు ధర్మాంగముల యొక్క ప్రాదుర్భావమును, వృద్ధియు నగు లోపల పది పండ్రెండు శతాబ్దము లైనను గడచి యుండునని చెప్పవలసివచ్చును; కాని భాగవతధర్మములను శ్రీకృష్ణుఁడు తనకాల

మునందు (అనఁగా: క్రీస్తునకు పూర్వము సుమారు 1400 సంవత్సరములనాఁడు) ప్రవర్తింపఁ జేసెనని యొప్పికొనినను నీ పండితుని మతమున నీ ధర్మాంగములయొక్క వృద్ధియగుటకుఁ దగిన యవకాశము సైతముండదు. కారణ మేమన: ఋగ్వేదముయొక్క కాలమే యీ పండితుఁడు క్రీస్తువుకంటె పూర్వము 1500 సంవత్సరములు గాని 2000 సంవత్సరములుగాని యై యుండునని యెన్నుకొనుచున్నాఁడు. అటులైన నూఱు సంవత్సరముల క్రిందటఁ గాని యెక్కువగ లెక్కించిన నైదాఱువందల సంవత్సరముల క్రిందటఁగాని, భాగవతధర్మము లుత్పన్నము లైనవని చెప్పవలసివచ్చును. ఈ కారణమున వెనుకఁ జెప్పినటు లేదో యొక నీరసవిషయము నాధారముగఁ గైకొని దానికి శ్రీకృష్ణునియొక్క గాని, భాగవతధర్మములయొక్క గాని సంబంధమును గల్పించి, భాగవతధర్మముల యొక్క యుదయము బుద్ధుని యనంతరమున నాయె నని చెప్పుటకు సైతము కొంతమంది పాశ్చాత్యపండితులు సిద్ధముగనే యున్నారు; కాని జైన గ్రంథములలోను, బౌద్ధగ్రంథములలోను నీ భాగవతధర్మములు ప్రత్యేకముగ వ్రాయఁబడుట వలన భాగవతధర్మములు బుద్ధునికంటె ప్రాచీనములై యుండునని స్పష్టముగఁ గాన్పించుచున్నవి. కావున భాగవతధర్మోదయ కాలమును, ఋగ్వేదాదిగ్రంథములయొక్క కాలమును, నేను వ్రాసిన "ఓరాయన" మను గ్రంథమందుఁ బ్రతిపాదింపఁ బడినట్లు వెనుకకు జరుపవలయు నని డా. బ్యూలర్ అను వానిచేఁ జెప్పఁబడినది. * పాశ్చాత్యపండితులచే కొన్ని సందిగ్ధములగు నూహలయొక్క బలముచే నిశ్చయింపఁబడిన వైదిక గ్రంథముయొక్క కాలము సత్యమైనది కానందున, వైదికకాలముయొక్క పూర్వమర్యాద క్రీస్తుకంటె పూర్వమున 4500 సంవత్సరములకంటె తక్కువ యని చెప్పుటకు

* డా. బ్యూలర్‌చే రచియింపఁబడిన Indian Antiquary, September 1894 (Vol- XXIII. pp. 238–249) లో 'ఓరాయన' గ్రంథముపై చేసిన విమర్శమును జూడుము.

వీలులేదని వేదమందున్న యుదగయన స్థితిదర్శకములగు వాక్యములయొక్క యాధారముచే 'ఓరాయన' గ్రంథము నందు నాచే స్పష్టముగ నిరూపింపఁబడినది. ఈ యనుమాన మిప్పు డనేకులగు పాశ్చాత్యపండితులకు సమ్మతముగనే యున్నది. ఋగ్వేదకాల మిటులు వెనుకకు జరిపితిమేని, అనఁగా: వైదికధర్మములయొక్క యన్నియంగముల వృద్ధికిని యోగ్యమగు నవకాశము నిచ్చితిమేని, భాగవతధర్మోదయ కాలమును సంకోచింపఁజేయ నవసరము లేదు. "ఋగ్వేదానంతరమున నుత్పన్నమైన బ్రాహ్మణాది గ్రంథములలో కృత్తిక మొదలుకొని నక్షత్రములను లెక్కించుట సంప్రదాయ మగుటచే నా బ్రాహ్మణములయొక్క కాలము క్రీస్తుకు పూర్వమునందు సుమారు 2500 సంవత్సరములని చెప్పవలసివచ్చును" అని మహారాష్ట్ర భాషయందు కై. శంకరబాలకృష్ణ దీక్షితునిచే తన భారతీయ జ్యోతిశ్శాస్త్రముయొక్క యితిహాసమునందు నిరూపింపఁబడినది; కాని యుదగయన స్థితిని బట్టి గ్రంథముల కాలమును నిర్ణయించు పద్ధతి యుపనిషత్తుల విషయములలో నుండునట్లు మా కెప్పుడును కాన్పింపలేదు. రామతాపినివంటి భక్తిపరమైనట్టిది గాని, లేక, యోగతత్త్వము వంటి యోగ పరమగు నట్టిది గాని యగు నుపనిషత్తులయొక్క భాషయు, రచనయు ప్రాచీనముగఁ గన్పట్టుదు. ఇంత మాత్రముచే నన్ని యుపనిషత్తులకాలమును, బుద్ధునికంటె నాలుగైదువందల సంవత్సరములకంటె ప్రాచీనమై యుండదని యనేకు లూహించుచున్నారు; కాని పూర్వోక్తవిధమున కాలనిర్ణయముఁ జేయు నెడల నిది తప్పని తోఁచును. జ్యోతిషము మూలమున నన్ని యుపనిషత్తుల కాలమును నిశ్చయించుట సాధ్యము కానిమాట నిజమే. అయినను ముఖ్యములగు నుపనిషత్తులయొక్క కాలమును నిశ్చయించుటకీ రీతి మిక్కిలి యుపయోగించును. భాషయొక్క శైలిని జూచినను, మైత్ర్యుపనిషత్తు పాణినికంటె ప్రాచీనముగనే యున్నదని ప్రొ.

మాక్సుముల్లరుచేఁ జెప్పఁబడినది. * కారణమేమన: ఈ యుపనిషత్తు నందు, –మైత్రాయణీసంహితయందే పైకి కాన్పించునవియు, పాణినీయవ్యాకరణమున ప్రచారములో లేనివియు (అనఁగా: ఛాందసములైనవియు) నగు ననేక సంధులు గలవు; కాని, మైత్ర్యుపనిషత్తులన్నింటిలో మొదటిది (అనఁగా: అతిప్రాచీనమగు నుపనిషత్తు)కాదు. మైత్రాయణ్యుపనిషత్తునందున్న బ్రహ్మజ్ఞానమును, సాంఖ్యము నను నీ రెంటికిని సంబంధము కలదు. ఇంతియకాక యా యా స్థలముల యందు ఛాందోగ్యము, బృహదారణ్యకము, తైత్తిరీయము, కఠము, ఈశావాస్యము నను నుపనిషత్తులయందున్న వాక్యములును శ్లోకములును మైత్ర్యుపనిషత్తులో ప్రమాణార్థమై గ్రహింపఁబడినవి. ఈ యుపనిషత్తులయొక్క నామములు మైత్ర్యుపనిషత్తులో ప్రత్యక్షముగ వ్రాయఁబడలేదు. అయినను నీ వాక్యములను వ్రాయుచు 'ఏవం హ్యాహ' అనియు, 'ఉక్తం చ' (=చెప్పఁబడినది) అనియు ఇట్లు పరవాక్యదర్శకములగు పదము లుండుటచే నా వాక్యములు మఱియొక గ్రంథములోని వనియు, మైత్ర్యుపనిషత్కారుఁడు స్వయముగఁ జెప్పినవి కావనియు నిస్సంశయముగఁ జెప్పవచ్చును. మఱియు నివి యెక్కడి వైనదియు నితరములగు నుపనిషత్తులను జూచి సహజముగ నిశ్చయింపవచ్చును. ఇప్పు డీ మైత్ర్యుపనిషత్తునందు, కాలరూపమగు, లేక, సంవత్సరరూపమగు బ్రహ్మముయొక్క వివేచన చేయఁబడు నప్పుడు (మైత్ర్యు. 6.14) "మఘా నక్షత్రము మొదలుకొని వరుసగ శ్రవిష్ఠ (అనఁగా: ధనిష్ఠా నక్షత్రము) యొక్క సగము భాగము పైకి వచ్చుపర్యంతము (మఘాద్యం శ్రవిష్ఠార్ధం) దక్షిణాయన మగుచున్నది. మఱియు సార్పము (అనఁగా: అశ్లేషా నక్షత్రము) మొదలుకొని విపరీతక్రమముగ (అనఁగా: అశ్లేష, పుష్యమి, ఈ మొదలగు

* See Sacred Books of the East Series, Vol. XV. Intro. pp. xlviii—lii.

ప్రకారముగ వెనుకకు) లెక్కింతు మేని ధనిష్ఠా నక్షత్రముయొక్క అర్ధభాగ పర్యంతము నుత్తరాయణ మగును" అని వర్ణింపఁబడినది. ఈ యుదగయన స్థితిదర్శకములగు వచనము లా కాలమున నుండు నట్టి యుదగయన స్థితినే యనుసరించి యుండవలయు నని స్పష్ట మగుచున్నది. మఱియు దానింబట్టి యీ యుపనిషత్తుయొక్క కాల నిర్ణయమును గణితశాస్త్రము మూలమున సులభముగఁ జేయవచ్చును. కాని యీ విధమున కాలనిర్ణయము నెవరును చేయలేదు. మైత్ర్యు పనిషత్తునందు చెప్పఁబడిన యీ యుదగయనస్థితి వేదాంగ జ్యోతిష మందున్న యుదగయన స్థితికంటె ప్రాచీన మైనది. కారణ మేమన: వేదాంగ జ్యోతిషమునం దుదగయనముయొక్క యారంభము ధనిష్ఠా నక్షత్రముయొక్క ఆరంభమునుండి యగునని స్పష్టముగ నున్నది. మఱియు మైత్ర్యుపనిషత్తునం దారంభము ధనిష్ఠార్ధము మొదలుకొని చేయఁబడినది. మైత్ర్యుపనిషత్తునందున్న శ్రవిష్ఠార్ధమను శబ్దమున నర్ధ మను పదమునకు 'సరిగా సగము' అని యర్థము గ్రహింపవలయునా? లేక, "ధనిష్ఠ, శతతార యను నీరెంటి మధ్య మున నెక్కడ నైనను" అని యర్థము చేయవలయునా? యను నీ విషయమున మతభేదము కలదు; కాని యేమి చెప్పినను వేదాంగ జ్యోతిషమునకు పూర్వమం దున్న యుదగయనస్థితి మైత్ర్యుపనిషత్తు నందు వర్ణింపఁబడినది. మఱియు నా కాలమునం దుండిన స్థితి యది యే యైయుండును. ఈ విషయమై సందేహము లేదు. కావున వేదాంగజ్యోతిషకాలముయొక్క యుదగయనము మైత్ర్యుపనిషత్కాల మందలి యుదగయనముకంటె సుమారు నక్షత్రములోని సగము వెనుకకు వచ్చియుండునని చెప్పవలయును. వేదాంగ జ్యోతిష మందున్న యుదగయనస్థితి క్రీస్తుశకముకంటె సుమారు 1200 సంవ త్సరములు గాని, లేక, 1400 సంవత్సరములు గాని పూర్వమై యుండ

వచ్చునని జ్యోతిశ్శాస్త్రగణితమును బట్టి సిద్ధమగును;* మఱియు నుదగయనములోని సగము భాగము వెనుకc బడుటకు సుమారు 480 అబ్దము లగుననియు, మైత్ర్యుపనిషత్తు క్రీస్తువు కంటె పూర్వము 1880 మొదలు 1680 వత్సరములలోపుగ నెప్పు డైనను పుట్టియుండు ననియు గణితముచే నిష్పన్న మగుచున్నది. తుట్టతుద కీయుపనిషత్తు వేదాంగజ్యోతిషముకంటె ప్రాచీనమైనదను విషయమున నైనను సంశయ మేమియు నుండదు. మైత్ర్యుపనిషత్తులో నుల్లేఖింపcబడిన ఛాందోగ్యము మొదలగు నుపనిషత్తులు మైత్ర్యుపనిషత్తుకంటెను ప్రాచీనములని వేఱుగ చెప్పనక్కఱలేదు గదా! ఋగ్వేదముయొక్క కాలము క్రీస్తుకంటె పూర్వము సుమారు 4500 వత్సరము లనియు, యజ్ఞయాగాదిపరమైన బ్రాహ్మణముల కాలము క్రీస్తుకు పూర్వమందు సుమారు 2500 వత్సరము లనియు, ఛాందోగ్యము మొదలగు జ్ఞాన పరము లగు నుపనిషత్తులకాలము క్రీస్తుకు పూర్వము 1600 సంవత్స రము లనియు నిర్ణయమైన పిదప భాగవతధర్మములయొక్క యుద యము, అభివృద్ధి వీనియొక్క కాలము నవీన మని పాశ్చాత్య పండితులు చెప్పుటకు వీలులేదు. అవువలెను, దూడవలెను నున్న శ్రీకృష్ణుcడు, భాగవతధర్మములు ననువానికి సమకాలికత్వమును చెప్పుటకు భయపడ నవసరము లేదు. మఱియు బౌద్ధగ్రంథకారులచే వర్ణింపcబడిన నితరములగు నితిహాసములవల్ల సిద్ధమైన వస్తుస్థితికిని సంబంధము బాగుగ కుదురును. ఈ సమయముననే వైదికకాలము సమాప్తమై సూత్రముల యొక్కయు, స్మృతులయొక్కయు కాలము నారంభమై యుండును.

---

* వేదాంగజ్యోతిష కాలమును గూర్చి మా Orion (ఓరాయనము) అను నాంగ్లేయ గ్రంథమునను, కై. శంకరబాలకృష్ణదీక్షితులచే రచింపcబడిన 'భార తీయ జ్యోతిశ్శాస్త్రేతిహాసము' అను మహారాష్ట్రగ్రంథమునను (పుట. 87-94 మఱియు 127-139) వివేచన చేయcబడినది, చూడుము. దానియందే యుదగ యనమును బట్టి వైదికగ్రంథముల కాలము నైతము విచారింపcబడినది.

భాగవతధర్మములయొక్క యుదయము క్రీస్తుకంటె పూర్వ మందు సుమారు 1400 సంవత్సరము (అనఁగా: బుద్ధునికంటె సుమారే డెనిమిది నూఱుల వత్సరము) లయి యుండునని పైన చెప్పిన కాలగణనముం బట్టి సిద్ధమగును. ఈ కాలము బహు ప్రాచీనముగనే యున్నది. అయినను బ్రాహ్మణగ్రంథములయందున్న కర్మమార్గము సైతము దీనికంటె ప్రాచీన మనియు, నుపనిషత్తులయందును, సాంఖ్య శాస్త్రమునందును ప్రతిపాదింపఁబడిన జ్ఞానమును, భాగవతధర్మములు వెలువడుటకంటె పూర్వముననే ప్రచలితములై సర్వమాన్యములై యున్నవనియు పైనఁ జెప్పఁబడియున్నది. ఇట్టి స్థితిలో పూర్వోక్త మగు జ్ఞానమును గాని, ధర్మాంగములను గాని యుపేక్షింపక, శ్రీకృష్ణునివంటి చతురుఁడును, జ్ఞానియు నైనవాఁడు తన ధర్మమును ప్రవర్తింపఁ జేసెదనని కాని, వారు ప్రవర్తింపఁ జేసినను, నా కాలమందలి రాజర్షులకును, బ్రహ్మర్షులకును నది మాన్యమై లోకమున నది వ్యాపించిన దని కాని కల్పించుట నా కేమి యుక్త మని తోఁపదు. క్రీస్తు తన భక్తిపరములగు ధర్మముల నే యహూదీయులకు మొదట నుపదేశించెనో వారిలో నా కాలమున ధార్మికమైన తత్త్వము లేక పోవుటచే తన భక్తిప్రధానమగు ధర్మమును తత్త్వజ్ఞానముతో సమ్మేళనముఁ జేయుట కావశ్యకత లేకపోయెను. బైబిలుయొక్క ప్రాచీన మైన నియమములలోఁ జెప్పబడిన కర్మమయమగు ధర్మము ననుసరించియే యీ నా భక్తిమార్గము బయలువెడలిన దని చెప్పుటచేతనే క్రీస్తుయొక్క ధర్మోపదేశకార్యము సంపూర్ణమాయెను. క్రీస్తువు సైత మింతవఱకే ప్రయత్నించెను. కాని క్రీస్తుధర్మములయొక్క యీ విషయమును, భాగవతధర్మములయొక్క యితిహాసముతోఁ బోల్చు సమయమున, భాగవతధర్మము లెవరిలో నే కాలమున ప్రవృత్తములైనవో నా కాలమునం దొక కర్మమార్గమునే కాక, బ్రహ్మజ్ఞానమును, కాపిల సాంఖ్యశాస్త్రసాంఖ్యమును సైతము పూర్ణముగ నెఱింగి యీ మూఁడు

ధర్మాంగములకు నేకవాక్యతను జేయుటను సైత మప్పుడు వారు నేర్చికొనిరని మనస్సున నుంచుకొనవలయును. ఇట్టి జనులతో మీా కర్మకాండమును, నౌపనిషదిక జ్ఞానమును, సాంఖ్యజ్ఞానమును దూర ముగ నుంచి, కేవల భక్తితో భాగవతధర్మములను స్వీకరింపు( డని చెప్పుట యుక్తముగా నుండదు. బ్రాహ్మణములు మొదలగు వైదిక గ్రంథములలో వర్ణింపఁబడినదియు, నా కాలమున వ్యాపించియున్న దియు నగు యజ్ఞయాగాది కర్మలకు ఫలమేమి? యని యుపనిషత్తు లయందుఁ గాని, సాంఖ్యశాస్త్రమందుఁ గాని చెప్పఁబడిన జ్ఞానము వ్యర్థమేనా? యనియు, భక్తికిని, చిత్తనిరోధరూపమగు యోగమున కును సంబంధ మెట్లు కుదురు ననియు, సహజముగ బయలువెడలు ప్రశ్నలకు తగిన సమాధానమును చెప్పనే కాని భాగవతధర్మములు ప్రచారములోనికి వచ్చుటకు వీలులేదు. కావున భాగవతధర్మముల యన్నింటిలో నీ విషయముల నన్నింటిని మొదటినుండి చర్చించుట యావశ్యక మగునని న్యాయదృష్టికిఁ దోఁచును. మహాభారతాంతర్గత నారాయణీయోపాఖ్యానమును బట్టియు నీ సిద్ధాంతమే దృఢమగును. ఈ యుపాఖ్యానమున భాగవతధర్మములతో నౌపనిషదికమైన బ్రహ్మ జ్ఞానమును కలుపఁబడినది. నాలుగు వేదములు, సాంఖ్యము, యోగము నను నీ యైదును భాగవతధర్మములలోఁ జేరియున్నవి. కావున వానికి పాంచరాత్రధర్మము లనియు పేరు గలదు (మ. భా. శాం. 339. 107). మఱియు "వేదముల యందలి యారణ్యకములు సైతము (అనఁగా: ఉపనిషత్తులు) ఒకదాని కొకటి యంగములగును" (శాం. 348.82) అని చెప్పఁబడినది. పాంచరాత్రశబ్దమున కీ నిరుక్తి వ్యాకరణరీతిచే సిద్ధము కాకపోయినను అన్ని మతముల యందలి జ్ఞానమున నేకవాక్యత భాగవత ధర్మములయొక్క యారంభముననే చేయఁబడినది యను విషయము మాత్రమే స్పష్ట మగును. అయినను భక్తితో నితరములగు ధర్మాంగములకును నేకవాక్యత చేయుటయు

భాగవతధర్మముల యందలి ప్రధానవిషయము కాదు. భక్తియొక్క ధర్మతత్త్వము భాగవతధర్మములచేతనే మొదటఁ బ్రవర్తింపఁబడలేదు. రుద్రునియొక్క గాని లేక, విష్ణువుయొక్కగాని యేదో యొక స్వరూపమునందలి భక్తి భాగవతధర్మములు వెలువడుటకు ముందే యారంభింపఁబడియుండెను. మఱియు నుపాస్య మేదైనను నది బ్రహ్మము యొక్క ప్రతీకము, లేక, యొక విధమగు రూపమే యను కల్పనయు పూర్వకాలముననే వెలువడియుండె నని మైత్ర్యుపనిషత్తులోని పైనఁ జెప్పిన వాక్యములను బట్టి స్పష్ట మగును (మైత్ర్యు. 7·7). రుద్రుఁడు మొదలగు నుపాస్యములకు మాఱుగ వాసుదేవుఁడే యుపాస్యుఁడని భాగవతధర్మములయందుఁ జెప్పఁబడిన మాట నిజమే; కాని యెవరిని భజించినను నా భజన యొక భగవంతునకే చెందును. మఱియు రుద్రుఁడును, భగవంతుఁడును నను వారిరువురు లేరని భగవద్గీతల యందును, నారాయణీయోపాఖ్యానమునందును చెప్పఁబడినది (గీ. 9. 23; మ. భా. శాం. 341. 20-26). కావున కేవల వాసుదేవభక్తి యనునదియే భాగవతధర్మములకు ముఖ్యలక్షణ మని చెప్పుటకు వీలు లేదు. ఏ సాత్వతజ్ఞాతులలో భాగవతధర్మము వెలువడెనో వాని యందు సాత్యకి మొదలగు పురుషులును, పరమభగవద్భక్తులగు భీష్మార్జునులును, సాక్షాత్తుగ శ్రీకృష్ణుఁడును పరాక్రమముతోఁ గూడిన యనేక కార్యములను జేయుచు చేయించుచునుండిరి. కావున నా ధర్మమునే యనుసరించి భగవద్భక్తులును, నా కాలమున ప్రచారములో నున్న చాతుర్వర్ణ్య ధర్మానుసారముగ యుద్ధము మొదలగు వ్యావహారిక కర్మలను చేయవలయు ననియే మూలభాగవతధర్మములయందుండు ముఖ్యవిషయము. భక్తిమార్గము నవలంబించి వైరాగ్యయుక్తమగు తీవ్రబుద్ధితో సంసారమును వదలిన విరక్తు లా కాలమున నైతము భొత్తిగ లేకపోలేదు; కాని యిదంతయు సాత్వతముయొక్క, లేక, శ్రీకృష్ణునియొక్క భాగవతధర్మములలో ముఖ్యసిద్ధాంతము కాదు.

భక్తిచే పరమేశ్వరుని జ్ఞానము కలిగిన పిదప భగవద్భక్తుఁడు పరమేశ్వరునివలె జగత్తుయొక్క ధారణపోషణల నిమిత్తమై ప్రవర్తింపవలయునని శ్రీకృష్ణుని యుపదేశమునందలి సారాంశము. వీనిలో బ్రహ్మజ్ఞానులు సైతము నిష్కామకర్మలఁ జేయుట కేమియు నాటంకముండదని యుపనిషత్కాలములయందు జనకాదులచే నిశ్చయింపఁబడినది; కాని, యా సమయమందు భక్తి వానిలోఁ జేరకపోవుటయే కాక జ్ఞానము కలిగిన పిదప కర్మలను జేయవలయునా? వలదా? యను విషయము వారి వారి యిచ్ఛానుసారముగ (అనఁగా: వైకల్పికముగ) నుండెడిది (వే. సూ. 3. 4. 15). శుద్ధమైన నివృత్తికంటె నిష్కామకర్మపరమైన ప్రవృత్తిమార్గమే (నైష్కర్మ్యమే) మిక్కిలి శ్రేయస్కరమని భాగవతధర్మముల యందలి సిద్ధాంతము. మఱియు కర్మలకు జ్ఞానముతోడనే కాక భక్తితో సైతము యోగ్యమగు సమ్మేళనము చేయఁబడినది. భాగవతధర్మములయం దున్నవియు, స్మార్తధర్మములకంటె వేఱైనవియు నగు నీ ధర్మములకు మూలప్రవర్తకులగు నరనారాయణులును, నిటులే యన్ని కర్మలను నిష్కామబుద్ధితోఁ జేయుచు నుండిరనియు, నిటులే యెల్లవారును కర్మలను జేయుచు నుండుట యావశ్యక మనియు మహాభారతమున నొకచోట చెప్పఁబడినది (మ. భా. ఉద్యో. 48.21,22). నారాయణీయోపాఖ్యానము నందు మాత్రము "ప్రవృత్తిలక్షణ శ్చైవ ధర్మో నారాయణాత్మకః" "నారాయణీయములు, లేక, భాగవతధర్మములు ప్రవృత్తిపరము (అనఁగా: కర్మపరము) లైయున్నవి" (శా. శాం. 347.81) — అని వాని లక్షణము స్పష్టముగఁ జెప్పఁబడినది. నారాయణీయములు, లేక, మూలభాగవతములగు ధర్మములలోను నిష్కామప్రవృత్తిరూపమగు తత్త్వమునకే నైష్కర్మ్యమని పేరు. ఇదియే మూలభాగవత ధర్మములయందు సిద్ధాంతము; కాని కొంతకాలమున కీ సిద్ధాంతము యొక్క వ్యాప్తి తగ్గెను. వైరాగ్యపరమగు వాసుదేవభక్తి యీ ధర్మ

ములలో ప్రధానముగ నంగీకరింపఁబడె నని భాగవతమును బట్టి స్పష్ట మగుచున్నది. మఱియు నారదపాంచరాత్రములలో మాత్రము భక్తివలెనే మంత్ర తంత్రములు సైతము భాగవతధర్మములయందుఁ జేర్పఁబడినవి. అయిన నివి యా ధర్మములయొక్క మూలస్వరూప ములు కావని భాగవతమును బట్టియే స్పష్టమగుచున్నది. కారణ మేమన: నారాయణీయములు, లేక, సాత్వతములగు ధర్మముల విషయమై చెప్పవలసిన సమయము వచ్చినపుడు సాత్వతునియొక్క లేక, నారాయణఋషియొక్క (అనఁగా: భాగవతములగు) ధర్మ ములును, నైష్కర్మ్యలక్షణములుగ నున్నవని భాగవతమునఁ జెప్పఁ బడినది (భాగ. 1.3.8 మఱియు 11.4.6). పిదప నీ నైష్కర్మ్యధర్మము నందున్న భక్తికి తగినంత ప్రాధాన్యము చెప్పఁబడకపోవుటచే భక్తి పరమైన భాగవతపురాణము చెప్పవలసి వచ్చినదని చెప్పఁబడినది (భాగ. 1. 5. 12). దీనినిబట్టి మూలభాగవతధర్మములు నైష్కర్మ్య ప్రధానములు (అనఁగా: నిష్కామకర్మయే ప్రధానముగాఁ గలవి) అనియుఁ, బిదపఁగొంతకాలమునకు వానియొక్క స్వరూపము మాఱి భక్తిప్రధానములైన వనియు నిర్వివాదముగనే సిద్ధ మగును. జ్ఞానము నకు భక్తితోడను నిత్యసంబంధముఁ గలుగఁజేయు మూలభాగవత ధర్మముల యందును నాశ్రమ వ్యవస్థారూపమగు స్మార్తమార్గము నందును భేద మేమి? కేవల సన్న్యాసపరమగు జైనబౌద్ధ ధర్మముల ప్రచారముచే భాగవతధర్మములయందున్న కర్మయోగ మఱఁచి వేయఁబడినందున దానికి మఱియొక (అనఁగా: వైరాగ్యపరమగు) స్వరూపము ఎట్లు వచ్చినదనియు బౌద్ధధర్మముల యేపణఁగినపిదప వెలువడిన వైదికసంప్రదాయములలోఁ గొన్నింటిచేతఁ దుదకు భగవద్గీతయందలి సన్న్యాసపరమగు స్వరూపమును, గొన్నింటిచేత భక్తిపరమగు స్వరూపమును, మఱికొన్నింటిచేత విశిష్టాద్వైతపరమగు స్వరూపమును, నెట్లు కల్పించినారను నిట్టి యైతిహాసిక ప్రశ్నల

యొక్క వివేచనము వెనుకనే చేయఁబడినది. అందుచేత నిచ్చో మరలఁ జెప్ప నవసరము లేదు.

వైదికధర్మముల యొక్క సనాతనమైన ప్రవాహమునందు భాగవతధర్మము లెప్పుడు పుట్టినదియు, మొదట నవి కర్మప్రధాన ములో, లేక, ప్రవృత్తిపరములో యై యుండినను, పిదప నవి భక్తి ప్రధానము లయినదియు, రామానుజాచార్యుల వారికాలమున విశిష్టాద్వైతరూప మైనదియు, పైనఁ జేయఁబడిన సంక్షిప్త వివేచన వలనఁ దెలియును. భాగవతధర్మములయొక్క యీ వేర్వేఱగు స్వరూపములలో మొట్టమొదటనున్న (అనఁగా: నిష్కామ కర్మపర మైన) స్వరూపముమాత్రమే గీతా ధర్మములయొక్క స్వరూపము. ఇప్పుడిట్టి మూలగీతలయొక్క కాలము విషయమై యేమి యూహ చేయవచ్చునో సంక్షేపముగఁ జెప్పుచున్నాఁడను. శ్రీకృష్ణుని యొక్కయు, భారతయుద్ధముయొక్కయు కాల మొకటే (అనఁగా: క్రీ. పూ. సుమారు 1400 సంవత్సరములే) యైనను మూలగీతయు, మూలభారతము నను భాగవతధర్మముల సంబంధమైన ప్రధాన గ్రంథములు రెండును నా కాలముననే పుట్టినవని చెప్పుట సాధ్యము కాదు. ఏ మతధర్మ మైనను బయలువెడలిన వెంటనే యా మతగ్రంథ ములు సిద్ధములై యుండవు. భారతమును గీతలును నటులే మత ధర్మములు వెలువడఁగనే వెలువడిన వనుటకు వీలు లేదు. భారత యుద్ధమైన పిదప పాండవులకు పౌత్త్రుఁడగు జనమేజయుఁడు సర్ప యాగము చేసినపుడు వైశంపాయనులు గీతాసహితమగు భారతమును తొలుత నతనికిఁ జెప్పెను. దానినే సూతుఁడు శౌనకునకుఁ జెప్పెను. పిదప భారతము ప్రవృత్తమైన దని కథ ప్రస్తుత మహాభారతము యొక్క ప్రారంభమున వ్రాయఁబడినది. సౌతి మొదలుగాఁగల పౌరాణికులద్వారా వెలువడినపిదప దీనికి కావ్యమయమగు గ్రంథము యొక్క స్థాయికమైన స్వరూపము లభించులోపల నేమాత్ర మైనను

కాలము గడచి యుండవలయునని స్పష్టమగుచున్నది; కాని, యా గడచినకాల మెంత యైనదియు నిశ్చయించుట కిపుడు సాధనము లేవియు లేవు. అయినను భారతయుద్ధమైనపిదప సుమారు 500 సంవత్సరములలోపలనే యార్షమహాకావ్యాత్మకమగు మూలభారతము నిర్మింపఁబడియుండు నని చెప్పుట యొక సాహసము కాదు. కారణ మేమన: బౌద్ధధర్మములను బోధించు ధర్మగ్రంథములు, బుద్ధునిమరణానంతర మింతకంటె శీఘ్రముగ బయలువెడలెను. అర్షమహాకావ్యమున నాయకుని పరాక్రమమును మాత్రమే వర్ణించుట చేత కార్యనిర్వాహము కానేరదు. నాయకుఁడు చేయవలసినకార్యము యోగ్యమైనదియు, అయోగ్యమైనదియు సైతము చెప్పవలసివచ్చును. వే యేల? అర్షమహాకావ్యములో నిది యొక ముఖ్యకార్య మని సంస్కృత వాఙ్మయమునుబట్టియే కాక యితర వాఙ్మయములయందలి యిట్టి మహాకావ్యములను బట్టియుఁ గన్పట్టును. ఇప్పటివారి యూహలనుబట్టి విచారించితిమేని, నాయకుని కృత్యములను పరిశుద్ధమగు నీతిదృష్టితో సమర్థింపవలయును; కాని, పూర్వకాలమున నిప్పటివలె ధర్మమునకును, నీతికిని భేదము పరిగణింపఁబడకపోవుటచే దీనిని సమర్థించుటకు ధర్మదృష్టి తప్ప మఱియొక మార్గము లేక పోయెను. మఱియు భారతమునందలి నాయకుల కన్వయించునట్టి లేక, వారిచేతనే ప్రవర్తింపఁ జేయఁబడినట్టి భాగవతధర్మముల యాధారముచేతనే వారి కృత్యములను సమర్థించుట యావశ్యక మని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. మఱియు భాగవతధర్మములే కాక యా కాలమున బయలువెడలిన యితరములగు వైదికధర్మమార్గములు సైతము కొంచెము కొంచెముగఁ గాని, పూర్తిగఁ గాని నివృత్తిపరములైయె యుండుటచే వానియందున్న ధర్మతత్త్వముయొక్క యాధారముచే భారతమునందలి నాయకులయొక్క పరాక్రమ కృత్యములను పూర్ణముగ సమర్థించుటకు వీలులేకపోయెను. కావున

మహాకావ్యాత్మకమగు మూలభారతములోనే కర్మయోగపరములగు భాగవతధర్మములను నిరూపించుట యావశ్యక మాయెను. గీత యా నిరూపణయే యై యున్నది. మఱియు భాగవతధర్మములయొక్క మూలస్వరూపమును యుక్తియుక్తముగ ప్రతిపాదించుటకు, యథార్థముగ మొదటిగ్రంథము కాకపోయినను మూలగ్రంథ మగుటచే దాని యొక్క కాలము సుమారు 500 సంవత్సరములకై యుండవచ్చునని యూహింపవచ్చును. ఇట్లూహించుట కేమియు నభ్యంతరము లేదు.

గీత యనునది భాగవతధర్మములను బోధించు మొదటిగ్రంథము కాకపోయినను పైన చెప్పినట్లు ముఖ్యగ్రంథ మైనను కావచ్చును; కాన దానియందు ప్రతిపాదింపఁబడిన నిష్కామకర్మయోగమా కాలమున నాచరణలో నున్న యితర ధర్మమార్గములతో అనఁగా: కర్మకాండతోడను, నౌపనిషదజ్ఞానముతోడను, సాంఖ్యముతోడను, చిత్తనిరోధరూపమగు యోగముతోడను, భక్తితోడను— విరోధింపకుండనే యున్నదని నిరూపించుట యావశ్యకము. వేయేల? ఇటులే మతముతోడను విరోధింపకుండుటయే యీ గ్రంథమువలనఁ గలుగు ముఖ్యప్రయోజన మనియుఁ జెప్పవచ్చును. వేదాంతము, మీమాంస యను నీ మార్గదర్శకములగు గ్రంథములు పిదప బయలు వెడలి యుండుటచే మూలగీతలయందు వానిని ప్రతిపాదించుటకు వీలు కలుగకపోయెను. కావుననే గీతలలోనున్న వేదాంతము ప్రక్షిప్తమై యుండునని యనేకు లెన్నుచున్నారు; కాని యీ మార్గదర్శకములగు వేదాంతము, మీమాంస యను శాస్త్రములు పిదప రచింపఁబడినవైనను వానియందుఁ బ్రతిపాదింపఁబడిన విషయము మిక్కిలి ప్రాచీనమైనదని పైనఁ జెప్పఁబడినది. కావున నీ విషయము మూల గీతలయందుఁ జెప్పఁబడుట యొక దోషము కాదు. అయినను మూల భారతమును బట్టి మహాభారతము రచియింపఁబడినపుడు మూలము నందున్న గీతలు బొత్తిగ మాఱలేదనియు నే చెప్పను. ఏ మతమున

నైనను నన్ని దేశములయందును నప్పుడప్పుడు భేదములు గలిగి యనేకములైన యుపమతములు నిర్మితము లగుచుండునని యితిహాసము లంబట్టి కాన్పించును. భాగవతధర్మముల విషయమును నిటులే యుండవచ్చును. నారాయణీయోపాఖ్యానమునందే కొందఱు భాగవతధర్మములు చతుర్వ్యూహములు (అనఁగా: వాసుదేవుఁడు, సంకర్షణుఁడు, ప్రద్యుమ్నుఁడు, అనిరుద్ధుఁడు) కలవనియు, కొందఱు త్రివ్యూహములు గలవనియు, మఱికొందఱు ద్వివ్యూహములే యనియు, నింకను కొంద ఱేకమే కలదనియు చెప్పుదు రని స్పష్టముగఁ జెప్పఁబడినది (మ.భా.శాం. 348.57). ఇటులే మఱికొన్ని మతభేదములు తర్వాత వెలువడి యుండవచ్చును. అటులే యౌపనిషదికము, సాంఖ్యము నైన జ్ఞానమును వృద్ధియగుచునే యుండును. కావున మూలగీతలయందు స్థాలిత్య మేమైన నున్నచో దానిని తొలఁగించి యవి వృద్ధిపొందుచున్న పిండబ్రహ్మాండముల జ్ఞానముతోఁ బూర్తిగఁ గలసిపోవునట్లు చేయుట యస్వాభావికము గాని, మూలగీతల యుద్దేశమునకు విరుద్ధముగాని కాదు. కావుననే ప్రస్తుతమందున్న గీతలయందు బ్రహ్మసూత్రము లుల్లేఖింపఁబడినవని పైన "గీతలు-బ్రహ్మసూత్రములు" అను శీర్షికక్రింద నిరూపింపఁబడినది. మఱియు గీతలయందిట్టివి మఱికొన్ని మార్పు లుండవచ్చును. అయినను మూలగీతాగ్రంథమున నిట్టి హెచ్చుతగ్గుల నైనను విశేషము చూపుట సాధ్యము కాదు. గీతకు ప్రస్తుతమందున్న ప్రామాణ్యము మహాభారతానంతరమున వచ్చినట్లుగఁ గన్పట్టదు. బ్రహ్మసూత్రములయందే 'స్మృతి' శబ్దముచే గీత ప్రమాణార్థమై స్వీకరింపఁబడిన దని పైన చెప్పఁబడినది. మూలభారతము మహాభారత మైనప్పుడు మూలగీతలయందు విశేషము భేద ముండునేని యీ ప్రామాణ్యమున కాటంకము వచ్చియే యుండును; కాని, యటులు గాక యీ ప్రామాణ్య మంతకంతెను వృద్ధి యగుచునే యుండెను; కావున మూలగీతలయం దేమేని భేద

మున్నచో నది యొక గొప్ప కాదు. మూలమునందున్న యర్థము దేనిచే పరిపోషింపఁబడునో యట్లే యది యుండవలయునని యను మానింప వలసివచ్చును. గీతకు నొకపరి యిట్లు ప్రాప్తమైన స్వరూపమే యింతపర్యంతమును స్థిరముగ నుండెను. పిదప దానిలో మార్పేమియు జరుగలేదు అని యా యా పురాణములయందు ప్రస్తుతమందున్న భగవద్గీతను బోలునట్లుగఁ జెప్పఁబడిన యనేకములగు గీతలం బట్టి స్పష్ట మగును. కారణ మేమన: ఈ పురాణము లన్నింటిలో నతి ప్రాచీనమగు పురాణముకంటె సైతము కొన్ని శతకములనుండియైనను ప్రస్తుతమందున్న గీత పూర్ణముగ ప్రమాణభూతము కానిచో, నా కారణముననే మార్చుటకు వీలులేక దానిని బోలునట్లు మఱియొక గీత చెప్పఁబడిన దను కల్పనయే తోఁచుటకు వీలులేదు. అటులనే ప్రతి సాంప్రదాయిక టీకాకారుఁడును, గీతలయందున్న యొక శబ్దమునకే బలాత్కారముగ వేర్వేఱగు నర్థము చెప్పి గీతార్థమును తమ సంప్రదాయమున కనుకూలముగ నున్నదని నిరూపించుటకై శ్రమ పడవలసిన యవసరమును లేదు. ప్రస్తుతము గీతలలో నున్న కొన్ని సిద్ధాంతములు పరస్పర విరుద్ధములుగఁ గాన్పించుచున్నవి. కావున ప్రస్తుతమందున్న మహాభారతము నందలి గీతలలో సైతము పిదప నప్పు డప్పుడు మార్పు చేయఁబడి యుండునని యనేకు లూహించుచున్నారు; కాని, యీ విరోధము వాస్తవికము కాదనియు, నిది ధర్మ ప్రతిపాదనము చేయు పూర్వాపర వైదికపద్ధతియొక్క స్వరూపమును బాగుగఁ దెలిసికొనక పోవుటచేఁ గలుగు భ్రమ మనియు నారంభముననే చెప్పఁబడినది. ప్రాచీనములగు నా యా ధర్మాంగముల కేకవాక్యతను జేసి ప్రవృత్తిమార్గమును విశేషముగ సమర్థించు భాగవత ధర్మములు వెలువడిన పిదప సుమారు 500 సంవత్సరములకు, అనఁగా క్రీస్తుకంటె పూర్వమున సుమారు 900 సంవత్సరములకు, ఆ మూల భాగవతధర్మములనే ప్రతిపాదించు మూలభారతమును గీతయుఁబుట్టి

యుండు ననియు, భారతము మహాభారతముగఁ బరిణమించునప్పు డీ మూలగీతయందా యర్థమును బోషించు మా ర్పేమాత్రమో చేయఁ బడినను గీతలయొక్క ముఖ్యస్వరూపముమాత్ర మప్పుడును మాఱలేద నియు, ప్రస్తుత మహాభారతమున గీతలఁ జేర్చిన పిదప దానియందు మరల మార్పేమియుఁ గలుగలేదనియు, అట్లు కలుగుటకు సాధ్యము గాకపోయె ననియు నీ వివేచనను బట్టి ముఖ్యముగఁ దెల్లమగునని యిందలి సారాంశము. మూలగీతయొక్క గాని, స్వరూపవిషయము నను, కాలవిషయముననను నీ నిర్ణయ మెల్లవారిచేతను స్థూలదృష్టితోఁ జేయఁబడినది. కారణ మేమన: ఆ నిర్ణయమును జేయుటకు వలసి నంత సామగ్రి యిప్పుడు లభింపదు; కాని ప్రస్తుతమందున్న మహా భారతమును, ప్రస్తుతమందున్న గీతయు నను వాని విషయ మటుల గానేరదు. వానియొక్క కాలనిర్ణయమునకై యనేకములగు సాధన ములు లభించుచునే యున్నవి. కావున నా చర్చ దీని పిదపనుండు ప్రకరణభాగమునఁ బ్రత్యేకముగఁ జేయఁబడినది. ప్రస్తుతమందున్న గీతయు, ప్రస్తుతమందున్న మహాభారతమును (అనఁగా: ప్రారం భము నుండి, క్రమక్రమముగ మార్పుఁ జెంది తుద కిప్పటికి తేలిన గీతయు, మహాభారతము) నను నివియే మూలగ్రంథములు గాని, తత్పూర్వమునందున్నవి మూలగ్రంథములుకావని చదువరు లెఱుంగ వలయును.

---

## 5. ఇప్పటి గీతయొక్క కాలము

భగవద్గీత యనునది భాగవతధర్మములకు ప్రధానగ్రంథము. ఈ భాగవతధర్మములు క్రీస్తుకంటె సుమారు పదునాల్గు శతాబ్దముల (క్రీ.పూ. 1400) క్రిందటను, తదనంతరమున కొన్ని శతాబ్దములకు

పిదప మూలగీతయు బయలుదేరి యుండునని స్థూలదృష్టిచే పైన నిశ్చయింపఁబడినది. మఱియు మూలభాగవతధర్మములు నిష్కామ కర్మప్రధానము లయినవనియు, వానికే భక్తిప్రధానమైన రూపాంత రము కలిగి తుదకు విశిష్టాద్వైతము సైతము వానిలో నెట్లు చేరిన దనియుఁ జెప్పఁబడినది. మూలగీతల విషయమైకాని, లేక, మూల భాగవతధర్మములవిషయమై కాని యింతకంటె విశేషముగ వ్రాయుట కిప్పుడైనను సాధనములు లేవు. మఱియు పది పదునైదు సంవత్సరం బులకు పూర్వమున ప్రస్తుత మహాభారతముయొక్కయు, ప్రస్తుతగీత యొక్కయు సంబంధమున సైత మట్టులే యుండెను. కాని డా. భాండార్కర్, కై. కాశీనాథపంత్ తెలంగ్, కై. శంకరబాలకృష్ణ దీక్షితులు, రావుబహదూర్ చింతామణిరావు వైద్య మొదలగువారి యొక్క ప్రయత్నముచే, ప్రస్తుతమునందు భారతముయొక్కయు, ప్రస్తుతమున నుండు గీతయొక్కయు కాలమును నిర్ణయించుటకు అనేక ప్రమాణములు చూపఁబడినవి. మఱియు నిటీవల నింక నొకటి రెండు ప్రమాణములు కై. త్ర్యంబకగురునాథకాళే యను వారిచే నిరూపింపఁబడినవి. వీని నన్నింటిని క్రోడీకరించి, నాకు తెలిసినంత వఱకు వానియందు ప్రామాణ్యమును నిరూపించుచు పరిశిష్టమగు నీ భాగము నిమిడ్చి వ్రాసితిని. ఈ పరిశిష్టప్రకరణముయొక్క ప్రారం భముననే యిప్పటి మహాభారతమును, ఇప్పటి గీతయును నొకరి చేతనే రచింపఁబడినవని సప్రమాణముగ నిరూపించితిని. ఈ రెండు గ్రంథములు నొకరే రచియించిరి, ఒక కాలముననే పుట్టినవని యందు మేని మహాభారతముయొక్క కాలమునుబట్టి గీతలయొక్క కాలమును సైతము నిర్ణయము చేసినట్టులే యగును. కావున నీ భాగమున నిప్పటి మహాభారత గ్రంథకాలమును నిర్ణయించుటకుఁ గల ముఖ్య ములైన ప్రమాణములను జెప్పి పిదప నిప్పటి గీతాగ్రంథ కాలమును నిర్ణయము చేయుట కుపయోగించు ప్రమాణములను ప్రత్యేకముగ

వ్రాసితిని. కావున మహాభారతముయొక్క కాలమును నిర్ణయించు టకుఁ గల ప్రమాణము లొకవేళ నెవరికైన సందిగ్ధములుగఁ దోఁచి నను, గీతయొక్క కాలనిర్ణయమునకు దానివలన నేమియు బాధ యుండదు.

## మహాభారతకాలనిర్ణయము

మహాభారత మను గ్రంథ మతి విస్తీర్ణమైనది; కాని యిప్పు డున్న మహాభారతమున కొంచె మెచ్చు తక్కువగ లక్షశ్లోకములు గలవు. హరివంశమును సైతము గలిపినను లక్షసంఖ్య పూర్తి కానేర దని, రావుబహదూర్ వైద్యునిచే వ్రాయఁబడిన మహాభారతమునకుఁ టీకవలె నుండు నాంగ్లేయభాషకు భాషాంతరీకరణమైన గ్రంథము యొక్క మొదటి పరిశిష్టమున నిరూపింపఁబడినది.* అయినను భార తము మహాభారతమైన పిదప గొప్పగ్రంథముగ పరిణమించిన గ్రంథ మనేక స్థలములయం దిప్పు డున్నదానివలెనే యుండునని నిరాతంక ముగఁ జెప్పవచ్చును. ఈ మహాభారతమునందు యాస్కునియొక్క నిరుక్తమును, మనుసంహితయును, భగవద్గీతయందు బ్రహ్మసూత్ర ములును నుల్లేఖింపఁబడిన వని పైనఁ జెప్పఁబడినది. ఇంతియె కాక, యిప్పుడు దానియొక్క కాలమును నిర్ణయించుటకు లభించు ప్రమా ణము లేవి యన-

1. ఈ పదునెనిమిది పర్వములు గలిగిన గ్రంథమును, హరి వంశమును 'జావా' దేశమునకును, 'బాలీ బేటు' అను దేశమునకును నాలుగైదు శతాబ్దములకంటె పూర్వమే కొనిపోఁబడినవి. ఆ దేశముల యందున్న ప్రాచీనమగు 'కవి' యను భాషలోనికి భాషాంతరీకర

* The Mahabharata: a Criticism P. 185 రా. బ. వైద్యుల మహాభారతమునకు టీకాత్మకమగు నీ పుస్తకమునే తొలుదొలుత ప్రమాణముగఁ జూపెదము.

ణము చేయఁబడినవి. ఈ భాషాంతరములో ఆది, విరాట, ఉద్యోగ, భీష్మ, ఆశ్రమవాసి, ముసల, ప్రస్థానిక, స్వర్గారోహణములను నీ యెనిమిది పర్వములు బాలిబేటులో కలవు. వానిలోఁ గొన్ని ముద్రితములై యున్నవి. కవిభాషయందు భాషాంతరీకరణము చేయఁబడిన దానియం దక్కడక్కడ మహాభారతమునందలి మూలసంస్కృతశ్లోకము లుదాహరణమునకై వ్రాయఁబడియున్నవి. వీనిలో నుద్యోగపర్వము నందున్న శ్లోకములను నేను పరిశీలించి చూచితిని. అవి యన్నియు ప్రస్తుతమందు కలకత్తాలో ముద్రితమైన మహాభారతము నందలి యుద్యోగపర్వములోని యధ్యాయములలో వరుసగ నక్కడక్కడ కాన్పించుచున్నవి. దీనింబట్టి లక్షశ్లోకములు గల మహాభారత మిప్పటికి నాలుగు శతాబ్దములకు (శకసంవత్సరములకు) పూర్వముననే, యధమపక్షము రెండువందల సంవత్సరములకంటె వెనుకనైనను భరతఖండమున ప్రమాణభూతముగ నుండి యుండవచ్చునని సిద్ధమగుచున్నది. కారణ మేమన: అట్లు గానిచో జావా దేశమునకును బాలీబేటు దేశమునకును కొనిపోవలసిన యవసరమేమి? టిబెట్ భాషలోనికి సైతము మహాభారతము భాషాంతరీకరింపఁబడెను; కాని యది దీనివెనుక చేయఁబడినది. •

2. చేది సంవత్సరములు 197, అనఁగా: 367 శకాబ్దములు గల గుప్తరాజులయొక్క యొక శిలాశాసన మిప్పుడు కాన్పించినది. దానియందు మహాభారత మను గ్రంథము లక్షశ్లోకములు గలదియని స్పష్టముగ నిర్దేశింపఁబడినది. దానింబట్టి శకాబ్దములు 367 నకు

---

• జావా, బాలిబేటులయందున్న మహాభారతము విషయమై The Modern Review, July 1914, pp. 32–38 అను దానిలో వ్రాయఁబడినది. చూడుము మరియు టిబెట్ భాషయందలి మహాభారతముయొక్క సంపూర్ణమగు మల్లెము Rockhill's Life of the Buddha, P. 228 note 1 లో వ్రాయఁబడినది.

పూర్వమే యొకటి రెండు శకవత్సరంబులకు వెనుక నది యుండు నని కన్పట్టుచున్నది. *

3. ఇప్పుడు ప్రసిద్ధములైన భాసకవి నాటకములలోఁ బెక్కు నాటకములు మహాభారతమునందలి యాఖ్యానములను బట్టియే రచియింపఁబడినవి. అనఁగా: భాసునికాలమున మహాభారత ముండె ననియు, లోకులు దానిని ప్రమాణముగ నంగీకరించుచుండి రనియు స్పష్టమగుచున్నది. భాసకవికృత 'బాలచరిత' మను నాటకమున శ్రీకృష్ణుని బాల్యవిషయమును, గోపికలవిషయము నుల్లేఖింపఁబడినవి. కావున హరివంశముసైత మా కాలమున నుండి యుండవచ్చును. భాసుఁడు కాళిదాసుకంటె పూర్వకవి యనుట నిర్వివాద మైనది. భాసకృతనాటకములకు సంపాదకుఁడగు పండిత త. గణపతిశాస్త్రిచే భాసుఁడు చాణక్యునకంటె ప్రాచీనుఁడని స్వప్నవాసవదత్త యను నామము గల నాటకముయొక్క ప్రస్తావనయందు వ్రాయఁబడినది. కారణ మేమి యన: భాసుని నాటకమున స్పష్టముగఁ గాన్పించుచున్న యొక శ్లోకము చాణక్యునిచే రచియింపఁబడిన యర్థశాస్త్రము నందు కలదు. అక్కడ నది మఱియొకరిదని యుల్లేఖింపఁ బడినది. కాన, నీ కాలము సందిగ్ధ మనినను, భాసకవికాలము క్రీస్తుశకమున రెండవది గాని, మూఁడవది గాని యగు శతకమునకంటె నెక్కువ నూతన మని చెప్పుటకు వీలులేదని మాత్రమే నేను చెప్పుదును.

4. అశ్వఘోషుఁ డను నొక బౌద్ధకవి శాలివాహనశకారంభమున పుట్టెనని బౌద్ధగ్రంథములనుబట్టి నిశ్చయింపఁబడినది. ఈ యశ్వఘోషుఁడు బుద్ధచరిత్ర మనియు, సౌందరనంద మనియు పేర్లు

---

* ఈ శిలాలేఖనము Inscriptionum Indicarum అను గ్రంథము యొక్క మూఁడవఖండమందు 134-వ పుటలో సంపూర్ణముగ వ్రాయఁబడినది. మఱియు శంకరబాలకృష్ణ దీక్షితులవారిచే ప్రచురింపఁబడిన మహాభారతీయజ్యోతిశ్శాస్త్రమునందు (పు, 108) నుల్లేఖము చేయఁబడినది.

గల రెండు బౌద్ధధర్మబోధకములగు సంస్కృత మహాకావ్యములను రచించెను. అవి ప్రస్తుతమున ముద్రితములై ప్రసిద్ధిగాంచియున్నవి. ఈ రెండింటియందును భారతకథ యుల్లేఖింపఁబడినది.

ఇంతియె కాక యశ్వఘోషునిచే రచియింపఁబడినట్లు చెప్పఁబడు, వజ్రసూచికోపనిషత్తుయొక్క వ్యాఖ్యానరూపమగు నొక గ్రంథము కలదు. ఈ వజ్రసూచికోపనిషత్తు నతఁడే రచియించెననియుఁ జెప్పవచ్చును. ప్రొ. వేబరను నాతఁడీ గ్రంథమును 1860 వ సంవత్సరములో జర్మనీదేశమునం దచ్చు వేయించెను. దాని యందు హరివంశమునందలి శ్రాద్ధమాహాత్మ్యములోని "సప్తవ్యాధా దశార్ణేషు...." (హరి. 24.20 మఱియు 21) మొదలగు శ్లోకములును మహాభారతములోని మఱికొన్ని శ్లోకములును (ఉదాహరణార్థమై మ.భా.శాం. 261.17) వ్రాయఁబడినవి. దీనినిబట్టి శకారంభమునకు పూర్వమున హరివంశముతోఁ జేరి ప్రస్తుతమందున్న లక్షశ్లోకములు గలమహాభారత ముండెనని కాన్పించుచున్నది.

5. అశ్వలాయన గృహ్యసూత్రమునందు (3.4.4) భారతమును, మహాభారతమును వేఱుగ నుల్లేఖింపఁబడి యున్నవి. బౌధాయనధర్మసూత్రములలో నొక స్థలమున (2.2.26) మహాభారతమునందలి యయాతి-ఉపాఖ్యానము నందున్న యొక శ్లోకము వ్రాయఁబడినది (మ.భా.ఆ. 78.10); కాని యీ యొక్కశ్లోకమును బట్టియే బౌధాయనులకంటె పూర్వమున మహాభారత ముండెనని, నిశ్చయముగ నూహించుట సాధ్యము కాదని బుహ్లర్‌దొర చెప్పుచున్నాఁడు; * కాని యట్లు చెప్పుట యుక్తమైనది కాదు. కారణమేమి యన: బౌధాయనుల గృహ్య శేషసూత్రములయందు విష్ణుసహస్రనామము లుల్లేఖింపఁబడినవి (బౌ. గృ. శే. 1. 22. 8). ఇంతియేకాక

* See Sacred Books of the East Series, Vol. XIV. Intro.

యాసూత్రములలోనే (2. 22. 9) పిదప గీతలలోని "పత్రం పుష్పం ఫలం తోయం...." అను శ్లోకమును (గీ.9.26) వ్రాయఁబడినది. బౌధాయనసూత్రములయందున్న యీ యుల్లేఖము మొదట, కై. త్ర్యంబకగురునాథకాళేచేఁ బ్రచురపఱుపఁబడినది. † మఱియు దానిం బట్టి బుహ్లర్ దొరయొక్క పూర్వపక్షము నిర్మూల మగును. అశ్వలా యనునకును, బౌధాయనునకును మహాభారతము బాగుగఁ దెలియు నని చెప్పవలసివచ్చును. బౌధాయనుఁడు క్రీస్తుశకముకంటె పూర్వ మున సుమారు నాలుగు శతాబ్దముల ప్రాంతమున పుట్టి యుండునని బుహ్లరుచేతనే యితరప్రమాణములను బట్టి నిశ్చయింపఁబడినది.

6. మహాభారతముననే విష్ణువుయొక్క యవతారములను చెప్పినచోట నా యవతారములలో బుద్ధునియొక్క పేరు లేదు. మఱియు నారాయణీయోపాఖ్యానమునందు (మ.భా.శాం. 339.100) దశావతారములయొక్క పేరులున్నచోట 'హంస' అను ప్రథమావ తారమునుజెప్పి కృష్ణానంతరమున నొకసారే కలికిని జేర్చి పదియను సంఖ్యపూర్తి చేయఁబడినది. అయినను వనపర్వమునందు కలియుగము యొక్క భవిష్యత్ స్థితిని చెప్పునప్పుడు, "ఏడూకచిహ్నా పృథివీ న దేవగృహభూషితా" అనఁగా: భూమిపై దేవాలయములకు మాఱుగ నేడూకము లుండును అని వర్ణింపఁబడినది (మ. భా. వన. 190.68) బుద్ధునియొక్క కేశమును గాని, దంతమును గాని, యేదో యొక స్మరింపఁ జేయు వస్తువును గాని పాతిపెట్టి దానిపై కట్టిన స్తంభము గాని మందిరము గాని, లేక, యిల్లు గాని యేడూక మనఁబడును. దీనినే యీ కాలమున మహారాష్ట్రభాషలో 'డాగోబా' యని చెప్పు దురు. డాగోబా యనుశబ్దము సంస్కృత 'ధాతుగర్భ' (=పాలీ

---

† కై. త్ర్యంబకగురునాథకాళే గారి సంపూర్ణ లేఖము The Vedic Magazine and Gurukula Samachar, Vol. VII. Nos. 6,7 pp. 528–532. అమదాసిలో ముద్రితమై యున్నది. ప్రొ. కాళే యని లేఖకుని పేరు లేర పాటున అచ్చువేయఁబడినది.

డాగబ్) శబ్దముయొక్క యపభ్రంశము. 'ధాతు' వనఁగా: 'లోపల నునుపఁబడిన స్మారకవస్తువు' అని యర్థము. సింహళమునను బర్మా దేశమునను నిట్టి డాగోబాలు ప్రతిదిక్కునను గలవు. దీనింబట్టి బుద్ధుఁడు పుట్టినపిదపనైనను, నతని నవతారములలో లెక్కించుటకు పూర్వమున నైనను మహాభారతము పుట్టినట్లు కాన్పించుచున్నది. మహాభారతమునందు బుద్ధుఁ డనియు ప్రతిబుద్ధుఁ డనియు శబ్దము లనేక స్థలములయందుఁ బ్రయోగింపఁ బడినవి (శాం. 194·58; 307 47; 343·52); కాని యా పదమునకు "జ్ఞాని, జ్ఞాత, లేక, స్థితప్రజ్ఞుఁ డైనపురుషుఁడు" అని మాత్రమే యర్థ మక్కడ నిర్దేశింపఁబడినది. బౌద్ధధర్మములలో నుండి యా శబ్దములను గ్రహించినట్లు కన్పట్టదు. వేయేల? బౌద్ధులచేతనే యీ శబ్దములు వైదికధర్మములలోనుండి గ్రహింపఁబడియుండు నని యూహించుట కిది యొక ప్రబలమైన కారణము.

7. మహాభారతముయొక్క నక్షత్రముల లెక్కకు కృత్తిక మొదలు గాని యశ్విని గాదు (మ.భా.అను. 64 మఱియు 89). మేషము, వృషభము మొదలుగాఁ గల రాసు లెక్కడను చెప్పఁబడ లేదు. ఈ విషయము కాలనిర్ణయమును గుఱించి మిక్కిలి గొప్పది. కారణ మేమన; గ్రీకుదేశీయుల యొక్క సహవాసముచే మేష వృషభాదిరాసుల ప్రచారము హిందూస్థానమునకు రాకపూర్వము (అనఁగా: అలెగ్జాండరు కాలమునకు పూర్వమున) మహాభారత గ్రంథము పుట్టియుండునని దానింబట్టి సహజముగనే యూహింపఁ బడును; కాని దీనికంటెను గొప్పదియగు విషయము మఱియొక టున్నది. శ్రవణము మొదలు నక్షత్రములను లెక్కించుటయే యను గీతయందు (మ .భా. అశ్వ. 44. 2 మఱియు ఆది. 71. 34) చెప్పఁ బడినది. విశ్వామిత్రుఁడు శ్రవణము మొదలుకొని నక్షత్రములు లెక్క పెట్టుట నారంభించినట్లున్నది. అప్పుడు శ్రవణనక్షత్రము మొదలు

కొనియే యుత్తరాయణ మారంభ మగుచుండుటచే నట్లు లెక్కింపఁ బడెనని టీకాకారులు నుడివిరి. అంతకంటె నాస్థలమున వేఱొక యర్థము బాగుగ నుండనేరదు. వేదాంగ జ్యోతిషకాలమందు ధనిష్ఠా నక్షత్రమున నుత్తరాయణ మారంభ మగుచు నుండెను. ధనిష్ఠయందుదగయన కాలము జ్యోతిర్గణితమును బట్టి శకకాలముకంటె పూర్వమున సుమారు 1500 సంవత్సరము లుండును. మఱియు జ్యోతిర్గణితమును బట్టి యుదగయన మొక నక్షత్రము వెనుకఁ బడుటకు సుమారు 1000 వత్సరములు పట్టును. ఈ లెక్కనుబట్టి శ్రవణారంభమున నుదగయనము కాఁబోవుకాలము శకముకంటె పూర్వమున 500 వత్సరము లుండును. అనఁగా: శకమునకు పూర్వము 500 వత్సరముల ప్రాంతమున మహాభారతము పుట్టి యుండునని గణితముచే నిరూపింపవచ్చును. కై. శంకరబాలకృష్ణ దీక్షితుఁడు, తన భారతీయ జ్యోతిశ్శాస్త్రమునం దీ విధముననే యూహించినట్లు వ్రాసెను (భా.జ్యో.పు. 87-90, 111 మఱియు 147 చూడు). ఈ ప్రమాణమునందలి విశేషమేమన: దీనింబట్టి ప్రస్తుత మహాభారతము యొక్క కాలము శకముకంటె 500 సంవత్సరములకంటె పూర్వమని చెప్పుటకు వీలులేదు.

8. రావుబహదూర్ వైద్యునిచే వ్రాయఁబడిన మహాభారతము యొక్క టీకాత్మకమైన యింగ్లీషుగ్రంథములో చంద్రగుప్తుని కొలువు కూటమున (ఇ.స. పూర్వమందు సుమారు 320 సంవత్సరములక్రింద) నుండినట్టి మెగస్థనీస్ అను పేరు గల గ్రీకున్యాయవాదికి మహాభారతమునందలి కథలు తెలిసియున్నవని నిర్దేశింపఁబడి యున్నది. మెగస్థనీసుయొక్క గ్రంథ మిప్పుడు సంపూర్ణముగ లభ్యపడదు; కాని యందుండి యితరులచే గ్రహింపఁబడిన వచనముల నన్నిటిని సమకూర్చి మొదట జర్మనీభాషలో నచ్చొత్తించిరి. పిదప దానిని మక్క్రిండలనువాఁ డింగ్లీషునకు మార్చెను. ఈ పుస్తకమునందు

(పుట. 200-205) వర్ణింపఁబడిన హెరక్లిసనువాఁడె శ్రీకృష్ణుఁడనియు, నతనిపూజ మెగస్థనీసు కాలమున శౌరసేను లను జనులు చేయుచుండి రనియు, నీ శౌరసేనీజనులు మధురలో నున్నారనియుఁ జెప్పఁబడినది. * ఇంతియే కాక హెరక్లిసనువాఁడు, డాయొనిసస్ అను మూలపురుషుని యొద్ద నుండి లెక్కింప, పదునైదవవాఁడై యున్నాఁడని దానియందు చెప్పఁబడినది. మహాభారతమునందు (మ.భా.అను. 147.25-33) నిటులే శ్రీకృష్ణుఁడు దక్షప్రజాపతివద్ద నుండి లెక్కింప పదునైదవ పురుషుఁడని చెప్పఁబడెనది. అటులే మెగస్థనీసు చేసిన కర్ణప్రావరణుఁడు, ఏకపాదుఁడు, లలాటాక్షుఁడు మొదలగు విలక్షణజనులయొక్క కాని (పు. 74), లేక, బంగారమును పైకిఁ దీయుచున్నచీమలయొక్క (పిపీలికా) గాని వర్ణనయును (పు. 94) మహాభారతమునఁ గాన్పించుచున్నది (మ.భా.సభా. 51 మఱి 52). దీనిని బట్టియు మఱికొన్ని యితరవిషయములను బట్టియు మహాభారత మనుగ్రంథమే కాక శ్రీకృష్ణచరిత్రయును, శ్రీకృష్ణుని పూజయును మెగస్థనీసుయొక్క కాలమున ప్రచారములోనికి వచ్చి యున్న వని స్పష్టమగుచున్నది.

---

* See M' Crindle's Ancient India - Megasthenes and Arrian pp. 200-205. మెగస్థనీసునియొక్క యభిప్రాయము పిదప నొకానొక శోధన వలన చమత్కారముగ దృఢపఱుపఁబడినది. బొంబాయిరాజధాని Archaeological Department యొక్క 1904-వ సం. Progress Report మాత్రము మిక్కిలి ప్రాశస్త్యము నొందినది. దానిలో గ్వాలియరు సంస్థానమునందలి భిల్సా యనుపట్టణసమీపమున బేస్నగర మను గ్రామమునందున్న ఖాంబబాబా (స్తంభరూపమగుతండ్రి) అను నొక గరుడధ్వజస్తంభము నందలి వ్రాఁతలో నా స్తంభమెదుట వాసుదేవుని దేవాలయము హెలి ఓడరసు అనుపేరు గల నొక హిందూ మతావలంబకుఁడగు నొక యవనునిచే (అనఁగా: ఒక గ్రీసుదేశస్థునిచే) స్థాపింపఁబడినది. ఆ యవను డక్కడనున్న భగభద్రుఁడను రాజుయొక్క కొలువు కూటమున, తక్షశిల యందుండిన అంటి అల్కిడస్ అను పేరుగల గ్రీకురాజు తరఫున రాయబారిగ నుండెనని వ్రాయఁబడినది. క్రీ. పూ. 140-వ సం. అంటె

పైనఁ జెప్పఁబడిన ప్రమాణములలో నొకదానితో నొకదానికి సంబంధము లేదనియు వేర్వేఱుగ నున్నవనియుఁ దెలిసికొంటిమేని ప్రస్తుతమున్న మహాభారత మెంత తగ్గించినను లెక్కించినను శకము కంటె పూర్వమున సుమారు 500సంవత్సరములనాఁ డుండెనని నిస్సంశయముగఁ గన్పట్టును. కొన్నిశ్లోకములు పిదప నొకవేళ నెవరైనను దానిలోఁ జేర్చియు నుండవచ్చును; కొన్నింటిని తీసివైచియు నుండ వచ్చును; కాని ప్రస్తుతసంగతి యొకానొక శ్లోకమును గుఱించినది కాదు. మొత్తముపై ముఖ్యగ్రంథమును గుఱించినది. మఱియు నీ ముఖ్యగ్రంథము శకకాలముకంటె నైదుశతాబ్దములు పూర్వముననే యుండియుండునని సిద్ధమగుచున్నది. గీతయనున దీపూర్ణగ్రంథము నందలిభాగమే యనియు, దానిలో వెనుకఁ జేర్పఁబడినది కాదనియు, నీ ప్రకరణారంభముననే నేను నిరూపించితిని. అప్పుడు గీతకును నీకాలమే చెప్పవలసివచ్చును. మూలగీత దీనికంటె పూర్వమం దుండ వచ్చును. కారణ మేమన: దానియొక్క పరంపర బహు ప్రాచీనమై యుండవలయును అని యీ ప్రకరణముయొక్క నాల్గవభాగమునందే నిరూపింపఁబడినది; కాని యేమి చెప్పినను దానియొక్క కాలము, మహాభారతముకంటె పిదపనని చెప్పుట సాధ్యము కాదనువిషయము నిర్వివాదముగనే యున్నది. పైప్రసంగమును బట్టి మాత్రమే యీ విషయము సిద్ధము కానేరదు. ఇఁక నేమన: దానివిషయమై స్వతంత్రములగు ప్రమాణములు గలవు.

---

**అల్కిడస్ రాజ్యము చేయుచుండెనని వారి నాణెములను బట్టియే యిప్పుడు నిశ్చయింపఁబడుచున్నది. కాన నా సమయమున వాసుదేవభక్తి ప్రచారములో నుండుటయే కాక, యవనులు సైతము వాసుదేవుని దేవాలయములు కట్టించిరని పూర్ణముగ నేర్పడినది. మెగస్థనీసునకేకాక పాణినికి సైతము వాసుదేవభక్తి స్మరణలో నుండెనని పూర్వమునఁ జెప్పఁబడియే యున్నది.**

## గీతాకాలనిర్ణయము

పైనఁ జెప్పఁబడిన ప్రమాణములయందు గీతలయొక్క స్పష్ట మగు నిర్దేశము లేదు. మహాభారతమునుబట్టి యీ కాలము నిర్ణయింపఁ బడినది. ఇప్పుడు గీత స్పష్టముగ నుల్లేఖింపఁబడిన ప్రమాణములను క్రమముగ నిచ్చో వ్రాయుచున్నాను; కాని, యంతకుమునుపే కై. తెలంగుచే గీత యాపస్తంబులవారికంటె మిక్కిలి ప్రాచీనమైనదని (అనఁగా; క్రీస్తునకు సుమారు 300 సంవత్సరములకంటె బహు ప్రాచీన మైనదని) నిశ్చయింపఁబడిన దనియు డా. భాండారుకరుచే "వైష్ణవ శైవాదిమతములు" అను నొక యింగ్లీషు గ్రంథమున నెక్కువగా చర్చింపఁబడి యీ కాలమే స్వీకరింపఁ బడినదనియు చెప్పవలయును. * ప్రొ. గార్బే యను నాతఁడు తెలంగుచే నిశ్చయింపఁబడిన కాలము సరియగునది కాదనియు మూలగీతలు క్రీస్తునకన్న పూర్వమున రెండవ శతాబ్దమునఁ బుట్టెననియు, క్రీస్తు పుట్టిన పిదప రెండు శతాబ్దములకు వానిలో మార్పు కలిగినదనియు చెప్పెను; కాని గార్బే యొక్క యీ ప్రమాణములు సరియైనవికావని యీ క్రింద వ్రాయఁ బోవు ప్రమాణములం బట్టి స్పష్టమగును.

1. గీతల కిప్పటి వఱకుండు టీకలలోను, భాష్యములలోను శాంకరభాష్యము మిక్కిలి ప్రాచీనమైనది. శ్రీశంకరాచార్యులు మహాభారతమునందున్న సనత్సుజాతీయ మను ప్రకరణమునకు భాష్యము వ్రాసిరి. వారు తమ గ్రంథమున మహాభారతమునం దున్న అనుగీత, మను-బృహస్పతి సంవాదము, శుకానుప్రశ్నము, వీని యందుండు వచనముల ననేక స్థలములయందు ప్రమాణముగ స్వీకరించిరి. కావున మహాభారతమును, గీతయును వారి కాలమున ప్రమాణభూతములుగ నంగీకరింపఁబడుచున్నట్లు స్పష్ట మగుచున్నది. శ్రీశం

* See Telang's Bhagavadgita S. B. E. Vol. VIII Intro. pp. 21 and 34; Dr. Bhandarkar's Vaishnavism, Shaivism and other Sects, p. 13; Dr. Garbe's Die Bhagavadgita p 64.

కరాచార్యులయొక్క జన్మకాల మొక సాంప్రదాయిక శ్లోకముయొక్క యాధారమునుబట్టి 710 శకసంవత్సరము లైనట్లు స్థిరమగు నని ప్రొ. కాశీనాథ బాపూ పాఠకునిచే నిశ్చయింపఁబడినది; కాని మా యుద్దేశమును బట్టి యీ కాల మింకను నూఱువత్సరములు ప్రాచీన మయి యుండవలయును. కారణ మేమన: మహానుభావ మార్గముయొక్క 'దర్శనప్రకాశ' మను పేరుగలిగిన గ్రంథమునందు "యుగ్మపయోధి రసాన్వితశాకే", అనఁగా: 642 శకసంవత్సరమున శ్రీశంకరాచార్యులు గుహాప్రవేశము చేసిరని చెప్పఁబడినది. మఱియు నా సమయమున, నాచార్యులవారి వయస్సు 32 సంవత్సరములు గాన వారి జన్మకాలము 610 శకవత్సరములని సిద్ధ మగుచున్నది. ఈ కాలమే ప్రొ. పాఠకునిచే నిశ్చయింపఁబడిన కాలముకంటె మిక్కిలి సయుక్తికమై యున్నదని మా యూహ. మఱియు దాని విషయము విస్తరించి విచారము చేయుట యిచ్చో సాధ్యము కానేరదు. గీతలయొక్క శాంకరభాష్యములో ననేకులగు టీకాకారు లుల్లేఖింపఁబడిరి, మఱియు వారి మతములను ఖండించి గీతలకు తాము నూతనమైన భాష్యమును రచించితి మని తమ భాష్యారంభముననే శ్రీశంకరులు వ్రాసి యున్నారు. కావున శంకరుల జన్మకాలము 610 శకవత్సరము లని యెన్నినను, 710 యని యెన్నినను నంతకంటె పూర్వము రెండు, లేక, మూఁడు శతాబ్దముల క్రిందటనైనను, అనఁగా: నాలుగు శక శతాబ్దముల ప్రాంతమున గీత వెలువడి యుండెనసుట నిర్వివాదము గనే యున్నది. ఇప్పు డింతకంటెను ప్రాచీన మని యెంద ఱెట్లు నమర్థింతురో చూతము గాక.

2. కై. తెలంగు, కాళిదానునకును, బాణభట్టునకును గీత తెలిసి యున్నదని నిరూపించియున్నాఁడు. కాళిదాసుని రఘువంశమునందలి (10.31) విష్ణుస్తుతిలో "అనవాప్త మవాప్తవ్యం న తే కించన విద్యతే" అను శ్లోకము "నానవాప్త మవాప్తవ్యం" అను గీతలయం

దున్న (3. 22) శ్లోకముతో సదృశముగ నున్నది. మఱియు బాణ భట్టుని కాదంబరియందు "మహాభారత మివానంతగీతాకర్ణనానం దితతరం" అని యొక శ్లేషప్రధానమైన వాక్యమునందు గీత స్పష్ట ముగ నుల్లేఖింపఁబడినది. కాళిదాసునియొక్కయు భారవియొక్కయు స్పష్టమగు నుల్లేఖము 556 శకవత్సరములుగల యొక శిలాశాసనమున నుండుటవలన, కై. పాండురంగగోవిందశాస్త్రీ పారఖీ యనువాఁడు రచియించిన బాణభట్టునికి సంబంధించిన మరాటీనిబంధనమున నిరూ పింపఁబడినట్లు బాణభట్టు 528 శకవత్సరముల ప్రాంతమున హర్ష రాజుయొక్క సభయం దుండెనని యిప్పుడు నిశ్చయింపఁ బడినది.

3. జావా బేటా యను దేశమునకు కైకొనిపోఁబడిన మహా భారతమున నున్న భీష్మపర్వమునందు గీతాప్రకరణము కలదు. దాని యందు గీతలలోని యా యా యధ్యాయముల యందలి నూఱు నూటయిరువదియైదు శ్లోకము లేమియు మార్పుచెందక యున్నవి. 12, 15, 16, 17 అధ్యాయములయందున్న శ్లోకములుమాత్రము దాని యందులేవు. అయినను అప్పటిగీతయు నిప్పటిగీతవలెనే యుండెనని చెప్పవచ్చును. కారణ మేమన: కవి-భాషలోనికి భాషాంతరీకరింపఁ బడిన గీతయందుండు సంస్కృతశ్లోకములు, నడుమనడుమ భాషాం తరీకరణమునకు నిదర్శన మగుటకొఱకుఁ గాని, యవతారికకొఱకుఁ గాని వ్రాయఁబడియున్నవి. అనఁగా: ఆ సమయమున గీతలలో నీ శ్లోకములు మాత్రమే కలవని యూహించుట యుక్తము కాదు. "డా. నరహరగోపాలసర్ దేశాయీ" అను నాతఁడు జావాబేటా దేశము నకు పోయినపు డీ విషయమును నాతఁడు తెలిసికొనినట్లు కలకత్తా యందలి మాడరన్ రివ్యూ అను పేరుగల మాసపత్రికలోని 1914సం. జూలై మాసపు పత్రికయందును, నంతకు మునుపు పునహాయందు ప్రచురింపఁబడు చిత్రమయజగత్తను మాసపత్రికయందును ప్రచు రింపఁ బడినది. దీనింబట్టి నాలుగైదు శతముల శకాబ్దములకంటె

పూర్వమున సుమారు 200 సంవత్సరముల నాఁడైనను మహాభారత మున భీష్మపర్వమునందు గీత యుండెననియు, దానియందున్న శ్లోకములు ప్రస్తుతము గీతలలోనికి క్రమక్రమముగ వచ్చినవనియు సిద్ధ మగుచున్నవి.

4. ఈ గ్రంథముయొక్క మొదటి ప్రకరణమున, విష్ణుపురాణము, పద్మపురాణము మొదలగు గ్రంథములలో నుండు భగవద్గీత శైలి ననుసరించి రచియింపఁబడిన యితరములగు గీతలు గాని, లేక గీతయొక్క యుల్లేఖములు గాని యివి యివి యని స్పష్టముగఁ జెప్పఁబడినవి. భగవద్గీత నటు లనుకరించుట కా కాలమందు భగవద్గీత ప్రమాణమును, పూజ్యమునై యుండుటయే కారణము. లేనిచో నెవరును దాని ననుకరింపనే యనుకరింపరని స్పష్ట మగుచున్నది. కావున నీ పురాణములలో మిక్కిలిప్రాచీనమగు పురాణముకంటెను భగవద్గీత రెండు మూఁడువందల సంవత్సరములైనను ప్రాచీనమై యుండవలయునని సిద్ధ మగుచున్నది. పురాణకాలముయొక్క ప్రారంభము క్రీస్తుశకమునందలి రెండవ శతాబ్దమునకంటె నెక్కువ నవీన మనుటకు వీలు లేదు. కావున గీతయొక్క కాలము శకారంభముకంటె కొంచెమైనను ప్రాచీనముగ నుండవచ్చును.

5. కాళిదాసబాణులకు గీత తెలిసియున్నదని పైన చెప్పఁబడినది. కాళిదాసుకంటె పూర్వమున, భాసకవినాటకములు మాత్రమే ప్రసిద్ధములు. వానిలో 'కర్ణభార' మను పేరుగల నాటకమున—

**హతోఽపి లభతే స్వర్గం జిత్వా తు లభతే యశః,**
**ఉభే బహుమతే లోకే నాస్తి నిష్ఫలతా రణే.**

అను పండ్రెండవ శ్లోకము గీతలయందున్న "హతో వా ప్రాప్స్యసి స్వర్గం" (గీ. 2. 37) అను శ్లోకముతో సమానార్థకముగ నున్నది. మఱియు భాసకవికి మహాభారతముయొక్క పూర్ణపరిచయ ముందు

నటు లాతని యితర నాటకముల వలన స్పష్టమగు చుండుటచే, పైన చెప్పఁబడిన శ్లోకము గీతలయందున్న శ్లోకమును జూచియే వ్రాసి యుండునని నిస్సంశయముగ నూహింపవచ్చును. అనఁగా: భాస కవికంటె పూర్వమందు సైతము మహాభారతమును, గీతయు నుండె నని స్థిర మగుచున్నది. భాసకవియొక్క కాలము శకమునకు పూర్వ మున రెండు మూఁడు శతాబ్దములై యుండునని పండిత, త. గణపతి శాస్త్రిచేత నిశ్చయింపఁబడినది; కాని యతని కాలము శకానంతరమున నొకటిరెండు శతాబ్దములై యుండవలయునని యనేకు లనుచున్నారు. ఈ యనేకులు చెప్పునదియే సత్య మనినను, భాసునికంటె పూర్వ మున నొకటి రెండు శతాబ్దములైనచో, శకారంభమున భారతము గీతయు సర్వమాన్యము లగు గ్రంథములై యుండె నని పైన చెప్పిన ప్రమాణముల వలన సిద్ధ మగును.

6. కాని దీనికంటె నిటులే (అనఁగా: ప్రాచీన గ్రంథకారులు గీతలయందలి శ్లోకములను గ్రహించినటులే) బలవత్తరమగు ప్రమా ణములను, కై. త్ర్యంబక గురునాథకాళేగారు గురుకులముయొక్క 'వైదిక మాగజైన్' అను పేరు గలిగిన నాంగ్లేయ మాసపత్రికయందు (పుస్తక 7 అంక 6-7 పుట. 5.28-532, మార్గశీర్షమును, పౌషమును సంవత్ 1970)ప్రచురించిరి. వీ రిట్లు ప్రచురింపక మునుపు ఉల్లేఖము, సంస్కృతకావ్యముల కంటెను, పురాణముల కంటెను, ప్రాచీనమగు నే గ్రంథమునందును నుదాహరణార్థమై యున్నట్లు కనఁబడదనియు, సూత్రగ్రంథములయందును కానరాదనియు, నా కారణమున సూత్ర కాలము సమాప్తమైన పిదప క్రీస్తుశకముకంటె పూర్వమున రెండవ శతాబ్దముకంటె నధిక ప్రాచీనకాలమున గీత పుట్టియుండ దనియు పాశ్చాత్యసంస్కృతపండితులు తలఁచుచుండెడివారు; కాని కై. కాళే గారి యీ యభిప్రాయము తప్పని నిరూపింపఁబడినది. బౌధాయన గృహ్యశేషసూత్రమున (2.22.9)-

దేశాభావే ద్రవ్యాభావే సాధారణే కుర్యా న్మనసా వార్చయే దితి. తదాహ భగవాన్—

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
త దహం భక్త్యుపహృత మశ్నామి ప్రయతాత్మనః. ఇతి

అని గీతలలోని (9.26) శ్లోకము “తదాహ భగవాన్” అని స్పష్టముగ జెప్పఁబడినది; మఱియు పిదప భక్తినమ్రుఁడై యీ మంత్రములను జెప్పవలయును— భక్తినమ్రః ఏతాన్ మంత్రానధీయీత అని చెప్పఁబడినది. మఱియు నీ గృహ్యసూత్రముననే మూఁడవప్రశ్నము కడపటు “ఓం నమో భగవతే వాసుదేవాయ” అను ద్వాదశాక్షరమంత్రమును జపించె నేని యశ్వమేధఫలము లభించునని చెప్పఁబడినది. దీనినిబట్టి బౌధాయనులకంటెను పూర్వమునుండియే గీత ప్రచారములో నున్నదనియు, వాసుదేవపూజయును నెల్లవారిచే నంగీకరింపఁబడు చుండెననియు పూర్తిగ సిద్ధమగుచున్నది. ఇంతియకాక బౌధాయనులచే రచియింపఁబడిన పితృమేధసూత్రములలో తృతీయ ప్రశ్నారంభముననే—

జాతస్య వై మనుష్యస్య ధ్రువం మరణ మితి విజానీయా
త్తస్మా జ్జాతే న ప్రహృష్యే న్మృతే చ న విషీదేత్.

అను వాక్యము కలదు. దానిని వారు “జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ, తస్మా దపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి” అను గీతలయందున్న శ్లోకమునుం బట్టి యూహించి యుందురని సహజముగఁ గన్పట్టును. మఱియు పైన చెప్పఁబడిన సూత్రము సైతము గీతయందలి “పత్రం పుష్పం” అను శ్లోకమును జూచియే వ్రాసియుండు నని నిస్సంశయముగఁ జెప్పవచ్చును. మహాభారతముననే యున్నయట్టి యొక శ్లోకము బౌధాయనసూత్రముల యందుఁ గాన్పించుచున్న దని పైనఁ జెప్పఁబడియున్నది. బౌధా

యనుల కాల మాపస్తంబుల కాలముకంటె పూర్వ మొకటి రెండు శతాబ్దంబులై యున్నది. అపస్తంబుల కాలము క్రీస్తుకంటె పూర్వము నందు మూఁడు శతాబ్దములకన్న లోపుగా నుండఁగూడ దని బుల్హారు దొర నిశ్చయించెను.* కాని యీ కాల మింకను కొంత నవీన మని చెప్పవలయునని తలఁచెదను. కారణ మేమన: మహాభారతమునందు మేషవృషభాది రాసులపై ళ్లుల్లేఖింపఁబడలేదు. బౌధాయనులయొక్క "మీనమేషయోః మేషవృషభయో ర్వా వసంతః" అను వచనము కాలమాధవమున వ్రాయఁబడినదని, కై. శంకరబాలకృష్ణ దీక్షితుల యొక్క జ్యోతిశ్శాస్త్రమునందును (పు. 102) చెప్పఁబడినది. దీనిం బట్టి మహాభారతము బౌధాయనులకంటె ప్రాచీనమైనది యనియు, శకవత్సరములకంటె పూర్వమున సుమారు నాలుగుశతాబ్దముల నాఁడైనను బౌధాయనులును, సుమా రైదు శతాబ్దములనాఁడు మహాభారతమును గీతయు నుండియుండవలయునని నిశ్చయముగ నూహింపఁబడినది. కై. కాళేగారు బౌధాయనులకాలము క్రీస్తునకు పూర్వ మే డెనిమిదిశతాబ్దము లని చెప్పిరి; కాని అది సరియయినది కాదు. రాశి సంబంధమగు బౌధాయనవచనమును కాళేగారు గమనింప లేదు.

7. పైనఁ జెప్పిన ప్రమాణములను బట్టి యిప్పుడుండు గీత శకముకంటె పూర్వ మైదు శతాబ్దములనాఁ డుండెననియు, బోధాయనులకు నాశ్వలాయనులకును దెలిసియే యున్నదనియు, నదిమొదలు తుదకు శ్రీశంకరుల పర్యంతమును దాని పరంపర యెడతెగకయుండు నటులు నిరూపించవచ్చు ననియు, నెల్లవారికి స్పష్టముగఁ గాన్పించును; కాని యీ నిరూపణయంతయు వైదికధర్మగ్రంథముల లోనిది. ఇఁక నేను నిరూపింపఁబోవు ప్రమాణములు వైదికేతర గ్రంథము లోనివి. అనఁగా: బౌద్ధవాఙ్మయములోనివి; గాన వానిచే గీతలకు పైన చెప్పిన ప్రాచీనత్వ మత్యధిక బలవత్తరమును, నిస్సందేహమును

* See Sacred Books of the East Series, Vol. II. Intro. p. xliii. and also the same Series Vol. XIV. Intro. p. xliii.

నగును: బౌద్ధధర్మములకంటె పూర్వమునందే, భాగవతధర్మము లుదయించి ప్రబలినవను విషయమున 'బుల్హార్' పండితుని యొక్కయు, ప్రసిద్ధుఁడగు ఫ్రెంచి పండితుఁడగు 'సెనాత్' అను వానియొక్కయు మతములు పూర్వమున చెప్పఁబడినవి. బౌద్ధధర్మము లెట్లు వృద్ధి పొందినదియు, హిందువుల ధర్మములతో నవి యెట్లు సంబంధించు నదియు, మొదలగు విషయములను దీనికి వెనుకఁ జెప్పఁబోవు ప్రకరణభాగమున ప్రత్యేకముగ విచారించితిని. ఈ కాలమున గీతయొక్క కాలసంబంధములో మాత్రమెంత యుల్లేఖించుట యావశ్యకమగునో యంతమాత్రమే సంక్షేపముగ వ్రాయుచున్నాను. భాగవతధర్మములు బౌద్ధధర్మములకంటె ప్రాచీనము లైనను అంత మాత్రముచే గీతలు బుద్ధునికంటె పూర్వమునఁ బుట్టినవని నిశ్చయము కానేరదు. కారణ మేమన: భాగవతధర్మములును, గీతాగ్రంథమును నొకకాలముననే పుట్టినవని చెప్పుటకు నిర్దుష్టము లైన ప్రమాణములు లేవు. కావున బౌద్ధగ్రంథకారులు, గీతాగ్రంథమును స్పష్టముగ నెచ్చటనైన నుద్దేశించిరా? లేదా? యని విచారించుట యావశ్యకము. బౌద్ధగ్రంథములయందు నాలుగు వేదములును, వేదాంగములును, వ్యాకరణమును, జ్యోతిషమును, నితిహాసమును, నిఘంటువును, మొదలగు వైదికధర్మములను బోధించు గ్రంథములు బుద్ధుని కాలమునకు పూర్వమే పుట్టినవని స్పష్టముగ వ్రాయఁబడినది. కావున వైదికధర్మములు బుద్ధునికంటె పూర్వమందే పూర్తియైన వను విషయమున నేమియు సందేహము లేదు. తదనంతరమందు బుద్ధుఁడు కని పెట్టిన నూతనమార్గ మధ్యాత్మదృష్టిచే, ననాత్మవాదముగ నున్నను, నాచరణదృష్టిచే నుపనిషత్తులలోని సన్న్యాసమార్గమే దానియందు ననుకరింపఁబడినదని పిదప నుండు ప్రకరణభాగమున నిరూపించెదను; కాని యశోకునియొక్క కాలమున బుద్ధధర్మములయొక్క యీ స్థితి మాఱుటచే బౌద్ధభిక్షువు లరణ్యములో నుండుట మాని,

ధర్మప్రచారము, పరోపకారము నను కార్యములను నెఱవేర్చుటచేత నిది తూర్పున చైనావఱకును, పశ్చిమమున నలగ్జాండ్రియా గ్రీసు దేశములవఱకును వ్యాపించినట్లు కాన్పించుచున్నది. అరణ్యములో నుండుట మాని లోకసంగ్రహ మను కార్యమును జేయుటకు బౌద్ధ యతులు ప్రవర్తించిరని చెప్పుటయే బౌద్ధధర్మేతిహాసముల యందలి గొప్ప విషయము.

బౌద్ధధర్మములను బోధించు ప్రాచీనగ్రంథములను జూచితి మేని, పూర్ణమైన యర్హతావస్థను బొందిన భిక్షువేమియుఁ జేయక ఖడ్గమృగమువలె వనమున నుండవలయు నని సుత్తనిపాతలలో ఖడ్గవిసాణసుత్తయందు చెప్పఁబడినది. మహావగ్గమునందు (5.1.27) బుద్ధుని శిష్యుఁ డగు సోనకోలివిసుయొక్క కథయందు "నిర్వాణ పదమును జెందిన భిక్షువు 'కతస్స పటిచయో నత్థి కరణీయం న విజ్జతి' – ఏమియు చేయవలసిన యవసరముండదనియు, చేసిన వానిని సైతము భోగింప నవసరములే" దనియు చెప్పఁబడినది. ఇది శుద్ధసన్న్యాసమార్గము. దీనికి నౌపనిషదికసన్న్యాసమార్గముతో పూర్ణ మైన సామ్యము కలదు. "కరణీయం న విజ్జతి" అను వాక్యము "తస్య కార్యం న విద్యతే" అను గీతావాక్యముతో సమానార్థక మగుటయే కాక, యందలి శబ్దములును నవియే యైనట్లు కాన్పించు చున్నవి; కాని బౌద్ధభిక్షువులయొక్క మొట్టమొదటి యీ సన్న్యాస పరమగు నాచారమును మార్చుకొని వారు పరోపకార మను కార్య మును చేయ నారంభించినపుడు ప్రాఁత మతమునకును, క్రొత్తమతము నకును వివాదము వెలువడినది. అందు ప్రాచీనులు తమ మార్గము గొప్పమార్గమని (వృద్ధపంథ) యనెడివారు. నవీనులు తమ మార్గము నకు 'మహాయాన' మని పేరిడికొని ప్రాచీనపంథను 'హీనయానము' (అనఁగా: తక్కువమార్గము) అనెడివారు. అశ్వఘోషుఁ డీ మహాయాన పంథలోనివాఁ డగుటచేఁ బౌద్ధయతులు పరోపకారకార్యమును చేయ

వలయు నను మత మాతనికి సమ్మతముగ నుండెను. కావున సౌందర నందకావ్యము యొక్క చివర నందుఁ డర్హ త్తావస్థను పొందినపిదప నాతనికి మొదట—

అవాప్తకార్యోఽసి పరాం గతిం గతః
న తేఽస్తి కించిత్కరణీయ మణ్వపి

— నీ కార్యము లైనవి. ఉత్తమగతి నీకు లభించినది. ఇప్పుడు నీకు (స్వీయమైనది) తిలమాత్ర మైనను కర్తవ్య మేదియు లేదు", (సౌ. 18.54) అని ముందు—

విహాయ తస్మా దిహ కార్య మాత్మనః
కురు స్థిరాత్మన్పర కార్యమవ్యథో.

— కావున నీవు నీకార్యములను వదలి వైచి స్థిరబుద్ధి గలవాఁడవై పరకార్యములను జేయుము అని బుద్ధుఁ డుపదేశించినట్లు స్పష్టముగఁ గాన్పించుచున్నది (సౌ. 18. 57). బుద్ధుఁడు ప్రాచీనగ్రంథములలోఁ జేసిన కర్మత్యాగపరమగు నుపదేశమును, సౌందరనంద కావ్యమునం దశ్వఘోషుఁడు బుద్ధునితోఁ సాదృశ్యమును జెంది బోధించిన కర్మయోగపర మగు నుపదేశమును పరస్పరవిరుద్ధములుగ నున్నవి. ఈ యశ్వఘోషునియొక్క సిద్ధాంతము మూడవ యధ్యాయమునందున్న "తస్య కార్యం న విద్యతే....తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర." — నీవు సేయఁదగిన దేదియు లేదు; కావున ప్రాప్తమగు కర్తవ్యములను నిష్కామ బుద్ధితోఁ జేయుము" (గీ. 3.17 19) — అను సిద్ధాంతముతో నర్థమాత్రముతోనే కాక శబ్దములతో సైతము సామ్యమును బొందుచున్నది. దీనింబట్టి యశ్వఘోషుఁ డీ సిద్ధాంతమును గీతలోనుండి గ్రహించి యుండవచ్చునని యూహింప వలసియున్నది. కారణ మేమన: అశ్వఘోషునికంటె పూర్వముననే మహాభారతము కలదని నిరూపింపఁబడినది. మఱియు నీ విషయ

మొక యనుమానప్రమాణమునే యవలంబించి యుండలేదు. ఇఁక నేమన: బౌద్ధులయొక్క మొదటి సన్న్యాస మార్గమునందు మహాయానపంథచేఁ జేయఁబడిన కర్మయోగపరమగు సిద్ధాంతము మహాయానపంథకు ప్రముఖపురస్కర్తయైన నాగార్జునునకు గురువగు రాహులభద్రునకు మొదటఁ దోఁచుటకు 'జ్ఞానియగు శ్రీకృష్ణుఁడును, గణేశుఁడును' కారణభూతు లైరని తారానాథ మను పేరు గల్గి టిబెట్ భాషలో నున్న బౌద్ధధర్మీయుల బౌద్ధధర్మములయొక్క యితిహాసమున వ్రాయఁబడినది. ఈ గ్రంథము రష్యనుభాషలో నుండి జర్మను భాషకు భాషాంతరీకరణము గావింపఁబడినది. ఇంగ్లీషుభాషలో లేదు. దాని భాషాంతరీకరణమును డా. కెర్న్ అనువానిచే 1896 సంవత్సరమున వ్రాయఁబడిన బుద్ధధర్మములను బోధించు గ్రంథమునుండి గ్రహించితిని. • ఇచ్చట శ్రీకృష్ణుఁ డను పేరుచేత భగవద్గీతయే యుల్లేఖింపఁబడినదని డా. కెర్న్ చెప్పుచున్నాఁడు. మహాయానపంథయందలి బౌద్ధగ్రంథములలో 'సద్ధర్మపుండరీక' మనుపేరు గల గ్రంథమునందును భగవద్గీతలయందున్న శ్లోకములవంటి కొన్నిశ్లోకములు గలవు; కాని దీనియొక్కయు, నితర విషయములయొక్కయు విచారము రాబోఁవు ప్రకరణభాగమునఁ జేయఁబడియున్నది. మూల బౌద్ధధర్మములు సన్న్యాసపరములై యుండ, దానియందు భక్తిపరమును, కర్మపరమును నగు మహాయానపంథ బయలు వెడలుటకు భగవద్గీత కారణమైనదని బౌద్ధగ్రంథకారులే చెప్పిరి. అశ్వఘోషుని యొక్క కావ్యమున నున్న విషయమునకును, గీతలయందున్న విషయమునకును నిరూపింపఁబడిన సామ్యమునుబట్టియు, దానికి ప్రాబల్యము వచ్చునని మాత్రమే యిచ్చోఁ జెప్పవలసియున్నది. మహా

• See Dr. Kern's Manual of Indian Buddhism, Grundriss, III 8 p. 122. మహాయానపంథయొక్క 'అమితాయుసుత్త' యని పేరు గలిగిన ముఖ్యగ్రంథము చీనాభాషలో ఇ.శ. 148 సుమారున భాషాంతరీకరణము గావిం

యానపంథకు ప్రథమపురస్కర్తయైన నాగార్జునుఁడు శకమునకు సుమారు నూఱు, నూటయేఁబది సంవత్సరములు పూర్వమున పుట్టి యుండునని పాశ్చాత్యపండితులు నిశ్చయించిరి. ఈ మహాయాన మార్గమునకు బీజారోపణ మశోకుని రాజ్యకాలమున నై యుండవల యునని స్పష్ట మగుచున్నది. అనఁగా: భగవద్గీత మహాయానబౌద్ధ పంథ బయలువెడలుటకంటె పూర్వమున_ వే యేల? అశోకునికంటె పూర్వమందే అనఁగా: క్రీస్తుకు పూర్వమున మూఁడు శతాబ్దములనాఁ డైనను బుట్టి యుండవలయునని బౌద్ధగ్రంథములను బట్టియు, బౌద్ధ గ్రంథకారులు స్వయముగ వ్రాసిన బౌద్ధగ్రంథముల యితిహాసమును బట్టియు పూర్ణముగ సిద్ధ మగును.

పైన చెప్పిన ప్రమాణముల నన్నిటిని విచారించితిమేని ప్రస్తుత మందున్న భగవద్గీత, శకమునకు పూర్వ మైదు శతాబ్దములనాఁడు పుట్టియుండిన దను విషయమై యే విధమగు సంశయము నుండదు. డా. భాండారుకరు, కై. తెలంగు, రా. బ. చింతామణిరావు వైద్య, కై. దీక్షితులు నను వారియొక్క మతము చాలవఱకిటు లే యున్న దనియు, నదియే యీ ప్రకరణమున గ్రాహ్యమనియు జెప్పవలయును ప్రొ. గార్బేయొక్క మతము మాత్రము వేఱు. దాని కాధారమగు గీతయందలి నాల్గవ యధ్యాయమునందున్న సంప్రదాయపరంపరను దెలుపు శ్లోకములోనే "యోగో నష్టః"_ అనఁగా: యోగము నశించి నది అను వాక్యమును గైకొని యిచ్చో యోగశబ్దార్థము "పాతంజల యోగ'మని చెప్పెను; కాని, యోగ శబ్దమున కచ్చో పాతంజల యోగ మని యర్థము కాదు. 'కర్మయోగమే' యర్థమని నేను పూర్వ మందే సప్రమాణముగ నిరూపించితిని. కావున ప్రొ. గార్బేయొక్క మతము తప్పును నగ్రాహ్యమునై యున్నది. ఇప్పటి గీతలయొక్క కాలము శకకాలమునకు పూర్వమందు నైదు శతాబ్దములకంటెను

నవీన మనుటకు సాధ్యము కాదని నిర్వివాదమై యున్నది. మూలగీత దీనికంటె సైతము కొన్ని శతాబ్దములైనను తప్పక ప్రాచీనమైనదిగ నుండవలయునని వెనుకటి ప్రకరణములోఁ జెప్పఁబడినది.

---

## 6. గీత - బౌద్ధగ్రంథములు

ఇప్పుడున్న గీతకాలమును నిశ్చయించుటకు దృష్టాంతముగ నీయఁబడిన బౌద్ధగ్రంథముల మహిమ తెలియుటకై గీతయొక్కయు, బౌద్ధంథములయొక్కయు, లేక, బౌద్ధగ్రధర్మములయొక్కయు సామాన్యమగు సాదృశ్యవైదృశ్యముల నిచ్చో విచారించుట కొంతయావశ్యకము. గీతలయందుఁ జెప్పఁబడిన స్థితప్రజ్ఞుఁను, ప్రవృత్తిమార్గములో నుండుటయే గీతాధర్మముల యందలి విశేష మని పూర్వమున ననేక పర్యాయములు చెప్పఁబడినది; కాని యీ విశేషసుగుణమును క్షణమాత్ర మొకప్రక్క నునిచి యట్టి పురుషుని మానసికములును, నైసర్గికములు నైన సుగుణములనే విచారించినచో గీతయందు వర్ణింపఁబడిన స్థితప్రజ్ఞునియొక్కయు (గీ. 2.55-72), బ్రహ్మనిష్ఠుఁడగు పురుషునియొక్కయు (4. 19-23; 5. 18-28), భక్తియోగియొక్కయు (12.13-19) లక్షణములయందును, నిర్వాణపదమున కధికారి యగు నర్హతునియొక్కయు, అనఁగా: పూర్ణావస్థను బొందిన బౌద్ధభిక్షువుయొక్కయు వేర్వేఱగు బౌద్ధగ్రంథములయందుఁ జెప్పఁబడిన లక్షణములయందును విలక్షణమైన సామ్య మున్నట్లు కన్పట్టుచున్నది. (ధమ్మపద. శ్లో. 360-423 మఱియు సుత్తనిపాతలలో మునిసుత్తను, ధమ్మికసుత్తను చూడు). వే యేల? స్థితప్రజ్ఞునివలెనే సత్యమగు భిక్షువు 'శాంతుఁడును', 'నిష్కాముఁడును', 'నిర్మముఁడును', 'నిరాశియు' (నిరిస్సిత), 'సమదుఃఖసుఖుఁడును', 'నిరారంభుఁడును', 'అనికేతనుఁడును', లేక, 'అనివేశనుఁడును', లేక, 'సమనిందాస్తుతియు',

'మానావమానములును, లాభాలాభములును సమములైన వానిగ నెన్నువాఁడును'నై యుండునని యీ వర్ణనంబట్టియు, గొంచెము శబ్దసామ్యముంబట్టియు స్పష్టమగుచున్నది (ధమ్మపద. 40, 41 మఱియు 91; సుత్తని. మునిసుత్త 1. 7 మఱియు 14; ద్వయతానుపస్సన సుత్త. 21-23; మఱియు వినయపిటకచుల్లవగ్గ. 7. 4. 7 చూడు). జ్ఞానికి ప్రకాశముగఁ దోఁచునదియే యజ్ఞాని కంధకారముగఁ దోఁచును. "యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ" (గీ.2.69) ఈ విచారము ద్వయతానుపస్సన సుత్తయందలి 40-వ శ్లోకమునందును, "అరోసనేయ్యో న రోసేతి"- అనఁగా: తాను త్రాసమును బొందఁడు, లోకులను సైతము త్రాసమును జెందింపఁడు అని గీతలయందున్న "యస్మాన్నోద్విజతే లోకో లోకా న్నోద్విజతే చ యః" (గీ. 12. 15) అను వర్ణనతో సమానమగు వర్ణనమును, మునిసుత్తయందు 10-వ శ్లోకమునఁ జెప్పఁబడినది. అటులే సల్లసుత్తయందు "పుట్టినవా రెల్లరు గిట్టుదురు" అనియు, లేక, "భూతములయొక్క యాదియు నంతమును నవ్యక్తము గాన దానిని గుఱించి శోకించుట వ్యర్థ"మనియు(సల్లసుత్త 1 మఱియు 9; మఱియు గీ. 2.27 మఱియు 28) మొదలగు గీతలయందలి విచారమే కొంచెము శబ్దభేదముతో స్పష్టమగుచున్నది. మఱియు గీతలయందలి దశమాధ్యాయమునందును, అనుగీతలయందును (మ.భా.అశ్వ. 43, 44) "జ్యోతిష్మంతులలో సూర్యుఁడను, నక్షత్రములలో చంద్రుఁడను, వేదమంత్రములలో 'గాయత్రిని' అను మొదలగు వర్ణనయంతయు నా విధముననే సేలసుత్తయొక్క 21, 22 శ్లోకములయందును మఱియు మహావగ్గ. 6.35.8 అను గ్రంథమునందును వేయఁబడియున్నది. ఇంకను పెక్కు శబ్దసాదృశ్యములును, నర్థసాదృశ్యములును, కై. తెలంగనువారిచే రచింపఁబడిన గీతలయొక్క యింగ్లీషు భాషాంతరముతోఁ జేర్చిన టిప్పణిలో నిరూపింపఁబడినవి. అయిన నీ సాదృశ్య మిటు లేల

యుత్పన్న మాయె? ననియు, నీ విచారము మొదట బౌద్ధము లోనిదా? లేక, వైదికధర్మములోనిదా? యనియు, దానినిబట్టి యేమని యూహింపవలయు? ననియు, నిటులే యనేక విధముల బయలు వెడలువిషయములను నిర్ణయించుట కప్పుడున్న సాధనములు చాలని వగుటచే పైనఁ జెప్పిన చమత్కారకారకమగు శబ్దసాదృశ్య మును, నర్థసాదృశ్యమును నిరూపించుటకంటె, కై. తెలంగుగా రీ విషయములో విశేష మేమియు వ్రాయలేదు; కాని యిప్పుడున్న బౌద్ధ ధర్మముల విషయమై కలిగిన విశేషజ్ఞానమునుబట్టి యీ ప్రశ్న ముయొక్క నిశ్చయము సమన్వయించును. కావున బౌద్ధధర్మముల యొక్క, యీ జ్ఞానము నిచ్చో సంక్షేపముగఁ జెప్పుచున్నాను. కై. తెలంగుగారు సేసిన యింగ్లీషు భాషాంతరమున ప్రకటింపఁబడిన "ప్రాచ్యధర్మగ్రంథమాల" యందే పిదప ప్రాచ్యవిద్వాంసులచేఁ బ్రకటింపఁబడిన యింగ్లీషు భాషాంతరములను బట్టి చాలవఱకు జ్ఞానము సంగ్రహింపఁబడినది. ప్రమాణార్థమై చూపింపఁబడిన బౌద్ధ గ్రంథములయొక్క స్థలనిర్దేశము సైత మీ మాలయందున్న భాషాం తరముల ననుసరించియే యున్నది. కొన్నిస్థలములయందున్న పాలీ భాషయందలి శబ్దములు గాని, వాక్యములు గాని, పాలీభాషలోని మూలగ్రంథములనుబట్టి వ్రాయఁబడినవి.

జైనధర్మములవలె బౌద్ధధర్మములును వైదికధర్మములును తండ్రియందుండి తనకు కావలసినంత సంపత్తును పంచుకొని, కారణాంతరముచే వేఱున్న కొమారునివలె నున్నవి. అనఁగా: అవి పరకీయములు కావనియు, తత్పూర్వమందున్న బ్రాహ్మణధర్మముల యందే యుత్పన్నమైన యొక శాఖలోనివే యనియు నీ విషయము నిస్సంశయముగ సిద్ధమైనది. సిలోను, బేటూలో నున్న మహావంశ, లేక, దీపవంసాది ప్రాచీన పాలీ గ్రంథములయందున్న బుద్ధుని తర్వాత రాజ్యమేలిన రాజులయొక్కయు బౌద్ధాచార్యుల పరంపర

యొక్కయు వర్ణనను బట్టి లెక్కించి చూచితి మేని గౌతమబుద్ధుఁడు 80 సంవత్సరముల వయస్సు గలవాఁడై క్రీస్తుశకమునకు పూర్వము 543-వ సంవత్సరమున మరణమును బొందినట్లు నిష్పన్నమగు చున్నది; కాని వీనిలో కొన్ని విషయము లసంబద్ధములై యున్నవి. కారణ మేమన: ప్రొ. మాక్సుముల్లరను నతఁడీ గణితమును సూక్ష్మ ముగఁ జర్చించి బుద్ధునియొక్క సత్యమైన నిర్వాణకాలము క్రీ. పూ. 473 సంవత్సరములై యుండునని చెప్పెను. డా. బుల్హార్ అను నాతఁ డా కాలమే యశోకునియొక్క శిలాశాసనమునుబట్టి సిద్ధ మగునని నిరూపించెను. అయినను ప్రొ. హిస్ డేవిడ్స్, లేక, డా. కెర్న్ మొదలగు పండితు లీ కాలమందు వీరికంటె 66 లేక, 100 సంవత్సర ములు నవీన మనవలయునని చెప్పుచున్నారు. మఱియు ప్రొ. గాయ గర్ అను నతఁడీ మతముల నన్నిటిని పరీక్షించి క్రీస్తుశకముకంటె పూర్వము 483 సంవత్సరములే బుద్ధుని సత్యమైన నిర్వాణకాల మని నిశ్చయించెను. * వీనిలో నే కాలమును స్వీకరించినను బుద్ధుఁడు జన్మించుటకంటె పూర్వమునందే వైదికధర్మములు పూర్ణావస్థను బొందిన వనియు, నుపనిషత్తులే కాక ధర్మసూత్రములవంటి గ్రంథ ములును తత్పూర్వమునందే కలవనియు నిర్వివాదముగ సిద్ధమగును.

కారణ మేమన: పాలీభాషయందున్న ప్రాచీనములగు బౌద్ధ ధర్మగ్రంథములలోనే, "నాలుగు వేదములును, వేదాంగములును, వ్యాకరణము, జ్యోతిషము, ఇతిహాసము, నిఘంటువు" మొదలగు

---

* బుద్ధునియొక్క నిర్వాణకాలవిషయమై ప్రొ. మాక్సుముల్లరుచేఁ జేయఁ బడిన ధమ్మపదముయొక్క అంగ్లభాషాంతరీకరణపుభూమికలో (S. B. E. Vol. Intro. pp. xxxv—xlv) వ్రాయఁబడినది. డా. గాయగ రనువానిచే 1912 వం వత్సరము ప్రచురింపఁబడిన తన మహావంశముయొక్క భాషాంతరీకరణము యొక్క ప్రస్తావనలో చేయఁబడిన యా గ్రంథముయొక్క పరీక్షణమును చూడుఁడు. (The Mahavamsa by Dr. Geiger, Pali Text Society. Intro

విషయములయందు పారంగతుఁడగు నొక సత్యశీలుఁడైన బ్రాహ్మణ గృహస్థు, లేక, జటిలుఁడగు తపస్వి మొదలగు వారితో గౌతమ బుద్ధుఁడు స్వపక్షమును గుఱించి వాదించుచు వారికి తన ధర్మముల యందలి దీక్ష నిచ్చినాఁడని చెప్పఁబడినది (సుత్తనిపాతలలో, సేల సుత్తయందున్న సేలయొక్క వర్ణనమును, వత్థుగాథను 30-45 చూడు) మఱియు కఠాద్యుపనిషత్తులయందును (కఠ. 1.18; ముండ. 1. 2. 10), అటులే గీతలయందును (2. 40. 45; 9. 20. 21) యజ్ఞ యాగాదిశ్రౌతకర్మలకు న్యూనత చెప్పఁబడినట్లే, తేవిజ్జసుత్తయంద (త్రైవిద్యసూత్రమునందు) సైతము బుద్ధుఁడు యజ్ఞయాగాదు లఃః యోగము లేని వనియు, త్యాజ్యము లనియు నిశ్చయించి బ్రాహ్మణ నకు 'బ్రహ్మసహవ్యతాయ' (బ్రహ్మసహవ్యత్యయ=బ్రహ్మసాయు జ్యత) యని చెప్పునవస్థ యెట్లు ప్రాప్త మగునదియుఁ, దన మతము ననుసరించి చక్కగ నిరూపించెను. బ్రాహ్మణధర్మములయందున్న కర్మకాండమును, జ్ఞానకాండమును- లేక, గార్హస్థ్యధర్మమును, సన్న్యాసమును, అనఁగా: ప్రవృత్తియు నివృత్తియు అను రెండు శాఖలను పూర్ణముగ రూఢము లైనపిదప వానిని సుధారణచేయుట కొఱకై బౌద్ధధర్మములు వెలువడినవని వీనివలన స్పష్ట మగును. సుధారణ యనః వానియందు పూర్వమందున్న కొన్నివిషయము లను స్థిరపఱచుటయు, మఱికొన్నిటిని మార్చుటయు నని సామాన్య నియమము కావున, నీ విధమున విచారింప బౌద్ధధర్మములయంద వైదికధర్మములయందున్న యే యే విషయములు స్థిరపఱుపఁబడి నదియు, ఏవేవి వదలఁబడినదియు నిపుడు విచారింతము. ఈ విచా రము గార్హస్థ్యధర్మము, సన్న్యాసము నను రెండు దృష్టులతోఁ జేయ వలయును; కాని బౌద్ధధర్మములు మొట్టమొదట సన్న్యాసమార్గము లోనివే (అనఁగా: నివృత్తిపరములైనవియే) యగుటచే రెండు విధములగుండ సన్న్యాసధర్మములను విచారించి, రెండువిధములను గార్హస్థ్యధర్మములయొక్క తారతమ్యమును విచారింతము.

వైదికసన్న్యాస ధర్మములను జూచితి మేని కర్మమయమగు సృష్టియందున్న వ్యవహారము లన్నియు తృష్ణామూలకములు గావు ననే దుఃఖమయము లగును. దానిలోనుండి (అనఁగా: జననమరణము లను భవచక్రములో నుండి) యాత్మకు సరియైన విముక్తి కలుగుటకు మనస్సును నిష్కామమును విరక్తమును జేసి దానిని దృశ్యసృష్టికి మూలకారణమును, నాత్మస్వరూపియు, నిత్యము నైన పరబ్రహ్మమందు స్థిరముగ నిలుపుటయు, సాంసారికకర్మలను బొత్తిగ వదలి యీ యాత్మనిష్ఠయందే యెప్పుడును నిమగ్నుఁడై యుండుటయు ననునవి దానియందలి ముఖ్యసిద్ధాంతములు. వీనిలో దృశ్యసృష్టి నామ రూపాత్మకము, నశ్వరమునునై యున్నది. దాని యఖండవ్యాపారము కర్మవిపాకానుసారముగ నడచుచున్నది.

కమ్మనా వత్తతీ లోకో కమ్మనా వత్తతీ పజా (ప్రజా),
కమ్మనిబంధనా సత్తా (సత్త్వాని) రథస్సాఽణీవ యాయతో.

సుత్తని. వాసేఠ సుత్త. 61.

— కర్మచేతనే లోకములయొక్కయు ప్రజలయొక్కయు ప్రవృత్తి జరుగుచున్నది, బండి యిరుసు ననుసరించునట్లు ప్రతిప్రాణియు కర్మచే బద్ధమై యున్నది అని వైదికధర్మీయమగు జ్ఞానకాండమందున్న సిద్ధాంతము. వేయేల? జననమరణప్రవాహమును బ్రహ్మదేవుఁడు, ఇంద్రుఁడు, మహేశ్వరుఁడు, ఈశ్వరుఁడు, యముఁడు మొదలగు వేదముచే బోధింపఁబడు దేవతలను, నా యీ దేవతలయొక్క స్వర్గాది కములు గాని పాతాళాదికములు గాని యగు లోకములను, బ్రాహ్మణ ధర్మములయందు చెప్పఁబడిన వీనియొక్క యస్తిత్వమును సైతము బుద్ధుఁ డొప్పుకొనియే యుండెను. కావుననే, నామరూపములు, కర్మవిపాకము, అవిద్య, ఉపాదానము, ప్రకృతి మొదలగు సాంఖ్య వేదాంతశాస్త్రములయందున్న శబ్దములును, బ్రహ్మ మొదలుగాఁ గల వేదచోదితలగు దేవతల కథలును (బుద్ధునియొక్క శ్రేష్ఠత్వమును

స్థాపించుచునే) ఏ మాత్రమో భేదముతో బౌద్ధగ్రంథములయం దన్ని దిక్కులను చెప్పఁబడినవి. దృశ్యసృష్టి నశ్వరము, అనిత్యముననియు, దాని వ్యవహారము కర్మవిపాకమునుబట్టి నడచు చున్నదనియు, కర్మసంబంధములోని వైదికధర్మములయం దున్న సిద్ధాంతములు బుద్ధునికి మాన్యము లైనను, నామరూపాత్మక నశ్వరసృష్టియొక్క యారంభమునందు నామరూపవ్యతిరిక్తమును నాత్మస్వరూపము నగు పరబ్రహ్మమువంటి యొక నిత్యమును సర్వవ్యాపకమును నగు వస్తువు కలదను వైదికధర్మములయొక్క, అనఁగా: ఉపనిషత్కారులయొక్క సిద్ధాంతము మాత్రము బుద్ధునకు సమ్మతము కాదు. ఇదియే యీ రెండు ధర్మములయందున్న గొప్ప భేదము. ఆత్మ, లేక, బ్రహ్మము వాస్తవికము కాదనియు, భ్రమ యనియు, ఆత్మానాత్మవిచారము, లేక, బ్రహ్మచింతన మను భ్రమలో పడి యెవరును తమ కాలమును వ్యర్థము చేయరాదనియు గౌతమ బుద్ధుఁడు స్పష్టముగఁ జెప్పెను (సబ్బాసవసుత్త. 9·13 చూడు). బుద్ధుఁ డే విధముననను నాత్మ కలదని యొప్పుకొనఁడని దీఘనికాయములలోని బ్రహ్మజాలసుత్తలను బట్టియు స్పష్ట మగును. * ఆత్మయు బ్రహ్మము నను నవి యొక పదార్థమా? వేర్వేఱు పదార్థములా? యనునవి మొదలగు 62 విధములైన పూర్వ పక్షములను చేసి, యివి యన్నియు మిథ్యాదృష్టిలోనివే యని యీ సుత్తయందు చెప్పఁబడినది. మఱియు, మిళిందప్రశ్నమునందును బౌద్ధధర్మములయందువలెనే యాత్మ యను నొక సత్యమైన వస్తువులే దని నాగసేనుఁడు గ్రీకు దేశస్థుఁడగు మిళిందునకు (మినాండరునకు) స్పష్టముగఁ జెప్పెనని యున్నది. (మి.ప్ర. 2.36 మఱియు 2.7.15) ఆత్మయు, బ్రహ్మము రెండును భ్రమలే, సత్యములు కావు. అని

---

* బ్రహ్మజాలసుత్త ఇంగ్లీషులోనికి భాషాంతరము చేయఁబడలేదు; కాని దాని క్లుప్తమగు వివేచనము 'ర్హీస్‌డేవిడ్స్' అను వానిచే S.B.E. Vol. XXVI. Intro. pp. xxiii—xxv లో వ్రాయఁబడినది, చూడుము.

యొప్పుకొనిన యెడల ధర్మము బొత్తిగా నశించియే పోవును. కారణ మేమన: మిగిలిన వన్నియు ననిత్యములే కాన, నిత్యసుఖ మనునది గాని, దాని యనుభవము గలవాఁడు గాని యుండరు. ఈ కారణముచేతనే, శ్రీశంకరాచార్యు లీ మతము తర్కశాస్త్రమువలె నైనను గ్రాహ్యము కాదని సిద్ధాంతము చేసిరి; కాని తొంటియందే బౌద్ధ ధర్మము లుండినవి యని మాత్రమే యిప్పుడు విచారించుచుంటిమి గాన, ఈ వాదము నిచ్చో విస్తరింపక బుద్ధుఁడు తన ధర్మమున కేమి యుపపత్తిని జెప్పెనో చూతము. ఆత్మయొక్క యస్తిత్వము బుద్ధుఁ డొప్పుకొనక పోయినను 1. కర్మవిపాకమునుబట్టి నామరూపాత్మక మగు దేహము (ఆత్మ కాదు) నశ్వరమైన జగత్తునందు పలుమారు జనన మొందవలసి వచ్చుననియు, 2. ఈ పునర్జన్మచక్రమునుండి (అనఁగా: మొత్తముమీఁద సంసారమే దుఃఖమయ మగుటచే దాని నుండి) తప్పించుకొని స్థిరమగు శాంతిని, లేక, సుఖమును పొందుట యావశ్యక మనియు, ఈ రెండువిషయములను మాత్రము బుద్ధుఁడు పూర్తిగ నొప్పుకొనెను. సాంసారికదుఃఖము లున్నవనియు, వాని నవశ్యము నిరాకరింపవలయుననియు నొప్పుకొనె నేని, యీ దుఃఖమును నివారించుకొని యత్యంతసుఖమును పొందుటకు మార్గమేమి? యని వైదికధర్మముల యందున్న ప్రశ్న మరల రాఁగలదు. కావున దానికి తగిన సమాధానము చెప్పితీరవలయును. యజ్ఞయాగాది కర్మలచే భవచక్రమునుండి విముక్తి కాదని యుపనిషత్కారులే చెప్పి యున్నారు. బుద్ధుఁ డంతకంటెను నెక్కువగ విచారించి యా కర్మ లన్నియు హింసాత్మకములు గాన, బొత్తిగ వదలివేయఁ దగిన వనియు, నిషిద్ధము లనియుఁ జెప్పెను. అటులే 'బ్రహ్మ' మను నదియు నొక భ్రమయే, యనునెడల దుఃఖనివారణార్థమై చెప్పఁ బడిన బ్రహ్మజ్ఞాన మను మార్గమును సైతము భ్రాంతికారకమును, నసంభవమును నగును; కాని దుఃఖమయమగు సంసారచక్రము నుండి విముక్తిఁ జెందుటకు బుద్ధుఁ డే యుపాయమును జెప్ప నన:

ఏ రోగమైనను నివారించుటకు దానికి మూల మేదియో విచారించి నిశ్చయించి దానిని తొలఁగించుటకు మంచివైద్యుఁడు ప్రయత్నించు నట్టుల, సాంసారిక దుఃఖములను రోగములను నివారణ చేయుటకు 3. దానికి కారణ మేమియో తెలిసికొని, 4. యా కారణమే దేనివలన సమూలముగ నశించునో యట్టి మార్గమును నేర్పరియగు పురుషుఁడు స్వీకరింపవలయును. కారణములను విచారించుట కారంభించితిమేని, తృష్ణ, లేక, వాసన యనునదియే యీ జగత్తునందున్న సర్వదుఃఖ ములకు మూలము; గావున నొక నామరూపాత్మకమగు దేహము నశించిన పిదప, మిగిలి యున్న యీ వాసనాత్మక బీజమునుండియే మఱియొక నామరూపాత్మకమైన దేహము పలుమారు పుట్టుచుండు నట్లు కాన్పించును. మఱియు పునర్జన్మమనెడు దుఃఖమయమగు సంసారము నుండి విముక్తుఁ డగుట కింద్రియ నిగ్రహముచేతను, ధ్యానముచేతను, వైరాగ్యముచేతను, తృష్ణ పూర్ణముగ నశించిన పిదప సన్న్యాసి, లేక, భిక్షువుగ మాఱుట యనునదియే యొక సత్యమగు మార్గమనియు, ఈ వైరాగ్యయుక్తమగు సన్న్యాసముచేతనే స్థిరమగు శాంతిసుఖము సైతము ప్రాప్త మగుననియు బుద్ధుఁడు చెప్పెను. అనఁగా: యజ్ఞయాగాదులు, లేక, ఆత్మానాత్మవిచారము నను నల్లరిలో పడక సాంసారిక దుఃఖము లున్న వనుట, వానికి కారణము. వానిని నిరోధించుట, లేక, నివారించుట యందలి యావశ్యకత, వానిని సమూలముగ నశింపఁ జేయు వైరాగ్యరూప మగు సాధనము లేక, బౌద్ధపరిభాషానుసారముగ ననుక్రమముగ దుఃఖము, సముదయము, నిరోధము, మార్గము— అను నాలుగు దృశ్యవిషయముల మీఁదనే బౌద్ధధర్మము లను కట్టడము కట్టఁబడి యున్నదని తాత్పర్యము. తమ ధర్మములయందలి యీ నాలుగు మూలభూతములగు తత్త్వములకే 'ఆర్యసత్యము' లని బుద్ధుఁడు పేరిడెను. ఉపనిషత్తులయందున్న యాత్మజ్ఞానమునకు మారుగ

నాలు గార్యసత్యములను దృశ్యములగు పుట్టుకీట్లమీఁదనే బౌద్ధధర్మములు నిర్మింపఁబడిన వైనను, స్థిరమగు శాంతిని, లేక, సుఖమును బొందుటకు తృష్ణను, లేక, వాసనను క్షీణింపఁజేసికొని మనస్సును నిష్కామముగఁ జేసికొనవలయునని బుద్ధుఁ డుపదేశించిన మార్గమును (నాల్గవసత్యము), మోక్షప్రాప్త్యర్థమై యుపనిషత్తులయందుఁ జెప్పఁబడిన మార్గము నను నీ రెండును నిజముగ విచారించిన వేఱు కావు. రెండుధర్మములయందును మనస్సుయొక్క నిర్విషయస్థితియే తుదకు దృశ్యమైన సాధ్యముగ నున్నదని స్పష్ట మగుచున్నది; కాని బ్రహ్మము నాత్మయు నొకటే యను నుపనిషత్కారులు, మనస్సుయొక్క యీ నిష్కామావస్థనే 'ఆత్మనిష్ఠ', 'బ్రహ్మసంస్థ', 'బ్రహ్మభూతత', 'బ్రహ్మనిర్వాణము' (గీ. 5. 17-26; ఛాం. 2. 23. 1) అనఁగా: బ్రహ్మమం దాత్మయొక్క లయమును చేసికొనుట యని, కడపటియవస్థకు పేరు పెట్టుచున్నారు. బుద్ధుఁడు దానికి 'నిర్వాణ' మని మాత్రమే, అనఁగా: "విరామమును బొందుట, లేక, దీప మారిపోయినట్లు వాసనలు నశించుట" యని మాత్రమే క్రియాదర్శకమగు పేరును పెట్టుచున్నాఁడు. ఇదియే యీ రెండుధర్మములయందును గల భేదము. కారణమేమన: బ్రహ్మము. లేక, ఆత్మ యనునది భ్రమ యని చెప్పిన పిదప 'విరామ' మన నేమి? యనియు, అది యెటులు లభ్యమగుననియు నడుగ నక్కఱ లేదు (సుత్తనిపాతలలో రతనసుత్త 13 మఱియు వంగీససుత్త 12 మఱియు 13 చూడు); మఱియు నేర్పరియగు పురుషుఁ డీ గూఢమగు విషయమును విచారించుచు కాలయాపన చేయఁగూడదని బుద్ధుఁడే స్పష్టముగఁ జెప్పెను (సబ్బాసవసుత్త. 9-13 మఱియు మిళిందప్రశ్న 4.2.4 మఱియు 5 చూడు). ఈ స్థితిని పొందినపిదప మఱియొక దేహము ప్రాప్త మగు నను సామాన్యక్రియకు సంబంధించిన 'మరణ' మను శబ్దము బౌద్ధధర్మానుసారముగ సైతము నిర్వాణ మను నర్థమునఁ బ్రయోగింప కూడదు. నిర్వాణ మనునది మరణమాత్రమే కాదు; "మరణము

యొక్క మరణము," లేక, యుపనిషత్తులలో చెప్పినటుల "మృత్యువును దాఁటుటకుఁ గలమార్గము". ఏ మనుజుఁడైన నీ స్థితిని పొందెనేని వానికి సర్పముచే వదలి వేయఁబడిన కుబుసముపై నా సర్పమునకు మమకార ముండనటులే, తన శరీర మను నూహయైన నుండదని బృహదారణ్యకోపనిషత్తులో (4. 4. 7) నీయఁబడిన దృష్టాంతము నిజమైన బౌద్ధభిక్షువులు సెప్పుచు సుత్తనిపాతయందున్న ఉరగసుత్తయందలి యోగములో స్వీకరించిరి. మఱియు నాత్మనిష్ఠుఁడైన పురుషుఁడు పాపపుణ్యములచే నెప్పుడును లిప్తుఁడు కాఁడనియు (బృ. 4.4.23), మాతృవధ పితృవధలవంటిపాపములు సైత మంటవనియు నున్న వైదికధర్మములయందలి తత్త్వము సైతము (కౌషీ. బ్రా. 3.1) ధమ్మపదమం దాశబ్దములతోఁ గూడ నున్నదని చెప్పఁబడినది (ధమ్మ. 294 మఱియు 295 మఱియు మిళిందప్రశ్న 4.5.7 చూడు). బ్రహ్మముయొక్కయు, నాత్మయొక్కయు నస్తిత్వమును బుద్ధుఁ డొప్పుకొనక పోయినను, మనస్సును శాంతముగను, విరక్తముగను, నిష్కామముగను చేయుట మొదలగు నుపనిషత్తులలోఁ జెప్పఁబడిన మోక్షప్రాప్తి సాధనములే బుద్ధుని మతమున నిర్వాణప్రాప్తికి నావశ్యకములగుటచే బౌద్ధయతులయొక్కయు, వైదికసన్న్యాసులయొక్కయు వర్ణనలు మానసికస్థితినిబట్టి యొకరీతిగనే యున్నవనియు, దానిఁబట్టి పాపపుణ్యములయొక్క బాధ్యతవిషయమునుగాని జన్మమరణముల విషయమునఁగాని వైదిక సన్న్యాసధర్మములయందున్న సిద్ధాంతములే బౌద్ధధర్మములయందును స్థిరములగుచున్న వనియు సారాంశము. కాని, వైదికధర్మములు గౌతమ బుద్ధునికంటె ప్రాచీనము లగుటచే నీ విచారము తొల్లిటినుండియు వైదికధర్మములలోనిదే యై యున్నదను విషయమున సందేహ మేమియు లేదు.

వైదికములును బౌద్ధములు నైన సన్న్యాసధర్మముల యందలి భేదాభేదములు చెప్పఁబడినవి. ఇప్పుడు గార్హస్థ్యధర్మములను బుద్ధుఁ

డెటుల చెప్పెనో విచారింతము. ఆత్మానాత్మ విచారముయొక్క, తత్త్వజ్ఞానమును గొప్పదనక సాంసారిక దుఃఖములయొక్క యస్తిత్వము మొదలగు దృశ్యమగు నాధారముమీఁదనే బౌద్ధధర్మము లను కట్టడము కట్టఁబడిన దైనను కాంటువంటి యాధునిక పాశ్చాత్య పండితునియొక్క కేవ లాధిభౌతికధర్మములవలెఁ గాని, లేక, గీతాధర్మములవలెను గాని-బౌద్ధధర్మములు ముందునుండి ప్రవృత్తిపరములు గావని యెఱుంగవలయును. ఉపనిషత్తులయందున్న యాత్మజ్ఞానమువంటి సిద్ధాంతమును బుద్ధుఁ డొప్పికొనని మాట సత్యమే; కాని సంసారమును బొత్తిగ వదలి, మనస్సును నిర్విషయముగను, నిష్కామముగను చేయుటయే మనుష్యున కీ జగత్తున పరమకర్తవ్యమను బృహదారణ్యకోపనిషత్తు నందలి యాజ్ఞవల్క్యుని సిద్ధాంతము (బృ. 4. 4. 6) బౌద్ధధర్మముల యందును కలదు గాన, బౌద్ధధర్మములు తొల్లిటినుండియు సన్న్యాసపరములే యై యున్నవి. సంసారమును వదలివైవక గృహస్థాశ్రమమునందే యుండుట వలన పరమసుఖము, లేక, యర్హతావస్థ యెప్పుడును సంభవింపదని బుద్ధునియొక్క యుపదేశముల కన్నింటికి తాత్పర్యము. అయినను దానియందు గార్హస్థ్యధర్మము బొత్తిగ వివేచింపఁబడక పోలేదు. సన్న్యాసమును గ్రహింపకుండనే, బుద్ధుఁడు బుద్ధునియొక్క ధర్మము, బౌద్ధభిక్షువులయొక్క సంఘము, (అనఁగా: మేళాలు లేక గుంపులు) నను నీ మూఁటియందును విశ్వాసమునుంచి "బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి" అని సంకల్పము చెప్పి యీ మూఁడింటిని శరణుఁజొచ్చు లోకులకు బౌద్ధగ్రంథములలో నుపాసకులని పేరిడిరి. ఇతఁడే బౌద్ధమతమున గృహస్థుఁ డనఁబడవలయును. ఈ యుపాసకులు తమ గార్హస్థ్యము నెట్లు జరుపవలయునను విషయమై సందర్భము వచ్చినప్పుడు బుద్ధుఁడే యక్కడ యుపదేశించెను(మహాపరినిబ్బాణసుత్త 1.24). వైదికములైన గార్హస్థ్యధర్మములలో హింసాత్మకములగు శ్రౌతయజ్ఞయాగములు, చాతుర్వర్ణ్య

భేదమును బుద్ధునకు సమ్మతములు కావు స్మార్తపంచమహాయజ్ఞ ములను, దానాదిపరోపకారధర్మములను జెప్పుచు బౌద్ధధర్మగ్రంథము లయందీ విషయము మాత్ర ముల్లేఖింపఁబడినది. పంచమహాయజ్ఞ ములు ప్రతి గృహస్థునిచేత (అనఁగా: ఉపాసకునిచేతను) నాచరింపఁ బడవలయునని బుద్ధుఁడు చెప్పెను. అహింస, సత్యము, అస్తేయము, సర్వభూతదయయు (ఆత్మ, సమ్మతము కాకపోయినను) ఆత్మౌపమ్య దృష్టియు, శౌచమును, లేక, మనఃపూతతయు, సత్పాత్రదానము (అనఁగా: బౌద్ధభిక్షువులకు, లేక, బౌద్ధభిక్షుసంఘములకు నన్న వస్త్రాదు లొసంగుట) మొదలగు ధర్మములను బౌద్ధులగు నుపాసకు లనుభవింప వలయునని, బుద్ధుఁడు స్పష్టముగఁ జెప్పియున్నాఁడు. బౌద్ధధర్మములయందు వీనికి శీల మని పేరిడి, పంచమహాయజ్ఞముల వలె నీ నీతిధర్మములను, బ్రాహ్మణధర్మములయందున్న ధర్మసూత్ర ములనుండియో, ప్రాచీనస్మృతిగ్రంథములనుండియో (మను. 6.92 మఱియు 10.63) బుద్ధుఁడు గ్రహించియుండునని యీ రెంటినిపోల్చి చూచినచో విస్పష్ట మగును.* వే యేల? ఈ యాచారము విషయ మున, బుద్ధుఁడు బ్రాహ్మణధమ్మికసుత్త యను గ్రంథమున ప్రాచీన బ్రాహ్మణుల స్తుతిని స్వయముగనే చేసియున్నాఁడు. మఱియు మను స్మృతియందలి కొన్ని శ్లోకములు ధమ్మపదమం దక్షరమైన మార్పు లేక వ్రాయఁబడినవి (మను. 2. 1-21 మఱియు ధమ్మపద 109 మఱియు 131 చూడు); కాని పంచమహాయజ్ఞములును, నీతిధర్మ ములును నను నొక విషయమే వైదికగ్రంథములలోనుండి బౌద్ధధర్మ ములలోనికి గ్రహింపఁబడలేదు ...కనే మన: గృహస్థాశ్రమమందు పూర్ణమగు మోక్షప్రాప్తి యెప్పుడును కలుగదని వైదికధర్మములయందు ప్రారంభమున కొంద ఱుపనిషత్కారులు ప్రతిపాదించిన మతము నైతము బుద్ధునిచే స్వీకరింపఁబడినది. ఉదాహరణ మేమన: సుత్తని

* See Dr. Kern's Manual of Buddhism (Grundriss III.8 p. 68).

పాతలలో ధమ్మికసుత్తయం దుపాసకులను భిక్షువులనుపోల్చి గృహస్థున కుత్తమశీలముచే స్వయంప్రకాశమగు దేవలోకము వచ్చును కాని, జనన మరణరూపమగు చక్రమునుండి విముక్తి కలుగుటకు సంసారమును, భార్యాపుత్త్రాదులను వదలివేయ వలయుననియు, తుద కతఁడు భిక్షుధర్మములనే స్వీకరింపవలయు ననియు బుద్ధుఁడు స్పష్టముగఁ జెప్పినాఁడు (ధమ్మికసుత్త 17.19; మఱియు బృ. 4.4.6; మఱియు మ. భా. వన. 2. 63 చూడు). కర్మమార్గీయులైన వైదిక బ్రాహ్మణులతో వాదించుచు కాలయాపనఁ జేయక తన సన్న్యాస పరమగు మతమును సిద్ధింపఁజేయుటకై "నీ మతమున, బ్రహ్మమునకు దారపుత్త్రాదులు, లేక, లోభరాగములు లేవు గాన, దారపుత్త్రాదులతో నుండి యజ్ఞయాగాది కామ్యకర్మలను జేయుటచే నీ కెట్లు బ్రహ్మప్రాప్తి కలుగును?" అని యిట్టి యుక్తివాదమును బుద్ధుఁడు చేయుచుండె నని తేవిజ్జసుత్తయందుఁ జెప్పఁబడినది (తే. సు. 1.35; 3.5). మఱియు బుద్ధుఁడు తన యౌవనముననే భార్యను, పిల్లలను, రాజ్యమును వదలి భిక్షుధర్మమును స్వీకరించిన పిదప నాఱు వత్సరములకు బుద్ధావస్థ ప్రాప్తమాయె నను విషయము ప్రసిద్ధముగనే యున్నది. బుద్ధునకు సమకాలికుఁడును, బుద్ధునికంటె పూర్వమే సమాధిస్థుఁడగు మహావీరుఁ డను కట్టకడపటి జైనతీర్థకారునియొక్క యుపదేశమును నటులే యున్నది; కాని యతఁడు బుద్ధునివలె ననాత్మవాది కాఁడు. కట్టువస్త్రములు, పై వస్త్రములు మొదలగు నైహిక సుఖములను త్యజించుటయు, అహింసావ్రతమును పాలించుటయు నను ధర్మములను జైనయతులు బౌద్ధభిక్షువులకంటె నధిక శ్రద్ధతో నాచరించి యుండుటయు, ఇప్పటికి నాచరించుచునే యుండుటయు నీ రెండు ధర్మములయందును గల గొప్పభేదము. తాను తినుటకై చంపఁబడిన జంతువుల మాంసమును 'పవత్త' (సం. ప్రవృత్త), అనఁగా: 'సిద్ధమైన మాంసమును' (ఏనుఁగు, సింహము మొదలగు కొన్ని జంతువులను వదలిపెట్టి) బుద్ధుఁడును తిని, 'పవత్త' మాంసమును తిన

వచ్చుననిి, మాంసభక్షకులగు బౌద్ధభిక్షుకులు కొందఱ కాజ్ఞయిచ్చెను. మఱియు వస్త్రములను ధరింపక దిగంబరులై తిరుగుట దోషమని బౌద్ధ భిక్షుధర్మములయందు చెప్పఁబడినది (మహావగ్గ. 6. 31. 14 మఱియు 8. 28. 1). అనాత్మవాదియగు భిక్షుఁడవు కావలసినదని బుద్ధుఁడు స్పష్టముగ నుపదేశించినను, కాయక్లేశమయమగు నుగ్రతపస్సు బుద్ధునకు సమ్మతము కాదనియు (మహావగ్గ 5.1.16 మఱియు గీ. 6.16), బౌద్ధభిక్షువులయొక్క విహారములయందు (అనఁగా: వారుండుటకై కట్టఁబడిన మఠములయందు) మొత్తముపై వ్యవస్థయు, శరీరమును విశేషము కష్టపెట్టక ప్రాణాయామము మొదలుగాఁ గల యోగాభ్యాసము నాచరించుచు నుండవలయు ననియు నియమము కలదని యిందలి సారాంశము. 'అర్హతావస్థ', లేక, 'నిర్వాణసుఖము' ప్రాప్తమగుటకు గృహస్థాశ్రమమును వదలివైచియే తీరవలయు నను సిద్ధాంతము వారియందు పూర్ణముగ స్థిరమై యుండుటచే బౌద్ధధర్మములు సన్న్యాసపరములే యని చెప్పవచ్చును.

బ్రహ్మజ్ఞాన మనునది గాని, యాత్మానాత్మ విచార మనునది గాని, భ్రమాత్మకమైన యొక్క గొప్ప జ్వాల యని బుద్ధునియొక్క ముఖ్యాభిప్రాయ మైనను, దుఃఖమయమగు సంసారచక్రమునుండి విముక్తుఁడై నిరంతరమగు శాంతిని సుఖమును సంపాదించుటకు, వైరాగ్యముచే మనస్సును నిర్విషయము చేయుట యను నుపనిషత్తులయందలి సన్న్యాసమార్గీయులయొక్క సాధనమునే బుద్ధుఁడు స్వీకరించియున్నాఁడు. చాతుర్వర్ణ్యభేదములను, లేక, హింసాత్మకములగు యజ్ఞయాగములను దప్ప వైదిక గార్హస్థ్యధర్మములయందున్న నీతినియమములనే బౌద్ధధర్మములయందు కొంత మార్చి గ్రంథములలో నున్న వైదిక సన్న్యాసులయొక్క వర్ణనయు, బౌద్ధభిక్షువులయొక్క, లేక, అర్హతులయొక్క వర్ణనలును, అహింస మొదలగు నీతిధర్మములును రెండు మతములయందును అనేక స్థలములయందు

శబ్దములతో సైత మొక విధముననే-స్పష్టముగఁ గాన్పించుట యాశ్చర్యము కాదు. ఈ విషయము లన్నియు మొట్టమొదటి వైదికధర్మములోనివే కాని యీ విషయము మాత్రమే బుద్ధునిచే వైదికధర్మములలోనుండి గ్రహింపఁబడలేదు. దశరథజాతకమువంటి బౌద్ధధర్మములయందున్న జాతకగ్రంథములును, నిటులే ప్రాచీనములగు వైదికములైన పురాణేతిహాసములయందలి కథలును బుద్ధధర్మానురూపముగ రచింపఁబడిన రూపాంతరములై యున్నవి. బౌద్ధులే కాక, జైనులు సైతము తమ యభినవములగు పురాణములయందు వైదికకథలకిటులే రూపాంతరములను రచియించిరి. మఱియు క్రీస్తుయొక్క యనంతరమున, మహమ్మదీయ ధర్మములయం దొక క్రైస్తవచరిత్ర యటులే మార్చి వ్రాయఁబడిన దని * సేల్ దొర వ్రాసియున్నాఁడు. బైబిలునందలి ప్రాచీన విధులయందున్న సృష్ట్యుత్పత్తి, ప్రళయము మొదలైన విషయములయొక్క కథలను, ప్రాచీనులైన ఖాల్దీలయొక్క ధర్మకథలను నిటులే మార్చి యహూదులు చెప్పిరని యిటీవల జరిగిన శోధనమువలన స్పష్టమగును. ఉపనిషత్తులును, ప్రాచీన ధర్మసూత్రములును, మనుస్మృతియందున్న వర్ణనలును కథలును, విచారములును బౌద్ధగ్రంథములయం దిట్లనేక స్థలములయందు శబ్దమాత్రము మార్పులేకయే గ్రహింపఁబడినవి. "జయముచే వైరము వృద్ధిఁబొందును. వైరముచే వైరము శమింపదు" (మ.భా.ఉ. 71.59 మఱియు 63), లేక, "ఇతరులయొక్క క్రోధమును శాంతిచే జయింపవలయును" అని విదురనీతియందును (మ. భా. ఉ. 38. 73), "నా యొక్క యొక బాహువునకు చందనము పూసినను, రెండవ దానిని కోసినను నీ రెండు విషయములును నాకు సమానముగనే యున్నవి" అని జనకుల వచనమును (మ.భా.శాం. 320. 36), మఱియు నితర

* See Sale's Koran, "To the Reader" (Preface) p. x, and the Preliminary Discourse, Sec. IV. p. 58 (Chandos Classics Edition.

ములగు మహాభారతములోని యనేక శ్లోకములును బౌద్ధగ్రంథములలో (ధమ్మపద 5 మఱియు 223, మఱియు మిళిందప్రశ్న 7·3·5) కలవు. అవి యన్నియు మహాభారతమునం దుండియే బౌద్ధగ్రంథకారులు గ్రహించియుందురని సహజముగ నూహింపఁబడును; కాని యుపనిషత్తులు బ్రహ్మసూత్రములు, మనుస్మృతి మొదలగు వైదిక గ్రంథములు బుద్ధునికంటె నిస్సంశయముగ ప్రాచీనము లగుటచే బౌద్ధగ్రంథములలో స్పష్టముగఁ గన్పడునట్టి వానిలోని శ్లోకములు గాని, విచారణలు గాని బౌద్ధగ్రంథకారు లా వైదిక గ్రంథములలో నుండియే గ్రహించినట్లు నిశ్చయముగఁ జెప్పుటకు వీలైనట్లు మహాభారతముయొక్క విషయమును నిశ్చయించుటకు వీలు లేదు. మహాభారతమునందు బౌద్ధధర్మములయొక్క యుల్లేఖము కలదు. కావున బుద్ధుని యనంతరమున మహాభారతము సంస్కరింపఁబడినట్లు స్పష్టమగుచున్నది. కావున శ్లోకసాదృశ్యమును బట్టియే మహాభారతము బౌద్ధగ్రంథములకు పూర్వకాలిక మైయే యుండవలయునని స్పష్టముగ నిర్ణయించుటకు సాధ్యము కాదు. గీత యనునది మహాభారతముయొక్క యొక భాగమే యగుటచే నట్లే గీతలను బుద్ధునికంటె ప్రాచీనము లని నిశ్చయించుటకు వీలుతేదు. ఇంతియ కాక, గీతలయందే బ్రహ్మసూత్రముల యుల్లేఖనము కలదు. బ్రహ్మసూత్రములయందు బౌద్ధమతఖండన మున్నదని ముందే చెప్పఁబడినది. కావున నీ శంక నివారింపఁబడినది. గీత బౌద్ధగ్రంథములకంటె ప్రాచీనమైనదని నిర్వివాదముగ సిద్ధించుటకు స్థితప్రజ్ఞునియొక్క వర్ణన మొదలగు స్థలముల రెండింటియందు నున్న శబ్దములకు సాదృశ్యము కలదని పూర్వమందు నిరూపింపఁబడిన విషయమే కాక బౌద్ధగ్రంథముల యం దితరములైన సాధనము లే వైనను కాన్పించునో, కాన్పింపవో యిప్పుడు విచారింతము.

బౌద్ధధర్మముల మూలస్వరూపము శుద్ధ నిరాత్మ వాదమనియు నివృత్తిపరమనియు పైనఁ జెప్పఁబడినది; కాని దాని కా స్వరూపము చిరకాలము నిలువలేదు. భిక్షువులయొక్క యాచారముల విషయమై మతభేదములు గలిగి బుద్ధుని మరణానంతరమున దానిలో యనేకములగు నుపమార్గములు నిర్మితము లగుచుండుటయే కాక, ధార్మికమగు తత్త్వజ్ఞాన విషయముననుఁ నిటులే మతభేదము కలిగెను. ఆత్మ లేదని చెప్పు విషయమున "అచింత్యమగు నాత్మజ్ఞానముయొక్క శుష్కవాదములోఁ బ్రవేశింపక వైరాగ్యముచేతను, నభ్యాసముచేతను మనస్సును నిష్కామముగఁ జేసికొనుట యను వ్యాపారమున నుండ నిమ్ము; ఆత్మ యున్నను, లేకపోయినను మనోనిగ్రహ మనుకార్యము ముఖ్యమగుటచే దానిని సిద్ధింపఁ జేసికొనుటకు మొదట ప్రయత్నము చేసి యుండవలయును" అనియే బుద్ధునియొక్క యూహ యని చెప్పవలసి యున్నది. బ్రహ్మము గాని, యాత్మ గాని బొత్తిగ లేనే లేదని యాతని యుద్దేశ్యము కాదు. కారణ మేమన: తేవిజ్జసుత్త యందు బుద్ధుఁడే 'బ్రహ్మసహవ్యతాయస్థితి' నుల్లేఖించెను. సేల సుత్తయందును, థేరగాథయందును, "నేను బ్రహ్మభూతుఁడనై యున్నాను" అని తన్ను వర్ణించుకొనెను (సేలసు.14; థేరగా.831); కాని యీ విషయము యుక్తమే యని యంగీకరించినను దానిలోనే "ఆత్మ, లేక, బ్రహ్మము అను వానిలో నేదోయొక నిత్యమగు వస్తువు జగదారంభమున లేదు. మనకుఁ గాన్పించున దంతయు క్షణికముగ లేక, శూన్యముగ నున్నది, లేక, "కాన్పించుచున్నదంతయు జ్ఞానమై యున్నది. జ్ఞానము తప్ప నీ జగంబునం దేమియు లేదు" అనియు తత్త్వజ్ఞాన విషయమున ననేకములగు వివిధ మతములును వాదములును నాగ్రహమార్గములును పిదప పుట్టిన వను విషయము నిర్వివాదముగనే యున్నది (వే.సూ.శాం.భా. 2. 18-26 చూడు). ఈ నిరీశ్వరుఁడు, లేక, యనాత్మవాది యగు బౌద్ధుని మతమునే, క్షణికవాద

మనియు, శూన్యవాద మనియు, విజ్ఞానవాద మనియు చెప్పుచు న్నారు; కాని మన మీ మతముల నన్నింటి నిచ్చో విచారింప నవ సరము లేదు. మన విషయ మైతిహాసికమై యున్నది. కావున దీనిని సిద్ధాంతీకరించుట కావశ్యక మగునంతయు, అనఁగా: 'మహాయాన' మని పేరు గలిగిన యొక మార్గముయొక్క విషయమును మాత్ర మిచ్చో సంక్షేపముగఁ జెప్పుచున్నాఁడను. బుద్ధునియొక్క తొంటి యుపదేశమున నాత్మ, లేక, బ్రహ్మము (పరమాత్మ, లేక, పరమేశ్వ రుఁడు) గౌణ మని చెప్పినచో భక్తిచేత పరమేశ్వరుని పొందుటకు మార్గమును తానే తన కాలమున నుపదేశించి పోవుటకు వీలులేకపో యెను. మఱియు నతని భవ్యమగు మూర్తియు, చరిత్రక్రమమును లోకుల నేత్రముల యెదుట నున్నంతవఱకు నీ మార్పును చేయనవ సరము లేకపోయెను; కాని యీ ధర్మము పిపిప సామాన్యజనులకు ప్రియమగుటకును, దాని ప్రచారము విశేషముగా జరుగుటకును, సంసా రమువదలి భిక్షువులై నిగ్రహముతో కూర్చుండుచోటనే నిర్వాణమును పొందుట యను నిరీశ్వరవృత్తిని బోధించుట యావశ్యక మాయెను. వేయేల? సామాన్యులగు బుద్ధభక్తు లా కాలమున బయలువెడలిన వైదికభక్తిమార్గము ననుకరించి బుద్ధునియొక్క యుపాసననే స్వయ ముగ తొలుత చేయ నారంభించియు నుండవచ్చును; కాని బుద్ధుని యొక్క నిర్వాణానంతరమునందు త్వరితముగనే బౌద్ధధర్మావలంబు లగు పండితులు బుద్ధుఁడే "స్వయంభువును, అనాద్యవంతుఁడు నగు పురుషోత్తముని"యొక్క యవతారమనియు, బుద్ధుఁడు నిర్వాణమును పొందుట యనునది లీలామాత్రమే యనియు, నిజమైన బుద్ధుఁ డెప్పు డును నశించువాఁడు కాఁడనియు, నెప్పుడును శాశ్వతుఁడుగనే యుం డుననియు, నీ లోకులంద ఱతని బిడ్డలే కాన నాతఁ డెల్లవారి యెడ లను సముఁడుగ నుండుననియు, నెవ్వరిమీఁదను ప్రేమను గాని ద్వేషమును గాని చెందఁ డనియు, ధర్మ మను గడియారము చెడిపోవు

నేని 'ధర్మకృత్య'ములకొఱకు కాయనయే యా యా సమయముల యందు బుద్ధనిరూపముతో నవతరించు ననియు, దేవాదిదేవుఁడగు బుద్ధుని భజించుటచేతను, వేయేల? యాతనికి భక్తితో కొన్ని కమలములను గాని, మఱి యేమైన పిడికెడు పుష్పములు గాని సమర్పించుట చేతను, మనుష్యులకు సద్గతి ప్రాప్తించునని బౌద్ధగ్రంథములలోఁ బ్రతిపాదింపఁ బడుచు వచ్చెను (సద్ధర్మపుండరీక 2. 77-98; 5. 22 మఱియు మిళిందప్రశ్న 3.7.7 చూడు).* మనుజునియొక్క జీవిత కాలమంతయు దురాచరణలోనే కడచినను, మరణించు కాలమున నైన నతఁడు బుద్ధుని శరణుఁ జొచ్చునేని స్వర్గము నొందక మానఁడనియు మిళిందప్రశ్నమునఁ జెప్పఁబడినది (మి.ప్ర. 3.7.2). మఱియు నెల్లవారి "అధికారమును, స్వభావమును, జ్ఞానమును, నొకవిధముగనే యుండవు గాన ననాత్మపరమగు నివృత్తిపర మార్గముకంటె నితరమగు భక్తి యను మార్గమును (యానమును), బుద్ధుఁడే దయాళువై 'తన నేర్పుచే నిర్మించె' నని సద్ధర్మపుండరీకమునందలి రెండవ మూఁడవ యధ్యాయముల యందు సవిస్తరముగఁ జెప్పఁబడినది. నిర్వాణపదమును బొందుటకు భిక్షుధర్మమే స్వీకరింపఁబడవలయునని బుద్ధునిచే స్వయముగఁ జెప్పఁబడిన ధర్మతత్త్వమును బొత్తిగ వదలుట కెప్పుడును వీలులేకపోయెను. కారణ మేమన: అటు లొనర్చుట యనఁగా బుద్ధునియొక్క ప్రథమోపదేశమును నశింపఁ జేయుటయే యగును; కాని భిక్షువైనను, అరణ్యమున 'ఖడ్గమృగము'వలె, నేకాకియై యుదాసీనుఁడై యుండక ధర్మప్రచారాది లోకహితములను, నిరీప్సితుఁడై (నిరిస్సిత) బుద్ధిపూర్వముగఁ జేయుట యనునదియే

* 'సద్ధర్మ పుండరీక' మను గ్రంథము ప్రాచ్యపుస్తకమాలయందు 21 ఖండములో భాషాంతరము సేయఁబడినది. ఈ గ్రంథము ప్రథమమున సంస్కృతభాషయందు వ్రాయఁబడినది. ఆ సంస్కృతగ్రంథము పైతమిప్పుడు ముద్రితమై యున్నది.

బౌద్ధభిక్షువులకుఁ గర్తవ్య మని చెప్పవచ్చును.* మఱియు నీ మతమే మహాయానమార్గమును బోధించు సద్ధర్మపుండరీకాది గ్రంథములలోఁ బ్రతిపాదింపఁబడినది. గృహస్థాశ్రమము నుండి నిర్వాణపదమును బొందుటకు బొత్తిగ వీలులేక పోలేదు. వే యేల? ఇట్టి యుదాహరణము లనేకములు గలవు" అని నాగసేనునిచే మిళిందునకు చెప్పఁబడినది (మి. ప్ర. 6.2.4). ఈ విచారమునకు నాత్మవాదపరములును కేవల సన్న్యాసపరములు నగు మొదటి బుద్ధధర్మములయందే కాక, శూన్యవాదులయొక్కయు విజ్ఞానవాదులయొక్కయు మతమున నైనను యోగ్యమగు నుపపత్తి కుదరదని యెల్లరకును సహజముగఁ దెలియును. మఱియు బుద్ధధర్మములయందే యున్న యనేకుల విచారము బుద్ధునియొక్క మొదటి యుపదేశమునకు విరుద్ధముగనున్నట్లు మొదటఁ దోఁచెను; కాని పిదప నీ క్రొత్తమతమే సహజముగ లోకుల కెక్కువ నమ్మకమైనది యాయెను. మఱియు బుద్ధుని మొదటి యుపదేశము ననుసరించి ప్రవర్తించుట 'హీనయాన' (చిన్న మార్గము) మనియు, నీ క్రొత్తమతము ననుసరించుట 'మహాయాన' (గొప్ప మార్గము) మనియు పేర్లు పెట్టఁబడెను.† చైనా, టిబెట్, జపాను

* 'సుత్తనిపాత' అను గ్రంథమునందు ఖగ్గవిసాణసుత్తయందలి 41-వ శ్లోకమునకు "ఏకో చరే ఖగ్గవిసాణకప్పో" అనునది ధ్రువపదము (అనఁగా: పల్లవి). ఖగ్గవిసాణ మనఁగా: ఖడ్గమృగము. దానివలె బౌద్ధభిక్షువు మతములో నొకఁడే యుండవలయునని దీని యర్థము.

† హీనయానమార్గమునకు, మహాయానమార్గమునకుఁ గల భేదమును వర్ణించుచు డా. కెర్న్ ఇట్లు చెప్పుచున్నాఁడు, "Not the Arhat, who has shaken off all human feeling, but the generous, self-sacrificing, active Bodhisattva is the ideal of the Mahayanists, and his attractive side of the creed has, more perhaps than anything else, contributed to their wide conquests, whereas S. Buddhism has not been able to make converts, except where the soil had been prepared by Hinduism and Mahayanism"– Manual of Indian Buddhism. p. 69. Southern Buddhism అనఁగా హీనయాన మగును. మహామానవయార్గ

మొదలైన దేశములలో నిప్పుడు ప్రచారములో నుండు బౌద్ధధర్మము 'మహాయాన' మార్గమును బోధించునదే. మఱియు బుద్ధుని నిర్వాణానంతరము బౌద్ధధర్మము లతిత్వరగా వ్యాపించుటు మహాయాన మార్గమందలి భిక్షుసంఘముయొక్క దీర్ఘోద్యోగమే కారణము; బౌద్ధధర్మమునందు బయలువెడలిన యీ సుధారణ (సంస్కారము) శాలివాహనశకముకంటె పూర్వము సుమారు 300 సంవత్సరములనాఁడు పుట్టియుండునని డా. కెర్న్ చే నిశ్చయింపఁబడినది. * కారణమేమన: కనిష్కుఁడను శకరాజు కొలువుకూటమున బౌద్ధభిక్షువులయొక్క మహోపద్రవము నిండియుండుటకు మహాయానభిక్షువులే కారణమని బౌద్ధగ్రంథములయం దుల్లేఖింపఁ బడియున్నది. ఈ మహాయాన మార్గమందలి 'అమితాయుసుత్త' యను పేరు గలిగిన ప్రధానసూత్ర గ్రంథము క్రీస్తుశకము 148-వ సంవత్సరప్రాంతమున చైనాభాషలోనికి భాషాంతరము చేయఁబడినది. ఈ గ్రంథమిప్పు డున్నది. అయిన నీ కాల మింతకంటెను ప్రాచీనమై యుండవలయునని యెన్నెద. కారణ మేమన: క్రీ. పూ. 230 సంవత్సరముల సుమారున నశోకుఁడు వేయించిన శిలాశాసనమున, సన్న్యాసపరములగు నిరీశ్వర బౌద్ధధర్మములు విశేషముగ నుల్లేఖింపఁబడక భూతదయాపరమగు ప్రవృత్తిపర

---

మున భక్తి పైతము కలదు. "Mahayanism lays a great stress on devotion, in this respect as in many other harmonising with the current of feeling in India which led to the growing importance of Bhakti" Ibid. p. 124.

* See Dr. Kern's Manual of Indian Buddhism, p. 6,69 and 119. మిలిందుఁడను (మినండరను పేరుగల గ్రీకురాజు) మహారాజు ఇ. స. పూర్వము 140, లేక, 160 ప్రాంతమున హిందూస్థానమునకు వాయవ్యమున నున్న బాక్ట్రియాదేశమునందు రాజ్యము చేయుచుండెను. అప్పుడు నాగసేనుఁడా రాజునకు బౌద్ధధర్మదీక్ష నిచ్చెనని మిళిందప్రశ్నమున వ్రాయఁబడినది. బౌద్ధధర్మప్రచార మను కార్యమును మహాయానమార్గమున నున్న జనులే చేయుచుండుటచే, నీ మహాయానమార్గ మప్పు డుద్భవించెనని స్పష్టమైనది.

బౌద్ధధర్మమే యంతటను నుపదేశింపఁబడెను. అప్పుడున్న (అనఁగా తత్పూర్వ మందున్న) బౌద్ధధర్మములకే మహాయానమందున్న ప్రవృత్తిపరమగు స్వరూపము వచ్చుట కారంభమైనదని స్పష్ట మగు చున్నది. బౌద్ధయతి యగు నాగార్జునుఁ డీ మార్గమునకు ప్రముఖుఁ డగు ప్రవర్తకుఁడే కాని దానిని కనిపెట్టినవాఁడు గాఁడు.

బ్రహ్మము, లేక, పరమాత్మయొక్క యస్తిత్వము నొప్పికొనక, మనస్సును నిర్విషయము చేయుట యను నుపనిషత్తుల యందున్న నివృత్తిమార్గమును మాత్రమే యొప్పుకొనునవియు, ప్రారంభమునుండి నిరీశ్వరవాదపరములే యైనవియు నగు బుద్ధుని యొక్క ధర్మములలో నుండియే పిదప క్రమక్రమముగ స్వాభావిక రీతినే భక్తిపరమగు ప్రవృత్తిమార్గము బయలు వెడలుటకు వీలులేక పోవుటవలన, బుద్ధునియొక్క నిర్వాణానంతరమున వెంటనే బౌద్ధ ధర్మములకుఁ గలిగిన కర్మప్రధానమగు భక్తిస్వరూపమునకు బౌద్ధ ధర్మములకంటె వేఱగు తత్కాలమంఁదున్న మతములే కారణములై యుండవలయునని స్పష్ట మగుచున్నది. ఈ కారణము లేవని విచారించుట కారంభించితి మేని భగవద్గీత వైపునకు దృష్టి ప్రసరింపక యుండదు. కారణ మేమన: భరతఖండమునం దాకాలమున వ్యాపించిన ధర్మములలో జైనధర్మములును, ఉపనిషద్ధర్మములును, పూర్ణముగ నివృత్తిపరములే యై యున్నవి. మఱియు వైదికధర్మముల యందున్న పాశుపతము, శైవము మొదలగుమార్గములు భక్తిపరములైనను, ప్రవృత్తిమార్గమును భక్తియు నను వానికి కలయిక భగవద్గీతలయందుతప్ప నెక్కడను స్పష్టముగా చెప్పఁబడియుండ లేదని నేను గీతారహస్యమునందలి పదునొకండవ ప్రకరణమున స్పష్టముగ నిరూపించినాఁడను. గీతలయందు భగవంతుఁడు తనకు పురుషోత్తముఁడని పేరు పెట్టుకొనెను. నేను పురుషోత్తముఁడను, సర్వలోకము

లకు 'తండ్రిని', 'తాతను' అనియు (9.17), ఎల్లవారియెడలను 'సముఁడ'నై యున్నాననియు, నా కెవరును శత్రు మిత్రులు కారనియు (9.29), నే నజుఁడను నవ్యయుఁడను నైనను ధర్మసంరక్ష ణార్థమై యా యా సమయములయం దవతరించు చున్నాననియు (4.6-8), మనుష్యుఁ డెంత దురాచారుఁ డైనను నన్ను సేవించుటచే సాధువు అగుననియు (9.30), లేక, నాకు భక్తితో నేదైన నొక పుష్పమును గాని, పత్రమును గాని, లేక, కొంచె ముదకమును గాని యిచ్చినను నేను దానిని సంతోషముతో గ్రహింతుననియు (9.26), అజ్ఞానులకు భక్తియనునది సులభమగు మార్గమనియు (12.5) భగవ ద్గీతలయందుఁ జెప్పఁబడినది. మఱియు, బ్రహ్మనిష్ఠుఁడు లోకసంగ్ర హార్థమై ప్రవృత్తిధర్మములనే యాచరింపవలయు నను సిద్ధాంతము మాత్రము గీతలయందుఁ దప్ప మఱియెక్కడను సవిస్తరముగఁ బ్రతి పాదింపఁబడలేదు. కావున వాసనాక్షయరూపమగు కేవలనివృత్తి పరమగు మార్గము మొదట బుద్ధధర్మములోని కుపనిషత్తులలో నుండి గ్రహించినట్లే పిదప మహాయానమార్గమందు ప్రవృత్తిపరమగు భక్తి తత్త్వము సైతము భగవద్గీతనుండియే స్వీకరింపఁబడినదని యూ హింపవలసివచ్చును. మఱియు నీ విషయ మనుమానప్రమాణమునే యవలంబించి యుండలేదు. టిబెట్ భాషయందున్న బౌద్ధధర్మముల యొక్క యితిహాసమును గుఱించి బౌద్ధధర్మీయుఁడగు తారానాథుఁడు రచియించిన యొక గ్రంథమున మహాయానమార్గమునకు ప్రముఖుఁ డును, పురస్కర్తయు నగు "నాగార్జునునకు గురువగు రాహులభద్రుఁ డనువాఁడు, బౌద్ధదీక్షను కైకొన్న బ్రాహ్మణుఁ డనియు, నీ బ్రాహ్మ ణునకు (మహాయానమార్గమందు) కల్పన తోఁచుటకు జ్ఞానులగు శ్రీకృష్ణుఁడు, గణేశుఁడును కారణభూతు"లనియు స్పష్టముగ వ్రాయఁ బడినది. మఱియొక టిబేటు గ్రంథమునందును నిటులే వ్రాయఁ

బడినది. * తారానాథుని గ్రంథము బహుప్రాచీన మయిన దనుట నిజమే; కాని దానియందున్న విషయము ప్రాచీనాధారము లేక వ్రాయఁబడలేదని చెప్పనవసరము లేదు. కారణ మేమన: బౌద్ధగ్రంథకారుఁ డెవఁడును స్వీయమగు ధర్మపంథయం దున్న తత్త్వములను చెప్పునపు డూరకయే పరకీయుల ధర్మముల నిట్టు లుల్లేఖించుట సంభవింపదు. కావున బౌద్ధగ్రంథకారులే స్వయముగ నీ విషయమునందు శ్రీకృష్ణునియొక్క నామనిర్దేశముఁ జేయుట యొక గొప్ప విషయము. కారణ మేమన: భగవద్గీత యొకటి తప్ప శ్రీకృష్ణునిచేఁ జెప్పఁబడిన మఱియొక ప్రవృత్తిపరమగు భక్తిగ్రంథము వైదికధర్మములయందు లేకపోవుటచే 'మహాయానమార్గము' బయలువెడలక మునుపు భాగవతధర్మములే కాక, భాగవతధర్మములను బోధించు శ్రీకృష్ణునిచేఁ జెప్పఁబడిన గ్రంథము సైతము, అనఁగా: భగవద్గీతయును, నప్పుడు ప్రచారములో నుండెనను విషయము దీనివలన పూర్ణముగ సిద్ధమగును. మఱియు డా. కెర్న్ అనువాని మతమును నిదియే. భగవద్గీత బౌద్ధధర్మములలోని మహాయానమార్గముకంటె ప్రాచీనమని నిశ్చయించిన పిదప, దానివలె మహాభారతమును నా కాలమున నుండి యుండవలయు నని యూహింపవచ్చును. బుద్ధుని మరణానంతరమున వెంటనే వారియొక్క మతములన్నియు నొక చోట సంక్షేపముగఁ జేర్పఁబడిన వని బౌద్ధగ్రంథములయందుఁ

* See Dr. Kern's Manual of Indian Buddhism, p. 122. "He (Nagarjuna) was a pupil of the Brahmana Rahulabhadra, who himself was a Mahayanist. This Brahmana was much indebted to the sage Krishna and still more to Ganesha. This quasi-historical notice, reduced to its less allegorical expression, means that Mahayanism is much indebted to the Bhagavadgita and more even to Shivaism" 'గణేశ' శబ్దముచే, డా. కెర్న్ శైవమార్గమని యెన్నినట్లు కాన్పించుచున్నది. డా. కెర్న్ ప్రాచ్యధర్మపుస్తకమాలయందు సద్ధర్మపుండరీక మను గ్రంథమున భాషాంతరీకరణ మొనర్చి దాని ప్రస్తావనయం దీ మతమునే ప్రతిపాదించినాఁడు. (S.B.E. Vol. XXI. Intro. pp. xxv-xxviii).

చెప్పఁబడినమాట నిజమే; కాని యిప్పుడు కాన్పించునట్టి యతిప్రాచీనములగు బౌద్ధగ్రంథములు సైత మాకాలమున నుండియే యుండవలయునని దానివలన సిద్ధము కానేరదు. మహాపరినిబ్బాణసుత్త యిప్పుడుండు గ్రంథములలో ప్రాచీనగ్రంథమని చెప్పుదురు; కాని దానియందు పాటలీపుత్రపత్తనవిషయమున (అనఁగా: పాట్నాను గుఱించి)నున్న యుల్లేఖమునుబట్టి యీ గ్రంథము బుద్ధుని నిర్వాణానంతరము కాలము నెంత తగ్గించినను సుమారు నూఱుసంవత్సరముల కంటె పూర్వమునందైనను పుట్టియుండదని, ప్రొ. ఱిస్‌డేవిడ్స్ అనునాతఁడు నిరూపించెను. బుద్ధానంతరము నూఱుసంవత్సరములలో బౌద్ధధర్మీయభిక్షువులయొక్క§ రెండవ పరిషత్తు జరుపఁబడెను. అది యే వినయపిటకముయొక్క కట్టకడపటి చుల్లవగ్గ యను గ్రంథము యొక్క చివరను వ్రాయఁబడినది. దీనినిబట్టి సిలోన్ బేటాదేశముల యందుండి పాలీభాషయందు వ్రాయఁబడిన ప్రాచీనము లగు వినయపిటకాది బౌద్ధగ్రంథము లీ పరిషత్తు జరిగిన వెనుకనే పుట్టినట్టు స్పష్టముగఁ గాన్పించుచున్నది. * అశోకుని పుత్త్రిఁడు మహేంద్రుఁడు మొదట క్రీస్తు పూర్వమునందు సుమారు 241-వ సంవత్సరము సింహల ద్వీపమందున్న బౌద్ధధర్మములను ప్రచారములోనికిఁ దెచ్చుట కారంభించినప్పు డీ గ్రంథ మక్కడకుఁ గొనిపోఁబడెను. అనంతరము నూటయేఁబది సంవత్సరముల సుమారున, నది యచ్చో పుస్తకరూపముగ వ్రాయఁబడినదని బౌద్ధగ్రంథకారులే వ్రాసిరి. ఈ గ్రంథమును నోటికి రాఁజేయువాడుక యుండెను. కాఁబట్టి మహేంద్రునికాలము మొదలు దానియం దే మాత్రము మార్పు లేదని యంగీకరించినను, బుద్ధుని నిర్వాణానంతర మీ గ్రంథమున, మొదట సిద్ధమైనపుడు గాని, లేక, పిదప మహేంద్రునియొక్క గాని యశోకునియొక్క గాని కాలముపర్యంతమును, నా కాలమునందు

§ See S.B.E. Vol. XI. Intro. pp. xv-xx and p. 58.

వ్యాపించియున్న వైదికగ్రంథములనుండి యేమియు గ్రహింపఁబడ లేదని చెప్పుటకు సాధ్యము కాదు. కావున మహాభారతము బుద్ధానంతరకాలిక మైనను, అది 'అలెగ్జాండర్' అనువానికంటె పూర్వకాలికము, అనఁగా: క్రీ.పూ. 325 సంవత్సరములకంటె ప్రాచీన మని యితర ప్రమాణములను బట్టి సిద్ధమగుటచే మనుస్మృతియందున్న శ్లోకములవలె దానియందున్న శ్లోకములును, మహేంద్రుఁడు సిలోను బేటాలోనికిఁ గొంపోయిన పుస్తకమున స్పష్టముగఁ గాన్పించుట యెంత మాత్రము సంభవింపఁదగనిది కాదు. బుద్ధునియొక్క మరణానంతరమం దతనియొక్క ధర్మములు ప్రచారములోనికి వచ్చుటను జూచి, వెంటనే ప్రాచీనములగు వైదిక గాథలు సైతము మహాభారతమందుఁ జేర్పఁబడిన వనియు, బౌద్ధగ్రంథములలోఁ గన్పట్టు భారత శ్లోకములను బౌద్ధగ్రంథకారులు భారతములోనుండి గ్రహించిరనియు, మహాభారతకారులు బౌద్ధగ్రంథములో నుండి గ్రహింపలేదని దీని వలన స్పష్ట మగుచున్నదనియు, కాని బౌద్ధగ్రంథకారు లీ శ్లోకములను మహాభారతములోనుండి గ్రహింపలేదనియు, భారతమునకు నాధార భూతమును, నిప్పుడు లుప్తమును, తత్పూర్వమునందున్న యేదో యొకవైదికగ్రంథములో నుండి గ్రహించియుండవలయు ననియు, కావుననే మహాభారతము యొక్క కాలనిర్ణయము, పైనచెప్పఁబడిన శ్లోకసాదృశ్యమువలన పూర్ణముగఁ గానేరదనియు, నొకవేళయున్నను 1. కేవలానాత్మవాదపరములును సన్న్యాసపరములును నగు మొట్ట మొదటి బౌద్ధధర్మములనుండియే, పిదప క్రమక్రమముగను స్వాభావికముగను భక్తిపరములును ప్రవృత్తిపరములునగు సిద్ధాంతములు వెలువడుటకు వీలులేకపోవుట, 2. మహాయాన మార్గముయొక్క యుత్పత్తిసంబంధములో బౌద్ధగ్రంథములు తమంతట తామే చేసిన శ్రీకృష్ణునియొక్క నామనిర్దేశము, 3. గీతలయందలి భక్తిపరములును ప్రవృత్తిపరములునునగు సిద్ధాంతములకు మహాయానపంథలో

నున్న మతములతో నుండు నర్థసాదృశ్యమును శబ్దసాదృశ్యమును, మఱియు 4. బౌద్ధధర్మములవలె నా కాలమున వెలువడిన రెండవ జైనమార్గమందుఁగాని, లేక, వైదికమార్గమతమునందుఁగాని ప్రవృత్తి పరమగు భక్తిమార్గము లేకుండుటయు నను నీ నాలుగు విషయము లనుబట్టియు, మహాయానమార్గము బయలు వెడలక మునుపే భాగవతధర్మములు ప్రచారములో నుండెననియు, నా కాలమున భగవద్గీతయు సర్వసమ్మతమై యుండె ననియు, నీ గీతయొక్క యాధారముచేతనే మహాయానమార్గము బయలువెడలిన దనియు, శ్రీకృష్ణప్రణీత గీతలయందున్న సిద్ధాంతములు బౌద్ధధర్మములలో నుండి స్వీకరింపఁబడినవి కావనియు, నిస్సంశయముగ నిష్పన్నమగు నని యిందలి సారాంశము. పైనఁ జెప్పఁబడిన యితర ప్రమాణము లనుబట్టి చేయఁబడిన ప్రస్తుతపు గీతయొక్క కాలనిర్ణయము దీనితోఁ బూర్ణముగ నేకవాక్యతను జెందియున్నది.

---

## 7. గీత—క్రైస్తవుల బైబిలు

హిందూదేశమునందు భక్తిపరములగు భాగవతధర్మముల యుదయము క్రీస్తునకు పూర్వము సుమారు పదునాల్గుశతాబ్దముల కాలమున నయియుండును. మఱియు క్రీస్తునకు పూర్వము వెలువడి ప్రారంభమునుండి సన్న్యాసపరములైన బౌద్ధధర్మములయందు ప్రవృత్తిపరమగు భక్తితత్త్వము ప్రవేశించుటకు శ్రీకృష్ణప్రణీతయగు గీతయె కారణ మని బౌద్ధగ్రంథకర్తల యభిప్రాయము, అనునవి మొదలగు విషయములు పైనఁ జెప్పిన ప్రమాణములచే నిశ్చితములైన పిదప, గీతలయందున్న యనేక సిద్ధాంతములు క్రైస్తవుల బైబిలున (అనఁగా; బైబిలుయొక్క క్రొత్తకరారు[న్యూ టెస్టుమెంటు]నందు) స్పష్టముగఁ గాన్పించుచున్నవని యుపపత్తిఁ జూపి క్రైస్తవధర్మముల

లోని సిద్ధాంతము గీతలలోనికి గ్రహింపఁ బడియుండునని యనేక గ్రంథములలో క్రైస్తవగురువులు చేసిన ప్రతిపాదనలును, మఱియు ముఖ్యముగ డా. లాఁరినసర్ అనువానిచే క్రీస్తుశకము 1869-వ సం. జర్మనుభాషలోనికి మార్చి ప్రచురింపఁబడిన గీతాగ్రంథమునందు దానికాలమును గుఱించి ప్రతిపాదింపఁబడిన విషయము లన్నియును నిర్మూలము లని స్వయముగనే సిద్ధమగును. లాఁరినస రనువాఁడు తన పుస్తకములో (అనఁగా: గీతలయొక్క జర్మనుభాషాంతరములో) చివర భగవద్గీతయు-బైబిలు-ముఖ్యముగ క్రొత్తకరారు (న్యూ టెస్టుమెంటు) - లనువానియందున్న శబ్దసాదృశ్యముల సుమారు నూఱు కంటె నధిక స్థలములయందుఁ జూపియుండెను. వానిలో కొన్ని విలక్షణములును విమర్శించుటకు తగినవియునై యున్నవి. "నేను నా తండ్రియందును, నీవు నాయందును, నేను నీయందును నున్నారము, అని యా దినమున నీకుఁ దెలియును" (జాన్. 14.20) అను నీ వాక్యము గీతలయందున్న "యేన భూతా న్యశేషేణ ద్రక్ష్య స్యాత్మ న్యథో మయి" (గీతా.4.35), మఱియు "యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి" (గీ. 6.30) అను నీ వాక్యములతో శబ్దమును బట్టియు నర్థమును బట్టియు సమానముగనే యున్నదని చెప్పవచ్చును. అట్లే జానునందలి (14.21) "ఎవరు నన్ను ప్రేమించుచున్నారో వారిని నేను ప్రేమించుచున్నాను" అను నీ వాక్యము గూడ "ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః" (గీ. 7.17) అను వాక్యముతో నన్నివిధములఁబోలి యున్నది. దీనిని బట్టియు నిట్టి యనేక వాక్యములను బట్టియు గీతాకారులకు బైబిలులోని విషయము బాగుగఁ దెలియునని యూహించి, డా. లాఁరినసర్ గీత క్రీస్తువునకు పిమ్మట సుమారు 500 సంవత్సరములకు పుట్టియుండునని చెప్పెను. డా. లాఁరినసర్ పుస్తకమందున్న యీ భాగము "ఇండియన్ ఆన్టిక్వరీ" అనుపుస్తకమున రెండవ భాగములో నింగ్లీషుభాషయందుఁ బ్రచురింపఁబడెను. మఱియు రై. తెలంగుగారు

భగవద్గీతల నింగ్లిషుభాషలోఁ బద్యకావ్యముగ రచించి దాని పీఠికలో డా. లాఁరినసరసు వాని యూహలను పూర్ణముగ ఖండించిరి. * లాఁరినసర్ అనునతఁడు పాశ్చాత్యులును, సంస్కృతజ్ఞులు నగు పండితులలో గణింపఁబడలేదు. సంస్కృతమునకంటె క్రైస్తవధర్మము లయందు జ్ఞానమును నభిమానమును నతని కధికముగ నుండెను; కాని నతని యూహలు తెలంగుగారికే కాక మాక్సుముల్లర్ మొదలగు పాశ్చాత్యసంస్కృత పండితులకును సమ్మతములు కావు. గీతయొక సారి నిస్సంశయముగ క్రీస్తునకు మున్ను పుట్టినదని నిశ్చయించిన పిదప గీతలలోను, బైబిలులోను నుండు తాను చూపించిన యనేక ములగు శబ్దసాదృశ్యములును, నర్థసాదృశ్యములును తన మతమునకే విరుద్ధము లను సంగతి డా. లాఁరినసర్ ఎఱుంగఁడు. కాని, యే విష యము స్వప్నమందైనను సంఘటిల్లదో యదియే పలుమారు ప్రత్యక్ష ముగ కన్నులకు గోచరించునని చెప్పుటలో నేమియు నసత్యము లేదు. నిజము విచారించితి మేని డా. లాఁరినసరున కుత్తరమిచ్చుట సైత మిచ్చో ననావశ్యకము. అయిన ననేకములగు గొప్ప యింగ్లీషు గ్రంథములలో నిప్పటికిని నీ యసత్యమగు మతము అనువదింపఁబడుట స్పష్టముగఁ గన్పట్టుచుండుటచే నీ విషయమై నవీనశోధనలయందుండి నిష్పన్నమయిన ఫలితార్థమును సంక్షేపముగ నిచ్చో చెప్పుట యా వశ్యకము. రెండు గ్రంథములలో సిద్ధాంత మొక విధముననే యున్న దను విషయమును మాత్రమే యవలంబించి వానిలో నేది ప్రాచీన మైనది, యేది నవీనమైన దని నిర్ణయించుటకు వీలులేదని తొలుతనే యెఱుంగవలయును. ఈ రెంటిలో నొక దానిలో నున్న విషయము మఱియొక దానిలోనికి గ్రహింపఁబడెనని సమముగనే యూహింప వచ్చును. కావున రెండుగ్రంథముల కాలమును మొదటు ప్రత్యేకముగ నిర్ణయించి పిదప విచారసామ్యముంబట్టి వీనిచే నీ గ్రంథము నుండి

§ See Bhagavadgītā translated into English Blank verse with notes & etc., by K. T. Telang, 1875, (Bombay). This book is different from the translation in the S. B. E. Series.

యీ విషయములు గ్రహింపఁబడిన వని నిశ్చయింపవలసి వచ్చును. ఇంతియే కాక సమానమగు రెండు విచారములు వేర్వేఱు దేశముల యందు వేర్వేఱగు నిరువురు గ్రంథకర్తల కొక్క కాలముననే కాని, వేఱుకాలములయందుఁ గాని స్వయముగఁ దోఁపవచ్చును గాన, రెండు గ్రంథములయందును నున్న విచారములకు సామ్యమును జూచునపుడు, స్వతంత్రముగ నుద్భవించినవియా?, లేదా? యనియు, నే యే దేశములయం దీ గ్రంథములు పుట్టినవో యా రెండుదేశముల కప్పుడప్పుడు పరస్పరసంబంధములు కొంచె ముండు టచే నొక దేశమునుండి యీ విచారము మఱియొక దేశమునకుపోవు టకు కొంచెమైన నవకాశముండునా? లేదా? యనియు విచారింప వలసివచ్చును. ఈ రీతిగ నన్ని విధముల విచారించితి మేని క్రైస్తవ ధర్మములనుండి గీతలలోని కే విషయమైనను గ్రహించుటకు వీలుగాక పోవుటయేకాక క్రైస్తవుల బైబిలునందు కాన్పించునట్టి గీతలలోని విష యములవంటి విషయములు బైబిలులోనికే బౌద్ధధర్మములలోనుండి-అనఁగా: గీతలలో నుండి గాని, లేక, వైదికధర్మములనుండి గాని-క్రీస్తువు చేతనో, లేక, యతని శిష్యులచేతనో గ్రహింపఁ బడియుండ వచ్చునని స్పష్టమగును. మఱియుఁ గొందఱు పాశ్చాత్యపండితులును నిప్పు డిదే విధముగ చెప్పుటకును నారంభించిరి. ఇట్లు క్రైస్తవమత మర్వాచీన మని నిర్ణయింపఁబడుటను జూచిన కొందఱు వీరక్రైస్తవు లాశ్చర్యముతో నీ విషయము నొప్పుకొనకపోవుట యొక వింత కానే రదు; కాని యిట్టి గృహస్థులకు మనమీ విషయము ధార్మికము గాద నియు, నైతిహాసిక మనియు, నితిహాసముయొక్క పద్ధతుల ననుస రించియు, ప్రస్తుతమందున్న జ్ఞానమునుబట్టియు, శాంతముగ విచా రించితి మేని, తుదకు బయలువెడలు సిద్ధాంతము నెల్లవారును ముందుగ నీ విచారసాదృశ్య మను విషయమును బ్రారంభించినవారు మిక్కిలి యానందముతోడను, నిష్పక్షపాతబుద్ధితోడను స్వీకరించుటయే న్యాయ్యమును సయుక్తికమును నగుననియు చెప్పవలయును.

యహూదీబైబిలునందు, అనఁగా: బైబిలుయొక్క ప్రాఁతకరారు (ఓల్డు టెస్టమెంటు) నందు ప్రతిపాదింపఁబడిన ప్రాచీన యహూదీ ధర్మములు సంస్కరింపఁబడి, నూతన కరారునందు క్రైస్తవధర్మములుగ బయల్పడినవి. యహూదీభాషయందు దేవుని 'ఇలోహా' (అరబ్బీ 'ఇలాహ') అని చెప్పుదురు; కాని మోఝెస్ అనువానిచే విధింపఁబడిన నియమముల ననుసరించి యహూదీధర్మములయందుఁ జెప్పఁబడు ముఖ్యమగు నుపాస్యదేవతకు 'జిహోవ్హా' అనుశబ్దము మొదట యహూదీభాషలోనిది కాదు. ఖాల్దీభాషలో నున్న 'యహ్వై' (సంస్కృతము 'యహ్వ') అను శబ్దమునుండి యుత్పన్నమైనదని పాశ్చాత్య, పండితులే యిప్పుడు నిశ్చయించిరి. యహూదీలు విగ్రహారాధకులు గారు; అగ్నిహోత్రమందు పశువులను గాని, యితర ద్రవ్యములను గాని హోమమును జేసియు, దేవునిచే విధింపఁబడిన ధర్మనియమముల నాచరించియు జిహోవ్హాను సంతుష్టునిగఁ జేయుటయు, దాని వలన నిహలోకమందు తమకును, తమ జ్ఞాతులకును, కల్యాణమును సంపాదించుకొనుటయు, వారి ధర్మమందున్న ముఖ్యమగు నాచారము. సంక్షేపముగఁ జెప్పవలయునేని, వైదికధర్మముల యందున్న కర్మకాండవలె యహూదీధర్మమును యజ్ఞమయముగను ప్రవృత్తిపరముగను నున్నదని చెప్పవలయును. ఇందులకు విరుద్ధముగ "నాకు (హింసాకారకములగు) యజ్ఞము లక్కఱయే లేదు. నేను (ఈశ్వరునియొక్క) కృపను కోరుకొనుచున్నాను" (మాథ్యూ. 9. 13) "దైవము, ద్రవ్యము నను రెంటిని సాధించుట శక్యము కాదు" (మాథ్యూ. 6. 24) "ఎవరి కమృతత్వము నొందవలయునని యిచ్ఛ యున్నదో వారు దారపుత్త్రాదుల వదలి నా భక్తులు కావలయును" (మాథ్యూ. 19.21). ఇ ట్లనేకస్థలములయందు క్రీస్తు వుపదేశించి తన శిష్యులను ధర్మప్రచారణకొఱకు దేశాంతరములకుఁ బంపినప్పుడు నీవు నీ యొద్ద బంగారమును గాని, నాణెములను గాని, విలువగల వస్త్రములు మొదలగు వానిని కాని యుంచుకొనకుము," మొదలగు

సన్న్యాసధర్మములలోని విధుల నాచరణలోనికి తెమ్మని చెప్పెను (మాథ్యూ. 10.9-13). ఈ కాలపువారగు క్రైస్తవులు క్రీస్తుయొక్క యీ యుపదేశములను చుట్టిచుట్టి యొకచో నుంచినమాట నిజమే. శ్రీశంకరపీఠమునకు వచ్చియుండు నిప్పటి శంకరాచార్యు లేనుఁగులు, గుఱ్ఱములు మొదలుగాఁ గలవానితో నుండుటవలన, శాంకరసంప్రదాయము రాజకీయము కానట్లే, యర్వాచీనమగు క్రైస్తవరాష్ట్రము యొక్క యీ ప్రవర్తనమువలన, మొదట క్రైస్తవధర్మములును, ప్రవృత్తిపరములుగ నున్నవని చెప్పుటకు సాధ్యము కానేరదు. వైదిక ధర్మము ప్రారంభమునందు కర్మకాండాత్మకమై యుండఁగా పిదప జ్ఞానకాండ మె ట్లుదయమైనదో, యటులే యహూదీధర్మములనుండి క్రైస్తవధర్మములును బయలువెడలెను, కాని వైదికమగు కర్మకాండము నందు మెల్లమెల్లఁగను క్రమక్రమముగను జ్ఞానకాండముయొక్కయు, భక్తిపరమగు భాగవతధర్మములయొక్కయు నుత్పత్తియు, వృద్ధియు ననేక సంవత్సరములవఱకు నగుచునున్నవి. ఆ తీరున క్రైస్తవధర్మములు వృద్ధినొందలేదు. క్రీస్తునకు పూర్వము సుమారు రెండువందల సంవత్సరములకు మున్ను ఏసీ లేక ఏసీన్ అనుపేరు గలిగిన సన్న్యాసులయొక్క మార్గము యహూదీదేశమున నుద్భవిల్లెనని యితిహాసము నుండి తెలియుచున్నది. ఈ ఏసీయతులు యహూదీధర్మ మవలంబించువారైనను హింసాత్మకములగు యజ్ఞయాగములను వదలి తమ జీవితకాలమునంతయును నిరుపద్రవమగు స్థలమునందుండి పరమేశ్వరుని ధ్యానించుచు కాలయాపనఁ జేయుచుండిరి. మఱియు నుదరపోషణకొఱకు వ్యవసాయమువంటి నిరుపద్రవములగు పనులను జేయుచుండిరి. అవివాహితులుగ నుండుట, మద్యమాంసములను వదలుట, హింసింపకపోవుట, శపథములను చేయకుండుట, సంఘముతో మఠములో నుండి యెవరి కేమి లభించినను మఠములో నుండువారెల్లరకును లభించినదే యని యెన్నుట మొదలగునవి యీ మతమునందలి ముఖ్యవిధులు. మఱియు నెవరైనను సము

దాయములోఁ బ్రవేశించిరేని, మూఁడు సంవత్సరములు వారి నాశ్రయించి పిదప శాంతి నొందుదు నని ప్రమాణమును చేయవలసి వచ్చును. వీరి ముఖ్యమగు మఠము మృతసముద్రపు పశ్చిమతీరమున ఎంగది యనుచోట నుండెను. మఱియు నచ్చోవారు సన్న్యాస వృత్తితో శాంతులుగ నుండెడివారు. స్వయముగ క్రీస్తువును, నతని శిష్యులును 'ఏసీ' యను మతమును క్రొత్తకరారులో గౌరవముతో నిర్దేశించి (మాథ్యూ. 5.34; 19.12; జేమ్స్. 5.12: కృత్యే. 4.32-35) యీ యేసుక్రీస్తుమార్గావలంబకులయి యీ సన్న్యాసధర్మమునే విశేష మగు ప్రచారములోనికి తెచ్చిరనియుఁ దోఁచుచున్నది; కాని, క్రీస్తు యొక్క సన్న్యాసపరమగు భక్తిమార్గపు పరంపర నీ తీరున ఏసీ మార్గము నవలంబించియున్న దన్నను మొదట కర్మమయ మగు యహూదీధర్మములయందు సన్న్యాసపరమగు ఏసీ మతమైనను నొక్క సారిగ నెట్లు బయలుదేరిన దను విషయమై కొంచెమైనను నయుక్తిక మగు నుపపత్తిని చెప్పుట యైతిహాసిక దృష్టిచే నావశ్యక మగును. క్రీస్తు ఏసీన్ మతములోనివాఁడు కాఁడని యనేకులు చెప్పుదురు; కాని యిది సత్యమని యంగీకరించినను బైబిలుయొక్క క్రొత్తకరారున చెప్పఁబడిన సన్న్యాసపరము లగు ధర్మములకు ముఖ్యకారణ మేమని కాని, లేక, కర్మప్రధానమగు యహూదీధర్మములందు వాని కొక్క సారి ప్రాదుర్భావ మెట్లు గలిగినదని గాని, మొదలగు ప్రశ్నలకు సమాధానము చెప్పకయే విడచిపెట్టుటకు వీలు లేదు. ఏ విషయ మైనను నొకసారియే యెక్కడను నుత్పన్నము కానేరదు. మెల్ల మెల్లఁగ బహుకాలము నుండి వృద్ధిఁ జెందుచుండును. ఇట్టివృద్ధి యెచ్చోఁ గాన్పింపదో యచ్చో నీ విషయము తఱచుగ పరదేశము నుండి కైకొనఁబడియుండు నను సమాజ శాస్త్రముయొక్క సామాన్య సిద్ధాంత మిపుడు నిశ్చయింపఁబడును. ఈ ప్రతిబంధమును ప్రాచీన క్రైస్తవగ్రంథకారు లెఱుఁగకపోలేదు. ఇఁక నేమన: బౌద్ధధర్మముల యొక్క పరిచయము, సమీపసంబంధము యూరోపియులకు కలు

గుటకంటె పూర్వమునందు (అనఁగా: క్రీస్తుశకముయొక్క పదు నెనిమిదవశతాబ్దము పర్యంతము) యహూదీలకు సంఘటిల్లిన పిదప గ్రీకుజనులయొక్క—అందునను పైథాగొరసుయొక్క తత్త్వజ్ఞానము నుండియు కర్మమయమగు యహూదీల ధర్మమునందు ఏసీన్ జనుల సంబంధమగు సన్న్యాసమార్గము పుట్టెననియు నర్వాచీనమగు శోధన లంబట్టి యీ సిద్ధాంతము సత్యముగ నిలువ దనియు, అయినను యజ్ఞమయములగు యహూదీధర్మములలోనే యొక్కసారిగ సన్న్యాస పరములగు ఏసీన్, లేక, క్రీస్తుధర్మము ఉద్భవిల్లుటకు సహజముగ శక్యము కాదనియు, వానికి యహూదీ ధర్మములకంటె భిన్నములగు కారణము లేవైనను నుండి యుండవలయుననియు శోధకులగు క్రైస్తవవిద్వాంసులయొక్క మతము. వానికి యహూదీధర్మములకు సంబంధింపని యితరకారణము లేవైనను నుండుననను కల్పన నవీన మైనదికాదు. క్రీస్తుశకముయొక్క పదునెనిమిదియవ శతాబ్దమునకు పూర్వమునందు క్రైస్తవపండితులకును నది సమ్మతముగనే యున్న దని దీనినిబట్టి సిద్ధ మగుచున్నది.

పైథాగొరసుయొక్క తత్త్వజ్ఞానమునకును, బౌద్ధధర్మముల యందున్న తత్త్వజ్ఞానమునకును విశేషసాదృశ్యము కలదని కోల్ బ్రూక్* అనునాతఁడు చెప్పెను. కావున పైఁ జెప్పఁబడిన సిద్ధాంతము సత్యమని యంగీకరించినను ఏసీ మార్గమునకు జనకత్వము హిందూ దేశము వైపునకే వచ్చునని చెప్పవచ్చును; కాని యింత కష్టపడి చెప్పుటకును నిప్పు డేమి యుపసరము లేదు. ఏసీ, లేక, క్రీస్తుధర్మ ములకు పైథాగొరియన్ సంఘముతో నున్న సామ్యముకంటె, కేవలము ఏసీ ధర్మములయొక్కయే కాక, క్రీస్తుచరిత్రమునకును, క్రీస్తుయొక్క యుపదేశములకు సైతము బుద్ధునియొక్క ధర్మము లతో శతగుణముగ నధికమైన సామ్యమున్నదని, బౌద్ధగ్రంథము

* See Colebrooke's Miscellaneous Essays, Vol. I pp. 399, 400.

లను బైబిలుయొక్క క్రొత్తకరారుతోఁ బోల్చి చూచితిమేని స్పష్టముగఁ గాన్పించును. క్రీస్తువును భ్రమపెట్టుటకు సైతాను ప్రయత్నించినట్లును, క్రీస్తునకు సిద్ధావస్థ ప్రాప్తమగు సమయమునందు నలువది దినము లుపవసించినట్లును, బుద్ధునకు సైతము మారుఁడు మోహమును గలిగించుటకు ప్రయత్నించె ననియు, నా సమయమునఁ బుద్ధుఁడు నలువదితొమ్మిది దినము (ఏడు వారము) లుపవసించినట్లును బుద్ధచరిత్రలో వర్ణింపఁబడినది. ఆ రీతిగనే పూర్ణమగు తన శ్రద్ధయొక్క ప్రభావముచే నీటిపై నడచుటయు, దేహముయొక్క కాంతిని నొక్కసారిగ సూర్యకాంతివంటి దానినిగ మార్చుటయు, లేక, శరణుఁ జొచ్చిన చోరులకును, వేశ్యలకును సైతము సద్గతి నిచ్చుటయు మొదలగు విషయములు బుద్ధునియొక్కయు, క్రీస్తుయొక్కయు చరిత్రలయం దొక విధముననే యున్నవి. "నీవు నీయొక్క యిరుగు పొరుగువారిని, వైరులను సైతము ప్రేమించుము" అనునవి మొదలగు క్రీస్తుయొక్క ముఖ్యములైన నైతికోపదేశములు సైత మక్కడక్కడ నేమాత్రము మార్పులేక బౌద్ధధర్మములలో నంతకు మునుపే ప్రసిద్ధములై యున్నవి. భక్తియొక్క సిద్ధాంతము మొట్టమొదటి బౌద్ధధర్మములలో లేదు. అదియుఁ బిదప అనఁగా: క్రీ.పూ. సుమారు రెండు మూఁడు శతాబ్దముల కాలమున మహాయానబౌద్ధమార్గములోనికి భగవద్గీత నుండి కొనిపోఁ బడినదని పైనఁ జెప్పఁబడియే యున్నది; కాని యీ సామ్య మింతవఱకు మాత్రమే కాదు. చిన్నవియుఁ బెద్దవియు నగు ననేకములైన యితరములగు విషయములలో క్రైస్తవధర్మముల యందును, బౌద్ధధర్మములయందును నిట్టి సామ్యమే కలదని, మి. ఆర్థర్ లిలీయను వానిచే తన పుస్తకమునం దాధారములతో వ్యక్తము చేసి నిరూపింపఁబడినది. వే యేల? క్రీస్తువును 'క్రాను' మీఁద నెక్కించి వధించుటచే క్రైస్తవులకు పవిత్రమును, పూజ్యమునగు నా 'క్రాను' యొక్క చిహ్నమును సైతము,

వైదికములు బౌద్ధములునగు ధర్మముల నాచరించు జనులు 'స్వస్తికము'యొక్క రూపముతో క్రీస్తుపుకంటె పూర్వమం దనేక వత్సరముల నుండి సైతము శుభదాయకముగ నెన్నియున్నారు. మఱియు ఈజిప్టు మొదలగు ప్రాచీన ఖండములయందున్న దేశములయందే కాక కొలంబసుకు పూర్వము కొన్ని శతాబ్దముల కాలమునసైత మమెరికాయందలి పెరూ, మెక్సికో దేశములయందు సైతము స్వస్తికమను చిహ్నము శుభావహమని యంగీకరింపఁబడి యుండెనని ప్రాచీనులగు శోధకులు నిశ్చయించిరి. * దీనినిబట్టి క్రీస్తునకు పూర్వమునందే యందఱకును పూజ్యమైన స్వస్తికచిహ్నముయొక్క యుపయోగము, క్రైస్తవభక్తులు తర్వాత నొకవిధముగఁ గావించికొనిరని యూహింపవలసి వచ్చును. బౌద్ధభిక్షువులకును, ప్రాచీన క్రైస్తవ ధర్మోపదేశకులకును (విశేషించి చూచితిమేని పాదిరీలకును) వస్త్రధారణముననను ధర్మవిధులయందును విశేషమగు సామ్యము కలదు. ఉదాహరణ మేమనఁగా: బ్యాప్టిజము యొక్క (అనఁగా: స్నానోత్తరకాలమునందు దీక్ష నిచ్చునట్టి) విధి సైతము క్రీస్తుపుకంటె పూర్వమందే ప్రచారమున నుండెను. మఱియు దూరదేశములకు ధర్మోపదేశకులను బంపి ధర్మప్రచారమునుచేయుట యను పద్ధతి క్రైస్తవ ధర్మోపదేశకులకంటె పూర్వమందే బౌద్ధభిక్షువులచేఁ బూర్ణముగ స్వీకరింపఁబడినదని సిద్ధమైనది.

బుద్ధునియొక్కయు, క్రీస్తుయొక్కయు చరిత్రలందును, నైతికోపదేశముల యందును, ఈ రెండు మతములయొక్క ధార్మికములగు విధులయందును గల విలక్షణమును వ్యాపకమును నగు సామ్యమునకు కారణ మే మనుప్రశ్న సహజముగఁ బ్రతిమానవునకుఁ

* See The Secret of the Pacific, by C. Reginald Enock, 1912, pp. 248—252.

దోఁచును. * బౌద్ధగ్రంథములఁ జదువుకొనుటచేత నీ సామ్యము పాశ్చాత్యులకు ప్రారంభమునఁ గన్పట్టినపుడు బౌద్ధు లీ తత్త్వములను నెస్టోరియన్ అను పేరుతో నాసియా ఖండమునందు వ్యాపించిన క్రైస్తవమార్గమునుండి గ్రహించియుందురని కొందఱు క్రైస్తవ పండితులు చెప్ప నారంభించిరి; కాని యీ విషయమే సంభవించుటకు వీలులేదు. కారణ మేమన: నెస్టార్ మార్గముయొక్క ప్రవర్తకుఁడే క్రీస్తుకు పిదప సుమారు 425 సంవత్సరముల కాలమునఁ బుట్టెను. మఱియు క్రీస్తుకంటె పూర్వమందు సుమారు 900 సంవత్సరముల కాలమున బుద్ధుఁడు పుట్టెను. కావున నశోకునియొక్క సమయమందు— అనఁగా: క్రీ. పూ. 250 సంవత్సరముల నాఁడైన— బౌద్ధ ధర్మములు హిందూదేశమందును, సమీపమునందున్న దేశముల యందును విశేషముగ వ్యాపించియుండుటచే బుద్ధచరిత్రాదిగ్రంథములును నప్పుడు పుట్టియుండునని యశోకుని శిలాశాసనమునుబట్టి యిప్పుడు నిస్సంశయముగఁ దెల్లమైనది. బౌద్ధధర్మములయొక్క ప్రాచీనత్వ మీ తీరున నిర్వివాదమై యుండుటచే క్రైస్తవధర్మముల యందును బౌద్ధధర్మములయందును స్పష్టముగఁ గన్పట్టు సామ్యము 1. రెండును వేర్వేఱుగఁ బుట్టియుండవలయునని కాని, లేక, 2. బౌద్ధ ధర్మములలో నుండి యీ విషయములు క్రీస్తుచేతఁ గాని, యతని శిష్యులచేతఁ గాని గ్రహింపఁబడియుండునని కాని, రెండువిధములను

* ఈ విషయమై మ. ఆర్థర్ లిలీ అనువాఁడు, Buddhism in Christendom అను పేరుగలిగినయొక గ్రంథము వ్రాసెను. ఇంతియకాక Buddha and Buddhism అను పేరు గలిగిన గ్రంథముయొక్క చివర నాలుగు భాగములలోఁ దనమతమును సంక్షేపముగను స్పష్టముగను నిరూపించెను. పరిశిష్టప్రకరణము యొక్క యీ భాగమునందు చేసిన వివేచనయంతయు నీ రెండవ గ్రంథముయొక్క యాధారముచేతనే చేయఁబడినది. Buddha and Buddhism అను గ్రంథము The World's Epoch-makers' Series లో 1900 సం. ప్రసిద్ధింపఁబడినది. ఆ గ్రంథముయొక్క పదియవప్రకరణమునందు బౌద్ధక్రైస్తవధర్మములయం దున్న సాదృశ్యములు సుమారు ఏఁబది సూచింపఁబడినవి.

రెండుమూఁడు శతాబ్దములకే యహూదీజనుల దేశమునందు బుద్ధ ధర్మీయులగు యతులు ప్రవేశించుచు నుండిరను విషయమున నిప్పు డేమియు సందేహము లేదని తాత్పర్యము. మఱియు నీ సంబంధము సిద్ధమైనచో యహూదీజనులతో ప్రారంభమున సన్న్యాసపరమగు ఎసీయును, పిదప సన్న్యాసయుక్తమగు భక్తిపరములైన క్రీస్తుధర్మము లును ప్రాదుర్భూతము లగుటకు బౌద్ధధర్మమే విశేషకారణమై యుండు నని సహజముగ నిష్పన్న మగును. ఇంగ్లీషుగ్రంథకారుఁ డగు లిలీ యను నాతఁ డీ విషయమునే యూహించెను. మఱియు దానిని బల పఱచు ఫ్రెంచిపండితులగు 'ఎమిల్ బుర్నుఫ్' అనునాతఁడును, 'రోశ్ని' * యను నాతఁడును తత్సదృశములగు మతములను తమ గ్రంథములలో వ్రాసిరని యుదాహరణము నిచ్చెను. మఱియును జర్మనీదేశమున 'లైప్సిగ్' పట్టణసమీపమున తత్త్వజ్ఞాన శాస్త్రమున కధ్యాపకుఁడగు ప్రొ. సేడ ననువానిచే నీ విషయమున నతనిగ్రంథము లలో నీ మతమే ప్రతిపాదింపఁబడినది. క్రీస్తుధర్మములును, బౌద్ధధర్మ ములును నన్ని విషయములలో సమానముగ నుండవు. రెంటికిని కొన్ని విషయములలో సామ్య ముండినను, కొన్ని విషయములలో వైషమ్యము సైతము విస్తారముగనే యుండును. మఱియు దానినిబట్టి క్రీస్తుధర్మములు బౌద్ధధర్మములలో నుండి బయలుదేరిన వను మతము గ్రాహ్యముగ నంగీకరింపఁగూడదని జర్మన్ ప్రొఫెసర్ శ్రాడ రను నాతఁడు తన గ్రంథములలో వ్రాసియున్నాఁడు; కాని యాతఁడు చెప్పినది ముఖ్యవిషయమును వదలి యుండుటచే నేమియు ప్రయో జనకారి కానేరదు. క్రైస్తవధర్మములును, బౌద్ధధర్మములును సర్వాం శములలో నొకటిగనే యున్నవని యెవరును చెప్పరు. కారణ మేమన:

---

చిన్నగ్రామము నెవరు యవనుల పట్టణ మని చెప్పుదురు? ఇంతియ కాక పైనఁ జెప్పఁబడిన యశోకుని శిలాశాసనమందే యవనుల రాజ్యమునకు బౌద్ధభిక్షువులను పంపినట్లు స్పష్టముగ వ్రాయఁబడినది.

* See Lillie's Buddha and Buddhism pp. 158. ff.

అట్లుండెనేని యీ రెండుధర్మములు వేర్వేఱుగ నెన్నఁబడవు. మొదట కర్మమయము మాత్రమే యగు యహూదీలధర్మమునందలి సుధారణను, అనఁగా: సన్న్యాసయుక్తమగు భక్తిమార్గమును ప్రతిపాదించు ధర్మము లుద్భవించుటకు కారణ మేమై యుండు ననునది ముఖ్యమైన ప్రశ్నయైయున్నది. మఱియు క్రీస్తుకంటె నిస్సంశయముగ ప్రాచీనములగు బౌద్ధధర్మముల యొక్క యితిహాసమును గమనించితి మేని, సన్న్యాసపరమగు భక్తియొక్కయు నీతియొక్కయు సిద్ధాంతములను క్రీస్తు స్వతంత్రముగనే శోధించి కనిపెట్టియుండు నని చెప్పుట యైతిహాసికదృష్టిచే సంభవించునట్టిది కాదు. క్రీస్తు తన పండ్రెండవ సంవత్సరము మొదలు ముప్పదియవ సంవత్సరము వఱకును నేమి చేయు చుండెనో దానిని గాని, యెక్కడ నుండెనో దానిని గాని బైబిలులో నేమియుఁ జెప్పియుండలేదు. ఈ కాలమును నతఁడు జ్ఞానార్జనము నందును, ధర్మచింతనయందును, ప్రవాసమందును గడపి యుండు నని స్పష్టమగుచున్నది. కావున నీ సందర్భమున నతనికిని బౌద్ధభిక్షువులకును, ప్రత్యక్షముగఁ గాని, పరంపరచేఁ గాని సంబంధము సంఘటిల్లనే లేదని నిశ్చయముగఁ జెప్పుటకు శక్యము కాదు. కారణ మేమన: బౌద్ధయతులయొక్క ప్రచార మా సమయమునందు గ్రీసు దేశపర్యంతమును వ్యాపించి యున్నది. నేపాళములోని యొక బౌద్ధమఠ మందున్న గ్రంథములో క్రీస్తు వా సమయమున భరత ఖండములోనికి వచ్చియుండెననియు, నక్కడ నతనికి బౌద్ధధర్మముల యొక్క జ్ఞానబోధ కలిగిన దనియు, స్పష్టముగఁ జెప్పఁబడినది. నికోలస్ నోటోవ్హిష్ అను పేరు గలిగిన యొక రష్యను గృహస్థునకీ గ్రంథము లభించుటచే నతఁడు దాని భాషాంతరమును 1894-వ సంవత్సరమున ఫ్రెంచిభాషలో చేయించి ప్రచురించెను. నికోలస్ నోటోవ్హిష్ యొక్క భాషాంతరీకరణము సరిగ నున్నను, మూల గ్రంథమును పిదప నెవరో యప్రామాణికులు కల్పించి రనియు, నది యసత్య మనియు ననేకులగు క్రైస్తవపండితులు సెప్పుచున్నారు.

మఱియు నీ గ్రంథము నా పండితులు సత్యమైనదియే యని యంగీక రించినను, లేకున్నను నా విషయమున మాకు విశేషము పట్టుదల లేదు. నోటోవ్హిషునకు దొరకిన యా గ్రంథము సత్య మైనను, ప్రక్షిప్తమైనను నైతిహాసికదృష్టితో మాత్రమే నేను చేసిన యీ వివేచనను బట్టి క్రీస్తునకుఁ గాకపోయినను క్రొత్తకరారునం దున్న యతని చరిత్రను వ్రాసిన యతని భక్తులకైనను బౌద్ధధర్మముల యందలి విషయము తెలిసియుండుటకు వీలులేకపోదని స్పష్టముగఁ దెలియును. మఱియు నీ విషయము సంభవించుటకు వీలులేనిచో క్రీస్తువు యొక్కయు, బుద్ధునియొక్కయు చరిత్రలలోను, నుపదేశములలోను స్పష్టముగ విలక్షణమగు సామ్యము ప్రత్యేకముగనే కలిగియుండు ననుటయు నయుక్తికముగఁ గన్పట్టుదు. * మీమాంసకులయొక్క కేవల కర్మమార్గము, జనకాదులయొక్క జ్ఞానయుక్తమగు కర్మ యోగము (నైష్కర్మ్యము), ఉపనిషత్కారులయొక్కయు సాంఖ్యుల యొక్కయు జ్ఞాననిష్ఠయు, సన్న్యాసమును, చిత్తనిరోధకరూపమగు పాతంజలయోగమును, పాంచరాత్రములు, లేక, భాగవతధర్మములు, అనఁగ : భక్తియు నను నీ ధార్మికములగు సమస్తాంగములును, తత్త్వ ములును మొదట ప్రాచీనమగు వైదికధర్మములలోనివై యున్నవ నియు, వీనిలో బ్రహ్మజ్ఞానమును, కర్మయు, భక్తియుఁ గాక చిత్త నిరోధరూపమగు యోగము, కర్మసన్న్యాసము అను నీ రెండు సిద్ధాం తములయొక్క యాధారముచే బుద్ధుఁడు తన సన్న్యాసపరమగు ధర్మమును నాల్గువర్ణములకును మొదట నుపదేశించెననియు, వాని యందే పిదప భక్తియొక్కయు నిష్కామకర్మయొక్కయు భారమును మోపి బుద్ధునిమతము ననుసరించువారు బుద్ధధర్మములను నాలుగు మూలలయందును ప్రసరింపఁ జేసి రనియు, నశోకునియొక్క సమ

* రమేశచంద్రదత్తుని మతమును నిదియే. కావున నా విషయమును తన గ్రంథమున సవిస్తరముగ వ్రాసెను. (Ramesh Chunder Dutt's History of Civilization in Ancient India Vol. II. Chap. XX. pp. 328-340.

యమున బౌద్ధమతము లిట్లు వ్యాపించిన పిదప శుద్ధకర్మపరములగు యహూదీధర్మములందు సన్న్యాసమార్గముయొక్క సిద్ధాంతములు ప్రవేశింప నారంభించిన వనియు, తుదకు వానినే భక్తితోఁ గలిపి క్రీస్తు తన ధర్మమును బ్రవర్తింపఁ జేసె ననియు, నితిహాసమువలన నిష్పన్నమగు నీ పరంపరను జూచితిమేని డా. లారినసర్ చెప్పినట్లు క్రీస్తుధర్మములలోనుండి కొన్ని ధర్మములైనను గీతలలో గ్రహింపఁ బడినవి యనుట యసంగతమే కాక యాత్మౌపమ్యదృష్టిచే సన్న్యాసముయొక్కయు నిర్వైరత్వముయొక్కయు భక్తియొక్కయు సిద్ధాంతములు బైబిలుయొక్క క్రొత్తకరారులోనికి బౌద్ధధర్మములనుండి, అనఁగా: పరంపరగా వైదికధర్మములనుండియే, గ్రహింపఁబడియుండుటకు మాత్రము బలవత్తరమగు నవకాశము కలదని విశేషముగ నమ్మఁదగి యున్నదియు, హిందువులకు గాని విషయమై మఱియొకరి ముఖముననైనఁ జూడ నవసర మెప్పుడును నుండదనియు పూర్ణముగ సిద్ధమగుచున్నదని యిందలి సారాంశము.

ఇట్లు ప్రకరణారంభమున చెప్పఁబడిన యేడు విషయములును విచారింపఁబడినవి. భరతఖండమునం దిప్పుడు వ్యాపించియున్న భక్తిమార్గమువలన భగవద్గీత కెట్టి పరిణామము సంభవించినదనియు మొదలైన నితరములగు కొన్ని గొప్పప్రశ్నలు దీనిని సంబంధించియే బయలు వెడలుచుండును; కాని యీ ప్రశ్నలు గీతాగ్రంథమునకు సంబంధించినవని చెప్పుటకంటె హిందూధర్మములయొక్క యర్వాచీనములగు నితిహాసములకు సంబంధించి యున్నవని చెప్పుట యుక్తము. కావున విశేషించి యీ పరిశిష్టప్రకరణము సమాప్తమైనది కాని మన మనుకొన్న దానికంటె నెక్కుడుగ వృద్ధిపొందినది. అయినను గీతయొక్క బహిరంగపరీక్ష నిచ్చోఁ సమాప్తిఁ జేయుచున్నాను.

ఇది పరిశిష్ట ప్రకరణము.

ధర్మాన్ని కాపాడండి అది మిమ్మల్ని కాపాడుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు

T.T.D. Religious Publications Series No.29

**Part-II**

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**తెలుగు ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | సప్తపది | 5-00 |
| 2. | పురుషసూక్తములు | 5-00 |
| 3. | నారాయణీయం | 45-00 |
| 4. | యోగసర్వస్వము | 40-00 |
| 5. | గీతారహస్యం - సంపుటం.1 | 40-00 |
| 6 | గీతారహస్యం - సంపుటం.2 | 45-00 |
| 7. | గీతారహస్యం - సంపుటం.3 | 35-00 |
| 8. | కల్యాణ సంస్కృతి | 7-00 |
| 9. | భజగోవిందం | 5-00 |
| 10. | తిరుమలలో తిరుప్పావై | 5-00 |
| 11. | శ్రీమద్భాగవతం-రెండవ స్కంధము | 55-00 |
| 12. | రామాయణము-ఉషశ్రీ | 35-00 |
| 13. | భారతీయ సంస్కారములు | 25-00 |
| 14. | తిరుమల సమయాచారములు | 15-00 |
| 15. | లలితా సహస్రనామం | 10-00 |
| 16. | రామచరితమానసము | 40-00 |
| 17. | శ్రీ వేంకటేశ్వర వైభవం | 40-00 |
| 18. | యజ్ఞోపవీత తత్త్వ దర్శనం | 10-00 |
| 19. | అద్వైతాక్షర మాలిక | 75-00 |
| 20. | ఆర్ష విజ్ఞాన సర్వస్వం-సంపుటం 1. | 50-00 |
| 21. | మహాభారతం అరణ్యపర్వం-1. | 125-00 |
| 22. | మహాభారతం అరణ్యపర్వం-2. | 150-00 |
| 23. | మహాభారతం విరాటపర్వం | 160-00 |
| 24. | దయాశతకం | 15-00 |

**For further Titles/Copies please contact The P.R.O., Sales Wing of Publications, T.T.Ds., Tirupati - 517 507.**

**వెల రూ. 45.00**

Published by the Executive Officer, T.T. Devasthanams, Tirup